# dakṣiṇa bhāratīya bhāṣalalōni toli sāṅghika navalalu - tulanātmaka pariśīlana

## (telugu, kannaḍa, tamiḷaṁ, malayāḷaṁ)

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of Doctor of Philosophy in Telugu)


**Researcher**

**M. SHANKAR**

**13HTPH05**

**Supervisor**

**Prof. G. ARUNAKUMARI**

**Department of Telugu**

**School of Humanities**

**University of Hyderabad**

**Hyderabad - 500 046**

**Telangana, India**


**March-2021**

# దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - తులనాత్మక పరిశీలన

## (తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం)

(పిహెచ్.డి. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)


**పరిశోధన**

**ఎం. శంకర్**

**పర్యవేక్షణ**

**ఆచార్య జి. అరుణ కుమారి**

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు - 500046**

**తెలంగాణ, భారతదేశం**


**మార్చి - 2021**

# DECLARATION

I, **M Shankar,** hereby declare that this Thesis entitled ***"dakṣiṇa bhāratīya bhāṣalalōni toli sāṅghika navalalu - tulanātmaka pariśīlana (telugu, kannaḍa, tamiḻaṁ, malayāḻaṁ)"*** Submitted by me under the guidance and supervision of **Prof. G. Aruna Kumari** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/ INFLIBNET.

Date: **M SHANKAR**

Place: Hyderabad Regd. No.13HTPH05

# CERTIFICATE

This is to certify the Thesis entitled **"dakṣiṇa bhāratīya bhāṣalalōni toli sāṅghika navalalu - tulanātmaka pariśīlana (telugu, kannaḍa, tamiḷaṁ, malayāḷaṁ)"** submitted by **Mr. M Shankar,** bearing **Regd. No. 13HTPH05** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter 3rd and 5th of the thesis.

1. "**dakṣiṇa bhāratīya bhāṣalalō toli sāṅghika navalalu-sāmājikadr̥kpathaṁ"** (ISBN NO: 978-93-5235-907-3), Pg. no: 469-482, July 2015. "Telugu Bhasha, Sahityam - Samaajikatha" edited by Dr. chinnam Rajaram. Published by Chinnam Publications, nelluru.
2. "**telugu-kannaḍa navalalu tulanātmaka pariśīlana"** (ISBN NO: 978-81-925716-2-1), Pg.no: 36-42, June, 2015. "Malle moggalu" edited by Dr. J. Seethapathi Rao. Published by Malleteega Publishers, Vijayavada.

**B. Presented in the following conferences:**

(Issues presented in the following papershave been discussed elaborately in the chapters 1, 4 & 5 of the thesis)

1. "**pantom'midō śatābdi malayāḷa sāhityaṁ prapañcīkaraṇa prabhāvaṁ"** (U.G.C.International Seminar), by The Department ofHindiSt. Josephs College for Women (A) and Dakshin Bharateeya Rajbhasha Sansthan,Vishakhapatnam, AP. On9th- 10th December, 2016.
2. "**telugu, tamiḷa toli saṅghika navalalu samakālīnasaṅghaṭanalu"** (U.G.C. International Seminar), by The Department of Hindi P.R. Government College (autonomous) and Apsche& Kendriya Hindi Sansthan and Ayodhya Shodh sansthan and Sahityik Sanskrutik Shodh Sansthan, Kakinada, AP. On6th- 7thFebruary, 2015.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil., program and the M.Phil., degree was awarded.

| **Course Code** | **Name** | **Credits** | **pass/fail** |
|---|---|---|---|
| 1. HT801 | Research Methodology | 4.00 | PASS |
| 2. HT802 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. HT803 | Studies in Literature | 4.00 | PASS |
| 4. HT804 | Studies in Specialized Area | 4.00 | PASS |

Prof. G. ARUNAKUMARI
**Research Supervisor**

Prof. G. ARUNA KUMARI
**Head, Telugu**

Prof. S. SARAT JYOTHSNA RANI
**Dean, Humanities**

# విషయ సూచిక

**కృతజ్ఞతలు** (i-iii)

**ముందుమాట** (iv-xiii)

1. ఉద్దేశం iv

2. పరిశోధనాంశ సైద్ధాంతిక నేపథ్యం v

3. పరిశోధన పద్ధతి vi

4 . పరిశోధన శీర్షిక వివరణ vii

5. ఊహా ప్రతిపాదన viii

6. పరిశోధన పరిధి ix

7. పరిశోధన ప్రయోజనం x

8. సమాచార సేకరణ xi

9. పరిశోధన ప్రణాళిక xi

**అధ్యాయం-1**

**1. దక్షిణ భారతీయ సాహిత్యం – నవల (1-59)**

1.1. మలయాళ నవల 1

1.1.1. కేరళ ప్రాంతం నవల ఆవిర్భావ పూర్వ సామాజిక పరిస్థితులు 1

1.1.2. మలయాళ సాహిత్యం – పాశ్చాత్య ప్రభావం 4

1.1.3. మలయాళ సాహిత్యం – పాశ్చాత్య పండితుల సేవ 6

1.1.4. మలయాళ సాహిత్యం మిషనరీ సంస్థలు – స్థానిక క్రైస్తవుల కృషి 6

1.1.5. మలయాళ సాహిత్యం – ఆధునిక ప్రక్రియల ఆవిర్భావం 9

1.1.6. మలయాళ సాహిత్యం – నవల ఆవిర్భావం 10

1.1.6.1. అప్పునెడుంగడి – కుందలత (1887) 11

1.1.6.2. తొలి సాంఘిక నవల – ఇందులేఖ 12

1.1.7. మలయాళ సాహిత్యం నవల – వికాసం 18

1.2. తమిళ నవల 19

1.2.1. తమిళ ప్రాంతం – అచ్చుయంత్ర ఆవిష్కరణ 20

1.2.2. తమిళ సాహిత్యం – పాశ్చాత్యుల సేవ 20

1.2.3. తొలి సాంఘిక నవల 23
1.2.4. తమిళ నవల – వికాసం 25
**1.3. కన్నడ నవల 29**
1.3.1. కన్నడ వచన రచనలు – ముద్రణ 31
1.3.2. తొలి కన్నడ నవల 32
1.3.2.1. కళావతి పరిణయ (1815) 33
1.3.2.2. సౌగంధికా పరిణయ (1821) 33
1.3.2.3. ముద్రా మంజూష (1823) 35
1.3.3. అనువాద నవలలు 36
1.3.4. తొలి సాంఘిక నవల – ఇందిరాబాయి 37
1.3.5. కన్నడ నవల వికాసం 38
**1.4. తెలుగు నవల 40**
1.4.1. తొలి నవల 40
1.4.2. తొలి సాంఘిక నవల – శ్రీరంగరాజు చరిత్ర 47
1.4.3. దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవల – శ్రీరంగరాజు చరిత్ర 50
1.4.4. తెలుగు నవల – వికాసం 51
1.5. తులనాత్మక పరిశీలన 57

**అధ్యాయం-2**

**2. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు రచయితలు - సామాజిక నేపథ్యం - తులనాత్మక పరిశీలన (60-87)**

2.1. గుల్వాడి వెంకటరావు 60
2.1.1. జననం 60
2.1.2. విద్యాభ్యాసం, ఉద్యోగం 60
2.1.3. రచనలు 60
2.1.4. కుటుంబం 60
2.1.5. సామాజిక స్పృహ 61
2.2. నరహరి గోపాలకృష్ణమసెట్టి 62

2.2.1. జననం 63
2.2.2. ఉద్యోగం 64
2.2.3. రచనలు 65
2.2.4. పత్రికల నిర్వహణ 66
2.2.5. లంచం – వ్యతిరేకత 67
2.2.6. సంఘసేవ 68
**2.3. వేదనాయగం పిళ్ళై 69**
2.3.1. జననం 69
2.3.2. విద్యాభ్యాసం 69
2.3.3. ఉద్యోగం 70
2.3.4. కుటుంబ జీవితం 70
2.3.5. రచనలు 71
2.3.6. సామాజిక స్పృహ 72
2.3.7. లంచంపట్ల వ్యతిరేకత 74
**2.4. ఒ. చందుమీనన్ 74**
2.4.1. జననం 74
2.4.2. విద్యాభ్యాసం 75
2.4.3. ఉద్యోగం 75
2.4.4. రచనలు – సాహిత్యాభిరుచి 77
2.4.5. కుటుంబ జీవితం 80
**2.5. తులనాత్మక పరిశీలన 83**

## అధ్యాయం- 3

## 3. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - ఇతివృత్తం- తులనాత్మక పరిశీలన (88-180)


| | |
|---|---|
| 3.1. ఇతివృత్తం | 88 |
| 3.1.1. శ్రీరంగరాజు చరిత్ర ఇతివృత్తం | 88 |
| 3.1.2. ప్రతాపముదలియార్ చరిత్ర – ఇతివృత్తం | 94 |
| 3.1.3. ఇందిరాబాయి – ఇతివృత్తం | 100 |
| 3.1.4. ఇందులేఖ – ఇతివృత్తం | 104 |
| 3.2. ఇతివృత్తం – తులనాత్మక పరిశీలన | 109 |
| 3.2.1. ఇతివృత్తం – నిర్మాణం | 113 |
| 3.2.2. కథ, కథా వస్తువు | 113 |
| 3.2.3. రచనా విశేషాలు | 120 |
| 3.2.3.1. రచనా ఉద్దేశం | 121 |
| 3.2.3.2. అధ్యాయ విభజన | 121 |
| 3.2.3.3. దృష్టికోణం | 122 |
| 3.2.3.4. సన్నివేశ కల్పన | 127 |
| 3.2.3.5. సన్నివేశ సామ్యత | 135 |
| 3.2.3.6. వాతావరణం | 146 |
| 3.2.3.7. వర్ణనలు | 150 |
| 3.2.3.8. నామకరణము | 155 |
| 3.2.3.9. ప్రారంభ ముగింపులు | 156 |
| 3.2.3.10. శైలి | 160 |
| 3.2.3.10.1. భాష | 161 |
| 3.2.3.10.2. పద ప్రయోగం | 166 |
| 3.2.3.10.3. వాక్య ప్రయోగం | 170 |
| 3.2.3.10.4. సామెతల ప్రయోగం | 172 |
| 3.2.3.10.5. హాస్యధోరణి | 175 |

3.2.3.10.6. గేయాలు, శ్లోకాలతో కూడిన రచన 177

**అధ్యాయం- 4**

## 4. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - పాత్ర చిత్రణ - తులనాత్మక పరిశీలన (181-292)


4.0. పాత్ర చిత్రణ 181

4.1. ఇందులేఖ – పాత్ర చిత్రణ 189

4.1.1. పురుష పాత్రలు 189

4.1.2. స్త్రీ పాత్రలు 219

4.2. ప్రతాపముదలియార్ చరిత్ర – పాత్ర చిత్రణ 230

4.2.1. పురుష పాత్రలు 230

4.2.2. స్త్రీ పాత్రలు 243

4.3. ఇందిరాబాయి – పాత్ర చిత్రణ 253

4.3.1. పురుష పాత్రలు 253

4.3.2. స్త్రీ పాత్రలు 260

4.4. శ్రీరంగరాజు చరిత్ర – పాత్ర చిత్రణ 266

4.4.1. పురుష పాత్రలు 266

4.4.2. స్త్రీ పాత్రలు 274

4.5. తులనాత్మక పరిశీలన 284

4.5.1. నాయక పాత్రలు 284

4.5.2. నాయిక పాత్రలు 287

4.5.3. ప్రతినాయక పాత్రలు 290

4.5.4. సహాయక పాత్రలు 291

## అధ్యాయం-5

## 5. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు – సామాజికాంశాలు (293 - 417)


5.0. నవల సామాజికాంశాలు 293

5.1. పరిపాలన 295

5.1.1. గవర్నర్ వ్యవస్థ 296

5.1.2. సివిల్ సర్వీసు 299

5.1.3. పోలీసు వ్యవస్థ 301

5.1.4. న్యాయ వ్యవస్థ 303

5.1.5. రాజ్య సంక్రమణ సిద్ధాంతం 306

5.2. సామాజిక జీవనం 308

5.2.1. వర్ణ వ్యవస్థ 308

5.2.2. మతం 327

5.2.3. వివాహ సంప్రదాయం 329

5.2.4. కుటుంబ వ్యవస్థ 347

5.3. విద్యా విధానం 353

5.4. వైద్య విధానం 365

5.5. ఆర్థిక వినిమయం 367

5.6. రవాణా సౌకర్యాలు 369

5.7. వార్తా ప్రసారం 373

5.8. నమ్మకాలు 383

5.8.1. శకునాలు 383

5.8.2. దయ్యాలు–భూతాలు 385

5.8.3. జ్యోతిష్యం 386

5.8.4. కలలు 389

5.8.5. దేవతలకు ముడుపులు కట్టడం 392

5.9. ఆటలు 393

5.10. నూతన వస్తు సంస్కృతి 394

5.11. సాంఘిక దురాచారాలు 397

5.11.1. సంఘ బహిష్కారాలు 397

5.11.2. సతీసహగమనం – వ్యతిరేకత 401

4.11.3. సముద్రప్రయాణం – నిషేధం 402

5.11.4. కపట సంతమండలి 403

5.11.5. బానిసత్వ వ్యవస్థ – పిల్లల అపహరణ 406

5.11.6. బందిపోటు దొంగతనాలు 407

5.11.7. లంచగొండితనం 409

5.11.8. భోగం మేళాలు 411

5.11.9. వితంతు స్త్రీ – కష్టాలు 413

**ముగింపు 418**

**పరిశోధన ఫలితాలు 420**

**ఉపయుక్త గ్రంథసూచి 430**

**పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాల నకళ్ళు (439-465)**

దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు – సామాజిక దృక్పథం (439–455)

తెలుగు, కన్నడ నవలలు – తులనాత్మక పరిశీలన (456 – 465)

**జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాల నకళ్ళు (466-467)**

పంతొమ్మిదో శతాబ్ది మలయాళ సాహిత్యం – ప్రపంచీకరణ ప్రభావం 466

తెలుగు తమిళ సాంఘిక నవలలు – సమకాలీన సంఘటనలు 467


*****

# కృతజ్ఞతలు

జన్మనిచ్చిన అమ్మా నాన్నలకి...

పరిశోధనకి అవకాశం కల్పించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ వారికి...

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ మానవీయ శాస్త్రాల విభాగాధిపతి, తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, నా పరిశోధనకి డాక్టోరల్ కమిటీ సభ్యులుగా వ్యవహరించిన, మాతృమూర్తి ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారికి,

నేను పరిశోధనలో చేరినప్పటి నుంచి పరిశోధన పూర్తి చేసేంత వరకు నా వెన్నంటే ఉండి నా తప్పులను సరిదిద్దుతూ, పరిశోధనకు అవసరమైన విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ, ఇటు పరిశోధనా రంగంలో పరిశోధక విద్యార్థిగా, అటు నా జీవితంలో ప్రభుత్వ ఉద్యోగిగా నేను స్థిరపడడానికి కావలసిన తమ విలువైన సమయాన్ని నా కోసం కేటాయించిన మా పర్యవేక్షకులు, తెలుగు శాఖ అధ్యక్షులు, మాతృమూర్తి ఆచార్య జి.అరుణకుమారి గారికి,

తమిళ, మలయాళ, కన్నడ భాషా సాహిత్యాలలో నా పరిశోధనకు అవసరమైన విలువైన సమాచారాన్ని తమ సలహాలు, సూచనల ద్వారా నాకు అందించిన డాక్టోరల్ కమిటీ సభ్యులు ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి గారికి,

ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి, తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి,

తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య పరిమి రామనరసింహం గారికి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి, ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గారికి,

ఎం.ఎ.లో నాకు పాఠాలు బోధించిన, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ బోధనా సిబ్బంది, ఆచార్య R.V. రామకృష్ణశాస్త్రి గారికి, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య గోన నాయక్ గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, డా. బాణాల భుజంగరెడ్డి గారికి, డా.డి. విజయకుమారి గారికి.

కన్నడ ఇందిరాబాయి నవల మూల ప్రతి దొరకక నేను ఇబ్బందులు పడుతున్న సందర్భంలో కన్నడ ఇందిరాబాయి నవల మూల ప్రతిని నాకు అందించిన ఆచార్య శివరామ పడిక్కల్(C.A.L.T.S. హైదరాబాద్ విశ్వవిద్యాలయం) గారికి,

తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలని ముద్రించి అందుబాటులోకి తెచ్చిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి, ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికి,

తమిళ, మలయాళ తొలి సాంఘిక నవలలని తెలుగులోకి అనువాదం చేసిన ఆచార్య. ఎస్. జయ ప్రకాశ్ గారికి,

నా పరిశోధనకు ఉపకరించే విలువైన పూర్వ పరిశోధనలను నాకు అందించిన మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి,

ఎం.ఫిల్ తరువాత పి.హెచ్.డి.లో సీటు లభించని సందర్భంలో నన్ను ఆదుకున్న, తమిళ భాషా సాహిత్యాలలో నాకు అండగా నిలిచిన మధురై కామరాజ్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జి. వెంకటరమణ గారికి,

నేను అడిగిన వెంటనే ఒ. చందుమీనన్ గారి శారద(మలయాళ) నవలని తెలుగులోకి అనువాదం చేసి ఇచ్చిన, మలయాళ, తెలుగు, హిందీ భాషలు తెలిసిన డా. భోజన్నగారి అనసూయ గారికి, నా పరిశోధనకి ఉపకరించే ఆంగ్ల భాష సిద్ధాంత గ్రంథాలని అందించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆంత్రోపాలజీ శాఖ పరిశోధక మిత్రులు పి. సుధీర్ కుమార్ గారికి,

ప్రతాపముదలియార్ చరిత్ర తమిళ ప్రతిని సేకరించడంలో, చదవడంలో నాకు సహకరించిన పరిశోధక మిత్రులు పురుషోత్తం(చరిత్ర శాఖ – హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం)గారికి,

ఇందులేఖ మలయాళ ప్రతిని సేకరించడంలో, చదవడంలో నాకు సహకరించిన పరిశోధక మిత్రులు మేఘ(C.A.L.T.S. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం)గారికి,

కామారెడ్డి ప్రాచ్య విద్యా పరిషత్ సాయం ప్రాచ్య డిగ్రీ కళాశాలలో నాకు పాఠాలు బోధించిన గురువులు డా. అవధానం రంగనాథవాచస్పతి, డా. అనంతకుమారశర్మ, డా. అయాచితం నటేశ్వరశర్మ, డా. మల్లికార్జునరావు, డా. ప్రభాకరరావు, డా. స్వర్ణలత, డా. సువత్సల గార్లకు,

పరిశోధన సమయంలో నాకు కావలసిన వాతావరణం ఏర్పరిచి నేను పరిశోధనని పూర్తి చేయడానికి సహకరించిన నా అర్ధాంగి వినూత్నకు,

నా తోటి పరిశోధక మిత్రులు డా. గిన్నారపు ఆదినారాయణ, డా. ధారావత్ సంతోష్ కుమార్, వెంకటేశ్ భరత, డా. చంద్రయ్య, డా.వి. వెంకటేష్, తిరుపతి, వేణు, డా. దొడ్ల సత్యనారాయణ, పిల్లి సురేష్ కుమార్, కొమ్మకోరె రవి కుమార్, సంగి సంజీవ్ కుమార్లకు...

నా కష్ట నష్టాలలో నాకు తోడుగా ఉండే మిత్రులు దుబ్బాక్రాంతికుమార్, మఠం సంగమేశ్వర్, పంచాత్రి నాగరాజులకు.

నేను నా పరిశోధనని పూర్తి చేయడంలో తమ వంతు సహాయ సహకారాలు అందించిన నా తోటి ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల బోధనా సిబ్బంది డా. గుమిడెల్లి మహేందర్ (ప్రధానాచార్యులు), శ్రీ నర్రి రాజేశ్వర్ (ఉపప్రధానాచార్యులు), శ్రీ బ్రాహ్మణపల్లి నవీన్ (జే.వీ.పి), శ్రీ సంతోష్ కుమార్ (టి.జి.టి.– సోషల్ స్టడీస్), శ్రీ రఘువీర్ చందర్ (ఆర్ట్ – టీచర్)లకు,

నేను రాసిన చేతి రాత ప్రతులను ఎప్పటికప్పుడు హైదరాబాద్ కు చేర్చి పరిశోధన వ్యాస ముద్రణలో సహకరించిన నా తోటి సహోపాధ్యాయుడు శ్రీ పంతుల నరేందర్ (పి.జి.టి.– ఫిజికల్ సైన్స్)గారికి,

పరిశోధన వ్యాస ముద్రణలో, అచ్చుతప్పులు సరిదిద్దడంలో సహకరించిన నా తోటి సహోపాధ్యాయుడు ఓపికకి నిలువెత్తు నిదర్శనం శ్రీ కదారియాదగిరి(టి.జి.టి.– తెలుగు)గారికి,
పరిశోధన వ్యాసాన్ని అందంగా టైప్ చేసిన పరిశోధక మిత్రుడు డా. మంత్రి మల్లేష్ కి,

హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బోధనేతర సిబ్బందికి,
నాకు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ మంజూరు చేసిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ న్యూఢిల్లీ వారికి, ఇందిరా గాంధీ మెమోరియల్ గ్రంథాలయం హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారికి,

**నా పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ**

**నా హృదయపూర్వక కృతజ్ఞతలు.**

**ఎం. శంకర్**

*********

# ముందుమాట

## 1. ఉద్దేశం

భారతీయ సాహిత్యంలో పంతొమ్మిదవ శతాబ్దానికి ప్రతేక స్థానం ఉంది. పంతొమ్మిదవ శతాబ్దం ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు మధ్య వారధిలా నిలిచింది. భారతీయ సాహిత్యంలో మౌలికమైన మార్పులు పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చాయి. అచ్చుయంత్ర ఆవిష్కరణ, ఆంగ్లేయులరాక, ఆంగ్ల విద్య పరిచయం వంటి అంశాలు పంతొమ్మిదవ శతాబ్దంలోని మార్పులకు ప్రధాన కారణాలు. ఈ కాలంలో సామాజిక రంగంలో సంభవించిన విస్తృత స్థాయి మార్పుల ప్రభావం సాహిత్యంపై కుడా పడింది. సాహిత్యంలో నవల, కథ, కథానిక వంటి నూతన ప్రక్రియలు ఆవిర్భవించాయి. అప్పటి వరకు కొంత మందికి మాత్రమే పరిమితమైన సాహిత్యం వచన రచనల రూపంలో అందరికి చేరువైంది. ఈ వచన రూప సాహిత్య లక్ష్యం సమాజాన్ని చైతన్యం చేయడం. ఒక పక్క కళాత్మక ప్రక్రియా పరమైన విలువలు కలిగి ఉంటూనే ఇంకో పక్క సమాజాన్ని చైతన్య పరిచే పనిని పంతొమ్మిదవ శతాబ్దం నాటి రచనలు చేసాయి. ఈనాడు మనం దురాచారాలుగా పరిగణించే బాల్యవివాహాలు, వృద్ధవివాహాలు, బహుభార్యత్వం, మూఢనమ్మకాలు పంతొమ్మిదవ శతాబ్దికి పూర్వం ఆచారాలుగా చలామణిలో ఉన్నాయి. ఈ దురాచారాలను రూపుమాపడానికి ఆనాటి సంఘసంస్కర్తలు ప్రయత్నించారు. ప్రజల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకు రావడానికి ఆనాటి సంఘసంస్కర్తలు ఏ రకమైన విధానాలను అవలంబించారు. అసలు పంతొమ్మిదవ శతాబ్దంలో ఉన్న దురాచారాలు ఏంటి. అవి మానవ జీవితాన్ని ఎలా ప్రాభావితం చేసాయి. పంతొమ్మిదవ శతాబ్దంలో నూతనంగా భారతదేశంలోకి ప్రవేశించిన విదేశీ వస్తూ సంస్కృతిని భారతీయులు ఎలా స్వీకరించారు. వంటి అంశాలను గురించి తెలుసుకోవాలంటే పంతొమ్మిదవ శతాబ్దంలో భారతీయ భాషలలో వచ్చిన రచనల మధ్య విస్తృత స్థాయి పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది. పంతొమ్మిదవ శతాబ్దంలో నూతనంగా వచ్చిన వచన రచనా ప్రక్రియలలో నవల నిడివి అధికం. నవలలో విస్తృత స్థాయి సామాజిక జీవనం చిత్రితమౌతుంది. పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారత దేశంలో ఉన్న సామాజిక పరిస్థితులని సాహిత్య రచనల ప్రాతిపదికగా వివరించాలన్న (పరిశోధన సమస్య)ఉద్దేశంతో "దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు తులనాత్మక పరిశీలన" అనే అంశాన్ని పరిశోధనకి ఎన్నుకోవడం జరిగింది.

## 2. పరిశోధనాంశ సైద్ధాంతిక నేపథ్యం

తెలుగు పరిశోధనా రంగంలో తెలుగు భాషా సాహిత్యాలను ఇతర భాషా సాహిత్యాలతో పోలుస్తూ అనేక పరిశోధనలు వచ్చాయి. "పంప నన్నయల భారతం తులనాత్మక పరిశీలన" (బి.రత్నావళి(1980) – బెనారస్ విశ్వవిద్యాలయం), "సంస్కృతాంధ్ర భారత భాగవతములు సాదృశ్య కథాంశ వివేచన"(పి. వేణుగోపాలరావు(1981) - ఆంధ్రవిశ్వవిద్యాలయం), "పోతన మహాభాగవతం జాన్ మిల్టన్ పారడైజ్ లాస్ట్ తులనాత్మక పరిశీలన" (ఆర్.ఎల్.ఎన్.రాజు(2010) – తెలుగు విశ్వవిద్యాలయం), "తెలుగు హిందీ పద సాహిత్యంలో రామభక్తి సంప్రదాయం" (వై. జయప్రద – తెలుగు విశ్వవిద్యాలయం), ఆళ్వార్లు, వేమన తులనాత్మక పరిశీలన (ఎన్. ధర్మారెడ్డి – శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) మొదలైన పరిశోధనలు ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషాసాహిత్యాలతో పోలుస్తూ వచ్చిన పరిశోధనలకు కొన్ని ఉదాహరణలు.

తెలుగు నవలా సాహిత్యాన్ని ఇతర భాషల నవలా సాహిత్యంతో తులనాత్మకంగా పోలుస్తూ పరిశోధనలు వచ్చాయి. "ఆంధ్రాంగ్ల సాహిత్యాలలో ఆత్మకథా నవలలు తులనాత్మక పరిశీలన" (ఎం. చంద్రమౌళి – తెలుగు విశ్వవిద్యాలయం), "ఆధునిక తమిళ, తెలుగు సాంఘిక నవలల్లో దళిత సమస్యలు" (ఎన్. వజ్రవేలు – శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం), "ఆధునిక తమిళ, తెలుగు నవలల్లో గాంధేయ దృక్పథం తులనాత్మక పరిశీలన" (పి. అమ్ముదేవి - శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం), తెలుగు, కన్నడ సాహిత్యాలలో మనోవైజ్ఞానిక నవలలు తులనాత్మక పరిశీలన" (టి. రాజశ్రీ మీనలోచన (2009) – బెంగళూరు విశ్వవిద్యాలయం). "తొలి తెలుగు తమిళ నవలలు తులనాత్మక పరిశీలన" (ఎం. మోహనరామయ్య(1985) – మద్రాసు విశ్వవిద్యాలయం). ఈ పరిశోధనలు  తెలుగు నవలలని ఇతర భాషా నవలలతో పోలుస్తూ వచ్చిన  సిద్ధాంత గ్రంథాలకు కొన్ని ఉదాహరణలు. ఈ పరిశోధనల నేపథ్యంగా "కందుకూరి వీరేశలింగంపంతులు రాజశేఖర చరిత్ర – గుల్వాడి వెంకటరావు ఇందిరాబాయి నవలలు – తులనాత్మక పరిశీలన" అనే అంశంపై నేను పరిశోధన చేసి హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్ పట్టా పొందాను. ఈ పరిశోధన చేసే క్రమంలో తెలుగు, కన్నడ నవలల మధ్య అనేక పోలికలు ఉన్నట్లు గుర్తించాను. నాకు తెలుగు భాషతో పాటు కన్నడ, మరాఠీ, హిందీ భాషలతో పరిచయం ఉండటం వల్ల ఏక

కాలంలో(పంతొమ్మిదవ శతాబ్దం) వచ్చిన కన్నడ, తెలుగు నవలల మధ్య పోలికలు ఉన్నట్లే ఏక కాలంలో వచ్చిన మరాఠీ, హిందీ, తెలుగు, కన్నడ నవలల మధ్య ఎందుకు పోలికలు ఉండకూడదు అన్న ప్రశ్న నాలో ఉదయించింది. పి.హెచ్.డి.లో ప్రవేశం పొందిన తరువాత నా ఆలోచనని మా పర్యవేక్షకులతో పంచుకున్నాను. మరాఠీ, హిందీ, నవలల స్థానంలో తమిళ, మలయాళ నవలల్ని చేర్చుకోవడం ద్వారా ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించి దక్షిణ భారతదేశంలో ఉన్న సామాజిక అంశాలను తెలుసుకోడానికి వీలుంటుందన్న మా పర్యవేక్షకుల సూచనతో నా ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. హైదరాబాదు విశ్వవిద్యాలయం ఎం.ఎ. (తెలుగు) బోధనాంశ పరిధిలో "తులనాత్మక సాహిత్యం", "భారతీయ సాహిత్య పరిచయం" ఉండటం వల్ల నాకు తెలుగుతో పాటు కన్నడ, తమిళ, మలయాళ, నవలా సాహిత్యాలతో పరిచయం ఏర్పడింది. పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చిన కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ నవలల మధ్య సామ్యం ఉన్నట్లు మా పర్యవేక్షకులు సూచించారు. నాకున్న పరిధులకి లోబడి కన్నడ, తమిళ, మలయాళ నవలా సాహిత్యం పై వచ్చిన విమర్శనా, పరిశోధనా వ్యాసాలను చదివాను. సి.ఎన్. రామచంద్రన్ గారు రచించిన "The early novels in south india" (2001) అన్న పుస్తకం ద్వారా పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చిన కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ నవలల మధ్య సామ్యం ఉన్నట్లు తెలుసుకున్నాను. నేను తెలుసుకున్న అంశాలను మా పర్యవేక్షకులతో చర్చించాను. మా పర్యవేక్షకుల సహకారం మరియు సూచన మేరకు "దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు తులనాత్మక పరిశీలన" అనే అంశాన్ని పరిశోధనకి ఎన్నుకున్నాను. ఈ అంశం తెలుగు పరిశోధనా రంగంలో నూతనమైనదిగా పరిగణిస్తున్నాను.

### 3. పరిశోధన పద్ధతి

పరిశోధన అనేక పద్ధతులలో చేయడానికి ఆస్కారం ఉంది. "సాహిత్య పరిశోధనా కళా: విధానం" అన్న పుస్తకంలో ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు పరిశోధన పద్ధతుల గురించి విపులంగా వివరించారు. "సామాన్య సూత్రాల నుంచి, ఒక విశిష్ట సూత్రాన్ని నిష్పన్నం చేసేది, సూత్రీకరించేది, లేదా ప్రమాణీకరించి చెప్పేది డిడక్టివ్ మెథడ్. ప్రమాణీకరించబడిన సూత్రాన్ని ఒక సందర్భానికి అన్వయించి, ఆరోపించి, ఆ ప్రమేయంతో దాని గుణ స్వభావాన్ని పరిశీలించి

నిర్ధారించేది, లేదా విపులీకరించేది ఇండక్టివ్ మెథడ్. వీటిని తెలుగులో మనం సూత్రీకరణ విధానం, నిరూపణ విధానం అని పిలవొచ్చు. ఇవి మరీ స్థూలంగా ఉన్నాయనుకున్న ఆధునిక అధ్యయన ప్రపంచం మరిన్ని విధానాలను రూపొందించుకొంది. అవి. సైద్ధాంతిక పరిశోధన (Theoretical), అన్వయాత్మక (Applied) పరిశోధన, వర్ణనాత్మక (Descriptive) పరిశోధన, చారిత్రక (Historical) పరిశోధన, తులనాత్మక (Comparative) పరిశోధన, నిర్ణాయక (Formulative) పరిశోధన, ప్రయోగాత్మక (Experimental) పరిశోధన, పూర్వ విపర్యాయ (Ex – Post Facto) పరిశోధన, ఏకాంశ సమగ్ర అధ్యయనం (CaseStudy), సర్వేక్షణాత్మక (Survey) పరిశోధన, మౌల్యీకరణాత్మక (Evaluative) పరిశోధన, అంతశ్శాస్త్రీయ (Inter–Disciplinary) పరిశోధన." (లక్ష్మీనారాయణ, గంగి శెట్టి. 2017: 12, 13).

ఈ పరిశోధన గ్రంథంలో దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలని తులనాత్మక (Comparative) పరిశోధన పద్ధతిని అనుసరించి పరిశీలించడం జరిగింది. "ఒక వస్తు స్థితిని సాదృశ్యమైన వాటితో పోల్చి సర్వ సమాన సూత్రాలనావిష్కరించడం తులనాత్మక పరిశోధన". (లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2017: 12). ఏక కాలంలో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నలలలోని వస్తు స్థితిని పోల్చి చూసి, సాదృశ్య అంశాలను ఈ పరిశోధనలో వివరించడం జరిగింది.

## 4. పరిశోధన శీర్షిక వివరణ

భారతదేశంలో అనేక భాషలు వాడుకలో ఉన్నాయి. "జార్జ్ గ్రియర్ సన్ గారు తన లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా అన్న పుస్తకంలో భారతదేశంలో మొత్తం 225 భాషలు వాడుకలో ఉన్నట్లు పేర్కొన్నారు". (George,K.M.1984:3). భారత ప్రభుత్వం 22 భాషలని ఇప్పటి వరకు అధికారికంగా గుర్తించింది. భారత రాజ్యాంగంలోని 343వ అధికరణం దేవనాగరి లిపితో కూడిన హిందీని అధికార భాషగా గుర్తించింది. హిందీ, ఇంగ్లీషుతో కలిపి భారతదేశంలో 24 అధికార భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ ఇరవై నాలుగు భాషలలో దక్షిణ భారత దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో అధికార భాషలుగా ఉన్న తెలుగు, కన్నడ,

తమిళ, మలయాళ భాషలను ఉద్దేశించి పరిశోధన శీర్షికలో “దక్షిణ భారతీయ భాషలు” అన్న పదాన్ని వాడటం జరిగింది. ఈ దక్షిణ భారతీయ భాషలలో వచ్చిన మొదటి సాంఘిక నవలలను తులనాత్మకంగా పరిశీలించడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం.

## 5. ఊహా ప్రతిపాదన

ఈ కింది అంశాలను ఊహా ప్రతిపాదనగా భావించి పరిశోధనని ప్రారంభించడం జరిగింది.

i) దక్షిణ భారతీయ భాషలలో నవల మొదట తెలుగు భాషలోనే ఎందుకు వచ్చి ఉండకూడదు?

ii) నవల ఆవిర్భావ పూర్వ పరిస్థితులు తెలుగులో ఉన్నట్లే మిగిలిన దక్షిణ భారతీయ భాషలలో కూడా ఉన్నాయా?

iii) దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలల నిర్మాణం ఎలా జరిగింది. ఈ నిర్మాణంలో ఏవైనా ఉమ్మడి అంశాలు ఉన్నాయా?

iv) ఎలాంటి సామాజిక పరిస్థితుల మధ్య ఆనాటి రచయితలు తొలి సాంఘిక నవలలని రచించారు?

v) నవలా రచనకి రచయితలని పురిగొల్పిన సంఘటనలు నాలుగు భాషలలో ఒకే విధంగా ఉన్నాయా?

vi) తొలి సాంఘిక నవలల్లో ఆనాటి సామాజిక అంశాలు ఎంత మేరకి ప్రస్తావనకి వచ్చాయి?

vii) పంతొమ్మిదవ శతాబ్దం నాటికి దక్షిణ భారతదేశం అంతటా ఒకే విధమైన సామాజిక పరిస్థితులు ఉన్నాయా?

viii) తెలుగు ప్రాంతంలో ఉన్న దురాచారాలు, కట్టుబాట్లు తమిళ, మలయాళ, కన్నడ ప్రాంతాలలో కూడా ఉన్నాయా?

ix) ఆనాటి సమాజంలో ఉన్న ఏ సామాజిక సమస్యలు ప్రధానంగా తొలి సాంఘిక నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి?

x) పంతొమ్మిదవ శతాబ్దం నాటికి దక్షిణ భారతదేశంలో ఉన్న సామాజిక పరిస్థితులని తెలుసుకోవడానికి తొలి సాంఘిక నవలలు ఎంత వరకి ఉపయోగపడతాయి.

## 6. పరిశోధన పరిధి

6.1. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలలకు పరిమితమై సిద్ధాంత గ్రంథ రచన కొనసాగింది.

6.2. దక్షిణ భారతీయ భాషలలో తొలి నవల ఏది అన్న విషయంలో వాదోప వాదాలు ఉన్నాయి. నేను కాల ప్రాతిపదికగా తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలలను మాత్రమే పరిశోధనకి ఎన్నుకున్నాను. అవి

6.2.1 తెలుగు – శ్రీరంగరాజుచరిత్ర (1872).

6.2.2 కన్నడ – ఇందిరాబాయి (1899).

6.2.3 తమిళం – ప్రతాపముదిలియార్ చరిత్ర (1879).

6.2.4 మలయాళం – ఇందులేఖ (1889).

6.2.3 ఈ నవలల్లో కన్నడ "ఇందిరాబాయి" తప్ప మిగిలిన రెండు నవలలు తెలుగులోకి అనువాద మయ్యాయి. తమిళ "ప్రతాపముదలియార్ చరిత్ర", మలయాళ "ఇందులేఖ" నవలలని ఆచార్య. ఎస్. జయప్రకాశ్ గారు తెలుగులోకి అనువాదం చేసారు. తమిళ "ప్రతాపముదలియార్ చరిత్ర" నవల తెలుగు అనువాదాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయం వారు ముద్రించారు. మలయాళ "ఇందులేఖ" నవల తెలుగు అనువాదాన్ని నేషనల్ బుక్ ట్రస్ట్, న్యూఢిల్లి వారు ముద్రించారు. ఈ ప్రతులను నేను పరిశోధనకి స్వీకరించాను. నాకు తెలుగు భాషతో పాటు కన్నడ భాష వచ్చి ఉండటం వల్ల కన్నడ "ఇందిరాబాయి" నవల మూల ప్రతిని పరిశోధనకి స్వీకరించాను.

ఇందిరాబాయి నవలలోని వాక్యాలను సిద్ధాంత గ్రంథంలో ఉదహరించే సందర్భంలో కన్నడ వాక్యాలని తెలుగులోకి అనువాదం చేసి ఇవ్వడం జరిగింది. ఈ అనువాదం సిద్ధాంత గ్రంథ పరిధులకి లోబడి చేయబడింది. ఇది భావానువాదం. కొన్ని చోట్ల విషయ పారదర్శకత కోసం కన్నడ, తెలుగు వాక్యాలను పక్కపక్కనే ఇవ్వడం జరిగింది. అన్ని చోట్లా ఇలా ఇవ్వడం వల్ల సిద్ధాంత గ్రంథ పుటల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అందువల్ల కన్నడ, తెలుగు వాక్యాలని అన్ని చోట్లా

పక్కపక్కనే ఇవ్వలేదు. తెలుగు వాక్యాల పాద సూచికల ఆధారంగా కన్నడ మూల నవలని చూడగలరని సవినయంగా మనవి చేస్తున్నాను.

6.2.4. పరిశోధన క్రమంలో విషయ సమగ్రతను సాధించడానికి తమిళ "ప్రతాపముదలియార్ చరిత్ర", మలయాళ "ఇందులేఖ" నవలల మూల ప్రతులని, ఆంగ్లానువాదాలని సేకరించడం జరిగింది. ఈ మూల ప్రతులని తమిళం-తెలుగు, మలయాళం-తెలుగు తెలిసిన హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని పరిశోధక మిత్రుల (పురుషోత్తం, మేఘాల) సహకారంతో చదవడం జరిగింది. ఈ మూల నవలలోని విషయాల గురించి కన్నడ, తమిళ, మలయాళ భాషలు తెలిసిన మా పర్యవేక్షకులు ఆచార్య. జి. అరుణకుమారి గారితోనూ నా సిద్ధాంత వ్యాస డాక్టోరల్ కమిటీ సభ్యులు ఆచార్య. డి. విజయలక్ష్మి గారితోనూ చర్చించడం జరిగింది. అనువాద నవలలలోని విషయాలు మూల విధేయంగా ఉన్నాయని ఈ చర్చల ద్వారా తెలుసుకోవడం జరిగింది. ఈ అంశం అనువాద నవలల ప్రామాణికతకి నిదర్శనం.

6.2.5. తమిళ, మలయాళ ప్రాంతానికి చెందిన చారిత్రక (పంతొమ్మిదవశతాబ్దం) అంశాలను తెలుసుకోవడానికి ఆంగ్ల, కన్నడ భాషలలో ప్రచురితమైన పుస్తకాల మీద ఆధార పడవలసి వచ్చింది. సాధ్యమైనంత వరకు మా పర్యవేక్షకులతో చర్చించి ఆంగ్ల వాక్యాలను తెలుగులో అనువాదం చేసి సిద్ధాంత గ్రంథంలో పేర్కొనడం జరిగింది. ఈ అనువాదం పరిశోధన పరిధులకి లోబడి జరిగిందని సవినయంగా మనవి చేస్తున్నాను. తెలుగు వాక్యాల పాద సూచికల ఆధారంగా ఆంగ్ల మూల పుస్తకాలని చూడగలరని వినమ్రతతో కోరుకుంటున్నాను. అనువాదానికి పొసగని ఆంగ్ల వాక్యాలను విషయ పారదర్శకత కోసం వాటిని అదే విధంగా ఉటంకించడం జరిగింది. తెలుగులో కందుకూరి వీరేశలింగం పంతులుగారి రాజశేఖరచరిత్ర (1878), మలయాళంలో ఒ.చందుమీనన్ గారి శారద, కన్నడలో కృష్ణరాజ ఒడయార్ గారి సౌఘందికా పరిణయ నవలలలోని అంశాలను విషయ సమగ్రతకోసం పరిశోధనలో ఉటంకించడం జరిగింది.

## 7. పరిశోధన ప్రయోజనం

7.1. దక్షిణ భారతదేశంలో పంతొమ్మిదవ శతాబ్దంలో ఉన్న సామాజిక పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ పరిశోధన ఉపకరిస్తుంది.

7.2. దక్షిణ భారతదేశంలోని తొలి సాంఘిక నవలల నిర్మాణాన్ని ఈ పరిశోధన ద్వారా తెలుసుకోవచ్చు.

7.3. దక్షిణ భారతదేశంలో నవల ప్రారంభానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఈ పరిశోధన తోడ్పడుతుంది.

7.4. భిన్న భాషలలో సమకాలీన చారిత్రక, సామాజిక స్వరూపం నవలలో నిక్షిప్తమైన విధానాన్ని ఈ పరిశోధన ద్వారా అధ్యయనం చేయవచ్చు.

## 8. సమాచార సేకరణ

ఈ పరిశోధనా కాలంలో జాతీయ సదస్సులకు, వర్క్ షాప్ లకు వెళ్ళడం వల్ల అధ్యాపకులను, ఆచార్యులను కలిసి నా పరిశోధనకి ఉపకరించే అనేక సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నాను. క్షేత్రపర్యటనలో భాగంగా వివిధ విశ్వవిద్యాలయాను, వివిధ గ్రంథాలయాలను సందర్శించాను.

### 8.1. సందర్శించిన విశ్వవిద్యాలయాలు, గ్రంథాలయాలు.

8.1. మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు.

8.2. ప్రాచ్యలిఖిత భాండాగారం, మద్రాసు.

8.3. శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం, రాజమండ్రి.

8.4. హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు

8.5. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

8.6. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు

8.7.స్టేట్ సెంట్రల్ లైబ్ర , అఫ్జల్ గంజ్, హైదరాబాదు

8.8. సిటీ సెంట్రల్ లైబ్రరీ, చిక్కడపల్లి, హైదరాబాదు.

## 9. పరిశోధన ప్రణాళిక

ఈ పరిశోధనాంశాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

"దక్షిణ భారతీయ సాహిత్యం – నవల" అన్న మొదటి అధ్యాయంలో మలయాళ, తమిళ, కన్నడ, తెలుగు భాషలలో నవల ప్రక్రియ ఆవిర్భవించిన విధానాన్ని గురించి వివరించాను. తమిళ, మలయాళ తెలుగు, కన్నడ, ప్రాంతాలలో అచ్చుయంత్రం ఎప్పుడు ప్రవేశించింది, అచ్చుయంత్ర ప్రవేశంతో సాహిత్యంలో ఎలాంటి మార్పులు వచ్చాయి, పాశ్చాత్యులు దక్షిణ భారతీయ భాషలకి ఎలాంటి సేవ చేసారు, దక్షిణ భారతీయ భాషలలో మొదటి నవలల నిర్ధారణలో ఎలాంటి సందిగ్ధం ఉంది, దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవలలు ఎప్పుడు ఆవిర్భవించాయి, దక్షిణ భారతీయ భాషలలో నవలా వికాసం ఎలా జరిగింది వంటి అంశాలను ఈ అధ్యాయంలో వివరించాను. దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవల తెలుగులో వెలువడిందన్న అంశాన్ని ఈ అధ్యాయంలో సిద్ధాంతీకరించడం జరిగింది.

రచయిత లేకుండా రచన వెలువడదు. రచన గురించి తెలుసుకోవడానికి ముందు ఆ రచన వెలువడటానికి కారణమైన రచయిత గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంటుంది. అందుకే "దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు – రచయితలు సామాజిక నేపథ్యం – తులనాత్మక పరిశీలన." అన్న రెండవ అధ్యాయంలో దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవలలని రచించిన రచయితల జీవితాన్ని ఆనాటి సామాజిక పరిస్థితుల నేపథ్యంగా వివరించాను. ఈ అధ్యాయంలో రచయితల బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగ జీవితం, సాహిత్య జీవితం, సామాజిక జీవితంలో కనిపించే ఉమ్మడి అంశాల గురించి తులనాత్మకంగా పరిశీలించాను.

"దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు– ఇతివృత్తం – తులనాత్మక పరిశీలన" అన్న మూడవ అధ్యాయంలో దక్షిణ భారతీయ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలల ఇతివృత్తాన్ని తులనాత్మకంగా పరిశీలించాను. తొలి సాంఘిక నవలల్లోని కథ వివరణ, నవల

ఇతివృత్త నిర్మాణంలో ప్రధాన భూమిక వహించే కథా–కథనం, దృష్టికోణం, సన్నివేశ కల్పన, వాతావరణం, వర్ణనలు, భాషా, శైలి వంటి అంశాలలో తొలి సాంఘిక నవలల్లో ఎలాంటి వైవిధ్యం పాటించబడిందో వివరించాను. తులనాత్మక పరిశీలనలో భాగంగా ఇతివృత్త నిర్మాణంలో తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపించే ఉమ్మడి అంశాలను వివరించాను.

"దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు – పాత్ర చిత్రణ – తులనాత్మక పరిశీలన" అన్న నాల్గవ అధ్యాయంలో దక్షిణ భారతీయ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలల లోని పాత్రలను తులనాత్మకంగా పరిశీలించాను. పాత్రలు నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు అవి ప్రవర్తించిన తీరును వివరించాను. పురుష పాత్రలు, స్త్రీ పాత్రలు, నాయక పాత్రలు, నాయిక పాత్రలు, ప్రతినాయక పాత్రలు, సహాయక పాత్రల ప్రవర్తనలో తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపించే ఉమ్మడి అంశాలను తులనాత్మక పరిశీలనలో భాగంగా వివరించాను.

"దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు – సామాజికాంశాలు" అన్న ఐదవ అధ్యాయంలో తొలి సాంఘిక నవలల్లో ప్రస్తావితమైన పంతొమ్మిదవ శతాబ్దంనాటి సామాజిక అంశాలను వివరించాను. పంతొమ్మిదవ శతాబ్దం నాటి తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ ప్రాంతాలలోని ప్రజల సామాజిక జీవనంలో ఎలాంటి మార్పులు వచ్చాయి, సమాజంలో ఎలాంటి దురాచారాలు ఉన్నాయి, పరిపాలనలో, న్యాయవ్యవస్థలో, వివాహవ్యవస్థలో, మత సంప్రదాయాలలో, వస్త్రాసంస్కృతిలో, విద్యా విధానంలో, వైద్య విధానంలో, ఆర్థిక వినిమయంలో, వార్తా ప్రసారంలో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ ప్రాంతాలలో వచ్చిన మార్పులను తొలి సాంఘిక నవలల ఆధారంగా ఈ అధ్యాయంలో వివరించాను.

నాకున్న పరిధులకి లోబడి ఈ పరిశోధనని పూర్తిచేసాను. నాకన్నా ముందు ఈ రంగంలో పరిశోధనచేసి, తమ కృషిని పుస్తక రూపంలో తెచ్చిన పరిశోధకులందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. పెద్దల సలహాలు, సూచనలు సర్వదా నాకు శిరోదార్యం.

అధ్యాయం-1

# 1. దక్షిణ భారతీయ సాహిత్యం - నవల

## 1.1. మలయాళ నవల

మలయాళంలో సాహిత్యం మొదట జానపద కథలు, స్థలవర్ణనలు, పుక్కిటి పురాణాల రూపంలో వెలువడింది. ప్రాచీన కాలంలో కేరళ ప్రాంతంలో ఐతిహ్యాలు (Vatakkan Pattukal –Ballads of North Malabar), వీరగాథలు వ్యాప్తిలో ఉండేవి. వీటితో పాటు కేరళ ప్రాంత ప్రజలకు మహాభారతం, రామాయణం, పంచతంత్రం, కథాసరిత్సాగరం, విక్రమాదిత్య కథలు, దశకుమార చరిత్ర, అరేబియన్‌నైట్స్ కథలతో గాఢ అనుబంధం ఉంది. ఈ కథలు, పురాణాలు కేరళ ప్రాంత కల్పనా సాహిత్య రచనలకు మౌలిక ఆకరాలుగా నిలిచాయి. వీటి ప్రభావంతో కేరళలో కల్పనా సాహిత్యం వచ్చింది. ఒక సాహిత్య ప్రక్రియగా 'నవల' కేరళ సాహిత్యంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల ఉద్భవించింది.

### 1.1.1. కేరళ ప్రాంతం నవల ఆవిర్భావ పూర్వ సామాజిక పరిస్థితులు

భారతదేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వం కేరళ ప్రాంతం మూడు విభాగాలుగా ఉండేది. i) మద్రాసు ప్రెసిడెన్సీలోని మలబార్‌ప్రాంతం, ii) ట్రావన్‌కోర్ ప్రాంతం, iii) కొచ్చి ప్రాంతం. 1950లో రెండు ప్రాంతాలు ఏకమై ట్రావన్‌కోర్ – కొచ్చి (Travancore – Cochin) గా ఏర్పడ్డాయి. ఆ తరువాత మలయాళం మాట్లాడే ప్రాంతమంతా కలిసి 1956లో కేరళ రాష్ట్రంగా ఆవిర్భవించింది. పాశ్చాత్య దేశాలతో సంబంధం కేరళ ప్రాంతంలోని సాహిత్యంలో గుణాత్మక మార్పులకు కారణం అయింది. భారతదేశ చరిత్రని ప్రభావితం చేసిన పోర్చుగీసువారు, డచ్చివారు, ఫ్రెంచివారు, బ్రిటీష్ వారు కేరళ చరిత్రని, సాహిత్యాన్ని కూడా ప్రభావితం చేశారు. వీరి ప్రభావంతో కేరళ ప్రాంత సంస్కృతిలో, సాహిత్యంలో కొన్ని మౌలిక మార్పులు వచ్చాయి.

#### 1.1.1.1. పోర్చుగీసు వారు

కేరళ ప్రాంతాన్ని సందర్శించిన వారిలో పోర్చుగీసు వారు చెప్పుకోదగిన వారు. క్రీ.శ. 1498 మే 18న పోర్చుగీసు దేశానికి చెందిన వాస్కోడగామ కేరళలోని కాలికట్‌కి చేరుకున్నాడు. వాస్కోడగామ కనుగొన్న ఈ సముద్ర మార్గం తూర్పు దేశాలతో భారతదేశానికి ఉన్న

సంబంధాలను పెంచడంలో సహకరించింది. ఒకటి, ఒకటిన్నర శతాబ్ద కాలంపాటు పోర్చుగీసు వారు కేరళ ప్రాంతంలో వర్తక, వ్యాపారాలు కొనసాగించారు. ఆల్బుకర్క్ అనే పోర్చుగీసు గవర్నర్ భారత దేశంలోని మహిళను వివాహమాడే విధంగా పోర్చుగీసు వారిని ప్రోత్సహించాడు. ఫలితంగా పోర్చుగీసు, ఇండియా సంబంధాలు బలపడతాయని ఆయన నమ్మకం. పోర్చుగీసు వారు భారతదేశ రాజుల యుద్ధ విధానంలో నూతన ఆయుధాలను ప్రవేశపెట్టారు. పిస్తోలు, తుపాకి వంటి ఆయుధాలను స్వదేశీ రాజులకు పోర్చుగీసు వారు అందించారు.

### 1.1.1.1.1. కులాంతర వివాహాలు - క్రైస్తవ మత వ్యాప్తి

"పోర్చుగీసు వారు కులాంతర వివాహాలు చేసుకోవడం వల్ల క్రైస్తవ మత వ్యాప్తి జరిగింది. వారు విద్యను అందించడానికి విద్యా సంస్థలు నెలకొల్పారు. విద్యా సంస్థలలో లాటిన్, పోర్చుగీసు భాషలను ప్రజలకి నేర్పించారు. కేరళ ప్రాంత క్రైస్తవులు క్రి.శ. 1599లో ఒక ధర్మ సభని కూడా పోప్ ఆధ్వర్యంలో (Diampur) నిర్వహించారు." (George, K.M. 1998: 2).

### 1.1.1.1.2. సాహిత్య సేవ

పోర్చుగీసు వారు మలయాళ ప్రజలకు యూరోపియన్ భాషలను నేర్పించడమే కాక వారు కూడా మలయాళాన్ని నేర్చుకున్నారు. వారి వ్యాపారం స్థానిక భాషలతో ముడిపడి ఉండేది. ఎస్.టి. ఫ్రాన్సిస్, గ్జావియర్ (Xaviar) వంటి విదేశీయులు మలయాళ ప్రాంతానికి విశేష సేవలు చేశారు. వారు మలయాళంలోనికి బైబిల్‌ని అనువాదం చేశారు. అది గోవాలో క్రీ.శ. 1557లో ప్రచురితమైంది. ఈ ఫ్రాన్సిస్ మలయాళంలో ప్రశ్నోత్తరాల రూపంలో ఉండే ఇంకో గ్రంథాన్ని కూడా రచించారు. అప్పటి నుండి మలయాళంలో పాశ్చాత్య రచనల అనువాదం ప్రారంభమైంది. కేరళ ప్రాంతంలో క్రీ.శ.1577లో ముద్రణాలయం స్థాపితమైంది. కేరళ ప్రాంతంలో ప్రచురితమైన తొలి మలయాళ పుస్తకం క్రిస్టియా వేదోపదేశం(Kristiya Vedo Padesam).

### 1.1.1.2. డచ్చీవారు

డచ్చీవారు క్రీ.శ. 1663-1795 మధ్యకాలంలో కేరళ ప్రాంతానికి వచ్చారు. పదిహేడవ శతాబ్ది మధ్య భాగంలో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపితమైంది. క్రీ.శ. 1663లో డచ్ కంపెనీవారు కొడంగలూర్, కొచ్చి, కననోర్ మొదలైన రేవు పట్టణాలను ఆక్రమించారు. వ్యాపారం నిమిత్తం కేరళ ప్రాంతానికి వచ్చిన డచ్చీ వారు అన్ని విధాల తమకు ముందున్న పోర్చుగీసు వారి స్థానాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. డచ్చీ వారు భారతీయ పరిశ్రమని అభివృద్ధి పరిచారు. నూతన పత్తి వంగడాలను, నాణ్యమైన వస్త్రాలను భారతదేశంలో ప్రవేశ పెట్టడంలో డచ్చివారు సఫలీకృతులయ్యారు. ముద్రణ, అద్దకం పరిశ్రమలలో వీరి కాలంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఉప్పు తయారీ విధానం, పత్తి పండించే విధానం, నీలి మందును వీరు భారతదేశంలో ప్రవేశ పెట్టారు. వీరు స్థానిక రాజుల మెప్పును పొందలేదు. ఆంగ్లేయుల పోటీని వీరు తట్టుకోలేక పోయారు. కేరళ సంస్కృతిని వీరు పోర్చుగీసు వారి వలే ప్రభావితం చేయలేదు.

### 1.1.1.3. ఫ్రెంచీ వారు

కేరళ ప్రాంతంలో డచ్ వారి ప్రాధాన్యం తగ్గుతున్న క్రమంలో ఇంగ్లీష్ వారికి పోటీగా ఫ్రెంచీ వారు వచ్చారు. ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీ క్రీ.శ. 1644లో స్థాపితమైంది. ఫ్రెంచ్ వారు తమ కర్మాగారాలను సూరత్ (1668), మచిలీపట్నం (1669)లలో స్థాపించారు. క్రీ.శ. 1674లో ఫ్రెంచ్ వారు పాండిచ్చేరిని పొందారు. ఇది తరువాతి కాలంలో ఫ్రెంచ్ వారి స్థావరాలకు ప్రధాన కేంద్రంగా బాసిల్లింది. కేరళ ప్రాంతంలో కూడా ఫ్రెంచ్ వారు తమ వర్తక స్థావరాలను నెలకొల్పారు. తెల్లి చెర్రి సమీపంలోని 'మహె' ఫ్రెంచ్ వారి ప్రధాన వర్తక కేంద్రం. ఫ్రెంచ్ గవర్నర్ అయిన డూప్లెక్స్ ఇంగ్లీష్ వారికి, ఫ్రెంచ్ వారికి మధ్య యుద్ధం జరగడానికి కారకునిగా నిలిచారు. ఏడు సంవత్సరాల యుద్ధంలో ఇంగ్లీష్ వారు మహె ప్రాంతాన్ని ఆక్రమించారు. తిరిగి క్రీ.శ. 1763లో ఫ్రెంచ్ వారు మళ్లీ మహె ప్రాంతాన్ని స్వాధీన పరుచుకున్నారు. ఫ్రెంచివారు ఇంగ్లీషు వారికి గట్టి పోటీదారుగా నిలిచారు. పాండిచ్చేరి, చంద్రానగర్, మహె, కరైకాల్, మొదలైన ప్రాంతాలపై ఫ్రెంచి వారి ప్రభావం బలంగా ఉంది.

### 1.1.1.4. బ్రిటీష్ వారు

క్రీ.శ. 17వ శతాబ్దంలో ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చారు. సముద్ర వ్యాపారంలో బ్రిటీష్ వారు నూతన విధానాలని అవలంబించారు. డిసెంబర్ 31, 1600 నాడు ఇంగ్లాండ్ రాణి ఎలిజబెత్ ఈస్టిండియా కంపెనీకి ఇండియా, పసిఫిక్ మహాసముద్ర ప్రాంతాలలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతిస్తూ చార్టర్‌ను విడుదల చేసింది. ఈ చార్టరులో పోర్చుగీసు వారు ఆక్రమించిన ప్రాంతాలను మినహాయించడం జరిగింది. క్రీ.శ. 1793లో ఆంగ్లేయులు కోహికోడ్ ప్రధాన కార్యాలయంగా మలబార్ ప్రాంతం తమ ఆధీనంలో ఉన్నట్లు ప్రకటించారు. కేరళలోని మిగతా ప్రాంతాలైన ట్రావన్‌కోర్, కొచ్చి పరోక్షంగా ఆంగ్లేయులచే పాలించబడుతుండేవి. కంపెనీ పరిపాలనా కాలంలో బ్రిటీష్ వారు భారతదేశంలో పరాయి పాలకులు గానే ఉన్నారు. కాని వారు భారతీయ సంస్కృతిలో మమేకం కాలేదు. కాబట్టి సాంస్కృతిక వినిమయం పెద్దగా జరగలేదు. పాశ్చాత్య సంస్కృతి భారతదేశంలోని ధనికులను ఆకర్షించింది. ఇది అనేక విధాలుగా పాశ్చాత్య సంస్కృతి వినిమయానికి అవకాశం కల్పించింది. విదేశి విద్య ఆంగ్లేయుల వల్ల భారతదేశంలో ప్రవేశించింది. ఈ విద్య వల్ల ప్రపంచ సంస్కృతి భారతీయులకు దగ్గరైంది. "రాజా రాంమ్మోహన్ రాయ్ వంటి వారు ఇంగ్లీషు విద్యను భారతదేశంలో ప్రవేశపెట్టడంలో (1835) ప్రధాన పాత్ర పోషించారు. క్రీ.శ. 1844లో బ్రిటీష్ వారు ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం ఉన్న వారికే ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని ఒక చట్టాన్ని తీసుకువచ్చారు. క్రీ.శ. 1857లో మద్రాసు, కలకత్తా, బొంబాయిలలో విశ్వవిద్యాలయాలు స్థాపితమయ్యాయి. ఈ విశ్వ విద్యాలయాలు ఆంగ్లేయ ప్రభుత్వం తెచ్చిన మాగ్నాకార్టా ఆఫ్ ఇంగ్లీషు ఎడ్యుకేషన్‌గా పిలువబడే 1854 చట్టం కింద స్థాపించ బడ్డాయి." (George, K.M. 1998: 5, 6) భారతదేశంలో నూతన సాహిత్య ధోరణులు బయలు దేరడానికి ఈ విశ్వవిద్యాలయాలు సహకరించాయి.

### 1.1.2. మలయాళ సాహిత్యం - పాశ్చాత్య ప్రభావం

"మలయాళ భాషా సాహిత్యాలపై పాశ్చాత్య ప్రభావం 1840 వరకు నెమ్మదిగా కొంత మాత్రంగా ఉండింది. 1840-1880 మధ్యకాలంలో ఈ పాశ్చాత్య ప్రభావం పెరిగింది. ఈ కాలంలో బైలీ, గుండర్ట్ వంటి పాశ్చాత్య పండితులు మలయాళ భాషకు వ్యాకరణ గ్రంథాలు, నిఘంటువులను రచించారు. 1880ల తరువాత మలయాళ సాహిత్యం పాశ్చాత్య సాహిత్య

ప్రక్రియల ప్రభావానికి లోనైంది." (George, K.M.1998:52) క్రీ.శ. పంతొమ్మిదవ శతాబ్దంలో అనేకమైన యూరోపియన్ సాహిత్య ప్రక్రియలు ఆంగ్ల విద్యా విధానంతో భారతీయులకు పరిచయం చేయబడ్డాయి. ఇంగ్లీషులో ప్రావీణ్యం ఉన్న భారతీయులు ఆ ప్రక్రియలని చదివి అందులోని మౌలికాంశాలను భారతీయ భాషలలోకి అనువదించసాగారు. ఈ విషయం భారతీయ సాహిత్యంపై విదేశీ సాహిత్య ప్రభావానికి విత్తుగా పనిచేసింది.

పాశ్చాత్య గ్రంథాలు భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఈ అనువాదాలు కూడా పాశ్చాత్య సాహిత్యానికి భారతీయులను దగ్గర చేశాయి. "ఈ విధంగా పాశ్చాత్య సాహిత్యాన్ని చదివి అందులోని సాహిత్య రచనలను భారతీయులకు పరిచయం చేసిన వారిలో బెంగాలీ భాషకు చెందిన బంకించంద్ర ఛటర్జీ, మరాఠీ భాషకు చెందిన హరినారాయణ్ ఆప్టే, మలయాళ భాషకి చెందిన ఒ. చందుమీనన్ ముఖ్యమైనవారు భారతీయ పునరుజ్జీవనోద్యమాన్ని వీరు పరిపుష్టం చేశారు." (George, K.M. 1998: 53) ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్య ప్రక్రియలకు మూలాలు పాశ్చాత్య సాహిత్యంలో ఉన్నాయి. ప్రక్రియ పాశ్చాత్య సాహిత్యం నుండి దిగుమతి అయినా అందులోని వస్తువు మాత్రం స్థానికం.

*"The Thought is Indian but the inspiring factor is borrowed. This is what happened in Malayalam during the last nine decades, when several Western books were adapted several themes borrowed and quite a few Western literary forms accepted as a means to present indigenous themes and contemporary problems" (George, K.M. 1998: 53).*

"లండన్ మిషనరీ సంస్థ క్రీ.శ. 1806లో ట్రావన్‌కోర్ జిల్లాలో తొలి ఇంగ్లీషు పాఠశాలని స్థాపించింది. 1813 వరకు ఈ సంస్థ ఆరు పాఠశాలలను ప్రారంభించింది. చర్చి మిషనరీ సొసైటీ 1816లో కొట్టాయంలో తొలి ఇంగ్లీషు పాఠశాలను ప్రారంభించింది. ట్రావన్‌కోర్ ప్రభుత్వం కూడా ఇంగ్లీషు పాఠశాలలను ప్రోత్సహించింది. ఇదే క్రమంలో మద్రాసు విశ్వవిద్యాలయం క్రీ.శ. 1857లో స్థాపితమైంది." (George, K.M. 1998: 54) ఈ

అంశాలు మలయాళ సాహిత్యంపై పాశ్చాత్య సాహిత్య ప్రభావానికి మౌలికాంశాలుగా పనిచేశాయి.

### 1.1.3. మలయాళ సాహిత్యం - పాశ్చాత్య పండితుల సేవ

#### 1.1.3.1. అర్నోస్ పాదిరి (1732) (Arnos Padiri)

అర్నోస్ పాదిరి మలయాళ భాషకి వ్యాకరణాన్ని రచించారు. ఈయన అసలు పేరు జాన్ ఎర్నెస్ట్ అనెక్స్ లెండన్', ఎర్నెస్ట్ మలయాళీకరించబడి అర్నోస్(Arnos)గా మారింది. పాదిరి అంటే గురువు అని అర్థం. హంగేరీ   జన్మించిన ఆర్నోస్ జెసుట్ మిషనరీ తరపున 1699లో కేరళకి వచ్చాడు. తిరిచ్చి ప్రాంతంలో చాలారోజులు ఉండి అక్కడి బ్రాహ్మణుల ద్వారా సంస్కృతాన్ని నేర్చుకున్నారు.

#### 1.1.3.2. పౌలియన్స్ పాదరి (Paulinos Padiri)

ఇతని అసలు పేరు ఫిలిప్ వెస్డిన్ (Philip Wesdin). ఇతను 1748లో ఆస్ట్రేలియాలో పుట్టాడు. క్రైస్తవ సన్యాసిగా మారిన తరుణంలో తన పేరును (Paulino desan bortolomeo) మార్చుకున్నారు. ఇతను ప్రెగ్, రోమ్ విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసించి పాశ్చాత్య భాషలపై మక్కువను పెంచుకున్నాడు. ఇతను క్రైస్తవ మిషనరీ పనిపై భారతదేశానికి వచ్చి మలయాళంలో కవితలు, గద్యరచనలు చేశాడు. దేవసెల్గవనం (Devasalgvnam) అన్నది ఇతని కవిత. ఇందులో దేవుని ఆరు గణాలు వర్ణించబడ్డాయి. త్రైస్యచరితం (Tresyacaritam) అనేది వీరి ఇంకో రచన. కుడసపుస్తకం(Kudasa pustakam) ఇతని గద్య రచన. ఇందులో పూజా విధానాలు పేర్కొనబడ్డాయి.

### 1.1.4. మలయాళ సాహిత్యం మిషనరీ సంస్థలు - స్థానిక క్రైస్తవుల కృషి

మాథ్యూస్ పాదిరి (Mathew Padiri), ఫ్రాన్సిస్ రోజ్ (Franciss Roz), ఆంగ్లో ఫ్రాన్సిస్(Angelo Francis), జాన్ బాప్తిస్టా(John Baptista) మొదలైన క్రైస్తవ సంస్థలు మలయాళ సాహిత్యానికి విశేష సేవలు అందించాయి.

#### 1.1.4.1. సంక్షేప వేదార్థం (Sanksepa Vedartham)

ఇది 'డాట్రినా క్రిస్టియాన'(Dotrina Christiana) అన్న పుస్తకానికి సంక్షిప్త రూపం. ఇది మలయాళంలో ముద్రితమైన తొలి పుస్తకం. దీని రచయిత ఫాదర్ క్లెమెంట్ (Father

Clement). ఈ పుస్తకం మలయాళ భాషలో రచించినప్పటికీ ముద్రణ మాత్రం 1772లో రోమ్ నగరంలో జరిగింది. ఇది 276 పుటల పుస్తకం. ఇది గురువు, శిష్యుల సంభాషణ రూపంలో ఉంటుంది.

### 1.1.4.2. వర్ధమాన పుస్తకం (Varthamana Pustakam)

ఇది ఒక యాత్రా చరిత్ర. దీన్ని థోమకట్టనార్ (Thoma Kattanar) అనే ఒక స్థానిక క్రైస్తవ మతస్థుడు రచించాడు. ఈ రచనలో థోమకట్టనార్ 'కరియట్టిల్ ఒసెఫ్ మల్ఫన్' (Kariyattil Ouseph Malphan)తో కలిసి రోమ్ వెళ్తాడు. వారి ఓడ ప్రయాణం 1778లో ప్రారంభమవుతుంది. వీరి ప్రయాణం రెండు సంవత్సరాలు కొనసాగుతుంది. వారు కేప్ ఆఫ్ గుడ్‌హోప్ నుండి బయలుదేరి రోమ్‌కు చేరుకుంటారు. మొత్తం ప్రయాణాన్ని ముగించుకొని భారతదేశం రావడానికి ఆరు సంవత్సరాలు పడుతుంది. ఈ మొత్తం ప్రయాణాన్ని థోమ కట్టనార్ ఈ పుస్తకంలో వివరించారు. ఈ పుస్తకంలో అధ్యయాల విభజన, ప్యారాల విభజన కనిపిస్తుంది. ఇది అంతకు ముందు ఉన్న భారతీయ రచనలలో కనిపించదు. ఈ రచనలోని వస్తువు, నిర్మాణం పాశ్చాత్యం కాని రచయిత మాత్రం భారతీయుడు.

### 1.1.4.3. కవిట్టు నాటకం

మలయాళ నాటక సాహిత్యంలో "కవిట్టునాటకం"కి ప్రత్యేక స్థానం ఉంది. కవిట్టు అంటే పాదకళ (Foot work) అని అర్థం. ఇది మధ్య కేరళ ప్రాంతంలో 17వ శతాబ్దంలో ఆవిష్కృతమైన నూతన సంగీత కళ. ఇది ఉత్తర, దక్షిణ భారత సంస్కృతులతో మిళితమై ప్రదర్శింపబడే నాటక కళ. కేరళ కథకళి, పాశ్చాత్య ఒపేరా రెండింటి సమ్మేళనం ఇందులో ఉంటుంది. ఇందులోని భాష తమిళ, మలయాళాలతో కలిసి ఉంటుంది. ఇందులోని కథ పాశ్చాత్యం అది బైబిల్‌కు, అందులోని పాత్రలకు చెందినదై ఉంటుంది. పాత్రల అలంకరణ, వస్త్రాధారణ అంతా పాశ్చాత్యం. ఇందులోని పాదకళ అద్భుతంగా ఉంటుంది.

చిన్నతంబి పిళ్ళై అనే తమిళ పరిశోధకుడు కాథలిక్ మతానుయాయుగా ఉండి నూతన నాటక విధానానికి తెరతీసాడు. ఆ తరువాత వేదనాయగంపిళ్ళై కొన్ని కథలను అనువదించడంతో నూతన విధానం నిర్మితమైంది. కరలమన్ చరితం అనేది ఒక ప్రముఖ కవిట్టు

నాటకం. ఇందులో చార్లే మాగ్నే (Charlemagne) కథ ఉంది. అతను పాలస్తీనాకు ఎలా చేరుకున్నాడు, అక్కడ ఉన్న తురుష్కులను క్రైస్తవులుగా ఎలా మార్చాడు అన్న కథ ఇందులో ఉంది. కథకళి మాదిరిగానే ఇందులో కూడా నాయక ప్రాధాన్యం ఉంటుంది. 'జోసెఫ్ నాటకం', 'యాకూబ్ నాటకం' మొదలైనవి ప్రముఖ చారిత్రక కవిట్టు నాటకాలు. ఈ నాటకంలోని కథలు బైబిల్ సంబంధమైనవి. ఇవి పాశ్చాత్య ప్రభావానికి నిదర్శనాలు.

తమిళంలో బైబిల్ 1714లో వెలువడింది. మలయాళంలో 1811లో, ఉర్దూలో 1743లో, అస్సామీలో 1819లో, బెంగాలీలో 1800లో, గుజరాతీలో 1809లో, హిందీలో 1806లో, కన్నడలో 1812లో, తెలుగులో 1812లో, మరాఠీలో 1805లో, ఒరియాలో 1809లో, పంజాబీలో 1815లో, సంస్కృతంలో 1808లో బైబిల్ వెలువడింది. డా. గుండర్ట్ నిఘంటు నిర్మాణకర్తగా అనువాదకుడిగా మలయాళ సాహిత్యానికి విశేష సేవలందించారు. గుండర్ట్ దాదాపుగా పంతొమ్మిది గద్య రచనలు చేశారు. ఈ రచనలు క్రైస్తవ మత ప్రాతిపదికగా రచించబడ్డాయి. కేరలోల్ పట్టి, కేరళపల్మ(1868), మలయాళ రాజ్యం(1870), పాఠమాల (1860), నలచరిత్ర, ఈయన రచనల్లో ప్రధానంగాపేర్కొనదగినవి.

### 1.1.4.4. స్థానిక క్రైస్తవులు - మలయాళ సాహిత్య సేవ

స్థానిక క్రైస్తవులలో మొట్టమొదట చెప్పుకోవలసిన వ్యక్తి రెవరెండ్. జార్జ్ మాథ్యు (1820-70) స్థానికంగా ఇంగ్లీష్ భాషను అభ్యసించిన వారిలో రెవరెండ్. జార్జ్ చెప్పుకోదగిన వారు. ప్రభుత్వం నుండి ఎన్ని అవకాశాలు వచ్చినా వాటిని కాదని మత ప్రచారకుడిగానే మిగిలి పోయారు. సత్యవాద ఖేతం (1861), వేద సంయుక్త (1862), ఓరుసామవాదం (1863), బాలభ్యాసనం (1867) ఇతని రచనలు. రెవరెండ్. జార్జ్ తరువాత చెప్పుకోదగ్గ వారు ఇండియా చరిత్రం రచించిన అయిమనం పి. జాన్ (1825-93), మరియు అల్మరట్టంను రచించిన ఓమెన్ ఫిలిపోస్ (1838-80). ఈ ఇద్దరు మిషనరీ సంస్థలలో పనిచేసినవారే. స్థానిక క్రైస్తవులే కాక కేరళ ప్రాంతంలో స్థానికంగా ఉన్న కొంతమంది రాజులు కూడా పాశ్చాత్య విద్యను ప్రోత్సహించారు. ట్రావన్కోర్ మహారాజు అయిలం తిరునాళ్ (1861-75) ఆంగ్ల విద్యని ప్రోత్సహించిన వారిలో చెప్పుకోదగ్గవారు. అయిలం తిరునాళ్ మలయాళ పాఠశాలలో పుస్తక రచన నిమిత్తం ఒక కమిటీని ఏర్పరిచారు. ఈ కమిటీ చైర్మన్గా అన్నాజి రాయర్ ఉండగా

సుబ్బయ్య దీక్షితర్, కేరళ వర్మ సభ్యులుగా ఉన్నారు. కేరళ వర్మ మంచి గద్య రచయిత. ఇతను తన రచనల ద్వారా తరువాతి రచయితలకు మార్గదర్శకంగా నిలిచారు. అంతేకాక యూరోపియన్ నిర్మాణాల ఆధారంగా నూతన పాఠ్య ప్రణాళికను రూపొందించారు. అనేక శాసనాలకు పరిష్కర్తగా వ్యవహరించి మలయాళ భాషకు ఎనలేని సేవ చేశారు. మలయాళంలో గద్య రచనలను ప్రోత్సహించారు. అందుకే ఈయన్ని "ఫాదర్ ఆఫ్ మాడ్రన్ మలయాళం ప్రోస్" అంటారు.

### 1.1.5. మలయాళ సాహిత్యం - ఆధునిక ప్రక్రియల ఆవిర్భావం

1880 తరువాత ఐదు దశాబ్దాల కాలాన్ని మలయాళ సాహిత్యంలో పునరుజ్జీవన కాలం అంటారు. ఈ కాలంలో మలయాళ సాహిత్యంలో ప్రముఖ పద్య, గద్య రచనలు వెలువడ్డాయి. మలయాళ గద్య రచనలకు ఒక పరిణామ క్రమం ఉంది.

#### 1.1.5.1. గద్య రచనలు

"గద్యంలో రచనలు కేరళ ప్రాంతంలో పదవ శతాబ్దం నుండి కనిపిస్తాయి. పదవ శతాబ్దంలో తమిళంతో కూడిన మలయాళంలో కౌటిల్యు  అర్థశాస్త్రం వెలువడింది. ఆ తరువాత 15వ శతాబ్దంలో అనేక పురాణాలు గద్యంలో వెలువడ్డాయి. జెసుట్ మిషనరీ, పోర్చుగీసు వర్తకుల మేలుకొలుపు వల్ల పదహారవ శతాబ్దం నుండి మలయాళంలో విస్తృత వచన రచనలు బయలుదేరాయి. జెసుట్ మిషనరీ ప్రధాన ఉద్దేశం మత ప్రచారమే అయినా అందుకు వారు వచన రచనలని ముద్రించాల్సిన అవసరం వచ్చింది. అందుకొరకు వారు క్రీ.శ. 1563లో కొచ్చిన్ సమీపంలో ముద్రణాలయం స్థాపించారు". (Clarck, T.W. 1970: 207, 208). "ట్రావన్కోర్ ప్రాంతాన్ని పలిపాలించిన స్వాతితిరునాళ్ మహారాజుచే త్రివేంద్రం ప్రాంతంలో ప్రభుత్వ ముద్రణాలయం ఏర్పడింది. అక్కడి నుండి పుస్తక ముద్రణ విరివిగా సాగింది. ఈశ్వరపిళ్ళై విచారిప్పుకార్ త్రివేంద్రంలో కేరళ విలాస ముద్రణాలయం స్థాపించి ఇరాయిమ్మన్ తంపి కృతుల సమూహాలను సంపుటాలుగా ముద్రించారు. ఈ ముద్రణాలయం నుండి స్వాతి తిరునాళ్ రచించిన అట్టకథల సమూహం మణిప్రవాళ పదములు వెలువడ్డాయి." (పరమేశ్వరన్ నాయర్, పి.కె. 1978, 23) "బ్రాహ్మణ పురాణం, దూతవాక్యం, అంబరీషోపాఖ్యానం, దేవీ మహాత్మ్యం, భాగవత గద్యం వంటి పురాణ కథలు, క్రియదీపిక, యంత్రాంగం శూర్పణగం

వంటి గద్య రచనలు కూడా ఇదే కాలంలో వెలువడ్డాయి." (వెంకటేశ్వర శాస్త్రి, జొన్నలగడ్డ. 1968: 55).

ఇదే సమయంలో పాశ్చాత్య సాహిత్య ప్రక్రియలు మలయాళ సాహిత్యానికి పరిచయం అయ్యాయి. నవల, కథానిక, జీవిత చరిత్ర, వ్యాసం, ఎలిజీ, నాటకం వంటి నూతన ప్రక్రియలు మలయాళ సాహిత్యానికి పరిచయం అయ్యాయి. నూతన సాహిత్య విప్లవాలు కూడా ఈ కాలంలో విలసిల్లాయి. కవిత్వంలో సంస్కృత మహాకావ్యాల ఆధారంగా నవ్య సంప్రదాయవాద కవిత్వం వచ్చింది. చందుమీనన్ రచించిన తొలి సాంఘిక నవల 'ఇందులేఖ (1889)', 'శారద (1892)', సి.వి. రామన్ పిళ్ళై చారిత్రక నవల 'మార్తాండవర్మ (1891)' మలయాళ సాహితీ ప్రియులకు పరిచయం అయ్యాయి. కవిత్వం సంస్కృత ప్రభావం నుండి వేరుపడలేకపోయినా వచన రచనలు మాత్రం పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వెలువడ్డాయి. ఆధునిక మలయాళ సాహిత్యాన్ని విస్తృతపరిచిన వారిలో చందుమీనన్, సి.వి. రామన్ పిళ్ళై, కేరళవర్మ, ఎ.ఆర్. రాజరాజవర్మ, కుమారన్ ఆశన్, వల్లదోల్, నారాయణ మీనన్, ఉల్లూర్ పరమేశ్వర అయ్యర్ మొదలైన వారు చెప్పుకోదగిన వారు. 20వ శతాబ్దంలో ఆశన్, వల్లథోల్ వంటి రచయితలు మలయాళ కవిత్వంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. ఆశన్ తన రచనలలో సాంఘిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వగా వల్లథోల్ తన ఖండ కావ్యాల ద్వారా జాతీయవాదాన్ని పెంచి పోషించారు. అందుచేతనే 1880-1930 మధ్యకాలాన్ని మలయాళంలో నవ్య సంప్రదాయ కాలంగా గుర్తిస్తారు.

### 1.1.6. మలయాళ సాహిత్యం - నవల ఆవిర్భావం

మలయాళంలో వచన రచనలు మొదట అనువాద రూపంలో వెలువడ్డాయి. 'జాన్ బన్యన్స్ పిలిగ్రిమ్స్ ప్రొగ్రెస్' అనే ఇంగ్లీష్ రచనని జోసెఫ్ పిట్ అనే మిషనరీ వ్యక్తి 1840లో మలయాళంలోకి అనువదించారు. ఇది నవలా కాదా అన్న విషయంలో మలయాళ విమర్శకులలో వాదోపవాదాలు జరిగాయి. "ఏది ఏమైనా మలయాళంలో వెలువడిన తొలి అనువాద రచన 'పిలిగ్రిమ్స్ ప్రొగ్రెస్" (George, 1984:649). కొంతమంది విమర్శకులు 'గటకవాదం' (1878) అనే రచనని తొలి మలయాళ నవలగా గుర్తించారు. ఈ గటకవాదం కొల్లిన్స్ రాసిన "సెరియన్ (Clayersiain)"కి మలయాళ అనువాదం. ఈ నవలలో సెరియన్

క్రిస్టియన్ సహజ వర్ణన కనిపిస్తుంది. క్రీ.శ. 1882లో 'పుల్లెలి కుంచు'(Pulleli Kuncu) అనే ఇంకో నవల కూడా వెలుగులోకి వచ్చింది. ఇందులో క్రైస్తవ మతం గురించి రెండు పాత్రల మధ్య నడిచే సంభాషణ ఉంటుంది. ఈ విధంగా హెర్మన్ గుండర్ట్, బెంజమెన్ బైలి, గోరె, మాథ్యు వంటి ఇంగ్లీష్ మిషనరీలకు చెందిన వ్యక్తులు తొలుత మలయాళంలో చేసిన రచనలు పంతొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధంలో ప్రారంభమైన మలయాళ నవలకి గట్టి పునాదులను ఏర్పరచాయి.

మలయాళ నవల ఇంగ్లీష్ భాషతో పరిచయం ఉన్న ముగ్గురు వ్యక్తులతో ప్రారంభమైంది. వారు అప్పునెడుంగడి, ఒ. చందుమీనన్, సి.వి. రామన్ పిళ్ళై. ఈ ముగ్గురిలో అప్పునెడుంగడి నవలా సాహిత్యానికి శంకుస్థాపన చేస్తే చందుమీనన్, రామన్ పిళ్ళై నవలా సాహిత్యాన్ని వికసింప చేశారు.

అ) కుందలత (1887) – అప్పునెడుంగడి రాసిన తొలి మలయాళ నవల.

ఆ) ఇందులేఖ (1889) – ఒ. చందుమీనన్ రాసిన తొలి మలయాళ సాంఘిక నవల.

ఇ) మార్తాండ వర్మ (1891) – సి.వి. రామన్ పిళ్ళై రాసిన తొలి మలయాళ చారిత్రక నవల.

మలయాళ సాహిత్యంలో నవల ఆవిర్భావం జరగడానికి ఈ మూడు రచనలు మూల కారణం. ఈ రచనల ఆవిర్భావం వెనుక కూడా విస్తృత నేపథ్యం ఉంది.

### 1.1.6.1. అప్పునెడుంగడి - కుందలత (1887)

"క్రీ.శ. 1887 అక్టోబర్ లో 'కుందలత' నవల ప్రచురింపబడింది. ఇది మలయాళంలో మొదటి నవల. అప్పునెడుంగడి దీనికర్త" (వెంకటేశ్వరశాస్త్రి, జొన్నలగడ్డ. 1968: 59) అప్పునెడుంగడిగారు రాసిన 'కుందలత' (1887) నవల మలయాళంలో ముద్రితమైన తొలి నవల. ఇది అన్ని నవలా లక్షణాలు కలిగిన నవల కాదని విమర్శకులు పేర్కొంటున్నారు. కాని మలయాళంలో వచ్చిన తొలి నవల కుందలత అన్నది సత్యం.

'కుందలత' అన్నది కళింగరాజు కుమార్తె పేరు. కపిలనాథన్ అతని మంత్రి. అతను కుందలతను అపహరిస్తాడు. ఆ తరువాత రాజ్యంలో చాలా మార్పులు వస్తాయి. రాజు సోదరుడు రాజ్య పీఠాన్ని అధిష్టిస్తాడు. చాలా సంవత్సరాల తరువాత కపిలనాథన్, కుందలత తిరిగి రాజ్యానికి వస్తారు. ఈ మధ్యలో కుందలతకి, కపిలనాథన్ కొడుకు తారానాథన్‌కి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తుంది. ఇలా ఈ కథలో చాలా మార్పులు ఉంటాయి. చివరికి కథ సుఖాంతం

అవుతుంది. ఎం.పి. పౌల్ అనే విమర్శకుడు కుందలత నవలపై షేక్స్ ఫియర్ 'Cymbelene', స్కాట్ 'ఐవాన్ హో' ప్రభావం ఉన్నట్లుగా అభిప్రాయపడ్డారు.

*"In the estimate of certain critics Kundalata (1887) of Appu Nedungadi is really the first novel in Malayalam. Nedungadi has been considerably influenced by Shakespeare's Cymbeline and Walter Scotts Ivanhoe. Kundalata is a romance packed with adventure and sentiment, with no relation to the social life in Kerala. The novel is an entertainer. It tells a story. Credit is due to it for its racy and effective dialouge" (George, K.M. 1984: 649).*

కుందలత నవల మలయాళ ప్రజలకు నవల అంటే ఏంటో రుచి చూపించింది. కుందలత నవలపై ఆంగ్ల ప్రభావం ఉందనడానికి పై వాక్యాలు నిదర్శనం. ఈ నవల తరువాత ఒ. చందుమీనన్ గారి ఇందులేఖ నవల వెలువడింది. ఇందులేఖ నవలని మలయాళ తొలి సాంఘిక నవలగా గుర్తిస్తారు.

### 1.1.6.2. తొలి సాంఘిక నవల - ఇందులేఖ

*"In December 1889, O. Chandu Menon, a judge by profession, gifted with a high sense of humour and the art of narration, brought out 'Indulekha' which is rightly hailed as the first major novel in Malayalam. He attempted another novel, Sarada but died before he could complete it. Even in the unfinished form Sarada has attained a place of eminence in Malayalam. The novel is remarkable for its humour and the sharpness of its social critisism. Both Indulekha and Sarada are set against the matriarchal system that prevailed among the Hindus in Kerala".*

*– K.M. Tharakan.(George, K.M. 1984: 649)*

*"Most of the earliest ones, which were published in the late eighties are now largely forgotten. But one that came out in 1889 is still widely read and reffered to, and is held by all critics to be first significant novel in the language. It is Chandu Menon's 'Indulekha'."*

*-Clark T.W. (Clark, T.W. 1970: 208)*

"మలయాళ వాఙ్మయమున ఆధునిక నవలా లక్షణాలతో గూడి సహజమైన గుణ సంపదచే మలయాళమునందలి యే అత్యుత్తమ నవల పక్కనైన నిలుపదగిన మొదటి నవల వెలువడెనని చెప్పవచ్చును. అది మనకు అపూర్వ ప్రతిభావంతమైన ఒక రచయితను స్వతంత్రము విమర్శనాత్మకమునై జీవిత దృక్పథమును ప్రదర్శించును. ఇందులేఖ సాంఘిక నవల. ఆధునిక విద్యాలాభమును పొందిన సమర్ధుడైన శిల్పిచే చిత్రింపబడిన తత్కాల సాంఘిక పరిస్థితుల వాస్తవిక చిత్రణ యిందు కనిపించును. ఉన్నత తరగతులవారు, ప్రాచీనమైనవారు సంస్కృతికి వారసులై యుండిరి. కాని సనాతనత్వము భూస్వామిత్వము వంటి దోషము ఆ సంస్కృతి అధ:పతనమునకు గురిచేసెను. సంప్రదాయమంగీకరించిన దురాచారముల నేకములుండెను. తత్ఫలితముగా కుటుంబ నిర్మాణమున అనైక్య మావహిల్లుటయు, వివాహ సంస్కారమొక వేళాకోళమగుటయు సంభవించెను. ఆంగ్ల విద్యాధ్యాయనమొసంగిన మనోవికాసమును, ఆంగ్లసారస్వతం నందలి ఆదర్శములను చందుమీనన్ కు సమకాలీన దృశ్యమునంతను నిష్పక్ష పాతముగను, సమగ్రముగను సమీక్షించి పతనమునకు కారణభూతమైన దుష్టశక్తులను కనుగొనుటకు తగిన సమర్థత నొసంగెను. ఆ వికృతత్వమంతయు అతని హృదయమును కంపింపజేసెను. తత్ప్రతిక్రియలే ఇందులేఖ రూపము నొందెను".

– పి.కె. పరమేశ్వరన్ నాయర్ (పరమేశ్వరన్ నాయర్, పి.కె. 1978:130)

"1882లో అప్పునెడుంగడి 'కుందలత' వచ్చింది. అయినప్పటికీ అసలైన మలయాళీ నవల రూపుదిద్దుకునేందుకు చాలా కాలం పట్టింది. మొదటి సమగ్ర మలయాళీ నవల చందుమీనన్ రాసిన ఇందులేఖ. పంతొమ్మిదో శతాబ్దం ఆఖరి దశాబ్దంలో వెలువడ్డ ఇందులేఖ నవలలో కేరళలోని ఉమ్మడి బ్రాహ్మణ కుటుంబ జీవిత చిత్రణ ముఖ్యాంశం"

– డి. విద్యేశ్వరి(విద్యేశ్వరి, డి. 2010: 24)

"జూన్ 11, 1889న ఇందులేఖ నవల ప్రచురింపబడటంతో మలయాళ సాహిత్యంలో లక్షణయుక్తమైన మొదటి నవల వెలువడిందని చెప్పవచ్చు. దీని రచయిత చందుమీనన్".

– జొన్నలగడ్డ వెంకటేశ్వర శాస్త్రి (వెంకటేశ్వర శాస్త్రి, జొన్నలగడ్డ. 1968: 60)

చందుమీనన్ గారు వృత్తిరీత్యా న్యాయవాది. అతనికి సాహిత్యంతో పరిచయం ఉండేది. ఇందులేఖ నవల ముందుమాటలో తాను నవలను రాయడానికి తనని ప్రేరేపించిన పరిస్థితులను ఒ.చందుమీనన్‌గారు పేర్కొన్నారు.

"1886లో నేను కాలికట్‌ని వదిలిన తరువాత ఆంగ్ల నవలలని చదవడం ప్రారంభించాను. నా ఖాళీ సమయాన్నంతా నవలలు చదవడానికి కేటాయించాను. ఆ తరువాత నా చుట్టూ ఉన్న ఆత్మీయుతులతో నా భావాలను పంచుకోడానికి ప్రయత్నించాను. కాని నేను కథలు చెబుతుండగా వినే శ్రోతలు నవలలోని కథల వైవిధ్యానికి ఆసక్తి చూపలేదు. చివరికి లార్డ్ బెకన్స్ ఫీల్డ్ 'హెన్రిరెట్టా టెంపుల్' నవలని చదివి వినిపిస్తున్నప్పుడు నవలను వినడానికి ఆసక్తి చూపించారు. నేను ఏకాంతంగా నవలని చదువుతున్నప్పుడు నా భార్య నవలలోని విషయాలు తెలుసుకోవడానికి తాపత్రయ పడేది. చివరికి ఈ తాపత్రయం వల్ల నేను బెకన్స్ ఫీల్డ్ నవలని అనువదించడానికి ప్రేరేపితుడయ్యాను. దీనిని నేను అంగీకరిస్తున్నాను. నేను కొంత పనిని ప్రారంభించిన తరువాత యథా తథానువాదం సరిపోదనిపించింది. అంతేకాక ఇంకో అభ్యంతరం ఏంటంటే మలయాళ సాహిత్య పున:సృష్టిలో ఇంగ్లీషు నవలలోని ప్రేమ వ్యక్తీకరణ మార్గాలు మలయాళ సమాజానికి దూరంలో ఉన్నట్లు అనిపించింది. ఈ అన్ని కారణాల వల్ల నేను ఇంగ్లీషు నవలలను అనుసరిస్తూ ఒక మలయాళ నవలని రాయాలని నిర్ణయించుకున్నాను." (George, K.M.1998: 91, 92). చందుమీనన్ గారికి ఇంగ్లీషు నవలలంటే అభిమానం. అతని భార్యకి ఆ నవలలోని కథలంటే ఇష్టం. ఆమెకి ఇంగ్లీషు రాదు. తన భాషలో ఆ కథలని చెప్పించుకోవడానికి పట్టుపట్టేది. రచయిత మలయాళంలో దాదాపుగా అర్థం పొసిగే విధంగా చెప్పడానికి ప్రయత్నించేవాడు. ఈ ప్రక్రియ మలయాళంలో ఇందులేఖ నవల ఆవిర్భావానికి కారణం అయ్యింది. ఇందులేఖ నవల మలయాళ సాహిత్యంలో నూతన శకాన్ని ప్రారంభించింది. చందుమీనన్ గారు ఆంగ్ల నవల నిర్మాణాన్ని అనుసరించి స్థానిక వస్తువును ఎన్నుకున్నప్పుడు స్థానికులు నవలకి దగ్గరవుతారని అభిప్రాయపడ్డారు. తన చుట్టూ ఉన్న సమాజంలోని సాంఘిక, సాంస్కృతిక పరిస్థితుల్ని గమనించారు. బాధాకరమైన అధోగతి

నంబూద్రి, నాయర్ కులాలలో కనిపించింది. నాయర్ మహిళను నంబుద్రివారు ఆట వస్తువుగా చూసేవారు. అంతేకాక సంప్రదాయ నాయర్ కుటుంబాలలో తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెలను అలాగే చూసేవారు. నంబూద్రిలు, నాయర్ మహిళను వివాహమాడిన తరువాత భర్తలుగా బాధ్యతలు నిర్వహించే వారు కాదు. పితృస్వామ్య విధానం వారి బాధ్యతా రాహిత్యానికి అండగా నిలిచింది. చందుమీనన్ ఈ వ్యత్యాసాన్ని ఎత్తి చూపాలనుకున్నారు. నాయర్ కులానికి కూడా సమాన స్థాయి కావాలని ఆకాంక్షించారు. స్త్రీకి పురుషులతో సమానమైన విద్య, ఉద్యోగ అవకాశాలు ఉండాలని ఆకాంక్షించారు. ఆంగ్ల విద్య వల్ల నూతన తరం శక్తివంతంగా తయారవుతుందని గట్టిగా నమ్మారు. చందుమీనన్ నవల రచించిన తరువాత తాను నవల రాయడానికి గల కారణాలను తెలుపుతూ తన నవల మొదటి ప్రతిని అప్పటి మలబార్ కలెక్టర్ డబ్ల్యు. డుమెర్గ్యూకు (W.Dumergue) అందించారు. ఆయన ఇందులేఖ నవలని చదివి దాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. డబ్ల్యు. డుమెర్గ్యూకు రాసిన లేఖలో చందుమీనన్ తాను నవల రాయడానికి గల కారణాలను చాలా స్పష్టంగా పేర్కొన్నారు. “మొదట నా భార్య పదే పదే తన భాషలో నవల చదవాలనుందని కోరడం, రెండోది నా సొంత కోరిక. నేను మలయాళ పాఠకులకు నూతన సాహిత్య రుచిని పరిచయం చేయాలని. సాహిత్యానికి సంబంధించి ఆంగ్లంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిన నవల రూప కాల్పనిక రచనలు స్థానికులకు తెలియదు. మరి వారు నిత్యం వారి ఇండ్లలో వారి చుట్టూ జరిగే సంఘటనలతో కూడిన కథా వస్తువును అంగీకరిస్తారో లేదో చూడాలి. నా మలయాళ సోదరులకు నాయర్ కులంలోని మహిళ శక్తి, సామర్థ్యాలను, వారి ప్రజ్ఞా పాటావాలను వారిపై జరిగే దోపిడీని తెలియచెప్పాలి. వారికి ఆంగ్ల విద్యను అందించాలి. అంతిమంగా అవసాన దశలో ఉన్న మలయాళ సాహిత్యాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా నా వంతు కృషి ఉండాలన్న చిన్న ఆశ. ఈ పుస్తకం మా ఇంట్లో వాడే మలయాళ భాషలో రచించాను”. (George, K.M.1998: 93-94)

ఈ వివరణ వల్ల మూడు విషయాలు తెలుస్తున్నాయి.

i) రచయిత మలయాళీ పాఠకుల సాహిత్య రుచిలో నూతన్వాన్ని కలిగించాలనుకున్నారు. అంత వరకు వారు నిజ జీవితానికి దూరంగా ఉన్న సాహిత్య రచనలకు అలవాటు పడ్డారు. నిజ జీవితానికి దగ్గరగా ఉన్న కథలను వారు ఆస్వాదించగలరా అన్నది పెద్ద ప్రశ్న. అందుకే రచయిత దాన్ని సాధించాలనుకున్నారు.

ii) రెండో అంశం సాంస్కృతిక పునరుజ్జీవనం. ఆంగ్ల విద్యా విధానం వల్ల సమాజంలో సమూల మార్పు వస్తుందని రచయిత కాంక్షించారు. అందుకే ఆంగ్ల విద్యని బలంగా సమర్థించారు. పాత తరానికి, కొత్త తరానికి ఇంగ్లీష్ విద్యని అభ్యసించడంలో విభేదాల రూపంలో ఇందులేఖ నవలలో నడిచిన సంఘర్షణ ఇందుకు నిదర్శనం.

iii) చందుమీనన్ గారు మలయాళ సాహిత్య అభివృద్ధికి తన వంతు కృషి చేయాలనుకున్నారు. చందుమీనన్ కన్నా పూర్వం చాలామంది రచయితలు మలయాళ సాహిత్యాన్ని అభివృద్ధి చేశారు. చందుమీనన్ గారు నవల రూపంలో తన వంతు కృషిని మలయాళ సాహిత్యానికి చేశారు. సృజనాత్మక రచన ప్రాంతీయ భాషలో వెలువడాలన్న ఉద్దేశంతో మిషనరీలు ప్రాచుర్యంలోకి తెచ్చిన గద్యంలో తన ఇంట్లో వాడే సాధారణ మలయాళ భాషలో చందుమీనన్ గారు ఇందులేఖ నవలని రచించారు.

### 1.1.6.3. ఒ. చందుమీనన్ - శారద నవల

మలయాళ సాహిత్యంలో ఇందులేఖ ఒక మైలురాయి. ఇందులేఖ నవలకి వచ్చిన ఆదరణ చూసి చందుమీనన్ గారు ఇంకో నవలని రచించాలని భావించి శారద నవలని ప్రారంభించారు. ఈ నవల మొదటి ఎనిమిది అధ్యాయాలను 1892లో పూర్తిచేశారు. ఈ నవలలోని ఎనిమిది అధ్యాయాలను రచించిన తరువాత రచయిత మరణించారు. శారద నవలలో ఒక కుటుంబ ఇతివృత్తం చిత్రితమైంది. కుటుంబ పెద్ద కుటుంబాన్ని ఎలా నడిపిస్తాడు, అతని వద్ద ఉండే వ్యక్తులు అతన్ని ఎలా తప్పుదోవ పట్టిస్తారు, మధ్యవర్తులు గొడవలని ఎలా పెంచి పెద్ద చేస్తారు వంటి అంశాలతో ఈ నవల కథ నడుస్తుంది.

### 1.1.6.4.సి.వి. రామన్ పిళ్ళై

చందుమీనన్ తరువాత మలయాళ సాహిత్యానికి కృషిచేసిన వారిలో చెప్పుకోదగ్గ రెండో వ్యక్తి సి.వి. రామన్ పిళ్ళై. రామన్ పిళ్ళై గారు సివిల్ సర్వీసులో పనిచేశారు. ట్రావన్‌కోర్ వీరి జన్మస్థలం. త్రివేండ్రంలో సివిల్ సర్వీస్ వ్యక్తిగా పనిచేశారు. చందుమీనన్ గారు ఇందులేఖ నవల ద్వారా మలయాళంలో సాంఘిక నవలకి 1889లో పునాది వేయగా రామన్ పిళ్ళైగారు తన మార్తాండ వర్మ నవల ద్వారా మలయాళంలో చారిత్రక నవలకి 1891లో పునాది వేశారు. మార్తాండ వర్మ నవలే కాక ఇంకో రెండు చారిత్రక నవలలను కూడా రామన్ పిళ్ళైగారు

రచించారు. ఈ నవలలు వెలువడేంత వరకు తమ పూర్వ చరిత్ర కూడా కాల్పనిక సాహిత్య వస్తువు అవుతుందని మలయాళ ప్రజలకు తెలియదు. చందుమీనన్ గారికి నవల కథ ఎన్నికలో, పాత్రల నిర్మాణంలో స్వేచ్ఛ ఉండింది. ఈ అవకాశం రామన్ పిళ్ళైకి లేకుండా పోయింది. కారణం అతను చారిత్రక సంఘటనలపై ఆధారపడి నవల రచించాడు. మార్తాండ వర్మ నవలలో చారిత్రక విషయాల ఆధారంగా రామన్ పిళ్ళై గారు నూతన కల్పనలతో చరిత్రకి దూరం కాకుండా ఉండే విధంగా నవల రచించాడు. 1913లో రామన్ పిళ్ళైగారు 'ధర్మరాజ' అనే నవలని రచించారు. ఆ తరువాత రామరాజ బహదూర్ అనే నవలను రెండు సంపుటాలుగా 1917లో, 1920లలో ప్రచురించారు. ఈ రెండు చారిత్రక నవలలు. రామన్ పిళ్ళై గారు ప్రేమమిత్రం (1915) అనే జనసాంఘిక నవలని కూడా రాశారు. ఈ రచనలు చారిత్రక నవలా రచనలో రామన్ పిళ్ళైగారికి ఉన్న ఉత్సుకతకి నిదర్శనాలు. చందుమీనన్ గారు సాంఘిక అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ నవలలు రచిస్తే రామన్ పిళ్ళైగారు చారిత్రక అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ నవలలు రచించారు. ఈ ఇద్దరి రచనలు మలయాళ సాహిత్యంలో మైలురాళ్లు.

### 1.1.6.5. రామన్ పిళ్ళై - మార్తాండ వర్మ నవల

మార్తాండ వర్మ నవలకి ఆ పేరు నేటి ట్రావన్‌కోర్ ఒక నాటి 'వెనాడ్' ప్రాంతాన్ని పరిపాలించిన రాజు ఆధారంగా పెట్టడం జరిగింది. రాజుల సోదరుల మధ్య రాజ సింహాసనం కోసం జరిగిన అంతర్యుద్ధం ఈ నవలకి కథని సమకూర్చింది. రాజు వద్ద ఉన్న అనంత పద్మనాభన్ కథ రూపంలో ప్రేమకథ చెప్పబడింది. ఈ కథ అడవిలో గాయపడిన కథానాయకుడి వర్ణనతో ప్రారంభమవుతుంది. మార్తాండవర్మ, అనంత పద్మనాభన్ ల ఇతివృత్తంతో ఈ నవల కథ నడుస్తుంది. మార్తాండ వర్మ నవలకి, వాల్టర్ స్కాట్ ఐవాన్ హో (1819) నవలకి మధ్య ఉన్న సామ్యాలను చాలామంది విమర్శకులు పేర్కొన్నారు. ఈ పోలిక కేవలం పాత్ర చిత్రణలోనే కాదు, కథా నిర్మాణం, ప్రతీ అధ్యాయం చివరిలో రచయిత ఇచ్చే సందేశంలోను కనిపిస్తుంది. ఎం.పి. పౌల్ అనే విమర్శకుడు ఐవాన్ హోలోని జాన్ పాత్ర మార్తాండ వర్మలోని పద్మనాభ పాత్ర రెండింటి రూప, వర్ణనలో, ప్రవర్తనలో సామ్యాలున్నాయని తెలిపారు. అదే విధంగా ఐవాన్ హో లోని విల్‌ఫ్రెడ్ పాత్రకు, అనంతపద్మనాభ పాత్రకూ సామ్యం కనిపిస్తుంది. పౌల్ షేక్స్ ఫియర్ 'కింగ్లర్' ప్రభావం కూడా మార్తాండవర్మ నవలపై ఉన్నట్లు భావించారు. మొత్తం మీద మార్తాండవర్మ నవలను రామన్ పిళ్ళైగారు పాశ్చాత్య ధోరణిలో చారిత్రక నేపథ్యంతో రచించారు.

### 1.1.7. మలయాళ సాహిత్యం నవల - వికాసం

"కిజక్కె పట్టు రామన్ మీనన్" గారు 1892లో 'పరన్నోటిపరిణయం" అనే నవలని రచించారు. ఇది మలయాళ ప్రాంత వివాహ వ్యవస్థపై విమర్శనా దృక్పథంతో రాసిన నవల. ఈ నవల మలయాళ సాహిత్యంలో వ్యంగ్య ధోరణి, విమర్శనాత్మక ధోరణితో కూడిన నవలలకి బాటవేసింది. 'కరత్ అచ్యుత్ మీనన్‌గారు రాసిన "విరుతన్ శంకు (1912)" అనే నవల మలయాళంలో హాస్య నవలలకి నాంది పలికింది. కె. నాయాయణం కురుక్కల్‌గారు రచించిన "పరప్పురం", ఉదయభాను (1925) నవలలు రాజకీయాలపై వ్యంగ్యాస్త్రాన్ని సంధించిన నవలలు. అప్పన్ దంపురాన్ గారు, చారిత్రక, ప్రణయ ఇతివృత్తంతో భూతరాయర్ (1923) అనే నవలను రచించారు. ఈ నవలల తరువాత మలయాళంలో చారిత్రక, వినోదాత్మక, సామాజిక నవలలు వచ్చాయి.

### 1.1.7.1. చారిత్రక, వినోదాత్మక నవలలు

సి.వి. రామన్ పిళ్ళై గారి చారిత్రక నవలల మార్గదర్శకంగా ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో కొన్ని చారిత్రక, ప్రణయ ఇతివృత్తంతో కూడిన నవలలు మలయాళంలో వచ్చాయి. టి. రామన్ నంబియన్ గారి కేరళేశవరన్ (1941), కప్పన్ కృష్ణమీనన్ గారి చేరమన్ పెరుమాళ్ (1952), కె.ఎం. పణిక్కర్ గారి కేరళసింహం (1941), మొదలైన నవలలు ఇందుకు ఉదాహరణలు. చారిత్రక ఇతివృత్తంతో కూడిన నవలలతో పాటు ఇరవయ్యవ శతాబ్దంలో వినోదాత్మక నవలలు కూడా వచ్చాయి. సి. చందూనాయర్ మీనాక్షీ (1890), కన్నన్‌మీనన్-స్నేహలత (1918), కొచ్చెపన్ తారకన్ - బాలికా సదనం (1921) మలయాళంలో వచ్చిన వినోదాత్మక నవలలకు ఉదాహరణలు.

### 1.1.7.2. సామాజిక నవలలు

'కున్ను కుంజియిల్ కోచుదోమన్' క్రిస్టియన్ సమాజాన్ని వర్ణిస్తూ 'పరిష్కారప్పాటి' (1925) అనే నవలని రచించారు. సంప్రదాయ బ్రాహ్మణ స్త్రీల కష్టాలను గురించి వివరిస్తూ 'పోదేరి కుంజెంపు', 'సరస్వతి విజయం' అనే నవలని రచించారు. స్థానిక మలయాళ మహిళలు పాశ్చాత్య మహిళలను అనుకరించే విధానాన్ని గురించి తెలుపుతూ కె.ఎం. పణిక్కర్ 'దొరశీని' (1931) నవలని రచించారు. ఇవి మలయాళ సాహిత్యంలో వచ్చిన సామాజిక నవలలకి కొన్ని ఉదాహరణలు.

### 1.1.7.3. అనువాద నవలలు

మలయాళంలో అధికంగా బెంగాలీ, ఇంగ్లీష్ భాషల నుండి నవలలు అనువాదం అయ్యాయి. ఆంగ్లానికి సంబంధించి 'వాల్టర్ స్కాట్' 'అలెగ్జాండర్', హ్యూగో నవలలు ఎక్కువగా అనువాదం అయ్యాయి. హ్యూగో రచించిన 'లెస్ మిసరబుల్'(Lesmiserables) నవలని 'పావన్నాల్' (ది పూర్ పీపుల్) పేర నల్లప్పాట్ నారాయణ్ మీనన్ మలయాళంలోకి అనువదించారు. బెంగాల్‌కి చెందిన బంకించంద్రఛటర్జీ, శరత్‌చంద్రఛటర్జీ, రవీంద్రనాథ్ ఠాగూర్ నవలలు మలయాళంలోకి అనువాదం అయ్యాయి. బంకించంద్రఛటర్జీ గారు కపాలకుండల, దుర్గేశనందిని మలయాళంలో చాలా ప్రఖ్యాతిగాంచాయి.

### 1.1.7.4. ఇతర నవలలు

మహ్మద్ బషీర్ గారి 'బాల్యకాలసఖి' (1910) నవలతో మలయాళ నవలలో పునరుజ్జీవన కాలం ప్రారంభమైంది. ఆ తరువాత పి. కేశవదేవ్ గారి 'ఓ తమిల్ నిన్ను' (1944) నవల వెలువడింది. ఈ రెండు నవలలు నాటి సమాజానికి దర్పణంగా రచించబడ్డాయి. 'బాల్యకాలసఖి' నవల కేరళ ప్రాంత ముస్లీం సమాజంలోని వివాహ వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపగా, 'ఓ తమిల నిన్ను' నవలలో కేరళ ప్రాంత భూస్వామ్య విధానం చరిత్రమైంది. ఈ రెండు నవలల సరసన నిలబడగల మరో నవల తకలి శివశంకర పిళ్ళై రచించిన 'రంటితన్నాలి'. ఈ నవలలో 'కోరన్', 'చధన్' అనే ఇద్దరు దళిత స్నేహితుల గాథ వివరించబడింది. మలయత్తూర్ రామకృష్ణ, కె. సురేంద్రన్, కొవిలన్, పరప్పురన్, ఎస్.పి. మొహమ్మద్, వి.కె. నారాయణ్ కుట్టి, ఎం.టి. వాసుదేవనాయర్ వంటి రచయితలు ఆధునిక కాలంలో మలయాళ నవలని తమ రచనలతో పరిపుష్టం చేశారు.

## 1.2. తమిళ నవల

తమిళంలో నవల పంతొమ్మిదవ శతాబ్దంలో ఆవిర్భవించింది. పంతొమ్మిదవ శతాబ్దానికి పూర్వం తమిళంలో గద్య రచనలు ఉన్నా 'నవల' లక్షణాలతో కూడిన రచనలు మాత్రం పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చాయి. "గద్య రచనలు ప్రాచీన కాలం నుండి తమిళంలో ఉన్నాయి. 'తొల్కాప్పియం' మొట్టమొదటి తమిళ వ్యాకరణ పుస్తకం. ఇందులో అనేక రకాల గద్య బేధాలు పేర్కొనబడ్డాయి. కాని గద్యం సాహిత్యంలో తక్కువగా కనిపిస్తుంది. మధ్యకాల సాహిత్యంలో చిన్న వ్యాకరణ పుస్తకాలు, తత్వ పుస్తకాలు సుందరమైన గద్యంలో వెలువడ్డాయి.

ముద్రణాయంత్రం వచ్చిన తరువాత గద్యంలో సాహిత్య అభివ్యక్తికి విస్తృతి వచ్చింది. ప్రారంభ కాలంలో గద్యం లయాత్మకంగా, ప్రాచీన రూపాన్ని కలిగి ఉండేది. తరువాత ఇది ఆధునిక రూపాన్ని సంతరించుకోవడానికి కొంతకాలం పట్టింది." (Geroge, K.M.1984: 693) ఆధునిక వచన రచనల ఆవిర్భావం వెనుక పాశ్చాత్య పండితుల కృషి ఉంది. మత ప్రచారం నిమిత్తం ఆంగ్లేయులు తమిళ ప్రాంతంలో ప్రవేశపెట్టిన అచ్చుయంత్రం 'వచన' రచనల ప్రచారానికి తోడ్పడింది.

### 1.2.1. తమిళ ప్రాంతం - అచ్చుయంత్ర ఆవిష్కరణ

అచ్చుయంత్రం తమిళ ప్రాంతంలో ప్రారంభమైన తరువాత తమిళ వచన సాహిత్యంలో మార్పు వచ్చింది. అప్పటి వరకు కొంతమందికి మాత్రమే పరిమితమైన సాహిత్య రచనలు అచ్చులోకి రావడం వల్ల అందరికి చేరువయ్యాయి. ఫలితంగా సాహిత్య రచనలకు పాఠకులు పెరిగారు. దీనితో నూతన రచయితలు ఉద్భవించారు. తమిళ ప్రాంతంలోకి అడుగుపెట్టిన ఆంగ్లేయులు క్రైస్తవ మత గ్రంథాలను ముద్రించే ఉద్దేశంతో ముద్రణాలయాలను స్థాపించారు. "తమిళ అక్షరాలతో అచ్చు వేసే ప్రయత్నం మొట్టమొదట క్రీ.శ.1577లో జరిగింది. క్రైస్తవ ఫాదరీలు తమ మత గ్రంథాలను అచ్చువేశారు. పదిహేడు, పద్దెనిమిది శతాబ్దాల వరకు తూర్పు ఇండియా కంపెనీ వారి వద్ద మాత్రమే అచ్చుయంత్రం ఉండేది. పంతొమ్మిదవ శతాబ్దంలో భారతీయుల వద్దకి అచ్చుయంత్రం వచ్చింది. ఆ తరువాత క్రైస్తవులు, హిందువులు, ముస్లింలు తమ తమ మతాల్ని రక్షించుకునే ప్రయత్నంలో మత గ్రంథాలని ముద్రించడం ప్రారంభించారు. ఈ అచ్చు యంత్రాలు రావడం వల్ల పత్రికలు ఉద్భవించాయి. పత్రికలతో పాటు విద్యార్థులకు చదువుకోవడానికి పాఠ్య పుస్తకాలు ముద్రించారు." (Clark, T.W.1970: 259) వీటితోపాటు వచన రచనలు, గద్య రచనలు విస్తృతంగా తమిళంలో వచ్చాయి. ఈ రచనల నేపథ్యంగా 'నవల' తమిళ సాహిత్యంలో ఆవిర్భవించింది.

### 1.2.2. తమిళ సాహిత్యం - పాశ్చాత్యుల సేవ

చెన్నైక్కల్విచ్చంగం (The College of Fort St. George) అనే ఒక సంస్థ (1812-1854) ఆంగ్లేయులచే స్థాపించబడింది. తిరుక్కురళ్‌ని ఆంగ్లంలోకి అనువదించిన ఎల్లిస్, అనేక తమిళ తాళపత్ర గ్రంథాలను సేకరించిన 'మెకంజి' వంటి వారు ఈ సంస్థని స్థాపించారు.

ముత్తుస్వామిపిళ్ళై, తాండవరాయ ముదలియార్, కొట్టైయుర్ శివకోళందు దేశికర్ వంటి తమిళ పండితులు ఈ సంస్థలో పనిచేశారు. ఈ సంస్థ ముత్తుస్వామిపిళ్ళై, వీరమామునివర్ రచించిన తమిళ అకారాది నిఘంటువుని, తాండవరాయ ముదలియార్ మరాఠి నుండి అనువదించిన పంచతంత్ర కథలను ముద్రించింది. వీటితో పాటు తమిళ ప్రాంతంలోని కొన్ని కథలను సేకరించి కథామంజరి (1826) పేరుతో ముద్రించడం జరిగింది.

పదహారు, పదిహేడు శతాబ్దానికి చెందిన 'దే.నోబిలి' అనే యూరోపియన్ ఫాదర్ మధురైలో తమిళ బ్రాహ్మణుడిగా జీవించాడు. తమిళ ప్రజల ఆదరణ చూసి, మాంసాహారాన్ని వర్జించి తమిళ దేశ బ్రాహ్మణ మతాచారుడై జీవించాడు. తన పేరును 'తత్వబోధకర్'గా మార్చుకున్నాడు. ఆత్మనిర్ణయం, జ్ఞానోపదేశకాండ, మొదలైన వచన రచన గ్రంథాలను రచించాడు. ఇతని తరువాత వీరమామునివర్ తమిళ వచనానికి సేవచేశాడు. ఇతను కూడా ఐరోపా దేశం వాడే.

ఇటలీ దేశం నుండి తమిళ దేశానికి మతప్రచారం నిమిత్తం వచ్చిన వీరమామునివర్ (1680-1747) 'తేంబావణి' అనే తమిళ కావ్యాన్ని రచించారు. ఐరోపాలో అప్పటికే ప్రచారంలో ఉన్న అకారాది క్రమంలో శబ్దాలను కూర్చి వాటికి అర్థాలు ఇచ్చే అకారాది క్రమ నిఘంటువును మొట్టమొదట వీరమామునివర్ తమిళంలో తయారు చేశారు. 'తెంబావణి' మాత్రమే కాక 'తిరుక్కావలూర్‌కాలబగం', 'కిత్తేఅమ్మాళ్ అమ్మానై' అను పద్య కావ్యాలను కూడా వీరు రచించారు. తొన్నూల్ విళక్కం, అనే లక్షణ గ్రంథాన్ని, శెందమిళ్ ఇలక్కణమ్ (కావ్య తమిళ లక్షణం) కొడుం దమిళ్ ఇలక్కణమ్ (గ్రామ్య తమిళ లక్షణం) అనే గ్రంథాలను కూడా రచించారు. 'తిరుక్కురళ్'ను లాటిన్ భాషలోకి అనువదించారు. వీరమామునివర్ 'పరమార్థ గురువీర్ కథై' అనే కథా గ్రంథాన్ని మతసేవకై 'వేదవిళక్కం' అనే గ్రంథాన్ని రచించారు.

భారతదేశానికి వచ్చిన కాల్డ్ వెల్ (1814-1891) అనే ఆంగ్లేయ ఫాదరిని తమిళ భాష ఆకర్షించింది. కాల్డ్ వెల్ సంస్కృతం, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషలను పరిశోధించి 'ద్రావిడ భాషల తులనాత్మక వ్యాకరణాన్ని' రచించారు.

జె.యు. పోప్ (1870-1907) అనే ఆంగ్లేయ విద్వాంసుడు ఉళనూల్, తత్త్వనూల్, అళవైనూల్ అనే రచనలను తమిళంలో రచించడమే కాక తమిళ భాషా వ్యాకరణాన్ని తమిళం, ఆంగ్లంలో రచించాడు. తిరుక్కురళ్, తీరువాచకంలను ఆంగ్లంలోకి అనువదించాడు. ప్పొరుళ్, వెణ్బామాలై, పురునానూరులోని పెక్కు పద్యాలను ఆంగ్లంలోకి అనువదించారు. తమిళంలో వచన సాహిత్యానికి పాశ్చాత్యులతో పాటు కొంత స్థానికులు కూడా కృషి చేశారు. మీనాక్షి సుందరంపిళ్ళై, రామలింగర్, గోపాలకృష్ణ భారతి వంటి స్థానికుల కృషి ప్రధానంగా పేర్కొనదగినది.

మీనాక్షి సుందరం పిళ్ళై గారు తిరువాడులోగల శైవ మఠంలో ఆస్థాన విద్వాంసుడిగా ఉన్నాడు. ఈయన అనేక తమిళ లఘు కావ్యాలను రచించారు. మురుగర్ పిళ్ళై తమిళ్, తిరువిడైక్కళ్ క్కురవంజి, శూత సంగిత్తై, కుండదై తిరిపతాది, అఖిలాండ నాయకి మాలై, అంబల వాణ దేశిగర్, కలంబగం, తిరువిడై, ముడదూర్ ఉలం, ఉరైయూర్ పురాణమ్, విళ్లత్తొట్టి పురాణం మొదలైన రచనలను మీనాక్షి సుందరం పిళ్ళై గారు రచించారు.

రామలింగర్ (1823-1974) 'అరుట్పా' అనే పేరుతో తన కవితల్ని ప్రచురించారు. తిరుమాలై పేరుతో ఆరు వేలకు పైగా పాటలు పాడారు. అంతేకాక మనుమూలై కణ్ణవాచకమ్, జీవకారుణ్య ఒళక్కమ్ అనే వచన గ్రంథాలను కూడా రచించారు.

గోపాలకృష్ణ భారతిగారు పెరియ పురాణంలోని కొందరు భక్తుల జీవిత చరిత్రలను అభివర్ణిస్తూ కీర్తనలు అనే సంగీత రచనలు చేశారు. తిరునీలకంఠనాయర్ కీర్తనై, ఇయఱ్పగై నాయనార్ కీర్తనై, నందనార్ కీర్తనై అన్నవి వీరి మిగతా రచనలు. గోపాలకృష్ణ భారతిగారు రచించిన 'నందనార్ చరిత్ర' కీర్తనలలో హరిజనుడు తన యజమానిని ఎదిరించి సంగీతమును నేర్చుకున్నట్లు ఉంది.

పంతొమ్మిదవ శతాబ్దానికి చెందిన 'అష్టావధానం సభాపతి మొదలియార్' పెక్కు కావ్యాలను రచించారు. సభాపతి మొదలియార్ గారు శందప్పాటలను మిక్కిలి వేగంగా రచించడంలో ప్రవీణుడు. స్థలపురాణం, కలభంగము, కురవంజి, అంతాది శతకము మొదలైన గ్రంథాలను సభాపతి మొదలియార్ రచించారు. "పంతొమ్మిదో శతాబ్దంలో తమిళంలో వచన

రచనలని ప్రోత్సహించే దినవర్తమాని (1856), జనవినోదిని (1870), వివేక చింతామణి, స్వదేశీ మిత్ర (1882), మధురైలో 'శెందమిళ్' వంటి పత్రికలు ఆవిర్భవించాయి. ఈ కాలంలోనే తీరుచ్చిటం బలదేశకర్, కంబరామాయణంను, రామాయణ ఉత్తరకాండను వచనంలో రచించారు. వీరస్వామి చిట్టియర్ వినోద రసమంజరి అనే వచన రచనని రచించడంతో పాటుగా కంబర్, కాళిదాసర్, పుగళేంది, ఒట్టక్కూత్తర్ మొదలైన కవీశ్వరుల రచనలను వచనంలో అనువదించారు". (వరదరాజన్, ము.1982: 269). ఈ అంశాలు తమిళసాహిత్యంలో నవల ఆవిర్భావానికి సాహిత్య భూమికని ఏర్పరచాయి.

### 1.2.3. తొలి సాంఘిక నవల

వేదనాయగం పిళ్ళై రచించిన 'ప్రతాపముదలియార్ చరిత్ర' నవల ద్వారా తమిళ నవలా ప్రస్థానం మొదలైంది. ఇది తమిళ తొలి సాంఘిక నవల. తమిళంలో తొలి నవలని రచించిన వేదనాయగం పిళ్ళై గారు ఈ విధంగా చెప్పుకున్నారు.

*"Is to supply the want of prose works in Tamil and also to give a practical illustration of the maxims morality contianed in my former works... In writing this story I have not followed the example of those novelists who depict human nature as it is. Not as it ought to be and who thus exhibit bad specimens of humanity which are often mistaken by the young and inexperienced for objects of imitation. I have represented the principle personages as perfectly virtuous inaccordance with the opinion of the great english moralist Dr. Johnson"* (George, K.M.1984: 693).

ఈ వాక్యాలు తమిళంలో తొలి నవల వెలువడటానికి ఆంగ్లేయ రచనలు మార్గదర్శకంగా నిలిచిన విధానాన్ని స్పష్టపరుస్తున్నాయి. నవల అంతకు ముందు తమిళంలో ఉన్న కథా సంబంధ రచనల కన్నా ఏ విధంగా భిన్నమైనదో తెలపడానికి ఈ వాక్యాలు నిదర్శనం. వేదనాయగం పిళ్ళై గారి 'ప్రతాప ముదలియార్ చరిత్ర' నవల కన్నా ముందు కొన్ని గద్య రచనలు తమిళంలో

వెలువడ్డాయి. ఈ గద్య రచనలలో ప్రాచీన తమిళ 'తొల్కాప్పియం' వంటి రచనలలో ఉన్న గద్యం ఒక ఎత్తైతే ఆధునిక కాలంలో ఆంగ్లేయ పరిపాలన పట్ల ఆంగ్లేయ సాహిత్య ప్రభావంతో వచ్చిన అనువాద, అనుసరణ రచనలు ఇంకో ఎత్తుగా చెప్పవచ్చు. 'పాదర్ బెస్చి' 1822లో 'పరమార్థ గురు కథై' అనే గద్య రచన చేశారు. తండవరణ్య ముదలియార్‌గారు 'పంచతంత్రకథై' (1826), 'యుసుఫ్ కట్టుకథైకల్' (1813), 'మదన్ కామరాజ కథై' (1855), 'తమిళ లానియుమ్ పెరుమల్ కథై' (1869) వంటి గద్య రచనలు చేశారు. ఈ రచనలు ప్రతాప ముదలియార్ చరిత్ర కన్నా పూర్వం గద్యరూపంలో తమిళంలో వెలువడ్డాయి. ఈ రచనలు తమిళంలో 'నవల' ఆవిర్భావానికి నాంది వాక్యంగా పనిచేశాయి. ఆ తరువాత తమిళ తొలి సాంఘిక నవల ప్రతాప ముదలియార్ చరిత్ర(1879) వెలువడింది. ప్రతాప ముదలియార్ చరిత్రని రచించిన 'వేదనాయగం పిళ్ళై (1826-1889) మీనాక్షి సుందరం పిళ్ళై వద్ద తమిళాన్ని అభ్యసించి అతనితో సన్నిహితంగా జీవించారు. జిల్లా న్యాయస్థానంలో మునసుబుగా పనిచేశారు. ఇశై తమిళంలోను, ఆంగ్ల భాషలోను అతనికి ప్రావీణ్యం ఉంది. మీనాక్షి సుందరంపిళ్ళైతో వేదనాయగపిళ్ళై సన్నిహితంగా ఉన్నా అతనిని అనుసరించలేదు. మీనాక్షి సుందరంపిళ్ళై పదహారు స్థల పురాణాలను, పదహారు అంతాదులను, వది పిళ్ళై తమిళ గ్రంథాలను రచించాడు. వేదనాయగం పిళ్ళై స్థల పురాణాలను, కలంబగమును రచించలేదు" (వరదరాజన్,ము. 1982: 281).

వేదనాయగం పిళ్ళైగారు 'తిరువళ్ అంతాది', 'దేవతాఅంతాది' అనే రెండు అంతాది గ్రంథాలను రచించారు. పెణ్ మది మాలై అన్న వీరి రచన మహిళలకు ఉపకరించే రచన కాగా స్వర సమయ సమరస కీర్తనై, సత్యవేద కీర్తనై అన్నవి వీరి సంగీత రచనలు. తిరువరుళ్ మాలై, దేవతోత్తర మాలై అనే అర్చనార్థం పనికివచ్చే భక్తి రచనలు కూడా వేదనాయగంపిళ్ళై రచించారు. వీటన్నింటికంటే వీరికి శాశ్వత కీర్తిని కలిగించినవి "ప్రతాప ముదలియార్ చరిత్రము" (1879), "సుగుణ సుందరి చరిత్రము" (1887) అనే రెండు నవలలు మాత్రమే. తమిళంలో మొట్టమొదట నవలను రచించి తమిళ సాహిత్యంలో నూతన శాఖను ప్రారంభించిన ఘతన వేదనాయగం పిళ్ళై గారికి దక్కుతుంది.

### 1.2.4. తమిళ నవల - వికాసం

తమిళంలో వేదనాయగం పిళ్ళై తరువాత వచన రచనలు చేసిన రచయిత నటేశ శాస్త్రి (1859-1906). ఈయన ప్రభుత్వ శాఖలో ఉద్యోగిగా పనిచేశారు. ద్రావిడ పూర్వకాల కదైగళ్, మధ్యకాల కదైగళ్ అనే పేరుతో తమిళ ప్రాచీన కథలను లిఖిత రూపంలో వెలువరించారు. ముద్రా రాక్షస నాటకాన్ని సంస్కృతం నుండి తమిళంలోకి అనువదించారు. 'మామి గొలువిరుక్కై', 'కోమలంకుమారి యానదు', 'దిక్కట్ట ఇరుకున్దైగళ్', 'మదికెట్టమనైవి' అనేవి వీరు రచించిన కథా రచనలు.తమిళ ప్రాంత న్యాయ వ్యవస్థ గురించి, వైధవ్యం పొందిన స్త్రీ కష్టాల గురించి వివరిస్తూ మాధవయ్యగారు 'విజయమార్తాండర్', 'మీనాక్షి' నవలలని రచించారు. 1942లో జరిగిన స్వతంత్ర పోరాటాన్ని గురించి తెలుపుతూ 'త్యాగత్తళము' నవలని నారణత్తురై క్కణ్ణర్‌గారు రచించారు. తరంగిణి, కోకిల, నాడుత్తెరు నారాయణర్ అనునవి వీరి కథా రచనలు.

అఖిలోన్ గారు తమిళంలో విభిన్న ఇతివృత్తాలతో నవలలని రచించారు. స్వాతంత్ర్యోద్యమం ఇతివృత్తంగా నేతాజి నాయకత్వాన్ని గురించి తెలుపుతూ 'నెంజిర్ అలైంగళ్' నవలని రచించారు మానవ స్వభావాన్ని గురించి తెలుపుతూ 'పాపై విళక్కు' నవలని, నాగరికత, ధనం గొప్పతనం అవి మానవ జీవితాన్ని ప్రభావితం చేసిన విధానాన్ని తెలుపుతూ 'చిత్తిరప్పావై' నవలని రచించారు. 11వ శతాబ్దంలోని చోళ సామ్రాజ్యాన్ని గురించి తెలుపుతూ 'వేంగైయిర్ మైందర్' నవలని, పాండ్యరాజ్య పరిపాలనని తెలుపుతూ 'కయల్‌విళ్' నవలను, విజయనగర రాజుల పరిపాలనను గురించి తెలుపుతూ 'వెట్రిత్తిరునగర్' నవలను 'అఖిలోన్' గారు రచించారు. చలనచిత్ర రంగంపై వ్యామోహాన్ని ఒక ఉపాధ్యాయుని మానసిక స్థితిని వివరిస్తూ కో.వి. మణిశేఖర్ గారు 'తవమో తత్త్వమో' అనే నవలని రచించారు. అగ్నిగోపం, పీలివళై శెమ్బియర్ శల్వి, అనేవి వీరి చారిత్రక రచనలు. దేవర్ కలంపేరుతో 'కలమహదేవర్' 'తుప్పరియం శామ్బు', 'మిస్టర్ వేదాంతం', 'రాజత్తీర్ మనోరధం' మొదలైన నవలలు రచించారు.

దేశంలో ఉన్న సమకాలీన సంఘటనల ఆధారంగా ము. వరదరాజన్ గారు' కళ్లో కావ్యమో', 'అగల్ విళక్కు', 'కరిత్తుండు', 'కయమై' మొదలైన నవలలు రచించారు. కా.నా. సుబ్రహ్మణ్యం గారు 'ఓరునాళ్' అనే గొప్ప నవల రచించారు. వెంకట్రామర్ గారు మహాభారత

కథని ఆధారంగా చేసుకొని 'నిత్యకన్ని' అనే సుదీర్ఘ వచన రచన చేశారు. యువనరాణి, కడల్‌పూరా, మన్నర్ మగళ్, మలైవాశల్, జీవభూమి, కన్నిమాడం, పల్లవ తిలకం మొదలైన చారిత్రక నవలల్ని శాండిల్య గారు రచించారు ఇవి పత్రికల్లో ధారావాహికంగా వెలువడ్డాయి. మధురై నగరంలో జరిగే జల్లికట్టు క్రీడని వర్ణిస్తూ శ్రీ. సు. శల్లప్పాగారు 'వాడివాశల్' అనే నవలని రచించారు.

తమిళ జాతీయోద్యమ సాహిత్యాన్ని ముందుండి నడిపించింది సుబ్రహ్మణ్య భారతిగారు (1882-1921). ఈయన జాతీయోద్యమ గీతాలు, కవితలు తమిళ రచయితలలో నూతన ఉత్తేజాన్ని నింపాయి. జ్ఞానరథం, చంద్రికాయిని కథ, విశాలాక్షి వంటి రచనల ద్వారా సుబ్రహ్మణ్య భారతి తన తరువాతి రచయితలకు మార్గదర్శకంగా నిలిచారు. మహాత్ముని జాతిపితగా వర్ణిస్తూ సుబ్రహ్మణ్య భారతి 'పంచకం' అనే రచనని వెలువరించారు. తమిళ రచనలు సాధారణ, మధ్యతరగతి ప్రజల వద్దకి చేరడానికి 'ఆనందవికటన్' పత్రిక సహకరించింది. ఈ పత్రికని ఎస్.ఎస్. వాసన్ (1905-69) స్థాపించారు. ఈ పత్రికకి వాసన్ గారు కృష్ణమూర్తి(కల్కి)ని సంపాదకునిగా నియమించారు. ఆనందవికటన్ పత్రిక భూమికగా కృష్ణమూర్తి అనేక రచనలు చేశారు. గ్రామీణ, పట్టణ జీవితవాస్తవికతను వివరిస్తూ కృష్ణమూర్తి(కల్కి)గారు 'కాన మాలిని కనవు', 'కల్ వానిన్ కాతలి' నవలలని రచించారు. ఈయన రాసిన ఇంకో గొప్ప నవల 'త్యాగభూమి'.

కాఫీ తోటలో పనిచేసే కూలీల జీవితాన్ని వర్ణిస్తూ 'పురుమైపిథన్' గారు 'తున్‌బక్కెని' నవలని రచించారు. కల్కి గారు 1941లో 'ప్రతాపన్ కనువు' అనే చారిత్రక నవలని రచించారు. ఇందులో చోళ, పల్లవ యుద్ధ గాథ వర్ణితమైంది. శివకామిని శపథం (1945), పొన్నెయినె సెల్వన్ (1950) అనే మరో రెండు చారిత్రక నవలలని కూడా కల్కి రాశారు. ఈయన తన నవలల ద్వారా చారిత్రక నవలలకి పునాది వేశారు. భారత స్వాతంత్రోద్యమ భూమికగా కల్కి 'అలై ఓశై' (1953) అనే నవలని రచించారు. ఈ నవలకి 1956లో సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది. కుటుంబంలోని వితంతు స్త్రీని కుటుంబ సభ్యులు చూసే విధానాన్ని తెలుపుతూ చల్లప్పగారు 'జీవనాంశం' (1962) నవలని రచించారు. సంగీతకళాకారుడి జీవనాన్ని వర్ణిస్తూ 'చిదంబర సుబ్రహ్మణ్యం' గారు 'ఇదయనాదం' (1952) నవలని రచించారు. మైసూర్‌ని

పరిపాలించిన టిప్పుసుల్తాన్ పరిపాలనని అతని రాజ్య పరిస్థితులని ఆధారంగా చేసుకొని బాలకృష్ణ నాయుడు గారు 'దనయక్కన్ కొట్టై' నవలని రచించారు. డి.ఎం.కె. పార్టీని స్థాపించిన అన్నాదొరై మంచి ప్రసంగకర్త, రచయిత. అలాగే కరుణానిధి, వరదరాజన్‌లు కూడా నవలలు రచించారు.

తమిళనాడులో యువ రచయితలను ప్రోత్సహించే ఉద్దేశంతో 1946 నుండి కలైమగల్ నారాయణ స్వామి అయ్యర్ మెమోరియల్ అవార్డును ఇస్తున్నారు. 1940-46 మధ్యకాలంలో ఎందరో గొప్ప గొప్ప యువ నవలాకారులు తమిళంలో ఆవిర్భవించారు. నారనదొరై, కన్నన్, రాజవేలు, పి.ఎం. కన్నన్, ఉమాచంద్రన్, వెంకటరామన్, వాసవన్, రాజేశ్వరీ పద్మనాభన్, ఆర్.ఎస్. నల్ల పెరుమాల్, సుబ్రహ్మణ్యన్ వంటివారు అందులో కొందరు.

రబ్బరు పరిశ్రమలో పనిచేసే కార్మికుల గురించి తెలుపుతూ పి.వి. అఖిలాండం (అఖిలోన్) గారు 'పాల్మర కట్టినిలె' (Inthe Rubber Forest) (1977) నవలని రచించారు. ఈయన నవలల్లో చాలావాటికి అవార్డులు వచ్చాయి. వెన్‌గయిన్, మైన్‌దాన్ (The Tiger Son) (1961) నవలకి 1968లో సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది. చిత్తిరపావై (1968) నవలకి 1975లో 'జ్ఞానపీఠ' అవార్డు వచ్చింది. అఖిలోన్ గారు పదిహేనుకు పైగా నవలలు రచించారు. స్వాతంత్ర్యోద్యమ భూమికగా వీరు రాసిన 'పెన్న' (1946) నవలకి కలైమగల్ నారాయణ స్వామి మెమోరియల్ బహుమానం వచ్చింది. కల్కి పత్రికలో 'పావి విలక్కు' (1958) అనే నవల సీరియల్‌గా ప్రచురితమై గొప్ప ప్రజాదరణ పొదింది.

తమిళంలో సాహిత్య అకాడమి అవార్డు పొందిన సోమసుందరం (1921) మంచి కథకుడు, నవలా రచయిత. రవిచంద్రిక, 'కాదల్ కాంత కనువు', 'నందవనం', వెన్నెలవు పెన్నారాసి అన్న వీరి నవలలు కల్కి పత్రికలో సీరియల్‌గా వచ్చి గొప్ప ప్రజాదరణ పొందాయి. సుందర రామస్వామిగారు చింతచెట్టుకి, మనుష్యులకి ఉన్న సంబంధాన్ని గురించి తెలుపుతూ ఓరు పులియ మరత్తిన్ కథే (1956) అనే నవలని రచించారు.

1979లో సాహిత్య అకాడమి అవార్డును పొందిన టి. జానకి రామన్ గారు 'అమ్మవందాల్' అనే గొప్ప నవలని రచించారు. ఈయన రచించిన ఇంకో గొప్ప నవల 'మోహముల్' (1961). జయకాంధన్ అప్పటివరకు తమిళ రచయితలు స్వీకరించని నూతన కథా వస్తువులతో నవలలు రచించారు. మానవ ప్రవృత్తి ఆధారంగా ఈయన మారుక్కాగ ఆలుత్తన్, వాళ్క్కై ఆళైక్కిరదు, శిల నేరంగళ్ శిల మనిత్రహళ్ వంటి నవలలు రచించారు.

చెంబల్ వ్యాలిలో పనిచేస్తున్న కార్మికుల గురించి, నీలగిరి ఆటవిక తెగ ప్రజల జీవన విధానాన్ని గురించి తెలుపుతూ రాజం క్రిష్ణన్ గారు 'కురింజితేన్' వంటి నవలలు రచించారు. పి.సి. గణేషన్ గారు సినిమా యాక్టర్ల జీవితాన్ని తెలుపుతూ 'నడికై' నవల రాశారు. ఎస్.ఎ. కందస్వామి గారు పారిశ్రామికీకరణ వల్ల అడవులు మాయమైపోతున్న స్థితిని తెలుపుతూ 'ఛాయావనం' (1969) నవలని రచించారు. మనిషికి, అడవికి మధ్య జరిగిన మానసిక యుద్ధం ఈ నవలలోని ప్రధాన కథా వస్తువు. నీలా పద్మనాభన్ గారు తాత్విక ధోరణిలో తమిళ నవలలని రచించారు. వీరు రాసిన 'ఉరువుకాల్' (1975) నవలకి రాజశ్రీ అన్నమలై చిత్తర్ బహుమతి వచ్చింది. నీలం పద్మనాభన్ గారు ఒక ఇంజనీర్‌గా ఉండి కన్యాకుమారి ప్రాంతంలోని మాండలిక భాషలో తన నవలని రచించారు. 'తలైములైకాల్', 'పల్లికొండపురమ్' వీరు రచించిన నవలల్లో ప్రధానమైనవి.1908లో మలయాళ ఇందులేఖ నవల తమిళంలోకి అనువాదమైంది.

దినమణి, స్వదేశ మిత్రన్, దినతంతి, దినమాలర్, నవశక్తి వంటి తమిళ పత్రికలు ప్రతీ ఆదివారం నవలలని సీరియల్‌గా ప్రచురించడం వల్ల నూతన నవలా రచయితలకు గొప్ప ప్రోత్సాహం లభించింది. ఫలితంగా అనేక మంది రచయితలు వెలుగులోకి వచ్చారు. ఆర్.కె. రంగరాజన్, మనెయన్, హేమా ఆనందతీర్థన్, గిరిజ, విమల, రమణి, పుష్పా తుంగదురై, కురుంచూర్ కుప్పుస్వామి, సుజాతా, శివశంకరి, ఇందుమతి, వాసంతి, మొదలైనవారు ఆధునిక కాలంలో పేరు తెచ్చుకున్న గొప్ప నవలా రచయితలు. ద్రవిడ మూమెంట్‌ను చిత్రిస్తూ ఎ.వి.పి. ఆశైతంబి, దెలైవిల్లాలన్, ఎస్.ఎస్. దన్నారసు, రాధామనాలన్ వంటి వారు నవలలు రచించారు.

ట్రావన్‌కోర్ జిల్లాలోని గ్రామీణ ప్రజల జీవనాన్ని వర్ణిస్తూ హెప్సిప జేసుదాసన్ గారు పుట్టెన్ వీడు (1964) నవలని రచించారు. ఇందిరా పార్థసారథి గారు తమిళ ప్రాంత కుల, ఆర్థిక, లింగ పరిస్థితుల్ని వివరిస్తూ రాసిన కుర్తి పున్నాల్ (1975) నవలకి సాహిత్య అకాడమి

అవార్డు వచ్చింది. ఈ విధంగా ఎంతో మంది గొప్ప గొప్ప నవలా రచయితల కృషితో తమిళ నవల వికసించింది.

### 1.3. కన్నడ నవల

"మన దేశమందలి ఇతర భాషలవలె కన్నడమునకు నవీన సాహిత్యం ఇంగ్లీషు విద్యాభ్యాస విచార సరణుల తీవ్ర ప్రభావం వలన తలయెత్తినది" (ముగళి, రం. 1978: 205) ఇంగ్లీషు భాషా సారస్వతాలు విస్తృతంగా కన్నడ ప్రజలకి ఆంగ్లేయుల రాకతో పరిచయం అయ్యాయి. మిగతా రాష్ట్రాల సాహిత్యాల మాదిరిగానే కన్నడలో కూడా తొలి నాళ్లలో పద్య, గద్య, చంపూ రచనలు వచ్చాయి. మొదట శాసనాలలో పదాల రూపంలో కన్నడ భాషకి లిఖిత ఆధారాలు లభించాయి. (కన్నడ భాషా చరిత్ర స్థూలంగా క్రీ.పూ. 4వ శతాబ్దం నుండి ప్రారంభమైంది. ఆధారం: బ్రాహ్మగిరి శాసనంలో లభించిన 'ఇసిలి' పదం. చెన్నకేశవరెడ్డి, జీ(సం). 1999: 120). తరువాతి కాలంలో పద్య, చంపూ రచనలు వచ్చాయి.

పంప, పొన్న, రన్న, చంవుండరాయ, నాగచంద్ర, శాంతినాథ వంటి కవులు పద్య రచనలతో కన్నడ సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. దేవర దాసిమయ్య, ప్రభుదేవ, బసవణ్ణ, అక్కమహాదేవి, చెన్నబసవణ్ణ, సిద్ధరామయ్య వంటి కవులు తమ వచన సాహిత్యంతో కన్నడ సాహిత్యానికి నూతన వన్నె తెచ్చారు. వీరితో పాటు చిక్కదేవరాయ కాలానికి చెందిన భాస్కర, విజయణ్ణ, రత్నాకర, సాళ్వ, దొడ్డయ్య, దేవచంద్ర వంటి జైనకవులు, దేవరాజ, చామరస, గురుబసవ, చంద్రకవి, నీలకంఠాచార్య, సర్వజ్ఞ వంటి కవులు కూడా వచన రచనలతో కన్నడ సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. కుమార వ్యాస యుగానికి చెందిన కుమార వాల్మీకి, తిమ్మకవి, చాటు విఠలనాథ, సోమనాథకవి, రంగనాథ, లింగణ్ణ వంటి కవులు ప్రధానంగా చంపూ పద్ధతిలో రచనలు చేశారు. ఆధునిక కన్నడ సాహిత్యంలో సరళ వచనంలో రచనలు వచ్చాయి. వీటికన్నా ముందు హొసగన్నడలో రచనలు రావడానికి, హొసగన్నడతో పాటు నూతన ప్రక్రియలు కన్నడలోకి రావడానికి దోహదం చేసిన కారణాలను ఎల్.ఎన్. శేషగిరి గారు విపులంగా వివరించారు.

"కన్నడలో హొసగన్నడ సాహిత్య సృష్టికి ముఖ్య ప్రేరణ ఇంగ్లీషు విద్య, ఇంగ్లీషు విద్యాభ్యాసం వల్ల రెండు రకాల ప్రయోజనాలు కలిగాయి. మొదటిది నూతన జీవన మనోధర్మ దర్శనం. రెండోది నూతన సాహిత్య జగత్తుతో పరిచయం. ఆనాటి శిక్షణ విధానంలో ప్రౌఢ పాఠశాలలో అందరు విద్యార్థులు ఇంగ్లాండు చరిత్రను అభ్యాసం చేశారు. అప్పట్లో విద్యార్థులు చదివిన చాసర్ ఆంగ్ల కవితలు ఇప్పుడు ఎం.ఎ. వాళ్ల పాఠ్యాంశాలలో కలవు. షేక్స్ ఫియర్ నాటకాలు, దీనికితోడు క్రీ.పూ. 4వ శతాబ్దానికి చెందిన గ్రీకు రచయిత 'అనాబేసిన్' ఇంగ్లీషు అనువాదాలు, ప్లేటో సంభాషణ అనువాదాలు, జేమ్స్ ఫ్రాయిడ్ జూలియస్ సీజర్, కార్లాయిల్ హీరో అండ్ హీరో వర్షస్, ఇంకా మిల్టన్, వర్డ్స్ వత్, షల్లి, కీట్స్, ఆర్నాల్డ్ మొదలైన కవుల కవితలు, జోన్ ఆస్టిన్, స్కాట్ మొదలైన వారి నవలలు పాఠ్య పుస్తకాలుగా ఉన్నాయి. మొత్తం మీద ఐదు శతాబ్దాల ఇంగ్లీషు సాహిత్యాన్ని విద్యార్థులు చదివారు. దీనితో అన్నిటిని ప్రశ్నిస్తూ విశ్లేషించే ధోరణి అలవడింది. రాజు సర్వజ్ఞుడు, భగవంతుని ప్రతినిధి అనే నమ్మకాన్ని ప్రశ్నించి ప్రజలు పోరాటం నడిపిన రీతిని, దాని వెనుక దాగి ఉన్న మనోధర్మాన్ని తెలుసుకున్నారు. దీనితో పాటు సాహిత్యం సమాజాన్ని ఎలా చిత్రిస్తుందో తెలుసుకున్నారు. షేక్స్ ఫియర్ నాటకాల వల్ల సమాజ విశ్లేషణ, మిల్టన్ కవితల వల్ల స్వతంత్రాభివ్యక్తి, వంటివి నూతనంగా పరిచయం అయ్యాయి. వర్డ్స్ వత్ రైతులు, ఎవరూ దిక్కులేని స్త్రీల గురించి రాసిన రచనలు అబ్బుర పరిచాయి. కార్లాయిల్, రస్కిన్ మొదలైన రచయితలు తమ నవలల్లో సమాజ సమస్యలని సూక్ష్మంగా విశ్లేషించడం నూతన వస్తువును పరిచయం చేసింది. ఈ విధంగా నూతన విషయ భాండాగారానికి ఇంగ్లీషు విద్య తాళం చెవిగా పనిచేసింది. ఇలియట్, ఒడిస్సి, ప్యారడైస్ లాస్ట్ వంటి రచనల వల్ల నూతన సాహిత్య సంప్రదాయాలు పరిచయం అయ్యాయి. సంస్కృత నాటక పరంపరతో పాటు గంభీర ఇంగ్లీషు నాటకాల పరిచయం ఏర్పడింది. విమర్శలో నూతన ఒరవడులు వచ్చాయి. కన్నడికులకు కథతో పరిచయం ఉన్నా ఈ కథ కాదంబరిగా, సణ్ణ కథగా సాహిత్య ప్రక్రియ రూపం ధరించింది మాత్రం ఆంగ్లేయ సాహిత్యం వల్లనే అని చెప్పక తప్పదు." (శేషగిరిరావు, ఎల్.ఎన్. 2013: 7, 8).

ఈ విధంగా కాదంబరి కన్నడ సాహిత్యానికి ఆంగ్ల సాహిత్యం వల్ల పరిచయం అయ్యింది. వచన రూపంలో నవల కన్నడలో వెలువడడానికి కొంత సమయం పట్టింది.

"కన్నడలో ప్రాచీన కాలంలోని హల్మిడి శాసనంలో గద్యం కనిపిస్తుంది. ఈ గద్యంలో కొన్ని సంస్కృత పదాల మధ్య కన్నడ పదాలు కనిపిస్తాయి. ఐదవ శతాబ్దం నుండి పద్దెనిమిదవ శతాబ్దం వరకు లభించిన వీరగల్లు, మాస్తికల్లు, శాసనాలలో ఆ కాలంనాటి పదాలు కనిపిస్తాయి. వడ్డారాధన (920) కన్నడలో ప్రచురితమైన తొలి గద్యకృతి. శివకోటాచార్య రచించిన ఈ గద్య కృతిలో పంతొమ్మిది కథలు కలవు. ఆ తరువాత చావుండరాయ (970) రచించిన 'తిషష్టి లక్షణ' కన్నడలో లభించిన రెండవ గద్య గ్రంథం. ఇందులో గద్యం వడ్డారాధన కన్నా ప్రౌఢంగా ఉండి అరవై మూడు మంది జైన కవుల చరిత్ర వివరించబడింది. తరువాత పంప, జన్న, షడాక్షరి, రుద్రభట్ట, దుర్గసింహ రచనలలో గద్యం కనిపిస్తుంది. పన్నెండవ శతాబ్దం నాటి శైవ కవులు వచనాల ద్వారా తమ మతాన్ని ప్రచారం చేశారు. పదిహేడవ శతాబ్దం నాటి మైసూరు రాజుల కాలంలో కొన్ని గద్య రచనలు వెలువడ్డాయి. 'చిక్క దేవరాయ విన్నప', 'చిక్క దేవరాజ వంశావళి' ఈ కాలంలో వెలువడ్డ గద్య రచనలు. పద్దెనిమిది, పంతొమ్మిది శతాబ్దాలలో విస్తృతంగా గద్య రచనలు వచ్చాయి. కెంపు నారాయణ ముద్రామంజూష (1823) హళగన్నడ, నడుగన్నడ, హొసగన్నడల సంగమ రచన. దేవచంద్ర రాజావళి, కృష్ణరాజ ఒడయార్ గద్యకృతులు ఈ కాలంలో వచ్చిన ప్రధాన గద్యరచనలు. అప్పటివరకు నత్తనడకన సాగిన గద్య రచనల పరంపర ఆంగ్లేయులు అడుగిడిన తరువాత విస్తృతమైంది. క్రైస్తవ మతాన్ని ప్రచారం చేయాలని తలచిన ఆంగ్లేయులు కన్నడ భాషకి విలువైన సేవ చేశారు." (శివరాయ, తు.సు. 2014: 203-205).

ఆంగ్లేయులు తమ మత ప్రచారం నిమిత్తం చేసిన ప్రతీ పని గద్య రచనలు సాహిత్య మాధ్యమంగా మారడానికి సహకరించాయి. ఆంగ్లేయ పాదరీలు కన్నడ ప్రాంతానికి ముద్రణని పరిచయం చేయడంతో పాటు అనేక వచన రచనలను, కథలను ముద్రించి నవలకి వాస్తవ భూమికని ఏర్పరిచారు. కన్నడ భాషకి ఆంగ్లేయులు చేసిన సేవ విలువైనది.

### 1.3.1. కన్నడ వచన రచనలు - ముద్రణ

1) విలియంకేరి సిరంపూర్ ప్రేస్‌లో "ఏ గ్రామర్ ఆఫ్ కర్ణాటక లాంగ్వేజ్"ని ప్రచురించారు. ఇది కన్నడ భాషకి సంబంధించి ప్రచురితమైన ప్రథమ గ్రంథం. ప్రాచీన, ఆధునిక కన్నడ భాషల మిశ్రమంగా 1739లో 'సెవరి' రెండు క్రైస్తవ కృతులను రచించారు.

2) లండన్ మిషన్ తరపున జాన్ హండ్స్ 1810లో బళ్లారి వచ్చాడు. హండ్స్‌కి సహాయకుడిగా వచ్చిన విలియం రివ్ 1824లో ఇంగ్లీషు కన్నడ నిఘంటువుని, 1832లో కన్నడ ఇంగ్లీషు నిఘంటువుని కూర్చి ముద్రించాడు. ఇవి కన్నడ ఆది నిఘంటువులు.

3)1856లో బెంగళూరులోని వెస్లియన్ ముద్రణాశాల మేనేజర్ మైసూరు పరగణాకి ఉమ్మడి పాఠ్య ప్రణాళికతో పాటు, కన్నడలో 'బహుభాషా భగవద్గీత'ను ముద్రించారు.

4) జాన్ స్టివెన్ సన్ 'కెంపు నారాయణ గారి' 'ముద్రామంజూష'ను పరిష్కరించి ప్రచురించారు.

5) రెవరెండ్ పెర్డినాండ్ ఇరవై రెండేళ్ల వయసులో జర్మనీ నుండి ప్రొటెస్టెంటు మత ప్రచారం నిమిత్తం కర్ణాటకకి వచ్చారు. ఈయన 'పరమాత్మ జ్ఞానం', 'కథా మాలై' వంటి క్రైస్తవ మత గ్రంథాలతో పాటు నాగవర్మ రచించిన కన్నడ ఛందోబుధిని పరిష్కరించి 1870లో ప్రచురించారు. హళ, నడు, హోస గన్నడల తారతమ్యాన్ని వివరిస్తూ కిట్టెల్ రచించిన 'ఎ గ్రామర్ ఆఫ్ ద కెనరీస్ లాంగ్వేజ్' (1903)ను బాసెల్ మిషన్ ప్రచురించింది.

6) హర్మన్ మోగ్లింగ్ ప్రచురించిన జాతి విచారణ, దేవవిచారణ అనే వ్యాసాలు ఆధునిక కన్నడ వ్యాసానికి నాంది వాక్యాలుగా పనిచేశారు. ఈయన మంగళూరు సమాచార అనే పత్రికని కూడా నడిపారు.

7) నిత్య వ్యవహారంలో ఉన్న వంద కన్నడ పదాల ఉపయోగ విధానాన్ని తెలుపుతూ ఫ్రెడ్రిక్ జిగ్లర్ 'ఎ ప్రాక్టికల్ కీ టూ కన్నడ లాంగ్వేజ్' రచించారు.

8) కాథలిక్ శాఖకి చెందిన బార్బోనెక్స్ 1850లో కాథలిక్ ప్రెస్‌ను స్థాపించి ఎన్నో మత గ్రంథాలను, పాఠ్య పుస్తకాలను ప్రచురించారు. లాటిన్-కన్నడ, కన్నడ – లాటిన్ నిఘంటువుని కూడా వెలువరించారు.

9) తమిళంలో వీరమునివర్ రచించిన పరమార్థగురుకథైను 1877లో జె. బరెల్ కన్నడీకరించారు. (చెన్నకేశవరెడ్డి, జి.1999:150-152).

ఈ సామాజిక పరిస్థితుల భూమికగా కన్నడలో నవల ఆవిర్భవించింది.

### 1.3.2. తొలి కన్నడ నవల

"నవల అని చెప్పుకోదగ్గ రచనలు కన్నడలో పంతొమ్మిదవ శతాబ్దం నుండే ఉన్నాయని, దాని ప్రాదుర్భవాన్ని గురించి పరిశోధన చేసిన వారు భావిస్తున్నారు." (సుందరం, ఆర్వీ. యస్, 1977: 180). నవలని కన్నడంలో కాదంబరి అనడం పరిపాటి. ఒక పక్క కన్నడ భాష గద్యం

ఆధునిక రూపం ధరిస్తున్న తరుణం. ఇంకో పక్క అప్పుడప్పుడే కన్నడ భాషకి నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలు వెలువడుతున్న సందర్భంలో పూర్తిగా కన్నడ భాష ఆంగ్ల భాషా ప్రభావానికి లోనుకాక మునుపే కాదంబరి అని చెప్పుకోదగ్గ మూడు రచనలు కన్నడంలో వచ్చాయి. అవి:

1) కళావతి పరిణయ (1815) – యాదవ కవి.

2) సౌగంధికా పరిణయ (1821) – ముమ్మడి కృష్ణరాజ ఒడయార్.

3) ముద్రా మంజూష (1823) – కెంపూ నారాయణ.

#### 1.3.2.1. కళావతి పరిణయ (1815)

"కళావతి పరిణయ" రచనని కన్నడ తొలి కాదంబరిగా గోవింద పై గారు గుర్తించారు. "కళావతి పరిణయ దల్లి ఒళ్లియ కథన విదే. పాత్రగళ నిరూపణయల్లి సహజతెయూఇల్ల దిల్ల" (కళావతి పరిణయంలో మంచి కథనం ఉన్నా పాత్రల నిరూపణంలో సహజత్వం లేదు) (శేషగిరిరావ్, ఎల్.ఎన్. 213: 214) అంటూ శేషగిరి రావు గారు కళావతి పరిణయంలో ఉన్న లోపాన్ని తెలిపారు. కాలప్రమాణంగా ఆధునిక కన్నడ గద్యానికి దగ్గరగా వెలువడిన కాదంబరిగా కళావతి పరిణయాన్ని కన్నడ విమర్శకులు గుర్తిస్తున్నారు.

#### 1.3.2.2. సౌగంధికా పరిణయ (1821)

"సౌగంధికా పరిణయ ఆధునిక హొసగన్నడకి దగ్గరగా ఉన్న రచన" (శేషగిరి రావు, ఎల్.ఎన్. 213:214). "ఈ సౌగంధికా పరిణయ కాదంబరిని రచించిన కృష్ణరాజ ఒడయార్ మైసూరును కొన్ని రోజులు పరిపాలించారు. ఈ కాదంబరిలో నాయకుని పేరు 'ఇంద్ర'. అతను సౌగంధికా రాజుగా పిలువబడతాడు" (George. K.M. 1845: 636). అతని చరిత్ర ఇందులో కలదు. ఈ రచనని క్రీ.శ. 1909లో ఆర్యమత గ్రంథ ప్రార్థన సభ మేనేజర్ "గుండ్లు పండిత లక్ష్మీనారాయణాచార్య' అచ్చు వేశారు.

*"శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం*
*ప్రసన్న వదనంధ్యాయెత్సర్వ విఘ్నోప శాంతయే!"*

అన్న ప్రార్థనా శ్లోకంతో ఈ రచన ప్రారంభమవుతుంది. మొదట వినాయకస్తుతి, తరువాత సరస్వతి స్తు , ఆ తరువాత త్రిమూర్తులను, మహిశాసుర మర్ధినిని ప్రార్థించడం రచన ప్రారంభంలో కనిపిస్తుంది. ఇది ప్రాచీన కావ్య రచనలోని ఇష్టదేవతాస్తుతికి నిదర్శనం. రచన

ఆరంభంలో ఇష్టదేవతా స్తుతితో పాటు తనకి ముందున్న కవుల పేర్లను కూడా కృష్ణరాజ ఒడయార్ ఇందులో పేర్కొన్నారు.

"పూర్వరాద బ్రహ్మనిష్టరాద బ్రాహ్మణరన్ను నేమిసి, వాల్మీకి, వ్యాస, కాళిదాస, దండి భవభూతి, మాఘ మయూర భారవి, భోజరాజ మొదలాద సుకవిగళం స్మరిసి" (వెంకటసెట్టి ఎ.ఆర్. 1909:3).

కవి ప్రశంసతో పాటు కులదైవమైన చాముండికాపరమేశ్వరి స్మరణ ఉంది. సౌగంధికాపరిణయ కృతిని విద్వాంసులు చూసి రస, అలంకార రీతులలో సంవిధానంలో ఏదైన తక్కువ ఉన్నట్లయితే క్షమించమని కృష్ణరాజ ఒడయార్ చేసిన విజ్ఞాపన ఈ రచన ఆరంభంలో కనిపిస్తుంది.

"రసాలంకార శూన్య యాగి శబ్దాబాసగళింద మన బందంతె కావ్యంగళం రచిసి గర్వందిం తిరుగువ కుకవి గళం నిరాకరిసి కులదేవతయాద శ్రీ చాముండేశ్వరీయ పరమానుగ్రహదింద. హిరియర ఆశిర్వాదదిందెనగే తెళిదిష్టు హేళువ సౌగందికా పరిణయ నెంబీ నవీన కృతియం నిర్‌మత్సరరాద విద్వాంసరుగళునోడి రసగళల్లి, అలంకారగళల్లి, రీతిగళల్లి, సంవిధాన నిబందన గళల్లి యావదాదు కడిమె ఆదదు క్షమిసి ఒదం బహుదు." (వెంకటసెట్టి, ఎ.ఆర్. 1909: 3).

ఇది వెయ్యి పుటల నిడివి కల గ్రంథం. సుచరిత్ర మహారాజు గుణ వర్ణనతో ప్రారంభమైన ఈ గ్రంథంలోని కథ సుగంధరాజు వర్ణనతో ముగుస్తుంది. ఇందులో సుగంధరాజు చరిత్ర ఉంది. సుగంధరాజు సౌగంధికా దేవిని వివాహం చేసుకోవడం ఇందులోని ప్రధాన ఇతివృత్తం.

ఈ ఇతివృత్తానికి అనుబంధంగా సుగంధరాజు విజయాలు, రాక్షస పోరాటాలు వర్ణించబడ్డాయి. మొత్తం మీద ఇందులోని ఇతివృత్తంలో ప్రాచీన పురాణ, ఐతిహాసిక ఛాయలు కనిపిస్తాయి. ఇందులోని సుదీర్ఘమైన వాక్య నిర్మాణం, వర్ణనలతో కూడిన శైలి కన్నడ ప్రాచీన రూపానికి నిదర్శనం. ఈ రచనను ప్రాచీన పురాణ, ఐతిహాస కథల నేపథ్యంగా గద్యంలో కల్పిత కథను చెప్పిన రచనగా పేర్కొనవచ్చు. అందుకే దీన్ని కన్నడ విమర్శకులు పూర్తిస్థాయి నవలగా

కాక "నవలకి భూమికగా నిలిచిన ఒక గద్యగ్రంథంగా". (సుందరం, ఆర్వీయస్. 1977: 180) పేర్కొన్నారు.

### 1.3.2.3. ముద్రా మంజూష (1823)

"ముద్రా మంజూషను సంస్కృత ముద్రా రాక్షసం నాటకం ఆధారంగా కెంపు నారాయణ రచించారు" (శేషగిరిరావు, ఎల్.ఎస్. 2013:124) ఇది చారిత్రక గద్య కావ్యం కెంపు నారాయణ కృష్ణరాజ ఒడయార్ ఆస్థాన కవి. ఈ కృతికి మూలం సంస్కృత నాటకకర్త విశాఖదత్తుని ముద్రా రాక్షసం.

### 1.3.2.3.1. ఇతివృత్తం

చాణక్య చంద్రగుప్తులు తమ శత్రువులను జయించి పాటలీపుత్ర సింహాసనాన్ని అధీష్టించిన వృత్తాంతం ఇందులో ఉంది. చాణుక్యుడు శాస్త్ర విజ్ఞాని, బుద్ధిమంతుడు, చతురుడు. తాను పాటలీపుత్ర రాజులైన నవ నందుల నుండి అవమానం పొందాడు. వారిని తన చతురోపాయాలతో చంపి తనకు ఇష్టమైన చంద్రగుప్తుడిని రాజుగా చేస్తాడు. ఇది స్థూలంగా ఇందులోని ఇతివృత్తం.

"ఇది స్వతంత్ర రచన అని ఈ రచనపై పరిశోధన చేసిన డా. కె.ఎస్.ఎన్. ఉడుపగారు పేర్కొన్నారు. ఈ రచనలో ప్రస్తావితమైన చంద్రగుప్త చాణుక్య కథ విష్ణుపురాణం, భాగవత పురాణం, వాయు, మత్స్య పురాణాల్లో కనిపిస్తుంది. బౌద్ధ, జైన గ్రంథాలలో కూడా ఈ కథ కనిపిస్తుంది. జైన కావ్యం అయిన దేవేంద్ర విరచిత రాజావళి కథాసారంలోను ఈ చంద్రగుప్త చాణుక్య కథ ప్రస్తావన ఉంది. కన్నడలో ఐతిహాసిక లేదా చారిత్రక కాదంబరి రచనలలో మొట్టమొదటి ఉత్కృష్ట రచన ముద్రా మంజూష" ("అవధి"–"ఆన్‌లైన్ బ్లాగ్"– ఉదయ కుమార్ హబ్బు). ముద్రా మంజూష గద్యంలో ఉన్నా అందులోని ఇతివృత్తం 'చారిత్రకం'. పైగా ఇందులోని ఇతివృత్తం విశాఖదత్తుని ముద్రా రాక్షసం ఆధారంగా రచించబడింది. అందువల్ల ఈ రచనని తొలి కాదంబరిగా కాక "ఐతిహాసిక, చారిత్రక కాదంబరికి మార్గదర్శకత్వం ఇచ్చిన రచనగా కన్నడ విమర్శకులు పేర్కొంటున్నారు". (మైసూరు విశ్వవిద్యాలయ విశ్వకోశ /

ఒడయార్ కాలద కన్నడ సాహిత్య: వికిసోర్స్). ఈ మూడు కాదంబరీల తరువాత కన్నడలో అనువాద నవలలు వచ్చాయి.

### 1.3.3. అనువాద నవలలు

ప్రారంభ కాలంలో ఇంగ్లీషు నుండి నవలలు కన్నడలోకి అనువాదం అయ్యాయి.1842లో బనియన్ రచించిన "పిల్గ్రిమ్స్ ప్రోగ్రెస్" 'యాత్రికన సంచార' పేర కన్నడంలోకి అనువాదం అయింది. 1857లో డానియల్ డెఫోగారి, రాబిన్సన్ కుసో కన్నడంలోకి అనువాదం అయింది. ఆ తరువాత ఇతర భారతీయ భాషల నుండి నవలలు కన్నడంలోకి అనువాదం అయ్యాయి.1869లో బాబా పద్మాన్‌జి మరాఠీలో రచించిన 'యమునా పర్యటన్' కన్నడంలోకి అనువాదం అయింది. బెంగాలీలో బంకించంద్ర ఛటర్జీ రచించిన దుర్గేశనందిని నవలని 1885లో బి. వెంకటాచార్య కన్నడంలోకి అనువదించారు. ఈ నవల కన్నడంలో చాలా ప్రచారం పొందింది. 1895లో కందుకూరి వీరేశలింగం పంతులు గారి వివేకచంద్రిక, 1899లో మలయాళ భాష నుండి సుకుమారి నవల కన్నడంలోకి అనువాదం అయ్యాయి. ఆ తరువాత కన్నడ భాషలో విస్తృత స్థాయిలో నవలలు వచ్చాయి.

1895లో రెంటాల వెంకట సుబ్బారావుగారు 'కేసిరి విలాస' నవలని కన్నడ, తెలుగు రెండింటిలో రచించారు. 1892లో లక్ష్మణరావు గాధకర్ 'సూర్యకాంత', 1899లో గుల్వాడి వెంకటావు గారి 'ఇందిరాబాయి' నవలలు వచ్చాయి. ఇందిరాబాయి నవల తరువాత బోళార బాబురావ్ వాగ్దేవి, 1908లో కరూరశ్రీనివాసాచార్య 'ఇందిర' నవలలు వచ్చాయి. ఈ నవలలలో తొలి నవల ఏది అన్న విషయంలో కన్నడసాహిత్యంలో చర్చోపచర్చలు జరిగాయి. ఈ ప్రారంభ కాలంలో కన్నడంలో వెలువడ్డ ఒక్కో నవలకి ఒక్కో ప్రత్యేకత ఉంది.

i) యాదవ కవి రచించిన 'కళావతి పరిణయ' (1815) నవలను పోలిన రచన. కానీ పూర్తి నవల కాదు. పెళ్లికి ముందే పెళ్లికూతురు తనకు కాబోయె భర్తకు లొంగడానికి నిరాకరించడం ఇందులోని ఇతివృత్తం. 'ఇది ప్రథమ కన్నడ ఐతిహాసిక కాదంబరి". (శేషగిరి, ఎల్.ఎన్. 2014: 125)

ii) 'కృష్ణరాజ ఒడయార్ రచించిన సౌగంధికా పరిణయ (1829) వెయ్యి పుటలకు పైగా ఉన్న వచన ప్రబంధం" (చెన్నకేశవరెడ్డి, జి. 1999: 142)

iii) 'కెంపూ నారాయణ ముద్రా మంజూష (1823) విశాఖదత్తుని నాటక కథను అనుసరించి రచించిన గద్య గ్రంథం. ఇందులో రాజకీయ విషయాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది.' (చెన్నకేశవరెడ్డి, జి(సం). 1999: 142)

4) 1892లో ప్రకటితం అయిన 'సూర్యకాంత నవలను కన్నడ స్వతంత్ర ఐతిహాసిక కాదంబరి'గా ఎల్.ఎన్. శేషగిరి రావు గారు పేర్కొన్నారు.' (శేషగిరి రావు ఎల్.ఎన్., 2014:125)

5) '1897లో ప్రకటితం అయిన చోరగ్రహణ తంత్ర తొలి కన్నడ డిటెక్టివ్ నవల' (శివరాయ, తు.సు. 2013:217).

### 1.3.4. తొలి సాంఘిక నవల - ఇందిరాబాయి

కన్నడలో వచ్చిన తొలి సాంఘిక నవల 'ఇందిరాబాయి'. ఈ నవలకి ముందు అనువాదాలు, పౌరాణిక ఇతివృత్తాలు కల నవలలు వచ్చాయి. ఇందిరాబాయి తొలి కన్నడ సామాజిక కాదంబరి అని అనేక మంది విమర్శకులు పేర్కొన్నారు.

1) "హేగిద్దరూ ఈ గిద్ద స్వరూపదల్లి కన్నడ కాదంబరి హుట్టు కొండిద్దు హత్తొంబత్తనెయ శతమానద కొనియ దశకదల్లి ఎన్నువుదు నిర్వివాద గుల్వాడి వెంకటరాయర ఇందిరాబాయి (1899) నమ్మ మొట్టమొలెనెయ స్వతంత్ర కాదంబరి. అందుక్కు మొదలు బందువుగళు భాషాంతరగళు, ఇల్లవే కథగళ" –(ఆమూర్ జి.ఎస్. 1983: 9)

2) "1899 రల్లి గుల్వాడి వెంకట రాయరు బరిద ఇందిరాబాయి అథవ సద్ధర్మ విజయ, కన్నడ ప్రథమ స్వతంత్ర సామాజిక కాదంబరి. ఎందుహేళలాగుత్తె భాగీరథి మత్తు సీమంతిని ఇవర ఇతర కాదంబరి గళు" –(శివరాయ తు.సు. 2014: 217)

3) "కన్నడ మొదల సామాజిక కాదంబరి 'ఇందిరాబాయి' ఇదు ప్రకటిత వాదద్దు 1899 రల్లి". అశోక్, టి.పి. (బాబురావ్, బోళార.2013: 10)

4) '1899లో ప్రచురితమైన ఇందిరాబాయి లేదా సద్ధర్మ విజయవు కన్నడలో వచ్చిన మొదటి స్వతంత్ర సాంఘిక నవల అని పేరుపొందింది." – (చెన్నకేశవరెడ్డి, జి (సం). 1999:142)

"Gulvadi Venkat Rao's Indirabai (1899) generally considered as the first social novel in Kannada" – (Shivarama, Padikkal. 2005: 216)
"1899 Again a memorable year saw publication of the first independent social novel in Kannada Gulvadi Venkat Rao's Indiraba The sub title Sadharma Vijayavu". – (George, k.m. 1984: 637).

### 1.3.5. కన్నడ నవల వికాసం

ఇందిరాబాయి నవల తరువాత కన్నడ ప్రాంత సామాజిక పరిస్థితులని చిత్రిస్తూ మరో రెండు నవలలు వచ్చాయి. 1905లో బోళర బాబురావ్ గారు వాగ్దేవి నవలని రచించారు. ఈ నవల ఇందిరాబాయి నవలకి కొనసాగింపుగా పేర్కొనవచ్చు. ఇందులో నాటి కన్నడ సమాజంలోని మతాలలో జరిగే అకృత్యాల గురించి రచయిత వివరించారు. 1908లో కెరురువాసు దేవాచార్య 'ఇందిర' అన్న నవలని రచించారు. ఈ నవల వెను వెంటనే రెండు సాంఘిక నవలలు వచ్చాయి.

ఇందిరాబాయి తరువాత అంతటి పేరు పొందిన సాంఘిక నవల ఎం.ఎస్. పుట్టణ్ణ గారు 1910లో రచించిన 'మాడిదుణ్ణోమహారాయ'. ఆధునిక కన్నడ నవలకి పితామహుడు ఎం.ఎస్. పుట్టణ్ణ. ఈయన రచించిన మాడిదుణ్ణో మహారాయ నవల కన్నడ తొలి నవలలో ప్రసిద్ధమైనది. ఈ నవలలో పుట్టణ్ణ రెండు తరాలకు చెందిన కుటుంబ కథను వివరించారు. వీరు పిల్లల కోసం 1884లో పౌరాణికేతివృత్తాల ఆధారంగా 'నీతి చింతామణిని' అనే నవలలని రచించారు. ఇది 33 ముద్రణలు పొందింది. ముసుగుతెగియో మగనే, కుణిగల రామశాస్త్రిగళ చరిత్ర, హేమచంద్రరాజ విలాస, సుమతి మదనకుమారచరిత్ర, హిందూ చరిత్ర సంగ్రహ వీరి ప్రధాన రచనలు.

కర్ణాటక నవలా ప్రపంచంలో శివరామకారాంత గారిది ప్రముఖ స్థానం. ఈయన నవలా ప్రస్థానం 1928లో 'దేవదూతరు' నవలతో ప్రారంభమైంది. శివరామకారంత్ గారికి "మూకజ్జియ కనసుగళు" నవలకి 1975లో జ్ఞానపీఠ పురస్కారం వచ్చింది. ఈయన తన తరువాతి నవల 'చోమనదుడి' 1933లో రచించారు. ఇందులో దళిత వర్గానికి చెందిన చోముని

కథ వర్ణితమైంది. వీరు 1942లో 'మరళిమణ్ణిగే' నవలని రచించారు. ఈ నవలలో మూడు తరాల జీవితం వర్ణితమైంది. వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇస్తూ కారంత్ గారు 1960లో 'అల్లిదమేలే' నవలని రచించారు. కన్నడ నవలా ప్రపంచంలో వీరు తొలిసారిగా ప్రథమ పురుషలో బెట్టదజీవ (1993) నవలని రచించారు. ఈయన కన్నడ నవలా సాహిత్య వికాసంలో నవోదయ యుగానికి మార్గదర్శకంగా నిలిచారు.

స్వాతంత్ర్య సంగ్రామం నేపథ్యంగా 1946 తరువాత కన్నడలో నవలలు వచ్చాయి. గురుస్వామి అయ్యంగార్ రాసిన 'హేమావతి', వి.ఎం. ఇనాందార్ రాసిన 'మురబెట్ట', టి.ఆర్. సుబ్బారావు రాసిన 'రక్తతర్పణ' నవలలు ఇందుకు ఉదాహరణలు. 1928లో మాస్తి వెంకటేశ అయ్యంగార్ గారి 'సుబ్బణ్ణ' నవల వెలువడింది. ఇది ఆత్మ వ్యక్తీకరణ ధోరణితో రచించిన నవల. కన్నడ నవల పరిణామంలో మొదటి తాత్విక నవల. దేవుడు నరసింహ శాస్త్రి గారి 'అంతరంగ' నవల. ఈ నవల నరసింహ శాస్త్రి 1931లో రచించారు. నరసింహశాస్త్రి గారు చారిత్రక దృక్పథంతో 1928లో 'మయూర' నవలని రచించారు. మహాబ్రాహ్మణ, మహాక్షత్రియ (1960), మహాదర్శన (1963) వీరి ఇతర నవలలు. ప్రాచీన సంస్కృతి నాశనం అవుతున్న దానిపై నూతన సంస్కృతి నిర్మితమైన విధానాన్ని తెలుపుతూ ఆద్యరంగాచార్య 'విశ్వామిత్రన సృష్టి' అనే నవలనిరచించారు. నీతి, నియమాల ప్రాధాన్యాన్ని  గురించి చెబుతూ ఎ.ఎన్. కృష్ణారావుగారు 'జీవన యాత్ర', 'సంధ్యారాగ' (1938) 'నగ్నసత్య' (1958) వంటి నవలలని రచించారు.

కన్నడ మాండలికంలో మిర్జి అన్నారావు గారు 'నిసర్గ' నవలని రచించగా, యువత బాంబే వంటి నగరాలలో జీవన భృతికోసం పడుతున్న పాట్లను వివరిస్తూ వ్యవసాయ బల్లాల వారు 'హేమంతగాన' (1954) నవలని రచించారు. టి.ఆర్. సుబ్బారావు, బసవరాజు కట్టమణి, నిరంజన, సుబ్రహ్మణ్య రాజు, మస్తి వెంకటేశ అయ్యంగార్ వంటి ఎందరో రచయితలు తమ రచనల ద్వారా కన్నడ నవలా సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు.

## 1.4. తెలుగు నవల

### 1.4.1. తొలి నవల

"తొలి తెలుగు నవల వ్రాసే ప్రయత్నం 1872లో జరిగింది. అదే తొలి నవలా, కాదా అని వితర్కిస్తే. అవునూ, కాదూ అని వితర్కించవచ్చు. కొన్ని వాద వివాదాలూ పుట్టాయి" (రామానుజరావు, దేవులపల్లి.1973:1). ఇవి తెలుగు నవలకి నూరు సంవత్సరాలు నిండిన సందర్భంగా డా. అక్కిరాజు రమాపతిరావు గారు అన్న మాటలు. నేడు తెలుగు తొలి నవల 1872లో కాక 1866లో వెలువడిందన్న నూతన వాదం బయలుదేరింది.

"తొలి తెలుగు నవల 1866లో వెలువడింది. మొదట "కంబుకంధర చరిత్ర", ఆ తర్వాత కామరూప కథ రెండూ ఒకే సంవత్సరంలో వెలుగు చూశాయి. ఇందులో మొదటి నవల కంబుకంధర చరిత్రలో పద్యాలు, వచనం కలగలిపి ఉన్నాయి. కామరూప కథ వ్రాత ప్రతికి క్యాటలాగ్ రాస్తూ సంపాదకులు ఇలా పేర్కొన్నారు. "ఇది కంబుకంధర చరిత్రమును బోలిన కల్పిత కథ. వ్రాతను బట్టి యిదియు తడకమళ్ల రామకృష్ణ కవి రచించినదిగా గుర్తింపనగు చున్నది. ఈ లైబ్రరీలో ఆయన చేతివ్రాత గ్రంథములు పెక్కులు గలవు. మిక్కిలి పెద్దదియగు కల్పితగాన, లిపి కష్టము మీద జదువదగినదిగా నున్నది గాన, యిందలి కథ సంగ్రహంగా జెప్పగుదురు లేదు. ఇది నేటి నావెలును బోలినె రచన". అంటే ఇది స్వతంత్ర రచన నవల మాదిరిగా ఉన్నదని 1937లో ఈ వ్రాత ప్రతికి క్యాటలాగ్ రాస్తూ సంపాదకులు పేర్కొన్నారు. కామరూప కథ గ్రంథ రచన ఆరంభం 'విభవ శ్రావణ బహుళ 4 శుక్రవారము' అని ఉంది. దీన్ని బట్టి ఈ నవల 1868 జూలైలో ప్రారంభించారు.

'తెలుగు వెలుగు ముగుదకథ' గ్రంథానికే 'శ్రీమదాంధ్ర కవితా వేదినీ విలాసము' అనే మరో పేరు కూడా ఉన్నది. ఇది 1879లో ముద్రించబడిందని సుంకిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇందులో పద్య, గద్యాలు ఉన్నప్పటికీ కథా కథనం ఆధునిక నవల మాదిరిగానే ఉన్నది. ఈ మూడు నవలలని రచించింది తడకమళ్ల వేంకటరామ కృష్ణారావు. ఈయన కామందకము, లీలావతి గణితము, రామావతార కాలనిర్ణయం, చిత్రకథా వివరణము అనే రచనలను కూడా వెలువరించారు. సంస్కృతాంధ్ర, ఉర్దూ, పారసీ, ఆంగ్ల, తమిళ, కన్నడ భాషల్లో కూడా నిష్ణాతులైన రామకృష్ణారావు భూగోళ, ఖగోళ గణిత శాస్త్రాల యందు కూడా పాండిత్యము

ఉన్నవాడని రంగాచార్య పేర్కొన్నారు. అంతేకాకుండా పింగళిసూరన కళాపూర్ణోదయ కథను సీస మాలికగా చెప్పి తన కవితా ప్రౌఢిని నిరూపించుకున్నాడు. నల్గొండ జిల్లా మునగాల మండలం బేతవోలులో కుట్టెన – వెంకమ్మ దంపతులకు జన్మించిన కృష్ణారావు, రామచంద్రరావు – కనకమ్మ దంపతులకు దత్తతగా వెళ్లాడు. యుక్త వయస్సులో మద్రాసు – తిరువళిక్కేణికి వెళ్లి అక్కడే స్థిరపడిపోయాడు. రచనా వ్యాసంగం అంతా అక్కడున్నప్పుడే జరిగింది. అవసాన దశలో తిరిగి బేతవోలు చేరుకున్నాడు.

అందుబాటులో ఉన్న ఆధారాలను లోతుగా పరిశీలించినట్లయితే తొలి తెలుగు నవల 'కంబుకంధరచరిత్ర' అనే తేలుతున్నది. అయితే కామరూపకథ పూర్తిస్థాయి నవలగా భావించవచ్చు. నవలలోని ఇతివృత్తం, రచనా విధానం, కథనం అన్ని ఆధునిక నవలకు చాలా దగ్గరగా ఉన్నాయి. అందుకే ఇదే తొలి తెలుగు నవల అని నిర్ధారించవచ్చు. మద్రాసు లైబ్రరీలో అందుబాటులో ఉన్న ఈ నవలను పునర్ముద్రించినట్లయితే తెలుగు పాఠకులకు అందుబాటులోకి వస్తుంది" (వెంకటేశ్వర్లు, పంతంగి. 2014: 17–22) అని సంగిసెట్టి శ్రీనివాస్ గారు పేర్కొన్నారు.

'కంబుకంధరచరిత్ర' (1866), 'కామరూపకథ' (1866) నవలల తరువాత 1867లో కొక్కొండ వెంకటరత్నం పంతులు రచించిన 'మహాశ్వేత' నవల వెలువడింది. మహాశ్వేత నవల తరువాత 1872లో శ్రీనరహరి గోపాలకృష్ణమ సెటి 'శ్రీరంగరాజుచరిత్ర', 1878లో కందుకూరి వీరేశలింగం పంతులు 'రాజశేఖరచరిత్ర' నవలలు వెలువడ్డాయి.

ఈ నవలల్లో తొలి తెలుగు నవల ఏది అన్న విషయంలో వాదవివాదాలు జరిగాయి.

1867లో వెలువడిన కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి 'మహాశ్వేత' తొలి తెలుగు నవల అని శ్రీ నిడవోలు వేంకటరావుగారి వాదన. ఈయన తన వాదనకి శ్రీ శివశంకర పాండ్య కొక్కొండవారి విగ్రహ తంత్రానికి పీఠిక ఇంగ్లీషులో వ్రాస్తూ పేర్కొన్న మాటలని ఉదాహరణగా చెప్పారు.

*"In 1867 he (Venkata Ratnam Pantulu) composed the First Telugu Novel named 'Mahasweta'. Founded on the pleasant story of*

*Kadambari, the master piece of Bana Bhatta in Sanskrit".* (ఇనాక్, కొలకలూరి. 2013: 62)

ఈ వాక్యాలను ఆధారంగా చేసుకొని నిడదవోలు వెంకటరావు గారు 'మహాశ్వేత' నవలని తెలుగు తొలి నవలగా గుర్తించారు. "పైవాని యన్నింటి కన్నా ముఖ్యమైనది మహాశ్వేత నవలా రచన పంతులు గారు క్రీ.శ. 1867వ సంవత్సరమున రచించిరి. తెలుగు నవలా రచనకి పంతులుగారు ప్రథములు. ఈ నవలలో కొంతభాగం 1895వ సంవత్సరమున వైజయంతి పత్రికయందు ప్రకటితమైంది. ఇది వీరేశలింగం పంతులుగారి రాజశేఖరచరిత్ర కన్నా ఇరువది రేండేండ్లు ముందుగా వెలసినది" (ఇనాక్, కొలకలూరి. 2013: 63). ఇవి నిడదవోలు వెంకటరావు గారి మాటలు. 'తెలుగు నవలా పరిణామముపై' పరిశోధన చేసిన డా. బి.వి. కుటుంబరావు గారు కూడా 'మహాశ్వేత' నవలని తొలి తెలుగు నవలగా తమ సిద్ధాంత వ్యాసంలో పేర్కొన్నారు.

"సాహిత్య ప్రక్రియల విషయమైన నవ్యతా దర్శనము గలిగియు బ్రాచీన సంప్రదాయములను బ్రాచీన సాహిత్య ప్రభావ సమిష్టిలో బరిమళింపజేయ వలెననెడి వాతావరణము నెలకొని యున్న దినములవి. ఆ ప్రభావము గలదియే మన తొలి నవల 'మహాశ్వేత'. స్వదేశీ పూర్వరంగ ప్రభావముగల మహాశ్వేతయే మన మొదటి నవల. 'శ్రీరంగరాజుచరిత్ర' ఇట్టిది కాదు. అది సాహిత్యకముగా విదేశీ పూర్వరంగం కలది" (కుటుంబరావు, బి.వి.1971: 85, 156).

1872లో వెలువడిన నరహరి గోపాలకృష్ణమ సెట్టిగా 'శ్రీరంగరాజుచరిత్ర' తొలి తెలుగు నవల అని మొదట శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావుగారు పేర్కొనగా దాన్ని డా. అక్కిరాజు రమాపతి రావు గారు బలపరిచారు. డా.అక్కిరాజు రమాపతిరావుగారు తొలి తెలుగు నవలగా 'శ్రీరంగరాజుచరిత్ర'ని గుర్తించడానికి గల కారణాలను విపులంగా పేర్కొన్నారు.

"1897వ సంవత్సరంలో శ్రీకాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు మొదటిసారిగా ఈ ప్రక్రియను 'నవల' అని పిలిచారు. వీరేశలింగం పంతులు గారి 'రాజశేఖరచరిత్ర'పై వారు ప్రకటించిన విమర్శ గ్రంథం పీఠికలో శ్రీ బ్రహ్మయ్యశాస్త్రి గారిట్లా రాశారు.

ఆంగ్లేయ భాషలో నావెల్  అను పదము కొత్త యను నర్థముగల 'నవ్' అను పదము నుండి పుట్టినది. ఈ 'నవ్' అన్న పదానికి 'నవ'యను మన సంస్కృత పదమునకు గల సంబంధము తెటతెల్లమే! కావున నవల యనగా 'నవాన్ విశేషాన్ లాతిగృహ్ణాతీతి నవలా' అనగా క్రొత్త విషయంబుగలదని యర్థము వచ్చుచున్నది. హూణభాషయందునీ మాటకిదే యర్థమగుటచే 'నవల'అను పదమునకు సరైన వేరొక సంస్కృత పదమునకై ప్రయత్నము చేయక 'నవల'యని యీ పదమునే నేనిట వాడిచున్నాను."

ఈ వాక్యాలను పురస్కరించుకొని చూస్తే నవల అన్న ప్రక్రియ ఇంగ్లీషు ప్రభావం వల్లనే తెలుగులో రూపొందింది అన్నది స్పష్టం. అప్పుడు మహాశ్వేత తొలి నవల కాదు. ఇది అసంపూర్ణం, యధా మాతృకానువాదం. పోనీ వచన ప్రబంధం అనుకొందామన్నా, ప్రబంధం అనువాదం కారాదు. ఇది అనువాదం. వాక్య నిర్మాణం కూడా సంస్కృత మర్యాదానుసారంగానే ఉంది" (రామానుజరావు, దేవులపల్లి. 1973: 3, 4).

ఈ విధంగా మహాశ్వేత తొలి నవల కాదు అని చెప్పిన అక్కిరాజు రమాపతి రావు గారు శ్రీరంగరాజుచరిత్రను తొలి తెలుగు నవలగా గుర్తించారు. శ్రీరంగరాజుచరిత్ర ఎందుకు తొలి తెలుగు నవల అన్నదానికి కారణాలను కూడా చెప్పారు.

"ఇక 'శ్రీరంగరాజుచరిత్రం' 1872లో పుస్తకరూపంలో వెలువడింది. దానిని నవలగా అప్పటి పత్రికలు, మద్రాసు గెజిటు పేర్కొన్నాయి. పురుషార్థ ప్రదాయిని అనే సాహిత్య మాస పత్రిక తెలుగులో చేసిన సమీక్షలో దీనిని వచన ప్రబంధంగా పేర్కొని ఇంగ్లీషు విభాగంలో చేసిన సమీక్షలో నవలగా పేర్కొన్నది. ఈ వచన ప్రబంధమన్న పదాన్ని నవలకు సమానార్థకంగా శ్రీగోపాలకృష్ణమ సెట్టి గారే సృష్టించారని చెప్పవచ్చు. అంతకు పూర్వం తెలుగులో వచన ప్రబంధం వ్రాయడానికి అంటే ఇంగ్లీషు సాహిత్యంలోని నవల వంటి సాహిత్య ప్రక్రియను

తెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఈ ప్రయత్నం చేసిన వారిలో నరహరి గోపాలకృష్ణమ సెట్టి గారే ఆద్యులు." (రామానుజరావు, దేవులపల్లి. 1973: 4, 5).

కందకూరి వీరేశలింగం పంతులు గారి 'రాజశేఖరచరిత్ర' 1878లో వెలువడింది. వీరేశలింగం గారు తెలుగు సాహిత్యంలో తాను చేసిన రచనల గురించి చెప్తూ తెలుగులో తొలి వచన ప్రబంధంను తానే చేశానని పేర్కొన్నారు. "....నే నారంభించిన కాలమందు తెలుగులో నిప్పటివలె వివిధములైన పుస్తకములు లేవు. వివిధములేమి? ఇంచుమించుగా నేవిధమైనవియు వచన రూపమున లేవనియే చెప్పవచ్చును. అప్పుడన్నియు నూతన సృష్టి చేయవలెను. అందుచేత నప్పటి వారికి కష్టములెక్కువ. సౌలభ్యములు తక్కువ. అయినను తెలుగులో మొదటి వచన ప్రబంధమును నేనే చేసితిని, మొదటి నాటకమును నేనే తెనిగించితిని. మొదటి ప్రకృతి శాస్త్రమును నేనే రచించితిని. మొదటి ప్రహసనమును నేనే రాసితిని, మొదటి చరిత్రమును నేనే రచించితిని. స్త్రీలకై మొదటి వచన పుస్తకము నేనే కావించితిని" (వీరభద్రరావు, కొత్తపల్లి. 1986: 494). వీరేశలింగంపంతులుగారి ఈ మాటలను ఆధారంగా చేసుకొని కొంత మంది విమర్శకులు రాజశేఖరచరిత్రను తొలి తెలుగు నవలగా గుర్తించారు. వీరేశలింగం గారు తాను 'రాజశేఖరచరిత్ర' వెలువరించడానికి పూర్వమే శ్రీరంగరాజుచరిత్ర నవల వెలువడింది. శ్రీరంగరాజుచరిత్రని కందుకూరి వీరేశలింగం పంతులుగారు చూడలేదా? చూసినా తానే తెలుగులో తొలి వచన ప్రబంధాన్ని రాసానని ఎందుకు పేర్కొన్నారు? వంటి అంశాలపై తెలుగు సాహిత్యంలో సుదీర్ఘ చర్చ జరిగింది. శ్రీరంగరాజుచరిత్రను కందుకూరి వారు చూసి ఉంటారని తెలి  ఉదాహరణలను కొత్తపల్లి వీరభద్రరావు గారు తమ 'తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము' అన్న గ్రంథంలో వివరించారు.

"ఆయన శ్రీరంగరాజుచరిత్రను చూచిరనుటకు, రాజశేఖరచరిత్రములోని కొన్ని భాగములకు శ్రీరంగరాజుచరిత్రలోని కొన్ని భాగములకు గల పోలికలే మనకి సాక్ష్యమిచ్చుచున్నవి". (వీరభద్రరావు, కొత్తపల్లి. 1986: 496).

రాజశేఖరచరిత్రలో రాజశేఖరుడు తన ధనాన్ని పోగొట్టుకొని తన గ్రామాన్ని విడిచి ఇంకో గ్రామానికి వెళ్లే సందర్భంలో దారిలో ఒక రాకుమారుడు వడదెబ్బతో రావిచెట్టు కింద పడిపోగా

రాజశేఖరునికి, గొల్లవానికి మధ్య నడిచిన సంభాషణలో అంటరానితనం ప్రస్తావన వస్తుంది. గొల్లవాడు తాము నీళ్లు ఇస్తామన్నా రాజు తాము శూద్రులము కాబట్టి తమ నీటిని తాగలేదని చెప్తాడు. అప్పుడు రాజశేఖరుడు రాజుకి నీళ్లిచ్చి బతికిస్తాడు. శ్రీరంగరాజుచరిత్రలో కూడా ఇలాంటి వర్ణన కనిపిస్తుంది. రాజు దాహంతో ఎండకి పడిపోగా కొందరు కాపులు అతనికి నీరు తాగించడానికి ప్రయత్నించగా ఇంకో 'కాపు' అడ్డుకొని శూద్రులు రాజులకు నీళ్లు తాపరాదని, పూర్వం ఇలాంటి ఎన్నో తప్పులు చేయడం వల్లే తమకు ఈ శూద్ర జన్మ వచ్చిందంటాడు.

ఈ రెండు సన్నివేశాలు ఒకే విధంగా ఉండటాన్ని బట్టి ఇంకా శ్రీరంగరాజుచరిత్రలోని వాక్యాలను పోలిన వాక్యాలు కొన్నిచోట్ల రాజశేఖరచరిత్రలో ఉండటాన్ని బట్టి కందుకూరి వారు శ్రీరంగరాజుచరిత్రని చూసి ఉండవచ్చు అన్న అభిప్రాయాన్ని కొత్తపల్లి వీరభద్రరావు గారు వ్యక్తపరిచారు.(వీరభద్రరావు, కొత్తపల్లి. 1986:500) కందుకూరి వారు శ్రీరంగరాజుచరిత్ర చూసినా దాని గురించి ప్రస్తావించలేదు.

"పంతులుగారు శ్రీరంగరాజుచరిత్రని గూర్చి ఎక్కడా ప్రస్తావించక పోవడానికి కారణం, వారా గ్రంథాన్ని నవలగా అంటే వచన ప్రబంధంగా భావించక కథగా భావించి ఉండవచ్చు. అందువల్ల మొదటి వచన ప్రబంధాన్ని నేనే చేశానన్నారు. కాబట్టి అప్పటి నుంచీ సాహిత్యపరులంతా తొలి నవల రాజశేఖరచరిత్రమే అని అభిప్రాయపడటం జరిగింది." (రామానుజరావు, దేవులపల్లి.1973: 8).

"రాజశేఖరచరిత్ర కన్నా ముందు శ్రీరంగరాజుచరిత్ర వెలువడినా 'రాజశేఖరచరిత్ర'కి వచ్చిన ప్రచారం శ్రీరంగరాజుచరిత్రకు రాలేదు. దీనికి అనేక కారణాలను చూపించవచ్చు. ఆ రోజుల్లో 'చింతామణి' అనే పత్రిక మొదటిసారిగా నవలల పోటీని నిర్వహించింది. ఆ పత్రిక వారు నవలకు ప్రమాణంగా రాజశేఖరచరిత్రనే తీసుకున్నారు. 'శ్రీరంగరాజుచరిత్ర' ఆ పత్రిక సంపాదకుల దృష్టికి రాలేదు. అంతేకాకుండా గోపాలకృష్ణమ సెట్టి ఆ రోజుల్లో సాహిత్య ప్రపంచంలో అంత ప్రఖ్యాతుడు కాదు. కానీ నవయుగ వైతాళికుడుగా వీరేశలింగం పంతులు గారు చాలా ప్రఖ్యాతుడు. ఈ కారణం వల్ల రాజశేఖరచరిత్రకి వచ్చినంత పేరు ప్రఖ్యాతలు శ్రీరంగరాజుచరిత్రకి రాలేదు." (నవీన్, అంపశయ్య. 2012: 43). ఇలాంటి వాదనలు ఎన్ని

ఉన్నా ‘శ్రీరంగరాజుచరిత్ర’కు తొలి తెలుగు నవల అన్న గౌరవం దక్కాలని ఈనాడందరూ అంగీకరిస్తున్నారు. అయితే తడకమళ్ల కృష్ణారావు గారు రాసిన ‘కంబుకంధర చరిత్ర’ (1866) తొలి తెలుగు నవల అవుతుందా కాదా అన్న విషయంపై నేడు చర్చ జరుగుతోంది. ఈ నవల గురించి ప్రస్తావిస్తూ కాసుల ప్రతాపరెడ్డిగారు ఇంకా ఈ విషయంపై విస్తృత స్థాయిలో చర్చ జరగాల్సి ఉందని పేర్కొన్నారు.

“నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన తడకమళ్ల కృష్ణారావు ‘కంబుకంధర చరిత్ర’ అనే రచన చేశారు. ఆయనే ‘కామరూప కథ’ అనే రచన కూడా చేశారు. ఇది 1866లో వచ్చింది. దీనిలో తొలి నవలకు సంబంధించిన బీజాలున్నాయి. అలా తెలంగాణ నవలకు అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు. ఇదే సమయంలో తెలుగు నవలకు కూడా ఇక్కడే అంకురార్పణ జరిగిందని చెప్పడానికి వీలుంది. నరహరి గోపాలకృష్ణమ సెటి రాసిన శ్రీరంగరాజుచరిత్ర1872లో వెలువడింది. వీరేశలింగంపంతులు రాసిన ‘రాజశేఖరచరిత్ర’ 1878లో వచ్చింది. మొదటి నవలాకారుడు తాను రాసిన శ్రీరంగరాజుచరిత్ర నవీన ప్రబంధమనె చెప్పాడు. కందుకూరి వీరేశలింగం వచన ప్రబంధమని అన్నాడు. తడకమళ్ల కృష్ణారావు తాను రాసిన ‘కంబుకంధరచరిత్ర’ను కూడా వచన ప్రబంధమన్నాడు. దానికి నోట్ రాసిన వారు నవల లాంటిది అని అన్నారు. 1897 వరకు నవలను తెలుగులో వచన ప్రబంధమనే అన్నారు. తడకమళ్ల కృష్ణారావు రాసిన ‘కామరూపకథ’ మొదటి తెలుగు నవల అవుతుందా అనే విషయంపై చర్చ జరగాల్సి ఉంది.” (ప్రతాపరెడ్డి, కాసుల. 2007: 7, భువనగిరిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి డిగ్రీ కళాశాల తెలుగుశాఖ 19 ఆగస్టు, 2007న నిర్వహించిన సదస్సులో సమర్పించిన పత్రం, ఇరుసు: తెలంగాణ సాహిత్య వ్యాసాలు).

డా. సంగిసెట్టి శ్రీనివాస్ గారు, కామరూప కథ, కంబుకంధర చరిత్రల గురించి ప్రస్తావిస్తూ, “తొలి తెలుగు నవల కంబుకంధరచరిత్ర (1866), మద్రాసు లైబ్రరీలో అందుబాటులో ఉన్న ఈ నవలను పునర్ముద్రించినట్లయితే తెలుగు పాఠకులకు తొలి నవల అందుబాటులోకి వస్తుందని” పేర్కొన్నారు. ఈ నవల సేకరించే ప్రయత్నంలో నేను మద్రాసు లైబ్రరీని సందర్శించడం జరిగింది. అక్కడ క్యాటలాగులో *D.No. 433P* (కంబుకంధర చరిత్ర) *Kambukundhara Charitra by Tadakamalla Venkata Krishna Rao.*

*D.No. 1401. P.* (కామరూపకథ) *Kamarupakatha* by *Tadakamalla Venkata Krishna Rao* అని పుస్తకాల పేర్లు ఉన్నాయి కాని పుస్తకాలు అందుబాటులో లేవు.

ఈ నవలల గురించి సంగిసెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, ముదిగంటి సుజాతరెడ్డి వంటి పరిశోధకులు పేర్కొన్నారు. కాని ఈ నవలలు నేటికి అందుబాటులో లేవు. సంగిసెట్టి శ్రీనివాస్‌గారు పేర్కొన్న వివరాల ప్రకారం తెలుగు నవల రాసే ప్రయత్నం 1866లో వెలువడిన 'కంబుకంధర చరిత్ర' ద్వారా జరిగిందని చెప్పవచ్చు. నేటికి లభ్యమౌతున్న తొలి తెలుగు నవల శ్రీరంగరాజుచరిత్ర.

### 1.4.2. తొలి సాంఘిక నవల - శ్రీరంగరాజు చరిత్ర

ఆంధ్ర నవలా పరిణామంపై పరిశోధన చేసిన డా. బి.వి. కుటుంబరావుగారు 'శ్రీరంగరాజుచరిత్ర' నవలని దక్షిణ భారత దేశంలోనే తొలి సాంఘిక నవలగా అభివర్ణించారు. నిడదవోలు వెంకట్రావు గారు కూడ ఆంధ్రుల సాంఘిక ఆచారాలు చిత్రించిన నవలగా శ్రీరంగరాజుచరిత్రని పేర్కొన్నారు.

"దీని సరైన పేరు 'శ్రీరంగరాజుచరిత్ర' కర్తపేరు నరహరి గోపాలకృష్ణమసెట్టి. 14.6.1872లో దీని ప్రథమ ప్రకటనము. ఇందలి పుటలు 101. ఆంధ్రుల యాచార వ్యవహారాలముల చిత్రణ దీని ప్రధాన ఉద్దేశమని తోచును. కథనము జిగిగలదే కాని లంబాడీల గుంపుచే నిందు నాయికయగు (సోనాబాయి) రంగనాయిక బలాత్కారముగ బందింపబడిన సంఘటనము మాత్రమంత శుభోత్కరముగా లేదు. దీనిని కులస్త్రిలెంతవరకు మెత్తురో విచార్యము."

**– నిడదవోలు వెంకట్రావు గారు** (కుటుంబరావు, బి.వి. 1971: 121).

"ఇందలి ఇతివృత్తము విజయనగర ప్రభువైన శ్రీరంగదేవరాయల కాలము నాటిది. సాంఘిక చరిత్రము, నాయకుడు రంగరాజు, నాయిక రంగనాయిక, కథలో కొంతవరకు సోనాబాయి యనె వ్యవహరించబడును. ఈ నవలికను 'సోనాబాయిచరిత్ర' యన్నను ననవచ్చును. పేరును బట్టి దీనిని చారిత్రక మనరాదు. విదేశ ములయందుసైత మిట్లే 'చరిత్ర' యను పదము నవలల పేరులో జాలాకాలముండెను. 'శ్రీరంగరాజుచరిత్ర' ప్రధానముగా

సాంఘికము, యావత్ దక్షిణ భారతదేశమునకు దీనిని సాంఘిక నవలా ప్రథమ ప్రసిద్ధ ప్రయత్నమని కూడా జెప్పనొప్పును. ఆంధ్రుల యాచార వ్యవహారములను చిత్రించుట దీని ధ్యేయము.”

**–డా. బి.వి. కుటుంబరావు** (కుటుంబరావు, బి.వి. 1971: 145)

శ్రీరంగరాజుచరిత్ర నవలని రచించిన నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు నవల రచనా ఉద్దేశాన్ని తెలుపుతు సమకాలీన అంశాలు నవలలో నిబిడీకృతమైన విధానాన్ని వివరించారు. 1872లో నరహరి గోపాలకృష్ణమ సెట్టిగా ‘శ్రీరంగరాజుచరిత్ర’ (సోనాబాయి పరిణయం) నవల వెలువడింది. ఈ రచన తొలి ముద్రణలో ‘హిందువుల యాచారములు తెలుపునట్టి నవీన ప్రబంధం’ అని ఉంది. ఈ ఉపశీర్షిక ఈ నవలలో పేర్కొన్న సాంఘిక అంశాలకు ప్రతీక. ఈ నవల రచించడానికి తనను ప్రేరేపించిన పరిస్థితుల గురించి రచయిత చెప్పుకున్నాడు. “పది నెలల నాడు లార్డు మేయోగారు, బంగాళుల యాచారంబులు తెలుపు ప్రబంధంబు గావించువానికి బహుమానంబు చేయ బడునని ప్రచారము చేసిరి. అది నేను జదివినపుడు తెలుగు దేశమువారి యాచారంబులు తెలుపునట్టి ప్రబంధంబొకటి రచియించుట తెలుగు చదువు వారికుపయుక్తంబగునని తలంచి నా నేర్పుకొలదిని ప్రబంధంబు చెప్పబూనితిని. ఇది కేవలము కల్పితంబు. కథా నాయకుడు మహాకులీనుడైయుండ వలయునని యీ దేశంబున మున్ను దొరతనము చేసిన విద్యానగర రాజవంశము వారిలో శ్రీరంగరాజను వాని పేరు గైకొంటినిగాని యిందు జెప్పిన చరితయు యధార్థముగా జరిగిన కథ యని యెంచగూడదు. ఇందు జెప్పిన యాచారములు మాత్రము యథార్థముగా నాచరింపబడునవి.

ఈ కథ 400 సంవత్సరాల నాడు జరిగినట్లు చెప్పబడియె గాని యప్పటి యాచారములకు నిప్పటి యాచారాములకును లేశంబుగాని భేదంబులేమింజేసి యిందుదహరింపబడిన యాచారంబులన్ని యిపుడాచరింపబడుచున్నవని. యెఱుంగునది – కేవల గద్యాత్మకములయిన తెనుగు ప్రబంధములు – విశేషములేమింజేసి యిది తెలుగు విద్యార్థులకు సయితముపయోగించు నని తలచెద.” (ఇనాక్, కొలకలూరి (సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 8).

ఈ మాటలు రచయిత తన రచనలో పేర్కొన్న అంశాలకు దిక్సూచి వంటివి తన రచనలోని ఇతివృత్తం కల్పితం. కథా నాయకుడైన శ్రీరంగరాజు కులీన రాజవంశం వ్యక్తి కాని తన రచనలో తాను చరిత్రను కాక 'అప్పటి యాచారములకు నిప్పటి యాచారములకును లేశంబుగాని భేదంబు లేమింజేసి' రచిస్తున్నానని, ఇందులో ఉదహరించబడిన ఆచారాలు రచనా కాలం నాటి ఆచారాలుగా గ్రహించాలని పేర్కొన్నారు. గోపాలకృష్ణమ సెట్టిగారు తెలగులో తన రచనని నవీన ప్రబంధం అని పేర్కొన్నా ఇంగ్లీషులో ఈ నవలకి వెలువరించిన ముందుమాటలో (*Preface*) 'నవల' అని పేర్కొన్నారు. అంతేకాక బెంగాల్ రాష్ట్రంలోని సామాన్యుల జీవితం, సంప్రదాయాలు, ఆచారాలు చిత్రించమన్న లార్డు మెయో కోరిక మేరకు తాను తెలుగువారి ఆచార సంప్రదాయాలను తన రచనలో చిత్రించానని తన రచనకి ఇంగ్లీషులో రాసిన ముందుమాటలో నరహరిగోపాలకృష్ణమ సెట్టిగారు (*Preface*) పేర్కొన్నారు.

*Preface*

*"This attempt to delineate the manners and customs of the telugus in their own language in the form of a novel, owes its origin to the announcement by the late lamented Viceroy of the offer of a reward for the best story in Bengali illustrative of native life and manners in lower Bengal and the author therefore deems it a privelege (deeply as the regrets that he cannot do so in person) to inscribe to Lord Mayo in token of respectful and grateful appreciation of his Lordships endeavours to promote the literary culture of the Vernaculars of India this slight effort to further in however small a degree the same cause".*(ఇనాక్, కొలకలూరి (సం). శ్రీరంగరాజుచరిత్ర.2010: 10).

రచయిత తన రచనలో పేర్కొన్న ఈ అంశాలు శ్రీరంగరాజుచరిత్ర సాంఘిక నవల అని తెలుపుతున్నాయి. ఇదే అంశాన్ని గురించి ప్రస్తావిస్తూ ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు శ్రీరంగరాజుచరిత్ర నవల – సాంఘిక జీవనానికి దర్పణంగా వెలువడిందని పేర్కొన్నారు.

"నూటేభై ఏళ్లు గడిచినా, ఇంత బాగా సుగాలీలు, లంబాడీలు, బంజారాలు పాత్రలైన నవలా సాహిత్యం ఇంత సహజంగా, జీవిత సన్నిహితంగా రాలేదనే చెప్పవచ్చు". (ఇనాక్, కొలకలూరి.2013: 11, 66). ఈ విధంగా శ్రీరంగరాజుచరిత్రని రచించిన నరహరి గోపాలకృష్ణమసెట్టి గారు, మరియు పరిశోధకులు తెలుగు వారి ఆచార వ్యవహారాలు చిత్రిచించిన నవలగా శ్రీరంగరాజుచరిత్ర నవలని గుర్తించారు. శ్రీరంగరాజుచరిత్ర(1872) నవల వెలువడిన తరువాత ఆరు సంవత్సరాలకు కందుకూరి వీరేశలింగంపంతులు గారి రాజశేఖరచరిత్ర(1878) నవల వెలువడింది. ఈ రెండు నవలల్లో సాంఘిక అంశాల ప్రస్తావన ఉంది. కాల ప్రాతిపదికగా చూసినపుడు శ్రీరంగరాజుచరిత్ర తొలి సాంఘిక నవల అవుతుంది. కాని ఇందులో చర్చకి వచ్చిన సాంఘిక అంశాలు రాజశేఖరచరిత్రతో పోల్చుకుంటే తక్కువ. సాంఘిక అంశాల ప్రస్తావన తక్కువగా ఉన్నంత మాత్రాన శ్రీరంగరాజుచరిత్ర నవలను సాంఘిక నవలకాదు అనలేం. ఆరు సంవత్సరాల తేడాతో ఈ రెండు నవలలు వచ్చాయి. కర్నూలు ప్రాంతానికి చెందిన నరహరి గోపాలకృష్ణమ సెట్టి రంగరాజుచరిత్ర రాయగా, రాజమండ్రి ప్రాంతానికి చెందిన కందుకూరి వారు రాజశేఖరచరిత్ర రచించారు. ఈ రెండింటిలో 'వర్ణ వ్యవస్థ – వ్యధ' కనిపిస్తుంది. శ్రీరంగరాజుచరిత్రలో లంబాడి ప్రజల ఆచార వ్యవహారాలు కనిపిస్తాయి. రాజశేఖరచరిత్రలో సమాజంలోని మూఢ నమ్మకాల చిత్రణ కనిపిస్తుంది. కాల ప్రాతిపదికగా చూసినపుడు రంగరాజు చరిత్ర తొలి సాంఘిక నవల అవుతుంది.

### 1.4.3. దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవల - శ్రీరంగరాజు చరిత్ర

తెలుగులో కాల ప్రమాణంగా చూసినపుడు నరహరి గోపాలకృష్ణమ సెట్టిగారు రాసిన శ్రీరంగరాజుచరిత్ర(1872) తొలి సాంఘిక నవల అవుతుంది. దీనికి పూర్వం వచ్చిన తడకమళ్ళ రామకృష్ణారావుగారి కంబుకంధరచరిత్ర (1866) నేటికి అలభ్యం. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి మహాశ్వేత(1867) సంస్కృత కాదాంబరికి అనువాదం, అలభ్యం కావడం వల్ల దీన్ని విమర్శకులు తొలి నవలగా అంగీకరించడంలేదు. నవలా లక్షణాలు, సమకాలిన సమాజ చిత్రణ, తరువాతి నవలలపై చూపిన ప్రభావం మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకున్నపుడు 'శ్రీరంగరాజుచరిత్ర' తరువాత ఆరు సంవత్సరాలకు వచ్చిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి 'రాజశేఖరచరిత్ర'ని (1878) తొలి తెలుగు సాంఘిక నవలగా కొంతమంది విమర్శకులు గుర్తిస్తున్నారు. కులవివక్ష, వర్ణవ్యవస్థ–వ్యధ, లంబాడీల జీవనవిధానం వంటి

అంశాలు శ్రీరంగరాజుచరిత్రలో ప్రస్తావనకి వచ్చినందువల్ల 'శ్రీరంగరాజుచరిత్ర' సాంఘిక నవల అవుతుంది. కాల ప్రాతిపదికగా 'శ్రీరంగరాజుచరిత్ర' మొదట వెలువడటం వల్ల 'శ్రీరంగరాజుచరిత్ర' తొలి తెలుగు సాంఘిక నవలఅవుతుంది. గుల్వాడి వెంకట్రావుగారి ఇందిరాబాయి (1899) కన్నడలో నేడు తొలి సాంఘికనవలగా గుర్తించ బడుతున్నది. గుల్వాడి వెంకట్రావుగారి ఇందిరాబాయి(1899) నవలకి పూర్వం కన్నడలో యాదవకవి 'కళావతిపరిణయ' (1815), ముమ్మడికృష్ణరాజరు 'సౌఘందికాపరిణయ' (1829), కేంపునారాయణ 'ముద్రామంజూశ' (1823) వంటి నవలలు వచ్చాయి. వీటిలో ముమ్మడి కృష్ణరాజరు రాసిన 'సౌఘందికాపరిణయ' గద్యకృతి కావడం, యాదవకవి రాసిన 'కళావతిపరిణయ' దండక ప్రక్రియలో గద్య లక్షణాలని కలిగి ఉండటం, కేంపునారాయణ రాసిన 'ముద్రామంజూశ' పురాణాన్ని పోలి ఉండటం వల్ల కన్నడ విమర్శకులు గుల్వాడి వెంకట్రావుగారు రాసిన ఇందిరాబాయి నవలని తొలి కన్నడ సామాజిక కాదాంబరిగా గుర్తిస్తున్నారు. తమిళంలో వేదనాయాగం పిళ్ళైగారు రచించిన 'ప్రతాప ముదిలియార్ చరిత్ర'(1879) నవలని తమిళ విమర్శకులు తొలి సాంఘిక నవలగా గుర్తిస్తున్నారు. "1887లో అప్పునెడుంగడి రచించిన కుందలతతో మలయాళంలో నవలారచన ప్రారంభమైంది. ఈ ప్రథమ ప్రయోగం అంత విజయవంతం కాలేదు. ఇందులో సంస్కృత పదాలతో కూడిన అలంకార యుక్త భాష వాడబడింది. ఇందులో సరైనా జీవితాదర్శం లేదు" (పరమేశ్వారన్, నాయర్ పి. కె.1978: 129). 1889వ సంవత్సరంలో ఒ.చందుమినాన్ గారు సమగ్ర నవలా లక్షణాలతో బాసిల్లె తొలి సాంఘిక నవల 'ఇందులేఖ'ని రచించారు. మొత్తం మీద దక్షిణ భారతదేశంలో మొదట తెలుగు (శ్రీరంగరాజుచరిత్ర–1872), తరువాత తమిళం (ప్రతాపముదిలియార్ చరిత్ర–1879), తరువాత మలయాళం (ఇందులేఖ–1889), ఆతరువాత కన్నడ (ఇందిరాబాయి–1899) భాషలలో తొలి సాంఘిక నవలలు వచ్చాయి. శ్రీరంగరాజుచరిత్ర(1872) కాల ప్రాతిపదికగా దక్షిణ భారతీయ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవల అవుతుంది.

### 1.4.4. తెలుగు నవల - వికాసం

కంబుకంధరచరిత్ర (1866), కామరూపకథ(1866), మహాశ్వేత (1867), శ్రీరంగరాజుచరిత్ర (1872), రాజశేఖరచరిత్ర (1878), నవలలతో తెలుగు నవలా ప్రస్థానం

మొదలైంది. ప్రారంభంలో సామాజిక అంశాల ప్రాతిపదికగా నవలలు వెలువడ్డాయి. రాజశేఖరచరిత్ర నవల తరువాతి తెలుగు నవలలకు దిక్సూచిగా నిలిచింది. ఈ నవల తరువాత వెలువడిన నవలలు దీన్ని ఒక నమూనాగా స్వీకరించాయి. 1894లో చింతామణి పత్రిక తెలుగులో నవలల పోటీని నిర్వహించింది. ఈ పత్రికలో రాజశేఖరచరిత్రని నమూనాగా తీసుకొని నవలలు రాయాలని ప్రకటన వెలువరించారు. ఫలితంగా పునప్పాకం 'అనంతాచార్యుల', 'మంజువాణీ విజయం' (1892), 'ఖండవల్లి రామచంద్రుడు గారి' 'ధర్మవతీ విలాసం (1893), మాలతీ రాఘవీయం (1895), లక్ష్మీసుందర విజయం (1896). తల్లా ప్రగడ సత్యనారాయణ, సంజీవరాయ చరిత్రము (1893), వంటి నవలలు వచ్చాయి. ఈ నవలలన్ని చింతామణి పుత్రిక బహుమానాలను కూడా పొందాయి.

చింతామణి పత్రిక నవలల పోటీ వల్ల తెలుగు నవలా ప్రపంచంలో ప్రవేశించిన వ్యక్తి 'చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు'. 1894లో 'రామచంద్రవిజయం' అన్న ఈయన నవలకు చింతామణి పత్రిక మొదటి బహుమతి లభించింది. ఈ నవలతో తన నవలా ప్రస్థానాన్ని ప్రారంభించిన చిలకమర్తి వారు దాదాపుగా పాతిక సంవత్సరాల పాటు తెలుగు నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేసి ఆంధ్రస్కాట్‌గా పేరుపొందారు. దాసికన్య, సుధాశరశ్చంద్రము, కృష్ణవేణి, రాజారత్నం, అహల్యాబాయి (1897), హేమలత (1896), సౌందర్యతిలక, కర్పూరమంజరి (1898), శాపము, గణపతి మొదలైనవి వీరి ప్రసిద్ధ నవలలు. చిలకమర్తి వారి నవలలు వెలువడుతున్న కాలంలోనే 'రెంటాల వెంకట సుబ్బారావు' కేసరి విలాసం (1895), బులుసు పాపయ్య శాస్త్రిగారి, 'భాస్కర విలాపం' (1895), రాజామంత్రి ప్రగఢ భుజంగరావు, మనోరమ (1899), కూనపురి లక్ష్మీ నర్సయ్య భక్షి (1899), ఓ. వై. దొరస్వామి కపాల కుండల' నవలలు వచ్చాయి. ఇలా ప్రారంభ కాలంలో వచ్చిన నవలలు ప్రధానంగా కల్పిత, సాంఘిక ఇతివృత్తాలతో వచ్చాయి.

ఆ తరువాతి కాలంలో సాంఘిక, చారిత్రక ఇతివృత్తాలతో కూడిన నవలలు వచ్చాయి. ఈ నవలలో మధ్యతరగతి జీవితం ప్రధానంగా కనిపిస్తుంది. కేతవరపు వేంకటశాస్త్రి మధ్యతరగతి జీవితం ప్రధానంగా  'లక్ష్మీప్రసాదము' నవలను, ఆంధ్ర చరిత్ర ప్రధానంగా 'బొబ్బిలిముట్టడి', 'రాయచూరుయుద్ధము' వంటి నవలలను రచించారు. వేంకట పార్వతీశ్వర

కవులు కూడా సాంఘిక, చారిత్రక ఇతివృత్తాలు ప్రధానంగా 'వసుమతివసంతం' (1911), 'ప్రమదవనము' (1912), 'మాతృ మందిరము' (1919), 'తిరుగుడుపెండ్లి' వంటి నవలలు రచించారు.

వేంకట పార్వతీశ్వర కవుల తరువాత, గాంధీ సిద్ధాంతాలను, హరిజన సమస్యలను స్వీకరించి ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'మాలపల్లి' రచించారు. స్త్రీ స్వేచ్ఛను కోరి చలంగారు మైదానం, వివాహం, బ్రాహ్మణీకం, దైవమిచ్చినభార్య, అమీన, అరుణ, జీవితాదర్శం వంటి నవలలు రచించారు. విశ్వనాథ సత్యనారాయణ గారు భారతీయ సంస్కృతి సంప్రదాయాల ఆలవంగా 'వేయి పడగలు' నవలని రచించారు. ఏకవీర, చెలియలికట్ట, మాబాబు, స్వర్గానికి నిచ్చెనలు, వార్షిక, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు లాంటి ఎన్నో నవలలని విశ్వనాథ వారు రచించారు. విశ్వనాథ సత్యనారాయణ నవలలు వెలువడుతున్న తరుణంలోనే అడవి బాపిరాజుగారు నారాయణరావు, కోణంగి, తుఫాను, నరుడు వంటి సాంఘిక నవలలని, హిమబిందు, గోనగన్నారెడ్డి, అడవిశాంతిశ్రీ వంటి చారిత్రక నవలలని రచించారు.

కథకులుగా ప్రసిద్ధిచెందిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, 'స్మశానవాటిక', 'మిథునరాగం', ఆత్మబలి, వడ్లగింజలు వంటి నవలలు రచించారు. ఈయన నవలలో హాస్యంతో పాటు ఆంధ్రదేశ ఆచార వ్యవహారాలు కూడ దర్శనమిస్తాయి. 'కాంతం' పాత్రని సృష్టించిన మునిమాణిక్యం నరసింహరావుగారు. రుక్కుతల్లి, దీక్షితులు, తిరుమాళిగ అనే మూడు నవలలని రచించారు.

ఆ తరువాత హేతువాద, ఫ్రాయిడ్ మనస్తత్వ సిద్ధాంతం, మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం ప్రాతిపదికగా తెలుగులో నవలలు వచ్చాయి. హేతువాద దృక్పథంలో గోపిచంద్‌గారు 'అసమర్థుని జీవయాత్ర' (1946) నవలని రచించారు. గోపిచంద్‌గారి రెండవ నవల పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామ. ఈ నవలకి కేంద్రసాహిత్య అకాడమి అవార్డు లభించింది. గోపిచంద్ గారికి సమకాలంలో బుచ్చిబాబు 'చివరికిమిగిలేది'(1952) నవలవెలువడింది. ఇది మనోవైజ్ఞానికి నవల. ఈ నవల 1947 నుండి 1948 వరకు నవోదయ వార పత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఈ నవల మాదిరిగానే 'భారతి' మాసపత్రికలో సీరియల్‌గా వచ్చిన నవల

రా.వి.శాస్త్రి అల్పజీవి(1953). ఇదేకాలంలో డైరి పద్దతిలో ఉప్పల లక్ష్మణరావు అతడు ఆమె(1950) నవల వెలువడింది. కారల్‌మార్క్ సిద్ధాంతాల ప్రాతిపదికగా కొడవటిగంటి కుటుంబరావు చదువు, ఐశ్వర్యం, వారసత్వం, గడ్డురోజులు, పంచకళ్యాణి, ప్రేమించిన మనిషి, ఎండమావులు, అనుభవం, బతుకుభయం, తార, వంటి నవలలు రచించారు. తెలుగునేలలో ఉన్న గ్రామీణ వాతవరణాన్ని చిత్రిస్తూ జి.వి.కృష్ణారావుగారు కీలుబమ్మలు(1951) నవలని రచించారు.

1901లో స్థాపితమైన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, 1906లో హైదరాబాదులో స్థాపించబడి 1910 నాటికి మద్రాసుకు తరలించబడ్డ విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి, హితబోధిని అనే పత్రికల ద్వారా తెలంగాణ ప్రాంతం నుండి నవలలు వచ్చాయి. తెలంగాణ చరిత్ర, సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ దొరలపెత్తనం, నిజాం కాలంనాటి పరిస్థితులను ఆలవంగా చేసుకొని తెలంగాణ ప్రాంతంనుండి సాంఘిక చారిత్రక నవలలు వచ్చాయి.

మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ దుర్గానికి సంబంధించి 'బండారు శ్రీనివాసరావు' 1910లో హితబోధిని పత్రిక ద్వారా 'ఆశాదోషం' అనే నవలని వెలువరించారు. అటుతరువాత గ్రంథాలయోద్యమం, పత్రికా ఉద్యమం భూమికగా తెలంగాణ ప్రాంతంలో నవలలు వచ్చాయి. సంఘసంస్కరణ ఉద్దేశంతో టేకుమళ్ళ నరసింహం 'రాధమ్మ' అనే నవలని రచించారు. కాకతీయుల, మహ్మదీయుల చరిత్ర ఆధారంగా ఆదిరాజు వీరభద్రరావు 'అల్లాహోఅక్బర్' నవలని రచించారు. ఖమ్మం జిల్లా భద్రాచలం ప్రాంతానికి చెందిన దేశ్‌పాండ్య సోమరాజు రామానుజరావు 1914లో 'మంజుమతి' అనే చారిత్రక నవలని రచించారు. ఒద్దిరాజు సీతారామచంద్రరావు 1918లో 'రుద్రమదేవి' అనే చారిత్రక నవలని వెలువరించారు. ఈయన శౌర్యశక్తి, భ్రమర, బ్రాహ్మణ సాహసము అనే చారిత్రక నవలని, స్త్రీసాహసము, ముక్తవలస, శశవిషాణము, ప్రేమప్రవాహము, ఇరువురు మగాళ్ళు, నాగరికభార్య, ఎఱువుసొమ్ము, మంగ సంసారం, ఆడపెత్తనం, రక్తాంజలి అనే సామాజిక నవలని రచించారు.

సీతారామచంద్రరావు తమ్ముడు రాఘవరంగారావు 'వీరావేశం' వరాహముద్ర అనే చారిత్రక నవలలని రచించారు. 1917లో సురవరం ప్రతాపరెడ్డిగారు 'శుద్ధాంతకాంత' అనే మరో నవల రచించారు. సురవరం ప్రతాపరెడ్డి గారు 1932లో 'ఆరెవీరులు' అనే మరోనవల రచించారు. ప్రకృతి కథాంశంగా శేషభట్టరు వేంకటరామానుజాచార్యులు 'ప్రాకృతదాంపత్యం' పేరిట (1922) నవల రచించారు. దూపాటి వేంకటరమణాచార్యులు ప్రతాపరుద్రుని సంబంధ కథాంశంతో 1922 లో 'వసుంధర' అనే చారిత్రక నవల రచించారు. ఈయన రాసిన రెండవ చారిత్రకనవల కొండపల్లి ముట్టడి(1929). తొలి తెలంగాణ మహిళా నవల శోభావతిని కె.సీతావిరాటమ్మ 1924లో వెలువరించారు.

1946-48 మధ్య కాలంలో సంభంవించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని చిత్రిస్తూ కొన్ని నవలలు వచ్చాయి. బొల్లిముంత శికరామకృష్ణ గారి 'మృత్యుంజయులు' మహీధర రామ్మోహరావు 'ఓనమాలు', 'కొల్లాయిగట్టితేనేమి', 'వట్టికోట ఆళ్వారుస్వామి', 'ప్రజలమనిషి' (1952), 'గంగు', లక్ష్మికాంత్‌మోహన్ గారి 'సింహగర్జన' (1951) వంటి నవలలు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం,  నిజాంకాల పరిస్థితులను ఆధారంగా చేసుకొని వచ్చాయి.

ఆధునిక కాలంలో యువతీ యువకుల సంబంధాలలో వచ్చిన మార్పులని చిత్రిస్తూ డా. పి. శ్రీదేవిగారు 'కాలాతీత వ్యక్తులు' (1958) నవల రచించారు. మద్రాసునగర పరిస్థితులు అక్కడి సినిమా జీవితంను వర్ణిస్తు మాలతీచందూర్ 'చంపకం', 'చెదపురుగుల' 'హృదయనేత్రి' వంటి నవలలు రచించారు. అస్తిత్వవాద ధృక్పథంతో భాస్కరభట్ల కృష్ణారావు 'యుగసంధి', 'వెల్లువలోపూచికపుల్లలు' వంటి నవలలు రచించారు. మధ్య తరగతి జీవితాన్ని వివిధ కోణాల్లో వర్ణిస్తు కొమ్మూరి వేణుగోపాలరావు 'పెంకుటిల్లు', 'హౌస్‌సర్జన్', 'ఒకే రక్తపు మనుషులు' వంటి నవలలు రచించారు. నోరి నరసింహశాస్త్రి నారాయణభట్టు, రుద్రమాదేవి, ఎర్రప్రగడ, మల్లారెడ్డి, కవిసార్వభౌమ వంటి చారిత్రక నవలలు, రచించారు. ఇదే క్రమంలో తెన్నేటిసూరి 'చంఘీజ్‌ఖాన్' అనే చారిత్రక నవల రాసారు. 1950 తరువాత తెలుగులో డిటెక్టివ్ నవలలు వచ్చాయి. ఆరుద్ర 'పలకల వెండిగ్లాసు' అనే డిటెక్టివ్ నవల రాసారు.

మంజుశ్రీ అన్న కలం పేరుతో అక్కిరాజు రమాపతిరావు 'జారుడుమెట్లు', 'స్వర్గారోహణ', 'నూరుశరత్తులు' వంటి సాంఘిక నవలలు రచించారు. అస్తిత్వవాద భూమికగా ఆర్.ఎస్.సుధర్శనం 'అసురసంధ్య', 'అనుబంధాలు' 'మళ్ళీవసంతం' వంటి నవలలు రచించారు. ఈయన రచించిన నవలలో సంసారవృక్షం(1970) ప్రసిద్ధిచెందిన నవల. పోరంకి దక్షిణామూర్తి రాయలసీమ, ఆంధ్ర, తెలంగాణ మూడు మాదలికాల్లో 'వెలుగువెన్నల గోదావరి', 'ముత్యాలపందిరి', 'రంగవల్లి' అనే మూడు నవలలు రచించారు. పాలగుమ్మి పద్మరాజు బతికిన కాలేజి, నల్లరేగడి, పోలాప్రగడ సత్యనారయణ సంఘంచేసిన మనిషి, కౌసల్య వంటి నవలలు రచించారు. 1958 తరువాత రంగనాయకమ్మగారు, బలిపీఠం, పేకమేడలు, కృష్ణవేణి, రచయిత్రి, అంధకారంలో, జానకీవిముక్తి వంటి స్త్రీ జీవిత నేపథ్యంగా ఉన్న నవలలు రచించారు. ఇదే కాలంలో వాసిరెడ్డి సీతాదేవి 'వైతరణి', 'సమత', 'ఊర్మిళ ', 'ఉరితాడు', వంటి నవలలను రచించారు. 1969లో నవీన్ గారి 'అంపశయ్య' వెలువడింది, నవీన్‌గారు 'ముళ్ళపొదలు', 'అంతస్రవంతి' అనే మరో రెండు నవలలను కూడా రచించారు. చైతన్య స్రవంతి ఛాయలతో వినుకొండ నాగరాజు 'ఊబిలోదున్న', 'తాగుబోతు' వంటి నవలలు రచించగా, రాయలసీమ ప్రజల పరిస్థితుల నేపథ్యంగా కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు', 'ఇన్‌క్రెడిబుల్ గాడెస్', 'మూగవాని పిల్లనగ్రోవి' వంటి నవలలు రచించారు. వడ్డెరఛండీదాస్ హిమజ్వాల, శిలావీర్రాజు 'మైన' నవలలు 1970 ప్రారంభంలో వెలువడ్డాయి. సినిమాలో జీవితాన్ని ఆధారంగా చేసుకొని రావూరిభరధ్వాజ రచించిన 'పాకుడురాళ్ళు' నవలకి ఇటీవల 'జ్ఞానపీఠ' పురస్కారం లభించింది. రా.వి.శాస్త్రిగారు అల్పజీవి, రత్తాలు రాంబాబు, రాజు, మహి వంటి నవలలని రచించారు.

అల్లం రాజయ్య 'కొలిమంటుకున్నది', 'వసంతగీతం', 'కోమురంభీం' వంటీ నవలల ద్వారా తెలంగాణలో ఉన్న సామజిక పరిస్థితులని వివరించారు. తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'నల్లవజ్రం' నవల బొగ్గుగని కార్మికుల జీవితాలకు ప్రతీక. బీ.యస్.రాములు 'బతుకుపోరు', బీడీ కార్మికుల జీవితాలకి దర్పణం. స్పార్టకస్ పేరుతో మోహన్‌రావు రాసిన 'ఖాకీబతుకులు' పోలీసుకానిస్టెబుల్ జీవితం ఆధారంగా వచ్చిన నవల. ఓల్గాగారు రచించిన 'సహజ', 'ప్రయోగం', 'స్వేచ్ఛ' నవలలు స్త్రీవాదానికి భూమికగా నిలిచాయి. జీ.కళ్యాణరావు 'అంటరానివసంతం' చిలుకూరి దేవపుత్ర 'పంచమం' బోయజంగయ్య 'జగడం' నవలలు దళితవాద నేపథ్యంగా వచ్చాయి. సలీం ఎయిడ్స్ వ్యాధిని గురించి రచించిన నవల

'కాలుతున్నపూలతోట' ఈ నవలకి కేంద్రసాహిత్య అకాడమి పురస్కారం వచ్చింది. ఈయన రాసిన 'వెండిమేఘం' ముస్లీం జీవితానికి దర్పణం. నవీన్ గారు తెలంగాణ సాంఘిక పరిస్థితుల నేపథ్యంగా 'కాలరేఖలు', 'చెదిరిన స్వప్నాలు', 'బాంధవ్యాలు' అనే మూడు నవలలు రచించారు. ఈ మూడు నవలల్లో 'కాలరేఖలు' నవలకు 2004లో కేంద్రసాహిత్య అకాడమి అవార్డు వచ్చింది. స్వామి గారి గద్దలాడతాండాయి జి.యస్.ఆర్.మూర్తి 'వలసదేవర' వేముల ఎల్లయ్య 'సిద్ది', 'కక్క', అరుణగారి ఎల్లి, నీలి వంటినవలలు దళితుల సమస్యలను చిత్రించాయి. వృత్తి జీవితాలని చిత్రిస్తూ శ్రీనివాస్‌గౌడ్ గారి 'బతుకుతాడు', కాలువ మల్లయ్య గారి 'గువ్వలచెన్న' నవలలు వచ్చాయి. ఈ విధంగా తెలుగు ప్రజల జీవితాన్ని వివిధ కోణాల్లో చిత్రిస్తూ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతికగా తెలుగులో అనేక  నవలలు వచ్చాయి.

### 1.5. తులనాత్మక పరిశీలన

దక్షిణ భారతీయ భాషలలో 'నవల' పంతొమ్మిదవ శతాబ్దంలో ఆవిర్భవించింది. 'నవల' ఆవిర్భావానికి పూర్వం జానపద కథల రూపంలోను, స్థల వర్ణనలు, పుక్కిటి పురాణాల రూపంలో దక్షిణ భారతీయ భాషలలో కథాసాహిత్యం వ్యాప్తిలో ఉండింది. మలయాళంలో వ్యాప్తిలో ఉన్న 'వట్టక్కన్ పుటుక్కల్' (ఉత్తర మలబార్ ప్రాంత) వీరగాథాలు, తమిళ, తెలుగు, కన్నడ ప్రాంతాలలో వ్యాప్తిలో ఉన్న జానపద కథలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

తొలి తమిళ వ్యాకరణ పుస్తకం 'తొల్కాప్పియం'లో పెర్కొన్న గద్యభేదాలు, చిన్న వ్యాకరణతత్త్వ పుస్తకాలు ప్రాచీన తమిళ సాహిత్యంలోని గద్య రచనలకి ఉదాహరణలు. 'వడ్డారాధన' (920) కన్నడలో వెలువడిన తొలి గద్యరచన. చిక్కదేవరాయ విన్నప, చిక్కదేవరాజ వంశావళి ప్రాచీన కన్నడ సాహిత్యంలో వచ్చిన గద్యరచనలు. మలయాళంలో పదవ శతాబ్దంలో తమిళంతో కూడిన మలయాళంలో కౌటిల్యుని అర్థశాస్త్రం గద్యంలో వెలువడింది. తెలుగులో ప్రాచీనకాలం నుండి చంపూపద్ధతిలో గద్యం కనిపిస్తుంది. ఈ విధంగా ప్రాచీన సాహత్యంలో గద్యరచనలు ఉన్నా ఆధునిక లక్షణాలతో కూడిన వచన రూపంలోని నవల పంతొమ్మిదో శతాబ్దంలో వచ్చింది. నవల ఆవిర్భావానికి ప్రేరేపించిన పరిస్థితులు అన్ని భషలలోను  ఒకే విధంగా కనిపిస్తున్నాయి.

మలయాళ ప్రాంతంలో తొలుత అడుగుపెట్టిన పోర్చుగీసువారు మతవ్యాప్తి వ్యాపార విస్తరణలో భాగంగా తాము మలయాళాన్ని నేర్చుకొనడమేకాక మలయాళంలోకి బైబిల్‌ని అనువాదంచేశారు. ఫ్రెంచీవారి తరువాత మలయాళ ప్రాంతంలోకి వచ్చిన డచ్చీవారు ఫ్రెంచివారి వలే మలయాళ ప్రాంత సంస్కృతిని, సాహిత్యాన్ని ప్రభావితం చేయలేదు. కోహికోడ్ ప్రధాన కార్యాలయంగా మలబార్ ప్రాంతాన్ని పాలించిన ఆంగ్లేయులు మలయాళ సాహిత్యానికి విశేష సేవ చేశారు. 'సంక్షేప వేదార్థం' (1772), 'వర్థమనపుస్తకం', 'కవిట్టునాటకం' వంటి వచన రచనలను ముద్రించారు. ఫలితంగా వచన రచనలకి ఆదరణ పెరిగి 'నవల' ఆవిర్భావానికి వాస్తవ మార్గం ఏర్పడింది. తమిళ ప్రాంతంలో అడుగు పెట్టిన ఆంగ్లేయులు క్రైస్తవ మత గ్రంథాలను ముద్రించే ఉద్దేశంతో క్రీ.శ.1577లో అచ్చుయంత్రాన్ని స్థాపించారు. తరువాతి కాలంలో క్రైస్తవ సిద్ధాంతాలను, జపములను, అర్చనాక్రమాన్ని తమిళంలోకి అనువదించారు. వచన రచనలని ప్రోత్సహించే ఉద్ధేశంతో 'దినవర్తమాని' (1856), 'జనవినోదిని'(1870) 'స్వదేశమిత్ర' (1882) వంటి పత్రికలు వచ్చాయి. ఈ అంశాలు తమిళ ప్రాంతంలో నవల ఆవిర్భావానికి భూమికగా నిలిచాయి.

మతప్రచారం నిమిత్తం కర్ణాటక ప్రాంతానికి వచ్చిన 'రెవరెండ్' వంటి ఆంగ్లేయులు కన్నడంలో 'పరమాత్మజ్ఞానం', 'కథామాలై' వంటి వచన రచనలని ముద్రించడంతో పాటు 'నాగవర్మ' రచించిన 'చందోభుదిని' పరిష్కరించి ప్రచురించారు, 'జాన్‌స్టివెన్‌సన్' కన్నడ తొలి నవలల సరసన నిలువగల 'కెంపూనారాయణగారి' 'ముద్రామంజూషను' పరిష్కరించి ప్రచురించారు. ఈ అంశాలు కన్నడ నవల ఆవిర్భానికి దారితీసాయి. తెలుగు భాషకి 1817లో విలియంబ్రౌన్ 'ఎ గ్రమర్ ఆఫ్ జంటూ లాంగ్వేజ్' పేర వ్యాకరణాన్ని రచించారు. ఎ.డి.కాంప్‌బెల్, బ్రౌన్, ఎట్స్ వంటి విదేశీయులు తెలుగు భాషకి విశేష సేవ చేసారు. అప్పటివరకి గ్రాంథిక రూపంలో ఉన్న తెలుగు భాష పాశ్చాత్య ప్రభావంతో వచన రూపం ధరించింది. ముద్రణాయంత్రం వచ్చిన తరువాత తెలుగులో విస్తృతంగా వచన రచనలు వచ్చాయి. ఈ అంశాలు నవల ఆవిర్భావినికి నాంది వాక్యంగా పనిచేశాయి. ఈ విధంగా అన్ని దక్షిణ భారతీయ భాషలలో నవల ఆవిర్భావానికి పూర్వం ఒకే విధమైన సామాజిక పరిస్థితులు ఉన్నాయి. వీదేశీయుల రాక, మతవ్యాప్తిలో భాగంగా వచన రచనల ముద్రణ, భాష ప్రాచీన పద్య, గద్య రూపాన్ని వీడి ఆధునిక రూపాన్ని ధరించడం, పాశ్చత్య సాహిత్యంతో స్థానికులకి పరిచయం కలగడం, నూతన సాహిత్య ప్రక్రియలలో భాగంగా 'నవల' ఆవిర్భావం వంటి

అంశాలు ఉమ్మడిగా అన్ని దక్షిణ భారతీయ  భాషలలో నవల ఆవిర్భావానికి పూర్వం కనిపిస్తాయి.

తెలుగు, కన్నడ భాషలలో తొలి నవల ఏది? అన్న విషయంలో వివాదం ఉంది. తమిళ, మలయాళ భాషలలో ఈ వివాదం లేదు. తమిళంలో తొలి నవల మరియు తొలి సాంఘిక నవల 'ప్రతాప ముదలిమార్‌చరిత్ర' (1879). మలయాళంలో తొలి నవల 'కుందలత (1887)' తొలి సాంఘిక నవల 'ఇందులేఖ' (1889). కన్నడలో 'కళావతిపరిణయ' (1815), 'సౌగంధికా పరిణయ' (1821), 'ముద్రామంజూష' (1823)లలో తొలినవల ఏది అన్న విషయంలో వివాదం ఉంది. అలాగే తెలుగులో కూడా కంబుకంధరచరిత్ర (1866), శ్రీరంగరాజుచరిత్ర (1872), రాజశేఖరచరిత్ర (1878) నవలలో తొలి నవల ఏది అన్న విషయంలో వివాదం ఉంది. కన్నడ విమర్శకులు కాలప్రమాణంగా 'కళావతిపరిణయ' (1815) రచనను నవలకి నాంది పలికిన రచనగా గుర్తిస్తున్నారు. తొలి సాంఘిక నవలగా కన్నడ విమర్శకులు 'ఇందిరాబాయి' (1899) నవలని గుర్తిస్తున్నారు. తెలుగులో కాలప్రమాణంగా మొదట వచ్చిన 'కంబుకంధర చరిత్ర' (1866) నేటికి అలభ్యం. తరువాత వచ్చిన 'శ్రీరంగరాజుచరిత్ర' (1872), 'రాజశేఖరచరిత్ర' (1878) నవలలలో కాల ప్రాతిపదికగా మొదట వచ్చిన 'శ్రీరంగరాజుచరిత్ర' తొలి సాంఘిక నవల అవుతుంది.

కందుకూరి వీరేశలింగం పంతులు గారు గోల్డ్‌స్మిత్ గారి వెకర్ ఆఫ్ వేక్ ఫీల్డ్ ద్వారా ప్రేరణ పొంది రాజశేఖరచరిత్ర రచించినట్లే వేదనాయగం పిళ్ళై గారు డా. జాన్‌సన్ రచనల నుండి ప్రేరణ పొంది 'ప్రతాపముదిలిమార్ చరిత్ర' రచించారు. అదే విధంగా ఒ. చందుమీనన్ గారు బెంజమిన్ డిస్రాయిల్ రచించిన హెన్రెట్టా టెంపుల్ (1836) నవల ద్వారా ప్రేరణ పొంది 'ఇందులేఖ' నవలని రచించారు. ఈ అంశాలు దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవలలకి ఆంగ్ల నవలలు మార్గ దర్శకంగా నిలిచిన విధానాన్ని తెలుపుతున్నాయి.

*****

## అధ్యాయం-2

# 2. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - రచయితలు - సామాజిక నేపథ్యం – తులనాత్మక పరిశీలన

### 2.1. గుల్వాడి వెంకటరావు

#### 2.1.1. జననం

గుల్వాడి వెంకటరావు క్రీ.శ.1844 లో జన్మించారు. గుల్వాడి వెంకటరావుగారి తండ్రి పేరు శేషగిరి. ఈయన గుల్వాడిగ్రామ వాసి. ఈ గుల్వాడి గ్రామం దక్షిణ కర్ణాటకలోని కుందాపురం తాలుకాలోగల గంగోళీ నదీ తీరంలో ఉంది. శేషగిరిరావుగారికి సుబ్బారావు, నాగప్పయ్య, మూడ్లగిరి, గణపయ్యల తరువాత ఐదవ సంతానంగా వెంకటరావుగారు జన్మించారు. వీరికి పార్వతి, అమ్మణి అనే ఇద్దరు సోదరీమణులు కూడ ఉన్నారు.

#### 2.1.2. విద్యాభ్యాసం, ఉద్యోగం

వెంకటరావుగారు మంగళూరులో తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ముగించుకొని, మద్రాసు విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. డిగ్రీని పొందారు. వెంకటరావుగారు పోలీసు శాఖలో ఉద్యోగిగా పనిచేసారు. వారు మంజీశ్వర, మంగళూరు, బంట్వాళ మొదలైన చోట్ల పనిచేసి ఉద్యోగ విరమణ పొందే సమయానికి పోలిస్ ఇన్స్పెక్టర్‌గా ఎదిగారు.

#### 2.1.3. రచనలు

గుల్వాడి వెంకటరావు గారికి పేరు తెచ్చిపెట్టిన నవల 'ఇందిరాబాయి' (1899). ఈ నవలతో పాటు వీరు 'భాగీరథి', 'సీమంతిని' అనే మరో రెండు నవలలని కూడా రచించారు. 'లాడుప్రియాచార్య', 'వేణమ్మ – నాగమ్మ సంవాదం' వీరి ఇతర కృతులు వీరు 'మిత్రోదయం' అనే పత్రికని కూడ నడిపారు.

#### 2.1.4. కుటుంబం

గుల్వాడి వెంకటరావు గారికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వారి ప్రథమ పుత్రుని పేరు దేవణ్ణ, రెండవ కుమారుని పేరు శివరాయ. కన్నడలో 1907లో మూడవ సామాజిక కాదంబరి రాసిన గుల్వాడి అణ్ణాజిరావు ఈయనికి సోదరుని వరుస అవుతారు.

### 2.1.5. సామాజిక స్పృహ

గుల్వాడి వెంకటరావు గారు ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. వీరు పోలీస్ అధికారి. సమాజంతో దగ్గరి సంబంధంగల ఉద్యోగం వీరిది, కాబట్టి సమాజంలోని అన్ని అంశాలను వీరు నిశితంగా పరిశీలించే వారు. వీరు ఇందిరాబాయి నవల రచించడానికి వీరిలోని సమాజ పరిశీలన ప్రధాన హేతువుగా పనిచేసింది. "గుల్వాడి వెంకటరావుగారు 'సారస్వతసమాజంలో' పనిచేశారు. సమాజంలోని విషయాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండేవారు. వీరు పనిచేస్తున్న సారస్వత సమాజంలో ఒక్కసారిగా విద్యాభ్యాసాది ఆధునిక ధోరణులు ప్రవేశించగానే పాత సంప్రదాయ వాదులు వాటిని వ్యతిరేకించారు. 'విధవ వివాహం' చేసుకున్నవారిని, 'సముద్ర ప్రయాణం' చేసిన వారిని అస్పృశ్యులుగా చూడసాగారు. వాళ్ళని 'మఠం' ద్వారా జాతి భ్రష్టులుగా ప్రకటించి సమాజంలో వాళ్ళతో పాటు సహపంక్తి భోజనం ఇత్యాది వ్యవహారాలను నిషేధించారు. దీన్ని ఎదిరిస్తూ ఇంకో కొత్త వాదం బయలుదేరింది. 1870లో ది. ఉళ్ళల రఘునాథయ్య, ది. రావ్ బహద్దూర్ కుద్మల్ రంగారావు (స్వామిఈశ్వరానంద) వంటి వారందరూ బ్రహ్మసమాజంలో చేరి సంఘ సంస్కరణకి పాల్పడ్డారు. హరిజనులతో సామూహికంగా స్వజనులతో సమానంగా ఉన్నత కులంవారుగా పిలువబడే సారస్వత బ్రాహ్మణులు సహపంక్తి భోజనాలు నడపసాగారు. దీనికి ఎదురొడ్డి నిలిచిన 'పంచ' అనే గృహస్తులు మఠం ద్వారా తమకు లభించిన అధికారం ద్వారా వాళ్ళందరిని జాతి నుండి బహిష్కరించారు. ఇదంతా సుమారు 1896 ప్రాంతంలో జరిగింది. (సారస్వత చిత్రాపుర మఠం అధికారిగా ఉన్న మహాగురు పరమహంస శ్రీమత్ పాండురంగ స్వామీజీ వారికి ఈ విషయంలో ఏం చేయాలో తోచలేదట). ఈ 'పంచ'కులు జాతి బహిష్కరణ నెపంతో తమ వైయుక్తిక స్వార్థాలను తీర్చుకొని దాని ద్వారా వచ్చే కళంకాన్ని మఠానికి అంటించారు. ఈ విషయం గుల్వాడి వారికి కోపాన్ని కలిగించింది. ఒక పక్క సమాజంలోని ఆందోళన, ఇంకో పక్క సమాజ సభ్యుల స్వార్థ సాధన, మరో పక్క సనాతన సంప్రదాయనికి ఆదర్శంగా నిలిచిన తన గురువు, మఠం. ఇదే నేపథ్యంతో గుల్వాడిగారి ఇందిరాబాయి నవల వెలువడింది". (వెంకటరావు, గుల్వాడి.1962: 11)

ఇందిరాబాయి నవల ఆవిర్భావం గురించి ఇందిరాబాయి నవల ముందు మాటలో సంతోష్ కుమార్ గుల్వాడి గారు చెప్పిన పై మాటలు గుల్వాడి వెంకటరావు గారు సమాజం పట్ల

ఎటువంటి వైఖరిని కలిగి ఉన్నారో తెలుపుతున్నాయి. సమాజంలో తన చుట్టూ జరుగుతున్న పరిస్థితులకు స్పందించి గుల్వాడి వెంకటరావుగారు ఇందిరాబాయి నవల రచించారు. నవల రచించడమే కాక తాను స్వయంగా సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. “1869లో మంగళూరులోని ఉమామహేశ్వర దేవస్థాన ప్రగతి పునరుద్ధరణ నిమిత్తం నిర్మించిన 25 గృహాల సముదాయంలో గుల్వాడి వెంకటరావు గారు తమదైన ప్రాత పోషించారు. మంగళూరులో గవర్నమెంట్ కాలేజి, జాతి బాంధవ హైస్కూల్ మూతబడే సమయంలో వాటిని పునరుద్ధరించారు. 1908లో గవర్నమెంట్ కాలేజిలోని హైస్కూల్ విభాగ తరగతులు మూసివేసే సమయంలో కొంతమంది పెద్దమనుషులతో కలిసి అప్పటి ప్రిన్సిపల్ అయిన హెచ్.ఎ.లార్డ్‌వర్‌తో గుల్వాడి వెంకటరావుగారు చర్చించి మూతపడే విద్యాలయాన్ని తిరిగి ప్రారంభించారు. ఇదే సందర్భంలో గణపతి స్కూల్ కూడా అవసాన దిశలో ఉండింది. గుల్వాడి వెంకటరావుగారు కుద్మల్ రంగ రాయునితో కలిసి ఈ పాఠశాలని కాపాడారు” (వెంకటరావు, గుల్వాడి.1962: 10) 69 సంవత్సరాలు జీవించిన గుల్వాడి వెంకటరావుగారు 1913లో మరణించారు.

## 2.2. నరహరి గోపాల కృష్ణమసెట్టి

నరహరి గోపాలకృష్ణమసెట్టి గారి గురించిన వివరాలు వారి పుత్రుడు, విజయనగర మహరాజైన శ్రీమద్ ఆనంద గజపతి ఆస్థాన విద్వాంసుడు అయిన “రాజామణిసెట్టి రాసిన” – “గోపాలకృష్ణమూర్తి శతకము”, గోపాలకృష్ణ దండకము” “మదీయజనకా గోపాలకృష్ణాగ్రణీ” మకుటంతో వారు రాసిన పద్యాల వలన తెలుస్తున్నాయి.

గోపాలకృష్ణమసెట్టి గారు నవల మాత్రమే కాక అనేక రచనలు చేశారు. ఇంగ్లీషులో ప్రావీణ్యం సంపాదించి ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ప్రజలకు సేవ చేశారు. ఈయన రచనలు, బాల్యం, ఉద్యోగ విషయాలు అన్ని రాజామణిసెట్టి శతక, దండకాలుగా రచించి తండ్రికి అంకితం ఇచ్చారు.

“రాజామణిసెట్టి స్వయంగా గొప్ప పండితుడు, సంగీత, ఆట పాటలలో మేటి. సమస్య పూరణంలో కూడామేటి. అనుభవ రసిక శతకము(1896), గణికా మణివిలాసము (1896),

బల్లాణరాజచరిత్ర (1890), శ్రీ వనకుమారి మహిమ, విజయనగర మహరాజ చరిత్ర, శ్రీ వనకుమారి పాతివ్రత్య మహాత్మ్యం (1896), గోపాలకృష్ణ దండకం (1889), సొద్దుకథ, లలితాలత విలాసము, గోపాలకృష్ణ శతకము, గణపతి చరిత్ర, మొదలైనవి వీరి రచనలు” (వీరభద్రారావు, కొత్తపల్లి.1986: 476).

ఇన్ని రచనలు చేసిన రాజామణి సెట్టిగారు తన తండ్రిని గురించి వివరాలు తెలుపుతూ దండకం, శతకాన్ని వెలువరించారు. ఈ వివరాలు గోపాలకృష్ణమసెట్టి గారి గురించి తెలుసుకోవడానికి ప్రధాన ఆకరాలుగా పని చేస్తున్నాయి.

### 2.2.1. జననం

*సీ. శ్రీలఁజెలంగెడు చెన్న పురంబున*
*భాసిల్లు నరహరి వంశమందు*
*ధీరుఁడై తనరిన తెన్న రంగయ్యకు*
*వేంకట లక్ష్మమాంబకు బుట్టి*
*యేఁబది యైదేండ్లు నింపుగానలరుచు*
*తన పేరునిల శాశ్వత ముగఁజేసి*
*వరసర్వధారి సంవత్సరమునను వైశాఖ*
*ముశుక్ల పక్షంబునందు*
*గీ|| షష్ఠి సౌమ్య వాసరమున సారసాప్తుఁ*
*దపరగిరి కేగినపుడు నీ వరగి తౌర*
*సకల భూపాల రింఛోళి చక్రవర్తి*
*క్షీర సత్కీర్తి గోపాల కృష్ణమూర్తి*
(గోపాలకృష్ణ మూర్తి శతకము)

(మోహన రామయ్య, ఎం.1983:82)

నరహరి గోపాలకృష్ణమసెట్టి గారు, నంద్యాల నగరములో ప్రఖ్యాతికెక్కిన నరహరి వారి కుటుంబంలో తెన్న రంగయ్య – వేంకటాంబలకు 1832లో జన్మించారు. వీరి బాల్యం, విద్యాభ్యాసంకు చెందిన వివరాలు పూర్తిగా లభించడం లేదు.

### 2.2.2. ఉద్యోగం

ఉపాధ్యాయుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన గోపాలకృష్ణమసెట్టి తన జీవితంలో ఎన్నో ఉన్నత పదవులను అలంకరించారు. వీరి సేవకు వారు పొందిన పదోన్నతులే తార్కాణం.

- ❖ 1857లో స్కూళ్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. 1859లో తెలుగు ట్రాన్స్‌లేటర్‌గా పనిచేశారు.
- ❖ 1861 వరకు నెల్లూరు కలెక్టరు ఆఫీసులో గుమాస్తాగా పనిచేశారు.
- ❖ 1863లో వేంకటగిరిలో సబ్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వహించారు. 9.2.1863 నుంచి 25.7.1863 వరకు మార్కాపురం తహసీల్దార్‌గా పనిచేశారు.
- ❖ 1866లో పత్తికొండ తహసీల్దార్‌గా కొంతకాలం పనిచేశారు.
- ❖ 23.12.1866 హుజుర్ సిరస్తాదార్‌గా కర్నూలులో పనిచేశారు.
- ❖ 15.2.1867 ఖజానా డిప్యూటీ కలెక్టరుగా కర్నూలులో పనిచేశారు.
- ❖ 15.3.1867 నుంచి 11.4.1867 వరకు డిప్యూటీ కలెక్టరు ఖజానా, కర్నూలు, రిజిస్ట్రార్ ఆఫ్ అష్యూరెన్సస్ కర్నూలులో పనిచేశారు.
- ❖ 15.4.1867లో తహసీల్దార్ రమాల్‌కోట.
- ❖ 9.8.1867 ఖజానా డిప్యూటీ కలెక్టరు, రిజిస్ట్రారు కర్నూలు.
- ❖ 14.1.1869 4వ తరగతి డిప్యూటీ కలెక్టరు. 18.4.1869 – 18.6.1874 వరకు సెలవు.
- ❖ సెలవు ముగిసిన తరువాత 1.4.1875 వరకు 3వ తరగతి డిప్యూటీ కలెక్టరుగా ఉన్నారు.
- ❖ 8.10.1875 న 3వ తరగతి డిప్యూటీ కలెక్టరుగా ఎన్నిక.
- ❖ 1.7.1879 ఖజానా డిప్యూటీ కలెక్టరు, కర్నూలు.
- ❖ 7.7.1879 – 2.10.1879 వరకు డిప్యూటీ కలెక్టరు, నంద్యాల.
- ❖ 3.10.1879 – 4.11.1879 సెలవు.
- ❖ 5.11.1879 తాత్కాలిక డిప్యూటీ కలెక్టరు, కర్నూలు.
- ❖ 27.1.1879 – 16.1.1880 ఖజానా డిప్యూటీ కలెక్టరు, కర్నూలు.
- ❖ 15.10.1880 కర్నూలు మండలంలోని ప్యాపల్లిలో ప్రభుత్వ పర్యవేక్షకుడు.
- ❖ 7.7.1881 నుండి 6.10.1881వరకు సెలవు
- ❖ 23.1.1882 న 2వ తరగతి డిప్యూటీ కలెక్టరుగా ఎన్నిక.

❖ మార్చి 1886 వరకు డిప్యూటీ కలెక్టరు మన్నారుగుడి, తంజావూరు జిల్లా.

1886 ఏప్రిల్ 10న ఉద్యోగ విరమణ.

ఈ ఉద్యోగ వివరాలు, తేదీలు *"Hisotry of Services of Gazetted Officers in the Civil Department, Serving in the Madras Presidency"* అనే గ్రంథంలో ఉన్నాయి. (మోహన రామయ్య, ఎం. 1983: 83, 84)

ఈ పదవులు గోపాలకృష్ణమ సెట్టి గారి ఉద్యోగ నిబద్ధతికి నిదర్శనాలు. ఆయన తాను పనిచేసిన ప్రతీ పదవికి వన్నె తెచ్చారు. ఈయన కృషిని గుర్తించి అధికారులు పదోన్నతులు ఇచ్చారు. ఈయన అతి తక్కువ కాలంలో పదోన్నతులు పొందినట్లు రాజమణిసెట్టి గారు 'గోపాలకృష్ణ' దండకంలో వివరించారు.

'వెంకటగిరిలో' సబ్‌మెజిస్ట్రేట్‌గా గోపాలకృష్ణమసెట్టి ఉన్నప్పుడు వెంకటగిరి ప్రభువు ఈయన సేవలను మెచ్చి మంత్రిగా నియమించుకొనడానికి ప్రయత్నించారు. "వీరు ఎక్కడ జమిందారి కొలువులో చేరిపోతారో అని భయపడి ప్రభుత్వం వీరిని 'మార్కాపురం' తహశీల్దారుగా (25-07-1863) బదిలీ చేసింది". (వీరభద్రరావు, కొత్తపల్లి.1986: 480). ఈ సంఘటన ఆయన ఎంత నిబద్ధతతో తన పదవులని నిర్వహించారో తెలుపుతుంది.

### 2.2.3. రచనలు

*"అర్థ గౌరవమెప్పు నాంధ్ర భాషను రంగరాజు చరితంబు రచన చేసి*
*కందనోల్బాగోళముందె నుంగించి యాంధ్రంబున వ్యాకరణంబుచేసి*
*హూణ భాషను కందనోలిమాన్యులును ప్రభువులు మెచ్చంగఒరగజేసి*
*శేషకవీంద్ర రచిత రంగరాజ చరిత్రమునకు నీవు కృతి పతిత్వ*
*మొంది కాదంబరి తెలుంగు నందు జేయ*
*తలఁపు గొని తివిలేదయ్యె దైవబలము*
*సకల భూపాలరింఛోళి చక్రవర్తి*
*క్షీర సత్కీర్తి గోపాలకృష్ణమూర్తి"*

(వీరభద్రారావు, కొత్తపల్లి.1986: 476)

ఈ గద్యం గోపాలకృష్ణమసెట్టి గారి రచనా పటిమను తెలియ చేస్తున్నది. గోపాలకృష్ణమసెట్టి శ్రీ రంగరాజు చరిత్రనే కాక ఇంకా అనేక రచనలు చేశారు. రచనలు రచించడమేకాదు, కొన్ని కృతులకు కృతి భర్తగా కూడ ఉన్నారు. "కర్నూలు భూగోళము". "శ్రీరంగరాజుచరిత్ర" (1872) వీరిప్రసిద్ధ గ్రంథాలు. గోపాలకృష్ణమసెట్టి గారు పరవస్తు చిన్నయసూరి సమకాలికులు. సూరిగారు *A Manual of Hindu Law* అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేయునపుడు వారికి సెట్టిగారు సహాయకులుగా ఉన్నారు. చిన్నయసూరి గారి 'బాల వ్యాకరణం' మాదిరిగా గోపాలకృష్ణమసెట్టిగారు కూడ ఒక వ్యాకరణం రాసి దానికి 'బాలవ్యాకరణం' (1874) అని పేరుపెట్టారు. సంస్కృత కాదంబరిని తెలుగు అనువాదం చేయడానికి ప్రయత్నించి మధ్యలో వదిలిపెట్టారు. 1887లో "కందనోలి కైఫియత్తులను" ఆంగ్ల భాషలో *"Kurnool Manual"* గా రచించారు. ఈ *"Kurnool Manual"* గ్రంథానికి ఆనాటి ఆంగ్లేయ ప్రభుత్వం వెయ్యి రూపాయలు బహుమానంగా ఇచ్చినట్లు గోపాలకృష్ణ దండకంలో కలదు. గిద్దలూరు శేషకవి తాను రాసిన "రంగరాజు చరిత్రను" సెట్టి గారికి అంకితం ఇచ్చారు. ఆంగ్లం, తెలుగుభాషపై పట్టు ఉండటం గోపాలకృష్ణమసెట్టి ఇన్ని రచనలు చేయడానికి మూలకారణం.

### 2.2.4. పత్రికల నిర్వహణ

గోపాలకృష్ణమ సెట్టిగారికి "క్రెసెంట్" పత్రికతో ప్రత్యేక్ష సంబందాలు ఉన్నట్లుగా రాజామణిసెట్టి గోపాలకృష్ణ దండకంలో రాసారు. "..ఆంగ్ల భాషా పరిజ్ఞానముజెంది. బ్రౌణాజ్ఞకు బ్రీతింగ్రెసెంట్పత్రికం నాంగ్లేయభాషల బ్రకాశింపగా జేసి...." అని తమ తండ్రికి బ్రౌను దొర ఆజ్ఞ వలన క్రెసెంట్ అనే ఇంగ్లీషు పత్రికతో సంబంధం ఉన్నట్లు రాసారు. ఈ "క్రెసెంట్" పత్రికని ఆనాడు మద్రాసులో గాజుల లక్ష్మీనర్సుసెట్టి స్థాపించారు.

"హిందూ దేశస్తులను సమున్నత స్థితికి దెచ్చుటయే" ఆశయంగా 'క్రెసెంట్' పత్రిక మొదటి సంచికను లక్ష్మీనర్సుసెట్టి 1844 అక్టోబర్ 2వ తేదీన వెలువరించారు. ఈ క్రెసెంట్ పత్రికను లక్ష్మీనర్సుసెట్టి ప్రారంభించడానికి పూర్వం నారాయణ స్వామి నాయుడు మద్రాసులో 'సర్క్యులేట్' అనే పత్రికని నిర్వహిస్తుండేవారు. లక్ష్మీనర్సుసెట్టి గారు దానిని కొని 'క్రెసెంట్'గా మార్చి 'హర్లే' అనే ఆంగ్లేయుని దానికి సంపాదకులుగా నియమించి పత్రికా నిర్వహణ

ప్రారంభించారు. బ్రౌన్ దొర ఆజ్ఞ ప్రకారం (1855) గోపాలకృష్ణమసెట్టి 'క్రెసెంట్' పత్రికా నిర్వహణలో పాలుపంచుకున్నారు.

### 2.2.5. లంచం - వ్యతిరేకత

గోపాలకృష్ణమసెట్టిగారు లంచాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తాను లంచం తీసుకోలేదు. తన శాఖలోని ఉద్యోగులు కూడా లంచం తీసుకోకుండా జాగ్రత్తపడ్డారు. లంచం పట్ల ఈయన వ్యతిరేక వైఖరిని కనబరచడం వల్ల ఈయన స్వభావం నచ్చని కొందరు పై అధికారులకు ఆకాశరామన్న ఉత్తరాలు రాసినట్లు వాటిని కలెక్టరు లెక్కచేయనట్లు రాజమణిసెట్టి గారు గోపాలకృష్ణ దండకంలో రాసారు.

*"అవ్వేళ లంచంబు లందీయఁగా లేక తాపంబునం జెందు నా దుర్జను ల్వేగ*
*నాకాశరామన్న జాబుల్విశేషంబు జిల్లాధికారుండు వీక్షింపగా జేయగా నాతఁడవార్త*
*లందుండు నైజంబు వెరచించి యా చీటులం దాను లెక్కింపకచో నినున్మెచ్చుడే.."*

(వీరభద్రరావు, కొత్తపల్లి 1986: 478)

ఇదే అంశంను గోపాలకృష్ణ మూర్తి శతకంలో కూడా వివరించారు.

*"లాలించె ప్రజలచే లంచాలుగైకొని బుద్ధిమంతులు బొలుచునట్టి*
*జనహింసకులనెల్ల జక్కగాఁ బరికించి మర్దిమ్పుగా వారు మంద బుద్ధి*
*దమకుఁదొడగునట్టి కుమతులతోఁ గూడి నీమీద లేనిపోని యవివేక*
*వ్యవహారములఁ బన్ని యవివేకులను పేరు బడసి నిందిత వృత్తిబరగుచుండ*
*నౌర! నీ చరితం బెన్న నజునివశమె*
*రాజమాత్రుండవే నీవు రాజ వినుత!*
*సకల భూపాల రింఛోళి చక్రవర్తి*
*క్షీర సత్కీర్తి గోపాల కృష్ణమూర్తి"*

(వీరభద్రరావు, కొత్తపల్లి.1986: 478).

### 2.2.6. సంఘసేవ

గోపాలకృష్ణమసెట్టి గారు లంచం తీసుకోకుండా ప్రజలకు తన సేవలను అందించడంతో పాటు తాను అధికారిగా పనిచేసిన పలు ప్రాంతాలలో స్వయంగా కొన్ని సంఘసేవ కార్యక్రమాలను నిర్వహించారు.

"మార్కాపురములో వీరు పనిచేసే సందర్భంలో బాలుర విధ్యాభ్యాసానికి పాఠశాల కట్టించారు. హుజూరు సిరస్థిదారుగా కర్నూలులో ఉన్నప్పుడు ఈయన నిర్వహించిన సంఘసేవ కార్యక్రమాల గురించి గోపాలకృష్ణ దండకంలో ఉంది. కర్నూలులో ఉన్నపుడు 'మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్‌గా' నగర పారిశుద్య కార్యక్రమాల్లో ఈయన చూపిన శ్రద్ధకి 'మున్సిపల్ మెంబర్లు' రాజవీధికి ఈయన పేరుపెట్టారట, అక్కడ ఈయన పాఠశాలని ఏర్పరచడమేకాక 1876-77 సంవత్సరాలలో కరువు వచ్చినపుడు ప్రజలని ఆదుకున్నారు. గోపాలకృష్ణమసెట్టిగారు కరువులో పేదలని ఆదుకున్న విషయం గోపాలకృష్ణ శతకంలో ఉంది. ".... క్షామంబునం, జాల కష్టంబునుం జెందు వారిందగం బ్రోవవే...." అన్న వాక్యాలు వీరు కరువు సమయంలో ప్రజలను ఆదుకున్నారని తెలుపుతున్నాయి. (వీరభద్రరావు, కొత్తపల్లి 1986 : 481).

'గోపాలకృష్ణమసెట్టిగారు తాను మార్కాపురంలో పనిచేసే సందర్భంలో స్థానిక కేశవస్వామి బ్రహ్మోత్సవాలలో స్వామిని నానాసునాళి మాలలతో సేవించడంతో పాటు ఆ ఉత్సవాలకి వచ్చే ప్రజలకు సకల సదుపాయాలు కల్పించేవారు. స్వామి పూజార్థము భుధానం కూడా ఇచ్చారు. ప్రతీ సంవత్సరం జరిగే ఉత్సవాల నిమిత్తం సత్రాలని కట్టించారు. బాటసారుల కొరకు చెట్లు నాటించి చెరువులు తవ్వించారు'. (మోహన రామయ్య. ఎం. 1983: 87, 88).

### 2.2.7. మరణం

గోపాలకృష్ణమసెట్టి గారి మరణం గురించి 'గోపాలకృష్ణమూర్తి శతకంలో' రాజమణిసెట్టి పేర్కొన్నారు.

*"శ్రీఁజెలంగెడు చెన్నపురంబున బాసిల్లు నరహరి వంశమందు*
*ధీరుడై తనరిన తెన్న రంగయ్యకు వేంకట లక్షమాంబకునుబుట్టి*
*యెఁబదియైదేండ్లు నింపుగా నలరుచు తన పేరునిల శాశ్వతముగఁజేసి*

*వర సర్వధారి (1888) సంవత్సరమునను వైశాఖము శుక్లపక్షంబునందు*

*షష్ఠి సౌమ్య వాసరమున సారసాప్తుఁ*

*డపరగిరి కేగినపుడునీ వరిగి తార*

*సకల భూపాలరింఛోళి చక్రవర్తి*

*క్షీర సత్కీర్తి గోపాలకృష్ణమూర్తి"*

(వీరభద్రరావు, కొత్తపల్లి 1986: 482)

ఈ వాక్యాలు గోపాలకృష్ణమసెట్టి గారు యాభై ఐదేళ్ళు జీవించి 1888లో మరణించినట్లు తెలుపుతున్నాయి. అంటే గోపాలకృష్ణమసెట్టి గారు తాను పదవీవిరమణ చేసిన (1888 – ఏప్రిల్–10) సంవత్సరంలోనే పరమపదించారు.

## 2.3. వేదనాయగం పిళ్ళై

### 2.3.1. జననం

వేదనాయగంపిళ్ళై పూర్తి పేరు 'మాయూరం సామివేలు వేదనాయగంపిళ్ళై'. వేదనాయగంపిళ్ళై తిరుచిరపల్లి జిల్లాలోని కుళత్తూర్ అనే గ్రామంలో అక్టోబర్ 11, 1826న జన్మించారు. వీరి తండ్రి సవరిముత్తుపిళ్ళై. తల్లి ఆరోగ్య మేరి అమ్మాళు. వీరు శైవ వేళాల కులానికి చెందన వారు. వీరి పూర్వీకులైన మదురైనాయగంపిళ్ళై కత్తోలిక మతం స్వీకరించినందు వల్ల వీరు క్రైస్తవులయ్యారు.

### 2.3.2. విద్యాభ్యాసం

వేదనాయగంపిళ్ళై పుట్టుకతోనే ప్రతిభావంతుడు. పదకొండు సంవత్సరాల వయస్సులోనే పెక్కు తమిళ గ్రంథాలను చదివాడు. తనకు పదో ఏడు వచ్చే వరకు వీధి బడిలోనే చదువుకున్నాడు. ఆ రోజుల్లో ఆంగ్ల భాష రానిదే ప్రభుత్వ కొలువు అసాధ్యం. దీనిని గ్రహించిన సవరిముత్తుపిళ్ళైగారు తన కుమారుడైన వేదనాయగంపిళ్ళై గారిని ఆంగ్ల భాష అభ్యాసం నిమిత్తం తిరుచిరపల్లిలో 'త్యాగరాజ పిళ్ళై వద్ద చేర్పించారు. ఈ 'త్యాగరాజ పిళ్ళై' తమిళ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. ప్రభుత్వ న్యాయస్థానంలో అనువాదకులుగా పనిచేశారు. ఈయన వద్ద వేదనాయగం పిళ్ళై గారు తమిళం, ఆంగ్లంలను నేర్చుకున్నారు.

### 2.3.3. ఉద్యోగం

చదువు పూర్తైన తరువాత వేదనాయగం పిళ్ళై గారు తిరుచిరపల్లిలోని కోర్టులో 'రికార్డు కీపరుగా' (1848) ఉద్యోగంలో చేరారు. ఈ ఉద్యోగం చేస్తున్న క్రమంలోనే పదోన్నతి పొంది కొంతకాలం ప్రభుత్వ అనువాదకులుగా పనిచేశారు. ఆ తరువాత ఆంగ్లేయ ప్రభుత్వం న్యాయమూర్తుల కోసం జరిపిన ఎంపికలో ఉత్తీర్ణులై 'శీర్కాళి'లో కొంతకాలం పనిచేశారు. తన 30వ ఏట మాయూవరం జిల్లా మునుసబుగా సమర్థవంతంగా పనిచేసి 1872లో పదవీ విమరణ పొందారు. వదవీ విరమణ అనంతరం వీరు కొంతకాలం 'మాయూవరం' పురపాలక సంఘ అధ్యక్షులుగా కూడా పనిచేశారు.

### 2.3.4. కుటుంబ జీవితం

"వేదనాయగం పిళ్ళైగారి కుటుంబ జీవితం అంత సాఫీగా సాగలేదు. కట్టుకున్న భార్యలు వెంట వెంటనే అకాల మరణం చెందడం వలన వీరు ఐదు పర్యాయాలు పెళ్లి చేసుకోవలసి వచ్చింది. మూడవ భార్య ద్వారా వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి కలిగారు." (జయప్రకాశ్, ఎస్ (అ). 2008: 9). వేదనాయగం పిళ్ళై మృదు స్వభావి. తాను క్రైస్తవమతం స్వీకరించినా ఇతర మతస్థులతో కూడా స్నేహభావంతో ఉన్నారు. "ఆనాటి శైవ మతాయాయులైన పండితులు పలువురు ఆయన మిత్రకోటిలో ప్రముఖులు. మహా విద్వాన్ మీనాక్షి సుందరం పిళ్ళై వద్ద ఆయన తమిళ కావ్యాలు అధ్యయనం చేశారు. మీనాక్షి సుందరం పిళ్ళై మహాపండితుడు, పరమశైవుడు. ఆయన 16 స్థల పురాణాలు, 14 అంతాదులను వెలయించిన విద్వాంసుడు. వేదనాయగం పిళ్ళై లోని సౌజన్యాన్ని ప్రశంసిస్తూ 'కుళ్లత్తూర్ కోవై' అనే రచన చేసిన సహృదయుడు." (రాధాకృష్ణశర్మ, చల్లా. 1978: 13).

"శైవమఠాధిపతులైన సుబ్రహ్మణ్య దేశికర్‌పై వీరు అనేక స్తోత్రగీతాలు రచించారు. మాయూరం మున్సుబుగా ఉన్న వేదనాయాగం పిళ్ళై చాలా సార్లు తిరువాడుతురై మఠానికి రావడం కద్దు. వచ్చినపుడంతా వారు (మఠాధిపతులైన) శ్రీ సుబ్రహ్మణ్య దేశికర్ మీద స్తోత్రగీతాలు రాస్తుండేవారు. సులభ సుందరమైన శైలిలో, భావలాలిత్యంతో వినేవారి హృదయాలకు హత్తుకునేలా వారి పద్యాలు ఉండేవి' అని స్వామినాధఅయ్యర్ వేదనాయాగం పిళ్ళైగారిని ప్రశంసిచారు". (జయప్రకాశ్, ఎస్. 2008:10). ఈ రెండు ఉదాహరణలు తొలుత

వేదనాయగం పిళ్ళై గారు భక్తి సాహిత్యం రచించి తరువాత లౌకిక సాహిత్యంవైపు మళ్లారని తెలుపుతున్నాయి. "తొలినాళ్లలో 'అంతాదులతో' స్తోత్రగీతాలతో చంద:బద్ధ రచన చేసిన వేదనాయగం పిళ్ళై గారు ఇలాంటి చందోబద్ధ రచనలు నలుగురికి సుబోధకంగా ఉండవనే ఉద్దేశంతో నవలా రచనకి పూనుకున్నారు". (రాధాకృష్ణశర్మ, చల్లా. 1978: 15).

### 2.3.5. రచనలు

తమిళ నవలా సాహిత్యం వేదనాయగం పిళ్ళై గారి 'ప్రతాపముదిలియార్ చరిత్ర'తో మొదలౌతుంది. 1879 ఆగస్టు 23వ తేదీన వెలువడిన ఈ నవల తరువాతి తమిళ నవలలకు మార్గదర్శకమైంది. ఈయన ప్రతాపముదిలియార్ చరిత్ర నవలతో పాటు "సుగుణసుందరి చరిత్రం" అనే ఇంకో నవలని కూడా రచించారు. ఇది 1887లో వెలువడింది. బాల్య వివాహాల వల్ల ఏర్పడే దుష్పరిణామాలను ఇందులో చిత్రించారు. ఈ రెండు నవలలనే కాక సమాజ అభివృద్ధిని కాంక్షించి పదహారుకు పైగా గ్రంథాలను వేదనాయగం పిళ్ళై గారు రచించారు.

i) నీతి, న్యాయం, నిజాయితీ, సత్ప్రవర్తన మొదలైన సద్గుణాలు మానవ జీవితానికి అవసరమని తెలుపుతూ 'నిదినూల్' (1859) అనే పుస్తకం రచించారు.

ii) ఆదర్శ జీవితం, సమాజంలో మెలగవలసిన పద్ధతులు, కుటుంబ జీవితం గురించి చెబుతూ పద్యాలతో ఒక పుస్తకాన్ని 1858లో వెలువరించారు.

iii) 1862లో సిద్ధాంత సంగ్రహం అనే పుస్తకాన్ని రచించారు.

iv) ఆనాటి స్త్రీల స్థితిగతులను, సమాజంలో వారు అనుభవిస్తున్న కష్ట, నష్టాలను తెలియజేస్తూ పద్యాలు, కీర్తనలను రచించారు. వీటిని 'పెణ్‌మదిమాలై" (స్త్రీల మేధా సంపత్తి) అనే పేరుతో ఒక సంకలన గ్రంథంగా 1869లో ప్రకటించారు.

v) స్త్రీలకు పురుషులతో సమానంగా విద్యను అందిస్తే వారు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తారని తెలుపుతూ పెణ్‌మణమ్ (1869), పెణ్‌కల్వీ (1869) అనే పుస్తకాలను రచించారు.

vi) సంగీత శాస్త్రంలో ప్రవేశం కలిగిన వేదనాయగం పిళ్ళై గారు ఎన్నో కీర్తనలను రచించారు. 'దేవతోత్తర మాలై' అనే క్రైస్తవ ప్రార్థనాగీత సంపుటిని వెలువరించారు. 'తిరువరుళ్ మాలై' (1873), 'సరసమయ సమరస కీర్తనగాళ్' (1877) వీరి సంగీత సాహిత్యానికి తార్కాణాలు.

vii) 'తిరువరుళ్ అన్తాది' (1873), 'పెరియనాయగి అమ్మన్ పదిగమ్' (1873), 'సత్తియవేదకీర్తణై' (1889), 'తనిప్ పాడల్‌గళ్' (1889), 'శోభనపాడల్ గళ్' (1889),

‘తయాపర కన్నిత్’ (1889), ‘కొచ్చగప్పా’ (1889), ‘బొమ్మెకల్యాణం’ (1889) వీరి ఇతర రచనలు.

8) వీరు 1805 నుండి 1863 వరకు గల ఆంగ్ల భాషలోని న్యాయస్థాన తీర్పులను తమిళంలోకి అనువదించారు. న్యాయస్థాన తీర్పులకి సంబంధించిన తొలి తమిళ రచన ఇది.

### 2.3.6. సామాజిక స్పృహ

ఆంగ్లేయపాలన వల్ల తమిళ సమాజంలో వచ్చిన మార్పులని వేదనాయగం పిళ్ళై గారు తమ రచనలో పొందుపరిచారు. అంతే కాక తనకు రచనలు చేయడానికి పురికొల్పిన అంశాలను ప్రతాప మదిలయార్ చరిత్ర ముందుమాటలో పేర్కొన్నారు. “తమిళంలో వచన గ్రంథాలు లేవనేది అందరూ అంగీకరించిన విషయమే. ఈ లోపాన్ని గురించి అందరూ చింతిస్తున్నారు. ఈ లోటును తొలగించే ఉద్దేశంతోనే ఈ కల్పనా గ్రంథాన్ని రాయడానికి ముందుకు వచ్చాను. అంతే కాక అంతకు ముందే నేను రచించి, ప్రచురించిన నీతి గ్రంథం ‘పెణ్‌మదిమాలై’, ‘సమరసకీర్తనం’ ఆదిగాగల పుస్తకాలలో ప్రచురితమైన నీతి సూత్రాలకు ఉదాహరణలు చూపించడానికి ఈ నవల రచించాను” (జయప్రకాశ్, ఎస్. 2008:5). ఈ వాక్యాలు వేదనాయగం పిళ్ళైగారు అంతకు ముందు తాము రచించిన గ్రంథాలకు కొనసాగింపుగా ప్రతాప ముదిలియార్ చరిత్ర రచించినట్లు స్పష్టం చేస్తున్నాయి. పిళ్ళైగారు ప్రతాప ముదిలియార్ చరిత్రకి పూర్వం రచించిన రచనలలో వస్తువు సాంఘికం, (భక్తి, అంతాది గీతాలు, పాటలు మినహా) ఈ రచనలలో స్త్రీల అభ్యున్నతి ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది. అప్పటి సమాజానికి అవసరమైన సూచలని ఇస్తూనే సమాజాన్ని రచనలో పొందుపరిచే పనిని వేదనాయగం పిళ్ళై గారు చేశారు. ఈ విధంగా రచనల ద్వారా మాత్రమే కాక ప్రత్యక్షంగా కూడా ఆయన సామాజిక సేవలో పాలు పంచుకున్నారు. “1876-80 ప్రాంతాల్లో దేశాన్ని సంక్షోభపరిచిన భయంకరమైన క్షామం కారణంగా లక్షలాది ప్రజలు ఆకలితో అలమటించారు. ఆ సందర్భంలో పిళ్ళైగారు తమ యావత్ శక్తినీ వినియోగించి పేద ప్రజలను ఆకలి రక్కసి కొరల నుండి కాపాడారు. పలు చోట్ల గంజి కేంద్రాలను తెరచి ప్రజలకు సేవ చేశారు. సాధారణంగా దైవస్తుతి తప్ప నరస్తుతి చేయని సుప్రసిద్ధ కవి గోపాలకృష్ణ భారతిగారు పిళ్ళైగారి మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ “నీయే పురుషమేరు...” అనే కీర్తనను రచించారంటే వారి మహోన్నత వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుస్తుంది”. (జయప్రకాశ్, ఎస్ (అ). 2008:12)

వేదనాయగం పిళ్ళై గారు జిల్లా మునుసబుగా పనిచేసినా ఏనాడు అన్యాయాన్ని సహించలేదు. లంచం పట్ల వ్యతిరేక వైఖరిని ప్రదర్శించారు. తాను మునుసబుగా ఉన్న రోజులలో రచించిన పాటలను గమనిస్తే పిళ్ళై వారి మనోవేదన అర్థమవుతుంది.

*"గొంతు చించుకొనుచూ*
*కీచులాడే వకీళ్లు*
*చెంత కూర్చుండి, మనల*
*చిత్ర వధ చేయుచుండ*
*చింతించుట వీలగునా*
*చిన్మయ రూపుని గురించి*
*చింతింప భారమా మనసా*
*చేతులు లేనివాడు వాదిని పట్టుకొనెనట*
*రెండు కాళ్లు లేనివాడు తన్నెనట*
*పాటపాడు వేదనాయకన్ వినెనట!"*

మరో పాటలో కూడా ఆయన మనోవేదన వ్యక్తమౌవుతుంది.

*"పోదుం పోదుం ఉద్దియోగ గమనమే – ఇదిల్*
*ఏదు సుకం సమక్కు – మనమె*
*ఎన్ద నేరముం ఓయాద వేలై – ఇదిల్*
*ఎన్న పెట్రోం ముత్తు మాలై...*
*"చాలు చాలునీ ఉద్యోగ – భోగం – ఇందులో*
*మనకేమి సుఖం మనసా*
*ఎల్లవేళలా తీరని పని – ఇందులో*
*మనకేమి లభించినది*
ఆ ఉద్యోగం ఒక యంత్రం – అందులో
*నలిగే చెరుకుగాడలం మనం*
*సుబ్బయ్యగారేమో అబద్దాల పుట్ట – ఆ*
*సుందరయ్యారు కేసు దోషాల గుట్ట"*

(రాధాకృష్ణశర్మ, చల్లా.1978: 16)

న్యాయసమ్మతంగా తీర్పునిచ్చే వరం నాకు ప్రసాదించు. వచ్చే కక్షిదారుల మనస్సుని మాటలతో గాయపర్చకుండా కింది ఉద్యోగస్తులతో అనవసరంగా గొడవ పడకుండా కేసు విచారణలో అలసట కలగకుండా ఉండేటట్లు అనుగ్రహించమని ఆ ప్రభువును ఈయన అర్థించాడు. జాతిభేదాలు ఉండరాదని పిళ్ళైగారి అభిప్రాయం. ఈ అంశాలు ఆయనలోని సేవాభావానికి నిదర్శనాలు.

## 2.3.7. లంచంపట్ల వ్యతిరేకత

"లంచం తీసుకునే అధికారులను ఖండిస్తూ అధిక్షేప పాటలను వేదనాయాగం పిళ్ళైగారు రచించారు. దొంగలు అమావాస్య చీకటినాడే దొంగతనం చేయుదురట. కొందరధికారులు పగలు కూడా కొల్లగొట్టుదురట. దొంగలు దొరికి వీరి ముందు విచారణకి వచ్చినపుడు వారు పెక్కు దినములు కూర్చిన ధనమును వీరొక దినములో లాగుకొందురట. దొంగల దగ్గర నుండి కూడ దొంగలించుటకు సమర్థులట కొందరధికారులు. కొందరు నేరుగా లంచము తీయక తమయిండ్లలో పెక్కు విధములయిన యుత్సవములు, వేడుకలు, పూజలు జరిపి యచట బహుమానములు పొందుదురట." (వరదరాజన్. ము, 1982: 285) ఈ మాటలు వేదనాయగం పిళ్ళై గారి కాలంనాటి లంచగొండి తనానికి నిదర్శనాలు. ఈ లంచగొండి తనాన్ని వేదనాయగంపిళ్ళై గారు వ్యతిరేకించారు.

## 2.4. ఒ. చందుమీనన్

### 2.4.1. జననం

చందుమీనన్‌గారి తండ్రి ఎటపటి ఒయత్ చందునాయర్ ఒక జ్యూడీషియల్ అధికారి. వారు కొట్టాయం తాలుకా పినరయి  సబ్ డివిజన్‌లో ఉన్న 'కెలలూర్ దేశంలో' జన్మించారు. అప్పుడు పాఠశాల సౌకర్యాలు తక్కువ. అయినా చందునాయర్‌గారు మలయాళంతో పాటు ఇంగ్లీషు భాషని నేర్చుకున్నారు. చందునాయర్‌గారు 'తెల్లిచెర్రి' కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేశారు. వారి పనితనాన్ని మెచ్చి ప్రభుత్వం వారికి అతి తక్కువ కాలాంలోనే పదవీ ఉన్నతి కల్పించింది. 1837లో వారు మెజిస్ట్రేట్‌గా పనిచేశారు. ఆ తరువాత మూడు సంవత్సరాలకే తహసిల్దారుగా ఎన్నికై 'మలబార్' ప్రాంతంలోని చాలచోట్ల పనిచేశారు.

చందునాయర్‌గారికి రెండు పర్యాయాలు వివాహం అయ్యింది. రెండవ భార్య పార్వతి అమ్మ వల్ల ఐదుగురు పిల్లలు పుట్టారు. ఈ ఐదుగురు పిల్లలలో చిన్నవాడు చందుమీనన్. చందుమీనన్ 9 జనవరి, 1847లో జన్మించారు. యాభై రెండవ ఏట చందునాయర్ మధుమేహ వ్యాధితో మరణించారు. చందునాయర్ గారు 'తెల్లిచెర్రి'లో తహసిల్‌దారుగా ఉన్నప్పుడు ఒక ఇంటిని కొని దాన్నే తమ శాశ్వత నివాసంగా మార్చుకున్నారు. చందుమీనన్ గారు పది సంవత్సరాల ప్రాయంలో ఉండగా వారి తండ్రి మరణించారు. అప్పటి నుండి వారు తమ తల్లి పార్వతి అమ్మ సంరక్షణలో పెరిగారు.

### 2.4.2. విద్యాభ్యాసం

'కోరన్ గురుక్కళ్' అనే వ్యక్తి చందుమీనన్ గారికి తొలుత కొన్ని పాఠాలు చెప్పారు. పండిత కుంజునంబియర్ చందుమీనన్‌గారి బాల్య గురువు. ఈయన వద్ద చందుమీనన్‌గారు కవిత్వం, నాటకం, వ్యాకరణం నేర్చుకున్నారు. ఇదే సమయంలో కె. కుంజన్ మీనన్ వద్ద ఇంగ్లీషు పాఠాలను నేర్చుకున్నారు. ఈ కుంజన్ మీనన్‌గారు తెల్లి చెర్రి సివిల్ కోర్టులో ఆంగ్ల అనువాదకుడిగా ఉండి తరువాత సబ్ జడ్జీ అయినారు. చందుమీనన్‌గారు తెల్లిచెర్రిలో ఉన్న బెసెల్ మిషన్ పార్సీ మెమోరియల్ స్కూల్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. చందుమీనన్‌గారు మెట్రిక్యులేషన్ చదువుతున్న రోజులలో వారి తల్లి మరణించింది (1864). దానితో వారు పాఠశాల మానివేయాల్సి వచ్చింది.

### 2.4.3. ఉద్యోగం

పదిహేడు సంవత్సరాల ప్రాయంలో చందుమీనన్‌గారు ఉద్యోగ వేటని ప్రారంభించారు. తెల్లిచెర్రిలో చిన్న చిన్న వివాదాలు పరిష్కరించే కోర్టులో చందుమీనన్ గారు గుమాస్తా ఉద్యోగం కొరకు దరఖాస్తు చేసుకోగా వీరిని మౌఖిక పరీక్ష నిర్వహించిన జడ్జీ టి.ఆర్. షర్పే చందుమీనన్ గారి తెలివితేటలకు ఆశ్చర్యపడి ఆరోతరగతి గుమాస్తాగా తెల్లిచెర్రి సివి కోర్టులో నియమించారు.

చందుమీనన్‌గారు తెల్లిచెర్రిలో మూడు సంవత్సరాలు పనిచేశారు. అప్పుడే వీరి తెలివితేటలు సబ్ కలెక్టర్ వరకు వెళ్లాయి. దానిని విన్న సబ్ కలెక్టర్ చందుమీనన్‌గారికి మూడవ

తరగతి గుమాస్తాగా పదవీ ఉన్నతిని కల్పిస్తూ తన కార్యాలయంలో నియమించారు. ఆ తరువాత అక్కడ చందుమీనన్‌గారు ఒకటవ తరగతి గుమాస్తాగా పనిచేశారు.

జస్టిస్ టి.ఆర్. షర్ఫేగారు కాలికట్ డిస్ట్రిక్ జడ్జీగా 1872లో నియమితులైన తరువాత చందుమీనన్‌గారిని ప్రధాన గుమాస్తాగా సివిల్‌కోర్టులో నియమించారు. 1875వ సంవత్సరం చందుమీనన్‌గారి జీవితంలో చరగని ముద్ర వేసిన సంవత్సరం. ఈ సంవత్సరంలో చందుమీనన్‌గారి గుమాస్తా జీవితం అంతమైంది. పదోన్నతి పొంది చందూ మీనన్‌గారు 1875వ సంవత్సరంలో పట్టాంబి ప్రాంత యాక్టివ్ మున్సిఫ్‌గా నియమితులయ్యారు. మున్సిఫ్‌గా చందుమీనన్ గారు యంచేరి, పాల్ఘాట్, ఒట్టప్పాలం, కాలికాట్ మొదలైన ప్రాంతాలలో పనిచేశారు. 1886 నుండి 1892 వరకు ఈయన 'పరప్పనంగడి' జిల్లా మున్సిఫ్‌గా పనిచేశారు. ఆ తరువాత 1890లో తన ఇందులేఖ నవలని ముద్రించారు. చందుమీనన్‌గారు ఎక్కడ పనిచేసినా తన పైఅధికారుల మన్నన్నలను పొందారు.

'షర్ఫే' మాత్రమే కాక 'డ్యూమర్గ్' మరియు 'డేనిస్' వంటి అధికారులు చందుమీనన్ గారి బుద్ధి చతురతని మెచ్చుకున్నారు. ఇలా చందుమీనన్ సేవలని మెచ్చుకున్న అధికారులు అందరూ ఆయనకంటే పెద్దవారు, మరియు ఆంగ్లేయులు అవి ఆంగ్లేయ నిరంకుశ పాలన కొనసాగుతున్న రోజులు. ఈ ఆధికారులు కేవలం చందుమీనన్‌గారు మిగతా గుమాస్తాల కన్న ఉత్తమంగా పనిచేయడం, వారు చెప్పింది చెప్పినట్టు రాసుకోవడం వంటి కారణాల వల్ల మెచ్చుకోలేదు. చందుమీనన్ లోని సూక్ష్మపరిశీలనాదృష్టి, పరిశోధనా కోణం, చురుకైన న్యాయనిర్ణయ స్వభావం, స్వంత నిర్ణయ క్రమం, ఉత్సాహం వారిని ఆకట్టుకున్నాయి. చందుమీనన్ జిల్లా మున్సిఫ్‌గా గొప్ప పేరు తెచ్చుకున్నారు. అంతేకాక మలబార్ ప్రాంతంలో ఉన్న గొప్ప పరిశోధకునిగా, చట్టాన్ని అమలుపరిచిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. అందుకే 1809లో నియమించబడ్డ మలబార్ మ్యారేజ్ కమీషన్‌లో చందుమీనన్‌గారు, టి.ముత్తుస్వామి అయ్యర్, శ్రీ.సి.శంకరన్ నాయర్‌లతో పాటు సభ్యునిగా నియమితులయ్యారు. ఈ కమీషన్‌ను 'మరుమక్కతాయం' కుటుంబంలోని వివాహ వ్యవస్థలో రావలసిన మార్పులను సూచించడానికి నియమించారు.

చందుమీనన్ తెలివి తేటలని గుర్తించిన ప్రభుత్వం 1892లో ఆయన్ని సబ్ జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ తెన్నెవెలైలో నియమించింది. ఇక్కడే చందుమీనన్ తమ అసంపూర్ణ 'శారద' అనే నవలని ప్రారంభించారు. ఇక్కడి నుండి సబ్ జడ్జీగా 1893లో బదిలీపై మంగళూరు వెళ్లారు. ఇక్కడ చందు మీనన్  ఎక్కువ కాలం పనిచేయలేదు. ఆయనకి ధనుర్వాతం రావడం వల్ల సెలవు తీసుకున్నారు. ఇతర కారణాల వల్ల తాను రచిస్తున్న 'శారద' నవలని కూడా ఆపివేశారు.

చందుమీనన్ పనిచేసిన అన్ని శాఖలలోని ఉన్నతాధికారులు అతని తెలివి తేటలను మెచ్చుకున్నారు. ఒక గొప్ప ప్రజ్ఞావంతునిగా అతన్ని గుర్తించారు. 1892లో చందుమీనన్ గారికి అప్పటి ఇంగ్లాండ్ ప్రధానమంత్రి డబ్ల్యు.ఇ. గ్లాడ్‌స్టోన్ నుండి ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో విక్టోరియా రాణి చందుమీనన్ గారు 'ఇందులేఖ', 'శారద' నవలలను రచించి మలయాళ సాహిత్యాన్ని తద్వారా భారతీయ సాహిత్యాన్ని పరిపుష్టం చేసినందుకు గాను వారిని మెచ్చుకుంటున్నట్లు ఉంది. భారత ప్రభుత్వం 1897లో చందుమీనన్ గారికి 'రావ్‌బహదూర్' బిరుదుతో సత్కరించింది. మద్రాసు యూనివర్సిటీ చందూ మీనన్ గారి ప్రజ్ఞను గుర్తించి 1898లో వారిని లా డిగ్రీ పరీక్షలకు పరీక్షకునిగా నియమించింది. ఆ తరువాత చందుమీనన్ గారిని మద్రాసు యూనివర్సిటీ 'యూనివర్సిటీ ఫెలో'గా నియమించింది.

### 2.4.4. రచనలు – సాహిత్యాభిరుచి

మలయాళ సాహిత్యంలో చందుమీనన్ 'ఇందులేఖ', 'శారద' నవలలను రచించి తన ముద్ర వేశారు. ఈ రెండింటితోనే ఆయన సాహిత్య కృషి ఆగిపోలేదు. 'కేరళవర్మ వలియ కోయిల్ తంబురాన్' పద్యాలంటే చందుమీనన్‌గారికి ఇష్టం. అంతేకాక వీరు తంబురన్ (కేరళ కాళిదాసు) గారి 'మయూర సందేశం' రచనని ముద్రించారు. వాటిని ఉచితంగా తన స్నేహితులకు పంచిపెట్టారు. 'కుంజి శంకరన్ నంబియార్' గారు రచించిన 'నారిచరితం' అనే రచనని కూడా తన సొంత డబ్బులతో ముద్రించి దానికి ముందుమాట కూడా రాశారు. ఈయన పత్రికా ముఖంగా తన వ్యాసాలను కూడా ప్రచురించారు. సాహిత్య రంగంలో వీరి కృషిని గురించి పి.కె. పరమేశ్వరన్ నాయర్ గారు 'ఆధునిక మలయాళ సాహిత్యం'లో చందుమీనన్ గారిని గొప్పవారిగా పేర్కొన్నారు. వీరు ఇంగ్లీషులో చేసిన రచనలు 'అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ ఇన్

అనిసెంట్ టైమ్స్' మొదలైన వాటిని శ్రీ టి. ముత్తుస్వామి అయ్యర్ మెమోరియల్ కమిటీ పుస్తక రూపంలో ప్రచురించింది.

"చందుమీనన్‌గారికి 'కేరళ వర్మ వలయకోయిల్ తంబురాన్' గారి రచనలంటే మక్కువ ఎక్కువ. తంబురాన్ గారు 'అక్బర్' అనే డచ్ మూల నవలని ఇంగ్లీషు అనువాదం ఆధారంగా మలయాళంలో రచించారు. చందుమీనన్‌గారు ఈ మలయాళ అనువాదాన్ని చూసినపుడు నవ్వుకునేవారు. ఈ అనువాదంలో తంబురాన్‌గారు సంస్కృతంతో కూడిన మలయాళ భాషని అధికంగా వాడారని, ఈ పుస్తకం సంస్కృతం–మలయాళ డిక్షనరీ సహాయంతో మాత్రమే చదవగలమని చందుమీనన్ గారి ఆక్షేపణ. చందుమీనన్‌గారు నవలలోని భాష సామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా ఉండాలని తలచారు. కాని 'అక్బర్' నవలలోని భాష అందుకు భిన్నంగా ఉండడం వల్ల దానిని విమర్శించారు. అప్పటికే మలయాళ సాహిత్యంలో, కేరళవర్మ తంబురాన్‌కి గొప్ప పేరుంది. మలయాళ రచయితలలో ఆయనకి ప్రత్యేక స్థానం ఉంది. చందుమీనన్‌గారికి తంబురాన్‌గారి 'మయూరసందేశం' అంటే మిక్కిలి ప్రీతి. ఇంట్లో తనకు ఖాళీ సమయం దొరికినప్పుడల్లా కేరళవర్మ రచనలను, పద్యాలను చందుమీనన్‌గారు చదివేవారు. చీకటిలో దారి తెలియని పరిస్థితులలో కేరళ వర్మ గారి రచనలు కాంతిని ప్రసరింప చేసి మార్గాన్ని చూపిస్తాయని చందుమీనన్‌గారు అన్నారంటే ఆయనకి కేరళవర్మ రచనలంటే ఎంత అభిమానమో అర్థమవుతుంది". (శంకర మీనన్, టి.సి. 1997: 17, 18). ఈ సంభాషణ వల్ల రెండు అంశాలు తెలుస్తున్నాయి. చందుమీనన్‌గారికి సాహిత్యం అంటే అభిమానం. దానితోపాటు సాహిత్య రచనల నిర్మాణం పట్ల వారికి ఒక అభిప్రాయం బలంగా ఉంది. రచన ఏదైనా అంతిమంగా అది పాఠకుల వద్దకు చేరి వారిని అలరించాలని చందుమీనన్‌గారు కోరుకున్నారు. అందుకే కేరళవర్మ రచనలు తాను అమితంగా గౌరవించినా వారి 'అక్బర్' నవలని విమర్శించారు.

'ఇందులేఖ' నవలని చందుమీనన్‌గారు ముద్రించి మలయాళ సమాజానికి పరిచయం చేసే సందర్భంలో నవల ముందుమాటలో పేర్కొన్న అంశాలు గమనించదగ్గవి. "ఇలాంటి రచనని మన ప్రజలు ఎలా పరిగణిస్తారో తెలియదు. ఇంగ్లీషు రాని వారికి ఈ రకమైన రచన చదివే అవకాశం లేదు. సాహిత్యపరంగా ఈ నవల వారికి తొలి అనుభవంతో కూడిన రచన.

దీనిని వారు ఆదరిస్తారో? లేదో? ఇంతకు ముందు నవల కళాత్మక విలువల గురించి నేను పేర్కొన్న అంశాలనే ఈ నవల ద్వారా పాఠకుల ముందు ఉంచుతున్నాను. దీని సమర్థత పాఠకులే నిర్ణయిస్తారు" (శంకరమీనన్, టి.సి. 1997: 18).

ఈ మాటలు చందుమీనన్‌గారి ఆచరణాత్మక ప్రవృత్తికి నిదర్శనం. తాను 'కేరళవర్మ' గారి 'అక్బర్' నవలని విమర్శించి ఆగిపోలేదు. తాను నవల ఎలా ఉండాలో తెలుపడానికి తాను అనుకున్న విధంగా 'ఇందులేఖ' నవలని రాసి పాఠకుల ముందుకి తెచ్చారు. నవల మంచిదా కాదా అన్న విషయాన్ని పాఠకులకే వదిలివేశారు. 'ఇందులేఖ' నవల వెలువడిన కొద్దిరోజులకే ఎక్కువ ప్రచారాన్ని పొందింది. ఇది ఆయన నవల సఫలీకృతం అయ్యిందనడానికి నిదర్శనం.

చందుమీనన్‌గారికి కథకళి సాహిత్యంలో పరిచయం ఉండేది. వారు సంస్కృతం, మలయాళం, ఇంగ్లీషు భాషలను నేర్చుకున్నారు. చదువుపట్ల వారికి అభిరుచి మెండుగా ఉండేది. చందుమీనన్‌గారు తన ఆలోచనలను తన ఆత్మీయ స్నేహితులతో ఎప్పటికప్పుడు పంచుకునేవారు. వారి స్నేహితులు కూడా చందుమీనన్‌గారు చెప్పేకథలను వింటూ వారిని ప్రోత్సహించేవారు. చందుమీనన్‌గారు సంస్కృతం నేర్చుకొనడమే కాకుండా సంస్కృతాన్ని అమితంగా గౌరవించేవారు. సంస్కృతం మన పూర్వ సంస్కృతిని తెలుసుకోవడానికి మరియు అలంకార అభివ్యక్తి, రసపూర్ణ రచనలను తెలుసుకోవడానికి తోడ్పడుతుందని వారి అభిమతం. ఇంగ్లీషు భాషని కూడా వారు గౌరవించారు. ప్రాపంచిక విషయాలను తెలుసుకోవడానికి ఇంగ్లీషు భాష తప్పనిసరి అని నొక్కి వక్కాణించారు.

చందూ మీనన్ గారికి కథకళి అంటే అమితప్రేమ. వారు ఆ కళని ఆదరించారు. కథకళి ప్రదర్శన కారులు వారి నివాసం చుట్టుపక్కల గుళ్లలో ఎక్కడ ప్రదర్శన నిర్వహించినా వారిని తన ఇంటికి ఆహ్వానించేవారు. చందుమీనన్ గారికి వివిధ నాటకాలలో నచ్చిన కొన్ని దృష్యాలుండేవి. వాటిని ప్రదర్శించమని ఆ కళా బృందాలను కోరేవారు. ఈ సంఘటన చందుమీనన్ గారి కళాపోషణకి నిదర్శనం.

### 2.4.5. కుటుంబ జీవనం

"1872లో ఇరవై ఐదవ ఏట చందుమీనన్‌గారికి వివాహం జరిగింది. 'కంజోలి' కుటుంబానికి చెందిన లక్ష్మీకుట్టి అమ్మతో వీరి వివాహం జరిగింది. అప్పుడు లక్ష్మీకుట్టి అమ్మకి 13 సంవత్సరాల వయస్సు. మధ్య కేరళ 'ఇరింజలకుడ' కూడల మాణిక్యం దేవస్థానానికి సంబంధించిన అధికారి 'వరచ్చత్' కుటుంబానికి చెందిన కృష్ణమీనన్ కూతురు లక్ష్మీకుట్టియమ్మ. కృష్ణమీనన్ గారి భార్య 'కంజోలి' కుటుంబానికి చెందినది. లక్ష్మీకుట్టి అమ్మ, చందుమీనన్ లకు ఐదుగురు అబ్బాయిలు మరియు ఒక అమ్మాయి. అరవైఏడు సంవత్సరాల వయస్సులో లక్ష్మీకుట్టి అమ్మ మరణించింది. లక్ష్మీకుట్టి అమ్మకి సంగీత సాహిత్యాలపై మక్కువ ఎక్కువ. చందుమీనన్‌గారి ఆదరాభిమానాలను చూరగొని భర్త అభిరుచికి తగినట్లుగా లక్ష్మీకుట్టి అమ్మ నడుచుకున్నారు. చందుమీనన్‌గారు 'ఇందులేఖ' నవలని రచించడం వెనుక లక్ష్మీకుట్టి అమ్మ ప్రోత్సాహం ఉంది. అందుకే మలయాళ సాహిత్యాభిమానులు లక్ష్మీకుట్టి అమ్మని స్మరిస్తారు. చందుమీనన్ గారు తన నవలని ఆంగ్లంలోకి అనువాదం చేసిన డుమెర్గ్ గారికి ఉత్తరం రాస్తూ అందులో తాను మలయాళంలో నవల రచించడానికి కారణాలను తెలుపుతూ "ఆంగ్ల శైలి తరహాలో మలయాళంలో రచించబడ్డ నవలని చదవాలని తనకు ఆశగా ఉందని నా భార్య పదే పదే అడగడం కూడా ఒక కారణం" అని చెప్పారు.

చందుమీనన్‌గారు తన కుటుంబ సభ్యులతోను, స్నేహితులతోను సంతోషకరమైన జీవనం గడిపారు. వారి వ్యక్తిత్వం ఆకర్షణీయంగాను, వారి గుణ, శీలాలు కుతూహలంతో కూడి మనస్సును ఆకట్టుకొనే విధంగా ఉండేవి. వారు శారీరకంగాను, మానసికంగాను ఉన్నత వ్యక్తిత్వం కలవారు. ఆరు అడుగుల ఆజానుభాహుడు. ఎత్తుకి తగ్గ దేహపుష్టికలవారు. చందుమీనన్‌గారు నవ్వుతూ ఎదుటి వారిని నవ్విస్తూ చలాకీగా ఉండేవారు. ఈ చలాకీతనం వల్లే చందుమీనన్ గారి 'ఇందులేఖ' నవలలో మనకి హాస్యరస సంభాషణలు కనిపిస్తాయి. చందుమీనన్ గారు హాస్యప్రియులు. ఒక పర్యాయం తన స్నేహితులలో ఒకరు చందుమీనన్ గారికి వారి కుమార్తెను గురించి అడగగా, తాను తన కుమార్తెను 'పాట్టం'కు ఇచ్చినట్లు సమాధానం చెప్పారు. ఈ 'పాట్టం' అనే పదానికి మలయాళంలో 'అద్దెకిచ్చు' అనే అర్థం ఉంది. చందుమీనన్‌గారు తన కూతురుని 'పాట్టిదిల్' ఇంటికి ఇచ్చారా లేక అద్దెకిచ్చారా అన్నదితనను ప్రశ్నించిన స్నేహితునికే వదిలేశారు.

ఈ విధంగా పద చమత్కారంతో మాట్లాడడం చందుమీనన్ గారికి అలవాటు. ఆయనకి పొట్ట ఉండేది. ఒకపర్యాయం వారు తమకి కోటు కుట్టించుకోవడానికి ఒక దర్జీ వద్దకి వెళ్లగా అతనికి కొలతలు తీసుకోవడం కష్టమైంది. ఆ దర్జీవాడు ఏం చేయాలో అర్థం కాక "సార్ ఈ టేపు ఒక కొసను మీరు పట్టుకోండి రెండవ కొసతో మిమ్మల్ని చుట్టి వస్తాను" అన్నాడు. ఆ మాటలకు చందుమీనన్ గారు కోప్పడక తాను ఒక కొసని పట్టుకొని సహకరించడమే కాక, వచ్చేటప్పుడు ఒక రూపాయిని బహుమానంగా ఇచ్చారు.

చందుమీనన్‌గారు పరిష్కరించిన ఒక డప్పుకొట్టే వాడి కేసు వారికి గొప్పపేరు తెచ్చిపెట్టింది. ఆయన కాలికాట్‌లో సబ్ జడ్జీగా ఉన్నప్పుడు 'డేవిడ్స్' జిల్లా జడ్జీగా ఉన్నారు. వీరిద్దరు ఒకే భవనంలో పక్క పక్క గదులలో తీర్పులు విచారించేవారు. 'డేవిడ్స్' సున్నితమైన స్వభావం కలవాడు. తాను కేసు వినేటప్పుడు చిన్న శబ్దం కూడా కానిచ్చే వారు కాదు. తన పట్టుని వదిలేవాడు కాదు. కింది అధికారులకు డేవిడ్స్ అంటే హడల్. డేవిడ్స్ గురించి విన్న చందుమీనన్‌గారు ఎలాగైనా అతనికి గుణపాఠం చెప్పాలనుకున్నారు. సమయం కోసం ఎదురు చూడసాగారు. ఇంతలో తన కోర్టులో ఒక మద్దెర వాయించే వాడి కేసు విచారణకి వచ్చింది. ఒక పండుగలో ఈ మద్దెర వాయించే వాడికి తక్కువ డబ్బు ఇచ్చారని మిగతా అన్ని చోట్లా అతనికి అంతకన్నా ఎక్కువ ఇస్తారని కాబట్టి అతనికి న్యాయం చేసి తగిన పారితోషకం ఇప్పించాలని ఆర్జీదారుని మనవి. ఇది వినగానే చందుమీనన్ గారి మెదడులో ఒక ఆలోచన వచ్చింది. 'మద్దెర వాయించే వాడికి న్యాయం, డేవిడ్స్‌కి గుణపాఠం చెప్పడానికి ఇదే సరైన సమయం అనుకొని కోర్టులో నిర్వహించాల్సిన కార్యక్రమాలన్ని నిర్వహించి తాను ఇప్పటికిప్పుడు ఈ మద్దెర వాయించే వాడిపూర్తి ప్రదర్శన చూడాలని ఆజ్ఞాపించాడు. ఆ మద్దెర వాయించేవాడు తన ప్రదర్శన చేస్తుండగా ఆ శబ్దాలకు ఉలిక్కిపడ్డ డేవిడ్స్ తన పనులను ఆపి చందుమీనన్ వద్దకు వచ్చారు. అప్పుడు చందుమీనన్ గారు తాను తీర్పు చెప్పేముందు ఈ మద్దెర వాయించే వాడి సామర్థ్యం చూడనిదే నా తీర్పులో న్యాయం ఉన్నట్టు నేను భావించలేనని చెప్పారు. ఈ మాటలు విన్న డేవిడ్స్ ఏం మాట్లాడాలో తెలీక నవ్వుతూ చందుమీనన్ గారిని చూసి మీరు అసాధారణ న్యాయమూర్తులని మెచ్చుకున్నారు. ఈ సన్నివేశం జరిగింది బ్రిటీష్ పరిపాలనా కాలంలో, అందులోను ముంగోపి అయిన ఒక జడ్జీ తన పక్క గదిలో తీర్పు చెబుతుండగా చందుమీనన్

గారు ఇటువంటి మద్దెల చప్పుడుతో కూడిన ప్రదర్శన నిర్వహించారంటే ఆయన ధైర్యం ఎటువంటిదో అర్థం అవుతుంది.

ఒక సందర్భంలో ఒక ధనవంతుని ఇంట్లో ఒక గొప్ప కార్యక్రమం జరుగుతుండగా వచ్చిన అతిథులు సరదాగా మాటలాడుతున్నారు. వారి సంభాషణ లంచం వైపు మళ్లింది. అక్కడ ఉన్న ఒక అధికారి 'అందరూ లంచాలు తీసుకుంటారు' అనగా అక్కడికి వచ్చిన అధికారులు తమ తమ అభిప్రాయాలను చెబుతున్నారు. అక్కడే ఉన్న చందుమీనన్ ఒక్క ఉదుటున తాను కూర్చున్న చోటు నుండి లేచి "ఎప్పటికీ లంచం తీసుకొని ఒక వ్యక్తి ఇక్కడ ఉన్నాడు. అతనే ఒయాత్ చందూ" అని గట్టిగా అరచి కూర్చున్నాడు. అక్కడి వాతావరణం ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారింది. చందుమీనన్ తనకేమి తెలీదు అన్నట్లు తన ముందు ఉన్న పదార్థాలను తినడం ప్రారంభించాడు. అందరూ చందుమీనన్ గారిని ఆశ్చర్యంతో చూసి కొద్దిగా నవ్వుకొని ఊరుకున్నారు". (శంకర మీనన్, టి.సి. 1997: 17).

చందుమీనన్‌గారు అరమరికలు లేని జీవితం గడిపారు. ఎదుటివారు కూడా అలాగే ఉండాలని తలచారు. ఇందుకు ఆయన జీవితంలో జరిగిన ఒక సంఘటనని ఉదాహరణగా చెప్పవచ్చు. "ఒకరోజు ఒక అపరిచిత యువకుడు సహాయం కోసం చందుమీనన్ వద్దకి వచ్చాడు. చందుమీనన్‌గారు కూర్చోమని చెప్పగానే ముందూ వెనకా ఆలోచించకుండా చందుమీనన్ ముందు కూర్చున్నాడు. వచ్చిన పని ఏమిటని చందుమీనన్ అడగగా, తాను తడుముకోకుండా సూటిగా తనకు క్యారెక్టర్ (వ్యక్తిత్వ) సర్టిఫికెట్ కావాలని చెప్పాడు. ఆ యువకునితో అంతకుముందు చందుమీనన్ గారికి పరిచయం లేదు. అతన్ని చందుమీనన్ చూడడం అదే మొదటిసారి. చందుమీనన్ అతని ప్రవర్తనకి కోపించి ఉండవచ్చు. కానీ అలా చేయక అతనితో మాట్లాడి అతని పూర్తివివరాలు తెలుసుకుని అతనికి కావలసిన సర్టిఫికేట్ ఇచ్చి పంపించారు. ఒక అపరిచిత వ్యక్తికి మీరు సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని అతని స్నేహితుడు చందుమీనన్‌గారిని అడగగా "ఓ అదా! ఆ యువకుడు నా మీద ఎంతో నమ్మకంతో ఇంత దూరం వచ్చాడు. పైగా తాను వచ్చిన విషయాన్ని మొహమాటం లేకుండా చెప్పాడు. అందుకే ఇచ్చాను" అన్నారు. (శంకరమీనన్, టి.సి. 1997: 17).

### 2.4.6. మరణం

1899లో చందుమీనన్ గారు మరణించారు. 1899 సంవత్సరం శుక్రవారం సెప్టెంబర్ 7వ తేదీన రోజూమాదిరిగానే తన కోర్టు వ్యవహారాలు ముగించుకొని ఇంటికి వచ్చారు. అప్పటికే తనని కలవడానికి వచ్చిన మిత్రుణ్ణి పలకరించి అతనితో కోర్టు వ్యవహారాలను ముచ్చటించడం ప్రారంభించారు. మీనన్‌గారికి కొంచెం అస్వస్థతగా అనిపించి తన పడకగది వైపుగా కదిలారు. అకస్మాత్తుగా పడిపోయారు. చందు మీనన్ గారి స్నేహితుడు తట్టి లేపినా లేవలేదు. అప్పటికే ఆయన మరణించారు.

## 2.5. తులనాత్మక పరిశీలన

ఈ రచయితలందరూ సమకాలంలో జీవించారు. 1826 నుండి 1919 మధ్య కాలంలో ఈ రచయితలు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ ప్రాంతాలలో జీవించారు. పుట్టినది మొదలు గిట్టేవరకు వీరి జీవితంలో జరిగిన సంఘటనలలో సామ్యం కనిపిస్తుంది.

### 2.5.1. జననం

గోపాలకృష్ణమసెట్టిగారు అప్పటికే ప్రసిద్ధిచెందిన నరహరి వారి కుటుంబంలో జన్మించారు. వేదనాయగం పిళ్ళై గారు పూర్వం శైవులుగా ఉండి తరువాత క్రైస్తవులుగా మారిన సవరిముత్తుపిళ్ళై కుటుంబంలో జన్మించారు. చందుమీనన్ గారి తండ్రి చందుమీనన్ గారు జన్మించే కాలానికే ఒక జ్యుడీషియల్ అధికారి. ఈ అంశాలు రచయితల జనన కాలంనాటి వారి సామాజిక స్థాయికి నిదర్శనాలు. అప్పటి పరిస్థితులలో వీరు సామాజికంగా ఉన్నతంగా ఉన్న కుటుంబాలలో  జన్మించడం వీరి తరువాతి జీవితంలోని విద్యాభ్యాసం, ఉద్యోగం వంటి సంఘటనలకి నేపథ్యంగా నిలిచింది. వీరు జన్మించిన ప్రాంతాలు వేరైనా వీరి కుటుంబ నేపథ్య పరిస్థితులలో కొంత సామ్యం ఉంది. వారి పూర్వికుల సామాజిక స్థాయి, ఆర్థిక స్థితిగతులు, చదువు విలువ తెలిసి ఉండటం వంటి అంశాలలో ఈ సామ్యం కనిపిస్తుంది. చందుమీనన్, గోపాలకృష్ణమసెట్టి, గుల్వాడి వెంకటరావు, వేదనాయగం పిళ్ళై గార్లకు బాల్యంలో వీరు ఎదగడానికి కావలసిన ఆర్థిక వనరులను వారి తల్లిదండ్రులు అందించారు. ఫలితంగా బాల్యంలో వీరి విద్యాభ్యాసానికి మార్గం సుగమమైంది. ఈ విద్యార్జన మీద ఆధారపడి వీరి ఉద్యోగజీవితం, కుటుంబజీవితం, సామాజిక సంస్కరణ జీవితం రూపుదిద్దుకున్నది. ఈ రచయితలు స్వీయచరిత్రని రచించలేదు అందువల్ల వీరి జీవిత వివరాలు పూర్తిగా

తెలియడంలేదు. వారి జీవిత విశేషాలు అరకొరగా వారి కుమారులు రాసిన రచనలు, లేదా తమరచనలకి తాము రాసుకున్న ముందు మాటల వల్ల తెలుస్తున్నాయి. తెలిసినంత వరకు వీరి అందరి జీవిత సంఘటనలలో సామ్యం కనిపిస్తుంది. వీరి జీవిత సంఘటనలలోని సామ్యం నాటి సామాజిక పరిస్థితులకి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వీరి జీవనకాలం, వీరి జీవితాలను గురించి తెలుసుకోడానికి ఉపకరించే ఆధార గ్రంథాలను ఈ పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

| క్ర.సం. | రచయిత. | జీవనకాలం. | ప్రాంతం. | ఆధారం. |
|---|---|---|---|---|
| 1 | గోపాలకృష్ణమసెట్టి | జననం:10.04.1822<br>మరణం: 1888 | నంద్యాల గ్రామం,<br>కర్నూలుజిల్లా.<br>ఆంధ్రప్రదేశ్. | రాజామణిసెట్టి<br>రచనలు. |
| 2 | గుల్వాడివెంకట<br>రావు | జననం: 1844<br>మరణం: 1913 | దక్షిణ కర్ణాటక,<br>కుందాపురంతాలుక,<br>గుల్వాడిగ్రామం,<br>కర్ణాటక. | ఇందిరాబాయి<br>నవలకి<br>సంతోష్‌కుమార్<br>గుల్వాడి రాసిన<br>ముందు మాట |
| 3 | వేదనాయగంపిళ్ళై. | జననం:<br>11.10.1826<br>మరణం:<br>21.07.1889 | తిరుచురుపల్లి,<br>జిల్లా, కుళుత్తురు,<br>గ్రామం,తమిళనాడు. | ‘ప్రతాపముదలి<br>యార్ చరిత్ర’<br>ముందుమాట. |
| 4 | ఒ.చందుమీనన్ | జననం:<br>09.01.1847<br>మరణం:<br>07.09.1899 | కొట్టాయం తాలుక<br>కెలలూర్ దేశం, కేరళ | శంకరమీనన్<br>రచనలు. |

### 2.5.2. విద్యాభ్యాసం

ఈ రచయితలందరూ మొదట తమ మాతృ భాషలోని సంప్రదాయ విద్యను అభ్యసించి తరువాత ఆంగ్లం నేర్చుకున్నారు. చందుమీనన్ గారు మొదట మలయాళంలో కవిత్వం, నాటకం వ్యాకరణం నేర్చుకొని ఆంగ్ల భాషలో విద్యాభ్యాసం చేసారు. బెసిల్ మిషన్‌పార్సి మెమోరియల్ స్కూల్లో ఉన్నత విద్యని నేర్చుకున్నారు. గుల్వాడి వెంకటరావుగారు, ప్రాథమిక విద్యని కన్నడంలో నేర్చి మద్రాసులో బి.ఎ. పూర్తిచేశారు. వేదనాయగంపిళ్ళై గారు మొదట తమిళంలో గ్రంథాలను పూర్తిగా చదివి ఆంగ్లభాష అధ్యాయనం నిమిత్తం తిరుచునపల్లి వెళ్ళారు. చందుమీనన్ గారు చిన్నప్పుడు కుంజన్ నంబియర్ వద్ద ఆంగ్ల పాఠలను నేర్చుకున్నారు. ఈ అంశాలు 1826–1919 మధ్య కాలంలో దక్షిణ భారతదేశంలో ఆంగ్ల విద్యకి ఉన్న ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాయి. ప్రాంతీయ భాషలు ఎన్ని వచ్చినా ఆంగ్లం రానిదే నాడు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేది కాదు. అందుకే వేదనాయాగంపిళ్ళై గారి తండ్రి ఆంగ్లభాష అభ్యాసం నిమిత్తం వేదనాయగంపిళ్ళై గారిని తమిళం ఆంగ్లం తెలిసిన త్యాగరాజ పిళ్ళై వద్ద చేర్పించారు. ఈ రచయితలందరు నాటి కాలంలో ఉన్నతవిద్యను అభ్యసించారు.

### 2.5.3. ఉద్యోగం

ఈ రచయితలందరు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారు. తెల్లి చర్రి కోర్టులో గుమాస్తాగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన, చందుమీనన్ గారు తెన్నివెలై సబ్‌జడ్జిగా పదవీవిరమణ పొందారు. తిరుచిరపల్లి కోర్టులో రికార్డు కీపరుగా (1848) తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన వేగనాయగంపళ్లై గారు జిల్లా మున్సిఫ్‌గా పదవీవిరమణ చేశారు. గుల్వాడి వెంకటరావు గారు పోలీసుశాఖలో పనిచేశారు. గోపాలకృష్ణమసెట్టి గారు స్కూళ్ళ డిప్యూటీ ఇన్సిపెక్టర్ (1857)గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణ పొందారు ఈ విధంగా ఈ రచయితలందరూ న్యాయశాఖతో సంబంధం ఉన్న ఉద్యోగాలు చేశారు.

### 2.5.4. పత్రికా నిర్వహణ

ఈ రచయితలకు  పత్రికలతో ప్రత్యేక్ష, పరోక్ష సంబంధం ఉంది. గుల్వాడి వెంకటరావుగారు 'మిత్రోదయం' అనే పత్రికని నడిపారు. చందుమీనన్ గారు తమ వ్యాసాలను పత్రికాముఖంగా ప్రకటించారు. గోపాలకృష్ణమసెట్టి గారికి 'క్రెసెంట్' అనే పత్రికతో ప్రత్యేక్ష

సంబంధం ఉంది. ఈ అంశాలు పత్రికల ప్రారంబ కాలంలో రచయితలకు పత్రికలతో ఉన్న సంబందానికి నిదర్శనాలు.

### 2.5.5. లంచం - వ్యతిరేకత

ఈ రచయితలందరూ తాము పనిచేసిన శాఖలలో లంచగొండితనాన్ని వ్యతిరేకించారు. మునుసుబుగా పనిచేసిన గోపాలకృష్ణమసెట్టి గారు లంచగొండ్ల పాలిట సింహస్వప్నంగా నిలువగా జిల్లా మునుసుభుగా పనిచేసిన వేదనాయగం పిళ్ళై గారు లంచగొండ్లను ఖండిస్తూ అధిక్షేప రచనలు చేశారు. చందుమీనన్ గారు ఒక వివాహ కార్యాక్రమంలో అందరిముందు బాహాటంగా తాను లంచగొండిని కాదని ప్రకటించారు. ఈ అంశాలు బ్రిటీషుపాలన కాలంలో ఉన్న లంచగొండితనానికి నిదర్శనాలు.

### 2.5.6. రచనలు

ఈ రచయితలు తొలి సాంఘిక నవలతో పాటు నాటిసాంఘిక జీవనానికి దర్పణంగా నిలిచే రచనలు కూడా చేశారు. ఈ రచయితలు తాము తొలి సాంఘిక నవలని రచించడానికి తమని ప్రేరేపించిన పరిస్థితులని చాలా స్పష్టంగా పేర్కొన్నారు.

1) వేదనాయగం పిళ్ళై గారు తమిళంలో వచన గ్రంథాలు లేని లోటును పూరించడానికి, అంతకుపూర్వం తాను రచించిన 'పెణ్‌మదిమాలై', 'సమరసకీర్తనై'లో గల నీతి సూత్రాలకు ఉదాహరణ పూర్వకంగా తాను ప్రతాపముదిలియార్ చరిత్ర రచిస్తున్నట్లు పేర్కొన్నారు.
2) చందుమీనన్ గారు తన భార్య పదేపదే తనని మలయాళ భాషలో ఆంగ్ల నవలని చదవాలని కోరడంవల్ల ప్రేరణ పొంది, ఆంగ్లేయ నవలా ప్రక్రియని మలయాళీ పాఠకులకు పరిచయం చేసే ఉద్దేశంతో స్థానిక ఇతివృత్తింలో తాను ఇందులేఖ రచిస్తున్నట్లు పేర్కొన్నారు.
3) గుల్వాడి వెంకటరావుగారు తాను పనిచేస్తున్న "సారస్వత" సమాజంలోని లోపాలను మతాధిపతులకు తెలియపర్చే ఉద్దేశంతో 'ఇందిరాబాయి' నవలని రచించారని సంతోష్‌కుమార్ గుల్వాడి గారు ఇందిరాబాయి నవల ముందుమాటలో పేర్కొన్నారు.

4) బెంగాలీల ఆచారవ్యవహారాలను తెలిపే వచన రచనలను చేయండని లార్డుమేయోగారి ప్రకటనతో ప్రేరణపోంది తాను శ్రీరంగరాజుచరిత్ర రచించినట్లు గోపాలకృష్ణమసెట్టి గారు పేర్కొన్నారు.

**2.5.7. సామాజిక స్పృహ**

ఈ రచయితలందరు తమ రచన ద్వారా తమ కాలంనాటి సామాజిక లోపాలను ఎత్తి చూపడమే కాక ప్రత్యేక్షంగా సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. గోపాలకృష్ణమ సెట్టి గారు విద్యార్థుల కొరకు పాఠశాల కట్టించారు. 1876-77 సంవత్సరంలో కరువు వస్తే ప్రజలను ఆదుకున్నారు. సరిగ్గా ఇదే కాలంలో వేదనాయగం పిళ్ళైగారు తమిళనాడులో కరువు నుండి ప్రజలను కాపాడటానికి గంజి కేంద్రాలను ఏర్పాటు చేశారు. గోపాలకృష్ణభారతి గారు వేదనాయగం పిళ్ళై గారిని 'నీ మే పురుష మేరు….' అని కీర్తించారంటే ఆయన సామాజిక సేవ ఎలాంటిదో అర్థమౌతుంది. గుల్వాడి వెంకటరావుగారు మంగళూరులోని ఉమామహేశ్వర దేవస్థాన పునరుద్దరణలో పాల్గోనడమే కాక గవర్నమెంట్ కాలేజి, జాతిబాంధవ హైస్కూల్ మూత పడే సమయంలో వాటిని పునరుద్ధరించారు. చందుమీనన్ గారు తన సహాయం కోసం వచ్చిన వారిని ఆదరణతో ఆదుకున్నారు. ఇలా ఈ రచయితలందరూ సమాజ సేవాభావాన్ని కలిగి నాటి సమాజానికి తమ వంతు సేవచేసారు.

*****

## అధ్యాయం-3

# 3. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - ఇతివృత్తం - తులనాత్మక పరిశీలన

### 3.1. ఇతివృత్తం

#### 3.1.1. శ్రీరంగరాజుచరిత్ర ఇతివృత్తం

విద్యారణ్యస్వామి తన తపోబలంతో నిర్మించిన ఊరు విద్యానగరం. ఈ విద్యానగర రాజు మూరురాయగండర్. ఈ మూరురాయగండర్ శారద అనే వేశ్యను గుడిలో చూసి మోహిస్తాడు. ఆమెను తన అంతఃపురానికి తెచ్చి, సకల సౌకర్యాలతో ఆశ్రయం కల్పిస్తాడు. రాజస్త్రీలతో సమానంగా శారదను చూస్తాడు. కొంతకాలం గడిచిన తరువాత శారదకు ఒక కుమారుడు పుడతాడు. అతని పేరు కృష్ణుడు శారదకి పుత్రుడు పుట్టిన తరువాత సంవత్సర కాలానికి మూరురాయగండర్ పట్టపురాణికి ఒక కుమారుడు పుడతాడు. అతని పేరు శ్రీరంగరాజు. కృష్ణుడు, శ్రీరంగరాజులకు విద్య నేర్పించాలనే ఉద్దేశంతో మూరురాయగండర్ ఒక గురువును ఏర్పాటు చేస్తాడు. పద్దెనిమిది సంవత్సరాలు గడుస్తాయి. ఒకరోజు శ్రీరంగరాజు, కృష్ణుడు ఇద్దరూ కలిసి వేటకు వెళ్తారు. ఈ వేటలో కృష్ణుడు ఒక ముళ్లపందిని చంపుతాడు. అది గమనించిన అక్కడి సేవకులలో ఒకడు రాకుమారుడైన శ్రీరంగరాజు వద్దకు వెళ్లి "ముడుచుకొని ఉన్న ముళ్లపందిని కృష్ణయ్యగారు నేర్పుతో చంపారు" అని చెప్తాడు. వేశ్యాకుమారుడైన కృష్ణుడిని తన సేవకుడు "గారు" అని సంబోధించడం శ్రీరంగరాజుకు నచ్చదు. సేవకునితో "ఏమన్నావు? ఏమన్నావు? కృష్ణయ్య "గారా" ఇప్పుడు తెలియక చెప్పావు గాని "ఇంకొకసారి అట్లా అన్నావంటే నీ ప్రాణాలు తీస్తా" అని అతన్ని బెదిరించి పొమ్మంటాడు. ఈ సంఘటన శ్రీరంగరాజు మనసును కలచి వేస్తుంది. వెంటనే వేట ఆపి, ఇంటికి వెళ్లి అడవిలో జరిగినదంతా తల్లితో చెప్తాడు. భోగం వాడు పట్టణంలో ఉండడం అవమానకరం. వాణ్ణి, వాడి తల్లిని వెంటనే ఊరి నుండి వెళ్లగొట్టించమని తల్లితో అంటాడు. ఆమె తన భర్తతో శారదని ఇంటి నుండి పంపించేయమని ప్రాధేయ పడుతుంది. మూరురాయగండర్ శారదకి జరిగిన విషయం చెప్పి రాజ్యం వదిలి వెళ్లిపోవాల్సిందిగా పరోక్షంగా చెప్తాడు. శారద తాను వెళ్లనని, ఇదంతా మీ పట్టపురాణి కుయుక్తి అని రాజుకి చెప్తుంది. రాజు చేసేది లేక తాను శారదని రాజ్యం నుండి పంపించనని, శ్రీరంగరాజుకు నీవే ఏదో ఒక విధంగా నచ్చ చెప్పమని, పట్టపురాణితో అంటాడు. రాణి కొడుక్కి ఎన్నో రకాలుగా చెప్పి చూస్తుంది. కాని కొడుకు మనసు మారదు. రాజ్యాన్ని భోగం దానికి

అప్పగించమని చెప్పి శ్రీరంగరాజు తన స్నేహితుడు రామయ్యతో కలిసి ఇల్లు వదిలి వెళ్లిపోతాడు. శ్రీరంగరాజు తన ప్రయాణంలో గ్రామీణ జీవితంలోని అందాలని ఆస్వాదిస్తాడు. దారిలో ఒక బ్రాహ్మణుడితో సంభాషించి వర్ణ వ్యవస్థ గురించి తెలుసుకుంటాడు. మరునాడు తుంగభద్ర, కృష్ణా నదులు కలిసే చోటు సంగమేశ్వరానికి చేరుకుంటాడు.

శ్రీరంగరాజు వెళ్లిన తరువాత తెల్లవారు ఝామున కొడుకు ఇల్లు వదిలి వెళ్లిన విషయాన్ని తెలుసుకుని తల్లి బాధపడుతుంది. కొడుకు వెళ్లిపోయిన సంగతి తెలిసి తండ్రి కూడా బాధ పడతాడు. ఈ విషయం తెలిసి మంత్రులు అధికారులు రాజభవనానికి వస్తా . వారంతా శ్రీరంగరాజు కోసం గాలిస్తారు కాని శ్రీరంగరాజు జాడ లభించదు. శ్రీరంగరాజు ఇల్లు వదిలి వెళ్లిన విషయం తెలిసి శారద బాధపడుతుంది. ఈ పరిస్థితికి తానే కారణమని, తాను రాజ్యం వదిలి వెళ్లిపోతే రాకుమారుడు తిరిగి వస్తాడేమోనని రాజుగారి అనుమతితో వేరేచోటికి వెళ్లిపోతుంది. రాజు కూడా పుత్రుని మీద బెంగతో నిద్రాహారాలు మాని కృశిస్తాడు. రాజు తన గురువు శేషాచార్యులను చూసి యవ్వనంలో తాను చేసిన తప్పుకు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నానని బాధ పడతాడు. శేషాచార్యులు నీ కొడుకుకి వచ్చిన కష్టమేమీ లేదని అతను చిన్న పిల్లవాడు కాదని ధైర్యం చెప్తాడు. ఒకరోజు రాజగృహం ముందు కల్లాపి చల్లే కాశక్క వీధి అరుగు మీద ఒక అజ్ఞాత ఉత్తరం చూస్తుంది. అందులో దేవరాజు గ్రామానికి చెందిన రెడ్డిరాజు తమ ఊరి అడవిలో ఎవరో రాజకుమారుడు బావిలో పడి చనిపోయాడని అతను మీ కుమారుడేమో వచ్చి చూసి వెళ్ళండని రాసి ఉంటుంది. ఆ ఉత్తరం చదవగానే అందరూ బాధపడతారు. రాజు ఉత్తరంలోని విషయం ఆరాతీయించడానికి మనుషులని పంపుతాడు. వారు చనిపోయిన వ్యక్తి రాకుమారుడు కాదని నిశ్చయించి రాజుకు చెప్తారు. ఈ విషయం వినగానే రాజు తన కొడుకుకి గొప్ప ఆపద తప్పిందని సంతోష పడతాడు.

శ్రీరంగరాజు సంగమేశ్వరం చేరుకొంటాడు. అక్కడ వేటాడటం కోసం చంద్రగుప్తి వనానికి వెళ్తాడు. అడవిలో దారి తప్పి ఎటు వెళ్లాలో తెలియక చీకటి పడడంతో ఒక చెట్టు ఎక్కి కూర్చుంటాడు. ఆ చెట్టు కిందకి పులివస్తుంది. తన పద్దెనిమిదవ ఏట తనకు మృగగండం ఉందని జ్యోతిష్యులు చెప్పిన మాట గుర్తుకు తెచ్చుకుంటాడు. ధైర్యం తెచ్చుకుని పులి పైకి బాణం విసురుతాడు. బాణం తగిలి పులి చనిపోతుంది. ఆ రాత్రంతా చెట్టు మీదగడుపుతాడు. తెల్లవారిన

తరువాత సంగమేశ్వరం వైపు పయనం సాగిస్తాడు. కానీ దారి తప్పి శ్రీశైలం దగ్గర ఉన్న చంద్రగుప్తి అనే ఊరిని చేరుకుంటాడు. అక్కడ ఒక అందమైన లంబాడి అమ్మాయిని శ్రీరంగరాజు చూస్తాడు. ఆమె వేషాన్ని చూస్తే లంబాడి స్త్రీలా అనిపిస్తుంది. కానీ రూపం, అందం చంద్రుని వంటి మోహాన్ని చూస్తుంటే ఆమె లంబాడి స్త్రీ కాక రాజపుత్రిక యేమో అన్న అనుమానం శ్రీరంగరాజుకు కలుగుతుంది. రాజు ఆ అమ్మాయి వివరాలు కనుక్కోమని రామయ్యను పంపుతాడు. రామయ్య "నీవెవరు? నీ కుల గోత్రాలు ఏమిటి? ఎక్కడ నుంచి వచ్చావు? ఈ అడవిలో ఎక్కడా చడీ, చప్పుడు వినబడదు ఇలాంటి అడవిలో ఎందుకు ఉన్నావు?" అని ఆ అమ్మాయిని అడుగుతాడు."నేడు లంబాడి దాన్ని, గుంటూరు సీమలో బియ్యం, ఉప్పు మొదలైనవి తీసుకుని బేరం ఆడుతూ కందవోలు సీమకి పోతున్నా . ముసలిదైన తల్లి తప్ప నాకు ఇప్పుడు ఎవరు ఈ అడవిలో లేరు". అని ఆ అమ్మాయి సమాధానం చెబుతుంది. అంతలోనే అక్కడికి వచ్చిన ఆ లంబాడి స్త్రీ తల్లి రాజు వివరాలు అడుగుతుంది. రాజు తన వివరాలు చెప్తాడు. రాజు వివరాలు విని తల్లి తన మనస్సులో సంతోషపడుతుంది. కానీ పైకి మాత్రం "లంబాడి వారమైన మాతో రాజులైన మీకు సంభాషణ తగదు" అని రాజుని వారిస్తుంది. గుణం ప్రధానం కానీ కులం ప్రధానంకాదని ఈ అమ్మాయి తనకు లంబాడి స్త్రీలా కనిపించడం లేదని ఈ అమ్మాయి కథేంటో చెప్పమని ఆ తల్లిని రాకుమారుడు అడుగుతాడు. అప్పుడా తల్లి ఈమె నేను కని, పెంచిన కూతురు. పరాయిదికాదు. అంటూ రాజుని పక్కకు తీసుకువెళ్లి అక్కడ ఉన్న రోకళ్లు, నూరిన పసుపు, నవధాన్యాలు చూపిస్తుంది. అవి ఏమిటో అర్థం కాని రాజు వాటిని గురించి చెప్పమని రామయ్యని అడుగుతాడు. వాటిని చూసిన రామయ్య "ఈ వస్తువులను చూస్తుంటే ఈమె ఖచ్చితంగా లంబాడి స్త్రీ అని అర్థమవుతుంది. ఈ గుర్తులను బట్టి ఈమెకి పెళ్లి కూడా అయినట్లుగా అనిపిస్తున్నది". అంటూ అక్కడ ఉన్న వాటిని గురించి రాజుకి వివరించి చెప్తాడు. అది విన్న రాకుమారుడు మనసులో బాధ పడతాడు. ఒక పెళ్లైన స్త్రీ పై తాను మనసు పడినందుకు చింతిస్తాడు. ఎన్నో కష్టాలు పడి ఇక్కడికి వచ్చాను. ఈ అమ్మాయిని చూసి కష్టాలన్నీ మర్చిపోయాను. కొంచెం సంతోషపడ్డాను. కానీ అంతలోనే బాధ. అంటూ ఆలోచిస్తున్న రాకుమారుడు పెళ్లి జరిగిన గద్దెల వద్దకు వెళ్తాడు. అక్కడ అతనికి అక్షింతలు కనిపించవు పెళ్లి జరిగితే పసుపు కలిపిన బియ్యపు గింజలు ఉండాలి కదా అవి లేవు. పెళ్లి జరిగితే వరుడు ఉండాలి కదా అతను ఎక్కడికి వెళ్లాడు. అని అనుమానించిన రాకుమారుడు తన స్నేహితుడు రామయ్యని పిలిచి ఆ అమ్మాయి తలపై జడకుప్పే, చేతికి దంతపు గాజులు ఉన్నాయో లేదో చూసి

రమ్మంటాడు. రామయ్య వెళ్లి చూస్తాడు. "గాజులు లేవు. ఈమెకి పెళ్లి కాలేదు. ఈ విషయం చెబితే రాజు ఈ లంబాడీ స్త్రీ మోహంలో పడి, ఈమెని పెళ్ళాడి రాజ్యపాలనకి అర్హుడు కాకుండా పోతాడు". ఇలా అనేక రకాలుగా ఆలోచించిన రామయ్య  రాకుమారుడి దగ్గరికి వెళ్లి ఆ లంబాడి స్త్రీకి వివాహం అయిందని అబద్ధం చెప్తాడు. లంబాడి స్త్రీ పై మరులుగొన్న రాజు జ్వరంతో బాధ పడతాడు. మూడు రోజులు లంబాడి వృద్ధ స్త్రీ రాజుకు సపర్యలు చేస్తుంది. జ్వరం తగ్గిన తర్వాత రాకుమారుడు మీ అల్లుడు ఎక్కడికి వెళ్లాడు అని ఆ లంబాడి స్త్రీతో అడుగుతాడు.

నెల రోజుల కిందట మా అన్నా, చెల్లెలు నా కూతురిని రామానాయక్ తండాకు చెందిన భీమానాయక్ అనే వెధవకి ఇచ్చి పెళ్లి చేద్దామని చూశారు. ఈ విషయం తెలిసి నేను వచ్చి పెళ్లి ఆపాను. అది నచ్చక మా అన్నా, చెల్లెలు నన్ను వదిలి వెళ్లిపోయారు. అంటూ తన కూతురి పెళ్లి విషయంలో జరిగిన ఉదంతాన్ని ఆ వృద్ధ స్త్రీ రాజుకు వివరిస్తుంది. శ్రీరంగరాజు సోనాబాయికి వివాహం జరగలేదని తెలుసుకుని మనసులో సంతోష పడతాడు. సోనాబాయి లంబాడి స్త్రీ కాదేమోనన్న అనుమానం రాజుకు కలుగుతుంది.

సోనాబాయికి రాజు మీద ఇష్టం ఏర్పడుతుంది. సోనాబాయిని గమనించిన ఆమె తల్లి ఎలాగైనా రాకుమారునితో సోనాబాయికి స్నేహం ఏర్పర్చాలని ఆమెకి పాలదుత్త ఇచ్చి రామయ్య, రాకుమారుడు ఉన్న చోటకి పంపుతుంది. మొదట తాను వెళ్లనని చెప్పిన సోనాబాయి చివరికి రాకుమారుడు ఉన్న పర్ణశాల వద్దకు వెళ్తుంది. శ్రీరంగరాజు, రామయ్యకు మధ్య లంబాడి కులం పాతివ్రత్యం గురించి సంభాషణ జరుగుతుంది. సోనాబాయి పై మరులుగొన్న శ్రీరంగరాజు సోనాబాయి   గాంధర్వ వివాహం చేసుకుంటానని రామయ్యతో అంటాడు. రామయ్య పెద్దల అంగీకారం లేకుండా పెళ్లి చేసుకోవడం తగదని అదీకాక పట్టపురాణి అంత:పుర స్త్రీలు అందరూ గౌరవించే విధంగా ఉండాలని రాజు మనస్సు మార్చడానికి ప్రయత్నిస్తాడు. రామయ్య మాటలు పట్టించుకోని శ్రీరంగరాజు ముసలమ్మతో మాట్లాడి చూడాలి. నువ్వు వెళ్లి ఆ అమ్మాయి అభిప్రాయం ఏమిటో కనుక్కొనిరా. అంటూ తమ పర్ణశాల వద్దకి వచ్చి నిలబడిన సోనాబాయి చూస్తాడు. రామా.. ఎవరో వచ్చారు చూడు అని అంటాడు. అది విన్న సోనాబాయి అక్కడి నుంచి తల్లి వద్దకు వస్తుంది. వెంటనే రంగరాజు "రామా.. ఆ అమ్మాయి వెళ్లిపోయింది. భయపడి వెళ్ళిందా? నా మాటలు విని కోపం వచ్చి వెళ్ళిందా? కనుక్కొని రా.." అంటు శ్రీరంగరాజు

సోనాబాయి వద్దకి రామయ్యని పంపిస్తాడు. సోనాబాయి ఏం చెబుతుందో అన్న కుతూహలంతో తాను కూడా వెళ్లి లంబాడి వారి ఇంటి వెనుక ఉన్న చెట్టునీడలో నిలబడతాడు.

సోనాబాయి రాకను గమనించిన ఆమె తల్లి పాలకుండను ఎందుకు వెనక్కి తెచ్చావని ప్రశ్నిస్తుంది. సోనాబాయి తాను విన్న విషయాలన్నీ తల్లితో చెబుతుంది. అంతలోనే అక్కడికి వచ్చిన రామయ్యను చూసి లోపలికి వెళ్లి పోతుంది. రామయ్య "మీ కూతురు మీకు ఏం చెప్పిందో నాకు తెలియదు. కానీ మా రాజుగారు మాత్రం మీ అమ్మాయిని ఇష్టపడుతున్నారు. వారి పెళ్లికి మీరు సహకరించాలి" అని సోనాబాయి తల్లితో అంటాడు. రామయ్య మాటలు విన్న సోనాబాయి తల్లి, సోనాబాయి పసిపిల్ల కాదు ఆమెకు పదహారు సంవత్సరాలు, ఆమెకి అనిపించాలి. మీ రాజును పెళ్లాడటం, ఆడకపోవడం ఆమె ఇష్టం వాళ్లిద్దర్నీ కలపాల్సింది మా ఇలవేల్పు శ్రీమల్లికార్జునుడు తప్ప ఇంకెవరూ కాదని రామయ్యతో అంటుంది. ఇదంతా లోపలి నుండి వింటున్న సోనాబాయి "మాలాంటి పేదలకూ, నీచులకు రాజు వంటి గొప్పవారితో పొత్తుకుదరడం అసాధ్యం. ఆశకు హద్దుండాలి. ఎవరిని పడితే వారిని కోరుకోకూడదు. ఇలాంటి పెద్దవారు మోస ప్రవృత్తి కలిగి ఉంటారు. ఇవ్వాళ పెళ్లి చేసుకొని రేపు కాదంటే మనం బజారున పడతాం, మనలాంటివారు లంబాడిలలోనే సంబంధం చేసుకోవడం మంచిది" అని తల్లితో చెబుతుంది. తల్లి రాకుమారున్ని వివాహం చేసుకోవలసిందిగా సోనాబాయికి నచ్చచెబుతుంది. సోనాబాయిమాత్రం తాను లంబాడి కన్యను తనకు రాజుతో వివాహం అతని వంశ చరిత్రకు మంచిది కాదని మొండికేస్తుంది. ఎన్ని రకాలుగా చెప్పినా వినదు. చివరికి తల్లి "ఎందుకంత సందేహం పెట్టుకుంటావు శ్రీమల్లికార్జునుని సాక్షిగా నీవు గొప్ప పుట్టుక పుట్టావు. దొరలు కూడా మెచ్చుకునేంత గొప్ప పుట్టుక నీది నా మాట ప్రకారం నడుచు  నీకు అంతా వివరంగా చెబుతాను". అని తల్లి అంటుండగా విని అక్కడే ఉన్న శ్రీరంగరాజు వారి ముందుకు వస్తాడు సోనాబాయి భయంతో ఇంట్లోకి వెళ్లిపోతుంది. శ్రీరంగరాజు ఈ అమ్మాయి ఎవరి కూతురు అని సోనాబాయి తల్లిని నిలదీస్తాడు. ఆమె మౌనంగా ఉండటంతో చేసేది లేక అక్కడి నుండి తన పర్ణశాలకి వెళ్తాడు.

సోనాబాయి పెళ్లి విషయంలో నిరాశపడ్డ భీమానాయకుడు తనకు దక్కనిది మరెవరికీ దక్కకూడదని ఆమెని బసవిగా మార్చాలనుకుంటాడు. ఆ ప్రాంతంలో స్త్రీలోలుడిగా పేరుపొందిన కొండవీటి రాజు సేవకుల వద్దకు వెళ్లి సోనాబాయి గురించి చెప్తాడు. ఆ సేవకులు సోనాబాయి

గురించి రాజు వద్ద చెప్తారు. కొండవీటి రాజు తనకు స్త్రీలను తార్చే జంగమ మల్లమ్మను పిలిచి సోనాబాయిని తన వద్దకు తీసుకు రావాల్సిందిగా ఆజ్ఞాపిస్తాడు. రాజు ఆజ్ఞ ప్రకారం జంగమ మల్లమ్మ సోనాబాయి  బెదిరించి రాజు వద్దకు తీసుకు వెళ్తుంది. తీసుకు వెళ్లే మార్గంలో సోనాబాయి తల్లి తన కట్ల సంచి మర్చిపోయానని దాన్ని తీసుకు వస్తానని చెప్పి చంద్రగుప్తిలో ఉన్న శ్రీరంగరాజుకు జరిగిన విషయం చెప్పి కొండవీటికి వెళ్లిపోతుంది.

సోనాబాయితో పాటే శ్రీరంగరాజు చంద్రగుప్తిని వీడి కొండవీడు చేరుకుంటాడు. ఆ కొండవీటి రాజు తనకు మేనత్త మనవడని, తన బావ కొడుకుని తెలుసుకుంటాడు. ఎలాగైనా సోనాబాయిని కాపాడాలనుకుంటాడు. కానీ తన వద్ద బలం లేక చింతిస్తాడు. శ్రీరంగరాజు స్వయంగా తానే పూలు అల్లే తంబళ్ల వాని వేషం వేసి అంత:పురంలోని స్త్రీలకు ఇచ్చే పూల మాలల ద్వారా తన క్షేమ సమాచారాన్ని సోనాబాయికి చేరవేస్తాడు. అది తెలుసుకుని సోనాబాయి సంతోషిస్తుంది. సోనాబాయి తల్లి తన కూతురు భరద్వాజ గోత్రంలో పుట్టిందని రాజ పురోహితునికి చెబుతుంది. రాజ పురోహితుడు సగోత్రవివాహం చేసుకోవడం మంచిది కాదని కొండవీటి రాజుకు చెప్తాడు. అయినా రాజు పురోహితుని మాట వినడు. తన భర్త ఇంకొక స్త్రీని వివాహం చేసుకుంటునా దని తెలిసి కొండవీటి రాజు భార్య తన అత్త వద్ద బాధపడుతుంది. తన కొడుకు ఇంకో వివాహం చేసుకోవడం నచ్చని అతని తల్లి సోనాబాయిని  దొంగచాటుగా రథంలో కొండవీటిని దాటిస్తుంది. కొండవీడు వదిలిన సోనాబాయి తంబళ్లవాని వేషంలో ఉన్న శ్రీరంగరాజుని కలుస్తుంది. రామయ్య, సోనాబాయి, శ్రీరంగరాజు, సోనాబాయి తల్లి అందరూ కలిసి విద్యానగరానికి బయలుదేరుతారు.

విద్యానగరంలో శ్రీరంగరాజు రాకను తెలిసి అందరూ చాలా సంతోషిస్తారు. సోనాబాయిని చూసి అందరూ ఆశ్చర్యపోతారు. ఈ స్త్రీ రాచబిడ్డ అయితే బాగుండును అనుకుంటారు. ఇంతలోనే శ్రీరంగరాజు మేనత్త వద్ద సోనాబాయి పెంపుడు తల్లి ఆమె రాచబిడ్డ అని చెబుతుంది. అందరూ ఆశ్చర్య పోతారు. సోనాబాయి పెంపుడు తల్లి తాను చిన్నప్పుడు సోనాబాయిని ఎత్తుకు వెళ్లినప్పుడు ఆమె శరీరంపై ఉన్న పావడ, రవికా, చెవి పోగులను తన కట్లసంచిలో నుండి తీసి చూపిస్తుంది. వాటిని చూసిన శ్రీరంగరాజు మేనత్త సోనాబాయి తన కూతురే అని నిశ్చయించుకుంటుంది. సంతోషంతో సోనాబాయి వద్దకు వెళ్లి ఆమె వీపు మీద

ఉన్న పుట్టుమచ్చను చూసి సోనాబాయి ఎవరోకాదు తన కూతురు రంగనాయకి అని తెలుసుకుని ఆనందపడుతుంది. రంగనాయకి, శ్రీరంగరాజులకు వివాహం చేయాలని అందరూ అనుకుంటారు. ఈ వివాహానికి రాజు గారి వియ్యంకుడు మల్రాజు మహారాజు అంగీకరించడు. ఏనాడో ఇల్లు వదిలి వెళ్లిన స్త్రీ రాచకన్య ఎలా అవుతుంది? అని ప్రశ్నిస్తాడు. ఈ స్త్రీకి వర్ణాశ్రమ ధర్మాలు తెలియవు, కాబట్టి ఈ వివాహం తగదని ఆక్షేపిస్తాడు. ఈ విషయంపై రాజుగారి కొలువులో చర్చ జరుగుతుంది. చివరికి శృంగేరి స్వాములు శ్రీ శంకరాచార్యుల వారి పిలుస్తారు. శ్రీ శంకరాచార్యులవారు ఇది అజ్ఞాన దశలో జరిగింది. పెద్ద దోషం కాదని ప్రాయశ్చిత్తంతో దోషం పోగొట్టవచ్చని తగువు తీర్చి తీర్థ ప్రసాదాలు ఇస్తారు. దీనితో రంగరాజు, రంగనాయకిల వివాహం జరుగుతుంది. సోనాబాయి తల్లిని క్షమించి శ్రీరంగరాజు ఒక గ్రామం ఆమెకి ఇస్తాడు. అలాగే శారదకు కొన్ని గ్రామాలను, కృష్ణుడికి ఒక పరగణాను ఇస్తాడు. ఈ రకంగా శ్రీరంగరాజు, సోనాబాయి అందరూ కలిసి సంతోషంగా జీవిస్తారు.

### 3.1.2. ప్రతాపముదలియార్ చరిత్ర - ఇతివృత్తం

తమిళనాడులోని సత్యపురి అనే గ్రామంలో తొండ మండలం ముదలియార్ కులంలో జన్మించిన దివాను 'ఏకాంబరముదలియార్'. ఈ ఏకాంబరముదలియార్ కొడుకు కనకాచలముదలియార్. ఈ కనకాచలముదలియార్‌కి సుందరఅణ్ణికి కలిగిన ఏకైక సంతానం ప్రతాపముదలియార్. ప్రతాపముదలియార్ పూర్వికులు గొప్ప సంపన్నులు అందువల్ల తాము విద్య నేర్చుకోవల్సిన అవసరం లేదనే భావాన్ని ప్రతాపముదలియార్ చిన్నప్పటినుండి కలిగి ఉండేవాడు. అతని తల్లి సుందరఅణ్ణి ప్రోద్భలంతో తన ఎనిమిదవ ఏట అక్షరాభ్యాసం ప్రారంభిస్తాడు. ఈ ప్రతాపముదలియార్‌కి విద్య నేర్పించడానికి ఒక పేద గురువు నియమించబడతాడు. ఈ పేద గురువు కుమారుడు కనకసభ. ఈ కనకసభ ప్రతాపముదలియార్ వర్ణమాల నేర్చుకునే క్రమంలో అనేక దెబ్బలు తింటాడు. చదువు నేర్పించే గురువు ప్రతాపముదలియార్‌ని కొడితే తన ఉద్యోగం పోతుందని భయపడి అతను తప్పు చేసిన ప్రతీసారి తన కుమారున్ని కొట్టేవాడు. ఈ సంగతి తెలిసి ప్రతాపముదలియార్ తల్లి ప్రతాపముదలియార్‌ని బెదిరిస్తుంది. కనకసభని అప్పటినుండి తన కొడుకుతో సమానంగా చూసుకుంటుంది. అతని తండ్రి శాంతలింగం పిళ్ళైని తన ఇంట్లో ప్రధాన కార్యదర్శిగా నియమిస్తుంది.

ప్రతాపముదలియార్ మేనమామ పేరు సంబంధముదలియార్. ఈ సంబంధ ముదలియార్ కుమార్తె జ్ఞానాంబాళ్. ఈమె పేరుకు తగ్గట్టుగా గొప్ప తెలివిమంతురాలు సుందరఅణ్ణి ఆజ్ఞ ప్రకారం కనకసభ, ప్రతాపముదలియార్‌లు జ్ఞానాంబాళ్ తో కలిసి తమ మేనమామ సంబంధముదలియార్ ఇంట్లో చదువుకోవడం ప్రారంభిస్తారు. అప్పటినుండి ప్రతాపముదలియార్‌లో చదువుపట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కరుణానందపిళ్ళై వీరికి గురువుగా నియమించబడతాడు. కరుణానందపిళ్ళై పర్యవేక్షణలో కనకసభ, ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ చదువుకుంటున్న క్రమంలో కనకసభ శాంతలింగం పిళ్ళై కుమారుడు కాదని తెలుస్తుంది. కనకసభ అసలు తల్లిదండ్రులు దేవరాజ పిళ్ళై అతని భార్య ఒక సన్యాసి ద్వారా కనకసభ జాడ తెలుసుకుని అతడిని తమ సొంత ఊరు ఆదియూర్ పాళ్యెంకు తీసుకువెళ్తారు. అప్పటికే ప్రతాపముదలియార్ యవ్వనంలోకి అడుగుపెట్టడం వల్ల సుందరఅణ్ణి జ్ఞానాంబాళ్‌తో అతనికి వివాహం నిశ్చయిస్తుంది. ఈ వివాహం విషయంలో జ్ఞానాంబాళ్ తండ్రి సంబంధ ముదలియార్ ఒక నిబంధన విధిస్తాడు. వివాహానంతరం వధూవరులు తన ఇంట్లోనే ఉండాలని పట్టుబడతాడు. ఈ నిబంధనకి ప్రతాపముదలియార్ తండ్రి కనకాచల ముదలియార్ ఒప్పుకోడు. ఈ విషయంలో ఇద్దరికి గొడవ జరుతుంది. గొడవ పెద్దది కావడంవల్ల వివాహం రద్దు చేసుకుంటారు. రెండు కుటుంబాల సంబంధాలు తాత్కాలికంగా నిలిపివేయబడతాయి. కోపంతో ఉన్న సంబంధముదలియార్ తన కుమార్తెకు వేరే సంబంధాలు వెతుకుతాడు. ఈ విషయం తెలిసి కనకాచల ముదలియార్ తన కొడుకుకి వేరే సంబంధాలు చూడడం ప్రారంభిస్తాడు.

సంబంధముదలియార్ జ్ఞానాంబాళ్ ఇష్టానికి విరుద్ధంగా ఆమె వివాహాన్ని వీరప్పముదలియార్ కుమారుడు చంద్రశేఖర ముదలియార్‌తో నిర్ణయిస్తాడు. కనకాచల ముదలియార్ ప్రతాపముదలియార్ ఇష్టానికి విరుద్ధంగా కోయంబత్తూరులో ఉన్న చొక్కలింగముదలియార్ కుమార్తె పూంగావనంతో అతని వివాహాన్ని నిశ్చయిస్తాడు. సంబంధ ముదలియార్ తన కుమార్తె పెళ్లిని చైత్రమాసం 28వ తేదీనాడు ఉదయం ఆరుగంటలకు వూంగావూరు గ్రామంలో తన భార్యపేర ఉన్న పెద్ద భవంతిలో నిర్ణయిస్తాడు. ఈ విషయం తెలిసి కనకాచల ముదలియార్ అదే ముహూర్తానికి, అదే ఊరిలో, అదే భవంతిలో తన భార్యకు లభించిన దక్షిణ భాగంలో తన కొడుకు వివాహం నిశ్చయిస్తాడు. వివాహం జరగడానికి

ఎనమిది రోజులముందు సంబంధముదలియార్ దగ్గరి బంధువులలో ఒకరు మరణిస్తారు. అది తెలిసి సంబంధముదలియార్ వివాహాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తనకు కాబోయే వియ్యంకుడు చంద్రశేఖరముదలియార్‌కు ఉత్తరం రాస్తాడు. సంబంధముదలియార్ బంధువులు కనకాచలముదలియార్ బంధువులే కాబట్టి అతనుకూడా వివాహం తాత్కాలికంగా వాయిదా వేసుకుందామని తనకు కాబోయే వియ్యంకుడు చొక్కాలింగముదలియార్‌కు లేఖ రాస్తాడు. ఈ రెండు లేఖలు సమయానికి చేరుకోలేకపోవడంవల్ల వివాహం వాయిదాపడ్డ విషయం తెలియని వీరప్పముదలియార్, చొక్కాలింగముదలియార్ లు తమ కుమారుడు, కుమార్తె సకల బంధు పరివారంతో పూంగావూరు చేరుకుంటారు. అప్పటికే అక్కడ అన్ని వివాహ పనులు జరిగి ఉండడం, మండపాలు వేసి ఉండడం వల్ల పెళ్లి జరిగే భవంతికి చేరుకుంటారు. వారికి అంతకుముందు పరిచయం లేకుండడంవల్ల చంద్రశేఖరముదలియార్ తండ్రి వీరప్ప ముదలియార్ తన కొడుకుకి కూతురినిచ్చే సంబంధముదలియార్ ఇతనేనని చొక్కాలింగ ముదలియార్‌ని చూసి అనుకుంటాడు. చొక్కాలింగముదలియార్ కూడా తన కూతురికి నిశ్చయించబడ్డ ప్రతాపముదలియార్ తండ్రి ఇతనే కావచ్చు అని వీరప్పముదలియార్‌ను చూసి అనుకుంటాడు. వారిద్దరు తమ కుమార్తె, కుమారులకు నిర్ణయించబడ్డ ముహూర్తంలో పెళ్లి చేస్తారు. ఈ విధంగా జ్ఞానాంబాళ్ కి చంద్రశేఖర ముదలియార్‌తో, ప్రతాపముదలియార్‌కి పూంగావనంతో నిర్ణయించబడ్డ పెళ్లి చంద్రశేఖర ముదలియార్ కి పూంగావనంతో జరుగుతుంది. ఈ విషయం తెలిసిన తరువాత జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్ సంతోషిస్తారు. ఇది జరిగిన తర్వాత సంబంధముదలియార్ జ్ఞానాంబాళ్‌కి సంబంధాలు చూడడం ఆపేస్తాడు.

వేసవి సెలవుల కాలంలో సంబంధముదలియార్ తన కుటుంబంతో కలిసి 'పనంపళ్ళి' అనే గ్రామానికి వెళ్తాడు. పనంపళ్ళి గ్రామంనుండి తిరిగి సత్యపురికి చేరుకునే క్రమంలో జ్ఞానాంబాళ్‌ను ఎవరో అపహరిస్తారు. ఈ విషయం తెలిసి సంబంధముదలియార్ అతని సేవకులు అన్ని దిశలా వెతుకుతారు. కానీ జ్ఞానాంబాళ్ జాడ కనిపించదు. జ్ఞానాంబాళ్ తప్పిపోయిన సంగతి తెలిసి ప్రతాపముదలియార్ ఆమెను వెతకడానికి బయలుదేరుతాడు. జ్ఞానాంబాళ్‌ను ఎత్తుకెళ్లిన వారిని తన తుపాకితో చంపి జ్ఞానాంబాళ్‌ని తెచ్చి తన మామ సంబంధముదలియార్‌కి అప్పగిస్తాడు. సంబంధముదలియార్ తన కూతురిని కాపాడిన

ప్రతాపముదలియార్‌ని గుండెలకు హత్తుకుని తన కూతురిని అతనికి ఇచ్చి వివాహం చేయాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకుంటాడు. జ్ఞానాంబాళ్ ఇంటికి వచ్చిందన్న వార్త తెలియగానే కనకాచలముదలియార్, సుందరఅణ్ణి అందరూ సంబంధముదలియార్ ఇంటికి వచ్చి ఆమెను పరామర్శిస్తారు. వాళ్లను చూసి సంబంధముదలియార్ తన మనసులోని మాటను కనకాచల ముదలియార్‌తో చెప్తాడు. అందుకు కనకాచలముదలియార్ అంగీకరిస్తాడు. దీనితో జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌ల వివాహం జరుగుతుంది. వివాహానంతరం జ్ఞానాంబాళ్ సుందరఅణ్ణిని జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇది చూసి ప్రతాపముదలియార్ సంతోషిస్తాడు. వీరి వివాహ జీవితం ఒకటిన్నర సంవత్సరం గడిచిన తర్వాత సంబంధముదలియార్ కనకాచల ముదలియార్ వద్దకు వెళ్లి తన కుమార్తెకు పుట్టబోవు బిడ్డను తనకు దత్తతగా ఇవ్వాలంటాడు. ఇది విన్న కనకాచలముదలియార్ అతను తన మనమడు కావున ఎవరికిమాత్రం మనమడిమీద ప్రేమ ఉండదు అంటూ కనకాచలముదలియార్ విజ్ఞాపనని తిరస్కరిస్తాడు. దీనితో సంబంధ ముదలియార్‌కి కోపం వస్తుంది. ఇద్దరి మధ్య మాటామాటా పెరుగుతుంది. అది కాస్త గొడవకి దారి తీస్తుంది. ఈ గొడవలో ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ ఒకరినొకరు చూడకూడదు, కలుసుకోకూడదు అని సంబంధముదలియార్, కనకాచలముదలియార్ ఇరువురు తీర్మానిస్తారు. ఇది జరిగిన తర్వాత జ్ఞానాంబాళ్ బాధ పడడంవల్ల ఆమెకి గర్భస్రావం జరుగుతుంది. కనకాచలముదలియార్ తన కొడుకు ప్రతాపముదలియార్‌కి వేరే వివాహం నిశ్చయిస్తాడు. అది తెలిసి ప్రతాపముదలియార్ తండ్రిపై కోపంతో తన భార్యతో తాను ఎక్కడికైనా వెళ్లి జీవించాలని నిర్ణయించుకుంటాడు. ఆ సమయంలో తన భార్య గర్భస్రావ వ్యాధితో బాధపడుతూ ఉండడంవల్ల తన వెంట ఆమెను తీసుకువెళ్లకూడదని నిర్ణయించుకుంటాడు. ముందుగా తాను ఒకచోట స్థిరపడి తరువాత తన భార్యను అక్కడికి తీసుకువెళ్లవచ్చని అనుకుని తన ఆలోచనలని తెలుపుతూ భార్యకి లేఖ రాస్తాడు. తరువాత తన గ్రామానికి తూర్పుదిశగా తన సేవకులతో బయలుదేరుతాడు. 'సత్యపురి' నుండి ప్రతాపముదలియార్ నల్లూరు అనే గ్రామాన్ని చేరుకుంటారు. భర్త లేఖ అందుకున్న జ్ఞానాంబాళ్, కందస్వామి, వినయ్‌తీర్థన్ అనే సేవకుల భార్యలు అందించిన సమాచారంతో నల్లూరులో ఉన్న తన భర్తను కలుసుకుంటుంది. ప్రతాపముదలియార్ ఎంత చెప్పినా వినకుండా తానుకూడా భర్తతో వస్తానంటుంది. ప్రతాపముదలియార్ చేసేది లేక తన భార్యతో కలిసి తన ప్రయాణం కొనసాగిస్తాడు. దిశ లేకుండా ప్రయాణం సాగిస్తున్న ప్రతాపముదలియార్ దంపతులు తమకు తెలియకుండ కనకసభ

ఊరైన ఆదియూరులో ప్రవేశిస్తారు. దేవరాజపిళ్ళై వీరికి ఘనస్వాగతం పలుకుతాడు. అంతే కాక ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ సత్యపురిని వీడి తన వద్దకు వచ్చారని ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ తల్లిదండ్రులకి లేఖ రాస్తాడు. దేవరాజ పిళ్ళైనుండి లేఖ అందుకున్న మరుక్షణమే ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ తల్లిదండ్రులు ఆదియూరుకు చేరుకుంటారు. కనకాచల ముదలియార్, సంబంధముదలియార్ తాము తప్పు చేశామని ఇకపై ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌ని వేరుచేయమని ప్రతాపముదలియార్‌కి మాటిస్తారు.

దేవరాజపిళ్ళై తమ పిల్లలకి ఆశ్రయం ఇచ్చినందుకు ఆయనకి కృతజ్ఞతలు చెప్పి ఆదియూరు నుండి ఇంటికి వెళ్లడానికి తమకి అనుమతి ఇవ్వవలసిందిగా సంబంధ ముదలియార్, కనకాచలముదలియార్ లు దేవరాజపిళ్ళైని కోరతారు. దేవరాజపిళ్ళై తన కొడుకు కనకసభ పిళ్ళై వివాహ అనంతరం వెళ్లవలసిందిగా వారిని కోరుకుంటాడు. అందుకు కనకాచలముదలియార్, సంబంధముదలియార్ లు ఒప్పుకుంటారు. కనకసభతో వివాహానికి నిశ్చయించిన 'గుణరత్నం'ను ప్రేమించిన కలెక్టరు ఆఫీసులోని శిరస్తదారు. కనకసభ దేవరాజపిళ్ళై సొంత కుమారుడు కాదని కాబట్టి కనకసభ, గుణరత్నంల వివాహం చట్ట విరుద్ధమని కలెక్టరుకు చెప్పి దావా తీసుకొని వస్తాడు. ఈ దావాపై విచారణ జరుగుతుంది. విచారణ సమయంలో 'కనకసభ' దేవరాజపిళ్ళై సొంత కుమారుడని కనకాచల ముదలియార్, సంబంధముదలియార్ మొదలైనవారు సాక్ష్యం చెప్తారు. వీరందరూ తప్పుడు సాక్ష్యం చెబుతున్నారని శిరస్తదారు కలెక్టరును నమ్మిస్తాడు. తప్పుడు సాక్ష్యం చెప్పిన వారిని అండమాను దీవులకు పంపవలసిందిగా కలెక్టరునుండి ఆదేశాలు వెలువడతాయి. అప్పుడు సుందరఅణ్ణి కొంతమంది స్త్రీలతో మద్రాసువెళ్లి గవర్నర్ కు సత్యాన్ని తెలియజేస్తుంది. గవర్నర్ విచారణ జరిపి సంబంధముదలియార్, కనకాచలముదలియార్‌లను నిర్దోషులుగా విడుదల చేయడమేకాక విచారణ జరిపిన ప్రభుత్వ ఉద్యోగులను అండమాను పంపేటట్లుగా ఆదేశాలిస్తాడు.

కనకసభ, గుణరత్నంల వివాహం వైభవంగా జరుగుతుంది. ఆదియూరుకు ఉత్తరంగా ఉన్న కొండలలోని ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు ఆ చుట్టుపక్కల ఉన్న గ్రామాలను నాశనం చేయడం ప్రారంభిస్తాయి. ఆ గ్రామ ప్రజలు వాటిని హతమార్చవలసిందిగా దేవరాజపిళ్ళైని వేడుకుంటారు. దేవరాజపిళ్ళై వేటగాళ్లను పిలిపించి వాటిని వేటాడవలసిందిగా

ఆజ్ఞాపిస్తాడు. కనకసభ, ప్రతాపముదలియార్ లు ఆ వేటని చూడటానికి వేటగాళ్లతో పాటు వెళ్తారు. గుర్రంపై కనకసభ పట్టపు ఏనుగుపై ప్రతాపముదలియార్ కూర్చుంటారు. వేటకి బయలుదేరే సమయంలో అక్కడ పొదలమాటున దాగిన పులి మావటివానిపై దాడి చేస్తుంది. ఏనుగుపై అంబారీలో కూర్చున్న ప్రతాపముదలియార్ పులిపై తుపాకి గుండ్ల వర్షం కురిపిస్తాడు. ఆ గుండ్ల శబ్దానికి బెదిరిన ఏనుగు ప్రతాపముదలియార్‌తో పులివెనక పరిగెడుతుంది. ఏనుగు అడవిలో చాలాదూరం పరిగెత్తి ఒక కొండవద్ద ఆగుతుంది. ఆ కొండ పూర్వం ఆ ఏనుగు నివసించిన ప్రాంతం. ఆ కొండను ఏనుగు వేగంగా ఢీకొనడంవల్ల 'ప్రతాపముదలియార్' అంబారీ నుండి ఎగిరి కొండ మీద పడ్తాడు. ఆ కొండకి ఉత్తర దిశగా ఉన్న మెట్లనుదిగి విక్రమపురి అనే రాజ్యానికి చేరుకుంటాడు. విక్రమపురి రాజు అప్పటికే మరణించి ఉండడం వల్ల ప్రజాపాలన పేర అక్కడ అక్రమాలు జరుగుతుంటాయి. విక్రమపురిలో చెప్పులు కుట్టేవాడు, జూదగాళ్లు, కుంటివాడు, గుడ్డివాడు మొదలైనవారు 'ప్రతాపముదలియార్'ని చూడగానే అతని ఒంటి మీద ఉన్న ఆభరణాలకి ఆశపడి చెప్పులు, డబ్బు, కళ్లు, కాళ్లు దొంగలించినట్లుగా ప్రతాపముదలియార్‌పై దొంగ నేరారోపణలు చేస్తారు. అక్కడున్న కావలివారు తమకి డబ్బు ఇస్తే వదిలిపెడతామని ప్రతాపముదలియార్‌తో బేరమాడతారు. వీటిని చూసి ప్రతాపముదలియార్ ఆశ్చర్యపోతాడు. తాను తప్పు చేయలేదని న్యాయస్థానానికి వెళ్తాడు. అక్కడ న్యాయాన్ని విచారించే అధికారి కావలివారి మాటలు, పురప్రజల మాటలు నమ్మి తెల్లవారగానే ప్రతాపముదలియార్‌ని శిక్షించాలని నిర్ణయిస్తాడు. తనలాంటి అమాయకుల్ని శిక్షించడం సరికాదని తనని నిజంగా శిక్షించాలని చూస్తే తాను తెల్లవారకుండా చేస్తానని ప్రతాపముదలియార్ ఆ న్యాయాధికారితో సవాల్ విసురుతాడు. మరునాడు 'సూర్యగ్రహణం' ఉండటం, ఆ విషయం ముందే ప్రతాపముదలియార్‌కి తెలిసి ఉండటంవల్ల సూర్యుడు ఉదయించడు. పురప్రజలు ప్రతాపముదలియార్ వల్లే సూర్యుడు ఉదయించలేదని నమ్మి అతన్ని పూజించడం మొదలుపెడతాడు. న్యాయాధికారి తన తీర్పుని వెనక్కి తీసుకుంటాడు. తమ రాజ్యాన్ని నీవే కాపాడాలని ప్రజలు ప్రతాపముదలియార్‌ని వేడుకుంటారు. ప్రతాపముదలియార్ వెంటనే మీ రాజ్యానికి రాజును ఎన్నుకోండి అని ఆజ్ఞాపిస్తాడు. ఆ పుర ప్రజలు రాజును ఎన్నుకునే ప్రక్రియలో భాగంగా ఒక ఏనుగును అలంకరించి ఆ ఏనుగుకు ఒక పూలమాలను ఇస్తారు. ఆ ఏనుగు ఎవరి మెడలో ఆ పూలహారం వేస్తే అతనే తమ రాజు అని నిర్ణయించుకుంటారు. ఆ ఏనుగు పూలమాలను అప్పటికే 'ప్రతాపముదలియార్'ను వెతుకుతూ రక్షణకోసం పురుషవేషం

ధరించి విక్రమపురికి చేరుకున్న జ్ఞానాంబాళ్ మెడలో వేస్తుంది. దీనితో జ్ఞానాంబాళ్ 'విక్రమపురికి' రాజు అవుతుంది. రాజుగా తన భర్తపై మోపబడిన అసత్య ఆరోపణలు నిజంకాదని నిరూపిస్తుంది. తాను రాజుగా ప్రతాపముదలియార్ యువరాజుగా కొంతకాలం విక్రమపురిని పరిపాలిస్తారు. ఈ క్రమంలో విక్రమపురి రాజుకుమార్తె 'ఆనందవల్లి' పురుష వేషంలో ఉన్న జ్ఞానాంబాళ్‌ను ఇష్టపడుతుంది. ఈ విషయం తెలిసి మంత్రులు, ఉద్యోగులు ఆనందవల్లికి, జ్ఞానాంబాళ్‌కి వివాహాన్ని నిశ్చయిస్తారు. ఇక చేసేదిలేక జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌లు విక్రమపురిని వదిలి ఆదియూరుకు చేరుకుంటారు. ఆదియూరుకు రాగానే జ్ఞానాంబాళ్ తాను పురుషుడిని కాదు, స్త్రీ అని ఆనందవల్లికి లేఖ రాస్తుంది. ఆ లేఖ చదివిన వెంటనే ఆనందవల్లి తన పరివారంతో ఆదియూరుకు చేరుకుని జ్ఞానాంబాళ్‌ని ప్రతాపముదలియార్‌ని తమ రాజ్యానికి వచ్చి మునుపటి వలే పరిపాలన చేయవలసిందిగా వేడుకుంటుంది. జ్ఞానాంబాళ్ సమ్మతింపక ఆనందవల్లికి పట్టాభిషేకం జరిపించ వలసిందిగా అక్కడున్న అధికారులను ఆదేశిస్తుంది. వారు అలాగే చేస్తారు. ఆదియూరు నుండి సత్యపురికి వచ్చే మార్గంలో జ్ఞానాంబాళ్‌కి మశూచి వ్యాధి సోకగా ఆమెని ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పిస్తారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఆమె మరణించినట్లు వైద్యులు చెప్పగా మశూచి అంటువ్యాధి కావడం వల్ల వైద్యుల విజ్ఞప్తిమేరకు మృతదేహాన్ని అక్కడే వదిలి బాధపడుతూ అందరూ సత్యపురికి చేరుకుంటారు. జ్ఞానాంబాళ్ మరణవార్త విన్న దేవరాజపిళ్ళై బాధపడుతూ ఆదియూరు నుండి జ్ఞానాంబాళ్‌ని చేర్పించిన ఆసుపత్రికి వెళ్తాడు. అక్కడ జ్ఞానాంబాళ్ చనిపోలేదని తెలిసి ఆమెకి వైద్యం చేయించి సత్యపురికి తీసుకువస్తాడు. జ్ఞానాంబాళ్‌ని చూడగానే ప్రతాపముదలియార్, కనకాచలముదలియార్, సుందరఅణ్ణి సంబంధముదలియార్ అందరూ సంతోషిస్తారు. ఆనందవల్లికి ఒక రాజుతో వివాహమౌతుంది. సత్యపురి, విక్రమపురిలో అందరూ సంతోషంగా ఉంటారు. దీనితో కథ ముగుస్తుంది.

### 3.1.3. ఇందిరాబాయి - ఇతివృత్తం

కమలాపురం అనే గ్రామంలో 'హంసే భీమారావు' అనే గృహస్థుడు ఉండేవాడు. ఈయన పూర్వీకులు 'బీజాపురం' ప్రాంతంలో ఉండేవారు. 'భీమారావు'కి ఆరేడు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు తల్లిదండ్రులు మరణిస్తారు. 'భీమారావు' అమ్మమ్మ 'బీజాపురం'లో ఉన్న ఆస్తిని అమ్మి భీమారావుతోపాటు కమలాపురానికి వలస వెళ్తుంది. భీమారావుకు పదవయేట ఉపనయనం

అవుతుంది. విద్యాభ్యాసం అనంతరం యుక్తవయస్సురాగానే 'అంబాబాయి' అనే స్త్రీతో వివాహమవుతుంది. అంబాబాయి వివాహ అనంతరం అన్ని విషయాలలోనూ భర్తకి చేదోడు వాదోడుగా ఉంటుంది. ఒకరి వద్ద పనిచేయడం కన్నా తానే సొంతంగా ఒక వ్యాపారం ప్రారంభించాలనుకుంటాడు భీమారావు. తన ఆలోచనని అంబాబాయికి చెప్తాడు. 'అంబాబాయి' తాము ఇంకా స్థిరపడలేదని, వ్యాపారంలో ఒకవేళ నష్టం వస్తే భరించే స్థితిలో తమ కుటుంబం లేదని భర్త ఆలోచనని తిరస్కరిస్తుంది. భార్య మాటలపై నమ్మకం ఉంచిన 'భీమారావు' సొంత వ్యాపార ఆలోచనని మానుకుంటాడు. నరసింహశాస్త్రి కూడా భీమారావుపై పూర్తి నమ్మకం ఉంచి మిల్లు పనులన్నీ అతనికి అప్పగించి తాను మిల్లుకి దూరంగా ఉంటాడు. కొన్నిరోజుల తరువాత 'భీమారావు' ఆర్థికంగా ఉన్నత స్థితిలోకి వస్తాడు. ఆర్థికంగా ఎదిగినా సంతానం లేదనే బాధ భీమారావుని వెంటాడుతుంది. సంతానం కోసం హోమాలు, దానస్ధర్మాలు చేస్తుంటాడు. భీమారావు, ఉంటున్న వీధిలోనే 'తంబూరి బాలాజీరావు' అనే పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగి నివసిస్తుంటాడు. ఈ తంబూరి బాలాజీరావుకి ముగ్గురు కుమారులు. అందులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులుకాగా 'సుందరరావు' అనే అతను ఉద్యోగం కోసం వెతుకుతూ ఉంటాడు. సుందరరావు భార్యపేరు 'సుశీల', వీరి కుమారుని పేరు 'భాస్కరరావు'. 'భీమారావు' 'సుందరరావు' ఇద్దరు ఒకే వీధిలో ఉండటంవల్ల 'భీమారావు'వల్ల తనకి నరసింహశాస్త్రి మిల్లులో పని లభిస్తుందని ఆశపడిన 'సుందరరావు' అతన్ని సేవించాలనుకుంటాడు. ప్రతీరోజు 'భీమారావు' ఇంటికివెళ్లి అతనికి సేవ చేయడం ప్రారంభిస్తాడు. 'సుందరరావు' సేవలకి మెచ్చి అతన్ని తన సహాయకుడిగా నియమించుకోవాలనుకుంటాడు 'భీమారావు'. తన ఆలోచనని భార్య అంబాబాయికి చెప్తాడు. 'సుందరరావు' పేరు వినగానే అంబాబాయి "అగ్గిమీద గుగ్గిలంలా" మండి పడుతుంది. అతనికి ఉద్యోగం ఇవ్వవద్దంటుంది. భీమారావు తన భార్య ఎందుకు సుందరరావుకి ఉద్యోగం ఇవ్వవద్దంటుందో అర్థంకాక అక్కడనుండి వెళ్లిపోతాడు. నరసింహశాస్త్రి కూతురి పెళ్లి ముగిసిన తర్వాత ఒకనాడు 'సుందరరావు' భీమారావు ఎదుట తన మనసులోని మాట చెప్తాడు. 'సుందరరావు' మనసు తెలిసిన 'భీమారావు' అంబాబాయి నీ విషయంలో ఎందుకో ఆక్షేపణ చెబుతోంది, కొన్ని రోజులు ఓపిక పట్టు నిన్ను మంచి స్థితిలోకి తీసుకువస్తాను అంటాడు.

ఒకరోజు మంచి సమయం చూసుకొని 'భీమారావు' 'అంబాబాయి' ఎదుట 'సుందరరావు' ప్రస్తావన తెస్తాడు. 'సుందరరావు' పేరు వినగానే 'అంబాబాయి' మళ్ళీ కోపంతో

ఊగిపోతుంది. ఎందుకు మీకు 'సుందరరావు' మీద అంత ఇష్టం అని ఏడుస్తుంది. ఆమె ఏడుపును చూసి తట్టుకోలేక సుందరరావు వల్ల కలిగిన ఆపద ఏంటో చెప్పమని భీమారావు, అంబాబాయిని అడుగుతాడు. అంబాబాయి కళ్లను తుడుచుకొని మొన్న మనింటికి వచ్చిన 'సీతాబాయి' మీ యజమాని 'నరసింహశాస్త్రి' మనయింటికి ఎందుకు తరచుగా వస్తుంటారని అందరిముందు అడిగింది. అక్కడితో ఆగకుండా 'సుందరరావు' మొన్న మా ఇంటికి వచ్చినప్పుడు పురుషుల అక్రమ సంబంధాల గురించి ఏవేవో చెప్పాడని నవ్వింది. ఆమాటలు విన్న నాకు చెవిలో సీసం పోసినట్లు అనిపించింది. ఏ తప్పు చేయకుండా పతివ్రతగా ఉన్న నాకు మీ యజమానితో అక్రమసంబంధం ఉందని 'సుందరరావు' వాళ్లముందు అన్నాడట, అతనికి మీరు ఉద్యోగం ఇస్తానంటున్నారు. ఇది మీకు తగినదేనా అంటూ మళ్ళీ ఏడ్వసాగింది. భీమారావు భార్యను ఓదార్చి తన ఇల్లాలికి మచ్చ తెచ్చిన సుందరరావును ఏంచేయాలో చెప్పని భార్య అంబాబాయిని అడుగుతాడు. అంబాబాయి అతన్ని చంపివేయడమే దీనికి పరిష్కారమని చెబుతుంది. సుందరరావు బతికిఉండటం మన కుటుంబ పురోభివృద్ధికి మంచిది కాదని, అతన్ని చూసిన ప్రతీసారీ నాకు నాపై మోపబడిన నింద గుర్తుకు వస్తుందని, భర్త భీమారావు సుందరరావును హత్యచేయడానికి ప్రోత్సహిస్తుంది.

అంబాబాయి ప్రోత్సాహంతో 'భీమారావు' సుందరరావును హత్య చేయాలనుకుంటాడు. మరునాడు ఉదయం తన ఇంటికి వచ్చిన నాటువైద్యురాలు 'దేవకి'తో తన మనసులోని మాటని చెబుతాడు. 'భీమారావు' అభిప్రాయాన్ని తెలుసుకున్న తరువాత 'దేవకి' విషం కలిపిన 'బజ్జీలను' సుందరరావుకు ఇస్తుంది. భీమారావు తన ఇంట్లో జరిగిన యక్షగాన ప్రసంగంలో కీచకవధ అయిన సందర్భాన్ని పురస్కరించుకొని "ఈ రోజు మధ్యాహ్నం ఒక బ్రాహ్మణ సంతర్పణం చేయాల్సి ఉంది. అందుకని అందరికీ ఫలహారం ఇస్తున్నాను" అంటూ ఆ వీధిలో ఉన్న వారందరినీ తన ఇంటికి పిలిచి కాఫీ, దోశలు, వంకాయ బజ్జీలతో ఫలహారాన్ని ఇస్తాడు. వీధిలో ఉన్న అందరితో పాటు 'సుందరరావు' కూడా భోజనానికి వస్తాడు. భీమారావు దేవకి పంపిన విషంకలిపిన బజ్జీలను సుందరరావుకు వడ్డిస్తాడు. అవితిన్న 'సుందరరావు' ఇంటికి వెళ్లిన తరువాత విషప్రభావంతో మరణిస్తాడు. ఈ విషయం తెలియగానే అంబాబాయి తన భర్తపై అనుమానం రాకుండా ఉండటానికి అతన్ని వ్యాధివచ్చినట్లు పడుకోమని చెబుతుంది. భార్యమాటలు విని భీమారావు, పెద్దరోగం వచ్చినవాడిలా పడుకుంటాడు. 'సుందరరావు'

శవాన్ని పరీక్షించిన పోలీసులు అతను విషప్రయోగంవల్ల చనిపోయాడని నిర్ధారిస్తారు. అందరికి భీమారావుపైన అనుమానం వస్తుంది. అదేరోజు 'సుందరరావు' భీమారావు ఇంట్లో తిన్నట్లు విచారణలో తేలుతుంది. భీమారావు పగతో సుందరరావుని హత్యచేశాడని పోలీసులకు తెలిసినా వారు అతన్ని ఏమీ చేయలేకపోతారు. భీమారావు తనవద్ద ఉన్న డబ్బుతో న్యాయవాదులను కొని తాను హత్యచేయలేదని కోర్టుని నమ్మిస్తాడు. నిర్దోషిగా బయటకు వస్తాడు.

భీమారావు దంపతుల వల్ల సుందరరావు కుటుంబం బజారున పడుతుంది. సుందరరావు భార్య సుశీల బాధపడుతుండగా కొడుకు భాస్కరరావు ఆమెను ఓదార్చుతాడు. సుందరరావు మరణంతో భాస్కరరావు చదువు ఆగిపోతుంది. అదే ఊర్లో ఉంటున్న 'అమృతరావు' అనే న్యాయవాది భాస్కరరావు పరిస్థితి చూసి అతన్ని చేరదీసి చదివిస్తాడు. అమృతరావు భార్య జలాక్షి భాస్కరరావుని సొంత కొడుకులా చూసుకుంటుంది. అమృతరావు పర్యవేక్షణలో భాస్కరరావు దినదిన ప్రవర్ధమానంగా చదువుకుంటాడు. అన్ని తరగతులలోను ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడౌతాడు. ఇదే సమయంలో భీమారావు అంబాబాయిలకు ఇందిరాబాయి జన్మిస్తుంది. అమృతరావు భాస్కరరావు ఎదుగుదలని చూసి సంతోషించి అతన్ని బి.ఎ. చదువు నిమిత్తం మద్రాసుకి పంపిస్తాడు. భాస్కరరావు ఎదుగుదలను చూసి 'భీమారావు' రగిలిపోతాడు. కాని అమృతరావు అతనికి అండగా ఉండటంవల్ల అతన్ని ఏమీ చేయలేకపోతాడు.

ఇందిరాబాయికి ఎనిమిది సంవత్సరాల వయస్సురాగానే అంబాబాయి, భీమారావు ఆమెకి త్రియంబకరావు కుమారుడైన విఠలరావుతో వివాహం నిశ్చయిస్తారు. 'ఇందిరాబాయి' తనకి ఇప్పుడే వివాహం వద్దంటున్నా పట్టించుకోకుండా ఆమెకి విఠలరావుని ఇచ్చి వివాహం జరిపిస్తారు. ఈ వివాహవేడుకలో నాట్యం చేయడానికి వచ్చిన 'గోకుళి', 'గులాబి' అనే వేశ్యలను చూసి విఠలరావు మోహిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న 'పొక్కుసెట్టి' అనే గుమాస్త విఠలరావుకు ఆ వేశ్యలతో సంబంధాన్ని ఏర్పరుస్తాడు. వేశ్యాలోలుడిగా మారిన విఠలరావు మత్తుపదార్థాలకి బానిస అవుతాడు. చివరికి అంతుచిక్కని వ్యాధితో మరణిస్తాడు. ఇందిరాబాయి బాలవితంతువుగా మారుతుంది. బాలవితంతువుగా మారిన ఇందిరాబాయిని తల్లి అంబాబాయి ఆచారాలు, సంప్రదాయాల పేరుతో చిత్రహింసలకు గురిచేస్తుంది. తల్లి పెట్టే హింసలు భరించలేక ఇందిరాబాయి అమృతరావు వద్దకి పారిపోతుంది. అమృతరావు ఇందిరాబాయి చెప్పిన విషయాలు విని ఆమెని చేరదీస్తాడు. ఆమెని వితంతు శరణాలయంలో చేర్పించి విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తాడు.

అంబాబాయి, భీమారావు కలిసి 'ఇందిరాబాయి'ని వెతుకుతారు. ఎక్కడ ఇందిరాబాయి జాడ వారికి కనిపించదు. చివరికి ఇందిరాబాయి అమృతరావు సంరక్షణలో ఉన్నట్లు తెలుసుకుంటారు. అమృతరావుపై భీమారావుకు మరింత కోపం వస్తుంది. అతనిపై కోర్టులో దావా వేద్దామనుకుంటాడు. కాని అతను న్యాయవాది కావడంవల్ల ఏమీ చేయలేక పోతాడు. అమృతరావు సంరక్షణలో ఉన్న ఇందిరాబాయి మెట్రిక్యులేషన్ వరకు చదువుకుంటుంది. ఇందిరాబాయికి యుక్త వయస్సురాగానే అమృతరావు జలాక్షి ఆమెకి వివాహం చేయాలని నిశ్చయించుకుంటారు. ఎలాగైనా కూతురిని తమ ఇంటికి తెచ్చుకోవాలని నిర్ణయించుకున్న 'భీమారావు' 'అమృతరావు' ఇంటికివెళ్ళి ఇందిరాబాయిని తమ ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానిస్తాడు. తాను ఆ ఇంటికి వచ్చి మళ్ళీ నరకయాతన అనుభావించలేనని ఇందిరాబాయి అమృతరావు ముందు తన తండ్రికి కుండబద్దలుకొట్టినట్లు చెబుతుంది. భీమారావు చేసేదిలేక తన ఇంటికి వెళ్తాడు.

అమృతరావు ప్రోత్సాహంతో బి.ఎ. పూర్తిచేసిన భాస్కరరావు విదేశాలకు వెళ్ళి సి.యస్. (సివిల్ సర్వీసు) పరీక్షలో ఉత్తీర్ణుడై కలెక్టర్‌గా మారి కమలాపురానికి వస్తాడు. భాస్కరరావు కమలాపురానికి వచ్చిన తరువాత అమృతరావు 'ఇందిరాబాయిని' పెళ్ళిచేసుకుంటావా? అని అడుగుతాడు. భాస్కరరావు అందుకు ఒప్పుకుంటాడు. అప్పటికే భాస్కరరావుని ఇష్టపడుతున్న ఇందిరాబాయి కూడా భాస్కరరావుతో వివాహానికి ఒప్పుకుంటుంది. భాస్కరరావు, ఇందిరాబాయిల వివాహం జరుగుతుంది. ఈ వివాహం గురించి తెలుసుకున్న అంబాబాయి, భీమారావు తాము తప్పుచేశామని పశ్చాత్తాపపడతారు. అమృతరావు, జలాక్షి, భాస్కరరావు వారిని క్షమించి తమ ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తారు. దీనితో కథ ముగుస్తుంది.

### 3.1.4. ఇందులేఖ - ఇతివృత్తం

ఇందులేఖ నవల ఒక ప్రేమకథ. ఇందులో మాధవుడు, ఇందులేఖల ప్రేమకథ వర్ణించబడింది. ఇందులేఖ నవల కథా నాయకుడు మాధవుడు. మాధవుడు నాయర్ 'తరవాడు' (ఉమ్మడి) కుటుంబానికి చెందిన వ్యక్తి. మాధవుడు సభ్యుడిగా ఉన్న ఉమ్మడి కుటుంబం (తరవాడు) పెద్ద పంజుమీనన్. ఈ పంజుమీనన్‌కి మాధవుడు మనమడు. పంజుమీనన్ భార్య కుంజియకుట్టియమ్మ, పంజుమీనన్‌కి కుంజియకుట్టియమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఇందులో ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కృష్ణన్ కుట్టిమీనన్, గోవిందన్ కుట్టిమీనన్

కుమారులుకాగా లక్ష్మి కుట్టియమ్మ కూతురు. ఈ లక్ష్మి కుట్టియమ్మ కూతురు 'ఇందులేఖ'. ఇందులేఖ పంజుమీనన్‌కి వరుసకి మనుమరాలు. పంజుమీనన్ సోదరుడు శంకరమీనన్. సోదరి పార్వతియమ్మ. ఈ పార్వతియమ్మ కూతురి పేరు కూడా పార్వతియమ్మనే. ఈ పార్వతీయమ్మ పంజుమీనన్‌కి వరుసకి కోడలు అవుతుంది. ఈ కోడలు పార్వతీయమ్మకి గోవింద పణిక్కర్‌కి మాధవుడు పుట్టాడు. ఈ విధంగా మాధవుడు పంజుమీనన్‌కి మనవడు అవుతాడు. తరవాడు చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం. ఈ కుటుంబంలో పంజుమీనన్ దగ్గరి బంధువులతో పాటు దూరపు బంధువులు కూడా కలిసి జీవించేవారు. పంజుమీనన్ అమ్మమ్మపేరు పంజుమీనన్ అవ్వ. ఈ అవ్వ చెల్లెలి మనుమరాలు కుమ్మినియమ్మ. ఈమె వరుసకి పంజుమీనన్‌కి సోదరి అవుతుంది. ఈ కుమ్మినియమ్మ భర్త శీనుభట్టర్. వీరికి నలుగురు సంతానం. ఇందులో ముగ్గురు కుమారులుకాగా ఒక కుమార్తె. సాత్తరమీనన్, గోపాలన్, చిన్నడు కుమ్మినియమ్మ, శీనుభటర్‌ల కుమారులు కాగా కళ్యాణకుట్టి కుమార్తె. వీరంతా ఒకే కుటుంబంలోని వాళ్లు. ఈ కుటుంబంలోని సభ్యుల మధ్య ఉన్న సంబంధాలను ఈ కింది పట్టిక ద్వారా సులభంగా అర్థం చేసుకోవచ్చు.




(జయప్రకాశ్, ఎస్ (అ). 2016: xv)

మాధవుడు తనకు సోదరుని వరుస అయిన చిన్నడికి ఆంగ్ల విద్య నేర్పించాలనుకుంటాడు. 70 సంవత్సరాల వయస్సు కలిగిన ఇంటిపెద్ద (కారణవన్) పంజుమీనన్ దీనికి ఒప్పుకోడు. మాధవుడు పంజుమీనన్‌ని చిన్నడి విద్యాభ్యాసం గురించి అడగగా అతను తిరస్కరిస్తాడు. అతని విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును కూడా తాను భరించనని ఖరాఖండిగా చెప్పేస్తాడు. ఈ విషయం గురించి మాధవుడు పంజుమీనన్‌తో గొడవపడతాడు.

మాధవునికి ఇందులేఖ అంటే ఇష్టం. ఇందులేఖ వరసకి మాధవునికి మరదలు. ఇందులేఖకి పది, పదకొండు సంవత్సరాల వయస్సు రాగానే ఇంటిపెద్ద పంజుమీనన్ మంచి వరున్ని చూసి వివాహం చేయాలనుకుంటాడు. అప్పటికే ఇందులేఖ మాధవుడిని ఇష్టపడుతుంది. ఇందులేఖ తన ఇష్టాన్ని మాధవుడికి చెప్పదు. తన ఇష్టాన్ని చెప్పడంవల్ల మాధవుడి చదువు ఆగిపోతుందని ఇందులేఖ అభిమతం. ఇందులేఖపై మరలుగొన్న మాధవుడు తాను మద్రాసునుండి ఇంటికి వచ్చిన ప్రతీసారి ఇందులేఖ చుట్టే తిరిగేవాడు. ఇందులేఖ తనకు సొంతమైతే తనకన్నా అదృష్టవంతుడు ఇంకొకడు ఉండదని మాధవుడు మనస్సులో అనుకుంటాడు. తనప్రేమని ఇందులేఖతో ఎలా తెలపాలో తెలియక సతమతమౌతాడు. పరోక్షంగా తన ప్రేమని ఇందులేఖకు తెలుపుతాడు. మాధవుడి మనోగతం తెలిసినా ఇందులేఖ ఏమీ అనకుండ కాలయాపన చేస్తుంది. ఒకరోజు మద్రాసునుండి మాధవుడు బి.ఎల్‌లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైనట్లు తంతివస్తుంది. అది చదివి ఇందులేఖ ఆనంద పడుతుంది. మాధవుడు మాత్రం అదేమీ గొప్ప విషయం కాదని తేలికగా తీసిపారేస్తాడు. తాను మాధవుడి ప్రేమని ఒప్పుకుంటే అతని చదువు పాడౌతుందని అనుకున్న ఇందులేఖ ఆ తంతివార్త చూడగానే తన మనస్సును మార్చుకుంటుంది. మాధవుడిని బాధ పెట్టడం ఇష్టంలేక తాను మాధవున్ని ఇష్టపడుతున్నట్లు అతనే తనభర్త అని చెప్తుంది. మాధవుడి సంతోషానికి అవధులు లేకుండా పోతాయి. తాను బి.ఎల్.లో ఉత్తీర్ణత సాధించిన దానికంటే ఇందులేఖ ప్రేమ లభించడమే గొప్ప సంతోషాన్నిచ్చిందని ఉబ్బితబ్బిబ్బౌతాడు.

అప్పటివరకు ఇందులేఖని మాధవుడికి ఇచ్చి పెళ్లిచేద్దాం అనుకున్న ఇంటిపెద్ద పంజుమీనన్ మాధవుడు తనని ఎదురించడంతో తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఇందులేఖ తల్లి లక్ష్మీకుట్టియమ్మను పిలిచి ఇందులేఖని మాధవునికి ఇచ్చేది లేదని చెప్తాడు. దానికి

లక్ష్మీకుట్టియమ్మ, ఆమె భర్త కేశవన్ నంబూద్రి అంగీకరిస్తారు. ఈ విషయం ఇందులేఖకి తెలిసి బాధపడుతుంది. మాధవుడి దగ్గరికి వెళ్లి మనం ఇద్దరం మద్రాసుకు వెళ్లి సంతోషంగా ఉందాం అంటుంది. మాధవుడు అలా చేయడం వల్ల ఇందులేఖకి చెడ్డపేరు వస్తుందని, అది తనకి ఇష్టం లేదని అంటాడు. అదీగాక తనకు భార్యను పోషించేస్థాయి ఇంకా రాలేదని ఉద్యోగం వచ్చాక తానే ఇందులేఖను వివాహమాడి మద్రాసుకు తీసుకువెళ్తానంటాడు. మాధవుడు ఇందులేఖని ఇష్టపడుతున్నాడని అతని తండ్రి గోవింద పణిక్కర్‌కి తెలుస్తుంది. గోవింద పణిక్కర్ మాధవుడు, ఇందులేఖల ప్రేమని సమర్థిస్తాడు. అంతేకాక చిన్నని ఇంగ్లీషు చదువుకి కరణవాన్ పంజుమీనన్ డబ్బులు ఇవ్వకున్నా పర్వాలేదు తనసొంత డబ్బులతో చిన్నని చదివిస్తానంటాడు. ఈసారి మద్రాసు వెళ్లేటప్పుడు చిన్ననికూడా మాధవుని వెంట తీసుకువెళ్లమంటాడు. తండ్రి ఆజ్ఞ ప్రకారం చిన్నని తండ్రి శీనుభట్టర్‌ని ఒప్పించి మాధవుడు చిన్నడిని తనతోపాటు మద్రాసుకు తీసుకువెళ్తాడు.

మాధవుడు తనని కాదని చిన్నడిని మద్రాసుకు తీసుకువెళ్లడం పంజుమీనన్‌కి నచ్చదు. పంజుమీనన్ చిన్నని తండ్రి శీనుభట్టర్ అన్నలు సాత్తరమీనన్, గోపాలన్‌లపై కోప్పడతాడు. “అసలు దూరపు బంధువులైన మిమ్మల్ని మా ఇంట్లో చేర్చుకోవడమే నేను చేసిన తప్పు. దానికి తగిన ఫలితం నాకు ఇవ్వాళ లభించింది. ఇకపై మీకు నా నుండి ఎలాంటి సహాయం అందదు” అంటూ వారిపై ఆంక్షలు విధిస్తాడు. ఇందులేఖ తండ్రి కేశవన్ నంబూద్రిని పిలిచి వెంటనే మూర్కిల్లాత్తమనైక్కల్ నంబూద్రిపాదును ఇందులేఖను చూసి వెళ్లడానికి రమ్మని ఉత్తరం రాయమంటాడు. నంబూద్రిపాదు పంజుమీనన్ ఇంటికి వస్తున్నట్లుగా ఉత్తరం అందుతుంది.

‘కణ్ణళిసూరి నంబూద్రిపాదు’ మూర్కిల్లాత్తమనై కుటుంబంలో పుట్టిన గొప్ప ధనవంతుడు తనను చూడగానే ఎవ్వరైనా ఇష్టపడతారనే అహంకలిగిన నంబూద్రి తనకు 45 సంవత్సరాల వయస్సుఉన్నా యువకునిగానే ప్రవర్తిస్తాడు. ఇందులేఖని చూసి వెళ్లవలసిందిగా పంజుమీనన్ నుండి లేఖ అందిన మరుక్షణం నుండే ఇందులేఖని గురించి ఆలోచించడం మొదలుపెడతాడు. ‘ఇందులేఖ’ సౌందర్యం గురించి విని మురిసి పోతాడు. ఎలాగైనా ఇందులేఖని వివాహం చేసుకొని తన ఇంటికి తీసుకు రావాలని తన స్నేహితులతో కలిసి ఇందులేఖ ఇంటికి వెళ్తాడు. మనసులో మాధవున్ని వరించిన ఇందులేఖ నంబూద్రిపాదు వచ్చిన విషయాన్ని గమనించక తనగదిలో తనకిష్టమైన పుస్తకాలు చదువుతూ ఉంటుంది. ఇందులేఖ తల్లి లక్ష్మీకుట్టియమ్మ తన

కూతురు మాధవున్ని ఇష్టపడుతున్నట్లు తెలుసుకుంటుంది. ఇందులేఖ ప్రేమని సమర్థిస్తుంది. మద్రాసునుండి వచ్చిన గోవిందన్‌కుట్టి తెచ్చిన ఉత్తరం ద్వారా మాధవునికి మద్రాసులో ఉద్యోగం దొరికినట్లుగా ఇందులేఖ తెలుసుకుంటుంది. సంతోష పడుతుంది. మాధవునితో తనవైవాహిక జీవితాన్ని ఊహించుకొని ఆనందపడుతుంది. ఈ విషయం తెలియని ఇంటి పెద్ద పంజుమీనన్ భార్య కుంజియకుట్టి అమ్మ నంబూద్రిపాడు సంపదని చూసి ఇందులేఖ ఆనందపడుతుందని అనుకుంటుంది. ఇందులేఖకి, నంబూద్రిపాడుకి వివాహం జరిగిపోయినట్లే అని మనసులో అనుకుంటుంది. ఒకరోజు నంబూద్రిపాడు ఇందులేఖని చూడడానికి ఆమెగదికి వెళ్తాడు. నంబూద్రిపాడు అంటే నచ్చని ఇందులేఖ అతన్ని నవ్వులపాలు చేసి అతనే తన గదిలోనుండి వెళ్లిపోయేలా చేస్తుంది. ఇందులేఖవద్ద భంగపడ్డ నంబూద్రిపాడు ఇందులేఖ తల్లి లక్ష్మీకుట్టియమ్మని మోహిస్తాడు. ఈ విషయాన్ని అందరిముందు బాహాటంగా చెప్తాడు. అంతవరకు నంబూద్రిపాడుపై మంచి అభిప్రాయాన్ని కలిగిఉన్న ఇంటిపెద్ద పంజుమీనన్ ఈ మాటలతో నంబూద్రిపాడుపై తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఇందులేఖకి ఇష్టంలేకుండా నంబూద్రిపాడుకి ఇందులేఖను ఇచ్చేది లేదని తీర్మానించుకుంటాడు. ఈ విషయం తెలిసి ఇందులేఖ సంతోష పడుతుంది. రెండవసారి తనని చూడడానికి తనగదిలోకి వచ్చిన నంబూద్రిపాడును ఇందులేఖ నవ్వులపాలుచేయడమేకాక తాను అతన్ని వివాహం చేసుకోనని తెగేసి చెబుతుంది. ఇందులేఖ ప్రవర్తనతో ఖంగుతిన్న నంబూద్రిపాడు ఇందులేఖకి బదులుగా అదే ఇంట్లో ఉన్న కళ్యాణకుట్టిని వివాహం చేసుకొని తన ఊరికి వెళ్లిపోతాడు. ఈ వివాహం రాత్రి సమయంలో జరుగుతుంది. పూర్తిగా తెల్లవారక ముందే నంబూద్రిపాడు కళ్యాణకుట్టిని తీసుకొని తన ఊరికివెళ్లిపోతాడు. అప్పటికే నంబూద్రిపాడు ఇందులేఖని వివాహం చేసుకోవడానికి పంజుమీనన్ ఇంటికి వచ్చాడని బయట బాగా ప్రచారమై ఉండడంవల్ల నంబూద్రిపాడు ఇందులేఖని వివాహం చేసుకొని తన ఇంటికి తీసుకెళ్లాడని అందరూ అనుకుంటారు. ఈ విషయం బాగా ప్రచారమౌతుంది. మద్రాసులో తనకు ఉద్యోగం లభించడం వల్ల ఇందులేఖను వివాహం చేసుకొనే ఉద్దేశంతో మాధవుడు తన ఊరికి వెళ్తాడు. అతను రైల్వేస్టేషన్‌లో దిగగానే అక్కడ ఉన్న ప్రయాణికులు ఇందులేఖకు, నంబూద్రిపాడుతో వివాహం అయినట్లుగా మాట్లాడుకోవడం వింటాడు. ఈ విషయం గురించి అదే స్టేషన్‌లో ఉన్న తన స్నేహితుడు శంకరశాస్త్రిని అడుగుతాడు. శంకరశాస్త్రి తాను విన్న విషయాల ఆధారంగా ఇందులేఖ, నంబూద్రిపాడుల వివాహం జరిగిన మాట వాస్తవమేనని మాధవునితో చెప్తాడు. మాధవుడు

బాధపడతాడు. ఇంటికి వెళ్లడం ఇష్టంలేక మద్రాసుకు వెళ్తాడు. అక్కడనుండి ఉత్తర భారతదేశ యాత్రకి వెళ్తాడు. తాను యాత్రకి వెళ్తున్నట్లు ఇంటివారికి ఒక ఉత్తరం ద్వారా తెలుపుతాడు. మాధవుని ఉత్తరం చదవగానే ఇంట్లో ఉన్నవారందరు బాధపడ్డారు. ఇందులేఖ తనని గురించి మాధవుడు తప్పుగా ఊహించుకున్నందుకు చింతిస్తుంది. గోవిందపణిక్కర్, గోవిందకుట్టిమీనన్ మాధవున్ని ఇంటికి తిరిగి తీసుకురావడానికి బయలుదేరుతారు. ఉత్తర భారతదేశ యాత్ర నిమిత్తం బయలుదేరిన మాధవుడు కలకత్తా, బొంబాయి నగరాలను వీక్షిస్తాడు. కలకత్తా నగరాన్ని మాధవుడు వీక్షిస్తున్న సందర్భంలో బాబుగోవిందసేన్ అనే వ్యాపారితో మాధవునికి పరిచయం ఏర్పడుతుంది. ఉత్తర భారతదేశ యాత్రలో కావాల్సిన ఆర్థిక సహాయాన్ని బాబుగోవిందసేన్ మాధవునికి అందిస్తాడు. ఈ బాబుగోవిందసేన్ స్నేహితుదు 'గోపీనాథబెనర్జి' ఇతనుకూడా గొప్పవ్యాపారస్థుడు. బాబుగోవిందసేన్ కుమారుడు కేశవచంద్రసేన్, ఇతను బొంబాయిలో గవర్నమెంట్ ఉద్యోగిగా ఉంటాడు. మాధవున్ని వెతుకుతూ గోవిందపణిక్కర్, గోవిందకుట్టిమీనన్ బొంబాయికి వెళ్తారు. అక్కడ కేశవచంద్రసేన్‌ని కాకతాళీయంగా కలుసుకుంటారు. కేశవచంద్రసేన్ మాధవుని ఆచూకి గోవిందపణిక్కర్, గోవిందకుట్టిమీనన్‌లకి చెప్తాడు. కేశవచంద్రసేన్ ఇంట్లో మాధవుడు గోవిందపణిక్కర్, గోవిందకుట్టి మీనన్‌లను కలుసుకుంటాడు.

గోవిందపణిక్కర్, గోవిందకుట్టిమీనన్‌లతో కలిసి మాధవుడు ఇంటికి చేరుకుంటాడు. మాధవుని రాకతో అందరూ సంతోషిస్తారు. మాధవుడు లేని సమయంలో ఇందులేఖ మాధవునికోసం దిగులుపడటం చూసి పంజుమీనన్ తన మనసుని మార్చుకుంటాడు. ఇందులేఖని మాధవునికి ఇచ్చి వివాహం జరిపించాలని నిశ్చయించుకుంటాడు. అనుకున్న ప్రకారం మాధవుడు, ఇందులేఖల వివాహం జరిపిస్తాడు. దీనితో కథ సుఖాంతమవుతుంది.

## 3.2. ఇతివృత్తం - తులనాత్మక పరిశీలన

"నవలలో కేవలం కథ చెప్పడం ఉండదు. ఇతివృత్తం రూపంలో కథ ప్రస్తుతీకరింప బడుతుంది. కథలో సంఘటనలు జరిగిన క్రమంలో చెప్పబడుతాయి. ఇతివృత్తంలో కూడా సంఘటనలను చెప్పడం ఉంటుంది. కాని సంఘటనల వెనుక ఉన్న కారణాల వివరణకు ప్రాధాన్యం ఉంటుంది. కథలో 'తర్వాత' అని అడుగుతాము. ఇతివృత్తంలో ఎందుకూ? ఎలా?

అని అడుగుతాము. అని కథకు, ఇతివృత్తానికి ఉన్న భేదాన్ని ఫార్‌స్టర్ వివరించారు." (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 126) ఈ వివరణవల్ల నవలలోని కథని రచయిత పాఠకులకు అందించిన విధానం కథాశిల్పిగా చెప్పవచ్చు. ఈ క్రమంలో నవలా కథ ఇతివృత్తంగా మారుతుంది. కథ ఇతివృత్తంగా మారే క్రమంలో కథనం ప్రధాన భూమిక వహిస్తుంది.

"కథనం సాధారణంగా కథా వస్తువు స్వభావంమీద ఆధారపడి ఉంటుంది. వస్తువు ఎన్ని రకాలుగా ఉంటుందో కథనం కూడా అన్ని రకాలుగా ఉండటానికి వీలుందని మహారచయిత టాల్‌స్టాయ్ భావించాడు." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 47). కథా వస్తువు అంతిమ లక్ష్యం పాఠకునిలో రచయిత ఆశించిన ప్రతిస్పందనని కలిగించడం. పాఠకుని ప్రతిస్పందనకి అనుగుణంగానే కథనం ఉంటుంది. ఈ కథనంలో అనేక రకాలు ఉన్నా "వాస్తవిక కథనం, (ఫాంటసీ), అంతరర్థ కథనం (అలిగరీ), దినచర్య కథనం, లేఖా కథనం, చైతన్యస్రవంతి కథనం వీటిలో ప్రధానమైనవి."(వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 47).

**i. వాస్తవిక కథనం (ఫాంటసీ)**

"మితిమీరిన అలంకారికత, నైరూప్యత, అసంభావ్యత కాకతాళీయత ప్రతీకలు లేని కథనం వాస్తవిక కథనం. కథ ఎలా చెప్పబడిందో అలా జరగడానికి వీలుందన్న నమ్మకం పాఠకునిలో కలిగినప్పుడు వాస్తవిక కథనం విజయవంతమైనట్టుగా భావించవచ్చు. వాస్తవికంగా కథను చెబుతూ ఉన్నప్పుడు కాలక్రమాన్ని తప్పకుండా పాటించాలన్న నియమం ఎక్కడా లేదు. కాలాన్ని తారుమారు చేయవచ్చు. వాస్తవికతను ఆధారంగా చేసుకొని ఊహా ప్రపంచంలోకి వెళ్లిపోవడం 'ఫాంటసీ'. ఫాంటసీ అవాస్తవికంగా ఉంటూనే గొప్ప జీవిత వాస్తవికతను ఆవిష్కరిస్తుంది." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 58).

**ii. అంతరర్థ కథనం (అలిగిరీ)**

"ఇందులో బయటికి ఒక కథా వస్తువు, కథా పాత్రలు కన్పిస్తాయి. కానీ లోతుగా పరిశీలిస్తే కథ వెనుక కథ, పాత్ర వెనుక పాత్రలు, కథా వస్తువు వెనుక మరొక కథా వస్తువు స్ఫురిస్తాయి. ఇది వాస్తవికంగానూ, ఫాంటసీగానూ కూడా ఉండవచ్చు.(వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 59).

**iii. లేఖా కథనం**

"నవలలోని ముఖ్య పాత్రలు పరస్పరం రాసుకున్న ఉత్తరాలతో కథను నడిపించడం ఈ పద్ధతిలోని ప్రధానమైన అంశం. నవలలో రెండు మూడు ప్రధాన పాత్రలు మాత్రమే ఉంటే ఈ పద్ధతిని అనుసరించడం సులభంగానే ఉంటుంది. లేకపోతే ఇతర పాత్రలను గురించిన విషయాలను కూడా ప్రధాన పాత్రలు రాసుకునే విషయాల్లోకి చొప్పించవలసి ఉంటుంది.(వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 63).

**iv. దినచర్య కథనం**

"లేఖ ఒకరు మరొకరితో మాట్లాడటం, డైరీ తనతో తానే మాట్లాడుకోవడం. ఇందులో కథనం నవలలో పాత్రలు రాసుకున్న దినచర్యల(డైరీ) ఆధారంగా జరుగుతుంది". (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 65).

**v. చైతన్య స్రవంతి కథనం**

"తర్కబద్ధంగా ఒక భావం తరువాత మరొక భావాన్ని ఆలోచించుకుంటూపోవడం మనసు సాధారణ స్వభావం కాదు. ఒక భావాన్ని గురించి ఆలోచిస్తూ దానితో సంబంధం ఉన్న విషయాలను, అప్పుడప్పుడు సంబంధం లేని విషయాలను మనసు ఆలోచిస్తుంది. మానవుడి మనసులో చెలరేగే విభిన్నమైన, తర్క విరుద్ధమైన భావాలు, తర్కబద్ధమైన భావాలతో కలసి ప్రవాహంలా సాగుతాయి. ఆ ప్రవాహశీలతను సూచించడమే చైతన్యస్రవంతి. ఇందులో క్షణికమైన మానసిక అనుభవాన్ని ఉన్నది ఉన్నట్లుగా కథనంలో చెప్పడం ఉంటుంది." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 66).

**vi. తులనాత్మక పరిశీలన**

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో వాస్తవిక, అంతరర్ధ కథనాలు కనిపిస్తాయి. శ్రీరంగరాజుచరిత్ర, ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో వాస్తవిక కథనం ఉంది. ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో అంతరర్ధ కథనం ఉంది. ఇందిరాబాయి నవలలో కనిపించే కుటుంబ సంఘర్షణ, ఒక కుటుంబంపై ఇంకొక కుటుంబం కుయుక్తులు పన్నడం, డబ్బు ఉన్న కుటుంబాలు విజయం సాధించడం. వంటి అంశాలు పంతొమ్మిదవ శతాబ్దంలోనే కాక నేడు కూడా కన్పిస్తాయి. ఇందులేఖ నవల కథనంలోని కుటుంబ అంతరంగిక సంఘర్షణ నేడు కూడా కన్పిస్తుంది. ఇందిరాబాయి నవల చివరిలో భాస్కరరావు ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఇందిరాబాయిని వితంతు వివాహం చేసుకున్నట్లే ఇందులేఖ నవలలో కూడా మాధవుడు ప్రభుత్వ

ఉద్యోగం సాధించిన తర్వాత ఇందులేఖను వివాహం చేసుకుంటాడు. ఇది ఉద్యోగం వచ్చిన తర్వాత వివాహం చేసుకునే సమాజ వాస్తవ సంప్రదాయానికి చిహ్నం. ఇందిరాబాయి నవలలో సుందరరావును భీమారావు హత్యచేసి అందులోనుండి బయటపడ్డ సందర్భంలోనూ, ఇందులేఖ నవలలో ఇందులేఖ తనతో సంబంధం ఏర్పర్చుకోవడానికి వచ్చిన నంభూద్రి పాడుతో ప్రవర్తించిన తీరులో కొంత కాకతాళీయత, అసంబద్దత కనిపిస్తుంది. ఈ కాకతాళీయత, అసంబద్దత నవల వాస్తవిక కథనానికి లోబడి జరింగిందే కానీ, వాస్తవికతను వీడి జరగలేదు. శ్రీరంగరాజుచరిత్ర నవలలో ఇంటిని వీడిన శ్రీరంగరాజు అడవిలో చిన్నప్పుడు తప్పిపోయిన తన మరదలు "సోనాబాయిని" కలుసుకోవడంలో కొంత కాకతాళీయత కన్పిస్తుంది. ఈ కాకతాళీయతలో అతిశయోక్తి కన్పించదు. శ్రీరంగరాజు తాను 'కాకతాళీయంగా' కలిసిన సోనాబాయిని లంబాడీస్త్రీగా ఇష్టపడతాడే కానీ తన మరదలిగా కాదు. ఇదే అంశం శ్రీరంగరాజుకు, అతని స్నేహితుడు 'రామయ్యకు' మధ్య కులాల గొప్పతనానికి సంబంధించిన చర్చకు దారితీస్తుంది. ఈ చర్చలో శ్రీరంగరాజు లంబాడీలు గొప్పవారని చెప్తాడు. ఈ విధంగా నవలలో కల్పించబడ్డ కాకతాళీయ సంఘటన సామాజిక వాస్తవికతకి దారితీస్తుంది. శ్రీరంగరాజుచరిత్ర నవల కథలో కొంత కాల్పనికత కనిపించినా ఆ కాల్పనికత చాటున ప్రస్తావనకి వచ్చిన కులవివక్ష, అంటరానితనం, బాలికా అపహరణ వంటి అంశాలు వాస్తవికాంశాలు.

తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో అంతరర్థ కథనం కనిపిస్తుంది. ఈ నవలా కథనం మహమ్మదీయ పాలన పరిస్థితుల పరిచయంతో మొదలై ప్రతాపముదలియార్ చరిత్ర వివరణతో కొనసాగుతుంది. ఇలా కొనసాగే క్రమంలో అనేక పాత్రలు, అనేక ఉపకథలను చెప్పడం కన్పిస్తుంది. ఈ ఉపకథలలో నవలా పాత్రల ఉపకథలు కొన్ని కాగా నవలా కథ మధ్యలో నీతిని బోధించడానికి వచ్చిన ఉపకథలు మరికొన్ని. అలెగ్జాండర్ తల్లి ప్రేమ, పర్షియా, ఆస్ట్రియా రాజుల మాతృప్రేమ, మిల్టన్, సోక్రటీస్ భార్యల కౄరత్వం, బేక్సన్ విద్యాభిప్రాయం, క్రానాడ్ విజయ ప్రశంసలకు సంబంధించిన కథలు నీతిని బోధించేవి కాగా, కనకసబై, కరుణానందం పిళ్ళై, ఆన్డిచ్చియమ్మాళ్ కథలు నవలా పాత్రాగత కథలు. ఈ నవలలో స్థూలంగా ప్రతాపముదలియార్ కథ చాటున తమిళ ప్రాంత దురాచారాలను తెలియపరిచే కథా వస్తువు

కనిపించినప్పటికీ ఈ కథ, కథా వస్తువు చాటున అనేక ఉపకథలు, కథా వస్తువుల ప్రస్తావన కన్పిస్తుంది.

### 3.2.1. ఇతివృత్తం - నిర్మాణం

ఇతివృత్త నిర్మాణంలో ఇందిరాబాయి, ఇందులేఖ, శ్రీరంగరాజుచరిత్ర నవలలో 'నిబిడబంధం' (organic plot) కన్పిస్తుంది. అంటే ఈ నవలలో పాత్రల కంటే వస్తువు ప్రధానంగా కనిపిస్తుంది. ఎక్కడ కూడా ప్రధాన కథ పూర్తిగా మరుగున పడ్డట్టుగా కనిపించదు. ప్రతాపముదలియార్ చరిత్ర నవలా కథనంలో 'శిథిలబంధం' (loose plot) కన్పిస్తుంది. "పాత్రల ప్రాధాన్యంగల నవల శిథిలబంధంగల నవల అనబడుతుంది. దీనిలో కథకు ప్రాధాన్యం తక్కువ, రచయిత నిర్ధిష్టమైన పాత్రలను చిత్రించదలచుకొని వాటిచుట్టూ వాటి నిజ గుణాలకు అనుగుణంగా సన్నివేశాలను, ఇతివృత్తాన్ని సృష్టిస్తాడు."(సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 128). ప్రతాపముదలియార్ చరిత్రలో ప్రతాపముదలియార్ పాత్రకి సమాంతరంగా కనక సభ, సంబంధముదలియార్, కరుణనందం పిళ్ళై వంటి పాత్రల ఇతివృత్తాలు చెప్పబడ్డాయి. ఈ పాత్రల ఇతివృత్తాలు చదువుతున్న సందర్భంలో ప్రధాన కథ కొంతకాలం మరుగునపడుతుంది. ఉపకథ పూర్తికాగానే మళ్ళీ ప్రధాన కథ మొదలవుతుంది. దీనివల్ల శిథిలబంధంతో కూడిన ఇతివృత్త నిర్మాణం ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కన్పిస్తుంది.

### 3.2.2. కథ, కథా వస్తువు

కథ లేకుండా ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కథానికలను ఊహించలేం నవలలో ఏముంటుంది? అన్న ప్రశ్నకి ప్రాథమికంగా వచ్చే సమాధానం 'కథ'. నవల ఏం చెబుతుంది? అన్న ప్రశ్నకి వచ్చే సమాధానం 'కథావస్తువు'. కథావస్తువు లేని నవలలు (కాలక్షేప) ఉండవచ్చు. కానీ కథలేని నవలలు ఉండవు. అందుకే ఇ.ఎమ్. ఫార్‌స్టర్ నవలలోని కథ గురించి చెబుతూ "కథ లేక పోతే నవలే లేదన్నాడు." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 19). సోమర్‌సెట్ మామ్ వంటివాళ్లు నవలలో కథ ఉంటుందని అంగీకరించారు. "పాఠకుడి ఆసక్తిని చెదరకుండా నిలిపేది కథే కాబట్టి కథ తప్పనిసరిగా నవలలో ఉండాలని చెప్పారు.

నవల అంతర్గతంగా కథ దాగి ఉంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే కథ విస్తారాన్నిబట్టి నవల నిడివి ఆధారపడి ఉంటుంది. రచయిత ఎన్నుకున్న కథ, నిడివి పెద్దగా ఉంటే నవల పరిమాణం కూడా పెరుగుతుంది. కథ మరీ చిన్నదిగా ఉన్న సందర్భంలో అది కథానిక అవుతుంది. మొత్తంమీద 'కథ' నవలకి ఆత్మ. ఈ కథ పునాది మీదే నవల రూపుదిద్దుకుంటుంది. కథా గమనం, గమ్యం బట్టి నవల ప్రయోజనాలు నిర్దేశితమవుతాయి. సమాజ శ్రేయస్సును కాంక్షించే 'కథ' కలిగిన నవల సమాజ అభివృద్ధి వైపు పయనిస్తుంది. సమాజ లోపాన్ని సరిదిద్దుతూ సమాజాన్ని ఉన్నత శిఖరాలవైపుకి నడిపిస్తుంది. నవలలోని కథ ప్రధాన ధ్యేయం పాఠకుల మనస్సును రంజింపజేయడం మాత్రమే అయినప్పుడు ఆ నవల కాలక్షేప నవలగా రూపుదిద్దుకుంటుంది. అలా కాక 'కథ' రాజు గురించో, రాజ్యం గురించో చెబితే అది చారిత్రక 'నవల' అవుతుంది. కథ మానసిక సంఘర్షణ గురించి చెబితే అది మనోవైజ్ఞానిక నవల అవుతుంది. మొత్తంమీద "కథ సంఘటనల వరుసక్రమం" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 19). ఈ సంఘటనలు రచయిత దృక్పథాన్ని బట్టి ఆలోచన విధానాన్ని బట్టి మారుతుంటాయి. కథకి ప్రాథమిక ముడిసరుకు మానవజీవితం రచయిత తన జీవితంలో తాను ప్రేరణ పొందిన సంఘటనలను బట్టి కథలో ఈ సంఘటనల కూర్పు మారుతుంది. సంఘజీవిగా ఉన్న రచయిత ఏ అంశంనుండైనా, ఎప్పుడైనా, ఎక్కడినుండైనా ప్రేరణ పొందవచ్చు. ఈ ప్రేరణ అనేక విధాలుగా పొందే ఆస్కారం ఉంది. ఆదిమకాలంలో శ్రమజీవిగా ఉన్న మానవుడు శ్రమని మరిచిపోయే ఉద్దేశంతో కాలక్షేపం నిమిత్తం కాల్పనిక సంఘటనలు జోడించి కథ చెప్పడం ప్రారంభించాడు. ఇక్కడ శ్రమనుండి విశ్రాంతి పొందటం అనే అవసరం నుండి ప్రేరణ పొంది కాల్పనిక కథలను సృష్టించడం జరిగింది. పరిణామ క్రమంలో సంచార జీవనం వీడి అన్ని విధాలుగా మానవుడు స్థిరపడిన తరువాత సమాజం పురుడు పోసుకుంది. స్థిర జీవితం ఏర్పరుచుకున్న మానవ సమూహంతో సమాజం ఏర్పడింది. ఈ సమాజంలో అంతర్గత సంఘర్షణలు మొదలయ్యాయి. వ్యక్తికి, వ్యక్తికి మధ్య, వ్యక్తికి, సంఘానికి మధ్య, వ్యవస్థకి, వ్యక్తికి మధ్య మొదలైన ఈ సంఘర్షణల ప్రేరణతో సామాజిక, సాంఘిక నవలలు వచ్చాయి. రచయిత ప్రేరణ నవల కథకి బీజం వంటిది. రచయిత తాను సమాజ లోపాలని సరిదిద్దాలి అనుకున్నప్పుడు ఆ దిశగా అడుగులు వేస్తాడు. ఇందులో భాగంగా ప్రత్యక్షంగా, భౌతికంగా తాను అప్పుడున్న సమాజానికి ఎదురొడ్డి నిలబడి సమాజ లోపాన్ని ఎత్తి చూపవచ్చు లేదా సాహిత్య మాధ్యమం ద్వారా సమాజ లోపాలను సంఘటనలుగా

ఒక వరుస క్రమంలో కూర్చి విస్తార కథ ద్వారా నవలని రచించవచ్చు. రచయిత లక్ష్యాన్ని బట్టి, ప్రేరణని బట్టి సాహిత్యం రూపాన్ని మార్చుకుంటుంది. అప్పటి సమాజాన్ని అప్పటికప్పుడు తక్కువ పరిధిలో ఉత్తేజ పరచడం రచయిత లక్ష్యం అయితే అతని ఆలోచన ఉపన్యాసం రూపంలో లేదా మౌఖిక సాహిత్యమైన పాట రూపంలో వెలువడుతుంది. ఈ లక్ష్యం కొంత విస్తృతిని కాంక్షించినపుడు తన ముందు ఉన్న, తాను జీవించిన, తాను నడయాడిన సమాజాన్ని కాక అలాంటి సమస్య ఉన్న యావత్ మానవ సమాజాన్ని ఉద్దేశించినపుడు అతని ఆలోచనలు లిఖిత సాహిత్యమైన కథ, కథానిక, నవల రూపంలో వెలువడుతాయి. కాలక్షేప ఉద్దేశంతో మొదలైన కథా గమనం, కథను చెప్పే లేదా రాసే వ్యక్తి యొక్క ఉద్దేశానుసారం నూతన సంఘటనలను, వస్తువులను జోడించుకుంటూ సామాజిక, సాంఘిక రాజకీయ నవలల ఆవిర్భావ దిశగా సాగింది. ఈ సమయంలో కథతో పాటూ కథలో ఏం ఉంది అన్న ప్రశ్నకి ప్రాధాన్యం ఏర్పడింది. చదువుకున్న వర్గం పెరిగి విద్య అందరికి అందుబాటులోకి వచ్చిన పంతొమ్మిదవ శతాబ్దం తొలినాళ్ళలో సామాజిక సమస్యలని ప్రజలకి చేరువ చేయడంలో నవల ప్రధాన మాధ్యమంగా పనిచేసింది. కాలక్షేపం నిమిత్తం కాక ఒక ఉద్దేశంతో నవలా రచన ప్రారంభమైంది. దీనితో నవలలో కథతో పాటు కథా వస్తువుకు ప్రాధాన్యం పెరిగింది. అందుకే కథా వస్తువులేని నవలకన్నా కథా వస్తువుతో ఉన్న నవలలకు ఆదరణ పెరిగింది. ఈ వస్తువులో విభేదాలు ఉన్నాయి. అలాగే కథలోను విభేదాలు ఉన్నాయి. నవల రాసే రచయిత నవలకి కథని ఎలా ఎన్నుకుంటాడు? ఏది ఉత్తమ ఎన్నిక? నవల కథ ఎలా నడుస్తుంది? నవల కథకి ఉండవలసిన లక్షణాలు ఏంటి? ఏది నవలా కథ ఉత్తమ లక్షణం? వంటి ప్రశ్నలు నవల కథకి సంబంధించి ప్రాథమిక అంశాలను అందిస్తాయి.

### 3.2.2.1. నవలాకథ - లక్షణాలు

"నవలా పఠనంలో పాఠకుల ఆసక్తిని చెదరకుండా చేసేది కథే అని సోమర్‌సెట్ మామ్" (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 123) అభిప్రాయం. ఇటువంటి కథ నిర్దిష్ట లక్షణాలతో ఉండక పోతే అది పాఠకుని ఆసక్తిని చురగొనలేదు. ప్రాథమికంగా నవలా రచయిత తాను చెప్పదల్చుకున్న సంఘటనని కథరూపంలో చెప్తాడు. ఈ 'కథ' నడిచే క్రమంలో కొన్ని లక్షణాలు సంతరించుకుంటుంది. నవలా కథకి మిగిలిన కథలకి స్వల్ప భేదం ఉంటుంది. చిన్న సంఘటన ప్రాతిపదికగా రూపొందిన కథానికలో కథ చిన్నదిగా ఉండి, తక్కువ నిడివిలో ముగుస్తుంది. కానీ

నవల నిడివి అధికం. ఇక్కడ రచయితకి విస్తార జీవితాన్ని చిత్రీకరించడానికి ఆస్కారం ఉంటుంది.

"నవలలోని ఇతివృత్తానికి మూల ప్రోతస్సు మానవ జీవితమని డబ్ల్యు.హెచ్ హడ్సన్ అంటాడు. రచయిత సమకాలీక వ్యక్తుల జీవిత పరిశీలనలో నవల ఇతివృత్తాన్ని సుస్సజితం చేయాలి. నిత్యజీవితంలోని మామూలు మనుషుల, మామూలు విషయాలను కాక రచయిత ఏదో పరమార్థాన్ని జీవిత సత్యాన్ని చాటగలిగి ఉండాలి. నవలా జీవితానికి భాష్యం కావాలి." (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 126). విస్తృత నిడివి కలిగిన 'నవలాకథ' బిగి తప్పకుండా ఉండాలంటే ప్రధానంగా రెండు లక్షణాలు ఉండాలి అంటారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు. అవి

"ఒకటి కథ సరైనచోట ప్రారంభమై, సరైనచోట ముగియడం. రెండు అన్ని విషయాలలోనూ అనివార్యత కలిగి ఉండడం". (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 20). ఈ రెండు లక్షణాలలో మొదటి లక్షణం నవల కథ ప్రారంభ, ముగింపులను ప్రస్తావిస్తుంది. రెండవ లక్షణం కథా సంఘటనల నడక గురించి తెలుపుతుంది. ఈ రెండు లక్షణాలు నవలా కథ విస్తృతి ఆధారంగా పేర్కొనబడ్డాయి. విశాలమైన మానవ జీవితంలో ఏ అంశాన్ని ఎన్నుకొని 'కథ' రాయాలన్నది రచయిత ఇష్టం. ఈ ఇష్టం నవలా కథగా రూపుదిద్దుకునే క్రమంలో ఖచ్చితంగా అది సరైనచోట ప్రారంభం కావలసి ఉంటుంది. అప్పుడే అది ఆ నవలని చదివే పాఠకుని మనస్సుని రంజింపజేస్తుంది. ఆశ్చర్యాన్ని ఉత్సుకతని కలిగించే సంఘటనతో నవలా కథ ప్రారంభం కావాలి. కథా గమనంలో కథను రచయిత నడిపించే తీరు ఇతివృత్తం రూపంలో దర్శనమిస్తుంది. కాలానుసరణ సంఘటనల క్రమం కథ, కాగా సంఘటనల మధ్య కార్యాకారణ సంబంధంతో ఇతివృత్తం నిర్మితమౌతుంది. "నవలలో కథ ఇతివృత్తం రూపంలో ఉంటుంది. నవలలోని కథ ఇతివృత్తంగా మారే క్రమంలో సంఘటనల మధ్య ఉండే సంబంధాన్ని బట్టి ఈ ఇతివృత్తానికి మూడు లక్షణాలు ఉంటాయని ఆచార్య ముదిగంటి సుజాతారెడ్డిగారు పేర్కొన్నారు. అవి (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 126).

### 3.2.2.1.1. విశ్వజనీనత

నవలా రచయిత ఏదో ఒక ప్రదేశంలో ఉండి, ఏదో ఒక జాతిని, సంఘాన్ని, దేశాన్ని గురించి వ్రాసినా ప్రపంచంలో ఏ ప్రాంతం వారైనా, ఏ దేశంవారైనా చదివినప్పుడు దానిలోని సంఘటనలు వ్యక్తులు తమవే అనిపించేటట్లుగా ఉండాలి.

ఈ లక్షణం భారతదేశానికిలోబడి దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపిస్తుంది. కన్నడ ప్రజలను ఉద్దేశించి రాసిన ఇందిరాబాయి నవలలో వితంతుపునర్వివాహం, వితంతు స్త్రీ కష్టాలు, స్త్రీ విద్యా ఆవశ్యకత, వంటి అంశాలు కన్పిస్తాయి. తమిళ ప్రాంత ప్రజలను ఉద్దేశించి రాసిన ప్రతాపముదలియార్ చరిత్రలో అంటరానితనం, స్త్రీ విద్యా ఆవశ్యకత, సవతి తల్లుల క్రౌర్యం, ప్రభుత్వ ఉద్యోగులలోని లంచగొండితనం వంటి అంశాలు కనిపిస్తాయి. మలయాళ ప్రాంత ప్రజలను ఉద్దేశించి రాసిన ఇందులేఖ నవలలో కులాధిపత్యం, స్త్రీవిద్యా ఆవశ్యకత వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. తెలుగు ప్రాంత ఆచార వ్యవహారాలను తెలిపే ఉద్దేశంతో రాసిన శ్రీరంగరాజుచరిత్ర నవలలో అంటరానితనం, వర్ణ వ్యవస్థ వంటి అంశాల ప్రస్తావన కన్పిస్తుంది. ఈ అంశాలు ఆయా ప్రాంతాలకే పరిమితం కాక మిగిలిన అన్ని ప్రాంతాలలోనూ కన్పిస్తాయి. మలయాళ నవలలో ఉన్న కులాధిపత్యం (నాయర్‌లపై నంబూద్రిల ఆధిపత్యం) అన్ని ప్రాంతాలలోనూ ఉంది. కాకపోతే కులాల పేర్లు వేరు. శ్రీరంగరాజుచరిత్ర, ప్రతాపముదలియార్ చరిత్రలలో ప్రస్తావనకి వచ్చిన అంటరానితనం కేవలం తెలుగు, కన్నడ ప్రాంతాలలోనే కాక అన్ని ప్రాంతాలలో కన్పిస్తుంది. కన్నడ నవలలో ప్రధాన కథా వస్తువు వితంతు పునర్వివాహం. ఇది పంతొమ్మిదవ శతాబ్దంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో కనిపిస్తుంది. మొత్తంమీద ఈ నాలుగు నవలల్లో విశ్వజనీనత అనే నవల కథా లక్షణం కనిపిస్తుంది. ఏ భారతీయుడు ఈ నవలలని చదివినా ఈ నవలల్లోని ఇతివృత్తంతో, ఇందులో ఉన్న సామాజిక అంశాలతో తాదాత్మ్యం చెంది ఈ సమస్య మా ప్రాంతంలో కూడా ఉంది కదా అనే భావనకి లోనౌతాడు.

### 3.2.2.1.2. చిత్తరంజకత

"నవల పాఠకుల చిత్తాన్ని రంజింపజేయాలి. నవలలోని ఇతివృత్తం పాఠకుల ఉత్కంఠను నిలుపుతూ చివరి వరకూ ఏకబిగిన చదివింపజేస్తూ నైతిక విలువలను బోధించేదిగానూ,

సాంఘిక పరిణామాన్ని చిత్రించేదిగానూ వ్యక్తుల మనస్తత్వాన్ని, సామాజిక సంశ్లిష్టతను ప్రకటించేదిగానూ, సాంఘిక రాజకీయ, వైజ్ఞానిక విషయాలను ప్రభోదించేదిగానూ ఉండాలి. (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 126). ఈ 'చిత్తరంజకత'అనే లక్షణం దక్షిణ భారత తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపిస్తుంది. ఈ చిత్తరంజకతని సాధించడానికి రచయితలు ఎన్నుకున్న మార్గాలలో వైవిధ్యం ఉంది. నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు పాఠకుల చిత్తాన్ని నవలపై నిలిపే క్రమంలో నాటి సామాజిక సమస్యని భూమికగా ఎన్నుకున్నారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు తమకంటే తక్కువ స్థానంలో ఉన్నవారిని నీచంగా చూడడం పరిపాటి. ఇది పంతొమ్మిదవ శతాబ్దంలో ఉంది. నేడు కూడా కన్పిస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకొని నవలా కథని ప్రారంభించారు. రాజు కొడుకుగా ఉన్న శ్రీరంగరాజు ఎదుట భటులు వేశ్యాకుమారున్ని 'గారు' అనడంతో నవలా కథకి బిజం పడింది. ఈ సంబోధనను జీర్ణించుకోలేని శ్రీరంగరాజు ఇంటినుండి వెళ్లిపోవడంతో కథ మొదలవుతుంది. ఇంటి నుండి వెళ్లిన శ్రీరంగరాజు లంబాడి స్త్రీని మోహించడంతో కథ పతాక స్థాయికి చేరుకుంటుంది. ఇక్కడ కూడా రాజు ఉన్నత కులస్తుడు, అతను ఇష్టపడింది ఒక లంబాడి స్త్రీని. వీరి వివాహం జరుగుతుందా? జరగదా? అన్న రీతిలో పాఠకుల మనస్సులో ప్రశ్నలు రేకెత్తించారు. అదే కుతుహలం చివరి వరకూ కొనసాగించి నవల చివరలో పాఠకుల మనసులో కలిగిన ప్రశ్నలకు ఒక్కొక్కటిగా సమాధానాలు చెప్తూ చివరి వరకు నవల చదివించేలా చేసారు. లంబాడీలు నీచకులం వారు కాదు. అంటరానితనం మంచిదికాదు. అంటూ సామాజిక సందేశాలు అందిస్తూ శ్రీరంగరాజు ఇష్టపడ్డ సోనాబాయి ఎవరోకాదు అతని మరదలే అని చెప్పి తెరను తొలగించి కథ సుఖాంతం అయ్యేలా చేసారు. మొత్తంమీద సామాజిక అంశం నవలా కథలో చిత్తరంజకత సాధించడానికి ఉపయోగపడిన విధానం శ్రీరంగరాజుచరిత్ర నవలలో కనిపిస్తుంది. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో వేదనాయగం పిళ్ళైగారు పాఠకుల చిత్తాన్ని నవలా కథపై నిలిపి ఉంచే క్రమంలో ఉపకథలని ఎన్నుకున్నారు. ఈ నవలలో అనేక ఉపకథలు కనిపిస్తాయి. ఈ ఉపకథల వల్ల కొంత పాఠకుల చిత్తం పక్కకు మరలిన అది ప్రతాపముదలియార్ వృత్తాంతాన్ని వీడి జరగలేదు. ప్రతీ ఉపకథలోనూ ఒక నీతి ఉంది. ఉపకథ కాగానే పాఠకుల మనసు ప్రధాన కథపైకి వెళ్లేలా అధ్యాయ విభజన చేసారు.

కన్నడ ఇందిరాబాయి నవలలోను, మలయాళ ఇందులేఖ నవలలోను రచయితలు పాఠకుల చిత్తాన్ని నవలాకథపై నిలిపి ఉంచేక్రమంలో కుటుంబ కలహాలని భూమికగా ఎన్నుకున్నారు. భీమారావు, సుందరరావు, కుటుంబ కలహం ఇందిరాబాయి నవలకాగా, పంజుమీనన్ కుటుంబంలోని అంతర్గత కలహం ఇందులేఖ నవల. తల్లిదండ్రులను ఎదురించి ఇందిరాబాయి వితంతువివాహం చేసుకోగా కుటుంబపెద్ద పంజుమీనన్ ను ఎదురించి ఇందులేఖ ప్రేమ వివాహం చేసుకుంది.

### 3.2.2.1.3. సంభావ్యత

"నవలలోని సంఘటనలో పాత్రలు, మొదలైనవి నిత్య జీవితం మీద ఆధారపడినవైె కల్పితమైనవైనా అవి పాఠకులకు అసంభావ్యాలుగా మాత్రం అనిపించకూడదు. అంటే ఇతివృత్తం జరిగింది కాకపోయినా జరిగినదానిలా ఉండేటట్లు రచయిత రాయాలి". (సుజాతారెడ్డి, ముదుగంటి.2017: 126).

ఈ లక్షణం నాలుగు నవలల్లోనూ కనిపిస్తుంది. శ్రీరంగరాజుచరిత్రలోని ఇతివృత్తం కల్పితం, కానీ అందులో ప్రస్తావితమైన అంటరానితనం, వర్ణ వ్యవస్థవ్యధ, సాంఘీకం, సమకాలీనం. ప్రతాపముదలియార్ చరిత్రలో ప్రతి ఉపకథ సమకాలీనం, ప్రతి పాత్ర సామాజికం. ఇందిరాబాయి, ఇందులేఖ నవలలు సమకాలీన సమాజానికి దర్పణాలు. ఈ రెండు నవలల్లోనూ పంతొమ్మిదవ శతాబ్దంలో భారతదేశంలో నూతనంగా ప్రవేశపెట్టబడ్డ స్టాఫ్‌వాచ్, వాటర్ ఫిల్టర్, ఫ్యాన్ వంటి వస్తువుల ప్రస్తావన కనిపిస్తుంది. ఈ అంశం ఈ రెండు నవలల్లోనూ అభూత కల్పనలు లేవు అనడానికి ఒక ఉదాహరణ.

### 3.2.2.2. నవల కథ ఎన్నిక

నవలా రచయిత ప్రాథమికంగా సమాజంలో సభ్యుడు సమాజంలో ఉన్న ఏ అంశం ఎన్నుకొనైనా 'కథ' రాయవచ్చు. ఎన్నుకున్న అంశాన్ని బట్టి కథా నిర్మాణం జరుగుతుంది. ఈ ఎన్నికలో ఏది ఉత్తమ ఎన్నిక, ఏది ఉత్తమ ఎన్నిక కాదు అని తేల్చి చెప్పడం కష్టం, ఎందుకంటే ఎన్నుకున్న అంశం ఏదైనా అది కథగా రూపొందే క్రమంలో దానికి కాల్పనికత తోడౌతుంది. ఈ కాల్పనికత లేకుండా కథని ఊహించడం కష్టం. కేవలం వాస్తవిక సంఘటనలని కాల్పనికత

లేకుండా అదే క్రమంలో గుదిగుచ్చి రాస్తే అది వార్తల సమాహారం లేదా చరిత్ర అవుతుంది తప్ప కథ కాదు. కాబట్టి కథా నిర్మాణంలో కాల్పనికత ప్రధాన పాత్ర పోషిస్తుంది. కొన్ని సందర్భాలలో కాల్పనికత కథా ఎన్నికని మరుగునపరిచే అవకాశం ఉంది. అందుకే వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు నవలాశిల్పంలో నవల 'కథ' గురించి చెబుతూ "కథ వాస్తవిక జీవితాన్ని ఆలంబనంగా కలిగి ఉంటుంది లేదా కనీసం వాస్తవిక జీవితాన్ని స్ఫురింపచేస్తుంది". (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 19) అంటారు. ఈ వాక్యాలు నవలా రచయితకి నవల కథ ఎన్నికలో స్వేచ్ఛ ఉన్నా ఏది ఉత్తమ కథా ఎన్నిక అన్న ప్రశ్నకి వాస్తవిక జీవిత సంఘటనల ఆలంబనంగా ఎన్నుకున్న నవల కథా ఎన్నిక ఉత్తమ నవలకథా ఎన్నిక అని చెప్పకనే చెబుతున్నాయి. ఇలాంటి కథా ఎన్నిక మనకు పంతొమ్మిదవ శతాబ్దం తొలి నాళ్ళలో దక్షిణ భారతీయ భాషలలో వచ్చిన అన్ని తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది.

### 3.2.3. రచనా విశేషాలు

నవలకి ప్రాథమిక ముడిసరుకు మానవ జీవితం. మానవ జీవితం అనేక సంఘటనల మిశ్రమం. ఈ సంఘటనలు నిజ జీవితంలో కాలానుగుణంగా ఒక క్రమపద్ధతి ప్రకారం జరుగుతాయి. జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, మరణం ఇలా కాల క్రమగతిలో జరిగే ఏ సంఘటన నుండైనా ప్రేరణ పొంది నవలా రచయిత నవలను రచించవచ్చు. ఈ సంఘటనల సంఖ్య, సంఘటనలని కూర్చిన విధానాన్ని అనుసరించి రచనలో రకాలు ఏర్పడతాయి. నవల అనేక సంఘటనల సమాహార రచన. నవల విస్తృతి అధికం కాబట్టి, నవలలో ఒక వ్యక్తి లేదా వ్యక్తుల పూర్తి జీవితం వివరించడానికి ఆస్కారం ఉంటుంది. నిజ జీవిత సంఘటనలు నవలలో కథాంశాలుగా రూపొందుతాయి. ఈ సంఘటన అంశాలు కథాంశాలుగా కూర్చే క్రమంలో రచయితలు పాటించిన మెళకువలు రచనా విశేషాలుగా దర్శనమిస్తాయి. కాలక్రమ సంఘటనాంశాలు, నవల కథనాంశాలుగా మారే క్రమంలో కథనాంశాలను ఎవరు చెబుతున్నారు? కథనంలో ఏ అంశం తర్వాత ఏ అంశం చెబుతున్నారు? ఎన్ని పాత్రల ద్వారా కథనం నడిచింది? పాత్రల సంభాషణ విధానం ఎలా ఉంది? కథ నడిపించే క్రమంలో వాతావరణం ఎలా ఉంది? కథన సందర్భంలో ఎలాంటి భాష వాడబడింది? కథనం ఎలా ప్రారంభమై ఎలా ముగిసింది? వంటి ప్రశ్నలు నవల నిర్మాణానికి సంబంధించి ప్రాథమిక అంశాలను అందిస్తాయి. నవలలో పైకి కనిపించే ఇతివృత్తం, పాత్రలు, సంభాషణలు, శైలి

నవలా స్వరూపం కాగా, ఈ స్వరూపగత అంశాలచాటున రచయిత సమాజానికి అందించే సందేశం నవలా స్వభావంగా చెప్పబడుతుంది. ఈ స్వరూప, స్వభావాల ఉపరిన్యాసంగా నవల రూపుదిద్దుకుంటుంది. అందుకే ఆచార్య ముదిగంటి సుజాతరెడ్డిగారు నవల స్వరూప, స్వభావాన్ని గురించి చెబుతూ "నవల స్వరూప స్వభావాన్ని తెలుసుకోవడానికి దానిలోని ఇతివృత్తం, పాత్రలు, సంభాషణలు వంటి అంగాలను పరిశీలించడం చాలా అవసరం. నవల అనగానే దానిలోని కథ, ఆ కథను చెప్పే పద్ధతి అంటే కథాకథనం ఉంటుంది. కథేగాక పాత్రలు, సంభాషణలు, శైలి ఉంటాయి. ఇవేగాక నవలేతివృత్తం కాలంనాటి వాతావరణ చిత్రణతో కూడిన వర్ణనాదులు కూడా ఉంటాయి." (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 111). అన్నారు. మొత్తంమీద ఇతివృత్తం, పాత్ర చిత్రణ, దృక్కోణం, సన్నివేశ కల్పన, వాతావరణం, వర్ణనలు, శైలి, రచనా ఉద్దేశం, ప్రారంభముగింపులు మొదలైన అంశాలతో నవలా నిర్మాణం జరుగుతుంది. ఈ అంశాల ప్రాతిపదికగా దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలల నిర్మాణ విశేషాలని ఈ రకంగా వివరించవచ్చు.

### 3.2.3.1. రచనా ఉద్దేశం

ఇందులేఖ, ఇందిరాబాయి, ప్రతాపముదలియార్ చరిత్ర, శ్రీరంగరాజుచరిత్ర నవలలను తాము సంఘసంస్కరణ ఉద్దేశంతో రచిస్తున్నట్లు రచయితలు ఆయా నవలల ముందు మాటలో చెప్పుకున్నారు. ఈ నవలలన్నీ సంఘసంస్కరణ ఉద్దేశంతో రచించబడ్డాయి. స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం ఇందిరాబాయి నవలలోని ప్రధాన కథా వస్తువులు కాగా, స్త్రీ విద్యమలయాళ సమాజంలోని నంబూద్రి, నాయర్ల గొడవలు ఇందులేఖ నవలలోని ప్రధాన కథా వస్తువులు. నవలా రచనా కాలం నాటి అనేక సాంఘిక దురాచారాలను ఎత్తిచూపే ఉద్దేశంతో శ్రీరంగరాజుచరిత్ర, ప్రతాపముదలియార్ చరిత్ర నవలలు రచించబడ్డాయి.

### 3.2.3.2. అధ్యాయ విభజన

దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో అధ్యాయ విభజన కనిపిస్తుంది. అనేక ఉపకథలతో కూడిన ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో నలభైయారు అధ్యాయాలు ఉన్నాయి. ఒకే కుటుంబంలో జరిగిన అంతర్గత సంఘర్షణతో నడిచిన ఇందులేఖ నవలలో ఇరవై అధ్యాయాలు ఉన్నాయి. రెండు కుటుంబాల మధ్య నెలకొన్న సంఘర్షణలతో

నడిచిన ఇందిరాబాయి నవలలో అరవైఒక్క అధ్యాయాలు ఉన్నాయి. శ్రీరంగరాజుచరిత్ర నవల ఇతివృత్తంలో ఐదు ఉల్లాసాలు ఉన్నాయి. ఈ విధంగా అన్ని నవలల్లో ఇతివృత్తం అధ్యాయాలుగా విభజించబడి ఉంది. ఈ అంశం ప్రాచీన పద్య రచన తర్వాత ప్రారంభ కాలంతో వచ్చిన నవలలు ఇతివృత్త నిర్మాణంలో అధ్యాయాల విభజన రూపంలో కొంత ప్రాచీన సంప్రదాయాన్ని పాటించినా రచన వస్తువు స్వీకారంలో నవీనతని పాటించాయనడానికి నిదర్శనం.

### 3.2.3.3. దృష్టికోణం

కథా శిల్పంలో కథను నడిపించే క్రమంలో కథను ఎవరు చెప్పాలి? అన్నది ప్రధానమైన ప్రశ్న. ఈ ప్రశ్నకి సమాధానం దృష్టికోణం. రచయిత తాను కథని ఎలాగైనా చెప్పవచ్చు. తానే స్వయంగా కథను తన సొంతమాటల్లో చెప్పవచ్చు. లేదా తాను సృష్టించిన ఒక పాత్ర ద్వారా చెప్పవచ్చు. లేదా పాత్రాగత సంభాషణ ద్వారా చెప్పవచ్చు. ఈ చెప్పే విధానం రచయిత ఇష్టాఇష్టాలపై అతను అందించే సందేశంపై ఆధారపడి ఉంటుంది. రచయిత కథని పాఠకులకు అందించే క్రమంలో ప్రధానంగా నాలుగు దృష్టికోణాలలో చెప్పడానికి ఆస్కారం ఉంది. అవి "సర్వసాక్షి దృష్టికోణం, ప్రథమ పురుష దృష్టికోణం, ఉత్తమపురుష దృష్టికోణం, నాటకీయ దృష్టికోణం" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 48).

### 3.2.3.3.1. సర్వసాక్షి దృష్టికోణం

'దీన్నే రచయిత దృష్టికోణం అని కూడా అంటారు. దీనిలో రచయితే స్వయంగా కథ చెబుతాడు. కథ జరిగే ప్రతిచోట అతడు ఉంటాడు. ఇద్దరు పాత్రలు ఒకే చోట చేరి మాట్లాడుకుంటే వారి మాటలు వింటూ ఉంటాడు. పాత్ర ఒంటరిగా ఉన్నా అతన్ని వదలడు. పాత్రల ప్రవర్తనను వర్ణిస్తాడు. వారి మనసు లోతుల్లోని భావాలను ఆవిష్కరిస్తాడు. అలా అన్ని విషయాలు చెబుతూ పాఠకున్ని తన వెంట తీసుకువెళతాడు' (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 48).

### 3.2.3.3.2. ఉత్తమపురుష దృష్టికోణం

'నవలలోని ప్రధాన పాత్ర లేదా నవలలోని అన్ని సంఘటనలల్లో సాధ్యమయినన్ని ఎక్కువ సంఘటనలని చూసే అవకాశం ఉన్నపాత్ర ద్వారా కథను చెప్పడం ఉత్తమపురుష

దృష్టికోణం. ఇందులో కథకుడు (కథచెప్పే పాత్ర) తనని తాను "నేను" అని ప్రస్తావించుకుంటూ ఉంటాడు'. (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 50).

### 3.2.3.3.3. ప్రథమపురుష దృష్టికోణం

"నవలలోని ప్రధాన పాత్ర తన జీవితాన్ని తన దృష్టికోణం నుంచి చెప్పుకోవడం ఉత్తమపురుష కథనమైతే, నవలలోని ఒక అప్రధాన పాత్ర తన దృష్టికోణం నుండి కథని చెప్పడం ప్రథమపురుష కథనం. దీన్నే కొంతమంది విమర్శకులు సరిహద్దురేఖ నుండి కథనం అంటారు. రచయిత కథ చెపుతున్న పాత్రను ప్రథమపురుషలో (అతడు, ఆమె) సంభోదిస్తాడు. కాబట్టి ఈ దృష్టికోణానికి ప్రథమపురుష దృష్టికోణం అని పేరు వచ్చింది." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 53).

### 3.2.3.3.4. నాటకీయ దృష్టికోణం

"రచయిత జోక్యం పాఠకుడికి కనిపించకుండా ఉండడంకోసం, దృష్టికోణంలో, కథనంలో సంపూర్ణమైన వస్తుగతం ఉందన్న భ్రాంతిని కలగజేయడం కోసం రూపొందించిన పద్ధతి నాటకీయ కథనం. నాటకీయ దృష్టికోణంలో రచయిత కథ జరుగుతున్నచోట స్థిరంగా కదలిక లేకుండా ఉంచిన కెమెరా వంటివాడు. తన ఎదుట జరుగుతున్న ప్రతి సంఘటనను రికార్డు చేస్తాడు. పాత్రల పేర్లు ఇవ్వకుండా వారి ఆకారాలను, మనోగత భావాలను ఒక్కసారి కూడా వర్ణించకుండా మొత్తం కథను నాటకంలోలాగా సంభాషణగా మాత్రమే నడిపిస్తాడు." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 50-54).

### 3.2.3.3.5. తులనాత్మక పరిశీలన

"ఈ దేశాన్ని ఆంగ్లేయులు స్వాధీనం చేసుకోవడానికి పూర్వం సత్యపురి అనే గ్రామంలో తొండ మండలం ముదలియార్ కులంలో నేను జన్మించాను. మా తాతగారైన ఏకాంబర ముదలియార్ ఈ దేశాన్ని పాలించిన నవాబుల దగ్గర దివానుగా పనిచేసి అంతులేని ఐశ్వర్యాన్ని సంపాదించారు. మా తాతగారికి చదువు పూర్తికాగానే దివాను ఉద్యోగం లభించడం అందరికీ ఆశ్చర్యకరమైన విషయం కావడంవల్ల నేను విన్న విషయాన్ని వివరిస్తాను". (జయప్రకాశ్, ఎస్. (అ). 2008:1). ఇవి ప్రతాపముదలియార్ చరిత్ర నవల ప్రారంభ వాక్యాలు. ఇక్కడ 'నేను' అని పేర్కొన్న పాత్ర ప్రతాపముదలియార్ ఈ వాక్యాలతో తన పూర్వ చరిత్రను పాఠకులకు చెప్పిన

ప్రతాపముదలియార్ తర్వాతి కథలో తన బాల్యం, విద్యాభ్యాసం, జ్ఞానాంబాళ్ తో పరిచయం వంటి అంశాలను చెబుతూ వెళ్తాడు. ఇలా ప్రతాపముదలియార్ కథ పూర్తిగా "ఉత్తమపురుష దృష్టికోణం"లో నడిచింది. ప్రతాపముదలియార్ ఈ నవలలోని ప్రధాన పాత్ర. ఈ పాత్ర ముఖతహ కథ పూర్తిగా పాఠకులకు చెప్పడం జరిగింది. అయితే అన్ని సందర్భాలలో అన్ని వేళల ప్రతాపముదలియార్ పాత్ర ఉండే అవకాశం ఉండదు. అటువంటి సందర్భంలో ప్రతాపముదలియార్ లేనప్పుడు జరిగిన విషయాలను అతను ఊహించి, వేరేవారి ద్వారా విని తాను పాఠకులకు చెప్పడం ఈ నవలలో కనిపిస్తుంది. నవలలోని 30వ భాగంలో దేవరాజపిళ్ళై అపుత్ర వాజ్యంపై విచారణ జరుగుతుంది. ఈ విచారణ "వేదపురి" అనే గ్రామంలో జరుగుతుంది. ఈ విచారణకి దేవరాజ పిళ్ళై అతనికి అనుకూలంగా ఉండే జమీందారులు ప్రతాపముదలియార్, అతని తండ్రి, సంబంధముదలియార్ మొదలైనవారు వెళ్తారు. వీరంతా "కనకసభ" దేవరాజ పిళ్ళై సొంత కుమారుడని సాక్ష్యం చెప్తారు. ఈ సాక్ష్యం చెల్లదని, వీరంతా దొంగ సాక్ష్యం చెబుతున్నారని అక్కడికి వచ్చిన న్యాయవిచారకర్తలు వీరందరికీ ద్వీపాంతరవాస శిక్ష విధిస్తారు. ఈ తీర్పు విన్న వెంటనే అక్కడివారందరూ బాధపడతారు.

ఈ తీర్పు ప్రతాపముదలియార్‌తోపాటు 'వేదపురికి' వచ్చిన వారికేకాక వారినుండి దూరంగా ఉన్న వారి బంధువులకు కూడా బాధ కలిగించే అంశం. వారు బాధపడ్డ విషయాన్ని వివరించడానికి ప్రతాపముదలియార్ అక్కడలేడు. మరి వారి బాధ పాఠకులకు ఎలా తెలియాలి. ఈ సందర్భంలో వేదనాయగం పిళ్ళైగారు ప్రతాపముదలియార్ పాత్ర అక్కడ లేనప్పటికీ ఆ పాత్ర అక్కడి సంగతులు వేరే వారి ద్వారా విని పాఠకులకు చెబుతున్నట్లుగా రాసారు. అంతేకాని తాను ప్రత్యక్షంగా పాఠకులకు ప్రతాపముదలియార్ లేని సందర్భాలలోని పరిస్థితులను చెప్పలేదు. ఈ అంశం ఈ నవలని ఉత్తమపురుషలో నడిపించడానికి రచయిత అనుసరించిన ఒక మెళకువగా చెప్పవచ్చు.

"పురుషులైన మా పరిస్థితే ఇలాగున్నప్పుడు మా స్త్రీజనం పడిన దుఃఖాన్ని నేను ఏ విధంగా వివరించగలను. అప్పుడు అక్కడ నేను లేనప్పటికీ నేను విన్నది రాస్తూన్నాను." (జయప్రకాశ్, ఎస్.(అ). 2008:129). అంటూ ప్రతాపముదలియార్ అక్కడి పరిస్థితులను పాఠకులకు వివరిస్తాడు.

ఇందిరాబాయి, ఇందులేఖ, శ్రీరంగరాజుచరిత్ర నవలల్లో సర్వసాక్షి దృష్టికోణంతో కూడిన కథనం ఉంది. ఈ మూడు నవలల్లోను రచయితలు అన్ని సందర్భాలలోనూ తామె ఉండి పాఠకులకు నవలలోని కథని వివరించారు.

శ్రీరంగరాజుచరిత్రలో "శ్రీ తుంగభద్రా నదీ తీరమందు విద్యానగరమను గ్రామంబు గలదు." (ఇనాక్, కొలకలూరి (సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010:59) అంటూ విద్యానగర వర్ణనతో నవలని ప్రారంభించిన రచయిత విద్యానగర వర్ణన, విద్యానగరంలోని వివిధ కులాల వర్ణన శారద అనే వేశ్యకి కృష్ణుడి జననం, శ్రీరంగరాజు జననం, బాల్యం, విద్యాభ్యాసం, వంటి అంశాలను వివరిస్తూ వెళ్తాడు. ప్రతీ అంశాన్ని తానే స్వయంగా పాఠకులకు వివరించడం కనిపిస్తుంది. శ్రీరంగరాజు నామకరణ ఉత్సవానికి శారద వస్తుంది. శారద వేశ్యాస్త్రీ ఈమె రాకను అక్కడి రాజస్త్రీలు అడ్డుకున్న విధానం. ఈ విధానంతో శారద పాత్ర బాధపడిన విధానం రచయిత ప్రత్యక్షంగా పాఠకులకు చెప్పడం ఈ నవలలోని సర్వసాక్షి దృష్టికోణానికి ఒక ఉదాహరణ.

"ఇట్లు మహావైభవంతో నామకరణోత్సవము జరుగుచుండగా శారదవేడుక జూడగా వచ్చి నృత్తంబు చేయుచున్న వారాంగనలను దొఱంగి రాచవనితలున్న చోటికిఁబోవ, వారు మిక్కిలి పరువుగలవారుగాన దానింజూచిన మాత్రాననే బొనగత్తియలకు దానివంకను సన్నజేసి యింకొక గదికి లేచిపోయిరి. అంత నాబోనగత్తియలు శారదతో నేమమ్మ యీడకేల వచ్చితి. రాచవారు కులమర్యాదలందు రాజును సయితము సడ్డచేయనివారని తెలియదే చూడు, వారందరు కోపించుకొని లేచిపోయిరి. కలతయేల దయచేసి యెవరికి నెఱుక లేకుండ నింటికి బొమ్మనిన శారద యేమో యాపద వచ్చిన దానివలె దుఃఖితయై, విన్నవోయిన మోమయి మాఱువలుక నోరాడక యున్మత్తవోలె నిలువంబడియె" (ఇనాక్. కొలకలూరి(సం), శ్రీరంగరాజుచరిత్ర. 2010: 63).

'ఇందులేఖ' నవలలో చందుమీనన్‌గారు 'చిన్నని' చదువు విషయంలో సాత్తరమీనన్‌కి మాధవునికి సంభాషణ నడిచిన పిదప "ఈ కథను ఇకపై కొనసాగించడానికి ముందు ఇక్కడ మాధవుని పరిస్థితిని గురించి కొంత చెప్పవలసి ఉంది" (జయప్రకాశ్.ఎస్. (అ). 2016: 1)

అంటూ పాఠకులతో ప్రత్యక్షంగా మాట్లాడతాడు. మాధవుడి పాత్ర పరిచయం తరువాత అతని గుణగణాలను ప్రత్యక్షంగా తానే పాఠకులకు చెప్తారు. తరువాత శంకరమీనన్, మాధవుడు, పార్వతియమ్మ మొదలైన పాత్రలమధ్య నడిచిన సంభాషణ ద్వారా తరువాతి కథను వివరిస్తాడు. రెండవ అధ్యాయంలో ఇందులేఖ పాత్రని పాఠకులకు పరిచయం చేసే సందర్భంలో ఒ. చందుమీనన్‌గారు తానే ప్రత్యక్షంగా పాఠకులతో మాట్లాడటం కనిపిస్తుంది.

"అందమైన కథానాయికలను వర్ణించే సామర్థ్యం కొంచమైనా నాకు లేనందువల్ల ఈ అధ్యాయాన్ని రాయాలని అనుకున్నపుడు నాకు కలిగిన భయాందోళనలు నాకు బాగా తెలుసు. అయితే తప్పించుకోవడం వీలుకాదు కదా! సాధ్యమైనంత వరకు వర్ణించడం చేస్తాను. ఈ కథను ప్రారంభించేకాలానికి ఇందులేఖకు సుమారు 18 సంవత్సరాల ప్రాయం ఉంటుంది." (జయప్రకాశ్,ఎస్.(అ). 2016: 7).

ఇందిరాబాయి నవలలో ప్రథమాంకంలో కమలాపుర గ్రామాన్ని గుల్వాడి వెంకటరావుగారు తన సొంతమాటల్లో వివరించారు. తరువాతి కథలో "ఈ గ్రామంలో అగ్రహార వీధిలో హంపె భీమారావు అనే గృహస్థుడు ఉన్నాడు. అతని పూర్వీకులు బీజాపురం ప్రాంతంలో చాలాకాలం వంశపారంపర్యంగా కులవృత్తిలో జీవించారు." (వెంకటరావు, గుల్వాడి.1962: 1) అంటూ నవలలోని ప్రధాన పాత్రలలో ఒకటైన భీమారావు పూర్వస్థితిని వివరించారు. అంబాబాయి సుందరరావును చంపినపుడే తనకి తృప్తి కలుగుతుందని భీమారావుని ప్రేరేపించిన సందర్భంలో, భీమారావు ఎలాగైనా సుందరరావును చంపాలని నిర్ణయించుకుంటాడు. అప్పుడు అతని మానసిక సంఘర్షణ గుల్వాడి వెంకటరావుగారు తన మాటల్లో పాఠకులకు అందించడం కనిపిస్తుంది.

"భీమారావుకు ఆ రాత్రంతా సరిగ్గా నిద్ర పట్టలేదు. మరునాడు చేయవలసిన కార్యాన్ని గురించి ఆలోచిస్తూ అపాయం ఏమన్నా వస్తుందేమో అన్న దిగులుతో ఒకసారి తాను నిశ్చయించుకున్న క్రమాన్ని మరచిపోయి, మళ్ళీ దాని గురించే ఆలోచిస్తూ తాను స్వయంగా కన్నులతో చూడకుండా, చెవులతో వినకుండా త్వరపడి సీతాబాయి చెప్పిన మాటలునమ్మి నరహత్యా పాపానికి గురికావాలా అని సంశయిస్తూ తన వంశానికి చెడ్డపేరు తేవాలని ఈ

స్త్రీలందరూ కుట్ర చేయడంలేదు కదా! అని తన మనసులో ఆలోచించసాగాడు." (వెంకటరావు.గుల్వాడి. 1962: 15).

### 3.2.3.4. సన్నివేశ కల్పన

నవలలో రచయిత తాను చెప్పదల్చుకున్న అంశం సన్నివేశాల రూపంలో చెప్తాడు. కథలో చెప్పదల్చుకున్న అంశానికి అనుగుణంగా పాత్రల కలయిక, పాత్రలమధ్య సన్నివేశ కల్పన జరుగుతుంది. సహజ సన్నివేశాల కల్పన నవలలో సహజ వాతావరణాన్ని ఏర్పరుస్తుంది. ఈ సన్నివేశాలవల్ల పాత్రలు నడయాడిన ప్రాంతం, ఆ కాల పరిస్థితులు పాఠకులకు తెలుస్తాయి. ఈ సన్నివేషాలను ప్రధానంగా రెండు రకాలుగా కల్పించడానికి అవకాశం ఉంది.

"1. **సంభాషణాశ్రితం**: ఇందులో పాత్రల సంభాషణల ద్వారా పాత్రల మనస్తత్వాలు, కాల, దేశ పరిస్థితులు చిత్రితమౌతాయి.
2. **చేష్టాగతం**: ఇందులో రచయిత తన మాటల ద్వారా వ్యక్తులు చేస్తున్న చర్యలను వివరిస్తారు." (మృణాళిని.సి. 1988: 65)
ఈ రెండు రకాల సన్నివేశ కల్పనలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కన్పిస్తున్నాయి

### 3.2.3.4.1. సంభాషణాశ్రిత సన్నివేశం

ప్రతాపముదలియార్ చరిత్ర ప్రథమ అంకంలో 'ప్రతాపముదలియార్' చదువు గురించి ప్రతాపముదలియార్‌కి అతని తండ్రి, తల్లికి మధ్య నడిచిన సంభాషణ రూపంలో తొలి సంభాషణాత్మక సన్నివేశం కల్పించబడింది. ఈ సన్నివేశంలో ప్రతాపముదలియార్ వయస్సు 8 సంవత్సరాలు అయినా అతను తన విద్యాభ్యాసాన్ని మొదలుపెట్టాడు. ప్రతాపముదలియార్ తండ్రి ప్రతాపముదలియార్ వద్దకి వచ్చి "మీ అమ్మ నిన్ను బడికి పంపించాలని అంటోంది. నీవు ఏం చెబుతావు" (జయప్రకాశ్,ఎస్.(అ). 2008: 3)అని అడుగుతాడు. దానికి సమాధానంగా ప్రతాపముదలియార్ "నాన్న నేను కూడా చదవాలా! నాకున్న తెలివితేటలు చాలవా! పేదవాళ్లు పొట్టకూటికోసం చదువు నేర్చుకుంటారు. నాకు చదువుకోవాల్సిన అవసరం ఏముంది? ఏదైనా చదవాలని అభిలాషిస్తే చదవడానికి, రాయవలసిన అవసరం వస్తే రాయడానికి మనకు ఉద్యోగులు లేరా! గుమస్తాలులేరా!" (జయప్రకాశ్,ఎస్.(అ). 2008: 3) అంటాడు. ఈ

మాటలు స్వయంగా ప్రతాపముదలియార్ అన్నవి కావు. అతని వయసు అప్పుడు ఎనిమిది సంవత్సరాలు. అంతచిన్న వయస్సులో తన భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి ఉద్యోగులు ఉంటారు అనే ఆలోచన రావడం కష్టం. అతను పలికిన భావాలన్ని అంతకుముందే అతని అవ్వ (ప్రతాపముదలియార్ నానమ్మ) అతనితో అన్న మాటలు. ఈ విషయం పెద్దవాళ్లు చిన్నపిల్లల వద్ద చాలా జాగ్రత్తగా మాట్లాడాలి అని తేటపరుస్తున్నది. చిన్న ప్రాయంలోనే అవ్వ మనం ధనవంతులం. మనం చదువకున్నా ఉద్యోగులు మన పనులు చేస్తారు అని ఉపదేశించడం వల్ల ప్రతాపముదలియార్ మనసులో అదే విషయం బలంగా నాటుకుంటుంది. అదే విషయాన్ని తన తండ్రితో అంటాడు. ఈ మాటలు విన్న ప్రతాపముదలియార్ తల్లి అతన్ని వారిస్తుంది. విద్య మనిషికి ఎంత అవసరమో ఒక సుధీర్ఘ ఉపన్యాసంగా చెబుతుంది.

"నాచిట్టి తండ్రి నీవు చెప్పినది ఆవగింజంత కూడా సరికాదు. చదువుసంధ్యలు బొత్తిగాలేని పామర జనులను చూడు. వాళ్ల చేష్టలకు, మృగాల చేష్టలకు ఏం భేదం ఉంది. చదువు లేనట్లైతే భగవంతుని యదార్థ స్వరూపాన్ని అతని అనంత కళ్యాణగుణ గణాలనూ, ధర్మాధర్మాల భేదాలను, విజ్ఞాన శాస్త్రాలను, భూగోళం, ఖగోళం, గణితం మొదలైన శాస్త్రాలను ఇహపర సుఖాలను అందుకోగల మార్గాంతరాలను మనం ఎలా తెలుసుకోగలం. మనం కార్య నిర్వాహకుల కంటే అధికంగా చదువుకోనట్లైతే వాళ్లు మనల్ని గౌరవిస్తారా? జమా ఖర్చుల విషయంలో వాళ్లు చేసే తప్పులను ఎలా కనిపెట్టగలం? ధనవంతుడు విద్యావంతుడైనప్పుడు మాత్రమే తన సిరిసంపదలను సత్కార్యాలకు ఉపయోగిస్తాడు. విద్యాహీనులైన ధనవంతుల చేతిలోని డబ్బు పిచ్చివాని చేతిలోని రాయిలాగా తమకు, ఇతరులకు దుఃఖాన్ని తెచ్చిపెడుతుంది. కాబట్టి విద్య ధనవంతులకే అత్యావశ్యకం." (జయప్రకాశ్,ఎస్.(అ). 2008: 3).

ఈ సంభాషణ విద్యా ఆవశ్యకతని గురించి తెలుపుతోంది. ఆ తరువాత జరిగిన కథలో ప్రతాపముదలియార్ బాల్యక్రీడల సన్నివేశం, ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌తో కలిసి సంబందిముదలియార్ ఇంట్లో ఉండి చదువుకున్న సన్నివేశం, కనకసభ గవర్నర్‌కి గుడారాలకి వెళ్లే మార్గాన్ని చూపే సన్నివేశం, కనకసభ నీటిలో పడగా అతన్ని సన్యాసి రక్షించిన సన్నివేశం, కనకసభ తన తండ్రి దేవరాజపిళ్ళైని కలుసుకున్న సన్నివేశం వరుసగా చిత్రితమయ్యాయి. నవల పన్నెండవ అధ్యాయంలో ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌ల వివాహ సన్నివేశం చిత్రితమైంది. ఇది కథ మలుపుకు కారణమైన సన్నివేశం. ఈ సన్నివేశంలో సంబంధముదలియార్ వివాహ

అనంతరం కూతురూ, అల్లుడు తమ ఇంట్లో ఉండాలని పట్టుబడతాడు. అందుకు ప్రతాపముదలియార్ తండ్రి కనకాచల ముదలియార్ ఒప్పుకోడు. దీనితో జ్ఞానాంబాళ్, ప్రతాప ముదలియార్‌ల వివాహం తాత్కాలికంగా వాయిదా పడుతుంది. ఈ సందర్భంలో కనకాచల ముదలియార్‌కి, సంబంధముదలియార్‌కి మధ్య నడిచిన సంభాషణలో 'చాకలి' 'మంగలి' వంటి కులాల ప్రస్తావన కనిపిస్తుంది. (జయప్రకాశ్,ఎస్.(అ). 2008: 3). ఈ అంశం నాటి సామాజిక పరిస్థితులకి దర్పణం. జ్ఞానాంబాళ్ అపహరణ తరువాత సన్యాసిరూపంలో ఉన్న ఆన్దిచ్చియమ్మాళ్‌కి ఆమె భర్తకి మధ్య సంభాషణాత్మక సన్నివేశం కల్పించబడింది.

ఇందులేఖ నవల సంభాషణాశ్రిత సన్నివేశంతో ప్రారంభమౌతుంది. చిన్నని చదువు విషయంలో 'సాత్తారమీనన్' మాధవుడు, 'కుమ్మినియమ్మ' మధ్య నడిచిన సంభాషణాశ్రిత సన్నివేశంతో నవల ప్రారంభమవుతుంది. ఈ సన్నివేశం ద్వారా నవలలోని ప్రధాన పాత్ర 'మాధవుడు' ఇంటి పెద్దని ఎదురించిన విషయం పాఠకులకు అందించడం జరిగింది. కథ నడిపించే క్రమంలో ఇందులేఖకి–మాధవునికి మధ్య ఒక సుదీర్ఘ సంభాషణాశ్రిత సన్నివేశం కల్పించబడింది. ఈ సన్నివేశంలో ఇందులేఖపై మాధవునికి ఉన్న ప్రేమ వ్యక్తీకరించబడింది. మాధవుడు పంజుమీనన్‌ని ఎదురించిన సందర్భంలో పంజుమీనన్‌కి కేశవ నంబూద్రికీ మధ్య సంభాషణాశ్రిత సన్నివేశం కల్పించబడింది. ఈ సన్నివేశంలో పంజుమీనన్ కోపం వ్యక్తీకరించబడింది. మాధవుడిమీద కోపంతో కణ్ణళిసూరి నంబూద్రిపాదును ఇందులేఖని చేసుకోవడానికి పంజుమీనన్ ఆహ్వానించిన తర్వాత ఇందులేఖకి, నంబూద్రిపాదుకి మధ్య సుదీర్ఘ సంభాషణాశ్రిత సన్నివేశం కల్పించబడింది. ఈ సన్నివేశం వల్ల నంబూద్రిల డాంబిక ప్రవృత్తి, చదువుకున్న అమ్మాయి తెలివితేటలు పాఠకునికి తెలుస్తాయి. మాధవుడు ఉత్తర భారత యాత్రలో ఉన్నప్పుడు మాధవునికి, కేశవచంద్రసేన్, గోపీనాథ బెనర్జీ గోవిందసేన్ వంటి పాత్రల మధ్య కల్పించబడిన సంభాషణాశ్రిత సన్నివేశాలవల్ల ఉత్తర భారతదేశంలోని నగరాల సౌందర్యం, ప్రయాణవ్యయ ప్రయాసలు పాఠకునికి అందించడం జరిగింది.

"**షియా అలిఖాన్:** మీరు ఎక్కడినుండి వస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు. ఇంతకుముందు ఈవైపు వచ్చినట్లు లేదని తెలుస్తున్నది.

మాధవుడు: నేనిప్పుడు కలకత్తానుండి వస్తున్నాను. ఒక స్నేహితుణ్ణి చూడ్డానికి వెళ్తున్నాను. మావూరు మలయాళం. మదరాసు మాగాణంలో ఉంది. ఉత్తర భారతదేశం చూద్దామని వచ్చాను. మీతో పరిచయం కావడం నా అదృష్టమని భావిస్తున్నాను.

షియా అలిఖాన్: అవును నేను అలాగే అనుకుంటున్నాను. స్నేహితులుగాని, వేరెవరుగాని మీతో రాలేదా? లేక ఒంటరిగానే బయలుదేరారా?

మాధవుడు: ఎవరూ లేరు, నేను మాత్రమే.

షియా అలిఖాన్: ఇంకొక గుర్తు చెప్పేదా? మీరు బి.ఎల్. కూడా అవునా?

మాధవుడు: (నవ్వుకుంటూ) అవును. (జయప్రకాశ్, ఎస్.(అ). 2016: 258-59)

శ్రీరంగరాజుచరిత్ర నవల శ్రీరంగరాజు నామకరణ సన్నివేశంతో మొదలవుతుంది. ఈ సన్నివేశంలో శారదకి నామకరణ మహోత్సవానికి వచ్చిన స్త్రీలకి మధ్య కల్పించిన సంభాషణాత్మక సన్నివేశం అంటరానితనాన్ని గురించి తెలుపుతుంది. శ్రీరంగరాజు ఇంటినుండి వెళ్లిన తరువాత ఒక ఊరిలో ఉన్న బ్రాహ్మణునికి శ్రీరంగరాజుకు మధ్య కల్పించిన సంభాషణాత్మక సన్నివేశం నవల కాలంనాటి సామాజిక పరిస్థితులను పాఠకులకు అందిస్తుంది.

"**శ్రీరంగరాజు**: నొడలెల్ల జెమటలుకార మోటలుతోలుచున్న మగవారిని, మడవలు మలుపుచున్న మగువలను జూచి గృహమేధితో బాపమీ యెండనేల వీరింతల శ్రమపడెదరనిన బ్రాహ్మణుండిట్లనియె.

**బ్రాహ్మణుడు**: ఇదేమీ కష్టముగాని చూడుఁడాకపిలమోకు దైవగతిని దేగినగాని యెద్దులా కపిలను లాగలేక వెనుక వచ్చినగాని యామోకు మీదివాడు త్రాటితోడంబెనగి కూపంబునం గూలబడి మృతినొందుగాదె. యెంత అపాయ జనకంబది. ఇంతియగాదు చూడుడాచేల నెందఱు గుంటుకలు తోలెదరు ఎందఱు గొర్రు తోలెదరు ఆ గొర్రుల వెంబడి నెందఱుస్త్రీలెండ యని చూడక యొడిని విత్తనములు గట్టుకొని జడ్డిగము గుండం జాళ్ళయందు వైచుచు బోయెదరు. కాపువారెండకు వెఱచి యింటనుండిరా పదునుపాడై చేసిన పాటెల్ల వ్యర్థంబుగాదె.

**శ్రీరంగరాజు**: ఇదిభగవంతుని మాయసుమ్ము-చిట్టెడుపొట్టకు వలయు పట్టెడు సంకటికి బావురొట్టెకు స్త్రీలు పిల్లలు సయితమింత పాటు వడలయునె, పాపమింటిచుట్టు గబ్బుదిబ్బలు పేర్చుకొని పశువుల రొచ్చులోబడి సుఖమునకు బెఱలై యుండెదరు గ్రామమందేడ జూచినను బెంటకానం బడుచున్నది. కాలుపెట్ట చోటులేదు. వారుపరుండు మంచములను జూడసయితము

సహ్యముగాదు–ఆ నల్లులపుట్టమీద వారికెట్ల నిద్ర వచ్చుచున్నదో యది యాపరమాత్మకె యెఱుక" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 68,69).

నవలలోని పాత్రలు నడయాడిన ప్రాంత సామాజిక పరిస్థితులని ఈ సంభాషణ పట్టిస్తున్నది. నవల తరువాతి కథలో రామయ్యకి, శ్రీరంగరాజుకి మధ్య లంబాడీల కులపాతివ్రత్యం గురించి చర్చ జరుగుతుంది. ఈ సందర్భంలో కల్పించబడ్డ సంభాషణాశ్రిత సన్నివేశం లంబాడీల ఆచార వ్యవహారాలను పాఠకులకు తెలుపుతుంది. శ్రీరంగరాజు సోనాబాయితో కలిసి విద్యానగరానికి వచ్చిన సందర్భంలో శ్రీరంగరాజు వియ్యంకుడు మల్రాజు మహారాజుకి, మిగతావారికి జరిగిన సంభాషణలో 'సోనాబాయి' తప్పు చేయలేదని తేలుతుంది. ఈ సంభాషణలో శంకరాచార్యుల ప్రస్తావన వస్తుంది. ఇలా శ్రీరంగరాజుచరిత్ర నవలలోని ప్రతీ సంభాషణాశ్రిత సన్నివేశం సామాజికాంశాల భూమికగా కొనసాగింది.

ఇందిరాబాయి నవల భీమారావు బాల్యం, వివాహ వర్ణనతో మొదలవుతుంది. భీమారావుకు సుందరరావుకు మధ్య మొదటి సంభాషణాశ్రిత సన్నివేశం కల్పించబడింది. ఈ సన్నివేశంలో ఒక వ్యక్తికి ఉద్యోగం అవసరం ఎంత ఉంటుందో తెలుపబడింది. అ తరువాతి కథలో అంబాబాయికి, దేవకికీ మధ్య కల్పించబడిన సంభాషణాశ్రిత సన్నివేశం నవలా రచన కాలంనాటి సామాజిక అంశాలకు అద్దంపడుతుంది.

"**అంబాబాయి:** ఇంకా విశేషాలేమిటి?

**దేవకి:** విశేషమేమమ్మ కావేరి ఎట్లాగు మర్యాద పోగొట్టుకున్నది. లేకుంటే కడుపులో ఉన్న బిడ్డతోసహా ఆత్మహత్యకు పాల్పడుతుందా?

**అంబాబాయి:** అదేమి కథ?

**దేవకి:** మీకు తెలియదా? విధి రాతవల్ల ఆమెకు ప్రాయం నిండకమునుపే వైధవ్యం ప్రాప్తించింది. ప్రాయం వచ్చిన తర్వాత మానవుడు సంసారజీవి కదా! గ్రహచర దోశమో ఏమో అపచారం జరిగి, దానిఫలితం కనిపించేంతవరకు బుద్ధిహీనులైన ఆ తల్లిదండ్రులు ఏ ఉపాయాన్ని ఆలోచించకుండా మిన్నకుండినారు. ఆపైన ఏం చేయాలో తెలియక చిట్టచివరికి నా వద్దకు వచ్చి దేవకి! ఏదో ఒక దారి చూపమని వేడుకున్నారు. క్షణ కాలంలో నేనొక ఔషధంతో కడుపు తీయించి వచ్చాను. ఇప్పుడు అమ్మాయి బాగానే ఉంది.

**అంబాబాయి:** ఇదంతా చుట్టుపక్కల వారికి తెలియదా?

**దేవకి:** ఎట్లా తెలుస్తుంది. ఎప్పటికీ తినే వస్తువులోనే ఎవరికీ కంటికి కనపడని నీళ్లవంటి స్వచ్ఛమైన ఔషధాలున్నాయి. వాటిని సున్నంతో కలిపి తింటే సరి. వెంటనే గర్భం పోతుంది. నేను అక్కడికి వెళ్లి నాలుగు మాటలాడి అమ్మాయి చేత ఒక్క ఆకు తినిపించానంతే. చేసిన దోశమంతా పోయింది.

**అంబాబాయి:** శభాష్ దేవకీ కుటుంబ మర్యాదనే కాదు, జాతి మర్యాదను కూడా కాపాడావు. ఇంకేమన్న విశేషాలున్నాయా దేవకి.

**దేవకి:** ఇంకేం విశేషాల్లేవమ్మా నాకు మిఠాయి చేయడం కూడా వచ్చు. అయితే మిఠాయి చేసుకొని బతికే రోజులు కావివి. వెనుకటి రోజుల్లో అయితే రంగు, పమ్మచు, తిమ్మ్మ, అనే ప్రఖ్యాతిగాంచిన మేళంవారున్నప్పుడు ఒక్కొక్కరిదగ్గర ఒక్కొక్కరోజు ఎంతలేదన్నా సగం మనుగు మిఠాయి అవసరం అవుతుండేది. ఇప్పటికాలం – అదంతా ఏం చెప్పాలి! వస్తానమ్మా.

**అంబాబాయి:** మంచిది దేవకి, అప్పుడప్పుడు వస్తూ ఉండు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 9, 10)

ఈ సంభాషణ నవలా రచనాకాలంనాటికి ఉన్న వితంతు స్త్రీల అవస్థ, భోగంమేళాల స్థితి మొదలైన సామాజిక అంశాలను పాఠకులకు అందిస్తుంది. తరువాతి కథలో భీమారావు దేవకి సహాయంతో సుందరరావును హత్య చేస్తాడు. ఈ హత్యను విచారించడానికి వచ్చిన పోలీసుల మధ్య సంభాషణాశ్రిత సన్నివేశం కల్పించబడుతుంది. ఈ సంభాషణాశ్రిత సన్నివేశంలో పంతొమ్మిదవ శతాబ్దంనాటి పోలీసు వ్యవస్థలో ఉన్న లోటుపాట్లు ప్రస్థావనకి వచ్చాయి. ఇందిరాబాయి మొదటి వివాహ సందర్భంలోనూ, రెండవ వివాహ సందర్భంలోనూ భీమారావు, అంబాబాయి, తియంబకరావు, సుశీల, అమృతరావు పాత్రల మధ్య కల్పించబడిన సంభాషణాశ్రిత సన్నివేశాలు నవలా రచనా కాలంనాటి సామాజిక అంశాలకు తార్కాణాలు.

### 3.2.3.4.2. చేష్టాగత సన్నివేశం

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో జ్ఞానాంబాళ్ అపహరణకి గురైన సందర్భంలో అక్కడ జరిగిన సంఘటనలని రచయిత ప్రతాపముదలియార్ మాటలద్వారా వివరించారు.

"ఒక చిన్నబండి ఆ బాట గుండా మాకు ఎదురుగా వచ్చింది. ఆ బండిని నలుగురు చుట్టుముట్టి దక్షిణం వైపుగా వస్తున్న ఆ బండిని బలవంతంగా ఉత్తరదిశగా మళ్లిస్తున్నారు. వాళ్లలో ఇద్దరు

గుర్రంమీద, ఇద్దరు పాదాచారులుగానూ వారు బండిని మళ్లిస్తుండగా ఆ బండి నుండి స్త్రీల హాహాకారాలు వినిపించాయి. మేము రావడం చూడగానే గుర్రంమీదున్న ఆ ఇరువురు దుర్మార్గులు కత్తులు దూసుకుంటూ మమ్మల్ని చంపడానికి వేగంగా వచ్చారు. వారు మమ్మల్ని సమీపించడానికి మునుపే తుపాకులతో వాళ్లమీద గుళ్ల వర్షాలను కురిపించాము. గుర్రాలమీదున్న ఇరువురి శరీరంలోనూ గుళ్లు తగిలి కిందపడిపోయారు. పాదాచారులైన ఆ ఇరువురి కాలికి బుద్ధి చెప్పారు" (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 59).

ఇది జ్ఞానాంబాళ్ ను పూంగావరు తహసీల్దారు అపహరించిన సన్నివేశం. ప్రయాణానికి బండ్లు, గుర్రాలు ఉపయోగించడం, ఆయుధంగా కత్తులు, తుపాకులని ఉపయోగించడం ఈ సన్నివేశంలో కనిపిస్తుంది. ఇది నవలా రచనా కాలంనాటి ప్రయాణ మాధ్యమాలకి, ఆయుధాలకు నిదర్శనం. ఇలాంటి అనేక చేష్టాగత సన్నివేశాలు ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కల్పించబడ్డాయి.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు పుట్టిన తర్వాత అతని నామకరణ మహోత్సవం జరుగుతుంది. ఈ సన్నివేశాన్ని గోపాలకృష్ణ మసెట్టిగారు తన మాటల్లో వివరించారు.

"మొదట మాతాపితలు దుకూలధారులై పీఠమీద గూర్చుండి పురోహితునిచేత గణపతి పూజ చేయించి, పుణ్యాహవాచనము జరిపించిన పిదప తమ తమ గదులకు పోయి నూతన వస్త్రములు ధరించుకొని శిశు సమేతముగా మరలా వచ్చి పీఠ మీద గూర్చుండ హోమము జరుగును. ఇంతలో బంగారు పళ్ళెరము నిండా బియ్యము, నారికేళ తాంబూలాది సామాగ్రులు తేబడిన బురోహితుండు తగిన పూజలుగావించి నామకరణ మంత్రంబులు పలుక సభాసీనులై యున్న బ్రాహ్మణులు వేదమంత్రంబుల నాశీర్వచనములను లొనర్ప నొకమూలను బజంత్రీలు, మేళములు, తాళములు మ్రోగింప మరియొక తట్టున వారాంగనలు కొందరు నటనంబులు సలుప మరికొందరు వీణాది వాద్యంబులు వాయింప వీధిని భేరి మృదంగాది మహా వాయిద్యం బులు మ్రోయ బురోహితులు శిశువు మేనమామ చేత చేయింపబడిన రత్నఖచిత స్వర్ణముద్రికతో రాజుచే బంగారు పళ్ళెరములోని బియ్యంమీద నాలుగు గీతలు గీయించి మొదటి ఇంట నక్షత్ర

నామంబును, రెండవ ఇంట మాసనామంబును, మూడవ ఇంట వ్యవహార యోగ్యమగు శ్రీరంగరాజాభిదానంబు లిఖియింపించిరి. అంత బంధువులు మిత్రులు మొదలగువారు కట్నంబులు చదివించిరి. బాపన ముత్తైదువలు మంగళారతులొసంగిరి. అంత బ్రాహ్మణులకు దక్షిణలు విశేషముగా నీయబడియె" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 63) ఈ వర్ణన నవల రచనా కాలంనాటి తెలుగు ప్రాంతంలో ఉన్న ఆచార వ్యవహారాలకు నిదర్శనం.

ఇందులేఖ నవలలో మాధవుడు ఉత్తర భారతదేశాన్ని చూడడానికి వెళ్లిన సందర్భంలో మాధవుడు చూసిన బొంబాయి ఓడరేవు వద్ద మాధవుడు చూసిన సన్నివేషాలను ఒ. చందుమీనన్ తన మాటల ద్వారా పాఠకులకు అందించారు.

"సముద్ర ప్రయాణానికి బయలుదేరి వచ్చిన గొప్ప ప్రముఖులు తమ కుటుంబ సభ్యులతో నౌకలలోనికి ఎక్కడానికి తయారవుతున్నవారునూ, వారికి వీడ్కోలు చెప్పడానికి వచ్చినవారునూ ఆశీర్వాదాలు చెప్పి దిగులుతో ఇంటికి తిరుగుముఖం పట్టిన వారునూ, ఇలా అందరినీ ఒకేచోట చూడవచ్చు. మరొక చోట చాలా కాలం సందర్భవశాత్తు ఐరోపావెళ్లి అక్కడే ఉండిపోయి తన ప్రాణానికి ప్రాణమైన భార్య నౌకనుండి దిగుతున్నప్పుడు అత్యంత ఆవేషంగా ఎదుర్కొని వెళ్లి, భర్త వేగంగా భార్యను పడవనుండి దింపి ఉత్సాహంగా ఆలింగనం చేసుకొని ఆకాశ రథాన్ని పోలిన సార్టు బండిలో ఎక్కించుకొని మిక్కిలి సంతోషంతో తోలుకుంటూపోవడం చూడవచ్చు. మరోవైపు నాలుగైదు సంవత్సరాలుగా అమ్మానాన్నలను ఒక్కసారికూడా చూడనటువంటి పిల్లలను కన్నవారు వేగంగా వచ్చి ఎత్తుకొని ఎల్లలులేని సంతోషంతో ముద్దులుకురిపించి ఆనంద బాష్పాలతో గద్గదస్వరాలతో గాఢమైన ప్రేమానురాగాలకులోనై నిలబడి ఉండడం చూడవచ్చు. ఇదే కాక జనుల వేడుక వినోదాలకై అక్కడ జరుగుతున్న బ్యాండు వాద్యాల సుఖమైన సంగీత కోలాహలం. ఈ విధంగా ఎన్నో దృశ్యాలను, వినోదాలను, మాటలకు, వర్ణణలకు అతీతమైన సాటిలేని సూర్యాస్తమయ అందాలను వీటన్నిటిని చూసి మాధవుడు ఆనందిస్తూ కదలకుండా నిలబడిపోయాడు." (జయప్రకాశ్. ఎస్(అ). 2016: 244-254). ఈ వర్ణన పంతొమ్మిదవ శతాబ్దంనాడు ఓడరేవుల వద్ద ఉన్న వాస్తవ సన్నివేశానికి దర్పణం.

ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయి వివాహ సందర్భంలో జరిగిన హంగూ ఆర్భాటాలను గుల్వాడి వెంకటరావుగారు పాత్రల హావభావాల ద్వారా వివరించారు. ఈ చేష్టాగత సన్నివేశం పంతొమ్మిదవ శతాబ్దంలో జరిగిన వితంతు వివాహ సన్నివేశంలోకి పాఠకులను తీసుకెళ్తుంది.

"ఇందిరాబాయిని అలంకరించిన తరువాత సంజీవరావు భాస్కరరావును తీసుకొని ఒకపక్క, అనేక మంది స్త్రీలు ఇందిరాబాయిని తీసుకొని ఇంకో పక్క తీసుకొని వచ్చి మంగళ మండపంలో కూర్చోబెట్టారు. ఇంటి పూర్వ దిక్కు బురుజు మీద ఇంగ్లీషు బ్యాండు వాద్యాల ఘోష, పశ్చిమదిక్కునున్న బురుజుమీద దేశీయ వాద్యాల ఘోష, వివాహ మండపంలో వేదమంత్రాల ఘోష ఇలా అనేక రకాల ఆనంద ఘోష శబ్దాలు వినిపిస్తున్నాయి. అమృతరావు, జలాక్షి కళ్యాణ మండపంలోకి వెళ్లి రామకృష్ణ అవధాని వేదశాస్త్ర విధుల ప్రకారం అప్పుడప్పుడు ఇచ్చిన సూచనలు పాటిస్తూ సకలశాస్త్రాల విధుల ప్రకారం ఇందిరాబాయిని భాస్కరరావుకు ధారాదత్తం చేశారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 241).

### 3.2.3.5. సన్నివేశ సామ్యత

#### 3.2.3.5.1. వేట

దక్షిణ భారతీయ భాషల్లోని తొలి సాంఘిక నవలల్లో ప్రధాన పాత్రలు వేటాడటానికి వెళ్లిన సన్నివేశం ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందులేఖ, శ్రీరంగరాజుచరిత్ర నవలల్లో కనిపిస్తుంది. శ్రీరంగరాజుచరిత్ర నవలలో యుక్తవయస్సు వచ్చిన తర్వాత అన్ని విద్యలు నేర్చిన శ్రీరంగరాజు తన పరివారంతో కలిసి వేటాడటానికి వెళ్తాడు. ఇది నవలా కథ మలుపుకు కారణమైన సన్నివేశం. వేటాడే సందర్భంలోనే ఒక సేవకుడు వేశ్యాకుమారుడైన కృష్ణుడిని కృష్ణయ్యగారు అని పిలవడం అది సహించని శ్రీరంగరాజు తల్లిదండ్రులతో గొడవపడి ఇంటినుండి వెళ్లిపోవడం సంభవిస్తాయి.

"ఇట్లు పదునెనిమిది సంవత్సరంబులు గడిచిన తరువాత వారిరువునుగూడి మృగయార్థమొక వనము సమీపంబునకు రాగా వారి భటుల చుట్టుపట్ల గ్రామములకుజని రెడ్డి, కరణములను బట్టికొని యుఱకకు నొక్కరి నిద్దఱిని బర్వుమోయను బనియున్న వారిని లే నివారిని

గుంపు చేసుకొనిరాగా శ్రీరంగరాజొక చోటికిని, కృష్ణుడొక చోటికిని జీలి యాయడవినింద నడయాడుచున్న యేదులనేమి, కారుపోతులనేమి, జింకలనేమి, కడతులనేమి కుందేళ్లు మొదలుగానడ్డమువచ్చిన మొకములన్నిటిని వేటాడుచుండిరి. తన వేటకారులను జూచి తలను గడుపున నుంచుకొని వర్తులాకారమయి వీపుచిప్పలచేత రక్షితమైయున్న యొక యాళువును జూచి కృష్ణుడు చిప్పలు దాకకుండదనయమ్ము వమ్ముగాకుండ దానియాయువు పట్టెరిగి యేయంగానది తక్షణంబునేలకొఱిగి యీల్గె సేవకులచ్చెరువడి రందొకడు రాచకుమారుని కడకుంజని కృష్ణయ్యగారు దేహము ముడుచుకొనియున్న యాళువును నీల్గనేసిరి యనిచెప్పె- రాచకొమరుండు కృష్ణయ్యగారను శబ్దము విన్నమాత్రాననే కోపాన్వితుండై కనులెఱ్ఱబారనుఱిమి యుఱిమి జూచును.” (ఇనాక్, కొలకలూరి(సం), శ్రీరంగరాజుచరిత్ర. 2010: 64).

ఇందులేఖ నవలలో మాధవుడు వేటాడటంలో ప్రవీణుడు వేటాడే అలవాటు అతనిలో వెర్రిగా ఉండేది. తాను వేటాడడానికి వెళ్లేటప్పుడు తనవెంట రెండు, మూడు రకాలైన తుపాకులు, రెండుమూడు పిస్తళ్లను వెంటతీసుకొనివెళ్లేవాడు. తనకి మనసు బాగాలేనప్పుడు ఉదయాన్నే లేచి వేటకి వెళ్లేవాడు. ఇందులేఖ తన ప్రేమని అర్థం చేసుకోక తనని ఇబ్బందిపెట్టిన సందర్భంలో వేటకి వెళ్తాడు.

“ఇకపై ఇందులేఖని తలచుకొని ఇలా మనసులో బాధపడదలచుకోలేదు. ఉదయమే తుపాకులను తీసుకొని వేటకు వెళ్లాల్సిందే నాన్నగారుకూడా వేటకు రావచ్చు. నేను వేటకు వెళ్లి చాలా రోజులైంది. ఈ మనోవేదనతో నా పురుషగుణాలన్నీ నశించాయి......అని యోచిస్తూ మాధవుడు మంచం మీద నుండి లేచి తెల్లవారు ఝామున వేటకు పోవలసిన దానికి కావలసినవి సమాయత్తం చేయడం ప్రారంభించాడు. మొదటి రకమైన తుపాకిని ఒకటి తీసి తుడిచి పెట్టాడు. కావలసిన తూటాలు తయారుగా ఉంచాడు. సూర్యోదయానికి పూర్వమే తేనీరు సిద్ధంచేయాలని పనిమనిషిని పిలిచి ముందుగానే చెప్పి ఉంచాడు. నాలుగు గంటలకు లేచి కోటు, కాళ్లకు వేసుకొనే ప్యాంటు బూట్లు మొదలైన వాటిని వేసుకొని తనతో ఒక పనివాడిని పిలుచుకొని వేటకి బయలుదేరాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 30, 32).

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ఇంటినుండి దేశ సంచారానికి వెళ్లిన ప్రతాపముదలియార్ తన భార్యతో కలిసి తన బాల్యమిత్రుడైన కనకసభ ఊరు 'ఆదియూరుకు' చేరుకుంటాడు. అక్కడ అడవిలో ఉన్న ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు చుట్టుపక్కల గ్రామాలవారిని ఇబ్బందిపెడుతున్నాయని తెలుసుకుని వాటిని వేటాడటానికి కనకసభతో కలిసి వెళ్తాడు. ప్రతాపముదలియార్ ఎక్కిన ఏనుగు తుపాకి శబ్దానికి భయపడి అతన్ని విక్రమపురికి తీసుకువెళ్తుంది. దీనితో కథ కొత్త మలుపు తిరుగుతుంది. ప్రతాపముదలియార్‌ని వెతుకుతూ జ్ఞానాంబాళ్ విక్రమపురి రావడం. ఆమె పురుష వేషంలో రాజుగామారి విక్రమపురిలో పరిపాలన చేయడం తరువాత కథలో జరగడానికి ప్రతాపముదలియార్ వేటకు వెళ్లడం కారణంగా నిలుస్తుంది.

"ఆది యూరుకు ఉత్తరంగా రెండు యోజనాల అవతల అంతులేని విస్తారమైన కొండలు వ్యాపించి ఉన్నాయి. వాటిలో ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు మొదలైన మృగాల సంఖ్య పెరిగిపోయి చుట్టుపక్కల ఉన్న గ్రామాలలోని ప్రజలను, పశువులను, మేకలను మొదలైన వాటిని గాయపరిచి నాశనం చేస్తుండటంవలన ఆ మృగాలను హతమార్చమని వేటగాళ్లకు ఆజ్ఞ ఇవ్వవలసిందిగా పెక్కుగ్రామాలనుండి ప్రజలు గుంపులుగా వచ్చి దేవరాజ పిళ్ళైని ప్రార్థించారు. వెంటనే వారు వేటగాళ్లను పిలిచి క్రూరమృగాలను వేటాడవలసిందిగా ఆజ్ఞాపించారు. దేవరాజపిళ్ళై తన పట్టపుటేనుగును అలంకరించి వేటాడడానికి వెళ్లే అడవిలో సిద్ధంగా ఉంచారు. నేను కనకసభ గుర్రాలమీద ఎక్కి అడవిలోపలికి వెళ్లాము. నాగుర్రం ఏనుగు నిలచిన చోటికి ముందుగా వెళ్లడం వలన నేను గుర్రంమీద నుండి ఏనుగు మీదకి ఎక్కి అంబారీలో కూర్చున్నాను. మావటివాడు కనకసభ కనిపించనందున దారివైపుగా చూస్తూ ఏనుగు పక్కన నిలబడి ఉన్నాడు. వేటగాళ్ల అలజడికి పొదలో దాగి ఉన్న ఒకపులి ఆ మావటివాని మీదకు దూకి అతన్ని లాక్కొని పరిగెత్తడం ప్రారంభించింది. నేను వెంటనే నా చేతిలో ఉన్న తుపాకీతో పులిమీద గుండ్లవర్షం ప్రయోగించాను. పులి ఆ గుండ్లను కూడా లక్ష్యం చేయక మావటివాడిని ఎత్తుకొని పరిగెత్తింది." (జయప్రకాశ్. ఎస్(అ). 2008: 153).

ఇలా తెలుగు, తమిళ, మలయాళ నవలల్లో ప్రధాన పాత్రలు వేటాడడానికి వెళ్లిన సన్నివేశం వర్ణించబడింది. ఇది పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఉన్న వేటాడే సంప్రదాయానికి నిదర్శనం.

### 3.2.3.5.2. దేశ సంచారం

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని ప్రధాన పాత్రలు దేశ సంచారానికి వెళ్లిన సన్నివేశం దాదాపుగా అన్ని నవలల్లో చిత్రితమైంది. ఇది పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఉన్న యాత్రల ప్రాధాన్యానికి నిదర్శనం.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో తల్లిదండ్రులతో గొడవపడిన శ్రీరంగరాజు ఇంటినుండి దేశ సంచారానికి బయలుదేరుతాడు. విద్యానగరం నుండి బయలుదేరిన శ్రీరంగరాజు అనేక గ్రామాలను దర్శిస్తాడు. మార్గ మధ్యమంలో వర్ణ వ్యవస్థ గురించి తెలుసుకుంటాడు. సంగమేశ్వరం అడవులగుండా ప్రయాణించి చంద్రగుప్తి అనే ఊరిని చేరుకుంటాడు. అక్కడ సోనాబాయిని చూసి ఇష్టపడతాడు. ఆ తర్వాత కొండవీడుకు వెళ్తాడు. చివరికి విద్యానగరం చేరుకుంటాడు. ఇలా దేశ సంచారం చేసిన శ్రీరంగరాజు లంబాడీల ఆచారాలు, కుల వ్యవస్థ గురించి తెలుసుకుని విద్యానగరానికి చేరుకుంటాడు.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో తల్లిదండ్రుల ప్రవర్తన నచ్చని ప్రతాపముదలియార్, ఇంటినుండి వెళ్లిపోయిన సన్నివేశం చిత్రించబడింది. ఇంటిని వీడిన ప్రతాపముదలియార్ నల్లూరు చేరుకుంటాడు. అక్కడ తన భార్య జ్ఞానాంబాళ్ ను కలుసుకుంటాడు. నల్లూరు నుండి ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ కలిసి ఆదియూరు చేరుకుంటారు. ఆదియూరునుండి విక్రమపురికి చేరుకుంటారు. అక్కడినుండి తిరిగి సత్యపురికి చేరుకుంటారు. ఈ యాత్రా గమనంలో ప్రతాపముదలియార్ రాజ్యంలో దొంగల సంచారం గురించి తెలుసుకుంటాడు. రాజ్యాన్ని పరిపాలించే రాజు సరిగా లేకపోతే ఆ రాజ్యం ఎలా ఉంటుందో తెలుసుకుంటాడు. అపాయం వచ్చినప్పుడు దానిని ఉపాయంతో ఎలా జయించాలో తెలుసుకుంటాడు. ఇలా ప్రతాపముదలియార్ చేసిన యాత్ర అతనికి నూతన అనుభవాలని నేర్పిస్తుంది.

ఇందులేఖ నవలలో ఇందులేఖ నంబూద్రిపాదుని వివాహం చేసుకుందన్న ఒక తప్పుడు ప్రచారాన్ని నమ్మి మాధవుడు బాధతో దేశ సంచారానికి వెళ్తాడు. దేశ సంచారానికి వెళ్లిన మాధవుడు బొంబాయి, బర్మా, కలకత్తా మొదలైన ప్రాంతాలను సందర్శిస్తాడు. ఈ సందర్భనలో

'మాధవుడు' అధునాతంగా ఏర్పడిన ప్రయాణ మార్గాల గురించి వార్తల ప్రసారం గురించి, పట్టణాల నిర్మాణం గురించి తెలుసుకుంటాడు.

ఇందిరాబాయి నవలలో భాస్కరరావు తన చదువు నిమిత్తం విదేశాలకు వెళ్లి కలెక్టర్‌గా మారి తిరిగి తన గ్రామానికి చేరుకుంటాడు. ఇలా అన్ని దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని ప్రధాన పాత్రలు దేశసంచారానికివెళ్లి జ్ఞానాన్ని పొందినట్లు చెప్పబడింది.

**3.2.3.5.3. కథానాయిక - అపహరణ**

కథా నాయికలు అపహరణకు గురైన సన్నివేశాలు శ్రీరంగరాజుచరిత్ర, ప్రతాప ముదలియార్ చరిత్ర నవలల్లో కనిపిస్తాయి. ఇందులేఖ, ఇందిరాబాయి నవలలో కథా నాయికను అపహరించడానికి ప్రయత్నాలు జరిగిన సన్నివేశాలు కనిపిస్తాయి.

ఇందులేఖ నవలలో మాధవుని మీద కోపంతో పంజుమీనన్ తన మనుమరాలైన ఇందులేఖతో సంబంధం మాట్లాడటానికి తన ఇంటికి రావాల్సిందిగా కణ్ణళి సూరి నంబూద్రిపాదును ఆహ్వానిస్తాడు. మలయాళ దేశంలో నంబూద్రి పురుషులు నాయార్ స్త్రీతో సంబంధం ఏర్పర్చుకోవడం సంప్రదాయం. ఈ సంప్రదాయంలో అమ్మాయి తల్లి ఇంటివద్దే ఉంటుంది. కానీ ఇందులేఖతో సంబంధం గురించి పంజుమీనన్ నుండి తనకు లేఖ అందగానే నంబూద్రిపాదు ఎలాగైనా ఆమెను తన ఇంటికి తీసుకురావాలని అనుకుంటాడు. మంది మార్బలంతో నంబూద్రిపాదు ఇందులేఖ ఉంటున్న ఇంటికి వెళ్తాడు. అక్కడ ఇందులేఖ ఎంతకి నంబూద్రిపాదు మాట వినదు. దీనితో చేసేది లేక నంబూద్రిపాదు తన పరువు పోకూడదని ఇందులేఖ స్థానంలో కళ్యాణకుట్టిని తన ఇంటికి తీసుకువెళ్తాడు. ఇందులేఖనే తాను వివాహం చేసుకొని తీసుకెళ్లినట్లుగా ప్రచారం చేస్తాడు.

"ఆ ఇంట్లో స్త్రీలందరూ కలిసి ఒకరినొకరు తోసుకుంటూ ఆ గది పడమటివైపు వాకిలిగుండా ప్రాణాలున్న పందినో లేక వేరొకదానినో పట్టుకొని బోనులో బంధించినట్లు అమాయకురాలైన కళ్యాణ కుట్టిని చుట్టుముట్టి గదిలోపలికి నెట్టి పడమటిగది వాకిలి తలుపు మూసారు. పెళ్లి జరిగిపోయింది. గోవిందుడు అతి జాగ్రత్తగా పల్లకిని మోసేవాళ్లను, మిగిలిన

వాళ్లను తయారుగా ఉంచమని చెప్పి, పల్లకిలను, డోలీలను రాత్రిపూటే తీసుకొని వచ్చిపెట్టి, నిద్రపోకుండా అన్ని ఏర్పాట్లను చూస్తూ వచ్చాడు. దోవలోగాని మరెక్కడైనాగాని ఎవరైనా అడిగితే ఇందులేఖనే పెళ్లి చేసుకొని వెళ్తున్నామని చెప్పాలని నంబూద్రిపాదుతో ఉన్న మిగిలిన వారందరికీ తెలియజేసి హెచ్చరికగా ఉండమని చెప్తాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 224).

ఈ రెండు సన్నివేశాలలో ఇందులేఖ చదువుకున్న అమ్మాయి, కళ్యాణకుట్టి చదువుకోలేని అమ్మాయి. చదువువల్ల వచ్చిన తెలివితేటలవల్ల ఇందులేఖ నంబూద్రిపాదు నుండి తప్పించుకుంటుంది. అమాయకురాలైన కళ్యాణకుట్టి పెద్దలను ఎదురించే ధైర్యం లేక నంబూద్రిపాదును వివాహం చేసుకుంటుంది. ఇది స్త్రీవిద్యా ఆవశ్యకతకి నిదర్శనం. విద్యవస్తే ఆమె ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కొనగలదు అనే సందేశాన్నిచ్చే ఇలాంటి సన్నివేశము ఇందిరాబాయి, ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కూడా కన్పిస్తాయి.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రధాన పాత్ర జ్ఞానాంబాళ్. జ్ఞానాంబాళ్ అందాన్ని గురించి గుణగణాలని గురించి విని పుంగావూరు తహసీల్దార్ ఆమెను పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. ఇదే విషయం గురించి జ్ఞానాంబాళ్ తండ్రి సంబంధ ముదలియార్‌కి ఉత్తరాలు కూడా రాస్తాడు. సంబంధముదలియార్ నుండి ప్రత్యుత్తరం రాకపోయేసరికి జ్ఞానాంబాళ్ ని ఎత్తుకెళ్లి వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుంటాడు. వేసవి కాలంలో సంబంధ ముదలియార్ తన కుటుంబంతో కలిసి ‘పనంపళ్ళి’ అనే గ్రామానికి విహారానికి వెళ్తాడు. పనంపళ్ళి గ్రామం నుండి తిరిగి సత్యపురికి వచ్చే మార్గంలో జ్ఞానాంబాళ్ ని పుంగావూరు తహసీల్దారు మనుషులు ఎత్తుకెళ్తారు. తహసీల్దారు మనుషులు ఒకచోట కల్లు తాగడం కోసం పల్లకిని దింపగా జ్ఞానాంబాళ్ పల్లకి నుండి అడవిలోకి పారిపోతుంది. అడవిలో ఒక సన్యాసి జ్ఞానాంబాళ్ ను కాపాడాలని ఆమెకు సన్యాసి వేషం వేసి ఒక బండిలో పనంపల్లికి చేర్చాలనుకుంటుంది. బండిలో జ్ఞానాంబాళ్, సన్యాసి వెళ్తున్నపుడు పుంగావూరు తహసీల్దారు తన మనుషులతో వచ్చి బండిపై దాడి చేస్తాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న ప్రతాపముదలియార్ తన తుపాకీతో తహసీల్దార్ మనుషులని చంపి జ్ఞానాంబాళ్ ని రక్షిస్తాడు.

"ప్రతాపముదలియార్ తల్లి సుందర అణ్ణిని పేరావూరు నీలకంఠముదలియార్ ఇష్టపడతాడు. సుందర అణ్ణిని వివాహం చేసుకోవడానికి చాలా ప్రయత్నిస్తాడు. తన ప్రయత్నాలు వృధా కావడంవల్ల ఆమెను ఎత్తుకెళ్లి బలవంతంగా వివాహం చేసుకోవాలనుకుంటాడు దానికి తగినట్లుగా ప్రణాళిక రచిస్తాడు. ఒకరోజు ఇంట్లో ఎవరూ లేరని గమనించి సుందరఅణ్ణి తాతగారికి హఠాత్తుగా గుండెనొప్పి వచ్చిందని వెంటనే సుందర అణ్ణిని తీసుకురమ్మన్నారని తప్పుడు వార్తని పంపుతాడు. ఆ వార్త నిజం అని నమ్మిన సుందరాఅణ్ణి నీలకంఠముదలియార్ పంపిన బండిలో కూర్చుంటుంది. ఆ బండి నీలకంఠ ముదలియార్‌ది అని సుందర అణ్ణికి తెలియదు. కొంత ప్రయాణం సాగిన తర్వాత పడమటి దిక్కుకు వెళ్లవలసిన బండి తూర్పు దిక్కుకు వెళ్తుంది. బండిలో కిటికీలన్నీ మూసి ఉండడం తండ్రికి గుండెపోటు వచ్చిందన్న బాధలో ఉండడం వల్ల సుందర అణ్ణి బండి మార్గాన్ని గమనించదు. ఒకచోట బండినడిపేవాని తమలపాకుల సంచి పడిపోతుంది. అతను దానిని తీసుకోవడానికి బండిని ఆపుతాడు. అతను తమలపాకుల సంచిని తీసుకోవడానికి వెళ్లినప్పుడుసుందర అణ్ణి బండి దారి మరలినట్లు గుర్తిస్తుంది. ఆ బండిలో ఒక పక్క నీలకంఠముదలి అనే పేరు రాసి పెట్టి ఉండడంవల్ల దానిని చదివి తాను పెరవూరికి వెళ్లడంలేదని, తాను ఎక్కింది నీలకంఠముదలియార్ బండి అని గ్రహించి ఆ బండిని తానే నడిపి తనను తాను రక్షించుకుంటుంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2018: 18) స్త్రీ విద్యావంతురాలైతే ఎలాంటి కష్టం వచ్చినా ఎదుర్కొనగలదు అని చెప్పడం ఈ సన్నివేశం ఆంతర్యం.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో కథా నాయిక సోనాబాయి. ఈమె చిన్నప్పుడు ఇంటివద్ద ఆడుకుంటూ ఉండగా ఒక లంబాడి స్త్రీ ఎత్తుకెళ్తుంది. పన్నెండు సంవత్సరాలు తనవద్దే పెంచుతుంది. చంద్రగుప్తి అనే ఊరిలో సోనాబాయితో కలిసి ఉంటుంది. అక్కడ భీమానాయకుడు అనే రామనాయక్ తాండాకు చెందిన వ్యక్తి కుట్రవల్ల సోనాబాయి, ఆమెతల్లి కొండవీటిరాజువల్ల కష్టాల్లో పడతారు. కథానాయకుడైన శ్రీరంగరాజు తన ఉపాయంచేత సోనాబాయిని ఆమె పెంపుడు తల్లిని రక్షించి విద్యానగరానికి తీసుకువస్తాడు. విద్యానగరంలో సోనాబాయి పెంపుడు తల్లి సోనాబాయి ఎవరోకాదు శ్రీరంగరాజు మరదలని జరిగిన విషయాన్ని వివరంగా చెప్తుంది.

"యిప్పటికి రమారమి పంద్రెండు సంవత్సరములనాడు మా చనుప యీ దేశమునకు బేరము వచ్చి విద్యానగరము వెలుపల దిగియుండ, నొకనాడు సాయం కాలము గ్రామము లోపలికి వచ్చి రాజనగరు ముందర నాలుగేండ్ల ప్రాయపుబిడ్డ యాడుకొను చుండుటను జూచి బుద్ధిచెడి యెత్తుకొనిపోయిన నాటఁనుండి గారాబమున బెంచితిని. నా రాచబిడ్డయే కాని మఱియెకటి కాదమ్మ, యీబాల నాతప్పు క్షమింపుమమ్మ". (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 111,112) సోనాబాయి పెంపుడు తల్లి అసలు విషయం తెలపగానే శ్రీరంగరాజు మేనత్త సోనాబాయి ఎవరోకాదు తన కూతురు రంగనాయకి అని గుర్తిస్తుంది. ఇలా కథలో మలుపుకు సోనాబాయి అపహరణ కారణంగా నిలుస్తుంది.

ఇందిరాబాయి నవలలో కథానాయిక ఇందిరాబాయి. ఇందిరాబాయి బాలవితంతుగా మారినపుడు ఆమెలో వైరాగ్య భావాన్ని నింపడానికి వచ్చిన సంతమండలి అధ్యక్షుడు రంగప్పయ్య ఇందిరాబాయిని బలాత్కారం చేసి ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తాడు. కాని ఇందిరాబాయి అతన్ని ఎదిరించి అతన్ని ఒక గదిలో బంధించి పారిపోతుంది. మరునాడు ఎంతసేపటికి రంగప్పయ్య ఇందిరాబాయి కనిపించపోయేసరికి అక్కడున్న సంతమండలి సభ్యులు రంగప్పయ్య నిజంగానే ఇందిరాబాయిని ఎత్తుకెళ్లాడని భయపడతారు.

"ఒక స్వామి ఇంకోస్వామి. చెవిలో "బాళప్పయ్య కేసు పరిష్కరించబడి ఇంకా కొన్ని రోజులు కూడా గడవలేదు. ఇంకో కార్యం సంభవించిందా?" అని చెప్పగానే. అతను "మన భక్తుల సంఖ్యను పెంచే మార్గం ఇది కానేకాదు దీనివల్ల అల్లరిపాలౌతాం. అది అలా ఉండని. అధ్యక్షులే ఇటువంటి పనిచేస్తే సంతమండలి గతి ఏం కావాలి? భక్తిరాగాలాపన చేసే వ్యక్తి తానైతాను ఇలా చేయవచ్చా" (వెంకటరావు, గుల్వాడి. 1962: 185).

ఈ సంభాషణలో ప్రస్తావనకి వచ్చిన 'బాళప్పయ్య' అనే స్వామి కూడా కళ్యాణి అనే విధవరాలిని అపహరించి ఆమెతో సంసారజీవితాన్ని ప్రారంభిస్తాడు. ఈ విషయంపై కోర్టులో విచారణ జరగగా బాళప్పయ్యకు శిక్షకూడా పడుతుంది. ఈ బాళప్పయ్య, రంగప్పయ్య అధ్యక్షుడిగా ఉన్న సంతమండలిసభ్యుడు. అందుకే రంగప్పయ్య కనిపించకపోయే సరికి అతను కూడా బాళప్పయ్య మాదిరిగా విధవరాలిగా ఉన్న ఇందిరాబాయిని ఎత్తుకెళ్లాడేమోనని

సంతమండలిలో ఉన్న మిగతాస్వాములు అనుకుంటారు. ఈ విధంగా కథానాయిక అపహరణ సన్నివేశం ద్వారా గుల్వాడి వెంకటరావుగారు నవల రచనా కాలానికి వితంతువుల పరిస్థితిని వివరించారు.

### 3.2.3.5.4. కొలనుగట్టు సన్నివేశం

ఊరికి అవతల ఉన్న కొలనుగట్టు వద్ద, చెరువుగట్టువద్ద ఉన్న జనసమూహం నవలలోని విషయాలతోపాటు ప్రాపంచిక విషయాల గురించి మాట్లాడుకునే సన్నివేశం ఇందిరాబాయి, ఇందులేఖ నవలలో చిత్రితమైంది. ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయి ఇంటినుండి వెళ్లిపోయిన తరువాత కమలాపురం ముక్కణేశ్వర దేవస్థానం వెనుక ఉన్న చెరువుగట్టువద్ద బట్టలు ఉతకడానికి వచ్చిన స్త్రీలు అనేక విషయాల గురించి మాట్లాడుకుంటారు.

"దారు: ఏంటే రుక్కి, ఆదున్నపోతులు అమ్మాయిని అపహరించారట నిజమేనా?

రుక్కి: అపహరించడానికే ఆమె తలిదండ్రులు వాళ్లని ఇంటికి పిలిచారేమో.

లింగు: ఎంతమంచి అమ్మాయి. ఆదున్నపోతులు అపహరించిన అమ్మాయిని వేశ్యలతో జత కలుపుతారేమో?

మేరి: నివేం అంటున్నావ్! నా తల్లి ఇందిరమ్మ వేశ్యలతో జతకడుతుందా? భర్త చనిపోయిన తర్వాత నా బిడ్డ ముఖాన్ని ఎవరైనా చూశారా?

దుగ్గి: నీ అధిక ప్రసంగాన్ని ఆపు. అలాగైతే ఇప్పుడు ఆమె ఎక్కడుంది.

బిర్మా: ఇంట్లో ఒకరు జైలుకు వెళ్లారు? అంతలోనే ఇంకొక ఆమెను ఎవరో ఎత్తుకెళ్లారు. వాళ్లందరు ఎన్ని కష్టాలను అనుభవిస్తున్నారు.

లక్ష్మి: అలాగైతే ఇన్నిరోజులు ఇక్కడ ఉన్నవారు అమ్మాయి కనబడక పోయేసరికి ఇల్లు వదిలి ఎందుకు వెళ్లారు.

పూపె: నీవు ముందు వెళ్లు మేము తరువాత వస్తామని చెప్పిపంపారేమో.

మేరి: మీరందరూ ఏం మాట్లాడుతున్నారు.

లుజ్జు: నీవేం అంటున్నావు మేరి! అమ్మాయి ఎక్కడుందో చూపించు.

దేయి: ఆమెకి పిచ్చి! ఎంతమంది అమ్మాయిలు విటులతో వెళ్లలేదు!" (వెంకటరావు, గుల్వాడి. 1962: 195)

ఇలా దేయి, పూపె, మేరి, దుగ్గె, సుబ్బి, దారు, లక్ష్మి, పొణ్ణు, లింగు, లుజ్జు, బిర్మ్యా, చోము, రుక్కి మొదలైన పేర్ల స్త్రీలు ఇందిరాబాయి అపహరణ గురించి మాట్లాడుతారు. ఈ సన్నివేశం విధవస్త్రీల అపహరణ పంతొమ్మిదవ శతాబ్దంనాడు సర్వసాధారణం అనే అంశాన్ని తెలుపుతుంది. ఈ సంభాషణలో ప్రస్తావించబడ్డ స్త్రీలపేర్లు నవలా రచనా కాలంనాటి స్త్రీల పేర్లకి నిదర్శనం.

ఇందులేఖ నవలలో నంబూద్రిపాదు ఇందులేఖ ఇంటికి వచ్చిన సందర్భంలో వంటగది, స్నానాలగది, కొలనుగట్టువద్ద ఉన్న ప్రజలు నంబూద్రిపాదురాక గురించి రకరకాలుగా మాట్లాడుకుంటారు.

"కొలనుగట్టు సమీపంలో ఉన్న ఒక యువకునితో మరొక యువకుడు

'ఒరేయ్' ఈ నంబూద్రిపాడు పేరేమిట్రా?

కణ్ణల్ ముక్కిల్లాద (ముక్కులేని) వైసూరి నంబూద్రిపాడు అని చెబుతారు

పేరేం బాగాలేదు నిజంగానే

"పేరులో ఏముంది అంతా డబ్బే. వారింట్లో ఏనుగును కట్టే సంకెళ్లుకూడా బంగారంతో చేసినవట. అట్లున్నప్పుడు ముక్కు ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటి? వైసూరి అయితే మాత్రం ఏమిటి?

"ఎంతడబ్బు ఉన్నప్పటికీ ఇందులేఖ మాధవుని తిరస్కరించిందంటే నేను ఆమెమీద ఉంచిన మర్యాద పోతుంది. మాధవుడే ఆమెకు తగినభర్త.

"మాధవునికి బంగారంతో ఏనుగుకు సంకెళ్లు చేయడానికి వీలవుతుందా? నీవెందుకిలా వక్రంగా మాట్లాడుతున్నావు. ఆడవాళ్లకి డబ్బుకి మించింది ఏదీలేదు

"మాధవుడు ఇందులేఖ ఇరువురూ చాలా సన్నిహితమైన వారని విన్నాను!

అదంతా ఇకమీదట జరగదు. మాధవునికి శుక్రదశ ఉంటే అది ముగిసిపోయినట్లే. నిశ్చయంగానే అందులో సందేహమేలేదు!" (జయప్రకాశ్, ఎస్.(అ). 2016: 139, 140)

ఈ సన్నివేశం నంబూద్రిపాదు డాంబిక ప్రవృత్తికి నిదర్శనం. ఇదే విషయం గురించి వంటగదిలో ముత్తు, మాను, సుబుకుట్టి, శంకరశాస్త్రి మాట్లాడుకుంటారు. ఈ సన్నివేశం పంతొమ్మిదవ శతాబ్దంనాడు మలయాళ ప్రాంతంలోని వ్యక్తుల పేర్లను తెలుతుంది.

ప్రతాపముదలియార్ చరిత్ర, శ్రీరంగరాజుచరిత్ర నవలల్లో కొలనుగట్టు సన్నివేశం లేకున్నా ప్రజాసమూహం నవల అంతర్గత విషయాలను చర్చించే సన్నివేశం రెండు నవలల్లోనూ ఉంది.

ప్రతాపముదలియార్ చరిత్రలో సుందర అణ్ణి అన్యాయంగా శిక్షించబడ్డ తనభర్త తరపున మద్రాసుకు వెళ్లి గవర్నర్‌తో వాదిస్తుంది. సుందర అణ్ణి వాదనలు విన్న గవర్నర్ కనకసభ దేవరాజపిళ్ళై సొంతకొడుకని చెప్పడంతో పాటు ఈ వాజ్యంలో సాక్ష్యం చెప్పిన వారందరిని నిర్దోషులుగా తీర్పు చెబుతాడు. ఈ సందర్భంలో అక్కడున్న ప్రజాసమూహం సుందర అణ్ణిని మెచ్చుకుంటారు.

"గవర్నరు వెళ్లిన తరువాత అందరు రాజులు, వారి కుటుంబాలు, ఆదియూరుచుట్టు పక్కల గ్రామాలలో నివసిస్తున్నవారు తీరందాటి పొంగి వస్తున్న సముద్రంవలె గుంపులు గుంపులుగా దేవరాజపిళ్ళై ఇంటికివచ్చి తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఆ మహోత్సవానికి దేవరాజపిళ్ళై ఇల్లే దేవాలయంగానూ, ఆ దేవాలయానికి మాతల్లి దేవతగాను భావించి అందరూ మాఅమ్మని స్తుతించి నమస్కరించారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 135).

శ్రీరంగరాజుచరిత్ర నవలలో సోనాబాయి సమేతంగా శ్రీరంగరాజు విద్యానగరానికి దగ్గరగా ఉన్న ఒక ఊరికి చేరుకుంటాడు. అదివిని శ్రీరంగరాజుని, సోనాబాయిని చూడటానికి వచ్చిన గ్రామ ప్రజలు సోనాబాయిని గురించి అనేక విధాలుగా మాట్లాడుకుంటారు. ఈ మాటలు నవల తరువాతి కథాసూచకంగా ఉంటాయి.

"పరామర్శించడానికి వచ్చిన మరికొందరు లంబాడి యువతిని చూశారు. తండ్రితో కొట్లాడి పోతే పోయాడు కాని అత్యంత అద్భుతమైన సుందరిని తీసుకువచ్చాడు అని మెచ్చుకున్నారు. మరికొందరు చూస్తుంటే ఈ అమ్మాయి దేవకన్యలా ఉంది. ఇంత నీచకులంలో పుట్టించి పాడు బ్రహ్మ ఎంత చిన్నచూపు చూశాడో" అని దేవుణ్ణి నిందిస్తున్నారు. మరికొందరు బుద్ధిమంతులు దేవుడిలా ఎందుకుచేస్తాడు. ఈమె పూర్వపరాలు తెలిస్తే తప్ప ఏమీ చెప్పలేం అంటున్నారు" (నరేశ్‌బాబు, దోనేపూడి. 2017: 64).

ఈ సంభాషణలోని మాటలు సోనాబాయి లంబాడి స్త్రీకాదు రాచకన్య అనే నవల భవిష్య కథాంశానికి పరోక్ష సూచకాలు. ఇలా అన్ని నవలల్లోను నవల అంతర్గతంగా పాత్రలు చేస్తున్న పనులను ఆనాటి ప్రజాసమూహం చూస్తుందనడానికి నిదర్శనంగా కొలనుగట్టు, స్నానాలగది, వంటగది, దేవాలయం వంటి ప్రాంతాలలో ప్రజలు మాట్లాడుకున్న సన్నివేషాలను రచయితలు చిత్రించారు.

### 3.2.3.6. వాతావరణం

"నవల మానవజీవితాన్ని చిత్రించేది. మానవునికి తన దేశకాల సమాజ పరిస్థితులతో సంబంధం ఉంటుంది. కాబట్టి నవలలో పృష్ఠభూమికగా దేశకాల సమాజ చిత్రణ చేయవలసి ఉంటుంది. ఈ చిత్రణ సమగ్రంగా, స్వాభావికంగా జరిగినప్పుడే నవల ప్రభావ వంతంగా ఉంటుంది." (సుజాతారెడ్డి, ముదిగంటి. 2017:163). నవలలోని పాత్రలు నడయాడిన ప్రాంత పరిస్థితులను వర్ణనల ద్వారా రచయిత పాఠకులకు అందిస్తాడు. ఇలాంటి వర్ణన సాంఘిక నవలలో నవలకి భూమికగా నిలిచిన సంఘ వాతావరణాన్ని తెలుసుకోవడానికి ఉపకరిస్తుంది. దక్షిణ భారతీయ తొలి సాంఘిక నవలల్లో పాత్రలు ప్రవేశపెట్టే సందర్భంలోను, పాత్రల గుణగణాలను వివరించే సందర్భంలోను, నగరాలని, సన్నివేశాలని వివరించే సందర్భంలోను నవలా రచనా కాలంనాటి సమాజ వాతావరణం చిత్రితమైంది. శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు తండ్రితో గొడవ పడి దేశ సంచారానికి బయలుదేరిన సందర్భంలో అతను చూసిన గ్రామీణ జీవితం వర్ణించబడింది. ఈ వర్ణన శ్రీరంగరాజు నడయాడిన కాలం నాటి గ్రామీణ వాతావరణాన్ని పాఠకులకి అందించడంతోపాటు వారిని పంతొమ్మిదవ శతాబ్దంనాటి తెలుగు పల్లె సీమలకు తీసుకువెళ్తుంది.

"యొక యూరి బావికింజని సంధ్యావందనంబు సలిపి, జలాహరణార్థము వచ్చిన జానపదులు కడవలనించుకొని నీరొక బొట్టుగాని కారకుండ దణ్ణనున్నవారు, పంటిపగిలెఁ బగిలెనని భ్రమించునట్లు, అవలీలగా నెత్తికిని మోపునకు నొకానొకర్తుక రొండికి నెత్తుకొనుటను జూచి గారిడిసాములు నేర్పి, కర్రల ద్రిప్పువారయినఁగాని యుంత నిరాయాసం బున నెత్తఁగలరేమి యూచానల సామర్థ్యమని మెచ్చుకొనుచు బసచేయుటకు గ్రామంబు సొచ్చి, మంటిమిద్దె యిండ్లను వానిముందర యెరువుదిబ్బలు దిబ్బగుంటలు కమ్పకడఁగన్న శ్మలము

నిండ్ల ముందర ముదితలుపొంగఁబోంగఁగాగిననీరు, నుదుకుదుకుగా బోసి నల్లులను వెడలించుచున్న మలినంబులైన నులక మంచములను జూచి యేవగించుచు జంగిలివాఁడు తోలుకొని పోవుచున్న పశువుల వెంబడిఁ బేడకుఁగాఁ బుటికలుపట్టుకొని నేలఁబడిన పేడ కీ కడినాది యీ కడి నాది యని తగువులాడుచుఁ బోవుచున్న కోమటి పడుచులను జూచి నగుచు" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010:68). ఈ వర్ణన శ్రీరంగరాజుచరిత్ర నవలా కాలంనాటి గ్రామీణ వాతావరణానికి నిదర్శనం.

ఇందులేఖ నవలలో మాధవుడి పాత్రని పరిచయం చేసే సందర్భంలో అతను నడయాడిన ప్రాంత వాతావరణం పాఠకులకు పరిచయం చేయబడింది. "మాధవునితో పరిచయం అయిన ఐరోపియులంతా అతడిని చూసిన మాత్రంలోనే మాధవునిచే ఆకర్షించబడి వెనువెంటనే అతనికి మంచి స్నేహితులుగా మారిపోతుండేవారు. ఈ విధంగా యవ్వనంలో తన శరీరం అత్యంత మనోహరంగా ఉన్నదని అందరూ భావించడం తనకు పెద్ద ఆభరణంగా భావించి అది ఏనాటికి చెడిపోకూడదు అనే స్థిరమైన ఆలోచన కలిగిఉండేవాడు. సహజంగానే వచ్చిన సంస్కారంచేత సాధారణంగా 18 సంవత్సరాలకే పెళ్లి చేసుకొని గృహస్థాశ్రమ ప్రవేశానికి పూర్వమే దురభ్యాసాలకు లోనైన కొంతమంది యువకులలో కనిపించే చెడు నడత మాధవునిలో కొంచెమైనా కనిపించలేదనేది నిశ్చయంగా చెప్పగలను. మాధవుడు ఆంగ్లంలో అత్యంత నిపుణుడనే విషయాన్ని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదుకదా! లాన్‌టెన్నిస్, క్రికెట్ మొదలైన ఆటల్లోకూడా మాధవుడు ఎంతో ప్రవీణుడుగా ఉండేవాడు. చిన్నప్పటినుండి వెంటాడడం అతనికి అలవాటు. అతని తండ్రిగారైన గోవింద పణక్కర్‌నుండి సంక్రమించిన అలవాటుగా ఉన్నప్పటికీ మాధవుడు వేటలో మిక్కిలి ప్రావీణ్యం కలవాడిగా పేరుతెచ్చుకున్నాడు. వేటాడడం అనే అలవాటు అతనిలో వెర్రిగా ఉండేది. రెండు మూడు రకాలైన తుపాకులు రెండుమూడు పిస్తళ్లు, రివాల్వర్లు మొదలైన వాటిని తాను వెళ్లిన ప్రదేశాలకు కూడా తీసుకెళ్లడం అలవాటుగా ఉండేది. తన విరామ సమయాల్లో కథాకళి, నృత్యనాటకాలు చూసేవాడు. అతని మనసును మరల్చేదాకా వేటాడడంతోనే మాధవుడు ఆధికకాలం గడుపుతుండేవాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 3). ఈ వర్ణనలో మాధవుడు నడయాడిన సమాజ వాతావరణం కనిపిస్తుంది. యూరోపియన్లు ఉన్న సమాజంలో బాల్య వివాహాలు, అప్పుడప్పుడే అంతమవుతున్న సమాజంలో, వేట వంటి ప్రాచీన ఆటలకి సమాంతరంగా టెన్నీస్, క్రికెట్

కొనసాగుతున్న వాతావరణంతో కూడిన సమాజంలో మాధవుడున్నాడు అని ఈ వర్ణన తెలుపుతుంది. ఇది నవలా రచనాకాలంనాటి సమాజ వాతావరణానికి నిదర్శనం.

ఇందిరాబాయి నవలలో భీమారావు కుటుంబ పరిస్థితులని వివరించే సందర్భంలో నవలా రచనా కాలంనాటి సామాజిక వాతావరణం పాఠకులకు అందించడం జరిగింది.

"హిగిరుత్తిరువాగ మనెయల్లి యథానుశక్తియాగి దేవరపూజయూ, పంచ పర్వగళు, ఆగాగ నరసింహశాస్త్రిగూ, స్నేహితరిగూ హలవు బగియ ఫలార ఉపచారగళూ స్వజాతీయ గురుళవరు కమలాపురక్కే చిత్తిసిద సమయగళల్లి పాదపూజ ముంతాద సేవెగళు, దేవాలయదల్లి ఆగాగ్గె సంతర్పగళూ, ఉత్సవగళూ హిగెల్లా అనేక సత్కర్మగళు అంబాబాయియ సూచెనగళిగను సారవాగి నడియ లారంభిసిదవు" (వెంకటరావు, గుల్వాడి. 1962: 3). ఈ వర్ణన గురుపూజ, సంతర్పణలు, ఉత్సవాలు నిత్యం యక్షగాన పారాయణం జరిగే వాతావరణంలో భీమారావు, అతని కుటుంబం ఉన్నదన్న విషయాన్ని తేట పరుస్తున్నది. ఇలా ఆధ్యాత్మిక వాతావరణం కలిగిన సమాజ వాతావరణంలోని పూర్తి అంశాలు నవలలోని 17వ భాగంలో తెలుపబడ్డాయి.

"ఈ సమయంలో కమలాపురం గ్రామంలో యువకులు ఇంగ్లీషు అనే మ్లేచ్ఛుల భాషని నేర్చి వర్ణాశ్రమ ధర్మాలను, కర్మ సిద్ధాంతాన్ని పాటించకుండా కులభ్రష్టులుగా మారి విదేశాలకు వెళ్లడం మొదలైన అధర్మ కార్యాలలో ప్రవర్తిస్తున్నారు. విధవ వివాహం, యువతీ వివాహం మొదలైన కర్మలను చేస్తున్నారు. గురువులపట్ల లేశమాత్రమైన భయభక్తులు లేక గురుమతానికి ఇవ్వవలసిన వార్షిక చందాను ఇవ్వకుండా అపహరిస్తున్నారు. పిలిచి అడిగితే ఇంగ్లీషు పదాలను మధ్య మధ్యలో చేర్చి అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతూ భయభక్తులు లేకుండా ప్రవరిస్తున్నారు. గురుసంస్థానానికి జాతికి కళంకం తెచ్చే విధంగా ద్రోహాలోచనలు చేస్తున్నారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 63).

ఈ వర్ణన కమలాపురం గ్రామంలో ఉన్న యువకుల ప్రవర్తనను తెలుపుతుంది. ఇంగ్లీషు విద్య చదవడం వల్ల యువకులలో వచ్చిన చైతన్యం, వారు ప్రవర్తించిన తీరు వంటి అంశాలు ఈ వర్ణన ద్వారా పాఠకులకు తెలుస్తున్నాయి. ఆ నాటి సమాజంలో ఉన్న మతం దాని అధికారాలతో

కూడిన సమాజ వాతావరణం ఈ వర్ణనలో కనిపిస్తుంది. ప్రాచీన సంస్కృతికి, ఆధునిక సంస్కృతికి మధ్య సంఘర్షణ నడుస్తున్న నాటి సమాజ వాతావరణం ఈ వర్ణనలో ధ్వనిస్తుంది.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ బాల్యం గురించిన వర్ణనలో, దేవరాజ పిళ్ళై వ్యాధిగ్రస్తుడైనప్పుడు నాటి సామాజిక వాతావరణం చిత్రితమైంది.

"గ్రామ విషయాలపట్ల మా నాన్నగారు ఆవగింజంతైనా గమనించక పోవడంవల్ల మా అమ్మ ఆ బాధ్యతనంతా నిర్వహిస్తూ వచ్చింది. నేను కనకసభ మరికొందరు పిల్లలు దేహ దారుఢ్యంకోసం కొన్ని రోజులుగా కత్తిసాము నేర్చుకుంటూ వచ్చాము. ఒక రోజు రాత్రి చాలా సేపు మేము కత్తిసాము చేసి ఇంటికిరాగా మా ఇంటికి ఎదురుగా ఉన్న మైదానంలో వీధి భాగవతుల వారువేషాలను ధరించి రామాయణం నాటకం ప్రదర్శిస్తూ ఉన్నారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 3, 10).

"దేవరాజపిళ్ళైకి తీవ్రమైన వ్యాధి సోకింది. కుటుంబవైద్యులు, తదితర వైద్యులు ఔషధం ఇచ్చినప్పటికీ రోగం తగ్గలేదు. ఇంగ్లీషు డాక్టర్లు మందు ఇచ్చి  కొంచెం గుణమైన తరువాత దేశయాత్రలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని గట్టిగా చెప్పారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 26).

ఈ వర్ణనలు చదివిన తర్వాత నవలా రచనాకాలానికి సంపన్న కుటుంబాలలో పిల్లల చదువులకి అంత ప్రాముఖ్యం ఇవ్వలేదని, విద్యావ్యాప్తి నాటి సమాజంలో అంతగా లేదని అర్థమవుతుంది. కుటుంబంలో స్త్రీలకు తగిన గౌరవం ఇవ్వబడినట్లు, రాత్రి సమయాల్లో రామాయణాది కథలతో వీధి భాగవతాలు నడిచినట్లు తెలుస్తుంది. దేవరాజపిళ్ళైకి ఆంగ్లేయ వైద్యులు వైద్యం చేసినట్లు వర్ణించబడింది. దీనివల్ల నాటి సమాజంలో ఆంగ్ల వైద్యం కూడా అందుబాటులో ఉన్నట్లు తెలుస్తుంది. ఇలా సందర్భానుసారంగా వేదనాయగంపిళ్ళైగారు నవలా కథా వ్యాప్తిలో భాగంగా నవలా రచనా కాలంనాటి సామాజిక వాతావరణాన్ని పాఠకులకు అందించారు.

ఆంగ్లేయుల సంపర్కంవల్ల భారతీయ గ్రామీణ వాతావరణంలో వచ్చిన మార్పు 'ఇందులేఖ' నవలలో కనిపిస్తుంది. నవల వెలువడే కాలానికి మలయాళ ప్రాంతానికి ఆంగ్లేయులతో సంపర్కం ఏర్పడింది. వస్తు సంస్కృతిలో, ఆహారపు అలవాట్లలో మార్పు వచ్చింది. ఈ అంశాలు ఇందులేఖ పాత్రని పరిచయం చేసే సందర్భంలో ఒ. చందుమీనన్‌గారు వివరించారు. "పొద్దుపోవడానికి ఐరోపాదేశంలో స్త్రీలు నేర్చుకునే కుట్టుపని, చిత్ర లేఖనం మొదలైన వాటిని కూడా అతిమనోహరి అయిన తన మేనకోడలు ఇందులేఖకి పరిచయం చేశారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2010: 10). ఇందులేఖను పెంచిన మేనమామ కృష్ణమీనన్ మరణించిన తర్వాత ఆమె నివాసం పంజుమీనన్ ఇంటికి మారుతుంది. అక్కడ ఇందులేఖ కోసం ఏర్పాటుచేయబడిన గది వాతావరణాన్ని వివరిస్తూ చెప్పిన మాటలు ఆనాటి సామాజిక వాతావరణానికి దర్పణం.

"ఉండడానికి ప్రత్యేకంగా ఒక బంగళా ఏర్పాటు చేయబడింది. ఆ బంగళాలో అన్ని గదులలోను ఆంగ్లేయ పద్ధతికి తగినట్లుగా సామానులు మొదలైనవి అందంగా అమర్చబడి ఇందులేఖ అభీష్టం ప్రకారం తీర్చిదిద్దబడి ఉండేవి." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 10) ఈ వాక్యాలు నవలా రచనా కాలానికి ఆంగ్లేయులతో ఏర్పడిన సంపర్కానికి నిదర్శనం.

### 3.2.3.7. వర్ణనలు

నవలలో రచయిత వివరించే అంశం పాఠకులకు అందించడానికి వర్ణనలు తోడ్పడతాయి. నవలలోని సందర్భం, సన్నివేశానికి తగినటువంటి వర్ణన రచయిత చేస్తాడు "సందర్భానుకూలంగా రచయిత ప్రకృతి వర్ణనలను, గ్రామ, పట్టణ వీధులను, గృహాదులను అంటే సన్నివేశం జరిగే పరిసరాలను వర్ణించవచ్చు." (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 132). ఈ వర్ణనల నిడివి ఇంతే ఉంటుందని గిరిగీసి చెప్పడం కష్టం. తాను వివరించే సన్నివేశ వాతావరణం పూర్తిగా తానే పాఠకులకు తెలియ చెప్పాలని రచయిత ఆకాంక్షించినపుడు వర్ణనల నిడివి పెరుగుతుంది. నవలా సన్నివేశం జరిగే పరిసర ప్రాంతాలను కొంత తాను వివరించి మిగి న అంశాలను పాఠకుల ఊహకి విడిచిపెట్టినప్పుడు వర్ణనల నిడివి తగ్గుతుంది. నవలలో వర్ణనలు పాఠకుడిని నవల జరిగే ప్రాంత పరిస్థితులకు తీసుకు వెళ్లడానికి తోడ్పడుతాయి. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో శ్రీరంగరాజుచరిత్ర, ఇందులేఖ నవలలలో సుదీర్ఘ వర్ణనలు

ఉండగా, ఇందిరాబాయి, ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో తక్కువ నిడివితో కూడిన వర్ణనలున్నాయి.

శ్రీరంగరాజుచరిత్ర నవల విద్యానగర వర్ణనతో ప్రారంభమౌతుంది. నగర నిర్మాణంతో ప్రారంభమైన వర్ణన. రాజుగారి గృహవర్ణన, తోటల వర్ణన, నగరంలోని అన్న సత్రాలవర్ణన, నగరంలోని చతుర్వర్ణ వ్యవస్థ వర్ణన దిశగా కొనసాగుతుంది.(ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010: 59, 61) ఇది సుధీర్ఘ వర్ణన. ఈ వర్ణనలో విద్యానగర పూర్తి అంశాలు పాఠకులకు అందుతాయి. విద్యానగరాన్ని వీడిన శ్రీరంగరాజు గ్రామాలను సందర్శించి మళ్లీ విద్యానగరాన్ని చేరుకుంటాడు. విద్యానగరం తరువాత శ్రీరంగరాజు గ్రామాలలో సంచరిస్తాడు. గ్రామాలలో ఉండే గ్రామీణ జీవితం రెండవ అధ్యాయంలో సుధీర్ఘంగా వర్ణించబడింది. నీళ్లను మోసే స్త్రీల వర్ణనలతో ప్రారంభమైన గ్రామీణజీవిత వర్ణన, మట్టి ఇళ్లు, నులక మంచాలు, పొలానికి వెళ్లే రైతులు, పొలానికి నీళ్లు తోడే పురుషులు, కాలువలు తీసే స్త్రీలు, పల్లెటూరి వాతావరణానికి, నగర వాతావరణానికి ఉండే భేదాల వర్ణన దిశగా సాగుతుంది. ఈ వర్ణన నవలా రచనా కాలంనాటి వాస్తవిక గ్రామీణ జీవితానికి నిదర్శనం. (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 68-71) గ్రామాలను దర్శిస్తున్న శ్రీరంగరాజు 'చంద్రగుప్తి' అటవీ మార్గంలో ప్రయాణిస్తాడు. చంద్రగుప్తి వనంలో వేటకు వెళ్తాడు. అతడు ప్రవేశించిన అడవి వర్ణన నాలుగవ అధ్యాయంలో కన్పిస్తుంది.

"అది మహా ఘోరవనంబు, అందుతేఁకు, తుమికి, నల్లమద్దిఏగె, చిట్టేగే, చిరిమాను, పెద్దమాను, చందనము, దిరసనము, రావి, జువ్వి, ముక్కిడి, బీల్వుడు, చిటిపిటి, చిందుగ, శ్రీగంధ మగరువు మొదలగు మ్రాకులను, ఇప్ప, కుంకుడు, చీకాయిచాఱ, వెలంగ, తోరెలంగ మారెడు, నేరేడు, కరక, ఈంగు, జీడి, తాడి మొదలగు ఫల వృక్షములను, ముష్టి, మంగ, గుగ్గిల, మోదుగు, బలుసు, కవివ, సంద్ర, జాన, యిరికిదంతె మొదలగు ఫలౌషదాది గుల్మంబులను, దట్టముగా కమ్ముకొని యుండు. పులి, చిరుతపులి, ఎలుగు, మనుబోతు, కడతి, కొరనాసిగాఁడు, తోడేలు, ఱేఁచుకుక్క, యాళువపఁదు, పంది, దుప్పి, జింక, కొండగొరియ, కుందేలు మొదలగు మెకములు నేల నడయాడుచుండు గువ్వ, బెళగువ్వ, చిలుక, కోయిల, గోరువంక, నెమలి, పొన్నంగి, చిమట, కోడి, లావుక, జేముడుకాకి, పెడిసె, గిజిగాడు మొదలగు నానాజాతి పక్షులు,

వృక్షంబులం బరచూచు నానావిధ రుతంబులు చేయుచుండును.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 81). ఈ వర్ణన శీరంగరాజు ప్రవేశించిన అటవీ వాతావరణంలోకి పాఠకులను తీసుకువెళ్లడంతోపాటు అడవులలోని వృక్షాల, జంతువుల, పక్షుల రకాలను పాఠకులకు పరిచయం చేస్తుంది. శ్రీరంగరాజు చంద్రగుప్తిలో సోనాబాయిని కలిసిన సందర్భంలో లంబాడీల వివాహ వర్ణన, శ్రీరంగరాజు సోనాబాయిని విద్యానగరానికి తీసుకువచ్చిన సందర్భంలో శ్రీరంగరాజు, సోనాబాయిల వివాహ వర్ణన కనిపిస్తుంది. ఈ విధంగా నగర, వన, వేట, వివాహ వర్ణనలు శ్రీరంగరాజుచరిత్ర నవలలో కన్పిస్తాయి.

శ్రీరంగరాజుచరిత్ర నవల మాదిరిగానే ఇందులేఖ నవలలో సుధీర్ఘ నగర వర్ణన కనిపిస్తుంది. మాధవుడు ఉత్తర భారతదేశ యాత్రా నిమిత్తం వెళ్లినపుడు కలకత్తా, బొంబాయి వంటి నగరాలను దర్శిస్తాడు. ఈ నగరాలను మాధవుడు సందర్శించిన సమయంలో ఒ. చందుమీనన్‌గారు బొంబాయి ఓడరేవును, కలకత్తా పట్టణాన్ని, కలకత్తాలోని వ్యాపారి బాబు గోవిందాసేన్ ఇంటిని సుధీర్ఘంగా వర్ణించారు.

“పాలనురుగులాగా అతి తెల్లగానూ, నీటి మేఘాలలో నీలివర్ణంగానూ పలు రకాలైన కుంకుమ వర్ణాలతో, ఎర్రరంగు కలగలిసిన రంగులతో కూడిన పెక్కు ఉన్నతమైన గుర్రాలచే లాగబడుతున్న సార్టు అనబడే గుర్రపుబళ్లు లెక్కలేనన్ని దిక్కుదిశాలేకుండా పరుగెత్తుతుండడం, చిత్రాలలాగ నిలబెట్టినట్లు మిక్కిలి అందమైన సముద్రతీరపు ప్రదేశాలలో నిలబెట్టి ఉండడం మొదలైన దృశ్యాలను, ఆ బళ్లలో కూర్చొని సముద్రపు గాలిని ఆస్వాదిస్తున్న వారిని, సముద్ర తీరంలో నిలబడి వేడుక చూస్తున్న పెద్దకుటుంబానికి చెందిన పురుషులను, చంద్రబింబాన్ని పోలిన ముఖంగల స్త్రీలను, సముద్రంనుండి వీచే మందమారుతాన్ని ఆస్వాదిస్తూ ఆనందంతో సల్లాపాలు జరుపుతున్న వారిని చూడటం ఆనందకరమైన ఒక దృశ్యం.” (జయప్రకాశ్, ఎస్(అ).2016: 243, 244) ఈ వర్ణన సముద్రతీర పరిస్థితులకు నిదర్శనం. బొంబాయి ఓడరేవునుండి బయలుదేరిన మాధవుడు కలకత్తా నగరాన్ని చేరుకుంటాడు. కలకత్తాలో భవనాల అందాలు వీక్షిస్తూ బాబుగోవిందాసేన్ ఇంటిని చేరుకుంటాడు.

"ప్రత్యేకంగా వీధులనుండి కొంచెం తొలిగి నాలుగువైపుల అతి మనోహరమైన పూలతోటలతో పరివేష్టింపబడిన బంగళాలు నిర్మించబడి ఉన్నాయి. ఈ పెద్ద తోటలోకి ప్రవేశించి ప్రవేశించగానే మాధవుని మనసులో ఆశ్చర్యకరమైన భావం ఒకటి కలిగింది. నాలుగైదు అత్యున్నతములైన వరుసలు గల భవనపు కట్టడాలను తెల్లని రంగుతో ఆకాశాన్నంటుతూ సమున్నతంగా నిలిచిన గోపురాలను చూసి మాధవుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. ఇంతటి ఎత్తైన భవనాలను అంతకుమునుపు తాను చూడలేదని నిశ్చయించుకున్నాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 248) కలకత్తా నగరంలోని ఎత్తైన భవనాల అందాలకి ఈ వర్ణన నిదర్శనం. మాధవుడి వేట, నంబూద్రిపాడు ఆహార్యం, ఇందులేఖ, మాధవుల వివాహం వంటి అంశాలు సందర్భానుసారంగా ఇందులేఖ నవలలో వర్ణించబడ్డాయి.

ఇందిరాబాయి నవల పురవర్ణనతో ప్రారంభమౌతుంది. ఈ వర్ణన నవలా రచనా కాలంనాటి చతుర్వర్ణ విభజనను సూచించే విధంగా ఉంటుంది. (వెంకటరావు, గుల్వాడి. 1962: 1). కథాగమనంలో భీమారావు ఇంటి వాతావరణ వర్ణన, ఇందిరాబాయి, విఠలరావుల వివాహ వర్ణన, కమలాపుర మఠ సంప్రదాయ వర్ణన, ఇందిరాబాయి, భాస్కరరావుల వితంతు పునర్వివాహ వర్ణన వంటి వర్ణనలు చేయబడ్డాయి. ఈ అన్ని వర్ణనలు కథలోని సంఘటనలకు తగినట్లుగా పాఠకుని నాటి సామాజిక వాతావరణంలోకి తీసుకెళ్తాయి.

"ఇంట్లో యథాప్రకారంగా దేవునిపూజ, పంచవ్రతాలు, రాత్రుళ్ళలో తాళ మద్దెలతో యక్షగాన ప్రసంగాలు అప్పుడప్పుడు నరసింహశాస్త్రికి, అతని స్నేహితులకి ఫలహార ఉపాచారాలు, సజాతీయ గురువులకి భిక్షాదిసేవలు, దేవాలయంలో అప్పుడప్పుడు సంతర్పణలు ఈ విధంగా అనేక సత్కార్యాలు, అంబాబాయి సూచనానుసారంగా నడవసాగాయి." (వెంకటరావు, గుల్వాడి. 1972: 3) ఈ వర్ణన పంతొమ్మిదవ శతాబ్దం నాటికి ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న కుటుంబాలలోని వాతావరణాన్ని కళ్లకుకట్టినట్టుగా పాఠకుల ముందు ఉంచుతున్నది. ఇలాంటి వర్ణన విఠలరావు, భాస్కరరావు వివాహ సందర్భంలో కూడా చేయబడింది.

తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో పురవర్ణన కనిపించదు. ప్రతాపముదలియార్ 'సత్యపురి' అనే గ్రామంలో పుట్టాడు అని రేఖామాత్రంగా ప్రతాప

ముదలియార్ పుట్టిన నగరాన్ని ప్రస్తావించడం కనిపిస్తుంది. ప్రతాపముదలియార్ ఎదిగే క్రమంలో అతని బాల్యక్రీడలు సుదీర్ఘంగా వర్ణితమయ్యాయి. ప్రతాపముదలియార్ విద్యాభ్యాస సమయంలో అతని ఇంటివెనుక ఉన్న తోటని వేదనాయగం పిళ్ళైగారు వర్ణించారు.

"మా ఇళ్లకు వెనకవైపు లెక్కలేనన్ని ఫలవృక్షాలతో కూడిన తోటలు, పూదోటలు, తామరతో నిండిన తటాకాలు ఉన్నాయి. మేము చదువుకునే సమయంలో తప్ప మిగిలిన వేళల్లో ఇంద్రుని ఉద్యాన వనాలకు సమానమైన ఆ అందమైన ఉద్యాన వనాల్లో ఆటలు ఆడుకోవడం అలవాటు. ఆటలాడుకునే సమయాల్లో కూడా జ్ఞానాంబాళ్ ధర్మవిషయాల్లో ప్రవర్తిల్లూతూ ఉండేది. ఏ విధంగా అంటే అందమైన తోటల్లో పండిన మామిడిపండ్లు, పనస పళ్లు, వెలగపళ్లు, కొబ్బరికాయలు మొదలైన వాటినికోసి పేదలకు పంచుతూ వచ్చేది. ఆ తోటలో నున్న పక్షులను ఎవరూ పట్టుకోకుండానూ, వాటికి ఉపద్రవం కలిగించకుండానూ వాటిని రక్షిస్తూ వచ్చేది. అందువల్ల ఆ పక్షిసంతతి బాగా వృద్ధి చెంది జ్ఞానాంబాళ్‌ను చూసిన వెంటనే కిలకిలరావాలు చేస్తుంటాయి." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 20). ఈ వర్ణన జీవకారుణ్య భావనకి నిదర్శనం. ఒకపక్క పచ్చని తోటని తోటలోని వృక్షాలను వర్ణిస్తూనే ఇంకోపక్క పశు పక్షాదులను మనం కాపాడాలన్న జీవకారుణ్య భావనతో కూడిన సందేశాన్ని వేదనాయగం పిళ్ళైగారు ఈ వర్ణన ద్వారా ఇచ్చారు. కనకసభ వివాహ సమయంలో తమిళ సంప్రదాయ వివాహాన్ని పూర్తిగా వర్ణించడం జరిగింది. వేటను చూడడానికి ప్రతాపముదలియార్ అడవికి వెళ్లిన సందర్భంలో ఏనుగు బెదిరి అడవిలోకి ప్రవేశించి చాలాదూరం ప్రయాణిస్తుంది. ఏనుగు ప్రయాణించిన మార్గంలోని అడవులని ఏనుగు వేగానికి తగినట్లుగా వర్ణించడం జరిగింది.

"ఒక పర్వతం జలపాతాలతో నడిచి పోతున్నట్లు ఆ మదగజము మదజలాలను స్రవిస్తూ అడ్డుగా వచ్చిన చెట్లనూ తీగలను ధ్వంసంచేస్తూ, మేఘ గర్జనలు చేస్తూ అడవిలోకి పరుగెత్తింది. దీనిని చూసిన మిగిలిన ఏనుగులు, పులి, ఎలుగుబంట్లు మొదలైన జంతువులు గజ గజ వణుకుతూ కొండలు, లోయలు దాటుకొని ఉత్తరదిశగా పరిగెత్తాయి." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 153) మిగిలిన దక్షిణ భారత తొలి సాంఘిక నవలతో పోల్చి చూపినపుడు ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో వర్ణనలు తక్కువగా కనిపిస్తాయి.

### 3.2.3.8. నామకరణము

నవలా రచయిత నవలకి పేరుని అనేక రకాలుగా పెట్టడానికి ఆస్కారం ఉంది. నవలలోని ప్రధాన సంఘటన ఆధారంగా నవలకి పేరు పెట్టవచ్చు. లేదా నవలలోని పాత్రల ఆధారంగా నవలకి పేరు పెట్టవచ్చు. దక్షిణ భారత తొలి సాంఘిక నవలలన్నింటిలో నవలలోని పాత్రల పేర్లని నవలకి పేర్లుగా పెట్టడం కనిపిస్తుంది. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలలో నవల పేరుకు తగినట్లుగానే నవల ఆసాంతం శ్రీరంగరాజు కథ వివరించబడింది. తమిళ 'ప్రతాపముదలియార్ చరిత్ర' నవలలో ప్రతాపముదలియార్ ఇతివృత్తం బాల్యంనుండి వివాహం వరకు, తదనంతరం గృహస్త జీవితంలో కొంతభాగం వర్ణించబడింది. తెలుగు, తమిళ నవలలు పురుషపాత్రల పేర్లు నవల శీర్షికగా కలిగిన నవలలుకాగా, కన్నడ 'ఇందిరాబాయి', మలయాళ 'ఇందులేఖ' నవలలు స్త్రీపాత్రల పేర్లను నవలా శీర్షికలుగా కలిగిన నవలలు. కన్నడ ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయి పాత్ర ప్రధాన కేంద్రంగా స్త్రీవిద్య, వితంతు పునర్వివాహం వంటి సందేశాలు అందించబడ్డాయి. నవలలో ప్రధానంగా ఇందిరాబాయి ఎదుర్కొన్న కష్టాలు, ఆమె సాధించిన విజయం ప్రస్తావించబడ్డాయి. మలయాళ ఇందులేఖ నవలలో ఇందులేఖ పాత్ర ద్వారా నాయర్ స్త్రీలలోని మనోధైర్యం వ్యక్తమైంది. నవల ఆసాంతం ఇందులేఖ పాత్ర చుట్టూ తిరుగుతుంది. ఇంటిపెద్ద పంజుమీనన్ ఇందులేఖ నుండి మాధవుడిని దూరం చేయాలని నంబూద్రిపాదుని ఇంటికి పిలుస్తాడు. నంబూద్రిపాదు ఇందులేఖని వివాహం చేసుకున్నాడని నమ్మి మాధవుడుఇందులేఖ దక్కలేదనే బాధతో ఉత్తర భారతదేశ యాత్రకి వెళ్తాడు. ఇలా అన్ని సంఘటనలు నవలలో 'ఇందులేఖ' కేంద్రంగా జరుగుతాయి. ఈ విధంగా నవలలో ప్రధాన పాత్ర పోషించిన పాత్రలపేర్లను నవలల పేర్లుగా పెట్టడం దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది.

తెలుగు, కన్నడ, తమిళ భాషల్లోని తొలి సాంఘిక నవలలకి రెండు పేర్లున్నాయి. నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు తెలుగులో "శ్రీరంగరాజుచరిత్ర" నవలకి 'సోనాబా పరిణయం' అనే ఇంకో పేరుకూడా పెట్టారు. కన్నడలో గుల్వాడి వెంకటరావుగారు ఇందిరాబాయి నవలకి 'సద్ధర్మ విజయం' అనే ఇంకో పేరుకూడా పెట్టారు. తమిళంలో వేదనాయగం పిళ్ళైగారు "ప్రతాపముదలియార్ చరిత్ర" నవలకి 'సుగుణ సుందరి చరిత్రము' అనే ఇంకో పేరుకూడా పెట్టారు. మలయాళ ఇందులేఖ నవలకి రెండు పేర్లు కనిపించవు. "ఈవిధంగా నవలకి రెండు

పేర్లు ఉండడం ఆంగ్ల సంప్రదాయం". (మోహన రామయ్య. ఎం. 1983: 139) ఇది నవలా రచనాప్రారంభ దశకి నిదర్శనం.

### 3.2.3.9. ప్రారంభ ముగింపులు

"శ్రీ తుంగభద్రా తీరమందు విద్యానగరమను గ్రామంబుగలదు. అది యిప్పుడు కుగ్రామముగాఁ గానఁబడునుగాని నన్నూఱు సంవత్సరములనాఁడు రాయలవారి కాలమందు రాజధానియై యవనులయు నుత్కల రాజులయు నగరంబుల మించి మహావిచిత్రములయిన సోయగముచేత లోకవిధితంబై యుండె. (ఇనాక్, కొలకలూరి(సం), శ్రీరంగరజుచరిత్ర. 2010: 59). ఇవి శ్రీరంగరాజుచరిత్ర ప్రారంభవాక్యాలు. నవలా రచన 'శ్రీ'కారంతో ప్రారంభం కావటం, పురవర్ణనతో ప్రారంభంకావడం, శ్రీరంగరాజుచరిత్ర నవలలో ఉంది. ఇది ప్రాచీన ప్రబంధ రచనా సంప్రదాయానికి నిదర్శనం. శ్రీరంగరాజుచరిత్ర నవల వెలువడటానికి పూర్వం తెలుగులో పద్యరూపంలో ఉన్న ప్రబంధ సాహిత్యం ఉండింది. శ్రీకారంతో రచన ప్రారంభంకావడం, వర్ణనలు కలిగి ఉండడం, సుధీర్ఘ సమాసాలతో కూడిన రచనా శైలిని కలిగిఉండటం. శుభకరంతో రచన అంతమవ్వడం. ఇవి ప్రాచీన కావ్య లక్షణాలు. ఈ లక్షణాలన్నీ దాదాపుగా శ్రీరంగరాజుచరిత్ర నవలలో కనిపిస్తాయి. శ్రీకారంతో ప్రారంభమైన నవల పురవర్ణన, వేటవర్ణన, విహారయాత్ర వర్ణన, లంబాడీల ఆచారవ్యవహారాల వర్ణన, వివాహ వర్ణన వంటి వర్ణనలతో కొనసాగి చివరికి శ్రీరంగరాజు, సోనాబాయి వివాహంతో సుఖాంతమవుతుంది. దాదాపుగా ఇలాంటి లక్షణమే కన్నడ ఇందిరాబాయి, తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కూడా కనిపిస్తుంది. ఈ రెండు నవలలు శ్రీకారంతో ప్రారంభంకాకున్నా నగరవర్ణనతో ప్రారంభమయ్యాయి. "వింధ్యాచల దక్షిణ ప్రాంతదల్లి రోహిణీనదీ తీరదల్లి కమలాపుర వెంబొందు విస్తారవాద నగరవిరువదు." (వెంకటరావు, గుల్వాడి. 1899: 1) ఇవి ఇందిరాబాయి నవల ప్రారంభ వాక్యాలు. వింధ్యాచల దక్షిణ ప్రాంతంలో రోహిణీ నదీ తీరంలో ఉన్న 'కమలాపురం' అనే గ్రామ వర్ణనతో నవల ప్రారంభమవుతుంది. ఈ నగరంలోని ప్రసిద్ధిగాంచిన భవనాలు, దేవాలయాలు, అగ్రహారాలు, న్యాయస్థానాలు, ఫలవృక్షాలతో ఉన్న తోటలు, విశాలమైన రాజమార్గాలు మొదలైన నగర విభాగాల వర్ణనతో నవల కొనసాగుతుంది. ఇది ప్రాచీన కావ్యరచనలోని పురవర్ణన సంప్రదాయానికి నిదర్శనం. కన్నడలో నవలా రచన వెలువడటానికి పూర్వం పద్యరచన

కొనసాగింది. "కన్నడ సాహిత్యంలో 1400 నుండి 1900 వరకు వెలువడిన సాహిత్యాన్ని "చిక్కదేవరాయయుగ" సాహిత్యంగా పేర్కొంటారు. (సుందరం, ఆర్వీయస్. 1977: 148). ఈ కాలంలో వెలువడిన సాహిత్యం రాజాశ్రయ సాహిత్యం 'తిరుమలార్యుడు' చిక్కదేవరాయని ఆస్థానకవి ఈయన రచించిన 'చిక్కదేవరాజు విజయ' వర్ణన ప్రధాన రచన. ఈ రచనలో రాజు బాల్యం, విద్యాభ్యాసం, సంగీత వైదుష్యానికి సంబంధించిన వర్ణనలు కనిపిస్తాయి. ఇదే కాలానికి చెందిన 'చిక్కుపాధ్యాయ' రచించిన 'దివ్యసూరిచరిత్ర'లోను వర్ణనలు కనిపిస్తాయి. చిక్కదేవరాయ యుగానికి చెందిన 'హొన్నమ్మ' అనే రచయిత్రి తాను 'హదిబదెయధర్మ (పతివ్రతాధర్మం)' అనే రచనను ప్రారంభిస్తూ "అష్టాదశ వర్ణనల గొడవకు వెళ్లకుండా తనకు తెలిసినదేదో వ్రాస్తానని పేర్కొంది." (సుందరం, ఆర్వీయస్. 1977: 153) ఈ వాక్యం హొన్నమ్మకి పూర్వం కన్నడ సాహిత్యంలో అనేక వర్ణన ప్రధాన రచనలు వచ్చాయి అనడానికి నిదర్శనం. ఈ వర్ణనల ప్రభావం ఇందిరాబాయి నవలలో కూడా కనిపిస్తుంది. కమలాపుర వర్ణనతో ప్రారంభమైన ఇందిరాబాయి నవల భీమారావు కుటుంబ వర్ణన, భీమారావు ఇంటివాతావరణ వర్ణన, వివాహవర్ణన, యక్షగానవర్ణన, మఠం, మఠాధిపతుల అధికార వర్ణనతో కొనసాగి చివరికి భాస్కరరావు, ఇందిరాబాయి వివాహవర్ణనతో సుఖాంతమవుతుంది.

"ఈ దేశాన్ని ఆంగ్లేయులు స్వాధీనం చేసుకోవడానికి పూర్వం సత్యపురి అనే గ్రామంలో తొండమండలం ముదలియార్ కులంలో నేను జన్మించాను." (జయప్రకాశ్. ఎస్(అ). 2008: 1) అన్న వాక్యంతో ప్రతాపముదలియార్ చరిత్ర నవల ప్రారంభమవుతుంది. 'సత్యపురి' గ్రామాన్ని రేఖామాత్రంగా పేర్కొన్న వేదనాయగం పిళ్ళైగారు నవల కొనసాగింపులో తురుష్కుల కాలంలో 'సత్యపురి' గ్రామంలో ఉన్న పరిస్థితులని వర్ణించారు. తరువాత కథానాయకుడైన ప్రతాపముదలియార్ బాల్యం, విద్యాభ్యాసం, వివాహం వంటి అంశాలను నవల తరువాతి భాగాలలో ఉపకథల రూపంలో సుధీర్ఘంగా వర్ణించారు. కథానాయకుని వర్ణనలోను, అతని వంశం, ప్రాంతం వర్ణనలోను కొంత ప్రాచీన కావ్యలక్షణాలు కన్పిస్తాయి. ఈ వర్ణన సంప్రదాయం తమిళ సాహిత్యానికి కొత్తదికాదు. "తమిళ ఆదిగ్రంథం తొల్కాప్పియంలో యుద్ధవిధానం, రహస్యప్రేమ, సంసారిక ప్రణయము, సాత్విక భావాలకి సంబంధించిన వివరణతో కూడిన వర్ణన కనిపిస్తుంది. మహాకవి తిరువళ్ళువర్ రాసిన తిరుక్కుఱళ్‌లో ధర్మఖండము దైవస్తుతితో ప్రారంభమవుతుంది. కామ ఖండంలో ప్రేయసీ ప్రియుల ప్రథమ

సమాగమం, వారి రహస్యప్రేమ, ప్రేయసీప్రియుల ప్రేమానురాగాలు వర్ణించబడ్డాయి. తమిళ పంచకావ్యాలలో మొదటిదైన మణిమేకలై కావ్యాన్ని శీత్తలై శాత్తనార్ రచించారు. ఈ కావ్యంలో మణిమేఖల అనే అమ్మాయి జీవితం వర్ణించబడింది. ఇందులో ప్రధాన కథతోపాటు అనేక ఉపకథలు ఉన్నాయి. (ఇదే రకమైన రచన సంప్రదాయం ప్రతాపముదలియార్ చరిత్రలో కూడా కన్పిస్తుంది). సహజసుందర దైనందిన జీవితములోని వర్ణనలతో కంబకవి కంబరామాయణాన్ని రచించారు. ఆ తరువాతి కాలంలో పురాణాలు, వ్యాఖ్యానాలు, సిద్ధులరచనలు, ప్రబంధాలు వర్ణన ప్రధానంగా వచ్చాయి." (రామానుజరావు, దేవులపల్లి. 1979: 5, 36). ఈ రచనలలోని వర్ణనల ప్రభావం కొంతవరకు ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ బాల్యం, కనకసభ వివాహంవంటి సందర్భాలలో కనిపిస్తుంది.

ఇందులేఖ నవల ప్రారంభంలో నగరవర్ణన, శ్రీకారంతో ప్రారంభమవ్వడం వంటి అంశాలు కనిపించవు. కాని నవల కొనసాగే క్రమంలో పాత్రల పరిచయంలో, సన్నివేశాల వివరణలో సుధీర్ఘ వర్ణనలు కనిపిస్తాయి. "ఏమయ్యా! మాధవా! మాటలను చాలావేగంగా విసురుతున్నావే! ఛీ! ఛీ! ఇదేం బాగాలేదు. ఆయన మనసుకు నచ్చినట్లు చేయనీ! ఇంటిపెద్ద కారణవారుగారిపట్ల మనం వినయంగా నడుచుకోవద్దా! నీమాటలు కొంచెం ఎల్లలు దాటాయి." (జయప్రకాశ్, ఎస్ (అ). 2016: 1) అన్న సాత్తరమీనన్ మాటలతో ఇందులేఖ నవల ప్రారంభమవుతుంది. నవల ఎత్తుగడలోని ఈ వాక్యాలు నవల, వస్తుసూచకాలు ఈ వాక్యాలు వినగానే 'మాధవుడు' ఇంటిపెద్ద కారణవారు(పంజుమీనన్)ని ఎదురించాడని పాఠకులకు అర్థమవుతుంది. ఇంటిపెద్ద నిర్ణయాన్ని ఇంట్లో ఉన్న ఎవ్వరూ ప్రశ్నించరాదు. ఇది నవలా రచనా కాలానికి మలయాళ తరవాడు (ఉమ్మడి) కుటుంబంలోని సంప్రదాయం. ఈ సంప్రదాయంవల్ల కారణవన్ కి కుటుంబంలోని ఆర్థికవనరులని తన ఇష్టానుసారంగా వాడుకునే హక్కు లభించింది. ఈ హక్కుతో కొంతమంది కారణవన్ లు కుటుంబ ఉమ్మడి ఆర్థిక వనరులను తమ సొంతపిల్లల అభివృద్ధికి వాడుకుని మిగతా కుటుంబ సభ్యులను చిన్నచూపు చూశారు. దీనితో తరవాడు ఉమ్మడి కుటుంబ సంప్రదాయం సమాజంలో నవ్వులపాలైంది. ఈ విధంగా తరవాడు కుటుంబంలోని సంప్రదాయలోపాన్ని ఎత్తి చూపాలనుకున్నారు చందుమీనన్‌గారు. అందుకే ఇంటిపెద్ద కారణవన్ న్ని మాధవుడు ఎదురించిన సంఘటనతో నవలని ప్రారంభించారు. సాత్తరమీనన్ మాటలు వినగానే మాధవుడు ఇంటిపెద్దని ఎందుకు ఎదురించాడు? ఇంటిపెద్ద

నిజంగా తప్పుచేశాడా? ఒకవేళ ఇంటిపెద్ద తప్పుచేస్తే ఎదురించాలా? వద్దా? ఇంటిపెద్దని ఎదిరిస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? వంటి పాఠకుల మనస్సులో తలెత్తే ప్రశ్నలకి సమాధానం ఇందులేఖ నవల. 'వస్తుగత' ఎత్తుగడ ఇందులేఖ నవలతో పాటు శ్రీరంగరాజుచరిత్ర, ప్రతాప ముదలియార్ చరిత్ర, ఇందిరాబాయి నవలలో కూడా కనిపిస్తుంది.

అన్ని నవలల్లోను కథ కథానాయకుని గ్రామ వర్ణనతో ప్రారంభమై చివరికి అదే గ్రామంలో సుఖాంతంగా ముగియడం కనిపిస్తుంది. ఈ అన్ని నవలల్లోను ముగింపు సుఖాంతంగా జరిగింది. అన్ని నవలల్లోను కథానాయకులు యాత్రలు చేయడం కనిపిస్తుంది. విద్యానగరంలో నివాసం ఉన్న శ్రీరంగరాజు కృష్ణుడి కులం విషయంలో తల్లిదండ్రులతో గొడవపడి ఇంటినుండి వెళ్లిపోతాడు. ఇంటినుండి బయటకు వెళ్లిన శ్రీరంగరాజు తనమిత్రుడు రామయ్యతో కలిసి అలంపూరు, నల్లమల్ల అడవులు, శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవాలయం దగ్గరలో ఉన్న చంద్రగుప్తి గ్రామం, ఆతరువాత కొండవీడు మొదలైన ప్రాంతాలు తిరిగి చివరికి తాను ఇష్టపడ్డ సోనాబాయితో కలిసి విద్యానగరం చేరుకుంటాడు.

ఇందిరాబాయి నవలలో కమలాపురం గ్రామంలో నివాసం ఉన్న భాస్కరరావు తండ్రి మరణం తరువాత అమృతరావు సంరక్షణలో పెరుగుతాడు. విద్యని నేర్చుకుంటాడు. పై చదువుల కొరకు సముద్ర ప్రయాణం చేసి విదేశాలకు వెళ్తాడు. అక్కడ సి.ఎస్. పరీక్షలో నెగ్గి కలెక్టరుగా మారి కమలాపురం వస్తాడు. అమృతరావు సలహామేరకు తాను ఇష్టపడ్డ బాలవితంతువైన ఇందిరాబాయిని వితంతు పునర్వివాహం చేసుకుంటాడు. ఈ విధంగా కమలాపురంలో ప్రారంభమైన కథ ఇందిరాబాయి, భాస్కరరావుల వివాహంతో కమలాపురంలోనే సుఖాంతమవుతుంది.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ పుట్టింది 'సత్యపురి' గ్రామంలో. అదే గ్రామంలో ఉన్న తన మామ సంబంధముదలియార్ కూతురు జ్ఞానాంబాళ్‌తో కలిసి చదువుకుంటాడు. అప్పుడే ప్రతాపముదలియార్ కి జ్ఞానాంబాళ్ అంటే ఇష్టం ఏర్పడుతుంది. యుక్తవయస్సు వచ్చిన తరువాత అనేక ఆటంకాలు తొలిగి వీరికి వివాహం జరుగుతుంది. వివాహం అనంతరం జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌కు పుట్టబోయేబిడ్డ

ఎవరివద్ద ఉండాలి అన్న విషయంలో జ్ఞానాంబాళ్ తండ్రి సంబందముదలియార్, ప్రతాపముదలియార్ తండ్రి కనకాచలముదలియార్ మధ్య వివాదం తలెత్తుతుంది. ఈ వివాదం కారణంగా ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్దూరం అవుతారు. జ్ఞానాంబాళ్కుదూరమైన ప్రతాపముదలియార్ 'నల్లూరు' అనే గ్రామం చేరుకుంటాడు. ప్రతాపముదలియార్ మాదిరిగానే భర్తకి దూరంగా ఉండడం నచ్చని జ్ఞానాంబాళ్ వేగులద్వారా భర్త విహారయాత్ర గురించి తెలుసుకుని నల్లూరులో భర్తని కలుస్తుంది. అక్కడినుండి జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్ ఇద్దరు తమబాల్య మిత్రుడైన 'కనకసభ' ఊరైన ఆదియూరుకు వెళ్తారు. అక్కడ కొన్ని రోజులు ఉంటారు. వేటనిమిత్తం ఏనుగుపై అడవికి వెళ్లిన ప్రతాపముదలియార్ దారితప్పి 'విక్రమపురి' చేరుకుంటాడు. భర్త ఆచూకీకోసం వెతుకుతున్న జ్ఞానాంబాళ్ ఏనుగు సహకారంతో 'విక్రమపురి' చేరుకుంటుంది. అక్కడ కొన్నిరోజులు ఉన్న జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్ దంపతులు చివరికి 'సత్యపురికి' చేరుకుంటారు. ఇలా 'సత్యపురి' గ్రామంలో ప్రారంభమైన కథ సత్యపురి గ్రామంలోనే ముగుస్తుంది.

దక్షిణ మలబారులోని ఒక నాయరు కుటుంబంలో ఇందులేఖ నవల కథ ప్రారంభమవుతుంది. నాయరు కుటుంబంలో పుట్టిన 'మాధవుడు' తమ ఇంటిపెద్ద కారణవన్ పంజుమీనన్ని చిన్నని చదువు విషయంలో ఎదురిస్తాడు. మాధవుడు నంబూద్రిపాదు ఇందులేఖని వివాహం చేసుకున్నాడని అనుకొని. విహారయాత్రలకి వెళ్తాడు. ఉత్తర భారతదేశము, బర్మా మొదలైన ప్రాంతాలను సందర్శిస్తాడు. గోవిందఫణక్కరు, గోవిందకుట్టిమీనన్ బొంబాయిలో మాధవుని ఆచూకిని కనుగొంటారు. మలబారు ప్రాంతానికి వెళ్లి ఇందులేఖని మాధవుడు వివాహం చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

### 3.2.3.10. శైలి

తన మనసులోని భావాలను వ్యక్తీకరించడానికి నవలా రచయితకి ఉన్న ఒకే ఒక సాధనం 'భాష'. "విషయాన్నిబట్టి, సందర్భాన్నిబట్టి మాట్లాడుతున్న వ్యక్తినిబట్టి, వింటున్న వ్యక్తినిబట్టి భాష మారుతూఉంటుంది. కాబట్టి ఒక నిర్దిష్టశ్రోతకు చెబుతూ ఉన్నప్పుడు భాష ఉపయోగించబడ్డ పద్ధతిని శైలి అని స్థూలంగా నిర్వచించవచ్చు." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 79). ఈ నిర్వచనాన్ని బట్టి శైలి భాషా ప్రయోగానికి చెందిన అంశమని

అర్థమవుతుంది. "నవలలో సాధారణంగా భాష సరళ వ్యావహారికమై అలతిపదాల కూర్పుతో వాస్తవజీవిత ప్రయుక్త భాషకు చేరువగా ఉంటుంది." (మృణాళిని, సి. 1988: 70). దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలల్లో ఆధునిక వ్యవహార భాషకి దగ్గరగా ఉన్న భాష వాడబడింది. ఈ విషయం ఆయా నవలలకి రచయితలు తాము రాసుకున్న ముందుమాటలలో చెప్పారు. అయితే ఈ నవలలు వెలువడే కాలానికి వ్యవహార వచనంలో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో రచనలు వెలువడలేదు. ఆధునిక వ్యవహార వచనానికి దగ్గరగా ఉన్న గ్రాంథిక భాష వచన శైలిలో ఈ రచనలు వెలువడ్డాయి. ఇలా పూర్తిగ్రాంథిక భాషలోకాక సుధీర్ఘ వాక్యాలతో, వర్ణనలతో, పదబంధాలతో, జాతీయాలు, సామెతలతో ఈ నవలలలోని భాష ఉండడానికి ఆనాటి సామాజిక, సాహిత్య పరిస్థితులే కారణం. వాటిని క్రింద వివరించడం జరిగింది.

### 3.2.3.10.1. భాష

భారతీయ సాహిత్యంలో పంతొమ్మిదవ శతాబ్దానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ కాలంలో భారతదేశంలో కొందరికి మాత్రమే పరిమితమైన సాహిత్యం తన రూపాన్ని మార్చుకుని ప్రజలందరికీ చేరువైంది. ఇలా చేరువయ్యే క్రమంలో రూపంతోపాటు వస్తువులోనూ మార్పు వచ్చింది. సమకాలీనం, సాంఘికం అయిన స్త్రీవిద్య ఆవశ్యకత వంటి అంశాలతో రచనలు వచ్చాయి. వస్తువు సమకాలీనమైనా అది చేరువయ్యే మాధ్యమం అందరికీ చెందినది కాకపోతే రచన వస్తుగతంగా దాగిన సందేశం అందరికి అందదు. ఫలితంగా రచన ప్రయోజనం నెరవేరదు. ఇది గమనించిన రచయితలు భారతీయ సమాజంలోని లోపాలని సరిదిద్దే క్రమంలో సమాజ అభివృద్ధికి అడ్డుకట్టవేస్తున్న సమస్యలని ప్రజలకి చేరవేసే మాధ్యమంలో మార్పు రావాలని భాషా విప్లవానికి తెరలేపారు. భాష ఛందోసంకెళ్లను తెంచుకొని అందరికి చేరువయ్యే వచన రూపాన్ని ధరిస్తే తప్ప రచనల సందేశం పాఠకులకు అందదని తలచిన సంస్కర్తలు భాషా విప్లవానికి నడుంబిగించారు. ఈ భాషా విప్లవానికి పత్రికలు సహాయసహకారాలు అందించగా ఆంగ్లవిద్య వచన రచనలకు రూపం కల్పించింది. దీనితో పంతొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్థంలో భాష ఛందస్సుతో కూడిన పద్యరూపాన్ని వీడి వచనరూపాన్ని ధరించింది. ఈ మార్పు దక్షిణ భారతీయ భాషలలో స్పష్టంగా కన్పిస్తుంది.

### 3.2.3.10.1.1. తమిళ సాహిత్యం – వ్యవహారిక భాషా ఉద్యమం

"తమిళంలో వచన గ్రంథాలు లేవనేది అందరూ అంగీకరించిన విషయమే. ఈ లోపాన్ని గురించి అందరు చింతిస్తున్నారు. ఈ లోటును తొలగించే ఉద్దేశంతోనే ఈ కల్పనా గ్రంథాన్ని రాయడానికి ముందుకు వచ్చాను. (జయప్రకాశ్.ఎస్(అ). 2008: V). వేదనాయగం పిళ్లైగారు ప్రతాపముదలియార్ చరిత్ర ముందుమాటలో రాసిన ఈ వాక్యాలు ప్రతాపముదలియార్ చరిత్ర నవలకి పూర్వం తమిళ భాషలో పూర్తివచనంలో ఉన్న రచనలు విరివిగా వెలువడలేదని తెలుపుతున్నాయి. ప్రతాపముదలియార్ చరిత్రకి పూర్వం "తిరుచ్చిట్రం బలదేశికర్ కంబరామాయణాన్ని, రామాయణ ఉత్తర కాండని వచనంలో రాసాడు. వీరసామి చిట్టియార్ 'వినోదదాస మంజరి' అనే వచన గ్రంథాన్ని రచించాడు. సోమసుందర నాయకర్, శైవ చూడామణి, సిద్ధాంత జ్ఞానబోధము మొదలైన గ్రంథాలను వచనంలో రచించారు. ఈ రచనలలోని వచనం అధిక సంస్కృత శబ్దాలతో కఠినంగా ఉంది. ఈ రచనల తర్వాత వచన రచనలను ప్రజలలో వ్యాపించే ఉద్దేశంతో "దినవార్తమాని"(1856) "జనవినోదిని" (1870) "వివేక చింతామణి" వంటి పత్రికలు ప్రారంభమయ్యాయి." (వరదరాజన్, ము. 1982: 269) ఇలా వచనా రచనలకి ప్రాచుర్యం ఏర్పడుతున్న తరుణంలో వేదనాయగం పిళ్ళైగారు పూర్తిగా తమిళ వచనంలో ఉన్న సాంఘిక నవలను రచించారు. ఇది వచన రచనా ఉద్యమానికి బీజం వేసింది. తమిళ జాతీయకవి సుబ్రహ్మణ్య భారతి వ్యవహారిక భాషలో రచనలు వెలువడవలసిన ఆవశ్యకతను గుర్తించారు. 'తమిళ సాహిత్య స్థితిగతులు రాజకీయ పరిస్థితులు మొదలైన వాటిని గుర్తించిన భారతి సామాన్య మానవునికి సైతం సుబోధకమగు భాషలో రచనలు చేయసాగెను. అనగా వ్యవహారిక భాషలో కావ్యరచనము చేయదొడగెనన్నమాట. ఆయన ప్రభావం నేటి పత్రికారచనము నందును, పలువురు రచయితల మీదను స్పష్టంగా గోచరించుచున్నది. కనుక ఇది భారతీయుగమనియు, భారతీ వ్యవహారిక భాషోద్ధారకుడనియు పేర్కొనదగును' (రామానుజరావు, దేవులపల్లి. 1979: 40). ప్రతాపముదలియార్ చరిత్ర తమిళ ప్రాంతంలో వచన రచనలు వెలువడుతున్న ప్రారంభకాలంలో వచ్చింది. వేదనాయగంపిళ్లైగారు ఈ నవలని ప్రజల భాషలో రాయాలని సంకల్పించారు. ఈ ప్రభావాల వల్ల ప్రతాపముదలియార్ చరిత్ర తమిళ ప్రాంతంలోని సాధారణ భాషలో తమిళ ప్రాంత ప్రజలు ఉపయోగించే జాతీయాలు, సామెతల పోహళింపుతో వెలువడింది. దీని తరువాత తమిళ ప్రాంతంలో వచనా రచనల

విప్లవం మొదలైంది. ఈ విప్లవానికి వేదనాయగం పిళ్ళైగారు నాందివాక్యం పాడగా సుబ్రహ్మణ్య భారతిగారు విస్తరించారు.

### 3.2.3.10.1.2. కన్నడ సాహిత్యం - వ్యవహారిక భాషా ఉద్యమం

కన్నడ ప్రాంతంలో ఆధునిక భాషా భావన పంతొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థంలో వచ్చింది. ఇందిరాబాయి నవల వెలువడడానికి పూర్వం కర్ణాటకలోని మైసూరు సంస్థానాన్ని ముమ్మడి కృష్ణరాజ ఒడయార్ పరిపాలించారు. ఈయన పరిపాలనా కాలంలో ఆంగ్లవిద్య కర్ణాటకలో వ్యాపించింది. దీనితో కొత్త ఆలోచనలు మొదలయ్యాయి, కొత్త రచనలు వచ్చాయి. “బొంబాయి, కలకత్తా, మద్రాసులో విశ్వవిద్యాలయాలు ప్రారంభమై కొత్త చదువులకు దారితీసాయి. ముద్రణాలయాలు, వాటితోపాటు పత్రికలు, పత్రికలతోపాటు పుస్తకముద్రణ ఆరంభమై జనజీవనంలో ఊహించలేని మార్పులు సంభవించాయి. గద్య రచనలకు ప్రాధాన్యం పెరిగింది. కెంపు నారాయణ ముద్రామంజూష గద్య సాహిత్యానికి దారి చూపింది.” (సుందరం, ఆర్వీయస్. 1977: 162) కెంపు నారాయణచే ప్రారంభమైన ‘హొసకన్నడ’ సాహిత్యం ముద్దణచే వృద్ధి చెందింది. హొసకన్నడలో కన్నడ రచనలు వస్తున్న తరుణంలోనే గుల్వాడి వెంకటరావుగారు ఆధునిక వచన కన్నడలో ఆనాటి సామాజిక సమస్యలతో ఇందిరాబాయి నవల రచించారు.

### 3.2.3.10.1.3. మలయాళ సాహిత్యం - వ్యవహారిక భాషా ఉద్యమం

“ఈ పుస్తకాన్ని నేను ఇంట్లో సహజంగా మాట్లాడే మలయాళ భాషలో రచించాను. నాకు సంస్కృతంలో కొంత అనుభవ జ్ఞానం ఉన్నప్పటికీ పెక్కు సంస్కృత పదాలను మలయాళ భాషలో మన మలయాళీలు ప్రతిరోజు మాట్లాడుతున్నప్పుడు ఉపయోగించే విధంగానే ఈ పుస్తకంలోను సహజంగా ఉపయోగించాను.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: ix) ఇవి ఇందులేఖలో వాడిన భాష స్వరూపాన్ని గురించి తెలుపుతూ ఒ.చందుమీనన్‌గారు రాసిన వాక్యాలు. ఇందులేఖ నవలలో సాధారణంగా మలయాళ ప్రాంత ప్రజలు ఉపయోగించే వచన మలయాళ భాషను వాడినట్లు పై వాక్యాలు తెలుపుతున్నాయి. ఇందులేఖ నవల వెలువడడానికి పూర్వం మలయాళ సాహిత్యంలో తమిళం, సంస్కృతంతో మిళితమైన భాష వాడబడింది. ‘ప్రారంభకాలంలో వచ్చిన జానపద గేయాలలో సులభ సుందర మలయాళ భాష కన్పిస్తుంది.

ఇలాంటి జానపద గేయాలను సి.పి. గోవిందపిళ్ళైగారు సేకరించి పళయపాట్టుగళ్ (పాత పాటలు) పేరుతో ప్రచురించారు. కాలక్రమంలో జానపద సాహిత్యం లిఖిత సాహిత్యంగా మారుతున్న తరుణంలో ఆ సాహిత్యంలోని భాష స్వరూపం మారింది. క్రీ.శ. 825 వరకు మలయాళ ప్రాంతాన్ని పరిపాలించిన పెరుమళ్ రాజవంశీయులు తమిళ ప్రభువులు. వీరి ప్రభావంతో తమిళ పదాలతో కూడిన మలయాళంలో సాహిత్యం వచ్చింది. 12వ శతాబ్దంలో వచ్చిన రామచరితము దీనికి ఉదాహరణ. ఆ తరువాతి కాలంలో సంస్కృత, మలయాళ పదాలతో కలిసిన మణిప్రవాళ శైలిలో రచనలు వచ్చాయి. క్రీ.శ. 1893లో వెలిసిన 'ఉణ్ణునీలి సందేశము' అనే సందేశ కావ్యం మణిప్రవాళ శైలికి చక్కని ఉదాహరణ. పంతొమ్మిదవ శతాబ్దపు పూర్వార్థంలో మలయాళ ప్రాంతంలో ఆంగ్లేయుల పాలన స్థిరపడింది. పంతొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్థంలో ప్రొటెస్టంట్ మిషనరీలు మత ప్రచారంలో భాగంగా మలయాళ సాహిత్యరంగంలో ప్రవేశించాయి. ఈ మిషనరీలు సామాన్య ప్రజలకు కూడ తమ బోధనలు అర్థం కావాలన్న ఉద్దేశంతో వచనంలో రచనలని ముద్రించారు. "తంత్ర సముచ్చయము", "వ్యవహారమాల" వంటి రచనలు ఇందుకు ఉదాహరణలు. ఈ విధంగా వచనా రచనలు మలయాళ ప్రాంతంలో ప్రారంభమయ్యాయి. పంతొమ్మిదవ శతాబ్దం మధ్యభాగం నాటికి కేరళ ప్రాంతంలో నూతన విద్యావిధానం ప్రచారంలోకి వచ్చింది. పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ పాఠశాలల్లో చదువుకోవడానికి పుస్తకాలు అవసరమయ్యాయి. ఈ అవసరాన్ని తీర్చడానికి కేరళవర్మ మలయాళ వచనంలో 'మయూర సందేశము'వంటి రచనలు రచించారు. కేరళవర్మ వచనా రచనలకి బాటవేయగా కొడుంగల్లూర్ రాజవంశీయులు వెన్‌మణి నంబూద్రి వంటి రచయితలు ఆ బాటని తమ రచనలతో సుసంపన్నం చేశారు". (రామానుజరావు, దేవులపల్లి. 1979: 148–151) ఇదే బాటలో ఒ.చందుమీనన్‌గారు పయనించి "ఇందులేఖ" నవలద్వారా మలయాళ వచన రచనల విస్తారానికి తమవంతు సహకారాన్ని అందించారు.

### 3.2.3.10.1.4. తెలుగు సాహిత్యం - వ్యవహారిక భాషా ఉద్యమం

తెలుగులో శ్రీరంగరాజుచరిత్ర నవల వచనంలో వెలువడింది. ఈ వచనం ఆధునిక వ్యవహార వచనానికి భిన్నమైంది. ఇందులో గ్రాంథికభాష ఛాయలు కనిపిస్తున్నాయి. సుదీర్ఘ పదబంధాలు, విరుపులు లేని సుదీర్ఘ వాక్యనిర్మాణం, అలంకారంతో కూడిన శైలి, వర్ణనలు, పదాలమధ్యలో అరసున్నాలు ఉండడం, పదాల అంతంలో –ము, –యును (అదియును) వంటి

పదబంధాలు ఉండడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. శ్రీరంగరాజుచరిత్ర నవల వెలువడే కాలానికి పూర్తి ఆధునిక తెలుగు వచనంలో ఉన్న రచనలు తెలుగులో వెలువడలేదు. పొన్నికంటి తెలగన రచించిన యయాతి చరిత్ర వంటి అచ్చతెలుగు కావ్యాలు ఉన్నా వాటిని ఆధునిక వచన రచనలు అనలేం. తంజావూరు నాయకరాజుల కాలంలో మహాభారత, భాగవతాది పురాణకావ్యాలు, క్షేత్ర మహాత్మ్య కావ్యాలు వచనంలో వెలువడ్డాయి. ఈ కావ్యాలలోని వచనం ఆధునిక వచనం కాదు. పంతొమ్మిదవ శతాబ్దంలో ఆంగ్లేయులు తెలుగు ప్రాంతంలోకి వచ్చిన తర్వాత వారికి తెలుగు నేర్చుకోవాల్సిన అవసరం వచ్చింది. ఈ అవసరం తీర్చడానికి ఆంగ్లేయులకు సులభంగా అర్థమయ్యే వచన తెలుగులో విక్రమార్కుని కథలు (1819), పంచతంత్ర కథలను పోర్ట్ సెయింట్ జార్జి కళాశాలలో ఆంధ్ర ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న రాయపాటి గురుమూర్తిశాస్త్రి రాసాడు. ఈ కథలకి విశేష ప్రచారం లభించడంతో పాటూరి రామస్వామిశాస్త్రి శుకసప్తతి కథలను (1840), ధూర్జటి లక్ష్మీపతి హంసవింశతి కథలను(1840) సులభ వ్యావహారిక వచనంలో రచించారు. ఈ కథలకి చాలా ప్రచారం వచ్చింది." (సుజాతారెడ్డి, ముదిగంటి. 2017: 14).

ఇదేకాలంలో "క్రీ.శ. 1820లో బ్రౌను కడప మండలానికి కలెక్టరుగా వచ్చాడు. పంతొమ్మిదవ శతాబ్దంలో తెలుగుకు పునరుజ్జీవనాన్ని ఇచ్చినవాడు ఇతడు. ఎన్నో తెలుగు కావ్యాల తాలూకు ప్రతులను సేకరించాడు. తెలుగుకు వ్యాకరణాన్ని రచించాడు. బ్రౌనుదగ్గర అతనికి సాహిత్య వ్యాసంగంలో తోడ్పడుతూ "వాసుదేవపరబ్రహ్మశాస్త్రి", "జూలూరిఅప్పయ్య" మొదలైనవారు ఉండేవారు. వారి సహాయంతో అనేక తెలుగు కావ్యాల శుద్ధప్రతులను తయారుచేయించి శాస్త్రీయ పాఠ నిర్ణయాలు చేసి వ్యాఖ్యానాలు రాయించి ముద్రించి ఆంధ్ర భాషకి ఎంతో సేవ చేశాడు. బ్రౌను మాదిరిగానే కల్నల్ మెకంజి గ్రామ కైఫీయత్తులనుసేకరించి వాటిని తన వద్ద ఉన్న కావలి వెంకటబొర్రయ్య అనే పండితునిచేత సరళవ్యవహార వచనంలో రాయించారు." (సుజాతారెడ్డి, ముదిగంటి. 2017: 158) ఇలా వచన రచనలు వెలువడుతున్న తరుణంలో క్రీ.శ. 1857లో మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగుకు స్థానం లభించింది. అక్కడ చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లో సాధారణ వచన తెలుగు ఉపయోగించాలా వద్దా అనే విషయంలో వివాదం తలెత్తింది. "వెయ్యేళ్లక్రితం స్థిరపడిన తెలుగు భాష మారదు. అందులో ఏకరూపకత, ప్రామాణికత ఉన్నాయి. అటువంటి భాషని కేవల వ్యవహార భాషలైన కోయ, సవర

వంటి ఆటవిక జాతుల స్థితికి దించరాదని వ్యవహార భాష నింద్రగామ్యం అని గ్రాంథిక భాషావాది చిన్నయసూరి వాదించారు. గిడుగు రామమూర్తిపంతులు వంటివారు వ్యవహారిక భాషావాదాన్ని సమర్థించారు. అప్పటికే చిన్నయసూరి విద్యాశాఖకి ప్రధానాధికారి కావడంవల్ల గ్రాంథిక శైలికి గుర్తింపు వచ్చింది. విశ్వవిద్యాలయ పాఠ్యపుస్తకాలు గ్రాంథిక తెలుగులో ముద్రితమయ్యాయి. వీటికి సమాంతరంగా సులభశైలిలో సాధారణ వచనంలో పరమానంద గురువుల కథలు (1861), అరేబియన్ నైట్స్ కథలు (1862) వచ్చాయి." (సుజాతారెడ్డి, ముదుగంటి. 2017: 15).

ఇలాంటి సంధి కాలంలోనే శ్రీరంగరాజుచరిత్ర నవల (1872) వచ్చింది. అప్పటికీ పూర్తివచనంతో కూడిన రచనలు తక్కువగా వెలువడ్డాయి. రచనలలో గ్రాంథిక భాషని ఉపయోగించాలా లేదా వ్యవహారిక భాషని ఉపయోగించాలా అన్న విషయంలో వివాదం జరుగుతుంది. అప్పటి పరిస్థితులలో గ్రాంథిక వాదాన్ని బలపర్చేవారు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండడం, మద్రాసు విశ్వవిద్యాలయ పాఠ్యపుస్తకాలలో గ్రాంథిక తెలుగుని వాడడం, వ్యవహార తెలుగులో నీతికథలు తప్ప ప్రామాణిక రచనలు తక్కువగా ఉండడం వంటి అంశాలు శ్రీరంగరాజుచరిత్రలోని తెలుగు భాష గ్రాంథిక తెలుగు భాషకి దగ్గరగా ఉండడానికి కారణాలుగా కన్పిస్తాయి.

### 3.2.3.10.2. పద ప్రయోగం

భాషలో ధ్వనులుంటాయి, ఈ ధ్వనుల కలయికతో పదాలు, పదాల కలయికతో వాక్యాలు ఏర్పడతాయి. భాషలో సంపూర్ణ అర్థాన్ని బోధించే కనిష్ఠ అంశాన్ని పదం అంటారు. ఈ పదాల ప్రయోగంలో రచయితకి స్వేచ్ఛ ఉంటుంది. పాత్రల ప్రవర్తన, రచనా లక్ష్యం, రచయిత అందించే సందేశం ఆధారంగా పద ప్రయోగంలో మార్పు కనిపిస్తుంది. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో, మలయాళ ఇందులేఖ నవలలో శ్లేషార్థంతో కూడిన పదాల ప్రయోగం కనిపిస్తుంది. ఈ రెండు నవలల్లోనూ రచయితలు హాస్యపూరిత శైలిలో రచన అంతర్గత సందేశాన్ని పాఠకులకు అందించారు. నవలలో హాస్యరసాన్ని శ్లేషార్థ పదాలు ప్రయోగించడం ద్వారా ఒ.చందుమీనన్‌గారు సాధించారు. నవల ఆంతర్గత సందేశాన్ని శ్లేషార్థ పదాల ప్రయోగంద్వారా వేదనాయగంపిళ్ళైగారు పాఠకులకు అందించారు.

### 3.2.3.10.2.1. శ్లేషార్థ పదప్రయోగం

ఒక పదానికి ఒకటికన్నా ఎక్కువ అర్థాలు ఉండడాన్ని శ్లేషార్థం అంటారు. ఇలాంటి పదాల ప్రయోగం ఇందులేఖ, ప్రతాపముదలియార్ చరిత్ర నవలలలో కనిపిస్తుంది. ఇందులేఖ నవలలో తనని చూడటానికి తన వద్దకి వచ్చిన నంబూద్రిపాదుని ఇందులేఖ శ్లేషార్థ పదాలతో అపహాస్యానికి గురిచేస్తుంది. ఇందులేఖతో సంభాషిస్తున్న నంబూద్రిపాదు ఇందులేఖకి 'కథాకళి నాట్యం'లో ప్రవేశం ఉందా? అని ఇందులేఖని అడుగుతాడు. అప్పుడు ఇందులేఖ తనకు నాట్యం గురించి తెలియదు అంటుంది. వెంటనే నంబూద్రిపాదు నాకు నాట్యం అంటే పిచ్చి మహాపిచ్చి అంటాడు. నంబూద్రిపాదు నాట్య అభిరుచిని ఉద్దేశించి ప్రయోగించిన 'పిచ్చి' అనే పదాన్ని ఇందులేఖ నంబూద్రి పాదు గుణానికి ఆపాదించి అతన్ని పరిహాసం చేస్తుంది. పిచ్చి అనే పదానికి మితిమీరిన అభిరుచి, ఇష్టం, తిక్క అనే అర్థాలు వ్యవహారంలో ఉండడంవల్ల ఈ సంభాషణ చదవగానే నంబూద్రిపాదును ఇందులేఖ అపహాస్యానికి గురిచేస్తుందని పాఠకులకు అర్థమై హాస్యం జనిస్తుంది.

"**నంబూద్రిపాదు:** ఇందులేఖకు నాట్యంలో ప్రవేశం ఉందా?

**ఇందులేఖ:** ఏమి నాట్యం?

**నంబూద్రిపాదు:** నాట్యంలో, కథాకళి నాట్యంలో, నాకు చాలా పిచ్చి, భయంకరమైన పిచ్చి.

**ఇందులేఖ:** (నవ్వుతూ) సరే సందేహమే లేదు.

**నంబూద్రిపాదు:**ఏమిటి! ఇందులేఖ వివరాలన్నీ ముందుగానే విని ఉన్నావా.

**ఇందులేఖ:** లేదు ఇప్పుడే కదా తెలుస్తున్నది.

**నంబూద్రిపాదు:**నేను చెప్పిన తర్వాతనే కదా తెలిసింది. అవునా!

**ఇందులేఖ:** అవును మీరు మాట్లాడుతున్న మాటలను బట్టే నిర్ధారించుకున్నాను." (జయప్రకాశ్, ఎస్(అ). ఇందులేఖ. 2016: 154)

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ కి అక్షరాలు నేర్పే క్రమంలో అతని గురువు శాంతలింగం పిళ్ళై ప్రతాపముదలియార్ తప్పుచేసిన ప్రతీసారీ అతను డబ్బు ఉన్నవాడు కనుక అతన్ని కొట్టక అతను చేసిన తప్పులకి తన కొడుకు కనకసభని కొడతాడు.

ప్రతాపముదలియార్ పూర్తి అక్షరాలు నేర్చుకోవడానికి కనకసభ అనేక దెబ్బలు తింటాడు. తల్లి హిత బోధనవల్ల తన తప్పుని తెలుసుకున్న ప్రతాపముదలియార్ తనకు చదువు రావడానికి కనకసభ అనేక దెబ్బలు తిన్నాడు, మానసికంగా బాధపడ్డాడు. అతని ప్రాణం ఎంత బాధపడి ఉంటుందో కదా అనుకుని "అందుకే కాబోలు హల్లుల్ని మెయ్ ఎళుత్తు" అని, గుణింతాలని 'ఉయిర్'మెయ్ ఎళుత్తు అని పిలుస్తారు. మెయ్–శరీరం, ఉయిర్ మెయ్–ప్రాణశరీరాలని అర్థం. కనకసభ పడిన కష్టాన్ని చెప్పడానికి రచయిత వాడిన రూపాలివి." (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర 2008: 6).

"శరీరం అన్న పదానికి 'సాధారణ మనిషి శరీరం', ప్రాణి, హల్లు అనే అర్థాలు ఉన్నాయి. ప్రాణం అనే పదానికి 'మనిషి ప్రాణం' హల్లులో ఉండే 'అచ్చు'. అనే అర్థాలు వాడుకలో ఉన్నాయి. ప్రతాపముదలిర్ అక్షరం నేర్చుకునే క్రమంలో కనకసభ శరీరం, ప్రాణం రెండూ బాధపడ్డాయి. అందుకే అక్షరాలలో ఉండే అచ్చులకి ప్రాణాలు అని హల్లులకి ప్రాణి అనే పేరు వచ్చిందని వర్ణమాలలోని అచ్చులకి, హల్లులకి ఉన్న పేర్లను నవలా వస్తుగతంగా ఉపయోగించడం ప్రతాపముదలియార్ చరిత్రలో కనిపిస్తుంది. నవలా వస్తువుని పాఠకులకి అందించే క్రమంలో ఈ శ్లేషార్థ పదాలు ప్రయోగించబడ్డాయి.

### 3.2.3.10.2.2. ధ్వన్యనుకరణ పదాలు

భావ వ్యక్తీకరణ జరిగే సందర్భంలో వస్తువుల శబ్దాలని, ఆశ్చర్యాన్ని, నవ్వుని, రోదని, పక్షులు చేసే ధ్వనులను వివరించేటప్పుడు ధ్వన్యనుకరణ పదాలని వాడటం పరిపాటి. ఇలాంటి ధ్వన్యనుకరణ పదాలు భావవ్యక్తీకరణ సందర్భంలో దక్షిణ భారత తొలి సాంఘిక నవలలో వాడడం జరిగింది.

1. ఛీ ఛీ: చిరాకు కలిగినపుడు కేశవ నంబూద్రి ఉపయోగించిన పదాలు.

"ఛీ ఛీ నేనేమి ఏర్పాట్లు చేయలేదు. నేనేమి ఏర్పాట్లు చేసేది. ఇందులేఖ రాత్రుల్లో అలవాటుగా పియానో పెట్టె వాయించినట్లు ఈరోజు కూడా వాయిస్తుంది".(జయప్రకాశ్, ఎస్(అ). ఇందులేఖ 2016: 179)

2. హె...హె... హో...హో... హూ...హూ.. : పల్లకిని మోసేటప్పుడు వ్యక్తుల గొంతునుండి వెలువడే శబ్దాలు.

"పదహారు మంది ఒకే గొంతుతో శబ్దం చేయగా ముగ్గురు నలుగురు హె...హె...హో...హో... హూ... హూ... అంటూ గొంతు కలుపుతూ ముందుగా నడిచివెళ్తారు. ఈ విధంగా ఆర్భాటం చేస్తూ పల్లకిలు ఇంటి ముంగిలి ముందుకు వచ్చి చేరాయి". (జయప్రకాశ్. ఎస్(అ). ఇందులేఖ, 2016: 119)

3. **దడ దడా:** మెట్లు ఎక్కేటప్పుడు చెప్పులనుండి వెలువడే శబ్దం.

"ఇలా మాట్లాడుతూ బంగారుకుప్ప ఉన్న చెప్పులతో మేడ మెట్లమీద దడదడా శబ్దం చేసుకుంటూ నడిచి పైకివెళ్లి వరండా దగ్గరికి రాగా అరుగును అనుకొని నిలబడ్డ యౌవనం పొంగులు వారుతున్న ఇందులేఖని చూశారు." (జయప్రకాశ్. ఎస్(అ). ఇందులేఖ. 2016: 148)

4.**ఈ... ఈ:** సంగీతంలోని రాగధ్వనులు.

"సంగీత విద్వాంసులు ఈ... ఈ అని రాగం తీస్తుంటే ఆయన జగడానికి వస్తాడు".(జయప్రకాశ్, ఎస్(అ). (అ). ఇందులేఖ. 2008: 14)

5. **హాహాకారం:** వృషభానికి బెదరి జ్ఞానాంబాళ్ చేసిన ధ్వని (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర. 2008: 34)

6. **ధగధగమని మెరవడం:** తొమ్మిదో పీఠంలో ధగధగమని మెరుస్తూ ఒక విగ్రహం ఉంది (జయప్రకాశ్, ఎస్ (అ). ప్రతాపముదలియార్ చరిత్ర.2008: 49)

7. **అహ్హా! అహ్హా! అహ్హా!:** దగ్గుతున్న సందర్భంలో వచ్చేధ్వని.

భీమారావు తన కూతురి వివాహ సందర్భంలో కట్నం గురించి మాట్లాడుతూ పదేపదే దగ్గుతాడు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 84)

8. **గజగజ వణుకు:** భయాన్ని సూచించే ధ్వని.

"దొంగలు రాగానే వాళ్లకు ఇవ్వడానికై డబ్బులున్న పెట్టెను పక్కనపెట్టుకొని మరణాన్ని ఎదురుచూస్తున్న వారిలాగా భయంతో గజగజ వణుకుతూ ఉన్నాము". (వెంకటరావు, గుల్వాడి. 1972: 22)

9. **ఘో:** అందరూ కలిసి ఒకే సారి ఏడ్చిన సందర్భాన్ని తెలుపుతూ ఉపయోగించిన ధ్వన్యనుకరణ పదం. "సుందరరావు ఇంట్లో ఘో అనే ధ్వనులు వినిపించసాగాయి. "సుందరరాయన మనెదన్ని ఘో ఎందు గోళాటి బిత్తు" (వెంకటరావు, గుల్వాడి. 1972: 23)

10. **ధడ్డంతు:** ఒకేసారి కింద పడ్డప్పుడు వచ్చే శబ్దం.

“అయ్యో! దేవుడా ఏంచేయాలి అని అరుస్తూ అక్కడ చాపమీద (ధడ్డుమని). దభేల్మని పడిపోయి మూర్ఛిల్లాడు”( వెంకటరావు, గుల్వాడి. 1972: 23).

### 3.2.3.10.2.3. ఆంగ్ల భాషా పద ప్రయోగం

దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలల్లో ఆంగ్ల భాషాపదాలను విరివిగా ఉపయోగించడం జరిగింది. ఇది పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారత దేశంలోజరిగిన ఆంగ్ల భాషా వ్యాప్తికినిదర్శనం.

1. గవర్నరు (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 21)
2. మిల్టన్, సోక్రటీసు, (జయప్రకాశ్, ఎస్(అ). 2008:82)
3. అనపియస్, అంబినోయస్, క్వింటన్, ఆంటిపాటర్. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 109)
4. ఫెడరిక్, జోసెఫ్ (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 109)
5. స్టీమర్ (వెంకటరావు, గుల్వాడి. 1962: 82)
6. Reform (ధర్మపరివర్తన) (వెంకటరావు, గుల్వాడి. 1962: 102)
7. Lecture (భాషణ) (వెంకటరావు, గుల్వాడి. 1962: 102)
8. Agitation (వాగ్వివాదం) (వెంకటరావు, గుల్వాడి. 1962: 102)
9. ప్రైజస్(వెంకటరావు, గుల్వాడి. 1962: 102)
10. స్కాలర్షిప్ (వెంకటరావు, గుల్వాడి. 1962: 102)
11. ఎవాల్యుషన్ (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 296, 312)
12. సైన్స్ (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 307)
13. అగ్నోస్టిసిసమ్ (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 307)
14. మెకానిక్ (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 319).

### 3.2.3.10.3. వాక్య ప్రయోగం

క్త్వార్థక క్రియలతో కూడిన సుధీర్ఘ వాక్యాల ప్రయోగం దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలు ప్రాచీన ఛందోరూపాన్ని వీడి ఆధునిక వచనా రూపాన్ని పొందుతున్న తరుణంలో ఈ నవలలు వచ్చాయి. భాష ఆధునీకరించబడుతున్న తొలినాళ్లలోని వాక్యప్రయోగానికి ఈ నవలలు నిదర్శనం.

"యక్షగాన ప్రసంగవే ముంతాద నిత్య నియమగళూ రాత్రియందు భోజనవూ తీరిద బళిక శయ్యా గృహదల్లి రేశ్మియ ఆస్మానగరి ఝుల్లరిగళిందలూ జామ దానిగ వాసనికెగళూ హాసిగె తలెదింబు బాలెసుగళిందలూ మఖమల్లినల్లి, ముడివాళనవిలుగరి చామర గళిందలూ ఆస్మానిరంగిన జాళిగె వస్త్రద తెరగళిందలు, ఆస్మానగరియ, మధ్యప్రదేశ దల్లి తూగిసల్పట్టె పీతవర్ణనద రెశ్మిదారగళిందలు ఇంద్రనీలవర్ణద' జాలరుగళిందలూ" (వెంకటరావు. గుల్వాడి. 2016: 5).

భీమారావు ఇంటిలో అనునిత్యం జరిగే కార్యక్రమాల గురించి వర్ణిస్తూ ఇందిరాబాయి నవలలో గుల్వాడి వెంకటరావుగారు ప్రయోగించిన ఈ వాక్యం విరుపులు లేకుండా సాగుతుంది. ఇలాంటి సుధీర్ఘ వాక్యాల ప్రయోగం ఇందిరాబాయి నవలలోనేకాక ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందులేఖ, శ్రీరంగరాజుచరిత్ర నవలలో కూడా కనిపిస్తుంది.

"చదువు లేనట్లైతే భగవంతుని యదార్థ స్వరూపాన్ని, అతని అనంత కళ్యాణ గుణ గణాలను, ధర్మాధర్మ భేదాలను, విజ్ఞాన శాస్త్రాలను, భూగోళం, ఖగోళం మొదలైన గుణింత శాస్త్రాలను ఇహపర సుఖాలను అందుకోగల మార్గాంతరాలను మనం ఎలా తెలుసుకోగలం, మనకు కళ్లు ఉన్నప్పటికీ సూర్యప్రకాశం లేనట్లయితే ఏమి ప్రయోజనం, మన కళ్లకు విద్య అనే జ్ఞానకాంతులు అత్యావశ్యకములు కదా! రత్నం సానపెట్టకనే ప్రకాశిస్తుందా? మృణ్మయ రూపంలో ఉన్న బంగారం, వెండి మొదలైన పంచలోహాలను శుద్ధిచేయనట్లయితే అవి కాంతితో ప్రకాశించగలవా? బాగా దున్నిన భూమిమాత్రమే మంచిపంటలని అందిస్తుంది." (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర. 2008: 4).

"మఱునాడు రాజుగారు యథాప్రకారముగా శారద యింటికిఁజని, శారద మాటాడక యొకతీరుననుండుటంజూచి కారణంబడిగి తెలిసికొని యుల్లంఘనచేసినవారు తనయింటివారు గారుగనుక దానియవమానంబునకుఁ బ్రతికారంబు చేయుట దుస్సాధమని రాఁగోరిన దావు నాతో ముందు చెప్పి రావలసియుండె, రాచకులము వారు పరువుమీఁద దృష్టిగలవారని నీ వెఱుఁగవఁటవే జరిగినదానికి వగవనేల వారితోడి పని నీకేమని శారదనూఱడించిన నది హా

మీరందఱెక్కటె నేనే కదా లాఁతిదానను".(ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010: 61).

ఇలా మూరురాయగండర్ శారదని ఓదార్చిన విధానాన్ని ఒకే సుధీర్ఘ వాక్యంలో వివరించడం శ్రీరంగరాజుచరిత్రలో కనిపిస్తుంది. ఇందులేఖ నవలలో 'మాధవుడు' ఉత్తర భారతదేశ యాత్రకువెళ్లి కలకత్తాలోని బాబుగోవిందసేన్ ఇంటిని చూసిన సందర్భంలో క్త్వార్థక క్రియాపదాలతో కూడిన సుధీర్ఘ వాక్యాల రచనాశైలి కనిపిస్తుంది. "ఎత్తైన గోడలలో పొదగబడి ఉన్న ఆశ్చర్యాన్ని కలిగించే చిత్రమైన అద్దాలు, అచ్చటచ్చట బంగారు వర్ణంగానూ, రజత మయంగానూ ఉన్న స్తంభాలద్వారా దింపి గోడలలో పొదిగి నిలబెట్టిన వాల్‌సెట్ అని ఇంగ్లీషులో చెప్పబడే దీపాలు, తెలుపు, నీలం, పసుపు వర్ణాలతో కూడిన వార్నిషులు వేయబడి అతిగంభీరంగా నిలబడి ఉన్న గోడలను అలంకరించి ఉన్న దీపాలు అక్కడ అసంఖ్యాకంగా ఉనాయి." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 250).

### 3.2.3.10.4. సామెతల ప్రయోగం

సామెతలు భాషకి నూతన అందాన్ని చేకూర్చుతాయి. అల్పాక్షరాలలో అనంత అర్థాన్ని బోధించడం సామెతల లక్షణం. "సామెత శబ్ద వ్యుత్పత్తిని గురించి పండితలోకంలో అభిప్రాయ భేదాలు లేకపోలేదు. సామ్యత అనేది తెలుగులో సామెతగామారి వాడుకలోకి వచ్చిందని చిలుకూరి నారాయణరావుగారు విశ్వసించారు. పోల్చిచెప్పడమే సామెతలోని ప్రధానాంశం కనుక సాదువ, చాటవ అనే పేర్లు వ్యాప్తిలోకి వచ్చి ఉండవచ్చని కొందరి అభిప్రాయం. తమిళంలో సామెతను పళమొళి, మూదురై, ముదుసోత అంటారు. పురాణోక్తి అని వీటి అర్థం. నాణ్ణుడి (నానుడి), గాదె (గాథ) అని కన్నడికుల వ్యవహారం. నాణ్ణుడిని లోకోక్తి అనవచ్చు. ఇక మలయాళంలో పళంచొల్లు, పళమొళి అంటారు. పురాణోక్తి అని దీని అర్థం" (రాధాకృష్ణశర్మ, చల్లా. 1986: 8, 9). సందర్భాన్ని బట్టి సామెతలని ప్రయోగించడం దక్షిణ భారత తొలి సాంఘిక నవలల శైలిలో కనిపిస్తుంది.

1. “మోదలె నావు హింగు కట్టిద బట్టె గళష్టె.” (ముందే మేము ఇంగువ కట్టిన బట్టవంటి వాళ్లం.) ఎవరు తప్పు చేసిన మమ్మల్నే అనుమానిస్తారు (వెంకటరావు, గుల్వాడి. 1162: 130)
2. “సద్యః ఫలితం వలదని చెప్పబడినట్లు.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర. 2008: 2)
3. “శుక్లపక్ష చంద్రునివలె దినదినమూ అభివృద్ధి చెందుతూ ఉండాలి.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర, 2008: 5)
4. “పండబోయెపంట విత్తులోనే తెలుస్తుంది.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాప ముదలియార్ చరిత్ర, 2008: 15)
5. “కుంటివాడు చెట్టుకొమ్మ మీద ఉన్న తేనెకి ఆశ పడినట్లు.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర, 2008: 15)
6. “అత్తమెచ్చిన కోడళ్లు లేరు.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర, 2008:19)
7. “డబ్బుంటే శవంకూడ నోరు తెరుస్తుంది.”(జయప్రకాశ్.ఎస్.(అ), ప్రతాపముదలియార్ చరిత్ర 2008: 36)
8. “నిప్పులో వేసిన పువ్వువలె.” (జయప్రకాశ్, ఎస్(అ), ప్రతాపముదలియార్ చరిత్ర. 2008: 37)
9. “మూసి పెట్టిన బోషాణానికి తాళంచెవి ఇచ్చినట్లు.”(జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాప ముదలియార్ చరిత్ర, 2008:37)
10.“ఆత్రగాడి బుద్ధి మట్టు.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర. 2008: 56)
11. “ఔషధ ప్రయోగంతో విషందిగిపోయినట్లు.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాప ముదలియార్ చరిత్ర 2008: 63)
12. “చిలుకను పెంచి పిల్లిచేతికి అప్పగించినట్లు.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర 2008: 69)
13. “వెతక బోయిన తీగ కాళ్ళకు తగులుకున్నట్లు.” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర 2008: 73)

14. “పొగరుబోతు కోడెను బండికికట్టినవెంటనేపడుకున్నట్లు” (జయప్రకాశ్, ఎస్ (అ). ప్రతాపముదలియార్ చరిత్ర, 2008:77)

15. “దెబ్బ మీద దెబ్బ పడితే దయ్యం కూడా చప్పున మాట వింటుంది అన్నట్లు” (జయప్రకాశ్, ఎస్(అ). ప్రతాపముదలియార్ చరిత్ర. 2008: 90).

16. “చిట్టెడు పొట్టకు వలయు పట్టెడు” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010: 69)

17. “ఇద్దద్దు హోయితు మద్దిన గుణదింద”. (కొండనాలుకకి మందు వేసుకుంటే ఉన్ననాలుక ఊడినట్లు) (వెంకటరావు, గుల్వాడి. 1962: 160)

18. “ఎరడు దేవర నంబి కరుడ దాస కెట్ట” (రెండింటికి చెడ్డ రేవడివలే) (వెంకటరావు, గుల్వాడి. 1962: 133)

19. “కణ్ణుకట్టి కాడినల్లి బిట్టంతాగిదే” (కళ్లు మూసి కారడవిలో వదిలిన విధంగా) (వెంకటరావు, గుల్వాడి. 1962: 134)

20. “కోడలికి బుద్ధిసెప్పి అత్త రంకు పోయెను” అను సామెత అయ్యెను! (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010: 86)

21. “చిట్టెడు పొట్టకు వలయు పట్టెడు సంకటికి బావు. రొట్టెకు” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010: 69)

22. “మదువిగె తంద అక్కి సేసిగె హోయితు ఎంబగాదెహంతె” (ఉన్న ఒక్క మెతుకు గంజిలో పోయినట్లు) (వెంకటరావు, గుల్వాడి. 1962: 6)

23. “హాడిదేహాడు, కిసబాయిదాస” (పాడిందే పాడు పాసుపండ్ల దాసు అన్నట్లు) (వెంకటరావు, గుల్వాడి. 1962: 6)

24. “అజ్జిగె అరువెయ చింతె, మగళిగే మిండరచింతె, మొమ్మగళిగే ఖజ్జాయదచింతె” (ముసలమ్మకు బట్టలచింత, కూతురికి విటులచింత, మనుమరాలికి కజ్జికాయల చింత అన్నట్లు) (వెంకటరావు, గుల్వాడి. 1962: 6)

25. “నీరల్లి మడిద హోమదంతే నిరర్థకవాయితు.” (నీటిలో చేసిన హోమంవలే నిరర్థకమైంది.) (వెంకటరావు, గుల్వాడి. 1962: 149)

26. “మదువె మాడినవనే బల్ల, మనెకట్టిదవనె బల్ల” (ఇల్లుకట్టి చూడు, పెళ్లిచేసి చూడు) (వెంకటరావు, గుల్వాడి. 1962: 79).

### 3.2.3.10.5. హాస్యధోరణి

ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందులేఖ నవలల్లో హాస్యధోరణితో కూడిన రచనాశైలి కనిపిస్తుంది. 'ప్రతాపముదలియార్' బాల్యక్రీడలని వివరించే సందర్భంలో, జ్ఞానాంబాళ్‌తో ప్రతాపముదలియార్ చదువుకునే సందర్భంలో హాస్యధోరణితో కూడిన శైలి వాడబడింది.

"నేను మరికొంత మంది పిల్లలు వీధిలో ఆటలాడుకొంటున్నప్పుడు వాళ్లలో ఒకడు నన్ను చూసి "నేను రెండు కళ్లు మూసుకొని ఒక చమత్కారం చేస్తాను. ఆ చమత్కారాన్ని నీవు రెండు కళ్లు తెరుచుకొని చేయగలవా అని పందెం వేశాడు. దానికి నేను "నీవు రెండు కళ్లు మూసుకొని చేసే విద్యను నేను కళ్లు తెరుచుకొని చేయలేనా "ఆవిధంగా చేయక పోయినట్లయితే పందెం ఓడిపోయినట్లే" అని ఒప్పందం చేసుకున్నాను. వెంటనే వాడు నడివీధిలో కూర్చుని రెండు కళ్లను మూసుకొని మట్టిని పిడికిలితో ఎత్తి తన కళ్లమీద పోసుకున్నాడు. ఆ తరువాత వాడు నన్ను చూసి "నీవు రెండు కళ్లు తెరుచుకొని ఈ పని చెయ్యి" అని మట్టిని నా చేతిలో పోశాడు. నేను కళ్లు పోగొట్టుకోవడం కన్నా డబ్బు పోగొట్టుకోవడం మంచిదని భావించి పందెండబ్బులు ఇచ్చివేశాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 7).

ఇంట్లో ఉన్న అద్దంలో అందరి మొహాలు అందంగా కనిపించి తనమొహం అందంగా కనిపించక పోయేసరికి అది అద్దం తప్పని ప్రతాపముదలియార్ అద్దాన్ని పగలగొడతాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 8). కోడి కూయకపోతే తెల్లవారదని భావించి కోళ్లను పెంచవద్దని ఇరుగు పొరుగు వారిని ఆజ్ఞాపిస్తాడు. యముడు వచ్చి ప్రాణాలు తీసుకెళ్తాడని విని ఉండడంవల్ల ఒక రోగిని గదిలోపెట్టి తలుపులు బంధిస్తాడు. రోగి చనిపోతాడు. తలుపులన్నీ మూసి ఉన్నా యముడు ఎలా వచ్చాడని ప్రతాపముదలియార్ ఆశ్చర్యపడతాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 9).

"జ్ఞానాంబాళ్ తెలివితేటలను చూసిన ఒక పండితుడు ఆమెతో చిన్నవయస్సులో బుద్ధిశాలులైన పిల్లలు తరువాతి కాలంలో నిష్ప్రయోజకంగా మారడం సహజమని చెప్పాడు. వెంటనే జ్ఞానాంబాళ్ ఆయన్ని చూసి తాము చిన్నవయస్సులో ఎక్కువ బుద్ధిసూక్ష్మకతను కలిగిఉండేవారని తలుస్తానని అని చెప్పింది." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 15).

ఇందులేఖ నవల ఆసాంతం హాస్యం తొణికిసలాడుతుంది. ఇంటివద్ద పంజుమీనన్‌న్ని మాధవుడు ఎదురించి అతని అభీష్టానికి వ్యతిరేకంగా చిన్నడిని మద్రాసుకు తీసుకువెళ్తాడు. అప్పుడు కోపంతో ఊగిపోయిన పంజుమీనన్ ప్రవర్తన నవ్వును తెప్పిస్తుంది. పంజుమీనన్ తన కోపాన్ని సాత్తమీనన్, గోపాలన్‌పై చూపిస్తాడు. పంజుమీనన్ అడిగిన ప్రశ్నలకి వారు చెప్పే సమాధానాలు పొందిక లేకుండా ఉంటాయి.

పంజుమీనన్: ఒరేయ్ తెలివితక్కువ వెధవా! చిన్నని మదరాసుకు పంపించావా! ఏమిరా!

సాత్తరమీనన్: చిన్నడిని మాధవుడు మదరాసుకు పిలుచుకువెళ్లాడు.

పంజుమీనన్: నీ సమ్మతి లేకుండానా?

సాత్తరమీనన్: నా దగ్గర ప్రత్యేకంగా సమ్మతి ఏది తీసుకోలేదు.

పంజుమీనన్: నీ సమ్మతి లేకుండానా పిలుచుకొని వెళ్లాడు? అది చెప్పు. దిక్కులేని వెదవా! ముందు అది చెప్పు.

సాత్తరమీనన్: నాన్నగారిని అడిగి సమ్మతం తీసుకున్నట్లుగా నాదగ్గర గోపాలన్ చెప్పాడు.

పంజుమీనన్: గోపాలన్ ని పిలువు

గోపాలన్ కారణవరుగారికి ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

పంజుమీనన్: నీదగ్గర మీ నాన్న ఆ వెర్రివాడు ఏమిరా చెప్పాడు? చిన్నని పిలుచుకొని వెళ్లడానికి నేను సమ్మతించినట్లు చెప్పాడా!

గోపాలన్: మా నాన్న వెర్రివాడు కాదు! భట్టరు!

పంజుమీనన్: ఏమిరా చెప్పావు తెలివితక్కువ వెధవా!

అంటూపంజుమీనన్ లేచి నిలబడి గోపాలన్‌ని రెండుమూడు దెబ్బలు వేశారు.

గోపాలన్: నన్ను ఊరికే కొట్టకండి

పంజుమీనన్: కొడితే ఏమిరా? ఇప్పుడు కొట్టానుకదా! మనసుకు ఎక్కలేదా? (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 59, 60)

ఇందులేఖను చూడడానికి నంబూద్రిపాదు తాను తన వెంటతీసుకున్న బంగారు వస్తువులను సేరుసేరి నంబూద్రికి విశేషంగా చూపిస్తాడు. అప్పుడు వారి మధ్య జరిగిన సంభాషణ నవ్వు పుట్టించే విధంగా ఉంటుంది.

నంబూద్రిపాదు: సెరిసేరి దీనిని చూడండి ఇది వెండితాంబూలపు పెట్టె, ఇంతకుముందు మీరు చూసి ఉండరని తోస్తున్నది.

వెయ్యిసార్లు సేరుసేరి ఆ పెట్టెను చూసి ఉంటాడు. అయినప్పటికీ

సేరుసేరి నంబూద్రి: నాకు చూసినట్లు బాగా జ్ఞాపకంలేదు. మంచిపనితనం ఈ వైపు చేయించారా?

పెట్టె నిజానికి అక్కడి ఆచారి చేసినదే. అది సేరుసేరికి తెలుసు. అయినప్పటికీ తాను అడిగిన ప్రశ్న నంబూద్రిపాదుకి మిక్కిలి సంతోషాన్ని కలిగిస్తుందని తెలిసే ఆ ప్రశ్నని అడిగాడు.

నంబూద్రిపాదు: లేదు ఇక్కడ చేసింది కాదు. ఈ వైపు ఎవరు ఇలా చేయగలరు. మైసూరుకు చెందిన ఒక పెద్దమనిషి నాకు బహుమతిగా ఇచ్చాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 113,114)

### 3.2.3.10.6. గేయాలు, శ్లోకాలతో కూడిన రచన

గేయాలు, శ్లోకాలతో కూడిన రచనాశైలి దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ఉంది. అనేక సందర్భాలలో చెప్పదల్చుకున్న విషయాన్ని శ్లోకాలు లేదా గేయాల రూపంలో చెప్పడం కనిపిస్తుంది.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు ప్రాపంచిక విషయాలగురించి ఒక బ్రాహ్మణుడితో చర్చిస్తాడు. ఈ చర్చలో సుఖదుఃఖాలు రెండు ఒకదాని తరువాత మరొకటి వస్తాయని ఒక శ్లోకంలో బ్రాహ్మణుడు శ్రీరంగరాజుకి చెప్తాడు.

“శ్లో. నహి సుఖం దుఃఖైర్వినలభ్యతే
సుఖస్యానంతరం దుఃఖం, దుఃఖస్యానంతరం సుఖం
చక్ర వత్పరివర్తతె దుఃఖానిచ సుఖానిచ” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010:71)

కొండవీటిరాజు సోనాబాయిని రెండవ వివాహం చేసుకోడానికి సిద్ధమైనప్పుడు అతనిభార్య ఇద్దరు పెళ్లాలవల్ల వచ్చే కష్టాలను భర్తకు తెలియచెప్పే ఉద్దేశంతో ఒక సురభీ జంగమస్త్రీచేత గౌరీ, గంగల పోరు కథను రాజుముందు గానం చేయిస్తుంది.

“గౌరమ్మ పండుగ గలియ వచ్చినది,

కార్తీక పున్నమి గౌరి నోములను,

నూటొక్క నోములు నోచెనుగౌరి

కడగొట్టు నోముకుఁ గడకుఁ బోయినది

కడకుఁబోయిన వార్త గంగమ్మ వినెను" (ఇనాక్, కొలకలూరి. శ్రీరంగరాజు చరిత్ర. 2010: 56)

ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయి భర్త విఠలరావు మరణించిన తరువాత ఇందిరాబాయిలో వైరాగ్య భావాన్ని కలిగించడానికి భీమారావు సంతమండలిని తన ఇంటికి పిలిపిస్తాడు. ఆ సంతమండలివారు ఇందిరాబాయిలో వైరాగ్యభావం కలిగించే క్రమంలో ఆమె ఎదుట భగవద్గీత శ్లోకాలు, గేయాలను పాడుతారు.

"అశోచ్యానన్వ శోచ్యస్త్వం ప్రజ్ఞావాదాంశ్చభాషసే

గతాసూనగతాసూంశ్చ నాను శోచంతి పండితాః"

(వెంకటరావు, గుల్వాడి. 1962: 164)

ఇందిరాబాయి వివాహ సమయంలో 'శారదాబాయి' అనేక శోభనా గీతాలను పాడుతుంది.

మందగామిని యారొందాగి

చందద్దైతందుకూడిరలు

కుందకుసుమ కెంబందుగె చంపక

సందణిసిద జాజియమల్లిగెసర

వృంద బకుళ శావంతిగె మాలిగ

ళిందిరియ ముడిగే ఇరీసీదర్" !!శోభాన్!!" (వెంకటరావు, గుల్వాడి. 1962: 240)

భాస్కరరావు వివాహ సమయంలో అతని మిత్రుడు సంజీవరావు పెళ్లి మండపంలో రెండు సంస్కృత వృత్తాలను పాడతాడు.

"మంగళాక్షితె దేవిగె సహితా, సు

మంగళియరు శోభన హాడి

మంగళాత్మక భాస్కర ఇందిరెయర

మంగళారతియను బెళగిదరు" (వెంకటరావు, గుల్వాడి. 1962: 243)

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ వేటాడుతూ దారితప్పి 'విక్రమపురికి' చేరుకుంటాడు. 'విక్రమపురిలో' అన్యాయంగా ప్రతాపముదలియార్ పై ఒక చర్మకారుడు న్యాయస్థానంలో వ్యాజ్యం వేస్తాడు. వ్యాజ్యాన్ని విచారించిన న్యాయాధీశుడు ఆ చర్మకారుని సంతోషపెడదామని నీవు అంగీకరించునందువలన రేపు సూర్యోదయానికి ముందు అతన్ని నీవు ఎలాగైనా సంతోషపెట్టాలి. నీవు అలాచేయకపోయినట్లైతే రేపు అతను నీ ప్రాణాలు అడిగిన ఇవ్వవలసిందే." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 161) అని తీర్పు చెబుతాడు. ఈ తీర్పు విన్న ప్రతాపముదలియార్ ఈ విపత్తునుండి తప్పించుకోవడానికి ఒక ఉపాయం ఆలోచిస్తాడు. "మరుసటినాడు సూర్యగ్రహణం కావడం, అది పాతాళ సూర్యగ్రహణం కావడంవల్ల చాలా సేపటికి వరకు సూర్యుడు కనిపించడు. ఆ ఊళ్లో ఉన్న వాళ్లకి గ్రహణం అంటే ఏమిటో తెలియదు. ఈ విషయాలను తన మనసులో ఉంచుకొని ప్రతాపముదలియార్ రేపటి దినం సూర్యోదయానికి ముందు నేను చర్మకారుని సంతోషపెట్టాలని మీరు తీర్పు చెప్పారు. రేపటిదినం సూర్యోదయం కాకపోతే ఏం చేస్తారు అని న్యాయాధిపతిని అడుగుతాడు. న్యాయాధీశుడు రేపటినాడు సూర్యోదయం కాకుండా చేస్తే ప్రతాపముదలియార్ ని శిక్షనుండి తప్పిస్తానని అలాకాకుండా సూర్యోదయమైతే మరణదండన విధిస్తానని తీర్పు చెబుతాడు. ప్రతాపముదలియార్ ఆ రాత్రి నిద్రపోకుండా మంత్రతంత్రాలు చేస్తున్నట్లు ఇంద్రజాలం చేయడమేకాక ఒక గేయాన్ని కూడా ఆలపిస్తాడు.

"చక్రవర్తి మరణించిన తరువాత మూర్ఖులందరూ
కూడి, ప్రజాప్రభుత్వమనే పేరు చెప్పుకొని
అక్రమాలు చేస్తున్న ఈ పాడు దేశంలో
సూర్యుడా! ఉదయించబోకు" (జయప్రకాశ్, ఎస్(అ). 2008:162)

మరుసటి రోజు సూర్యుడు ఉదయించడు. అక్కడున్న ప్రజలు "మీరు మమ్మల్ని అనుగ్రహించాలి అని ప్రతాపముదలియార్ కాళ్ళమీద పడగా గ్రహణం వీడే సమయానికి ముందు ఇంకో గేయాన్ని ఆలపిస్తాడు.

"వాడిన పైరును కాపాడ్డానికి వచ్చే పెద్ద వర్షంవెలె
పిల్లలకు ప్రేమైక మూర్తియైన తల్లివలె
దేశంలో వ్యాపించిన అంధకారం తొలిగేలా
సూర్యుడా! నీవు ఉదయించాలి" (జయప్రకాశ్, ఎస్(అ). 2008:162)

ఇలా చాకచక్యంతో, గేయాలాపనతో ప్రతాపముదలియార్ తనకు వచ్చిన ఆపదనుండి బయటపడతాడు.

ఇందులేఖ నవలలో ఇందులేఖతో సంబంధం ఏర్పర్చుకోవడానికి ఇందులేఖ ఇంటికి వచ్చిన నంబూద్రిపాదు ఆమె ముందు తన భాషా పాండిత్యాన్ని చూపడానికి సంస్కృత శ్లోకాలను చదువుతాడు. ఆ శ్లోకాలు గుర్తుకురాక తడబడి నవ్వులపాలవుతాడు. చివరికి నంబూద్రిపాదు ప్రారంభిన శ్లోకాన్ని ఇందులేఖ ముగిస్తుంది.

"**ఇందులేఖ:** నాకు బాగా అలవాటు లేదు. లేనివంత చెప్పకండి. అయితే ఈ శ్లోకం మాత్రం నాకు జ్ఞాపకం ఉంది. దిగులుపడకండి. నేను చెబుతాను.

"ఆస్తాం పీయూష లాభ స్సుముఖి గర జరా మృత్యుహారీ ప్రసిద్ధ<br>
స్తల్లాభోపాయ చింతాపి చగరళజుషో హేతురుల్లాఖ తాయాః<br>
నోచేత్ ఆలోల దృష్టి ప్రతిభయ భుజగీ దుష్టకర్మ ముహుస్తే<br>
యామే వాలంభ్య జీవే కథ మధుర సుధామాధురీ మప్య జానన్"

**నంబూద్రిపాదు:** చాలా బ్రహ్మాండమైన శోకం కదా!

**ఇందులేఖ:** అవును (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 154).

*****

## అధ్యాయం - 4

# 4. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - పాత్రచిత్రణ - తులనాత్మక పరిశీలన

### 4.0. పాత్ర చిత్రణ

"కథా వస్తువును భరించేవారు. కథను నడిపించేవారు పాత్రలు". (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 27). పాత్రలులేని నవలని ఊహించలేం. నవలలో ఉన్న కథ ఏదైనా ఆ కథని పాఠకులకు అందించడానికి తోడ్పడేవి పాత్రలు. నవల కథ చాటున దాగిన సందేశాన్ని పాత్రలు పాఠకునికి అందిస్తాయి. ఒక పాత్ర నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించేవరకు అది ప్రవర్తించిన తీరును పాత్ర చిత్రణగా చెప్పవచ్చు. నవలలో పాత్రల ప్రవర్తన తీరు ఎలా ఉండాలి? పాత్ర ప్రవేశం మొదలు నిష్క్రమించే వరకు ఎలాంటి ప్రవర్తన తీరును కలిగి ఉంటే అది ఉత్తమ పాత్ర చిత్రణ అవుతుంది. వంటి అంశాలు పాత్ర చిత్రణకి సంబంధించి ప్రాథమికాంశాలను అందిస్తాయి.

నవలా రచయిత ఆలోచనల నుండి కథ, కథను నడిపించే పాత్రలు పురుడు పోసుకుంటాయి. రచయిత ఆలోచనల నుండి పుట్టిన పాత్ర నవలలో నడయాడే క్రమంలో తనకంటూ కొన్ని ప్రత్యేక లక్షణాలను సంతరించుకుంటుంది. ఈ లక్షణాలు సహజ మానవ ప్రవృత్తికి దగ్గరగా ఉన్నప్పుడే ఆ పాత్రలో సహజత్వం ఉంటుంది. సజీవ సమాజంలో మానవుడు భౌతిక, మానసిక ప్రవృత్తులను కలిగి ఉంటాడు. మానవుని ఆహార్యం, మాట్లాడే తీరు, బయటికి కనపడే ప్రవర్తన భౌతిక ప్రవర్తనకి నిదర్శనం కాగా ఆలోచనా విధానం, మనసులో ఉన్న భావాలు మానసిక ప్రవర్తనకి నిదర్శనం. ఈ రెండు ప్రవర్తనలతో భౌతిక ప్రవర్తన అందరికి కనిపిస్తుంది. కాని మానసిక ప్రవర్తన అందరికి కనిపించదు. అది వ్యక్తిగతం. ఒక వ్యక్తి ఏం ఆలోచిస్తున్నాడో, అతని మనసులో ఎలాంటి సంఘర్షణ జరుగుతుందో అతనికి మాత్రమే తెలుస్తుంది. ఇలాంటి ప్రవర్తనలను కళాత్మకంగా నవల అంతర్గత పాత్రలకు ఆపాదించడంలో రచయితలు పాటించడానికి ఆస్కారం ఉన్న పద్ధతుల గురించి "సోమర్ సెట్ మామ్, ఇ.ఎమ్. ఫోర్‌స్టర్ వంటి విమర్శకులు వివరించారు. సోమర్‌సెట్ మామ్ పాత్ర చిత్రణ గురించి చెబుతూ నవలలో పాత్ర చిత్రణ మానవ మానసిక ప్రవృత్తికి దగ్గరగా ఉండాలన్నారు." (సుజాతారెడ్డి, ముదిగంటి.

2017: 146). పాత్రల ప్రవర్తన ఆధారంగా ఇ.ఎమ్. ఫోర్‌స్టర్ పాత్రల్ని 'ఫ్లాట్ కారెక్టర్స్' 'రౌండ్ కారెక్టర్స్' అని రెండు రకాలుగా విభజించాడు.

**అ. క్లిష్టతలేనిపాత్రలు (ఫ్లాట్ క్యారెక్టర్స్)**

"ఒకే ఒక భావాన్నో, గుణాన్నో అధారం చేసుకొని రూపొందించబడ్డ పాత్రల్ని క్లిష్టతలేని పాత్రలు లేదా ఫ్లాట్ కారెక్టర్స్ అనవచ్చు. ఇలాంటి పాత్రలు మొదటిసారిగా పాఠకునికి పరిచయమైనప్పటినుంచీ చివరి వరకూ ఒకే పద్ధతిలో, ఒకే మనస్తత్వంతో కొనసాగుతాయి. ఈ పాత్రల మనస్తత్వంలో ఎలాంటి సంఘర్షణలూ వుండవు. ఈ పాత్రల్లో ఒకే భావం లేదా ఒకే గుణం ఉండటం చేత వాటిలో ఎలాంటి మానసిక సంఘర్షణ దానికి సంబంధించిన అశాలు ఉండవు." (వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994: 28).

**ఆ. క్లిష్టత ఉన్నపాత్రలు (రౌండ్ క్యారెక్టర్స్)**

"క్లిష్టత ఉన్న పాత్రలు అన్ని గుణాల్లోనూ క్లిష్టతలేని పాత్రలకి వ్యతిరేకమైనవి. వాటిలో భిన్న వ్యక్తిత్వాలు ఉంటాయి. అందుచేత అంతఃసంఘర్షణ ఉంటుంది. పరిస్థితుల ప్రభావం చేత అవి మార్పు చెందుతాయి. పాత్రల్లో వచ్చిన మార్పును చూసి పాఠకుడు మొదట ఆశ్చర్య పోయినా నెమ్మదిగా మార్పుకు కారణాలు ఉన్నాయని గుర్తిస్తాడు." (వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994: 29).

ఈ పాత్రల విభజన పాత్ర మానసిక ప్రవృత్తి ఆధారంగా చేయబడింది. ఈ మానసిక ప్రవృత్తి నవలలో పాత్ర ప్రవర్తించిన తీరును బట్టి పాఠకులకు అందుతుంది. నవలలో పాత్రల భౌతికరూపం, మానసిక ప్రవర్తన పాఠకులకు అందించే విధానాన్ని బట్టి "నవలల్లో పాత్రల చిత్రణ రెండు రకాలుగా ఉంటుందని డబ్ల్యూ.హెచ్. హడ్సన్ అంటాడు. Direct (or) Descriptive method, indirect (or) Dramatic method. పాత్ర చిత్రణలో మొదటిదాన్ని ప్రత్యక్ష లేదా వర్ణనాత్మక పద్ధతి అని, రెండోదాన్ని పరోక్ష లేదా నాటకీయ పద్ధతి అని అనవచ్చును. ప్రత్యక్ష పద్ధతిలో రచయిత స్వయంగా పాత్రల మనోభావాలను, గుణస్వభావాలను వేష భూషణాదులను ప్రత్యక్షంగా పనిగట్టుకొని వర్ణించి చెప్పడం, ఒక్కొక్కసారి పాత్రల గుణగణాలను వ్యాఖ్యానిస్తూ చెప్పడం కూడా వుంటుంది. పరోక్ష పద్ధతిలో పాత్రచిత్రణ నాటక శిల్పాన్ని పాటించడంతో జరుగుతుంది. నాటకంలో పాత్రల గుణస్వభావాల,

మనోభావాల, వేషభాషల వర్ణనలను రచయిత స్వయంగా చేయదు. నాటకంలో పాత్రల గుణాదులు సంభాషణల మూలంగానే ప్రకటితమౌతాయి. నవలలో రచయితలు కొందరు ఈ నాటక శిల్పంతో కూడిన పరోక్ష పద్ధతిని అవలంబించి పాత్రల చిత్రణను చేసారు. ఈ పద్ధతిలో పాత్ర గుణ స్వభావాదులకు సంబంధించిన చాలా విషయాలు రచయిత వాచ్యంగా చెప్పకపోవడంచేత పాఠకుల ఊహకు, వ్యాఖ్యానానికి వదిలివేయబడుతుంది." (సుజాతారెడ్డి, ముదిగంటి. 2017: 152).

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ప్రత్యక్ష లేదా వర్ణనాత్మక పద్ధతి (Direct (or ) descriptive method) ద్వారా పాత్రల భౌతిక, మానసిక ప్రవృత్తిని రచయితలు పాఠకులకు అందించారు. శ్రీరంగరాజుచరిత్ర నవలలో "వారిలోపల శారద యనునది మిక్కిలి సొబగుకన్నులది చందురు మోముది, మృదులాంగి, మల్లెపూవు జొంపము అది మహారాజు గారిచేఁ బరిగ్రహింపఁబడి రాజు సదనమునందే యొక తట్టునఁ బ్రత్యేకముగా నుంపఁబడి రాజస్త్రీలకు సమానముగ సన్మానింపఁబడుచుండె" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2016: 61). అంటూ 'శారద' పాత్ర ఆహార్యాన్ని వివరించిన గోపాలకృష్ణమసెట్టిగారు శ్రీరంగరాజు నామకరణ సందర్భంలో శారద భంగపడినపుడు ఆమె మానసిక ప్రవృత్తిని కూడా తన మాటలతోనే పాఠకులకు అందించారు. "ఇట్లు ములికి పోట్లవంటి క్రూర వచనములకు నోర్వ జాలక చూడు వీరి నందఱ నేమి చేసెద వీరి చేతికిఁ జట్టి యిప్పింపక పోతినేని నా పేరు శారద కాదని బయటికి బింకములు పలుకుచు మనంబున మిగుల దుఃఖించుచుఁబోయి యింట గూర్చుండె." (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 63). ఇలాగే కేవలం శారద పాత్ర ప్రవర్తననే కాక మిగిలిన పాత్రల ప్రవర్తనని కూడా గోపాలకృష్ణమసెట్టిగారు తన మాటలతో వివరించారు.

"శ్రీరంగరాజు తల్లి మహాపతివ్రత భర్త ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా ఓర్చుకొని నోరు మెదపకుండా బతికేది" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 65). అంటూ శ్రీరంగరాజు తల్లి పాత్రను పరిచయం చేసిన గోపాలకృష్ణమసెట్టిగారు సోనాబాయి పాత్ర ఆహార్యాన్ని తన మాటల ద్వారా పాఠకులకు అందించారు. "తళుకు తళుకు మని మెఱయు మెఱుపు చందంబున మెఱయుచున్న చొక్కపు ప్రాయంపుకన్నియంజూచి, విస్మయంబంది, యది

లంబాడి కుచ్చెళ్ళు పోసిన కెచ్చెలు గట్టికొని, మెడ మొదలుకొని నడుము వరకు నొడలు గప్పునట్టి లంబాడి రవిక తొడగుకొని, దంతపు సొమ్ములు దాల్చియుండటం జూచి నది వేషంబున లంబాడిది గాఁగానంబడుచున్నదిగాని యీరూప లావణ్యంబులును, నీ మిసిమిసి వెంట్రుకలును నిరులుపోఁగొట్టునట్టి చందురు మోమునుజూడ నిది లంబాడిదిగా దోచబడదు" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 83). శ్రీరంగరాజు రాజకుమారుడని తెలిసిన తరువాత సోనాబాయి లంబాడి తల్లి మనసులో సంతోషపడుతుంది. ఈ సంతోషాన్ని గోపాలకృష్ణమసెట్టిగారు తన మాటల ద్వారా పాఠకులకు అందించారు. "లంబాడి ముసలిది మనంబున బరమానందము నొంది, నామ్రొక్కు మల్లికార్జుండు నేఁడు ఫలింపఁజేసెననికొని నీవు చెప్పినది వినఁగా నాగర్భము గరిగిపోవుచున్నది. విద్యానగరమేడ, చంద్రగుప్తియేడ రాయలవారి వంశమేడ దేశదేశమునఁ గ్రుమ్మరు లంబాడి కులమువారేడ మాతోడ నీకేమి మాటలయ్యా" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 85). ఈ విధంగా పాత్రల ఆహార్యం మానసిక ప్రవృత్తిని రచయిత తన మాటల ద్వారా పాఠకులకు అందించడం శ్రీరంగరాజుచరిత్రలో ఉంది. ఇందిరాబాయి నవలలో గుల్వాడి వెంకటరావుగారు పాత్రల పరిచయాన్ని తన మాటల ద్వారా చేశారు. పాత్రల మానసిక ప్రవృత్తిని సుధీర్ఘంగా వివరించారు. "ఈ నగర అగ్రహార వీధిలో హంపె భీమారావు అనే గృహస్థుడు ఉండేవాడు. అతని పూర్వీకులు బీజాపుర సీమలో చాలా కాలం వంశపారపర్యంగా కులకర్ణి ఉద్యోగాన్ని చేస్తూ జీవించారు. ప్రాయం వచ్చిన తరువాత అతను నరసింహశాస్త్రి అనే వ్యాపారివద్ద పనిలోకి చేరాడు. కొంతకాలం తరువాత పుణ్యవతి, రూపవతి, గుణవతి అయిన అంబాబాయి అనే స్త్రీతో అతనికి వివాహమైంది." (వెంకటరావు, గుల్వాడి. 1972: 1, 2). ఇలా నవల ప్రారంభంలో రేఖామాత్రంగా అంబాబాయి, భీమారావు, నరసింహశాస్త్రి వంటి పాత్రలను పరిచయం చేశారు. అమృతరావు పాత్రను పరిచయం చేసే సందర్భంలో అతని పూర్వస్థితిని గుల్వాడి వెంకటరావుగారు తనమాటల్లో వివరించారు. "అమృతరావు అంటే చిన్నతనంలోనే తన తల్లి, తండ్రి చనిపోవడం వల్ల చాలా దారిద్ర్యాన్ని అనుభవించి కొంతకాలం తరువాత అనాధాశ్రమంలో ఉండి విద్యనేర్చి క్రమంగా ఉన్నతస్థితికి వచ్చినవాడు కావడంవల్ల ఇతరుల సుఖదుఃఖాలు అంటే ఏమిటో తెలిసినవాడు." (వెంకటరావు, గుల్వాడి. 1972: 71).

పాత్రల పరిచయాన్ని రేఖామాత్రంగా తెలిపిన గుల్వాడి వెంకటరావుగారు పాత్రల మానసిక ప్రవృత్తిని తన మాటల్లో సుధీర్ఘంగా వివరించారు. భార్య అంబాబాయి మాటల ద్వారా సుందరరావును చంపాలనుకున్న భీమారావు అందుకు ప్రణాళిక రచిస్తాడు. ఆ రోజు రాత్రి అతనికి నిద్రపట్టదు. అతని మనసులో ఉన్న ఆలోచనలను అతని ప్రవర్తనను గుల్వాడి వెంకటరావు తన మాటల్లో సుధీర్ఘంగా వివరించారు.

“భీమారావుకు ఆ రాత్రంతా సరిగ్గా నిద్ర పట్టలేదు. మరు రోజు చేయవలసిన సూక్ష్మమైన పని గురించి ఆలోచిస్తూ కష్టాలేమన్నా ఎదురవుతాయేమో అనే దిగులుతో ఒకసారి నిశ్చయించిన క్రమాన్ని మరిచిపోయి మళ్ళీ దానిని గురించి ఆలోచిస్తూ తాను స్వయంగా చూసి, విని ఉండక ముందే సీతాబాయి ఆడిన మాటలను నమ్మి కార్యాన్ని ముందుకు నడిపిస్తే నరహత్యా పాతకానికి గురికావలసి వస్తుందేమో అని బాధపడుతూ, తన ఆస్తికి కీడు తేవాలని సంకల్పించిన ఊరి స్త్రీలందరూ ఇలాంటి మాటలు ఆడి ఉండవచ్చు కదా! సుందరరావు ఎందుకు నిరపరాధికాకూడదు. ‘కళ్ళార చూసినా పరామర్శించి చూడాలని పెద్దలమాట’ తాను ముందుకెళ్తే ఆ కార్యం పర్యవసనాలు ఎలా ఉంటాయో అని ఇలా తన మనసులో విచారిస్తూ కొంత సమయానికి కళ్ళు మూసిన వెంటనే సుందరరావు ఎదురుగా నిలుచుండి ‘స్వామి స్నేహంతోనూ, భక్తితోనూ, మిమ్మల్ని ఆశ్రయించి ఉన్నాను. మీరే రక్షించాలి’ అని చెప్పిన కలగని గగుర్పాటుతో లేచి కన్నులను తుడుచుకొని ‘అయ్యో ఇంకా ఎంత రాత్రి ఉంది’ గడియారాన్ని చూడసాగాడు” (వెంకటరావు, గుల్వాడి. 1972: 15, 16). ఈ ఒక్క సందర్భంలోనే కాక సుందరరావు మరణం సంభవించిన తరువాత జరిగిన పోలీసు విచారణ సందర్భంలోనూ ఇందిరాబాయి వివాహ సందర్భంలోనూ భీమారావు అంతరంగాన్ని గుల్వాడి వెంకటరావుగారు సుధీర్ఘంగా వర్ణించారు.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో వేదనాయగంపిళ్ళైగారు పాత్రల ప్రవర్తన తీరును పాత్ర ప్రవేశంలో ప్రతాపముదలియార్ పాత్ర మాటల ద్వారా వివరించారు. పాత్రల స్వభావాన్ని మంచి, చెడు గుణాలను వాచ్య రూపంలో వర్ణించి చెప్పడం ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కనిపిస్తుంది. సంబంధముదలియార్, జ్ఞానాంబాళ్ పాత్రల పరిచయ సందర్భంలో ఆయా పాత్రల గుణ గణాలను ప్రతాపముదలియార్ పాత్రముఖతహ వేదనాయగంపిళ్ళైగారు వివరించారు.

"సంబంధముదలియార్ ఎవరంటే ఆయన మా అవ్వకు సోదరుడు. ఆయన తాత మా తాతగారి వలనే కర్ణాటక రాజ్యంలో ఉద్యోగాలు చేసి అనేక స్థిర చరాస్థులను ఆర్జించి సత్యపురంలో స్థిరపడ్డాడు. ఆయన కుమారుడు చంద్రశేఖర ముదలియార్‌కు సంబంధముదలియార్ మా అమ్మ ఇరువురే సంతానం. వారికి మాకు చాలాకాలంగా విడదీయరాని అనుబంధం. అంతే కాక సంబంధముదలియార్ కూడా మావలనే సంపదలో పుట్టి పెరిగినవారు. ఆయనకు చాలాకాలం వరకు సంతానం లేకుండా ఉండి, తర్వాత ఒక ఆడపిల్ల జన్మించింది. ఆ పిల్లకు జ్ఞానాంబాళ్ అని నామకరణం చేశారు. ప్రపంచంలో ఉన్న సౌందర్యమంతా ఒకచోట మూర్తీ భవించిందా అన్నట్లు ఆమె రూప లావణ్యాలను కలిగి ఉండినది. ఆమె గుణగణాలను చూస్తే జ్ఞానాంబాళ్ పేరు ఆమెకు చక్కగా సరిపోతుంది. ఆమె తండ్రి సంబంధముదలియార్ గొప్ప శ్రీమంతుడైప్పటికీ, ఖర్చు పెట్టడంలో అతనికి మించిన లోభులు ఉండబోరు. ఆయన ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతారుగాని ఖర్చు పెట్టడానికి ఇష్టపడరు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 13, 14). ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో అనేక ఉపకథలు ఉన్నాయి. ఈ ఉపకథలలో కొన్ని ఒక పాత్ర ఇంకో పాత్రకు చెప్పిన ఉపకథలు కాగా, ఇంకొన్ని ఉపకథలు పాత్రలు తమను గురించి తాము చెప్పుకున్నవి. జ్ఞానాంబాళ్‌ని రక్షించిన అన్డిచ్చియమ్మాళ్ పాత్ర తన ఇతివృత్తాన్ని తానే చెప్పుకుంటుంది. "నేను ఒక ధనవంతుని ఇంట్లో పుట్టాను. ధనవంతుల ఇంటికే కాపురానికి వెళ్ళాను. నేను పుట్టిన స్థలం పుదువై నగరం. కాపురానికి వెళ్లినది పొన్నగిరి. మా తల్లి మరణించిన తరువాత మా నాన్నగారు పదహారు సంవత్సరాల క్రితం సైన్యంలో దళపతిగా ఉన్న మా అత్త కొడుక్కు నన్ను పాణిగ్రహణంచేసి ఇచ్చి నారు" (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 65). కనకసభతో వివాహానికి నిశ్చయించిన 'గుణరత్నం' పాత్రని కనకసభ తండ్రి దేవరాజపిళ్ళై పాఠకులకు పరిచయం చేస్తాడు. "మా చెల్లి కుమార్తెను కనకసభకు ఇచ్చి పెళ్ళి చేద్దామని నిశ్చయించి ఉన్నాము. ఆ అమ్మాయి పేరు గుణరత్నం. ఆ అమ్మాయి చరిత్ర కనకసభ చరిత్రవలే ఆశ్చర్యకరమైనది. మా చెల్లెలి భర్త మాణిక్యంపిళ్ళై గొప్ప ధన వంతుడు. ఈ ఊరికి నాలుగైదు కోసుల దూరంలో ఉన్న సింగనూరు వారి స్వస్థలం. గుణరత్నం తప్ప వేరే సంతానం లేనందువల్ల ఆ అమ్మాయిని కంటికి రెప్పలా, ప్రాణానికి ప్రాణంగా పెంచారు. (జయప్రకాశ్, ఎస్(అ). 2008:77, 78). ఈ విధంగా ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో పాత్రల ప్రవర్తనని నవలలోని పాత్రలే సుధీర్ఘంగా వివరించి చెప్పడం కన్పిస్తుంది.

ఇందులేఖ నవలలో ఒ.చందుమీనన్‌గారు పాత్రల భౌతిక, మానసిక ప్రవర్తనని తన మాటల ద్వారా పాఠకులకు అందించారు. పాత్రకు సంబంధించిన ప్రతీ అంశాన్ని తన మాటల్లో వివరించారు. మాధవుడు, ఇందులేఖ, నంబూద్రిపాడు, పంజుమీనన్ వంటి పాత్రలని పరిచయం చేసే సందర్భంలో పాత్రల గుణగణాలను పూర్తిగా ఒ.చందుమీనన్‌గారు తన మాటల్లో వర్ణించారు. “మాధవుడు బుద్ధిమంతుడు, అందగాడైన ఒక యువకుడు. మాధవుని దేహ కాంతులను గురించి రెండు మాటలైనా ఇక్కడ చెప్పకుండా వదిలి వేయడం ఈ కథా స్వభావానికి సరిపోదని నా పాఠకులు భావిస్తారేమోనని నేను సందేహించడం వలన సంగ్రహంగ చెబుతాను.

“మాధవుని శరీరం బంగారు రంగును కలిగి ఉంది. రోజూ చక్కగా వ్యాయామం చేయడం వలన యవ్వనంలో ఉన్న అతని శరీరం సమ్మోహనంగా ఉంది. అవసరానికి మించిన లావుగాని, మరీ సన్నగాగాని కనిపించకుండా మాధవుని కాళ్ళు, చేతులు, రొమ్ము మొదలైనవి బంగారాన్ని కరిగించి చేశారేమోననే భ్రాంతిని కలిగిస్తూ ఉంది. మనిషి బాగా పొడగరి. మాధవుని శరీరాన్ని కొలిచి చూడాలంటే వంపులు లేకుండా మోకాళ్ళ వరకు పొడుగ్గా, బాగా నిండుగా ఉన్న మాధవుని తల వెంట్రుకలను పాదం వరకు చక్కగా కొలిచి చూడవచ్చు. మొత్తానికి మాధవుని ముఖము శరీర నిర్మాణము చూసినపుడు శోభావహంగానూ, అతిశయంతో కూడుకొని ఉన్నట్లుగాను చెప్పబడుతోంది.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 3). ఈ వర్ణన మాధవుని రూపాన్ని కళ్ళకు కట్టినట్లుగా పాఠకుల ముందుంచింది.

ఇందులేఖ పాత్రను పరిచయం చేసే సందర్భంలో ఒ.చందుమీనన్‌గారు పాఠకులతో మాట్లాడడం కనిపిస్తుంది. “అందమైన కథా నాయికలను వర్ణించే సామార్థ్యం కొంచెమైనా నాకు లేనందువల్ల ఈ అధ్యాయాన్ని రాయాలని అనుకున్నప్పుడు నాకు కలిగిన భయాందోళనలు నాకు బాగా తెలుసు. అయితే తప్పించుకోవడం వీలుకాదు కదా! సాధ్యమైనంత వరకు వర్ణించడం చేస్తాను.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 9). పంజుమీనన్ పాత్రని పరిచయం చేసే సందర్భంలో పాత్ర భౌతిక రూపంతో పాటు అతనిలో ఉన్న లోపాన్ని ముందే పాఠకులకు ఒ.చందుమీనన్‌గారు తన మాటల్లో వివరించారు.

"ఈ కథ ప్రారంభమయ్యే కాలానికి పంజుమీనన్‌గారికి వయసు 80 సంవత్సరాలు. మనిషి మంచి తెల్లటి రంగును కలిగి పొట్టిగాను, కొంచెం లావుగానూ ఉన్నారు. వీరి సౌందర్య వర్ణన గురించి చెప్పాలంటే వీరికి భట్టతల, నోటిలో పై వరుసలో మూడు, కింది వరుసలో ఐదు పళ్ళు లేవు. కళ్ళు రక్త వర్ణంతో కూడిన రుద్రాక్షమాల, తలమీద ఎర్రటి కంబళి టోపి, చేతిలో వెండిపొన్ను కలిగిన చేతికర్ర ఉంటాయి. మనసులో నిజాయితీ, దయాగుణం ఉన్నప్పటికీ జన్మతః కోపిష్టి." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 46). ఈ ఒక్క సందర్భంలోనే కాక నంబూద్రిపాదు పంజుమీనన్ ఇంటికి వచ్చిన సందర్భంలో, మాధవుడు చిన్నడిని ఆంగ్లం చదివించడానికి తీసుకెళ్ళిన సందర్భంలోను పంజుమీనన్ ప్రవర్తనను ఒ.చందుమీనన్‌గారు తన మాటల్లో వివరించారు. నంబూద్రిపాదు పాత్రని పరిచయం చేసే సందర్భంలో పాత్ర భౌతిక రూపాన్ని మానసిక లోపాన్ని ఒ.చందుమీనన్‌గారు వివరించారు. "నంబూద్రిపాదుకి ఈ కథ జరుగుతున్న కాలంలో 45 సంవత్సరాల వయస్సు ఉంటుంది. చిన్న వయసు మొదలుకొని కుటుంబ వ్యవహారాలు చూస్తూ ఉండటం వలన చదువుకోవడానికి వీల్లేకపోయింది. వీరు సహజంగానే పెద్ద స్త్రీలోలుడుగా ఉండేవారు. స్వంతంలో సంప్రదాయం ప్రకారం పెళ్ళి చేసుకోలేదు. తమ్ముళ్ళు ఇద్దరికి పెళ్ళిళ్ళు అయ్యాయి. దానినే కారణంగా చూపి వీరు చాలా మంది శూద్ర అమ్మాయిలకు భర్తగా ఉంటూ కాలాన్ని గడుపుతూ వచ్చారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 87). ఇలా ఇందులేఖ నవలలో పాత్రల ప్రవర్తనని అనేక సందర్భాలలో ప్రత్యక్షంగా తానే ఒ.చందుమీనన్‌గారు పాఠకులకు వివరించారు.

నవలలో పాత్రల ప్రవర్తన మంచిగా ఉండవచ్చు లేదా చెడుగా ఉండవచ్చు. మంచి ప్రవర్తన కలిగిన పాత్రలు సమాజంలోని మంచి వ్యక్తులకు ఉదాహరణ కాగా చెడు ప్రవర్తన కలిగిన పాత్రలు సమాజంలో నీచ ప్రవృత్తి కలిగిన వ్యక్తులకు ఉదాహరణ. నవలలో ఏవి మంచి పాత్రలు? ఏవి చెడు పాత్రలు? మంచి పాత్రలు ఎన్ని ఉండాలి? చెడు పాత్రలు ఎన్ని ఉండాలి? ఏ పాత్ర ద్వారా తాను అనుకున్న సందేశాన్ని పాఠకులకు అందించాలన్నది రచయిత ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉంటుంది. ఏ పాత్ర ప్రవర్తనలో క్లిష్టత ఉంది. ఏ పాత్ర ప్రవర్తనలో క్లిష్టత లేదు అన్నది నవల ఆసాంతం పాత్ర ప్రవర్తించిన తీరును గమనిస్తే తప్ప అర్థం కాదు. "నవలా సాహిత్యంలోని పాత్రలు దేశకాలాల చట్రంలో బిగింపబడిన వ్యక్తులు. వీరికి వాస్తవిక జీవితం ఆధారం. ఈ పాత్రలు పరస్పర విరుద్ధంగా కనిపించే రెండు పనులు చేయాలి. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న

దేశకాలాల చైతన్యాన్ని పాఠకుడిలో కలిగించాలి. అంతే కాకుండా తమ చుట్టూరా దేశకాలాల చక్రం లేదన్న భ్రాంతిని కూడా కలిగించాలి." (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 37) అంటే పాత్రలు నవల కథను నడిపిస్తూనే సామాజిక అంశాలకు ప్రాతినిధ్యం వహించాలి.

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని పాత్రలు నవల రచనా కాలం నాటి సామాజిక అంశాలకు ప్రతీకగా చిత్రించబడ్డాయి. ఈ అంశం నవలలోని పాత్రలు మిగతా పాత్రలతో నడయాడిన విధానం ఆధారంగా తెలుసుకోవచ్చు. ఈ అంశాల ఆధారంగా దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని పాత్ర చిత్రణని ఈ విధంగా వివరించవచ్చు.

### 4.1. ఇందులేఖ - పాత్ర చిత్రణ

### 4.1.1. పురుషపాత్రలు

#### 4.1.1.1. మాధవుడు

ఇందులేఖ నవలలో ప్రధాన పాత్ర 'మాధవుడు'. తనకి వరుసకి సోదరుడైన 'చిన్నడిని' చదివించాలని ఇంటిపెద్ద తన మేనమామ పంజుమీనన్‌ని ఎదురించడంతో ఇందులేఖ నవల కథ ప్రారంభం అవుతుంది. "మాధవుడు బుద్ధిమంతుడు, అందమైనవాడు, తెలివైనవాడు. ఎఫ్.ఎ, బి.ఎ., బి.ఎల్ మొదలైన చదువులు చదివిన విద్యావంతుడు. చిన్నప్పటి నుండి అన్ని తరగతులలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు అవ్వడమే కాక, ఉపకార వేతనాన్ని కూడా అందుకున్న ప్రజ్ఞావంతుడు. మాధవుడు బంగారు వర్ణంతో చక్కని శరీర సౌష్టవం కలవాడు. బాగా పొడగరి. మాధవునికి వంపులేని తలవెంట్రుకలు పాదాల వరకు ఉంటాయి. అతనితో పరిచయమైన ఐరోపీయులంతా అతడిని చూసిన వెంటనే ఆకర్షింపబడి స్నేహితులవుతారు. మాధవుడు ఎలాంటి చెడు వ్యసనాలు లేని పరిపూర్ణ యువకుడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 3). ఇవి మాధవుడి పాత్రను పరిచయం చేస్తూ రచయిత చెప్పిన అంశాలు. ఈ అంశాలు మలయాళ సమాజంలో చదువుకున్న వర్గానికి ప్రతీకగా మాధవుడి పాత్రని ఒ. చందుమీనన్‌గారు చిత్రించారని చెప్పకనే చెబుతున్నాయి. మాధవుడి శరీరాకారాన్ని వర్ణిస్తూ అతనికి పెద్ద జుట్టు ఉందని చెప్పడం మలయాళ సమాజంలో పురుషులు పంతొమ్మిదవ శతాబ్దంలో జుట్టు పెంచుకునేవారు అని చెప్పడానికి ఒక ఉదాహరణ. మలయాళ ప్రాంత ప్రజలు కాలక్షేపం నిమిత్తం చేసేపనులు మాధవుడి పాత్ర ద్వారా తెలుపబడ్డాయి. మాధవుడు తనకు తీరిక సమయం దొరికిన సందర్భంలో తన తండ్రి ద్వారా తనకు అబ్బిన వేటకు వెళ్ళేవాడు. అంతేకాక కథకళి నృత్యాలను

చూసేవాడు. ఈ రకమైన వర్ణనలు పాత్ర ప్రవర్తన ద్వారా నాటి సామాజిక వాతావరణాన్ని పాఠకులముందు ఉంచుతున్నాయి. నవలలో మాధవుని పాత్ర ప్రవర్తించిన తీరు, ఇతర పాత్రలతో మెలిగిన తీరు కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. తరవాడు కుటుంబంలో ఉన్న ఎవ్వరు కూడా కుటుంబ పెద్దని ఎదురించలేదు. మాధవుడు మాత్రం ఎదిరించాడు. అంతే కాక తన్నుతాను సమర్థించుకుంటూ తన తల్లితో, మేనమామతో మాటల యుద్ధానికి దిగాడు. వాస్తవానికి మాధవుడిని చదివించింది ఇంటిపెద్ద పంజుమీనన్. ఆయన తలచుకుంటే మాధవునికి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టవచ్చు కానీ అలా చేయలేదు. అలా చేయడానికి ఆస్కారం ఉందని శంకరమీనన్ చెప్పగానే మాధవుడికి తత్వం బోధపడింది. వెంటనే తన కోపాన్ని తగ్గించుకొని తన కోపం వెనుక ఉన్న సత్యాన్ని తన ప్రవర్తన వెనుక ఉన్న ఆంతర్యాన్ని బయటపెట్టాడు. చిన్నడు, నేను ఇద్దరు ఒకే కుటుంబంవారం. ఇంటిపెద్ద పంజుమీనన్ నన్ను చదివిస్తారెందుకు చిన్నడిని చదివించరెందుకు అని సూటిగా అడిగే సరికి శంకరమీనన్ వద్ద సమాధానం లేకుండా పోయింది. ఇది నవల సందేశ అంశం. చందుమీనన్‌గారు తన నవల ద్వారా అందించే సందేశాలలో ప్రధాన సందేశం ఆనాటి మలయాళ 'తరవాడు' ఉమ్మడి కుటుంబాలలో దగ్గరివారిని ఒకరకంగా దూరంవారిని ఒకరకంగా చూడటం అనే వివక్ష ఉంది. ఈ వివక్ష మంచిది కాదన్నది రచయిత ఉద్దేశం. అందుకే మాధవుడు "కుమ్మినియమ్మగాని, ఆమె ఇద్దరు పిల్లలుగాని ఇక్కడ పనిమనుషులు కారు. వారిని ఎందుకని పెదమామ ఈ విధంగా ఇలా నిర్లక్ష్యం చేసి దూరంగా ఉంచడం. ఆమె ఇద్దరి పిల్లలకు ఇంగ్లీషు చదువు చదివించలేదు. కళ్యాణకుట్టికి కూడా కావలసిన చదువు ఇవ్వలేదు. వీరు చేస్తున్నది ఎంతో కష్టంగా ఉంది. ఇలా వంచన చేయవచ్చా!" (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 4) అని శంకరమీనన్‌ని అడుగుతాడు. ఈ ప్రశ్నకి శంకరమీనన్ వద్దనే కాదు, నాటి మలయాళ తరవాడు కుటుంబ పెద్దల వద్ద కూడా సమాధానం లేదు. దీని ద్వారా తరవాడు ఇంటి పెద్ద ఆలోచన దోరణి మారాలని రచయిత ఆంతర్యం. ఇలా అనేక సామాజిక సమస్యలకి ప్రతీకగా మాధవుడి పాత్ర రూపుదిద్దుకుంది.

చిన్నడిని చదివించాలన్నది మాధవుని మనసులోని మొదటి అభిమతం కాగా ఎలాగైనా ఇందులేఖని వివాహం చేసుకోవాలన్నది రెండవ అభిమతం. ఈ రెండు అభిప్రాయాల కేంద్రంగా మొదటి రెండు అధ్యాయాలలో మాధవుని పాత్ర ప్రవర్తన చిత్రితమైంది. యువకుడైన మాధవుడు ఇందులేఖని ప్రేమించడం, పెళ్ళి చేసుకోవాలనుకోవడం అతని వైయక్తిక సమస్య. చిన్నడిని

విద్యావంతుడిని చేయాలన్నది తరవాడు కుటుంబంలో ఉన్న ఉమ్మడి సామాజిక సమస్య. మాధవుడు తాను ఇష్టపడ్డ ఇందులేఖ తనకు దక్కాలంటే మొదట తన ప్రేమని ఇందులేఖ ముందు వ్యక్తీకరించాలి. ఆ ప్రేమని ఇందులేఖ ఒప్పుకోవాలి. ఆ తరువాత ఆమెని పెళ్ళి చేసుకోవాలి. ఈ అన్ని సంఘటనల సమాహారంగా మాధవుని ప్రవర్తన ఉంటుంది. తన ప్రేమని వ్యక్తీకరించే ప్రయత్నంలో ఇందులేఖతో మాట్లాడుతాడు, సంభాషిస్తాడు, ఆటలాడుతాడు రోజంతా ఆమెతోనే ఉంటాడు. మాధవుడు తన ప్రవర్తన ద్వారా పరోక్షంగా తన ప్రేమని ఇందులేఖ వద్ద వ్యక్తీకరిస్తాడు. మాధవుని ప్రేమ తిరస్కరణకి గురౌతుంది. తన ప్రేమ వైఫల్యానికి కారణాలను అన్వేషించే క్రమంలో 'తరవాడు' సంప్రదాయంలో వివాహ విషయంలో స్త్రీకి స్వేచ్ఛ ఉన్నందు వల్లే ఇందులేఖ తన ప్రేమని ఒప్పుకోవడం లేదనే అభిప్రాయానికి వస్తాడు. దీనితో మాధవుడి వైయక్తిక ప్రేమ సమస్య కాస్త తరవాడు కుటుంబంలో స్త్రీలకు స్వేచ్ఛా అవసరమా? వద్దా? అనే సామాజిక సమస్యగా మారుతుంది. నిజానికి చదువుకున్న వ్యక్తిగా మాధవుడు స్త్రీ స్వేచ్ఛని అంగీకరించాలి. ఇందులేఖ తనకన్నా డబ్బు ఉన్నవారిని పెళ్ళిచేసుకున్నా తప్పులేదు అనుకొని ఊరుకోవాలి. కాని ఇందులేఖపై ఉన్న మోహం, ఎలాగైనా తన ప్రేమని గెలిపించు కోవాలన్న తపన అతని ప్రవర్తనలో మార్పుకు కారణమయ్యాయి. తనను కాదని ఇందులేఖ ఇంకొకరిని ఎలా పెళ్ళి చేసుకుంటుంది అని ఆవేశానికి లోనౌతాడు. ఇందులేఖను పెళ్ళి చేసుకునేవారి అంతు చూస్తానని ప్రగల్భాలు పలుకుతాడు. ఈ ఆవేశంతోనే ఇందులేఖ వద్దకు వెళ్లి "మలయాళ దేశంలో స్త్రీలు మిగిలిన దేశంలోని స్త్రీలవలే పతివ్రతాధర్మాన్ని అనుసరించడంలేదు. భర్తలను తమకు ఇష్టం వచ్చినట్లు ఎన్నుకోవడం, నిరాకరించడం చేస్తారు. అంతేకాక వీరికి ఎన్నో స్వేచ్ఛా స్వాతంత్రాలు ఉన్నాయి. అందువల్ల మలయాళ స్త్రీలకు గర్వం చాలా ఉంటుందని నేను చెబుతున్నాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 37) అంటాడు. ఆంగ్ల విద్యను నేర్చిన వ్యక్తి, ఆ రోజుల్లో బి.ఎల్. చదువుతున్న వ్యక్తి, మలయాళ స్త్రీల గురించి ఇలా అదుపు తప్పి మాట్లాడటం కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇక్కడ మాధవని ప్రేమ నిరాకరణకు గురైందా లేదా సఫలమైందా అన్నది పాత్రాగత అంశం కాని తన ప్రేమ నిరాకరణకి గురైన సందర్భంలో మాధవుడు పలికిన పై వాక్యాలు మాత్రం పాత్రాగతం కాదు. సామాజికం. ఈ వాక్యాలు ఆనాటి కాలంలో చదువుకున్న వ్యక్తులలో కూడా తరవాడు స్త్రీలపై ఉన్న చిన్నచూపుకు నిదర్శనం. ఎందుకంటే మాధవుడు చదువుకున్నవాడు. అందునా తరవాడు కుటుబ సభ్యుడు. అతని ద్వారా ఈ మాటలు పలకబడ్డాయి. ఈ మాటల ఆంతర్యం ఏమిటి అని ఆలోచిస్తే ఈ మాటలు మాధవుడు పలకలేదు చందుమీనన్ గారు మాధవుని చేత

పలికించారు. చదువుకున్న వర్గం తరవాడు స్త్రీలను ఎలా చూస్తుందో చెప్పాలనుకున్న చందుమీనన్‌గారి ఆంతర్యం ఇలా మాధవుని ఆవేశం రూపంలో బయటపడింది. ఇలా చందుమీనన్‌గారు పాత్రగత ఆవేశాన్ని తన ఆంతర్యానికి అనుగుణంగా వాడుకొని సామాజిక సమస్యని ప్రకటించారు. మలయాళ స్త్రీలు ఇష్టం వచ్చినట్లు భర్తలను ఎన్నుకుంటున్నారా? నిజంగా వారు పతివ్రతా ధర్మాన్ని పాటించడం లేదా? అన్న ప్రశ్నలకి మలయాళ ప్రాంతంలో తరవాడు కుటుంబంపై చెడు అభిప్రాయాన్ని కలిగి ఉన్న చదువుకున్న వర్గానికి చెంపపెట్టుగా ఇందులెఖ మాధవునికి సమాధానం చెబుతుంది. "మీరు మగవారు ఆత్మవిశ్వాసంతో ఉంటే స్వజాతి స్త్రీలను ఇలా అవమానించడానికి నోరు వస్తుందా? ఒక వ్యక్తికి పతివ్రతాధర్మం కొంచెం కూడా లోపల లేకుండా మిగిలిన పురుషులతో పలు విధాలుగా మాట్లాడటం, పరిచయం, స్వతంత్రం మొదలైన అవకాశాలు ఏర్పడవచ్చు. అలా మాట్లాడటం, కలిసి మెలిసి ఉండటం ఇవంతా వ్యభిచారామనే ఒక భావనలో ఆలోచించి అనవసరంగా కేరళ స్త్రీలను అవమానించే బుద్ధిహీనుల జాబితాలో మాధవుడు చేరి పోవడం నాకు చాలా ఆశ్వర్యంగా ఉంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 38). ఈ ఇందులేఖ సమాధానంతో మాధవుని అంతరంగిక కల్లోలం తగ్గి తిరిగి ఇందులేఖ వద్ద తన ప్రేమని వ్యక్తపరుస్తాడు. ఇందులేఖ తన ప్రేమని అంగీకరించిన సందర్భంలో ఆనందపడతాడు. ఎలాగైనా ఉద్యోగం సంపాదించి ఇందులేఖని వివాహం చేసుకోవాలని మనస్సులో నిర్ణయించుకుంటాడు. మాధవుడు మద్రాసుకు బయలుదేరే సందర్భంలో ఇందులేఖ తాను కూడా మాధవునితో పాటు వస్తానంటే మాధవుడు వద్దంటాడు. తనకు భార్యను పోషించే స్థాయి లేదని, మద్రాసులో ఉద్యోగం వచ్చిన తరువాత తానే పంజుమీనన్‌ని ఒప్పించి వివాహం చేసుకుంటానని ఇందులేఖకు నచ్చజెప్పుతాడు. ఇది పరిణతి చెందిన మాధవుని మనఃప్రవృత్తికి నిదర్శనం. మాధవుడు తాను మద్రాసుకు వెళ్ళే సందర్భంలో తనతోపాటు తమ దూరపు బంధువు చిన్నడిని కూడా మద్రాసుకు తీసుకువెళ్తాడు. ఈ సంగతి తెలిసి పంజుమీనన్ మాధవునికి ఇందులేఖను ఇచ్చి వివాహం చేయనని శపథం చేస్తాడు. ఈ శపథాన్ని గురించి తెలిసి మాధవుడు బాధ పడతాడు. ఉద్యోగం నిమిత్తం మాద్రాసుకు వెళ్లిన మాధవుడు అక్కడ ఉద్యోగం సంపాదించి ఇందులేఖని వివాహం చేసుకోవడానికి ఇంటికివస్తాడు. మార్గ మధ్యమంలో రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు ఇందులేఖకి నంబూద్రిపాదుతో వివాహం జరిగిపోయిందని మాట్లాడుకుంటుంటే విని ఆశ్చర్యపోతాడు. ఇందులేఖ ఇలా ఎందుకు ప్రవర్తించిందని మానసిక సంఘర్షణకి లోనౌతాడు. తనస్నేహితుడు

శంకరశాస్త్రి చెప్పిన మాటలు నమ్మి ఇందులేఖ తనకు ఇక లేదని బాధతో ఇంట్లో వాళ్ళకు చెప్పకుండా ఉత్తర భారతదేశ యాత్రకు వెళ్తాడు. ఈ రకమైన మాధవుని ప్రవర్తన వల్ల మాధవుని తండ్రి గోవింద పణిక్కర్, మాధవుని తల్లి పార్వతియమ్మ, ఇందులేఖ, గోవిందకుట్టిమీనన్ అందరూ బాధపడతారు. ఉత్తర భారతదేశ యాత్రలో ఉన్న సందర్భంలో బాబూగోవిందసేన్ అనే వ్యాపారస్థుడితో మాధవునికి స్నేహం ఏర్పడుతుంది. బాబూగోవిందసేన్ అందించిన ఆర్థిక సహాయం వల్ల ఉత్తరభారత యాత్రను మాధవుడు కొనసాగిస్తున్న సందర్భంలో తనని వెతుకుతూ ఇంటి నుండి వచ్చిన తన నాన్న గోవిందపణిక్కర్, మావయ్య గోవిందకుట్టిమీనన్‌లను మాధవుడు బొంబాయిలో కలుసుకుంటాడు. వారి ద్వారా ఇందులేఖ వివాహం సూరి నంబూద్రిపాడుతో జరగలేదని తెలుసుకుని సంతోషిస్తాడు. తొందరపాటువల్ల తాను తీసుకున్న నిర్ణయానికి చింతిస్తాడు. ఇంటికి వెళ్లిన తరువాత తన కుటుంబ సభ్యులను కలుసుకొని ఇందులేఖని వివాహం చేసుకుంటాడు. బాగా చదువుకుని ప్రశ్నించే తత్వం కలిగిన తరవాడు కుటుంబ సభ్యుల ప్రవర్తనకు ప్రతీకగా మాధవుని పాత్రను ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు.

### 4.1.1.2. పంజుమీనన్

ఇందులేఖ నవలలో పంజుమీనన్ పాత్ర నవల మూడవ భాగంలో రంగప్రవేశం చేస్తుంది. ఈ పాత్ర నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు ప్రాచీన మలయాళ సంప్రదాయాలకు కట్టుబడి ఉంటుంది. పాత మలయాళ సంప్రదాయాలకు ప్రతీకగా పంజుమీనన్ పాత్రని చందుమీనన్‌గారు చిత్రించారు. నవలలోని అన్ని పాత్రలు పంజుమీనన్ చుట్టూ తిరుగుతాయి. పాత్రల గమనాన్ని నిర్దేశించి అందరి గమనంలో మార్పులకు కారణమైన పాత్ర 'పంజుమీనన్'. దీనికి ప్రధాన కారణం 'తరవాడు' సంప్రదాయంలో ఇంటి పెద్దకి ఇచ్చిన గౌరవం, మర్యాద. తరవాడు సంప్రదాయానికి చెందిన 'సెంబాళియెట్టు పూవళ్ళి' అనే ఉమ్మడి కుటుంబానికి పెద్ద పంజుమీనన్. కాబట్టి ఈయన చెప్పినట్టే అందరూ నడుచు కోవాలి. అదే ఆచారం, కట్టుబాటు. ఈ ఆచారం, కట్టుబాటుకి కంకణ బద్ధుడు పంజుమీనన్. నవలలో కొన్ని పాత్రలు ఈయన పెత్తనాన్ని అంగీకరించడం, కొన్ని పాత్రలు అంగీకరించకపోవడం కనిపిస్తుంది. ఈ రెండు పరిస్థితుల మధ్య పంజుమీనన్ ప్రవర్తన మారుతూ ఉంటుంది. "ఈ కథ ప్రారంభమయ్యే కాలానికి పంజుమీనన్ గారికి వయస్సు 80 సంవత్సరాలు. మనిషి మంచి తెల్లటి రంగును కలిగి పొట్టిగాను, కొంచెం లావుగాను ఉన్నారు. వీరి సౌందర్య వర్ణన గురించి చెప్పాలంటే వీరికి బట్టతల, నోటిలో పైవరుసలో మూడు, కిందివరుసలో ఐదుపళ్ళు లేవు. కళ్ళు

రక్త వర్ణంతో కూడిన రుద్రాక్షమాల, తలమీద ఎర్రటి కంబళి టోపి, చేతిలో వెండి పొన్ను కలిగిన చేతికర్ర ఉంటాయి. పూర్వం ఉద్యోగం చేసి ఉన్నప్పటికీ ఇంగ్లీషు బొత్తిగా తెలియదు. మనసులో నిజాయితీ, దయాగుణం ఉన్నప్పటికీ జన్మతః కోపిష్ఠి. ఇప్పుడు వయసైన కారణంగానూ, వ్యాధి కారణంగానూ అన్నివేళలా కోపగుణమే నిలిచి ఉంది". (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 46). ఇవి పంజుమీనన్ పాత్రని పరిచయం చేస్తూ చందుమీనన్‌గారు చెప్పిన వాక్యాలు. పంజుమీనన్‌గారికి కోపం అధికంగా ఉన్నా తన కోపాన్ని ఎప్పుడూ ప్రత్యక్షంగా మాధవుని మీద కాని, ఇందులేఖ మీద కాని, చూపించలేదు. కారణం పంజుమీనన్‌కి మాధవుడన్నా, ఇందులేఖ అన్నా మనసులో ఇష్టం ఉండేది. అదీగాక ఇందులేఖ తన సొంత కూతురు లక్ష్మికుట్టి యమ్మకి కూతురు కాగా మాధవుడు తన సొంత సోదరి పార్వతియమ్మకు మనవడు. ఈ ఇద్దరు పంజుమీనన్‌కి దగ్గరి బంధువులు. అందుకే నెలకి యాభై రూపాయల ధనాన్ని వెచ్చించి మాధవున్ని చదివిస్తాడు. ఇందులేఖకి వ్యవహారానికి అవసరమైనంత విద్యని నేర్పిస్తాడు. కుటుంబ ఉమ్మడి సంపద నుండి తన భార్య, కుంజికుట్టియమ్మ పేరుమీద ముప్పైఅయిదు వేల రూపాయల ఆస్తిపాస్తులను కూడబెడతాడు. తాను, తన భార్య కుంజికుట్టియమ్మ కొడుకు గోవింద కుట్టిమీనన్‌తో కలిసి పూవరంగం అనే ఇంట్లో ప్రత్యేకంగా కాపురం ఉంటాడు. కుటుంబంలోని మిగిలిన వారి కోసం పూవళ్ళి అనే రెండు మూడు అంతస్థుల ఇంటిని ప్రత్యేకంగా కట్టిస్తాడు. ఈ అంశాలు ఇంటి పెద్ద స్థానంలో ఉన్న పంజుమీనన్ ఉమ్మడి కుటుంబంలో తన దగ్గరి వారిని ఒక రకంగా దూరపు బంధువులని ఇంకో రకంగా చూశాడనడానికి నిదర్శనం. ఈ రకమైన వివక్ష పంతొమ్మిదవ శతాబ్దంనాటి మలయాళ తరవాడు ఉమ్మడి కుటుంబంలో సర్వసాధారణం. ఈ వివక్షని ఉమ్మడి కుటుంబ సభ్యులు ఎదిరిస్తే కుటుంబ పెద్దగా వ్యవహరించే వ్యక్తి పరిస్థితి ఎలా ఉంటుందనడానికి నిదర్శనం పంజుమీనన్ పాత్ర.

అప్పటివరకు అందరిమీద పెత్తనం చెలాయిస్తూ వచ్చిన పంజుమీనన్ చిన్నని చదువు విషయంలో మాధవుడు తనను ఎదిరించగానే ఆశ్చర్యానికి గురవుతాడు. సహజంగానే కోప స్వభావంగల పంజుమీనన్ మాధవుని ప్రవర్తన ద్వారా కోపంతో ఊగిపోతాడు. కోపంతో లక్ష్మికుట్టి వద్ద, కేశవ నంబూద్రి వద్ద మాధవున్ని తిడతాడు. ఆంగ్ల విద్యని అభ్యసించడం వల్లే మాధవుడు తనని ఎదిరించాడని మనసులో నిర్ణయించుకుంటాడు. మాధవుడిని ఏమి అనలేక తనకు దూరపు బంధువులైన కుమ్మినియమ్మ కొడుకు సాత్తరమీనన్‌న్ని తిడతాడు. కుమ్మినియమ్మ

రెండో కొడుకు గోపాలుడిని కొడతాడు. ఇందులేఖను మాధవునికి ఇచ్చేది లేదని తీర్మానిస్తాడు. కేశవ నంబూద్రిని పిలిచి ఇందులేఖను చేసుకోవడానికి నంబూద్రిపాదును తన ఇంటికి పిలిపించమని చెప్తాడు. మాధవుని తండ్రి గోవిందపణిక్కర్ వద్దకు వెళ్లి మాధవునికి ధనసహాయం చేయవద్దని చెప్తాడు. ఇలా మాధవున్ని అన్ని వైపుల నుండి కట్టడి చేయడం వల్ల అతను తన దారికి వస్తాడని పంజుమీనన్ తన మనసులో అనుకుంటాడు. తాను అనుకున్న విషయాన్ని ఇందులేఖ తల్లి లక్ష్మికుట్టియమ్మ వద్ద చెప్తాడు. ఎట్టి పరిస్థితుల్లోను ఇందులేఖను మాధవునికి ఇవ్వనని తీర్మానిస్తాడు. ఈ శపథం చేస్తున్న సందర్భంలో ఇందులేఖ మాధవుని ప్రేమను గుర్తుకు తెచ్చుకొని తన శపథం నెరవేరదేమోనని మనసులో భయపడతాడు. అయినా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ 'మూర్కిల్లాద నంబూద్రిపాదు'కు ఇందులేఖని ఇచ్చి వివాహం చేసే ఉద్దేశంతో అతన్ని తన ఇంటికి ఆహ్వానిస్తాడు. నంబూద్రిపాదు ధనవంతుడు కాబట్టి ఇందులేఖ అతన్ని చూడగానే ఇష్ట పడుతుందని అనుకుంటాడు. మలయాళ తరవాడు సంప్రదాయం ప్రకారం తరవాడు ఇంట్లో ఉన్న స్త్రీలకు వివాహాలు జరుగుతాయి. ఇంటిపెద్ద నిర్ణయించిన వరున్ని దాదాపుగ ఇంట్లోని స్త్రీలు తిరస్కరించరు. కాని ఇందులేఖ చదువుకొని ఉండటం, అప్పటికే మాధవుడు తనని ఎదిరించడం వల్ల ఎక్కడ ఇందులేఖ కూడా మాధవుని మాదిరిగా తనను ఎదిరిస్తుందో అని భయపడ్డ పంజుమీనన్ నంబూద్రిపాదుతో ఇందులేఖకు తాను ఏర్పాటు చేయబోయేపెళ్ళి గురించి ఆమె వద్ద పరోక్షంగా ప్రస్తావిస్తాడు. ఇందులేఖ పంజుమీనన్ అభిప్రాయాన్ని తిరస్కరిస్తుంది. వివాహం నిశ్చయించిన తరువాత తన వద్ద దానిని గురించిన అభిప్రాయం అడగడం సమంజసం కాదని ఇందులేఖ చెప్పిన సమాధానాన్ని విని పంజుమీనన్ నివ్వెరపోతాడు. అందరి వద్ద కోపంగా మాట్లాడిన పంజుమీనన్ ఇందులేఖ తన అభిప్రాయాన్ని ఎదురించినా ఏమి అనడు. చదువుకున్న ఇందులేఖ అంటే పంజుమీనన్‌కి లోలోపల భయం, ప్రేమ రెండూ ఉంటాయి. అందుకే ఇందులేఖని ఏమీ అనలేక పోతాడు. కేశవ నంబూద్రి సూరినంబూద్రిపాదు ఐశ్వర్యాన్ని గురించి చెబితే విని పంజుమీనన్ ఆశ్చర్యపోతాడు. కాని ఇందులేఖ నంబూద్రిపాదును తిరస్కరిస్తే తన పరిస్థితి ఏంటని భయపడతాడు. తనకు ఇష్టంలేని వ్యక్తితో ఇందులేఖకు పెళ్ళి ఎలా చేయాలని బాధపడతాడు. ఒక పక్క తాను చేసిన శపథం ఇంకో పక్క తనకు ఇష్టమైన ఇందులేఖ బాధపడుతుందేమోనని సందేహం, ఈ మానసిక సంఘర్షణ నుండి బయటపడే క్రమంలో పంజుమీనన్ ఇందులేఖకి ఇష్టంలేకుండా ఆమెను సూరినంబూద్రిపాదుకి ఇవ్వనని తీర్మానించుకుంటాడు. తన తీర్మానాన్ని కేశవ నంబూద్రికి

చెప్తాడు. మాధవునికి ఇందులేఖను ఇవ్వనని నేను శపథం చేశాను. కానీ నంబూద్రిపాదుకు ఇస్తానని శపథం చేయలేదు. నంబూద్రిపాదుకు సాధ్యమైతే ఇందులేఖ భార్యగా దక్కుతుంది అంటూ మధ్యేమార్గంగా నంబూద్రిపాదు విషయంలో పంజుమీనన్ ప్రవర్తిస్తాడు. కేశవ నంబూద్రి మాటల ఆధారంగా సూరినంబూద్రిపాదుపై తన మనసులో మంచి అభిప్రాయాన్ని ఏర్పర్చుకున్న పంజుమీనన్ తన ఇంటికి వచ్చిన సూరినంబూద్రిపై అమిత గౌరవ, మర్యాదలను ప్రదర్శిస్తాడు. సూరినంబూద్రిపాదు ఇందులేఖతో పాటు ఆమె తల్లిని కూడా మోహిస్తున్నాడని తెలిసి పంజుమీనన్ నంబూద్రిపాదుపై తనకున్న అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. సంబూద్రిపాదు శుద్ధ అప్రయోజకుడనే అభిప్రాయానికి వస్తాడు. ఇందులేఖ ఎట్టి పరిస్థితుల్లోను నంబూద్రిపాదును ఇష్టపడదనే నిర్ణయానికి వస్తాడు.

పంజుమీనన్ అనుకున్నట్లుగానే ఇందులేఖ సూరినంబూద్రిని వివాహం చేసుకోవడానికి తిరస్కరిస్తుంది. ఈ విషయం సూరినంబూద్రి పంజుమీనన్ వద్ద చెప్పి తనకి కళ్యాణకుట్టితో వివాహం జరిపించమని కోరుకుంటాడు. సూరినంబూద్రి కోరిక విని పంజుమీనన్ ఆశ్చర్యపోతాడు. కళ్యాణకుట్టికి ఇలాంటి సంబంధం రావడం ఆమె అదృష్టంగా భావించి కళ్యాణకుట్టితో మాటమాత్రం కూడా చెప్పకుండా ఇంటి పెద్దగా పంజుమీనన్ కళ్యాణకుట్టి వివాహాన్ని సూరినంబూద్రిపాదుతో నిశ్చయిస్తాడు. అంతేకాక కళ్యాణకుట్టికి ఇలాంటి సంబంధం రావడం వల్ల తమ కుటుంబ మర్యాద పెరిగిందని భావిస్తాడు. ఈ సంఘటన 'తరవాడు' సంప్రదాయంలోని ఇంటిపెద్దలు దూరపు బంధువులపై చూపిన వివక్షకి నిదర్శనం. మాధవుడు దేశసంచారానికి వెళ్లిన సందర్భంలో ఇందులేఖ మాధవుని మీద ఉన్న ప్రేమ కారణంగా అస్వస్థతకి గురౌతుంది. ఇందులేఖ బాధను చూడలేక పంజుమీనన్ తన శపథాన్ని వెనక్కి తీసుకుంటాడు. శపథానికి తగిన ప్రాయశ్చిత్తం చేస్తాడు. మాధవునిపై తనకున్న కోపాన్ని తగ్గించుకుంటాడు. ఇందులేఖ, మాధవుల వివాహాన్ని జరిపిస్తాడు. ఇలా నవల ఆసాంతం కోప స్వభావం కలిగిన 'తరవాడు' ఇంటిపెద్ద ప్రవర్తనకు నిదర్శనంగా పంజుమీనన్ పాత్ర చిత్రితమైంది. ముందు కోపగించడం, తరువాత ఆలోచించడం వంటి ప్రవర్తన పంజుమీనన్‌లో కన్పిస్తుంది. నవల ప్రారంభం నుండి అంతం వరకు పంజుమీనన్ తన దగ్గరి బంధువులపై ఆశ్రిత పక్షపాతాన్ని చూపిస్తాడు. ఇది పంతొమ్మిదవ శతాబ్దం నాటి తరవాడు కుటుంబపెద్దల వాస్తవ ప్రవర్తనకు నిదర్శనం. మొదట మాధవుని ప్రవర్తనపై మంచి అభిప్రాయం కలిగి ఉన్న

పంజుమీనన్ కాలక్రమంలో తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. నవల చివరలో ఇందులేఖ మాధవునికోసం బాధపడటం చూసి మళ్ళీ మాధవునిపై మంచి అభిప్రాయాన్ని ఏర్పర్చుకుంటాడు. సూరి నంబూద్రిపాడుపై మంచి అభిప్రాయం కలిగి ఉన్న పంజుమీనన్ అతని ప్రవర్తన చూసి తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఇలా వాస్తవిక సంఘటనల ఆధారంగా పంజుమీనన్ తన మనసును మార్చుకోవడం ఇందులేఖ నవలలో కన్పిస్తుంది. ఈ రకమైన ప్రవర్తన కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా 'తరవాడు' ఇంటిపెద్దలతో రావాల్సిన ప్రవర్తన మార్పులను సూచిస్తుంది.

### 4.1.1.3. గోవిందన్ కుట్టి మీనన్

ఇందులేఖ నవలలో ఎనిమిదవ భాగంలో గోవిందన్ కుట్టి మీనన్ పాత్ర పరిచయం చేయబడింది. గోవిందన్ కుట్టిమీనన్ పంజుమీనన్ కొడుకు. ఇందులేఖకి మేనమామ. గోవిందన్ కుట్టిమీనన్‌కి ఇందులేఖ అంటే ఎంతో ఇష్టం. ఉద్యోగరీత్యా మద్రాసులో ఉంటున్న గోవిందన్ కుట్టిమీనన్ తన నాన్నగారైన పంజుమీనన్ ఇందులేఖని మాధవునికి కాక వేరే నంబూద్రికి ఇస్తున్నారని మాధవుడి ద్వారా తెలుసుకుంటాడు. ఈ విషయం తెలిసి ఎంతో బాధ పడతాడు. తాను ఇంటికి వెళ్లిన సందర్భంలో ఇందులేఖని ఆట పట్టిస్తాడు. ఇందులేఖ తన మనసులో మాధవున్ని ఎంత ఇష్ట పడుతుందో తెలుసుకోదలిచి 'నీవు రాత్రి కొంచెం అధికంగానే చదివినట్లు మీ అమ్మ చెప్పింది. చాలాసేపు చదివి ఆరోగ్యం పాడుచేసుకోకు' అంటాడు. దీనికి సమాధానంగా ఇందులేఖ 'నిన్న రాత్రి అనుకోకుండా నేను శాకుంతలం చదువుతున్నప్పుడు ఏదో విషయం మాట్లాడటానికని 'తాతగారు, కేశవ నంబూద్రి' నా గదిలోకి వచ్చారు. అందుకే పడుకోడానికి కాస్త ఆలస్యమైంది, అంటుంది. కేశవ నంబూద్రి, పంజుమీనన్ ఏ విషయం గురించి ఇందులేఖతో మాట్లాడారో గోవిందన్ కుట్టిమీనన్‌కి తెలుసు. అయినా ఏమి తెలియనట్టు తాతగారు, కేశవ నంబూద్రి నీతో ఏ విషయం గురించి మాట్లాడారు అని అడుగుతాడు. అప్పుడు ఇందులేఖకి ఏమి చెప్పాలో తెలియక ఏడుస్తుంది. అప్పుడు గోవిందన్ కుట్టిమీనన్ 'ఏమిటిది? ఇంత అమాయకురాలివా నీవు! ఎగతాళిచేస్తే నవ్వాలికదా! నీవెందుకు ఏడుపు ముఖం పెట్టావు. తరువాత కూడా ఏడిస్తే నేను దీనిని గురించి ఏదీ అడగబోను' అంటాడు. ఈ వాక్యాలు మామ కోడళ్ళ పరిహాసానికి నిదర్శనం. మలయాళ ప్రాంతంలో తరవాడు కుటుంబంలోని మేనమామ,

కోడళ్ళ సంబంధ బాంధవ్యాలకు నిదర్శనంగా గోవిందన్ కుట్టిమీనన్ పాత్రను చందుమీనన్‌గారు చిత్రించారు.

### 4.1.1.4. సాత్తరమీనన్

సాత్తరమీనన్ మాటలతో ఇందులేఖ నవల ప్రారంభమవుతుంది. ఈ సాత్తరమీనన్ పంజుమీనన్‌గారికి తల్లి తరుపు బంధువు. పంజుమీనన్‌గారి అమ్మమ్మ చెల్లెలి మనుమరాలి కొడుకు. మాధవుడు సాత్తరమీనన్ తమ్ముడు ‘చిన్నడిని’ (9 సంవత్సరాలు) పట్టణం తీసుకువెళ్ళి ఇంగ్లీషు విద్యను చదివిస్తానంటే సాత్తరమీనన్ అడ్డుకుంటాడు. “మాధవా! మాటలను చాలా వేగంగా విసురుతున్నావే ఛీ!ఛీ! ఇదేం బాగాలేదు. ఆయన మనసుకు నచ్చినట్లు చేయని’ అంటూ మాధవుడిని అడ్డుకొని పంజుమీనన్‌ని సమర్థిస్తాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016:1). మలయాళ తరవాడు ఉమ్మడి కుటుంబంలో దూరపు బంధువుల మనస్తత్వానికి ప్రతీకగా సాత్తరమీనన్ పాత్రని ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు. మాధవుడు చిన్నడిని మద్రాసుకు తీసుకువెళ్లిన సందర్భంలో పంజుమీనన్ సాత్తరమీనన్‌ని విపరీతంగా తిడతాడు. సాత్తరమీనన్ ఆ తిట్లని భరిస్తాడు. పంజుమీనన్‌కి ఎదురుచెప్పడు. పంజుమీనన్ కోపంతో సాత్తరమీనన్ని ఇకపై తన పొలంలో పనిచేయవద్దని ఆజ్ఞాపిస్తాడు. అందుకు కూడా సాత్తరమీనన్ ఒప్పుకుంటాడు. ఈ క్రియలన్నీ మలయాళ తరవాడు సంప్రదాయంలో ఇంటిపెద్ద దూరపు బంధువులపై చూపిన వివక్షకి నిదర్శనం. సాత్తరమీనన్ తనని ఇంటిపెద్ద పంజుమీనన్ ఎన్ని బాధలు పెట్టినా భరిస్తాడు. తన మనుగడకి, జీవనానికి ఇంటిపెద్ద పంజుమీనన్ ఆధారమనే స్థిరమైన అభిప్రాయాన్ని కలిగి ఉంటాడు. అందుకే పంజుమీనన్ ఎన్ని రకాలుగా తనని ఇబ్బంది పెట్టినా వాటన్నిటినీ భరిస్తాడు. ఇందులేఖని పెళ్ళిచేసుకోవడానికి వచ్చిన నంబూద్రిపాడును చూసి ఈ జన్మలో మాధవునికి ఇందులేఖ దక్కదని అనుకుంటాడు. నంబూద్రిపాడు ధనాన్ని చూసి సాత్తరమీనన్ ఆశ్చర్య పోతాడు. ఇదంతా ఇంటి పెద్ద పంజుమీనన్ ప్రణాళిక అని మనసులో అనుకుంటాడు. ఇలా నవల ఆసాంతం ఇంటి పెద్ద నిర్ణయాలకు కట్టుబడి నడుచుకున్న తరవాడు కుటుంబ సభ్యుని ప్రవర్తనకి నిదర్శనంగా సాత్తరమీనన్ పాత్ర ప్రవర్తన చిత్రితమైంది.

### 4. 1.1.5. శంకరమీనన్

పంజుమీనన్ సోదరుడు శంకరమీనన్. శంకరమీనన్ మాధవునికి మేనమామ. తన అన్న పంజుమీనన్ మాటకి కట్టుబడి ఉండే మనస్తత్వంగల వ్యక్తి శంకరమీనన్. మాధవుడు తన

అన్న పంజుమీనన్‌ని ఎదిరించాడని తెలియగానే శంకరమీనన్ అతన్ని పిలిచి పెద్దవారి మాటలని నీవు గౌరవించాలని అతనితో అంటాడు. అంతేగాక పంజుమీనన్‌ని ఎదిరించే ధైర్యం మాధవునికి ఇంగ్లీషు విద్య వల్ల వచ్చిందని నమ్ముతాడు. తరవాడు కుటుంబంలో ఇంటిపెద్ద ఆజ్ఞని పాటించే పాత్రగా శంకరమీనన్ పాత్ర చిత్రితమైంది. ఇంటిపెద్ద పంజుమీనన్ పక్కనే ఉంటూ అనేక సందర్భాలలో అతని ఆవేశాన్ని శంకరమీనన్ తగ్గిస్తాడు. పంజుమీనన్ తనని ఎదిరించిన గోపాలుడిని, శీనుభట్టరుని కొట్టడానికి సన్నద్ధమైన సందర్భంలో శంకరమీనన్ పంజుమీనన్‌న్ని అడ్డుకుంటాడు. ఈ రోజుల్లో పిల్లలతో అధికంగా మాట్లాడక పోవడమే మంచిది అంటూ పంజుమీనన్‌కి హితవు చెప్తాడు. గోపాలుడిని కొట్టే క్రమంలో పంజుమీనన్ కాలుజారి కిందపడగా శంకరమీనన్ పంజుమీనన్‌కి సపర్యలు చేస్తాడు. పంజుమీనన్ ఆవేశాన్ని తగ్గిస్తాడు. పంజుమీనన్ మాధవుని చర్యవల్ల బాధపడుతూ మాధవున్ని ఏమీ అనలేక మాధవుని తండ్రి గోవింద ఫణిక్కర్‌ని తిడుతున్న సందర్భంలో శంకరమీనన్ పంజుమీనన్ కోపం తగ్గించే ప్రయత్నం చేస్తాడు. పంజుమీనన్ శంకరమీనన్‌ని నమ్ముతాడు. ఇంటి వ్యవహారాలు శంకరమీనన్‌తో పంచుకుంటాడు. తరవాడు పొలం పనులను చూసుకునే బాధ్యతను పంజుమీనన్ శంకరమీనన్‌కి అప్పగిస్తాడు. ఈ అంశాలు తరవాడు ఇంటిపెద్ద తన దగ్గరి బంధువులపై చూపిన ప్రేమకి నిదర్శనం. శంకరమీనన్ తన అన్న పంజుమీనన్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఏనాడు ఒమ్ము చేయలేదు. పంజుమీనన్ తనకి అప్పగించిన పొలం పనులను శంకరమీనన్ సక్రమంగా నిర్వహిస్తాడు. నంబూద్రిపాదు ఇందులేఖను కాక కణ్యాణకుట్టిని వివాహం చేసుకుంటానని పంజుమీనన్‌తో చెప్పిన సందర్భంలో పంజుమీనన్ ఈ విషయాన్ని శంకరమీనన్‌తో పంచుకుంటాడు. ఈ సంఘటన తరవాడు కుటుంబ విషయాలలో పంజుమీనన్ శంకరమీనన్‌కి ఇచ్చిన ప్రాముఖ్యతకి నిదర్శనం. పంజుమీనన్ అభిప్రాయం ప్రకారం నడుచుకునే తత్వం కలిగిన శంకరమీనన్ పంజుమీనన్ అభిప్రాయం ప్రకారం నంబూద్రిపాదు, కళ్యాణకుట్టిల వివాహం జరగడానికి సహకరిస్తాడు. మాధవుడు ఇంటి నుండి వెళ్లిపోయిన సందర్భంలో బాధ పడతాడు. మాధవుని తల్లి, తన సోదరి అయిన పార్వతియమ్మకి, మాధవునికి ఏమీకాదని ధైర్యం చెప్తాడు. మాధవుడు ఎక్కడున్నా తానే వెతికి పదిరోజుల్లో అతన్ని ఇంటికి తీసుకువస్తానని పార్వతియమ్మకి మాటిస్తాడు. గోవిందపణిక్కర్, గోవిందకుట్టిమీనన్ మాధవుడిని వెతకడానికి తాము వెళ్తామని చెప్పగా శంకరమీనన్ ఇంటిల్లిపాదికి రక్షణగా నిలబడతాడు. ఇలా నవల ఆసాంతం పంజుమీనన్‌కి అండగా నిలిచిన వ్యక్తిగా, పంజుమీనన్

తరువాత కుటుంబ బాగోగులను చూసుకున్న వ్యక్తిగా శంకరమీనన్ పాత్ర చిత్రితమైంది. మలయాళ తరవాడు సంప్రదాయంలో ఇంటి పెద్దకి చేదోడు వాదోడుగా ఉంటూ, అతనికి కుటుంబ వ్యవహారాలలో సహాయ, సహకారాలు అందించిన వ్యక్తుల ప్రవర్తనకి నిదర్శనంగా శంకరమీనన్ పాత్ర ప్రవర్తన చిత్రితమైంది.

### 4.1.1.6. కృష్ణమీనన్

కృష్ణమీనన్ పంజుమీనన్ గారి కుమారుడు. ఈయన దివాన్ పేష్కార్‌లో ఉద్యోగి. ఇతని జీతం 800 రూపాయలు. ఇందులేఖ తండ్రి చనిపోయిన తరువాత ఆమెను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించాడు. యువతులు అన్ని విద్యలు నేర్చి పరిపూర్ణంగా ఎదిగిన తరువాత వివాహం చేయాలనే విశాల హృదయం కలవాడు కృష్ణమీనన్. తాను అనుకున్నట్టే తన మేనకోడలు ఇందులేఖను చదివించాడు. అన్ని విద్యలు నేర్చుకునే సమయానికి ఇందులేఖ వయస్సు పదహారు సంవత్సరాలు. అప్పటికే అందరూ ఇందులేఖకి వివాహం చేయండని చెబుతున్నా కృష్ణమీనన్ మాత్రం "ఇంకా ఇందులేఖ విద్యాభ్యాసం పూర్తికాలేదని అది పూర్తయిన తరువాత పెళ్ళి ఆలోచన చేయడం ఆవశ్యమనీ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి అర్హురాలైన యువతిగా చేయవలసిన భారం తనపై ఉన్నదని, ఆ తర్వాత తనకు కలిగినపుడు ఇందులేఖ తనకు తాను స్వయంగా కావలసినవాణ్ణి తన అభీష్టం ప్రకారం చేసుకోగలదని" చెప్పేవారు (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 13) ఇది కృష్ణమీనన్‌లోని అభ్యుదయ భావాలకు నిదర్శనం. ఇందులేఖకి 16 సంవత్సరాల వయస్సు రాగానే కృష్ణమీనన్ మరణించాడు. ఈ పాత్ర పంతొమ్మిదవ శతాబ్దంలో మలయాళ ప్రాంతంలోని అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తులకు నిదర్శనం.

### 4.1.1.7. కణ్ణళి సూరి నంబూద్రిపాడు

మలయాళ ప్రాంతంలోని చపలబుద్ధి కలిగిన, స్త్రీలోలులైన నంబూద్రిలకు ప్రతీకగా కణ్ణళి సూరి నంబూద్రిపాడు పాత్రని ఒ.చందుమీనన్ గారు చిత్రించారు. ఇందులేఖ నవలలోని ఏడవ భాగంలో కణ్ణళి సూరి నంబూద్రిపాడుపాత్ర రంగవేశం చేస్తుంది. ఈ పాత్ర ప్రవేశానికి కావలసిన వాతావరణం అంతకు ముందరి నవల కథలో చేయబడింది. ఇందులేఖని మాధవునికికాక వేరే నంబూద్రికి ఇచ్చి వివాహం చేయాలని పంజుమీనన్ నిశ్చయించినపుడు ఆయనకి కనిపించిన వ్యక్తి కణ్ణళిసూరి నంబూద్రిపాడు. ఈ నంబూద్రిపాడు ఇందులేఖ తండ్రి కేశవ నంబూద్రికి

స్నేహితుడు. ఈ కేశవ నంబూద్రి కణ్ణళిసూరి నంబూద్రి తనకి బాగా తెలుసని అతను గొప్ప ధనవంతుడు, అందగాడిని పంజుమీనన్‌కి చెప్తాడు. ఈ విధంగా కణ్ణళిసూరి నంబూద్రి పాత్రగత పరిచయం కేశవ నంబూద్రి ద్వారా జరిగింది. నవల రచించే కాలానికి నంబూద్రిలు మలయాళ ప్రాంతంలో మిక్కిలి ధనవంతులు. ఆస్తిపాస్తులు ఉన్నవారు. ఈ నంబూద్రిలకు నాయర్ స్త్రీలతో సంబంధం ఏర్పర్చుకోవడానికి అవకాశం ఉండేది. ఆ సంబంధాన్ని ఎవరూ కదనేవారుకాదు. పంతొమ్మిదవ శతాబ్దంలో ఆంగ్లేయ విద్య మలయాళ ప్రాంతంలో ప్రవేశించిన తరువాత కొంత పరిస్థితి మారింది. భారతీయులతోపాటు ఆంగ్లేయులు మద్రాసువంటి ప్రాంతాలలో నివసించడం ప్రారంభించారు. వారు స్త్రీలను చూసే దృష్టిలోను, నంబూద్రిలు స్త్రీలను చూసే దృష్టిలోను తేడా ఏర్పడింది. ఒక వేళ ఆంగ్లేయ విద్య భారత స్త్రీలకు కూడా అందితే అందులోను నాయర్ స్త్రీలకు అందితే వారిలో ఏ రకమైన మార్పు వస్తుంది? అలాంటి నాయర్ స్త్రీలతో సంబంధం ఏర్పర్చుకునే విషయంలో నంబూద్రిలు ఎలా ప్రవర్తిస్తారు? నంబూద్రిలకు సమాజంలో గౌరవం వారి ప్రవర్తనలవల్ల వచ్చిందా? లేదా? వారి డబ్బువల్ల వచ్చిందా? వంటి అన్ని ప్రశ్నలకు సమాధానంగా కణ్ణళిసూరి నంబూద్రిపాదు పాత్రను ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు.

"కణ్ణళి మూర్కిల్లాత్తమనై" కుటుంబానికి చెందినవాడు సూరి నంబూద్రిపాదు. 'కణ్ణళి మూర్కిల్లాత్తమనై' అనేది మలయాళ దేశంలో అంతటా ప్రసిద్ధమైన ఒక కుటుంబం. సంపదలో, ప్రాబల్యంలో సాటిలేనివారుగా పేరు ప్రతిష్టలు గల కుటుంబం వీరిది. ఈ కుటుంబంలో కుబేరులైన నంబూద్రిపాదులలో రెండవ వ్యక్తి సూరినంబూద్రిపాదు. అయితే పెద్ద నంబూద్రిపాదు వయోధికులుగానూ, వ్యాధిగ్రస్తులుగాను ఉన్నందువలన వారి కుటుంబ వ్యవహారాలన్నీ చూసుకోవడానికి నియమించబడినవారు మన కథలోని సూరినంబూద్రిపాదు. వీరికి ఈ కథ జరుగుతున్న కాలంలో 45 సంవత్సరాల వయస్సు ఉంటుంది. వీరు సహజంగానే పెద్ద స్త్రీలోలుడుగా ఉండేవారు. స్వంతంలో సంప్రదాయం ప్రకారం పెళ్ళి చేసుకోలేదు. వీరు చాలామంది శూద్ర అమ్మాయికి భర్తగా ఉంటూ కాలాన్ని గడుపుతూ వచ్చారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 87)

ఇవి సూరినంబూద్రిపాదును, పరిచయం చేస్తూ ఒ. చందుమీనన్‌గారు రచించిన వాక్యాలు. బాగా డబ్బున్న కుటుంబంలో సూరి నంబూద్రిపాదు పుట్టాడు. ఈ డబ్బువల్ల

నంబూద్రిలో కొన్ని అవలక్షణాలు ఏర్పడినట్లు కనిపిస్తాయి. పెళ్ళి చేసుకోకుండా స్త్రీలతో ఇష్టం వచ్చినట్లు సంబంధాలు ఏర్పర్చుకోవడం ఒక అవలక్షణం అయితే, చుట్టూ పని మనుషులను పెట్టుకొని ఎల్లప్పుడు వారిచేత పొగిడించుకోవడం రెండవ అవలక్షణం. చేతిలో డబ్బు ఉండటం వల్ల తనను ఎవ్వరూ కాదనరన్న అహం సూరినంబూద్రిలో ఉంటుంది. ఇది ఆ రోజుల్లో డబ్బుఉండి అహంతో ప్రవర్తించిన నంబూద్రిలకు ప్రతీక. సూరినంబూద్రి అంతర్గతంగా తానొక మన్మథున్ని అందగాడిని అనుకునేవాడు. ఎలాంటి స్త్రీ అయినా తనను చూస్తే మోహించవలసిందే అనుకునేవాడు. ఈ అభిప్రాయం తన మీద తనకు ఏర్పడటానికి ఇతని వద్ద ఉన్న సేరుసేరి నంబూద్రి ఒక కారణం. ఈ సేరుసేరి నంబూద్రి ఎల్లప్పుడూ సూరినంబూద్రిని పొగుడుతూ ఉండేవాడు. రాజు వద్ద ఉండే వందిమాగధులతో ఇతను సమానం. ఒక పక్క సేరుసేరి నంబూద్రి సూరినంబూద్రిని పొగడటం ఇంకో పక్క సూరినంబూద్రి భౌతిక ఆకారాన్ని వివరిస్తూ ఒ.చందుమీనన్ చెప్పిన విషయాలు రెండూ విరుద్ధంగా ఉంటాయి. "మనిషి చాలా తెల్లని రంగుతో ఉన్నప్పటికీ అందమో, ఆకర్షణో వీరి శరీరానికి కొంచెం కూడా లేదనే చెప్పాలి. అయితే కురూపి అని చెప్పడానికి లేదు. వీరిని పోలిన దేహం కలవారు ఒక లక్ష మంది పైనా మలయాళ దేశంలో చూడవచ్చు. అవయవాల్లో ప్రశంసించి చెప్పడానికి ఏదీ లేదు. అందగాడనో వ్యతిరేకంగా అందవిహీనుడనో చెప్పడానికి లేదు. అయితే వీరి ఆకారంలోనూ, నడవడికల్లోనూ రెండు మూడు విశేషాలను గురించి చెప్పవలసి ఉంది. వీరు నవ్వుతున్నప్పుడు నోరు బుగ్గలను దాటి వాటిని కూడా మించి పోతుందేమోనని చూసేవారికి అనిపిస్తుంది. ముక్కు సరియైన కొలతలోనే సృష్టింపబడి ఉన్నప్పటికీ ఆ ముఖానికి పొసగలేదని తోస్తుంది. నడవడం చూసినప్పుడు, గెంతులు వేస్తూ కాకులు నడిచినట్లు ఉంటుంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 88). ఈ భౌతిక ఆకారం గురించి విన్న ఎవరికైనా నవ్వురాక మానదు ఇలాంటి ఆకారం కలిగిన వ్యక్తిని స్త్రీలు ఇష్టపడుతున్నారు, వారి పాలిట ఇతను మన్మథుడు అని చెప్పడం హాస్యాస్పదమే అవుతుంది. ఇలా నవ్వు పుట్టించే విధంగా సూరినంబూద్రి పాత్ర చిత్రణ జరిగింది. ఇలా జరగడానికి కారణం ఆనాటి సమాజంలో ధనవంతులైన నంబూద్రిల ప్రవర్తన ప్రధాన కారణం. ఒకపక్క పాత్ర వాస్తవ స్థితిగతుల్ని చందుమీనన్‌గారి సొంతమాటల్లో చెప్పి ఇంకోపక్క దానికి విరుద్ధమైన భావాలను నవల అంతర్గత పాత్రల ద్వారా తెలపడం వల్ల వాస్తవ పరిస్థితి పాఠకులకు ద్యోతకమవుతుంది.

సమాజంలో నంబూద్రిలకు ఇచ్చే గౌరవం వారి డబ్బువల్ల వచ్చిందేగాని వారి ప్రవర్తన వల్ల కాదు అని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. అంద విహీనంగా ఉన్న నంబూద్రిని అతనితో సంచరించే వేశ్యా స్త్రీలు అందగాడని పొగడడం ఇందుకు మరో ఉదాహరణ. సంపద ఉండటం వల్లే చెడు వ్యసనాలు కలిగిన నంబూద్రిలకు గౌరవం లభించదని చెప్పడానికి ఇంకో సాక్ష్యం. సేరుసేరి పాత్ర వర్ణనలో కనిపిస్తుంది. సేరుసేరి ఎందుకు నిత్యం సూరినంబూద్రిని అస్తమానం ఆకాశానికి ఎత్తేశాడు అనడానికి అతని వద్ద ఉన్న సంపదనే ప్రధాన కారణం. సూరినంబూద్రిపై సేరుసేరి నంబూద్రికి ఎలాంటి మంచి అభిప్రాయం ఉండదు, కాని అతని సంపద పలుకుబడి వల్ల గౌరవం ఇస్తాడు. "సూరినంబూద్రి గురించి వీరికి తుచ్ఛమైన భావమే ఉంది. అయితే దానిని అంత బహిరంగా చూపించడానికి వీలుకాదు కదా! సూరినంబూద్రిపాడు ధనంతో ప్రాబల్యంతో నంబూద్రిలందరిలో చాలా ముఖ్యమైన వారుగా ఉన్నారు. కాబట్టి బహిరంగంగా వారిని ఎలా గౌరవించకుండా ఉండటం?" (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 89)

ఇందులేఖ మాధవుడిని ఇష్టపడుతున్నట్లు సూరినంబూద్రికి తప్ప అతనిచుట్టూ ఉన్న అన్ని పాత్రలకి తెలుస్తుంది. కాని ఎవరుకూడా ఈ విషయం గురించి నంబూద్రిపాడు వద్ద ప్రస్తావించరు. సూరినంబూద్రిపాడు చుట్టూ ఎప్పుడూ అతన్ని పొగిడే జనం ఉండటం వల్ల అతను తానొక మేధావినని తనకు తానే నిర్ధారించుకుంటాడు. అందరూ తన మేధస్సును, సంపదను గుర్తించాలనుకుంటాడు. తనను చూడగానే ఎటువంటి స్త్రీలైనా మైమరచి పోతారనే అతి నమ్మకాన్ని కలిగి ఉంటాడు. ఈ అభిప్రాయాలన్ని సరైనవి కాకున్నా ఎవ్వరుకూడా నంబూద్రిపాడువద్ద వాస్తవాన్ని చెప్పరు. దీనికి అతని వద్ద ఉన్న డబ్బు ప్రధాన కారణం. నంబూద్రిపాడును ఆశ్రయించి ఉన్న వేశ్యా స్త్రీలు సూరినంబూద్రి ధనానికి ఆశపడి అతన్ని అనునిత్యం మన్మథునిగా కీర్తించేవారు. సంస్కృతంలో విద్వాంసుడైన, లక్షణశాస్త్ర గ్రంథాలు తెలిసినవాడైన సేరుసేరినంబూద్రి వాస్తవ విషయాలను నంబుద్రిపాడువద్ద చెబితే తాను నంబూద్రి ఆశ్రయాన్ని కోల్పోయి జీవనభృతిని పోగొట్టుకోవలసి వస్తుందని భయపడి అతన్ని అనునిత్యం పొగడేవాడు. ఇలా అన్ని వైపులనుండి అనుకూల ప్రతిస్పందనలు రావడంవల్ల సూరినంబూద్రిపాడు తనపైన తనకి అతి నమ్మకం కలిగిన వ్యక్తిగా ప్రవర్తించేవాడు. ఈ అతి నమ్మకంతో కూడిన ప్రవర్తన సూరి నంబూద్రిపాడు పాత్రలో పాత్ర ప్రవేశించినది మొదలు నిష్క్రమించేవరకు కనిపిస్తుంది. ఒక కొండను గుత్తాకి ఇచ్చే విషయం మాట్లాడటానికి

సూరినంబూద్రి 'మక్షమన్' అనే ఆంగ్లదొరని కలుస్తాడు. ఈ సందర్భంలో మర్షమన్ దొర ఆంగ్లేయ సంప్రదాయం ప్రకారం తన భార్యని సూరినంబూద్రిపాడుకి పరిచయం చేస్తాడు. ఆమె సూరినంబూద్రిపాడు పక్కకువచ్చి కూర్చొని కరచలనం చేస్తుంది. తన అందం చూసి మతిభ్రమించి ఆంగ్లేయ దొరసని తన చేతిలో చెయ్యి కలిపిందని భావించిన నంబూద్రిపాడు ఆమెకు తన చేతి ఉంగరాన్ని బహుమానంగా ఇస్తాడు. ఈ సంఘటన సూరినంబూద్రికి అతనిపై అతనికున్న అతి నమ్మకానికి, స్త్రీలోలత్వానికి ఉదాహరణ. తన వద్ద ఉన్న బంగారు వస్త్రాలను, వస్తువులను, సేరుసేరి నంబూద్రికి చూపి అనునిత్యం తన్నుతాను ధనవంతుడినని పొగిడించుకుంటాడు. సందర్భం వచ్చిన ప్రతీసారి సేరుసేరి నంబూద్రి సూరి నంబూద్రిని పొగడటం వల్ల సూరి నంబూద్రిపాడు అతని పొగడ్తలకు అలవాటుపడతాడు. ఎల్లప్పుడు సూరినంబూద్రిపాడును తన పక్కనే ఉంచుకుంటాడు. ఇందులేఖను వివాహం చేసుకోవాలని పంజుమీనన్ నుండి ఉత్తరం అందిన మరుక్షణం నుండి ఇందులేఖ గురించి ఆలోచించడం మొదలుపెడతాడు. ఇందులేఖ సంస్కృతము, ఆంగ్లం తెలిసిన అమ్మాయని తెలిసి కొంత అసహనానికి లోనౌతాడు. ఆంగ్లం చదివిన అమ్మాయి ప్రవర్తన సరిగా ఉండదని తన మనసులోని మాటని సేరుసేరి నంబూద్రితో పంచుకుంటాడు. సేరుసేరి నంబూద్రి అది తప్పుడు అభిప్రాయమని ఆంగ్లం తెలిసినంత మాత్రానా అమ్మాయి ప్రవర్తన చెడిపోతుందని చెప్పలేమని నంబూద్రిపాడు మనసులోని శంకని తీరుస్తాడు. ఇందులేఖ అందచందాలని గురించి విన్న తరువాత స్త్రీలోలుడైన సూరినంబూద్రిపాడు ఎలాగైనా ఇందులేఖను తన భార్యగా చేసుకోవాలని అనుకుంటాడు. బంగారు వస్త్రాలతో కూడిన సంపదతో పంజుమీనన్ ఇంటికి బయలుదేరి వెళ్తాడు.

పంజుమీనన్ ఇంటికి వెళ్లిన మరుక్షణం నుండే ఇందులేఖ కోసం వేట మొదలుపెడతాడు. ఇందులేఖతో సంభాషించడానికి ఉవ్విళ్ళూరుతాడు. ఇందులేఖతో సంభాషణ ప్రారంభించిన సందర్భంలో ఇందులేఖ నంబూద్రిపాడుతో సమానంగా కూర్చొని మాట్లాడటం చూసిన తరువాత నంబూద్రిపాడుకు కోపంతో కూడిన ఆవేశం వస్తుంది. ఇందులేఖ అందాన్ని చూసిన తరువాత తన ఆవేశాన్ని తగ్గించుకొని ఇందులేఖతో సంభాషణని కొనసాగిస్తాడు. ఇందులేఖతో సంభాషిస్తున్న క్రమంలో తన సంపద గొప్పతనాన్ని గురించి ఇందులేఖకి చెప్తాడు. తాను ఇందులేఖని ఇష్టపడుతున్నటుగా సంస్కృత శ్లోకాల రూపంలో చెప్పడానికి ప్రయత్నించి ఆ

శ్లోకాలు గుర్తుకు రాక అబాసుపాలవుతాడు. తాను ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ఇందులేఖ మనస్సు మార్చడం కష్టమని గ్రహించి సంభాషణని ముగిస్తాడు. ఇందులేఖ తల్లి లక్ష్మికుట్టియమ్మని, ఇందులేఖ వద్ద పనిచేసే 'అమ్ము'ను చూసిన సందర్భంలో వారిని సూరినంబూద్రిపాదు మోహిస్తాడు. తాను వారిని మోహించినట్లు సేరుసేరి నంబూద్రివద్ద చెబుతాడు. ఈ సంఘటన నవల రచనా కాలంనాటికి నాయర్ స్త్రీలపై నంబూద్రిలకు ఉన్న హక్కును తెలుపుతుంది. ఇందులేఖ నంబూద్రిపాదును వివాహం చేసుకోనని చెప్పిన సందర్భంలో సూరినంబూద్రిపాదు తనకు పరాభవం జరిగినట్లుగా భావించి కుంగిపోతాడు. ఈ అవమానం నుండి గట్టెక్కే మార్గాన్ని గురించి ఆలోచిస్తున్న తరుణంలో తన వద్ద పనిచేసే గోవిందుడు ఇందులేఖ స్థానంలో కళ్యాణకుట్టిని వివాహం చేసుకోవాల్సిందిగా సలహా ఇస్తాడు. గోవిందుని సలహామేరకు ఇందులేఖ స్థానంలో కణ్యాణకుట్టితో తన వివాహం జరిపించమని పంజుమీనన్‌ని సూరి నంబూద్రిపాదు కోరతాడు. ఈ వివాహంవల్ల తన పరువు నిలబడుతుందని పంజుమీనన్ వద్ద వేడుకోగా, పంజుమీనన్ సూరినంబూద్రిపాదు విజ్ఞాపన మేరకు కణ్యాణకుట్టితో అతని వివాహం జరిపిస్తాడు. ఇలా నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించేవరకు డబ్బున్న నంబూద్రిల ప్రవర్తనకి ప్రతీకగా, సూరినంబూద్రి పాత్రను ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు.

### 4.1.1.8. బాబు గోవిందసేన్

పంతొమ్మిదవ శతాబ్దంలో కలకత్తా నగరంలో ఉన్న వ్యాపారవేత్తల జీవనానికి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు బాబుగోవిందసేన్ పాత్రని చిత్రించారు. ఈ పాత్రద్వారా స్నేహ స్వభావం. అతిథి సత్కారం వంటి గుణాలను పాఠకులకు అందించారు. కలకత్తా నగరంలో ఒక జంతు ప్రదర్శనశాలలో బాబుగోవిందసేన్ మరియు అతని తమ్ముడు బాబు చిత్రప్రసాదసేన్ మరియు అతని కుమారుడు కేశవచంద్రసేన్‌లను చిరుతపులి బారినుండి మాధవుడు కాపాడతాడు. మాధవుని ధైర్యాన్ని చూసి ఆశ్చర్యపోయిన బాబుగోవిందసేన్ మాధవున్ని తన ఇంటికి ఆహ్వానిస్తాడు. మాధవునికి బాబుగోవిందసేన్‌లకు మధ్య స్నేహం కుదురుతుంది. బాబుగోవిందసేన్ కలకత్తా నగరంలో ఉన్న గొప్ప కోటీశ్వరుడు. అతని భవనాన్ని చూసి మాధవుడు ఆశ్చర్యపోతాడు. ఈ సందర్భంలో మలయాళ ప్రాంతంలో ఉన్న ధనవంతులకు కలకత్తా ప్రాంతంలో ఉన్న ధనవంతులకు మధ్య ఉన్న తేడాని ఒ.చందుమీనన్‌గారు పాఠకులకు

వివరించారు. “బెంగాలు దేశంలో కుబేరునికి చెన్నై ప్రాంతంలో కుబేరునికి మధ్య పెద్ద వ్యత్యాసం ఉంది. వారిరువురి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సంపద లెక్కించడం ద్వారా తెలుసుకోవచ్చు. చెన్నైలో అయిదు లక్షల రూపాయలు కలిగినవాడు నాలుగోరకం ధనవంతుడే. ఇక్కడ కోట్లు కలిగినవారే శ్రీమంతులు. గొప్ప ధనవంతులు. బెంగాలు దేశంలో కుబేరులని సందేహం లేకుండా ఒకరిని చెప్పాలంటే అతనికి పదిహేను కోట్లకుపైగా డబ్బు ఉండాలి.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 225). అత్యధిక ధనవంతునిగా ఉన్న బాబూగోవిందసేన్ అనేక సందర్భాలలో మాధవున్ని కష్టాలనుండి కాపాడతాడు. బొంబాయికి బయలుదేరిన సందర్భంలో మార్గ మధ్యమంలో మాధవుని పెట్టెను ‘షియాఅలీఖాన్’ అనే దొంగ అపహరిస్తాడు. ఆ సందర్భంలో మాధవుని వద్ద చిల్లిగవ్వకుడా ఉండదు. ఈ విషయం తెలిసి బాబుగోవిందసేన్ బాధపడతాడు.

“మాధవుడు ఉత్తరభారతదేశాన్ని పర్యటించి చూడ్డానికి మదరాసుకు తిరిగి వెళ్ళడానికి కావలసిన ఖర్చుల నిమిత్తం రెండువేల రూపాయలు మాధవునికి ఇవ్వండి. అయితే రూపాయలు అన్నీ చేతిలో తీసుకొని వెళ్ళవద్దు. ప్రస్తుత అవసరాలకు కావలసింది మాత్రం డబ్బుగా, రొక్కంగా ఉండనీ. మిగతా కావలసినది అలహాబాదు, ఆగ్ర, ఢిల్లీ లాహోరు మొదలైన ప్రాంతాల నుండి అప్పటికప్పుడు తీసుకునే విధంగా చెక్కులు ఇవ్వండి. మాధవుడు బొంబాయి తిరిగివెళ్లి చేరేంత వరకు తోడుగా వెళ్ళడానికి మన బైరామ్‌ఖానును పంపించండి. వాడు ప్రయాణాలు చేసిన అనుభవమున్నవాడు. వస్తువులు దొంగిలింపబడటం వలన ఎక్కువ దిగులుపడవద్దని మాధవునితో తప్పకుండా చెప్పండి.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 270). ఇది బాబుగోవిందసేన్ మాధవున్ని జాగ్రత్తగా చూసుకోమని తన మిత్రుడు గోపీనాథ బెనర్జీకి రాసిన లేఖ. ఈ లేఖ మాధవునిపై బాబుగోవిందసేన్‌కి ఉన్న వాత్సల్యానికి నిదర్శనం. మాధవుని వివాహ సమయంలో కూడా బాబుగోవిందసేన్ మాధవునికి కానుకలు పంపిస్తాడు. ఇలా నవల చివరిలో మాధవున్ని అన్ని రకాలుగా బాబుగోవిందసేన్ ఆదుకుంటాడు. తమ ప్రాణాలను కాపాడిన ఉపకారానికి ప్రత్యుపకారంగా బాబుగోవిందసేన్ మాధవునికి మేలు చేస్తాడు. దీనివల్ల ఉపకారానికి ప్రత్యుపకారం చేయాలన్న సందేశం ఇవ్వబడింది.

### 4.1.1.9. గోవిందపణిక్కర్

‘గోవిందపణిక్కర్’ మాధవుని తండ్రి. మాధవునికి పంజుమీనన్‌కు విరోధం ఏర్పడిన సందర్భంలో మాధవునికి కావలసిన ఆర్థిక వనరులను గోవిందపణిక్కర్ చేకూర్చుతాడు. తండ్రికి

కొడుకుపై ఉన్న మమకారానికి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు గోవిందపణిక్కర్ పాత్రని చిత్రించారు. ముందు నుండి మాధవునిపై మంచి అభిప్రాయం కలిగి ఉన్న గోవిందపణిక్కర్ నవల ముగిసే వరకు తన అభిప్రాయాన్ని మార్చుకోడు. మద్రాసులో మాధవుని ఖర్చులకు కావలసిన ధనాన్ని గోవిందపణిక్కర్ అందిస్తాడు. మాధవుడు ఇంటిపెద్ద పంజుమీనన్‌న్ని ఎదిరించాడని తెలిసి గొడవలు మంచివి కావని మాధవున్ని వారిస్తాడు. జగడం వస్తే కుటుంబం సమాజంలో నవ్వుల పాలవుతుందని మాధవునికి హితవు చెప్తాడు. ఇందులేఖ విషయంలో మాధవుడు బాధపడుతుండగా ఇందులేఖ మాధవునికి సొంతమని మాధవునికి ధైర్యం చెప్తాడు. ఇలా ఒక పక్క మాధవునికి కావలసిన వాటిని సమకూరుస్తూ ఇంకోపక్క పంజుమీనన్ వద్ద అతనికి అనుకూలంగా నడుచుకుంటాడు. పంజుమీనన్ మాధవుని గురించి చెప్పిన విషయాలన్నీ వింటాడు. మాధవునికి ఆర్థిక సహాయం చేయవద్దని పంజుమీనన్ అన్న సందర్భంలో సరేనని అతని కోపం తగ్గించే విధంగా మాట్లాడతాడు. ఇందులేఖకి వివాహం జరిగిందన్న అసత్య ప్రచారాన్ని నమ్మి మాధవుడు ఉత్తరభారత యాత్రకు వెళ్లిన విషయం తెలిసి ఒక తండ్రిగా అమితంగా బాధపడతాడు. ఎలాగైనా మాధవున్ని వెతికి తెస్తానని బాధపడవద్దని మాధవుని తల్లికి ధైర్యంచెప్పి ఉత్తరభారతదేశం బయలుదేరుతాడు. బొంబాయిలో మాధవున్ని కలుసుకున్న సందర్భంలో అతన్ని ఒక్క మాటకూడా అనడు. ఆప్యాయంగా గుండెలకు హత్తుకొని చిన్న పిల్లాడిలా ఏడుస్తాడు. ఇలా నవల ఆసాంతం పుత్రునిపై తండ్రికిగల ప్రేమకు ప్రతీకగా గోవిందపణిక్కర్ పాత్రని ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు. బాబుకేశవచంద్రసేన్‌గారి ఇంట్లో విశ్వం ఆవిర్భావం, దేవుని ఉనికి, భారతస్వతంత్ర సంగ్రామం వంటి అంశాల గురించి గోవిందపణిక్కర్, గోవిందమీనన్, మాధవునికి మధ్య సంభాషణ జరుగుతుంది. ఈ సంభాషణలో గోవిందపణిక్కర్ పలికిన మాటలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి మలయాళ సమాజంలో ఉన్న పరిస్థితులపై ఆనాటి సంప్రదాయ వాదులు కలిగిన భావాలకు నిదర్శనం. “ఆంగ్లం చదవడం వల్ల కొత్త తరం యువకుల్లో పెద్దలపట్ల గౌరవభావం తగ్గింది. లౌకిక ఆచారాలను, సంప్రదాయాలను తిరస్కరించే క్రమంలో ఏది ఆచరించాలో ఏది ఆచరించకూడదో తెలియక ఒక సందిగ్ధ పరిస్థితిలోకి నేటి యువత నెట్టివేయబడింది. ఆంగ్లం చదవడంవల్ల యువకుల్లో హిందూ మతం పట్ల వ్యతిరేకత ఏర్పడింది. దైవం లేదన్న భావన యువకుల మనసులో బలపడింది”.(జయప్రకాశ్, ఎస్(అ).2016:278) ఇలాంటి అభిప్రాయాలను గోవిందపణిక్కర్ మాధవునితో పంచుకుంటాడు. గోవిందపణిక్కర్ అభిప్రాయాలను మాధవుడు,

గోవిందకుట్టిమీనన్ లు తిరస్కరిస్తారు. దైవం గురించి, మతం గురించి హేతుబద్ధమైన అభిప్రాయాలను గోవిందకుట్టిమీనన్, మాధవుడు చెప్పినా గోవిందపణిక్కర్ తన అభిప్రాయాన్ని మార్చుకోడు. చిన్నపిల్లలతో ఇలాంటి విషయాల గురించి మాట్లాడటం తన తప్పేనని సంభాషణ ముగిస్తాడు. ఇలా నవల ఆసాంతం సంప్రదాయ భావాలు కలిగిన వ్యక్తులకు ప్రతీకగా గోవిందపణిక్కర్ పాత్ర చిత్రితమైంది.

### 4.1.1.10. గోవిందకుట్టి మీనన్

ఇందులేఖ నవలలో మలయాళ తరవాడు ఉమ్మడి కుటుంబంలోని చదువుకున్న వ్యక్తికి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు గోవిందకుట్టిమీనన్ పాత్రను చిత్రించారు. గోవిందకుట్టిమీనన్ ఇందులేఖ మేనమామ. ఇంటిపెద్ద పంజుమీనన్‌కి రెండవ కుమారుడు. పంజుమీనన్ మొదటి కుమారుడు కృష్ణన్‌కుట్టిమీనన్ మరణించిన తరువాత ఇందులేఖ బాగోగులను గోవిందన్ కుట్టిమీనన్ చూసుకుంటాడు. గోవిందన్ కుట్టిమీనన్‌కి ఇందులేఖ అంటే ఎంతో ఇష్టం. ఇందులేఖకి సంరక్షకునిగా ఉంటూ ఇందులేఖ విద్యని అభ్యసించడానికి సహకరిస్తాడు. చదువుకున్న వ్యక్తి అవ్వడంవల్ల ఇందులేఖ ప్రేమని అర్థంచేసుకుంటాడు. ఆమె ప్రేమకు సహకరిస్తాడు. మద్రాసులో ఉన్న మాధవుని బాగోగులను ఎప్పటికప్పుడు ఇందులేఖకి చేరవేస్తాడు. ఇంటిపెద్ద పంజుమీనన్ ఇందులేఖని, మాధవునికి ఇచ్చి వివాహం చేసేది లేదని శపథం చేశాడని మాధవుని ద్వారా గోవిందన్ కుట్టిమీనన్ తెలుసుకుంటాడు. ఈ శపథం గురించి ఇందులేఖ వద్ద గోవిందన్ కుట్టిమీనన్ పరిహాసమాడతాడు. ఈ శపథం నెరవేరబోదని గోవిందన్‌కుట్టిమీనన్ ఇందులేఖకు పరోక్షంగా చెబుతాడు. అందరితో కోపంగా మాట్లాడే పంజుమీనన్ గోవిందన్‌కుట్టి మీనన్‌పై గౌరవ భావాన్ని ప్రదర్శిస్తాడు. ఇందులేఖని మాధవునికి ఇచ్చి పెళ్ళి చేసేది లేదని తాను శపథం చేసిన మాట ఎంత వాస్తవమో ఇందులేఖకు ఇష్టం లేకుండా నంబూద్రిపాదుకు ఇందులేఖను ఇచ్చి వివాహం చేసేది లేదనేది కూడా అంతే వాస్తవమని పంజుమీనన్ గోవిందకుట్టిమీనన్‌కి చెబుతాడు. ఈ సందర్భంలో ఎలాగైనా పంజుమీనన్‌ని ఒప్పించి మాధవుడు, ఇందులేఖల వివాహం జరిపించాలని గోవిందకుట్టిమీనన్ తీర్మానించుకుంటాడు. పంజుమీనన్ తనతో చెప్పిన విషయాన్ని గోవిందకుట్టిమీనన్ ఇందులేఖతో పంచుకుంటాడు. ఇందులేఖకు ఇష్టంలేకుండా ఆమె వివాహం జరగదని ధైర్యం చెబుతాడు. ఇందులేఖ వివాహం విషయంలో పొరబడి మాధవుడు ఇల్లు విడిచి విహారయాత్రలకి

వెళ్లిన సందర్భంలో మాధవునికి ఏమీకాదని అతన్ని తాను వెతికి తీసుకువస్తానని గోవిందకుట్టిమీనన్ ఇంట్లో వారికి ధైర్యం చెబుతాడు. మాధవుని తండ్రి గోవిందపణిక్కర్ తో కలిసి మాధవున్ని వెతకడానికి వెళ్తాడు. మాధవున్ని వెతికే క్రమంలో గోవిందపణిక్కర్‌కి గోవిందకుట్టిమీనన్ తన సహాయ సహకారాలు అందిస్తాడు. చివరికి అనేక ప్రయత్నాల తరువాత బొంబాయిలో కేశవచంద్రసేన్ సహకారంతో మాధవున్ని కలుసుకున్న సందర్భంలో గోవిందకుట్టిమీనన్ అమితానందానికి లోనౌతాడు. మాధవున్ని తాము కలుసుకున్నట్లుగా ఇంటికి లేఖ రాస్తాడు. ఇలా నవల ఆసాంతం ఇందులేఖ, మాధవుడు పాత్రల చుట్టూ గోవిందకుట్టిమీనన్ పాత్ర తిరుగుతూ ఉంటుంది. గోవిందకుట్టిమీనన్ మొదటినుండి ఇందులేఖ, మాధవుల ప్రేమ నెరవేరాలని కోరుకుంటాడు. ఈ ప్రేమకు సహకరిస్తాడు. వారి పెళ్ళిని దగ్గరుండి జరిపిస్తాడు. ఇది నవల కథ పరంగా గోవిందకుట్టిమీనన్ పాత్ర ప్రవర్తన కాగా బొంబాయిలో మాధవున్ని గోవిందకుట్టిమీనన్ కలుసుకున్న తరువాత కేశవచంద్రసేన్ ఇంట్లో గోవిందపణిక్కర్, మాధవుడు, గోవిందకుట్టిమీనన్‌ల మధ్య ప్రాపంచిక విషయాల గురించి ఒక సంభాషణ జరుగుతుంది. ఈ సందర్భంలో గోవిందకుట్టిమీనన్ వెలుబుచ్చిన అభిప్రాయాలు 'తరవాడు' ఉమ్మడి కుటుంబంలోని చదువుకున్న వ్యక్తుల ఆలోచనా విధానానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. గోవిందపణిక్కర్ దేవుడి ఉనికిని గురించి గోవిందకుట్టిమీనన్‌ని ప్రశ్నించిన సందర్భంలో అతను చెప్పిన మాటలు గమనించదగినవి.

"భాగవంతుడనే ఏ ఒక ప్రత్యేక శక్తి ఉన్నదని నాకు నమ్మకంలేదు. ప్రపంచమంతా సహజసిద్ధంగా సృష్టించబడి స్థిరంగా వర్ధిల్లడం, నశించడం జరుగుతూ ఉంటుందని నాకు తోస్తున్నది. ఈ ప్రపంచం పూర్తిగా కార్యకారణ సంబంధం కలిగి పదార్థాల ప్రత్యేక ధర్మం వలన, ఘర్షణ వలన అనాది కాలంగా క్రమ క్రమంగా తనకు తానుగా సృష్టించబడి వచ్చినదే. అన్ని పదార్థాలకు, ప్రాణులకు ఆధారభూతమైనవి భూమి, నీరు, అగ్ని, వాయు, ఆకాశం ఇవే. వీటిలోని కొన్ని భాగాలుగా కలిసి పరస్పర ఆకర్షణ వల్ల, ఘర్షణ వల్ల మిగిలిన భాగాలను గ్రహించి క్రమ క్రమంగా అనంత కోటి జీవ రాశి ఉత్పత్తి కావడం, వృద్ధి కావడం జరిగింది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 287). ఈ మాటలు చదువుకున్న వ్యక్తి ఆలోచనా విధానానికి ప్రతీకలు. ఇలా కేశవచంద్రసేన్ ఇంట్లో జరిగిన సంభాషణలో ఒ.చందుమీనన్‌గారు గోవిందకుట్టిమీనన్ పాత్ర ద్వారా దేవునికి సంబంధించిన హేతుబద్ధమైన అంశాలను

అందించారు. నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు ఇందులేఖ ప్రేమపై, భగవంతుని ఉనికిపై స్థిరమైన అభిప్రాయాలు కలిగి వాటిని నెరవేర్చడానికి, నిరూపించడానికి ప్రయత్నించడం గోవిందకుట్టిమీనన్ పాత్ర ప్రవర్తనలో కనిపిస్తుంది.

### 4.1.1.11. గోవిందుడు

సూరినంబూద్రిపాడు వద్ద తమలపాకుల పెట్టెను ఎత్తుకుని అతని వెన్నంటి తిరిగే అడపకాడు గోవిందుడు. మంచి సామర్థ్యం ఉన్న పనివాడు. యజమానులపై పనివాళ్ళు ప్రదర్శించే భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు గోవిందుని పాత్రను చిత్రించారు. అనునిత్యం సూరినంబూద్రిపాడుతో ఉండటం వల్ల గోవిందునికి తన యజమాని సూరినంబూద్రిపాడు గుణగణాలు పూర్తిగా తెలుస్తాయి. సూరినంబూద్రిపాడు తనకి ఏ అవసరం ఉన్నా మొదట గోవిందునుకే చెప్పేవాడు. ఇలా గోవిందునికి, సూరి నంబూద్రిపాడుకు మధ్య సంబంధం బలపడుతుంది. సూరినంబూద్రిపాడుకు గోవిందుడంటే అధిక నమ్మకం. తాను ఇందులేఖను చూడటానికి ఆమె ఇంటికి వెళ్ళడానికి తీర్మానించుకున్నట్లు సూరినంబూద్రిపాడు మొదట గోవిందునికి చెప్తాడు. ఈ ఒక్క విషయమే కాక సూరినంబూద్రిపాడు పంజుమీనన్ ఇంటికి వెళ్లిన సందర్భంలో అక్కడ జరిగిన ప్రతీ విషయాన్ని గోవిందునితో పంచుకుంటాడు. గోవిందుడు తన యజమాని తనపై ఉంచిన నమ్మకానికి ప్రతిగా అవసరమైన సందర్భాలలో నంబూద్రిపాడుకి సలహాలు, సూచనలు ఇస్తూ ఉంటాడు. ఇందులేఖ సూరినంబూద్రిపాడును తిరస్కరించిన సందర్భంలో గోవిందుడు సూరినంబూద్రిపాడుని ఓదార్చుతాడు. తనకు తెలిసినంత వరకు ఇందులేఖ నడవడిక సరిగ్గా లేదని, ఆమెకు ఒక యువకునితో రహస్య సంబంధం ఉందని, కాబట్టి ఇందులేఖను వివాహం చేసుకోక పోవడమే మంచిదని సూరినంబూద్రిపాడుకు చెప్తాడు. గోవిందుని మాటలు విన్న తరువాత సూరినంబూద్రిపాడు సంతోషిస్తాడు. చెడు ప్రవర్తన కలిగిన ఇందులేఖ తనకి వద్దని తీర్మానించుకుంటాడు. ఇందులేఖని వివాహం చేసుకోకుండా పంజుమీనన్ ఇంటినుండి వెళ్లడం తనకు అవమానమని సూరినంబూద్రిపాడు ఆలోచిస్తున్న తరుణంలో ఇందులేఖ స్థానంలో కళ్యాణకుట్టిని వివాహం చేసుకుంటే ఎటువంటి సమస్యా ఉండదని గోపాలుడు సూరినంబూద్రిపాడుకి సలహా ఇస్తాడు. తన యజమానిపై అమిత విశ్వాసం కలిగిన పని వాడిగా అతని మర్యాదకి భంగం కలగకూడదని సూరినంబూద్రిపాడుకు, కళ్యాణకుట్టికి జరిగిన వివాహాన్ని సూరినంబూద్రిపాడుకి, ఇందులేఖకి

జరిగినట్లుగా ప్రచారం చేస్తాడు. ఈ ప్రచారంలోని వాస్తవం తెలిసేలోపే సూరినంబూద్రిపాదు కళ్యాణకుట్టితో తన ఇంటికి చేరుకుంటాడు. ఇలా ఆపదలో ఉన్న అనేక సందర్భాలలో తన తెలివితేటలతో గోవిందుడు తన యజమాని సూరినంబూద్రిపాదును రక్షిస్తాడు. సూరినంబూద్రిపాదులో ఎన్ని అవలక్షణాలున్నా వాటినన్నింటిని కప్పిపుచ్చి శంకరశాస్త్రి సూరినంబూద్రిపాదు గురించి అడిగిన సందర్భంలో 'నంబూద్రిపాదు మంచి కార్యదక్షుడు, అతని కుటుంబంలో ఇలాంటి వ్యక్తులను నేను ఇదివరకెప్పుడూ చూడలేదు, ఆయన ఇక్కడికి రావడం పంజుమీనన్ అదృష్టం. ఇలా నాయర్ ఇండ్లకు నంబూద్రిలు రావడం నేను ఎక్కడా చూడలేదు' అంటూ తన యజమాని గురించి గొప్పగా చెబుతాడు. ఇలా నవల ఆసాంతం యజమానిపై నమ్మకస్తుడైన పనివాడు చూపే భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా ఒ. చందుమీనన్‌గారు గోవిందుని పాత్రను చిత్రించారు.

### 4.1.1.12. గోపాలుడు

నాయర్ ఉమ్మడి కుటుంబంలో దూరపు బంధువులు ఎదుర్కొన్న వివక్షకు ప్రతీకగా గోపాలుడి పాత్రని ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు. ఇందులేఖ నవల ఐదవ భాగంలో గోపాలుని పాత్ర పరిచయం చేయబడింది. చిన్నడిని మాధవుడు ఆంగ్లం చదివించడానికి మద్రాసుకు తీసుకెళ్ళాడని తెలిసి పంజుమీనన్ మాధవుడిని ఏమీ అనలేక గోపాలుడిని పిలిచి నీ తమ్ముడిని ఎందుకు మాధవునితో మద్రాసుకు పంపావని తిడతాడు. పంజుమీనన్ తిట్లు భరించలేక గోపాలుడు పంజుమీనన్‌కి ఎదురు తిరుగుతాడు. తనని కొడితే ఊరుకునేది లేదని గోపాలుడు పంజుమీనన్‌ని హెచ్చరిస్తాడు. ఈ విధంగా ఇంటి సభ్యులలో ఒకడైన గోపాలుని రూపంలో పంజుమీనన్‌కి మొట్టమొదట వ్యతిరేకత ఎదురౌతుంది. ఈ వ్యతిరేకతను తట్టుకోలేని పంజుమీనన్ గోపాలున్ని కట్టడి చేయాలని అనుకొని అతనికి తాను సాగు నిమిత్తం ఇచ్చిన భూమిని వెంటనే తిరిగి ఇవ్వాలని ఆజ్ఞాపిస్తాడు. గోపాలుడు తనవద్ద భూమి ఏదీ ఇప్పుడు లేదని ఉన్న భూమిని సంవత్సర కాలానికి కౌలుకి ఇచ్చానని పంజుమీనన్‌కి చెప్తాడు. గోపాలుని ధిక్కారాన్ని తట్టుకోలేని పంజుమీనన్ అతన్ని కొట్టడానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నంలో గోపాలుడు తప్పించుకోవడం వల్ల పంజుమీనన్ కాలికి గాయమవుతుంది. ఈ సంఘటన తరువాత గోపాలుడు ఇంటినుండి బయటికి వెళ్లిపోతాడు. ఈ విధంగా గోపాలుని పాత్రద్వారా పంతొమ్మిదవ శతాబ్దంలో మలయాళ తరవాడు ఉమ్మడి కుటుంబంలో ఇంటిపెద్దకు, కుటుంబ సభ్యులకు మధ్య నడిచిన సంఘర్షణ చిత్రితమైంది.

### 4.1.1.13. శీనుభట్టరు

మలయాళ తరవాడు ఉమ్మడి కుటుంబంలో ఇంటిపెద్ద అకృత్యాలను ప్రశ్నించిన దూరపు బంధువుకి ప్రతీకగా శీనుభట్టరు పాత్రని ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు. శీనుభట్టరు బ్రాహ్మణుడు. పంజుమీనన్ అమ్మమ్మ తరపు బంధువైన కుమ్మినియమ్మ భర్త. వంటవాడిగా ఉంటూ తన కుటుంబాన్ని పోషిస్తాడు. బీదవాడు, తన కొడుకైన చిన్నడిని మాధవుడు ఆంగ్లం చదివిస్తాడని తెలిసి ఆనందపడతాడు. చిన్నని చదువుకు కావాల్సిన ధనాన్ని తానే మాధవునికి ఇచ్చినట్లు పంజుమీనన్ వద్ద అబద్ధం చెప్తాడు. శీనుభట్టరు మాటలు విన్న పంజుమీనన్ శీనుభట్టరు ఇకమీదట తన ఇంటికి రాకూడని తీర్మానిస్తాడు. బ్రాహ్మణ సంత్రంలోను, గుడిలోనూ ఎక్కడా శీనుభట్టరు కనిపించకూడదని ఆజ్ఞని జారీ చేస్తాడు. శీనుభట్టరు తాను బ్రాహ్మణుడినని సంత్రంలోనూ, గుడిలోనూ తనకి ప్రవేశం ఉంటుందని పంజుమీనన్ ఆజ్ఞని వ్యతిరేకిస్తాడు. సత్రానికి, గుడికి ఖచ్చితంగా వెళ్తానని పంజుమీనన్‌తో చెప్తాడు. ఈ విషయంలో తాను అవసరమైతే పంజుమీనన్‌పై ఫిర్యాదు చేస్తానంటాడు. ఈ ధిక్కారాన్ని పంజుమీనన్ తట్టుకోలేక అతన్ని కొట్టడానికి వెళ్తాడు. శంకరమీనన్ పంజుమీనన్‌ని అడ్డగించడంతో గొడవ సద్దుమణుగుతుంది. ఇందులేఖని వివాహం చేసుకోవడానికి తమ ఇంటికి వచ్చిన నంబూద్రిపాడుకు శీనుభట్టరు దగ్గరుండి సేవలు చేస్తాడు. నంబూద్రిపాడు ఇందులేఖను వివాహం చేసుకుంటున్నాడని తెలిసి శీనుభట్టరు సంతోషపడతాడు. తన కూతురు కళ్యాణకుట్టికి సూరినంబూద్రిపాడుతో వివాహం నిర్ణయించబడిందని తెలియక సూరినంబూద్రిపాడు వివాహం ఇందులేఖతో జరుగుతున్నట్లు ప్రచారం చేస్తాడు. ఈ ప్రచారం వల్ల మాధవుడు నిజంగానే ఇందులేఖ వివాహం సూరినంబూద్రిపాడుతో జరిగిందనుకొని ఉత్తరభారతదేశ యాత్రలకు వెళ్తాడు. ఇలా నవల కథాపరంగా శీనుభట్టరు తనకు తెలియకుండానే కథ మలుపుకు కారణమవుతాడు. ఇందులేఖ వివాహం విషయంలో కొంత దుందుడుకుగా ప్రవర్తించిన శీనుభట్టరు తన కుమారుడైన చిన్నని చదువు విషయంలో స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగి ఇంటి పెద్ద పంజుమీనన్‌ని ఎదిరిస్తాడు. తద్వారా కుటుంబ బహిష్కారానికి గురవుతాడు. ఇలా కుటుంబ పెద్ద మాటలను ఎదిరిస్తే వచ్చే ఆపదలకు నిదర్శనంగా శీనుభట్టరు పాత్ర కనిపిస్తుంది. సాత్తరమీనన్, గోపాలుడు, కళ్యాణకుట్టిల తండ్రి శీనుభట్టరే అయినప్పటికీ వీరి బాగోగులను పంజుమీనన్ చూసుకుంటాడు. కళ్యాణకుట్టి వివాహ సందర్భంలో కూడ పంజుమీనన్ శీనుభట్టర్‌ని సంప్రదించడు. తన ఇష్టప్రకారం కళ్యాణకుట్టి వివాహాన్ని సూరినంబూద్రిపాడుతో

జరిపిస్తాడు. ఈ సంఘటన మలయాళ తరవాడు కుటుంబాలలో ఇంటిపెద్దకి ఉన్న హక్కులకు నిదర్శనం.

### 4.1.1.14. కేశవ నంబూద్రి

ఇందులేఖ నవల మూడవ భాగంలో పాత్ర పరిచయం చేయబడింది. కేశవ నంబూద్రి లక్ష్మికుట్టియమ్మ భర్త. లక్ష్మికుట్టియమ్మ మొదటి భర్త మరణించిన తరువాత పంజుమీనన్ లక్ష్మికుట్టియమ్మని కేశవ నంబూద్రికి ఇచ్చి వివాహం చేస్తాడు. అప్పటికే లక్ష్మికుట్టియమ్మకు ఇందులేఖ పుడుతుంది. ఇందులేఖకు పెంపుడు తండ్రిగా కేశవ నంబూద్రి ఉంటాడు. పేదవాడైన నంబూద్రి మనఃప్రవర్తనకు ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు కేశవ నంబూద్రి పాత్రను చిత్రించారు. కేశవ నంబూద్రి ఇంటిపెద్ద పంజుమీనన్ మాటని ఎప్పుడూ జవదాటడు. పంజుమీనన్ మాధవునికి ఇందులేఖను ఇవ్వనని తీర్మానించిన సందర్భంలో ఇందులేఖ పెంపుడు తండ్రిగా అందుకు అంగీకరిస్తాడు. తన పూర్వపు స్నేహితుడైన మూర్కిల్లాద నంబూద్రిపాదును గురించి పంజుమీనన్ వద్ద గొప్పగా చెప్తాడు. నంబూద్రిపాదు అందగాడు, ధనవంతుడు. అతన్ని చూడగానే ఇందులేఖ మాధవున్ని మరచిపోతుంది అంటూ పంజుమీనన్ వద్ద చెప్పగా పంజుమీనన్ సంతోషిస్తాడు. ఇలా ఒక నంబూద్రిపాదు ఇంకో నంబూద్రిని గురించి గొప్పగా చెప్పడం డబ్బున్న నంబూద్రిపాదులకు నాటి సమాజంలో ఉన్న గౌరవానికి నిదర్శనం. కేశవ నంబూద్రి మాటలను నమ్మి పంజుమీనన్ నంబూద్రిపాదును తన ఇంటికి ఆహ్వానిస్తాడు. ఇందులేఖను వివాహం చేసుకోవడానికి వచ్చిన నంబూద్రిపాదు తన భార్య లక్ష్మికుట్టియమ్మను మోహించిన సందర్భంలో కేశవ నంబూద్రి బాధపడతాడు. నంబూద్రిపాదు లక్ష్మికుట్టియమ్మ అందగత్తె, చాలాబాగుంది అంటూ కేశవ నంబూద్రివద్ద చెప్పగా నంబూద్రిపాదు మాటలకు మనసులో బాధపడుతూ పైకి ఏమీ అనలేక అతని మాటలకు తలూపుతాడు. నంబూద్రిపాదు ఒక వేళ ఇందులేఖకు బదులుగా తన భార్యను పెళ్ళాడతానని పంజుమీనన్ వద్ద చెబితే అందుకు పంజుమీనన్ అంగీకరిస్తే తన పరిస్థితి ఏంటని కేశవ నంబూద్రి బాధపడతాడు. ఒకవేళ నంబూద్రి ఇష్టపడ్డ స్త్రీకి పెళ్ళైనా ఆమెకు పిల్లలు ఉన్నా భర్త ఉన్నా నంబూద్రి ఇష్టాన్ని ఇంటిపెద్ద అంగీకరిస్తే నంబూద్రిలు తాము ఇష్టపడ్డ స్త్రీతో సంబంధం ఏర్పర్చుకునే వారనడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం. ఇలా పెళ్లైన స్త్రీలపై డబ్బున్న నంబూద్రిలు మోహాన్ని ఏర్పర్చుకోవడం వల్ల ఆ స్త్రీల భర్తలు పడ్డ మనోవేదనకు నిదర్శనం కేశవ నంబూద్రి పాత్ర. నిజానికి కేశవ నంబూద్రి, నంబూద్రిపాదు ఇద్దరు ఒకే కులానికి చెందినవారు. కానీ కేశవ నంబూద్రితో

పోల్చుకుంటే నంబూద్రిపాడు ధనవంతుడు. అతని సంపద ఆధారంగా నంబూద్రిపాడుకు విపరీతమైన గౌరవ మర్యాదలు పంజుమీనన్ ఇంట్లో లభించాయి. అతను ఏమి మాట్లాడినా చెల్లింది. ఇలా ధనిక, పేద నంబూద్రిలను ఒకే చోట ఉంచి ధనిక నంబూద్రి ప్రవర్తన వల్ల బీద నంబూద్రి బాధపడినట్లు చిత్రించడం పంతొమ్మిదో శతాబ్దం నాటికి డబ్బున్న నంబూద్రిలకు నాయర్ ఇళ్లలో లభించిన అధిక గౌరవ మర్యాదలకి నిదర్శనం. నవలలో కేశవ నంబూద్రి పాత్ర ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు ఇంటిపెద్ద పంజుమీనన్ ఆజ్ఞను పాటించిన పాత్రగా, డబ్బున్న నంబూద్రిపాడు ప్రవర్తన వల్ల బాధపడ్డ పాత్రగా, తన భర్యా, పిల్లలపై అధిక ప్రేమ కలిగిన పాత్రగా చిత్రితమైంది. తన స్నేహితుడైన నంబూద్రిపాడుపై మొదట మంచి అభిప్రాయాన్ని కలిగి ఉన్న కేశవ నంబూద్రి అతని ప్రవర్తన చూసిన తరువాత తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఇందులేఖను చూడటానికి పంజుమీనన్ ఇంటికి వచ్చిన నంబూద్రిపాడును ఎల్లప్పుడు ఇంద్రుడు, చంద్రుడు అని పొగడుతాడు. అతని నిజ స్వరూపం తెలుసుకున్న తరువాత నంబూద్రిపాడు గురించి అనవసరంగా పంజుమీనన్ వద్ద ప్రస్తావించానని బాధపడతాడు. తాను ఎంతో ఇష్టపడ్డ తన భార్యను నంబూద్రిపాడు అంగాంగా వర్ణన చేస్తుంటే పేదవాడైన కేశవ నంబూద్రి నంబూద్రిపాడును ఏమీ అనలేక మనసులో బాధపడతాడు. పంతొమ్మిదవ శతాబ్దంలో నూతనంగా భారతదేశానికి వచ్చిన కిరసనాయిల్, నూలుమిల్లు, రైలుబండి వంటి అంశాల గురించి భార్య లక్ష్మికుట్టియమ్మతో చర్చిస్తాడు. ఈ అధునాతన వస్తువులలో ఉన్న మార్మికతను ఆంగ్లేయులు ఎన్నటికీ భారతీయులకు చెప్పరని లక్ష్మికుట్టియమ్మతో అంటాడు. ఈ మాటలు పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చిన నూతన సాంకేతిక వస్తువుల పట్ల ఆనాటి సంప్రదాయవాదులు కలిగి ఉన్న అభిప్రాయానికి నిదర్శనం.

### 4.1.1.15. సేరుసేరి నంబూద్రి

పంతొమ్మిదవ శతాబ్దంలో మలయాళ దేశంలో బుద్ధికుశలత, సామర్థ్యం ఉన్న నంబూద్రిలకు ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు సేరుసేరినంబూద్రి పాత్రను చిత్రించారు. ఈ పాత్ర ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు సూరినంబూద్రిపాడుతో కలిసి ప్రయాణిస్తుంది. ఎక్కడా తన అభిప్రాయాన్ని మార్చుకోదు. “సేరుసేరి నంబూద్రి, సూరి నంబూద్రిపాడుకి స్నేహితుడు. వీరు సంస్కృతంలో గొప్ప విద్వాంసులు, లక్షణ గ్రంథాలను చక్కగా చదువుకున్నారు. సంగీతమంటే చాలా అభిమానం. చూడ్డానికి మంచి లక్షణమైన మోహము

శరీరము కలిగినవారు. వీరికి కొంచెంకూడా చెడ్డ ఆలోచనలు లేవు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 89). ఇవి సేరుసేరినంబూద్రి పాత్రను పరిచయం చేస్తూ ఒ.చందుమీనన్‌గారు ప్రయోగించిన వాక్యాలు. సేరుసేరి చదువుకున్న వాడని, అందగాడని, లోకజ్ఞానం తెలిసినవాడని ఈ వాక్యాలు తెలుపకనే తెలుపుతున్నాయి. ఇన్ని మంచి లక్షణాలు కలిగిన సేరుసేరి నంబూద్రి, సూరినంబూద్రిపాదుని అనునిత్యం పొగడేవాడు. నవల ఆసాంతం సూరినంబూద్రిపాదు ఏ పని చేసినా దాన్ని సేరుసేరి నంబూద్రి సమర్థిస్తూ నిందా స్తుతి చేయడం కనిపిస్తుంది. సూరినంబూద్రిపాదు ఇందులేఖను చూడడానికి ముందే సేరుసేరి నంబూద్రి ఇందులేఖను కలుస్తాడు. ఇందులేఖకు, మాధవునికి మధ్య ఉన్న ప్రేమను గురించి తెలుసుకుంటాడు. ఇందులేఖ తండ్రి కేశవ నంబూద్రి సూరినంబూద్రిపాదుతో ఇందులెఖకు సంబంధం ఏర్పర్చమని చెప్పిన సందర్భంలో అది కుదరదని సేరుసేరి నంబూద్రి కేశవ నంబూద్రితో ఖరాఖండీగా చెప్తాడు. ఇందులేఖ మాదవునికి దక్కడమే సరైనదని మనసులో తీర్మానించుకుంటాడు. తాను ఇందులేఖను కలిసినట్టుగాగాని, ఇందులేఖ మాధవున్ని ఇష్టపడుతున్నట్లుగా గాని సూరినంబూద్రిపాదు వద్ద చెప్పడు. అంతేగాక కేశవ నంబూద్రి నుండి సూరినంబూద్రిపాదుకు ఇందులేఖను చూసి వెళ్ళవల్సిందిగా కోరుతూ లేఖ వచ్చిన సందర్భంలో సేరుసేరి నంబూద్రి సూరి నంబూద్రిని అమితంగా కీర్తిస్తాడు. సూరినంబూద్రి అందగాడని, అతన్ని చూడగానే ఇందులేఖ మైమరిచి పోతుందని నిందాస్తుతి చేస్తాడు. ఈ నిందాస్తుతిని సూరినంబూద్రిపాదు నిజమైన స్తుతిగా భావించి సంతోష పడతాడు. సూరినంబూద్రిపాదు తన బంగారు సామాగ్రిని గురించి, వేశ్యాస్త్రీలు తన గురించి మాట్లాడుకున్న విషయాల గురించి సేరుసేరి నంబూద్రివద్ద ఎన్నిసార్లు చెప్పినా అన్నిసార్లు సేరుసేరి ఓపికతో వింటాడు. విన్న ప్రతీసారి సూరినంబూద్రిని ఇంద్రుడు, చంద్రుడు అంటూ ఆకాశానికి ఎత్తేస్తాడు. సూరినంబూద్రిపాదు ఇందులేఖ ఇంటికి వెళ్లిన సందర్భంలో సేరుసేరి కూడా అతనితో పాటు ఇందులేఖ ఇంటికి వెళ్తాడు. సూరినంబూద్రిపాదుతో సేరుసేరినంబూద్రి కూడా వచ్చాడని తెలిసి ఇందులేఖ సంతోష పడుతుంది. పంజుమీనన్ ఇంట్లో సూరినంబూద్రిపాదు ఇందులేఖ వద్ద ఒక శ్లోకం పూర్తిగా గుర్తుకు రాకపోవడం వల్ల అబాసుపాలవుతున్న సందర్భంలో సేరుసేరి తాటాకుపై ఆ శ్లోకాన్ని రాసి నంబూద్రిపాదుకు ఇచ్చి అతని మర్యాదను కాపాడతాడు. పంజుమీనన్ ఇంట్లో ఇందులేఖను చూసిన సందర్భంలో తాను సూరినంబూద్రి బలవంతం మీదనే వచ్చానని తనకీ సూరినంబూద్రి రాకకు ఎటువంటి సంబంధం లేదని ఇందులేఖతో అంటాడు. మాధవునితో ఇందులేఖ వివాహం

జరగాలని తాను బలంగా కోరుకుంటున్నట్లు ఇందులేఖకు చెప్తాడు. ఇలా ఒక పక్క ఇందులేఖకు మాధవునికి వివాహం జరుగుతుందని ఇందులేఖ వద్ద చెప్పిన సేరుసేరి, సూరి నంబూద్రిపాడు వద్ద ఇందులేఖ మీ వంటి పురుషుడిని ఇదివరకు చూసి ఉండక పోవచ్చు. మిమ్మల్ని చూడగానే భ్రమించి ఉంటుంది అంటూ అతన్ని పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేస్తాడు. ఈ రకమైన ప్రవర్తన డబ్బులేని నంబూద్రిలు, డబ్బున్న నంబూద్రిల పోషణలో ఉంటూ అనుక్షణం వారికి చేసే నిందాస్తుతికి నిదర్శనం. ప్రేమ గురించి సూరినంబూద్రిపాడు సేరుసేరి వద్ద ప్రస్తావించిన సందర్భంలో సేరుసేరి ప్రేమ స్త్రీ, పురుషులిద్దరిలో కలగాలని అలా కలిగినప్పుడే అది నిజమైన ప్రేమ అవుతుందని ప్రేమపై తనకున్న అభిప్రాయాన్ని సూరినంబూద్రిపాడుతో పంచుకుంటాడు. ఈ సందర్భంగా ఇష్టం లేని స్త్రీని ప్రేమించడం బలాత్కారంతో సమానమని దానితో అపకీర్తి వస్తుందని సూరినంబూద్రిపాడుని సేరుసేరి హెచ్చరిస్తాడు. సేరుసేరి మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించని సూరినంబూద్రిపాడు ఇందులేఖను మోహించి భంగపాటుకు గురవుతాడు. ఈ విషయం ముందే పసిగట్టిన సేరుసేరినంబూద్రి సూరినంబూద్రిపాడుపై సహానుభూతిని ప్రదర్శిస్తాడు. కళ్యాణకుట్టితో సూరినంబూద్రి వివాహం నిశ్చయమైందని తెలిసి సంతోషిస్తాడు. ఇందులేఖకు మాధవునికి త్వరలోనే వివాహం జరుగుతుందని ఇందులేఖకు చెప్పి సేరుసేరి, సూరి నంబూద్రితోపాటు వెళ్లిపోతాడు. ఇలా నవల ఆసాంతం సూరినంబూద్రిపాడు పక్కనే ఉండి అతని వ్యవహారాలను సేరుసేరి నంబూద్రి చూసుకుంటాడు. ఎన్ని తెలివితేటలున్నా ధనం లేకపోవడంవల్ల సేరుసేరి సూరినంబూద్రిపాడుకు వత్తాసు పలకడం, అతనిని అనునిత్యం స్తుతించడం ఇందులేఖ నవలలో కనిపిస్తుంది. ఇది డబ్బున్న నంబూద్రిల డాంభిక ప్రవృత్తికి, డబ్బులేని నంబూద్రిల నిస్సహాయ స్థితికి నిదర్శనం.

### 4.1.1.16. శంకరశాస్త్రి

ఇందులేఖ నవలలో ఇతివృత్తం ప్రధాన మలుపు తిరగడానికి కారణమైన పాత్ర శంకరశాస్త్రి. శంకరశాస్త్రి బాగా చదువుకున్న ఆచారవంతుడైన బ్రాహ్మణుడు. మాధవుని స్నేహితుడు. ఇందులేఖతో దగ్గరి పరిచయం ఉన్న వ్యక్తి. మాధవుని బాగుకోరే వక్తిగా ఇందులేఖతో మాధవుని పెళ్ళి జరగాలని అనుకుంటాడు. పంజుమీనన్ శపథం, తద్వారా నంబూద్రిపాడు రాకతో ఇందులేఖ, మాధవుల వివాహానికి అంతరాయం ఏర్పడుతుందని తెలిసి బాధపడతాడు. నంబూద్రిపాడు సంపదను చూసి ఊరిలోని ప్రజలు అతను అందగాడు, ఇంద్రుడు, చంద్రుడు అని పొగుడుతుంటే శంకరశాస్త్రి నంబూద్రిపాడు మోహం గుర్రం

మొహమని వారి పొగడ్తలను తిప్పికొడతాడు. కొలనుగట్టు వద్ద, వంట ఇంట్లో, గుడిలో ఇలా అనేకచోట్ల గ్రామప్రజలు ఇందులేఖకి, నంబూద్రిపాడుతో వివాహం నిశ్చయించబడిందని మాట్లాడుకుంటుంటే విని అది నిజం కాదని వారితో వాగ్వివాదానికి దిగుతాడు. ఈ విషయంలో నిజానిజాలు తెలుసుకుందామని ఇందులేఖను కలవడానికి వెళ్లిన సందర్భంలో కుంజికుట్టియమ్మ ఇందులేఖ నిజంగానే నంబూద్రిపాడుతో సంబంధానికి ఒప్పుకుందని శంకరశాస్త్రితో చెబుతుంది. కుంజికుట్టియమ్మ మాటలు విన్న తరువాత శంకరశాస్త్రి ఆశ్చర్యానికి గురవుతాడు. "ఈ మహాపాపి ఇందులేఖ ఇలాంటి రాతి మనస్కురాలై పోయిందే! ఎంత దురవస్థ డబ్బు ఎవరి దగ్గర అధికంగా ఉందో వాడే భర్త అని తీర్మానించే ఈ నాయరు స్త్రీలకు ఏం చేయడానికి వీలుకాదు" (జయప్రకాశ్, ఎస్(అ). 2016:143) అంటూ ఇందులేఖను తిట్టుకుంటాడు. నంబూద్రిపాడు స్వభావాన్ని అతని సేవకుడు చిన్నభట్టరు ద్వారా తెలుసుకుని బాధపడతాడు. సూరినంబూద్రిపాడుకు, కళ్యాణకుట్టికి నిర్ణయించబడిన వివాహాన్ని శీనుభట్టరు ఇందులేఖకు సూరినంబూద్రిపాడుకు నిర్ణయించబడినట్లుగా తప్పుడు ప్రచారం చేయగా అందులోని నిజానిజాలు తెలుసుకోకుండా అది నిజమేనని శంకరశాస్త్రి నమ్ముతాడు. తాను నమ్మడమే కాక ఇందులేఖను వివాహం చేసుకోవడానికి మద్రాసు నుండి ఎంతో ఉత్సాహంతో వచ్చిన మాధవునికి అదే విషయం చెప్తాడు. మాధవుడు శంకరశాస్త్రి మాటలు విన్న తర్వాత తాను విన్న విషయాలన్నీ నిజమేనని నమ్మి ఇందులేఖను కలవకుండా బాధతో ఉత్తర భారతదేశ యాత్రలకు వెళ్తాడు. తర్వాత నిజం తెలుసుకున్న శంకరశాస్త్రి తన తప్పుడు వర్తమానం వల్లే మాధవుడు దేశ సంచారానికి వెళ్ళాడని బాధపడతాడు. ఇలా నవల కథ జరుగుతున్న కాలంలో నవలలోని ప్రధాన పాత్రల గురించి మిగతా పాత్రలు మాట్లాడుకున్న విషయాలు శంకరశాస్త్రి పాత్ర ద్వారా పాఠకులకు ఒ.చందుమీనన్‌గారు అందించారు. మాధవుని ఉత్తర భారతదేశ యాత్రకు శంకరశాస్త్రి కారణమవుతాడు. ఈ యాత్రవల్ల మాధవునికి ఉత్తరభారత విషయాలు తెలియడంతోపాటు యాత్ర అనంతరం ఇందులేఖతో అతని వివాహం జరుగుతుంది.

### 4.1.1.17. గిల్‌హామ్ దొర

మాధవునిమీద అత్యంత ప్రేమ అభిమానాలుగల ఆంగ్లేయ అధికారి గిల్‌హామ్ దొర. మాధవున్ని సివిల్ సర్వీసు పరీక్షకు ఎంపిక చేయాలని గిల్‌హామ్ దొర అనుకుంటాడు. పంతొమ్మిదవ శతాబ్దంనాడు భారతీయులపట్ల ప్రేమాభిమానాలు కలిగిన ఆంగ్లేయ దొరలకు

ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు గిల్‌హామ్ దొర పాత్రను చిత్రించారు. గిల్‌హామ్ దొర మాధవునికి ఉద్యోగ విధి నిర్వహణ పరంగా పూర్తిస్వేచ్ఛని ఇస్తాడు. మాధవుడు తన పెళ్ళి నిమిత్తం సెలవులు కావాలని అడిగితే వెంటనే సెలవులను మంజూరు చేస్తాడు. ఇందులేఖ వివాహం విషయంలో అసత్య ప్రచారం నమ్మి మాధవుడు మద్రాసుకు తిరిగివచ్చిన సందర్భంలో అతని విషాదానికిగల కారణాన్ని గిల్‌హామ్ దొర అడిగి మాధవున్ని శాంత పరుస్తాడు. మాధవుడు తాను దేశసంచారానికి ఐరోపాదేశం వెళ్ళాలనుకుంటున్నానని అందుకు తనకు ఒక సంవత్సరం సెలవు కావాలని అడిగిన సందర్భంలో గిల్‌హామ్ దొర రాబోయే మూడునెలల కాలంలో ఐరోపాలో చలి ఎక్కువగా ఉంటుంది. అక్కడికి వెళ్ళవద్దని చెప్తాడు. మాధవున్ని వెతుకుతూ తన వద్దకి వచ్చిన గోవిందపణిక్కర్, గోవిందకుట్టిమీనన్‌లకు గిల్‌హామ్ దొర మాధవుడు క్షేమంగా ఉన్నాడని, అతను ఉత్తరభారతదేశ యాత్రకు వెళ్ళాడని సమాచారమిస్తాడు. గిల్‌హామ్ దొర సమాచారం మేరకు గోవిందపణిక్కర్, గోవిందకుట్టిమీనన్‌లు బొంబాయిలో మాధవున్ని కలుసుకుంటారు. ఇలా నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించేవరకు మాధవుని ఉత్తర భారత యాత్రకు సహకరించిన వ్యక్తిగా గిల్‌హామ్ దొర పాత్ర ప్రవర్తన చిత్రితమైంది. ఈ ప్రవర్తన పంతొమ్మిదవ శతాబ్దం నాటి ఆంగ్లేయ దొరలు భారతీయులపై చూపిన ప్రామానురాగాలకు నిదర్శనం.

### 4.1.1.18. షియా అలిఖాన్

షియా అలిఖాన్ ఒక దారిదోపిడి దొంగ. ప్రయాణ సమయంలో అప్రమత్తంగా లేకుంటే దొంగలు ఎలా మోసం చేస్తారని చెప్పడానికి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు 'షియాఖాన్' పాత్రను చిత్రించారు. పంతొమ్మిదవ శతాబ్దంలో దారిదోపిడీలు జరిగాయనడానికి ఈ షియా అలిఖాన్ పాత్ర నిదర్శనం. కలకత్తా నుండి బొంబాయికి రైలులో బయలుదేరిన మాధవుడు ఒకచోట ఫలహారం చేయడానికి దిగుతాడు. అదే స్టేషన్‌లో ఉన్న షియా అలిఖాన్ అతని అనుచరులు మాధవున్ని చూసి ఇతను ఆ ప్రాంతానికి చెందినవాడు కాదని గుర్తించి, మారువేషం ధరించి, మాధవున్ని ఏమార్చి అతని వద్దనున్న పెట్టెని దొంగిలిస్తారు. 'షియా అలిఖాన్' ఒక చదువుకున్న వ్యక్తివలే తన ఆహార్యాన్ని మార్చుకొని మాధవునితో పరిచయం పెంచుకుంటాడు. షియా అలీఖాన్ ఆకారాన్ని చూసి మాధవుడు అతను తాను అలహాబాదులో 'సబార్డినేట్ జడ్జి' అని చెప్పినా నమ్ముతాడు. షియా అలీఖాన్ మాధవుడిని మాటల్లో పెట్టి అతను ఒంటరిగా

ఉన్నాడని, అతని వెంట ఎవరూ లేరని గ్రహిస్తాడు. ఒక స్టేషన్‌లో రైలుబండి ఆగగానే మాధవుడిని ఫలహారం నెపంతో ఫ్లాట్‌ఫాం మీదకు తీసుకెళ్తాడు. ఫ్లాట్‌ఫాంమీద ఉన్న రిఫ్రెష్‌మెంట్ రూములో కొద్దిసేపు మాధవునితోపాటు కూర్చొని కావలసినవన్నీ తెప్పించుకుంటాడు. రైలు బయలుదేరే సమయంలో తన పిల్లవాడిని తీసుకువస్తానని మాధవునితో అబద్ధం చెప్పి అప్పటికే మాధవుని పెట్టె వద్ద ఉన్న తన మిత్రునితో కలిసి రైలు ఎక్కి పరారౌతాడు. అటు తరువాత షియా అలీఖాన్ పాత్ర కనిపించదు. పంతొమ్మిదవ శతాబ్దంనాటి దారిదోపిడి దొంగల ప్రవర్తనకి ప్రతీకగా షియా అలీఖాన్ ప్రవర్తన కనిపిస్తుంది.

#### 4.1.1.19. కుట్టిభట్టరు

పంజుమీనన్ ఇంట్లో పనిచేసే పనివాడు. నవలలోని పాత్రలకు టీ, ఫలహారాలు అందిస్తుంటాడు.

### 4.1.2. స్త్రీ పాత్రలు

#### 4.1.2.1. ఇందులేఖ

'ఇందులేఖ' నవలలో నాయిక ఇందులేఖ పాత్ర. నవల రెండవ భాగంలో ఇందులేఖ పాత్రను ఒ.చందుమీనన్‌గారు పరిచయం చేశారు. నవల కథ ప్రారంభమయ్యే కాలానికి ఇందులేఖ వయస్సు 18 సంవత్సరాలు. ఇందులేఖ ఇంటి పెద్ద పంజుమీనన్‌కి మనుమరాలు. ఇందులేఖ సౌందర్యవతి, గుణవతి. తండ్రి మరణించిన తరువాత మేనమామ కొచ్చుకృష్ణమీనన్ వద్ద పెరిగింది. ఇందులేఖ ఆంగ్లం నేర్చుకుంది. సంగీతంలో పియానో, ఫిడేలు, వీణ మొదలైన వాటిని నేర్చుకుంది. కుట్టుపని, చిత్రలేఖనం కూడా నేర్చుకుంది. ఇలా అన్ని గుణాలుగల ఉత్తమ స్త్రీ పాత్రగా ఇందులేఖ పాత్రను రచయిత చిత్రించారు. ఇందులోని ఆంతర్యం నవలా లక్ష్యానికి దగ్గరగా ఉంది. ఇందులేఖ నవల ద్వారా చందుమీనన్ గారు అందించే సందేశాలలో ఆంగ్ల విద్యావశ్యకత ప్రధాన అంశంకాగా, స్త్రీ విద్య ఇంకో అంశం. ఈ రెండు లక్ష్యాలకి అక్షర రూపంగా ఇందులేఖ పాత్రని చిత్రించారు. స్త్రీ విద్యావంతురాలైతే ఆమె ఎలా స్వతంత్రంగా జీవిస్తుంది. తనకు వచ్చిన కష్టాలను చతురతతో ఎలా ఎదురుకుంటుంది. సౌందర్యంతోపాటు విద్య కూడా ఉంటే 'బంగారానికి పరిమళం అబ్బినట్లు' ఆ స్త్రీ జీవితం ఎలా ఉంటుంది. అన్న అంశాలు చందుమీనన్‌గారు మలయాళ సమాజానికి తెలపాలనుకున్నారు. ఈ అంశాలకి ప్రతీకగా ఇందులేఖ పాత్రను సృష్టించారు. ఈ అంశాలను ఇందులేఖ పాత్రను వర్ణించే

సందర్భంలో స్పష్టపరిచారు. "ఇందులేఖ దైనందిన ప్రవర్తన, సంప్రదాయాలు, స్వభావము ఆమెకు లభించిన విద్యకారణంగా, మేనమామ కొచ్చుకృష్ణమీనన్ బుద్ధిచాతుర్యాలచేత ఆమెకు లభించిన జ్ఞానం కారణంగా అతి రమణీయంగా ఉండేదనే చెప్పాలి." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 10)

విద్య వల్ల వివేకవంతురాలిగా మారిన ఇందులేఖ హిందు సంప్రదాయాన్ని వీడి ప్రవర్తించలేదు. ఆంగ్లం చదివిన వెంటనే హిందూ సంప్రదాయాలు వ్యర్థం అంటూ మాట్లాడలేదు. స్నానపానాదులు, వస్త్రధారణ మాట్లాడే పద్ధతి, అమ్మ, తాత మొదలైన వారి పట్ల భక్తి విశ్వాసాలను కలిగి ఉండటం, తన పల్లెటూరి స్నేహితురాళ్ళతో స్నేహంగా ఉండటం మొదలైన లక్షణాలు ఇందులేఖ పాత్రలో కనిపిస్తాయి. ఈ అంశాలు విద్యతో పాటు వివేకం కూడా కలిగి ఉండాలన్న సందేశాన్ని ఇస్తున్నాయి. అంతే కాక ఎంత చదివినా మన సంప్రదాయంలోని మంచి లక్షణాలను విడవరాదు అనే అంతరార్థాన్ని తెలుపుతున్నాయి.

ఇందులేఖ మాధవున్ని ఇష్టపడింది. కాని తన ఇష్టాన్ని మాధవునికి చెప్పలేదు. చెబితే దానివల్ల అతని చదువుకు అంతరాయం ఏర్పడుతుందని భావించింది. ఇందులేఖ 'మరుమక్కతాయం (మాతృస్వామ్య)' సంప్రదాయంలోని 'తరవాడు(ఉమ్మడి)' కుటుంబానికి చెందిన స్త్రీ. తరవాడు సంప్రదాయం ప్రకారం 'ఇందులేఖ' ఎవరినైనా భర్తగా ఎన్నుకోవచ్చు. ఏ నంబూద్రి అయినా ఇందులేఖని కోరవచ్చు. వాస్తవానికి సంప్రదాయ ఆలోచనలుగల స్త్రీ అలా చేసేది. ఇందులేఖ అలా చేయలేదు. ఎందుకంటే ఇందులేఖ చందుమీనన్‌గారి ఆశయాలకు అనుగుణంగా చిత్రించబడ్డ పాత్ర. చందుమీనన్‌గారు ఇందులేఖ నవల ద్వారా ఆనాటి సమాజానికి తెలపాలనుకున్న అనేక అంశాలలో రెండు అంశాలు ప్రధానమైనవి. ఒకటి తరవాడు సంప్రదాయంలో ఉన్న ఆచారాలు, సంప్రదాయాలు వాటిపట్ల ప్రజల మనసులో ఉన్న అభిప్రాయాలు. రెండు వివాహ విషయంలో తరవాడు స్త్రీకి ఇచ్చిన స్వేచ్ఛ, తరవాడు స్త్రీలు ఆ స్వేచ్ఛను వినియోగించుకున్నతీరు. ఈ రెండింటిని పాఠకులకు తెలపాలకున్నారు. తరవాడు ఆచారం ప్రకారం నాయర్ స్త్రీలు తమకు నచ్చిన నంబూద్రి పురుషుడిని పెళ్ళాడవచ్చు. కాబట్టి వీరు తమ మనసుకు కాక ధనానికి ప్రాధాన్యం ఇచ్చి ఎవరివద్ద ధనం ఎక్కువగా ఉంటే వారినే వివాహం చేసుకుంటారు. అనే అభిప్రాయం ఆనాటి సమాజంలో ఉండింది. దీనికి సమాధానం

చందుమీనన్‌గారు ఇందులేఖ పాత్ర ద్వారా  చెప్పారు. "ఇందులేఖ తన వివాహ విషయంలో ఖచ్చితమైన అభిప్రాయాన్ని కలిగి ఉంటుంది "నాకు ఈ విషయంలో డబ్బు గడ్డిపోచ రెండూ సమానమే. నా మనసుకు ఇష్టపడినవారే నాకు భర్త అని నేను తీర్మానించి ఉన్నాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 36). అని ఇందులేఖ మాధవునితో తెగేసి చెబుతుంది. వివాహ సమయంలో మలయాళ నాయర్ స్త్రీకి లభించిన స్వేచ్ఛవల్ల వారు ఎంతమందినైనా తమ భర్తలుగా ఎన్నుకుంటున్నారు. తద్వారా మలయాళ నాయర్ స్త్రీలు పతివ్రతాధర్మానికి దూరమౌతున్నారు అన్నది ఆనాటి ప్రజలలో ఉన్న రెండవ భావన. ఇదే ప్రశ్నని మాధవుడు ఇందులేఖని అడుగుతాడు అప్పుడు ఇందులేఖ మాధవుని తెలివి తక్కువ తనానికి ఆశ్చర్యపడి మలయాళ స్త్రీ గొప్పతనాన్ని అతనికి వివరిస్తుంది. "ఏం చెప్పారు? మలయాళ స్త్రీలు పతివ్రతా ధర్మాన్ని అనుసరించడంలేదా? మిగిలిన దేశాల్లోని స్త్రీలవలే మలయాళ స్త్రీలు కూడా తప్పకుండా పతివ్రతా ధర్మాన్ని అనుసరిస్తారు. ఎంతో మంది స్త్రీలు దీన్ని ఆచరిస్తున్నారు. ఒక స్త్రీ పతివ్రతా ధర్మాన్ని అనుసరించడంలేదని చెబితే ఆమె వ్యభిచారి అని అర్థమా? అలా చెబితే నేను దానిని అంగీకరించను. మన నాయర్ స్త్రీలు బ్రాహ్మణ అంతర్జనులవలె మిగిలిన ప్రజలతో మాట్లాడకుండా, విద్యాభ్యాసం చేయకుండా కట్టుబాటుతో నడుచుకోకపోవడం వలన వ్యభిచారులనో, పతివ్రతాధర్మం లేదనో మీరు అనుకుంటే దీనికన్న అబద్ధమైన తలంపు వేరే ఏదీ లేదు. ఐరోపా, అమెరికా మొదలైన రాజ్యాలలో స్త్రీల స్థితిని కొంత ఆలోచించి చూడండి. ఈ రాజ్యాలలో పురుషులకు, స్త్రీలకు చదువు, తెలివితేటలు, స్వేచ్ఛా స్వతంత్రాలు ఇవన్నీ ఒకేవిధంగా ఉంటాయి కదా! మరి ఈ స్త్రీలందరూ వ్యభిచారులా? ఈ వైపు ఒక అందమైన యువతికి పెద్దపెద్ద చదువులు ఉన్నట్లైతే ఆమెతో మాట్లాడే, పరిచయం ఉన్న పురుషులంతా ఆమెకు ఎవరితోనో రహస్య సంబంధం కూడా ఉన్నదని వెంటనే అనుకుంటారు. దీనిలో ఎంత వాస్తవముంది? సంగీతం తెలిసిన ఒక స్త్రీ పాడుతుండగా పదిమంది పురుషులు  ఒకటిగా చేరి వింటే ఆ పదిమంది పురుషులు ఆమె రహస్య ప్రేమికులని మీరు చెబుతారా?" (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 38). ఇలా స్త్రీలను చూసే పురుషుల చూపులోనే తేడా ఉంది తప్ప వారు ఎన్నడు తప్పుగా ప్రవర్తించ లేదని ఇందులేఖ చెబుతుంది. ఈ మాటలు నాటి సమాజంలోని స్త్రీలని చూడాల్సిన విధానాన్ని గురించి చెబుతున్నాయి. ఇందులేఖ తనని ఎంత మంది ఇష్టపడినా తాను ఎంత మందితో మాట్లాడినా మాధవుడే తన భర్త అని మనస్సులో గట్టిగా నిర్ణయించుకుంటుంది. ఆమె

నిర్ణయానికి వ్యతిరేకంగా మాధవుడు మాట్లాడటంతో తన మనోవాంఛని మాధవన్‌పై తనకున్న ప్రేమని బయటపెడుతుంది.

పంజుమీనన్ మాధవుని మీద కోపంతో ఇందులేఖని మాధవునికిచ్చి పెళ్ళిచేయనని తీర్మానించిన సందర్భంలో ఇందులేఖ బాధపడుతుంది. తానుకూడా మాధవునితో మద్రాసుకు వస్తానని మాధవునితో అంటుంది. అందుకు మాధవుడు అంగీకరించక పోవడంతో మాధవుని రాక కోసం తాను ఎదురుచూస్తుంటానని అతన్ని మద్రాసుకు పంపుతుంది. మాధవుడు మద్రాసుకు వెళ్లిన తరువాత పంజుమీనన్ ఇందులేఖ వద్దకు వచ్చి తాను ఇందులేఖ వివాహాన్ని సూరి నంబూద్రిపాదుతో నిర్ణయించినట్లుగా చెబుతాడు. పంజుమీనన్ మాటలకు ఇందులేఖ నర్మగర్భంగా సమాధానం చెబుతుంది.

పంజుమీనన్‌ని చూసి ఇంట్లో ఉన్న వాళ్ళందరూ బయపడినా ఇందులేఖ మాత్రం పంజుమీనన్‌కి జంక కుండా మాట్లాడుతుంది. పంజుమీనన్ కూడా ఇందులేఖని చూసి భయపడతాడు. ఇందులేఖలోని ధైర్యానికి ఆమె విద్య ప్రధాన కారణమని పంజుమీనన్ అనుకుంటాడు. ఎంత మంది ఎన్ని రకాలుగా చెప్పినా ఇందులేఖ మాత్రం తన అభిప్రాయాన్ని మార్చుకోదు. మాధవుడే తన భర్త అని అందరి వద్ద ఖరాఖండీగా చెబుతుంది. ఈ విషయం తెలుసుకున్న పంజుమీనన్ ఇందులేఖ వివాహం విషయంలో కాస్త వెనక్కి తగ్గుతాడు. ఇందులేఖకు ఇష్టంలేకుండా నంబూద్రిపాదుతో ఆమె వివాహం జరిపించనని తన కుమారుడు గోవిందన్ కుట్టి మీనన్‌తో చెబుతాడు. ఈ విషయం గోవిందన్‌కుట్టిమీనన్ ఇందులేఖవద్ద చెప్పగా ఇందులేఖ సంతోషపడుతుంది.

నంబూద్రిల వద్ద నాయర్ స్త్రీలు నిలబడి మాట్లాడటం ఆచారం. ఈ ఆచారానికి విరుద్ధంగా ఇందులేఖ తనతో సంభాషించడానికి తన గదిలోకి వచ్చిన నంబూద్రిపాదు ముందు కూర్చుని అతని కళ్ళల్లో కళ్ళుపెట్టి సూటిగా మాట్లాడుతుంది. ఈ ప్రవర్తనని చూసి సూరి నంబూద్రిపాదు ఆశ్చర్యపోతాడు. ఈ అమ్మాయికి ఎంత అహంకారమని మనసులో అనుకుంటాడు. సూరినంబూద్రిపాదు ధనాన్ని చూసి ఇందులేఖ మాధవున్ని మరిచిపోతుందని అందరూ అనుకుంటారు. అప్పటికే  మానసికంగా మాధవున్ని పరిణయమాడిన ఇందులేఖ

సూరినంబూద్రిపాదు ధనానికి లొంగక అతన్ని అబాసుపాలు చేసి ఎప్పటికి ఇందులేఖ అతనికి దక్కదని చెప్పి తన గదిలోంచి పంపించి వేస్తుంది. ఈ రకమైన ధైర్యం, తెగువ నవలలోని మిగతా పాత్రలలో కనిపించదు.

ఇందులేఖ ప్రవర్తనని గమనించిన నంబూద్రిపాదు ఇందులేఖ తనకి దక్కదని తెలిసి కళ్యాణకుట్టిని రహస్యంగా వివాహం చేసుకుంటాడు. ఈ వివాహ విషయం తెలిసి ఇందులేఖ సంతోషపడుతుంది. తనకూ నంబూద్రిపాదుకు వివాహం జరిగిందన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మి మాధవుడు దేశ సంచారానికి వెళ్ళాడని తెలిసి ఇందులేఖ బాధపడుతుంది. తన గురించి మాధవుడు తప్పుగా ఆలోచించాడని మదనపడుతుంది. మాధవుడు క్షేమంగా తిరిగి వస్తాడని తన అత్త పార్వతియమ్మకి ధైర్యం చెబుతుంది. చదువు పూర్తి అయిన తరువాత వెంటనే దేశసంచారం చేయడం అవసరమని ఇందులేఖ నమ్ముతుంది. అదే విషయాన్ని మాధవుని తల్లితో చెప్పి ఆమె బాధను తగ్గిస్తుంది. మాధవుని రాక గురించి తెలిపే టెలిగ్రాము ఏదైనా వస్తుందేమోనని సందేహించి ప్రతీ రోజు ఒక మనిషిని స్టేషన్‌కు పంపి వివరాలు కనుక్కొనే ఏర్పాటు కూడా ఇందులేఖ చేస్తుంది. ఒకరోజు మాధవునికి ముస్లీంలవల్ల ఆపద కలిగినట్లుగా కలగని ఉలిక్కి పడుతుంది. తన కలగురించి తన తల్లి లక్ష్మికుట్టికి చెబుతుంది. ఇదే విషయం పంజుమీనన్ వద్ద చెప్పగలవా? అని లక్ష్మికుట్టి ఇందులేఖని ప్రశ్నించిన సందర్భంలో. 'నాకిక దేనికీ భయంలేదు. నా మనసులో ప్రస్తుతానికి ఒకే ఒక ఆవేగం ఉంది. నేను నా భర్తను భర్త అని పిలవడం తాత గారికి ఇష్టం లేకుండా ఉండవచ్చు. ఉండక పోని దైవాధీనంగా యవ్వన కాలంలో నా మనసుకు సంపూర్ణ సుఖానందాలను ఇస్తారని నాకు నమ్మకము యోగ్యుడైన ఒకరిని భర్తగా భావించుకొని మనసులో వరించుకునే అదృష్టం కలిగింది.' అది కూడా ఇప్పుడు ఫలించ కుండా పోతుందేమోనని నాకు భయంగా ఉంది. నేను దురదృష్టవంతురాలిని కాబట్టే ఇదంతా జరుగుతూ ఉంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 344) అంటూ ఇందులేఖ తన మనోగత బాధను తల్లి ముందు వెళ్ళగక్కుతుంది. ఈ విషయం తెలిసిన పంజుమీనన్ ఇక మీదట ఇందులేఖని బాధ పెట్టడం ఇష్టం లేక తన శపథాన్ని వెనక్కి తీసుకొని ఇందులేఖకి మాధవునితో వివాహం జరిపిస్తానని కుటుంబ సభ్యులందరి ముందు చెప్తాడు. తాను అన్నట్లుగానే ఇందులేఖని మాధవునికి ఇచ్చి వివాహం జరిపిస్తాడు. ఇలా నవల ఆసాంతం చదువుకుని మనోధైర్యం ఉన్న స్త్రీ ప్రవర్తనకి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు ఇందులేఖ పాత్రను చిత్రించారు.

### 4.1.2.2. పార్వతియమ్మ

"పార్వతియమ్మ మాధవుని తల్లి ఈమె తన మామ పంజుమీనన్ మాటలను జవదాటి ఎరుగదు. మధ్యతరగతి స్త్రీ మనస్తత్వానికి ప్రతీక పార్వతియమ్మ పాత్ర. మొదటి భాగంలో మాధవుడు పంజుమీనన్ అభిప్రాయానికి భిన్నంగా చిన్నడిని చదివిస్తాను అంటే అతన్ని తిడుతుంది. అంతే కాక ఇంటి పెద్దవారి నిర్ణయానికి కట్టుబడి ఉండాలని అతనితో అంటుంటుంది. రెండవ భాగంలో పార్వతియమ్మ పాత్ర ప్రవర్తన తల్లి మనస్సుకు తార్కాణంగా నిలుస్తుంది. ఇందులేఖపై మాధవుడు మనసుపడ్డ విషయం పార్వతియమ్మకి తెలియదు. ఆమె ఇందులేఖ వద్ద తన కుమారుడు విపరీతంగ ప్రవర్తిస్తున్నాడని అతనికి ఏ జ్వరం వచ్చిందో అని బాధపడుతుంది. "అన్నం తినడం లేదు. రెండు పూటలా నిర్బందించి అన్నం తినాలని చెప్పవలసి ఉంది. పాలుగానీ, టీ గానీ ఏదీ తాగడంలేదు. అతనితో ఉన్నవాళ్ళు అతను రాత్రి నిద్ర పోవడం లేదని కూడా చెబుతున్నారు. ఏమిటో శరీరానికి ఏదైనా పెద్ద కీడు కలుగుతుందేమోనని భయపడుతున్నాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 41). ఈ మాటలు స్వచ్ఛమైన మాతృ ప్రేమకి నిదర్శనాలు. ఇందులేఖ తాను మాధవుని జ్వరాన్ని నయం చేస్తాను అతన్ని తన వద్దకు పంపమనగా అమాయకురాలైన పార్వతియమ్మ మాధవుడిని ఇందులేఖ వద్దకు పంపుతుంది. మాధవుడు ఉద్యోగం నిమిత్తం మద్రాసుకు వెళ్ళే సందర్భంలో తల్లిగా తగిన జాగ్రత్తలు చెప్పి అతన్ని మద్రాసుకు పెంపుతుంది. మాధవునికి మద్రాసులో ఉద్యోగం లభించిందని ఇందులేఖ ద్వారా తెలుసుకుని సంతోష పడుతుంది. నంబూద్రిపాదు కళ్యాణకుట్టిని వివాహం చేసుకుంటున్నాడని తెలిసి ఆనంద పడుతుంది. ఇందులేఖ వివాహం విషయంలో తప్పుడు ప్రచారాన్ని నమ్మి మాధవుడు దేశ సంచారానికి వెళ్ళాడని తెలిసి అమితంగా బాధపడుతుంది, రోదిస్తుంది. ఎలాగైనా తన కుమారున్ని వెతికి తీసుకురావలని తన భర్తను కోరుకుంటుంది. మాధవుడు లేని సమయంలో అతన్ని తలచుకొని అమితంగా దుఖిస్తుంది. మాధవునికి ఇందులేఖ అంటే ఇష్టమని తెలుసుకుని ఇందులేఖ ఉత్తరం రాస్తే తన కొడుకు ఇంటికి తిరిగివస్తాడని ఇందులేఖని ఉత్తరం రాయమని వేడుకుంటుంది. ఇందులేఖ మాధవునికి ఏమీ కాదని ధైర్యం చెప్పడంతో దుఃఖాన్ని ఆపుకొని మాధవుని రాక కోసం ఎదురు చూస్తుంది. మాధవుడు ఇంటికి తిరిగి వచ్చిన సందర్భంలో అతను లేని సమయంలో జరిగిన విషయాలన్ని అతనికి వివరంగా చెబుతుంది. ఇలా నవల ఆసాంతం కొడుకు బాగుకోరే తల్లి మనస్తత్వానికి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు పార్వతియమ్మ పాత్రను చిత్రించారు.

### 4.1.2.3. కుమ్మినియమ్మ

మలయాళ తరవాడు కుటుంబంలో దూరపు బంధువులపై వివక్ష ఉండేది. ఈ వివక్షకి ప్రతీక కుమ్మినియమ్మ పాత్ర. కుమ్మినియమ్మ ఇంటి పెద్ద పంజుమీనన్‌కి తల్లి తరపు దూరపు బంధువు. 'పంజుమీనన్' ఇంటిపెద్దగా అందరినీ సమానంగా చూడాల్సి ఉండగా కుమ్మినియమ్మను ఆమె కుమారులు గోపాలన్, సాత్తరమీనన్, కణ్యాణకుట్టి, చిన్నడిని అందరితో సమానంగా చూడడు. ఈ విషయం కుమ్మినియమ్మకి తెలిసినా పంజుమీనన్‌ని ఎదిరించదు. ఒక సాధారణ మధ్య తరగతి స్త్రీ మనస్తత్వానికి ప్రతీకగా కుమ్మినియమ్మ పాత్రని ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు.

తన కుమారుడు చిన్నడిని మాధవుడు మద్రాసు తీసుకెళ్ళి ఆంగ్లం చదివిస్తానంటే కుమ్మినియమ్మ వద్ద ఉంటుంది. ఆంగ్లం చదవడం వల్ల తన కుమారునికి లాభం జరుగుతుందని తెలిసినా ఇంటిపెద్ద పంజుమీనన్‌ని ఎదిరించలేక మాధవుడు చిన్నడిని మద్రాసుకు తీసుకువెళ్తానన్నా వద్దంటుంది. ఇందులేఖను వివాహం చేసుకోవడానికి సూరినంబూద్రిపాడు తమ ఇంటికి వచ్చిన సందర్భంలో కుమ్మినియమ్మ అతని సంపదను చూసి ఆశ్చర్యపోతుంది. "నా వయసుకు ఇలాంటి ఊరేగింపు చూసిందిలేదు. దివాను పెద మామను చూసిన జ్ఞాపకం వస్తుంది. వారి దగ్గర కూడా ఇలాంటి ఐశ్వర్యాన్ని నేను చూడలేదు. ఇందులేఖకు పట్టిన అదృష్టం చూశావా? ఆమె చాలా అదృష్టవంతురాలు. అయినప్పటికీ మాధవున్ని గురించి తలచుకుంటే కొంత విచారంగానే ఉంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 138) అంటూ తన మనసులోని మాటని తన కొడుకు సాత్తరమీనన్‌తో పంచుకుంటుంది. ఈ మాటలు సంప్రదాయ భావాలు కలిగిన స్త్రీ మనస్తత్వానికి ప్రతీక. ప్రాచీన సంప్రదాయ ఆచారాలు పాటించే 'తరవాడు' కుటుంబానికి చెందిన స్త్రీలు తమ మనసుతో సంబంధం లేకుండా, ధనం ప్రాతి పదికగా అధిక ధనం ఉన్న నంబూద్రిలను వివాహం చేసుకునేవారనడానికి ఈ మాటలు నిదర్శనం. కుమ్మినియమ్మకు ఇందులేఖ మాధవుడిని ఇష్ట పడుతుందని తెలుసు. అయినా సూరినంబూద్రిపాడు ఐశ్వర్యాన్ని చూడగానే ఇందులేఖకి సూరినంబూద్రిపాడు మాత్రమే సరైన భర్త అని నిర్ణయించుకుంటుంది. నిర్ణయించుకోవడమేకాక ఇందులేఖ కూడా సూరి నంబూద్రిపాడును వివాహం చేసుకొని తీరుతుందని అభిప్రాయానికి వచ్చి మాధవునిపై విచారం వ్యక్తం చేస్తుంది. ఇలా తన కొడుకు చిన్నని చదువు విషయంలోనూ, ఇందులేఖ వివాహం

విషయంలోను కుమ్మినియమ్మ తరవాడు సంప్రదాయానికి లోబడి ఆలోచిస్తుంది. ఒక తల్లిగా చిన్నడు చదువుకుంటే అతను బాగుపడతాడని తెలిసినా తరవాడు సంప్రదాయానికి లోబడి ఇంటిపెద్ద పంజుమీనన్ నిర్ణయానికి ఎదురుచెప్పదు. తన కుటుంబంవల్ల మాధవునికి పంజుమీనన్‌తో సంబంధాలు దెబ్బతింటాయని బాధపడుతుంది. ఇందులేఖకి మాధవుడు సరైన వరుడని తెలిసినా 'తరవాడు' సంప్రదాయానికి లోబడి మనసుకన్నా ధనం ప్రధానమని సూరినంబూద్రిపాదుతో ఇందులేఖ వివాహం జరగాలని కోరుకుంటుంది. ఇలా వనల ఆసాంతం 'తరవాడు' సంప్రదాయానికి కట్టుబడి ప్రవర్తించే స్త్రీల మనస్తత్వానికి ప్రతీకగా ఒ. చందుమీనన్‌గారు కుమ్మినియమ్మ పాత్ర ప్రవర్తనని చిత్రించారు.

### 4.1.2.4. కణ్యాణకుట్టి

మలయాళ తరవాడు సంప్రదాయంలో వివాహ విషయంలో స్త్రీ అస్వతంత్రతకి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు కళ్యాణకుట్టి పాత్రను చిత్రించారు. ఇందులేఖ నవలలో కళ్యాణకుట్టి పాత్ర పదమూడవ అధ్యాయంలో కనిపిస్తుంది. కణ్యాణకుట్టి శీనుభట్టరు కుమార్తె. మలయాళ ప్రాంతంలోని సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక కణ్యాణకుట్టి పాత్ర. "ఈ కళ్యాణకుట్టి పూర్తిగా మలయాళ సంప్రదాయం ప్రకారం పెరిగిన స్త్రీ. రాయడమో, చదవడమో తెలియదు. పాడటం కొంత తెలుసు. అంతవరకు మాత్రమే ఆమెకు నేర్పించారు. చూడ్డానికి బాగుంటుంది. మలయాళ దేశంలో కొంత మంది స్త్రీలు పదమూడు సంవత్సరాల వయసులో మాతృత్వదశకు చేరుకోవడం సాధారణంగా ఉన్నప్పటికీ కళ్యాణకుట్టి శరీరంలో అప్పుడప్పుడే యవ్వనం ప్రారంభమైనట్లు తోస్తుంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 190). ఇవి కళ్యాణకుట్టి పాత్ర పరిచయ వాక్యాలు. ఈ వాక్యాలు కళ్యాణకుట్టి నడవడికకు నిదర్శనాలు. కళ్యాణకుట్టిని గురించి నంబూద్రిపాదు వద్ద అతని సేవకుడు గోవిందుడు చెప్పిన మాటలు గమనింపదగినవి. "పంజుమీనన్ మేనకోడలైన ఒక చక్కటి అమ్మాయి ఉంది. ఆమెకు ఇంగ్లీషు ఏమీ తెలియదు. మంచినడత గలదని అందరూ చెబుతున్నారు. పేదరాలు, మంచిగుణం, ఈ రోజు ఉదయం భోజన సమయంలో రెండు పూటలా మనల్ని జాగ్రత్తగా చూసుకున్న శీనుభట్టరు కూతురే ఆమె." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 186, 187). ఈ మాటలు విన్న తరువాత సూరి నంబూద్రిపాదు ఆంగ్లం చదివిన ఇందులేఖని వివాహం చేసుకోవడం కన్నా అమాయకురాలైన కళ్యాణకుట్టిని వివాహం చేసుకోవడమే ఉత్తమమనే అభిప్రాయానికి వస్తాడు. స్నానాలగదిలో కళ్యాణకుట్టిని చూసిన నంబూద్రిపాదు

ఆమెని మోహిస్తాడు. వెంటనే పంజుమీనన్ వద్దకు వెళ్లి తన వివాహాన్ని ఇందులేఖతో కాక కళ్యాణకుట్టితో జరిపించమని వేడుకుంటాడు. కళ్యాణకుట్టి ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండానే పంజుమీనన్ కళ్యాణకుట్టి వివాహాన్ని సూరినంబూద్రిపాదుతో నిర్ణయిస్తాడు. ఈ సంఘటన వివాహ విషయంలో మలయాళ 'తరవాడు' సంప్రదాయంలో ఉన్న స్త్రీ అస్వతంత్రకు నిదర్శనం. నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు కళ్యాణకుట్టి ఎక్కడ ఒక్క మాట కూడా మాట్లాడదు. స్నానాల గదిలో తనని నంబూద్రిపాదు చూసిన సందర్భంలో అతన్ని ఏమీ అనదు. తన వివాహ విషయంలో తలవంచుకొని తాళి కట్టించుకుంటుందేకాని పంజుమీనన్ నిర్ణయాన్ని వ్యతిరేకించదు. ఇలా మలయాళ 'తరవాడు' సంస్కృతి, సంప్రదాయాలకు కట్టుబడి జీవనాన్ని సాగించే స్త్రీ ప్రవర్తనకి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు కళ్యాణకుట్టి పాత్రని చిత్రించారు.

### 4.1.2.5. లక్ష్మికుట్టియమ్మ

ఇందులేఖ తల్లి లక్ష్మికుట్టియమ్మ పంజుమీనన్ కూతురు. మలయాళ 'తరవాడు' సంప్రదాయ భావాలు కలిగిన మధ్యతరగతి స్త్రీకి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు లక్ష్మికుట్టియమ్మ పాత్రను చిత్రించారు. లక్ష్మికుట్టియమ్మకు మొదట కిళిమానూరు రాజుతో వివాహమవుతుంది. లక్ష్మికుట్టియమ్మకి కిళిమానూరు రాజుకు ఇందులేఖ పుట్టిన తరువాత కిళిమానూరు రాజు మరణిస్తాడు. అతని మరణం అనంతరం పంజుమీనన్ లక్ష్మికుట్టియమ్మని కేశవ నంబూద్రికి ఇచ్చి వివాహం చేస్తాడు. ఇలా లక్ష్మికుట్టియమ్మ అభిప్రాయంతో సంబంధం లేకుండా ఇంటి పెద్ద ఆజ్ఞ ప్రకారం ఆమెకు రెండు వివాహాలు జరుగుతాయి. ఈ సంఘటన వివాహ విషయంలో తరవాడు సంప్రదాయంలో స్త్రీలు ఇంటిపెద్ద ఆజ్ఞ ప్రకారం నడుచుకునేవారని చెప్పడానికి నిదర్శనం. లక్ష్మికుట్టియమ్మకి తన కూతురు ఇందులేఖ అంటే అమితమైన ప్రేమ. ఇందులేఖ మాధవుడిని ఇష్టపడుతుందని తెలిసి సంతోషిస్తుంది. మాధవుడు ఇందులేఖకి సరైన ఈడూ జోడూ అనుకుంటుంది. అనుకోని ఉపద్రవం సంభవించి ఇంటిపెద్ద పంజుమీనన్ ఇందులేఖను మాధవునికి ఇవ్వనని తీర్మానించిన సందర్భంలో పంజుమీనన్ తీర్మానాన్ని సమర్థిస్తుంది. నంబూద్రిపాదు ధనాన్ని చూసిన తరువాత తన కూతిరికి ఇలాంటి సంబంధం రావడం అదృష్టమని అనుకుంటుంది. ఇందులేఖ మాధవుడిని ఇష్ట పడుతుందని తెలిసినా ఒక మధ్య తరగతి స్త్రీవలే తన కూతురు ధనవంతుడైన నంబూద్రిపాదుని వివాహం చేసుకోవడంవలన సుఖపడుతుందని భావిస్తుంది. ఇందులేఖని చూడడానికి వచ్చిన నంబూద్రిపాదు తనతో

అమర్యాదగా ప్రవర్తించిన సందర్భంలో కంగారు పడుతుంది. నంబూద్రిపాదుపై తనకున్న అభిప్రాయాన్ని మార్చుకుంటుంది. మలయాళ తరవాడు సంప్రదాయం ప్రకారం నాయర్ స్త్రీ నంబూద్రి పురుషునితో సంబంధం ఏర్పర్చుకోవడానికి అవకాశం ఉన్నందువల్ల నంబూద్రిపాదు లక్ష్మికుట్టియమ్మతో అనుచితంగా ప్రవర్తించినా అతన్ని ఏమీ అనదు. ఇందులేఖ మాధవుడు దూరమౌతాడేమోనని బాధపడుతున్న సందర్భంలో తల్లిగా ఇందులేఖని ఓదార్చుతుంది. భర్త కేశవ నంబూద్రి ప్రాపంచిక విషయాల గురించి లక్ష్మికుట్టియమ్మతో చర్చించిన సందర్భంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మనం కూడా మారాలని తన అభిప్రాయాన్ని చెబుతుంది.

పొగబండి నీటి ఆవిరితో నడుస్తుందని, నూలుమిల్లు చక్రంతో నడుస్తుందని ఇందులేఖ ద్వారా తాను తెలుసుకున్న విషయాలను కేశవ నంబూద్రితో పంచుకుంటుంది. ఆధునిక విద్య వల్ల ప్రపంచ విషయాలు యువతకి తెలుస్తున్నాయని అంటుంది. నూతన మార్పులను మానసికంగా స్వాగతిస్తుంది. కూతురి ప్రేమను సమర్థిస్తుంది. భర్త కేశవ నంబూద్రి, నంబూద్రిపాదు విషయంలో భయపడుతున్న సందర్భంలో అతని అమాయకత్వాన్ని చూసి నవ్వుకుంటుంది. ఒక పక్క పంజుమీనన్ ఆజ్ఞలను పాటిస్తూ, ఇంకో పక్క తన కూతు ప్రవర్తనను సమర్థిస్తుంది. చదువులేకున్నా తన వద్ద వెకిలి చేష్టలు చేసిన నంబూద్రిపాదును సమర్థవంతంగా ఎదురుకుంటుంది. నంబూద్రిపాదుతో జాగ్రత్తగా ఉండమని తన కూతురికి హితవు చెప్తుంది. ఇంటిపెద్ద పంజుమీనన్ కోపానికి తన కూతురు ఎక్కడ కష్టాలపాలవుతుందో అని బాధపడుతుంది. మాధవుడు ఉత్తరభారతదేశ యాత్రకి వెళ్లిన సందర్భంలో మాధవుడు తొందరగా సుఖంగా ఇంటికి తిరిగి వస్తాడని ఇందులేఖకి ధైర్యం చెబుతుంది. పంజుమీనన్ తన అభిప్రాయాన్ని మార్చుకొని ఇందులేఖకి మాధవునితో వివాహం జరిపించిన సందర్భంలో సంతోషిస్తుంది. ఇలా నవల ఆసాంతం కూతురి బాగుకోరే తల్లి మనస్తత్వానికి ప్రతీకగా లక్ష్మికుట్టియమ్మ పాత్రను ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు.

### 4.1.2.6. కుంజికుట్టియమ్మ

పాతతరం మలయాళ తరవాడు సంప్రదాయ భావాలు కలిగిన స్త్రీ మనస్తత్వానికి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు కుంజికుట్టియమ్మ పాత్రని చిత్రించారు. కుంజికుట్టియమ్మ ఇంటిపెద్ద పంజుమీనన్ భార్య. ఇంట్లో ఉన్న స్త్రీలందరూ ఇంటిపెద్ద అభిప్రాయాన్ని

గౌరవించాలనే ఆలోచనని కలిగి ఉంటుంది. సంప్రదాయం ప్రకారం నాయర్ స్త్రీ నంబూద్రి పురుషునితో సంబంధం ఏర్పర్చుకోవడాన్ని సమర్థిస్తుంది. ఇందులేఖ మాధవునిమీద ప్రేమతో నంబూద్రిపాదుతో సంబంధం ఏర్పర్చుకోవడానికి నిరాకరించిన సందర్భంలో పిల్లలను అధిక గారాభం చేయకూడదని అవసరమైతే రెండు దెబ్బలు వేసైనా వారి ప్రవర్తన మార్చాలని భర్తతో అంటుంది. ఈ మాటలు మలయాళ తరవాడు సంప్రదాయానికి కట్టుబడ్డ స్త్రీల మనస్తత్వానికి ప్రతీక. ఇందులేఖ మాధవుడిని ఇష్ట పడుతుందని తెలిసినా మాధవుని కన్నా నంబూద్రిపాదు ధనవంతుడు కావడంవల్ల ఇందులేఖ నంబూద్రిపాదునే వివాహం చేసుకోవాలని పట్టుబడుతుంది. ఈ విషయంలో తన భర్త శపథాన్ని తెలుసుకుని అందుకు సహకరిస్తుంది. నంబూద్రిపాదు తమ ఇంటికి వచ్చిన సందర్భంలో అతని సంపద చూసి ఆశ్చర్య పోతుంది. ఇందులేఖ తప్పనిసరిగా నంబూద్రిపాదు సంపద చూసి అతనితో వివాహానికి అంగీకరిస్తుందని అనుకుంటుంది. మాధవునికి మద్రాసులో ఉద్యోగం వచ్చిందన్న వార్తా తెలిసి ఇందులేఖ సంతోషంగా ఉండటాన్ని గమనించిన కుంజికుట్టియమ్మ నంబూద్రిపాదు సంపద, అందం చూసి ఇందులేఖ ఆనందంగా ఉంటుందనే తప్పుడు అభిప్రాయానికి వస్తుంది. చివరికి ఇందులేఖ నంబూద్రిపాదుని తిరస్కరించిందని తన భర్త ద్వారా తెలుసుకుని బాధపడుతుంది. నంబూద్రిపాదు కళ్యాణకుట్టిని ఇష్టపడుతున్నాడని తెలిసి వెంటనే వారి వివాహం జరిగిపోవాలని తన భర్త పంజుమీనన్‌తో అంటుంది. అంతేకాక నంబూద్రిపాదు, కళ్యాణకుట్టిల వివాహవిషయంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇలా నవల ఆసాంతం ధనవంతులైన నంబూద్రి పురుషులతో సంబంధం కలుపుకోవడానికి నాటి నాయర్ స్త్రీలు పడిన తాపత్రయానికి ప్రతీకగా ఒ.చందుమీనన్‌గారు కుంజికుట్టియమ్మ పాత్రను చిత్రించారు.

### 4.1.2.7. పారు

పారు పంజుమీనన్ ఇంట్లో పనిమనిషి. పంజుమీనన్ భార్య కుంజికుట్టియమ్మకి పనులలో సహకరిస్తుంది. నంబూద్రిపాదు ఇందులేఖని వివాహం చేసుకోవడానికి పంజుమీనన్ ఇంటికి వచ్చిన సందర్భంలో ఇందులేఖ మనసులో ఏముందో తెలుసుకోవాలని కుంజికుట్టియమ్మ ప్రయత్నిస్తుంది. కాని కుంజికుట్టియమ్మ ప్రయత్నం ఫలించదు. ఒక రోజు మాధవుని ఉత్తరం చదివి అతనికి ఉద్యోగం వచ్చిందని తెలుసుకుని ఇందులేఖ సంతోష పడుతుంది. ఆ సంతోష సమయంలో తన వద్దకు వచ్చిన 'పారు'కి ఇందులేఖ ఒక మంగళ

సూత్రాన్ని బహుమానంగా ఇస్తుంది. ఇందులేఖ ప్రవర్తనకు నివ్వెరపోయిన 'పారు' ఇందులేఖ సంతోషంగా ఉండటానికి కారణం నంబూద్రిపాదుతో సంబంధం ఏర్పడటమే అని తన మనసులో అనుకుంటుంది. ఈ సంగతిని తన యజమాని కుంజికుట్టియమ్మకి చెప్పి సంతోషపడుతుంది. ఇంటి యజమానుల బాగును కోరే పనిమనుషుల మనస్తత్వానికి ప్రతీకగా పారు పాత్రను ఒ.చందుమీనన్‌గారు చిత్రించారు.

#### 4.1.2.8. అమ్ము

ఇందులేఖ పనిమనిషి. ఇందులేఖకి మాధవునికి మధ్య ప్రేమరాయభారం నడుపుతుంది. ఇందులేఖని చూడటానికి తొలిసారిగా ఇందులేఖ గదిలోకి వచ్చిన నంబూద్రిపాదు అమ్మును చూసి ఇందులేఖ అని భ్రమపడతాడు. అమ్ము చాలా అందంగా ఉందని సేరిసేరి నంబూద్రితో అంటాడు. ఈ సంఘటన నంబూద్రిలకు నాయర్ ఇంటిలో ఉండే పనిమనుషులపై కూడా హక్కు ఉండేదనడానికి నిదర్శనం.

## 4.2. ప్రతాపముదలియార్ చరిత్ర - పాత్ర చిత్రణ

### 4.2.1. పురుష పాత్రలు

#### 4.2.1.1. ప్రతాపముదలియార్

'ప్రతాపముదలియార్ చరిత్ర' నవలలోని కథా నాయకుడు ప్రతాపముదలియార్. ప్రతాపముదలియార్ జననం మొదలుకొని బాల్యం, విద్యాభ్యాసం, వివాహం వరకు అతని పూర్తి జీవిత విశేషాలు 'ప్రతాపముదలియార్ చరిత్ర' నవలలో వేదనాయగంపిళ్ళైగారు వివరించారు. నవలలోని ప్రతీపాత్ర ప్రతాపముదలియార్ చుట్టూ తిరుగుతూ ఉంటుంది. నవలలోని పూర్తి కథను ప్రతాపముదలియార్ పాఠకులకు చెప్తాడు. బాల్యం మొదలుకొని యవ్వన దశ వరకు ప్రతాపముదలియార్‌లో వచ్చిన మానసిక పరివర్తన నవల ఇతివృత్తంలో ప్రస్తావనకు వచ్చింది. బాల్యంలో కొంత దుందుడుకు స్వభావాన్ని కలిగిన ప్రతాపముదలియార్ ఎదుగుతున్న క్రమంలో తన చుట్టూ ఉన్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఎదుగుతాడు. నవాబుల కాలంలో ఆర్థికంగా బలపడిన ముదలియార్ కులంలోని కనకాచలముదలియార్‌కి ప్రతాపముదలియార్ జన్మిస్తాడు. కనకాచల ముదలియార్, సుందర అణ్ణిలకు ప్రతాపముదలియార్ ఏకైక సంతానం కావడంవల్ల అతన్ని అల్లారు ముద్దుగా పెంచుతారు. కనకాచల ముదలియార్ తల్లి ప్రతాపముదలియార్‌ని మిక్కిలి గారాబం చేస్తుంది. ఇలా చిన్నప్పుడే అన్ని రకాల సౌకర్యాలు కలిగిన కుటుంబంలో

జన్మించడం వల్ల తనకి విద్య అవసరం లేదనే భావనకు ప్రతాపముదలియార్ వస్తాడు. పసి పిల్లవాడిగా ఉన్న ప్రతాపముదలియార్‌లో ఈ భావన ఏర్పడటానికి అతని నానమ్మ అనునిత్యం అతని వద్ద చెప్పే 'మనం ధనవంతులం'. 'మనకు ఏ అవసరం వచ్చినా పని చేయడానికి పని వాళ్ళు ఉంటారు' అనే మాటలు భూమికగా నిలుస్తాయి. ప్రతాపముదలియార్ విద్యాభ్యాసం ఆలస్యమవ్వడాన్ని గమనించిన అతని తల్లి సుందరఅణ్ణి విద్య గురించిన విలువలు నేర్పడం వల్ల ఎనిమిదవ ఏట 'ప్రతాపముదలియార్ తన విద్యాభ్యాసాన్ని ప్రారంభిస్తాడు. ఈ సంఘటన పెద్దవాళ్ళు మాట్లాడే మాటలు పిల్లలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయనడానికి నిదర్శనం. నానమ్మ మాటలతో విద్యకు దూరమైన ప్రతాపముదలియార్, తల్లి మాటలతో మళ్ళీ విద్యకు దగ్గరౌతాడు. తల్లి మాటల ద్వారా యాంత్రికంగా విద్యకు దగ్గరైన ప్రతాపముదలియార్ తనకు విద్య నేర్పడానికి వచ్చిన గురువు దీనస్థితిని చూసి, అతని కుమారుడు 'కనకసభ' తన చదువుకోసం దెబ్బలు తినడం చూసి మానసికంగా విద్యకు దగ్గరౌతాడు. బాల్యంలో ఆటలాడే సందర్భంలో కొంత ఆకతాయి స్వభావాన్ని ప్రదర్శించిన ప్రతాపముదలియార్ తన మామ సంబంధముదలియార్ ఇంట్లో జ్ఞానాంబాళ్‌తో కలిసి విద్యను అభ్యసించే సందర్భంలో తన దుందుడుకు స్వభావాన్ని తగ్గించుకుంటాడు. ఎలాగైనా విద్యలో తన మరదలు జ్ఞానాంబాళ్‌ని జయించాలని బాగా చదువుతాడు. కాని జ్ఞానాంబాళ్‌ను విద్యలో గెలవడం ప్రతాపముదలియార్‌కు సాధ్యంకాదు. కనకసభ శాంతలింగంపిళ్ళై కుమారుడు కాదని అతను ఆదియూరు పాళ్యానికి అధికారి అయిన దేవరాజపిళ్ళై కుమారుడని తెలిసిన సందర్భంలో 'ప్రతాపముదలియార్' సంతోషిస్తాడు. దేవరాజపిళ్ళై కనకసభను తన ఇంటికి తీసుకువెళ్ళే సందర్భంలో కనకసభతో తనకి ఏర్పడిన బంధం తాత్కాలికంగా దూరమవుతున్నందుకు ప్రతాపముదలియార్ తన మనసులో బాధపడతాడు. 'కరుణానందపిళ్ళై' జ్యోతిష్యం అబద్ధమని, దయ్యాలు లేవని చెప్పిన సందర్భంలో ప్రతాపముదలియార్ నమ్ముతాడు. తనకు విద్యనేర్పిన కరుణానంద పిళ్ళైపై అమిత భక్తి, విశ్వాసాలు ప్రదర్శిస్తాడు. సంబంధముదలియార్ ఇంట్లో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌ని ఇష్టపడతాడు. ఈ విషయం ముందే ఊహించిన సుందరఅణ్ణి విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత జ్ఞానాంబాళ్‌కి ప్రతాపముదలియార్‌తో వివాహం చేయడానికి తాను నిర్ణయించినట్లుగా ప్రతాపముదలియార్‌తో చెబుతుంది. తల్లి మాట వినగానే ప్రతాపముదలియార్ 'వెతకబోయే తీగ కాళ్ళకు తగిలినట్లు' ఆనందపడతాడు. వెంటనే వివాహాన్ని జరిపించవలసిందిగా తల్లితో అంటాడు.

సంబంధముదలియార్ ప్రవర్తన వల్ల ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌ల వివాహం తాత్కాలికంగా వాయిదా పడుతుంది. 'పనంపళ్ళి' గ్రామానికి వేసవి విడిది కోసం వెళ్లిన జ్ఞానాంబాళ్‌ని పూంగావూరు తహశీల్దారు మనుషులు అపహరించిన సందర్భంలో ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌ని తహసీల్దారు మనుషుల నుండి కాపాడతాడు. ప్రతాపముదలియార్ ఉపకారానికి మెచ్చి సంబంధముదలియార్ జ్ఞానాంబాళ్‌ని ప్రతాపముదలియార్‌కు ఇచ్చి వివాహం జరిపించడానికి ఒప్పుకుంటాడు. ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌తో వివాహానంతరం సంతోషంగా కాలం గడుపుతాడు. తమకు పుట్టబోయే బిడ్డ విషయంలో కనకాచల ముదలియార్, సంబంధముదలియార్‌లు గొడవపడి జ్ఞానాంబాళ్‌ని తనకి దూరం చేసిన సందర్భంలో ప్రతాపముదలియార్ మానసిక సంఘర్షణకి లోనౌవుతాడు. తన తండ్రి తనకు ఇంకో స్త్రీతో వివాహం చేయడానికి సన్నద్ధం అవుతున్నాడని తెలిసి తండ్రిని ఏమీ అనలేక ఇంటినుండి వెళ్లిపోతాడు. తన ఎడబాటును తట్టుకోలేక నల్లూరువద్ద జ్ఞానాంబాళ్ తనని కలుసుకున్న సందర్భంలో జ్ఞానాంబాళ్ స్థితిగతులను తెలుసుకుని తిరిగి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోవలసిందిగా ఆమెను కోరతాడు. జ్ఞానాంబాళ్ తాను కూడా భర్తతోపాటే వస్తానని చెప్పడంతో సంతోషిస్తాడు. తమ ప్రయాణంలో ప్రతాపముదలియార్ దంపతులు కాకతాళీయంగా దేవరాజపిళ్ళై ఇంటికి చేరుకున్న సందర్భంలో ప్రతాపముదలియార్ తన తండ్రి, మామ పరువు కాపాడే విధంగా దేవరాజపిళ్ళైకి జరిగిన జగడం గురించి చెప్తాడు. ప్రతాపముదలియార్ కనకసభ వివాహం అయ్యేంతవరకు దేవరాజపిళ్ళై ఇంట్లో తన భార్యతో కలిసి ఉంటాడు.

ఒకరోజు వేట చూడటానికి వెళ్ళగా ఏనుగు తుపాకి శబ్దానికి బెదిరి ప్రతాపముదలియార్‌ని విక్రమపురి అనే రాజ్యానికి తీసుకువెళ్తుంది. అక్కడ ప్రతాపముదలియార్ అనేక కష్టాలు పడతాడు. చివరికి జ్ఞానాంబాళ్ పురుష వేషంలో విక్రమపురి చేరుకొని ప్రతాపముదలియార్‌ను కష్టాలనుండి కాపాడుతుంది. విక్రమపురి నుండి ఆదియూరు వచ్చిన ప్రతాపముదలియార్ దంపతులు అక్కడ కొంతకాలం గడిపి, సత్యపురికి బయలుదేరుతారు. మార్గ మధ్యమంలో జ్ఞానాంబాళ్‌కి మశూచి సోకి అనారోగ్యం పాలవుతుంది. వైద్యులు జ్ఞానాంబాళ్ మరణించింది అని చెప్పగా ప్రతాపముదలియార్ అమితంగా దుఃఖిస్తాడు. చివరికి దేవరాజ పిళ్ళై జ్ఞానాంబాళ్ మరణించలేదని ఆమెను వైద్య శిబిరంనుండి ఇంటికి తీసుకువచ్చిన సందర్భంలో ప్రతాపముదలియార్ తన భార్యను చూసి సంతోషిస్తాడు. ఇలా నవల ఆసాంతం

ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ పాత్ర చుట్టూ తిరుగుతాడు. భార్యపై, భర్తకు ఉన్న ప్రేమకు ప్రతీకగా ప్రతాపముదలియార్ పాత్రను వేదనాయగంపిళ్ళైగారు చిత్రించారు.

### 4.2.1.2. దేవరాజ పిళ్ళై

తండ్రికి కొడుకుమీద ఉండే ప్రేమ, అన్నదమ్ముల మధ్య ఉండే గొడవలు, ఉపకారానికి ప్రత్యుపకారం చేయడం వంటి లక్షణాలకు ప్రతీకగా వేదనాయగం పిళ్ళైగారు దేవరాజ పిళ్ళై పాత్రను చిత్రించారు. దేవరాజ పిళ్ళై ఆదియూరు అనే పాళ్యానికి అధికారి. వీరి పూర్వీకులు రాజులకు కిరీటాన్ని అలంకరించే 'వేళ్ళాలర్' కులానికి చెందిన వారు కావడంవల్ల వీరికి అనేక గ్రామాలు, భూములు ధానంగా లభించాయి. దేవరాజ పిళ్ళై తండ్రి ఆదిమూలం పిళ్ళై. ఈ ఆదిమూలం పిళ్ళైకి పెద్ద కుమారుడు దేవరాజపిళ్ళై కాగా, చిన్న కుమారుడు దేవనాయగం పిళ్ళై. 'వెళ్ళాలర్' కులం ఆచారం ప్రకారం ఇంటి పెద్ద కుమారునికి మాత్రమే ఆస్తిపై హక్కు ఉండటం వల్ల ఆదిమూలం పిళ్ళై మరణం తరువాత ఆస్తి పూర్తిగా దేవరాజ పిళ్ళైకి దక్కుతుంది. అప్పటికే దేవరాజ పిళ్ళైకి 'కనకసభ' పుడతాడు. ఆస్తి అన్నకు దక్కడాన్ని జీర్ణించుకోలేని దేవనాయగం పిళ్ళై ఎలాగైనా తన అన్న కుమారుడైన కనకసభను చంపి తానే ఆస్తిని పూర్తిగా అనుభవించాలని అనుకుంటాడు. తాను అనుకున్న ప్రకారం దేవరాజ పిళ్ళై విహారయాత్రకు వెళ్లిన సందర్భంలో కనకసభను చంపమని తన ప్రియ స్నేహితుడైన ముత్తువీరునికి చెప్తాడు. ముత్తువీరుడు కనకసభను తాను చంపనని అతన్ని తీసుకొని దూరంగా వెళ్తానని చెప్పి అలాగే చేస్తాడు. కనకసభను ముత్తువీరుడు ఎత్తుకెళ్ళిన తరువాత దేవనాయగం పిళ్ళై కనకసభ చనిపోయినట్లుగా తన అన్న దేవరాజ పిళ్ళైకి లేఖ రాస్తాడు. విహారయాత్ర నిమిత్తం వెళ్లిన దేవరాజపిళ్ళై బెంగాలులో ఉండగా దేవనాయగం పంపిన ఉత్తరం అతనికి అందుతుంది. కనకసభ మరణ వార్తను విని అమిత దుఃఖంతో దేవరాజ పిళ్ళై ఇంటికి చేరుకుంటాడు. అప్పటికే దేవనాయగం పిళ్ళై కనకసభ స్థానంలో వ్యాధి వల్ల మరణించిన దాది కుమారున్ని ఖననం చేస్తాడు. అందరూ కనకసభ మరణించాడని అనుకుంటారు. దేవరాజపిళ్ళై కొడుకును కడసారి చూపులు కూడా చూడలేకపోయానని బాధపడతాడు. ఆ తరువాత కొన్ని రోజులకు దేవనాయగం పిళ్ళై అంతు చిక్కని వ్యాధితో మరణిస్తాడు. తమ్ముని శవం మీద పడి దేవరాజపిళ్ళై ఏడుస్తున్న తరుణంలో అతని నడుమకు చుట్టిన ఉత్తరం దేవరాజపిళ్ళై చేతికి తాకుతుంది. ఆ ఉత్తరంలో కనకసభ మరణించ లేదని అతను ముత్తువీరుని వద్ద ఉన్నాడని రాసి ఉంటుంది. ఉత్తరాన్ని చదివిన తరువాత దేవరాజ పిళ్ళై అమిత ఆనందానికి గురవుతాడు. ముత్తువీరున్ని గాలించి

పట్టుకుంటాడు. ముత్తువీరుని ద్వారా తన కుమారుడు కనకసభ సంబంధ ముదలియార్ ఇంట్లో ఉన్నాడని తెలుసుకుని అక్కడికి వెళ్తాడు. తాను లేని సమయంలో తన కుమారున్ని కంటికి రెప్పలా కాపాడిన సుందరఅణ్ణి, జ్ఞానాంబాళ్, కనకాచల ముదలియార్, ప్రతాపముదలియార్, సంబంధముదలియార్, శాంతలింగం పిళ్ళై మొదలైన వారికి నమస్కరించి వారికి కృతజ్ఞతలు తెలుపుతాడు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తాను వారికి సహాయం చేస్తానని మాట ఇస్తాడు. తన కుమారున్ని గుండెలకు హత్తుకొని ఆదియూరుకు తీసుకెళ్తాడు.

ఇంట్లో గొడవపడి ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ ఆదియూరుకు వచ్చిన సందర్భంలో అతిథి సత్కారాలతో వారిని ఆహ్వానించి సకల మర్యాదలు చేస్తాడు. తల్లిదండ్రులు ఎప్పటికీ బిడ్డల మేలునే కాంక్షిస్తారని వారిమీద కోపగించుకోవడం తగదని ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్లకు హితవు చెప్తాడు. ప్రతాపముదలియార్ దంపతులు తన వద్దకు వచ్చినట్లుగా సంబంధముదలియార్, కనకాచల ముదలియార్లకు లేఖ రాస్తాడు. ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ల కోసం తన ఇంటికి వచ్చిన సంబంధముదలియార్, సుందరఅణ్ణి, కనకాచలముదలియార్ మొదలైనవారికి అతిథి మర్యాదలు చేస్తాడు. తన కుమారుడు కనకసభ వివాహ విషయంలో జిల్లా అధికారి ద్వారా తాను ఎదుర్కొంటున్న కష్టాల గురించి ప్రతాపముదలియార్ తల్లిదండ్రులు, అత్తామామలకు చెప్తాడు. కనకసభ దేవరాజపిళ్ళై సొంత కుమారుడా కాదా అని వేదపురిలో విచారణ జరుగుతున్న సందర్భంలో సంబంధముదలియార్, కనకాచల ముదలియార్ మొదలైన వారందరూ 'కనకసభ' దేవరాజ పిళ్ళై సొంత కుమారుడే అని సాక్ష్యం చెబుతారు. అప్పటికే దేవరాజ పిళ్ళైపై పగబట్టిన జిల్లా అధికారి వీరందరిది దొంగ సాక్ష్యమని కలెక్టర్ నమ్మేలా చేస్తాడు. దీనితో సాక్ష్యం చెప్పిన వారందరికి ద్వీపాంతరవాస శిక్ష పడుతుంది. ఇది విన్న వెంటనే దేవరాజ పిళ్ళై బాధపడతాడు. తనకు మేలు చేయడానికి వచ్చిన వారికి జైలుశిక్ష పడటం వల్ల అమితంగా దుఃఖిస్తాడు. చివరికి సుందరఅణ్ణి మద్రాసులో ఉన్న గవర్నర్ని కలిసి అసలు నిజం చెప్పడంవల్ల 'కనకసభ' దేవరాజ పిళ్ళై సొంత కుమారుడే అని ప్రభుత్వం నమ్మడంతోపాటు ఈ వివాదంలో సాక్షం చెప్పిన వారి శిక్షను గవర్నర్ రద్దు చేస్తాడు. ఈ విషయం విన్నవెంటనే దేవరాజ పిళ్ళై సంతోషిస్తాడు. సుందరఅణ్ణి పట్ల కృతజ్ఞతా భావాన్ని ప్రదర్శిస్తాడు. కనకసభ వివాహం అనంతరం కనకాచల ముదలియార్, సంబంధ ముదలియార్, సుందరఅణ్ణి మొదలైన వారందరూ తమ ఇంటికి

వెళ్లిపోగా దేవరాజపిళ్ళై అభ్యర్థన మేరకు ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌లు కొన్ని రోజులు దేవరాజ పిళ్ళై ఇంట్లో ఉంటారు.

ఆదియూరుకు ఉత్తరంగా ఉన్న అడవిలోకి వేటకు వెళ్లి ప్రతాపముదలియార్ తప్పిపోతాడు. అతన్ని వెతకడానికి వెళ్లిన దేవరాజపిళ్ళై ప్రతాపముదలియార్ కనిపించక పోయేసరికి విచారిస్తాడు. ప్రతాపముదలియార్‌ను వెతుకుతూ జ్ఞానాంబాళ్ అడవిలోకి వెళ్లిన సందర్భంలో దేవరాజపిళ్ళై తన రాజభోగాలను వదిలి అడవిలోనే గుడారం వేసుకొని ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌లను వెతకడం ప్రారంభిస్తాడు. వారు అడవినుండి తిరిగి తన వద్దకు వచ్చిన సందర్భంలో సంతోషిస్తాడు. జ్ఞానాంబాళ్‌కు మశూచిసోకి ఆమె మరణించిందని భావించి ఇంట్లోని వారందరూ ఆమెను  అడవిలో వైద్యుల వద్ద వదిలిపోగా దేవరాజపిళ్ళై జ్ఞానాంబాళ్ గురించి తెలుసుకుని ఆమెను కాపాడి ప్రతాపముదలియార్‌కి అప్పగిస్తాడు. ఇలా నవల ఆసాంతం ప్రతాపముదలియార్ కుటుంబం వెన్నంటి ఉండి వారికి సహాయం చేసిన వ్యక్తిగా దేవరాజ పిళ్ళై పాత్ర చిత్రితమైంది.

### 4.2.1.3. నీలకంఠ ముదలియార్

ఇతను సుందరఅణ్ణి కుటుంబానికి దగ్గరి బంధువు. ఎలాగైనా సుందరఅణ్ణిని వివాహం చేసుకోవాలని అనుకుంటాడు. కాని అందుకు సుందరఅణ్ణి ఒప్పుకోదు. ఎలాగైనా ఆమెను ఎత్తుకెళ్ళి వివాహం చేసుకోవాలని అనుకుంటాడు. ఒకనాడు ఇంట్లో అందరూ పనిమీద 'మంగనూరు' అనే గ్రామానికి వెళ్తారు. ఇంట్లో సుందరఅణ్ణి మాత్రమే తన స్నేహితురాళ్ళతో ఉంటుంది. ఇదే అదనుగా భావించి తన సారధిని పంపి మంగనూరు వెళ్ళే దారిలో సుందరఅణ్ణి తండ్రికి గుండెనొప్పి వచ్చిందని ఆమె వెంటనే రావాలని తప్పుడు వర్తమానం పంపుతాడు. అది నిజం అని నమ్మి సుందరఅణ్ణి నీలకంఠ ముదలియార్ పంపిన రథంలో ఎక్కుతుంది. కాని మార్గ మధ్యమంలో రథసారధి తన కట్ల సంచి పడిపోయిందని రథం ఆపుతాడు. రథం దిగిన సుందరఅణ్ణి రథం నీలకంఠ ముదలియార్ ఇంటివైపుగా వెళ్లడం గుర్తించి రథాన్ని తన గ్రామంవైపు తీసుకెళ్తుంది. ఇది గమనించిన నీలకంఠముదలియార్ ఖంగుతింటారు. రథాన్ని ఆపుదామని వెళ్లి బురదలో పడతాడు. ఈ విషయం తెలిసిన సుందరఅణ్ణి తండ్రి

నీలకంఠముదలియార్‌ను సంఘం నుండి, కులంనుండి బహిష్కరిస్తారు. స్త్రీలపై వ్యామోహం ఉన్న వ్యక్తుల మనస్తత్వానికి ప్రతీకగా నీలకంఠముదలియార్ పాత్ర చిత్రించబడింది.

#### 4.2.1.4. కనకసభ

కష్టాలు జ్ఞానానికి పాఠలు, కష్టం తెలియనివాడు బీదవారి బాధలను అర్థం చేసుకోలేడు. కష్టాలు తెలియనివాడు రాజ్యాధికారానికి యోగ్యుడు కాదు. ప్రజలను పరిపాలించే స్థానంలో ఉన్నవారు కష్టాలు అనుభవించి ఉండాలి. అన్న మాటలకు సాక్షీ భూతంగా కనకసభ పాత్ర చిత్రితమైంది. కనకసభ ఆదియూరు పాళ్యానికి రాజైన దేవరాజపిళ్ళై కుమారుడు. రాజ కుమారుడైన కనకసభ చిన్నప్పటినుండి కష్టాలు తెలియకుండా పెరగాలి. కాని కనకసభ విషయంలో అలా జరగలేదు. కనకసభ పిన తండ్రి దేవనాయగంపిళ్ళై తన అన్న దేవరాజపిళ్ళై వల్ల తనకు రాజ్యాధికారం దక్కలేదన్న కోపంతో అతన్ని ఏమీ చేయలేక చిన్నపిల్లవాడుగా ఉన్న అతని కొడుకు కనకసభని చంపాలనుకుంటాడు. కాని దేవనాయగంపిళ్ళై స్నేహితుడు ముత్తువీరుడు కనకసభను తప్పించి శాంతలింగం పిళ్ళై వద్దకు కనకసభను చేరుస్తాడు. ముత్తువీరుని వల్ల శాంతలింగం పిళ్ళై వద్దకు చేరిన ఐదు సంవత్సరాల 'కనకసభ' అతని వద్ద చదువు కోవడం ప్రారంభిస్తాడు. సుందరఅణ్ణి ఈ శాంతలింగం పిళ్ళైని తన కుమారుడు ప్రతాపముదలియార్‌కు గురువుగా నియమిస్తుంది. అప్పడి నుండి ప్రతాపముదలియార్‌కు, కనకసభకు స్నేహం ఏర్పడుతుంది.

నవల ప్రారంభంలో బీద వానిగా ఉన్న శాంతలింగం పిళ్ళై కుమారునిగా 'కనకసభ' పాఠకులకు పరిచయం అవుతాడు. ప్రతాపముదలియార్ తల్లి సుందరఅణ్ణి చొరవ వల్ల శాంత లింగంపిళ్ళై మంచి ఉద్యోగంలో నియమించబడతాడు. కనకసభ, ప్రతాపముదలియార్‌తో జ్ఞానాంబాళ్‌తో సమానంగా చూడబడుతూ విద్యను నేర్చుకుంటాడు. వ్యాధిగ్రస్తుడైన శాంతలింగం పిళ్ళై ఒకనాడు కనకసభను పిలిచి అతను తన సొంతకుమారుడు కాదని ఒకవ్యక్తి తమకు ఇచ్చి వెళ్ళాడని అప్పుడు కనకసభుకు ఐదు సంవత్సరాలని తాను ఎలాగూ మరణించే కాలం సమీపించడం వల్ల ఈ నిజం నీకు తెలియాలని కనకసభ జనన రహస్యం అతనికి చెబుతాడు. అప్పడినుండి కనకసభ బాధపడుతూ తన తల్లిదండ్రులు ఎవరై ఉంటారని ఆలోచిస్తూ ఉంటాడు. ఒక నాడు అనుకోకుండా ఆటలాడుతూ కొలనులో పడిపోతాడు. అది గమనించిన

జ్ఞానాంబాళ్ సన్యాసి వేషంలో ఉన్న ముత్తు వీరుని సహాయంతో అతన్ని కాపాడుతుంది. ఈ ముత్తువీరుడు కనక సభని అతని నిజమైన తల్లిదండ్రుల వద్దకి చేరుస్తాడు. కనకసభ తన నిజమైన తల్లిదండ్రులు దేవరాజపిళ్ళై అతని భార్యను కలిసి ఆనందపడతాడు. చిన్నప్పుడు తన కుమారుడు పడ్డ కష్టాలు అతని భవిష్యత్తుకు బాటలు వేస్తాయని చెప్పి దేవరాజపిళ్ళై కనకసభను ఆదియూరుకు తీసుకొని వెళ్తాడు. ఇంటి నుండి విహారయాత్ర నిమిత్తం బయలుదేరిన ప్రతాపముదలియార్ అతని భార్య జ్ఞానాంబాళ్ తన ఊరికి వచ్చిన సందర్భంలో కనక సభ వారిని అత్యంత ఆదరాభిమానాలతో చూసుకుంటాడు. ఉపకారానికి ప్రత్యుపకారం చేసే స్వభావానికి ప్రతీక కనకసభ పాత్ర.

#### 4.2.1.5. కనకాచల ముదలియార్

పుత్రునిపై తండ్రికి ఉన్న ప్రేమకు ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు కనకాచల ముదలియార్ పాత్రను చిత్రించారు. కనకాచల ముదలియార్ ఏకాంబర ముదలియార్ కుమారుడు. ప్రతాపముదలియార్ తండ్రి. సుందరఅణ్ణి భర్త. జన్మతః ధనవంతుడైన కనకాచల ముదలియార్ తన కుమారుడైన ప్రతాపముదలియార్‌ని అల్లారు ముద్దుగా పెంచుతాడు. కుమారున్ని అతిగారాబం చేసి అతన్ని చాలాకాలం విద్యకు దూరం చేస్తాడు. భార్య సుందరఅణ్ణి విద్య గొప్పతనం గురించి చెప్పిన తరువాత కుమారుని విద్యాభ్యాసానికి అంగీకరిస్తాడు. ఎనిమిదవ ఏట ప్రతాపముదలియార్ తమ వంటి ధనవంతులకు విద్యనేర్చుకునే అవసరం లేదని చెప్పిన సందర్భంలో తండ్రిగా అతన్ని మందలించక తమ కుటుంబ డాంబికం పుత్రునికి కూడా అబ్బినందుకు సంతోష పడతాడు. కుమారున్ని విద్యాభ్యాసం నిమిత్తం గురువులను నియమించి ప్రతాపముదలియార్‌ని కొట్టొద్దు, తిట్టొద్దు అని షరతులు విధిస్తాడు. ఈ విధంగా అతిగారాబం చేయడం వల్ల ప్రతాపముదలియార్ చాలాకాలం విద్యకి దూరమౌతాడు. ప్రతాపముదలియార్ వివాహ విషయంలో సుందరఅణ్ణి తనని సంప్రదించిన సందర్భంలో భార్య మాట ప్రకారం జ్ఞానాంబాళ్‌ని తన కుమారునికి ఇచ్చి వివాహం జరిపించమని సంబంధముదలియార్‌ని అడుగుతాడు. సంబంధముదలియార్ ప్రతాపముదలియార్‌ని ఇల్లరికం అడిగిన సందర్భంలో “పశువులను మేపుకునే వాడుకూడా మామగారింట్లో ఉండటానికి అంగీకరించడే? నా కొడుకు మీ ఇంట్లో ఉంటాడా?” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 50). అంటూ సంబంధముదలియార్ విన్నపాన్ని తిరస్కరిస్తాడు. సంబంధముదలియార్ తనకు తాను ఉన్నతంగా భావించుకొని కనకాచల ముదలియార్‌ని తిట్టిన సందర్భంలో ఆత్మాభిమానంగల కనకాచలముదలియార్

అతన్ని కూడా తిడతాడు. ఈ గొడవ పెద్దది కావడం వల్ల ప్రతాపముదలియార్ వివాహం వాయిదా పడుతుంది. సంబంధముదలియార్ జ్ఞానాంబాళ్‌కి వేరే అబ్బాయితో వివాహం నిశ్చయించాడని తెలిసి కనకాచల ముదలియార్ కూడా సరిగ్గా అదే సమయంలో అదే ముహూర్తానికి ప్రతాపముదలియార్‌కి వేరే అమ్మాయితో వివాహం నిశ్చయిస్తాడు. శాంత స్వభావం కలిగిన కనకాచల ముదలియార్ సంబంధముదలియార్ రెచ్చగొట్టడం వల్ల ఆవేశ పూరిత నిర్ణయాలు తీసుకుంటాడు. ప్రతాపముదలియార్‌కి, జ్ఞానాంబాళ్‌కి వివాహం జరిగిన తరువాత వారికి పుట్టబోయే బిడ్డను సంబంధ ముదలియార్‌కి ఇవ్వడానికి ఒప్పుకోడు. ఈ గొడవ పెద్దది కావడం వల్ల ప్రతాపముదలియార్ ఇంటి నుండి వెళ్లిపోతాడు. ఈ విషయం తెలిసి కనకాచల ముదలియార్ అమితంగా బాధపడతాడు. ఇలా మొదట ఆవేశంలో ఒక నిర్ణయం తీసుకొని తరువాత బాధపడే మనస్తత్వం కనకాచల ముదలియార్‌లో కనిపిస్తుంది. 'కనకసభను' వెతుకుతూ అతని తల్లిదండ్రులు తన ఇంటికి వచ్చిన సందర్భంలో వారికి తగిన అతిథి మర్యాదలు చేస్తాడు. 'కనకసభ' వ్యాజ్యంలో కనకసభ దేవరాజ పిళ్ళై కుమారుడని సాక్ష్యం చెబుతాడు. కరుణానంద పిళ్ళైని ఆదుకుంటాడు. పుణ్యకోటి చెట్టిని ఆదుకోవడమే కాక తన భూమిలో దొరికిన నిధిని అతనికే ఇచ్చేస్తాడు. ఇలా ఉపకారం చేయడానికి అవకాశం ఉన్న ప్రతీ సందర్భంలో కనకాచలముదలియార్ తన ధాతృత్వంతో కష్టాలలో ఉన్నవారిని ఆదుకుంటాడు. కొడుకు వివాహ విషయంలో మాత్రం పంతానికి వెళ్లి మానసికంగా బాధపడతాడు. తన కుమారుని మీద అమిత ప్రేమ కలిగిన కనకాచల ముదలియార్ అతను తన కళ్లముందే ఉండాలని కోరుకుంటాడు. తన ప్రవర్తన వల్ల కుమారుడు ఇల్లు వదిలి వెళ్ళాడని తెలిసి బాధపడతాడు. దేవరాజపిళ్ళై ఇంట్లో తన కుమారున్ని కలిసిన సందర్భంలో తన కుమారున్ని గుండెలకు హత్తుకొని చిన్న పిల్లాడివలే ఏడుస్తాడు. ఇక పై ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌లను విడదీయనని మాటిస్తాడు. ఇలా నవల ఆసాంతం కనకాచల ముదలియార్ తన కొడుకుకు ప్రతాపముదలియార్‌కి సంరక్షకునిగా ఉంటాడు.

### 4.2.1.6. సంబంధముదలియార్

ప్రతాపముదలియార్ చరిత్ర నవల మూడవ అధ్యాయంలో సంబంధముదలియార్ పాత్ర పరిచయం చేయబడింది. సంబంధ ముదలియార్ పుట్టుకతో ధనవంతుడు. అనేక స్థిర, చర ఆస్తులతో సత్యపురంలో స్థిరపడ్డ 'చంద్రశేఖరముదలియార్' కుమారుడు సంబంధ

ముదలియార్. సుందరఅణ్ణి సంబంధ ముదలియార్ సోదరికాగా, జ్ఞానాంబాళ్ సంబంధముదలియార్ కూతురు. సంబంధ ముదలియార్ గొప్ప శ్రీమంతుడైన లోభి. ప్రాణ త్యాగానికైనా సిద్ధపడేవాడు కాని చిల్లిగవ్వ కూడా ఖర్చు పెట్టడానికి ఇష్టపడేవాడు కాదు. జ్ఞానాంబాళ్ సంబంధముదలియార్‌ని మార్చుతుంది. ప్రజలందరూ తన తండ్రిని లోభి అని పిలవడం తనకు సిగ్గుచేటుగా ఉందని చెప్పడంతో సంబంధముదలియార్ తన పిసినారి గుణాన్ని మార్చుకొని అందరూ తనని గొప్పదాత అని ప్రశంసించేలా ప్రవర్తిస్తాడు. సంబంధముదలియార్‌కి తన కూతురు జ్ఞానాంబాళ్ అంటే అమితమైన ప్రేమ. తన కూతురు ఎప్పుడూ తనతోటే ఉండాలని అనుకుంటాడు. భారతీయ సంప్రదాయం ప్రకారం స్త్రీ వివాహం అయిన తరువాత అత్తవారింట్లో ఉండటం పరిపాటి. ఈ సంప్రదాయాన్ని సంబంధముదలియార్ వ్యతిరేకిస్తాడు. వివాహం అనంతరం తన కూతురూ, అల్లుడు తన ఇంట్లోనే ఉండాలని పట్టుబడతాడు. దీనికి ప్రతాపముదలియార్ తండ్రి ఒప్పుకోకపోవడంతో జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌ల వివాహం వాయిదా పడుతుంది. ఆవేశంతో ఊగిపోయిన సంబంధ ముదలియార్ తన కూతురి ఇష్టాన్ని తెలుసుకోకుండా ఆమెకు వేరే వ్యక్తితో సంబంధాన్ని నిర్ణయిస్తాడు. ఇలా సంబంధముదలియార్ కూతురుమీద చూపే అతి ప్రేమ జ్ఞానాంబాళ్‌కి సంకటంగా మారుతుంది. జ్ఞానాంబాళ్‌ని దొంగల అపహరణ నుండి ప్రతాపముదలియార్ కాపాడిన సందర్భంలో సంబంధముదలియార్ తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. తన కూతురు అభీష్టం మేరకు ప్రతాపముదలియార్‌తో జ్ఞానాంబాళ్ వివాహం జరిపిస్తాడు. కూతురి వైవాహిక జీవితం చూసి సంతోషపడతాడు. జ్ఞానాంబాళ్ గర్భవతి అయిన సందర్భంలో జ్ఞానాంబాళ్‌కి పుట్టబోయే బిడ్డ తన వద్దే ఉండాలని పట్టుబడతాడు. దీనికి కనకాచలముదలియార్ ఒప్పుకోకపోవడంతో జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌లు ఒకరినొకరు దూరమవుతారు. భర్తకు దూరమవ్వడం వల్ల జ్ఞానాంబాళ్ బాధపడుతుంది. తండ్రికి చెప్పకుండా భర్తను కలుసుకుంటుంది. తన నిర్ణయం వల్ల జ్ఞానాంబాళ్ తనకు దూరమైన సంగతి తెలుసుకున్న సంబంధముదలియార్ బాధపడతాడు. ఇంటిని వీడిన జ్ఞానాంబాళ్ దేవరాజపిళ్ళై ఇంట్లో భర్తతోపాటు కలిసి ఉందని తెలిసి సంబంధముదలియార్ ఆనంద పడతాడు. దేవరాజ పిళ్ళై ఇంటికి వెళ్లి తన తప్పును మన్నించి ఇంటికి తిరిగి రావాల్సిందిగా కూతురు జ్ఞానాంబాళ్, అల్లుడు ప్రతాపముదలియార్‌లను వేడుకుంటాడు. ఇలా మొదట కోపంతో తప్పుచేయడం, తరువాత బాధపడటం సంబంధముదలియార్ మానసిక ప్రవృత్తికి నిదర్శనం. నవల ప్రారంభంలో

కోపంతో ప్రవర్తించిన సంబంధముదలియార్ నవల అంతానికి తన కోపాన్ని తగ్గించుకుంటాడు. తన నిర్ణయాలు తన కూతురికి నష్టాన్ని కలిగిస్తున్నాయని తెలుసుకుని వాటిని వెనక్కి తీసుకుంటాడు. మొత్తం మీద పరివర్తన చెందిన మానవుని మానసిక ప్రవృత్తికి నిదర్శనంగా వేదనాయగంపిళ్ళైగారు సంబంధముదలియార్ పాత్రను చిత్రించారు.

### 4.2.1.7. నీలకంఠముదలియార్

నీలకంఠముదలియార్, సంబంధముదలియార్‌కి దగ్గరి బంధువు. సంబంధ ముదలియార్ సోదరి సుందరఅణ్ణిని ఇష్టపడతాడు. సుందరఅణ్ణిని వివాహం చేసుకోవాలని ప్రయత్నిస్తాడు. అందుకు సుందరఅణ్ణి కుంటుంబ సభ్యులు ఒప్పుకోరు. ఎలాగైనా సుందరఅణ్ణిని ఎత్తుకువెళ్లి వివాహం చేసుకోవాలని పథకం రచిస్తాడు. ఇంట్లో ఎవరూ లేని సందర్భంలో మంగనూరులో ఉన్న సుందరఅణ్ణి నాన్నకు ఆరోగ్యం బాగాలేదని అబద్ధం చెప్పి తన మనుషుల ద్వారా సుందరఅణ్ణిని ఎత్తుకెళ్తాడు. సుందరఅణ్ణి ప్రయాణిస్తున్న రథం మంగనూరు మార్గంలో కాక వేరే మార్గంలో ప్రయాణించడం, ఆ రథంపై 'నీలకంఠముదలి' అని పేరు రాసి పెట్టి ఉండటం వల్ల సుందరఅణ్ణి తాను అపహరణకు గురైనట్లుగా తెలుసుకుంటుంది. రథసారధి తాను జారవిడుచుకున్న 'తమలపాకుల సంచికోసం' రథం ఆపిన సందర్భంలో సుందరఅణ్ణి రథాన్ని వెనక్కి మలిపి వాయువేగంతో తన నాన్నగారి ఊరికి చేరుకుంటుంది. మంగనూరు వచ్చిన సుందరఅణ్ణి ద్వారా జరిగిన విషయం తెలుసుకున్నా ఆమె నాన్న కోపంతో ఊగిపోతాడు. తన కూతురిని 'నీలకంఠముదలియార్' అపహరించడానికి ప్రయత్నించినట్లుగా తమ కులపెద్దలకు చెప్తాడు. వారు 'నీలకంఠముదలియార్‌ని' నీరు, నిప్పు ఇవ్వకుండా జాతినుండి బహిష్కరిస్తారు. ఈ విధంగా అమ్మాయిల అపహరణ, జాతి బహిష్కారం వంటి సాంఘిక దురాచారాలకు ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు నీలకంఠముదలియార్ పాత్రను చిత్రించారు.

### 4.2.1.8. శాంతలింగం పిళ్ళై

కనకసభ పెంపుడు తండ్రి శాంతలింగంపిళ్ళై. పేదవాడు, ఉపాధ్యాయవృత్తిలో ఉండి తన కుటుంబాన్ని పోషించుకుంటాడు. ముత్తువీరుని ద్వారా తనకు లభించిన కనకసభను కంటికి రెప్పలా కాపాడతాడు. ప్రతాపముదలియార్ ఇంట్లో ఉద్యోగానికి కుదిరిన సందర్భంలో ప్రతాపముదలియార్ అవ్వ ఆజ్ఞ ప్రకారం ప్రతాపముదలియార్ తప్పు చేసిన ప్రతీసారి

కనకసభను కొడతాడు. కనకసభ తనను ఎందుకు కొడుతున్నావు అని అడిగిన సందర్భంలో తన బీదరికాన్ని తలచుకొని బాధపడతాడు. పరిస్థితులన్నీ చక్కబడి సుందరఅణ్ణి శాంతలింగం పిళ్ళైని తమ ఇంట్లో కార్యదర్శిగా నియమించిన సందర్భంలో సంతోషపడతాడు. శాంతలింగం పిళ్ళై మనసులో కనకసభ తమ కుమారుడు కాదన్న విషయం అతనికి చెప్పాలని బలంగా ఉంటుంది. కానీ నిజం తెలిస్తే కనకసభ బాధపడతాడని అతనికి చెప్పడు. శాంతలింగం పిళ్ళై వ్యాధిబారిన పడి బాధపడుతున్న సందర్భంలో 'కనకసభ' తమ కుమారుడు కాదన్న విషయం అతనికి చెప్పి మరణిస్తాడు.

### 4.2.1.9. కరుణానంద పిళ్ళై

జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌లకు చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువు కరుణానంద పిళ్ళై. కనకసభ కూడా కరుణానంద పిళ్ళై వద్ద విద్య నేర్చుకుంటాడు. తన వద్దకు విద్య నేర్చుకోవడానికి వచ్చిన ప్రతాపముదలియార్‌ని మొదట కరుణానంద పిళ్ళై పరీక్షిస్తాడు. అతనిలో రావాల్సిన మార్పును 'జ్ఞానాంబాళ్' ద్వారా ప్రత్యక్షంగా అతనికి చూపిస్తాడు. అనుక్షణం ఆసక్తికరమైన ప్రశ్నలు అడుగుతూ ప్రతాపముదలియార్ చదువుకు దగ్గరయ్యేలా చేస్తాడు. విద్యాభ్యాసాన్ని అందించడంతోపాటు దయ్యాలు ఉన్నాయనే ప్రతాపముదలియార్ నమ్మకాన్ని ఒమ్ముచేస్తాడు. సత్యపురి సమీపంలో దయ్యాలు ఉన్నాయని ప్రతాపముదలియార్ చెప్పగా ఆ ప్రాంతంలో తాను వెళ్లి నిద్రించి దయ్యాలు లేవని నిరూపిస్తాడు. జాతకాలను నమ్మవద్దని, జాతకాలు భూటకమని ఒక జ్యోతిష్యుని ద్వారా ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌ల ఎదుట చెప్పిస్తాడు. జ్యోతిష్యంపై వారిలో ఉన్న నమ్మకాన్ని పోగొడతాడు. ఇలా జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌లు సంపూర్ణంగా ఎదగడానికి సహాయపడిన గురువు కరుణానంద పిళ్ళై. కరుణానంద పిళ్ళై ధనవంతుడుగా ఉన్న సందర్భంలో అతని కూతురు, అల్లుడు అతన్ని మోసగించి ఇంటి నుండి వెళ్లగొడతారు. ఈ విషయం తెలిసి కనకాచల ముదలియార్ కరుణానందపిళ్ళైకి సహాయపడతాడు. అతని ఆస్తి అతనికి వచ్చేలా చేస్తాడు. చివరికి తన కూతురు, అల్లుడు చేసిన తప్పులని మన్నిస్తాడు. ఇలా నవల ఆసాంతం దయార్ద్రహృదయం కలిగిన వ్యక్తుల ప్రవర్తనకు ప్రతీకగా వేదనాయగం పిళ్ళైగారు కరుణానంద పిళ్ళై పాత్రను చిత్రించారు.

### 4.2.1.10. పుణ్యకోటి చెట్టి

ఉపకారానికి ప్రత్యుపకారం చేయాలన్న గుణానికి ప్రతీకగా వేదనాయగం పిళ్ళైగారు పుణ్యకోటి చెట్టి పాత్రను చిత్రించారు. పుణ్యకోటి చెట్టి తండ్రి జ్ఞాని చెట్టి. ఇతను సత్యపురిలో చాలా రోజులు కనకాచలముదలియార్ తండ్రివద్ద పనిచేసి మరణిస్తాడు. అప్పటికే ఇతనికి పుణ్యకోటి చెట్టి జన్మిస్తాడు. 'జ్ఞాని చెట్టి' మరణ అనంతరం కనకాచల ముదలియార్ పుణ్యకోటి చెట్టిని చేరదీస్తాడు. పుణ్యకోటి చెట్టి, అతని తల్లి ఉండటానికి సత్యపురిలో ఉన్న తన పాత ఇంటిని ఇస్తాడు. పుణ్యకోటి చెట్టిని చదివిస్తాడు. పుణ్యకోటి చెట్టికి 12 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు వారి ఇంటి పెరట్లో చెట్టు నాటడానికి కందకం తవ్వగా చర్మంతో కప్పిన ఒక కంచు బిందె వారికి లభిస్తుంది. అందులో అనేక బంగారు ఆభరణాలు ఉంటాయి. పుణ్యకోటి చెట్టి తల్లి ఈ బిందె గురించి ఎవరికీ చెప్పొద్దంటుంది. పుణ్యకోటి చెట్టి 'ఈ ఇల్లు' పెరడు మనల్ని రక్షిస్తున్న కనకాచల ముదలియార్‌కు సొంతం కాబట్టి అందులో లభించిన నిక్షేపం వారికే కదా సొంతం".(జయప్రకాశ్, ఎస్(అ). 2008: 100). అంటూ తల్లిమాట వినకుండా ఆ బిందెను కనకాచల ముదలియార్‌కి అప్పగిస్తాడు. సుందరఅణ్ణి, కనకాచల ముదలియార్‌లు పుణ్యకోటి చెట్టి సుగుణానికి మెచ్చి ఆ ధనాన్ని అతనికే ఇచ్చేస్తారు. ఆ ధనంతో 'పొన్నూరు' అనే గ్రామంలో పుణ్యకోటి చెట్టి వ్యాపారం మొదలుపెట్టి ధనవంతుడిగా ఎదుగుతాడు. అనివార్య కారణాలవల్ల ఇంటిని వీడిన జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌లు 'పొన్నూరు' సమీపంలో దొంగల బారిన పడ్డ సందర్భంలో పుణ్యకోటి చెట్టి వారిని కాపాడతాడు. ప్రతాపముదలియార్ పుణ్యకోటి చెట్టికి కృతజ్ఞతలు తెలపగా పుణ్యకోటి చెట్టి ప్రతాపముదలియార్‌కు నమస్కరించి తన పూర్వ వృత్తాంతాన్ని అతనికి తెలుపుతాడు. ప్రతాపముదలియార్ తండ్రివల్లే తాను జీవించి ఉన్నానని తనకు కృతజ్ఞతలు తెలపవలసిన అవసరం లేదని పుణ్యకోటి చెట్టి, ప్రతాపముదలియార్‌తో అంటాడు. ఈ విధంగా ఉపకారానికి ప్రత్యుపకారం చేయాలన్న సందేశానికి ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు పుణ్యకోటి చెట్టి పాత్రను చిత్రించారు.

### 4.2.1.11. దేవనాయగం పిళ్ళై

అన్నదమ్ముల మధ్య ఉండే ఆస్తి తగాదాలకి ప్రతీకగా వేదనాయగంపిళ్ళై దేవనాయగం పిళ్ళై పాత్రను చిత్రించారు. దేవనాయగం పిళ్ళై ఆదిమూలం పిళ్ళై రెండవ కుమారుడు వెళ్ళాలర్ కుల ఆచారం ప్రకారం తన తండ్రి ఆదిమూలం పిళ్ళై ఆస్తి తన అన్న, ఇంటిపెద్ద కుమారుడు దేవరాజపిళ్ళైకి దక్కుతుంది. ఇది తట్టుకోలేని దేవనాయగం పిళ్ళై ఆస్తి ఎలాగైనా తనకే దక్కాలని

దేవరాజపిళ్ళై ఏకైక కుమారుడైన 'కనకసభ'ని చంపడానికి పథకం రచిస్తాడు. తన పథకాన్ని తన మిత్రుడు 'ముత్తువీరునికి' చెబుతాడు. 'ముత్తువీరుడు' దేవనాయగం పిళ్ళై ఆలోచన మంచిది కాదని హితవు చెప్పినా దేవనాయగం పిళ్ళై వినడు. కనకసభని 'ముత్తువీరుడు' ఎత్తుకెళ్ళడంతో చేసేది లేక దాసి కుమారుని శవాన్ని కనకసభ శవంగా అందరిని నమ్మిస్తాడు. దహన సంస్కారాలు జరిపిస్తాడు. కనకసభ మరణించినట్లు తన అన్న దేవరాజపిళ్ళైకి లేఖ రాస్తాడు. అందరూ 'కనకసభ' మరణించాడని అనుకుంటారు. అవసాన దశలో పశ్చాత్తాపానికి లోనైన దేవనాయగం పిళ్ళై జరిగిన విషయాలన్నీ ఒక ఉత్తరంలో రాసి చనిపోతాడు. ఈ ఉత్తరాన్ని చదివిన తర్వాత దేవరాజ పిళ్ళై కనకసభని కలుసుకుంటాడు. నవల ఆసాంతం క్రూర స్వభావం ప్రదర్శించిన దేవనాయగం పిళ్ళై వ్యాధిగ్రస్తుడైన సందర్భంలో పశ్చాత్తాప పడతాడు. తన మనసు మార్చుకుంటాడు. ఇలా పరివర్తన చెందిన మనుషుల ప్రవర్తనకు నిదర్శనంగా వేదనాయగం పిళ్ళైగారు దేవనాయగం పిళ్ళై పాత్రను చిత్రించారు.

### 4.2.1.12. ముత్తువీరుడు

ముత్తువీరుడు దేవనాయగం పిళ్ళై స్నేహితుడు. గాడి తప్పుతున్న స్నేహితుని మనస్సును సరిదిద్దడానికి ప్రయత్నించే ఉత్తమ స్నేహితుని ప్రవర్తనకు నిదర్శనంగా ముత్తువీ పాత్రను వేదనాయగంపిళ్ళైగారు చిత్రించారు. తన అన్నకొడుకు కనకసభని ఆస్తి నిమిత్తం తాను హత్య చేస్తానని దేవనాయగంపిళ్ళై చెప్పిన సందర్భంలో అతని స్నేహితుడైన ముత్తువీరుడు దేవనాయగం పిళ్ళైని ఆపుతాడు. అంతేగాక కనకసభను దేవనాయగం పిళ్ళైబారి నుండి కాపాడతాడు. చివరికి తాను కాపాడిన కనకసభను అతని తండ్రి దేవరాజపిళ్ళైకి అప్పగిస్తాడు. ఇలా నవలలో దేవనాయగం పిళ్ళై స్నేహితునిగా పరిచయమైన 'ముత్తువీరుడు' తన స్నేహితుడి తప్పుడు ప్రవర్తనను ఎదురించిన గొప్ప వ్యక్తిగా కనిపిస్తాడు.

## 4.2.2. స్త్రీ పాత్రలు

### 4.2.2.1. జ్ఞానాంబాళ్

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలోని నాయిక పాత్ర జ్ఞానాంబాళ్. విద్య నేర్చిన స్త్రీ ధైర్య సాహసాలకు ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు జ్ఞానాంబాళ్ పాత్రను చిత్రించారు. ధనవంతులైన కుటుంబంలో పుట్టిన జ్ఞానాంబాళ్‌కు తాము ధనవంతులమనే పొగరు ఎక్కడా ప్రదర్శించదు. పేద్ద వారిపట్ల గౌరవ భావాలను కలిగి ఉండటం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం.

తల్లిదండ్రుల ఆజ్ఞ ప్రకారం నడచుకోవడం, అన్ని సమయాలలో భర్తకు అండగా ఉండటం, సమస్య వచ్చినప్పుడు దాన్ని చతురతతో ఎదుర్కోవడం వంటి లక్షణాలు జ్ఞానాంబాళ్‌లో కనిపిస్తాయి. జ్ఞానాంబాళ్ సంబంధ ముదలియార్ ఏకైక సంతానం. సంబంధ ముదలియార్ జ్ఞానాంబాళ్‌ని అల్లారుముద్దుగా పెంచుతాడు. జ్ఞానాంబాళ్ అడిగిన ప్రతీది నెరవేర్చుతాడు. దీనిని గ్రహించిన జ్ఞానాంబాళ్ తన తండ్రిలో ఉన్న లోభ గుణాన్ని పోగొడుతుంది. అందరూ అతన్ని గొప్పదాతగా కీర్తించేలా చేస్తుంది. జ్ఞానాంబాళ్ చిన్న వయస్సులోనే అధికబుద్ధి సూక్ష్మతను ప్రదర్శిస్తుంది. తన బావ ప్రతాపముదలియార్ విద్యాభ్యాసం నిమిత్తం తమ ఇంటికి వచ్చిన సందర్భంలో అతన్ని ఆటపట్టిస్తుంది. ప్రతాపముదలియార్ చదువుపై దృష్టి కేంద్రీకరించేలా చేస్తుంది. తమతో పాటు చదువుకుంటున్న 'కనకసభ' తన తల్లిదండ్రుల జాడ తెలియక బాధపడుతుంటే జ్ఞానాంబాళ్ అతన్ని ఓదార్చుతుంది. కనకసభ ఆటలాడుకుంటూ కొలనులో పడ్డ సందర్భంలో తన వద్ద ఉన్న పూర్తి నగలను సన్యాసికి ఇస్తానని చెప్పి కనకసభను కాపాడుతుంది. ఈ సంఘటన జ్ఞానాంబాళ్‌లోని ధాతృత్వానికి చిహ్నం. జ్ఞానాంబాళ్ ఎంత చదువుకున్నా గర్వాన్ని ప్రదర్శించేది కాదు. ప్రతాపముదలియార్ తాను జ్ఞానాంబాళ్ కంటే చదువులో వెనకబడుతున్నానని బాధపడుతున్న సందర్భంలో "స్త్రీలు ఎంత చదివినప్పటికీ పురుషులను జయించలేరు. స్త్రీలు స్వల్పకాలంలో పెరిగి పుష్పించి తొందరగా వాడిపోయే పూతీగలకు సమానమైనవారు, కాని పురుషులు మెల్లగా పెరిగి దీర్ఘకాల ఫలాలను అందించే వృక్షాలకు సమానమైనవారు. స్త్రీలకు యవ్వనం, బుద్ధి, తొందరగా వచ్చి తొందరగా క్షీణించి పోతుంది. పురుషులకు యవ్వనం బుద్ధి ఆలస్యంగా రావడం వల్ల చాలాకాలం నిలిచి ఉంటుంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 16) అంటూ ప్రతాపముదలియార్‌లో ఉన్న సిగ్గును తొలగించి అతను మరింత బాగా చదివేలా ప్రోత్సహిస్తుంది. జ్ఞానాంబాళ్ తెలివితేటలను గుర్తించిన 'ప్రతాపముదలియార్ అవ్వ' ప్రతాపముదలియార్‌కి జ్ఞానాంబాళ్ భార్యగా వస్తే అతని జీవితం బాగుంటుంది అనుకుంటుంది. చిన్నప్పుడు తనకి విద్యను నేర్పే కరుణానందపిళ్ళై బోధనలవల్ల జ్యోతిష్యం భూటకమని జ్ఞానాంబాళ్ తెలుసుకుంటుంది. అప్పుడప్పుడు తమ ఇంటికి వచ్చే మేనత్త సుందరఅణ్ణి బోధనలవల్ల పతివ్రత స్త్రీల కథలను జ్ఞానాంబాళ్ తెలుసుకుంటుంది. యుక్త వయస్సుకు వచ్చిన జ్ఞానాంబాళ్‌కి ప్రతాపముదలియార్‌తో వివాహం జరిగితే బాగుంటుందని అనుకుంటుంది. సంబంధముదలియార్ ప్రతాపముదలియార్‌తో జ్ఞానాంబాళ్ వివాహానికి ఒప్పుకుంటాడు. ఈ వివాహం అనివార్య కారణాల వల్ల వాయిదా

పడుతుంది. ఈ సందర్భంలో ప్రతాపముదలియార్ తాము ఎక్కడికైనా వెళ్లి వివాహం చేసుకుందామని జ్ఞానాంబాళ్‌కి ఉత్తరం రాస్తాడు. ఆ ఉత్తరాన్ని చదివిన జ్ఞానాంబాళ్ ప్రతాపముదలియార్ అభిప్రాయాన్ని తిరస్కరిస్తుంది. "వివాహం కాని ఒక కన్య ఓ బ్రహ్మచారి ఇల్లు విడిచి వెళితే కలిగే అవమానం, అపవాదం, ఈ ప్రపంచం ఉన్నంతవరకూ తొలిగిపోతుందా? నన్ను ఇలా అవమానానికి గురిచేయడానికి నేను మీకు ఏం ద్రోహం చేశాను. ఈ విషయంలో పురుషులకు జరిగే అవమానం కన్నా స్త్రీలకు కలిగే అపవాదు నూరు రెట్లు అధిక మనే విషయం మీరెందుకు యోచించలేదు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 52) అంటూ ప్రతాపముదలియార్ అభిప్రాయాన్ని జ్ఞానాంబాళ్ సున్నితంగా తిరస్కరిస్తుంది. ఈ మాటలు జ్ఞానాంబాళ్ తన వివాహ విషయంలో తల్లిదండ్రుల అభిప్రాయానికి కట్టుబడి ఉన్న వైనాన్ని తెలుపుతున్నాయి. అందుకే సంబంధముదలియార్ జ్ఞానాంబాళ్‌తో సంప్రదించకుండానే ఆమె వివాహాన్ని చంద్రశేఖరముదలియార్‌తో నిర్ణయిస్తాడు. ఈ సందర్భంలో కూడా తన తండ్రిని ఎదురించదు. పుంగావూరు తహసీల్దారు మనుషులు జ్ఞానాంబాళ్‌ని అపహరించిన సందర్భంలో ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌ని కాపాడతాడు. ఈ సందర్భంలో జ్ఞానాంబాళ్ ప్రతాపముదలియార్‌పై కృతజ్ఞతా భావాన్ని ప్రదర్శిస్తుంది. ఈ సంఘటనతో 'సంబంధముదలియార్' జ్ఞానాంబాళ్‌ని ప్రతాపముదలియార్‌కి ఇచ్చి వివాహం జరిపిస్తాడు. అప్పటి వరకు తండ్రి చెప్పినట్లు నడుచుకున్న జ్ఞానాంబాళ్ వివాహ అనంతరం తన భర్త ప్రతాపముదలియార్‌కి అండగా ఉంటుంది. తన అత్త సుందరఅణ్ణిని కంటికి రెప్పలా చూసుకుంటుంది. తన తండ్రి అనాలోచిత ప్రవర్తనవల్ల భర్తకు దూరమైన సందర్భంలో బాధపడుతుంది. వివాహ అనంతరం భార్యకు భర్తే సర్వస్వంగా నిర్ణయించుకొని ఇంటినుండి వెళ్లిపోయి తన భర్తని కలుసుకుంటుంది. ఇంటినుండి బయలుదేరిన జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌లు కాకతాళీయంగా కనకసభ ఊరికి చేరుకుంటారు. అక్కడ వేటాడే సందర్భంలో ప్రతాపముదలియార్ తప్పిపోయి విక్రమపురిని చేరుకుంటాడు. భర్తను అనుసరించి జ్ఞానాంబాళ్ కూడా విక్రమపురి చేరుకొని పురుష వేషంలో కొంత కాలం విక్రమపురిలో రాజ్యపాలన చేస్తుంది. తన భర్తను కష్టాలనుండి కాపాడుతుంది. చివరికి మశూచి వ్యాధినుండి బయటపడి తన భర్తతో సుఖంగా జీవిస్తుంది. ఇలా నవల ఆసాంతం పతివ్రతా ధర్మం కలిగిన విద్యావంతురాలైన భారత స్త్రీ ప్రవర్తనకు ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు జ్ఞానాంబాళ్ పాత్రను చిత్రించారు.

### 4.2.2.2. గుణభూషణి

సవతి తల్లి పోరును ఎదుర్కొన్న పాత్ర గుణభూషణి. తల్లి మరణించిన తరువాత పెంపుడు తల్లివద్ద పిల్లలు పడే కష్టాలకు ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు గుణభూషణి పాత్రను చిత్రించారు. ఆదియూరుకు చెందిన అరుమైనాథ పిళ్ళై తన మొదటి భార్య గుణభూషణిని ప్రసవించి మరణించిన తరువాత రెండవ వివాహం చేసుకుంటాడు. రెండవ భార్యకు మోహనమాల అనే కూతురు జన్మిస్తుంది. అరుమైనాథ పిళ్ళై రెండవ భార్య, అతని కూతురు మోహనమాల ఇద్దరు కలిసి తల్లి లేని గుణభూషణిని అష్టకష్టాలు పెడతారు. మోహనమాల వేసుకొని వదిలిన, చినిగిన బట్టలను గుణభూషణికి ఇచ్చేవారు. అందరూ తినగా మిగిలిన ఎంగిలి అన్నాన్ని గుణభూషణికి పెట్టేవారు. అరుమైనాథ పిళ్ళైకి ఈ విషయాలన్నీ తెలిసినా భార్యకు భయపడి ఆమెను ఏమీ అనేవాడు కాదు. పినతల్లి నిరంతరం గుణభూషణిని కొట్టడం, తిట్టడం చేసేది. పినతల్లి పెట్టే హింసను గుణభూషణి ఓర్పుతో సహించేది. గుణభూషణి మోహనమాల కంటే అందంగా ఉండటం వల్ల నాగపట్టణంలోని నల్లతంబిపిళ్ళై అనే ధనవంతుని తల్లి తన కుమారునికి గుణభూషణిని ఇచ్చి వివాహం చేయాలనుకుంటుంది. గుణభూషణిని అడగడానికి నాగతంబిపిళ్ళై తల్లి అరుమైనాథ పిళ్ళై ఇంటికి వెళ్లిన సందర్భంలో మోహనమాల తల్లి వారివద్ద ఉన్న డబ్బుల సంచిని తీసి గుణభూషణి పెట్టెలో పెడుతుంది. గుణభూషణి దొంగ అని అందరిముందూ ముద్ర వేస్తుంది. తమ డబ్బుల సంచి గుణభూషణి పెట్టెలో లభించడంవల్ల నల్లతంబిపిళ్ళై తల్లి అది నిజమేనని నమ్ముతుంది. తనకొడుకు వివాహాన్ని గుణభూషణితో కాక మోహనమాలతో నిశ్చయిస్తుంది. నాగపట్టణం ఆదియూరుకు దూరంగా ఉండటంవల్ల నెల రోజుల తరువాత వివాహం నిశ్చయిస్తారు. నల్లతంబిపిళ్ళై తన పరివారంతో నాగపట్టణం నుండి బయలుదేరిన సందర్భంలో మార్గమధ్యమంలో 'తలవంచనివీరుడు' అనే బందిపోటు దొంగ కొంతమంది దొంగలతో కలిసి నల్లతంబిపిళ్ళై పరివారంపై దాడిచేసి వారి సొమ్మును కాజేస్తాడు. అరుమైనాథ పిళ్ళై ఇంటికివచ్చి, తానే నల్లతంబిపిళ్ళైని అని చెప్పి మోహనమాలను వివాహం చేసుకుంటాడు. అక్కడున్న ఎవరూ నల్లతంబిపిళ్ళైని చూసి ఉండక పోవడం వల్ల అతనే నల్లతంబి పిళ్ళైఅని నమ్ముతారు. చివరికి నల్లతంబిపిళ్ళై ఆదియూరుకు వచ్చి నిజం చెప్పగా అందరూ నిర్ఘాంతపోతారు. అప్పటికే నల్లతంబిపిళ్ళై అరుమైనాథ పిళ్ళై ఇంట్లో ఉన్న ఆభరణాలతో వెళ్లిపోతాడు. ఈ సందర్భంలో అరుమైనాథ పిళ్ళై రెండవ భార్య తాను తన అక్కకూతురు గుణభూషణికి కష్టాలు పెట్టడం వల్లే తనకు ఇలా జరిగిందని బాధపడుతూ, ఏడుస్తుంది. ఆమె

ఏడుపు వల్ల అసలు విషయం తెలుసుకున్న ఊరి పెద్ద దేవరాజ పిళ్ళై గుణభూషణికి నల్లతంబి పిళ్ళైతో వివాహం జరిపిస్తాడు. ఇలా నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు పినతల్లి పెట్టిన కష్టాలు అనుభవించి చివరికి తన ప్రవర్తన ద్వారా తన పినతల్లిలో మానసిక పరివర్తనకు కారణమైన పాత్ర గుణభూషణి.

### 4.2.2.3. ఆనందవల్లి

విక్రమపురి రాజు కుమార్తె ఆనందవల్లి. విక్రమపురిని జ్ఞానాంబాళ్ పురుషవేషంలో పరిపాలిస్తున్న తరుణంలో ఆనందవల్లికి జ్ఞానాంబాళ్ సంరక్షకురాలిగా ఉంటుంది. సన్మార్గాల గురించి, రాజనీతి గురించి బోధిస్తుంది. ఆనందవల్లికి యుక్తవయస్సు వచ్చిన తరువాత ఆమెను రాణిగా పట్టాభిషేకం చేసి తాను సత్యపురికి వెళ్లిపోదామని జ్ఞానాంబాళ్ అనుకుంటుంది. అప్పటికే పురుషవేషంలో ఉన్న జ్ఞానాంబాళ్‌ని ఆనందవల్లి ఇష్టపడుతుంది. రాజ్యంలో ఉన్న ప్రజలందరూ ఆనందవల్లికి, పురుషవేషంలో ఉన్న జ్ఞానాంబాళ్‌కి వివాహం చేద్దామని అనుకుంటారు. ఈ విషయం తెలిసి జ్ఞానాంబాళ్ తన భర్త ప్రతాపముదలియార్‌తో కలిసి రాత్రికి రాత్రే ఆదియూరుకు వెళ్లిపోతుంది. ఆదియూరుకు చేరుకున్న తరువాత తాను పురుషుడిని కాదని, పురుషుడి వేషంలో ఉన్న స్త్రీనని జ్ఞానాంబాళ్ ఆనందవల్లికి లేఖ రాస్తుంది. జ్ఞానాంబాళ్ లేఖ అందుకున్న ఆనందవల్లి చాలా బాధపడుతుంది. వెంటనే ఆదియూరుకు వెళ్లి భర్త ప్రతాపముదలియార్‌తో కలిసి ఇంతకు ముందులాగే తమ రాజ్యాన్ని పరిపాలించవలసిందిగా కోరుకుంటుంది. ఆనందవల్లి విజ్ఞాపనను జ్ఞానాంబాళ్ సున్నితంగా తిరస్కరిస్తుంది. ఆనందవల్లి మార్గమధ్యంలో జ్ఞానాంబాళ్ మశూచి వ్యాధి బారిన పడిందని తెలిసి బాధపడుతుంది. మశూచి వ్యాధినుండి జ్ఞానాంబాళ్ కోలుకున్న తరువాత సత్యపురికి వెళ్లి జ్ఞానాంబాళ్‌ని కలుస్తుంది. జ్ఞానాంబాళ్ అభీష్టం మేరకు ఒక రాజును వివాహమాడి విక్రమపురిని పాలిస్తుంది. ఇలా స్త్రీలకు సరైన శిక్షణ ఇస్తే వారు రాజ్యపాలన కూడ చేయగలరన్న సందేశానికి ప్రతీకగా ఆనందవల్లి పాత్రను వేదనాయగంపిళ్ళైగారు చిత్రించారు.

### 4.2.2.4. సుందర అణ్ణి

చదువుకున్న స్త్రీ తనకు ఎదురైన సమస్యలను చాకచక్యంగా ఎలా ఎదుర్కుంటుందో తెలపడానికి ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు సుందరఅణ్ణి పాత్రను చిత్రించారు. సుందరఅణ్ణి చంద్రశేఖర ముదలియార్ కూతురు. సంబంధముదలియార్ చెల్లెలు. ప్రతాపముదలియార్ తల్లి.

కనకాచల ముదలియార్ భార్య. జ్ఞానాంబాళ్ మేనత్త. తల్లిగా సుందరఅణ్ణి తన కొడుకు ప్రతాపముదలియార్ చదువుకొని గొప్ప విద్యావంతుడు కావాలని కోరుకుంటుంది. భార్యగా సుందరఅణ్ణి తన భర్త కనకాచలముదలియార్‌కు అండగా ఉంటుంది. కోడలిగా తన అత్త ప్రతాపముదలియార్ అవ్వకు సేవలు చేస్తుంది. జ్ఞానాంబాళ్ తెలివి తేటలను గుర్తించి ఆమె తన కోడలు కావాలని కోరుకుంటుంది. అందుకు అనుగుణంగా తన కుమారుడు ప్రతాపముదలియార్‌ని తన సోదరుడు సంబంధముదలియార్ ఇంట్లో ఉంచి చదివిస్తుంది. ఇలా భార్యగా, కోడలిగా, తల్లిగా, మేనత్తగా అన్ని రకాలుగా కనకాచల ముదలియార్ కుటుంబాన్ని ముందుండి నడిపించిన పాత్ర సుందరఅణ్ణి. తన కుమారుడు 'అవ్వ' మాటలునమ్మి విద్యకు దూరం అవుతున్న సందర్భంలో అన్ని సంపదల కన్నా విద్యా ధనం గొప్పదని చెప్పి అతని మనసుని విద్యవైపు మళ్లిస్తుంది. తన కుమారుని వల్ల శాంతలింగం పిళ్ళై అనే గురువు అతని కుమారుడు కనకసభ బాధలు పడ్డారని గుర్తించి శాంతలింగం పిళ్ళైని తమ ఇంట్లో గుమాస్తాగా నియమించుకోవడంతోపాటు కనకసభను తన కుమారునితో సమానంగా చూసుకుంటుంది. తన ఇంట్లో ఉంటే ప్రతాపముదలియార్ విద్యను నేర్చుకోడని గుర్తించి అతన్ని విద్యాభ్యాసం నిమిత్తం కనకసభతో సహా తన సోదరుడు సంబంధముదలియార్ ఇంటికి పంపుతుంది. యుక్తవయస్సు వచ్చేంతవరకు ప్రతాపముదలియార్‌ని కనకసభ, జ్ఞానాంబాళ్‌తో కలిసి చదువుకునేలా ఏర్పాటు చేసిన సుందరఅణ్ణి ప్రతాపముదలియార్‌కి యుక్త వయస్సు వచ్చిన తరువాత తన ఇంటికి తీసుకు వస్తుంది. అప్పటికే ప్రతాపముదలియార్ జ్ఞానాంబాళ్‌ని ఇష్టపడుతున్నాడని తెలిసి కనకాచలముదలియార్ ద్వారా ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌ల వివాహం జరిపించడానికి ప్రయత్నిస్తుంది. వివాహ అనంతరం వధూవరులు ఎవరి ఇంట్లో ఉండాలన్న విషయంలో వివాదం చెలరేగి వివాహం వాయిదా పడిన సందర్భంలో సుందరఅణ్ణి బాధపడుతుంది. పట్టుదలకు పోయి సంబంధముదలియార్–జ్ఞానాంబాళ్‌కి చంద్రశేఖర ముదలియార్‌తో వివాహం నిశ్చయిస్తాడు. ఈ విషయం విన్న వెంటనే కనకాచల ముదలియార్–ప్రతాపముదలియార్‌కి పూంగావనంతో వివాహం నిశ్చయిస్తాడు. అనివార్య కారణాల వల్ల ఈ వివాహాలు రద్దవుతాయి. ఈ సందర్భంలో దైవం కూడా జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌ల వివాహం కోరుకుంటుందని చెప్పి సుందరఅణ్ణి తన భర్త కనకాచల ముదలియార్ మనసును మార్చే ప్రయత్నం చేస్తుంది. అన్ని ఆటంకాలు తొలిగి జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌ల వివాహం అయిన తరువాత సుందరఅణ్ణి జ్ఞానాంబాళ్‌ని కూతురిలా చూసుకుంటుంది.

జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్ దంపతులకు పుట్టబోయే బిడ్డను సంబంధముదలియార్ దత్తత అడిగిన సందర్భంలో కనకాచల ముదలియార్‌కి సంబంధముదలియార్‌కి మధ్య గొడవ జరుగుతుంది. ఈ గొడవ కారణంగా జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌లు ఒకరినొకరు చూసుకోకూడదని తీర్మానిస్తారు. ఈ తీర్మానం విన్న తరువాత ప్రతాపముదలియార్ బాధపడతాడు. సుందరఅణ్ణి తండ్రి కోపంతో ఒక మాట అంటే మనస్తాపం చెందవద్దని ప్రతాపముదలియార్‌ని ఓదార్చుతుంది. ప్రతాపముదలియార్ ఇంటిని వదిలి వెళ్లిన సందర్భంలో బాధపడుతుంది. 'కనకసభ' వివాదంలో తన భర్తకు న్యాయవిచార కర్తలు. ద్వీపాంతర శిక్ష విధించగా తెగువతో తన తోటి స్త్రీలను ఒక చోటకి చేర్చి మద్రాసు వెళ్లి తన భర్త తరపున వాదిస్తుంది. గవర్నర్‌కి అసలు విషయం చెప్పి తనకు పతి భిక్ష పెట్టమని వేడుకుంటుంది. సుందరఅణ్ణి వాదనకు ఆశ్చర్యం చెందిన గవర్నర్, కనకాచల ముదలియార్‌తోపాటు 'కనకసభ' వివాదంలో సాక్ష్యం చెప్పిన వారందరిని నిర్దోశులుగా విడుదల చేస్తాడు. జ్ఞానాంబాళ్ మశూచి వ్యాధి బారిన పడిన సందర్భంలో ప్రతాపముదలియార్ బాధపడగా సుందరఅణ్ణి అతన్ని ఓదార్చుతుంది. ఇలా అనేక సందర్భాలలో కుటుంబ సభ్యుల బాధలను పోగొడుతూ సుందరఅణ్ణి వారికి అండగా నిలుస్తుంది. సుందరఅణ్ణి కీర్తి ప్రతిష్టలు యూరప్ వరకు వ్యాపించినట్లు ఆమెకు యూరప్ చక్రవర్తి 'రాజస్త్రీ' అనే బిరుదుతో గౌరవించినట్లు నవల అంతంలో పేర్కొన్నబడింది.

### 4.2.2.5. ప్రతాపముదలియార్ అవ్వ

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో పేరులేని పాత్ర 'ప్రతాపముదలియార్ అవ్వ'. ఈమె ప్రతాపముదలియార్ నాన్నమ్మ. చిన్నప్పుడు ప్రతాపముదలియార్ ఈ అవ్వ పరిరక్షణలో పెరుగుతాడు. డబ్బున్న ఇళ్ళలో ఉన్న సనాతన భావాలు కలిగిన స్త్రీల మనస్తత్వానికి ప్రతీకగా వేదనాయగంపిళ్ళైగారు 'అవ్వ' పాత్రను చిత్రించారు. ప్రతాపముదలియార్‌కి చిన్నప్పటినుండి తాము డబ్బున్నవారమని తమకు విద్యనేర్చుకొనే అవసరం లేదని 'అవ్వ' నూరిపోస్తుంది. ఫలితంగా ఎనిమిది సంవత్సరాల వరకు ప్రతాపముదలియార్ విద్యని నేర్చుకోకుండా నిరక్షర కుక్షిగా ఉండిపోతాడు. ప్రతాపముదలియార్ తల్లి సుందరఅణ్ణి ప్రోద్భలంతో ప్రతాపముదలియార్ విద్యాభ్యాసం ప్రారంభమవుతుంది. ప్రతాపముదలియార్ విద్య నేర్చుకుంటున్న సందర్భంలో 'అవ్వ' ప్రతాపముదలియార్‌ని కొట్టొద్దని, తిట్టొద్దని అతనికి విద్యనేర్పే గురువులపై ఆంక్షలు విధిస్తుంది. శాంతలింగంపిళ్ళై ప్రతాపముదలియార్‌కి విద్య నేర్పు సందర్భంలో "నా మనవడికి పాఠాలు అర్థంకాకపోయినట్లైతే అతనిలో భయం కలగడానికిగాను

కనకసభను బలంగా కొట్టండి"(జయప్రకాశ్, ఎస్(అ). 2008: 5) అంటుంది. ఈ మాటలు 'అవ్వ' ప్రతాపముదలియార్‌ని ఎంత గారాబం చేసిందో తెలుపుతున్నాయి. ప్రతాపముదలియార్ ఏ పని చేసినా 'అవ్వ' దానిని సమర్థించేది. సంబంధ ముదలియార్ ఇంట్లో చదువుకుంటున్న ప్రతాపముదలియార్‌ని చూడడానికి వెళ్లిన సందర్భంలో జ్ఞానాంబాళ్ అవ్వని చూడగానే అక్కడున్న 'బెత్తాన్ని' దాచి పెడుతుంది. అవ్వ అలా ఎందుకు చేశావని జ్ఞానాంబాళ్‌ని అడగగా మీ మనుమడు తప్పు చేస్తే నన్ను కొడతారేమోనన్న భయంతో అలా చేశానని జ్ఞానాంబాళ్ చెప్పగా విని అవ్వ ఆశ్చర్యపోతుంది. జ్ఞానాంబాళ్ తెలివితేటలను మెచ్చుకొని ప్రతాపముదలియార్‌కి జ్ఞానాంబాళ్ తగిన జోడి అని నిర్ణయించుకుంటుంది. ప్రతాపముదలియార్ తల్లి సుందరఅణ్ణి తెలివి తేటల గురించి ఆమె తనను చూసుకుంటున్న విధానం గురించి జ్ఞానాంబాళ్‌కి చెబుతుంది. తన కోడలు తనపై చూపే ప్రేమానురాగాలకు కృతజ్ఞతలు తెలుపుతుంది. కనకసభను వెతుకుతూ వారి తల్లిదండ్రులు సంబంధముదలియార్ అతని భార్య తమ ఇంటికి వచ్చిన సందర్భంలో తన వల్ల కనకసభ దెబ్బలు తిన్నాడని అందుకు తనని మన్నించమని 'అవ్వ' సంబంధ ముదలియార్‌ని వేడుకుంటుంది. ఇలా మనవని మీద అధిక ప్రేమ ఉన్న 'అవ్వ' తన అనుభవంతో తాను చూసిన విషయాలను జ్ఞానాంబాళ్‌కి చెప్పి భవిష్యత్తులో జ్ఞానాంబాళ్ ఎలా నడుచుకోవాలో పరోక్షంగా సూచిస్తుంది. మొదట విద్యపట్ల కొంత వ్యతిరేకత భావాన్ని కలిగిఉన్న 'అవ్వ' తరువాత తన అభిప్రాయాన్ని మార్చుకుంటుంది.

#### 4.2.2.6. ఆన్డిచ్చియమ్మాళ్ (సన్యాసి)

జ్ఞానాంబాళ్‌ను పూంగావూరు తహసిల్దార్ అపహరించినపుడు ఆన్డిచ్చియమ్మాళ్ (సన్యాసి) ఆమెను కాపాడుతుంది. వేదనాయగంపిళ్ళైగారు తమిళ ప్రాంతంలో అత్తవారింట్లో స్త్రీ అనుభవించే కష్టాలకు ప్రతీకగా ఈ పాత్రను చిత్రించారు. ఆన్డిచ్చియమ్మాళ్ పుదువై నగరంలో జన్మిస్తుంది. ఈమె తండ్రి ధనవంతుడు. తన కూతురికి వివాహ వయస్సు రాగానే అనేక సంబంధాలు వెతికి చివరికి తన చెల్లెలు బతిమిలాడటం వల్ల తన చెల్లెలి కొడుక్కి ఇచ్చి వివాహం చేస్తాడు. ఆన్డిచ్చియమ్మాళ్ భర్త సైన్యంలో దళపతి. వీరి వివాహం అయిన కొన్ని రోజులకు దూర ప్రాంతంలో ఉన్న ఆడపడుచు భర్త మరణిస్తాడు. దీనితో ఆ ఆడపడుచుని చూడటానికి ఆన్డిచ్చియమ్మాళ్ అత్త వెళ్తుంది. ఆమె తిరిగి రావడానికి పదినెలల సమయం పడుతుంది. ఈ పదినెలల కాలంలో ఆన్డిచ్చియమ్మాళ్ తన భర్తతో అన్యోన్యంగా ఉంటుంది. అత్త విధవ ఆడపడచుతో కలిసి పదినెలల తరువాత ఇంటికి వస్తుంది. అప్పటినుండి ఆన్డిచ్చియమ్మాళ్‌కు

కష్టాలు ప్రారంభమవుతాయి. తన కూతురి భర్త మరణించడానికి కోడలే కారణమని అత్త ఆన్దిచ్చియమ్మాళ్‌ను అనేక కష్టాలకు గురిచేస్తుంది. తన భర్తతో తాను సన్నిహితంగా మాట్లాడటం కూడా అత్తకు నచ్చదు. “నేను మీ నాన్నగారిని పెళ్ళి చేసుకొని ఇరవై సంవత్సరాల వరకు పుని స్త్రీగా ఉన్నాను. ఇరవై సంవత్సరాల కాలంలో రెండు మాటలు కూడా నా భర్తతో మాట్లాడి ఎరగను. భర్త ఇంట్లో అడుగుపెట్టగానే ఆడపడచు భర్తను మింగిన దానితో నీకు మాటలు కూడానా” (ప్రతాపముదలియార్ చరిత్ర. 2008: 66). అంటూ తన కొడుకుతో తల్లి అంటుంది. ఈ మాటలు కొత్తగా వివాహమైన స్త్రీలను నాటి అత్తలు ఎలా చూశారనడానికి నిదర్శనం. ఆడపడుచు భర్త చనిపోతే దానికి కోడలి రాకతో ముడిపెట్టడం దురాచారం, మూఢనమ్మకం. ఇలాంటి పరిస్థితులలో ఆ కోడలు ఎలా ప్రవర్తిస్తే పరిస్థితులలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందనడానికి ఆన్దిచ్చియమ్మాళ్ పాత్ర నిదర్శనం. తన భార్యను తల్లి నిందిస్తున్న తరుణంలో భర్త ఏమీ అనడు. ధైర్యం చేసి నా చెల్లెలి భర్త మరణానికి, నా భార్యకి ఏం సంబంధం అని ఒకసారి తన తల్లిని ఎదిరిస్తాడు. అప్పుడు తల్లి నీ ‘భార్య నేర్పిన పలుకులు బాగానే పలుకుతున్నావ్ ఒక వేశ్య కూడా నీ భార్యలా మాట్లాడదు’ అంటుంది. ఈ మాటలు వినగానే అతనికి తీవ్రకోపం వచ్చినా తల్లిని ఏమీ అనలేక మిన్నకుంటాడు. అప్పటినుండి అత్తా, ఆడపడుచులు ఆన్దిచ్చియమ్మాళ్‌ని అనేక ఇబ్బందులకి గురి చేస్తారు. గర్భవతిగా ఉన్న ఆమెకు సరైన ఆహారం ఇవ్వరు. తన భర్తకు వేశ్యలను దగ్గరచేసే ప్రయత్నం చేస్తారు. వీటిని తాళలేక తానే ఎదురుతిరుగుదామని ఆన్దిచ్చియమ్మాళ్ అనుకుంటుంది కాని అత్తగారి ఇంటిని వీడిన స్త్రీకి తల్లిగారి ఇంట్లో గౌరవం ఉండదని మిన్నకుంటుంది. ఆన్దిచ్చియమ్మాళ్ భర్త తన తల్లిచేసే పనులు చూడలేక తన మామగారు తమ ఇంటికి రావాల్సిందిగా, వచ్చి కూతురు కష్టాలు తొలగించవలసిందిగా తన మామకు లేఖ రాస్తాడు. దానితో తన చెల్లెలి ఇంటికి వచ్చిన ఆన్దిచ్చియమ్మాళ్ తండ్రి తన కూతురి పరిస్థితి చూసి ఆశ్చర్యపోతాడు. అల్లుడిని, అతని తల్లిని తిట్టి, బెదిరించి వెళ్తాడు. అప్పటి నుండి అత్త, ఆడపడుచు ఆన్దిచ్చియమ్మాళ్‌ను ఏమీ అనరు. తాను తన భర్తతో అన్యోన్యంగా ఉంటున్న తరుణంలో యుద్ధానికి రావాల్సిందిగా భర్తకు వర్తమానం వస్తుంది. అల్లుడు యుద్ధానికి వెళ్లిన తరువాత అత్త, ఆడపడుచులు తన కూతురిని సరిగ్గా చూసుకోరని భావించిన ఆన్దిచ్చియమ్మాళ్ తండ్రి ఆమెని తనతో పంపవల్సిందిగా అల్లుడిని కోరతాడు. అందుకు అల్లుడు అంగీకరిస్తాడు. ఆన్దిచ్చియమ్మాళ్‌కి తన పోలికలతో కొడుకు పుడతాడు. తండ్రి సంరక్షణలో తాను తన కొడుకు పెరుగుతున్న తరుణంలో నగలతో

అలంకరింపబడిన తన కొడుకుని ఎవరో అపహరిస్తారు. తన కొడుకుని వెతుక్కుంటూ వెళ్లిన తండ్రి కనిపించడు. అదే సమయంలో తన భర్త యుద్ధంలో మరణించినట్లు వార్త వస్తుంది. ఇలా అన్ని కష్టాలు ఒకేసారి రావడంవల్ల ఆన్దిచ్చియమ్మాళ్ మరణించాలనుకుంటుంది. కాని మరణించి సాధించేది ఏమీ ఉండదు కనుక సన్యాసి వేషం వేసి ధైర్యంతో జీవనం సాగిస్తుంది. తాను సన్యాసిగా ఉన్నప్పుడు తన వద్దకు జ్ఞానాంబాళ్ వస్తుంది. ఆమెను ధైర్యంతో కాపాడుతుంది. జ్ఞానాంబాళ్‌ని కాపాడే ప్రయత్నంలో ప్రతాపముదలియార్ తహసీల్దార్, అతని స్నేహితుడిని చంపుతాడు. ఈ కేసు విచారించడానికి వచ్చిన అధికారి ప్రతాపముదలియార్ ఇంట్లో ఉన్న ఆన్దిచ్చియమ్మాళ్‌ని తన భార్యగా గుర్తిస్తాడు. యుద్ధభూమిలో తానుపడ్డ కష్టాలగురించి చెప్తాడు. అదే సమయంలో ఒక వృద్ధుడు ఒక బాలునితో అక్కడికి వచ్చి తాను ఆన్దిచ్చియమ్మాళ్ తండ్రిగా ఆ పిల్లవాడు తన మనుమడిగా పరిచయం చేసుకుంటాడు. ఇలా ఆన్దిచ్చియమ్మాళ్ నుండి దూరమైన ఆమె కుటుంబ సభ్యులంతా ఒక్కొక్కరిగా ఆమెవద్దకు చేరుకుంటారు. అత్తవారింట్లో స్త్రీలు పడే కష్టాలు, కష్టాలు వచ్చినప్పుడు వాటిని స్త్రీలు ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలకు ప్రతీకగా ఆన్దిచ్చియమ్మాళ్ పాత్రను వేదనాయగం పిళ్ళైగారు చిత్రించారు.

### 4.2.2.7. గుణరత్నం

'గుణరత్నం' సింగనూరుకు చెందిన 'మాణిక్యంపిళ్ళై' కూతురు. మాణిక్యంపిళ్ళైకి కూతురంటే అమితమైన ప్రేమ. చిన్నప్పుడు అనేక బంగారు ఆభరణాలను ధరించి నిద్రిస్తున్న సందర్భంలో ఒక దొంగ గుణరత్నాన్ని ఎత్తుకెళ్తాడు. దొంగను గమనించిన మాణిక్యంపిళ్ళై అతన్ని అనుసరిస్తాడు. దొంగ నగలను తీసుకొని బిడ్డను అయ్యనార్ గుడిలో వదిలిపెడతాడు. నగలు పోయినా బిడ్డ దొరికినందుకు 'మాణిక్యం పిళ్ళై' సంతోషిస్తాడు. కొన్నిరోజుల తరువాత 'మాణిక్యం పిళ్ళై' మరణిస్తాడు. ఆ తరువాత 'గుణరత్నం' తన తల్లి సోదరుడైన 'దేవరాజ పిళ్ళై' సంరక్షణలో పెరుగుతుంది. దేవరాజపిళ్ళై మాణిక్యంపిళ్ళై మరణ అనంతరం గుణరత్నాన్ని కంటికి రెప్పలాగా కాపాడతాడు. గుణరత్నాన్ని తన కొడుకు కనకసభకు ఇచ్చి వివాహం చేయలనుకుంటాడు. కాని ఈలోపు 'కనకసభ' అపహరణకు గురికావడం వల్ల చేసేదిలేక గుణరత్నం కోసం వేరే వరున్ని వెతుకుతాడు. చెంగల్పట్టు జిల్లా కలెక్టరు కచ్చేరి శిరస్తాదారు 'గుణరత్నం'ను ఇష్టపడుతున్నట్లు దేవరాజపిళ్ళైకి లేఖ రాస్తాడు. వివాహం విషయంలో తొందరపాటు నిర్ణయాలు తగవని ఆలోచించిన దేవరాజపిళ్ళై తాను ఆలోచించి తన నిర్ణయం

చెబుతానని శిరస్తాదారుకు తిరిగి ఉత్తరం రాస్తాడు. ఈ లోపు దేవరాజపిళ్ళై తన కొడుకు కనకసభను కలుసుకుంటాడు. తాను మొదట నిశ్చయించిన ప్రకారం కనకసభకు, గుణరత్నానికి వివాహం చేయాలనుకుంటాడు. అప్పటికే గుణరత్నాన్ని ఇష్టపడ్డ శిరస్తాదారు ఈ వివాహానికి ఆటంకాలు కలిగిస్తాడు. చివరికి ఆటంకాలు అన్నీ తొలిగి గుణరత్నం, కనకసభల వివాహం జరుగుతుంది. ఇలా నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు ఒక్కమాట కూడా మాట్లాడకుండా మొదట తండ్రి, తరువాత తన మామ ఆదేశానుసారం 'గుణరత్నం' నడుచుకుంటుంది. గుణరత్నం పాత్ర చుట్టూ జరిగిన సంఘటనల ద్వారా బాలికా అపహరణలు, దొంగతనం వంటి అంశాలను వేదనాయగంపిళ్ళైగారు సందేశాలుగా ఇచ్చారు.

## 4.3. ఇందిరాబాయి - పాత్ర చిత్రణ

### 4.3.1 పురుష-పాత్రలు

#### 4.3.1.1. భీమారావు

భీమారావు పాత్ర పరిచయంతో 'ఇందిరాబాయి' నవల ప్రారంభమౌతుంది. నవల రచనా కాలంనాటి సంప్రదాయ భావాలు కలిగిన వ్యక్తుల ప్రవర్తనకు ప్రతీకగా గుల్వాడి వెంకటరావుగారు భీమారావు పాత్రను చిత్రించారు. నవల ఆసాంతం మార్పు చెందని పాత్ర భీమారావు. చిన్నప్పుడు తల్లిదండ్రుల మరణించడం వల్ల తన నానమ్మ సంరక్షణలో పెరుగుతాడు. వివాహ అనంతరం తన భార్య అంబాబాయి జాతకంలో గజకేసరియోగం ఉన్నందువల్ల తాను వ్యాపారంలో స్థిరపడ్డానని బలంగా నమ్ముతాడు. తాను తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని భార్య అంబాబాయికి చెప్పి తీసుకుంటాడు. స్వతంత్రించి ఏ పనీ చేయడు. ఎవరికీ హాని చేయకూడదూ, అందరికి సహాయం చేయాలనే మనస్తత్వం కలిగిన భీమారావు తన భార్య చెప్పిన చెప్పుడు మాటలను నమ్మి తన వీధిలోని సుందరరావును హత్య చేస్తాడు. ఈ హత్య అనంతరం అతనిలో మానసిక సంఘర్షణ మొదలవుతుంది. ఎవరికీ ఏ హాని చేయని తాను ఇలా భార్య చెప్పిన మాటలను నమ్మి ఒక వ్యక్తిని హత్య చేయడం ఎంత వరకు సమంజసమని ఆలోచించడం మొదలుపెడతాడు. ఈ హత్య అనంతరం భార్య చేతిలో కీలుబొమ్మగా మారతాడు. తన ధన బలంతో తాను చేసిన నేరాన్ని గోపణ్ణ పైకి నెట్టి కోర్టులో తనని తాను నిర్దోశిగా నిరూపించుకుంటాడు. తన కూతురు ఇందిరాబాయి విషయంలోనూ సుందరరావు కొడుకు భాస్కరరావు విషయంలోనూ భార్య అంబాబాయి చెప్పినట్లే నడుచుకుంటాడు. భార్య చెప్పిన మాటలను నమ్మి తన కూతురు వద్దంటున్నా వినకుండా ఇందిరాబాయికి బాల్య వివాహం

చేస్తాడు. ఫలితంగా ఆమె బాలవితంతువుగా మారుతుంది. సుందరరావు కొడుకు భాస్కరరావు ఎదుగుదలను చూసి ఓర్వలేక భార్య ఆజ్ఞ ప్రకారం అతనికి వ్యతిరేకంగా మఠాధిపతులకు లేఖ రాస్తాడు. ఈ లేఖ వల్ల ఎలాంటి ప్రయోజనం కలగకపోగా సమాజంలో చదువుకున్న వారి నుండి భీమారావుకి వ్యతిరేకత ఎదురవుతుంది. ఒక పక్క స్వతంత్రించి ఆలోచించే శక్తి కలిగి ఉండటం ఇంకోపక్క భార్య ఆలోచనల పెత్తనం ఈ రెండింటికి మధ్య మానసిక సంఘర్షణకి లోనవడం భీమారావు పాత్ర ప్రవర్తనలో కనిపిస్తుంది. ఈ ప్రవర్తన భార్య ఆలోచనలకు కట్టుబడ్డ భర్తల మానసిక ప్రవృత్తికి నిదర్శనం. నవల చివరిలో భార్య అంబాబాయి ఆలోచనలో మార్పు వచ్చిన తరువాత భీమారావు కూడా తన ఆలోచనలను మార్చుకొని ఇందిరాబాయి భాస్కరరావుల వివాహానికి అంగీకరిస్తాడు.

### 4.3.1.2. భాస్కరరావు

ఇందిరాబాయి నవలలోని నాయక పాత్ర భాస్కరరావు. భాస్కరరావు సుందరరావు–సుశీల దంపతుల కుమారుడు. సుందరరావుని భీమారావు హత్య చేసిన సమయానికి భాస్కరరావు ఐదు సంవత్సరాల బాలుడు. భర్త మరణంతో ఒంటరగా మారానని ఇక తనకు దిక్కెవరని సుశీల బాధపడుతున్న సందర్భంలో బాలుడిగా ఉన్న భాస్కరరావు ఆమెను ఓదార్చుతాడు. తాను తల్లికి అండగా ఉంటానని ధైర్యం చెబుతాడు. కొడుకు మాటలకు సుశీల సంతోషించి అతన్ని తన గుండెలకు హత్తుకొని ఏడుస్తుంది. తండ్రి మరణంతో ఆధారం కోల్పోయిన భాస్కరరావుని అమృతరావు, జలాక్షి దంపతులు చేరదీసి చదివిస్తారు. అమృతరావు అభిమానాన్ని చూరగొన్న భాస్కరరావు అమృతరావు చెప్పినట్లు నడుచుకుంటాడు. అమృతరావు, జలాక్షి దంపతుల పట్ల కృతజ్ఞతా భావాన్ని ప్రదర్శిస్తాడు. అమృతరావు అందించిన ఆర్థిక సహాయంతో మద్రాసువెళ్లి ఉన్నత విద్యను అభ్యసిస్తాడు. తాను విద్యాభ్యాసం చేసే సందర్భంలో మద్రాసునుండి ఇంటికి వెళ్లిన ప్రతీసారి తన తల్లి సుశీలతో సమానంగా జలాక్షికి కూడా సపర్యలు చేస్తాడు. భాస్కరరావు రూపంలో తనకు పుత్రులు లేని లోటు తీరిందని జలాక్షి సంతోషపడుతుంది. భాస్కరరావు సి.ఎస్. పరీక్షలో నెగ్గి కలెక్టర్‌గా మారి ఊరికి వచ్చిన సందర్భంలో ఇందిరాబాయిని వితంతు పునర్వివాహం చేసుకుంటావా? అని అమృతరావు అడగగా భాస్కరరావు కాదనకుండా ఒప్పుకుంటాడు. విద్య వినయాన్ని, విజయాన్ని చేకూరుస్తుందనడానికి ప్రత్యక్ష సాక్ష్యం భాస్కరరావు పాత్ర. తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలను

కలిగి ఉండటం. తనకు సహాయం చేసిన వారిపట్ల ప్రేమను ప్రదర్శించడం, తనకు కీడు చేసిన వారిని మన్నించడం వంటి గుణాలు భాస్కరరావు పాత్ర ప్రవర్తనలో కనిపిస్తాయి. తన తండ్రి మరణానికి కారణమైన భీమారావుని తాను కలెక్టర్‌గా మారిన తరువాత భాస్కరరావు కష్టాలకు గురి చేసి ఉండవచ్చు. కాని అలా చేయకుండా భీమారావును క్షమించి అతని కూతురు ఇందిరాబాయిని వివాహం చేసుకుంటాడు. ఇది భాస్కరరావు పాత్రలోని క్షమాగుణానికి ఉదాహరణ.

### 4.3.1.3. అమృతరావు

అమృతరావు వృత్తిరీత్య 'న్యాయవాది'. చిన్నప్పుడు తల్లిదండ్రులను పోగొట్టుకోవడం వల్ల అనేక కష్టాలు అనుభవించి జీవితంలో స్థిరపడ్డాడు. భార్య జలాక్షి సహాయ సహకారాలతో గొప్ప న్యాయవాదిగా ఎదుగుతాడు. తన వద్దకు సహాయం కోసం వచ్చిన వారిని ఆదుకునే గుణాన్ని కలిగి ఉంటాడు. ఇందిరాబాయి నవలలో అమృతరావు పాత్ర ప్రవేశించినది మొదలు నిష్క్రమించేవరకు ఇందిరాబాయి, భాస్కరరావు పాత్రల చుట్టూ తిరుగుతుంటుంది. అమృతరావు తనకి సంతానం కలగక పోవడంవల్ల తన వద్దకు ఆశ్రయం నిమిత్తం వచ్చిన భాస్కరరావుని సొంత కుమారునిలా చూసుకుంటాడు. చదివిస్తాడు. భాస్కరరావు ఎదుగుదలకు అవసరమైన ఆర్థిక బలాన్ని అందిస్తాడు. భీమారావు, అంబాబాయి దంపతులు భాస్కరరావు ఎదుగుదలను చూసి ఓర్వలేక మఠాధిపతులకు లేఖ రాసిన సందర్భంలో అమృతరావు భాస్కరరావుకి అండగా ఉంటాడు. తల్లిదండ్రులను వదిలి తన వద్దకు వచ్చిన ఇందిరాబాయికి ఆశ్రయం కల్పిస్తాడు. తన డబ్బులతో ఇందిరాబాయిని చదివిస్తాడు. ఇందిరాబాయి చదువు పూర్తయిన తరువాత భాస్కరరావుకు ఇందిరాబాయిని ఇచ్చి వివాహం జరిపిస్తాడు. ఇలా నవల ఆసాంతం అమృతరావు ఇందిరాబాయి, భాస్కరరావులను ఆదుకుంటాడు. ఇతరులకు సహాయం చేసే గుణం కలిగిన వ్యక్తుల మనస్తత్వానికి ప్రతీకగా గుల్వాడి వెంకటరావుగారు అమృతరావు పాత్రను చిత్రించారు.

### 4.3.1.4. అత్తూర సూరప్పయ్య

బ్రిటీషు పరిపాలనా కాలంలో భారతదేశంలో నూతనంగా ప్రవేశించిన న్యాయస్థానాలలోని న్యాయవాదుల మనస్తత్వానికి ప్రతీక అత్తూర సూరప్పయ్య పాత్ర. అత్తూర సూరప్పయ్య అసిస్టెంట్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాది, న్యాయవాదులు ముద్దాయిల కోసం

వేచిచూడటం, ముద్దాయి దొరకగానే మొదట వారిని మానసికంగా తమ వైపుకు మళ్ళించి వారి వద్దనుండి ధనాన్ని అర్జించడం వంటి అంశాలు అత్తూర సూరప్పయ్య పాత్ర ప్రవర్తనలో కనిపిస్తాయి. ఈ అంశాలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి న్యాయవాదుల ప్రాబల్యం పెరగడానికి, న్యాయవిచారణ చాటున జరిగిన ధన ప్రవాహానికి నిదర్శనం. భీమారావు, సుందరరావును హత్యచేసిన సందర్భంలో అత్తూర సూరప్పయ్యతో భీమారావుకు పరిచయం ఏర్పడుతుంది. అప్పటికే సుందరరావును హత్య చేశానని తనకు శిక్ష తప్పదని బాధపడుతున్న భీమారావుకు అత్తూర సూరప్పయ్య ధైర్యం చెబుతాడు. పోలీసులు అన్నంత మాత్రానా నేరం రుజువు అయినట్లు కాదని, న్యాయ విచారణ న్యాయస్థానాలలో జరుగుతుందని తర్కబద్దంగా మాట్లాడి భీమారావుని మానసికంగా న్యాయస్థానాల వైపుకు మళ్ళిస్తాడు. అప్పటి వరకు న్యాయాస్థానాల గురించి ఆలోచించని భీమారావు తనకు ఒక ఆధారం దొరికిందని సంతోషించి ఈ హత్య విషయంలో తనకు ఎలాగైనా సహాయం చేయాలని అత్తూర సూరప్పయ్యను వేడుకుంటాడు. అతని సహాయం నిమిత్తం ఐదు అణాల ధనాన్ని కూడా అత్తూర సూరప్పయ్యకు ఇస్తాడు. అత్తూర సూరప్పయ్య కొన్ని రోజుల వరకు తన కుటుంబ పోషణకు ఆధారం లభించిందని సంతోషపడతాడు. న్యాయ విచారణ పేర భీమారావు వద్ద నుండి ధనాన్ని స్వీకరిస్తాడు. ఎన్ని రోజులు గడిచినా న్యాయస్థానంలో దావ పరిష్కారం కాకపోవడం వల్ల నరసింహశాస్త్రి సూచన మేరకు భీమారావు అత్తూర సూరప్పయ్యను కాదని ఇంకో న్యాయవాదిని ఆశ్రయిస్తాడు. పంతొమ్మిదవ శతాబ్దంనాటి న్యాయవాదుల ధనాశకి ప్రతీకగా అత్తూర సూరప్పయ్య పాత్ర కనిపిస్తుంది.

### 4.3.1.5. సుందరరావు

ఇందిరాబాయి నవల రెండవ భాగంలో సుందరరావు పాత్ర పరిచయం చేయబడింది. సుందరరావు పాత్ర నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించే వరకు భీమారావు పాత్ర చుట్టూ తిరుగుతూ ఉంటుంది. సుందరరావు తంబూరిబాలాజీరావు అనే పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగి మూడవ కుమారుడు. తంబూరి బాలాజీరావు ఇద్దరు కుమారులు ప్రభుత్వం ఉద్యోగంలో స్థిరపడగా సుందరరావుకు ప్రభుత్వ ఉద్యోగం రాక పోవడంవల్ల ఉద్యోగం నిమిత్తం భీమారావుని ఆశ్రయిస్తాడు. భీమారావు నరసింహశాస్త్రి మిల్లులో మంచి స్థానంలో ఉన్నందు వల్ల తనకు కూడా అదే మిల్లులో ఉద్యోగం కల్పిస్తాడని ఆశపడ్డ సుందరరావు ప్రతీరోజు అతన్ని

సేవిస్తాడు. భీమారావు తన భార్య అంబాబాయి చెప్పుడు మాటలను నమ్మి సుందరరావుని హత మార్చాలనుకుంటాడు. భీమారావు పథకం ప్రకారం తన ఇంట్లో జగిరిన కీచకవధ యక్షగాన ప్రసంగాన్ని పురస్కరించుకొని తన వీధిలో ఉన్నవారందరినీ తన ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తాడు. అందరితో పాటు సుందరరావు కూడా భోజనానినికి వస్తాడు. మనసులో ఎటువంటి కల్మషం లేని సుందరరావు భీమారావు వడ్డించిన విషం కలిపిన బజ్జీలను తిని మరణిస్తాడు. ఇల అంబాబాయి అనుమానానికి అంబాబాయి చుట్టూ ఉన్న స్త్రీల అసత్య ప్రచారానికి, భీమారావు నయవంచనకు గురైన వ్యక్తిగా సుందరరావు పాత్ర కనిపిస్తుంది. నవలలో సుందరరావు పాత్ర ప్రవర్తించిన తీరు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి నిరుద్యోగి ఉద్యోగం సంపాదించడానికి పడిన పాట్లకు నిదర్శనం. సుందరరావు ఉద్యోగం సంపాదించడానికి భీమారావుకు అనేక సేవలు చేస్తాడు. అయినా భీమారావు సుందరరావుకు ఉద్యోగం ఇవ్వడు. చివరికి తన భార్య మాటలు నమ్మి భీమారావు చేసిన సేవలను మరిచి అతన్ని చంపుతాడు. ఉద్యోగ ప్రయత్నంలో సుందరరావు ప్రాణాలు కోల్పోవడం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి నిరుద్యోగులు పడ్డ కష్టాలకు నిదర్శనం.

### 4.3.1.6. నరసింహశాస్త్రి

యజమాని తన ఉద్యోగులపై ఉంచే నమ్మకానికి నిదర్శనం నరసింహశాస్త్రి పాత్ర. నరసింహశాస్త్రి ధనవంతుడు. భీమారావు పనిచేసే మిల్లు యజమాని. తన మిల్లులో పనిచేసే భీమారావు సేవలకు మెచ్చిన నరసింహశాస్త్రి మిల్లు పూర్తి బాధ్యతలను భీమారావుకు అప్పగిస్తాడు. ప్రతీ విషయంలోనూ భీమారావుకు అండగా ఉంటాడు. భీమారావు సుందరరావు కేసు విషయంలో కటకటాలలోకి వెళ్ళవలసిన సమయంలో నరసింహశాస్త్రి శేషగిరిరావు అనే వకీలును తన డబ్బుల ద్వారా నియమించి భీమారావును హత్యా నేరం నుండి బయటపడేలా చేస్తాడు. భీమారావు ఎదుగుదలకు కావాల్సిన ఆర్థిక బలాన్ని నరసింహశాస్త్రి అందిస్తాడు. భీమారావు నరసింహశాస్త్రి చేసిన సహాయానికి కృతజ్ఞతగా నయవంచన లేకుండా అతని మిల్లులో పనిచేస్తాడు. ఇలా యజమానికి, ఉద్యోగికి మధ్య ఉండే సంబంధానికి ప్రతీకగా నరసింహశాస్త్రి పాత్ర చిత్రితమయింది.

### 4.3.1.7. గోపణ్ణ

గోపణ్ణ దేవకి ఇంట్లో పనివాడు. దేవకి చేసిన విషం కలిపిన బజ్జీలను భీమారావుకు అందించి సుందరరావు మరణానికి గోపణ్ణ కారకుడవుతాడు. పోలీసుల విచారణలో

'సుందరరావును' భీమారావు విష ప్రయోగంతో చంపాడని తేలిన సందర్భంలో గోపణ్ణ భీమారావు చేసిన నేరాన్ని తన పైన వేసుకొని భీమారావుకు బదులుగా జైలుకు వెళ్తాడు. అంతేగాక ప్రతీ పనిలో దేవకికి సహాయకునిగా ఉంటాడు. కృష్ణప్ప సెట్టి హత్య సందర్భంలో కూడా దేవకికి గోపణ్ణ సహాయపడతాడు. గోపణ్ణ పాత్ర ప్రవేశంలో గుల్వాడి వెంకటరావుగారు గోపణ్ణ గురించి దేవకి ద్వారా పలికించిన మాటలు గోపణ్ణ పాత్ర ప్రవర్తనకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గోపణ్ణ గురించి దేవకి అంబాబాయికి చెబుతూ 'అతను ఏ విషయం తెలియని అమాయకుడు' అంటుంది. నవల ఆసాంతం గోపణ్న పాత్ర అమాయకంగా ప్రవర్తించడం కనిపిస్తుంది. తనకు ఆశ్రయం కలిపించిన దేవకికి విధేయునిగా ఉంటూ ఆమె చెప్పిన ప్రతీపని చేస్తాడు. తాను చేసే పనివల్ల తనకు లాభం జరుగుతుందా, నష్టం జరుగుతుందా అని ఆలోచించకుండా చివరికి దేవకి మాటలు నమ్మి జైలుకు కూడా వెళ్తాడు. అమాయకంగా ఉండి నమ్మకంగా పనిచేసే పనివాళ్లను యజమానులు తమ అవసరం కోసం వాడుకునే విధానానికి ప్రతీకగా గుల్వాడి వెంకటరావుగారు గోపణ్ణ పాత్రను చిత్రించారు.

### 4.3.1.8. త్రియంబకరావు

పిల్లల సంరక్షణలో తండ్రి పాత్ర ప్రాధాన్యతకు ప్రతీక త్రియంబకరావు పాత్ర. త్రియంబకరావు వ్యాపారస్తుడు ధనవంతుడు. తన ఒక్కగానొక్క కొడుకు విఠలరావుని అమిత గారాబంతో పెంచుతాడు. అతనికి అడిగినవన్నీ లేదనకుండా ఇస్తాడు. కొడుకుపై ఏనాడు ఎలాంటి ఆంక్షలు విధించడు. ఫలితంగా విఠలరావు విలాస వంతమైన జీవితానికి అలవాటుపడతాడు. త్రియంబకరావు విఠలరావుకు ఇందిరాబాయితో బాల్య వివాహం చేస్తాడు. ఈ వివాహాన్ని జరిపించే సందర్భంలో తన ధన బలాన్ని ప్రదర్శించాలని భోగం మేళాలను ఏర్పాటు చేస్తాడు. ఈ అనవసర దాంబిక ప్రవృత్తివల్ల విఠలరావు భోగంమేళాల స్త్రీలను మోహించి చివరికి అంతుచిక్కని వ్యాధితో మరణిస్తాడు. ఇలా కొడుకు(విఠలరావు) మరణానికి తండ్రి (త్రియంబకరావు) కారణమైన సందర్భాం ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది. విఠలరావు వ్యాధిగ్రస్తుడైన సందర్భంలో ఇందిరాబాయి చెప్పినా వినకుండా త్రియంబకరావు విఠలరావుకు నాటువైద్యం చేయిస్తాడు. ఈ వైద్యం వికటించి విఠలరావు మరణిస్తాడు. ధనం ఎంతున్నా దాన్ని సరైన విధానంలో ఉపయోగించని సందర్భంలో ఎదురయ్యే పరిణామాలకు నిదర్శనం త్రియంబకరావు పాత్ర. విఠలరావు మరణ అనంతరం త్రియంబకరావు తన తప్పులను తెలుసుకుని బాధపడతాడు.

### 4.3.1.9. విఠలరావు

'విఠలరావు' త్రియంబకరావు కుమారుడు, ఇందిరాబాయి భర్త. తండ్రి ధనవంతుడు కావడంవల్ల చిన్నప్పటినుండి విఠలరావు కష్టం తెలియకుండ పెరుగుతాడు. తల్లిదండ్రులు అతిగారాబం చేస్తే పిల్లలు చెడిపోతారనడానికి సాక్షం విఠలరావు పాత్ర. విఠలరావు త్రియంబకరావు, చంద్రభాగి దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు కావడంవల్ల అతన్ని అతిగారాబంగా పెంచుతారు. అడిగినంత ధనాన్ని ఇస్తారు. ఈ అంశం విఠలరావు ఎదుగుదలలో అతను తప్పుడు మార్గంలో ప్రయాణించడానికి అవకాశం కల్పిస్తుంది. త్రియంబకరావు, చంద్రభాగి దంపతులకు జన్మించడం, తండ్రి ఆజ్ఞ ప్రకారం ఇందిరాబాయిని బాల్య వివాహం చేసుకోవడం, చెడు వ్యసనాలకు అలవాటు పడి మరణించడం. ఇవి విఠలరావు పాత్ర నవల ఇతివృత్తం పరంగా నిర్వహించిన అంశాలు కాగా తన వివాహం జరిగే సందర్భంలో గులాబి, గోకుళి అనే భోగంమేళాల స్త్రీలను చూసి మోహించడం అన్న సంఘటన విఠలరావు పాత్ర నవల వస్తుగతంగా నిర్వహించిన అంశం. విఠలరావుకు ఇందిరాబాయితో వివాహం జరిగే సమయానికి అతను అప్పుడప్పుడే యవ్వనంలోకి అడుగుపెడుతున్నాడు. ఇలాంటి సమయంలో తన ధనబలాన్ని ప్రదర్శించే ఉద్దేశంతో తండ్రి త్రియంబకరావు వివాహం జరిగే సందర్భంలో అందమైన స్త్రీలతో భోగం మేళాలను ఏర్పాటు చేస్తాడు. ఆ భోగం మేళాలలోని గులాబి, గోకుళి అనే స్త్రీల అందాలకు విఠలరావు ఆకర్షితుడవుతాడు. అప్పటికే ఇందిరాబాయి రజస్వల కాకపోవడం, తన వద్ద అమితంగా ధనం ఉండటం వల్ల ఎలాగైనా గులాబి, గోకుళీలను పొందాలని విఠలరావు అనుకుంటాడు. దీన్ని గమనించిన 'పొక్కుసెట్టి' అనే గుమాస్త గులాబి, గోకుళిలతో విఠలరావుకు పరిచయాన్ని ఏర్పరిచి అతని వద్ద నుండి ధనం తీసుకుంటాడు. విఠలరావు అడిగిన వెంటనే తండ్రి త్రియంబకరావు ఎలాంటి ప్రశ్నలు అడగకుండ అడిగినంత ధనాన్ని ఇస్తుండటం వల్ల విఠలరావు అతి తక్కువ కాలంలోనే గులాబి, గోకుళిలకు దగ్గరౌతాడు. విలాసవంతమైన జీవితాన్ని గడుపుతాడు. చివరికి అంతుచిక్కని వ్యాధిబారిన పడి మరణిస్తాడు. నవల ఆసాంతం విఠలరావు పాత్ర ప్రవేశించింది మొదలు నిష్క్రమించేవరకు గులాబి, గోకుళి, పొక్కుసెట్టి పాత్రల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. బాల్య వివాహాలవల్ల జరిగే నష్టాలకు, తల్లిదండ్రుల అతిగారాబం వల్ల పిల్లలకు జరిగే నష్టానికి ప్రతీక విఠలరావు పాత్ర.

### 4.3.1.10. మూడు కొట్ల కృష్ణుడు

ఇతన్ని దేవకి సహాయంతో రాఘవసెట్టి హత్య చేస్తాడు.

#### 4.3.1.11. తంబూరి బాలాజీరావు

భీమారావు ఇంటి వీధిలో ఉండే పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగి తంబూరి బాలాజీరావు. పంతొమ్మిదవ శతాబ్దంనాటి ప్రభుత్వ ఉద్యోగుల స్థితిగతులకు ఈ పాత్ర నిదర్శనం.

#### 4.3.1.12. శేషగిరిరావు

హైకోర్టులో వకీలు. భీమారావు తరపున కోర్టులో వాదిస్తాడు.

#### 4.3.1.13. పొక్కుసెట్టి

ఇతను విఠలరావుకు గులాబి, గోకుళి అనే వేశ్యలను పరిచయం చేస్తాడు.

#### 4.3.1.14. శంకరరావు - దుర్గాబాయి

వీరు భీమారావు అన్న, వదినలు. సంప్రదాయ భావాలు కలిగిన వ్యక్తుల ప్రవర్తనకు ప్రతిబింబంగా గుల్వాడి వెంకటరావుగారు ఈ పాత్రల ప్రవర్తనను చిత్రించారు.

#### 4.3.1.15. సోమయ్య, శ్యామ్, మేరి

భీమారావు ఇంట్లో పనివాళ్ళు.

#### 4.3.1.16. వెంకటరావు, పండితఘనశ్యామ్, లక్ష్మణభట్ట, రామకుట్టి పండితుడు

ఆయుర్వేద వైద్యులు.

### 4.3.2. స్త్రీ పాత్రలు

#### 4.3.2.1. జలాక్షి

గుల్వాడి వెంకటరావుగారు పిల్లలపై తల్లి చూపే ప్రేమకు, భర్త ఆలోచనలకు సహాయ సహకారాలు అందించే భార్య ఆలోచనలకు ప్రతీకగా జలాక్షి పాత్రను చిత్రించారు. ఇందిరాబాయి నవలలో జలాక్షి పాత్ర అమృతరావు, భాస్కరరావు, ఇందిరాబాయి పాత్రల చుట్టూ తిరుగుతుంది. భాస్కరరావు, ఇందిరాబాయిలను జలాక్షి సొంత బిడ్డలలాగా చూసుకుంటుంది. అమృతరావు న్యాయవాదిగా ఉండి తీసుకున్న ప్రతీ నిర్ణయాన్ని జలాక్షి సమర్థిస్తుంది. అందరూ బాగుండాలనే మనస్తతత్వంగల వ్యక్తుల ప్రవర్తనకు ప్రతీక జలాక్షి పాత్ర. తనకు సొంతంగా పిల్లలు లేకున్నా తన వద్దకు ఆశ్రయం పొందడానికి వచ్చిన భాస్కరరావు, ఇందిరాబాయిలను తన సొంత కుమారుడు, కుమార్తెలాగా చూసుకుంటుంది. నవలలోని మిగతా స్త్రీ పాత్రలతో పోల్చి చూసినప్పుడు జలాక్షి పాత్ర ప్రత్యేకత తెలుస్తుంది. అంబాబాయి తన కుమార్తె ఇందిరాబాయిని ఆచార, సంప్రదాయాల పేర చిత్రహింసలకు గురిచేసింది. తన మీద నింద

మోపాడన్న కారణంతో సుందరరావును భర్తచేత హత్య చేయించింది. అంతటితో ఆగకుండా సుందరరావు కుమారుడైన భాస్కరరావు ఎదుగుదలను అడ్డుకుంది. ఇలా 'అంబాబాయి' పాత్ర ద్వారా కష్టాలపాలైన ఇందిరాబాయి, భాస్కరరావులను జలాక్షి ఆదుకుంటుంది. ఇందిరాబాయికి తల్లి ప్రేమను పంచుతుంది. భాస్కరరావును సొంత కొడుకులా చూసుకుంటుంది. భాస్కరరావు చదువు విషయంలో అతనికి అండగా నిలబడుతుంది. స్త్రీకి విద్య అవసరమని నమ్మి తనవద్దకు వచ్చిన ఇందిరాబాయిని చదివిస్తుంది. మద్రాసు నుండి వచ్చిన భాస్కరరావు తన వద్ద ఉండకుండా తన తల్లి సుశీలని చూడటానికి వెళ్లిన సందర్భంలో తనకు సొంత కొడుకులు లేరని బాధపడుతుంది. తనని కాదని భాస్కరరావు అతని తల్లి వద్దకు వెళ్ళాడని అతనిపై కక్ష పెంచుకోదు. ఇంత మంచి గుణాలు కలిగిన కొడుకు ఉండటం సుశీల అదృష్టమని మనసులో సుశీలని మెచ్చుకుంటుంది. ఇలా నవల ఆసాంతం చదువుకున్న స్త్రీ ఆలోచనలకు ప్రతీకగా గుల్వాడి వెంకటరావుగారు జలాక్షి పాత్రను చిత్రించారు.

### 4.3.2.2. సుశీల పాత్ర చిత్రణ

ఇందిరాబాయి నవలలో సుశీల పాత్ర సుందరరావు, భాస్కరరావు, జలాక్షి, అమృతరావు పాత్రల చుట్టూ తిరుగుతుంది. చదువుకోని సాధారణ మధ్యతరగతి స్త్రీల మనస్తత్వానికి ప్రతీకగా గుల్వాడి వెంకటరావుగారు సుశీల పాత్రను చిత్రించారు. తన భర్తను భీమారావు అకారణంగా చంపిన సందర్భంలో తన ధీనస్థితిని తలచుకొని బాధపడుతుంది. అంతేకాని భీమారావును ఎదురించి పోరాటం చేయదు. తన కొడుకు భాస్కరరావు భవిష్యత్తు గురించి చింతిస్తుంది. ఇక తన కుటుంబం బజారున పడ్డట్లేనని బాధపడుతుంది. తల్లి బాధను చూడలేక కొడుకు భాస్కరరావు ఆమెను ఓదార్చిన సందర్భంలో అతని బుద్ధి కుశలతను మెచ్చుకుంటుంది. భాస్కరరావును అమృతరావు, జలాక్షి దంపతులు చేరదీసి చదివిస్తున్న సందర్భంలో వారిపట్ల కృతజ్ఞత భావాన్ని ప్రదర్శిస్తుంది. మద్రాసు నుండి చదువు ముగించుకొని భాస్కరరావు తనవద్దకు వచ్చిన సందర్భంలో తమకు అమృతరావు, జలాక్షి చేసిన మేలును మరిచి పోవద్దని అతనికి హితవు చెబుతుంది. జలాక్షి భాస్కరరావు వివాహ విషయంలో సుశీల అభిప్రాయాన్ని అడిగిన సందర్భంలో మరుమాట చెప్పకుండా ఇందిరాబాయితో భాస్కరరావు వివాహానికి ఒప్పుకుంటుంది. తన కొడుకు పట్ల సుశీల చూపిన మాతృ ప్రేమకు కృతజ్ఞతలు చెబుతుంది. సుందరరావు భార్యగా అతను చెప్పినట్లు నడుచుకుంటుంది. భాస్కరరావుకు తల్లిగా అతనికి కష్టాలు కలగకుండా ఉండాలని అనేక ప్రయత్నాలు చేస్తుంది. భస్కరరావు సి.ఎస్. పరీక్షల్లో నెగ్గి

ప్రభుత్వ ఉద్యోగం సంపాదించిన సందర్భంలో తల్లిగా సంతోషపడుతుంది. భాస్కరరావు తన చదువు నిమిత్తం విదేశాలకు వెళ్తానన్న సందర్భంలో అక్కడ ఇతరులు వండిన వంటలు తినవద్దని అతనిపై ఆంక్షలు విధిస్తుంది. మ్లేచ్ఛులతో మాట్లాడవద్దంటుంది. ఈ అంశాలు సుశీల పాత్రలోని మూఢ నమ్మకాలకు ఉదాహరణలు. సుశీల ఆలోచనలను భాస్కరరావు తిరస్కరించిన సందర్భంలో అతను చెప్పిన మాటలను శ్రద్ధగా వింటుంది. ఇలా నవల ఆసాంతం మార్పు చెందని పాత్రగా, భర్త మరణాంతరం కష్టాలపాలైన స్త్రీల మానసిక ప్రవృత్తికి నిదర్శనంగా గుల్వాడి వెంకటరావుగారు సుశీల పాత్రను చిత్రించారు.

### 4.3.2.3. చంద్రభాగి

మధ్యతరగతి స్త్రీల మనస్తత్వానికి ప్రతీక చంద్రభాగి పాత్ర. చంద్రభాగి త్రియంబకరావు భార్య. విఠలరావుకు తల్లి. భార్యగా భర్త త్రియంబకరావుకు చేదోడు వాదోడుగా ఉంటుంది. కొడుకును అతిగారాబంగా చూసుకుంటుంది. చెడు వ్యసనాల వల్ల కొడుకు ఆరోగ్యం చెడిపోయిన సందర్భంలో అతని ఆరోగ్యం కుదుట పడటానికి తల్లిగా అతనికి సపర్యలు చేస్తుంది. కొడుకు మరణించిన సందర్భంలో అమితంగా బాధ పడుతుంది. నవల ఆసాంతం చంద్రభాగి పాత్ర భర్త త్రియంబకరావు, కొడుకు విఠలరావు చుట్టూ తిరుగుతూ ఉంటుంది. భర్తను సర్వస్వంగా భావించడం, కొడుకుని కంటికి రెప్పలాగా చూసుకోవడం వంటి లక్షణాలు చంద్రభాగి పాత్రలో కనిపిస్తాయి. నవల మొత్తంమీద ఇంటికి మాత్రమే పరిమితమైన మధ్య తరగతి స్త్రీల మనస్తత్వానికి ప్రతీక చంద్రభాగి పాత్ర.

### 4.3.2.4. అంబాబాయి

ఇందిరాబాయి నవలలో మార్పు చెందిన పాత్ర 'అంబాబాయి'. గుల్వాడి వెంకటరావుగారు నవల వస్తుగత అంశాలకు ప్రతీకగా అంబాబాయి పాత్రను చిత్రించారు. నవల ప్రారంభంలో ఉత్తమ గృహిణిగా పరిచయం చేయబడ్డ అంబాబాయి పాత్ర నవల కొనసాగింపులో ఈర్ష్యా, అసూయ, అనుమానం వంటి మానసిక రుగ్మతల బారిన పడటం, నవల చివరిలో తన తప్పులను తెలుసుకుని మార్పు చెందటం అంబాబాయి పాత్ర ప్రవర్తనలో కనిపిస్తుంది. చిన్నప్పటి నుండి తెలివి తేటలు కలిగిన అంబాబాయి వివాహ అనంతరం తన భర్తకు అన్ని విషయాలలో చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబాన్ని తానే ముందుండి

నడిపిస్తుంది. అన్ని విషయాలలో సమర్థవంతంగా ఆలోచించే అంబాబాయి తన ఇంటికి వచ్చిన సావిత్రి చెప్పిన చెప్పుడు మాటలు నమ్మి సుందరరావుపై కక్ష పెంచుకుంటుంది. తాను చెప్పిన ప్రతీ విషయాన్ని తూచా తప్పకుండా పాటించే భర్తను సుందరరావును హత్య చేసే విధంగా ప్రోత్సహిస్తుంది. భీమారావు భార్య మాటలు నమ్మి సుందరరావును హత్య చేస్తాడు. భీమారావు సుందరరావును హతమార్చడం నవల కథాపరమైన అంశంకాగా, ఎన్ని ఉత్తమ గుణాలు కలిగి ఉన్నా చెప్పుడు మాటలను వినడం అనే అధమగుణం కలిగి ఉండటం వల్ల కుటుంబం కష్టాల పాలవుతుందన్న సందేశం ఈ కథాంశం చాటున దాగి ఉన్న నవల వస్తుగత అంశం. సుందరరావు హత్య అనంతరం పోలీసుల భయంతో ఒణికిపోతున్న భర్తకు అంబాబాయి ధైర్యం చెబుతుంది. తన చాకచక్యంతో భర్తపై హత్యానేరం పడకుండా చూసుకుంటుంది. చాలాకాలం తరువాత జన్మించిన తన కూతురు ఇందిరాబాయిని ప్రేమతో పెంచి పెద్ద చేస్తుంది. ఇందిరాబాయికి విఠలరావుతో బాల్యవివాహం జరిపిస్తుంది. కూతురిని ప్రేమతో పెంచడం నవల కథాంశం కాగా ప్రేమతో పెంచిన కూతురికి బాల్య వివాహం చేయడం నవల వస్తుగత అంశం. ఇందిరాబాయికి బాల్య వివాహం జరిపించే సందర్భంలో ఇందిరాబాయి తనకు బాల్య వివాహం వద్దని చెప్పినా వినకుండా అంబాబాయి ఆమెకు బాల్య వివాహం జరిపిస్తుంది. బాల్య వివాహం అనంతరం భర్త మరణించగా ఇందిరాబాయి తల్లి అంబాబాయి వద్దకు వచ్చిన సందర్భంలో సంప్రదాయాలు, ఆచారాల పేర అంబాబాయి ఆమెను అనేక కష్టాలకు గురి చేస్తుంది. ఈ అంశాలు నవల రచన కాలం నాటికి బాల వితంతువులు అనుభవించిన కష్టాలకి నిదర్శనం. అంబాబాయి సంప్రదాయాల పేర ఇందిరాబాయికి పెట్టే కష్టాలు భరించలేక ఆమె ఇంటి నుండి పారిపోయి అమృతరావు వద్ద ఆశ్రయం పొందుతుంది.

తన కూతురికి ఆశ్రయం కల్పించిన అమృతరావు, జలాక్షి దంపతులపై అంబాబాయి వ్యతిరేక భావాన్ని ఏర్పర్చుకుంటుంది. అమృతరావు, హిందూ ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాడని కావున అతన్ని సంఘం నుండి బహిష్కరించాలని తన భర్త ద్వారా మఠాధిపతులకు లేఖ రాస్తుంది. అంబాబాయి అమృతరావు కుటుంబంపై అయిష్టతని పెంచుకోవడం నవల కథాంశం కాగా ఆ అయిష్టత ప్రభావంతో మఠాధిపతులకు లేఖ రాయడం నవల వస్తుగత అంశం. ఈ సంఘటన పంతొమ్మిదవ శతాబ్దం నాటికి కొనసాగిన మఠాధిపతుల అధికారాలకు, సంఘ బహిష్కరణ లేఖలకు నిదర్శనం. ఈ సంఘ బహిష్కార పత్రాల వల్ల

ఎలాంటి ప్రయోజనం లేక పోవడంవల్ల చివరికి అంబాబాయి తన అభిప్రాయాలను మార్చుకొని అమృతరావు సహకారంతో విద్యను అభ్యసించిన భాస్కరరావుతో తన కూతురు ఇందిరాబాయి వివాహానికి అంగీకరిస్తుంది. ఇలా నవల ఆసాంతం గుల్వాడి వెంకటరావుగారు అంబాబాయి పాత్ర ప్రవర్తన ద్వారా నవల కథాంశాన్ని నవల వస్తువును పాఠకులకు అందించారు.

### 4.3.2.5. ఇందిరాబాయి

ఇందిరాబాయి నవలలోని కథానాయిక ఇందిరాబాయి. ఇందిరాబాయి నవల ద్వారా గుల్వాడి వెంకటరావుగారు ఆనాటి సమాజానికి అందించిన 'వితంతు పునర్వివాహం' అన్న సందేశానికి ప్రతీక ఇందిరాబాయి పాత్ర. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి కర్ణాటక ప్రాంతానికి చెందిన స్త్రీ విద్యావంతురాలైతే ఆమె ప్రవర్తన ఎలా ఉంటుంది? బాల్యవివాహం జరిగే సందర్భంలో అమ్మాయి తన తల్లిదండ్రులని ఎదిరిస్తే ఆమె పరిస్థితి ఎలా ఉంటుంది? బాల్య వివాహం వల్ల పంతొమ్మిదవ శతాబ్దం నాటి స్త్రీలు ఎలాంటి కష్టాలు అనుభవించారు? వివాహ విషయంలో స్త్రీలకు ఎలాంటి స్వేచ్ఛ ఉండింది? వంటి ప్రశ్నలకు సమాధానం ఇందిరాబాయి పాత్ర.

ఇందిరాబాయి పాత్ర నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించేవరకు ఆనాటి సమాజంలోని సమస్యలతో పోరాటం చేయడం కన్పిస్తుంది. అంబాబాయికి ఇందిరాబాయి జన్మించిన సందర్భంలో ఇందిరాబాయి తండ్రి భీమారావు తనకు మగపిల్లాడు జన్మించలేదని బాధపడతాడు. ఈ సంఘటన పంతొమ్మిదవ శతాబ్దం నాటికి సమాజంలో పురుష సంతానంపై ఉన్న ప్రేమకు నిదర్శనం. అప్పటి వరకు ఇందిరాబాయిని ప్రేమతో చూసుకున్న తల్లి అంబాబాయి ఇందిరాబాయిని అడగకుండ ఆమె వివాహాన్ని విఠలరావుతో నిర్ణయిస్తుంది. అప్పటికి చిన్నపిల్లగా ఉన్న ఇందిరాబాయి ఆ వివాహాన్ని వ్యతిరేకిస్తుంది. అయినా కూతురి ఇష్టానికి విరుద్ధంగా తల్లిదండ్రులు పెద్దమొత్తంలో ధనాన్ని కట్నంగా ఇచ్చి ఇందిరాబాయి వివాహాన్ని విఠలరావుతో జరిపిస్తారు. ఈ సంఘటన వివాహ సమయంలో పంతొమ్మిదవ శతాబ్దం నాటికి ఉన్న స్త్రీ అస్వతంత్రతకి నిదర్శనం. వివాహ సమయానికి ఇందిరాబాయి బాలిక. తన భర్త విఠలరావు వేష్యాలోలుడై తిరుగుతుంటే అది అర్థం కాని ఇందిరాబాయి అత్తామామల చాటుకోడలిగా ఉంటుంది. తనకు ప్రాపంచిక జ్ఞానం తెలిసే సమయానికి భర్త అంతు చిక్కని వ్యాధి బారిన

పడతాడు. భర్తకు వైద్యం చేసే విషయంలో నాటువైద్యం వద్దని ఆంగ్లేయ వైద్యం చేయండని తన తండ్రి భీమారావు, మామ త్రియంబకరావులను ఇందిరాబాయి వేడుకుంటుంది. ఇందిరాబాయి మాటలు వినకుండా భీమారావు, త్రియంబకరావు కలిసి వ్యాధిగ్రస్తుడైన విఠలరావుకి నాటువైద్యుని సహాయంతో నాటువైద్యం చేస్తారు. ఫలితంగా విఠలరావు మరణిస్తాడు. భర్త విఠలరావు మరణించిన సందర్భంలో తన తల్లిదండ్రులు తాను ఎంత చెప్పినా వినకుండా తనకు బాల్య వివాహం చేయడం వల్ల తన జీవితం నాశనమైందని ఇందిరాబాయి బాధపడుతుంది. ఈ సంఘటన పంతొమ్మిదవ శతాబ్దంలో బాల్య వివాహాలు జరిపించడం వల్ల స్త్రీలు అతి చిన్న వయస్సులోనే బాల వితంతువులుగా మారారనడానికి నిదర్శనం. బాల వితంతువుగా మారిన ఇందిరాబాయిని తల్లి అంబాబాయి ఆచారాలు, సంప్రదాయాల పేరిట అనేక చిత్రహింసలకు గురి చేస్తుంది. తలకు నూనె పెట్టుకోకూడదని, తెల్లని వస్త్రాలను మాత్రమే ధరించాలని, ఎవరిని చూడవద్దని ఆంక్షలు విధిస్తుంది. ఈ ఆంక్షలన్నింటిని ఇందిరాబాయి ఓపికతో భరిస్తుంది. ఇంట్లో తాను ఒంటరిగా ఉన్న సమయంలో ఇందిరాబాయి ఆంగ్ల పుస్తకాలు చదవడం ప్రారంభిస్తుంది. అది గమనించిన అంబాబాయి ఆంగ్లేయ పుస్తకాలు చదవకూడదని ఇప్పుడు నీవు వైరాగ్యభావాలను కలిగించే పుస్తకాలను మాత్రమే చదవాలని ఇందిరాబాయి చదువుపై ఆంక్షలు విధిస్తుంది. అప్పటి వరకు ఓపికతో ఉన్న ఇందిరాబాయి తల్లి ఆంక్షలను తిరస్కరిస్తుంది. తాను ఖచ్చితంగా చదువుకుంటానని తెగేసి చెబుతుంది. తన కూతురు తన మాటలు వినక పోవడానికి ఆమె విద్యావంతురాలు కావడమే ప్రధాన కారణమని అంబాబాయి అనుకుంటుంది. ఇందిరాబాయిలో వైరాగ్యభావం కలిగించే ఉద్దేశంతో కొంత మంది స్వాములను తన ఇంటికి ఆహ్వానించి తన ఇంట్లో ఇందిరాబాయి గది వద్ద పురాణ పారాయణాన్ని, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంది. తన గది బయట ఎంత శబ్దం చేసిన ఇందిరాబాయి గది నుండి బయటికి రాదు, స్వాములను చూడదు. ఇందిరాబాయి ప్రవర్తనలో మార్పురాక పోవడం వల్ల తల్లి అంబాబాయి ఇందిరాబాయి గదిలోకి వెళ్లి గది బయటకు వచ్చి స్వాములను భక్తితో సేవించడంవల్ల వైరాగ్యభావం కలుగతుందని ఇందిరాబాయితో అంటుంది. ఇందిరాబాయి తల్లి మాటలను తిరస్కరిస్తుంది. వచ్చిన స్వాములకు సేవ చేయడానికి ఒప్పుకోదు. అప్పటికే ఇందిరాబాయిపై మరులుగొన్న ఒక కపటస్వామి అర్ధరాత్రి సమయంలో ఇందిరాబాయి గదిలోకి ప్రవేశించి ఆమెను బలత్కరించడానికి ప్రయత్నిస్తాడు. ఇందిరాబాయి తన చాకచక్యంతో ఆ

స్వామీజీ నుండి తప్పించుకొని అమృతరావు అనే న్యాయవాది వద్ద ఆశ్రయం పొందుతుంది. ఈ సంఘటనలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి వితంతుస్త్రీలు అనుభవించిన కష్టాలకు నిదర్శనం.

అమృతరావు సంరక్షణలో ఇందిరాబాయి తన చదువును కొనసాగిస్తుంది. అమృతరావును వీడి తమ వద్దకు రావాల్సిందిగా తల్లి అంబాబాయి, తండ్రి భీమారావు ఇందిరాబాయిని వేడుకున్నా ఇందిరాబాయి తల్లిదండ్రుల విజ్ఞప్తులను తిరస్కరిస్తుంది. ఇందిరాబాయి అమృతరావు సంరక్షణలో చదువుకుంటూ అమృతరావు వద్ద తనలాగే ఆశ్రయం పొందిన భాస్కరరావును ఇష్టపడి వితంతు పునర్వివాహం చేసుకుంటుంది. ఇందిరాబాయి తల్లిదండ్రులు చేసేది లేక ఇందిరాబాయి వితంతు పునర్వివాహాన్ని ఆమోదిస్తారు. ఈ సంఘటన స్త్రీ విద్యావంతురాలైతే తనకు వచ్చిన కష్టాలను ఎలా ఎదుర్కొంటుందనడానికి నిదర్శనం. ఇలా నవల ఆసాంతం పంతొమ్మిదవ శతాబ్దం నాటి సామాజిక సమస్యల మేళవింపుగా ఇందిరాబాయి పాత్ర ప్రవర్తన కనిపిస్తుంది.

## 4.4. శ్రీరంగరాజుచరిత్ర – పాత్రచిత్రణ

### 4.4.1. పురుషపాత్రలు

#### 4.4.1.1. శ్రీరంగరాజు

శ్రీరంగరాజుచరిత్ర  నవలలో నాయక పాత్ర శ్రీరంగరాజు. శ్రీరంగరాజుచరిత్ర నవల ఆసాంతం శ్రీరంగరాజు జీవితం  వివరించబడింది. శ్రీరంగరాజు జీవితంలోని జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం వంటి సంఘటనల వివరణతో నవల కొనసాగుతుంది. నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు శ్రీరంగరాజుచరిత్ర నవల ఆధారంగా అందించదలచిన ప్రధాన కథావస్తువు, పంతొమ్మిదవశతాబ్దం నాటి వర్ణవ్యవస్థకి, కులాచారాల పట్టింపులకు ప్రతీకగా శ్రీరంగరాజు పాత్రను తీర్చిదిద్దారు. పంతొమ్మిదవ శతాబ్దం నాటి సామాజిక సమస్యల సమాహారంగా శ్రీరంగరాజు పాత్ర నడవడిక కనిపిస్తుంది. మొదట కులాచారాల పట్టింపులు అధికంగాగల వ్యక్తిగా శ్రీరంగరాజు పాత్రను చిత్రించిన నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు నవల గమనంలో అతని నడవడికలో కులాచార పట్టింపులో మార్పు వచ్చినట్లుగా సూచించడం శ్రీరంగరాజు పాత్ర చిత్రణలో కనిపిస్తుంది.

విజయనగరాన్ని పరిపాలిస్తున్న మారురాయగండర్ పుట్టపురాణి కుమారుడు శ్రీరంగరాజు. జనన కాలంనాటికే శ్రీరంగరాజు ధనవంతుడు. ఉన్నత వంశానికి చెందినవాడు.

కులంపట్ల, మతంపట్ల శ్రీరంగరాజుకు ఉన్న అభిప్రాయం అతని బాల్యంలో జరిగిన ఒక సంఘటన ద్వారా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు పాఠకులకు వివరించారు. శ్రీరంగరాజు తన తండ్రి ఉంపుడుగత్తెకి జన్మించిన కష్ణునితో కలిసి ఒకరోజు వేటకు వెళ్తాడు. వేట కొనసాగే సందర్భంలో ఒక సేవకుడు కృష్ణుడిని 'కృష్ణయ్యగారు' అని సంభోధిస్తాడు. ఈ సంభోదన ఏమాత్రం నచ్చని శ్రీరంగరాజు సేవకున్ని తిడతాడు. అంతటితో ఆగకుండ వేట మధ్యలో ఆపి ఇంటికి వచ్చి భోగందాని కుమారునికి తనతో సమాన గౌరవం దక్కడం తనకు ఇష్టంలేదని, తల్లితో గొడవపడ్తాడు. చివరికి తన స్నేహితుడు రామయ్యతో కలిసి ఇంటిని విడిచిపెడతాడు. కృష్ణుడిని తన సోదరునిగా స్వీకరించడు. ఈ సంఘటన శ్రీరంగరాజులోని కులాచార పట్టింపులకు పరాకాష్ట. ఇంతటి ఆచార పట్టింపులతో ఇంటిని వదిలిన శ్రీరంగరాజు దేశ సంచారంలో తన అభిప్రాయాన్ని పూర్తిగా మార్చుకుంటాడు.

కష్టాలు తెలియకుండా పెరిగిన శ్రీరంగరాజు తన దేశ సంచారంలో పల్లెప్రజల కష్టాల గురించి తెలుసుకుంటాడు. మిట్ట మధ్యాహ్నం ఎండలో ఒళ్ళంతా చెమటలు కారుతుండగా మోట తోడుతున్న మగవారిని, పొలాలకు పిల్ల కాలువలు తీస్తున్న ఆడవారిని చూసి ఆశ్చర్యానికి గురౌతాడు. పల్లె ప్రజలతో పోల్చి చూస్తే తమ విద్యానగరంలో ప్రజలు ఎంతో సుఖంగా ఉన్నారని అనుకుంటాడు. పల్లె ప్రజలు కష్టపడటం వల్లె రాజులు సైతం సుఖవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నారన్న అభిప్రాయానికి వస్తాడు. అప్పటివరకు తన ప్రయాణాన్ని సాఫీగా సాగించిన శ్రీరంగరాజు చంద్రగుప్తి వనంలో బెబ్బులి బారిన పడ్డ సందర్భంలో తన మనసులోని బాధలను పాఠకుల ముందు ఉంచుతాడు. "ఇంటి నుండి వెళ్ళొద్దని మా అమ్మ ఎంత బతిమిలాడినా లెక్కపెట్టకుండా వచ్చేశాను. దానికి తగిన ప్రతిఫలం ఇదేనేమో. నాకు 18 సంవత్సరాలప్పుడు మృగగండం ఉందని జ్యోతిష్యుడు చెప్పాడు. నేను సరిగ్గా ఈ వయస్సులో పులులు తిరిగేచోటకి వచ్చాను. నన్ను నా తండ్రి సరిగా చూసుకోలేదు. అందుకే ఇల్లు వదిలి వచ్చాను. కాబట్టి చావు ఎదురైనా బాధపడను. కాని అకాలమరణం మంచిదా! నా పరిస్థితి అలా ఉండనీ వీడు నన్ను నమ్ముకొని వచ్చాడు. వీడి గతి ఏంకావాలి? వీడి తల్లికి కూడా వీడు ఒక్కడే కొడుకు. వీడు ఎంత పేద వాడైనా తల్లికి పేదవాడు కాదుకదా! వీడు చనిపోతే ఆ నింద నామీద పడుతుంది." (నరేశ్‌బాబు, దోనేపూడి. 2017: 33). శ్రీరంగరాజు బాధపడుతూ చెప్పిన ఈ వాక్యాలు అతని మనస్తత్వానికి ప్రతీక. తాను ఇల్లు వదిలి రావడం తప్పే కాని తన తండ్రి చేసింది అంతకన్నా

పెద్దతప్పు కాబట్టి అడవిలో పులి బారిన పడి మరణించినా పరవాలేదు కాని ఇంటికి మాత్రం వెళ్లను అంటూ శ్రీరంగరాజు చెప్పడం అతని మనోధైర్యానికి నిదర్శనం. తనకు ఎలాంటి ఆపదవచ్చినా పర్వాలేదు కాని తనవల్ల తనవెంట వచ్చిన రామయ్యకు హాని కలగకూడదని ఆలోచించడం శ్రీరంగరాజులోని మంచితనానికి ఉదాహరణ. మానసికంగా శ్రీరంగరాజు ధైర్యవంతుడు. తన బాణంతో బెబ్బులిని చంపుతాడు. దయ్యాలున్నాయని రామయ్య చెబుతున్నా వినకుండా చంద్రగుప్తి గ్రామంలోకి ప్రవేశించడం, శ్రీశైల మల్లన్నకు ముడుపుకట్టడం, తన జాతకంలో తనకి 18వ ఏట మృగగండం ఉందని జ్యోతిష్యులు చెప్పినట్టు గుర్తుకు తెచ్చుకోవడం. జ్యోతిష్యం పట్ల, దైవంపట్ల శ్రీరంగరాజుకు ఉన్న నమ్మకానికి ఉదాహరణలు.

శ్రీరంగరాజు కులాలపై ఉన్న నమ్మకం నానాటికి సన్నగిల్లుతున్న సందర్భంలో చంద్రగుప్తి గ్రామంలో లంబాడి కులానికి చెందిన సోనాబాయిని చూస్తాడు. సోనాబాయిని చూసిన క్షణంలోనే ఆమెను మోహిస్తాడు. శ్రీరంగరాజు అభిప్రాయాన్ని గమనించిన రామయ్య సోనాబాయి లంబాడి కన్య. లంబాడిలది నీచ కులం అంటూ అతని మనసుని మార్చడానికి ప్రయత్నిస్తాడు. అప్పటికే సోనాబాయిపై మరులుగొన్న శ్రీరంగరాజు, "గుణం ప్రధానం కాని కులం ప్రధానమా" అంటూ కులంపై తనకున్న అభిప్రాయాన్ని పూర్తిగా మార్చుకుని లంబాడీలది నీచకులం కాదు గొప్పకులమని రామయ్యతో వాదానికి దిగుతాడు. తాను సోనాబాయిని వివాహం చేసుకుంటానని తెగేసి చెప్తాడు. శ్రీరంగరాజు అభిప్రాయాన్ని గుర్తించిన సోనాబాయి తల్లి ఇదివరకే సోనాబాయికి వివాహమైందని అబద్ధం చెబుతుంది. తన బుద్ధి చాతుర్యంతో శ్రీరంగరాజు సోనాబాయికి వివాహం కాలేదని తెలుసుకుంటాడు. ఎలాగైనా సోనాబాయితో తన వివాహం జరిపించవలసిందిగా రామయ్యతో వేడుకుంటాడు. తల్లి ద్వారా శ్రీరంగరాజు అభిప్రాయాన్ని తెలుసుకున్న సోనాబాయి శ్రీరంగరాజుతో తన వివాహాన్ని నిరాకరిస్తుంది. రాజులు మోస ప్రవృత్తిని కలిగి ఉంటారని తల్లితో చెబుతుంది. తన నిజాయితీని సోనాబాయికి శ్రీరంగరాజు తన క్రియల ద్వారా నిరూపిస్తాడు. సోనాబాయిని కొండవీటి దొర మనుషులు అపహరించిన సందర్భంలో సోనాబాయికి అండగా తానుకూడా కొండవీడు వెళ్తాడు. కొండవీటి దొర బారినుండి సోనాబాయిని తప్పించే క్రమంలో పూలు అమ్మే 'తంబళ్ళ' వాని వేషం ధరించి సోనాబాయి గోత్రం కొండవీటి దొర గోత్రం ఒకటేనని, సగోత్ర వివాహం నిషేధమని కొండవీటి దొరకు తెలిసేలా చేస్తాడు. కొండవీటి దొర భార్య సహాయంతో కొండవీటి దొర బంధనం నుండి

సోనాబాయి తప్పించుకున్న సందర్భంలో తంబళ్ళ వాని వేషంలో ఉన్న శ్రీరంగరాజు సోనాబాయిని కలుసుకుంటాడు. సోనాబాయిని, ఆమె తల్లిని తనతోపాటు విద్యానగరానికి తీసుకొని వెళ్తాడు. అక్కడ సోనాబాయి ఎవరో కాదు తన మేనత్త కూతురే అని తెలిసి సంతోషిస్తాడు. సోనాబాయిని తన కుటుంబానికి దూరం చేసిన లంబాడి వృద్ధ స్త్రీని శిక్షించకుండా వదిలిపెడతాడు. తన తండ్రి అభీష్టం మేరకు శారద, కృష్ణులకు కొన్ని అమరములు (పరగణాలు) ఇవ్వడానికి ఒప్పుకుంటాడు. తాను ఇష్టపడ్డ సోనాబాయిని వివాహం చేసుకుంటాడు. ఈ విధంగా చిన్నప్పుడు ఆవేశంతో ఇంటిని వదిలిన శ్రీరంగరాజు దేశ సంచారంలో లోక పరిజ్ఞానం తెలుసుకుని తన చిన్ననాటి అభిప్రాయాలను మార్చుకుని తిరిగి తన కుటుంబాన్ని చేరుకుంటాడు.

### 4.4.1.2. మూరురాయగండర్

శ్రీరంగరాజు తండ్రి మూరురాయగండర్. ఇతను విజయానగర ప్రభువు. అపార ధన సంపదతో విద్యానగరాన్ని పరిపాలిస్తాడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునేవాడు. ప్రభువుల భోగలాలస జీవితానికి ప్రతీకగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు మూరురాయగండర్ పాత్రను చిత్రించారు. విద్యానగరాన్ని పరిపాలిస్తున్న మూరురాయగండర్ 'శారద' అనే వేశ్యను మోహిస్తాడు. ఈ అంశం అతని జీవితంలో ఒడిదుడుకులకు కారణమవుతుంది. 'శారద'కి మూరురాయగండర్ వల్ల 'కృష్ణుడు' అనే కుమారుడు జన్మిస్తాడు. 'శారద' ఒక వేశ్య 'మూరురాయగండర్' ఒక ప్రభువు తన అవసరం నిమిత్తం శారదను మూరురాయగండర్ వాడుకొని ఉండవచ్చు. కాని అతను అలా చేయలేదు. తనవల్ల కుమారున్ని కన్న 'శారద'ని తన పట్టపు రాణితో సమానంగా చూసుకుంటాడు. అంతఃపురంలో 'శారద'కు ఆమె కుమారునికి స్థానం కల్పిస్తాడు. శారద కుమారున్ని తన సోదరునిగా స్వీకరించడానికి శ్రీరంగరాజు నిరాకరించిన సందర్భంలో మూరురాయగండర్ మానసిక సంఘర్షణకు లోనౌతాడు. తన పట్టపురాణిని పిలిచి శ్రీరంగరాజుకు నచ్చజెప్పమని చెబుతాడేగాని 'శారదని' తన అంతఃపురం నుండి వెళ్ళగొట్టడు. ఒక వైపు తన సొంత కుమారుడు ఇంకో వైపు తాను ఇష్టపడ్డ శారద ఇద్దరిలో ఎవరినీ దూరం చేసుకోవడం ఇష్టం లేని మూరురాయగండర్ మానసిక క్షోభకు గురౌతాడు. శారద వేశ్యా స్త్రీ అయినా తన భార్యకు ఇచ్చిన స్థానాన్ని ఇస్తాడు. తన మాటను తండ్రి కాదన్నాడన్న కోపంతో కొడుకు శ్రీరంగరాజు ఇల్లు వదిలి వెళ్లిన సందర్భంలో బాధ పడతాడు.

తన కుమారున్ని వెతకడానికి తన సేవకులను పంపిస్తాడు. ఎక్కడా కొడుకు జాడ లభించదు. రాజ కార్యాలను మంత్రికి అప్పగించి సన్యాసిలాగా మారిపోతాడు. రాత్రి భోజనాన్ని మాని చిక్కిపోతాడు. “తాను దేవాలయంలో శారదను చూసి మోహించడం వల్లే ఇప్పుడు కష్టపడవలసి వస్తోందని పశ్చాత్తాపానికి గురౌతాడు. తన కొడుకుకు మృగ గండం ఉందని తెలిసి జ్యోతిష్యుడు రామాచార్యుల చేత గ్రహశాంతి జరిపిస్తాడు. అనునిత్యం కొడుకు బాగోగుల గురించి కలలు కంటాడు. దేవరాజు గ్రామం నుండి తమ గ్రామంలో ఒక యువకుడు చనిపోయాడని ఉత్తరం వచ్చిన సందర్భంలో ఆ చనిపోయిన యువకుడు తన కుమారుడు కాకూడదని భగవంతున్ని ప్రార్థిస్తాడు. ఇంటిని విడిచిపెట్టిన తన కొడుకు విద్యానగరానికి దగ్గరలో ఉన్న గ్రామంలో ఉన్నాడని రామయ్య ద్వారా తెలియగానే తన పరివారంతో వెళ్లి శ్రీరంగరాజును కలుసుకుంటాడు. తండ్రి స్థానంలో శ్రీరంగరాజుని అతనితోపాటు వచ్చిన సోనాబాయిని, ఆమె తల్లిని విద్యానగరంలోకి ఆహ్వానిస్తాడు. మల్రాజు మహారాజు సోనాబాయి కులం విషయంలో వివాదం లేవనెత్తిన సందర్భంలో విద్యానగర ప్రభువుగా శంకరాచార్యుల వారిని విద్యానగరానికి ఆహ్వానించి గొడవ సద్దుమణిగేలా చేస్తాడు. శ్రీరంగరాజు సోనాబాయిల వివాహానికి అంగీకరిస్తాడు. శ్రీరంగరాజు సోనాబాయిల వివాహానికి రావడానికి కొండవీటి దొర నిరాకరించిన సందర్భంలో మహారాజుగా తన దూతలను కొండవీటి దొర వద్దకు పంపి సోనాబాయి విషయంలో అతను చేసింది తప్పు కాదని అది కేవలం అనుకోకుండా జరిగిన సంఘటన మాత్రమేనని నచ్చజెప్పుతాడు. కొండవీటి దొర బాధను పోగొట్టే క్రమంలో అతనితో ప్రాయశ్చిత్తం చేయిస్తాడు. సోనాబాయిని తన సోదరికి చిన్నప్పుడు దూరం చేసిన లంబాడి వృద్ధ స్త్రీ పై కోపపడక ఆమెకు ఒక గ్రామాన్ని ఇచ్చి ఆదుకుంటాడు. తన కుమారుడు శ్రీరంగరాజు అభిప్రాయం మేరకు శారద, కృష్ణుడికి కొన్ని పరగణాలను దానంగా ఇస్తాడు. ఈ విధంగా తనను నమ్ముకొని ఉన్నవారి మంచిని కాంక్షించే వ్యక్తుల మనస్తత్వానికి ప్రతీకగా మూరురాయగండర్ పాత్రను నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు చిత్రించారు.

### 4.4.1.3. రామయ్య

స్వచ్ఛమైన స్నేహానికి ప్రతీకగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు ‘రామయ్య’ పాత్రను చిత్రించారు. శ్రీరంగరాజు స్నేహితుడు రామయ్య. నవల ఆసాంతం శ్రీరంగరాజును కనిపెట్టి ఉన్న పాత్ర రామయ్య. శ్రీరంగరాజు కష్ట సుఖాలలో అతనికి అండగా ఉన్న పాత్ర రామయ్య.

నవలలో ప్రవేశించినది మొదలు నిష్క్రమించేవరకు రామయ్య పాత్ర శ్రీరంగరాజు పాత్ర చుట్టూ తిరుగుతూ ఉంటుంది. శ్రీరంగరాజు తండ్రిమీద కోపంతో ఇంటిని వదిలివెళ్ళాలని నిర్ణయించుకున్నప్పుడు అతనికి గుర్తుకు వచ్చిన ఒకే ఒక్క వ్యక్తి రామయ్య. శ్రీరంగరాజు తనతో పాటు దేశసంచారానికి రావలసిందిగా రామయ్యను అడిగినప్పుడు అతను మరుమాట మాట్లాడకుండా ఒప్పుకుంటాడు. దేశ సంచారంలో శ్రీరంగరాజు వెన్నంటే ఉండి అతను వర్ణాశ్రమ ధర్మాలు తప్పకుండా ఉండటానికి రామయ్య శతవిధాల ప్రయత్నిస్తాడు. శ్రీరంగరాజుకు ఆపద వచ్చిన సందర్భంలో రామయ్య కాపాడతాడు. ఆవేశంలో తప్పుడు నిర్ణయాన్ని తీసుకోకుండా శ్రీరంగరాజును వారిస్తాడు. ఎలాంటి లాభాన్ని కాంక్షించని ఉత్తమ స్నేహితుని ప్రవర్తనకు నిదర్శనంగా రామయ్య పాత్ర ప్రవర్తన కనిపిస్తుంది. చంద్రగుప్తి వనంలో రాజు దారితప్పిన సందర్భంలో రామయ్య ఎత్తైన చెట్టు ఎక్కి చంద్రగుప్తి గ్రామం వైపుగా రాజు ప్రయాణించేలా చేస్తాడు. చంద్రగుప్తి గ్రామాన్ని సందర్శించడానికి రాజు ఆ గ్రామంలో ప్రవేశిస్తున్న సందర్భంలో అక్కడ దయ్యాలు ఉంటాయని తాను విన్నానని, కావున ఆ గ్రామంలోకి వెళ్ళవద్దని రామయ్య శ్రీరంగరాజుని అడ్డుకుంటాడు. చంద్రగుప్తి గ్రామంలో ప్రవేశించిన శ్రీరంగరాజు అక్కడ ఉన్న సోనాబాయిని మోహించిన సందర్భంలో శ్రీరంగరాజు మనసు మార్చడానికి రామయ్య అనేక విధాలుగా ప్రయత్నిస్తాడు. శ్రీరంగరాజు లంబాడి వనిత సోనాబాయిని వివాహం చేసుకోవడం వల్ల వర్ణసంకరం జరుగుతుందని, శ్రీరంగరాజు రాజవిధులను సక్రమంగా నిర్వహించలేడని రామయ్య మనసులో అనుకుంటాడు. ఎలాగైనా శ్రీరంగరాజు సోనాబాయిని వివాహం చేసుకోకుండా చూడాలనే నిర్ణయానికి వస్తాడు. తాను నిర్ణయించుకున్న విధంగానే ప్రవర్తిస్తాడు. సోనాబాయి తల్లి సోనాబాయికి ఇదివరకే వివాహం జరిగిందని అయిరేణి దొంతరలు, రోకళ్ళు, దంతపు గాజులు మొదలైన వాటిని సాక్షాలుగా చూపిస్తుంది. వివాహం జరిగిన ప్రాంతంలో అక్షింతలు, వరుడు ఉండక పోవడం వల్ల అనుమానం వచ్చిన శ్రీరంగరాజు వధువు తల మీద జడకుప్పె, చేతికి దంతపు గాజులు ఉన్నాయో లేదో చూసి రమ్మని రామయ్యను సోనాబాయి వద్దకు పంపుతాడు. సోనాబాయికి తలపై కుప్పె, చేతికి దంతపు గాజులు ఉండవు. ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా శ్రీరంగరాజుకు చెబితే అతను సోనాబాయిని వివాహం చేసుకొని లంబాడీలతో కలిసి కులము చెడి రాజ్యపాలనకు అర్హుడు కాకుండా పోతాడని దిగులుపడి రామయ్య శ్రీరంగరాజువద్ద, సోనాబాయికి తలపై కుప్పె, చేతికి దంతపుగాజులు ఉన్నాయని అబద్ధం చెప్తాడు. అంతే కాకుండా లంబాడీలపై తనకు

ఎలాంటి నీచ భావన లేకున్నా శ్రీరంగరాజు మనసు మార్చే క్రమంలో లంబాడీలు నీచ కులం వారని శ్రీరంగరాజుతో వాదానికి దిగుతాడు. "ఎంతకీ శ్రీరంగరాజు మనసు మారక పోవడం వల్ల లంబాడీలు మామూలు వాళ్ళు కాదు, తేడా వస్తే ఎవరూ లేని ఇలాంటి అడవిలోకి తీసుకెళ్ళి వాళ్ళు చేయవలసింది వాళ్ళు చేస్తారని, వాళ్ళకు నాయకుడే న్యాయాధిపతి. కాబట్టి దయచేసి సోనాబాయిపై ఆలోచనలు మానుకోండని, శ్రీరంగరాజును ప్రాధేయపడతాడు. అయినా శ్రీరంగరాజు మనసు మారడం లేదని గ్రహించిన రామయ్య ఇంట్లో పెద్దలున్నారు. ఏ పనైనా వాళ్ళతో ఆలోచించి చేయాలి. ముందూ వెనకాల ఆలోచించ కుండా ఏ పనీ చేయకూడదు అంటూ శ్రీరంగరాజుకు హితబోధ చేస్తాడు. సోనాబాయి కోసం శ్రీరంగరాజు కొండవీటికి బయలుదేరిన సందర్భంలో రామయ్యకూడా శ్రీరంగరాజుతోపాటు కొండవీడు వెళ్తాడు.

కష్టకాలంలో ఆలోచించి కార్యాన్ని సాధించాలని శ్రీరంగరాజుకు ధైర్యం చెబుతాడు. కష్టాలన్ని తొలగి శ్రీరంగరాజు విద్యానగరాన్ని సమీపించిన సందర్భంలో అందరికంటే ముందే మూరురాయగండర్ వద్దకు వెళ్లి శ్రీరంగరాజు రాకను గురించి చెబుతాడు. ఇలా నవల ఆసాంతం తన గురించి కాక తన స్నేహితుని మంచి గురించి ఆలోచించే వ్యక్తుల ప్రవర్తనకు ప్రతీకగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు రామయ్య పాత్రను చిత్రించారు.

### 4.4.1.4. భీమానాయకుడు

సోనాబాయిని పెళ్ళి చేసుకోవడానికి ప్రయత్నించి నిరాశపడ్డ వ్యక్తి భీమానాయకుడు. భీమానాయకుడు రామానాయక్ తాండాకి చెందిన వ్యక్తి. తనకు దక్కనిది ఎవ్వరికీ దక్కకూడదనే మనస్తతత్వం కలిగిన వ్యక్తుల ప్రవర్తనకు ప్రతీకగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు భీమానాయకుని పాత్రను చిత్రించారు. సోనాబాయి తనకు దక్కలేదని భీమానాయకుడు ఆమెపై పగబడతాడు. సోనాబాయి చంద్రగుప్తి వనంలో ఉందని తెలుసుకుని సోనాబాయి గురించిన సమాచారాన్ని కొండవీటి రాజుకు చేరవేస్తాడు. కొండవీటి రాజు సేవకులకు సోనాబాయి సమాచారాన్ని భీమానాయకుడు అందించడం వల్ల శ్రీరంగరాజు సోనాబాయిల వివాహం తాత్కాలికంగా వాయిదా పడుతుంది. ఈ సంఘటన కథా మలుపుకు కారణమవుతుంది. కొండవీటి రాజు సోనాబాయిని అపహరించడం వల్ల ఆమె లంబాడి స్త్రీ కాదన్న విషయం కథా గమనంలో తెలుస్తుంది. ఇలా నవల కథ కొనసాగింపులో కథ రక్తి కట్టడానికి సహకరించిన పాత్ర

భీమానాయకుడు. దురుద్దేశంతో సోనాబాయికి అపకారం చేయాలని భీమానాయకుడు చేసిన పని ఆమెకు ఉపకారాన్ని కలిగించడం నవల కథా గమనంలో కనిపిస్తుంది. తన వివాహం విషయంలో అసహనానికి గురైన భీమానాయకుడు అందుకు ప్రతీకారంగా సోనాబాయి జాడ కొండవీటి దొరకి చెప్పడం వల్ల నవల కథ సుఖాంతంగా ముగుస్తుంది.

### 4.4.1.5. కొండవీటి ప్రభువు

'శ్రీరంగరాజుచరిత్ర' నవలలో పేరులేని పాత్ర కొండవీటి ప్రభువు. ఇతను కొండవీడుని పరిపాలించిన రాజు. శ్రీరంగరాజు మేనత్త మనవడు. శ్రీరంగరాజుకు స్వయాన బావ కొడుకు. రాజుల భోగలాలస ప్రవృత్తికి ప్రతీకగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు కొండవీటి ప్రభువు పాత్రను చిత్రించారు. ఇతను స్త్రీలోలుడు. తనకు అనునిత్యం స్త్రీలను తార్చడానికి జంగమ మల్లమ్మ అనే స్త్రీని నియమించుకుంటాడు. కొండవీటి ప్రభువు స్త్రీలోలుడని తెలిసి భీమానాయకుడు సోనాబాయి గురించి కొండవీటి ప్రభువుకు తెలిసేలా చేస్తాడు. జంగమ మల్లమ్మ చాతూర్యం వల్ల తన వద్దకు వచ్చిన సోనాబాయిని చూసి ఆమెని ఎలాగైనా పొందాలని కొండవీటి ప్రభువు ఉవ్విళ్ళూరుతాడు. సోనాబాయికి కట్టుకోవడానికి అందమైన బట్టలు, నగలు పంపిస్తాడు. వాటిని సోనాబాయి నిరాకరించిందని తెలిసి ఆగ్రహానికి గురౌతాడు. కాలం గడిచినా కొద్దీ సోనాబాయిపై కొండవీటి ప్రభువుకు మోహం అధికమవుతుంది. ఒకనాడు సోనాబాయిని బలాత్కరించడానికి వెళ్తాడు. సోనాబాయికి కాపలాగ ఉన్న 'రామక్క' స్త్రీలను చెరపట్టడం రాజధర్మం కాదని, సోనాబాయి రాజకన్య, కావున ఆమెని వివాహం చేసుకొమ్మని నచ్చజెప్పడంతో వెనక్కి తగ్గుతాడు. కొండవీటి ప్రభువుతో సోనాబాయికి వివాహం నిర్ణయించడానికి వచ్చిన జ్యోతిష్యుడు సోనాబాయి, కొండవీటి ప్రభువులది ఒకే గోత్రం కావడం వల్ల ఈ పెళ్ళి మంచిది కాదని, కొండావీటి ప్రభువుకు సలహా ఇస్తాడు. జ్యోతిష్యుడి మాటలతో కొండవీటి ప్రభువు ఆగ్రహానికి గురవుతాడు. లంబాడి స్త్రీ రాజకన్య ఎలా అవుతుందని ఎదురు ప్రశ్నిస్తాడు. వివాహం జరిగి తీరవలసిందేనని పట్టుపడతాడు. లంబాడీ స్త్రీతో వివాహం మంచిది కాదని తనకి సవతి పోరు తీసుకురావద్దని తన భార్య చెప్పినా కొండవీటి ప్రభువు మనసు మారదు.

కొడుకు ప్రవృత్తివల్ల తమ వంశానికి చెడ్డపేరు వస్తుందని గ్రహించిన కొండావీటి ప్రభువు తల్లి సోనాబాయిని రహస్యంగా కొండవీడు దాటిస్తుంది. ఈ విషయం తెలిసి కొండవీటి ప్రభువు తల్లిపై కోప్పడతాడు. సోనాబాయి విద్యానగరం చేరుకున్న తరువాత ఆమె ఎవరోకాదు తన బంధువని, తనకు చెల్లెలి వరుస అవుతుందని తెలుసుకుని కొండవీటి ప్రభువు అమితంగా బాధపడతాడు. విద్యానగర ప్రభువుకు తన మొహం చూపించడానికి సిగ్గుపడతాడు. సోనాబాయి వివాహానికి తన ఇంట్లోని స్త్రీలను మాత్రమే పంపి తాను కొండవీడులోనే ఉండిపోతాడు. విద్యానగర రాజు మూరురాయగండర్ కొండవీటి రాజు సోనాబాయి విషయంలో ఆమె ఎవరో తెలియకుండా తప్పు చేశాడని, జరిగిన తప్పుకు బాధపడటమే పాశ్చాత్తాపానికి సూచకమని కొండవీటి రాజును మన్నిస్తాడు. ఇలా నవల ఆసాంతం స్త్రీలమీద వ్యామోహం ఉన్న కొండవీటి రాజు తన వ్యామోహం వల్ల కలిగిన అనర్థానికి నవల చివరిలో బాధపడటం కనిపిస్తుంది. నవల ప్రారంభంలో స్త్రీలోలుడిగా ఉన్న కొండవీటి రాజు నవల అంతానికి తన మనసుని మార్చుకుంటాడు.

### 4.4.2. స్త్రీ పాత్రలు

#### 4.4.2.1. సోనాబాయి (రంగనాయకి)

శ్రీరంగరాజుచరిత్ర నవల కథా నాయిక సోనాబాయి. ఈమె అసలు పేరు రంగనాయకి. చెరుకూరి గ్రామపు రాజైన మల్రాజు కుమార్తె. వరుసకు శ్రీరంగరాజుకు మేనత్త కూతురు. చిన్నప్పుడు ఇంటిముందు ఆడుకుంటుండగా వ్యాపారం నిమిత్తం చెరుకూరి గ్రామానికి వచ్చిన ఒక లాంబాడి వృద్ధస్త్రీ రంగనాయకిని అపహరిస్తుంది. అప్పటి నుండి రంగనాయకి కాస్త సోనాబాయిగా మారి లంబాడి వృద్ధ స్త్రీ సంరక్షణలో పెరుగుతుంది. పుట్టింది ఉన్నత కులంలోనే అయినా లంబాడి వృద్ధ స్త్రీ అపహరణ వల్ల రంగనాయకి లంబాడి కులంలో పెరుగుతుంది. లంబాడీల జీవన విధానానికి, వ్యాపార వలస జీవితానికి అలవాటు పడుతుంది. తనను పెంచిన లంబాడి వృద్ధస్త్రీని సొంత తల్లిలా చూసుకుంటుంది. నవల ఆసాంతం వ్వర్ణవ్యవస్థ వల్ల మానసిక సంఘర్షణకిలోనైన పాత్ర సోనాబాయి. సోనాబాయిని చంద్రగుప్తి గ్రామంలో చూసిన మరుక్షణం లోనే కథానాయకుడైన శ్రీరంగరాజు ఆమెతో ప్రేమలో పడతాడు. "ఇది రాచకన్యయో, వనదేవతయో, మన చంద్రవంశము వారిలో సయితమింత రూపవతినిగానము?" ( ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 84) అంటూ శ్రీరంగరాజు సోనాబాయి

అందాన్ని కీర్తిస్తాడు. ఈ మాటలు విన్న సోనాబాయి ఏనాడు గర్వంతో విర్రవీగలేదు. అనుక్షణం ఆపద ఏ వైపునుండి పొంచు కొని వస్తుందోనని భయపడింది. రాజును చూసిన క్షణంలోనే తన మోహాన్ని కప్పుకుంది. తల పైకెత్తకుండా తాను లంబాడి స్త్రీనని, తనకు ముసలిదైన తల్లి తప్ప ఎవరూ లేరని ఉప్పు మొదలైన వాటిని తీసుకొని బేరమాడుతూ కందవోలు సీమకు పోతున్నామని తన వివరాలు రామయ్యతో చెబుతుందే కాని రాజుతో మాట్లాడదు.

కాలాంతరంలో సోనాబాయికి శ్రీరంగరాజంటే ఇష్టం ఏర్పడుతుంది. అప్పటికే శ్రీరంగరాజు తన పట్ల మక్కువ చూపుతున్నాడని సోనాబాయి గ్రహిస్తుంది. ఎంతో అదృష్టం చేసుకుంటేగాని ఇలాంటి వ్యక్తి భర్తగా లభించదని మనసులో అనుకుంటుంది. కాని తన మనసులోని మాటను శ్రీరంగరాజు వద్ద బయటపెట్టడానికి తన కులం అడ్డు వచ్చి వెనక్కి తగ్గుతుంది. వర్ణవ్యవస్థని నిందిస్తుంది. 'ఈ కులాచారాలను ఎవరు సృష్టించారో వాటివల్లే నా ప్రేమకు ఆటంకాలు ఏర్పడ్డాయి. నేనేమో లంబాడిదాన్ని, అతడేమో క్షత్రియుడు మా యిద్దరికి స్నేహం ఎలా కుదురుతుంది'. అంటూ మనసులో బాధపడుతుంది. సోనాబాయి అంతరంగాన్ని గుర్తించిన ఆమె పెంపుడు తల్లి శ్రీరంగరాజుతో సోనాబాయిని కలపాలని ప్రయత్నిస్తుంది. కాని సోనాబాయి మాత్రం ఎప్పటికప్పుడు తల్లి అభిప్రాయాన్ని తిరస్కరిస్తుంది. ఇలాంటి రాజులు మోస ప్రవృత్తిని కలిగి ఉంటారని, రాజులకు లంబాడి వారితో పొత్తు కుదరదని కరాఖండిగా చెబుతుంది. "రాజు తనని పెద్దమనసుతో పెళ్ళి చేసుకున్నా అతని చుట్టాలు అతన్ని ఎగతాళి చేయరా! వెళ్ళాడు లంబాడి దాన్ని తగులుకున్నాడు. కులభ్రష్టుడయ్యాడు. కలియుగంలో వర్ణాచారాలు తారుమారవుతాయని శాస్త్రం చెబుతున్న దానికి ఇదే సాక్షం." అని అతన్ని నిందించరా! మన జాతివారు కూడా మనలను ఆడిపోసుకుంటారు. స్తోమతకు తగ్గట్టుగా మన జాతి వారిని పెళ్ళి చేసుకోవాలిగానీ రాకుమారులను చేసుకుంటారా! అని అనరా!" (నరేశ్‌బాబు, దోనెపూడి. 2017: 47, 48). అని సోనాబాయి తార్కికంగా తల్లితో మాట్లాడుతుంది. తల్లి ఎన్ని రకాలుగా చెప్పినా సోనాబాయి శ్రీరంగరాజుతో వివాహానికి అంగీకరించదు. తల్లి చేసేది లేక సోనాబాయిది రాజులు కూడా మెచ్చుకునేంత గొప్పపుట్టుక అని సోనాబాయి జనన రహస్యాన్ని పరోక్షంగా చెబుతుంది. అది విన్న వెంటనే సోనాబాయి ఆశ్చర్యానికి గురవుతుంది. తన జననం గురించి చెప్పమని తల్లిని బ్రతిమిలాడుతుంది. తన తల్లి తన జననం గురించి పూర్తి వివరాలు చెప్పక పోవడంతో మానసిక సంఘర్షణకు లోనవుతుంది.

కొండవీటి దొర మనుషులు తనని అపహరించిన సందర్భంలో సోనాబాయి తనకు వచ్చిన కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటుంది. వ్రతం పేరిట కొండవిటి రాజు తన వద్దకు రాకుండా చూసుకుంటుంది. కొండవీటి రాజు తల్లి సహకారంతో కొండవీటినుండి తప్పించుకొని తన లంబాడి తల్లి వద్దకు చేరుతుంది. శ్రీరంగరాజుతో కలిసి విద్యానగరంలోకి ప్రవేశిస్తుంది. అక్కడ సోనాబాయి ఎవరో కాదు శ్రీరంగరాజు మేనత్త కూతురు రంగనాయకి అన్న నిజం సోనాబాయికి తెలుస్తుంది. ఈ నిజం తెలిసిన వెంటనే సోనాబాయి శ్రీరంగరాజుతో వివాహానికి అంగీకరించి ఉండవచ్చు. కాని ఆమె అలా అంగీకరించదు, మౌనంగా ఉంటుంది. సదా అందరి క్షేమాన్ని కాంక్షించే ప్రవృత్తి కలిగిన సోనాబాయి తనను వివాహం చేసుకోవడం వల్ల శ్రీరంగరాజుకు కలిగే ఆపద గురించి మనసులో చింతిస్తుంది. "నేను లంబాడి దాన్ని అనుకొని వాళ్ళతో కలిసిమెలిసి ఉన్నాను. వాళ్ళు పెట్టిన అన్నం తిన్నాను. వాళ్ళు ఇచ్చిన నీళ్ళను తాగాను. నేను రాకుమార్తెనైన వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించలేదు. నన్ను వాళ్ళలో ఎలా చేర్చుకుంటారు. లంబాడీలతో కలిసి ఉంటే లంబాడీగానే ఉండేదాన్ని. ఇప్పుడు నేను లంబాడీని కాను, రాచకన్యను కాను. రెంటికీ చెడ్డాను. నన్ను ఇంతగా ఇష్టపడి తెచ్చిన వాడు మేనమామ కొడుకే అయినా రేపు సింహాసనం ఎక్కిన తరువాత వర్ణాశ్రమ ధర్మ విషయంలో నలుగురికి న్యాయం చెప్పాల్సిన వాడు. నన్నెలా స్వీకరిస్తాడు.  నామీద ప్రేమతో రాజ్యాన్ని కూడా వదిలేసి నాతో ఉంటే అది నాకేమి గౌరవం" (నరేశ్‌బాబు, దోనెపూడి. 2017: 68). అంటూ సోనాబాయి మనసులో పరిపరి విధాలుగా చింతిస్తుంది. ఇదే విషయం గురించి రాజ సభలో చర్చ జరిగి శంకరాచార్యులు సోనాబాయి విషయంలో తెలియక తప్పు జరిగింది కాబట్టి ప్రాయశ్చిత్తంతో దాన్ని పోగొట్టవచ్చని తీర్పు చెప్పిన సందర్భంలో సోనాబాయి సంతోషిస్తుంది. అందరి అంగీకారం మేరకు శ్రీరంగరాజుని వివాహం చేసుకుంటుంది. ఇలా నవల ఆసాంతం వర్ణాశ్రమ ధర్మాల వల్ల మానసిక సంఘర్షణకు గురైన సోనాబాయి కథ ముగిసే సమయానికి శ్రీరంగరాజుని చేరుతుంది.

### 4.4.2.2. జంగమ మల్లమ్మ

రాజులకు స్త్రీలను తార్చే వ్యక్తులకు ప్రతీకగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు జంగమ మల్లమ్మ పాత్రను చిత్రించారు. జంగమ మల్లమ్మ జంగమ కులానికి చెందిన స్త్రీ. కొండవీటిరాజుకు స్త్రీలను తార్చే తార్పుడుగత్తె. ఈమె అంతఃపుర స్త్రీలకు పూలమాలలు కట్టిస్తుంది. కొండవీటి రాజు సోనాబాయిని గురించి విన్న క్షణంలోనే ఆమెపై మోజుపడతాడు.

సోనాబాయిని తీసుకురావడానికి తన పనివాళ్లతో జంగమ మల్లమ్మను పంపుతాడు. జంగమ మల్లమ్మ తాను రాజు కార్యం నిర్వహిస్తానని మాట ఇస్తుంది. తన వద్ద మంది మార్బలం కలిగిన జంగమ మల్లమ్మ సోనాబాయిని చూడగానే ఆమెని తన సేవకుల సహాయంతో కొండ వీటికి ఎత్తుకెళ్లి ఉండవచ్చు. కాని జంగమ మల్లమ్మ అలా చేయలేదు. మొదట తాను ఆశ్రయించిన కొండవీటి రాజు గొప్పతనం గురించి సోనాబాయికి చెప్పి ఆమె మనసు మార్చడానికి ప్రయత్నిస్తుంది. అప్పటికే శ్రీరంగరాజును ఇష్టపడుతున్న సోనాబాయి మనసు మారక పోవడంతో అమరాబాదులో ఉన్న తన సేవకులను తీసుకువచ్చి సోనాబాయికి పరిచయం చేస్తుంది. ఆ సేవకుల ద్వారా కూడా కొండవీటి రాజు గొప్పధనవంతుడని అతడిని వివాహమాడితే సోనాబాయి సుఖంగా ఉంటుందని చెప్పిస్తుంది. ఎంతకీ సోనాబాయి మనసు మారకపోయేసరికి సోనాబాయి తల్లిని బంధించి సోనాబాయిని బెదిరించి ఆమెను కొండవీటి దొరకు అప్పగిస్తుంది. జంగమ మల్లమ్మ వల్లనే తన భర్త సోనాబాయి మాయలో పడ్డాడని కొండవీటి రాజు భార్య మల్లమ్మపై కోప్పడుతుంది. ఆమెను ఉద్యోగంలో నుండి రాజగృహం నుండి బహిష్కరిస్తుంది. తాను చేసిన పనికి కొంతకాలం సుఖపడ్డా తరువాత రాజాశ్రయాన్ని కోల్పోయిన పాత్ర జంగమ మల్లమ్మ. వ్యక్తులు చేసిన చెడ్డపనుల వల్ల కొంతకాలం సుఖాలు అనుభవించినా తరువాత కష్టాలపాలవుతారని చెప్పడానికి నిదర్శనంగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు జంగమ మల్లమ్మ పాత్రను చిత్రించారు.

### 4.4.2.3. లంబాడి వృద్ధ స్త్రీ (సోనాబాయి పెంపుడు తల్లి)

శ్రీరంగరాజుచరిత్ర నవలలో కథానాయిక సోనాబాయికి సంరక్షకురాలిగా ఉన్న పాత్ర లంబాడి వృద్ధ స్త్రీ. నవల ఆసాంతం సోనాబాయి పెంపుడు తల్లిగా లంబాడి వృద్ధస్త్రీగా మాత్రమే ఈ పాత్ర పేర్కొన్నబడింది. ఎక్కడా ఈ పాత్ర పేరు ప్రస్తావనకు రాలేదు. లంబాడీల జీవన విధానానికి, ఆచార వ్యవహారాలకు ప్రతీక లంబాడి వృద్ధ స్త్రీ. శ్రీరంగరాజుచరిత్ర నవల కథానాయిక సోనాబాయిని కన్నది లంబాడి వృద్ధ స్త్రీ కాకున్నా ఆమెని పెంచి పెద్ద చేసింది మాత్రం ఈమెనే.

చిన్నతనంలో సోనాబాయిని ఎత్తుక వచ్చిన లంబాడి వృద్ధస్త్రీ తాను చేసిన తప్పుకు ప్రతీక్షణం బాధపడుతూ ఉంటుంది. ఎలాగైనా తాను చేసిన తప్పును సరిదిద్దు కోవాలను

కుంటుంది. నవల మొదటి నుండి నవల ముగిసే వరకు ప్రతీ సందర్భంలో సోనాబాయికి అండగా ఉంటుంది. తొలిసారిగా చంద్రగుప్తి వనంలో శ్రీరంగరాజుని చూసిన సందర్భంలో అతనిపై ప్రశ్నల వర్షం కురిపిస్తుంది. అడవిలో తాను, తన పెంపుడు కూతురు మాత్రమే ఉన్నాము కాబట్టి ఆపద ఏవైపు నుండైనా రావచ్చు అని మనసులో భయపడుతున్న లంబాడి వృద్ధస్త్రీ ఆ భయాన్ని మాత్రం పైకి కనిపించ కుండా శ్రీరంగరాజుని ప్రశ్నిస్తుంది. శ్రీరంగరాజు వివరాలు తెలుసుకుని మనసులో సంతోష పడుతుంది. తన మల్లికార్జునుడి మొక్కు ఈ రోజు ఫలించిందని అనుకుంటుంది. తన ఆనందాన్ని పైకి కనబడనీయకుండా శ్రీరంగరాజు గుణాన్ని పరీక్షిస్తుంది. "విద్యానగరం ఎక్కడా? చంద్రగుప్తి ఎక్కడ? రాయలవారి వంశం ఎక్కడా? దేశదేశాలు తిరిగే లంబాడీ కులం ఎక్కడ? మాతో మీకేం మాటలు." అంటూ శ్రీరంగరాజు మనసు విరిగిపోయేలా మాట్లాడుతుంది. అప్పటికే సోనాబాయిని ఇష్టపడుతున్న శ్రీరంగరాజు సోనాబాయిలంబాడి పిల్లలా లేదని అన్న సందర్భంలో లంబాడి వృద్ధ స్త్రీ సోనాబాయి తన సొంతబిడ్డనేనని నమ్మిస్తుంది.

సోనాబాయికి వివాహం జరిగినట్లు కొన్ని గుర్తులను కూడా రాకుమారునికి చూపిస్తుంది. శ్రీరంగరాజు సోనాబాయి లంబాడి కన్య కాదు కదా అని అడిగిన సందర్భంలోనే లంబాడి వృద్ధ స్త్రీ నిజం చెప్పి ఉండవచ్చు కాని ఆమె అలా చేయలేదు. దీనికి కారణం అప్పటికే రాజుపై ఆమెకు పూర్తి నమ్మకం ఏర్పడలేదు. అదీకాక సోనాబాయి మనసు గురించి ఆమెకు తెలియదు. అందుకే శ్రీరంగరాజు గుణాన్ని పూర్తిగా తెలుసుకునే ఉద్దేశంతో లంబాడి వృద్ద స్త్రీ ఆ క్షణానికి శ్రీరంగరాజుకు అబద్ధం చెబుతుంది. లంబాడి వృద్ధ స్త్రీ మాటలతో సంతృప్తి చెందని శ్రీరంగరాజు సోనాబాయిపై ప్రేమతో బాధపడుతున్నాడని తెలుసుకుని అతనికి పునుగు వాసనలు వచ్చే రాజనాల బియ్యంతో చేసిన అన్నం, వెన్న, పాలతో భోజనం పెడుతుంది.

శ్రీరంగరాజు చెట్టుకింద తడిక మీద పడుకున్నాడని కూతురి ద్వారా తెలుసుకుని అతనికి తమ వద్ద ఉన్న మంచం వేస్తుంది. జ్వరంతో బాధపడుతున్న శ్రీరంగరాజుకు మూడు రోజులు సేవ చేస్తుంది. శ్రీరంగరాజు జ్వరం కుదుటపడ్డాక ఇంటికి వెళ్ళమని సలహా ఇస్తుంది. జ్వరం నుంచి కోలుకున్న శ్రీరంగరాజు సోనాబాయి వివాహ వృత్తాంతం గురించి అడగగా అతన్ని ఇంకా బాధ పెట్టడం ఇష్టంలేక భీమానాయకునితో సోనాబాయి వివాహం ఆగిపోయిన

వృత్తంతాన్ని చెబుతుంది. తన కూతురు సోనాబాయి కూడా శ్రీరంగరాజును ఇష్టపడుతుందని తెలుసుకుని వారిని కలపడానికి ప్రయత్నిస్తుంది. సోనాబాయి తాను లంబాడి దాన్ని కావడంవల్ల శ్రీరంగరాజుతో వివాహం తిరస్కరించిన సందర్భంలో లంబాడి వృద్ధ స్త్రీ సోనాబాయిది నీచకులం కాదని శ్రీరంగరాజు మోస ప్రవృత్తి కలిగినవాడు కాదని నచ్చచెప్పే ప్రయత్నం చేస్తుంది.

కొండవీటి రాజు మనుషులు సోనాబాయిని బంధించి తీసుకువెళ్ళే సందర్భంలో తన కట్ల సంచి మర్చిపోయానని ఇంటికి వెళ్లి తీసుకువస్తానని రాజభటులను నమ్మించి సోనాబాయి సమాచారాన్ని శ్రీరంగరాజుకు చేరవేస్తుంది. తిరిగి కొండవీడు చేరుకుంటుంది. అక్కడి ద్వారా పాలకులు రాజ గృహంలోకి ప్రవేశించకుండ లంబాడి వృద్ధ స్త్రీని అడ్డుకోవడంతో రాజపరిచారికలను ఆశ్రయించి సోనాబాయిని కాపాడటానికి పథకం రచిస్తుంది. శ్రీరంగరాజు ఆజ్ఞ ప్రకారం కొండవీటి రాజు గోత్రం, సోనాబాయి గోత్రం ఒకటేనని రాజ పురోహితుని ద్వారా కొండవీటి రాజుకు తెలిసేలా చేస్తుంది. కొండవీటి రాజు తల్లి సహకారంతో సోనాబాయి తప్పించుకున్న సందర్భంలో ఆమెను కలుసుకొని శ్రీరంగరాజుతో పాటు విద్యానగరానికి వెళ్తుంది. విద్యానగరంలోని ప్రజలందరూ సోనాబాయి లంబాడి స్త్రీ కాకుంటే బాగుండు అని అనుకునే సందర్భంలో తాను నిజం బయటపెట్టడానికి ఇదే తగిన సమయమని భావించిన లంబాడి వృద్ధ స్త్రీ సోనాబాయి తన సొంత కూతురు కాదని శ్రీరంగరాజు మేనత్త కూతురిని చిన్నప్పుడు సోనాబాయి ఇంటిముందు ఆడుకుంటుండగా తానే ఎత్తుకెళ్ళానని అందరూ వినేలా చెబుతుంది. తాను చెప్పే మాటలకు సాక్ష్యంగా సోనాబాయి శరీరంపై చిన్నప్పుడు ఉన్న నగలను, వస్త్రాలను చూపుతుంది. లంబాడి వృద్ధస్త్రీ మాటలకు అందరూ ఆశ్చర్యపోతారు. చిన్నప్పటి వస్తువులను అమ్ముకోకుండా ఇప్పటి వరకు కాపాడి ఉంచినందుకు అందరూ లంబాడి వృద్ధస్త్రీని మెచ్చుకుంటారు. ఎత్తుకెళ్లిన పాపను లంబాడి వారికి ఇచ్చి వివాహం చేయకుండా ఇన్ని రోజులు కాపాడినందుకు అందరూ ఆమె పై కృతజ్ఞతా భావాన్ని ప్రదర్శిస్తారు. లంబాడి వృద్ధ స్త్రీ అనుకోని సందర్భంలో చేసిన తప్పుకు నవల ఆసాంతం బాధపడుతుంది. సరైనచోట, సరైన సందర్భంలో నిజం చెప్పి సోనాబాయి తిరిగి తన ఇంటినిచేరేలా చేస్తుంది. మనసులో ఎలాంటి కల్మషం లేని లంబాడి వృద్ధ స్త్రీ తెలియక చేసిన తప్పును శ్రీరంగరాజు, మూరురాయగండర్ పెద్దమనసుతో మన్నిస్తారు.

### 4.4.2.4. కొండవీటి రాజు భార్య

తప్పుడు మార్గంలో ప్రయాణిస్తున్న భర్తను ఎదురించిన స్త్రీలకు ప్రతీకగా నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు కొండవీటిరాజు భార్య పాత్రను చిత్రించారు. తన భర్త లంబాడి స్త్రీ సోనాబాయిని రెండవ వివాహం చేసుకుంటున్నాడని తెలిసి కొండవీటి రాజు భార్య మండిపడుతుంది. తన అత్త వద్దకు వెళ్లి జంగమ మల్లమ్మను తమ రాజగృహంలో ఉంచుకోవడం వల్లే ఈ తప్పు జరిగిందని బాధపడుతుంది. జంగమ మల్లమ్మను రాజగృహం నుండి వెళ్ళగొడుతుంది. తన భర్త వద్దకు వెళ్లి "మగవారిని అడ్డగించినంత మాత్రానా నిలుస్తారా అని ఇన్ని రోజులు బాధపడకుండా చూస్తూ ఉన్నాను. నీవు ఇంత పని చేస్తావని కలలోకూడా అనుకోలేదు. మీ అమ్మ మీద గౌరవంతో ఈ జంగమ మల్లమ్మను ఇన్ని రోజులు రాజగృహంలో ఉండనిచ్చాను. ఎంత మద పిచ్చి ఉన్నవాళ్లైనా ఇలా చేస్తారా! ఒళ్ళు మరచి వర్ణాశ్రమ ధర్మాలను కూడా పట్టించుకోకుండా ఇలాంటి పనులు చేస్తారా. అది రాచ కన్యా అని దాని కులందాచిపెట్టావు. సరే, ఈరోజు కాకపోయినా రేపైనా అది బయటపడదా? ఎందుకు ఈ కుల సంకరం? ఎందుకు ఈ లోకాపవాదం? ఒకవేళ ఆ అమ్మాయి రాచకన్యే అనుకుందాం. లోకంలో ఇద్దరు భార్యలు ఉన్నవాళ్ళు ఎన్ని కష్టాలు పడతారో వినలేదా. ఎక్కడైనా పిల్లలు లేకపోతే రెండవ పెళ్ళి చేసుకుంటారు. ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లల్ని పెట్టుకొని ఇలాంటి పనులు చేయాలనుకోవడం ఎంతవరకు న్యాయం? పూర్వం కైకేయితో కౌసల్య పడ్డపాట్లు వినలేదా? రుక్మిణీ సత్యభామల తగాదా ఆపడానికి శ్రీవిష్ణుమూర్తి అవతారమెత్తిన శ్రీకృష్ణునికైనా సాధ్యమైందా! గౌరీ, గంగలకు వచ్చిన పోట్లాటని మహేశ్వరుడు కూడా తీర్చలేక పోయాడు కదా!"(నరేశ్ బాబు, దోనెపూడి. 2017: 55, 56). ఇలా అనేక ఉదాహరణలతో భర్త మనసు మార్చడానికి కొండవీటి రాజు భార్య ప్రయత్నిస్తుంది.

భర్త మనసు మార్చే క్రమంలో జంగమ స్త్రీ చేత గౌరి, గంగకు మధ్య జరిగిన కథలను వినిపిస్తుంది. తనకు ఎంత మంచి సంబంధాలు వచ్చినా అన్నింటిని కాదని తన తండ్రి కొండవీటి రాజుకు ఇచ్చి పెళ్ళి చేసిన సందర్భాన్ని గుర్తు చేస్తుంది. ఇలా భర్త మనసు మార్చే భార్య మనఃప్రవృత్తికి ప్రతీకగా కొండవిటిరాజు భార్య పాత్ర ప్రవర్తన కనిపిస్తుంది. చివరికి కోడలి బాధతో నిజం తెలుసుకున్న కొండవీటి రాజు తల్లి కొండవిటి రాజుకు తెలియకుండా

సోనాబాయిని కొండవీటినుండి బయటకు పంపిస్తుంది. స్త్రీలోలుడిగా ఉన్న తన భర్త ప్రవర్తనలో మార్పుకు తన శక్తియుక్తులా కృషి చేసిన పాత్ర కొండవీటిరాజు భార్య.

**4.4.2.5. శారద**

శారద వేశ్యా కులానికి చెందిన మహిళ. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి వేశ్యలకున్న ప్రాధాన్యాన్ని, వేశ్యలకు సమాజంలో ఉన్న స్థానాన్ని నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు శారద పాత్ర ద్వారా వివరించారు. విద్యానగర ప్రభువు శారదను ఒక గుడిలో చూసి మోహించి తన రాజగృహంలోకి తీసుకెళ్తాడు. ఆమెతో ఒక కుమారున్ని కూడా కంటాడు. శారదని తన పట్టపురాణితో సమానంగా చూసుకుంటాడు కాని వివాహం మాత్రం చేసుకోడు. రాజు శారద మీద ఉన్న ప్రేమతో ఆమెని అంతఃపురంలోకి తీసుకువచ్చినా అంతఃపురంలోని స్త్రీలు మాత్రం ఆమెపై వివక్ష చూపుతారు. అనునిత్యం రాజభవనంలో శారద భయంభయంగా గడుపుతుంది. తనకు కుమారుడు పుట్టిన సందర్భంలో అందరినీ పిలిచి నామకరణం జరిపించాలని అనుకుంటుంది. కాని తన వారందరూ రాజ భవనంలోకి రావడం బాగుండదని వారిని నామరకరణానికి పిలవదు. శారదకు పుత్రుడు పుట్టాడని విన్న నగర ప్రజలు ఆ పిల్లవాడు వేశ్యకడుపున కాక రాణి కడుపున పుట్టిఉంటే రాజ వంశానికి మేలు జరిగేదని అనుకుంటారు. ఈ అంశం వేశ్యావృత్తులకు నాటి సమాజంలో ఉన్న స్థానానికి నిదర్శనం. మహారాణిగారి కొడుకు శ్రీరంగరాజు నామకరణానికి వెళ్లిన శారదను అంతఃపుర స్త్రీలు అవమానిస్తారు. వేశ్యలు ఉండాల్సింది నాటకశాలలో కాని రాజస్త్రీల పక్కన కాదని ఎగతాళి చేస్తారు. వారి మాటలకు భంగపడ్డ శారద బాధపడుతూ ఇంటికి వెళ్తుంది. రాణి కొడుకుకు జరిగిన దానిలో పదవవంతు కూడా తన కుమారునికి జరగలేదని బాధపడుతుంది. తనకు జరిగిన అవమానాన్ని రాజుకు చెబుతుంది. జరిగిందేదో జరిగిపోయింది అంటూ శారదకు రాజు సర్దిచెబుతాడేకాని శారదని ఎగతాళి చేసిన వారిమీద ప్రతీకారం తీర్చుకోడు.

మూరురాయగండర్ కొడుకు మాటలతో భంగపడి తనవద్దకు వచ్చి బాధపడుతున్న సందర్భంలో శారద అతని మనసులోని మాటను గ్రహిస్తుంది. “తాను ఎన్ని రోజులు రాజువద్ద ఉన్నా చివరికి వేశ్యగానే గుర్తించబడ్డానని బాధపడుతుంది. తన తల్లిని, తోబుట్టువులను, బంధువులను అందరిని వదిలి రాజును ఇష్టపడి అతనితో వచ్చినందుకు తనకు తగిన శాస్తి

జరిగిందని మూరురాయగండర్ తో అంటుంది. ఇన్నాళ్ళు తనను అంతఃపురంలో ఏకాకిని చేసి తనవల్ల సుఖాన్ని అనుభవించి ఇప్పుడు రాణి కొడుకు అన్న మాటల ప్రకారం తనను త్యజించడం రాజధర్మమా అంటూ రాజును నిలదీస్తుంది. తనను తొలిసారి దేవాలయంలో చూసినప్పుడే త్యజించి ఉంటే తనకు ఈ కష్టాలు వచ్చేవికావని బాధపడుతుంది. రాజు శారదని ఏమీ అనలేక వెళ్లిపోతాడు.

శ్రీరంగరాజు ఇంటిని వదిలి వెళ్లిన తరువాత శారద చుట్టాలు, వేశ్యా సమూహానికి చెందిన స్త్రీలు శారద వద్దకు వచ్చి “రాజగృహంలో ఉన్నంత మాత్రానా బోగం కులం స్త్రీ రాణి అవుతుందా?” అంటూ ఇష్టం వచ్చినట్లుగా శారదను నిందిస్తారు. శారద తన తప్పేమీ లేకున్నా తనవల్లే రాజుకు కష్టాలు వచ్చాయని భావిస్తుంది. తాను రాజగృహాన్ని విడిచిపెట్టడం వల్లనైనా రాజకుమారుడు ఇంటికి తిరిగి వస్తాడేమోనని తన కుమారుడితో రాజగృహం వదిలి వెళ్లిపోతుంది. నవల అంతంలో శ్రీరంగరాజు తన తప్పును తెలుసుకుని తన తండ్రి ఇష్టప్రకారం శారద, కృష్ణులకు కొన్ని అమరములు (ప్రాంతాలు) ఇవ్వడానికి ఒప్పుకుంటాడు. ఇలా నవల ఆసాంతం కుల ప్రాతిపదికగా వివక్షకు గురైన పాత్రగా శారద పాత్ర నడవడిక చిత్రితమైంది. శారద పాత్రపై నవలలోని మిగతా పాత్రలు చూపిన వివక్ష పంతొమ్మిదవ శతాబ్దం నాటికి నాటి సమాజంలో వేశ్యలకు ఉన్న స్థానానికి నిదర్శనం.

### 4.4.2.6. శ్రీరంగరాజు తల్లి

శ్రీరంగరాజు “తల్లి మహాపతివ్రత, పురుషుడెన్ని దుష్కార్యములు చేసిన నోర్చుకొని పతికి మాఱుపల్కనిది” (గోపాలకృష్ణమసెట్టి, నరహరి. ఇనాక్, కొలకలూరి (సం). 2010: 65) శ్రీరంగరాజు తల్లి పాత్రను నవలలో ప్రవేశపెడుతూ నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు ప్రయోగించిన పై వాక్యం శ్రీరంగరాజు తల్లి పాత్ర ప్రవర్తనకు దర్పణం. శ్రీరంగరాజు తల్లి పాత్ర పేరును నరహరి గోపాలకృష్ణమసెట్టిగారు పేర్కొనలేదు. ఈమె ఉత్తమ ఇల్లాలిగా ఉండి భర్త ఎన్ని చెడ్డ పనులు చేసినా అన్నింటిని చూస్తూ ఊరుకునేది కాని ఏనాడు భర్తకు ఎదురుతిరగలేదు. భర్త వేశ్యల మాయలోపడి శారదకు తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చినా శ్రీరంగరాజు తల్లి ఏరోజు భర్తను వ్యతిరేకించలేదు. కొడుకు తాను వేశ్యా కుమారునితో కలిసి ఉండనని చెప్పిన సందర్భంలో “మీ నాన్న నన్ను పెళ్ళి చేసుకోవడానికి ముందే చాలా చిన్నతనంలో శారదను

తెచ్చుకున్నాడు. శారద అన్నా, ఆమె కొడుకన్నా మీ తండ్రికి అమిత ప్రేమ. ఈ విషయంలో నీవు కొంత ఓపిక వహించాలి" అంటూ తన కొడుకుకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుంది. అంతే కాని అవకాశం దొరికింది కదా అని కొడుకును తండ్రిపైకి గొడవకు పంపలేదు. ఎంత చెప్పినా శ్రీరంగరాజు రాజీపడక పోవడంతో అతని తండ్రికి తాను నచ్చచెబుతానని తండ్రి, కొడుకుల మధ్య సయోధ్య కుదర్చడానికి శతవిధాల ప్రయత్నించింది. కొడుకు అభిప్రాయాన్ని భర్తకు చెబుతుంది. కొడుకు చిన్నవాడిగా ఉన్నప్పుడు ఏం చేసినా చెల్లింది. ఇప్పుడు వాడు పెరిగి పెద్దయ్యాడు కాబట్టి శారదకు, అతని కొడుకుకు వేరే ఇంటిలో బస ఏర్పాటు చేయండని భర్తతో చెబుతుంది. శారదకి, ఆమె కొడుకు కృష్ణుడికి వేరే చోట ఆశ్రయం కల్పించమని భర్తకు చెబుతుందేకా  ఆమెని వదిలిపెట్టమని, ఆమెను నిరాశ్రయురాలిగా చేయమని చెప్పదు. ఎప్పుడూ శారదను పల్లెత్తు మాటకూడా అనదు. ఇది శ్రీరంగరాజు తల్లి పాత్రలోని మానవతా దృక్పథానికి నిదర్శనం.

మూరురాయగండర్ శారదను వదులుకోలేక పుత్రుడికి నీవే ఏదో ఒక విధంగా నచ్చజెప్పమని శ్రీరంగరాజు తల్లితో చెప్పిన సందర్భంలో శ్రీరంగరాజు తల్లి తన కొడుకుకి అనేక విధాలుగా నచ్చజెప్పుతుంది. అయినా శ్రీరంగరాజు మనసు మారదు. తాను రాజ్యం వదిలి విహార యాత్రకు వెళ్ళడానికి నిర్ణయించుకున్నానని శ్రీరంగరాజు తన తల్లితో అంటాడు. శ్రీరంగరాజు తల్లి అమితంగా బాధపడుతుంది. కొడుకును విడిచి తాను ఉండలేనని తానుకూడా కొడుకుతోపాటు వస్తానంటుంది. శ్రీరంగరాజు తనతోపాటు రావద్దని తల్లిని వారిస్తాడు. రాత్రి రెండు ఝాములపుడు ఇల్లు వదిలి వెళ్లిపోతాడు.

కొడుకు ఇల్లు వదిలి వెళ్లినది మొదలు శ్రీరంగరాజు తల్లి ప్రతీరోజు కొడుకు రాక కోసం ఎదురు చూస్తుంది. ఆభరణాలను త్యజించి, ఆహారాన్ని మాని చిక్కి శల్యమవుతుంది. లక్ష రూపాయలు ఖర్చు చేసి కొడుకు క్షేమంగా తన ఇంటికి రావాలని హోమాలు జరిపిస్తుంది. ఎఱుకల అమ్మాయిచేత గద్దె చెప్పించుకుంటుంది. ఇలా ప్రతిక్షణం కొడుకు బాగుగురించి ఆలోచిస్తుంది. శ్రీరంగరాజు విద్యానగరానికి సమీపంలో ఉన్నాడని రామయ్య ద్వారా తెలుసుకున్న వెంటనే పరుగుపరుగున శ్రీరంగరాజు వద్దకు వెళ్లి అతన్ని కౌగిలించుకుంటుంది. ముద్దాడుతుంది. శ్రీరంగరాజు ఇల్లు వదిలి వెళ్లినప్పటినుండి తాను పడ్డ కష్టాలను అతని ముందు

ఏకరువు పెడుతుంది. దుఃఖిస్తుంది. చివరికి సోనాబాయి, శ్రీరంగరాజుల వివాహంతో ఆనందానికి గురవుతుంది. ఇలా నవల ఆసాంతం భర్త పై భార్యకు, కొడుకు పై తల్లికి ఉన్న ప్రేమకి ప్రతీకగా శ్రీరంగరాజు తల్లి పాత్ర ప్రవర్తనను నరహరి గోపాలకృష్ణమ సెట్టిగారు చిత్రించారు.

### 4.5. తులనాత్మక పరిశీలన

సామాజిక సమస్యల చిత్రణ ప్రధాన ఉద్దేశంగా వెలువడిన దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని పాత్ర చిత్రణలో కొన్ని భేద, సాదృశ్య అంశాలు కనిపిస్తున్నాయి. ఈ భేద, సాదృశ్య అంశాలు తొలి సాంఘిక నవలల్లోని నాయక, నాయిక, ప్రతినాయక, సహాయక పాత్రల ప్రవర్తనలో ప్రతిఫలించాయి. నవల కథ, సందేశ ప్రకటనలో ప్రధాన భూమిక వహించిన పాత్రలు నాయక, నాయిక పాత్రలు కాగా కథా గమనంలో సందేశ ప్రకటనలో నాయక, నాయిక పాత్రలకు సహకరించిన పాత్రలు సహాయక పాత్రలు. నాయక, నాయిక పాత్రల పురోగతిని అడ్డుకుంటూ నవల సందేశ ప్రకటనలో భాగమైన పాత్రలు ప్రతినాయక పాత్రలు. ఈ పాత్రల మధ్య ఉన్న భేద సాదృశ్యాలను ఈ రకంగా చెప్పవచ్చు.

### 4.5.1. నాయక పాత్రలు

ఇందులేఖ నవలలో కథా నాయకుడు మాధవుడు. శ్రీరంగరాజుచరిత్ర నవలలో కథానాయకుడు శ్రీరంగరాజు. ఇందిరాబాయి నవలలో కథానాయకుడు భాస్కరరావు. ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కథానాయకుడు ప్రతాపముదలియార్. ఈ పాత్రలన్నింటిలో భాస్కరరావు పాత్ర తప్ప మిగిలిన అన్ని పాత్రలు సంపద కలిగిన కుటుంబంలో జన్మించడం జరిగింది. భాస్కరరావు ఎదుగుదలకు కావలసిన ధన సహాయం అమృతరావు రూపంలో లభించగా మిగిలిన పాత్రల ఎదుగుదలకు కావలసిన ధన సహాయం వారి పూర్వీకుల ఆస్తి రూపంలో లభించింది.

తెలుగు, తమిళ తొలి సాంఘిక నవలలు నాయక పాత్రల పేర్లతో వెలువడగా కన్నడ, మలయాళ తొలి సాంఘిక నవలలు నాయిక పాత్రల పేర్లతో వెలువడ్డాయి. ఈ విధంగా వెలువడటానికి ఆ నవలల్లోని కథా వస్తువు ప్రధాన కారణం. తెలుగు ప్రాంతంలోని ఆచార

వ్యవహారాలను వివరించడం శ్రీరంగరాజుచరిత్రలోని ప్రధాన కథా వస్తువుకాగా, తమిళ ప్రాంతంలోని ఆచార వ్యవహారాలను వివరించడం ప్రతాపముదలియార్ చరిత్ర నవలలోని ప్రధాన కాథా వస్తువు. ఈ కథా వస్తువులకు తగినట్లుగా ఈ రెండు నవలల్లో శ్రీరంగరాజు, ప్రతాపముదలియార్‌ల జీవితం ఆధారంగా ఒక పక్క నవల కథ చెబుతూ ఇంకో పక్క నాటి సామాజిక పరిస్థుతులను వివరించడం జరిగింది. కన్నడ ఇందిరాబాయి నవలలో వితంతు పునర్వివాహం ప్రధాన కథా వస్తువు కాగా, మలయాళ ఇందులేఖ నవలలో నాయర్ స్త్రీల పరివర్తన ప్రధాన కథా వస్తువు. ఈ కథా వస్తువులకు తగినట్లుగా నాయిక పాత్రల జీవిత వివరణతోపాటు కథా వస్తువుల ప్రకటన జరిగింది. ఈ విధంగా కథా వస్తువు ప్రాతిపదికగా తెలుగు, తమిళ నవలలు కథానాయకుల పేర్లతో వెలువడగా కన్నడ, మలయాళ నవలలు కథా నాయికల పేర్లతో వెలువడ్డాయి.

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని కథానాయకులందరూ వారి తల్లిదండ్రులకు ఏకైక కుమారులు మరియు విద్యావంతులు. ప్రతాపముదలియార్, శ్రీరంగరాజు సంప్రదాయ పద్ధతిలో విద్యాభ్యాసం చేయగా భాస్కరరావు, మాధవుడు ఆధునిక పద్దతిలో ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యాభ్యాసం చేయడం కనిపిస్తుంది. విద్యాభ్యాసం చేయడంవల్ల మాధవునిలో ప్రాపంచిక విషయాలను అర్థంచేసుకొనే శక్తి పెరుగుతుంది. ఇది భాస్కరరావుకు విద్య, ఉద్యోగ ఆర్జనకు దారి చూపిస్తుంది. చిన్నప్పుడు విద్య పట్ల విముఖత చూపిన ప్రతాపముదలియార్ తల్లి హిత బోధతో విద్యపట్ల మక్కువ పెంచుకుంటాడు. శ్రీరంగరాజుకు తండ్రి దగ్గరుండి గురువును నియమించి విద్యాభ్యాసం జరిపిస్తాడు. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి విద్యపై పెరిగిన ఆసక్తికి నిదర్శనం

తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో 'ప్రతాపముదలియార్' బాల్య క్రీడల సుధీర్ఘ వర్ణన కనిపిస్తుంది. తెలుగు శ్రీరంగరాజు చరిత్ర, కన్నడ ఇందిరాబాయి, మలయాళ ఇందులేఖ నవలలో కథా నాయకుల బాల్య క్రీడల వర్ణన కనిపించదు.

తెలుగు, తమిళ, మలయాళ నవలల్లో కథానాయకులు వేటకు వెళ్లిన వర్ణన కనిపిస్తుంది. కన్నడ ఇందిరాబాయి నవలలో కథానాయకుని వేట వర్ణన కనిపించదు. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి వేటకు ఉన్న ప్రాధాన్యానికి నిదర్శనం.

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని నాయక పాత్రలన్నీ ఏదో ఒక కారణంచేత ఇంటిని వదిలి దేశసంచారానికి వెళ్లడం కనిపిస్తుంది. ఈ దేశ సంచారంలో ప్రాపంచిక విషయాలు తెలుసుకుని తిరిగి తమ ఇంటికి చేరడం ప్రతీ కథానాయకుని జీవితంలో జరిగిన ఉమ్మడి సంఘటన. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి వ్యాప్తిలో ఉన్న దేశ సంచార యాత్రలకు నిదర్శనం. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు తన తండ్రికి శారద అనే వేశ్యవల్ల జన్మించిన కృష్ణుడి విషయంలో గొడవపడి ఇంటినుండి వెళ్లిపోయిన శ్రీరంగరాజు తన ప్రయాణంలో కులం ప్రధానం కాదు, గుణం ప్రధానమని తెలుసు కుంటాడు. ఈ రకమైన మానసిక ప్రవర్తన మలయాళ ఇందులేఖ నవలలోని మాధవునిలోను కనిపిస్తుంది. మాధవుడు ఇందులేఖ వేరే నంబూద్రిని వివాహం చేసుకున్నదని నమ్మి ఉత్తర భారతదేశ యాత్రకు వెళ్తాడు. ఉత్తర భారతదేశ యాత్రలో బాబూ గోవిందసేన్ వంటి వ్యాపారవేత్తల పరిచయం వల్ల తన జ్ఞానాన్ని పెంచుకుంటాడు. ఉత్తర భారతదేశ అందాలను వీక్షిస్తాడు. చివరికి తాను ఇష్టపడ్డ ఇందులేఖకి వివాహం జరగలేదని తెలుసుకుని ఇంటికి చేరుకుంటాడు. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో తన వివాహం, పిల్లల విషయంలో తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయంవల్ల బాధపడ్డ ప్రతాపముదలియార్ తన ఇంటిని వీడి విహారయాత్రకు బయలుదేరుతాడు. తన యాత్రలో అనేక విషయాలు తెలుసుకుని ఆదియూరులో కొన్ని రోజులు గడిపి తిరిగి సతీ సమేతంగా తన ఇంటిని చేరుకుంటాడు. కన్నడ ఇందిరాబాయి నవలలో అమృతరావు సలహామేరకు భాస్కరరావు తన పైచదువుల నిమిత్తం ఇంటిని వదిలిపెట్టి మద్రాసుకు వెళ్తాడు. మద్రాసులో ఉన్న కాలంలో తన జ్ఞానాన్ని పెంచుకొని ప్రభుత్వ ఉద్యోగిగా ఇంటికి చేరుకుంటాడు. ఇలా దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని నాయక పాత్రలన్నీ ఇంటిని వదిలి దేశ సంచారంలో జ్ఞానపరిధుల్ని పెంచుకొని తిరిగి ఇంటికి చేరడం దాదాపు అన్ని నవలల్లో కనిపిస్తుంది.

మానసిక పరివర్తన ఆధారంగా శ్రీరంగరాజు, మాధవుడు సంక్లిష్టత కలిగిన పాత్రలుకాగా ప్రతాపముదలియార్, భాస్కరరావు పాత్రలు సంక్లిష్టత లేని పాత్రలుగా కనిపిస్తాయి. ఈ రెండు పాత్రలు మొదటినుండి తమ లక్ష్యాలపట్ల స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగి ఉండి అలాగే ప్రవర్తించడం కనిపిస్తుంది. ప్రతాపముదలియార్ మొదటి నుండి జ్ఞానాంబాళ్‌తో

జీవితాన్ని కోరుకుంటాడు. తాను అనుకున్న విధంగా తన భార్యతో దేశ సంచార యాత్ర కొనసాగించి ఇంటిని చేరుకుంటాడు. భాస్కరరావు మొదటినుండి జీవితంలో స్థిరపడాలని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని అనుకుంటాడు. అనుకున్న విధంగా కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించి తన కుటుంబాన్ని ఆదుకుంటాడు. మాధవుడు మొదటినుండి ఇందులేఖను వివాహం చేసుకోవాలనుకుంటాడు. ఈ విషయంలో మానసిక సంఘర్షణకు లోనౌతాడు. ఇందులేఖ తనకు దక్కలేదనే అపనమ్మకంతో ఇంటికి దూరంగా వెళ్లిపోతాడు. చివరికి తన మనసు మార్చుకుంటాడు. వర్ణవ్యవస్థపై మొదటినుండి స్థిరమైన అభిప్రాయం కలిగి ఉన్న శ్రీరంగరాజు సోనాబాయిని చూసిన తరువాత తన అభిప్రాయాన్ని మార్చుకొని మానసిక సంఘర్షణకు గురౌతాడు. చివరికి వర్ణవ్యవస్థపై తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని నాయక పాత్రలన్నీ తాము ఇష్టపడ్డ కథా నాయికలను ప్రేమించి వివాహం చేసుకోవడం జరిగింది. ప్రతాపముదలియార్– జ్ఞానాంబాళ్, మాధవుడు–ఇందులేఖ, శ్రీరంగరాజు–సోనాబాయిల వివాహం మేనరిక వివాహం కాగా, భాస్కరరావు–ఇందిరాబాయిల వివాహం వితంతు పునర్వివాహం, ప్రేమ వివాహం. ఈ వివాహాలు పంతొమ్మిదవ శతాబ్దంలో ఉన్న మేనరిక వివాహాలకు, ప్రేమ వివాహాలకు నిదర్శనం.

తెలుగు, తమిళ తొలి సాంఘిక నవలల్లోని కథానాయకులు పూర్వీకుల నుండి తమకు లభించిన ఆస్తిని అనుభవిస్తూ జీవనం సాగించారు. తమ నిత్య జీవితానికి అవసరమైనంత వరకు మాత్రమే విద్యని నేర్చుకున్నారు. కాని ప్రభుత్వ ఉద్యోగాలలో చేరలేదు. ఇందుకు భిన్నంగా మలయాళ, కన్నడ భాషలలోని తొలి సాంఘిక నవలల్లోని కథా నాయకులు విద్యను నేర్చుకొని ఆ విద్య వల్ల ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారత దేశంలో ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఆనాటి యువకులలో కాలాంతరంలో పెరిగిన ఆసక్తికి నిదర్శనం.

### 4.5.2. నాయిక పాత్రలు

శ్రీరంగరాజుచరిత్ర నవల కథానాయిక సోనాబాయి(రంగనాయకి). ప్రతాప ముదలియార్ చరిత్ర నవల కథానాయిక జ్ఞానాంబాళ్. ఇందిరాబాయి నవల కథా నాయిక ఇందిరాబాయి. ఇందులేఖ నవల కథానాయిక ఇందులేఖ. ఈ కథానాయికలందరూ ఉన్నత

వంశంలో జన్మించారు. జ్ఞానాంబాళ్, ఇందిరాబాయి, ఇందులేఖ కుటుంబ పెద్దల సమక్షంలో పెరగగా, సోనాబాయి చిన్నప్పుడే తన తల్లిదండ్రులకు దూరమై లంబాడి వృద్ధ స్త్రీ సంరక్షణలో పెరుగుతుంది. సోనాబాయి చిన్నప్పుడే తన కుటుంబానికి దూరంకాగా నవల కథాగమనంలో ఇందిరాబాయి, జ్ఞానాంబాళ్‌లు కూడా తమ కుటుంబానికి దూరమవుతారు. ఇలా కుటుంబానికి దూరమైన నాయిక పాత్రలు అనేక కష్టాలు అనుభవించి తిరిగి తమ కుటుంబాన్ని చేరడం తెలుగు, తమిళ, కన్నడ తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది. మలయాళ ఇందులేఖ నవలలో కథానాయిక ఇందులేఖ కుటుంబాన్ని వీడి దూరంగా వెళ్లడం కనిపించదు. మరుమక్కతాయం (మాతృస్వామ్య కుటుంబం) సంప్రదాయం ప్రకారం తన ఇంట్లోనే ఉండి నంబూద్రిపాదు రూపంలో తనకు వచ్చిన కష్టాలను ఎదుర్కొంటుంది.

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని నాయిక పాత్రలన్నీ నవల రచన కాలంనాటి సామాజిక సమస్యలతో బాధింపబడటం అన్ని నవలల్లోను కనిపిస్తుంది. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలలో సోనాబాయి వర్ణవ్యవస్థ వల్ల అనేక కష్టాలకు గురవుతుంది. సోనాబాయి లంబాడి కులంలో పెరగటంవల్ల రాజకుటుంబంలో జన్మించిన శ్రీరంగరాజుని వివాహం చేసుకోవాలా వద్దా అన్న మీమాంసకి లోనవుతుంది. ఈ విషయం గురించి రాజసభలో చర్చకూడా జరిగుతుంది. కథ చివరికి సోనాబాయి లంబాడీ కులంలో జన్మించలేదు. రాజకుటుంబంలో జన్మించిందని తేలుతుంది. ఈ రకమైన కాకతాళీయ మార్పు రచయిత కల్పన కావచ్చు కానీ లంబాడీ స్త్రీగా జీవనం సాగించినంత కాలం సోనాబాయి ఎదుర్కొన్న వివక్ష వాస్తవం. ఇది నవల రచన కాలం నాటి వర్ణవ్యవస్థకి నిదర్శనం. కన్నడ ఇందిరాబాయి నవలలో కాథా నాయిక ఇందిరాబాయి 'సాంఘిక ఆచారాల' వల్ల అనేక కష్టాలకు గురవుతుంది. బాలిక రజస్వల కాకముందే వివాహం చేయాలన్న ఆచారం నాడు వ్యాప్తిలో ఉన్నందువల్ల ఇందిరాబాయి తనకు వివాహం వద్దంటున్నా వినకుండా ఆమె తల్లిదండ్రులు ఆమెకు బాల్యవివాహం చేస్తారు. వివాహం జరిగిన కొన్ని రోజులకే భర్త మరణించడంతో ఇందిరాబాయి బాలవితంతువుగా మారుతుంది. బాల వితంతువుగా మారిన తరువాత ఇందిరాబాయి తల్లి ఆమెను ఆచారాలు సంప్రదాయాల పేర అనేక కష్టాలకు గురి చేస్తుంది. ఆ కష్టాలను తట్టుకోలేక ఇందిరాబాయి ఇంటి నుండి పారిపోయి అమృతరావును ఆశ్రయిస్తుంది. మలయాళ ఇందులేఖ నవలలో కథా నాయిక ఇందులేఖ. మలయాళ ప్రాంతంలో నవల రచనా కాలంనాటికి అమలవుతున్న 'సంబంధం' అనే వివాహ సంప్రదాయంతో కష్టాలకు గురవుతుంది. ఈ

సంప్రదాయం ప్రకారం కుటుంబ పెద్ద పంజుమీనన్ ఇందులేఖ ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా సూరినంబూద్రిపాదుతో ఆమె వివాహాన్ని నిర్ణయిస్తాడు. ఇందులేఖ సూరినంబూద్రిపాదుని అపహాస్యానికి గురిచేసి తనకు నచ్చిన మాధవున్ని వివాహం చేసుకుంటుంది. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కథానాయిక జ్ఞానాంబాళ్ తండ్రి సంప్రదాయ ఆలోచనలవల్ల తన భర్త ప్రతాపముదలియార్‌కు దూరమవుతుంది. ధైర్యంతో తన తండ్రిని వదిలి భర్తను చేరుకుంటుంది. తమిళ, మలయాళ, కన్నడ తొలి సాంఘిక నవలల్లోని నాయిక పాత్రలు ధైర్య సాహసాలు ప్రదర్శించి తమ అభీష్టం మేరకు తమకు నచ్చిన వరున్ని వివాహం చేసుకోగా, తెలుగు తొలి సాంఘిక నవలలోని కథానాయిక 'సోనాబాయి' పూర్తిగా సంప్రదాయబద్ధంగా ఆలోచిస్తుంది. కథానాయకుడు శ్రీరంగరాజు ఎంత చెప్పిన కులసంకరానికి ఒప్పుకోదు. చివరికి తానుకూడా ఉన్నత వంశానికి చెందిన స్త్రీ అని తెలిసిన తరువాత మాత్రమే శ్రీరంగరాజుతో వివాహానికి అంగీకరిస్తుంది. ఇది పంతొమ్మిదవ శతాబ్దం నాటికి తెలుగు ప్రాంతంలో వ్యాప్తిలో ఉన్న వర్ణవ్యవస్థ ప్రాబల్యానికి నిదర్శనం. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవల కథానాయిక జ్ఞానాంబాళ్ తన అభీష్టం నెరవేర్చుకునే క్రమంలో తన తండ్రిని ఎదిరిస్తుంది. పురుషవేషం ధరించి ధైర్యంగా రాజ్యపాలన చేస్తుంది. తన భర్తను కష్టాలనుండి కాపాడుతుంది. మలయాళ ఇందులేఖ నవలలోని కథానాయిక ఇందులేఖ మాధవున్ని వరించే క్రమంలో తన ఇంట్లో ఉన్న వారందరినీ ఎదిరిస్తుంది. మాధవుడు అసత్య ప్రచారాన్ని నమ్మి దేశ సంచారానికి వెళ్లిన సందర్భంలో కుటుంబానికి అండగా నిలబడుతుంది. కన్నడ ఇందిరాబాయి నవలలో కథానాయిక ఇందిరాబాయి బాలవితంతువుగా ఉండి తన తల్లిదండ్రులను ఎదిరించి తాను ఇష్టపడ్డ భాస్కరరావును వివాహం చేసుకుంటుంది.

మానసిక పరివర్తన ఆధారంగా ఇందిరాబాయి, ఇందులేఖ, జ్ఞానాంబాళ్ పాత్రలు సంక్లిష్టత లేని పాత్రలు కాగా సోనాబాయి సంక్లిష్టత కలిగిన పాత్ర. ఇందిరాబాయి, ఇందులేఖ, జ్ఞానాంబాళ్ పాత్రలు చదువుకున్న పాత్రలు కాగా సోనాబాయి చదువుకోని పాత్ర. సమస్య ఎదురైన సందర్భంలో మానసిక సంఘర్షణ సోనాబాయి పాత్రలో కనిపిస్తుంది. వర్ణవ్యవస్థ విషయంలో సోనాబాయి సంఘర్షణకి గురికావడం దీనికి ఉదాహరణ. ఇందిరాబాయి, ఇందులేఖ, జ్ఞానాంబాళ్ పాత్రలు సమస్యలని ధైర్యంగా ఎదుర్కొనడం కనిపిస్తుంది. ఈ పాత్రలలో సుధీర్ఘ మానసిక సంఘర్షణ కనిపించదు.

### 4.5.3. ప్రతినాయక పాత్రలు

నాయక, నాయిక పాత్రల అభివృద్ధికి ఆటంకాలు ఏర్పరుస్తూ ప్రతీక్షణం నాయక, నాయిక పాత్రలకు పరీక్షలు పెట్టే ప్రతినాయక పాత్రలు. దక్షిణ భారత తొలి సాంఘిక నవలన్నిటిలో ఉన్నాయి. ఈ ప్రతినాయక పాత్రలు ప్రవర్తించిన తీరులో కొంత వైవిధ్యం కనిపిస్తుంది.

కన్నడ ఇందిరాబాయి నవలలో 'అంబాబాయి, కథానాయకుడు భాస్కరరావు కుటుంబంపై కక్ష పెంచుకొని అతని ఎదుగుదలని అడ్డుకోడానికి ప్రయత్నిస్తుంది. కథ చివరికి తన మనసును మార్చుకుంటుంది. ఈ రకమైన మానసిక పరివర్తన. తెలుగు, తమిళ, మలయాళ తొలి సాంఘిక నవలల్లోని ప్రతినాయక పాత్రలన్నింటిలో కనిపిస్తుంది. కన్నడ ఇందిరాబాయి నవలలో స్త్రీ పాత్ర ప్రతినాయక పాత్రగా ఉండగా తెలుగు, తమిళ, మలయాళ తొలి సాంఘిక నవలల్లో పురుష ప్రతినాయక పాత్రలు కనిపిస్తాయి. మలయాళ ఇందులేఖ నవలలో ఆది నుండి మాధవునిపై కోపం పెంచుకున్న 'పంజుమీనన్' తన సంప్రదాయబద్ధమైన ఆలోచనలతో ఇందులేఖ, మాధవులను అనేక కష్టాలకు గురిచేస్తాడు. తన నిర్ణయాలవల్ల తన సొంత మనవరాలు ఇందులేఖ కష్టపడుతున్నదని తెలిసి కథాంతంలో పంజుమీనన్ తన ఆలోచనలని మార్చుకుంటాడు. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలలో భీమానాయకుడు తనకు దక్కని సోనాబాయి ఎవరికీ దక్కకూడదని కొండవీటి దొరకు సోనాబాయి జాడ చెబుతాడు. కొండవీటి దొర సోనాబాయిని అపహరించి శ్రీరంగరాజుని, సోనాబాయిని కష్టాలకు గురి చేస్తాడు. స్త్రీలోలుడిగా ఉన్న కొండవీటి దొర తాను అపహరించిన సోనాబాయి తనకు చెల్లెలి వరుస అవుతుందని తెలిసి సిగ్గుపడతాడు. మానసిక పరివర్తనకు లోనవుతాడు.

తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కథానాయిక జ్ఞానాంబాళ్‌ను ఇష్టపడ్డ 'పూంగావూరు తహసిల్దారు' ఆమెను వివాహం చేసుకోవాలనుకుంటాడు. వివాహం చేసుకోవడం కుదరకపోవడం వల్ల జ్ఞానాంబాళ్‌ని తన మనుషులతో ఎత్తుకెళ్తాడు. ఈ విషయం తెలిసి ప్రతాపముదలియార్ ఆమెను పూంగావూరు తహసీల్దారు మనుషులనుండి కాపాడతాడు. ఈ సంఘటన తరువాత జ్ఞానాంబాళ్ తండ్రి తన మనసు మార్చుకొని జ్ఞానాంబాళ్‌ని ప్రతాపముదలియార్‌కి ఇచ్చి వివాహం జరిపిస్తాడు. ఇలా ప్రతినాయకుడు తన స్వార్థం కోసం

చేసిన పని కథానాయకుడు, నాయికల వివాహానికి దారి తీసిన సందర్భం తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కనిపిస్తుంది. తెలుగు, తమిళ నవలల్లోని ప్రతినాయక పాత్రలు నవల కొంత భాగానికే పరిమితం కాగా కన్నడ, మలయాళ నవలల్లోని ప్రతినాయక పాత్రలు నవల ఆసాంతం నాయక, నాయిక పాత్రలతో ప్రయాణం చేయడం కనిపిస్తుంది.

### 4.5.4. సహాయక పాత్రలు

నాయక, నాయిక పాత్రలకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తూ నవల కథా గమనంలో నాయక, నాయిక పాత్రలకు సహకరించిన సహాయక పాత్రలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలలన్నింటిలో ఉన్నాయి. ఎల్లప్పుడు నాయక, నాయిక పాత్రల క్షేమాన్ని కోరడం నాయక, నాయిక పాత్రల క్షేమాన్ని ఉద్దేశించి ప్రవర్తించడం ఈ సహాయక పాత్రల ప్రవర్తనలో కనిపిస్తుంది. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలలో రామయ్య కథానయకుడు శ్రీరంగరాజుకు అండగా ఉంటాడు. దేశ సంచారంలో శ్రీరంగరాజు వెంటే ఉండి అతన్ని కష్టాల నుండి కాపాడతాడు. శ్రీరంగరాజు నుండి ఎటువంటి ప్రతిఫలం ఆశించడు. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో 'కనకసభ' చిన్నప్పటినుండి ప్రతాపముదలియార్‌తో ఉంటాడు. విద్యాభ్యాసం జరిగే సందర్భంలో ప్రతాపముదలియార్ దెబ్బలు తాను తిని ప్రతాపముదలియార్‌కి విద్య విలువ తెలిసేలా చేస్తాడు. ఇంటిని వీడిన ప్రతాపముదలియార్ తన భార్యతో కలిసి దేశ సంచారం చేస్తూ తన ఊరికి వచ్చిన సందర్భంలో అతన్ని, అతని భార్యను కంటికి రెప్పలా చూసుకుంటాడు. వేటాడుతూ అడవిలో దారి తప్పి ప్రతాపముదలియార్ విక్రమపురికి చేరిన సందర్భంలో కనకసభ నిద్రాహారాలు మాని అడవిలో ప్రతాపముదలియార్ కోసం వెతుకుతాడు. చివరికి ప్రతాపముదలియార్ తన ఇంటికి రావడంతో సంతోషిస్తాడు. దేశ సంచారంలో ప్రతాపముదలియార్‌కి కావలసిన ఆర్థిక సహాయం కనకసభ రూపంలో లభిస్తుంది. ఎల్లవేళలా ప్రతాపముదలియార్ క్షేమాన్ని కనకసభ కాంక్షిస్తాడు.

కన్నడ ఇందిరాబాయి నవలలో ఇంటిని వీడిన ఇందిరాబాయి, భాస్కరరావు పాత్రలు అమృతరావును ఆశ్రయిస్తారు. అమృతరావు సహాయ సహకారాలు అందడం వల్లనే కథానాయకుడు భాస్కరరావు చదువుకొని కలెక్టర్ అవుతాడు. కథా నాయిక చదువుకొని భాస్కరరావుని వితంతు పునర్వివాహం చేసుకుంటుంది. అమృతరావు పాత్ర లేకుండా

భాస్కరరావు, ఇందిరాబాయి పాత్రల ఎదుగుదలను ఊహించలేం. అమృతరావు తాను చేసిన సహాయానికి ప్రతిగా ఇందిరాబాయి, భాస్కరరావు బాగుండాలని కోరుకుంటాడేగాని వారినుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడు.

మలయాళ ఇందులేఖ నవలలో ఇంటిని వీడిన మాధవునికి కావలసిన సహాయ సహాకారాలు బాబూగోవిందసేన్ అనే వ్యాపారి రూపంలో లభిస్తాయి. కలకత్తాలో ఉన్న వ్యాపారి బాబూగోవిందసేన్ తనని పులి బారినుండి కాపాడాడన్న కారణంతో బాబుగోవిందసేన్ ఉత్తర భారతదేశ యాత్రలో మాధవునికి అండగా నిలిస్తాడు. అతనికి కావలసిన ధన సహాయాన్ని అందిస్తాడు. మాధవుడు సురక్షితంగా ఇంటికి చేరేవరకు ప్రతీక్షణం అతన్ని సంరక్షిస్తాడు. మాధవుడు ఇంటికి చేరిన తరువాత అతని వివాహానికి బహుమానాలు కూడా పంపిస్తాడు. ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఎదుటివారికి సహాయం చేసే గుణం కలిగిన వ్యక్తులకు నిదర్శనం ఈ సహాయక పాత్రలు.

*****

అధ్యాయం- 5

# 5. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు సామాజికాంశాలు

## 5.0. నవల సామాజికాంశాలు

సమాజాన్ని వీడి సాహిత్యం అభివృద్ధి చెందదు. సమాజానికి ప్రతిబింబంగా సాహిత్యం వెలువడుతుంది. దీనికి నవల మినహాయింపు కాదు. రాల్ఫ్ ఫాక్స్ నవలకి, సమాజానికి ఉన్న సంబందాన్ని గురించి చెబుతూ "నవల వ్యక్తిని చిత్రిస్తుంది. వ్యక్తి సమాజంతో, ప్రకృతితో జరిపే పోరాటాన్ని చిత్రించే మహాకావ్యమే నవల" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 2015:30) అన్నారు. "మానవునికి తన దేశకాల సమాజ పరిస్థితులతో సంబంధం ఉంటుంది. కాబట్టి నవలలో పృష్ఠ భూమిగా దేశకాల సమాజ చిత్రణను చేయవలసి ఉంటుంది". (సుజాతారెడ్డి, ముదిగంటి 2017: 163). ఈ సమాజ చిత్రణ భూమికగా దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు ఆవిర్భవించాయి.

నవల కళాత్మక రచన. నవలలో కొంత కాల్పనికత ఉంటుంది. వ్యాపార నవలల్లో, కాలక్షేప నవలల్లో ఈ కాల్పనికత అధికంగా ఉంటుంది. సాంఘిక నవలల్లో వాస్తవికతను వీడిన కాల్పనికత ఉండదు. వాస్తవ అంశాలు భూమికగా కాల్పనిక సంఘటనలు సాంఘిక నవలల్లో గూడు కట్టుకుంటాయి. సమకాలీన అంశాల ఆధారిత వర్ణనలు, సన్నివేశాలు, సంభాషణలు, కథ, కథావస్తువు మిగిలిన నవలల నుండి సాంఘిక నవలలని వేరు పరుస్తాయి. "సాంఘిక నవలను స్థూలంగా సమకాలీన బాహ్యాంతర జీవితాలను విభిన్న కోణాల నుండి సాధ్యమైనంత సమగ్రంగా చిత్రించే ప్రక్రియగా నిర్వచించవచ్చు. ఏ సమస్యనైనా సంఘజీవి అయిన మానవుడు ఏ విధంగా ఎదుర్కొంటున్నడు. ఏవిధంగా ఎదుర్కొనాలి. అనే విషయాన్ని సాంఘిక నవల చిత్రిస్తుంది. వ్యక్తి సాంఘిక జీవితంలో అతని ప్రవర్తనను, ఇతరులతో అతని సంబంధ బాంధవ్యాలను నిర్దేశించే ఆచారవ్యవహారాలు, మతవిశ్వాసాలు చిత్రించే నవల సాంఘిక నవల. సమకాలీన జీవితం, సాంఘిక ఆచార సంప్రదాయాలు, సంఘ జీవితానికి ప్రాతినిధ్యం వహించే పాత్రలు, వాస్తవ జీవితాను ఐమైన సంవాదాలు, వ్యవహారిక భాష ఈ ఐదు లక్షణాలు సాంఘిక నవలకి అనివార్యాలు." (మృణాళిని.సి.1988: 26,27) అంటూ సాంఘిక నవల

స్వరూప, స్వభావాల గురించి ఆచార్య. సి. మృణాళిని గారు చెప్పిన అంశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలలకి సరిగ్గా సరిపోతాయి. ఇందులేఖ, ఇందిరాబాయి, ప్రతాపముదలియార్ చరిత్ర, శ్రీరంగరాజుచరిత్ర నవలలు పంతొమ్మిదవ శతాబ్దం నాటి సామాజిక అంశాలకు దర్పణంగా వెలువడ్డాయి.

భారతదేశ చరిత్రలో పంతొమ్మిదవ శతాబ్దానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ కాలాన్ని చరిత్రకారులు సాంస్కృతిక పునరుజ్జీవన కాలంగా అభివర్ణించారు. ఈ కాలంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రాజా రాంమ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగంపంతులు. వంటి సంఘసంస్కర్తలు సనాతన భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో మార్పులు తీసుకురావడానికి కృషి చేశారు. పంతొమ్మిదవ శతాబ్దంలోనే ఈ సంఘసంస్కర్తలు భారతీయ సంప్రదాయాలలో మార్పులు తీసుకురావడానికి ఎందుకు ప్రయత్నించారు. భారతీయ సనాతన ఆచారాలు కట్టుబాట్లకువ్యతిరేకంగా ఎందుకు పోరాటం చేశారు, అని వితర్కిస్తే. పంతొమ్మిదవ శతాబ్దంలో ఈ మార్పులు రావడానికి ఆనాడున్న సామాజిక పరిస్థితులు భూమికగా నిలిచిన వైనం స్పష్టమవుతుంది. 1498 మే 17న పోర్చుగీసు నావికుడు వాస్కోడగామ సముద్రమార్గం గుండా కాలికట్ చేరుకున్నాడు. ఈ అన్వేషణ భారతదేశ చరిత్రలో నూతన మార్పులకు నాందీ వాక్యంగా పనిచేసింది. ఈ సముద్ర మార్గం వల్ల భారత దేశానికి ఇతర దేశాలతో వ్యాపార సంబందాలు ఏర్పడ్డాయి. వ్యాపార నిమిత్తం పోర్చుగీసువారు, డచ్ వారు, ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చారు. గోవా ప్రధాన కేంద్రంగా పోర్చుగీసువారు, కలకత్తా ప్రధాన కేంద్రంగా బ్రిటీష్ వారు, నాగపట్టణం ప్రధాన కేంద్రంగా డచ్చివారు, పాండిచ్చేరి ప్రధాన కేంద్రంగా ఫ్రెంచీవారు తమ వర్తకాన్ని కొనసాగించారు. ఇలా వర్తకం నిమిత్తం భారతదేశానికి వచ్చిన విదేశీయులను ఇక్కడి సంపద ఆకర్షించింది. భారతదేశంపై ఆధిపత్యం సంపాదించి ఇక్కడి సంపదను కొల్లగొట్టాలన్న ఆలోచన వారిలో బయలుదేరింది. ఫలితంగా వ్యాపారం నిమిత్తం వచ్చిన విదేశీయులు ఇక్కడి రాజుల అంతర్గత యుద్ధాలలో తలదూర్చడం ప్రారంభించారు. ఆంగ్లేయులు డచ్, పోర్చుగీసు స్థావరాలను ఆక్రమించడమే కాక మైసూరు, కర్ణాటక, మహారాష్ట్ర యుద్ధాలలో పాల్గొని భారతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి ఆంగ్లేయులు భారత దేశంలో అనేక ప్రాంతాలలో తమ స్థావరాలను ఏర్పాటు చేసుకుని బలమైన వారుగా ఎదిగారు. ఈ రకమైన చారిత్రక మార్పులు సాహిత్యం పై ప్రభావాన్ని చూపాయి.

తమ అవసరాల నిమిత్తం ఆంగ్లేయులు ఆంగ్లవిద్యను భారతదేశంలో ప్రవేశపెట్టారు. ఆంగ్ల విద్య అభ్యసించిన భారతీయ విద్యావంతులకు ఇతర దేశాల సంస్కృతి, సంప్రదాయాలతో పరిచయం ఏర్పడింది. ఫలితంగా భారతదేశ సమాజంలో ఉన్న లోపాలు వారికి తెలిసాయి. అందుకే రాజా రామ్మోహన్ రాయ్, దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవచంద్రసేన్ వంటి వారు ఇక్కడి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ పోరాటంలో సంఘసంస్కర్తలు సమాజ శ్రేయస్సును సాహిత్య రచనల మాధ్యమంగా తెలిపే ప్రయత్నం చేశారు. ఫలితంగా భారతీయ సాహిత్యంలో ప్రజలందరికీ అర్థమయ్యే వచన రచనలు బయలుదేరాయి. అందులో భాగంగానే పంతొమ్మిదవ శతాబ్దంలో భారతీయ సాహిత్యంలో నవల ఆవిర్భవించింది. నవల ఆవిర్భవించే కాలానికి భారతదేశంలో సంఘసంస్కరణ ఉద్యమం ప్రారంభ దశలో ఉంది. నాటి సామాజిక పరిస్థితులని ప్రజలకి తెలియపరిచే ఉద్దేశంతో రచయితలు నవలలు రచించారు. ఫలితంగా పంతొమ్మిదవ శతాబ్దం నాటి సామాజిక పరిస్థితులకు దర్పణంగా నాటి నవలలు వెలువడ్డాయి. పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చిన నవలని తులనాత్మకంగా పరిశీలిస్తే నాటి సామాజిక పరిస్థితులని తెలుసుకోవచ్చు అన్న దృక్కోణం నుండి పంతొమ్మిదవ శతాబ్దంలో తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలల్లో ప్రస్తావితమైన సామాజిక అంశాలను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది. ఈ అంశాలు పంతొమ్మిదవ శతాబ్దం నాటి దక్షిణ భారతదేశంలోని సామాజిక పరిస్థితులను తెలుసుకోవడానికి ఉపకరిస్తాయి.

## 5.1. పరిపాలన

మొఘల్ చక్రవర్తుల పరిపాలన అంతమైన తరువాత భారతదేశంలో బ్రిటీష్ పాలన ప్రారంభమైంది. పంతొమ్మిదవ శతాబ్దంలో భారతదేశంలో బ్రిటీ  వలస పాలన కొనసాగింది. బ్రిటీష్ పరిపాలన కన్నా పూర్వం “దక్షిణాన దక్కన్ సుల్తానులకు చెందిన బహమని రాజ్యం ఒక రాజ్యాధికారం కలిగిన సముదాయంగాను, విజయనగర తదితర రాజ్యాల కోవకు చెందిన రాజ్యాలు మరో అధికార సముదాయం గాను ఉండేవి. ఒక వైపున బహమనీ సుల్తానులకు చెందిన అహ్మద్ నగర్, బీరార్ బీజాపూర్, బీదర్, గోల్కొండ రాజ్యాలు మరో వైపు విజయనగర తదితర రాజ్యాల అధికార సముదాయము తమ తమ అధికార ప్రాబల్యాలను నెలకొల్పడానికి నిరంతరం ఘర్షణ పడుతూ ఉండేవి. దక్షిణ భారతదేశంలోని ఇలాంటి రాజకీయ అనిశ్చిత పరిస్థితులు బాబర్ భారతదేశంపై దండెత్తి రావడానికి, మొఘల్ సామ్రాజ్యాన్ని 1526లో

స్థాపించడానికి అనుకూలించాయి. బాబర్ ద్వారా స్థాపితమైన మొఘల్ సామ్రాజ్యం చివరి మొఘల్ చక్రవర్తి బహదుర్ షా లొంగి పోవడంతో అస్తమించింది." (వైకుంఠం, యెల్లంపల్లి. 2011:14,117). "18వ శతాబ్దాంతానికి దేశం మొగలాయిల సామ్రాజ్య వాద తత్వం నుంచి బ్రిటీష్ వారి వలస వాద తత్వానికి మారిపోయింది. బ్రిటీష్ వారు తమ వర్తకాభివృద్ధితో పాటు సైనిక విజయాలను సాధించి అనేక ప్రాంతాలను ఆక్రమించారు. కర్ణాటకయుద్ధాలు, మైసూరు, మరాఠా యుద్ధాలు అందులో సాధించిన విజయాల వల్ల బ్రిటీష్ వారు అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకోగలిగారు. దౌత్య మంతనాలు జరిపి మరికొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. సైన్య సహకార పద్ధతి, రాజ్యసంక్రమణ సిద్ధాంతం వంటి వాటి ద్వారా అనేక ఇతర ప్రాంతాలు వారి ఆదీనం అయ్యాయి. బ్రిటీష్ వారు భారత దేశంలోని వివిధ ప్రాంతాలను ఆక్రమించిన వెంటనే పరిపాలన, సివిల్ సర్వీస్, సైన్యం, పోలీసు, న్యాయస్థానాలు, భూమి శిస్తువిధానాలు వంటి అన్ని విషయాలలోనూ పాశ్చాత్య పద్ధతుల మేరకు మార్పులు ప్రవేశపెట్టారు." (శేషన్, ఎస్. ఎస్. 1999: 61) ఈ మార్పుల వల్ల భారతదేశ పరిపాలనలో గవర్నర్ వ్యవస్థ, సివిల్ సర్వీసు, సైన్యం, పోలీసు, న్యాయస్థానాలు వంటి నూతన అంశాలు చోటు చేసుకున్నాయి.

### 5.1.1. గవర్నర్ వ్యవస్థ

"1600 సంవత్సరంలో బ్రిటీషురాణి ఎలిజబెత్ నుండి అనుమతి పొంది స్థాపించబడ్డ బ్రిటీషు తూర్పుఇండియా వర్తక సంఘానికి మొఘల్ చక్రవర్తి జహంగీర్ సూరత్ రేవును వర్తకానికై ఇచ్చాడు. క్రమేణా మచిలీపట్నం, మద్రాసు, బొంబాయి, కలకత్తా, కాశింబజారు, కడలూరు, విశాఖపట్టణం వంటి అనేక రేవులను బ్రిటీషువారు పొందారు. (శేషన్. ఎస్. ఎస్. 1999: 11) నౌకా బలంపై ఆధారపడిన తూర్పుఇండియా వర్తక సంఘానికి చెందిన వర్తకులు తమ బలాన్ని పుంజుకొని ఆర్థికంగా బలపడ్డారు. కంపెనీ ఉద్యోగులు భారతదేశాన్ని వదిలి ఇంగ్లాండుకు వెళ్లిన తరువాత అక్కడ విలాసవంతమైన జీవితం గడపడం ప్రారంభించారు. "భారతదేశంలోని సంపాదనతో "బ్రిటీషునవాబు"గా పేరు పొందిన ఉద్యోగులు అనేక స్థిరాస్తుల క్రయ విక్రయాలలో పెట్టుబడులు పెట్టారు. వీరి మూలంగా వస్తువుల ధరలన్నీ అధికమయ్యాయని అనేవారు. ఉదాహరణకు రాబర్ట్ క్లైవ్ ఒకసారి లండన్ బజారుకు వెళ్లి ఒక దర్జీ దుకాణంలో రెండువందల చొక్కాలకు ఒకేసారి ఆర్డరిచ్చాడట. కంపెనీ వ్యవహారాలు

సక్రమంగా లేవని ప్రభుత్వంభావించి రెగ్యులేటింగ్ చట్టాన్ని (1773) పార్లమెంటులో ప్రవేశపెట్టింది" (శేషన్. ఎస్. ఎస్. 1999:61). "ఈ చట్టంప్రకారం భారతదేశంలో ఈస్ట్ ఇండియాకంపెనీ అధికారాలు 1600-1772 మధ్యకాలంలో ఆక్రమించిన భూభాగాలన్నింటిపై సంపూర్ణ పాలనాధికారాన్ని పార్లమెంటు నియమించిన గవర్నర్ జనరల్ అతని కౌన్సిల్ సభ్యులు పొందారు. వారన్ హేస్టింగ్స్ మొదటి గవర్నర్ జనరల్ గా, క్లావరింగ్, మోన్సన్, బార్వెల్, మరియు ఫిలిప్ ఫ్రాన్సిస్ కౌన్సిల్ సభ్యులుగా పదవీ బాధ్యతలుచేపట్టారు". (వైకుంఠం, యల్లంపల్లి 2011:159) ఈ విధంగా భారతదేశంలో గవర్నర్ ల పరిపాలన ప్రారంభమైంది.

### 5.1.1.1. ప్రతిస్పందనలు

తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో నవాబు, గవర్నర్ ల పరిపాలన గురించి ప్రస్తావించబడింది. ఇందిరాబాయి నవలలో ఎలిజబెత్ రాణి పరిపాలన గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇందులేఖ నవలలో మాధవుడు, గోవింద కుట్టి, గోవింద ఫణిక్కర్ ల మధ్య నడిచిన సంభాషణలో ఆంగ్ల ప్రభుత్వ ప్రస్తావన వస్తుంది. ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ తాత నవాబుల వద్ద దివానుగా పనిచేశాడు. (జయప్రకాష్.ఎస్(అ). 2008:1). నవాబుల కాలంలో రాజు మారువేషంలో వచ్చి తన రాజ్యంలోని ప్రజల స్థితిగతులు తెలుసుకున్న విధానాన్ని ప్రతాపముదలియార్ చరిత్ర నవల ప్రారంభంలో రచయిత పాఠకులకి వివరించాడు. మద్రాసు గవర్నర్ దేశసంచారం చేస్తూదారి తప్పగా కనక సభ గవర్నర్ ని సత్యపురి వద్ద ఉన్న వారి గుడారాలవద్దకి తీసుకువెళ్లిన సన్నివేశం ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో చిత్రమైంది.

"ఒక పర్యాయం చెన్నపురి గవర్నర్ దేశ సంచారం చేస్తూ సత్యపురికి వచ్చి గుడారాలు వేసుకొని పరివారంతో కొన్ని రోజులు అక్కడే నివాసం ఉన్నారు. అప్పుడు ఒకరోజు ఆయన మాత్రం ఒంటరిగా వాహనారూఢుడై ఊరంతా చుట్టి చూసి తిరిగి గుడారానికి వెళ్లడానికి దారి తెలియనందున అక్కడ నిలబడి ఉన్న కనకసభను పిలిచి గుడారానికి వెళ్లే మార్గాన్ని చెప్పమని అడిగారు. ఆయన గవర్నర్ అనే విషయం కనకసభకి తెలియనందున నేను అంత దూరం ఎలా నడిచి వచ్చి దారి చూపించగలను అని ప్రశ్నించాడు. వెంటనే గవర్నర్ తమతోపాటు బండిలో కూర్చోమని చెప్పడం వల్ల కనకసభ బండి ఎక్కి దారి చూపిస్తూ వెళ్లాడు. కనకసభ మాట్లాడిన

మాటలకు గవర్నర్ ఆశ్చర్యపడి అతనికి కనకాభిషేకం చేసి పంపించాడు.” (జయ ప్రకా.ఎస్(అ). 2008: 21) కనకసభ వివాహ సమయంలో కనకసభ దేవరాజపిళ్ళై సొంతకుమారుడే అని సుందరఅణ్ణి మద్రాసు వెళ్లి గవర్నర్ ముందు వాదిస్తుంది. (జయప్రకాశ్. ఎస్(అ). 2008:131). ఇలా అనేక సందర్భాలలో తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో గవర్నర్ ని గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

కన్నడ ఇందిరాబాయి నవలలో ప్రత్యక్షంగా గవర్నర్ ని గురించిన ప్రస్తావన కనిపించదు. కాని నవల రచించే కాలానికి కర్ణాటక ప్రాంతం ఆంగ్లేయుల పాలనలో ఉన్నట్లు తెలిపే విధంగా బ్రిటిష్ ఎలిజబెత్ రాణి  ప్రస్తావన కనిపిస్తుంది. భీమారావు సుందరరావుని హత్య చేస్తాడు. ఈ హత్యని విచారించడానికి వచ్చిన ఫౌజుదార్ జవాన్లతో బ్రిటిష్ పరిపాలనలో ఇలాంటి హత్య జరగడం రాణికి అవమానమని అంటాడు. “ఇటువంటి నగరంలో రాత్రీ, పగలు పోలీస్ జవాన్లు పహారా కాసే వాళ్లు గల్లీ, గల్లీలో తిరుగుతూ ఉండగా ఇటువంటి ఘోరమైన తప్పులు జరగడం, వాటిని విచారించి దోషులను పట్టుకోక పోవడం సిగ్గుపడాల్సిన విషయం. శ్రీ మహారాణి సామ్రాజ్య మహిమకు మచ్చరాకూడదు. మంజప్పశెట్టి హత్య గురించి ఇప్పటివరకు వివరాలు సేకరించనందుకు నగర పోలీసులకు ముఖ్యంగా నాకు వచ్చిన అపకీర్తిచాలు. ఇప్పటికైనా మేల్కొనండి. జాగ్రత్తగా ఉండండి.” ( వెంకటరావు, గుల్వాడి. 1962:28).

ఇందులేఖ నవలలో కాంగ్రెస్ మహాసభ గురించి మాట్లాడుకుంటున్న సందర్భంలో గోవిందన్ కుట్టి ఆంగ్లేయ ప్రభుత్వం గురించి గోవింద ఫణిక్కర్ కి చెప్తాడు.“ఇంగ్లీషు బాగా మాట్లాడే కొంతమంది ధనవంతులైన హిందువులు, ముస్లింలు ఇంగ్లాండ్ లో ఉన్న గవర్నమెంటు మాదిరిగా ఇండియాలోని గవర్నమెంటును ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఏ అధికారం లేని ఒక సంఘంగా ఏర్పడ్డారు. పరస్పరం స్తుతించుకొని, గొప్పలు చెప్పుకుని వ్యర్థంగా ఘర్షణలు చేస్తూ పొద్దు గడిపే సంఘమే ఈ కాంగ్రెస్ సభ. గోవిందన్ కుట్టి అభిప్రాయాన్ని మాధవుడు ఖండిస్తాడు. కాంగ్రెస్ మహాసభ బ్రిటిష్ వారి వల్ల భారతీయ సమాజంలో మార్పులు రావాలని కాంక్షించిందని చెప్తాడు. కొంతమంది బాహాటంగా ఆంగ్లేయ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. వాళ్లు ఆంగ్లేయ గవర్నర్ ల సహనాన్ని పరీక్షిస్తున్నారు, అని మాధవుడు అంటాడు.“ఇంగ్లీషు గవర్నర్లు, ప్రభుత్వ అధికారులు గొప్ప సహన గుణం కలిగిన వారుగా లేకుంటే ఇటువంటి

అవమానకరమైన నేరారోపణలు విని వారు ఎలా ఓర్చుకుంటారు. మన దగ్గర స్నేహభావాన్ని ఎలా చూపిస్తారు. ఈ రకమైన లోటుపాట్లు మనలో కొంతమందికి లేకుండా ఉన్నట్లయితే కాంగ్రెస్ దీనికి ఎంతో ముందుగానే దీనికన్నా బలమైనదిగా ఏర్పడేది." (జయప్రకాష్. ఎస్(అ).2016:327). ఈ సంఘటనలు బ్రిటీష్ గవర్నర్ ల పరిపాలన భారతీయ పరిపాలనా రంగంలో తెచ్చిన నూతన మార్పులకి నిదర్శనాలు.

### 5.1.2. సివిల్ సర్వీసు

"మనదేశంలో సివిల్ సర్వీసుకు పునాది వేసినవాడు లార్డ్ కారన్ వాలిసు. ఇతను కంపెనీ అధికారులు తీరిక సమయాల్లో కొనసాగించిన సొంత వ్యాపారాన్ని నిషేధించాడు. వారు బహుమానాల రూపంలో తీసుకునే లంచాలను రద్దుపరచాడు. వారికి మంచి జీతాలు ఇప్పించి ఉద్యోగ నిబంధనలను మెరుగుపరిచాడు. లార్డ్ వెల్లస్లీ భారతదేశంలోని బ్రిటీషు ఉద్యోగులకు తర్ఫీదు ఇవ్వడానికై ఒక ప్రత్యేక కళాశాలను ఏర్పాటు చేశాడు. 1806లో కంపెనీ డైరెక్టర్లు ఇంగ్లాండులోని హైలీబ్యారీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇది 1858 వరకు కొనసాగింది. హిందూ దేశంలో ఉద్యోగంలో చేరాలనుకున్న ప్రతీ ఒక్కరు హైలీబ్యారీ కళాశాలలో చేరి చదవాలనే నియమం ఉండేది. 1853 చార్టర్ చట్టంప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే ఉన్నత ఉద్యోగాలు ఇచ్చేవారు." (శేషన్, ఎస్. ఎస్. 1999: 65). ఈ సివిల్ సర్వీసులో బహిరంగ పోటీ విధానాన్ని ప్రవేశపెట్టే ఉద్దేశంతో లార్డ్ మెకాలే కమిటీని 1854లో ఏర్పాటు చేశారు. భారతదేశంలో చదువుకున్న వర్గానికి చెందినవారు సివిల్ సర్వీసులో చేరడానికి ఆసక్తిని చూపారు. ఆంగ్లవిద్యను అభ్యసించినవారు సివిల్ సర్వీసు పరీక్షలకి హాజరవ్వడానికి ఇంగ్లాండు వెళ్లారు. చదువుకున్నవారికి సివిల్ సర్వీసు ఉద్యోగంలో చేరాలనే లక్ష్యం ఉండేది. ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో సివిల్ సర్వీసు గురించిన ప్రస్తావన ఉంది. ఇందిరాబాయి నవలలో సుందరరావు మరణానంతరం అతని కుమారుడు భాస్కరరావు అమృతరావు పర్యవేక్షణలో ఆంగ్ల విద్యను అభ్యసిస్తాడు. సివిల్ సర్వీసు పరీక్షలో తర్ఫీదు పొందడానికి విదేశాలకి వెళ్తాడు. తాను మద్రాసులో బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత సి.ఎస్. పరీక్ష రాయడానికి విదేశాలకి వెళ్తున్నట్లు తన తల్లితో చెప్తాడు.

"**భాస్కరరావు:** నేను విదేశాలకి వెళ్లాలి.

**సుశీల:** ఎక్కడికి.

భాస్కరరావు: విదేశాలకి.

సుశీల: విదేశమంటే అదెక్కడ.

భాస్కరరావు: విదేశమంటే మన మహారాణిగారు ఉండే రాజ్యం.

సుశీల: అక్కడికి వెళ్లడం ఎందుకు?

భాస్కరరావు: సి.ఎస్. అనే పరీక్ష రాయడానికి.

సుశీల: మరి ప్రయాణం ఎలాగా? అక్కడికి చేరుకోవడానికి ఎన్ని రోజులు పడుతుంది.

భాస్కరరావు: ఇక్కడినుండి బొంబాయికి వెళ్లాలి. అక్కడి నుండి పడవెక్కి విదేశానికి వెళ్లడానికి మూడు వారాల సమయం పడుతుంది." (వెంకటరావు, గుల్వాడి. 1962: 99) ఈ సంభాషణ నవలా రచనా కాలానికి సి.ఎస్. పరీక్ష రాయాలన్న తపన నాటి యువకుల్లో ఎలా ఉండేదో తెలుపుతుంది.

ఇందులేఖ నవలలో మాధవుడు సి.ఎస్. పరీక్ష నిమిత్తం సన్నద్ధమవుతాడు. మద్రాసు కోర్టులో ఉద్యోగం చేస్తూ సి.ఎస్. పరీక్షలను రాస్తాడు. మాధవుడు ఉత్తరభారతదేశ యాత్రా నిమిత్తం వెళ్లినపుడు కలకత్తా నగరంలో బాబుగోవిందసేన్ అనే కుబేరునితో అతనికి పరిచయం ఏర్పడుతుంది. అతని ఇంట్లో మాధవుడు పదిరోజులు బస చేస్తాడు. బాబుగోవిందసేన్ ఇంటినుండి బొంబాయికి వెళ్లేటప్పుడు బాబుగోవిందసేన్‌కి మాధవునికి మధ్య నడిచిన సంభాషణలో సి.యస్. పరీక్ష గురించిన ప్రస్తావన వస్తుంది.

"**గోవిందసేన్:** మనం చాలా సన్నిహిత స్నేహితులమయ్యాము. మీరు మమ్మల్ని ఎడబాసి వెళ్లడం చాలా కష్టంగా ఉంది. మీ అంతస్తు, సామర్థ్యం, మర్యాద వీటిని గురించి నాకు తెలిసినంతవరకి ఆలోచించి చూసినప్పుడు మీరు మదరాసు గవర్నమెంటులో గొప్ప ఉద్యోగం చేస్తారని నేను నమ్ముతున్నాను. నా కుమారున్ని వచ్చే ఏడాది సివిల్ సర్వీసులో తీసుకుంటారని ఎదురు చూస్తున్నాను. అయితే నాకు ఉద్యోగంలో చేరాలని కోరిక లేదు. అయినప్పటికీ అతనికి ఉద్యోగం చేయాలని ఆశ ఉంది. కుటుంబ వృత్తిలోనూ, వ్యాపారంలోనూ, మనుషులను వెతుక్కుంటూ వెళ్లడంలోనూ అతనికి అంత ఆసక్తి లేదు. మీ మనసులోని దిగులంతా తొలిగిపోయి మీరు అతడు ఒకే సమయంలో సివిల్ సర్వీసులో చేరాలి. మీరు తిరిగి ఇంటికివెళ్లి

ఆత్మీయులైన కుటుంబ సభ్యులతో సంతోషంగా, సుఖంగా ఉన్నారనే వార్తను వినాలని నేను సర్వశక్తులను కలిగిన భగవంతున్ని ప్రార్థిస్తున్నాను.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 255) ఈ మాటలు వ్యాపారవేత్తల కుమారులు కూడా తండ్రులు వద్దన్నా వినకుండా సివిల్ సర్వీసు ఉద్యోగాల్లో చేరడానికి ఇష్టపడినట్లుగా తెలుపుతున్నాయి.

### 5.1.3. పోలీసు వ్యవస్థ

“పరిపాలన యంత్రాంగానికి ప్రాధాన్యత ఇచ్చినట్లే కంపెనీ పాలకులు పోలీసు విభాగానికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. కారన్ వాలీసు తన పరిపాలన సంస్కరణలో పోలీసు విభాగాన్ని సృష్టించడానికి గొప్ప కృషి చేసాడు. సుమారు ఇరవై మైళ్ళ విస్తీర్ణంగల ప్రతీ ప్రాంతానికి ఒక పోలీసు ఠాణాను స్థాపించి, ఒక్కొక్క ఠాణాకు ఒక దరోగ అనే పోలీసు అధికారిని నియమించాడు. జిల్లా విభాగంలో పోలీసు సంస్థను పర్యవేక్షించడానికి జిల్లా సూపరిండెంటు ఉండేవాడు. కాని స్థానికులను అటువంటి ఉద్యోగాలకు దూరంగా ఉంచారు. హిందూ దేశంలో శాంతిభద్రతల బాధ్యత చాలా వ్యయ ప్రయాసలతో కూడినదని కంపెనీ అధికారులు గుర్తించారు. 1858 తరువాత పోలీసు విభాగం పునర్వ్యవస్థీకరమై పటిష్టమైంది.” (శేషన్,ఎస్.ఎస్. 1999: 66).

ఇందిరాబాయి, ఇందులేఖ నవలలో పంతొమ్మిదవ శతాబ్దంలో నూతనంగా ఏర్పడ్డ పోలీసు వ్యవస్థ ప్రస్తావన ఉంది. ఇందిరాబాయి నవలలో భీమారావు సుందరరావుని హత్య చేసిన సందర్భంలో పోలీసులు జరిపే విచారణ సుధీర్ఘంగా పేర్కొనబడింది.

“విష ప్రయోగంవల్ల సుందరరావు మరణించాడని గుర్తించి అతని జీర్ణాశయాన్ని కెమికల్ పరీక్ష నిమిత్తం పంపిస్తారు. సాయంకాలం కవాతు నిర్వహించే బొగ్గు, జారప్పలను పిలిచి భీమారావును జాగ్రత్తగా గమనిస్తూ ఉండండని ఫౌజుదార్ చెప్తాడు. బొగ్గు, జారప్ప అంతకుముందు రోజు రాత్రి తాము పహారా కాస్తున్న సందర్భంలో భీమారావు తమకి డబ్బు ఇవ్వజూపినట్లు చెప్తారు. ఈ విషయాలన్నీ ఫౌజుదార్ జిల్లా సూపరిండెంట్‌కి చెప్తాడు. జిల్లా సూపరిండెంట్ ఈ కేసుని సరిగ్గా పరిష్కరిస్తే ఫౌజుదార్‌కి రెండవక్లాసు పదోన్నతి లభిస్తుందని చెప్తాడు. ఈ మాటలు విన్న ఫౌజుదార్ ఆ రోజు రాత్రి తాను పనిచేసే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి

జమేదార్ నిక్లాంవ్ ఫెర్నాండ్, జవానులు ఆంతోన్ సోజన్ బొగ్గు, జారప్పలను పిలిచి వారికి తగిన సూచనలను ఇస్తాడు. చివరికి భీమారావు సుందరరావుని హత్య చేసినట్లుగా అతనే ఒప్పుకునేలా చేస్తాడు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 29-32) ఈ హత్య అన్వేషణలో పోలీసులు నిర్వహించిన పాత్ర వల్ల పోలీసు వ్యవస్థలో పంతొమ్మిదవ శతాబ్దం నాటికి ఉన్న ఉద్యోగ అంతరువులు తెలుస్తున్నాయి.

ఇందిరాబాయి నవలలో మాధవుడు కలకత్తానుండి రైలులో వస్తున్న సందర్భంలో 'షియాఅలీఖాన్' అనే దొంగ అతని వస్తువులని దొంగలిస్తాడు. మాధవుడు ఈ విషయం గురించి స్టేషన్ మాస్టారుకు చెప్పగా అతను పోలీసులచేత విచారణ జరిపిస్తాడు.

"ప్లాటుఫారమ్ మీద పోలీసు వాళ్లెవరూ కనిపించలేదు. పోలీసు కచేరికి చేరుకున్నప్పుడు తలుపు మూసి ఉంది. ఆ వైపున మన బ్రిటీష్ ఇండియాకు చేరిన పోలీసులు లేరు. ఈ దొంగతనం జరిగింది కూడా బ్రిటీషు ఇండియాకి చేరని ఒక ప్రాంతంలోనే. గోపీనాథబెనర్జీ టెలిగ్రామ్ వచ్చిన తరువాత స్టేషన్ మాస్టర్ వెంటనే పోలీసు వాళ్లకై మనిషిని పంపించాడు. పావుగంటలో ఆ ప్రాంతానికి చెందిన పోలీసుదొరగారి ఒక హెడ్ ఆఫీసరు కొంతమంది హెడ్ కానిస్టేబుళ్లు వచ్చిచేరారు. హెడ్ ఆఫీసరు ఒక ముస్లీం. ఆకారం భయంగొల్పేదిగా ఉంది. స్టేషన్‌కు రాగానే స్టేషన్ మాస్టరు హెడ్ ఆఫీసర్‌తో "మలయాళ దేశం నుండి ఒక రాజు వచ్చియున్నారు. వారి దగ్గరి నుండి ఒక లక్ష విలువైన వస్తువులు దొంగలించబడ్డాయి. గోపీనాథ బెనర్జీకి కావలసిన వారు వీరు. ఈ గదిలో ఉన్నారు. వీరొక పెద్దరాజు. వివరాలు చెప్పి వారే బెనర్జీగారికి టెలిగ్రామ్ ఇచ్చారు. దానికి బదులు తంతి వచ్చింది. ఇదిగో చూడండి అని చెప్పి టెలిగ్రామ్ హెడ్ ఆఫీసర్ కు ఇచ్చాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 265, 66) స్టేషన్ మాస్టర్ చెప్పిన తరువాత పోలీసులు విచారణ జరుపుతారు కానీ దొంగ దొరకడు. అప్పటివరకు మాధవున్ని పట్టించుకోని స్టేషన్ మాస్టర్ తాను గోపీనాథ బెనర్జీ స్నేహితుడినని చెప్పగానే అతనికి విశేష మర్యాదలు చేస్తాడు. తానే పోలీసు వారిని పిలిపించి మాధవున్ని రాజుగా వారికి పరిచయం చేయిస్తాడు. దీనికి కారణం గోపినాథబెనర్జీ ఆ స్టేషన్‌కి వచ్చిన ప్రతీసారి డబ్బులు ఇస్తుంటాడు. ఈ విషయం స్టేషన్ మాస్టర్ స్వయంగా మాధవునికి చెప్తాడు. ఈ అంశం ప్రభుత్వ ఉద్యోగులలోని లంచగొండి

తనానికి నిదర్శనం. ఈ సంఘటనలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి పోలీసు వ్యవస్థ ఏర్పడిందనడానికి నిదర్శనాలు.

### 5.1.4. న్యాయ వ్యవస్థ

"18వ శతాబ్దం ప్రారంభంలో మద్రాసు, బొంబాయి, కలకత్తానగరాలలో మేయర్ కోర్టులు స్థాపితమయ్యాయి. బెంగాలు కంపెనీకి దివాని అధికారాలు సంక్రమించినపుడు క్రిమినల్, న్యాయ విచారణ అధికారం నవాబుకి వదిలిపెట్టడం జరిగింది. పన్ను వసూలు చేసే అధికారం, సివిల్ నేరవిచారణ కంపెనీ చేపట్టింది. వారన్ హెస్టింగ్స్ న్యాయ పరిపాలన విధానాన్ని మార్పు చేశాడు. జిల్లాలో స్థానిక సివిల్ న్యాయస్థానాలను కలెక్టరు ఆధీనంలో ఉంచాడు. అతనికి సహాయ పడటానికి హిందూ ముస్లీం అధికారులు నియమితమయ్యారు. చిన్నచిన్న ఫిర్యాదులకు సబార్డినెట్ న్యాయాధిపతులు ఉండేవారు. వీరిపై రాష్ట్రీయ న్యాయస్థానాలు, వాటిపై "సదార్ దివానీ అదాలత్" ప్రత్యేకంగా స్థాపితమైంది" (శేషన్. ఎస్.ఎస్. 1999: 67). ఈ విధంగా పంతొమ్మిదవ శతాబ్దం నాటికి కలకత్తా, బొంబాయి, మద్రాసువంటి మహానగరాల్లో కోర్టులు స్థాపితమయ్యాయి. దీనితో భారతీయ న్యాయ వ్యవస్థలో న్యాయవాదులకు, న్యాయస్థానాలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. "బ్రిటీషువారు రాకపూర్వం న్యాయపరిపాలనలో కులతత్వవిషయాలు ప్రధానపాత్ర పోషించాయి. అటువంటి వ్యత్యాసాలను తొలగించారు. కాని బ్రిటీషు న్యాయస్థానాలలో కూడా లోపాలు లేకపోలేదు. అవి చాలా వ్యయంతోకూడినవి. కోర్టు ఫీజులు ఎక్కువ. న్యాయవాదులు అమితంగా ప్రజల నుండి డబ్బులు వసూలు చేసేవారు. సామాన్య ప్రజానీకానికి బ్రిటీషు న్యాయస్థానాలు అవరోధాలుగానే ఉండేవి." (శేషన్.ఎస్.ఎస్. 1999: 68). ఈ అంశాలన్నీ దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి. బ్రిటీషు న్యాయస్థానాలలో న్యాయ విచారణ ఎలా జరిగింది? తీర్పులు ఎలా చెప్పారు? న్యాయవాదులు, న్యాయాధిపతులు ప్రజల నుండి డబ్బులు ఎలా వసూలు చేసారు? న్యాయస్థానాలలో ఎలాంటి మార్పులు రావాలని ఆనాటి సంఘసంస్కర్తలు ఆకాంక్షించారు? వంటి అంశాలు ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో చర్చకి వచ్చాయి.

### 5.1.4.1. ప్రతిస్పందనలు

ఇందిరాబాయి నవలలో భీమారావు, సుందరరావుని హత్య చేసిన సందర్భంలో పోలీసులవద్ద భీమారావు తాను హత్య చేసినట్లుగా ఒప్పుకుంటాడు. అదే సందర్భంలో భీమారావుని కలిసిన "అత్తూర సూరప్పయ్య" అనే వకీలు న్యాయస్థానంలో తాను భీమారావు కేసును వాదించి అతన్ని నిర్దోషిగా బయటికి తెస్తానని చెప్తాడు."మీరు జరిగిన విషయాలన్నీ వివరంగా నాకు చెప్పండి. మద్రాసు, కలకత్తా, బొంబాయి, అలహాబాదు హైకోర్టుల తీర్పులన్నీ నావద్ద ఉన్నాయి. వాటినే ఇప్పుడు నేను మార్గ మధ్యమంలో చూశాను." (వెంకటరావు, గుల్వాడి. 1962: 45). అంటూ భీమారావుకి నమ్మకాన్ని కలిగిస్తాడు. సూరప్పయ్యను నమ్మిన భీమారావు అతనిని తన ఇంటికి తీసుకు వెళ్లి కొంత ధనాన్ని ఇస్తాడు. ధనాన్ని స్వీకరించిన సూరప్పయ్య ఈ హత్య మీరు కాకుండా మీ వద్ద పనిచేసే గోపణ్ణ చేశాడని పోలీసుల వద్ద చెప్పమంటాడు. భీమారావు చేసిన నేరాన్ని గోపణ్ణవైపు మరలించడానికి పథకం రచిస్తాడు. భీమారావు భార్య అంబాబాయి గోపణ్ణని తన ఇంటికి పిలిచి నేరం ఒప్పుకోవలసిందిగా చెప్పి అతనికి డబ్బులు ఇస్తుంది. గోపణ్ణ పోలీసుల వద్ద నేరం ఒప్పుకుంటాడు. పోలీసులు, భీమారావు, గోపణ్ణలను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తారు. జరిగిన విషయాలన్నీ విన్న మెజిస్ట్రేట్ భీమారావు, గోపణ్ణలను పోలీసుల రిమాండ్‌కి పంపుతాడు. సూరప్పయ్య చేసేదిలేక చేతులెత్తేస్తాడు. ఈ విషయం తెలిసిన భీమారావు యజమాని నరసింహశాస్త్రి 'శేషగిరిరావు' అనే వకీలుని భీమారావు కేసు వాదించవలసిందిగా కోరుతాడు. అందుకుగాను వెయ్యిరూపాయలను ఇస్తాడు. శేషగిరిరావు కేసును కోర్టులో వాదించి భీమారావుని నిర్దోషిగా బయటికి తీసుకువస్తాడు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 55). ఈ సంఘటన డబ్బుంటే హత్య చేసికూడా తప్పించుకోవచ్చు అనే సందేశాన్ని ఇస్తుంది.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో దేవరాజపిళ్ళైకి కనకసభ సొంత కుమారుడా కాదా అన్న వ్యాజ్యాన్ని విచారించడానికి వచ్చిన ముగ్గురు న్యాయాధిపతులలో ఇద్దరు కలెక్టర్ ఇంట్లో బస చేస్తారు. కలెక్టర్ వద్ద పనిచేసే శిరస్తాదారు దేవరాజపిళ్ళై అతని చెల్లెలి కూతురిని తనకి ఇచ్చి వివాహం చేయలేదని దేవరాజపిళ్ళైపై పగబడతాడు. దేవరాజపిళ్ళై జమీందారిని జప్తు చేయడానికి ప్రయత్నిస్తుంటాడు. కలెక్టర్ వద్ద బస చేసిన న్యాయాధిపతులకు కలెక్టర్ ద్వారా లేని పోని విషయాలు చెప్తాడు. కలెక్టర్ మాటలను నమ్మిన న్యాయాధి పతులు దేవరాజపిళ్ళైకి

వ్యతిరేకంగా తీర్పు చెప్తారు. దేవరాజపిళ్ళై తరపున సాక్ష్యం చెప్పిన రెండు వందల మంది జమీందార్లను బంధించి వారిని ద్వీపాంతరాలకు పంపాలని, వారి ఆస్తిని జప్తు చేయాలని తమ తీర్పులో న్యాయాధిపతులు పేర్కొంటారు. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ ప్రతాపముదలియార్ తల్లి సుందరఅణ్ణి జమీందార్ల భార్యలతో కలిసి మద్రాసుకు వెళ్తుంది. గవర్నర్‌ని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తుంది. "నమ్మకమైన సాక్షీదారు సాక్ష్యం ఒకటి సరిపోతుందని న్యాయ శాస్త్రంలో చెప్పబడి ఉండగా విశ్వసనీయులు, గౌరవపాత్రులు అయిన రెండు వందల మంది సాక్షుల వాంగ్మూలాలను అవమానించడం ఎంత పెద్ద అన్యాయం. పాళేగార్లకు విరోధులుగా ఉన్న ఆ కలెక్టరు ఇంట్లో ఇద్దరు విచారణకర్తలు బసచేసి విచారించడం ధర్మమా?" (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 132) అంటూ సుందఅణ్ణి గవర్నర్ వద్ద తెలపగా గవర్నర్ శిరస్తాదారును ఉద్యోగం నుండి తొలగిస్తాడు. ఆ న్యాయ విచారణ కర్తలను ద్వీపాంతరాలకు పంపిస్తాడు. ఈ సంఘటన న్యాయ విచారణలో జరిగిన అవకతవకలకి నిదర్శనం.

విక్రమపురిని పురుషవేషంలో జ్ఞానాంబాళ్ పరిపాలిస్తున్న సందర్భంలో న్యాయ వ్యవస్థలో రావలసిన మార్పుల గురించి వేదనాయగంపిళ్ళైగారు, జ్ఞానాంబాళ్ పాత్ర ముఖతహ సుధీర్ఘంగా వివరించారు.

"న్యాయవాది సకలశాస్త్రాలలోను, దైనందిన వ్యవహారాల్లోనూ ప్రవీణుడై ఉండాలి. వకీలు అన్యాయపు వాజ్యాలను అంగీకరించరాదు. ఒక వ్యాజ్యాన్ని వకీలు అంగీకరించినప్పుడు అది దొంగ వ్యాజ్యమని తెలియకుండా ఉండి తరువాత ఎప్పుడైనా తెలిస్తే దానిని వెంటనే వదిలి వేయడం వకీలు బాధ్యత. వ్యాజ్యం మదింపును, వకీలు శ్రమను, వాది నిర్వాహకత్వాన్ని యోచించి దానికి తగినట్లు క్రమమైన ఫీజు వకీలు తీసుకోవాలిగాని అధిక ఫీజు అడగడం క్రమంకాదు. దేవతలు తరుచూ బలి కోరినట్లు కొంత మంది వకీళ్లు ఒక వ్యాజ్యంలో తరచూ ఫీజు అడిగినట్లు వింటున్నాము. ఎలాగంటే వాళ్లు వ్యాజ్యం ప్రారంభంలోనే మొత్తం ఫీజు తీసుకొని తరువాత వ్యాజ్యం మొదటి విచారణకు రాగానే వేరే ఫీజు ఇవ్వాలనీ ఇవ్వక పోతే కోర్టులో హాజరు కామని పిడివాదం చేస్తుంటారు. వాదికి వేరే మార్గం లేక అప్పుడు కూడా ఫీజు చెల్లించ వలసి ఉంటుంది. పిదప సాక్షి విచారణ జరిగేటప్పుడు వకీళ్లు కోర్టుకు రామని పదుకుంటారు. లేక వేరొక కోర్టులో అధిక ఫీజు వస్తుందని పయన సన్నాహం చేస్తుంటారు. అప్పుడు కూడా వాళ్లకు దక్షిణ సమర్పించి వశం చేసుకోవలసి ఉంటుంది. ఈ విధంగా సివిల్ విషయంలో కాని,

క్రిమినల్ విషయంలో కాని విచారణ జరిగే ప్రతి రోజూ కొత్త కొత్తగా వకీళ్లకు కానుకలు సమర్పించి వాదులు భిక్షగాళ్లుగా మారుతున్నారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 194-199). "ఆంగ్లేయ ప్రభుత్వంలో స్థాపించబడిన తమిళ న్యాయస్థానాలలో కొంత మంది తమిళ న్యాయవాదులు తమిళంలో వాదించకుండా ఆంగ్లంలో వాదిస్తున్నారని మనం విని ఉన్నాం. దేశభాష తమిళం, కోర్టులో ప్రయోగించే భాష తమిళం, న్యాయాధిపతి తమిళుడు, వాదించే వకీలు తమిళుడు. మిగిలిన వకీళ్లు, వాదులు మొదలైన వాళ్లంతా తమిళులే. ఈ విధంగా అంతా తమిళమయంగా ఉండగా ఈ వకీళ్లు ఎవరి ప్రీతి కోసం ఆంగ్లంలో వాదిస్తున్నారో తెలియడంలేదు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 194-200). ఈ మాటలు పంతొమ్మిదవ శతాబ్దం నాడు తమిళ ప్రాంతంలోని కోర్టు స్వరూప, స్వభావాలకి దర్పణం పడుతున్నవి.

ఇందులేఖ నవలలో నంబూద్రిపాదు ఒక వ్యాజ్యం విషయంలో కోర్టుకి హాజరవ్వాల్సి ఉంటుంది. ఈ విషయం నంబూద్రిపాదు ఇంటి వ్యవహారాలని చూసే దాసన్ మీనన్ నంబూద్రిపాదుకు చెప్తాడు. అప్పటికే ఇందులేఖ ఇంటికి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న నంబూద్రిపాదు తాను కోర్టుకి రాలేనని దాసన్ మీనన్‌తో చెప్తాడు. ఉళ్ళాట్టిల్ పంజుమీనన్ ఆస్తి విషయంలో వేసిన దావాలో నంబూద్రిపాదు సాక్షిగా ఉన్నారని కాబట్టి తప్పకుండా కోర్టుకు వెళ్లాలని దాసన్ మీనన్ చెప్తాడు.(జయప్రకాశ్, ఎస్(అ). 2016: 94, 95) ఈ సంవాదన పంతొమ్మిదవ శతాబ్దం నాటికి ఆస్తి వివాదాలు కోర్టుద్వారా పరిష్కరించబడిన విధానానికి నిదర్శనం.

### 5.1.5. రాజ్య సంక్రమణ సిద్ధాంతం

"1846-1856 మధ్యకాలంలో భారతదేశ గవర్నర్ జనరల్‌గా ఉన్న లార్డ్ డల్హౌసీ బ్రిటీషు సామ్రాజ్య విస్తరణలో భాగంగా రాజ్యసంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఈ కొత్త సిద్ధంతం ప్రకారం సంస్థానాధీశులకు పుత్రులులేని సందర్భంలో ఆ రాజ్యాలు దత్తపుత్రులకు చందవని, అవి బ్రిటీష్ కంపెనీకి సంక్రమిస్తాయని ప్రకటించాడు. ఈ చట్టానికి దత్తత స్వీకార రద్దు చట్టమని పేరు. డల్హౌసి ఈ సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టిన ఆ సమయంలో అనేక సంస్థానాధీశులు కుమారులు లేకుండా మరణించిన కారణంగ బ్రిటీషు అధికారం బహుళంగా వ్యాప్తి చెందింది. ఝాన్సీ, సాతారా, సంబల్‌పూర్, నాగపూర్, జైత్‌పూర్, భాగల్, ఉదయ్‌పూర్

మొదలైన అనేక సంస్థానాలు రాజ్యసంక్రమణ సిద్ధాంతానుసారం బ్రిటీషువారి ఆధీనమయ్యాయి.” (శేషన్, ఎస్.ఎస్. 1999: 57, 58).

ఈ రాజ్యసంక్రమణ సిద్ధాంతానికి సంబంధించిన సంఘటన ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో చిత్రితమైంది. ఆదియూరు అనే పాళ్యానికి అధికారి దేవరాజపిళ్ళై. ఇతని కుమారుడు కనకసభ. కనకసభ చిన్నప్పుడే తండ్రికి దూరమవుతాడు. కనకసభని చిన్నప్పుడు తీసుకెళ్లిన ‘ముత్తువీరుడు’ చాలా సంవత్సరాల తరువాత కనకసభ బ్రతికే ఉన్నాడని దేవరాజపిళ్ళైకి చెప్తాడు. దేవరాజపిళ్ళై కనకసభని కలుసుకుంటాడు. అప్పటికే కనకసభకి వివాహ వయస్సు రావడం వల్ల అతనికి వివాహం గురించి దేవరాజపిళ్ళై ‘ఆదియూరు’ వివాహ సంప్రదాయం గురించి, పుత్రులు లేరన్న కారణం చేత తన జమీందారిని కలెక్టరు జప్తు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను కనకాచల ముదలియార్‌కి వివరిస్తాడు.

“పాళైపట్టు సంప్రదాయం ఏమిటంటే మాలో వివాహం జరగడానికి ముందు కలెక్టరు, రెవెన్యూబోర్డు మొదలైన అధికార్లకు తెలియజేసి వాళ్ల అనుమతిపొంది పెళ్లి చేయడం రివాజుగా వస్తోంది. నేను ఆ అధికారులకు ఎన్నో ఉత్తరాలు రాసినప్పటికీ ఏ ఒక్క ప్రత్యుత్తరము రాలేదు. ఆ కలెక్టరు కచ్చేరి శిరస్తదారు కోరినట్లుగా నేను నా చెల్లెలి కూతురిని అతనికి ఇచ్చి పెళ్లి చేయలేదనే ఆగ్రహంతో కనకసభ పెళ్లి జరగకుండా చేయడానికై అతను ఏదేదో విఘ్నాలు కల్పిస్తూ వస్తున్నాడు. అతని దుర్బోధనలకు చెవియొగ్గి కలెక్టరు నా పాళియపట్టు జమీందారీని జప్తు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నేను జప్తి చేయకూడదనడానికి తగిన న్యాయ సంబంధమైన చట్టాలను చూపిస్తూ ప్రభుత్వం వారికి వినతీపత్రం సమర్పించాను. దానికి అనుకూలమైన ప్రత్యుత్తరం వస్తుందని రోజూ ఎదురు చూస్తూ ఉన్నాను. కనకసభ నా కొడుకు కాదని, ప్రభుత్వాన్ని ఏమార్చడానికి నేను అతన్ని కొడుకువలె పెంచుతూ వస్తున్నట్లు ఆ శిరస్తాదారు కుట్రపన్ని కలెక్టరు మొదలైన అధికారులకు బోధిస్తూ వస్తున్నాడు. ఎలాగూ కొన్ని రోజులకు కనకసభ పెళ్లికి అనుమతివస్తుందని నమ్ముతున్నాను. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 114,115). ఈ సంఘటన బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యసంక్రమణ సిద్ధాంతాన్ని ప్రభుత్వ అధికారులు తమ స్వార్థం కోసం ఎలా ఉపయోగించుకున్నారో తెలుపుతుంది.

### 5.2. సామాజిక జీవనం

దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు సంఘసంస్కరణ ఉద్దేశంతో రచించబడ్డాయి. శ్రీరంగరాజుచరిత్రలో శ్రీరంగరాజు లంబాడీ స్త్రీని వివాహమాడటం ప్రధాన ఇతివృత్తంకాగా, రాజశేఖర చరిత్రలో రాజశేఖరుని ఇతివృత్తం భూమికగా నాటి సామాజిక పరిస్థితులు, మూఢ నమ్మకాలు వివరించబడ్డాయి. తమిళ ప్రతాపముదలియార్ చరిత్రలో ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్ ప్రేమ ఇతి వృత్తంతో పాటు ఉప కథల రూపంలో నాటి సమాజ విషయాలు ప్రస్తావనకి వచ్చాయి. మలయాళ ఇందులేఖ నవలలో మాధవుడు, ఇందులేఖ ప్రేమ వృత్తాంతంలో సమానంగా నంబూద్రి, నాయర్ కుటుంబాలలోని విషయాలు, మాధవుడు చేసిన దేశ సంచారంలో భాగంగా పంతొమ్మిదవ శతాబ్దంలో ఉత్తర, దక్షిణ భారతదేశంలో ఉన్న సామాజిక అంశాలు ప్రస్తావనకి వచ్చాయి.

### 5.2.1. వర్ణవ్యవస్థ

కులవ్యవస్థ నుండి వేరు చేసి భారతీయ సమాజాన్ని చూడలేం. ఈ కులవ్యవస్థ, వర్ణవ్యవస్థకి అవినాభావ సంబంధం ఉంది. వర్ణవ్యవస్థ మూలాలు కనుగొనడం కష్టం.

> "బ్రాహ్మ ణోస్య ముఖమాసీత్, బాహూరాజన్యఃకృతః ఊరూ తదస్యయద్
> వైశః పద్భ్యాగ్ం శూద్రో అజాయత-రుగ్వేదం 10-90-12" (శర్మ, ఆర్.యస్. 1992: 20)

అన్న ఋగ్వేదంలోని పురుష సూక్తంలో మొట్టమొదట వర్ణ వ్యవస్థ ఆవిర్భావం గురించి తెలుపబడింది. ఈ సూక్తం ప్రకారం విరాట్ పురుషుని ముఖం నుండి బ్రాహ్మణుడు, బాహువుల నుండి క్షత్రియుడు, తొడల నుండి వైశ్యుడు, కాళ్ళ నుండి శూద్రుడు ఉద్భవించారు. ఈ విభజన తరువాతి కాలంలో సమాజాన్ని విభజించింది. వివిధ తెగలతో కూడిన ఆదిమ సమాజం ఈ విభజన తరువాత వర్ణాలుగా విభజించబడింది. ఈ వర్గ, వర్ణ విభజనకి పూర్వం శ్రమ విభజన జరిగింది. ఆదిమ సమాజంలో "ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు వివిధ వృత్తుల్లో నైపుణ్యం సంపాదించవలసిన అవసరం మానవునికి కలిగింది. ఈ ప్రయత్నంలోనే వివిధ వృత్తులు ఏర్పడ్డాయి. ఈ వృత్తులు కొంత కాలానికి కుటుంబ వృత్తులుగా మారిపోవడంతో మనిషి పుట్టుకే వృత్తిని నిర్ణయించే స్థితి కలిగింది. ఒకరు చేపట్టిన వృత్తిని ఇంకొకరు చేపట్టక పోవడంతో క్రమంగా కులవ్యవస్థ రూపుదిద్దుకుంది. ప్రారంభంలో ప్రకృతి సవాళ్లను

ఎదుర్కొనేందుకు ఏర్పడిన వృత్తులే చివరికి వర్ణ వ్యవస్థకు కారణమైయ్యాయి.” (రఘునాథరావు, పి. 2010: 18). ఋగ్వేదకాలం నాటి శ్రమ విభజన తరువాతి కాలంలో వర్ణ విభజన, వర్గ విభజనగా మారి నేడు కులవ్యవస్థగా ఆవిర్భవించింది. ఈ చతుర్వర్ణ వ్యవస్థలో ఎవరి పనులు వారికి నిర్దేశించబడ్డాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ఉన్నత వర్గంవారుగా శూద్రులు నిమ్న వర్గంవారుగా చూడబడ్డారు. ఈ విధానం పంతొమ్మిదవ శతాబ్దం వరకు కొనసాగుతూ వచ్చింది. అందుకే భారతదేశంలో అడుగు పెట్టిన ఆంగ్లేయులు తొలుత ఇక్కడి సమాజాన్ని, సమాజంలో వర్గ విభేదాలను అర్థం చేసుకోవడం ప్రారంభించారు. “తమ దేశం చట్టాలతోగాని, ప్రయోజనాలతోగాని ఎక్కువ వ్యతిరేకంగా లేని సంస్థల్ని అర్థం చేసుకొని అనుసరించినప్పుడే భారతదేశంలో తమ వ్యాపార ప్రయోజనాలను బెంగాల్‌లో చేజిక్కించుకున్న రాజకీయ అధికారాన్ని రక్షించుకోవడానికి వీలుంటుంది”. (శర్మ, ఆర్.యస్. 1992: 1). ప్రాచీన భారత చరిత్రకు సంబంధించి ప్రచురించబడ్డ తొలి ఆంగ్ల గ్రంథం ‘ఎ కోడ్ ఆఫ్ జెంటూ లాస్’ (1776) పీఠికలో రాసిన వాక్యాలు ఇందుకు నిదర్శనం. ఈ వర్ణ వ్యవస్థకి సంబంధించిన వర్ణన, దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలో కనిపిస్తుంది.

### 5.2.1.1. వర్ణ వ్యవస్థ ఆవిర్భావ సిద్ధాంతాలు

వర్ణ వ్యవస్థ ఆవిర్భావానికి సంబంధించి మూడు సిద్ధాంతాలు వ్యాప్తిలో ఉన్నాయి.

**“i. వర్ణ సిద్ధాంతం:**

భారతదేశానికి ఆర్యులు వచ్చిన తరువాత భారతీయ సమాజంలో మార్పు వచ్చింది. తెల్లటి వర్ణం కలిగిన ఆర్యులు తమ ఆధీనంలోకి వచ్చిన నల్లటి రంగు గల ద్రావిడులని అల్పులుగా చూడడం ప్రారంభించారు. వర్ణ సంకరణ భయం వల్ల ఆర్యులు వర్ణ వ్యవస్థ సృష్టించారు. ఆర్యులతో ఇతర జాతుల సంబంధాన్ని నిషేధించారన్నది ఈ సిద్ధాంతం యొక్క భావన.

**ii. పురుషసూక్త సిద్ధాంతం:**

ఋగ్వేదంలోని పురుష సూక్తంలో ఒక పురాణ గాథ ఉంది. ఈ ఇతిహాసం ప్రకారం దేవతలు సృష్టి ఆధిలో ఆది పురుషుని యజ్ఞ పశువుగా చేసి అతని శరీరాన్ని నాలుగు భాగాలుగా ఖండించారు. ఖండించిన నాలుగు భాగాలనుండి నాలుగు వర్ణాలు ఉద్భవించాయి. నోటి నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని ఈ గాథ తెలుపుతుంది.

### iii. శ్రమవిభాగ సిద్ధాంతం:

శ్రమ విభజనలో భాగంగా వృత్తులు ఏర్పడ్డాయి. ఈ వృత్తుల నుండి వర్ణాలు ఏర్పడ్డాయని ఈ సిద్ధాంతం తెలుపుతుంది". (రఘునాథరావు, పి. 2010: 17, 18).

### 5.2.1.1.1. శ్రీరంగరాజుచరిత్ర - వర్ణ వ్యవస్థ

వర్ణ వ్యవస్థ ఆవిర్భావానికి సంబంధించిన సిద్ధాంతాల చర్చ శ్రీరంగరాజుచరిత్రలో కన్పిస్తుంది. తన మాటని తండ్రి కాదన్నాడన్న కోపంతో శ్రీరంగరాజు ఇంటిని వదిలి దేశ సంచారానికి వెళ్తాడు. అతడు సంచరిస్తూ ఆలంపూర్ గ్రామం చేరుకుంటాడు. అక్కడ బ్రాహ్మణులు అధికంగా ఉండరు. ఇదే విషయమై అక్కడి బ్రాహ్మణులతో వర్ణ వ్యవస్థ ఆవిర్భావం గురించి చర్చ జరుపుతాడు. బ్రాహ్మణుడు పురుషసూక్త సిద్ధాంతం గురించి చెప్పగా శ్రీరంగరాజు అది సరైంది కాదని వర్ణమూల సిద్ధాంతాన్ని చెప్తాడు. తాను చెప్పిన విషయాన్ని బలపరిచే దిశగా పూర్వం ఆర్యులు ద్రవిడులని ఆక్రమించి వర్ణ వ్యవస్థ సృష్టించినట్లే ఇప్పుడు యవనులు మన దేశాన్ని ఆక్రమించి కష్టాలు కలిగిస్తున్నారు అంటాడు.

"శ్రీరంగరాజు వర్ణాశ్రయంబులకు గారనం బులడిగె నంత బ్రాహ్మణుండు: బ్రాహ్మణోస్య ముఖమాసిత్ బాహూ రాజన్వకః ఊరు తదస్య యద్వైశః పద్భ్యం శూద్రో అజాయత అని జగము పుట్టినప్పుడు కలిగిన భేదములుగాని యివి నడుమ వచ్చినవిగావు.

శ్రీ! రా!! నేను బహు గ్రామముల మీఁద వచ్చితిని. ఏ గ్రామమునందుఁ జూచినఁగాని యొకటి రెండు బ్రాహ్మణుల యిండ్లు, నొకటి రెండు కొమటిండ్లు మాత్రమేనున్నవి. క్షత్రియుల యిండ్లంత కంటె నరుదు. శూద్రుల యిండ్లు మాత్రము గ్రామములు నిండియున్నవి – తాము చెప్పిన ప్రకారము – నాలుగు జాతులవారి మూల పురుషులు సమకాలంబునఁ బుట్టిరేని – నాలుగుకులములవారి సంఖ్యయు – సమానంబై యుండవలెఁగాదె. యింత హెచ్చు తక్కువ లుండుటకు నిమిత్తంబేమి.

బ్రా!! లోకంబున శ్రేష్ఠంబయిన పదార్థంబు దుర్లభంబు. రాలలోపల రవములు పరిమితములు. లోహముల లోపల స్వర్ణం అరుదు. అటులనే లోకులలోపల బ్రాహ్మణులు శ్రేష్ఠులగుంట జేసి వారి సంఖ్యయు అల్పంబై యుండు.

శ్రీ!! ర!! రత్నములయు – లోహంబులయు సంఖ్య పరిమితంబయి స్వర్ణకాలము లందు సమానంబై యుండు. చతుర్వర్ణములవారి సంబంధం బట్టిదికాదు. నాలుగు కులములవారు నొక్కరి వలన నెక కాలముననె పుట్టిరని తామే సెలవిచ్చితిరి. కావున సమాన సంఖ్యలై యుండవలయుఁ గదా! నా బుద్ధికి బ్రాహ్మణాది వర్ణ త్రయము వారిద్దేశంబు వారు గారనియుం దొల్లి దేశాంతరముల నుండి వచ్చి యీదేశమున వారిని జయించి స్వాధీన పరచుకొని శ్రేష్ఠత్వంబు పూనిరనియుఁ దోచుచున్నది. దీనికి దృష్టాంతంబుగ నిపుడు యవనులు తమ దేశంబు వెడలి యీ దేశంబునకు వచ్చి బహు భాగంబులు స్వాధీనము చేసికొని యున్నారు గదా. వారి జన సంఖ్య యెంత యల్పంబైయున్నది – ఇదే ప్రకారంబు – బ్రాహ్మణాదుల విషయ మందున జెప్పవచ్చునని తోచుచున్నది. మరియు నిట్లు దేశమోడిన వారి లోపల దొరలు చేరదీసిన రయితులు మొదలగువారు శూద్రులనియు, వారికదివరకు వంగి బానిసతనము చేయుచున్న పనివారు మాల మాదిగలనియు తోచుచున్నది–ఇదియుగాక వర్ణత్రయమువారి ముఖరీతి శూద్రులమోము తీరుకంటే భిన్నమయి యున్నవి.

బ్రా!! తాము యుక్తిచేత నూహించెదరు మాకు వేదములు శాస్త్రంబులు ప్రమాణంబులు.

శ్రీ!!ర!!వేద శాస్త్రములయినగాని –న్యాయమునకుఁబ్రతి కూలంబులగునె కార్యములనుబట్టి కారణం బులనుమానించుట న్యాయశాస్త్రంబుగాదె!! (గోపాలకృష్ణమసెట్టి, నరహరి. ఇనాక్, కొలకలూరి(సం). 2010: 73,74)

ఈ సంభాషణ వర్ణ వ్యవస్థ ఆవిర్భావాన్ని గురించి తెలుపుతుంది. వర్ణ, వర్గ విభజన తరువాత వచ్చిన కులవ్యవస్థ, కులవ్యవస్థలో ఉన్న కులాలగురించి శ్రీరంగరాజుచరిత్ర నవల ఆరంభంలో వివరంగా చెప్పబడింది. విద్యానగరవర్ణనతో శ్రీరంగరాజుచరిత్ర నవల ప్రారంభమౌతుంది. నగర వర్ణనలో భాగంగా నగరంలోని కులాల గురించిన వర్ణన కనిపిస్తుంది.

**i.బ్రాహ్మణులు:**

"బ్రాహ్మణులు నాలుగు వేదములవారు, రాజుగారిచే దత్తంబులైన యగ్రహారంబుల వసించువారు. తమ తమ వేదములందు మహాజ్ఞానవంతులై యుపనిషత్తులనేమి, శాస్త్రాగమములనేమి, కావ్యములనేమి పరమ కోవిదులయి యనుదినము పెందలకాడ లేచి తుంగ భద్రయందుఁదీర్థంబులాడి సంధ్యా వందనము సలిపి తమతమ మతానుసారముగా నామంబులిడువారు. నామంబులను, విభూతి ధరించువారు, విభూతియును ధరించుకొని

వేదంబులు చదువుచూ నామ తీర్థకాలమందు రాజు సన్నిధికిఁ బోవలయు వారు పోయి దీవెనలు గావించుచు రాజులిచ్చిన మాన్యంబులు లేశంబుగాని యాఁకలేక పుత్ర, పౌత్ర పారంపర్యంగా నితర ద్రవ్యంబువోలె ననుభవించుచుందురుగాని యెనెపంబున నెన్నఁడైన దొరతనమువారు మన యీనములు పుచ్చుకుందురేమోనని భీతిల్లి ఇతర వ్యాపారంబులనుబుద్ధి ప్రవేశింపక జేయువారు లేరు.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010: 60-61). శ్రీరంగరాజుకు విద్య నేర్పిన శేషాచార్యులు, శ్రీరంగరాజు జాతకం చూసిన రామాచార్యులు శ్రీరంగరాజుతో వర్ణ వ్యవస్థ గురించి సంభాషించిన బ్రాహ్మణుడు శ్రీరంగరాజుచరిత్రలో ప్రస్తావనకు వచ్చిన బ్రాహ్మణ పాత్రలు.

**ii. కోమట్లు:**

వీరిని వైశ్యులని కూడా అంటారు. చతుర్వర్ణ వ్యవస్థలో వైశ్యులది మూడవస్థానం. వ్యాపారం వీరి ప్రధాన వృత్తి. “కోమటి పదం సంస్కృత పదమైన గోమతికి వికృత రూపమని తెలుస్తున్నది. గోమతి అనగా గోవులపై మనసు కలవాడు. లేదా గోధనం కలవాడు అని అర్థం. కోమట్లకు కన్యకా పురాణం పవిత్ర గ్రంథం. వీరు కన్యకా పరమేశ్వరి భక్తులు. కన్యకా పరమేశ్వరి వీరి కులదేవత. కోమట్లకు ఉపనయనం, యజ్ఞోపవిత ధారణం, గాయత్రి జపం ఉన్నాయి. వీరి వివాహాలు, వ్రతాలు, శుభకర్మలు, బ్రాహ్మణ పురోహితులే నిర్వహిస్తారు.” (గంగిరెడ్డి, బుక్క. 2004: 55). ఈ కోమట్లు విద్యానగరంలో అనేక వ్యాపారాలతో ధనవంతులుగా ఉన్నారని విద్యానగర వర్ణనలో చెప్పబడినది.

“కోమట్లు బహువిధ వ్యాపారంబుల చేత ధనము విశేషముగా సంపాదించి బ్రాహ్మణుల యందు మిక్కిలి భక్తిగలిగి నూటికి ఒకటి కంటే హెచ్చుగా వడ్డియా శింపక హరిహరాదుల సాక్ష్యంతో సూర్య చంద్రాదుల సాక్ష్యంతో సంతుష్టి కలిగి సర్వ జనుల యందు నమ్మకం ఉంచి వర్తింతురు. అందుఁగొందరు కోటీశ్వరులై పడగలెత్తి ధనదుఁబోలిన వారు నుందుదురు.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజు చరిత్ర. 2010: 61).

**iii. క్షత్రియులు:**

చతుర్వర్ణవ్యవస్థలో క్షత్రియులది రెండవస్థానం. రాజ్యపరిపాలన వీరి ముఖ్యమైన విధి. ప్రాచీన కాలంలో రాచరిక పాలన ఉండడంవల్ల రాజ్య పాలన వంశపారపర్యంగా సంక్రమించేది.

కాబట్టి క్షత్రియులు రాజులుగా పిలవబడేవారు. రాచరిక పాలన అంతమైన తరువాత క్షత్రియులు కాక ఎవరైన రాజ్యాన్ని పరిపాలించే విధానం వచ్చింది. క్షత్రియులు రాజ్యపాలన చేసే సందర్భంలో వారికి బాల్యంలో యుద్ధ విద్యలు విధిగా నేర్పేవారు. రాజ్యపాలనలో వ్యవహరించ వలసిన విధానాల గురించి చెప్పేవారు. ఈ క్షత్రియులు రాజులుగా, ఇంకొక రాజుకు సామంత రాజులుగా ఉండేవారు. శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు విద్యానగరాన్ని పరిపాలించిన మురురాయగండర్ అనే రాజు కుమారుడు. శ్రీరంగరాజు బావ కొడుకు “కొండవీటిరాజు” ఈ రెండు పాత్రలు, క్షత్రియ పాత్రలు. శ్రీరంగరాజు జన్మించిన సందర్భంలో శ్రీరంగరాజుని బ్రాహ్మణులు ఆశీర్వదించడం, బట్రాజులు స్తోత్ర పాఠాలు పాడడం, నాట్యకత్తెలు నృత్యం చేయడం, శ్రీరంగరాజుకు ఐదు సంవత్సరాలు గడిచిన తరువాత ఒక గురువును ఏర్పాటుచేసి చదువు, సామవిద్యల్ని నేర్పించడం, రాజ వైభవానికి నిదర్శనం. ఎలాగైనా తాను ఇష్టపడ్డ సోనాబాయిని దక్కించుకోవాలని కొండవీటిరాజు చూడడం రాజుల క్రూరత్వానికి నిదర్శనం.

### iv. శూద్రులు:

చతుర్వర్ణ వ్యవస్థలో శూద్రులది నాల్గవ స్థానం. ఉన్నత కులాల వారికి సహాయ పడటం వీరి ప్రధానవిధి. పురోహితం, పరిపాలన, వ్యాపారం మినహా మిగతా అన్ని పనులు శూద్రులు చేసేవారు. వేదకాలంలో శూద్రులు సమాజంలో గౌరవ ప్రదంగా చూడబడ్డారు. “వేద కాలానంతరం శూద్రులు ప్రధానంగా సేవక వర్గంగా ఏర్పడ్డారు. వాళ్ల దగ్గర పశువులు ఉండేవని యజ్ఞ యాగాదుల కోసం అగ్రవర్ణాలకి చెందిన వారు వాటిని లాక్కుపోయే వారని మైత్రాయణీ సంహితలో చెప్పబడింది. ఇంచు మించు ఇలాగే పంచవింశ బ్రాహ్మణం కూడా చెబుతుంది. భగవంతుని అస్తిత్వాన్ని అంగీకరించనటువంటి యజ్ఞ యాగాదుల ఏర్పాట్లు లేనటువంటి సమాజంలో శూద్రులు జన్మించారని వాళ్ల వద్ద చాలా పశువులు ఉండేవని అందులో చెప్పబడింది. పురుష మేధం అనే యజ్ఞాన్ని చేసినపుడు బ్రాహ్మణుడు పురోహిత వృత్తిని, క్షత్రియుడు రాజ్యపాలనను, వైశ్యుడు మరుత్తులలాగా రైతువృత్తిని శూద్రుడు కాయకష్టాన్ని స్వీకరించాలని శతపథ తైత్తరేయ బ్రాహ్మణాల్లో చెప్పబడింది. శూద్రుడు కఠిన శ్రమకి సంకేతమని భావించబడేది. పైన ఉదహరించిన నాలుగు వర్ణాలతో పాటు రథం తయారు చేసేవాళ్లు, వడ్రంగులు, కుమ్మరి, కమ్మరి, షరాబు, పశువుల కాపరి, రైతు, గొల్లవారు, మద్యం తయారు చేసేవారు, వేటగాళ్లు మొదలైన వివిధ రకాల ప్రజల్ని, శూద్రులుగా పరిగణింప

బదుతున్న నిషాదులు, కిరాతులు, బైందులు మొదలైన వాళ్లను గురించి ఈ సందర్భంలో చెప్పడం జరిగింది. ఇలాంటి అనేక హస్త కళాకారులు, వివిధ రకాల శ్రామికులు శూద్రులే అనే అభిప్రాయం క్రమంగా ప్రభలుతూ వచ్చింది.” (శర్మ, ఆర్.ఎస్. 1992:31, 32). శ్రీరంగరాజుచరిత్ర నవలలో శూద్రుల ప్రస్తావన కనిపిస్తుంది. విద్యానగరంలోని శూద్రులు సుఖ సంతోషాలతో ఉన్నారని చెప్పడం జరిగింది.

“నాల్గవ జాతి వారు రాజులకుఁ బంటనాఱవ పాలు కరమిచ్చుచుఁగాల వర్షంబులు తప్పక కురియ నీరుగారు ముక్కారు పుర్ణముగాఁ బండించు కొనుచు యథేష్టముగా వలయు వంట చెరుకును గృహములకు వలయు దూలములు మొదలగు వస్తువులను సుంకము లేక నిరభ్యంతముగఁ దెచ్చుకొనుచు సుఖంబుండుదురు. అట్లు పొలము పండింపని వారగు సాలె, కంసాలి, యగసాలి మొదలగు కర్మోపజీవనము వారు తమ నేసిన వస్త్రములు చేసిన సరుకులు మొదలగునవి కొనఁదగిన రాజులు రాజ బంధువులు, ప్రధానులు మొదలగువారు ధనవంతుల నేకులుండిరి.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 61)

**v. లంబాడీలు:**

లంబాడీలను బంజారాలు అని కూడా అంటారు. శ్రీరంగరాజుచరిత్ర నవలలో ‘సోనాబాయి’ లంబాడీ స్త్రీవద్ద పెరుగుతుంది. లంబాడీలలో స్త్రీలపేర్ల చివర ‘బాయి’ అని పురుషుల పేర్ల చివర ‘నాయక్’ అనే ప్రత్యయాలను చేర్చి పిలవడం పరిపాటి. అందుకే రంగనాయకిని అపహరించిన లంబాడీ వృద్ధస్త్రీ ఆమె పేరును సోనాబాయిగా మార్చుతుంది. సోనాబాయి వివాహాన్ని ‘భీమానాయక్’తో నిర్ణయిస్తారు. అడవిలో సోనాబాయిని తొలిసారిగా శ్రీరంగరాజు చూస్తాడు. రామయ్య సోనాబాయిని వివరాలను అడిగిన సందర్భంలో సోనాబాయి తన వివరాలను రామయ్యకి చెబుతుంది. “నేను లంబాడీ దానను, గుంటూరు సీమను బియ్యముప్పు మొదలైనవి పట్టుకొని బేరమాడుచుఁ గందనోలు సీమకుఁబోవుచు నిచటమా చనుపదిగి యుండఁగానని పలుకునంతలో దాని తల్లియువచ్చె.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 84). ఈ మాటలు లంబాడీల వ్యాపారవృత్తిని తెలుపుతున్నాయి. సోనాబాయి తల్లి సోనాబాయికి వివాహం అయినట్లుగా చెప్తుంది. వివాహ సమయంలో ఉపయోగించే అయిరేని దొంతులు, రోకళ్లు, కుప్పెన, దంతపు గాజులు మొదలైన వాటిని రాకుమారునికి చూపిస్తుంది. ఈ సన్నివేశం లంబాడీలలోని వివాహ సంప్రదాయానికి అద్దం

పడుతుంది. కొండవీటి దొర సోనాబాయిని అపహరించిన సందర్భంలో సోనాబాయికి అనేక చీరలను బహూకరిస్తాడు. సోనాబాయి వాటిని స్వీకరించక లంబాడీ బట్టలను తెప్పించమంటుంది. ఇలా అనేక సందర్భాలలో లంబాడీల ఆచార వ్యవహారాలు శ్రీరంగరాజు చరిత్ర నవలలో ప్రస్తావనకి వచ్చాయి.

### 5.2.1.1.2. ఇందిరాబాయి - వర్ణ వ్యవస్థ

వర్ణ వ్యవస్థకి సంబంధించిన విభజన ఇందిరాబాయి నవల ప్రారంభంలో 'కమలాపురం' గ్రామ వర్ణనలో భాగంగా ప్రస్తావిత మైంది."ఈ నగరం ప్రాచీన కాలం నుండి చరిత్రలో ఘనత వహించి ప్రసిద్ధికెక్కిన అనేక భవనాలను, దేవాలయాలను, అగ్రహారాలను, న్యాయస్థానాలను తరతరాల నుంచి ఫల, వృక్ష తోటలను, విశాలమైన రాజ మార్గాలను కలిగి శోభిల్లుతున్నది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు వంటి నాలుగు వర్ణాల ప్రజలే కాక ఇతర మతాలను ఆచరించే ప్రజలు కూడా తమ తమ వృత్తులను ఆచరిస్తూ ఆ నగరంలో వేరే వేరే వీధుల్లో నివాసం ఉంటున్నారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 1). ఈ వర్ణన కర్ణాటక ప్రాంతంలోని వర్ణ వ్యవస్థకి నిదర్శనం. వర్ణ వ్యవస్థలోని కులాల వర్ణన ఇందిరాబాయి నవలలో కనిపించదు. ఆయా పాత్రల ప్రవర్తనల వర్ణనద్వారా కులాల విభజనని పరోక్షంగా సూచించడం జరిగింది.

నవలలో ప్రధాన పాత్ర పోషించిన భీమారావు వ్యాపార వృత్తిలో జీవించాడు. ఇతని పూర్వీకులు కూడా బీజాపురం సీమ ప్రాంతంలో చాలా కాలంగా 'కులకర్ణి' ఉద్యోగాన్ని చేస్తూ జీవించారు. బ్రాహ్మణులకు 'కులకర్ణి' అనే పేరు నేటికి దక్షిణ కర్ణాటక జిల్లాలలో ఉంది. భీమారావు ఇంటికి వచ్చిన దేవకి భీమారావు భార్యతో బ్రాహ్మణ వీధులలో, బ్రాహ్మణుల ఇళ్లలో జరిగే విషయాల గురించి చర్చిస్తుంది. భీమారావు నరసింహశాస్త్రివద్ద ఉద్యోగం చేస్తాడు. భీమారావు తన ఇంట్లో కీచకవధ ప్రసంగం ముగిసిన తరువాత బ్రాహ్మణ సంతర్పణం నిర్వహిస్తాడు. భీమారావుకి ఆరోగ్యం బాగాలేని సందర్భంలో 'లక్ష్మణభట్టు' అంజనం వేసి చూస్తాడు. ఇందిరాబాయి వివాహ సందర్భంలో వస్త్రాలు, ఆభరణాల తయారీ గురించి చెప్పబడింది. త్రయంబకరావు కుమారుడైన విఠలరావు వేశ్యలపట్ల ఆకర్షితుడైనట్లు తెలుసుకుని 'పొక్కుసెట్టి' వేశ్యలకు విఠలరావుని దగ్గర చేస్తాడు. ఈ విధంగా పేర్ల చివరన కుల సూచక శాస్త్రీ, భట్టు, సెట్టి వంటి ప్రత్యయాలు కలిగిన పాత్రల ప్రస్తావన ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది.

భాస్కరరావు మద్రాసుకు బయలుదేరి వెళ్లే సమయంలో అతని తల్లి సుశీల మ్లేచ్ఛులైన వారితో జాగ్రత్తగా ఉండమని శూద్రుల గురించి చెబుతుంది. (వెంకటరావు, గుల్వాడి. 1962: 99). ఇలా పరోక్షంగా వర్ణ వ్యవస్థలోని కులాల ప్రస్తావన ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది.

### 5.2.1.1.3. ప్రతాపముదలియార్ చరిత్ర - వర్ణ వ్యవస్థ

"ప్రారంభ కాలంలో తమిళ ప్రాంతంలో బ్రాహ్మణ, శూద్ర విభజన ఉండేది. ఆర్యులు రాక పూర్వం తమిళ ప్రాంతంలో మూడు తెగలు ఉండేవి. అవి: 1. అటవీ కొండ జాతి తెగ 2. నాగ జాతి ప్రజలు, 3. వెల్లాల తెగ. ఈ తెగలన్నింటిని కలిపి ద్రావిడులుగా పేర్కొన్నారు. ఆర్యుల రాకతో తమిళ ప్రాంతంలో చతుర్వర్ణ వ్యవస్థ ప్రవేశ పెట్టబడింది. ఆధునిక కాలంలో ఉన్న కులాలలో చాలా వరకు వెల్లాల తెగ వ్యాప్తి ఫలితంగా ఏర్పడ్డాయి. వెల్లాల తెగతోపాటు ప్రాచీన నాగ, కొండ జాతి తెగల నుండి ఆధునిక కులాలు ఉద్భవించాయి. ఆహారం, వృత్తి, మతం, భౌతిక స్థితి మొదలైన అన్నింటిలో ఆధునిక కులాలలో వైవిధ్యం కనిపిస్తుంది. ఒక నాటి కాలంలో బ్రాహ్మణుల వల్ల జరిగిన వర్ణవిభజన నేడు విస్తృతరూపం దాల్చి అనేక కులాల ఆవిర్భావానికి దారి తీసింది." (Srinivasa ayangaar, M. 1986: 3, 92).

తమిళ ప్రాంతంలో అయ్యర్, నాడర్, పరయర్, వెల్లలార్, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, పిళ్ళై, మొదలియార్ కులానికి చెందిన ప్రజలు కనిపిస్తారు. అయ్యర్‌లు తమిళ ప్రాంతంలో ఉన్న బ్రాహ్మణులు వీళ్లని శాస్త్రి, భట్టర్ అని కూడా పిలుస్తారు. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ 'ముదలియార్' కులంలో జన్మించినట్లు నవల ప్రారంభంలో చెప్పబడింది. కనకసభను పెంచింది శాంతలింగం పిళ్ళై. ప్రతాపముదలియార్ తండ్రి కనకాచల ముదలియార్, కనకసభ తండ్రి దేవరాజ పిళ్ళై ఇలా పేర్ల చివరన మొదలియార్, పిళ్ళై ప్రత్యయాలతో కూడిన పాత్రలు ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో కనిపిస్తాయి, కాని 'ముదలియార్' పిళ్ళై కులానికి సంబంధించిన వివరణ కనిపించదు. కనకసభ తండ్రి దేవరాజపిళ్ళై తనను గురించి తాను కనకాచల ముదలియార్ కుటుంబానికి పరిచయం చేసుకునే సందర్భంలో తన పూర్వీకుల వృత్తిని, కులాన్ని గురించి చెబుతాడు.

"సిరి సంపదలతో విరాజిల్లుతున్న ఆదియూరు అనే పాళ్యానికి నేను అధికారిని. మేము పూర్వమున్న రాజులకు కిరీటాన్ని అలంకరించే 'వేళ్ళాలర్' కులానికి చెందిన వారము కాబట్టి మాకు అనేక గ్రామాలు, భూములు దానంగా లభించడం వలన సర్వస్వతంత్రంగా అనుభవిస్తూ వచ్చాను. మా నాన్న ఆదిమూలం పిళ్ళైకి, నేనూ మా తమ్ముడు దైవనాయగం పిళ్ళై ఇరువురం పుత్రులం." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 26)

ప్రతాపముదలియార్ వివాహం ఆగిపోయిన సందర్భంలో సంబంధముదలియార్ కనకాచల ముదలియార్ ఒకరికొకరు తిట్టుకునే సందర్భంలో చాకలీ, మంగలీ కులాల ప్రస్తావన కనిపిస్తుంది.

"కనకాచల ముదలియార్ సంబంధ ముదలియార్‌ని మీది మంగళోల్ల గోత్రం కదా! అని గేలి చేయగా సంబంధ ముదలియార్ కనకాచల ముదలియార్‌తో 'మీది చాకలోల్ల గోత్రం కదా!! అని పరిహాసం చేస్తాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 50)

"ప్రతాపముదలియార్ విక్రమపురికి చేరుకున్న సందర్భంలో చర్మకారుని వద్ద చెప్పులు కొంటాడు. విక్రమపురిని జ్ఞానాంబాళ్ పరిపాలించే సందర్భంలో రాజ్యంలోని ప్రజలలో రాజ భక్తిని పెంపొందించే ఉద్దేశంతో కొంత మంది విద్వాంసులని జ్ఞానాంబాళ్ నియమిస్తుంది. ఈ విద్వాంసులు గ్రామాల్లోనూ, నగరాలలోను వ్యవసాయం, నేత పని, వడ్రంగి పని, కంసాలి పని మొదలైన పెక్కు వృత్తుల వారు ఉండవలసిన ఆవశ్యకత గురించి ప్రజలకి చెప్తారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 188).

### 5.2.1.1.4. ఇందులేఖ - వర్ణ వ్యవస్థ

మలయాళ ప్రాంతంలో ప్రధానంగా నంబూద్రి(బ్రాహ్మణ), పట్టార (తమిళ బ్రాహ్మణ), ఎంబ్రాన్స్ (తుళుబ్రాహ్మణ), నాయర్, వారియర్, కనియన్ వంటి కులానికి చెందిన ప్రజలు ఉంటారు. ఇందులేఖ నవలలో ప్రధానంగా నంబూద్రి, నాయర్ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలు చర్చకి వచ్చాయి. నంబూద్రి, నాయర్‌లు కేరళలోని మలబార్, కొచ్చిన్, ట్రావన్‌కోర్ ప్రాంతంలో కనిపించే రెండు ప్రధాన కులాలు. నంబూద్రిలు బ్రాహ్మణులు. వారు గురువులు మరియు భూస్వాములు. నంబూద్రిలలో నంబూద్రిపాడ్ ఉన్నత వర్గానికి చెందినవాడు. ఈ నంబూద్రిలలో కుటుంబంలో అందరికన్నా వయస్సులో పెద్దగా ఉన్న నంబూద్రి తన కులంలోని స్త్రీని

వివాహమాడతాడు. దీన్ని 'వెలి' సంప్రదాయం అంటారు. అదే కుటుంబంలోని మిగతా నంబూద్రిలు నాయర్ కులంలోని స్త్రీలతో ఒప్పంద సంబంధాలని కలిగి ఉంటారు. ఈ సంప్రదాయాన్ని 'సంబంధం' అని పిలుస్తారు. బహుభార్యత్వం ఈ కులంలో అంగీకృతం మరియు సర్వసాధారణం.

'నాయర్‌లు' శూద్రులలో ఉన్నత వర్గానికి చెందిన వారు వీరు సొంత భూములను కలిగి ఉంటారు. నాయర్‌లలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉంటుంది. నాయర్‌లలోని ఉమ్మడి కుటుంబాలను 'తరవాడు' అంటారు. వయస్సులో అందరికన్నా పెద్దవాడైన పురుషుడు ఈ తరవాడు కుటుంబానికి పెద్దగా ఉంటాడు. అతనిని కారణవన్ అంటారు. నాయర్, కారణవన్‌లు నంబూద్రిలపట్ల విశేష గౌరవ మర్యాదలు కనబరిచేవారు. ఒ. చందుమీనన్‌గారు ఇందులేఖ నవలలో కన్నళిసూరి నంబూద్రిపాడు పాత్ర ప్రవర్తన ద్వారా నంబూద్రిల ప్రవర్తనని, పంజుమీనన్ ప్రవర్తన ద్వారా నాయర్‌ల ప్రవర్తనని పాఠకులకు అందించారు. నంబూద్రిపాడు పాత్రని ప్రవేశపెడుతూ ఒ. చందుమీనన్‌గారు ప్రయోగించిన వాక్యాలు గమనించదగినవి."మలయాళ దేశంలో నా దృష్టిలో నంబూద్రిల కన్నా అధిక గౌరవ మర్యాదలకు పాత్రులైనవారు ఎవరూ లేరు. వారిలో అత్యంత బుద్ధిశాలురు, సామర్థ్యంగలవారు అయిన చాలామంది నాకు తెలుసు. వారిలో కొందరు నాకు మిక్కిలి సన్నిహిత స్నేహితులు. ప్రతి జాతిలోను సమర్థవంతులుగానూ, అమాయకులుగాను, బుద్ధిశాలురుగాను మరియు బుద్ధిహీనులుగానూ మంచివారుగాను, చెడ్డవారుగాను కలగలిపిన వ్యక్తులు కనిపిస్తారు. అదే విధంగా నంబూద్రిలలోనూ ఉన్నారు. ఈ కథలో వచ్చే నంబూద్రిపాడు కొంత వేళాకోలంగా ఉన్నప్పటికీ వారి చెలికాడుగా నా పాఠకులకు పరిచయం కాబోతున్న సెరుసేరి నంబూద్రి యొక్క సామర్థ్యాన్ని, రసికత్వాన్ని గమనించినపుడు మొత్తానికి ప్రశంసించదగిన వారుగా కనిపిస్తారు. మలయాళ దేశంలో మర్యాదస్తులుగా పరిగణింప బడుతున్న నంబూద్రిలను, నంబూద్రిపాడులను పరిహాసం చేయాలని ఒక చెడ్డ భావం నాకు ఎప్పుడూ లేదు, అనేది బుద్ధి శాలురు సమష్టితిని మీరని వారు అయిన నా పాఠకులకు తేలికగా అర్థం అవుతున్నదని నేను నమ్ముతున్నాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 88). ఈ విధంగా నంబూద్రిల గొప్పతనాన్ని చెప్పిన ఒ. చందుమీనన్‌గారు సూరి నంబూద్రిపాడు కుటుంబ గొప్పతనాన్ని శూద్ర అమ్మాయిలతో అతనికి ఉన్న సంబంధాన్ని గురించి నవల తరువాతి భాగంలో వివరించారు. శంకరశాస్త్రి నంబూద్రిపాడు గురించి అతని

సేవకుడిగా వచ్చిన చిన్న భట్టరుని అడగగా చిన్నభట్టరు నంబూద్రిపాదు ప్రవర్తన గురించి శంకరశాస్త్రికి చెప్తాడు.

"ఇతను మహామోసగాడు ఒక ఇరవై మంది స్త్రీలతో ఇప్పుడు సంబంధం ఉంది. ఈ రెండు నెలల్లో కుటుంబానికి బాధ్యతగా ఈ మనిషి ఒక పనికూడా చేసింది లేదు. ఆ గోవిందుదు ఇప్పుడు చెప్పాడే. ఈ మనిషి నాయరు ఇండ్లకు పోయినదే లేదని. ఎంత పెద్ద అబద్ధం. అమ్మాయిలున్న అందరు ఇళ్లకు పోతాడు. కొన్ని సమయాల్లో చేతిలో కాసుకూడా లేకుండా వెళ్లడం ఉంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 145). ఈ మాటలు నంబూద్రిపాదు స్త్రీలోలుడని తెలుపకనే తెలుపుతున్నాయి. ఇందులేఖను పెళ్లి చేసుకుందామని వచ్చిన నంబూద్రిపాదు ఇందులేఖ తల్లి లక్ష్మీకుట్టియమ్మని చూసి మోహిస్తాడు. తాను మోహించిన విషయం బహిరంగంగా సెరుసేరి నంబూద్రి, పంజుమీనన్, కేశవ నంబూద్రిల వద్ద చెబుతాడు. నంబూద్రిపాదు అంతరంగం అందరికీ తెలిసినా అతన్ని ఎవరూ ఏమీ అనరు.(జయప్రకాశ్, ఎస్(అ). 2016: 172-174). ఈ విధంగా ఇందులేఖ నవలలో అనేక సందర్భాలలో నాయర్‌లపై నంబూద్రిల ఆధిపత్యం ప్రదర్శించిన సన్నివేశాలు చిత్రితమయ్యాయి.

### 5.2.1.2. వర్ణ వ్యవస్థ - తులనాత్మక పరిశీలన

దక్షిణ భారతీయ భాషల్లోని తొలి సాంఘిక నవలల్లో వర్ణ విభజనకి సంబంధించిన వర్ణనలు ఉన్నాయి. ఈ వర్ణ విభజనలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల గురించి చెప్పబడింది. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలలో, తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో శూద్రులు, చాకలి, మంగలి, స్వర్ణకారులకి సంబంధించిన ప్రస్తావన ఉంది. కన్నడ ఇందిరాబాయి నవలలో చతుర్వర్ణ విభజన గురించి నవల ప్రారంభంలో టూకీ మాత్రంగా చెప్పబడింది. ఇందిరాబాయి నవలలో కులాలకు సంబంధించిన సుదీర్ఘ వర్ణన కనిపించదు. మలయాళ ఇందులేఖ నవలలో నంబూద్రి, నాయర్ కులాలకు సంబంధించిన వర్ణన కనిపిస్తుంది. ఈ రకమైన విభేదాలు ఉండడానికి ఆయా నవలల్లోని వస్తువు ప్రధాన కారణం. ప్రతాపముదలియార్ చరిత్ర, శ్రీరంగరాజుచరిత్ర నవలల్లో నాటి సమాజంలోని లోపాల చిత్రణ ప్రధాన కథావస్తువు. ఈ వస్తువుకి అనుగుణంగా వేదనాయగం పిళ్ళైగారు, నరహరి గోపాల కృష్ణమసెట్టిగారు తమ నవలల్లో వర్ణవిభజనకి సంబంధించిన విపుల వర్ణనలు చేశారు. ఇందిరాబాయి, ఇందులేఖ

నవలల్లోని వస్తువు పరిధి పరిమితమైంది. ఇందిరాబాయి నవలలో స్త్రీవిద్య, వితంతు పునర్వివాహం ప్రధాన కథావస్తువులు. ఈ వస్తువులకి తగిన విధంగా గుల్వాడి వెంకటరావుగారు నవలా కాలంనాటి వర్ణ వ్యవస్థని పాత్రల ప్రవర్తన ద్వారా వివరించారు. ఇందులేఖ నవలలో నంబూద్రి, నాయర్‌ల అంతర కలహాలను వివరించడం ప్రధాన కథావస్తువు. ఈ వస్తువుకి తగిన విధంగా నంబూద్రి, నాయర్ కులాలకి సంబంధించిన వర్ణన ఇందులేఖ నవలలో కనిపిస్తుంది. వర్ణవిభజన వల్ల వచ్చిన 'అస్పృశ్యత'కి సంబంధించిన వర్ణన, వేశ్యలకి సంబంధించిన వర్ణన అన్ని నవలల్లోను కనిపిస్తుంది.

### i. అస్పృశ్యత

అస్పృశ్యతని అంటరానితనం అనికూడా అంటారు. కులంపేరిట, మతం పేరిట, జాతిపేరిట ఒక వ్యక్తిని నీచంగా, అంటరానివాడిగా చూడడాన్ని స్థూలంగా అస్పృశ్యతగా చెప్పవచ్చు. చతుర్వర్ణ వ్యవస్థలో శూద్రులు అంటరానివారుగా చూడబడ్డారు. శూద్రులను తాకిన, ముట్టుకున్న దేహం మలినమవుతుందన్న భావన ప్రాచీన కాలం నుండి భారతదేశంలో వ్యాప్తిలో ఉంది. "13వ శతాబ్దానికి చెందిన ధర్మస్వామి బీహార్‌లోని వర్ణ వ్యవస్థను తెలియజేసే ఒక విచిత్రమైన కథను రాసాడు. మగధలోని నదిలో మునిగిపోతున్న ఒక టిబెటన్ సన్యాసి, రక్షించండి-రక్షించండి అంటూ బిగ్గరగా కేకలు వేయనారంభించాడు. ఈ దృశ్యాన్ని ఒక అస్పృశ్యుడు దగ్గరి నుండి చూస్తున్నాడు. నదిలో మునిగి పోతున్న ఆ సన్యాసిని రక్షించాలని బలమైన కోరిక ఈ పంచమునికి ఉంది. అంతే కాదు. ఇతనికి ఈదడం సైతం తెలుసు. అయినా ఇతడు దగ్గరికి వెళ్లడానికి తటపటాయించాడు. సన్యాసిని రక్షించదలిస్తే అతన్ని ముట్టుకోవాలి. ముట్టుకుంటే సన్యాసి మైల పడతాడు. సన్యాసి బతికి బయటపడ్డ తరువాత అతన్ని ముట్టుకున్నందుకు ఈ పంచముడు తీవ్రంగా శిక్షింపబడతాడు. ఇది కథ." (సి.వి. 2015: 64).

సరిగ్గా ఇలాంటి సంఘటన శ్రీరంగరాజుచరిత్ర, ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో ప్రస్తావితమైంది. ఇందిరాబాయి నవలలో కూడా అస్పృశ్యతకి సంబంధించిన వర్ణనలు కనిపిస్తాయి. శ్రీరంగరాజుచరిత్ర నవలలో ఇంటిని వదిలిన శ్రీరంగరాజు యాత్ర చేస్తూ మండే ఎండలో నడిచి నడిచి అలసి పడిపోతాడు. అతనికి బాగా దాహం వేస్తుంది. దారి పక్కన పడుకుంటాడు. అక్కడ చేలలో ఉన్న మాలలు శ్రీరంగరాజుని చూస్తారు. అతనికి నీళ్లు ఇవ్వడానికి

వస్తారు. వెంటనే రాకుమారుడికి నీళ్లు ఇవ్వడానికి తాము తగిన వాళ్లం కాదు అనుకొని ఎవరైనా తగిన కులం వారిని పిలుచుకొని వద్దామని తమ చేతిలోని నీళ్లని ఇవ్వకుండా వెళ్లిపోతారు. వాళ్ల చేతిలో ఉన్న నీటిని చూసి శ్రీరంగరాజు తీసుకుందాం అనుకుంటాడు. కులం పట్టింపు అడ్డువచ్చి తీసుకోవడానికి చేతులు రాక మనసులో మదన పడతాడు.

ఇలా బాధపడుతున్న సందర్భంలో కొందరు కాపులు తాము తెచ్చుకున్న నీళ్ల దుత్తితో రాకుమారుని వద్దకు వస్తారు. కాని క్షత్రియుడని తెలుసుకుని నీళ్లు ఇవ్వడానికి సందేహిస్తారు. దాంతో శ్రీరంగరాజు వర్ణాచారాలకు భయపడవద్దని సైగ చేస్తాడు. ఒక కాపువాడు నీళ్లు ఇవ్వబోతాడు. శ్రీరంగరాజు చేయి చాపుతాడు. ఇంతలో అక్కడే ఉన్న ఇంకో కాపువాడు ఇచ్చేవాడి చేతిలోని దుత్తని లాక్కోని "యెన్ని పాపములు చేసితిమో, ఈ పాడు కులమున పుట్టితిమి. వీరు బ్రాహ్మణులో, క్షత్రియులో వీరికేడనయిన శూద్రులు నీరిత్తురే-వీరు తాపంబున కోర్వలేక నీరు త్రావెద మని చెప్పెదరు కాని, మనము పిల్లలు గలవారము మనకేల ఈ పాపంబు-వేగఁబోయి చల్లదెమ్మని మొకరిని గ్రామంబునకుపంపె." (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 72). దీనితో రాకుమారుని మనస్సు కకావికలమౌతుంది. ఆహా! ఏ పుణ్యాత్ముడు కల్పించాడో ఈ వర్ణాశ్రమ ధర్మాలు ప్రాణాలు పోతున్నా వాటి బంధాలు పోలేదే! అంటూ మనస్సులో బాధపడతాడు. ఈ సంఘటన పంతొమ్మిదవ శతాబ్దంనాటి అస్పృశ్యతకి ఒక ఉదాహరణ. ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కూడా ఇలాంటి సన్నివేశం చిత్రితమైంది.

తన రాజ్యంలోని పరిస్థితులను తెలుసుకోదలచిన నవాబు ఫకీరు వేషంలో ఊర్లన్నీ తిరుగుతూ సత్యపురి వద్ద స్పృహ తప్పి పడిపోతాడు. నవాబు ఫకీరు వేషంలో ఉండడం వల్ల అతనికి ఎవ్వరూ నీళ్లు ఇవ్వరు. అప్పుడు అక్కడ ఉన్నవాళ్లు "అతడు ఎవరో ఫకీరు. అతన్ని తాకితే జాతి భ్రష్టమవుతుంది. అని చెబుతూ దూరంగా తొలిగి పోతారు. ప్రతాపముదలియార్ తాత గారైన ఏకాంబర ముదలియార్ మాత్రం అతడెవరైనప్పటికీ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని భావించి అతనిని మోసుకు వెళ్లి గాయాలను శుభ్రంగా కడిగి అతనిని మూర్ఛ తేరుకునేలాగా చేస్తాడు. స్పృహ వచ్చిన తరువాత ఫకీరు వేషంలోఉన్న నవాబు ఏకాంబర ముదలియార్ తనకు చేసిన సహాయాన్ని మెచ్చుకుంటాడు. తాను తన రాజ్యానికి వెళ్లిన తరువాత ఏకాంబర

ముదలియార్ తనకు చేసిన సహాయానికి ప్రత్యుపకారంగా అతన్ని తన రాజ్యంలో దివానుగా నియమిస్తాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 1, 2).

ఇందిరాబాయి నవలలో భాస్కరరావు సి.యస్. పరీక్ష నిమిత్తం విదేశాలకి వెళ్లాలని చెప్పిన సందర్భంలో భాస్కరరావు తల్లి సుశీల ఓడలో మూడువారాల ప్రయాణంలో మ్లేచ్ఛులు తాకిన నీటిని తాగరాదని, వారు వండిన అన్నాన్ని తినరాదని భాస్కరరావుకి షరతులు విధిస్తుంది. ఈ సందర్భంలో భాస్కరరావు ఈ సృష్టిలో అంటరానివారు అంటూ ఎవరూ లేరని తల్లికి నచ్చచెప్పుతాడు.

| | |
|---|---|
| “సుశీల: | ఓడలో ఎవరెవరో చేసిన ఆహారాన్ని తింటావా? ఏంటి? |
| భాస్కరరావు: | తినను. అమృతరావు ఒక వంటవాడిని నాతో ఇచ్చి పంపుతున్నారు. |
| సుశీల: | సరే మంచిది. మ్లేచ్ఛులు ముట్టని నీరు, శుద్ధమైన నీరు ఉంటుందా? |
| భాస్కరరావు: | మ్లేచ్ఛులు ముట్టని నీరా? అదెక్కడ ఉంటుంది. నిజానికి మనం ఉపయోగించే నీరంతా మ్లేచ్ఛులు ముట్టినదే. బ్రాహ్మణులు ఎలాగూ బావులను తోడరు. తోడిన బావులలోని నీటిని మనం ముట్టడానికి ముందే మ్లేచ్ఛులు ముట్టుకుంటారు. |
| సుశీల: | ముట్టుకుంటే ఏంటీ? ఆ తరువాత మేము అందులో శుద్ధ ఉదకాన్ని వేసి ఆ నీటిని శుద్ధి చేస్తాం కదా! |
| భాస్కరరావు: | అలాగైతే మంచిది. నేను ఇక్కడి నుండి వెళ్లేటప్పుడు రెండు ముంతలలో శుద్ధ ఉదకాన్ని తీసుకువెళితే సరిపోతుంది. |
| సుశీల: | ఇదేమి చోద్యం. ఇంగ్లీషు చదివిన పిల్లలతో మాట్లాడితే ఇలాగే చెప్పింది వినకుండా కుతర్కం చేస్తారు. |
| భాస్కరరావు: | కుతర్కం కాదమ్మ కొంచెం నేను చెప్పేది ఆలోచించి చూడు. ముట్టినంత మాత్రాన అశుద్ధమై పోతాయన్న మాటే నాకు అర్థం కావడం లేదు. ఒక మ్లేచ్ఛుడు నన్ను ముడితే నా శరీరం అశుద్ధం అవుతుందా? |
| సుశీల: | సంశయం ఎందుకు? |
| భాస్కరరావు: | అలాగైతే నేను మ్లేచ్ఛుల శరీరాన్ని తాకితే అతని శరీరం శుద్ధమౌతుంది. |

సుశీల: ఈ చమత్కార ప్రశ్నలకి నావద్ద ఉత్తరం లేదు.

భాస్కరరావు: చమత్కారం ఏమీ లేదమ్మ. నాకేమనిపిస్తుందంటే శుద్ధంగా ఉండాల్సింది మన హృదయం. హృదయంలో చెడు సంకల్పాన్ని ఉంచుకొని బయటినుండి శరీరాన్ని శుభ్రం చేస్తే ప్రయోజనం ఉండదు. ఇంతకు మించి నేను నీకు ఏమీ చెప్పలేను." (వెంకటరావు, గుల్వాడి. 1962: 100).

ఈ సంభాషణ 'అంటరానితనం విడనాడాలన్న సందేశాన్ని ఇస్తున్నది. ఇందులేఖ నవలలో నంబూద్రి బ్రాహ్మణులు నాయర్‌లను తక్కువ చేసి చూడటం ఉంది. అంటరానితనానికి సంబంధించిన వర్ణన ఇందులేఖ నవలలో కనిపించదు.

**ii. వేశ్యావృత్తి:**

"మానసిక ఉద్వేగానికి అతీతంగా స్త్రీ తన దేహాన్ని పురుషుల లైంగికావసరాలు తీర్చేందుకు సమర్పించి అందుకు బదులుగా కొంత ధనాన్ని లేదా తదనుగుణమైంది పొందటాన్ని పడుపు తనంగాను, ఆపనిని వృత్తిగా సాగించడాన్ని పడుపువృత్తిగాను, దీన్ని చేపట్టిన స్త్రీలను పడుపుకత్తెలుగాను చెప్పుకోవచ్చు." (గంగిరెడ్డి, బుక్కా. 2004: 66) వీరినే భోగంవాళ్లని, వేశ్యలని అంటారు. ఈ వేశ్యావృత్తి ప్రాచీన కాలం నుండి భారతదేశంలో ఉంది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో దేవాలయ వ్యభిచారిణులను నృత్యకత్తెలుగా పేర్కొన్నాడు. దేవునికి దాసీలుగా నియమింపబడ్డ దేవదాసీలు 'దైవ ప్రతినిధులైన" పూజారులకు ఉంపుడు గత్తెలుగా దిగజార్చబడ్డారు. మధ్యయుగాల్లో రాజులు, జమీందార్లు, పురోహిత వర్గం ఉంపుడు గత్తెలను ఉంచు కోవడం భేషజంగా ఉండేది. వారికి రాజులు, భూస్వాములు, జమీందార్లు ఇనాములు ఇచ్చి పోషించేవారు. రాజ్యాలు, జమీన్లు పోయాక వారు కళావంతులయ్యారు. అంటే ఆడపిల్లలకు ఆటా, పాటా నేర్పించి 'కష్టమర్సను' మురిపింపచేసేవారు. అది పాపమని, అవినీతి అని తెలియనీయకుండా అలంకారాలవైపు, ఆస్తులవైపు వారిని మళ్ళించేవారు. వీరికి అసలు వివాహాలే ఉండేవి కావు. దేవదాసీలకు మాత్రం కత్తితోనో, విగ్రహంతోనో పెళ్లి చేసేవారు. కొందరు వృత్తి చేసుకుంటూ అంటే ఒక్కనితోనే ఉంటూ భోగం మేళాలకు వెళ్లేవారు. ఆ రోజులలో భోగంమేళాలు లేని పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిగేవికావు. క్రమేపి వారి అందం, ఆకర్షణలకు కాముకులైన పురుషులు కళావంతులను లోభపెట్టి వారిని చెడగొట్టి పడుపు

వృత్తిలోకి ఈడ్చారు. అలా ఈ వృత్తి అభివృద్ధి చెందుతూ ఈ నాటికి ఘనీభవించింది. ఈ వేశ్యావృత్తిలో సంఘం కట్టుబాట్లకు బలైన బాలవితంతువులు, భర్తల హింసలు భరించలేని వారు, పెళ్లికాని తల్లులు, మానభంగానికి గురైన స్త్రీలు, భర్తలచేత విడిచిపెట్టబడ్డవారు, కుటుంబ బాధలు భరించలేనివారు ఈ వేశ్యావృత్తిలోకి లాగబడుతున్నారు. ఇలాంటి వేశ్యల ప్రస్తావన దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది. ఇది పంతొమ్మిదవ శతాబ్దం నాటికి అమలులో ఉన్న వేశ్యావృత్తికి నిదర్శనం.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో వేశ్యల గురించిన వర్ణన కనిపిస్తుంది. శ్రీరంగరాజు తండ్రి మూరురాయగండర్ 'శారద' అనే వేశ్యని చూసి మోహిస్తాడు. శారదకి, మూరురాయగండర్‌కి కృష్ణుడు జన్మిస్తాడు. కృష్ణునితోగొడవ పడి శ్రీరంగరాజు ఇంటి నుండి వెళ్లిపోతాడు. ఈ విధంగా కథలో ప్రధాన మలుపుకి శారద పాత్ర కారణమవుతుంది. శ్రీరంగరాజుచరిత్ర నవల ఒకటవ అధ్యాయంలో వేశ్యల గురించిన విస్తార వర్ణన కనిపిస్తుంది.

"మఱియు వేల్పులకు దాస్యము చేయుచూ ముందు పెద్దలు నిర్ణయించిన యాచారము చొప్పున నితర పట్టణములందువలె నీపురమందును గొందఱు వేశ్యలు దేవాలయమునకు ముద్ర చెందినవారు వాసము చేయుచుండుదురు. వారు మహాసుందరులు, చుక్కవంటివారు. మహాధీరులైన మునులను సయిత మేమరించు వారు. వారి లోపల శారద యనునది మిక్కిలి సొబగు కన్నులది, చందురు మోముది, మృదులాంగి, మల్లెపూవు జొంపము అది మహారాజు గారిచే బరిగ్రహింప బడి రాజు సదనము నందే యొక తట్టున బ్రత్యేకముగానుంపబడి రాజస్త్రీలకు సమానంగా సన్మానింపబడుచుండే." (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 61). ఈ వర్ణన ఆనాటికాలంలో వేశ్యలకి లభించిన గౌరవానికి నిదర్శనం.

శ్రీరంగరాజు ప్రవర్తన గురించి తెలిసిన మూరురాయగండర్ 'శారదని' అంతఃపురం నుండి వెళ్లిపోవలసిందిగా అజ్ఞాపిస్తాడు. ఈ సందర్భంలో 'శారద' మూరురాయగండర్‌తో అన్న మాటలు వేశ్యల జీవన విధానాన్ని గురించి ఆనాటి సమాజంలో వేశ్యలపట్ల ఉన్న చిన్న చూపు గురించి తెలుపుతున్నాయి.

"నేను వారంగన వారాంగనయేకదా యెన్ని దినములుండినాగాని నావెలయాలి బ్రతుకు మానునే. యెంత గొప్పవానిని నాశ్రయించిన నేమిఫలంబు, నా తల్లిని నా యప్ప సెల్లెంద్రను, నా యన్న దమ్ములను, నట్టేటఁ గలిపి నీ యందు మోహంబుచే నీ వలను న జిక్కి నా ప్రాయంబు సర్వంబు నీ పాలు గావించితిని, యథేచ్ఛగా స్వతంత్ర వృత్తిని నిర్భయంగా బ్రవర్తించి మా కనురూపంబులయిన సుఖంబులనుభవించు దానిని నన్ను కారాగృహమునందుంచిన రీతిని నియంతఃపురంబున నుంచుకొని యిన్ని సంవత్సరములనుభవించి యిప్పుడు లోకులపాలు చేయుట ధర్మంబే-వృద్ధనయితినింక నీ కోరిక సఫలంబు చేయుటకుందగిన దానను గానని ఇట్లు నిర్ధయ చేయఁదలిఁచితివని పలికి నన్ను మొట్టమొదట దేవాలయమునందు నీ యిలవేల్పు సమక్షమున జూచి సన్నచేసినపుడు నీ కిది తోచక పోయెనె. యప్పుడా పట్టపు దొరసాని యాడనుండెనో, యీ మహా పుత్రుండేడ నుండెనో, కృష్ణుని భటులు సన్మానంబు చేసి కృష్ణయ్యగారని పిలిచిన మాత్రముననే యింత కాఠిన్యంబు వహించినది" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 66). ఈ మాటలు వేశ్యలను పురుషుల కామవాంఛ తీర్చడానికి మాత్రమే ఉపయోగించిన విధానాన్ని తెలుపుతున్నాయి.

ఇందిరాబాయి నవలలో విఠలరావు దీపావళి ఉత్సవాలలో నాట్యమాడడానికి వచ్చిన గోకుళి, గులాబి అనే వేశ్యలను చూసి మోహిస్తాడు. పొక్కుసెట్టి మధ్యవర్తిత్వం వల్ల వాళ్లతో సంబంధాన్ని ఏర్పర్చుకుంటాడు. వారిని ప్రత్యేకంగా తన తోటలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్న బంగళాలో ఉంచి చూసుకుంటాడు. విఠలరావు భార్య ఇందిరాబాయి పుష్పవతి అయినదని తెలిసి గోకుళి, గులాబి బాధపడతారు. ఇకపై విఠలరావు తమ వద్దకి రాదని తమని బాగా చూసుకోదని నిట్టూర్పులు వదులుతారు. ఈ సందర్భంలో గోకుళి, గులాబీలు ప్రవర్తించిన తీరు విఠలరావు వారితో అన్న మాటలు నవల రచనా కాలం నాటికి వేశ్యలకి శ్రీమంతులకి మధ్య ఉన్న సంబంధానికి నిదర్శనం.

"ఇందిరాబాయి పుష్పవతి అయిందన్న విషయాన్ని గోకుళి, గులాబీలవద్ద అత్యుత్సాహంతో చెప్పగా వాళ్లిద్దరు చాలా బాధ పడతారు. ఒకామె ఇక నేను మీకెందుకు? నేను ఈ రోజు రాత్రి ఈ బంగళాలో విషాన్ని తాగి ఆత్మహత్య చేసుకుంటాను. నేను మరణించిన తర్వాత మీరు మీ భార్యతో సంతోషంగా ఉండండి. చాలు మిమ్మల్ని నమ్మినందుకు నాకు సరిగ్గా జరిగింది అంటూ మాట్లాడుతుండగా ఇంకొకామె కళ్లు తిరిగి పడిపోయింది. ఆమెకి నీళ్లిచ్చి

శుశ్రూష చేసి ఇద్దరిని పడక గదిలోకి తీసుకువెళ్లి మంచంపై కూర్చోబెట్టి విఠలరావు వాళ్లకి అనేక రకాలుగా నచ్చచెప్పుతాడు. అయినా వారు విఠలరావు మాట వినక మేము ఈ రోజు చావడం ఖాయమని పంతం పట్టారు. అప్పుడు విఠలరావు బాధపడుతూ "అలాగైతే నేను కూడా ఈ రోజు చచ్చిపోతాను." అని నుదిటిపై చేయిని ఉంచి ఆలోచిస్తుండగా అక్కడికి వకీలు సూరప్పయ్య వస్తాడు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 115). ఈ సంభాషణ పంతొమ్మిదవ శతాబ్దం నాటికి కన్నడ ప్రాంతంలో కొనసాగిన వేశ్యావృత్తికి ఉదాహరణ.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ఆన్దిచ్చియమ్మాళ్ అత్తవారింట్లో తాను పడ్డ కష్టాలను గురించి ప్రతాపముదలియార్ కుటుంబానికి వివరిస్తుంది. ఈ సందర్భంలో వేశ్యల గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

"అన్ని కష్టాలను ఓర్పుతో సహించాను. అలాగుండగా మా అత్తగారు, ఆడపడుచు ఇరువురు కొంత మంది వేశ్యలను తరచూ మా ఇంటికి పిలుచుకొని వాళ్లకు, నా భర్తకు స్నేహం కలగజేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. దానిని బట్టి వాళ్లు ఎంత దుర్మార్గులో మీరే ఊహించుకోండి." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 67). ఈ సంఘటన పంతొమ్మిదవ శతాబ్దం నాటికి తమిళ ప్రాంతంలో వేశ్యావృత్తి ఉందనడానికి నిదర్శనం.

ఇందులేఖ నవలలో మాధవుడు ఇందులేఖ తన ప్రేమని అంగీకరించని సందర్భంలో మలయాళ దేశంలో స్త్రీలకి స్వేచ్ఛ అధికంగా ఉందని ఇందులేఖతో అంటాడు. ఈ సందర్భంలో ఇందులేఖ మాధవునితో పలికిన మాటల్లో వ్యభిచారానికి సంబంధించిన ప్రస్తావన కన్పిస్తుంది. "ఏం చెప్పారు. మలయాళ స్త్రీలు పతివ్రతా ధర్మాన్ని అనుసరించడం లేదా? మిగిలిన దేశాల్లోని స్త్రీలవలే మలయాళ స్త్రీలు కూడా తప్పకుండా పతివ్రతా ధర్మాన్ని అనుసరిస్తారు. ఎంతో మంది స్త్రీలు దీనిని ఆచరిస్తున్నారు. ఒక స్త్రీ పతివ్రతా ధర్మాన్ని అనుసరించడం లేదంటే ఆమె వ్యభిచారి అని అర్థమా? అలా చెబితే నేను అంగీకరించను. సంగీతం తెలిసిన ఒక స్త్రీ పాడుతూ ఉండగా పది మంది పురుషులు ఒకటిగా చేరి వింటే ఆ పది మంది పురుషులు ఆమె రహస్య ప్రేమికులని మీరు చెపుతారు. ఒక స్త్రీకి పతివ్రతా ధర్మంలో కొంచెం కూడా లోపం లేకుండా మిగిలిన పురుషులతో పలు విధాలుగా మాట్లాడడం, పరిచయం, మొదలైన అవకాశాలు ఏర్పడవచ్చు. అలా మాట్లాడడం కలిసి మెలిసి ఉండడం ఇదంతా వ్యభిచారం అనే ఒక భావనలో ఆలోచించి

అనవసరంగా కేరళ స్త్రీలను అవమానించే బుద్ధిహీనుల జాబితాలో మాధవుడు చేరడం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 38).

ఈ మాటలు మలయాళ దేశంలో నాయర్ స్త్రీలకు స్వేచ్ఛ ఉన్నంత మాత్రాన వారు వ్యభిచారులు కాదని తెలుపకనే తెలుపుతున్నాయి. ఈ విధంగా దక్షిణ భారత తొలి సాంఘిక నవలలన్నింటిలో వేశ్యావృత్తిని గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇది పంతొమ్మిదవ శతాబ్దం నాటికి దక్షిణ భారతదేశంలో ఉన్న వేశ్యాలంపటత్వానికి ఒక ఉదాహరణ.

### 5.2.2. మతం

భారతదేశంలోకి వ్యాపారం నిమిత్తం వచ్చిన ఈస్టిండియా కంపెనీ పాలకులు భారతదేశంలో ఆంగ్లేయ అధికారాన్ని స్థాపించడానికి క్రైస్తవ మత వ్యాప్తి తోడ్పడుతుందని గ్రహించారు. “భారతీయులని మొదట విద్యావంతులని చేయాలి. తరువాత క్రైస్తవ మతంలోకి మార్చాలి. అని గ్రాంట్ విశ్వసించాడు. క్రైస్తవుడిగా మారిన ప్రతీ భారతీయుడు తన స్వంత ప్రయోజనం కొరకూ, భద్రత కొరకు బ్రిటీషువాళ్లకు విధేయుడిగా ఉంటాడు. కనుక క్రైస్తవ మతవ్యాప్తి అంతిమంగా భారతదేశంలో బ్రిటీషు స్థానాన్ని పటిష్టపరుస్తుందని మిషనరీలు నొక్కిచెప్పాయి.” (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 35). మతవ్యాప్తి నిమిత్తం భారతదేశంలోకి అడుగుపెట్టిన క్రైస్తవ మిషనరీలు దానికి అనుగుణంగా దక్షిణ భారత దేశంలో వివిధ ప్రాంతాలలో పాఠశాలలను, ముద్రణాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు మత బోధనతో కూడిన విద్యని ప్రారంభించాయి. క్రైస్తవ మిషనరీలు కుల, మత భేదాలని పాటించక పోవడం, ఉద్యోగాలని ఇప్పించడం వల్ల నాటి సమాజంలో వివక్షని ఎదుర్కొంటున్న ప్రజలు, బీదవారు క్రైస్తవ మతంలోకి మారారు.

“1881 నాటికి మొత్తం 12,804 మంది మతం మారినట్లు అంచనా వేయబడింది. ఈ మత మార్పిడికి ఆంగ్లేయ పాఠశాలలు కేంద్ర బిందువులుగా మారాయి. సులభంగా ప్రభావితంకాగల చిన్న వయసులోనే మనసులను మార్చే ఉద్దేశంతో మిషనరీలు విద్య మీద అదుపు సంపాదించడానికి ప్రయత్నం చేసాయి. ఆంగ్ల భాషా పాఠశాలల ద్వారా ఉన్నత కులాలవాళ్లను క్రైస్తవ మతంలోకి మార్చవచ్చుననే ఉద్దేశంతో ఆ పాఠశాలలను, వాటితోపాటు

గ్రామాలలో పలు ప్రాథమిక పాఠశాలలనూ మిషనరీలు స్థాపించాయి. పాఠశాలలో బైబిల్‌ని విధిగా బోధించేవాళ్లు. బైబిల్‌లోని కథలు నిత్యం ఉపయోగించబడేవి. దీనిపట్ల ఆక్షేపణలు, సంఘటిత మైన నిరసనలు వచ్చాయి. ఈ సందర్భంలో 1806లో జన్మించిన గాజుల లక్ష్మీనరసు సెట్టి కృషిని ప్రస్తావించక తప్పదు. మద్రాసు రాష్ట్రంలో మొదటి ప్రజానాయకుడు ఆయనే. పాఠశాలలో బైబిల్ బోధనని ఆయన వ్యతిరేకించాడు. దానికిగాను ఆయన ఒక బహిరంగ సభ జరిపి, దాదాపు పన్నెండువేల సంతకాలతో ఒక మహాజరును ఇంగ్లాండుకు పంపాడు. యీ ఆందోళన ఫలితంగా బైబిల్ బోధన తాత్కాలికంగా నిషేధించబడింది." (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 37, 38). కలకత్తా ముస్లీంలు సమర్పించిన విజ్ఞాపన పత్రానికి సమాధానం ఇస్తూ "ఆంగ్లభాష బోధించే పాఠశాలలు, కళాశాలలలో మత బోధన ఉండదని ప్రత్యేక్షంగాగాని, పరోక్షంగాగానీ క్రైస్తవ మత ప్రచారానికి ప్రోత్సాహం ఉండదని గవర్నర్ జనరల్ బెంటింగ్ ప్రకటించాడు." (శేషన్, ఎస్.ఎస్. 1999: 73). ఈ సంఘటనలు విద్యావ్యాప్తిలో భాగంగా క్రైస్తవ మత ప్రచారం జరిగిందనడానికి నిదర్శనాలు. పంతొమ్మిదవ శతాబ్దంలో క్రైస్తవ మత వ్యాప్తి వల్ల ప్రజలలో కలిగిన ఆందోళనలు పంతొమ్మిదవ శతాబ్దం నాటి తొలి సాంఘిక నవలలో ప్రస్తావనకి వచ్చాయి.

### 5.2.2.1. ప్రతిస్పందనలు

"ఇందులేఖ" నవలలో పంజుమీనన్ ఆంగ్ల విద్యా వ్యాప్తివల్ల ఇందులేఖ, మాధవుల ప్రవర్తనలో కలిగిన మార్పులను గురించి 'గోవిందపణిక్కరు' వద్ద చెప్తాడు. వీరిద్దరి మధ్య నడిచిన సంభాషణ పంతొమ్మిదవ శతాబ్దం నాడు మత మార్పిడిపై ప్రజల మనస్సులో నెల కొన్న మానసిక సంఘర్షణకి నిదర్శనం.

**పంజుమీనన్:** తాటాకులంటే ఆమెకు అసహ్యం. కాగితం పుస్తకాలు తప్ప వేరే దానిని వీళ్ళెవరూ చేతితో నైనా తాకరు. ఇదంతా కలియుగం యొక్క వైపరిత్యం, వేరే ఏం చెప్పేది.

**గోవిందపణిక్కర్:** కలియుగం వైపరిత్యమే ఇది. దీనిని గురించి నేను వేరేది చెప్పడానికిలేదు.

**పంజుమీనన్:** ఇంగ్లీషు చదువు చదివి ఇక ఆ క్రైస్తవ వేదంలో ఈ పిల్లలు చేరిపోతారేమోనని నాకు భయం.

గోవిందపణిక్కర్: దానిని గురించి నాకూ భయం ఉంది. ఈ బుద్ధిలేని వాళ్లు దాంట్లో చేరిపోతే మనం ఏం? చేయగలం. రాజుకూడా ఇంగ్లీషు రాజైనాడు కదా! ఎవరు మన కష్టాలను చెవిలో వేసుకుంటారు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 70)

తమిళ ‘ప్రతాపముదలియార్’ చరిత్ర రచించిన వేదనాయగంపిళ్ళై శైవవేళాల కులానికి చెందినవారు. “వారి పూర్వీకులైన మదురైనాయగంపిళ్ళై కత్తోలిక మతం స్వీకరించినందువల్ల వీరు క్రైస్తవ మతస్తులయ్యారు.” (జయప్రకాశ్,ఎస్(అ). 2008: ix). వేదనాయగంపిళ్ళై 1826వ సంవత్సరంలో జన్మించారు. ఈ సంఘటన క్రైస్తవమత వ్యాప్తి 1826నాటికి తమిళ ప్రాంతంలో ఉందనటానికి నిదర్శనం. ఇందిరాబాయి నవలలో భీమారావు, భాస్కరరావు ఆహార్యంలో మార్పు రావడానికి క్రైస్తవ మతమే కారణం అని అనుకుంటాడు.

“మద్రాసు వెళ్లిన తరువాత స్నానం చేయడం, జపహోమాలను ఆచరించడం, సంధ్యా వందనం మొదలైన జాతి నియమాలు కొండెక్కుతాయి. జుట్టు పెంచుకొని క్రైస్తవుల మాదిరిగా గడ్డం పెంచి, గురువులు, పూర్వీకుల ఆచారం పట్ల ఏ మాత్రం లక్ష పెట్టక స్వీయ మనస్సుతో నడుచుకుంటారు.” (వెంకటరావు, గుల్వాడి. 1962: 21) ఇలా ఆహార్యంలో మార్పు వచ్చిన వారు జాతిని భ్రష్టం చేస్తున్నారని భీమారావు మఠాధిపతులకి లేఖ రాస్తాడు. అంతే కాక అంబాబాయి, భీమారావు తమ కూతురిని ఆంగ్లం తెలిసిన వారికి క్రైస్తవ మతస్తులకి ఇవ్వకూడదని నిర్ణయించుకుంటారు. ఈ సంఘటనలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి క్రైస్తవ మత వ్యాప్తి భారతదేశంలో ప్రారంభమైందనడానికి నిదర్శనాలు.

### 5.2.3. వివాహ సంప్రదాయం

భారతీయ సమాజాన్ని వివాహ వ్యవస్థని వీడి ఊహించలేం. భారతదేశంలో వివాహం అతి ప్రాచీన సంప్రదాయం. ఆదిమ కాలంలో గణాలుగా ప్రజలు జీవిస్తూ కేవలం ఆహారం కోసమే తమ జీవనాన్ని సాగిస్తున్న తరుణంలో వివాహ సంప్రదాయం ఏర్పడలేదు. “మొట్ట మొదటి సామాజిక వ్యవస్థ నియమ రహితమైందని ఆ వ్యవస్థలో స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి ఆంక్షలు లేని లైంగిక సంబంధాలను అనుమతించేవారని, పుట్టిన పిల్లలను బృందం పిల్లలుగా పరిగణించే వారని మోర్గాన్, స్పెన్సర్ వంటి పరిణామవాదులు భావించారు.” (విశ్వనాథం, జి. 2012: 195). ఇలా ఆంక్షలు లేని లైంగిక సంబంధంవల్ల పుట్టిన పిల్లలను తల్లి చూసుకునేది. ఆ పిల్లలను గణంలో ఉన్న అందరు పురుషులు సంరక్షించేవారు. కాని వారికి తండ్రి ఎవరో

తెలిసేది కాదు. ఇది మాతృ కేంద్రీకృత కుటుంబాలకు పునాది వేసింది. కాలక్రమేణ మానవుని ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. సంపాదించే ఆహారం, పండించే పంటతోపాటు పుట్టిన పిల్లలను కూడ ఆస్తిగా పరిగణించడం ప్రారంభమైంది. దీనితో ఒక స్త్రీ, ఒక పురుషుడు సంబంధానికి బీజం పడింది. ఇది పితృ కేంద్రీకృత కుటుంబాల ఏర్పాటుకు దారి తీసింది. స్త్రీ, పురుషుల మధ్య నూతనంగా ఏర్పడ్డ ఈ సంబంధం సమాజంలో అనేక రకాలుగా పరిఢ విల్లింది. కొన్ని సమాజాలలో ఒక పురుషునికి అనేక మంది స్త్రీలతో సంబంధం ఉంటే అతని ప్రతిష్ఠ పెరిగింది. అందువల్ల ఒక పురుషుడు ఎక్కువ మంది స్త్రీలతో సంబంధం కలిగి ఉండే పరిస్థితి ఏర్పడింది. ఇది తరువాతి కాలంలో బహుభార్యత్వానికి దారి తీసింది. కాలక్రమేణ స్త్రీ, పురుష సంబంధంలో పురుషుని ఆధిపత్యం పెరిగింది. పురుషుడు ఎవరితో సంబంధాలు ఏర్పరుచు కోవాలి, స్త్రీలు ఎటువంటి పురుషులతో సంబంధాలు ఏర్పర్చు కోవాలి అన్న అంశాలకు ప్రాధాన్యం పెరిగింది. సమాజంలో స్త్రీ, పురుష సంబంధానికి వివాహం అనే ఒక సామాజిక గుర్తింపు లభించింది. ఈ వివాహం స్త్రీ, పురుషుల మధ్య బంధాన్ని ఏర్పరిచింది. ఈ వివాహ బంధం ద్వారా కుటుంబాలు ఏర్పడ్డాయి. స్త్రీ, పురుషుల మధ్య ఉండే బంధం ఆధారంగా అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు వివాహాన్ని నిర్వచించారు.

"స్త్రీ, పురుషుల మధ్య సంతానం కలిగిన తర్వాత కూడా నిలిచి ఉండే చివరి స్థాయి సంబంధమే వివాహం." –వెస్టర్ మార్క్

"పిల్లల్ని కనడం, వారి సంరక్షణ చూడడంకోసం చేసుకున్న ఒప్పందమే వివాహం." –మాలినోవ్‌స్కీ

"పరస్పర స్త్రీ పురుష సంబంధాలలో భర్తకు, భార్యకుగల హక్కులను, బాధ్యతలను, సౌకర్యాలను నిర్వచించే నియమ, నిబంధనల సారమే వివాహం." –లండ్ బర్గ్ (విశ్వనాథం, జి. 2012: 193).

ఈ అన్ని నిర్వచనాలలోను సమాజం ఆమోదించిన స్త్రీ, పురుష సంబంధం వివాహం అనే అర్థం ధ్వనిస్తుంది. ఈ సంబంధాలను ఏర్పర్చుకునే క్రమంలో నిమయ నిబంధనలు ఏర్పడ్డాయి. లైంగిక వాంఛ తీర్చుకునే ఉద్దేశంతో ప్రారంభమైన సంబంధం తరువాత బలపడి మాతృత్వ, పితృత్వ భావనలతో వివాహ బంధంగా స్థిరపడింది. పరిణామ క్రమంలో వివాహ వ్యవస్థ బలపడి కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. వివాహం జరిపించే క్రమంలో రక్తసంబంధీకుల మధ్య లైంగిక

సంబంధాలను నివారించే ఉద్దేశంతో కొన్ని నియమాలు ఏర్పడ్డాయి. ఈ వివాహ నియమాలు రెండు రకాలు.

### 5.2.3.1. బహిర్వివాహం

"బహిర్వివాహం అంటే సామాజికంగా నిర్ణయించిన ఒక బృందానికి వెలుపల వివాహమాడే పద్ధతి. అన్ని సమాజాలలోను వావి, వరుసల నిషేధాలకు అనుగుణంగా బహిర్వివాహం ఉంది. భారతీయ సంప్రదాయం ప్రకారం స్వగోత్ర వివాహం నిషేధం. కారణం ఏమిటంటే ఒకే గోత్రానికి చెందిన వారంతా తండ్రి తరపున రక్త సంబంధీకులుగా వారు భావిస్తారు. కనుక ఒకే గోత్రం వారందరూ భాతృసంబంధం కలిగి ఉంటారు. బహిర్వివాహం బంధువర్గాన్ని పెంచడమే కాకుండా సమూహాన్ని క్రమబద్ధం చేయడానికి ఉపయోగపడుతుంది." (విశ్వనాథం, జి. 2012: 197).

### 5.2.3.2. అంతర్వివాహం

"అంతర్వివాహం అనగా సమాజ పరంగా ఒకే సమూహానికి చెందిన వ్యక్తి అదే సమూహానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవడం. సమూహ బహిర్వ్యక్తులతో వివాహం నిషేధం. ఒక సమూహం నిష్కళంకంగా కొనసాగడానికి, సాదృశ్య స్వభావం కాపాడు కోవడానికి, సంఖ్యాపరంగా పెద్దదిగా ఉండడానికి అంతర్వివాహాన్ని ఎన్నుకున్నారు. భారతీయులు కులం కల్తీ కాకుండా ఉండడం కోసం వీటిని ప్రోత్సహిస్తున్నారు." (విశ్వనాథం, జి. 2012: 197).

ఈ వివాహాలలో పురుషుడు వివాహమాడే స్త్రీకి అతడికి ఉండే బంధుత్వం ఆధారంగా కూడా వివాహంలో రకాలు ఏర్పడ్డాయి.

### i. మేనరికపు వివాహం

"మేనరికపు వివాహం అంటే సోదరి, సోదరుల పిల్లలు వివాహం చేసుకోవడం. ఒక వ్యక్తి తన తల్లికి సోదరుడైన మేనమామ కూతురినిగాని, తన తండ్రికి సోదరి అయిన మేనత్త కూతురినిగాని వివాహం చేసుకోవడం మేనరికం అంటారు." (విశ్వనాథం, జి. 2012: 197).

**ii. జ్ఞాతి వివాహం**

అన్నదమ్ముల పిల్లలు లేదా అక్కాచెల్లెల్ల పిల్లలు చేసుకునే వివాహం జ్ఞాతి వివాహం. ఒక వ్యక్తి తన తల్లి సోదరి కూతురినిగాని, తండ్రి సోదరుని కూతురినిగాని చేసుకునే వివాహం జ్ఞాతి వివాహం.

**iii. దేవర వివాహం**

భర్త మరణిస్తే అతని సోదరుణ్ణి వివామాడే పద్దతిని దేవర వివాహం అంటారు. వంశ నామాన్ని, ఆస్తిని నిలుపుకోవడానికి, మరణించిన సోదరుని భార్యకు అతని పిల్లలకు రక్షణ కల్పించడానికి ఈ పద్ధతి ఏర్పడింది.

**iv. భార్య భాగిని వివాహం**

భార్య మరణిస్తే ఆమె సోదరిని వివాహమాడే పద్ధతిని భార్యభాగిని వివాహం అంటారు.

వివాహంలో భాగస్వాముల సంఖ్యనుబట్టి వివాహం రెండు రకాలు.

**v. బహుభార్యత్వం**

ఒక పురుషుడు అనేక మంది స్త్రీలను పెళ్ళాడడం బహుభార్యత్వం. ప్రాచీన భారతదేశంలో ఈ పద్ధతి ఉండేది.

**vi. బహుభర్తృత్వం**

ఒక స్త్రీ ఒకే సమయంలో ఒక పురుషుని కన్న ఎక్కువ మందిని వివాహమాడడాన్ని బహుభర్తృత్వం అంటారు. ఒక వేళ భర్తలందరూ అన్నదమ్ములైతే భాతృబహుభర్తృత్వం అంటారు. దక్షిణ భారతదేశంలోని 'తోడాలు' అనే గిరిజనులలో ఈ పద్ధతి కనిపిస్తుంది. (విశ్వనాథం, జి. 2012: 198, 199)

హిందూమత ధార్మిక గ్రంథాలలో ఎనిమిది రకాల వివాహ పద్ధతులు చెప్పడం జరిగింది.

i. **బ్రహ్మ వివాహం:** వధువు తండ్రి ఆమెను ఆభరణాలతో అలంకరించి వేదాలలో పాండిత్యం కలిగిన, మంచి నడవడిక కలిగిన వ్యక్తికి బహుమతిగా అందిస్తాడు. వధువు తండ్రి తాను ఎంచుకున్న వరుణ్ణి స్వయంగా ఆహ్వానిస్తాడు.

ii. **దైవ వివాహం:** వధువు తండ్రి వధువును అలంకరించి యజ్ఞాదులలో పౌరోహిత్యం వహించే పురోహితునికి కానుకగా సమర్పించడం దైవ వివాహం.

iii. **అర్ష వివాహం:** ఇందులో తండ్రి ధర్మసూత్రాల ప్రకారం వరుని నుండి ఒక ఆవుని, ఒక ఎద్దును లేక రెండు జతల ఆవులను, ఎద్దులను పొందిన తరువాత తన కుమార్తెను వరునికి ఇచ్చి వివాహం చేస్తాడు.

iv. **ప్రజా  త్య వివాహం:** ఇందులో వరునికి తగిన గౌరవ సత్కారాలు చేసిన పిదప వధువు తండ్రి తన కుమార్తెను వరునికి కానుకగా ఇచ్చి వివాహం చేస్తాడు.

v. **అసుర వివాహం:** వరుడు వధువు తండ్రికిగాని, లేదా ఆమె సంరక్షకులకుగాని ధనాన్ని కన్యాశుల్కంగా ఇచ్చి ఆమెను వివాహం చేసుకుంటాడు.

vi. **పైశా  వివాహం:** వధువు తండ్రి అనుమతి లేకుండా వధువుని వరుడు వివాహం చేసుకోవడం పైశాచి వివాహం.

vii. **రాక్షస వివాహం:** బాలిక అనుమతి లేకుండా ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్లడం లేదా మత్తుపదార్థాల సేవనం వల్ల తెలివితప్పి ఉన్న బాలికను ఆమె ఇష్టానికి విరుద్ధంగా వివాహం చేసుకోవడం రాక్షస వివాహం.

viii. **గంధర్వ వివాహం:** వివాహానికి వధువు, వరుడు అంగీకరిస్తే చాలు ఈ వివాహం నిర్ణయించడంలో వధువు లేక వరుని తల్లిదండ్రులుగాని లేక బంధువులు కాని జోక్యం చేసుకోరు." (రంగారావు, కె. 2013: 61).

### 5.2.3.3. తులనాత్మక పరిశీలన

దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో బహిర్వివాహం, అంతర్వివాహంలో మేనరిక, దేవర వివాహ సంప్రదాయాలు కనిపిస్తున్నాయి. శ్రీరంగరాజుచరిత్రలో సగోత్రవివాహం నిషేధం అన్న విషయం ప్రస్తావనకి వచ్చింది. సోనాబాయిని కొండవీటిదొర మనుషులు అపహరించిన సందర్భంలో శ్రీరంగరాజు సోనాబాయిది, కొండవీటి రాజుది ఒకే గోత్రం అని రాజ పురోహితుని ద్వారా కొండవీటి రాజుకి తెలిసేలా చేస్తాడు. అయినా రాజు మనసు మారదు. "కొండవీటి దొర భరద్వాజ గోత్రోద్భవుడు గనుక సోనాబాయి గోత్రంబు సహితమయినదని రాజునకు నివేదింపఁజేయు నుపాయంబు చేసితి యేమి యావి మీరిన కార్యంబు రౌరవాది నరక ప్రాపకంబని ఈ కార్యంబతడు మానవచ్చును." (ఇనాక్ కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 100).

లంబాడి కులం పాతివ్రత్యం గురించి చంద్రగుప్తి నగరంలో శ్రీరంగరాజుకి, రామయ్యకి మధ్య నడిచిన సంభాషణలో రామయ్య లంబాడీలలో ఆచారంగా ఉన్న దేవర వివాహం గురించి రాజకుమారునికి చెప్తాడు.

"**రాముడు:** వాలి భార్యను వాని తమ్ముఁడు సుగ్రీవుండు వరించి వివాహంబు చేసికొన్న రీతిని లంబాడీలలో వదినెను వివాహం చేసుకొను నాచారంబు గలదు. జననీ సమానమైన భ్రాతృజాయను వివాహంబగు దురాచారంబునకు సమర్థంబుగ వాలి, సుగ్రీవుల వంశస్థుల మని వారు వాక్కాణించెదరు గాని వారికి వీరికేమాత్రమయి సంబంధంబు లేదు.

**శ్రీ!!రా!!:** వదినెను వరించు నాచారంబు దురాచారంబని నింద చేసితివి. అది అట్లుండనిమ్ము లంబాడీలలో భ్రాత పంచత్వము నొందిన వెనుకగదా వదినెను వరించెదరు. మా పెద్దలు పాండవులు సమకాలమందె ద్రౌపదిని మొకర్తుకను వరించిరిగదా యంతకంటె దురాచారంబె యీలంబాడి యాచారంబు" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 91)

లంబాడీలలో వదినెను వివాహం చేసుకునే ఆచారం ఉంది. కాబట్టి వాళ్లది నీచ కులమని రామయ్య వాదించగా సోనాబాయిపై మరలుగొన్న శ్రీరంగరాజు పురాణ కాలంలో ద్రౌపదిని అన్నదమ్ములందరు కలిసి వివాహం చేసుకున్నారని, నలుని భార్య దమయంతి కూడ ప్రోషిత భర్తృకగా ఉండిందని రామయ్యకు గుర్తు చేస్తాడు.

ఇందిరాబాయి నవలలో భీమారావు, అంబాబాయిలది పెద్దలు కుదిర్చిన వివాహం (బ్రహ్మ వివాహం) వీరు తమ కూతురు ఇందిరాబాయికి బాల్య వివాహం చేస్తారు. భర్త మరణించడం వల్ల బాలవితంతువుగా మారిన ఇందిరాబాయి అమృతరావు వద్ద ఆశ్రయం పొంది చదువుకొని తాను ఇష్టపడ్డ భాస్కరరావుని వివాహం చేసుకుంటుంది. ఇలా రెండు తరాలకు చెందిన వివాహాల ప్రస్తావన ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో మేనరిక వివాహ ప్రస్తావన ఉంది. ప్రతాపముదలియార్ తన మేనమామ కూతురు జ్ఞానాంబాళ్‌ని ఇష్టపడతాడు. తన తల్లి సుందరఅణ్ణి తనకు జ్ఞానాంబాళ్‌తో వివాహం నిశ్చయించినట్లు చెప్పగా చాలా

సంతోషిస్తాడు. ఆటంకాలన్నీ తొలిగి జ్ఞానాంబాళ్‌తో ప్రతాపముదలియార్ వివాహం జరుగుతుంది.

ఇందులేఖ నవలలో ఇందులేఖ తనకు వరుసకి మేనమామ అయిన మాధవున్ని పెళ్లి చేసుకుంటుంది. ఇది మేనరిక వివాహం. ఈ మేనరిక వివాహం జరగడానికి ముందు మలయాళ ప్రాంతానికి పరిమితమైన "సంబంధం" గురించిన ప్రస్తావన ఇందులేఖ నవలలో కనిపిస్తుంది. మలయాళ ప్రాంత 'మరుమక్కతాయం' (ఉమ్మడి కుటుంబం) సంప్రదాయం లోని వివాహ కట్టుబాట్లు ఇందులేఖ నవలలో పరోక్షంగా ప్రస్తావనకి వచ్చాయి.

### 5.2.3.3.1. తరవాడు వివాహ సంప్రదాయం - తలికెట్టు కళ్యాణం - సంబంధం

"పంతొమ్మిదవ శతాబ్దంలో నాయర్ తరవాడు కుటుంబాలలో స్త్రీల వివాహానికి సంబంధించి ఒక ఆచారం చలామణిలో ఉండేది. అదే తలికెట్టు కళ్యాణం. ఈ సంప్రదాయం ప్రకారం తరవాడు స్త్రీ పరిణతి చెందిన తరువాత తన ఇష్టానుసారంగా నాయర్ లేదా నంబూద్రి పురుషులలో ఎవరితోనైనా లైంగిక సంబంధం ఏర్పరుచుకోవచ్చు. ఈ బంధాన్ని 'సంబంధం' అని పిలుస్తారు. ఈ 'సంబంధం'లో పురుషుడు స్త్రీకి తమ సంబంధానికి గుర్తుగా (Pudava) పుడవ(బట్టలు) ఇస్తాడు. పురుషుడు స్త్రీని ఆమె సొంత తరవాడులో (కుటుంబంలో)సభ్యురాలిగా చూస్తాడు. ఈ పురుషుడు నాయర్ అయితే అతని తల్లి వంశం ద్వారా నంబూద్రి అయితే అతని కుటుంబం ద్వారా గుర్తించబడతాడు. ఈ సంబంధంలో కొనసాగే జంట తమకి ఇష్టం లేక పోతే ఏ క్షణంలోనైనా విడిపోవచ్చు, ఇతరులతో సంబంధాలని ఏర్పరుచుకోవచ్చు. ఈ సంబంధంలో జన్మించిన సంతాన నిర్వహణ బాధ్యత పురుషులకు ఉండదు. సంతానం వారి అమ్మకు చెందుతుంది. కొన్ని సందర్భాలలో ఇలాంటి సంతానం తమ వాస్తవ తండ్రితో పూర్తి సంబంధాలని కోల్పోతుంటారు. ఈ సంప్రదాయం కేరళ ప్రాంతంలో 12వ శతాబ్దంనుండి కనిపిస్తుంది." (Anitha, Devasia. 2005: 229) ఈ సంబంధం గురించి చందుమీనన్‌గారు మలబార్ మారెజ్ కమిషన్‌కి తాను ఇచ్చిన రిపోర్టులో పేర్కొన్నారు.

"మలబార్ ప్రాంతంలో 'సంబంధం' ఆచారంలో కనిపించే వ్యత్యాసాలను, ఈ 'సంబంధ' ఆచారంతో ముడిపడిన కొన్ని సంఘటనలను నేను ఇపుడు సంక్షిప్తంగా వివరిస్తాను.

నేను ఉత్తర మలబార్ ప్రాంతంలో ఆచరించే 'పుడమురి లేదా వస్త్రదానం'ను వివరించి అది ఇతర ప్రాంతాలలో ప్రచారంలో ఉన్న 'సంబంధం' ఆచారం కన్నా ఏ విధంగా భిన్నమైందో వివరిస్తాను. 'సంబంధం' ఆచారంలో 'పుడమురి' ఉత్తర మలబార్ ప్రాంతంలో అత్యంత పవిత్రమైన మరియు సంప్రదాయమైన పద్ధతి. నా ఈ వివరణ నా ముందున్న సాక్ష్యాధారాల ఆధారంగా ఇస్తున్నాను. ప్రతి 'పుడమురి'లో జరిగే మొదటి కార్యక్రమం జ్యోతిష్య పరిశీలన. ఇందులో ఒక జ్యోతిష్యుడు వధువు, వరుని జాతకాలను పరిశీలిస్తాడు. ఇది వధువు ఇంటిలో వధు, వరుల బంధువుల సమక్షంలో జరుగుతుంది. పరిశీలన ముగిసిన తరువాత జ్యోతిష్యుడు తన లెక్కల ఫలితాంశాన్ని, మరియు తన అభిప్రాయాన్ని ఒక తాటి ఆకుపై రాసి వరుడి బంధువుల చేతిలో పెడతాడు. జాతకాలుకలిస్తే అక్కడే వివాహానికి ఒకరోజును నిర్ణయిస్తారు. ఆ తేదీని రెండు తాటాకులపై రాస్తారు. ఒక ఆకును వధువు ఇంటిపెద్ద కారణవన్‌కి ఇంకో ఆకును వరుని బంధువులకి ఇస్తారు. ఆ తరువాత వధువు ఇంట్లో జ్యోతిష్యునికి మరియు వరుని తరపు బంధువులకి భోజనాలు ఏర్పాటుచేస్తారు. వరుని తరుపువారు వధువుకి డబ్బు, బట్టలు ఇస్తారు. ఉత్తర మలబార్ ప్రాంతంలో ఉన్న అన్ని 'పుడమురి' ఇళ్లలో కనిపించే ఈ సంప్రదాయాన్ని 'పుడమురి కురిక్కళ్' అంటారు. ఇది దక్షిణ మలబార్ ప్రాంతంలో కనిపించదు.

'పుడమురి' ఆచారం నిర్వహణ తేదీకి మూడు లేదా నాలుగు రోజులముందు వరుడు వివాహానికి తన సమ్మతిని తెలపడానికి కారణవన్ మరియు కులపెద్దలను కలుస్తాడు. అప్పుడు వరుడు కులపెద్దలకు తాంబూలాన్ని ఇచ్చి పెళ్లికి వారి అనుమతిని పొందుతాడు. వివాహం నిశ్చయించిన రోజున తన స్నేహితులతో సూర్యాస్తమయం అయిన తరువాత వధువు ఇంటికి బయలుదేరుతాడు. అతను పల్లకిలో వెళ్తాడు. వధువు ఇంటిని చేరగానే వధువు తరపువారు వరున్ని, అతని స్నేహితులను సాదరంగా ఆహ్వానించి ఇంటి దక్షిణ భాగంలో ఏర్పర్చిన ఆసనంలో కూర్చుండబెడతారు. అక్కడ ఉన్న బ్రాహ్మణులకు వరుడు డబ్బులను పంచుతాడు. ఇది అయిన తరువాత అందరికీ భోజనాలు పెడ్తారు. అదే సమయంలో జ్యోతిష్యుడు నిశ్చయించిన ముహూర్తాన్ని అందరి సమక్షంలో చదివి తన దక్షిణ తీసుకుంటాడు. ఆ తరువాత వరుని స్నేహితుడొకడు అతన్ని ఇంటి ప్రముఖగదిగా పిలవబడే 'పదినట్టు' గదికి తీసుకువెళ్తాడు. సాధారణంగా వరుని తరుపువారు తమవెంట వధువు ఇంటిల్లిపాదికి కొత్తబట్టలు, తాంబూలాలు తెచ్చి ఉంటారు. వాటిని ఇంటి ధార్మిక కార్యక్రమాలు జరిగే పదినట్టు అని పిలవబడే

పశ్చిమదిక్కులో ఉన్న గదిలో ఆ వస్త్రాలను అప్పటికే ఉంచి ఉంటారు. ఈ గదిలో వస్త్రాలను ఇస్తారు. ఆ గదిని పడకగదిగా అలంకరిస్తారు. గదిలో అనేక దీపాలను వెలిగించి ఉంచుతారు. మాంగళ్యం లేదా పెళ్లిని సూచించే ఎనిమిది వస్తువులను ఉంచుతారు. వీటిని అష్టమాంగళ్యం అంటారు. అవి బియ్యం, వడ్లు, కొబ్బరిచెట్ల ఆకులు, ఒక బాణము, ఒక అద్దము, మంచిగా ఉతికిన ఒక బట్ట, మండుతున్న అగ్ని, అందంగా తయారుచేసిన ఒక చిన్న చెక్కపెట్టె దీన్ని 'చెప్పు' అంటారు. వరుడు ప్రవేశించిన వెంటనే గదిలో నేలపై వీటిని చూస్తాడు. వరుడు తన స్నేహితుడితో తూర్పుద్వారం గుండా గదిలో ప్రవేశిస్తాడు. మంచి విలువైన బట్టలను, నగలను ధరించి వధువు తన చిన్నమ్మ లేదా మేనత్త లేదా ఇంకెవరినైన ఇంటి పెద్దవారైన స్త్రీలతో కలిసి పశ్చిమ ద్వారం గుండా గదిలోకి ప్రవేశిస్తుంది. వధువు అష్ట మాంగళ్యం మరియు వెలిగే దీపాల ఎదురుగా, పూర్వాభిముఖంగా నిల్చుంటుంది. వరుని తరుపున వచ్చిన స్నేహితుడు అతనికి బట్టలు ఇస్తాడు. వరుడు వాటిని వధువు చేతికి ఇస్తాడు. తరువాత వధువు తరపున వచ్చిన స్త్రీ వధువు, వరునిపై అక్షింతలు చల్లి వెళ్లిపోతుంది. వరునికి ఇంకో కర్తవ్యం ఉంటుంది. ఇంటి దక్షిణ భాగంలో కూర్చొని ఉన్న కులపెద్దలకు, బంధువులకు తీపి భోజనం పెట్టి తాంబూలాలు ఇస్తాడు. అతిథులంతా వెళ్లిపోయిన తరువాత వరుడు,వధువుతో కలిసి శయ్యా గృహంలోకి ప్రవేశిస్తాడు. ఇది 'పుడమురి' ఆచారం." (Shankar memon. T.C. 1997: 80, 81).

### 5.2.3.3.2. వెలి

మలబార్ ప్రాంతంలో 'తలికెట్టుకళ్యాణం', 'సంబంధం'తో పాటు 'వెలి' అనే ఇంకో రకమైన వివాహం కూడా వ్యాప్తిలో ఉండింది. 'సంబంధం' నాయర్ స్త్రీకి, నంబూద్రి పురుషునికి జరిగే వివాహం కాగా వెలి నంబూద్రి పురుషునికి, నంబూద్రి స్త్రీకి జరిగే వివాహం "నంబూద్రిలకు నాయర్‌లకన్నా సమాజంలో అధిక గౌరవం ఉండేది. నంబూద్రిలలో కుటుంబంలో అందరికన్నా వయసులో పెద్దగా ఉన్న వ్యక్తి మాత్రమే తన కులంలోని స్త్రీని అంటే నంబూద్రి స్త్రీని వివాహమాడాలి. దీన్ని వెలి అని పిలిచేవారు. కుటుంబంలోని మిగతా నంబూద్రిలు నాయర్ స్త్రీలతో సంబంధాలను ఏర్పర్చుకునేవారు. ఇది సమాజంలో చలామణిలో ఉన్న ఆచారం." (Anitha, Devasa 2005: 229). ఈ ఆచారం వల్ల నంబూద్రి పురుషులకి నాయర్ స్త్రీలపై హక్కు ఉన్నట్లు స్పష్టమవుతుంది. నంబూద్రి పురుషులు నాయర్ స్త్రీలతో సంబంధాలను ఏర్పర్చుకొని ఆ సంబంధాల ద్వారా పుట్టిన బిడ్డలను చూసేవారు కాదు. ఆ బిడ్డలు

తన తల్లితోపాటు పెరిగేవారు. వారికి తమ తండ్రి ఎవరో కూడా తెలిసేది కాదు. ఇందులేఖ నవలలో ఇందులేఖ జననాన్ని గురించి పరిచయం చేస్తూ చందుమీనన్‌గారు "ఇందులేఖ కిళిమానూరు రాజులలో ఒకరి కుమార్తె. ఇందులేఖకు రెండున్నర సంవత్సరాల వయస్సున్నప్పుడు తండ్రి స్వర్గలోకవాసులయ్యారు." (జయప్రకాశ్, ఎస్.(అ). 2016: 9) అంటూ ఇందులేఖ కిళిమానూరు రాజులలో ఒకరికి పుట్టింది అన్నారేగాని, ఎవరికి పుట్టిందో చెప్పలేదు. ఇందులేఖ తల్లి లక్ష్మీకుట్టియమ్మ. ఈమెకి కిళిమానూరు రాజుతో సంబంధం ఉండేది. అతని మరణం తరువాత పంజుమీనన్ తరవాడులో సభ్యురాలిగా కేశవ నంబూద్రితో ఉంటుంది. ఇందులేఖని చూడడానికి వచ్చిన నంబూద్రిపాదు ఇందులేఖ తల్లి లక్ష్మీకుట్టియమ్మతో ప్రవర్తించిన తీరు నంబూద్రిలకు నాయర్ మహిళపై ఉన్న హక్కుకు నిదర్శనం.

**"నంబూద్రిపాదు:** పంజుగొప్ప అదృష్టవంతులు. ఇందులేఖను, పంజు కూతురు లక్ష్మీకుట్టిని చూసాను. తమలో నీవా నేనా అని పోటీ చేస్తున్నట్లున్న అందాలను చూసాను. కరుత్తేడం అదృష్టం. ఇద్దరూ చాలా అందగత్తెలు.

**సెరుసేరి నంబూద్రి:** ఇక్కడికి రావడం ఇందులేఖను చూడ్డానికే కదా!

**నంబూద్రిపాదు:** అవును. అయితే ఇక్కడికి వచ్చిన తరువాత లక్ష్మీకుట్టి మీద వ్యామోహం

**సెరుసేరి నంబూద్రి:** అట్లయితే అమ్మతో కూతురితో ఇరువురితో సంబంధం పెట్టుకోవడానికి వీలవుతుందా! అది సముచితంగా ఉంటుందా?

**నంబూద్రిపాదు:** అయితే సంబంధం ఇందులేఖతోనే" (జయప్రకాశ్, ఎస్.(అ).2016: 166-174)

ఈ సంభాషణ నంబూద్రిలు నాయర్ స్త్రీలను ఎలా చూశారు అన్నదానికి నిదర్శనం. ఇందులేఖని చూడడానికి వచ్చిన నంబూద్రిపాదు ఆమె తల్లిని మోహిస్తాడు. అతని మోహం తెలిసికూడ పంజుమీనన్‌కాని కేశవ నంబూద్రికాని అతన్ని ఏమీ అనరు. పంజుమీనన్‌కి నంబూద్రిపాదు ప్రవర్తన నచ్చకున్నా 'సంబంధ' సంప్రదాయానికి కట్టుబడి అలాగే ఉండిపోతాడు. ఈ రకమైన నంబూద్రిల ఆధిపత్యాన్ని ప్రశ్నించడం పంతొమ్మిదవ శతాబ్దంలో ప్రారంభమైంది.(Anitha, Devasai, 2005: 230).

ఈ సంబంధ ఆచారం వల్ల ఒక పక్క నంబూద్రి స్త్రీలు పెళ్లిళ్లు కాక మిగిలి పోతుంటే ఇంకో పక్క నాయర్ పురుషులు స్త్రీల కోసం వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. నంబూద్రి స్త్రీలను అధికంగా వృద్ధనంబూద్రిలు వివాహం చేసుకోవడం వల్ల వారు విధవలుగా మారేవారు.

పోను పోను నాయర్  యువకులలో ఈ సంబంధాల మూలంగా తమ స్త్రీలపై కలిగి ఉండే హక్కును ప్రశ్నించే ధోరణి అధికమైంది. దీనికి ఇందులేఖ నవలలోని ఒక సంఘటనని ఉదాహరణగా చెప్పవచ్చు. ఇందులేఖ, మాధవునికి మధ్య నడిచే ప్రేమ అందరికీ తెలిసినా ఇందులేఖ మాధవునికి భార్య అవుతుందో లేదో అనే సందేహం అందరిలో ఉండేది. తిరువనంతపురంలోని పొన్న తంబురాన్  గారికి ఇందులేఖను తన ప్రణయినిగా తీసుకెళ్లాలనే ఆలోచన ఉందని ఆ కాలంలో పంజుమీనన్ ఇంటి చావడిలో మాట్లాడుకుంటూ ఉండేవారు.

ఈ మాటలు విన్న మాధవుడు "ఎవడా పొన్నుతంబురాన్? ఎవడా రాజు? నా ఇందులేఖ నాకు భార్య. అలా జరగక పోతే దాని తరువాత నేను ప్రాణాలతో ఉండను" (జయప్రకాశ్, ఎస్(అ). ఇందులేఖ. 2016:15) అంటాడు. ఈ మాటలు మాధవునికి ఇందులేఖపై ఉన్న ప్రేమని తెలపడమేకాక తమ స్త్రీలపై ఇతరులకు హక్కు ఉందంటే కోపంతో ఊగిపోయే నాయర్ యువకుని మనస్తత్వాన్ని కూడా తెలుపు తున్నాయి.

### 5.2.3.3.3. వివాహం - స్త్రీకి స్వేచ్ఛ లేకపోవడం

నాయర్ 'తరవాడు' కుటుంబాలలో ఇంటి పెద్ద తమ ఇంటి స్త్రీకి ఎవరు సరిపోతారో తానే నిర్ణయించేవాడు. ఇందులో ఆ స్త్రీ అభిప్రాయం కోరేవాడు కాదు. ఆమెకు ఇష్టం ఉన్నా లేకున్నా ఇంటిపెద్ద నిర్ణయించిన వ్యక్తిని వివాహంచేసుకోవాలి. ఇందులేఖ నవలలో ఇందులేఖని మాధవుడికి కాక 'మూర్కిల్లాత్తమనైక్కల్' 'నంబూద్రిపాదు'కు ఇచ్చి వివాహం చేయాలని ఇంటి పెద్ద పంజుమీనన్ నిర్ణయిస్తాడు. అప్పుడు ఇందులేఖ తండ్రి కేశవ నంబూద్రికి, ఇందులేఖకి మధ్య నడిచిన సంభాషణ ఇందుకు ఉదాహరణ.

"**కేశవ నంబూద్రి:** ఇందులేఖ నీకు కళ్యాణం నిశ్చయం చేయబడింది.

**ఇందులేఖ:** ఎవరు నిశ్చయం చేసారు.

**కేశవ నంబూద్రి:** ఇందులేఖ తాతగారే నిశ్చయించేశారు

**ఇందులేఖ:** సరే నిశ్చయం చేయనీ!

**కేశవ నంబూద్రి:** ఇది ఇందులేఖకు సమ్మతమే కదా!

**ఇందులేఖ:** నిశ్చయం చేసిన తరువాత సమ్మతము అవసరమా!

**కేశవ నంబూద్రి:** ఇందులేఖకు సమ్మతమా, కాదా అనేది మాకు తెలియాలి!

**ఇందులేఖ:** అలాగయితే దానిని తెలుసుకుని నిశ్చయం చేసి ఉండాలి.

కేశవ నంబూద్రి: ఇందులేఖ దగ్గర చెప్పి తీర్మానించ వలసిన విషయం కాదది.

ఇందులేఖ: ఇది అన్యాయం. మరి ఎందుకని ఇప్పుడు వచ్చి నా దగ్గర అడుగుతున్నారు. తెలుసుకుని తీర్మానించదగిన విషయం కాదు. జరుగుతున్నప్పుడు మాత్రం తెలుసుకోవలసిన విషయం. అట్లయితే నిశ్చయం చేసిన తరువాత ఎందుకని సమ్మతం అడగాలి. (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 77, 78). ఈ సంభాషణ వివాహంలో స్త్రీకి స్వేచ్ఛ ఉండేదికాదని తెలుపుతుంది. కళ్యాణకుట్టి వివాహ సందర్భంలో కూడా ఆమె సమ్మతితో సంబంధం లేకుండానే నంబూద్రిపాదుతో కళ్యాణకుట్టి వివాహం జరుగుతుంది.

### 5.2.3.3.4. వివాహం - ఆచారాలు

వివాహం జరిగే క్రమంలో కొన్ని ఆచార వ్యవహారాలు పాటించడం భారతీయ సమాజంలో కనిపిస్తుంది. ఈ ఆచారాలు ప్రాంతాన్ని బట్టి, ఆయా ప్రజా సమూహాలు ఏర్పర్చుకున్న నియమ, నిబంధనలను బట్టి మారుతుంటాయి. పంతొమ్మిదవ శతాబ్దంలో వివాహ సమయంలో పాటించిన ఆచారాల ప్రస్తావన దక్షిణ భారత తొలి సాంఘిక నవలలో కనిపిస్తుంది.

### 5.2.3.3.5. జాతకాలను చూడటం - వివాహానికి ముహూర్తాన్ని నిర్ణయించడం

వధువు, వరుని ఇష్టాను సారంగా జరిగే గాంధర్వ (ప్రేమ) వివాహాల్లో జాతకాలను చూడడం అరుదు. పెద్దలు కుదిర్చిన వివాహాల్లో వధువు, వరుని జాతకాలు చూసిన తరువాత అవి కలిస్తేనే వివాహం చేయడం కనిపిస్తుంది. జాతకాలు కలువని పక్షంలో వివాహాలు కూడా రద్దు చేసేవారు. తెలుగు ప్రాంతం నుండి వెలువడిన శ్రీరంగరాజుచరిత్రలో శ్రీరంగరాజు ఇంటి నుండి వెళ్లిపోయిన సందర్భంలో అతని జాతకాన్ని చూడడం కనిపిస్తుంది. పద్దెనిమిది సంవత్సరాల వయస్సులో అతనికి జల గండం మృగ గండం ఉందని జాతకం చూసి రామాచార్యులు చెప్తాడు. శ్రీరంగరాజు సోనాబాయితో కూడి ఇంటికి వచ్చిన తరువాత అన్ని అపార్థాలు తొలిగిపోతాయి. అప్పుడు వారి పెళ్లికి జాతక రీత్య సరైన ముహూర్తం నిర్ణయించి పెళ్లి పత్రికలని పంచుతారు. "తదనంతరము వివాహంబునకు సమకట్టి ముహూర్తంబు నిశ్చయించి

బంధువులకు శుభ పత్రికలు పంపిరి." (ఇనాక్, కొలకలూరి. శ్రీరంగరాజుచరిత్ర. 2010: 114).

ఇందిరాబాయి నవలలో భీమారావు, అంబాబాయి తమ కూతురైన ఇందిరాబాయిని త్రయంబకరావు కుమారుడైన విఠలరావుకు ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకుంటారు. అప్పుడు భీమారావు, ఇందిరాబాయి, విఠలరావుల జాతకాలను చూస్తాడు. అవి కలిసిన తరువాత వివాహాన్ని నిశ్చయించ వలసిందిగా త్రయంబకరావుని కోరతాడు.

"భీమారావు–విఠలరావు జాతకాన్ని తెప్పించుకున్నాను. అది మా ఇందిరాబాయి జాతకంతో సరిగ్గా సరిపోయింది. అన్ని సరిపోయాయి. మంచిది నాకూ అదే కావాలి. నాకు ఒకే కుమారుడు, మీకు ఒకే కుమార్తె ఊరిలో ఉండే జనాలు సై!సై! అనే విధంగా వివాహాన్ని జరిపిద్దాం." (వెంకటరావు, గుల్వాడి. 1162: 83).

ప్రతాపముదలియార్‌కి జ్ఞానాంబాళ్‌తో వివాహం జరిగే సందర్భంలో జాతక రీత్యా వారి వివాహానికి శుభముహూర్తం నిర్ణయిస్తారు.

"నాకు జ్ఞానాంబాళ్‌కు అతిత్వరలో వివాహం చేయాలని సంబంధముదలియార్ త్వరపడ్డాడు. అయితే మా తల్లిదండ్రులు, దూరంలో ఉన్న బంధు జనాలు, దేవరాజపిళ్ళై, కనకసభ మొదలైన వాళ్లందరూ పెళ్లికి రావడానికి వీలుగా ముహూర్తాన్ని నిశ్చయించడం వల్ల పెళ్లి ఇరవై రోజుల తరువాత పెట్టవలసి వచ్చింది." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 77).

మలయాళ ఇందులేఖ నవలలో వివాహ విషయంలో జాతక ప్రస్తావన కనిపించదు. మలయాళ 'తరవాడు' సంప్రదాయంలో జాతకాలతో సంబంధం లేకుండా నంబూద్రి బ్రాహ్మణుడు నాయర్‌స్త్రీతో సంబంధం ఏర్పర్చుకుంటాడు. ఈ సంప్రదాయం ప్రకారమే ఇందులేఖని వివాహం చేసుకుందామని వచ్చిన నంబూద్రిపాదు అది కుదరక పోయేసరికి కళ్యాణ కుట్టిని వివాహం చేసుకొని వెళ్లిపోతాడు. మాధవుడు తన ఉత్తర భారతయాత్ర ముగించుకొని వచ్చిన ఏడవరోజు ఇందులేఖతో అతనికి స్వయంవరం జరుగుతుంది.

## 5.2.3.3.6. సమీప బంధువుల మరణం - వివాహం వాయిదా

జాతకాలను చూసి వివాహం నిర్ణయించిన తరువాత దాయాదుల మరణం వల్ల వివాహం వాయిదా పడిన సన్నివేశం ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో చిత్రితమైంది. ఇది నేటి కాలంలో కూడా కన్పిస్తుంది. సమీప బంధువులు మరణించినప్పుడు సంతాపంలో అందరూ ఉన్నందు వల్ల శుభకార్యాలను కొన్ని రోజులు వాయిదా వేస్తారు. తిరున్వేలిలో నివసించే వీరప్ప ముదలియార్ కుమారుడు చంద్రశేఖర ముదలియార్‌తో జ్ఞానాంబాళ్ వివాహం నిశ్చయమవుతుంది. ఇది తెలిసిన ప్రతాపముదలియార్ తండ్రి కోయంబత్తూర్‌లో ఉన్న చొక్కలింగ ముదలియార్ కుమార్తె పూంగావనంతో ప్రతాపముదలియార్ వివాహం నిశ్చయిస్తాడు. ఈ రెండు పెళ్లిళ్లకు చైత్రమాసం 28వ తేదీ ఉదయం ఆరు గంటలకు పూంగావూరులో శుభ ముహూర్తాన్ని నిర్ణయిస్తారు. "దైవాదీనంగా ఆ పెళ్లికి ఒక అడ్డంకి ఏర్పడింది. అదేమిటంటే పెళ్లికి ఎనిమిది రోజుల ముందు సంబంధముదలియార్ ఇంట్లో వాళ్ల దాయాదుల్లో ఒకరు మరణించడం వలన పెళ్లి ఆగి పోవాల్సి వచ్చింది. మగ పెళ్లివారిని ప్రస్తుతానికి రావాల్సిన అవసరం లేదని, పై నెలలో వేరొక ముహూర్తం నిశ్చయించి తెలియజేస్తామని సంబంధముదలియార్ తిరున్వేలికి వెంటనే ఒక ఉత్తరాన్ని పంపించి పెళ్లిని నిలిపివేశాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 55). ఈ సంతాపం ప్రతాపముదలియార్ కుటుంబానికి కూడా ఉండడం వల్ల ప్రతాపముదలియార్ తండ్రి కోయంబత్తూర్ వాళ్లకు తెలిపి పెళ్లిని వాయిదా వేస్తాడు.

ఇలాంటి సన్నివేశం కందుకూరి వీరేశలింగం పంతులుగారి రాజశేఖరచరిత్ర నవలలో కూడా కనిపిస్తుంది. రాజశేఖరుని కుమార్తె 'సీత' వివాహం పద్మరాజుతో నిశ్చయమవుతుంది. ఒక అనామకుడు రాజశేఖరుని పిన తండ్రి కుమారుడైన రామమూర్తి మరణించాడన్న వార్త తేవడంతో పెళ్లి వాయిదా పడుతుంది."ఆ మరునాడు ప్రాతః కాలంలోనే రాజశేఖరుడుగారు బయలుదేరి శోభనాద్రిరాజుగారి ఇంటికి బోయి తన పినతండ్రి కుమారుడైన రామమూర్తి మరణం వలన సంభవించిన దురవస్థను చెప్పి ముహూర్తమశుభదినములలో వచ్చుట చేత వివాహ కార్యమునకు సంబంధించిన ఆలస్యమునకు నష్టమునకు కొంత చింతపడి పెళ్లికుమారుడి వారు తరలి రాకుండా వెంటనే వర్తమానమును చేయుదని కోరిరి."

(వీరేశలింగం, కందుకూరి. 2010: 143). సమీప బంధువుల మరణంవల్ల వివాహం వాయిదా పడిన సన్నివేశం ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో కనిపించదు.

### 5.2.3.3.7. వివాహం - దురాచారాలు

#### 5.2.3.3.7.1. బాల్య వివాహాలు

చిన్నతనంలో చేసే పెళ్లిని బాల్య వివాహం అంటారు. రజస్వల కాకముందే ఆడవాళ్లకి పెళ్లి చేయాలన్న సంప్రదాయం సమాజంలో వ్యాప్తిలో ఉండడం వల్ల పది, పన్నెండు సంవత్సరాలలోపు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేవారు. ఈ పెళ్లిలో పెళ్లికొడుకుకి ఎంత వయస్సైనా ఉండవచ్చు. కానీ అమ్మాయి మాత్రం రజస్వల అయి ఉండరాదు. ఫలితంగా పది, పన్నెండు సంవత్సరాల ఆడపిల్లలకు డెబ్బై, ఎనభైసంవత్సరాల ముసలివాళ్లతో పెళ్లిళ్లు జరిగేవి. ఈ వివాహాల వల్ల అభంశుభం తెలియని పసిపిల్లలు విధవలుగా మారుతుండేవారు. "పంతొమ్మిదవ శతాబ్దం నాటికి ఆంధ్రదేశంలో 11, 904 బాల్య వివాహాలు జరిగాయని సంఘసంస్కరణలపై సిద్ధాంత గ్రంథం రాసిన వి.రామకృష్ణగారు చెప్పారు." (గంగిరెడ్డి, బుక్క. 2004: 132). పంతొమ్మిదవ శతాబ్దంలోనే కాదు నేడుకూడా బాల్య వివాహాలు జరుగురున్నాయి. "బాలికా వధువుల సంఖ్యలో ప్రపంచంలోనే భారత్ తొలి వరసన నిలుస్తోంది. స్త్రీ, పురుష సమానత్వం సాధించే క్రమంలో ఆధునిక సమాజానికి అతిపెద్ద గుదిబండగా మారిన సమస్య ఇది. ఇటీవల విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2015-16) నివేదికలో బాల్యవివాహాల గురించి వెల్లడైన వాస్తవాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. దేశంలో 47% శాతం బాలికలు 18ఏళ్లు నిండకుండానే వధువులవుతున్నారు. వారిలో కొందరు మైనారిటీ తీరకుండానే తల్లులుకూడా అవుతున్నారు. బీహార్‌లో 69శాతం, రాజస్థాన్‌లో 65శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయి. ఉత్తరాదిలోనే కాదు తెలుగురాష్ట్రాల్లోను సుమారు మూడోవంతు పెళ్లిళ్లు బాల్య వివాహాల పరిధిలోకే వస్తాయంటే అతిశయోక్తి కాదు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం స్త్రీల వివాహ వయస్సు 18ఏళ్లు. ఆ వయస్సు రాక ముందు జరిగే వివాహం చట్టప్రకారం చెల్లదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక ప్రకారం తెలంగాణలో 18ఏళ్ళలోపు బాలికా వివాహాల శాతం పట్టణాల్లో 15.7శాతం గ్రామాల్లో 35శాతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ బాల్య వివాహాల శాతం పట్టణాల్లో 26.3 శాతం, గ్రామాల్లో 35.5 గా ఉంది." (పద్మశ్రీ, యలమంచిలి: ఈనాడు పత్రిక: పుట సంఖ్య 4లో మంగళవారం, జనవరి 17, 2017న వచ్చిన వ్యాసం). ఈ

వాక్యాలు నేటికాలంలో జరుగుతున్న బాల్య వివాహాలకు నిదర్శనం. బాల్యవివాహాలు పంతొమ్మిదవ శతాబ్దంలో అధికంగా జరుగుతుండేవి. దీనికి ఉదాహరణలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తున్నాయి.

ఇందులేఖ నవలలో ఇందులేఖకి 11 సంవత్సరాల వయస్సు రాగానే ఆమెను పెళ్లి చేసుకుంటామని చాలామంది కృష్ణమీనన్‌ని అడుగుతారు. (జయప్రకాశ్, ఎస్.(అ). 2016: 12) కాని కృష్ణమీనన్ అందుకు ఒప్పుకోడు. పంజుమీనన్ కూడా ఇందులేఖకి వివాహ వయస్సు (15సంవత్సరాలు) వచ్చిందని కాబట్టి ఆమెకి వివాహం చేద్దామని కృష్ణమీనన్‌తో అంటాడు. కాని కృష్ణమీనన్ అందుకు ఒప్పుకోడు. (జయప్రకాశ్, ఎస్.(అ). 2016: 13) ఈ అంశాలు పంతొమ్మిదవ శతాబ్దంలో స్త్రీల వివాహ వయస్సు 11-15 సంవత్సరాల మధ్య ఉండేది అనడానికి సంకేతాలు. మారిన పరిస్థితుల కారణంగా స్త్రీలకు విద్య అవసరమని, వారు పూర్తి విద్య అభ్యసించిన తరువాత వివాహం చేయాలని కృష్ణమీనన్ భావాలవల్ల తెలుస్తోంది. స్త్రీలకు బాల్యవివాహం చేయాలనే పంజుమీనన్ వంటి పాతతరాలవారికి, స్త్రీలకి మంచి విద్యని అందించి వారు సంపూర్ణంగా ఎదిగిన తరువాతే వారికి వివాహం చేయాలనే కృష్ణమీనన్ వంటి ఆధునిక తరాలకు మధ్య స్త్రీల వివాహ విషయంలో ఒక సంఘర్షణ పంతొమ్మిదవ శతాబ్దంలో నెలకొన్నదని చెప్పడానికి ఈ సంఘటనలు నిదర్శనం.

ఇందిరాబాయి నవలలో ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఇందిరాబాయికి విఠలరావుతో వివాహమవుతుంది. అప్పటికే ఇందిరాబాయికి వివాహం అంటే ఏమిటోకూడా తెలియదు. ఇందిరాబాయికి వివాహం నిశ్చయమైన తరువాత ఇంట్లో ఉన్నవాళ్లు “ఇందిరాబాయి మాట్లాడుతున్నప్పుడు వరుని పేరులోని అక్షరాలలో ఏ ఒక్క అక్షరాన్ని ఆమె ఉచ్చరించినా “ఓహో భర్తపేరు ఉచ్చరిస్తుంది.” అంటూ నవ్వేవారు. అదిచూసి ఇందిరాబాయి సిగ్గుపడేది.” (వెంకటరావు, గుల్వాడి. 1962: 86) ఇది ఇందిరాబాయి ముగ్ధమనస్తత్వానికి చిహ్నం. ఈ బాల్య వివాహానంతరం భర్త మరణించిన సమయంలో అన్ని విషయాలపై అవగాహన ఏర్పరుచుకున్న ఇందిరాబాయి తనకు బాల్యవివాహం చేసినందుకు తండ్రిని నిందిస్తుంది.

"అమ్మా నేను ప్రాయంలో చిన్నదానినే కావచ్చు కాని బుద్ధిలో కాదు. నేనుకొన్ని మాటలు మాట్లాడతాను. మీరు విని తీరాలి. ఇప్పుడు నీవు బాధపడి ప్రయోజనం ఏముంది? నా కోసం నీవు బాధపడవలసిన సమయం ఇది కాదు. నీవు నాన్నగారు చింతించ వలసిన సమయం వేరే ఉండెను కదా! అప్పుడు మీరు కొంచెం ఆలోచించి ఉంటే ఇప్పుడు ఈ దుర్గతి వచ్చేది కాదు. నేనంటే బుద్ధిచేత చిన్నదానిని. మీరు వాద్యాలు, మేళాలు, వేశ్యల ఆటలు, దశావతార ఆటలు, పంచ భక్ష పరమాన్నాలు మొదలైన వాటిని గురించి ఆలోచించారు. కానీ ఆ తరువాత భవిష్యత్తులో జరిగే పరిణామాల గురించి ఆలోచించలేదు. ఇప్పుడు నాజన్మమే వృధా అయ్యింది. (వెంకటరావు, గుల్వాడి. 1962: 146).

శ్రీరంగరాజుచరిత్ర నవలలో వివాహ సమయానికి సోనాబాయి వయస్సు 16 సంవత్సరాలు. ఈ విషయం ఆమెను ఎత్తుకెళ్లిన లంబాడీ స్త్రీ మాటల ద్వారా తెలుస్తుంది. "యిప్పటికీ రమారమి 'పంద్రెండు' సంవత్సరముల నాడు మా చనుప యీ దేశమునకు బేరము వచ్చి, విద్యానగరము వెలుపల దిగియుండ నొక నాడు సాయం కాలము గ్రామము లోపలికి వచ్చి రాజునగరు ముందర నాలుగేండ్ల ప్రాయపు బిడ్డ యాడుకొనుచుండుటను జూచి బుద్ధిచెడి యొత్తు కొని పోయిన నాట నుండి గారాబమున బెంచితిని" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 111). 12 సంవత్సరాల క్రితం 4 సంవత్సరాల పాపని ఎత్తుకెళ్లానని చెప్పడం వల్ల వివాహ సమయానికి సోనాబాయి వయస్సు 16సంవత్సరాలని చెప్పవచ్చు. శ్రీరంగరాజు ఇంటినుండి వెళ్లిపోయినప్పుడు అతని వయస్సు 18సంవత్సరాలు. కాబట్టి వీరిది బాల్యవివాహం అవునా? కాదా? అనే సందేహం రాక మానదు. వివాహ సమయానికి శ్రీరంగరాజు, సోనాబాయిల వయస్సు ఎంత వున్నా సోనాబాయి పుట్టినప్పుడే ఆమెని రంగరాజుకు ఇచ్చి వివాహం చేయాలనుకుంటారు. కాని సోనాబాయిని లంబాడి స్త్రీ నాలుగు సంవత్సరాల వయస్సులో ఎత్తుకెళ్లడం వల్ల వివాహం జరగదు. అదే సమయంలో మల్లయ్యగారి కుమార్తెతో శ్రీరంగరాజుకి వివాహం నిశ్చయమవుతుంది. అప్పుడే శ్రీరంగరాజుకు అతని తండ్రికి మధ్య వివాదం తలెత్తడంతో శ్రీరంగరాజు ఇంటి నుండి వెళ్లిపోతాడు. ఇంటి నుండి వెళ్లిన శ్రీరంగరాజు ఒక ఊరిలో బసచేస్తాడు. అక్కడ ఒక బ్రాహ్మణుడితో శ్రీరంగరాజు జరిపిన సంభాషణలో బాల్యవివాహం వల్ల జరిగే అనర్థాలు ప్రస్తావనకి వస్తాయి.

"కొందరు తల్లిదండ్రులు చిఱుత ప్రాయమపుడె పుత్రికకు బెండ్లి చేసి కన్నుల పండుగగా జూడవలయునని, యత్యానందముతో వేలకొలది ద్రవ్యము వ్యయము చేసి పెండ్లి చేయుదురు. ముహూర్తమయిన మరునాడే చేతి కంకణము చేత నుండగానే యల్లుని యముని వాతఁబెట్టి యాయువున్నంత వఱకు బిడ్డను జూచి-జూచి దుఃఖింతురు." (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 71) ఈ సంఘటనలు శ్రీరంగరాజుచరిత్ర రచనా కాలానికి బాల్యవివాహాలు ఉన్నాయనడానికి నిదర్శనాలు.

### 5.2.3.3.7.2. వరకట్నం - కట్నకానుకలు

కన్నడ ఇందిరాబాయి నవలలో వరకట్న ప్రస్తావన కనిపిస్తుంది. ఇందిరాబాయిని త్రయంబకరావు కుమారుడైన విఠలరావుకి ఇచ్చి వివాహం చేసే సందర్భంలో రెండు వేల రూపాయలు వరకట్నంగా ఇస్తాడు.

"**భీమారావు:** మిగతావన్ని చిన్న విషయాలే. వరకట్నం (అనే సందర్భంలో చిన్నగా దగ్గు వస్తుంది).

**త్రయంబకరావు:** అదేమి పెద్ద విషయం కాదు. నాశక్తికి తగ్గట్టుగా నేను, మీ శక్తికి తగ్గట్టుగా మీరు నడుచుకోవడం మంచిది.

**అంబాబాయి:** మాకేమి పదిమంది పిల్లలు లేరు. ఉన్నది ఒక్కగానొక్క కూతురు. భవిష్యత్తులో ఆమె మొఖం చిన్నబోకూడదు. బంగారు పట్టితో కూడిన ఆభరణాలు చేయించాలి.

**చంద్రభాగి:** అలాగేకాని. మాకు ఉన్నది ఒక్కగానొక్క కుమారుడు. నాలుగు రూపాయలు ఖర్చు అయినా పరవాలేదు. ఊరి ప్రజలంతా సై! సై! అంటూ మెచ్చుకొనే విధంగా వివాహం చేయాలని మాకూ ఉంది.

**భీమారావు:** 'రెండువేల రూపాయలు'-రహ్హా! అహ్హా, అహ్హా1 (మళ్లీ దగ్గు వస్తుంది).

**త్రయంబకరావు:** అలాగేకాని మీ ఇష్టప్రకారమేకాని" (వెంకటరావు, గుల్వాడి. 1962: 83, 84). ప్రతాపముదలియార్ చరిత్ర, శ్రీరంగరాజుచరిత్ర, ఇందులేఖ నవలల్లో వరకట్నం గురించిన ప్రస్తావన కనిపించదు. కాని వివాహం జరిగే సందర్భంలో కట్నకానుకలు ఇచ్చినట్లుగా ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో చెప్పబడింది."దేవరాజపిళ్ళై, కనకసభ మొదలైన వారు నా పెళ్లికి వచ్చి లెక్కలేనన్ని వస్త్రా భరణాలను, వస్తువులను బహుమతిగా

ఇచ్చారు. మేము వాళ్లకు తగిన విధంగా ఎదురు మర్యాదలు చేశాము. మేము చేసినది అణు మాత్రమై ఉండగా వాళ్లు మాకు చేసినది కొండంతగా ఉంది. అందువలన మేము సిగ్గుపడి వాళ్లు చేసినదానికి రెట్టింపుగా కనకసభ పెళ్లిలో మర్యాద చేయాలని సంకల్పించుకున్నాము." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 77).

### 5.2.4. కుటుంబ వ్యవస్థ

"ఒక వ్యక్తి అతని భార్య, వారి సొంతబిడ్డలు లేదా దత్తత చేసుకొన్న బిడ్డలు కలిసి ఒకే నివాస స్థలంలో సమూహంగా ఉండడాన్ని 'కుటుంబం' అంటారు." (సింగయ్య, కె. 2005: 152). కుటుంబంలో ఉన్న సభ్యుల సంఖ్య, వివాహపద్ధతి, వంశానుక్రమం, నివాసం, అధికారం, వారసత్వ సంక్రమణం, సభ్యత్వం ఆధారంగా కుటుంబంలో రకాలు ఏర్పడతాయి.

**అ. వివాహం - కుటుంబ రకాలు:**

వివాహ రూపాన్ని అనుసరించి కుటుంబంలో 3 రకాలు ఉంటాయి. ఏకవివాహ కుటుంబం,i బహుభార్యత్వ కుటుంబం, ii బహుభర్తృత్వ కుటుంబం.

**ఆ. వంశానుక్రమం – కుటుంబ రకాలు:**

**i. పితృవంశీయ కుటుంబం:** తండ్రి మూల జనకునిగా పరిగణించి తన సంతానానికి తండ్రి బంధువులతో పొత్తు పెట్టుకొని, ప్రతీ వ్యక్తి తన తండ్రినే వంశ కర్తగా గ్రహిస్తే దానిని 'పితృవంశీయ కుటుంబం' అంటారు.

**ii. మాతృవంశీయ కుటుంబం:** తల్లిని మూలజనకంగా పరిగణించి, తన సంతానానికి తల్లి బంధువులతో పొత్తుపెట్టుకొని ప్రతీ వ్యక్తి తన తల్లినే వంశ కర్తగా గ్రహిస్తే దానిని మాతృవంశీయ కుటుంబం అంటారు.

**iii. ద్వంద్వ వంశానుక్రమం:** ఒక వ్యక్తి మాతృవర్గం వారితోను, పితృవర్గం వారితోనూ పొత్తు కుదుర్చుకొని ఆ రెండు పక్షాల వారిని మూల పురుషుడిగా గ్రహించే కుటుంబాన్ని ద్వంద్వ వంశాను క్రమం అంటారు.

**ఇ. నివాసం - కుటుంబ రకాలు:**

నివాసపరంగా కుటుంబం ఐదు రూపాలలో ఉంటుంది.

**i.పతి స్థానిక కుటుంబం:** ఇందులో వివాహ అనంతరం భార్య, భర్తలు భర్త గృహంలో కాపురం ఉంటారు.

**ii. పత్నిస్థానిక కుటుంబం:** ఇందులో వివాహ అనంతరం భార్య భర్తలు ఇద్దరు భార్య ఇంట్లో కాపురం ఉంటారు.

**iii. మాతులస్థానిక కుటుంబం:** వివాహ అనంతరం భర్త తన తల్లి సోదరుడు, అంటే మేనమామ ఇంటికి పోయి నివాసం ఏర్పర్చు కుంటే దానిని మాతుల స్థానిక కుటుంబం అంటారు.

**iv. ద్విస్థానిక కుటుంబం:** వివాహ అనంతరం భార్య భర్తలిద్దరు వారి వారి పుట్టింటి ఆస్తిపాస్తులను, మంచి, చెడులను ఆధారంగా చేసుకొని ఆ ఇద్దరి సమ్మతితో భార్య పుట్టింటికిగాని, భర్త పుట్టింటికి గాని వెళ్లి కాపురం చేసే దానిని 'ద్విస్థానిక' కుటుంబం అంటారు.

**v. నూత్న స్థానిక కుటుంబం:** వివాహ అనంతరం భార్యభర్తలిద్దరు వారిలో ఏ ఒకరి ఇంటికిగాక, వారి ఇష్టం వచ్చిన చోట కాపురమేర్పరుచుకుంటే దానిని నూత్న స్థానిక కుటుంబం అంటారు.

**ఉ. సభ్యత్వం - కుటుంబ రకాలు:**

కుటుంబంలోని సభ్యత్వాన్ని బట్టి కుటుంబంలో రెండు రకాలు ఉంటాయి.

**i. ప్రాథమిక కుటుంబం (చిన్న కుటుంబం).**

భార్యభర్తలు వారి అవివాహిత సంతానం ఒక కుటుంబంలో సభ్యులైతే దానిని ప్రాథమిక కుటుంబం, న్యూక్లియర్ కుటుంబం, ఏక కుటుంబం అని అంటారు. దంపతులు వారి బిడ్డలతో ఏర్పడిన సామాజిక సమూహమే ప్రాథమిక కుటుంబం.

**ii. సమ్మిశ్ర కుటుంబం (ఉమ్మడి కుటుంబం):**

వివాహితులైన బిడ్డలు తమ తల్లిదండ్రుల నుంచి బంధువుల నుంచి విడిపోకుండా సమిష్టిగా కుటుంబ జీవితాన్ని గడుపుతుంటే దానిని సమ్మిశ్ర (ఉమ్మడి) కుటుంబం అంటారు. ఇందులో రెండుగాని, మూడుగాని అంత కన్నా ఎక్కువ తరాల వారుగాని ఉంటారు. ఈ ఉమ్మడి కుటుంబంలో నాలుగు రకాలు ఉంటాయి.

**ii.i. పతి స్థానిక ఉమ్మడి కుటుంబం:**

దీనిలో ఒకరో ఇద్దరో సోదరులు వారి భార్యలు వారి అవివాహితులైన కొడుకులు కూతుళ్లు, వివాహితులైన కొడుకులు, కొడుకుల భార్యలు, కొడుకుల సంతానం (మనుమలు) ఉంటారు.

**ii.ii. పత్నీస్థానిక ఉమ్మడి కుటుంబం:**

దీనిలో ఒకరో ఇద్దరో అక్కా, చెల్లెళ్లు, వారి వివాహిత, అవివాహిత ఆడ బిడ్డలు, వారి బిడ్డలు ఉంటారు. వారి భర్తలు గాని, వారి బిడ్డల భర్తలుగాని వారి మధ్య పరాయి వాళ్లలాగా ఉంటారు.

**ii.iii. బహుభార్యత్వ ఉమ్మడి కుటుంబం:**

దీనిలో ఒకవ్యక్తి, తన భార్యలు అతని సంతానం సభ్యులుగా ఉంటారు. ఈ కుటుంబానికి మూడు ముఖ్య లక్షణాలు ఉంటాయి.

అ. లైంగిక సంబంధాలవల్ల ఒకని భార్యలందరూ సమాన హక్కులతో ఉంటారు.

ఆ. ప్రతీభార్యకి ప్రత్యేక నివాస స్థలం ఉండవచ్చు లేదా అందరూ ఒకే గృహంలో కాపురం చేయవచ్చు.

ఇ. పెద్దభార్యకు ప్రత్యేక అధికారం హక్కులు ఉండవచ్చు.

**ii.iv. బహుభర్తృత్వ ఉమ్మడి కుటుంబం:**

దీనిలో ఒకస్త్రీ ఆమె భర్తలు, వారివల్ల ఆమె పొందిన సంతానం ఉంటారు. వారందరూ ఒకే గృహంలో కాని లేదా ప్రత్యేక గృహంలో కాని నివసిస్తూ ఉండవచ్చు. భర్తలందరూ సోదరులు కావచ్చు. కాకపోవచ్చు. ఉదాహరణకి-తొడలు, టిబెట్‌లోని కొన్ని సమాజాలు." (సింగయ్య. కె. 2005: 150-156).

## 5.2.4.1 ప్రతిస్పందనలు

శ్రీరంగరాజుచరిత్ర, ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందులేఖ నవలల్లో ఉమ్మడి కుటుంబాలు ఉండగా, ఇందిరాబాయి నవలలో ప్రాథమిక (చిన్న) కుటుంబ వర్ణన ఉంది. ఇందిరాబాయి నవలలో భీమారావు, సుందరరావు, అమృతరావు కుటుంబాల మధ్య సంఘర్షణ చిత్రితమైంది. భీమారావు, అంబాబాయి, ఇందిరాబాయిలది ఒక కుటుంబం కాగా సుందరరావు, సుశీల, భాస్కరరావులది రెండో కుటుంబం. అమృతరావు జలాక్షిలది మూడవ కుటుంబం. ఈ మూడు కుటుంబాలలోని సభ్యుల సంఖ్య తక్కువగా ఉంది. భీమారావు కుటుంబం సుందరరావు కుటుంబంపై పగబట్టడం. సుందరరావు కుటుంబాన్ని నాశనం చేయాలని చూడటం. అమృతరావు కుటుంబం ఈ ఆకృత్యాన్ని అడ్డుకోవడం ఇందిరాబాయి నవలలోని ప్రధాన ఇతివృత్తం. ఈ విధంగా మూడు కుటుంబాల మధ్య సంఘర్షణ ఇందిరాబాయి నవలలో చిత్రితమైంది. ఈ మూడు కుటుంబాలు ఏక వివాహ కుటుంబాలు, పితృవంశీయ కుటుంబాలు, పతిస్థానిక కుటుంబాలు.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు కుటుంబానికి సంబంధించిన ఇతివృత్తం వర్ణించబడింది. ఇది ఉమ్మడి కుటుంబం. శ్రీరంగరాజు అతని తండ్రి, తల్లి అందరూ కలిసి ఒకే

చోట నివసిస్తుంటారు. శ్రీరంగరాజు తండ్రి మూరురాయ గండర్ శారద అనే వేశ్యతో లైంగిక సంబంధాన్ని ఏర్పర్చుకొని ఆమెని కూడా తన నివాసంలోనే ఒక ప్రత్యేక గదిలో ఉంచుతాడు. ఆమె కొడుకు కృష్ణుడు కూడా రాకుమారునితో పాటు ఉంటాడు. ఈ విషయమే వివాదానికి కారణం అవుతుంది. మొత్తం మీద మురురాయగండర్‌ది పతిస్థానిక ఉమ్మడి కుటుంబం. వివాహం చేసుకోకున్నా మురురాయగండర్ శారదని భార్యమాదిరిగా చూస్తాడు. కాబట్టి శ్రీరంగరాజుచరిత్ర నవలలో పతిస్థానిక, బహుభార్యత్వ ఉమ్మడి కుటుంబ వర్ణన ఉందని చెప్పవచ్చు.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రధానంగా మూడు కుటుంబాల వర్ణన కనిపిస్తుంది. ప్రతాపముదలియార్, ప్రతాపముదలియార్ తండ్రి కనకాచలముదలియార్, తల్లి సుందరఅణ్ణి, ప్రతాపముదలియార్ నానమ్మ అందరూ కలిసి ఒకే చోట జీవిస్తుంటారు. ఇది మొదటి కుటుంబం. సంబంధముదలియార్ అతని భార్య, కూతురు జ్ఞానాంబాళ్ కలిసి ఒక కుటుంబంగా జీవిస్తారు. ఇది రెండవ కుటుంబం. ఆదియూరు పాళ్యానికి చెందిన ఆది మూలం పిళ్ళై, అతని ఇద్దరు కుమారులు దైవనాయగంపిళ్ళై, దేవరాజపిళ్ళై, దేవరాజపిళ్ళై భార్య, కుమారుడు, కనకసభ అందరూ ఒకే కుటుంబంలో జీవిస్తారు. ఇది మూడవ కుటుంబం. ఈ మూడు కుటుంబాలలో సంబంధ ముదలియార్‌ది మాత్రమే చిన్న కుటుంబంకాగా, కనకాచల ముదలియార్, ఆదిమూలంపిళ్ళైల కుటుంబాలు పెద్ద కుటుంబాలు, ఉమ్మడి కుటుంబాలు. ఈ అన్ని కుటుంబాలు ఏక వివాహ కుటుంబాలు, పితృవంశీయ కుటుంబాలు, ప్రతాప ముదలియార్‌కి జ్ఞానాంబాళ్‌తో వివాహం అయిన తరువాత కొంత కాలం దంపతులు కనకాచల ముదలియార్ ఇంట్లోను, మరికొంత కాలం సంబంధ ముదలియార్ ఇంట్లోను ఉంటారు. ఇది ద్విస్థానిక కుటుంబ లక్షణం. మిగిలిన కుటుంబాలలో పతిస్థానిక కుటుంబ లక్షణాలు కనిపిస్తాయి.

ఇందులేఖ నవలలో మలయాళ ప్రాంతానికి మాత్రమే పరిమితమైన మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థ గురించి చెప్పబడింది. పత్నీస్థానిక ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఇందులేఖ నవలలో కనిపిస్తుంది. ఈ ఉమ్మడి కుటుంబాన్ని మలయాళ ప్రాంతంలో 'తరవాడు' అంటారు. మలయాళ తరవాడు సంప్రదాయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఇందులేఖ నవలలో కనిపిస్తుంది.

### 5.2.4.2. మలయాళ- తరవాడు, ఉమ్మడి కుటుంబం

"నాయర్ సామాజిక జీవనంలో కనిపించే ముఖ్య లక్షణం 'మరుమక్కత్తాయం' లేదా 'మాతృయాజమాన్య పద్ధతి'. ఈ సంప్రదాయంలో నాయర్‌ల కుటుంబానికి 'తరవాడు' అని పేరు. ఈ 'తరవాడు' అవిభక్త ఉమ్మడి కుటుంబం. ఈ కుటుంబంలో కుటుంబ వృద్ధస్త్రీల సంతతి, పిల్లలు ఉంటారు. ఆస్తి హక్కు మరియు అధికారం తల్లి ద్వారా లభిస్తుంది. కుటుంబ యజమానిగా కుటుంబ సభ్యులలో అందరి కన్నా వయస్సులో పెద్దగా ఉన్న పురుషుడు వ్యవహరిస్తాడు. ఈ వ్యక్తిని 'కారణవన్' అని పిలుస్తారు. ఈ కారణవన్ న్యాయ పరంగా కుటుంబంలోని స్త్రీలను, వారి సంతతిని సంరక్షిస్తాడు. కుటుంబంలోని వ్యక్తులందరికీ పోషకుడిగా ఉంటాడు. 'తరవాడు' ఆస్తిని అమ్మే హక్కు అతనికి ఉండదు.

ఈ 'తరవాడు' కుటుంబంలోని మిగత మగవారిని 'ఆనందరవన్' అని పిలుస్తారు. కుటుంబంలోని పురుషులందరూ కుటుంబ నిర్వహణలో 'కారణవన్'కి సహకరించవలసి ఉంటుంది. ఈ 'తరవాడు' కుటుంబ సభ్యులని వారి మధ్య ఉండే సంబంధాల ఆధారంగా 'ఆనందరవన్' లేదా 'కారణవన్' అని పిలుస్తారు. కుటుంబంలోని పురుషుల వయస్సు ఆధారంగా కుటుంబపెద్దలుగా మారతారు. కుటుంబంలోని పురుషులు కొన్ని విధులు నిర్వహించవలసి ఉంటుంది. వయస్సు ఆధారంగా 'కారణవన్‌గా' మారి కుటుంబ ఉత్తర అధికారిగా బాధ్యతలు నిర్వహించుట. కారణవన్ అక్రమ నిర్వహణ మరియు ఆస్తి ఉపయోగాన్ని ఆక్షేపించడం. తరవాడు భవిష్య ప్రయోజనాల నిమిత్తం ఆస్తిని పరిరక్షించడం. తరవాడు నిర్వహణకి అవసరమైన ఆధాయ వనరులను సమకూర్చడం. ఉన్న ఆదాయ మార్గాలను సక్రమంగా నిర్వహించడం. తరవాడు కనిష్ట అవసరాలను తీర్చడం. కుటుంబంలోని పిల్లలను చదివించడం 'కారణవన్‌కు' అనివార్యం. అనేక సందర్భాలలో ఇంటి యజమాని కుటుంబ నిర్వహణపై కుటుంబంలోని యువకులకు ఆక్షేపిస్తూ ఉండేవారు. కారణవన్ పై తన భార్య, పిల్లల అవసరాలను, ఇతరుల అవసరాలను తీర్చే బాధ్యత ఉండేది. కాని ఈ 'మరుమక్కత్తాయం' తరవాడు నిర్వహణలో ఎక్కువ వ్యాజ్యాలు కుటుంబ నిర్వహణ లోపంపై వస్తుండేవి. కారణావన్ తరవాడు సంపాదనలో అధికభాగం ఎటువంటి కారణం చూపకుండా తన భార్య, పిల్లలకు ఖర్చుచేసేవాడు. దీన్ని కుటుంబంలోని యువకులు ఆక్షేపించడం జరిగేది. కుటుంబంలోని యువకుల పట్ల కారణవన్ పక్షపాత ధోరణి, కొన్ని సందర్భాలలో ఉద్రేకానికి, తగాదాలకు దారి

తీసేది. కాని అనేక మంది మంచి కారణ వర్లు ఉండేవారు. చెడ్డ కారణవర్లు పూర్తిగా చెడ్డవారని చెప్పలేం.

జీవన ప్రమాణానికి అవసరమైన భరోసా మరియు కుటుంబానికి సంబంధించిన ఆస్తిని అనుభావించడంలో పనిచేసే వారికి, పని చేయని వారికి ఉన్న సమానత్వం, ఈ అంశాలు మరుమక్కాత్తాయంలోని తరవాడు (ఉమ్మడికుటుంబం) అభివృద్ధికి ఆటంకంగా మారాయి." (Shankaramenon,T.c. 1997: 24).

ఇందులేఖ నవలలో కారణవన్‌గా ఉన్న పంజుమీనన్ తన తరవాడులోని చిన్నని పై వివక్ష చూపుతాడు. చిన్నడు పంజుమీనన్‌కి దూరపు బంధువు తన అమ్మమ్మ సోదరి కూతురికి మనమడు. తరవాడు సంప్రదాయంలో అందరూ కలిసి ఉమ్మడి కుటుంబంగా ఉండడం వల్ల చిన్నడు అతని అక్క, అన్నలు కూడా పంజుమీనన్ కారణవన్‌గా ఉన్న కుటుంబంలో ఉంటారు. పంజుమీనన్ అందరిని సమాన దృష్టితో చూడాల్సి ఉన్నా అలా చూడడు. తనకు దగ్గరి బంధువైన మాధవుడిని ఇంగ్లీషు చదివిస్తాడు. కానీ తనకు దూరపు బంధువులైన సాత్తరమీనన్, గోపాలన్, కళ్యాణకుట్టిలను చదివించడు. మాధవుడు ఈ వివక్షను ప్రశ్నిస్తాడు. "కుమ్మినియమ్మగాని, ఆమె పిల్లలుగాని ఇక్కడ పని మనుషులు కారు. వారిని ఎందుకని పెద్దమామ (పంజుమీనన్) ఈ విధంగా ఇలా నిర్లక్ష్యం చేసి దూరంగా ఉంచడం. ఆమె ఇద్దరి పిల్లలకు ఇంగ్లీషు చదివించలేదు. వీరు చేస్తున్నది ఎంతో కష్టంగా ఉన్నది. ఇలా వంచన చేయవచ్చా! ఇక చిన్నని కూడా ఆబోతువలె పెంచుదామని అనుకుంటున్నారు. దీనికి నేను సమ్మతించను. నేను అతన్ని పిలుచుకువెళ్లి చదివిస్తాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 4) అంటూ శంకర మీనన్‌తో మాధవుడు చేసిన వాదం ఉమ్మడి తరవాడు కుటుంబంలోని వివక్షకి నిదర్శనం. కళ్యాణకుట్టి వివాహ సందర్భంలో పంజుమీనన్ ఈ కుటుంబానికి నంబూద్రిపాదుతో సంబంధం కుదరడం పెద్ద గౌరవమే కదా! అందువలన దీనికి సమ్మతించడమే మంచిదని తోస్తుంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 213) అంటూ నంబూద్రిపాదు అడగగానే ఇందులేఖకి బదులు కళ్యాణకుట్టితో అతని వివాహానికి అంగీకరిస్తాడు. ఈ సంఘటనలు కారణవన్‌లు కుటుంబంలోని సభ్యులపై చూపిన వివక్షలకి నిదర్శనాలు. పంజుమీనన్ ఇంటి సభ్యులపై కోపగించుకున్నప్పుడు గోపాలన్ పంజుమీనన్‌ని ఎదిరించి అతని చేతిలో దెబ్బలు తింటాడు. శ్రీనుభట్టరు పంజుమీనన్‌ని ఎదురించడమే కాక అతడిపై ఫిర్యాదు చేస్తానంటాడు.

"పంజుమీనన్: నీవిక ఇకమీద నా ఇంటి గడప తొక్క కూడదు.

శీనుభట్టరు: ఓహో! నాకు పూర్ణసమ్మతం. నేను రానేరాను

పంజుమీనన్: అలాగే బ్రాహ్మణసత్రంలోనూ, గుడిలోనూ తల చూపించ కూడదు

శీనుభట్టరు: దానికి మీకు అధికారం లేదు. అన్ని దేవాలయాలకు, సత్రాలకు బ్రాహ్మణులు వెళ్లవచ్చు.

పంజుమీనన్: మీరు నా సత్రానికి, గుడికి నా సమ్మతి లేకుండా రాగలుగుతారా! దానిని కూడా నేను చూస్తాను.

శీనుభట్టరు: ఏమవుతుందో చూద్దాం. నేను ఖచ్చితంగా వెళ్తాను. అడ్డగిస్తే నేను మీ మీద ఫిర్యాదు చేస్తాను

పంజుమీనన్: ఏం చెప్పావు పనికిమాలినవాడా!" (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 63, 64)

ఈ సంఘటన తరవాడు కుటుంబంలోని సభ్యులు కుటుంబపెద్దని ఎదిరించారనడానికి నిదర్శనం. తరవాడు కుటుంబ ఆర్థిక స్థితిగతులగురించి నవలలోని మూడవ అధ్యాయంలో ఒ. చందుమీనన్‌గారు వివరించారు.

"ఖర్చులన్నీ పోనూ ఐదువేల రూపాయల మిగు లభించే స్థిరాస్తులు గల మాన్యం పంజుమీనన్ కుటుంబపెద్దగా ఉన్న సెంబలియెట్టు పూవళ్లికి ఉండేది. ఈ మిగులులోనుంచి ఒక కాసు ఖర్చు పెట్టాలన్నా పంజుమీనన్‌కు ఎంతో కష్టంగా ఉండేది. అయితే తన కుమార్తె అయిన లక్ష్మీకుట్టియమ్మ (ఇందులేఖ తల్లి) ఆమెకు తల్లి తనకు భార్య అయిన కుంజియ కుట్టియమ్మకు చేరి ఒక 35వేల రూపాయల ఆస్తి పాస్తులు వీరు ఇచ్చారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 46). ఇది కుటుంబపెద్ద తన దగ్గరి బంధువుల పట్ల చూపిన పక్షపాత వైఖరికి నిదర్శనం. ఇలా అనేక సందర్భాలలో తన బంధువులపై పంజుమీనన్ పక్షపాతం చూపిస్తాడు. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి తరవాడు ఉమ్మడి కుటుంబంలోని కారణవన్‌లు తన దగ్గరి బంధువులపై చూపిన ఆశ్రిత పక్షపాతానికి నిదర్శనం.

## 5.3. విద్యా విధానం

పంతొమ్మిదవ శతాబ్దంలో భారతీయ విద్యావిధానంలో గుణాత్మక మార్పు వచ్చింది. అప్పటివరకు "ఉపాధ్యాయుడు తన ఇంటి అరుగుమీదకానీ, చెట్టునీడనగానీ పిల్లలను

కూర్చోబెట్టుకొని సంస్కృతము, గణితము, తెలుగు బోధించేవాడు. యి సేవకుగాను అతనికి విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో తక్కువ ప్రతిఫలం ముట్టజెప్పేవాళ్లు. యీ పాఠశాలలు చాలా కాలంగా పనిచేస్తూ వుండినందున, కాలం చెల్లినవీ అయిపోయాయి." (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 11) ఈ విద్యావిధానం కొనసాగుతున్న క్రమంలో కంపెనీ పాలన భారతదేశంలో ప్రారంభమైంది. ఆంగ్లేయ కంపెనీ పాలకులు భారతీయ విద్యా విధానంలో కీలక మార్పులు తెచ్చారు. ఈ మార్పులను వారు తమ పరిపాలన సౌలభ్యం దృష్ట్యా తీసుకు వచ్చార.. భారతీయులను విద్యావంతులని చేయడం వలన ప్రభుత్వ పాలనలో స్థానికులని ఉద్యోగులుగా నియమించుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా ఉన్నత స్థాయి అధికారులను తప్ప మిగిలిన చిన్న ఉద్యోగులని భారతదేశం నుండే నియమించే వెసులుబాటు ఆంగ్లేయ ప్రభుత్వానికి కలుగుతుంది. భారతదేశంలో ఆంగ్ల విద్యని ప్రవేశ పెట్టడంవల్ల పాశ్చాత్య సంస్కృతిని, క్రైస్తవ మతాన్ని సులభంగా వ్యాపింప చేయవచ్చు అన్నది కంపెనీ పాలకుల ఆంతర్యం. అందుకే ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో విద్యా వ్యాప్తిని పట్టించుకోకున్నా "కంపెనీ ఉద్యోగులుగా భారతదేశానికి వచ్చిన వారందరూ విద్యా వ్యాప్తికి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. విద్యావ్యాప్తికి కంపెనీ ప్రభుత్వం కొంత వరకు ప్రయత్నించింది. 1781లో అప్పటి గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్'కలకత్తా మదర్సా'ను స్థాపించి అరబిక్, పారశీక భాషలలో బోధనకొనసాగే ఏర్పాట్లు చేశాడు. 1791లో బెనారస్‌లోని ఒక కంపెనీ ఉద్యోగి 'జొనాధన్ డంకన్' అనే ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించి అక్కడ ఒక సంస్కృత కళాశాల స్థాపితమైంది. 1800లో లార్డ్ వెల్లస్లీ, 'ఫోర్ట్ విలియం కళాశాలను' స్థాపించాడు. ఇది కంపెనీ అధికారాలకు భారతీయ భాషలు, భారతీయ ఆచార వ్యవహారాలు నేర్పడానికి ఉద్దేశించబడింది. తూర్పు ఇండియా కంపెనీ డైరెక్టర్లలో ఒకడైన 'ఛార్లెస్ గ్రాంట్' భారతదేశంలో విద్యా సౌకర్యాలు అభివృద్ధి చేసి, ఆంగ్ల భాషను ప్రవేశపెట్టి, విద్యావ్యాప్తి మూలంగా కొత్త విధానాలకు, ఉద్దేశాలకు ప్రాబల్యం కల్పించాలని, దీనికి కంపెనీ శ్రద్ధ వహించాలని సూచించాడు. 1830లో ప్రవేశపెట్టిన ఛార్టర్ చట్టంలో హిందూ దేశంలోని కంపెనీ ఆధీనంలోని ప్రాంతాలలో విద్యాభివృద్ధికి లక్ష రూపాయలు కేటాయించడం జరిగింది. క్రైస్తవ మిషనరీలు భారతదేశంలో విద్యావ్యాప్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చాయి. 1717లో డెనీష్ మిషనరీలు మద్రాసులో రెండు పాఠశాలలను నిర్వహించాయి." (శేషన్, ఎస్.ఎస్.కె. 1999: 70,71).

భారతదేశంలో వచ్చిన ఈ మార్పుల ఫలితంగా "1826లో 'పౌరవిద్యాసమితి' నెలకొల్ప బడింది. ప్రతీ జిల్లాలోనూ రెండు ప్రధాన పాఠశాలలు, ప్రతీ తాలూకాలోనూ ఒక నిమ్న పాఠశాల నెలకొల్పడానికి, ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇచ్చేందుకు పాఠ్యపుస్తక సంఘానికి విరాళాలు ఇవ్వడానికి ఆ సమితికి అధికారం ఇవ్వబడింది. ఇందుకు గాను మన్రో కోరినట్లు డైరెక్టర్ల సమితి 50వేల రూపాయలను సాలుసరి గ్రాంటు మంజూరు చేసింది. ఈ ఏర్పాటు మేరకు 14 జిల్లా పాఠశాలలు, 18 తాలుకా పాఠశాలలు, మద్రాసులో ఒక కేంద్ర పాఠశాల నెలకొల్పబడినాయి. మన్రో మరణం తరువాత ఈ పథకం క్షీణించి చివరకు 1836లో ఉపసంహరించబడింది." (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 12) ఈ పాఠశాలల స్థాపన వల్ల ప్రజలలో విద్యపట్ల అవగాహన పెరిగింది. ఉన్నత వర్గానికి చెందిన ప్రజలు విద్యా ఆవశ్యకతని గుర్తించారు. దీనితో సమాజంలో చదువుకున్న వర్గం ఏర్పడింది. విద్యని అభ్యసించే క్రమంలో ఏ విద్యని అభ్యసించాలన్న ప్రశ్న పంతొమ్మిదవ శతాబ్దంలో విద్యా విషయక చర్చకి దారి తీసింది. అప్పటి వరకు భారతదేశంలో ఉన్న సంస్కృత, ఉర్దూ, అరబ్బీ భాష విద్యలకి తోడు ఆంగ్లవిద్య నూతనంగా ప్రవేశించింది.

### 5.3.1. ఆంగ్లవిద్య

ఆంగ్లవిద్య భారతదేశంలో ప్రవేశపెట్టడానికి 'లార్డ్ మెకాలే' 'విలియం బెంటింగ్' వంటి గవర్నర్ జనరల్‌లు కృషి చేశారు. "గవర్నర్ జనరల్ 'లార్డ్ బెంటింగ్' ఆంగ్లభాషను బోధనా భాషగా ప్రవేశ పెట్టాలని భావించాడు. 1835 ఫిబ్రవరిలో మెకాలె ఆంగ్లభాషను ప్రవేశ పెట్టడం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ ఒక సుదీర్ఘ పత్రాన్ని తయారుచేసి గవర్నర్ జనరల్ కౌన్సిల్‌కు నివేదించారు. అందులో అతడు ఆంగ్లభాషా ఆవశ్యకతని వివరిస్తూ 'ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యాన్ని పెంపొందించే భాష ఆంగ్లం మూలానా భారతదేశంలో ఒక కొత్త తరగతి ఉత్పన్నం కాగలదు. ఆ తరగతి వారు వర్తకం, రంగులో భారతీయులుగాను, భావాలు, ఆచార వ్యవహారాలలో ఆంగ్లేయులుగాను ఉంటారు'. అనిపేర్కొన్నారు. గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్, మెకాలె ఉద్దేశాలకి మద్ధతునిచ్చి 1835 మార్చి నెల ఏడవ తేదీన ఆంగ్ల భాషను బోధనభాషగా ప్రవేశపెట్టాడు." (శేషన్, ఎస్.ఎస్.కె. 1999: 72, 73) ఈ ఆంగ్లభాష బోధన వల్ల భారతదేశంలో నూతన అలజడి మొదలైంది. సనాతన భావాలు కలిగిన వ్యక్తులు ఆంగ్లవిద్యని వ్యతిరేకించారు. ఈ ఆంగ్ల విద్య వల్ల భారతదేశంలో ఆంగ్లేయ సంస్కృతి వ్యాపించే

ప్రమాదం ఉందని వారి వాదన. ఈ వాదనని రాజారామ్మోహన్ రాయ్ వంటి సంఘసంస్కర్తలు వ్యతిరేకించారు. రాజారామ్మోహన్‌రాయ్ కలకత్తా మదర్సాను ప్రభుత్వం అభివృద్ధి చేయడాన్ని వ్యతిరేకించాడు. భారతీయులు యురోపియన్ భాషలు నేర్చుకోవడానికి, విజ్ఞానశాస్త్రాలు అభ్యసించడానికి ప్రభుత్వం ఒక విద్యాలయాన్ని స్థాపించాలని అర్థిస్తూ రామ్మోహన్‌రాయ్ ఒక సంఘాన్ని కూడా స్థాపించాడు. ఫలితంగా 1817లో 'హిందూ కళాశాల' స్థాపితమైంది. అది కేవలం ఉన్నత విద్యా కేంద్రం మాత్రమే కాక పంతొమ్మిదవ శతాబ్దంలో జాతీయ పునర్వికాసానికి కీలకమైన సంస్థగా పేరుపొందింది. 1835నాటికి కలకత్తాలో దాదాపు ఆరువేల మంది భారతీయ విద్యార్థులు ఆంగ్లభాషను అభ్యసించేవారు." (శేషన్, ఎస్.ఎస్.కె. 1999: 71, 72) ఆంగ్ల విద్యపై భారతీయులలో అభిమానం పెరుగుతూ వచ్చిందనడానికి ఈ వాక్యాలు నిదర్శనం. కేవలం కలకత్తా ప్రాంతంలోనే కాక మద్రాసు ప్రాంతంలో కూడా ఆంగ్ల విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 14) ఈ మార్పు సమాజాన్ని ముందుకు తీసుకువెళ్తుందా? లేదా ఆంగ్లేయుల బానిసలుగా మారుస్తుందా? అన్న సంఘర్షణ మొదలైంది. ఈ సంఘర్షణలో సనాతన వర్గం ఆంగ్ల విద్యని వ్యతిరేకించగా అభ్యుదయ భావాలు కలిగిన సంఘసంస్కర్తలు సమర్థించారు. ఈ సంఘర్షణ వాతావరణంలో ఆంగ్లవిద్యని అభ్యసిస్తున్న విద్యార్థులను నాటి సనాతన సంప్రదాయవాదులు ఎలా చూశారు? వారిపట్ల ఎలా ప్రవర్తించారు? వీరి ప్రవర్తనకి భిన్నంగా అభ్యుదయ వాదులు ఎలాంటి పరిష్కార మార్గాలను చూపారు వంటి ప్రశ్నలకి సమాధానంగా దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు వెలువడ్డాయి.

### 5.3.1.1. ప్రతిస్పందనలు

ఇందులేఖ నవలలో మాధవుడు ఇంగ్లీషు విద్యని అభ్యసిస్తాడు. తనకు లభించిన విద్య తన కుటుంబంలోని చిన్నడికి కూడా లభించాలని అనుకుంటాడు. ఈ విషయంలో ఇంటి పెద్ద పంజుమీనన్‌ని ఎదురిస్తాడు. చిన్నడిని తనతో పాటు మద్రాసుకు తీసుకు వెళ్తాడు. అప్పుడు పంజుమీనన్ ఇదంతా ఆంగ్లవిద్యను అభ్యసించడం వల్ల జరిగిందని శంకరమీనన్‌తో అంటాడు. "శంకరా! ఇక్కడ అంతా తారుమారుగా జరుగుతుంది. కలియుగ విశేషం ఆ పనికి మాలిన మాధవుడు నన్ను అవమానించడం అంతా విన్నావా? నా చెడు కాలానికి వాన్ని నేను ఆంగ్లవిద్య చదివించడంవల్ల నాకు వచ్చిన ఫలితం ఇది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 60) ఈ

అభిప్రాయం సనాతన సంప్రదాయ భావాలు కలిగిన పంజుమీనన్‌కి ఆంగ్లవిద్యపై ఉన్న అభిప్రాయానికి నిదర్శనం. ఆగ్రహానికి గురైన పంజుమీనన్ ప్రతీకారంగా ఇందులేఖతో మాధవుని పెళ్లి జరగనివ్వడు. ఇంటి పెద్దగా అందరి మీద అధికారం చెలాయించే పంజుమీనన్ ఆంగ్లం చదివిన ఇందులేఖ వద్ద మాట్లాడడానికి భయపడతాడు. "ముందుముందు మన మాటలు జాగ్రత్తగా ఉండాలి. ఇందులేఖ ఆంగ్లము, మరెన్నో చదివిన బుద్ధిశాలి. ఆమెతో మనమెవరమూ మాట్లాడి జయించలేము." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 49) అంటూ నంబూద్రిపాడుతో ఇందులేఖకి సంబంధాన్ని ఏర్పరచే సందర్భంలో తన మనస్సులో ఉన్న భయాన్ని పంజుమీనన్ కేశవ నంబూద్రితో పంచుకుంటాడు. మాధవుడు, ఇందులేఖ ప్రవర్తనలో మార్పు రావడానికి ఆంగ్లవిద్య కారణమనే అభిప్రాయాన్ని పంజుమీనన్ బలంగా కలిగిఉంటాడు. "మాధవుడు తురక వాడి  చెప్పులను వేసుకొని నడుస్తున్నాడు. వాడు కొన్ని సమయాల్లో ఇంట్లో కూడా వేసుకొని తిరగడం నేను చూశాను. పిల్లలు ఈ విధంగా పనికిరాకుండా పోతే ఏం చేసేది? ఈ పిల్లలను ఇంగ్లీషు చదివించడం నీచమైన పని. ఇందులేఖ ఇంగ్లీషు మాత్రం చదవకుండా ఉంటే ఇప్పుడు ఎంతో మంచి అమ్మాయిగా ఉండేది. ఏం చేసేది? మన గ్రహాలు సరిగ్గా లేనప్పుడు ఉపద్రవాలు ఒక్కొక్కటిగా వస్తాయి. ఈ ఇంగ్లీషు చదువుకున్న వాళ్లు ప్రవర్తించేది చూసి చదువుకోని వాళ్లు కూడా అదే విధంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 67).

ఇందులేఖని మొదట మెచ్చుకున్నా నంబూద్రిపాడు చివరికి "ఇందులేఖ నాకు వద్దు. పశు మాంసం తినే వాళ్ల భాష చదివిన ఆ అధిక ప్రసంగి నాకు వద్దు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 191) అని తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఆంగ్లం చదివిన మాధవుడు, ఇందులేఖ పాత్రలు పంజుమీనన్, నంబూద్రిపాడు పాత్రల ద్వారా ప్రతిఘటనను ఎదుర్కొంటాయి. పంజుమీనన్ తనకు ఇందులేఖని ఇవ్వనని పట్టుబట్టినా మాధవుడు ఆంగ్లం నేర్చి ఉద్యోగం సంపాదించి ఇందులేఖని వివాహం చేసుకుంటాడు. ఇందులేఖ తన ఆంగ్లవిద్య చాతుర్యంతో నంబూద్రిపాడుని ఎదురిస్తుంది. ఆంగ్ల విద్యాభ్యాసం జీవనోపాధికి, విజ్ఞాన విస్తారానికి తోడ్పడుతుంది. కాబట్టి ఆంగ్లం చదవాలన్న సందేశాన్ని ఒ. చందుమీనన్‌గారు ఇందులేఖ నవల ద్వారా ఇచ్చారు. ఆంగ్లభాష నేర్చుకున్నా మాతృ భాషా సంస్కృతిని వదల కూడదని సందేశాన్నిచ్చే కథని తమిళ ప్రతాపముదలియార్ చరిత్రలో వేదనాయగం పిళ్ళైగారు

రచించారు. చెన్నై నగరంలో 'సుబ్బయ్య అనే పేద బ్రాహ్మణుడు ధర్మ సత్రంలో అన్నం వండి పెడుతూ అనేక కష్టాలను పడి తన కుమారుడు 'అనంతయ్యను' తమిళం, ఆంగ్లం రెండూ నేర్చుకునే వెసులుబాటు కల్పించాడు. అనంతయ్య ఆంగ్ల భాష మీద అభిమానంతో సాధ్యమైనంత వరకు ఆ భాషను రాయడం, మాట్లాడడం నేర్చుకొని పాఠశాలను విడిచిపెట్టాడు. ఆంగ్లంతో అతనికి తెలిసిన అరకొర చదువుతో తాను ఆ భాషలో పూర్తి పాండిత్యాన్ని సంపాదించినట్లు అహంకారంతో విర్రవీగాడు. తమిళ భాష మీద అతను ఏమాత్రం ఆసక్తి చూపకపోయినందువల్ల ఆ భాషలో అతనికి అక్షరాలు కూడా పూర్తిగా తెలియకుండా పోయింది. తమిళ భాషలో చదవడం, మాట్లాడడం తనకు గౌరవ హీనమని భావించాడు. అతని దయ ఎవరికైనా కావాలంటే అతడు ఆంగ్లంలో గొప్ప విద్వాంసుడని తమిళ భాష ఏమీ తెలియనివాడని ఎవరైనా చెబితే వాళ్ల మీద అత్యంత విశ్వాసంతో కావాల్సినవన్నీ చేసి పెట్టేవాడు. అతనికి స్వదేశి భాషా జ్ఞానం ఎలా లేకుండా పోయిందో అలాగే దేశాభిమానం లేకుండా పోయింది. ఈ దేశాన్ని, దేశాచారాలను నిందించడం ఐరోపా ఖండాన్ని ప్రస్తుతించడం అతనికి నిత్య పారాయణం అయింది. అతడు తమిళ భాషలో మాట్లాడే అలవాటును గాలిలో వదిలేసి ఎల్లప్పుడూ ఆంగ్లభాషలో మాట్లాడడంవలన ఆ భాష తెలియని అతని తల్లిదండ్రులు, బంధుమిత్రులు మొదలైనవారి ప్రేమానురాగాలను స్నేహాన్ని కోల్పోయాడు. అతను వాళ్లతో మాట్లాడ వలసిన అవసరం వచ్చినపుడు ఆంగ్లం, తమిళం కలగలిసిన సంకర పదాల మూలంగా మాట్లాడే వాడు. టోపీ ఒక్కటి తప్ప మిగిలిన విషయంలో యురోపీయన్ల నడక దుస్తులు వాళ్ల శైలి అంతా అనుకరించడం ప్రారంభించాడు. అతనితో సదా ఆంగ్లం మాట్లాడే వాళ్లు కనిపించక పోవడం వల్ల ఆంగ్లేయ దొరలతో మాట్లాడటం అతనికి అసాధ్యమైనందు వల్ల వాళ్ల పరిచారికలు, వంట మనుషులు మొదలైనవారి సహవాసమే అతనికి నిల్చిపోయింది. వారిలో కొందరికి రోజూ పళ్లుతోమే అలవాటు లేక పోవడంవల్ల ఇతడు కూడా పళ్లు తోముకోవడం మానుకున్నాడు. వాళ్లు స్నానం చేయక పోవడం వలన ఇతడూ స్నానం చేయడం మానుకున్నాడు. వాళ్లు చుట్టతాగడం, పొగాకు వేసు కోవడం, కల్లు, సారాలు తాగడం మొదలైన అలవాట్లను అనుసరించడం వలన ఇతను కూడా ఆ దురలవాట్లను పాటించడం ప్రారంభించాడు. వాళ్లనుండి దుర్భాషలను కూడా నేర్చుకున్నాడు. వాళ్ల స్త్రీలు పరాయి పురుషులతో సంకోచం లేకుండా సంభాషించడం సహజమైనందు వలన తన భార్యకు తానే ఎంతో ప్రయాసతో ఇతరులతో సంభాషించడం నేర్పించాడు. 'అనంతయ్య' తన తండ్రిని తండ్రి అని కూడా చెప్పుకునేవాడు కాదు."

(జయప్రకాశ్, ఎస్(అ). 2008: 122, 123) ఇలాంటి ప్రవర్తనవల్ల అనంతయ్య అందరికీ దూరం అవుతాడు. అతని మున్సబు ఉద్యోగం పోతుంది. వ్యాధి బారిన పడతాడు. ఎవరూ అతనికి సహాయం చేయరు. దొంగలు అతని ధనాన్ని దోచుకుంటారు. చావడానికి సిద్ధంగా ఉన్న అనంతయ్యను అతని తల్లిదండ్రులు కాపాడతారు. ఈ ఇతివృత్తం నూతనంగా వచ్చిన ఆంగ్లవిద్యని, ఆంగ్లేయ సంస్కృతిని హద్దులకి లోబడి స్వీకరించాలనేగాని అమితంగా స్వీకరిస్తే నష్టం జరుగుతుందన్న సందేశాన్ని ఇస్తుంది. ఆంగ్లం నేర్చి తమిళం పట్ల చిన్నచూపు చూసిన పంతొమ్మిదవ శతాబ్దం నాటి వ్యక్తుల ప్రవర్తన సుబ్బయ్య పాత్రలో కనిపిస్తుంది. ఈ ఒక్క సన్నివేశంలోనే కాక ప్రతాపముదలియార్‌కి విద్య నేర్పే సందర్భంలో, జ్ఞానాంబాళ్ విద్య నేర్చుకునే సందర్భంలో విద్య అవసరాన్ని గురించి తెలిపే సుదీర్ఘ సంభాషణలు కనిపిస్తాయి. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 4, 46) ఈ సంభాషణల ద్వారా వేదనాయగం పిళ్ళైగారు అందరూ విద్యను నేర్చుకోవాలి, ఆంగ్లవిద్యను అభ్యసించినా తమిళాన్ని, స్థానిక భాషలను మరచి పోకూడదు అనే సందేశాన్నిచ్చారు. ఇందిరాబాయి నవలలో భాస్కరరావు ఆంగ్లవిద్యను అభ్యసిస్తాడు. ఇది సనాతన భావాలు కలిగిన భీమారావుకు నచ్చదు. భీమారావు, భాస్కరరావు వంటి ఆంగ్లవిద్యని అభ్యసించిన వారిని మఠాధిపతులు శిక్షించాలని వారికి లేఖ రాస్తాడు.

"ఈ సమయంలో కమలాపురంలో యువకులందరూ ఇంగ్లీషు అనే మ్లేచ్ఛుల భాషను నేర్చి వర్ణాశ్రమ ధర్మ క్రమాన్ని పాటించకుండా భ్రష్టులుగా మారి విదేశాలకు వెళ్లడం మొదలైన అధర్మ కార్యక్రమాలలో ప్రవర్తిస్తూ విధవ వివాహం, యువతి వివాహం మొదలైన అఘోర కార్యక్రమాలను చేస్తున్నారు. గురువులంటే వారికి లేశ మాత్రమైన భయం లేదు. ఈ విషయాల గురించి అడిగితే ఇంగ్లీషు శబ్దాలను మధ్యమధ్యలో చేర్చి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 63) ఈ లేఖ ఆంగ్లం చదువుకున్న వారి పట్ల కన్నడ ప్రాంతంలో ఉన్న వ్యతిరేకతకి నిదర్శనం. ఈ లేఖ అందుకున్న మఠాధిపతులు భాస్కరరావునిగాని, ఆంగ్లం అభ్యసించిన వారినిగాని ఏమీ చేయలేక పోతారు. చివరికి ఆంగ్లవిద్యను అభ్యసించిన భాస్కరరావు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి భీమారావు కూతురైన ఇందిరాబాయిని వివాహమాడతాడు. గుల్వాడి వెంకటరావుగారు ఈ సన్నివేశం ద్వారా ఆంగ్లవిద్య అభ్యసన అవసరం ఉందనే సందేశాన్నిచ్చారు. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర, తెలుగు శ్రీరంగరాజుచరిత్ర  నవలల్లో ఆంగ్ల విద్య ప్రస్తావన కనిపించదు. శ్రీరంగరాజుచరిత్ర

నవలలో శ్రీరంగరాజుకి విద్యని నేర్పించడానికి అతని తండ్రి ఒక గురువుని నియమిస్తాడు. ఆ గురువు శిక్షణలో శ్రీరంగరాజు విద్యని నేర్చుకుంటాడు. ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ కరుణానందపిళ్లై, శాంతలింగంపిళ్లైలవద్ద విద్యని నేర్చుకుంటాడు. ప్రతాపముదలియార్ విద్య నేర్చుకునే సందర్భంలో జ్ఞానాంబాళ్ తెలివిని చూసి అసూయ పడతాడు. "నేను చదువుకోవడం ప్రారంభించినప్పుడు ఆమె పుస్తకం చదవడం, అర్థం చెప్పడం, తప్పులు లేకుండా రాయడం, కూడికలు, తిసివేతలు, గుణకారం, భాగహారం మొదలైన వాటిలో నేర్పరిగా ఉండేది. సంతానవతిని చూసి గొడ్రాలు దీర్ఘమైన నిట్టూర్పును వదిలినట్లు జ్ఞానాంబాళ్ యొక్క విద్యా కౌశల్యాన్ని చూసి తరువాత మాకు అసూయ, సిగ్గు కలిగి ఆనాడు మొదలుకొని చదువులో అధిక శ్రద్ధ వహించసాగాము." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 15) ప్రతాపముదలియార్ బాధపడుతూ చెప్పిన ఈ వాక్యాలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి తమిళ విద్యా విధానంలో అచ్చులు, హల్లులు, గుణింతాలు, పుస్తకాలు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం వంటి అంశాలు విద్యా ప్రారంభ దశలో నేర్పించే వారని తెలుపుతున్నాయి.

### 5.3.2. స్త్రీవిద్య

ప్రాచీన మాతృస్వామ్య సమాజంలో స్త్రీలకి పురుషులతో సమాన హక్కులు కల్పించబడ్డాయి. కాలానుగుణంగా ఏర్పడిన పితృస్వామ్య సమాజంలో స్త్రీ తన హక్కులని కోల్పోయింది. సాంఘికంగా సాంస్కృతికంగా స్త్రీ అణచి వేతకి గురైంది. పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చిన నూతన మార్పుల వల్ల స్త్రీచైతన్యం పై చర్చ మొదలైంది. రాజారాంమోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంఘసంస్కర్తలు స్త్రీలు అజ్ఞానంలో ఉండటానికి ప్రధాన కారణం 'స్త్రీ–అవిద్య' అని గుర్తించారు. పురుషునితో సమానంగా స్త్రీ ఎదగాలన్నా స్త్రీలలో చైతన్యం రావాలన్నా 'విద్య'ను స్త్రీలకు అందించాల్సిన అవసరం ఉందని పంతొమ్మిదవ శతాబ్దం నాటి సంఘసంస్కర్తలు గుర్తించారు. అంతర్గత ఉద్దేశం ఏదైనా 'డల్హౌసీ' వంటి ఆంగ్లేయులు స్త్రీవిద్య కోసం కృషి చేశాడు. ఆంగ్లేయ మిషనరీల ప్రధాన ఉద్దేశం మతప్రచారం. క్రైస్తవ మతంలోకి మారిన స్త్రీలకు వీరు పురుషులతో సమానంగా విద్యని బోధించారు. "దీనికి 1830నుండి 1837కి మధ్య మద్రాసులో లండన్ మిషనరీ సొసైటీ, వెస్లీయన్ మిషనరీ, అమెరికన్ మిషనరీలు ప్రారంభించిన పాఠశాలలు నిదర్శనం. 1876–

77కు మధ్య ఈ మిషనరీ పాఠశాలలో చదువుతున్న బాలికల సంఖ్య 28,151." (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 62). ఇలా మిషనరీ సంస్థల కృషి జరుగుతున్న కాలంలోనే 'హిందూ కాలేజీ' (1817), 'కలకత్తా పాఠశాల పుస్తక సమాజం' (1817), 'భిషప్ కాలేజీ' (1820), 'సంస్కృత కళాశాల' (1824), 'కలకత్తా పాఠశాల సంఘం' (1818), 'బాలికా సంఘం' (1820), స్థానిక మహిళా విద్యకొరకు 'మహిళా సమాజం' (1824), వంటి సంస్థలు స్త్రీవిద్య కొరకు కృషి చేసాయి" (ముఖర్జీ, కనక: 2009: 39). ఇలా స్త్రీ విద్య గురించి అనేక ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో "మద్రాసు రాష్ట్రంలో మొత్తం మీద విద్యా పరిస్థితిని గురించి తెలుసుకోవడానికి మన్రో ఒక ప్రయత్నం (1868) చేసారు. ఆయన చేసిన ప్రయత్నం ద్వారా తేలిందేమిటంటే దేశీయ పాఠశాలల్లోని 1,84,110 మంది పిల్లలలో 5,840 మంది ఆడపిల్లలు ఉన్నారు." (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 62) మిషనరీ సంస్థలతోపాటు స్థానిక సంస్థలు ఎంత కృషి చేసినా బాలికా విద్యలో గణనీయమైన మార్పు రాలేదు. దీనికి కారణం పంతొమ్మిదవ శతాబ్దం నాటి సమాజంలో ఆడపిల్లల చదువు పట్ల బలమైన వ్యతిరేకత, ఉపేక్ష ఉండేది. ఆడపిల్లలు చదువు కుంటే ఆ కుటుంబాలకు దురదృష్టం చుట్టుకుంటుందని అనుకునేవాళ్లు. దేవదాసీలు దేవాలయాలలోనూ, ఉత్సవాలలోనూ నృత్యం చేసేటందుకు లలితకళలు నేర్చుకోవాలి కనుక స్త్రీవిద్య అనేది వాళ్ల కొరకే ఉద్దేశించబడిందనే అభిప్రాయం కూడా వ్యాప్తిలో వుండింది." (రామకృష్ణ, వకుళాభరణం. 2013: 62). ప్రజలలో నెలకొన్న ఈ భావాలను రూపుమాపడానికి రాజారాంమోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంఘసంస్కర్తలు కృషి చేసారు. ఈశ్వరచంద్రవిద్యాసాగర్ చేసిన కృషిని సమాజంలో వ్యాప్తి చెందించాలన్న ఉద్దేశంతో మైకేల్ మధుసూధనదత్, బంకించంద్ర ఛటోపాధ్యాయ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి రచయితలు తమ రచనలని వెలువరించారు. కందుకూరి వీరేశలింగం పంతులు ఆంధ్రదేశంలో స్త్రీ విద్యావ్యాప్తికి కృషి చేశారు. 'స్త్రీ అవిద్య' పంతొమ్మిదవ శతాబ్దంనాటి సమకాలీన సమస్య. దీనిని రూపు మాపడానికి దక్షిణ భారత తొలి సాంఘిక నవలల రచయితలు స్త్రీ విద్యా ఆవశ్యకతని తెలిపే సన్నివేశాలని తమ నవలల్లో చిత్రించడం జరిగింది.

#### 5.3.2.1. ప్రతిస్పందనలు

ఇందిరాబాయి నవలలో వితంతు పునర్వివాహం, స్త్రీవిద్య ప్రధాన కథా వస్తువులు. చదువుకునే స్త్రీలపై ఆనాటి సమాజంలో ఎలాంటి ఒత్తిడి ఉండేది. ఆ ఒత్తిడిని అధిగమించే

ప్రయత్నంలో స్త్రీలు ఎలాంటి కష్టాలు పడ్డారు. స్త్రీ విద్యావంతురాలైతే ఏం జరుగుతుంది. వంటి ప్రశ్నలకి సమాధానం ఇందిరాబాయి పాత్ర. ఇందిరాబాయి వితంతువుగా మారినపుడు ఒక సంవత్సరకాలం ఎవరికీ మొఖం చూపించ కూడదని తల్లి ఆజ్ఞాపిస్తుంది. ఆ సమయంలో ఇందిరాబాయి కాలక్షేపం నిమిత్తం పుస్తకాలను చదువుతుంది. అది గమనించిన ఇందిరాబాయి తల్లి "జాతిని భ్రష్టు పట్టించడానికి బయలుదేరావా? అంటుంది. తల్లి అడిగిన ప్రశ్నకి ఇందిరాబాయి 'శ్రీ' అనే అక్షరం తెలియని నిరక్షర కుక్షులు, పుస్తకాన్ని స్వప్నంలో కూడా చూడకుండా ఎంత మంది ప్రజలు జాతి భ్రష్టులయ్యారో నీకేం తెలుసూ" (వెంకటరావు, గుల్వాడి. 1962: 153) అంటుంది. ఇక్కడ అన్నది ఇందిరాబాయి అయినా ఆ పాత్రచేత ఆ మాటలను పలికించింది గుల్వాడి వెంకటరావుగారు. ఈ సంభాషణ ద్వారా స్త్రీ చదువుకోవడం వల్ల జాతి భ్రష్టమవ్వదు చదువుకోక పోవడం వల్లనే జాతికి ఎక్కువ నష్టం కలుగుతుందన్న సందేశాన్ని ఇచ్చారు. స్త్రీ విద్యపై నాటి సమాజంలో సనాతన వ్యక్తుల మనుసులో ఉన్న అనుమానాలను వాటికి సమాధానాలను ఇందిరాబాయికి, జలాక్షికి నడిచిన సంభాషణ రూపంలో గుల్వాడి వెంకటరావుగారు అందించారు.

"ఇందిరాబాయి: ఇంగ్లీషు భాష, గణితశాస్త్రం, లోకచరిత్ర మొదలైన అంశాలను ఆడవాళ్లు చదవకూడదట నిజమా?

జలాక్షి: చిరునవ్వు నవ్వి! అలా అని నీకు ఎవరు చెప్పారమ్మా!

ఇందిరాబాయి: కొంతమంది అలా చెప్పడం నేను విన్నాను. అయితే నాకు ఆ మాటలపై అంతగా విశ్వాసం లేదు. చదువు నేర్చిన స్త్రీలు జాతిని భ్రష్టుపట్టిస్తారట. విద్య నేర్చిన స్త్రీ తన నడతను సరిదిద్దుకుంటుందే తప్ప చెడిపోదని నా అభిప్రాయం. మీ అభిప్రాయం ఏంటి?

జలాక్షి: నా అభిప్రాయం కూడా అదే... అక్షర జ్ఞానం లేని నిరక్షరాసులే ఎక్కువ దుర్మార్గ ప్రవర్తనలో ఉంటారని నా భర్త అనేకసార్లు నా వద్ద చర్చించి ఉన్నారు.

ఇందిరాబాయి: విద్య నేర్చుకోవడంవల్ల ఎటువంటి నష్టం ఉండదు. అంతే కాక అన్ని కష్టాల నుండి విద్య మనల్ని రక్షిస్తుంది. మన బుద్ధి సరైన స్థితిలో

ఉండడానికి, హృదయం నిర్మలంగా ఉండడానికి విద్య ఉపకరిస్తుంది.”
(వెంకటరావు, గుల్వాడి. 1962: 193)

ఈ సంభాషణలో ఇందిరాబాయి మాటలు స్త్రీ విద్యా ఆవశ్యకత గురించి నాటి సమాజానికి గుల్వాడి వెంకటరావుగారు ఇచ్చిన సందేశాలు. ఇలా సందేశం ఇచ్చిన ఇందిరాబాయి పాత్ర ఆంగ్ల విద్యను నేర్చుకొని తన తల్లిదండ్రులని ఎదిరించి, తనకిష్టమైన భాస్కరరావును వితంతు పునర్వివాహం చేసుకుంటుంది. ఈ రకమైన పాత్రచిత్రణ ద్వారా రచయిత విద్యావంతురాలైన స్త్రీ తనకెదురైన కష్టాలను ఎదుర్కొని సమాజంలో ఎలా నిలబడగలదో ఇందిరాబాయి పాత్ర ద్వారా నాటి సమాజానికి తెలియపరిచారు.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ అవ్వ ధనవంతులకి చదువు అవసరం లేదని అన్ని పనులు గుమాస్తాలు చేస్తారని చెబుతుంది. ఈ మాటలు విన్న ప్రతాపముదలియార్ అమ్మ సుందరఅణ్ణి “చదువుసంధ్యలులేని పామరజనులను చూడు. వాళ్ల చేష్టలకు మృగాల చేష్టలకు ఏం భేదం ఉంది.” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 4) అంటూ చదువు గొప్పతనాన్ని ప్రతాపముదలియార్‌కి వివరిస్తూ సుధీర్ఘ ఉపన్యాసం ఇస్తుంది. సుందరఅణ్ణిపై ఆశపడిన ‘నీలకంఠముదలియార్’ ఆమెని ఎత్తుకెళ్లి పెళ్లి చేసుకుందామని పథకం రచిస్తాడు. నీలకంఠముదలియార్ మనుషులు సుందరఅణ్ణి తండ్రికి ఆరోగ్యం బాగాలేదని తప్పుడు వార్త చెప్పి తెల్లవారక మునుపే ఆమెని తమ బండిలో ఎక్కిస్తారు. కొంత సమయం గడిచిన తరువాత ఆ బండిలో ఒక పక్క ‘నీలకంఠముదలి’ అని రాసి పెట్టి ఉండడంవల్ల జరిగినదంతా నాటకమని ఇదంతా నీలకంఠముదలియార్ కుట్ర అని సుందరఅణ్ణి తెలుసుకుంటుంది. ఆపద నుండి బయట పడుతుంది. జ్ఞానాంబాళ్ విద్యావంతురాలు కావడం వల్ల విక్రమపురికి రాజుగా రాజకార్యాన్ని నిర్వహిస్తుంది. విద్య స్త్రీలకు అదనపు ఆభరణం మాత్రమే కాక కష్టసమయంలో వారికి అండగా ఉండి ఆ కష్టాల నుండి స్త్రీలను గట్టెక్కిస్తుందన్న సందేశాన్ని వేదనాయగంపిళ్ళైగారు ఈ సంఘటనల ద్వారా నాటి సమాజానికి అందించారు.

“జన్మతః సంక్రమించిన బుద్ధి చాతుర్యంతో, అంద చందాల్లో మిక్కిలి పేరు గడించిన మన నాయర్ అమ్మాయిలకు మంచి ఆంగ్లవిద్యను అభ్యసింపజేస్తే వాళ్లకు సమాజంలో లభించే గౌరవ మర్యాదలు, ఆత్మ విశ్వాసం కార్యనిర్వహణా దక్షత వీటిని గురించి నా మలయాళ

సోదరులకు అర్థమయ్యేల చేయాలన్నదే నా ఆశ" (జయప్రకాశ్, ఎస్(అ). 2016: xii) ఇవి ఇందులేఖ ముందుమాటలో చందుమీనన్‌గారు రాసుకున్న వాక్యాలు. ఈ వాక్యాలు స్త్రీవిద్య ఆవశ్యకతని చందుమీనన్‌గారు నాటి సమాజానికి తెలిపే ఉద్దేశంతో ఇందులేఖ నవలా రచనకి శ్రీకారం చుట్టారని తెలుపకనే పులుతున్నాయి. చందుమీనన్‌గారు తాను అందించాలనుకున్న సందేశానికి అనుగుణంగా ఇందులేఖ పాత్రని చిత్రించారు. ఇందులేఖ 'నాయర్' కుటుంబంలోని అమ్మాయి. ఆంగ్లవిద్యని అభ్యసిస్తుంది. ఈ విద్యాజ్ఞానం ఫలితంగా తనకు వచ్చిన కష్టాలను చాలా సునాయాసంగా ఎదుర్కొంటుంది. మాధవునితో ఇందులేఖకి జరిగిన సంభాషణలో మాధవుడు మలయాళ దేశంలో స్త్రీలకు అధిక స్వేచ్ఛ ఉన్నందువల్ల వారు చెడు దారిలో నడుస్తున్నారని ఆరోపిస్తాడు. మాధవుని మాటలు విన్న ఇందులేఖ విద్య స్త్రీలు చెడుదారిలో ప్రవర్తిల్లకుండా మంచి మార్గంలో పయనించేలా చేస్తుందని మాధవునికి సమాధానం చెబుతుంది. "నా అభిప్రాయం ప్రకారం స్త్రీలకు స్వాతంత్రం ఇవ్వక మృగాల వలె పెంచి పెద్ద చేయడమే వ్యభిచారం కన్నా అధికమైన హానిని కలిగిస్తుంది. అయితే చదువు, తెలివి తేటలు గల వారికి ఏ కాలంలోనూ వ్యభిచారంపై ఆలోచన రావడానికి మార్గం లేదని నేను చెబుతాను. దుర్బుద్ధి, దుస్సహవాసము ఎంత మంది చదువుకున్న వారికి ఏర్పడుతుంది? అలా ఏర్పడడం చదువు వలన, తెలివి తేటల వలన అని కొంతమంది తప్పుగా చెప్పడం విన్నప్పుడు నాకు ఆశ్చర్యం కలుగుతుంది. చదువు, విజ్ఞానము ఈ విధమైన దుర్బుద్ధులను నశింపజేయగల సాధనాలు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 39) ఈ రకంగా ఇందులేఖ చెప్పడమే కాదు స్వయంగా తాను ఆచరించి చూపిస్తుంది. నాయర్ స్త్రీగా ఉన్న ఇందులేఖని ఎంతో మంది నంబూద్రి పురుషులు ఇష్టపడతారు. దీన్ని అవకాశంగా తీసుకొని ఇందులేఖ వ్యభిచరించి ఉండవచ్చు. చదువుకున్న జ్ఞానం కలిగిన ఇందులేఖ అలా చేయలేదు. "నన్ను కోరుకున్నవారిపై మహారాజులపై నాకు ఆలోచన ఉంటే వారిలోని ఒకరిని ఎప్పుడో భర్తగా చేసుకోనుండేదానిని కదా! నాకు ఈ విషయంలో డబ్బు, గడ్డిపోచ రెండూ సమానమే. నా మనసుకు నచ్చినవారే నాకు భర్త." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 36) అంటూ తన అభిప్రాయాన్ని ఇందులేఖ మాధవుని వద్ద కుండబద్దలు కొట్టినట్లు చెబుతుంది. ఇలా నవల ఆసాంతం ఇందులేఖ పాత్ర అప్పటివరకు సంప్రదాయబద్ధంగా ఉన్న దురాచారాలను కూలగొడుతుంది. నవలలోని మిగతా స్త్రీ పాత్రలు మాత్రం తమ భర్తలకి అణగిమణగి ఉంటూ మలయాళ తరవాడు సంప్రదాయం ప్రకారం కుటుంబపెద్ద పంజుమీనన్ చెప్పిన మాటలు వింటాయి. ఇందులేఖలో నూతన అభ్యుదయ

భావాలు విద్యాద్వారానే వచ్చాయనే సందేశాన్ని ఒ. చందుమీనన్‌గారు ఇందులేఖ నవలద్వారా నాటి సమాజానికి ఇచ్చారు.

## 5.4. వైద్యవిధానం

ఆధునిక వైద్య విధానం అందుబాటులోకి రాకపూర్వం భారతదేశంలో సంప్రదాయ వైద్యం అమలులో ఉండేది. ఈ సంప్రదాయ వైద్యంలో ఉపయోగించే మందుల వల్ల కొన్ని సందర్భాలలో వ్యాధి నయమైనా అనేక సందర్భాలలో వైద్యం తిరగబడి, రోగి ప్రాణాలకి ప్రమాదం ఏర్పడే స్థితి ఉండేది. ఈ సంప్రదాయ వైద్యంలో నాటువైద్యం, మూలికా వైద్యం వంటివి వస్తాయి. ఆధునిక ఆంగ్లేయ వైద్యం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి అందుబాటులోకి వచ్చింది. ప్రాచీన సంప్రదాయ వైద్యం, ఆధునిక ఆంగ్లేయ వైద్యం రెండూ అమలులో ఉన్న పరిస్థితి పంతొమ్మిదవ శతాబ్దంలో కనిపిస్తుంది. శ్రీరంగరాజుచరిత్ర నవలలో చంద్రగుప్తి నగరాన్ని శ్రీరంగరాజు వీక్షించిన సందర్భంలో అతనికి జ్వరం వస్తుంది. సోనాబాయి తల్లి శ్రీరంగరాజుకు వనమూలికలతో వైద్యం చేసి అతన్ని రక్షిస్తుంది. (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 87). ఈ విధంగా మూలికా వైద్యం ద్వారా ఒక వ్యక్తి ఆరోగ్యం బాగుపడినట్లు శ్రీరంగరాజుచరిత్ర నవలలో ప్రస్తావితమైంది. కన్నడ ఇందిరాబాయి నవలలోనూ, తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలోనూ ఆంగ్లేయ వైద్య విధానం గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

### 5.4.1. ఆంగ్లేయ వైద్యం

పంతొమ్మిదవ శతాబ్దంలో భారతదేశంలో ప్రాచీన వనమూలికల స్థానంలో ఇంగ్లీషు మందులు అందుబాటులోకి వచ్చాయి. అంతకుముందు లేని ధర్మామీటర్, స్టెతస్కోప్ వంటి నూతన వైద్య పరికరాలు భారతీయులకు పరిచయం అయ్యాయి. వీటిని భారతీయులు స్వీకరించే క్రమంలో వారి మధ్య జరిగిన సంఘర్షణ కన్నడ ఇందిరాబాయి నవలలో చిత్రితమైంది. ఇందిరాబాయి భర్త విఠలరావు వేశ్యాలోలుడిగా ఉండి అనారోగ్యం బారినపడతాడు. అతనికి వైద్యం చేయించే క్రమంలో త్రయంబకరావు, ఆ ఊరిలో ఉన్న తక్కడివెంకటరావునో లేదా రాయకుట్టి పండితున్నో పిలిపించి వైద్యం చేయించాలనుకుంటాడు. అప్పుడు భీమారావుకి,

త్రయంబకరావుకు మధ్య జరిగిన సంభాషణ ఆంగ్లేయ వైద్యంపట్ల పంతొమ్మిదవ శతాబ్దంలో నెలకొని ఉన్న వ్యతిరేకతకి నిదర్శనం.

**భీమారావు:** ఈ మధ్యనే ఇక్కడికి ఒక కొత్త పండితుడు వచ్చాడట కదా! అతని వద్ద 'ధర్మామేస్త్రీ' అనే ఒక కొత్త గాజునాళం ఉందట. అందులో పాదరసమో, సిద్ధరసమో అనే ఏదో ఒక రసం ఉందట. ఆ నాళికను రోగి నోటిలో లేదా చంకలో కొన్ని నిమిషాల వరకు పెడితే జ్వరం ఎంతుందో ఖచ్చింతంగా తెలుస్తుందంటా.

**త్రయంబకరావు:** అయ్యో వద్దు రావుగారు, అతన్ని పిలిపించడం వద్దు. ఆ గాజునాళిక ఏంటో నాకు తెలుసు. జాతిని భ్రష్టు పట్టించడానికి పాదరీలు చేసిన కుయుక్తే ఇదంతా మ్లేచ్ఛుల నోట్లో ఉంచిన నాళికను మన నోట్లో ఉంచితే ఇక జాతి ఎక్కడుంటుంది? అదీ కాక ఆ గాజునాళికలో ఉన్నది పాదరసమో, సిద్దరసమో కాదు అది గోమాంసంతో తయారైన రసాయనం. దానిని మన నోట్లో వేయడానికి చేసిన కుయుక్తే ఇదంతా.

**భీమారావు:** అవునా! ఎంత కుయుక్తి. ఆ వైద్యుడి దగ్గర 'సెట్టియకోప' అనే చిని వాయిద్యం మాదిరిగా కనబడే ఇంకొక సాధనం ఉందట. దానిని గురించి మీకు తెలుసా!

**త్రయంబకరావు:** అదా! అది క్రైస్తవ పాదరీల ఇంకో కుయుక్తి. ఏమైనా అనారోగ్యం వస్తే దానిని అయ్యో! ఆ కర్మ కార్యక్రమాన్ని నోటి ద్వారా ఉచ్చరించడమే అపశకుణం. ఏది ఏమైనా కాని అటువంటి వైద్యం మనకువద్దు" (వెంకటరావు, గుల్వాడి. 1962: 128)

భీమారావు, త్రయంబకరావులచే నియమించబడ్డ తక్కడి వెంకటరావు అనే వైద్యుడు విఠలరావు నాడిని పట్టుకొని చూసి "రావుగారు నాకు రోగం పూర్తి మర్మం తెలిసింది. ఇది కాలజ్వరం. మొదట ఒక స్వర్గాంజనాన్ని కంటికి రాస్తాను. దానితో అతను మాట్లాడతాడు. ఆ తరువాత జ్వరాంతక తైలాన్ని తాగిస్తాను. రెండు నిమిషాలలో అంతా సర్ధుకుంటుంది. వెంటనే కొంచెం శొంఠి రసాన్ని తీసుకురండి" (వెంకటరావు, గుల్వాడి. 1962: 131) అంటాడు. ఈ మాటలు విన్న ఇందిరాబాయి తన భర్త ఆహారం తినక చాలా రోజులైంది. ఇప్పుడు పరిగడుపున

ఇలాంటి రసాన్ని తాగిస్తే అతను మరణిస్తాడు. వెంటనే ఆంగ్లేయ వైద్యుడిని పిలుచుక రండని తండ్రి భీమారావును, మామ త్రయంబకరావును వేడుకుంటుంది. అయినా వారు ఇందిరాబాయి మాటలను పట్టించుకోరు. తక్కడి వెంకటరావు వైద్యం అందించిన కొద్ది సేపటికే విఠలరావు మరణిస్తాడు. ఇలా ఒక పక్క ఆంగ్లేయ వైద్యంపై ప్రజలలో నెలకొన్న భావాలని చెబుతూ ఇంకోపక్క నాటు వైద్యం ద్వారా విఠలరావు మరణించినట్లు చెప్పడం ద్వారా గుల్వాడి వెంకటరావుగారు నాటు వైద్యం కన్నా ఆధునిక ఆంగ్లేయ వైద్యం మంచిదన్న సందేశాన్ని పాఠకులకు అందించారు. వేదనాయగంపిళ్ళైగారు ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కూడా ఇదే విధమైన సందేశాన్ని అందించే సన్నివేశం చిత్రించారు. ఆదియూరు పాళ్యానికి అధికారిగా ఉన్న దేవరాజపిళ్ళైకి ఒక రోజు తీవ్రమైన జ్వరం సోకుతుంది. కుటుంబ వైద్యులు, ఇతర వైద్యులు మందులిచ్చినా ఆ వ్యాధి తగ్గదు. చివరకి ఇంగ్లీషు డాక్టరు వచ్చి మందు ఇవ్వగా వ్యాధి నయమౌతుంది. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 26). జ్ఞానాంబాళ్‌కి మశూచి సోకిన సందర్భంలో ఆంగ్లేయ డాక్టర్లు ప్రత్యేక శిబిరంలో ఆమెకి వైద్యం చేస్తారు. (జయప్రకాశ్,2008(అ): 231). ఈ సంఘటనలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి భారతదేశంలో ప్రవేశించిన ఆంగ్లేయ వైద్యానికి నిదర్శనాలు.

### 5.5. ఆర్థిక వినిమయం

"పంతొమ్మిదవ శతాబ్దంలో రవాణా సౌకర్యాలు పెరగడం వల్ల రాకపోకలు పెరిగాయి. గ్రామాలలో ద్రవ్యం విరివిగా వాడుకలోకి వచ్చింది. అందు వల్ల అంతకు ముందున్న వస్తు మార్పిడికి బదులు ద్రవ్యమార్పిడి ఎక్కువైంది. భూమిశిస్తూ, ఇతర పన్నులు, అప్పులపై వడ్డీ, కూలి చెల్లింపులు అన్నింటికి ద్రవ్యాన్నే ఉపయోగించే పరిస్థితి ఏర్పడింది. అన్ని సేవలకు ధాన్యం ఇచ్చే పద్ధతి పూర్తిగా వదిలివేయబడింది." (శేషన్, ఎస్. ఎస్. 1999: 45)

ఆర్థిక వినిమయం పూర్తిగా ద్రవ్యరూపంలో జరిగిన అనేక సంఘటనలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలలలో ప్రస్తావనకి వచ్చాయి.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజును ఇంటికి క్షేమంగా రప్పించే క్రమంలో మూరురాయగండర్ జ్యోతిష్యులు చెప్పిన విధంగా యజ్ఞహోమాలు చేయిస్తాడు. ఈ హోమాలకు

లక్ష ధన వ్యయము చేసినా ఏం ప్రయోజనం లేకుండా పోయిందని శ్రీరంగరాజు తల్లి బాధపడుతుంది.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 80).

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో కనకసభని కాపాడిన సన్యాసికి జ్ఞానాంబాళ్ పదివేల వరహాలు విలువచేసే ఆభరణాలు ఇవ్వడానికి సిద్ధపడుతుంది.” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 22). ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జ్యోతిష్యుడికి జ్ఞానాంబాళ్ పది రూపాయల ఆర్థిక సహాయం చేస్తుంది. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 31). ప్రతాపముదలియార్ ఇంటి పెరడులో పుణ్యకోటిచెట్టిమొక్క నాటడానికి గుంత తవ్వగా అతనికి ఆరునూర్ల బంగారు వరహాలు ఉన్న పెట్టె లభిస్తుంది. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 99). కుంభకోణం వైశ్యుని కథలో తమ్ముడు అన్నకి నూరు బంగారు నాణ్యాలను పెట్టుబడిగా ఇస్తాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 119).

ఇందిరాబాయి నవలలో విఠలరావుకి వైద్యం చేయడానికి వచ్చిన వెంకటరామునికి భీమారావు ఐదువందల వరహాలిస్తాడు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 135) సుందరరావు కేసు విచారణ సందర్భంలో భీమారావు జవాన్లకు నాలుగు రూపాయల లంచం ఇస్తాడు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 32). సుందరరావు కేసు విచారణ నిమిత్తం శేషగిరిరావు అనే వకీలుకు నరసింహశాస్త్రి వెయ్యి రూపాయలను ఇస్తాడు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 51). ఇందిరాబాయి వివాహ సందర్భంలో భీమారావు పదిహేనువేల రూపాయలను ఖర్చు పెడతాడు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 94).

ఇందులేఖ నవలలో నంబూద్రిపాడు ఇందులేఖను చూడడానికి వెళ్తూ గజానికి తొంబై రూపాయల విలువచేసే బంగారు అంగీని వేసుకుంటాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 146). ఉత్తర భారతదేశ యాత్రకి బయలుదేరే ముందు మాధవుడు తన చెవి కమ్మలను నూటాయభై రూపాయలకి అమ్ముతాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 242)

ఈ విధంగా వరహాలు, బంగారు నాణాలు, రూపాయల రూపంలో ద్రవ్య వినిమయం జరిగిన సంఘటనలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో చిత్రితమయ్యాయి.

### 5.6. రవాణా సౌకర్యాలు

పంతొమ్మిదవ శతాబ్దంలో భారతదేశంలోని రవాణావ్యవస్థలో మార్పులు వచ్చాయి. ఆంగ్లేయులు తమ వ్యాపారాన్ని విస్తరించే క్రమంలో భారతదేశం నుండి ముడి సరుకులని ఎగుమతి చేసి తమ దేశంలో తయారైన వస్తువులను భారతదేశానికి దిగుమతి చేసారు. 1813లోనూ, 1833లోను ప్రవేశపెట్టబడిన చార్టర్ చట్టాల మూలంగా స్వేచ్ఛా వ్యాపారం అందుబాటులోకి వచ్చింది. దీనితో ఆంగ్లేయులు భారతదేశాన్ని తమ వస్తువులు అమ్ముకునే మార్కెట్‌గా మార్చివేశారు. భారతీయ మార్కెట్లను పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికి తగినంత రవాణా సౌకర్యాలను కల్పించవలసిన అవసరం ఏర్పడింది. అందుచేత దేశమంతా రైలు, రోడ్ల నిర్మాణానికి ఆంగ్లేయులు పూనుకున్నారు. ఈ రైలు, రోడ్ల నిర్మాణం జరుగుతున్న సమయంలో, ఎడ్లబండ్లు, గుర్రాలు, పల్లకిలు మొదలైన వాటిని కూడా ప్రయాణానికి ఉపయోగించారు.

### 5.6.1. రోడ్లు

"పంతొమ్మిదవ శతాబ్ది ఆరంభంలో భారతదేశంలో రవాణా సౌకర్యాలు చాలా తక్కువ. ఉన్న రోడ్లు స్థానిక అవసరాలకు మాత్రమే పనికివచ్చేవి. కొన్ని మట్టి రోడ్లు, రహదార్లు ఉండేవి. కాని అవి రక్షణ సదుపాయాలకు ఉద్దేశించబడినవి. కంపెనీ ప్రభుత్వం రహదారులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలేదు. పత్తి మొదలగు ముడి వస్తువులు ఎడ్ల బండ్ల ద్వారా రవాణా అయ్యేవి. వర్షా కాలంలో అట్లాంటి వస్తువుల రవాణా దుర్లభమయ్యేది. అందుచేత బీహార్ నుంచి బొంబాయికి ఎగుమతి చేసే పత్తిని వర్షాకాలానికి ముందే చేసేవారు." (శేషన్, ఎస్.ఎస్. 1999: 88) రవాణాకి రోడ్డుమార్గం ద్వారా ఎడ్లబండ్లను, గుర్రపుబండ్లను, పల్లకిని, గుర్రాలను ఉపయోగించిన సన్నివేశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో చిత్రితమయ్యాయి.

#### 5.6.1.1. పల్లకి ప్రయాణం

ఇందులేఖ నవలలో నంబూద్రిపాడు ఇందులేఖను చూడడానికి పల్లకిలో బయలుదేరుతాడు. "గోవింద! నేను ఇప్పుడే బయలుదేరుతాను. పల్లకి మోసేవాళ్లు ఇక్కడే కదా పడుకున్నారు. అందరిని పిలువు శీఘ్రం, శీఘ్రం." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 111). అంటూ అర్ధరాత్రి నంబూద్రిపాడు ఇందులేఖ వద్దకి వెళ్లడానికి పల్లకీలను సిద్ధం చేయండని తన పనివాళ్లకి చెబుతాడు. రాత్రి సమయంలో గుట్టలను, మిట్టలను దాటుతూ ప్రయాణం చేయడం సరికాదని సేరుసేరి నంబూద్రి చెప్పడం వల్ల నంబూద్రిపాడు తన ప్రయాణాన్ని ఉదయానికి

వాయిదా వేసుకుంటాడు. మరునాడు ఉదయం పల్లకిలో ప్రయాణించి నంబూద్రిపాదు ఇందులేఖ ఇంటికి చేరుకుంటాడు.(జయప్రకాశ్, ఎస్(అ). 2016: 119). ఇందిరాబాయి నవలలో భీమారావుని కమలాపురం మఠం పరిధిలో ధర్మవిచారకర్తగా నియమించడానికి మఠాధిపతి పల్లకిలో బయలుదేరి వస్తాడు. భీమారావు కూతురు ఇందిరాబాయి వివాహం జరిగే సందర్భంలో భీమారావు ఆహ్వానం మేరకు మఠాధిపతి పల్లకిలో భీమారావు ఇంటికి వస్తాడు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 64,86). ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో సంబంధముదలియార్ వేసవి కాలంలో కుటుంబ సమేతంగా బళ్లు, గుర్రాలు, పల్లకిలతో పనంపల్లి గ్రామానికి విడదికి వెళ్తాడు. ఈ సందర్భంలో జ్ఞానాంబాళ్‌ని పూంగావూరు తహసీల్దార్ మనుషులు పల్లకిలలో అపహరించడానికి ప్రణాళిక రచిస్తారు. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 62, 63). ఈ సంఘటనలు నవలల రచనా కాలంనాటి పల్లకి ప్రయాణానికి నిదర్శనం.

### 5.6.1.2. గుర్రపు బళ్లు

ప్రయాణానికి గుర్రాలను, గుర్రపు బళ్లను ఉపయోగించిన సన్నివేశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తున్నాయి.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో నవాబు గుర్రం మీద దేశసంచారం చేసిన విధానం నవల ప్రారంభంలో తెలుపబడింది. సుందరఅణ్ణిని అపహరించడానికి ప్రయత్నించిన నీలకంఠ ముదలియార్ జోడు గుర్రాలను పూన్చిన తన నాలుగు చక్రాల రథాన్ని, సారథిని సత్యపురికి పంపిస్తాడు. కనకసభ ఆచూకి తెలుసుకున్న అతని తల్లిదండ్రులు ప్రతాపముదలియార్ ఇంటికి గుర్రాలను పూన్చిన స్వర్ణమయ రథాలలో వస్తారు. దేశ సంచారం నిమిత్తం ఇంటి నుండి ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌లు వారికి తెలియకుండా ఆదియూరుకు చేరుకుంటారు. ఆదియూరులో ఉన్న దేవరాజపిళ్ళై నాలుగు గుర్రాలు కట్టిన రెండు రథాలపై ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌లను తన ఇంటికి తిసుకెళ్తాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 103).

ఇందులేఖ నవలలో ఉత్తరభారత యాత్రలో భాగంగా బాబు గోవిందసేన్ ఇంటికి వెళ్లిన మాధవుడు సార్టు బండిలో కలకత్తా నగరాన్ని వీక్షిస్తాడు.(జయప్రకాశ్, ఎస్(అ). 2016: 248). మాధవుడు బొంబాయి సముద్రతీరం వద్దకి వెళ్లినప్పుడు అక్కడ అనేక సార్టూ బండ్లను చూస్తాడు. “పాల నురుగలాగా అతి తెల్లగానూ, నీటి మేఘాలలో నీలివర్ణంగానూ, పలు రకాలైన కుంకుమ

వర్ణాలతో ఎరుపు రంగు కలగలిసిన రంగులతో కూడిన పెక్కు ఉత్తమములైన గుర్రాలచే లాగబడుతున్న సార్టూ అనబడే గుర్రపు బండ్లు దిక్కుదిశా లేకుండా పరుగెత్తుతుండడం చిత్రాలలాగ నిలబెట్టినట్లు, మిక్కిలి అందమైన సముద్రతీరపు ప్రదేశాలలో నిలబెట్టి ఉండడం మొదలైన దృశ్యాలను, ఆ బళ్లలో కూర్చొని సముద్రపు గాలిని ఆస్వాదిస్తున్న వారిని చూడ్డం ఆనందకరమైన ఒక దృశ్యం." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 243, 244) ఈ వర్ణలు గుర్రపుబళ్లు ప్రయాణ సాధనాలుగా ఉపయోగించిన విధానానికి నిదర్శనం.

## 5.6.2. రైల్వే వ్యవస్థ

బ్రిటీషు పరిపాలనా కాలంలో రైల్వే వ్యవస్థ నూతనంగా భారతదేశంలో ప్రవేశపెట్టబడింది. "భారతదేశంలో రైల్వేలను ప్రవేశపెట్టడం కోసం తొలి సూచనలు 1831–32లో మద్రాసులో జరిగాయి. కాని అప్పుడు రైలు పెట్టెలను నడపడానికి ఎద్దులను ఉపయోగించవచ్చునని భావించారు. ఆవిరి శక్తితో రైళ్ళను నడపడానికి 1843లో తగు సూచనలు చేసారు. అప్పటి గవర్నర్ జనరల్ అయిన లార్డ్ హార్డింజ్ హిందూ దేశంలో రైల్వేల నిర్మాణం ప్రభుత్వానికీ, వ్యాపారాభివృద్ధికీ, సైనిక అవసరాలకు ఎంతో అవసరమని తన నివేదికలో తెలిపాడు. రైల్వేల నిర్మాణాన్ని గురించి అంగీకారం కుదిరిన వెంటనే కంపెనీ డైరెక్టర్లకు, పెట్టుబడిదార్లకు మధ్య రైలు, రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. 1853లో 'పెనిన్సులార్ రైల్వే' బొంబాయి నుంచి ఠాణావరకు రైలు మార్గాన్ని పూర్తిచేసింది. 'తూర్పు ఇండియా రైల్వే కంపెనీ' 1854లో కలకత్తానుంచి రాణిగంజ్ వరకు రైలు మార్గాన్ని వేసింది. 1856లో 'మద్రాసు రైలు కంపెనీ' మద్రాసు నుంచి అర్కోణం వరకు రైలు మార్గ నిర్మాణాన్ని పూర్తిచేసింది." (శేషన్, ఎస్. ఎస్. 1999: 87). ఇలా భారతదేశంలో పంతొమ్మిదవ శతాబ్దం నాటికి రైల్వేమార్గాలు వేయబడ్డాయి. నూతనంగా వచ్చిన రైల్వే వ్యవస్థపై రైలు ప్రయాణంపై ప్రజలలో ఉన్న అభిప్రాయలు ఇందులేఖ నవలలో ప్రస్తావనకి వచ్చాయి. లక్ష్మీకుట్టియమ్మ, కేశవ నంబూద్రి భారతదేశంలో నూతనంగా వచ్చిన నూలుమిల్లు, చక్రం, ఆవిరి యంత్రం మొదలైన వాటిని గురించి చర్చించుకుంటూ రైలు గురించి మాట్లాడుకుంటారు.

**లక్ష్మీకుట్టియమ్మ:** ఇందులేఖ అయిదారు రోజులకు ముందు నా దగ్గర పొగబండిని గురించి కొంచెం చెప్పింది. ఈ రకమైన యంత్రాలంతా నీటి ఆవిరి శక్తితో పనిచేసే వనీ, పొగకు ప్రత్యేకంగా ఏ శక్తీ లేదనీ నిప్పు ఉన్న చోట

పొగ ఉండడం సమంజసమైనప్పటికీ పొగ వలన ఎలాంటి ప్రయోజనమూ లేదనీ ఇంకా ఏమేమో చెప్పింది.

**కేశవ నంబూద్రి:** ఏం కథ చెబుతున్నావు లక్ష్మీ ఆ పొగబండి స్తంబాల తంతి మొదలైన అనేకమైన మాయాజాలాలు వాళ్లిక్కడికి తీసుకువచ్చి చూపించడంలోని రహస్యం ఏదీ ఈ జన్మలో మనకు చెబుతారా చెప్పరు. ఈ ఇంగ్లీషువాళ్ల విద్య అంతా మనకు నేర్పిస్తే బాగుంటుంది.

**లక్ష్మీకుట్టియమ్మ:** ఇంగ్లీషువాళ్లు మన వాళ్లకి చెబుతూనే ఉన్నారు కదా! వాళ్లు ఇంకా ఏం చేయాలి? మనం చదువుకోలేక తెలివితేటలు లేకుండా ఉన్నాం.

**కేశవ నంబూద్రి:** అయ్యో! ఓసే లక్ష్మీకుట్టీ అలాగా అనుకుంటున్నావు. వీళ్ళ స్కూలులో చదివిస్తున్నది ఇలాంటి చదువుకాదు. అలాగైతే బాగానే ఉంటుందికదా! ఈ స్కూలులో చదివిస్తున్నదంతా మన పిల్లవాళ్లను చెడగొట్టి వెధవలను చేసేందుకే. తంతితపాల ఎలా తయారుచేయవచ్చు? పొగబండి ఎలా పరుగెత్తుతుంది? అని ఇంగ్లీషు చదివిన పిల్లవాడిని అడిగితే నీకూ, నాకు తెలిసింది కూడా వాడికి తెలియదు.

**లక్ష్మీకుట్టియమ్మ:** అలా ఏమీలేదు. ఆరోజు ఇందులేఖ పొగబండి ఎలా పనిచేస్తుందో ఎంతో విశదంగా చెప్పింది. నాకు బాగానే అర్థమైంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 81-83)

ఈ సంభాషణ రైలు నిర్మాణాన్ని గురించి ఆంగ్లేయులు భారతీయులకి తెలియజేయాలనే రచయిత ఆంతర్యాన్ని తెలుపుతుంది. చదువుకోని వారు ఆంగ్లేయుల వద్ద మంత్రతంత్ర శక్తులు ఉన్నందు వల్లే ఇలాంటి నూతన వస్తువులను కనుగొంటున్నారన్న నమ్మకాన్ని కలిగి ఉండేవారని ఈ సంభాషణ ద్వారా తెలుస్తుంది. మాధవుడు తన ఉత్తర భారతయాత్రలో కలకత్తా నుండి బొంబాయికి రైలులో ప్రయాణిస్తాడు. మాధవున్ని వెతకడానికి బయలుదేరిన గోవిందకుట్టిమీనన్, గోవిందపణిక్కర్‌లు రైలులో ప్రయాణిస్తారు. ఈ సంఘటనలు పంతొమ్మిదవ శతాబ్దంలో కలకత్తా, బొంబాయి మధ్య ఏర్పడిన రైల్వేవ్యవస్థకి నిదర్శనం.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో జ్ఞానాంబాళ్ విక్రమపురిని పురుష వేషంలో రాజుగా పరిపాలిస్తుంది. విక్రమపురిలోని న్యాయ వ్యవస్థని చక్కదిద్దే క్రమంలో న్యాయవాదులు

ఎలా ఉండాలనేది ఆ ఊరిలోని న్యాయవాదులకు చెబుతుంది. ఈ సందర్భంలో "కొంతమంది వకీళ్లు పెక్కుజిల్లాల నుండి వ్యాజ్యాలను తీసుకొని భూ ప్రదక్షిణం చేస్తూ వస్తుంటారు. వాళ్లను ఉదయం కాశీలో చూడవచ్చు. మధ్యాహ్నం మధురైలో చూడవచ్చు. వారు ఆశలనే రెక్కలుగా చేసుకొని పక్షులవలే ఎగిరి తిరుగుతుంటారు. వాళ్లకు రైలు బండి వేగం కూడా చాలనందువలన తంతి, తపాల మార్గంలో ప్రయాణం చేయడానికి వీలు లేకుండా పోయిందేనని సదా విచార నిమగ్నులై ఉంటారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 197). ఈ వర్ణన కాశీ, అయోధ్య, మధురై వంటి ప్రాంతాలను కలుపుతూ వేయబడ్డ రైల్వే, తంతితపాల మార్గాలను పరోక్షంగా సూచిస్తోంది.

## 5.7. వార్తా ప్రసారం

వార్త అన్న పదానికి బ్రౌన్ నిఘంటువులో "Tidings, Intelligence, news, talk, conversation, are part" (హరిశ్చంద్రప్రసాద్, జి. 1993: 1). వంటి అర్థాలు ఇవ్వబడ్డాయి. వార్తలో సమాచార చేరవేత ఉంటుంది. ఈ చేరవేసే సమాచారంలోని విషయం, కాలం, విధానం ఆధారంగా వార్తకి వర్తమానము, వృత్తాంతము, మాట, సంభాషణ వంటి పేర్లు బ్రౌన్ నిఘంటువులో సూచించడం జరిగింది. స్థూలంగా ఒకచోటనుండి మరోచోటికి చేరవేసే సమాచారాన్ని వార్త అనవచ్చు. ఈ సమాచార చేరవేత ఇద్దరు వ్యక్తుల మధ్య జరగవచ్చు లేదా వ్యక్తులకు సమాజానికి మధ్య జరగవచ్చు. వార్తలోని సమాచారం ఏదైనా దాన్ని చేరవేసే విధానంలో మార్పులు వచ్చాయి. ఆధునిక సాంకేతికత అందుబాటులో లేని కాలంలో మనుషుల ద్వారా, పక్షుల ద్వారా వార్తలని ఒక చోట నుండి మరో చోటకి చేరవేసేవారు. సమాచారంలో గోప్యత పాటించాల్సిన అవసరం ఉన్నప్పుడు రాజులు సమాచార చేరవేతకి 'వేగులని' నియమించుకునేవారు. "ఈ విధమైన వార్తా ప్రసారానికి మొఘల్ సామ్రాజ్యంలో ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడినట్లు వెనిటన్ ప్రయాణికుడు 'Niccolao Mancci' తన రచనలో పేర్కొన్నాడు." (హరిశ్చంద్రప్రసాద్, జి. 1993: 6). మొఘల్ సామ్రాజ్యం పతనం అయిన తరువాత ఆంగ్లేయులు భారతదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో వార్త ప్రసారంలో గుణాత్మక మార్పు వచ్చింది. ఈ మార్పుకి అచ్చుయంత్ర ఆవిష్కరణ ప్రధాన కారణం. భారతదేశంలో అచ్చుయంత్రం వచ్చిన తరువాత ముద్రణ ప్రారంభమైంది. లేఖల రూపంలో, పత్రికల రూపంలో, కరపత్రాల రూపంలో వార్తా ప్రసారం జరిగింది. సమాచార రంగంలో సాంకేతికత

పెరిగిన తరువాత టెలివిజన్, టెలిగ్రాఫ్, తంతితపాల వంటి ప్రసార సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. పంతొమ్మిదవ శతాబ్దం సమాచార రంగంలో ఒక సంధికాలం. ఈ కాలంలో భారతదేశంలో వార్తా ప్రసారంలో మార్పులు రావడం ప్రారంభమైంది. అచ్చుయంత్రం వచ్చినా అది అన్నిచోట్లకి విస్తరించడానికి సమయం పట్టింది, ఫలితంగా ఒక పక్క తంతి, లేఖ, కరపత్రం, వార్తపత్రికలతోపాటు వ్యక్తులు, వర్తకుల ద్వారా వార్తా ప్రసారం జరిగింది. ఈ విధమైన వార్తా ప్రసారం నేటి కాలంలో కూడా ఉంది. ఇంత అభివృద్ధి చెందిన సాంకేతిక యుగంలో కూడా నేటికీ గ్రామాలలో సమాచారాన్ని అందరికి తెలపడానికి 'దండోరా' వేస్తున్నారు. ఇది వ్యక్తి మాధ్యమ వార్తా ప్రసారానికి నిదర్శనం. పంతొమ్మిదవ శతాబ్దంలో సమాచార చేరవేతలలో వచ్చిన నూతన మార్పుల ప్రస్తావన దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది.

### 5.7.1. మనుషుల ద్వారా వార్తా ప్రసారం

ఒక చోటు నుండి ఇంకోచోటుకి వార్తను మనుషుల ద్వారా చేరవేసిన సన్నివేశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తున్నాయి. ఇది వార్తా ప్రసారంలోని ప్రాచీన పద్ధతికి నిదర్శనం. రవాణా సౌకర్యాలు అంతగా అభివృద్ధి చెందని కాలంలో ఎక్కువగా మనుషులద్వారా వార్తాప్రసారం జరిగింది.

ఇందులేఖ నవలలో మాధవుని మీద కోపంతో పంజుమీనన్ ఇందులేఖని కణ్ణళిసూరి నంబూద్రిపాదుకు ఇవ్వాలనుకుంటాడు. ఈ విషయం నంబూద్రిపాదుకు ఒక వ్యక్తి ద్వారా తెలుపుతాడు. ఇందులేఖని వివాహం చేసుకోడానికి తమ ఇంటికి నంబూద్రిపాదును ఆహ్వానించే విషయం గురించి పంజుమీనన్‌కి కేశవ నంబూద్రికి మధ్య చర్చ జరుగుతుంది.

"**పంజుమీనన్:** మనిషిని ఇంకా పంపించలేదా ఏమిటి? బదులు ఇంకా రాలేదు.

**కేశవ నంబూద్రి:** ఆ రోజే మనిషిని పంపించేశాను. నంబూద్రి అక్కడ లేడని నాలుగైదు రోజుల తర్వాతనే ఇంటికి వస్తారని పంపించిన మనిషి తిరిగి వచ్చి చెప్పాడు. ఈ రోజు ఉదయం రెండవసారి నేను ఉత్తరం ఇచ్చి మనిషిని పంపి ఉన్నాను. ఈ లోపల వారు ఇంటికి వచ్చి చేరి ఉంటే వారు రేపు ఇక్కడికి వస్తారని ఎదురు చూడవచ్చు." (జయప్రకాశ్(అ), ఎస్. 2016: 73). ఈ సంభాషణ మనుషుల ద్వారా జరిగిన వార్తా ప్రసారానికి నిదర్శనం.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో సోనాబాయిని పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించి నిరాశపడ్డ భీమానాయకుడు సోనాబాయిని బసివి మార్చాలని ప్రయత్నిస్తాడు. సోనాబాయి చంద్రగుప్తి

అనే గ్రామంలో ఉన్నట్లు తానే సమాచారాన్ని కొండవీటిదొర సేవకులకు చెప్తాడు. (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 97). శ్రీరంగరాజు కొండవీటిని వీడి పది రోజులు ప్రయాణించి విద్యానగరానికి రెండు పరుగుల దూరంలో ఉన్న పల్లెకి చేరుకుంటాడు. శ్రీరంగరాజు విద్యా నగరానికి రాబోతున్న విషయాన్ని 'రామయ్య' రాజ కుటుంబీకులకు తానే స్వయంగా శ్రీరంగరాజుకంటే ముందే విద్యానగరాన్ని చేరుకొని రాజ కుటుంబీకులకు తెలుపుతాడు. (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 109).

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో జ్ఞానాంబాళ్‌ని పూంగావూరు తహసీల్దార్ ఆజ్ఞప్రకారం ఆయన మనుషులు అపహరిస్తారు. బోయలు నిద్రపోయిన జ్ఞానాంబాళ్‌ని పల్లకిలో పూంగావూరు తహసీల్దారు వద్దకి తీసుకువస్తుంటారు. ఈ విధంగా బోయలు జ్ఞానాంబాళ్‌ని తెస్తున్న విషయాన్ని ఇద్దరు పనిమనుషులు ముందే కాలినడకన వెళ్లి పూంగావూరు తహసీల్దారుకు చెప్తారు. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 63). ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌లు కనకసభ ఇంట్లో ఉండగా వారిని చూడడానికి సంబంధముదలియార్, కనకాచల ముదలియార్ వస్తున్నట్లు ఒక బండివాడు చెప్తాడు. "సత్యపురమునుండి అమ్మగారు, అయ్యగారు ఇరువురు వస్తున్నారు. నేను నదీ తీరంవైపుగా వెళ్లినప్పుడు వాళ్లను దారిలో చూసి సంతోష సమాచారం చెప్పడానికై రెండు మైళ్ళదూరం పొట్ట కదిలిపోయేలా పరుగెత్తి వచ్చాను! అన్నాడు. ఇది విన్న వెంటనే దేవరాజపిళ్లై ఆనందం ఉప్పొంగుతుండగా పెట్టెను తెరిచి రెండు కోటు వస్త్రాలను, సంతోష సమాచారం తెచ్చినందుకు ఆ బండివానికి బహుమానంగా ఇచ్చాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 112). ఈ సంఘటనలు మనుషుల ద్వారా జరిగిన వార్తా ప్రసారానికి నిదర్శనాలు.

### 5.7.2. అచ్చుయంత్రాల ఆవిష్కరణ

ప్రపంచవ్యాప్తంగా మొట్టమొదట చైనాలో క్రీ.శ. 868లో ప్రారంభమైన ముద్రణ క్రీ.శ. 1557లో భారతదేశంలోకి ప్రవేశించింది. భారతదేశానికి వ్యాపారం నిమిత్తం వచ్చిన విదేశీయులు మత ప్రచారంలో భాగంగా ముద్రణాయంత్రాలని భారతదేశంలోకి తెచ్చారు. "క్రీ.శ.1556లో భారతదేశానికి జెస్యూట్ మిషనరి రెండు అచ్చుయంత్రాలని తీసుకురావడంతో భారతదేశంలో అచ్చు ప్రారంభమైందని చెప్పవచ్చు. 1557లో 'Doctrina Christa' అను

పుస్తకాన్ని గోవాలో అచ్చువేశారు. ఇండియాలో అచ్చైన మొదటి పుస్తకం ఇది. 1578లో మలబారు ప్రాంతంలో ఇదే పుస్తకం అచ్చయింది. 1606లో మధుర మిషనరీకి చెందిన రాబర్ట్ డెనోబిలి తమిళ, తెలుగు భాషలు నేర్చుకొని రోమన్ స్క్రిప్టులో క్రైస్తవమత గ్రంథాలు ప్రచురించారు. ఈ విధంగా భారతదేశంలో అచ్చు ప్రారంభమైందని చెప్పవచ్చు." (హరిశ్చంద్రప్రసాద్, జి. 1993: 6). ఆ తరువాత ముద్రణాలయాలు భారతదేశం అంతటా వ్యాపించాయి. 1831లో మద్రాసులో పోర్టుసెయింట్ జార్జ్ గెజిట్ కోసం ప్రభుత్వ ముద్రణాశాల ఏర్పాటు చేయబడింది. 1825లో 'బళ్ళారి ప్రెస్' స్థాపించబడింది. ఆ తరువాత క్రైస్తవ మత ప్రచార గ్రంథాలు ముద్రితమయ్యాయి. 1854లో విశాఖపట్టణంలో ముద్ర యంత్రము నెలకొల్పబడింది. ఇలా ముద్రణాయంత్రాల సంఖ్య పెరగడం వల్ల అనేక పుస్తకాలు ముద్రించబడ్డాయి. దీనితో పాఠకుల సంఖ్య పెరిగింది. ముద్రణాలయాల స్థాపన వార్త పత్రికల వ్యాప్తికి దోహదపడింది.

ఇందులేఖ నవలలో పంజుమీనన్, ఇందులేఖతో సంభాషించే సందర్భంలో అచ్చు పుస్తకాల గురించిన ప్రస్తావన వస్తుంది.

**పంజుమీనన్:** అమ్మాయి! నీవేం చదువుతున్నావు? ఆ రోజు చెప్పావే అలాంటి కట్టు కథలున్న పుస్తకమా?

**ఇందులేఖ:** కాదు. ఇది 'శాకుంతలం' తాతా! ఈ పుస్తకంలో అచ్చుతప్పులు చాలా ఉన్నాయి. చదవడానికి కష్టంగా ఉంది.

**పంజుమీనన్:** ఒక మంచి పుస్తకం తెప్పించుకోవచ్చు కదా! ఎక్కడ దొరుకుతుంది ఇప్పుడే డబ్బులిస్తాను.

**ఇందులేఖ:** అచ్చుతప్పులు లేని పుస్తకం ఎక్కడ దొరుకుతుందో నాకు తెలియదు. ఉంటే విచారించి తాతగారికి చెబుతాను.

**పంజుమీనన్:** నా బిడ్డకోసం తప్పులులేని పుస్తకాన్ని నేను కొనిస్తాను.

**ఇందులేఖ:** (నవ్వుతూ) అది చాలా కష్టంతాతా! చాలా ఖర్చవుతుంది. అంతేగాక ఇందులో పెద్ద టైపులో అచ్చయినదీ లేనిదీ తెలియదు.

**పంజుమీనన్:** ఏమని తెలియలేదు?

**ఇందులేఖ:** పెద్దపెద్ద అక్షరాల అచ్చు.

పంజుమీనన్: నాకు ఇదంతా ఏమీ తెలియదమ్మా అచ్చులేకపోతే దానిని కూడా తీసుకో.

ఇందులేఖ: (నవ్వింది)” (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 75, 76)

ఈ సంభాషణ అచ్చుపుస్తకాలు ముద్రతమైన తొలినాళ్ళలో అందులో అక్షరదోషాలు ఉన్నట్లు వాటి ఖరీదు అధికంగా ఉన్నట్లు తెలుపుతుంది. ఇందులేఖ క్రైస్తవమత గ్రంథాలనే కాక శాకుంతలం వంటి పుస్తకాలని కూడా చదువుతుంది. ఈ అంశం కేవలం క్రైస్తవమత గ్రంథాలే కాక మిగతా పుస్తకాలు కూడా పంతొమ్మిదవ శతాబ్దంలో అచ్చైనట్లు తెలుపుతుంది.

ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయి భర్త వితలరావు మరణించిన తరువాత విధవరాలిగా మారిన ఇందిరాబాయి అనేక నీతి కథలతో ముద్రితమైన పుస్తకాలను చదువుతూ కాలం గడుపుతుంది. ఈ విధంగా సందర్భానుసారంగా కన్నడ, మలయాళ నవలల్లో అచ్చుపుస్తకాల గురించి పరోక్షంగా తెలుపబడింది. కాని రెండు నవలల రచనా కాలానికి తెలుగు, తమిళ భాషలలో ముద్రణాలయాలు వచ్చాయి. అందుకు ఈ నవలలు ముదణ రూపంలో వెలువడడం ప్రత్యక్ష ఉదాహరణ.

ముద్రణాయంత్రాల స్థాపన జరిగిన తరువాత భారతదేశంలో వార్తాపత్రికల ముద్రణ ప్రారంభమైంది. ప్రారంభకాలంలో వార్తాపత్రికలు బ్రిటీషు ప్రభుత్వ అదుపు ఆజ్ఞలలో వెలువడ్డాయి. సమాచార చేరవేత లక్ష్యంగా 18వ శతాబ్దంలో పత్రికలు వచ్చాయి.

“1780లో ‘బెంగాల్ గెజిట్’ అనే పత్రిక ప్రారంభమైంది. కానీ ఆ పత్రిక గవర్నర్ జనరల్ వారన్ హెస్టింగ్‌ను విమర్శించిన కారణంగ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. దీని తర్వాత అనేక పత్రికలు వచ్చాయి. కలకత్తాగెజిట్, బెంగాల్ జర్నల్, కలకత్తాక్రానికల్, మద్రాసుకేరియన్, బాంబేహెరాల్డ్ మొదలైన పత్రికలను 1784-1790 మధ్య కాలంలో స్థాపించడం జరిగింది. పత్రిక చట్టాలులేని ఆ రోజులలో పత్రికల ఉనికి కంపెనీ అధికారుల ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉండేది. భారతదేశంలో పత్రికలపై సెన్సార్‌ను మొట్టమొదట 1799లో విధించినవాడు లార్డ్ వెల్లస్లీ. 1813-1823 కాలంలో గవర్నర్ జనరల్‌గా వ్యవహరించిన లార్డ్ హెస్టింగ్స్ పత్రికలపై విధించిన ఆంక్షలను తొలగించాడు. పత్రికలపై ఆంక్షలు తొలిగిన తరువాత అనేక కొత్త పత్రికలు ప్రచురణలోకి వచ్చాయి.” (శేషన్, ఎస్. ఎస్. 1999: 75). “1818లో

జె.సి. మార్ష్ మెన్ 'దిగ్ దర్శన్' (సమాచార దర్పణ్) పత్రికని ప్రారంభించారు. 1831లో తమిళ పత్రికను 'Religious tract society' వారు ప్రారంభించారు. 1855లో' Rajavritti bothini' వచ్చింది. ఇది తెలుగులో వచ్చిన దిన వర్తమానానికి సమకాలీన పత్రికగా పేర్కొనవచ్చు. 1882లో 'స్వదేశీమిత్రన్' వార్తా పత్రిక వచ్చింది. 1810లో 'విజ్ఞాననిక్షేపం' అనే మలయాళ పత్రిక వచ్చింది. 1888లో కేరళపత్రిక మలయాళ మనోరమ వచ్చింది." (హరిశ్చంద్రప్రసాద్, జి. 1993: 22, 23) ఇలా పంతొమ్మిదవ శతాబ్దం నాటికి దాదాపుగా అన్ని భారతీయ భాషల్లో పత్రికలు వచ్చాయి. ఈ పత్రికల ద్వారా కవులు, రచయితలు తమ భావాలని ప్రపంచానికి తెలిపారు.

ఇందిరాబాయి నవలా రచయిత గుల్వాడి వెంకటరావుగారు మతం ఆధారంగా జరుగుతున్న దోపిడీని మతాధిపతులకి పత్రికాముఖంగా తెలపాలనుకున్నరు. మతాధిపతులతో సంబంధం లేకుండా కొంతమంది కిందిస్థాయి న్యాయ విచారకర్తలు తమ స్వార్థబుద్ధితో తమకు నచ్చని వారిపై అభియోగాలు మోపి మతం ద్వారా తమకు లభించిన అధికారంతో వారిని సంఘం నుండి వెలివేస్తున్నారని దీనివల్ల మతానికి చెడ్డపేరు వస్తుందని గుల్వాడివెంకటరావుగారి అభిప్రాయం. దీనికి అడ్డుకట్ట వేయాలంటే మతంలోని కింది స్థాయి న్యాయవిచారకర్తలు చేసే అన్యాయ విచారణ గురించి మతాధిపతులకు పత్రికల ద్వారా తెలపాలనుకున్నాడు. దీనికి అనుగుణంగా ఇందిరాబాయి నవలలో కమలాపురం గ్రామంలో నడిచిన విషయాలన్నీ హితబోధిని అనే పత్రికలో వచ్చినట్లుగా, హితబోధిని పత్రికను చదివి ఆ విషయాలను మతాధిపతులు తెలుసుకున్నట్లుగా ఇందిరాబాయి నవలలోని కథా సంఘటనలని గుల్వాడివెంకటరావుగారు చిత్రించారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 259). "ఆంగ్లం చదివిన యువకులు మద్రాస్ మెయిల్ అనే పత్రికను చదువుతున్నట్లు ఇందిరాబాయి నవలలో ప్రస్తావనకు వచ్చింది." (వెంకటరావు, గుల్వాడి. 1962: 102).

ఇందులేఖ నవలలో ఇందులేఖ నంబూద్రిపాదును వివాహం చేసుకుందన్న తప్పుడు వార్త నమ్మి మాధవుడు ఇంటినుండి వెళ్లిపోతాడు. అతన్ని వెతకడానికి వెళ్లిన గోవిందఫణిక్కరు, గోవిందకుట్టిమీనన్ లకు మాధవుని ఆచూకి తెలియకపోయేసరికి మాధవుని గురించి పత్రికలో ప్రకటన ఇస్తారు.

"గోవిందన్‌కుట్టిమీనన్‌కు కలిగిన పెక్కు ఆలోచనలో న్యూస్ పేపర్లో ప్రకటన ఇవ్వడం అని కూడా తోచింది. దాని ప్రకారం ఒకటి రెండుసార్లు కొన్ని న్యూస్ పేపర్లలో ఇందులేఖని గురించిన వదంతులు అబద్ధాలని ప్రకటనలు ఇచ్చారు. ఆ విధంగా ప్రకటనలు వచ్చిన రోజులలో మాధవుడు నౌకలో పడుకొని విచారంలో మునిగిన రోజులుగా ఉండవచ్చునని నేను భావిస్తున్నాను. ఎట్లయినప్పటికీ మాధవుడు ఈ విధంగా ప్రకటన వెలువడిన పేపరు ఏదీ చూడలేదు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016:253). ఈ సంఘటనలు పంతొమ్మిదవ శతాబ్దంలో వార్తాపత్రికలు సమాచార చేరవేతలో మాధ్యమాలుగా ఉన్నట్లు తెలుపుతున్నాయి.

### 5.7.3. లేఖలు

పంతొమ్మిదవ శతాబ్దం నాటికి వార్తా ప్రసారంలో లేఖలు ప్రధాన పాత్ర పోషించాయి. వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్న కాలంలో (1772-85) భారతదేశం అంతటా తపాలాసర్వీసు అందుబాటులోకి వచ్చింది. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో వార్తా ప్రసారంలో లేఖలు ప్రధాన పాత్ర వహించిన అనేక సంఘటనలు చిత్రితమయ్యాయి.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు ఇంటి నుండి వెళ్లిన తరువాత ఆ విషయం తెలిసి ఇంటి వారందరూ బాధపడుతుంటారు. ఒక రోజు 'దేవరాజు' తమ గ్రామ అడవిలో ఎవరో యువకుడు ప్రమాద వశాత్తు బావిలో పడిపోయాడని అతను శ్రీరంగరాజో కాదో వచ్చి చుడండని మురురాయ గండర్‌గారి ప్రధానికి లేఖ రాస్తాడు.

"మురురాయరగండర్ మహారాయలుగారి ప్రధానులంగారికి గ్రామ రెడ్డి దేవరాజు వ్రాసుకొన్న విన్నపంబులు నేడు మాయూరి యడవిని నిద్దరు జనులు వేటాడి వేసారి దారిలో నీరుత్రాగ వచ్చిరి. ఒకడు రమారమి పదునెనిమిదేండ్లవాడు బావిగట్టున గూర్చుండి పరాకున దానం బడి కాలము చేసెను. తక్కిన వానినడుగగా నాతడు మహారాజుగారి పుత్రుండనియు నింట కొట్లాడి వచ్చినాడనియు వానిపేరు శ్రీరంగరాజునియు చెప్పుచున్నాడు. వర్చస్సు చూడగా మృతుండు రాజకులోద్భవుండనుటకు సందియంబు గలుగదు" (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2007:79).

ఈ లేఖను చదవగానే అందరూ బాధపడతారు. ఇదే సమయంలో దక్షిణంవైపుకు దండయాత్రకు వెళ్లిన దలవాయి రామన్న నాలుగు పరగణాలు స్వాధీనం చేసుకున్నట్లుగా ఉత్తరం వస్తుంది.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010:79) ఈ రెండు లేఖలు మనుషులు రాసి మనుషులే వచ్చి ఇవ్వగా అందిన లేఖలు. ఇవి తపాలా సౌకర్యం ప్రారంభానికి ముందున్నలేఖల ప్రసార విధానానికి ఉదాహరణ.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో దేవరాజపిళ్ళై తమ్ముడు ‘దైవనాయగంపిళ్ళై’ ఆస్తిని పూర్తిగా తానే అనుభవించాలన్న ఆశతో దేవరాజపిళ్లై కుమారుడైన కనకసభను చంపడానికి కుట్రపన్నుతాడు. విహారయాత్రలో ఉన్న దేవరాజపిళ్ళైకి కనకసభ కలరా వ్యాధితో మరణించినట్లు లేఖ రాస్తాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 26) ఆ ఉత్తరాన్ని చూడగానే దేవరాజపిళ్ళై ఇంటికి వెళ్తాడు. అప్పటికే దైవనాయగంపిళ్ళై అనారోగ్యంతో మరణించి ఉంటాడు. అతని నడుముకు తన చిరునామాతో రాయబడిన ఒక ఉత్తరాన్ని దేవరాజపిళ్ళై చూస్తాడు. ఆ ఉత్తరంలో దైవనాయగంపిళ్ళై తాను తన అన్నని మోసగించిన విధానాన్ని పూర్తిగా రాస్తాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 27) ఈ విధంగా ఒక ఉత్తరం ద్వారా తన కొడుకు మరణించినట్లు ఇంకో ఉత్తరం ద్వారా బ్రతికి ఉన్నట్లు సమాచారాన్ని దేవరాజపిళ్ళై తెలుసుకుంటాడు.

జ్ఞానాంబాళ్, ప్రతాపముదలియార్‌ల వివాహం ఆగిపోయిన సందర్భంలో సంబంధముదలియార్ తన శపథం నెరవేరాలన్న పట్టుదలతో తన కుమార్తెకు అల్లున్ని వెతికే క్రమంలో చాలా గ్రామాలకి ఉత్తరాలు రాస్తాడు. ఈ విషయం తెలిసి కనకాచల ముదలియార్ తన కుమారుడైన ప్రతాపముదలియార్ వివాహం గురించి చుట్టుపక్కల గ్రామాలకు లేఖలు రాస్తాడు. ఈ విషయం తెలిసిన ప్రతాపముదలియార్ తాము ఎక్కడికైనా వెళ్లి రహస్యంగా వివాహం చేసుకుందామని జ్ఞానాంబాళ్‌కి ఉత్తరం రాస్తాడు. ప్రతాపముదలియార్ ఉత్తరాన్ని అందుకున్న జ్ఞానాంబాళ్ ఎవరికీ తెలియకుండా పెళ్లి చేసుకోవడంవల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రతాపముదలియార్‌కి లేఖ రాస్తుంది. కర్పాలంకారి కథలో కర్పాలంకారి తనభర్త మంగళం పిళ్ళైకి రాజు అన్యాయంగా మరణ దండన విధించినట్లు ఒక తపాలా వాడి వలన తెలుసుకుంటుంది.(జయప్రకాశ్, ఎస్(అ). 2008: 38). కనకాచలముదలియార్, సంబంధముదలియార్ ప్రవర్తనతో ఇంటిని వదిలిన ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌లు తన

వద్దకు వచ్చారని దేవరాజ పిళ్ళై లేఖద్వరా కనకాచల ముదలియార్, సంబంధముదలియార్‌లకు తెలుపుతాడు. ఈ విధంగా ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో అనేక చోట్ల లేఖల గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

ఇందిరాబాయి నవలలో భీమారావు, భాస్కరరావు ఆంగ్లం చదివి జాతిని భ్రష్టు పట్టిస్తున్నాడని మఠాధిపతులకు లేఖ రాస్తాడు. ఇలాంటి లేఖలు మఠాధిపతులకు అనేకం వస్తాయి. భీమారావు సుందరరావుని హత్య చేసిన సందర్భంలో శవ పరీక్షకు సంబంధించిన కెమికల్ ఎక్జామినేషన్ రిపోర్టు మద్రాసు నుండి ఉత్తరం రూపంలో వస్తుంది. (వెంకటరావు, గుల్వాడి. 1962: 47). భీమారావు తన కూతురు ఇందిరాబాయి వివాహానికి రావాల్సిందిగా మఠాధిపతులకి లేఖ రాస్తాడు.

ఇందులేఖ నవలలో మద్రాసు నుండి తాను ఇంటికి వస్తున్న వార్తను గోవిందన్ కుట్టిమీనన్ ఉత్తరం ద్వారా ఇంటివారికి తెలుపుతాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 108) గోవింద ఫణిక్కర్ పంజుమీనన్‌తో తనకు జరిగిన సంభాషణని పంజుమీనన్ మనసులోని మాటని ఉత్తరం ద్వారా మద్రాసులో ఉన్న మాధవన్‌కి చేరవేస్తాడు. మాధవుడు తనకు ఉద్యోగం లభించిందన్న వార్తని ఉత్తరం ద్వారా ఇందులేఖకి తెలుపుతాడు."గోవిందన్ కుట్టి ఇక్కడి నుండి బయలుదేరిన రోజు రాత్రి 8గంటలకు నన్ను సెక్రటేరియట్‌లో నియమించినట్లు గిల్‌హోం దొరగారి దగ్గరినుండి ఉత్తరం వచ్చింది. నేను ఈ రోజు ఆ పనిలో చేరాను. గోవిందన్ కుట్టి, మిగిలినవారు బాగున్నారని భావిస్తున్నాను. నేను మూడు నాలుగు రోజుల తర్వాత ఒక వారం లీవ్ తీసుకొని అక్కడికి వస్తాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 128) ఈ సంఘటన ఉత్తరాల ద్వారా వార్తా ప్రసారం జరిగిందనటానికి నిదర్శనం.

### 5.7.4. తంతి తపాల

భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ తన అవసరాలకోసం 1851లో తంతి తపాలా విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. 1853 నాటికి టెలిగ్రాఫ్ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. 1885వ సంవంత్సరంలో ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం అమలులోకి వచ్చింది. ఈ

తంతి తపాలా ద్వారా సమాచార ప్రసారం జరిగిన సన్నివేశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో చిత్రితమయ్యాయి.

ఇందిరాబాయి నవలలో భాస్కరరావు తన చదువు నిమిత్తం మద్రాసుకు వెళ్తాడు. తాను మద్రాసుకు చేరుకున్న విషయం తంతి ద్వారా అమృతరావు, జలాక్షిలకు తెలుపుతాడు. "భాస్కరరాయను మదరాసన్ను ముట్టిద కొడలె తాయిగూ అమృతరాయ నిగూ తాను, సంజీవరాయను క్షేమదిద్ద మట్టిద వర్తమాన వన్ను 'తంతియ' ద్వారా తిళిసలు అవరెల్లరు సంతోషపట్టరు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 82).

ఇందులేఖ నవలలో ఉత్తరభారతదేశ యాత్రలో ఉన్న మాధవుని పెట్టె అపహరణకి గురౌతుంది. అతని చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండదు. ఈ విషయాన్ని ఒక రైల్వేస్టేషన్ నుండి తంతి ద్వారా మాధవుడు గోపినాథ బెనర్జీకి చేరవేస్తాడు. మాధవుని నుండి తంతి ద్వారా సమాచారం అందుకున్న గోపినాథ బెనర్జి అక్కడి స్టేషను మాస్టారుకి తంతి ద్వారా మాధవుని గురించి సమాచారం అందిస్తాడు.

"మలబారు నుండి వచ్చియున్న మాధవుని టెలిగ్రామ్ చేరింది. వారు నా ప్రాణ స్నేహితులు వారికి కావాల్సిన ఉపచారాలన్ని చేసి ఈ రోజు రాత్రి వారిని జాగ్రత్తగా చూసుకోవాలి. మాధవుని టెలిగ్రాం నాకు ఇక్కడ అందే లోపల ఇక్కడి నుండి అక్కడికి బయలుదేరే ఆఖరు రైలు వెళ్లిపోయింది. లేక పోతే ఈ రాత్రికే నేను అక్కడికి చేరుకొని ఉండేవాడిని. కొంత కూడా విచారించ వద్దని మీరు మాధవులగారితో చెప్పండి. నేను రేపు మొదటి బండికే వచ్చి చేరుకుంటాను." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 265) ఈ టెలిగ్రాంను చదివిన వెంటనే స్టేషన్ మాస్టర్ మాధవునికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తాడు. మాధవుడు బొంబాయి చేరిన తరువాత అతనికి కలిగిన ఆపద గురించి గోపినాథబెనర్జి, కలకత్తాలో ఉన్న బాబుగోవిందసేన్‌కి తంతి ద్వారా తెలియజేస్తాడు. బాబు గోవిందసేన్ కలకత్తానుండి మాధవుని ప్రయాణానికి అవసరమైన బాగోగులన్నీ చూసుకోవాలని గోపినాథబెనర్జీకి తిరిగి తంతి వార్తని పంపిస్తాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 269) ఈ విధంగా కలకాత్తా, బొంబాయి ప్రాంతాల మధ్య నడిచిన తంతి వార్తా ప్రసారం గురించి ఇందులేఖ నవలలో ప్రస్తావితమైంది.

## 5.8. నమ్మకాలు

"నమ్మకమన్నది ఒక వ్యక్తిమీదగానీ, వస్తువుమీదగాని, పరిస్థితిని గురించిగాని, మనిషి సమ్మతిని వ్యక్తంచేసే మానసికస్థితి. పరంపరానుగతంగ తరతరాల నుంచి పునరావృత్తిని పొందుతూ సామూహికమైన సమ్మతిని పొందే మానసిక స్థితిని నమ్మకమని చెప్పవచ్చు." (సుందరం, ఆర్వీయస్. 2015: 256). ఈ నమ్మకాలను పాటించడంవల్ల మానవునికి సుఖాలు కలుగుతాయనే భ్రాంతి సమాజంలో వ్యాప్తిలో ఉంది. నమ్మకాలకి కార్యకారణ సంబంధం ఉండదు. మానవ సమాజంలో అత్యంత ప్రాచీన కాలంలో ఈ నమ్మకాలు ఏర్పడ్డాయి. మానవుడు సంఘజీవిగా జీవించడం ప్రారంభించిన తరువాత ఈ నమ్మకాలు బలపడ్డాయి. ఈ నమ్మకాలని నమ్మేవారిలో చదువుకున్నవారు, చదువుకోనివారు ఉన్నారు. నమ్మకాలు ఎటువంటి హేతుబద్ధ ఆలోచనలు లేకుండా పాటించబడటంవల్ల మూఢనమ్మకాలుగా మారాయి. గుడ్డిగా ఎటువంటి హేతుబద్ధ సంబంధం లేకుండా పాటించే నమ్మకాలు మూఢనమ్మకాలు. ఈ నమ్మకాలని పాటించే వారు అనేకమంది నేటి సమాజంలో కూడా దర్శనమిస్తారు. పంతొమ్మిదవ శతాబ్దంలో వాడుకలో ఉన్న కొన్ని మూఢనమ్మకాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి.

### 5.8.1. శకునాలు

శకునం అనే పదానికి శుభసూచక నిమిత్తము (సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2010: 885) 'శుభాశుభము' (తెలుగు పర్యాయ పదనిఘంటువు, జి.ఎన్.రెడ్డి) అనే అర్థాలు ఉన్నాయి. ఏ పనినైనా ప్రారంభించేటప్పుడు, ఎక్కడికైన వెళ్లేటప్పుడు ఈ శకునాలను చూస్తారు. బయలుదేరే సమయం శుభశకునంలో ఉంటే వెళ్లే కార్యం జరుగుతుందని, అశుభ శకునంలో ఉంటే జరగదని నమ్మకం. ఎక్కడికైనా వెళ్లేటప్పుడు నల్లపిల్లి, ఎండుకట్టెలు, విధవరాలు, ఒంటి బ్రాహ్మణుడు ఎదురుగా వస్తే ఆకార్యం జరగదని ముత్తైదువులు, జంట బ్రాహ్మణులు, ఆవు, పచ్చగడ్డి ఎదురుగా వస్తే వెళ్లే కార్యం జరుగుతుందని నమ్మకం. ఈ నమ్మకంవల్ల ఇద్దరు బ్రాహ్మణులు, నిండు కుండ, మంగళ వాయిద్యాలు, ముత్తైదువలు వంటి వ్యక్తులు, వస్తువులు శుభ శకునాలుగా స్థిరపడగా, ఒంటి బ్రాహ్మణుడు, కొత్తకుండ, విధవస్త్రీ, కాషాయవస్త్రధారి, కట్టెలమోపు వంటి అనేక వ్యక్తులు, వస్తువులు అశుభ సూచకాలుగా స్థిరపడ్డాయి.

ఇందిరాబాయి నవలలో భీమారావు త్రయంబకరావు, ఇందిరాబాయి మొదలైన వారు బండిఎక్కి అనారోగ్యంతో బాధపడుతున్న విఠలరావుని చూద్దామని బయలుదేరుతారు. అదే సమయంలో వారికి ఒక విధవస్త్రీ ఎదురుగా రావడంతో కొద్దిసేపు ఆగి మళ్ళీ తమ ప్రయాణాన్ని ప్రారంభిస్తారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 129). అంబాబాయి గర్భం ధరించిన సందర్భంలో భీమారావు మంచి శకునాన్ని చూసి ఆమెకు శ్రీమంతం చేయిస్తాడు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 67).

శ్రీరంగరాజుచరిత్రలో శ్రీరంగరాజు ఇంటినుండి వెళ్లిపోయిన సందర్భంలో శ్రీరంగరాజు తల్లి శకునశాస్త్ర గ్రంథాలు తెప్పించి ప్రస్తుత కాలం శ్రీరంగరాజుకు ఎలా ఉందో చూస్తుంది. "అమ్మగారు పురోహితులు మొదలైన పెద్దలను బిలిపించి శ్రీరామ చింతామణి, సీతా చింతామణి, నవగ్రహ చింతామణి మొదలగు శకున గ్రంథాలు దెప్పించి యధాక్రమంబున మడిగుడ్డ కట్టుకొని ధూప దీపారాధన లొనర్చి ప్రశ్నలు చూచుచుండె. అందు నొకప్పుడు మేలుగా నొకప్పుడు కీడుగా వాక్యంబులు వచ్చుచుండె. అంత రాణి మూడు చింతా మణులు మూడు దోవలయ్యే, నిజంబు నిశ్చయింప నశక్యమయ్యెనని యధా పూర్వకముగా ఖేద హృదయమై యుండె" (ఇనాక్, కొలకలూరి (సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 79, 80). ఈ రెండు సంఘటనల లోను భీమారావుకుగాని, శ్రీరంగరాజుతల్లికి కాని ఆశించిన శుభం జరగదు. దీని వల్ల శకునాలు భూటక మనే సందేశం పాఠకులకు ఇవ్వబడింది.

'ఇందులేఖ' నవలలో నంబూద్రిపాదు ఇంటి వ్యవహారాలను చూసే 'దాసన్‌మీనన్' ఒక రోజు నంబూద్రిపాదు వద్దకు వచ్చి ఒక కోర్టు వ్యాజ్యంపై సంతకం పెట్టవలసిందిగా కోరుతాడు. "ఈరోజు శనివారం. నేను ఏ వ్యాజ్యంలోనూ సంతకం పెట్టను. పూర్వం ఒక ఫిర్యాదులో శనివారం సంతకం చేస్తే అది ఓడిపోయింది. నీకు జ్ఞాపకం లేదా!" (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 94). అంటూ నంబూద్రిపాదు సంతకం చేయడానికి నిరాకరిస్తాడు. చివరికి నారాయణ నంబూద్రిపాదు నచ్చజెప్పడంతో సంతకం పెడతాడు. ఈ సంఘటన నంబూద్రిపాదులోని మూఢనమ్మకానికి నిదర్శనం.

### 5.8.2. దయ్యాలు - భూతాలు

"నా చిన్నతనమునందు దయ్యములందలి విశ్వాస మెల్లవారికి నత్యధికంగా ఉండెను. అప్పుడు దయ్యములేని ఇల్లు లేనేలేదని చెప్పవచ్చు. ఎవ్వరు కొత్తగా చచ్చినను వారుదయ్యములై తిరుగుచుండిరని యెల్లవారలుఁ జెప్పుకొనుచుండిరి. దయ్యములను పాఱద్రోలు మంత్రగాంద్ర సంఖ్యయు నిప్పటికంటె నప్పుడు శతగుణాత్మకముగా నుండెను." (వీరేశలింగం పంతులు, కందుకూరి. 2013: 21) పంతొమ్మిదవ శతాబ్దంనాటి ప్రజలలో దయ్యాలు ఉన్నాయనే నమ్మకం అధికంగా ఉందని చెప్పటానికి కందుకూరి వీరేశలింగం పంతులుగారు తన స్వీయ చరిత్రలో రాసుకున్న ఈ వాక్యాలు నిదర్శం. దయ్యాలు లేవని నిరూపించే ప్రయత్నంలో భాగంగా కందుకూరి వీరేశలింగంపంతులుగారు స్మశానానికి వెళ్లి నిద్రపోయినట్లుగా, భూత వైద్యునితో దయ్యం చూపించమని వాగ్వివాదం పెట్టుకున్నట్లుగా తన స్వీయ చరిత్రలో వివరించారు. దయ్యాలకి సంబంధించిన ప్రస్తావన దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో ఇంటిని వీడిన శ్రీరంగరాజు విహారయాత్ర చేస్తూ శ్రీశైలం దగ్గర ఉన్న చంద్రగుప్తి నగరానికి చేరుకుంటాడు. చంద్రగుప్తి నగరాన్ని చూడటానికి ఆ ఊరిలోకి ప్రవేశిస్తాడు. రామయ్య శ్రీరంగరాజును అడ్డుకుంటాడు. 'శ్రీశైలయాత్రకు వచ్చిన వాళ్లందరూ ఈ చంద్రగుప్తి గురించి చెబుతూనే ఉంటారు. ఇక్కడ దయ్యాలు–భూతాలు తిరుగుతూ ఉంటాయి. తొందరగా ఈ ఊరిని వదిలి శ్రీశైలానికి వెళ్దాం!' అంటూ రామయ్య శ్రీరంగరాజుకి చెప్తాడు. (ఇనాక్, కొలకలూరి(అ). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 83). శ్రీరంగరాజు రామయ్య మాట వినకుండా చద్రగుప్తి గ్రామంలోకి ప్రవేశించి ఆ గ్రామాన్ని వీక్షిస్తాడు.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో తమ పొలాలకి వెనక ఉన్న అడవిలోని మంటపంలో దయ్యాలు ఉన్నాయని ప్రతాపముదలియార్ తన గురువుకి చెప్పగా అతను మండపంలో దయ్యాలు లేవని నిరూపిస్తాడు.

"ఈ అడవిని చూసినట్లైతే ప్రపంచ సృష్టి జరిగినప్పటి నుండి మనుష్య సంచారం లేనట్లుగా తెలుస్తున్నది. ఎవరో ఒకరు దుర్మరణం చెందారు అనే భ్రాంతిచే చాలా కాలంగా ఎవరూ ఈ ప్రాంతంలో సంచరించనందువల్ల పక్షులకు ఈ మండపం ఆవాసంగా

మారిపోయింది. ఆ పక్షులు చేసే శబ్దాలను పిశాచుల శబ్దాలుగా ప్రజలు భావించారు. ఈ అడవిలోకి ప్రవేశించే పశువులు, గొర్రెలు మొదలైన వాటిని మృగాలు తినేయడం తెలుసుకోక పిశాచులు తిని వేస్తున్నాయని భావిస్తున్నారు. ఈ ప్రదేశంలో అనేక రకాల వృక్షాల ఆకులు ఎండిపోయి గాలికి ఎగిరి గలగలమని చేసే శబ్దాలు పిశాచాలవని భావించారు. తెలివి తేటలులేని మృగాలు, పక్షులు నిర్భయంగా నివాసముంటున్న ఈ స్థలంలో తెలివి తేటలున్న మనుషులు సంచరించడానికి భయపడడం ఎంత మూర్ఖత్వం." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 32, 33) ప్రతాపముదలియార్‌కి అతని గురువు చెప్పిన ఈ మాటలు దయ్యాలు లేవనే సందేశాన్ని పాఠకులకు ఇస్తున్నాయి.

ఇందిరాబాయి నవలలో విఠలరావు ఆరోగ్యం బాగాలేని సందర్భంలో అతనికి వైద్యం చేయించడానికి తక్కడి వెంకటరావుని పిలిపిస్తారు. "భీమారావు అతన్ని చూసి 'రండి రావుగారు వైద్యానికి అన్ని ఔషధాలను తెచ్చారుకదా!' అని అడగగా అతను అంజనం, చూర్ణం, భస్మ మాత్ర, రసాయనం, నెయ్యి, కర్తగుళిక, మర్మగుళిక, పాషాణద్రావకం, జ్వరాంతక తైలం మొదలైన అష్టాంగ హృదయంలో చెప్పిన ఔషధాలను తెచ్చాను." (వెంకటరావు, గుల్వాడి. 1962: 129) అంటాడు. ఈ ఔషధాలలో అంజనం, చూర్ణం, భస్మం మొదలైనవి భూతవైద్యానికి ప్రతీకలు.

### 5.8.3. జ్యోతిష్యం

"నేనారంభంలో జ్యోతిశాస్త్రమునం దత్యంత విశ్వాసము కలవాడనే యైనను జన్మ పత్రికలలో దీర్ఘాయుష్మంతులగుదురని చెప్పబడిన వారనేకులు అల్పాయుష్కులగు చుండుటయు, మహా ధనాఢ్యులగుదురని చెప్పబడిన వారనేకులు దరిద్రులగుచుండుటయు, చిరకాల సువాసినులగుదురన్న కాంతలు పలువురు బాల వితంతువులగుచుండుటయు, సుమూహూర్తములు పెట్టి చేసిన కార్యములు పెక్కులు భగ్నములగుచుడుటయు చూచుచు వచ్చిన కొలదిని నాకీ జ్యోతిష్య విషయమున యంతకంతకు నమ్మకము తగ్గి లోకానుభవము అధికమైన తరువాత పూర్ణముగా నశించెను." (వీరేశలింగం, కందుకూరి. 2013: 12). కందుకూరి వీరేశలింగం పంతులుగారు తన స్వీయ అనుభవాన్ని గురించి వివరిస్తూ తన స్వీయ చరిత్రలో రాసుకున్న ఈ వాక్యాలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి ప్రజలలో జ్యోతిష్యంపై ఉన్న నమ్మకానికి ఉదాహరణలు. కందుకూరి వీరేశలింగం పంతులుగారి మాదిరిగానే నరహరి

గోపాలకృష్ణమసెట్టిగారు, వేదనాయగంపిళ్ళైగారు, గుల్వాడి వెంకటరావుగారు జ్యోతిష్యాన్ని నమ్మరాదన్న సందేశాన్ని తమ నవలల ద్వారా నాటి సమాజానికి అందించారు.

శ్రీరంగరాజు ఇంటినుండి వెళ్లిపోయిన సందర్భంలో మూరురాయగండర్ జ్యోతిష్యుడు రామాచార్యులను పిలిపించి శ్రీరంగరాజు ప్రస్తుత జాతకం ఎలా ఉందో చూడమంటాడు. “రామాచార్యులు జాతకము దెప్పించి లగ్నకుండలినిఁ జూచి యిపుడు వాడికి శనైశ్వరుడు చాలడు–సూర్యుడు పండ్రెండవ యింటనున్నవాడు. శని యెనిమిదవయింటనున్నవాడని చెప్పి– స్థానభ్రంశం పొంద వలసి యున్నది గాని వీనికి మరేమీ ప్రాణభయం లేదు. గ్రహంబులకు శాంతంబుగా జపహోమతర్పణ బ్రాహ్మణార్చనలు చేయించుట యావశ్యకంబు దానిచేత గ్రహములు బాధకొంత శమించు. బాలుండును త్వరితంబుగా మరలివచ్చుగండముల యపాయంబును దొలంగునని జ్యోతిష్యుడు పలికె.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 77). జ్యోతిష్యుడు చెప్పిన విధంగా మూరురాయగండర్ జపహోమ తర్పణ, బ్రాహ్మణార్చన అన్నింటిని జరిపిస్తాడు. కాని శ్రీరంగరాజు ఇంటికితిరిగి రాడు. తన 18వ ఏట శ్రీరంగరాజు పులి బారిన పడిన సందర్భంలో జ్యోతిష్యుడు తన చిన్నతనంలో చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకుంటాడు. తన జాతకంలో ఎలాగూ మృగ గండం ఉంది కదా అని పులిని చూస్తూ కూర్చోడు. ధైర్యంతో “నన్ను నా తండ్రి సరిగ్గా చుసుకోకపోవడం వల్లే ఇంటిని వదిలి వచ్చాను. కాబట్టి చావు ఎదురైనా భయపడకూదదు.” అంటూ పులిపైకి బాణం విసిరి తన్ను తాను కాపాడుకుంటాడు. ఈ సన్నివేశం మనోధైర్యం ఉంటే జాతక చర్యలను కూడా జయించవచ్చుఅనే సందేశాన్నిస్తుంది.

ఇందిరాబాయి నవలలో భీమారావు, అంబాబాయి జాతకంలో ‘గజకేసరియోగం’ ఉండటం వల్లే తాను ధనవంతుడనయ్యానని నమ్ముతాడు. తన అల్లుడు విఠలరావు ఆరోగ్యం బాగాలేని సందర్భంలో దీనికంతటికి గ్రహాల చెడు గమనమే కారణం అని నమ్ముతాడు. విఠలరావు ఆరోగ్యం విషమిస్తున్నా పట్టించుకోకుండా అతని జాతకం ప్రస్తుతం ఎలా ఉందో చూడడానికి సీతారామ జ్యోతిష్యున్ని తన ఇంటికి పిలిపిస్తాడు. సీతారామ జ్యోతిష్యునికి, భీమారావుకు మధ్య నడిచిన సంభాషణ జ్యోతిష్యంలోని డొల్లతనాన్ని బాయటపెడుతుంది. “భీమారావు ‘జ్యోతిష్యులగారు కూర్చోండి’ అనగానే తివాచిమీద కూర్చుండి ‘రావుగారు ఇప్పుడు

మీరు పలికిన పలుకులలోని మొదటిశబ్దం 'జ' అనే వ్యంజనం. దానికి వ్యంజన మాలలో అష్టమస్థానం ఉంది. అష్టమస్థానం కష్టాలను కలిగిస్తుంది. మీ ఇంట్లో ఏదో కష్టం ప్రాప్తించినట్లుగా అనిపిస్తుంది. అవునో కాదో చెప్పండి. అని అడగగానే భీమారావు జ్యోతిష్యుని జ్ఞానానికి మెచ్చి 'శభాస్', 'శభాస్' అంటూ విఠలరావు, ఇందిరాబాయి జాతకాలను త్రయంబకరావు ఇంటినుండి తెప్పించి వాటిని జ్యోతిష్యుని చేతిలో పెట్టి ఈ రెండు జాతకాలను చూసి ప్రస్తుతం వాటి గ్రహబలాలు ఎలా ఉన్నాయో చెప్పమన్నాడు. అతను ఒక చెక్క పీటపై ఒక నవ గ్రహకుండలాన్ని రాసి పాచికల సంచి నుండి కొన్ని పాచికలను తీసి ఆ కుండలంలో అక్కడక్కడ ఉంచి గణించి, క్షణక్షణం జాతకాలను చూస్తూ ఎనిమిది పది శ్లోకాలను చెప్పి ఒక నిమిషం కళ్లను మూసి ఒక సుధీర్ఘ శ్వాసను వదిలాడు. అప్పుడు భీమారావు ఏమైంది గ్రహబలం ఎలా ఉంది అని అడగగా రావుగారు నేను ఆ రోజే చెప్పాను కదా. అబ్బాయికి కుజ, రాహుదోషం ఉంది. అయితే మీరు కంగారు పడవలసిన అవసరం లేదు. దానికి తగిన పరిహారం నేను మొదటనే మీకు చెప్పు యున్నాను. పురోహితునికి ఒక బంగారు గోమూర్తిని దానంగా ఇస్తే సరిపోతుంది."(వెంకటరావు, గుల్వాడి. 1962: 124). అంటూ గ్రహశాంతి జరిపిస్తాడు. భీమారావు ఇచ్చిన దానాన్ని బ్రాహ్మణుడు కాశీనాథభట్టు, జ్యోతిష్యుడు సీతారామారావు ఇద్దరు కలిసి పంచుకుంటారు. ఈ గ్రహశాంతి వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరక పోగా విఠలరావు మరణిస్తాడు. ఈ సంఘటన జ్యోతిష్యాన్ని నమ్మరాదన్న సందేశాన్ని ఇస్తుంది.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ఒక జ్యోతిష్యుడు తాను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాను. తనకు ధన సహాయం చేయవల్సిందిగా ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌ల గురువుని అడుగుతాడు. అప్పుడు ఉపాధ్యాయునికి, జ్యోతిష్యునికి మధ్య నడిచిన సంభాషణ జ్యోతిష్యం నమ్మరాదని సందేశం ఇచ్చే విధంగా కొనసాగుతుంది.

"శాస్త్రిగారు ఆనందంతో ఇలా చెప్పడం ప్రారంభించారు. మా విద్యలన్ని శుద్ధ అబద్ధం. ఏ మాత్రం నిజంకాదు. ప్రపంచంలో ఉదర పోషణార్థం జనులు ఎన్నెన్నో వేషాలు వేస్తూ జీవిస్తుంటారు. ఆ విధంగా నేను కూడా ఈ వేశాన్ని ధరించి తిరుగుతున్నాను. నా విషయంలోనే ఈ శాస్త్రం ఫలించలేదంటే ఇక అన్యుల విషయంలో అడగవలసిందేముంది. నాకు నలుగురు కుమార్తెలు అందరికీ జాతకాలు చూసి పెళ్లిళ్లు చేసాను. కానీ వాళ్లు నలుగు భర్తలను

కోల్పోయారు. మంత్ర తంత్రాలకన్నా తెలివి తేటలు మిన్న అనే సామెత ప్రకారం నా తెలివితేటలతో జీవనాన్ని గడుపుతునా   కాని శాస్త్రంతో కాదు. అందరికీ సుఖదుఃఖాలు కలిసే వస్తుంటాయి. నేను కూడా సుఖాన్ని దుఃఖాన్ని కలిపి శాస్త్రాన్ని చెబుతూ వస్తుంటాను. సుఖాన్ని అందరూ ఇష్టపడుతుండటంవల్ల సుఖాన్ని అధికంగా చెప్పి అందరిని సంతోషపెట్టడం నా అలవాటు. ఇప్పుడు కాలం విపరీత మైపోయింది. నేను ఒకరికి మంచి యోగం వస్తుందని చెబితే అతనికి కష్టకాలం వస్తుంది. సుభీక్ష కాలం అని చెబితే దుర్భిక్ష కాలంగా పరిణమిస్తుంది. శాస్త్ర విషయాలపై ఉన్న విశ్వాసం అందరికి రోజురోజుకి తగ్గిపోతుంది. ఇక మీదట ఈ వృత్తిని వదిలి వేయాలని భావిస్తున్నాను అన్నారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 30, 31) జ్యోతిష్యుని ఈ మాటలు జ్యోతిష్యశాస్త్రంలోని ఢొల్లతనానికి నిదర్శనం. దక్షిణ భారత తొలి సంఘిక నవలల్లో జ్యోతిష్యం భూటకమనే సందేశాన్ని ఇచ్చే పై సంఘటనలు చిత్రితమయ్యాయి.

### 5.8.4. కలలు

తెల్లవారు ఝామున వచ్చిన కలలు నిజమవుతాయన్నది ఒక నమ్మకం. కానీ కలలో జరిగే విషయాలు నిజం కావు. ప్రజలలో కలలో వచ్చే విషయాలు నిజమవుతాయనే నమ్మకం నేటికీ ఉంది. మనం ప్రతిరోజూ కలలు కంటాం. ఈ కలలలో మన జీవితానికి దగ్గరగా ఉన్న అనేక అంశాలు జరుగుతూ ఉంటాయి. ఈ విషయాలు మంచివి కావచ్చు. చెడ్డవి కావచ్చు. చెడును సూచించే అంశాలు కలలో వచ్చినప్పుడు ఈ కల నిజం కాకపోతే బాగుండు అనుకుంటాం. కళ్లు తెరిచి చూసి ఇదంతా కలలో జరిగిందా అని సంతోషిస్తాం. కలలపై ఉన్న నమ్మకాన్ని సూచించే సంఘటనలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి.

ఒ. చందుమీనన్‌గారు కలలో జరిగిన విషయాలు నిజమవుతాయా? కాదా? అన్న అంశాన్ని గురించి ఇందులేఖ నవలలో సుధీర్ఘంగా వివరించారు. మాధవుడు దక్షిణ భారతదేశయాత్రలో ఉన్నప్పుడు ఇందులేఖ మాధవుడిని ముస్లీంలు పొడిచి చంపినట్లుగా కల కంటుంది. (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 341). కాకతాళీయంగా సరిగ్గా అదే సమయంలో మాధవుని వస్తువులను అలహాబాద్ సబ్‌జడ్జిగా పరిచయం అయిన షియా అలిఖాన్ దొంగలిస్తాడు. ఈ విషయం గురించి ఇందులేఖ, మాధవుడు చర్చించుకుంటారు. ఈ సందర్భంలో ఒ. చందుమీనన్‌గారు కలలో జరిగే విషయాల గురించి పాఠకులకు ప్రత్యక్షంగా తన మాటలద్వారా వివరించారు.

"స్వప్నం అనేది మనసులో ఏర్పడే ఒక భ్రాంతి మాత్రమే. సింబాలిసమ్, మెస్మరిసమ్ అని విదేశీయులు పేర్కొనే వివరాలవలె సాధారణ సృష్టిలో మానవుని మనసులో నిద్ర పోతున్నప్పుడు కొన్ని సమయాలలో ఏర్పడే ఒక చేష్టయే అని స్వప్నాన్ని గురించి చెప్పవలసి ఉంటుంది.

ఆ స్వప్నం కొన్ని సమయాలల్లో మన వలన తెలుసుకోగలుగుతున్నట్లుగా ఉండవచ్చు. కొన్ని సమయాలలో మనకు అర్థంకాని ఏ కారణం లేకపోయినా ఆ స్థితి ఏర్పడవచ్చు. కొన్ని సమయాలలో జరగడానికి వీలు కాని సంఘటనలని కూడా కలలో చూడవచ్చు. ఒక పాము పక్కకు వచ్చి కుట్టడానికి పడగవిప్పి నిటారుగా నిలబది ఉంది, కరచివేసింది. అన్నట్లుగా వేట ముగించుకొని వచ్చి అలసటగా గూడారంలో నిద్రపోతున్న ఒక దొరగారికి కల రాగా బెదిరిపోయి కళ్లు విప్పి చూశారు. నిజంగానే ఒక పాము తన గూడారంలో తన ఇనుప మంచానికి నాలుగు మూరల దూరంలో కదులుతూ రావడాన్ని వారు చూశారు. మరొక దొర చాలా కాలంగా తనకు కనిపించకుండా పోయిన ఒక ఆత్మీయ స్నేహితుడు తన ఇంటికి వచినట్లు రాత్రి కలగన్నాడు. మరురోజు తెల్లవారు ఝామున నిజంగానే ఆ మిత్రుడు తాను కలలో చూసినట్లుగానే ఇంటికి వచ్చాడు. ఈ విధంగా మరెన్నో కలలను గురించి నేను చదివి ఉన్నాను. అందువలన ఇందులేఖకి వచ్చిన కలను గురించి నేను ఆశ్చర్యపడలేదు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016:345). తాను విన్న చదివిన అంశాలను ఆధారంగా చేసుకొని ఇందులేఖ కలగన్నట్లు నవలలో ఒ. చందుమీనన్‌గారు చిత్రించారనడానికి ఈ మాటలు నిదర్శనం.

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు ఇంటిని వదిలివెళ్లిన సందర్భంలో మురురాయ గండర్ శ్రీరంగరాజుని గురించి కలగంటాడు."ఒకరోజు రాత్రి కొడుకు పల్లకి ఎక్కి ఇంటికి వచ్చినట్లు చాలా రోజులుగా తలంటు పోసుకోలేదు కాబట్టివాళ్ల అమ్మ చెప్పిన మాట ప్రకారం తలంటు పోసుకొని సుఖంగా మాట్లాడుతున్నట్లు కలగన్నాడు. వెంటనే మెలకువ వచ్చింది. జపాలు, హోమాలు చేయడం వల్ల వచ్చిన ఫలితం ఇది అని తెల్లవారు ఝామున లేచి, జ్యోతిష్యుని పిలిపించి, తనకు వచ్చిన కలను చెప్పాడు. ఆ కలకు అర్థం చెప్పడానికి నోరు రాక జ్యోతిష్యుడు ముందు వెనకాల ఆలోచిస్తున్నాడు. వయసులో బాగా ముసలివాడైన రామాచార్యులనే బ్రాహ్మణుడు సాధారణంగా కలల ఫలితాలు వ్యతిరేకంగా ఉంటాయి. ఒక్కొకసారి మంచి కలలకు మంచి ఫలితాలు కూడా ఉంటాయి. కాబట్టి ఇది పిల్లవాడికి చేటు

అని నిర్ణయించకూడదు. ఒకవేళ అలా నిర్ణయించామే అనుకో శని వదిలి వెళ్లేటప్పుడు చాలా బాధిస్తాడు. కాబట్టి వాడిని ఇప్పుడు శని వదిలిపెట్టి వెళ్లిపోతున్నాడేమో కాబట్టి బాధపడాల్సిన అవసరం లేదు. ఇది మేలే కాని కీడు కాదు అన్నాడు. మరొక జ్యోతిష్యుడు ఇప్పుడు రాజుగారికి ఆహారం సరిగ్గా లేదు కాబట్టి శరీరంలో పిత్తం ఎక్కువైంది. పైగా రాత్రింబవళ్లు కొడుకు స్మరణతప్ప వేరే లేదు అన్నాడు. మరొకరోజు రాకుమారున్ని ఎవరో దొంగలు చంపి శవాన్ని తీసుకుపోతున్నట్లుగా కలగన్నాడు రాజు. శాస్త్రులందరూ దీనికి సంతోషపడ్డారు. పిల్లవాడికి భయంలేదు అన్నారు. ఇలా ఒకదానికొకటి సంబంధంలేని కలలకు అర్థం తెలియక దిగులుపడుతున్నారు రాజుగారు." (నరేశ్‌బాబు, దోనెపూడి. 2017: 29).

ఇందిరాబాయి నవలలో భీమారావు సుందరరావుని హత్య చేసిన సందర్భంలో రాత్రిపగలు అతని గురించి ఆలోచిస్తాడు. చనిపోయినవ్యక్తి తన ఇంటికి వచ్చినట్లుగా కలగంటాడు. "ఆ రోజు రాత్రి భీమారావు ఇంట్లో భోజనం ముగిసిన తర్వాత అందరూ ఇంటి బయట అరుగు మీద మాట్లాడుతూ కూర్చున్నారు. అప్పుడు భీమారావు తన ఎదురుగా చూసి రా.. సుందరరావు ఎందుకు నిల్చున్నావు కూర్చో అన్నాడు. అక్కడ కూర్చున్న వారందరూ ఆశ్చర్యంతో చూసారు. వారికెవరికి సుందరరావు కనిపించలేదు. అందులో ఒకరు లేచి ఏమి రావుగారు ఏమి మాట్లాడుతున్నారు అనగానే అగో సుందరరావు నిల్చొని ఉన్నాడు. రమ్మని పిలుస్తున్నాడు. సుందరరావు రా వచ్చి కూర్చో "నీ సంగతి.... ఆరోజు...నరసింహశాస్త్రి...దేవకి ఒక మణుగు బియ్యం" అంటూ స్పష్టా స్పష్టంగా ఏమేమో మాట్లాడసాగాడు. దీనిని చూసి అంబాబాయి భీమారావుని లోనికి తీసుకువెళ్తుంది." (వెంకటరావు, గుల్వాడి. 1962: 37) అనునిత్యం సుందరరావుని గురించి ఆలోచిస్తూ ఉండడంవల్ల భీమారావు సుందరరావుని గురించి పగటి కల కన్నట్లుగా ఈ సన్నివేశం తెలుస్తుంది.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ప్రతాపముదలియార్ తన బాల్యంలో కన్న కలల గురించి నవల రెండవ అధ్యాయంలో వేదనాయగం పిళ్ళైగారు వివరించారు. "ఒక రోజు ఒక పిల్లవాడి దగ్గర నేను రెండు వరహాలు తీసుకున్నట్లు వాడు నన్ను కొట్టినట్లు కలగని ఉలికిపడి లేచాను. ఆ పిలవాడిని మరురోజు చూసినప్పుడు స్వప్న వృత్తాంతాన్ని వాడికి చెప్పాను. వెంటనే వాడు నా అప్పు తీర్చమంటు నా పంచను పట్టుకున్నాడు. నేను వాడి చెంప మీద ఛెళ్‌ఛెళ్ మంటూ

రెండు దెబ్బలు వేసాను. వాడు ఎందుకు కొడుతున్నావు అని అడిగాడు. రాత్రి నీవు నన్ను కలలో కొట్టావు కాబట్టి నేను నిన్ను ఇప్పుడు కొట్టాను. వాడు అప్పుడు దెబ్బకి దెబ్బ సరిపోయింది అని చెబుతూ వెళ్లిపోయాడు.” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 8). ఈ విధంగా దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కలల గురించి ప్రస్తావన చేయబడింది.

### 5.8.5. దేవతలకు - ముడుపులు కట్టడం

‘ముడుపు’ అన్న పదానికి ‘ధనము ముడిచిన మూట’ (సీతారామాచార్యులు, బహుజనపల్లి 2010: 741) ధనము, మొక్కుబడి అనే అర్థాలు ఉన్నాయి. తాము అనుకున్న కార్యం నెరవేరాలని లేదా ఏదైనా అవాంతరం ఏర్పడిన సందర్భంలో ఆ అవాంతరం నుండి గట్టెక్కడం కష్టమని తెలిసినప్పుడు నిస్సహాయ స్థితిలో తమని ఈ గండం నుండి గట్టెక్కిసస్తే దేవుడికి ప్రతిఫలంగా ఎంతో కొంత ధనాన్ని లేదా దానాన్ని చేస్తానని మొక్కి, ఆ మొక్కుకు ప్రతీకగా ఒక బట్టలో డాబ్బును మూటగా కడతారు. దానిని ముడుపు అంటారు. అనుకున్న కార్యం జరిగిన తరువాత తాము మొక్కిన దేవుడికి, దేవుడి వద్దకి వెళ్లి మొక్కుబడిని తీర్చుకుంటారు. ఇలాంటి మొక్కుబడులు నేటి కాలంలో కూడా కన్పిస్తుంటాయి. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ముడుపుల ప్రస్తావన కనిపిస్తుంది.

ఇందిరాబాయి నవలలో విఠలరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సందర్భంలో విఠలరావు త్రయంబకరావు, భీమారావు, విఠలరావుకి ఆరోగ్యం తొందరగా కుదుటపడాలని ముడుపులు కడతారు.

“**త్రయంబకరావు**: నాకిదంతా ఏమీ అర్థం కావడంలేదు రేపు శుక్రవారం నాడు మారెమ్మ గుడిలో పది దున్నపోతులను బలి ఇస్తానని ఇప్పుడే ముడుపు కడుతున్నాను. ఖచ్చింతంగా ఇస్తానని మాటిస్తున్నాను. అబ్బాయికి ఈ విధమైన దుర్బుద్ధి రావడం ఇప్పుడు సంభవించిన ఈ కష్టం అన్ని చూస్తుంటే నా శత్రువులు ఎవరో ఇలా చేస్తున్నారని అనిపిస్తుంది. రేపు బలి అర్పించిన తరువాత ఆ మహాదేవి దర్శనం చేసుకుంటాను.

**భీమారావు**: రావుగారు నేను కూడా ఒక ముడుపు కడుతున్నాను. ఏంటంటే మన విఠలరావు ఈ గండం నుండి గట్టెక్కి కోలుకున్న రోజు శ్రీమహాలింగేశ్వరునికి ఒక రుద్రాభిషేకం సహస్ర బ్రాహ్మణులకు సంతర్పణం ఇవ్వడమే కాక దేవస్థాన పశ్చిమద్వారం వద్ద సాయంకాలం

సమయంలో వాయించడానికి ఉపయోగపడే ఒక తామ్ర నగారా చేయించి దానికి దేవధుందుభి అనే పేరు పెట్టి దానికి అవసరమైన బండితో సహ శ్రీమహాలింగేశ్వరుని పాదాలకు అర్పిస్తాను.” (వెంకటరావు, గుల్వాడి. 1962: 132, 136).

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు చంద్రగుప్తి వనంలో వేటాడుతూ దారితప్పి శ్రీశైలం దిశగా వెళ్తాడు. అక్కడ ఒక వృక్షంపైకి ఎక్కి నలుదిక్కులు చూడగా తూర్పున స్వర్ణమయమైన ఒక దేవాలయం కనిపిస్తుంది. అది శ్రీశైలం అని నిర్ణయించుకుంటాడు. దానికి సమీపంలో ఒక పాడుబడ్డ గ్రామం కనిపిస్తుంది. చంద్రగుప్తి అని పిలువబడే గ్రామం ఇదే కాబోలు అని అనుకుంటాడు. శ్రీశైలానికి దండాలు సమర్పించి ఎంత దూరం దారి తప్పి వచ్చానని మల్లికార్జునునికి ముడుపు కడతాడు.” (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 83). ఈ విధంగా కష్టాలలో ఉన్న శ్రీరంగరాజు శ్రీశైల మల్లికార్జునుడికి ముడుపు కట్టిన సన్నివేశం శ్రీరంగరాజుచరిత్ర నవలలో ప్రస్తావించబడింది.

### 5.9. ఆటలు

మనసుకి ఉల్లాసాన్ని కలిగించేవి ఆటలు. ఆటలు ఆడనివారు ఉండరు. ఈ ఆటలలో రకాలు ఉంటాయి. వయసుబట్టి, లింగాన్ని బట్టి ఆటలలో భేదాలుంటాయి. ప్రాంతాలనుబట్టి, దేశాలనుబట్టి కూడ ఆటలలో మార్పు ఉంటుంది. నేడు ప్రపంచీకరణ ఫలితంగా విదేశాలలో ఉన్న క్రికెట్, టెన్నిస్ వంటి ఆటలు మన దేశంలోకి దిగుమతి అయ్యాయి. ఫలితంగా ఎన్నో దేశీయమైన ఆటలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రాచీన కాలంలో తెలుగు ప్రాంతంలో పాచుర్యంలో ఉన్న ఆటల ప్రస్తావన శ్రీరంగరాజుచరిత్రలో కనిపిస్తుంది. భారతీయ ప్రాచీన ఆటలతోపాటు కాలానుగుణంగా వచ్చిన మార్పువల్ల భారతదేశంలోకి వచ్చిన క్రికెట్, టెన్నిస్ వంటి ఆటల ప్రస్తావన మలయాళ ఇందులేఖ నవలలో కనిపిస్తుంది.

“మాధవుడు ఆంగ్లంలో అత్యంత నిపుణుడనే విషయాన్ని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు కదా! లాన్ టెన్నిస్, క్రికెట్ మొదలైన ఆటల్లో కూడా మాధవుడు ఎంతో ప్రవీణుడుగా ఉండేవాడు. చిన్నప్పటి నుండి వేటాడటం అలవాటు. అతని తండ్రిగారైన

గోవిందపణక్కర్ నుండి సంక్రమించిన అలవాటుగా ఉన్నప్పటికీ మాధవుడు వేటలో మిక్కిలి ప్రావిణ్యం కలవాడుగా పేరు తెచ్చుకున్నాడు.” (జయప్రకాశ్, ఎస్(అ), 2016: 3).

ఇందులేఖ నవలలో చదరంగం ఆట ప్రస్తావన ఉంది. ఇందులేఖ నవల రెండవ అధ్యాయంలో మాధవుడు, ఇందులేఖ చదరంగం ఆడతారు. (జయప్రకాశ్, ఎస్(అ), 2016: 15-17) ఈ ఆటల్లో ఇందులేఖ మాధవుడిని ఆటపట్టిస్తుంది. “అరేయ్! మీ గుర్రాన్ని నేను చంపబోతున్నాను. ఒక చేతిలో పావును పట్టుకొని చెక్ అని చెప్పి పైకి చూసింది. చాలు ఆడండి గుర్రాన్ని కాపాడడానికి వీలవుతుందా? మీ సామర్థ్యాన్ని చూద్దాం.” అంటూ మాధవుడిని ఆటలోకి ఆహ్వానిస్తుంది. అప్పటికి ఇందులేఖ మీద ఇష్టం ఉన్న మాధవుడు ఆమె చలోక్తులకు మనసులో బాధ కలిగి మనఃస్థితి బాగాలేదని అక్కడినుండి వెళ్లిపోతాడు. ఈ సంఘటనలు పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఉన్న ఆటలకు నిదర్శనం.

## 5.10. నూతన వస్తూ సంస్కృతి

పంతొమ్మిదవ శతాబ్దంలో ఆంగ్లేయ సంపర్కంవల్ల నూతన వస్తువులు భారతదేశంలోకి ప్రవేశించాయి. ఈ వస్తువులు భారతీయ జీవన విధానాన్ని ప్రభావితం చేసాయి. దక్షిణ భారతదేశంలో ఆంగ్లేయుల పాలన వల్ల ప్రవేశపెట్టబడ్డా నూతన వస్తువులపై ప్రజలలో నెలకొన్న అపోహలు, ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో ప్రస్తావిత మయ్యాయి. ఇందిరాబాయి నవలలో భీమారావు ఆరోగ్యం బాగాలేని సందర్భంలో అంబాయి అలారం గడియారం, వాటర్ ఫిల్టర్ మొదలైన వస్తువుల గురించి శంకరరావు, అతని భార్య దుర్గాబాయికి వివరిస్తుంది. “ఇవన్నీ ఉమాపతి ఔషధాలు, అనారోగ్యం తొందరగా తగ్గాలంటే వీటిని ఉపయోగించండని పండిత ఘనశ్యామ తెలిపారు. ఈ ఔషధాలను సరైన సమయంలో వేయడానికి ఈ ‘అలారం’ గడియారం పనిచేస్తుంది. మనం ఎంత వ్యవధిలో మందులు వేయాలో అంత వ్యవధికి సరిపడ ఈ గడియారంలో ముల్లును ముందే తిప్పిపెడితే ఆ సమయం కాగానే ఈ గడియారం పెద్ద శబ్దం చేస్తుంది. మనం నిద్రపోతున్న మనల్ని నిద్రలేపుతుంది.” (వెంకటరావు, గుల్వాడి. 1962: 21) ఈ పక్కన గ్లాసులో ఉన్నవి ఫిల్టర్ నీళ్లు అంటే శుద్ధిచేయడిన నీళ్లు. ఈ ఉమాపతి ఔషధాలు ఈ నీళ్లు తాగక పోతే పనిచేయవట. అందుకే వీటిని ఉంచాను అని అంబాబాయి చెప్పగానే దుర్గాబాయి ఆశ్చర్యపోతుంది. ఆహా! ఆంగ్లేయుల ఆవిష్కరణలకి అంతే లేదు కదా అంటుంది.

వెంటనే శంకరరావు కల్పించుకొని "ఇదంతా ఆంగ్లేయులు మన జాతిని అంతమొందించడానికి చేస్తున్న కుట్ర. ఈ ఆంగ్లేయ మందులను వాడకండి. అవసరసమైతే కొచ్చిపండితున్ని లేదా తక్కడివెంకటరాయన్ని పిలిపించండి. జాతి భ్రష్టమయ్యాక బ్రతికుండేం లాభం? ఈ ఆంగ్లేయులు చేసిన ఇంకో కుయుక్తి తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. వీరు మన ప్రజలకి వారి నూనెను సీమెణ్ణి (గ్యాస్, కిరోసనాయిల్) పేరుతో తక్కువ ధరకి అమ్ముతున్నారు. ఈ సీమెణ్ణి ఎంత ప్రమాదకరమంటే దీని ముందు మూకాంబిక దేవి మాయలు కూడా పనిచేయలేదు. మూకాంబికదేవి ఆలయంలో దొంగలు దొంగతనానికి వెళ్లారు. దొంగలు ఆలయంలోకి వెళ్లగానే దేవి తన మాయతో అక్కడున్న దీపాలను ఆర్పింది. అప్పుడు దొంగలకి కళ్లు కనబడక ఏమి చేయాలో తోచలేదు. అప్పుడు వారంతా సిమెణ్ణి తెచ్చి కాగడాలుగా వెలిగించారు. వెంటనే ఆలయాలలో వెలుతురు వెలిగింది. దేవి మాయలు మంచి నూనె దీపంపై పని చేసిన విధంగా ఆ కాగడాలపై పనిచేయలేదు. దొంగలు తమ పని చేసుకొని వెళ్లిపోయారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 22, 23).

ఈ సంఘటనలు కర్ణాటక ప్రాంతంలో పంతొమ్మిదో శతాబ్దం నాటికి నూతన వస్తువులపై ప్రజలలో ఉన్న అభిప్రాయాలకి నిదర్శనం. ఇలాంటి నూతన వస్తువుల ప్రస్తావన ఇందులేఖ నవలలో కూడా కనిపిస్తుంది. 'మాధవుడు వేటకి వెళ్లేటప్పుడు తన వెంట బాణాలను కాక మూడు రకాలైన తుపాకులు, రెండు, మూడు పిస్టళ్లు, రివాల్వర్లు మొదలైన వాటిని వెంట తీసుకెళ్తాడు. అంతే కాక తాను మద్రాసు నుండి వచ్చిన ప్రతీసారి వేటకి ఒక కొత్త పిస్తోలును పట్టుకవస్తాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 3). ఈ పిస్తోలు దచ్చివారు మలయాళ ప్రజలకు పరిచయం చేసారు. ఫలితంగా మలయాళ ప్రాంత వేటలో మార్పువచ్చింది. అప్పటివరకు వేటకు ఉపయోగించిన బాణాలు, ఈటెలు వంటి సంప్రదాయ, భారతీయ ఆయుధాల స్థానాన్ని పిస్తోలు, రివాల్వర్లు ఆక్రమించాయి. ఇందుకు మాధవుని గురించి వివరిస్తూ చందుమీనన్‌గారు చేసిన పై వర్ణన నిదర్శం. కర్ణాటక ప్రాంతంలో 'సిమెణ్ణి' అని పిలువబడ్డ 'కిరసనాయిల్' మలయాళ ప్రాంతంలో కూడా ప్రవేశించింది. రాత్రివేళలో ఎక్కువసేపు మెలకువతో ఉండి పుస్తకాలను చదువుతున్న తన కూతురు ఇందులేఖను ఉద్దేశించి లక్ష్మీకుట్టియమ్మ. "నిద్ర లేక పోవడం వల్ల శరీర ఆరోగ్యం దెబ్బతింటుందేమో! కిరసనాయిలు

దీపం కంటికి మంచిది కాదని చెబుతారే" (జయప్రకాశ్, ఎస్(అ), 2016: 8) అంటుంది. ఈ మాటలు మలయాళ ప్రాంతంలో కిరసనాయిల్ నూనెపై ఉన్న అభిప్రాయాన్ని తెలుపుతున్నాయి.

### 5.10.1. నూలు మిల్లులు

భారతదేశంలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి నూలుమిల్లులు ప్రధాన కారణం. ఆంగ్లేయుల ఆగమనం తరువాత నూలు మిల్లులు వచ్చాయి. నూలు వడికే సంప్రదాయం వెళ్లి నూలు మిల్లులు వచ్చాయి. అతి తక్కువ కాలంలో ఎక్కువ వస్త్రాలు నూలు మిల్లులలో తయారవ్వడం వల్ల ఈ మిల్లులలో పనిచేసే శ్రామికుల సంఖ్య పెరిగింది. ప్రారంభ కాలంలో ప్రజలకు ఉపాధి ఈ నూలు మిల్లులవల్ల లభించింది. "దేశంలో మొదటి నూలుమిల్లును 1818లో కోల్‌కత్తా సమీపంలోని 'పోర్ట్‌గ్లాస్టర్' వద్ద ఏర్పాటు చేశారు. తరువాతి కాలంలో ఇది మూతపడింది. 1854లో ముంబై సముద్రతీర ప్రాంతంలో సి.ఎస్. థేవార్ అనే పారశీక పెట్టుబడిదారుడి సహకారంతో ఆధునిక పద్ధతిలో నూలుమిల్లును ప్రారంభించారు. దేశంలో వాస్తవంగా పరిశ్రమల స్థాపన దీని ద్వారానే మొదలైందని భావిస్తారు." (10/07/2015 సాక్షి దినపత్రిక). ఈ నూతన పరిశ్రమల పట్ల ప్రజలలో నెలకొన్న భావాలు ఇందులేఖ నవలల్లో కనిపిస్తాయి. ఈ నూలు మిల్లులు ఆవిరి ద్వారా పనిచేస్తాయన్నది శుద్ధ అబద్ధం. ఆంగ్లేయుల వద్ద ఏదో మంత్ర ఉంది ఆ మంత్రం వల్లనే వీటిని వారు తయారుచేస్తున్నారని, ఈ మంత్రం మాత్రం భారతీయులకు చెప్పరని ఇందులేఖ నవలలో నూలుమిల్లులో పనిచేసే కేశవ నంబూద్రి తన భార్య లక్ష్మీకుట్టియమ్మతో అంటాడు. (జయప్రకాశ్, ఎస్(అ), 2016: 80) ఈ మిల్లుల స్థాపన వల్ల ఆంగ్లేయులు అధిక మొత్తంలో ధనాన్నికూడగడుతున్నారని భార్యతో చెప్తాడు. 'భారతీయుల వద్దనుండి డబ్బును పన్నుల రూపంలో వసూలు చేసిన ఆంగ్లేయులు ఆ డబ్బుతో ఆంగ్లేయ ప్రాంతంలో యంత్రాలు తయారు చేసి వాటిని ఇక్కడ దిగుమతి చేసి మిల్లులను ఏర్పాటు చేస్తున్నారు. అలా కాక ఆ యంత్రాలను ఇక్కడే తయారు చేసి ఇక్కడే వాటి ద్వారా మిల్లులను ఏర్పాటు చేయవచ్చు. అలా చేయడం లేదు ఎందుకంటే అలా చేస్తే భారతీయులు మిల్లు యంత్రాలను ఎలా తయారు చేయాలో నేర్చుకుంటారు. వారే సొంతంగా మిల్లులను ఏర్పాటు చేసుకుంటారని ఆంగ్లేయులు ఈ కుయుక్తి చేస్తున్నారంటాడు." "ఈ నూలు మిల్లు ఏర్పాటుచేయడానికి తెల్లవాళ్లు ఒక్కదమ్మిడీ అయినా ఖర్చుపెట్టి ఉంటారా? లేదు. అంతా మన

డబ్బే. అయినా! ఏం ప్రయోజనం! మనలో ఒక్కరికైనా ఈ విద్యను నేర్పించి ఉన్నారా? అపారంగా డబ్బులు తీసుకొని నూలుమిల్లు యంత్రాన్ని వాళ్లదేశంలోనే తయారుచేసారు. దానిని ఇక్కడకు తీసుకువచ్చి మిల్లు ప్రారంభించారు. మిల్లు చూడ్డానికి పెద్దగా అందంగా ఉంటుంది. మిల్లు నడుస్తున్నది చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది. మనవాళ్లు చాలామంది అమాయకులే కదా! లేకపోతే ఈ ఊళ్ళోనే కోళీక్కోడులోనే ఆ మిల్లు యంత్రాలను చేయవచ్చు కదా! దానికేమి అడ్డం ఉంది. అయితే ఇవన్నీ తెల్లవాడి దగ్గర చెప్పినప్పటికి ఫలించదు." (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 82). ఈ వాక్యాలు నూలుమిల్లుపై మలయాళ ప్రాంత ప్రజలలో నెలకొన్న అభిప్రాయానికి నిదర్శనం.

### 5.11. సాంఘిక దురాచారాలు

#### 5.11.1. సంఘబహిష్కారాలు

సంఘం కట్టుబాట్లకు, ఆచారాలకు విరుద్ధంగా నడుచుకున్నవారిని సంఘం నుండి బహిష్కరించే ఆచారం పంతొమ్మిదవ శతాబ్దంలో ఉన్నట్లుగా దక్షిణ భారత తొలి సాంఘిక నవలల వలన తెలుస్తోంది. ఏది సంఘానికి అనుకూల ఆచారం, ఏది సంఘానికి వ్యతిరేక ఆచారం అన్నది కాలానుగుణంగ సంఘం ఏర్పర్చుకున్నకట్టుబాట్లను బట్టి మారుతుంటుంది. సముద్ర ప్రయాణం, విధవ వివాహం, క్రైస్తవమత స్వీకారం ఈనాటి సమాజానికి విరుద్ధ ఆచారాలు కావు. కాని పంతొమ్మిదవ శతాబ్దంలో సముద్ర ప్రయాణం చేసినవారిని, వితంతుస్త్రీలను వివాహం చేసుకున్నవారిని, క్రైస్తవమతం స్వీకరించినవారిని సంఘంనుండి బహిష్కరించారు.

"విరూపాక్ష పీఠస్థులైన మా శంకరాచార్య స్వాములవారు విజయనగరము నుండి బయలుదేరి దారి పొడుగునను భిక్షులను, పాద పూజలను గైకొనుచు మా గోదావరి మండలమునకు వచ్చు చుండిరి. రాజమహేంద్రవరమున జరుగుతున్న విధవా వివాహ ప్రయత్నము గురించి విని స్వాముల వారు ఆ పనిలో ప్రవేశించిన వారినందరినీ వెలి వేసెదమని ఆనతిచ్చిరట. కొందఱు వీధుల మూలలను మూయించి ఎదుట గూరుచుండి మాయింటికి వచ్చువారిని మాత్రమేకాక మా వీధిని నడుచువారిని సహితము పేరులువ్రాసికొని బహిష్కార పత్రికలు తెప్పించి వెలి వేసెదమని బెదిరించుచూ వచ్చిరి." (వీరేశలింగం, కందుకూరి. 2013:

149,172). వితంతు పునర్వివాహం జరిపించే సమయంలో తనకు ఎదురైన అనుభవాన్ని గురించి కందుకూరి వీరేశలింగంపంతులుగారు తన స్వీయ చరిత్రలో రాసుకున్న పై వాక్యాలు పంతొమ్మిదవ శతాబ్దంలో సంఘబహిష్కారం ఉన్నట్లుగా తెలుపుతున్నాయి. ఈ సంఘ బహిష్కారానికి భయపడి కొంత మంది పెద్దలు తాను జరిపే మొదటి వితంతు పునర్వివాహానికి హాజరు కాలేకపోయారని కందుకూరి వీరేశలింగంపంతులుగారు తన స్వీయ చరిత్రలో పేర్కొన్నారు. సంఘబహిష్కార పత్రాలు మఠం నుండి వెలువడేవి. ఈ మఠాలకి, మఠాధిపతులకి పంతొమ్మిదవ శతాబ్దంలో అధిక ప్రాధాన్యం ఉండేది. ప్రతీ మఠానికి ఒక పీఠాధిపతి, కొంత మాన్యం, శిష్యుల సమూహం ఉండేది. మఠం పరిధిలోకి వచ్చే ప్రాంతంలో ప్రాచీన ఆచారాలకు వ్యతిరేకంగా ఎవరు నడుచుకున్నా వారిని సంఘం నుండి బహిష్కరించే అధికారం మఠానికి ఉండేది. సంఘ ఆచారాలకు విరుద్ధంగా నడుచుకునే వారిని మఠాధి పతులకి తెలిపే విధంగా మఠాధిపతులు తమ మఠం పరిధిలో అక్కడక్కడ 'ధర్మవిచారకర్తలను' నియమించేవారు. ఈ ధర్మవిచారకర్తలు సామాజిక కట్టుబాట్లకు వ్యతిరేకంగా నడుచుకునే వారి పేర్లను మఠాధి పతులకు సూచించడమే కాక శిష్యగణం నుండి వార్షిక చందాలను వసూలు చేసి మఠానికి ఇచ్చేవారు. మఠాధిపతులు ధర్మ విచార కర్తల నుండి ఫిర్యాదులను అందుకున్న తరువాత ఒక సభను ఏర్పాటు చేసి పిర్యాదులో పేర్కొన్న వ్యక్తి నిజంగానే సంఘవ్యతిరేక కార్యకలాపాలకి పాల్పడి, సంఘం కట్టుబాట్లకి వ్యతిరేకంగా నడుచుకున్నట్లు రుజువైతే అతన్ని సంఘం నుండి బహిష్కరించేవారు. ఈ రకంగా మఠం నుండి సంఘబహిష్కారానికి గురైన కుటుంబంతో కులస్తులెవరు మాట్లాడేవారు కాదు. ఈ విషయాలన్నీ ఇందిరాబాయి నవలలో ప్రస్తావనకి వచ్చాయి.

మఠాధిపతులు కమలాపురానికి వచ్చిన సందర్భంలో భీమారావు వారిని అమిత భక్తితో ఆరాధిస్తాడు. అతని భక్తిశ్రద్ధలకు మెచ్చి మఠాధిపతి భీమారావుని కమలాపుర గ్రామానికి ధర్మ విచారకర్తగా నియమిస్తాడు.(వెంకటరావు, గుల్వాడి. 1962: 63-65). ఈ విధంగా ధర్మవిచారకర్తగా నియమితమైన భీమారావు తన స్వార్థం కోసం తన న్యాయ విచక్షణ అధికారాన్ని వినియోగించుకుంటాడు. సుందరరావు కుటుంబం అంటే గిట్టని భీమారావు అతని మరణ అనంతరం సుందరరావు కుమారుడైన భాస్కరరావు సముద్ర ప్రయాణం చేసి, క్రైస్తవుల మాదిరిగా వేషధారణని మార్చి జాతిని భ్రష్టు పట్టిస్తున్నాడు కావున అతన్ని జాతి నుండి

బహిష్కరించాలని మఠాధిపతులకు ఒక లేఖ రాస్తాడు. ఈ లేఖ అందుకున్న మఠాధిపతులు భాస్కరరావుని ఏమీ చేయరు. ఎందుకంటే అప్పటికే భాస్కరరావు వంటి అనేక మంది యువకులు విదేశాలకు వెళ్లినట్లుగా మఠాధిపతులకి అనేక ఉత్తరాలు వస్తాయి. ఇలా వెళ్లిన వాళ్లందరినీ సంఘం నుండి బహిష్కరిస్తూ వెళ్తే వారి సంఖ్య పెరిగి మఠం మీద వారు తిరగబడే అవకాశం ఉంటుంది. అందుకే మఠం పెద్దలు ఇలా విదేశాలకు వెళ్లినవారు ప్రాయశ్చిత్తాన్ని జరుపుకుంటే తిరిగి జాతిలోకి చేరవచ్చునని పరిష్కార మార్గాన్ని కనిపెట్టారు. యువకులు అనేక మంది విదేశాలకు వెళ్లడం ప్రాయశ్చిత్తం జరుపుకొని తిరిగి మళ్ళీ జాతిలో కలవడం అనేది ఆనాటి యువకులకు అలవాటైంది. ఈ ప్రాయశ్చిత్తం జరిగే విధానం గురించి ఇద్దరు చదువుకున్న యువకులు ఇందిరాబాయి నవలలో మాట్లాడుకుంటారు.

"well (మంచిది) నీకు జాతి కావాలా?

"కావాలి price (ధర) ఎంత?"

"అదేమి Dead cheap (అల్ప విషయం, చాలా తక్కువ ధర)"

"నీవు ఎంతకు తీసుకున్నావు"

"నేను మూడు రూపాయలిచ్చాను, అప్పుడు ఇప్పుడు కొంచెం ధర తగ్గింది"

"ఇప్పుడేమి ధర ఉంది"

"ఇప్పుడు రెండు రూపాయలే"

"అదేమి fluctuation (హెచ్చు, తగ్గుదల)"

"మరేమనుకున్నావు. మార్కెట్ ఎప్పుడు ఒకే రకంగా ఉండదుగా ఎక్కువగా కొన్నిసార్లు 25రూపాయల వరకు వెళ్తుంది"

"అలాగైతే నేను రేపే వెళ్లి ప్రాయశ్చిత్తం తీసుకుంటాను. రెండు రూపాయల మాటెంత? కథ ఎంత? ఇంకా వేరే ఏమీ లేదు కదా!"

"ఒక టెంకాయ ఏడు అరటిపళ్లు, రెండు జంతువులు ఉంటే చాలు" (వెంకటరావు, గుల్వాడి. 1962: 251, 252)

ఈ విధంగా ఇందిరాబాయి నవలలో సంఘబహిష్కారం దానికి తగిన ప్రాయశ్చిత్తం రెండింటి గురించి తెలుపబడింది. ఈ ప్రాయశ్చిత్తంవల్ల మఠాధిపతులు అధిక మొత్తంలో ధనార్జన చేశారు. భీమారావునుండి అభియోగపత్రాన్ని అందుకున్న తరువాత మఠాధిపతి మఠం యొక్క భవిష్యత్తు కార్యాచరణ గురించి తన శిష్యునితో చర్చిస్తాడు. ఈ సంభాషణలో మఠం

యొక్క ఆర్థిక స్థితిగతులు ప్రస్తావనకి వచ్చాయి. "ఏమిటయ్య మఠం యొక్క భవిష్యత్తు? అని అడగగానే అతను స్వామీ! శ్రీస్వామివారి దయవల్ల ఏ ఒక్క విషయాన్ని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. ఒకరోజు వంద చొప్పున సంవత్సరకాలం పోలెలు (బొబ్బట్లు) చేసుకోవడానికి కావలసిన గోధుమలు, శనగపప్పు, బెల్లం, మొదలైన పదార్థాలన్నీ ఉన్నాయి. నెయ్యి మొదలైన వంట సామాగ్రి అంతా సిద్ధంచేసి ఉంచాను. బియ్యం ఎలాగూ మఠం భూముల నుండి వస్తాయి. అవి సరిపోతాయి. మఠానికి చెందిన పశువులలో చంద్రబాగి, గోదావరి, సోమావతి, సరస్వతి, వేదవతి ఈ ఐదు పశువులు గర్భంతో ఉన్నాయి. పాలు, పెరుగు గురించి ఆలోచించ వలసిన అవసరమే లేదు. ఇంకా ఆలోచించ వలసిన విషయం ఏముందో నాకు అర్థం కావడం లేదు. శ్రీగురువుగారికి అలాగ ఏమైనా అనిపిస్తే నాకు చెప్పండి. దానికి తగిన ఉపాయాన్ని ఆలోచిస్తాను. శ్రీగురువుగారు ఆ మాటలు విని ఖో! ఖో! అంటూ నవుతూ! ఆ విషయాలను మాత్రమే చూసుకుంటే సరిపోతుందా! కమలాపురం శిష్యుల పరిస్థితి ఏంటో తెలుసుకున్నావా? అనేక రకాలుగా ఆలోచించి చూస్తే అక్కడి నుండి వచ్చే అభియోగపత్రాల సంఖ్యను తగ్గించకుంటే ఇక ముందు అనేక కష్టాలు వస్తాయని తెలుస్తుంది. ఇకపై అక్కడినుండి వచ్చే ప్రతి అభియోగ పత్రానికి పది రూపాయలు పీజు కట్టాలి. పీజు కట్టని అభియోగపత్రాన్ని చింపి వేస్తామని పీజు ఉన్న అభియోగపత్రాన్ని మాత్రమే విచారిస్తామని, పీజు ఉన్న అభియోగ పత్రాన్ని పంపిన వ్యక్తి స్వతహాగ మఠానికి వచ్చి అందులో తాను రాసిన అభియోగాన్ని నిరూపించాలని తెలిపేటట్లు ఒక ప్రకటనను తయారు చేయమని శ్రీ గురువుగారు శిష్యుడిని ఆజ్ఞాపిస్తాడు. శిష్యుడు గురువు చెప్పినట్లు ప్రకటనా పత్రాన్ని రాసి దానిపై గురువుగారి సంతకం తీసుకొని అక్కడినుండి వెళ్లిపోయాడు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 253, 254) ఈ గురుశిష్యుల సంభాషణ బహిష్కార పత్రాల వల్ల మఠం ఆర్థికంగా బలపడిందనడానికి నిదర్శనం.

తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో మఠాధిపతులు కాకుండా కులపెద్దలు చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తిని కులం నుండి బహిష్కరించిన సంఘటన ప్రస్తావనకి వచ్చింది. పేరావూరు గ్రామానికి చెందిన నీలకంఠముదలియార్ జ్ఞానాంబాళ్‌ని వివాహం చేసుకోవాలని అనుకుంటాడు. అది కుదరక పోయే సరికి ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్తాడు. ప్రతాపముదలియార్ నీలకంఠముదలియార్ మనుషుల బారినుండి జ్ఞానాంబాళ్‌ని కాపాడతాడు.

ఇంటికి వచ్చిన జ్ఞానాంబాళ్ జరిగిన సంగతంతా తన తండ్రి సంబంధముదలియార్‌కు చెబుతుంది. సంబంధముదలియార్ కుల పెద్దలకు ఈ విషయం తెలుపగా వారు నీలకంఠముదలియార్‌ని సంఘం నుండి బహిష్కరిస్తారు."మనకులానికి సంబంధించిన వారందరూ ఒకటిగా సమావేశమై అతనిని జాతిభ్రష్టునిగా చేసి శుభాశుభాలకు ఎవరూ పిలవకుండాను, నీరు నిప్పు ఇవ్వకుండానూ బహిష్కరించారు. అతనికి కులస్థులు ఎవరూ పిల్లనివ్వక పోవడం వలన వాడు ఇంకా బ్రహ్మచారిగానే ఉన్నాడు. విఘ్నేశ్వరుని బ్రహ్మచర్యం తొలిగి తొలగుతుందేమోకాని అతని బ్రహ్మచర్యం మాత్రం తొలగదని నిశ్చయం." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 19) ఈ సంఘటన తమిళ ప్రాంతంలోని సంఘ బహిష్కారానికి నిదర్శనం. ఈ సంఘ బహిష్కారం ఈ నాటి సమాజంలో కూడా కనిపిస్తుంది. "తేది 08-05-2020 నాడు ఓ మహిళ ఆత్మహత్యకు కారణమయ్యాడని ఆరోపిస్తూ ఓ కుటుంబాన్ని గ్రామపెద్దలు బహిష్కరణ చేసిన వార్త ఆంధ్రజ్యోతిపత్రికలో ప్రచురితమైంది. ఈ సంఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బిర్నాంది కొమ్మతాండాలో చోటుచేసుకుంది." (తేది: 08 మే 2020నాడు ఆంధ్రజ్యోతి పత్రిక, పుట సంఖ్య 10లో ఈ వార్త వచ్చింది).

### 5.11.2. సతీసహగమనం – వ్యతిరేకత

కలకత్తా పరిసర ప్రాంతాలలో క్రీ.శ.1815, 1817 సంవత్సరాలలో వరుసగ 253, 289సతి దురాచారాలు జరిగాయి(వైకుంఠం, యెల్లపల్లి, 2011: 217) ఆంగ్లేయ కంపెనీ ప్రభుత్వం ఈ సతీసహగమనాన్ని నిషేధిస్తూ 1829లో చట్టం చేసింది. ఈ చట్టంవల్ల సతీసహగమనాలు ఆగాయి. భర్తతో పాటు స్త్రీ చనిపోవాల్సిన అవసరం లేదనే భావన బలంగా ఏర్పడింది. ఈ అంశానికి సంబంధించిన ప్రస్తావన ఇందిరాబాయి నవలలో కన్పిస్తుంది. 'విఠలరావు' చనిపోయిన సందర్భంలో 'కాశీనాథభట్టరు' భీమారావుతో సతీసహగమనాన్ని గురించి ప్రస్తావిస్తాడు.

"రావుగారు ప్రాచీన కాలంలో పతి మరణిస్తే పత్ని కూడా సహగమనం చేసేది. పతితో పాటు చితిలో కాలిపోవాలన్న స్మృతివాక్యాల అనుసారం ఎంతో మంది పతివ్రతా స్త్రీలు సహగమనాన్ని అనుసరించారు. ఇప్పుడు మ్లేచ్ఛుల రాజ్యం వచ్చిన తరువాత ఆ పద్ధతి పూర్తిగా

నిలిచిపోయింది. అయితే అనేక మంది స్త్రీలు స్మశానం వరకు వెళ్లి చితికి అగ్ని పెట్టేంతవరకు ఉంటున్నారు.” (వెంకటరావు, గుల్వాడి. 1962: 150) సతీసహగమన నిషేధచట్టం తరువాత వచ్చిన మార్పులకి ఈ వాక్యాలు నిదర్శనం.

### 5.11.3. సముద్ర ప్రయాణం – నిషేధం

“1858లో విక్టోరియా మహారాణి తన ప్రకటనలో అర్హులైన భరతీయులందరిని కుల, మత, జాతి విభేదాలు పాటించకుండా అన్ని ఉద్యోగాలలో చేర్చుకోవడం జరుగుతుందని వాగ్దానం చేసింది. ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలు పొందవలెనంటే వారు పోటీపరీక్షలలో నెగ్గవలె. ఈ పరీక్షలు ఇంగ్లాండులో మాత్రమే జరిగేవి. భారతీయులు ఇంగ్లాండు వెళ్లి ఆ పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణులైతేగాని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించవు. విదేశాలకు వెళ్లడం ఆ రోజులలో అంత సులు   కాదు. మొదటి సమస్య దూరాభారం. రెండోది ఖర్చుతో కూడిన పని. సముద్ర ప్రయాణం చేస్తే సంఘం వెలివేస్తుందేమో అనే భయము. అందువల్లనే భారతీయులకు ఉన్నత ఉద్యోగాలు లభించలేదు. ఎంత చదువుకున్నా వారు గుమాస్తాలుగానో చిన్న ఉద్యోగులుగానో తక్కువ జీతాలమీద పనిచేయవలసి వచ్చేది.” (వైదేహి, అల్లాడి. 2007: 231) ఇలాంటి పరిస్థితి పంతొమ్మిదవ శతాబ్దంలో భారతీయ సమాజంలో ఉండేది. ఒక వేళ ఎవరైనా సముద్ర ప్రయాణంచేసి విదేశాలకు వెళ్తే అతన్ని సంఘంనుండి బహిష్కరించేవారు. సముద్ర ప్రయాణంపై నిషేధం ఉన్న అంశం ఇందిరాబాయి నవలలో ప్రస్తావనకి వచ్చింది. భాస్కరరావు సి.ఎస్. పరీక్ష నిమిత్తం విదేశాలకు వెళ్లే సందర్భంలో అమృతరావు ఇంటిలో బి.ఎ. చదివిన వారితో ఒక భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. ఆ సందర్భంలో అమృతరావు ఇంటికి వచ్చిన బి.ఎ. చదివిన యువకులందరూ సముద్ర ప్రయాణ నిషేధం గురించి మతాధిపతులతో మాట్లాడాలని నిర్ణయించుకుంటారు.

“ఒక బి.ఎ: ఇప్పుడు భాస్కరరావు సముద్ర ప్రయాణం చేసి వచ్చిన తరువాత దాని పర్యావసానం ఎలా ఉంటుందో తెలియడం లేదు.

**ఇంకొక బి.ఎ:** అది ముందు జరగవలసిన విషయం. అందులో వేరే విశేషం ఏమైనా ఉంటే అది డబ్బుకు సంబంధించినదై ఉంటుంది. అది డబ్బు విషయమైతే ఎలాగో ఒకలాగ బయటపడవచ్చు. ఒకవేళ సంఘ బహిష్కారం వంటివి ఎదురైతే కష్టం.

**ఇంకొక బి.ఎ:** మనమంతా ఇలా మాట్లాడి ప్రయోజనం లేదు. మనమంతా ఒకటిగా చేరి గురువుల వద్ద సముద్ర ప్రయాణం గురించి ఒక వాగ్వివాదం జరపాలని నాకు అనిపిస్తున్నది." (వెంకటరావు, గుల్వాడి. 1962: 102)

ఈ సంభాషణ సముద్ర ప్రయాణంపై పంతొమ్మిదవ శతాబ్దం నాటికి నిషేధం ఉందనడానికి నిదర్శనం. యువకులు అనేక మంది సముద్ర ప్రయాణం చేయడం వల్ల మఠాధిపతులు వారిని ఏమీ చేయలేక చివరికి ప్రాయశ్చిత్తంతో తిరిగి వారిని జాతిలోకి తీసుకునే ఏర్పాటును చేశారని చెప్పడానికి ఈ సంఘటన నిదర్శనం. ఇందులేఖ నవలలో మాధవుడు సముద్ర ప్రయాణం చేసినట్టు చెప్పబడింది. కాని సముద్ర ప్రయాణనిషేధ ప్రస్తావన కనిపించదు.

### 5.11.4. కపట సంతమండలి

వేద అధ్యయనం చేసి, స్థిరచిత్తంతో, నిర్మలమైన మనస్సుతో ఇంద్రియ సుఖాలకు అతీతంగా జీవనం సాగించే వ్యక్తులను స్వాములు, మునులు, ఋషులు, సంతులు అని పిలవడం పరిపాటి. ఈ సంతులు మఠాలలో ఉంటారు. ఊరూరు తిరుగుతూ, జ్ఞానాన్ని ఉపదేశిస్తూ, భిక్షాటన ద్వారా జీవనాన్ని సాగిస్తారు. నిర్మల భావాన్ని కలిగిన మునులు ఇహపర సుఖాలకి లొంగరు. ఇలాంటి సంతుల సమూహం ఊళ్ళోకి భిక్షాటన నిమిత్తం వచ్చినప్పుడు గ్రామ ప్రజలు వీరిని భక్తిశ్రద్ధలతో ఆహ్వానించి భిక్షని పెట్టేవారు. దానాలను సమర్పించడంతోపాటు, తమ ఇళ్లలో వీరిచేత భజన, కీర్తన కార్యక్రమాలు ఏర్పాటుచేసేవారు. ఈ కార్యక్రమాలలో సంతుల భుక్తికి ఎలాంటి లోటూ ఉండేది కాదు. ఈ భజన, కీర్తన కార్యక్రమాలని సంత సమూహం చేత ఏర్పర్చడంవల్ల శుభాలు కలుగుతాయనే నమ్మకం ప్రజలతో ఉండేది. ఈ సంత సమూహాలలో ఇంద్రియ సుఖాలకు అలవాటుపడ్డ కొంతమంది 'సంతులు' తమస్వార్థ బుద్ధితో ప్రజలని మోసగించిన విధానం కన్నడ ఇందిరాబాయి నవలలో చిత్రితమైంది. ఇందిరాబాయి భర్త మరణించిన తరువాత తమ ఇంట్లో భజన కీర్తనలు నిర్వహించడానికి, ఇందిరాబాయిలో వైరాగ్య భావాన్ని కలిగించడానికి ఇందిరాబాయి తండ్రి భీమారావు శివపురంలో నివాసం ఉండే

'రంగప్పయ్య' సంతమండలిని తన ఇంటికి ఆహ్వానిస్తాడు. తన ఇంటికి సంతమండలి వచ్చిన సందర్భంలో వారికి విశేషమైన అతిథి మర్యాదలు చేస్తాడు. సంతమండలి భీమారావు ఇంట్లో త్రికాలభజన, గురుచరిత్ర, సప్తా మరియు రాధావిలాసం, గోపికావస్త్రాపహరణ మొదలైన కృష్ణచరిత్ర ప్రదర్శనలు, సంతర్పణలు నిర్వహిస్తుంది. వీరి ఉపాన్యాసాలను భార్తను కోల్పోయిన స్త్రీలు వింటూ, సంతమండలిని సేవిస్తూ వుంటారు. కాని ఇందిరాబాయి మాత్రం సంతమండలి బోధనలను వినదు. వారిని సేవించదు. చివరికి తల్లి చేసెది లేక ఇందిరాబాయి ఉన్నచోటనే సంతమండలి గురువు ద్వారా భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయిస్తుంది. సంత మండలి గురువు రంగప్పయ్య భగవద్గీత చదువుతున్న సందర్భంలో అక్కడున్న విధవస్త్రీలలో కొంతమంది అతనికి గాలి వీచడం, చమట తుడవడం, కాళ్ళు, చేతులు ఒత్తడం వంటివి చేస్తారు. ఇది ఇందిరాబాయికి నచ్చదు. ఇందిరాబాయి తల్లి 'గురువులను సేవించే విధానం ఇదే నువ్వు అలాగే సంతమండలిని సేవించమని' ఒత్తిడి చేస్తుంది. సంతమండలిలో ఒకరైన బాళప్పయ్యపై కోర్టులో కన్యాపహరణ వ్యాజ్యం విచారణకి వస్తుంది. ఈ సంగతి భీమారావుతో చెప్పగా అతను తన ఇంట్లో జరిగే కార్యక్రమం ఆగరాదని 500 రూపాయలతో ఒక న్యాయవాదిని బాళప్పయ్య తరపున వాదించడానికి నియమిస్తాడు. కోర్టులో బాళప్పయ్యచేత అపహరణకి గురైన కళ్యాణి అనే విధవస్త్రీ తనను బాళప్పయ్య ఎలా మోసగించాడో వివరంగా చెప్తుంది.

"నేను పదిహేను సంవత్సరాల విధవరాలిని. బాళప్పయ్య అప్పుడప్పుడూ నా వద్దకి వచ్చి సంత ధర్మోదేశం ద్వారా జన్మని ఎలా సార్థకం చేసుకోవాలో చెబుతానని చెప్పి అనేక కామోత్తేజిత విషయాలను మాట్లాడుతూ ఒక్కొక్కసారి నా శరీరాన్ని తాకుతూ అప్పుడప్పుడు స్వామి ప్రసాదం అని కొన్ని మధుర పదార్థాలను తినడానికి ఇచ్చేవాడు. అలా అనేక రకాలుగా నన్ను మాయ చేసి చివరికి ఒకరోజు నీకు బ్రహ్మానందాన్ని చూపిస్తా రా! అంటూ తన తోటి వారికి తెలియకుండా నన్ను వేరే ఊరికి తీసుకెళ్లాడు. అక్కడ మేము భార్య, భర్తలలాగా ఉంటుండగా పోలీసువారు వచ్చి ఇతన్ని తీసుకెళ్లారు. ఇతను జామీనుపై బయటికి వచ్చాడు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 172). కళ్యాణి మాటలు విన్న న్యాయాధిపతి అతనికి జైలు శిక్ష విధిస్తాడు. ఈ విషయం సంత మండలికి తెలిసి బాధపడతారు. సంతమండలి బోధనల వల్ల ఇందిరాబాయిలో ఎలాంటి మార్పురాదు. సంతమండలి అధ్యక్షుడు ఎలాగైనా ఇందిరాబాయిని వశం చేసుకోవాలని ఒకరోజు అర్థరాత్రి దాటాకా కిటికీ తలుపులను పగలగొట్టి ఇందిరాబాయి ఉన్న గదిలోకి

ప్రవేశించడానికి ప్రయత్నిస్తాడు. అది గమనించిన ఇందిరాబాయి 'ఎవరదీ' అని గట్టిగా అరుస్తుంది. "నేను రంగప్ప సంతమండలి అధ్యక్షుడిని నీతో కొన్ని విషయాలు రహస్యంగా మాట్లాడాలి. నాలో ఏ దురుద్దేశం లేదు. ఒక్క నిమిషం మాట్లాడి వెళ్లిపోతాను" అంటూ రంగప్పయ్య మేకవన్నె పులిలా మాట్లాడతాడు. ఏ విషయం ఉన్నా ఉదయం మానాన్న అనుమతితో మాట్లాడండని ఇందిరాబాయి ఎంత చెప్పినా వినడు. చివరికి ఇందిరాబాయి తనకు ఈ అధ్యక్షుని వల్ల ఆపద వస్తుందని గ్రహిస్తుంది. తాను ఎలాగైనా అక్కడి నుండి తప్పించుకోవాలని ఉపాయాన్ని ఆలోచిస్తుంది. వెంటనే తాను రంగప్పయ్యపట్ల అమిత భక్తి కలిగిన శిష్యురాలిగా నటిస్తుంది. అధ్యక్షులైన మీరు ఉపదేశం ఇవ్వడానికి కిటికిగుండా రాకూడదు. ద్వారం తీస్తాను. ద్వారం గుండా రండి, అని చెబుతుంది. ఇందిరాబాయి మాటలువిని రంగప్పయ్య మనసులో సంతోషపడతాడు. ఇందిరాబాయి ద్వారం తీయగానే "నీ భక్తికి నేను ప్రసన్నుడనయ్యాను" అంటూ ఇందిరాబాయి దగ్గరికి వచ్చి ఆమెని ముట్టుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఇందిరాబాయి కొంచెం వెనక్కి జరిగి "స్వామి దయచేసి కూర్చోండి. ఎందుకు కకృత్తి పడుతున్నారు. ఇన్ని రోజులు నేను మీరు చెప్పిన విషయాలన్నీ విన్నాను. స్వామి నాకు మీతో ఏకాంతంగా కొంతసేపు మాట్లాడాలని ఉంది. అయితే మాట్లాడడం ప్రారంభించిన తరువాత మధ్యలో నిలపడం యోగ్యం కాదు కాబట్టి ఒక్క మూడు నిమిషాలు బయటకు వెళ్లి వస్తాను. మీరు ఇక్కడే కూర్చోండి." (వెంకటరావు, గుల్వాడి. 1962: 183) అని చెప్పి రంగప్పయ్య గదికి బయటనుండి గొళ్ళెం వేసి ఇందిరాబాయి పారిపోతుంది.

ఈ రెండు సంఘటనలు సంతమండలి రూపంలో ఉన్న 'కపటస్వాములు' విధవ స్త్రీలపట్ల ఎలా ప్రవర్తించారనడానికి నిదర్శనం. విధవ స్త్రీలకి రక్షణ ఉండేది కాదు. చిన్న వయసులోనే భర్తలని కోల్పోవడంవల్ల వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని కొంత మంది కపటస్వాములు వారితో సంబంధాలను ఏర్పర్చుకునేవారు. తెలుగునాట ఇలాంటి అనేక విషయాలు కందుకూరి వీరేశలింగం పంతులుగారి దృష్టికి వచ్చినట్లుగా వారు తమ స్వీయ చరిత్రలో పేర్కొన్నారు.

"స్వాములవారీ విధవవివాహముల నెంత నిషేధించుచు వచ్చినను, ఘోటక బ్రహ్మచారులైన వారి శిష్యుల తోడ అమంత్రకమైన వివాహములను జరుపుచూనే వచ్చిరి.

పాఠశాలలోని కొందరు విద్యార్థులీ రహస్యమును కనిపెట్టి ఒక రాత్రి కాచి యుండి ఒక బ్రాహ్మణ వితంతువుతో సంసారము చేయుచున్న ఒక బ్రహ్మచారి శిష్యుని పట్టుకొని ఆ అపూర్వ దంపతులను వీధిలోనికి ఈడ్చుకొనివచ్చి, ఎల్లవారికినీ చూపి అవమానపర్చిరి.” (వీరేశలింగం, కందుకూరి. 2013: 46).

### 5.11.5. బానిసత్వ వ్యవస్థ - పిల్లల అపహరణ

“దక్షిణ భారతదేశంలో కర్ణాటక ప్రాంతంలో పదాహారువేలమంది బానిసలు ఉండటాన్ని చారిత్రక వృత్తాంతాలు పేర్కొంటున్నాయి. బానిసల ఖరీదు గురించికూడా వివరాలు లభిస్తున్నాయి. బానిస బాలుడు ఖరీదు మూడునుండి నాలుగు రూపాయలు. బానిస స్త్రీ ఖరీదు పదాహారునుంచి ఇరవైనాలుగు రూపాయలు. యుక్త వయస్సులోని బాలికలను తల్లిదండ్రులే బానిసలుగా అమ్మేవారు. కొందరు దారిద్ర్యం కారణంగా పోషించలేక పిల్లల్ని బానిసలుగా అమ్మేవారు. రుణ బాధితులు, జూదవ్యసనపరులు భార్యల్ని కూడా అమ్మేవారు. సంపన్నులు, భూస్వాములు, యూరప్‌కి చెందిన వలస వాసులు బానిస స్త్రీలను విలాసం కోసం కొనుగోలు చేసేవారు. పిల్లల్ని, కొంచెం పెద్దవయస్సువారిని దొంగతనంగా ఎత్తుకొనిపోయి బానిసలుగా అమ్మేముఠాలు ఉండేవి.” (వైకుంఠం, యల్లంపల్లి. 2011: 218).

పిల్లల్ని ఎత్తుకెళ్ళే ముఠాల ప్రస్తావన ప్రతాపముదలియార్ చరిత్రలో కనిపిస్తుంది. ఆన్దిచ్చియమ్మాళ్ (సన్యాసి) కుమారున్ని, తండ్రిని కొంతమంది దొంగలు ఎత్తుకెళ్లి ఆంగ్లేయులకు బానిసలుగా అమ్ముతారు. వారు అక్కడ అనేక కష్టాలు అనుభవించి తిరిగి ఆన్దిచ్చియమ్మాళ్‌ను చేరుకున్న ఇతివృత్తం ప్రతాపముదలియార్ చరిత్రలో ప్రస్తావితమైంది. పది సంవత్సరాల ప్రాయం కలిగిన ఆన్దిచ్చియమ్మాళ్ కుమారుడు ఆభరణాలు ధరించి వీధిలో ఆడుకుంటూ ఉండగా అతన్ని కొందరు దుండగులు అపహరిస్తారు. కుమారున్ని వెతుక్కుంటూ ఆన్దిచ్చియమ్మాళ్ తండ్రి వెళ్తాడు. అతను పిల్లవాడిని వెతుకుతూ తాను చూపిన దృశ్యాలను నవలలోని మిగతా పాత్రలకు వివరిస్తాడు.

"నేను మా వూళ్ళో వెతుక్కుంటూ వెళ్లినప్పుడు ఒకడు నన్ను చూసి సముద్రతీరంలో ఒక పిల్లవాడిని ఓడలోపలికి లాగుతూ ఉన్నాడు. ఆ బిడ్డ రానంటూ ఏడుస్తున్నది. నేను వెంటనే సముద్రతీరం దగ్గరికి ప్రయాణించాను. అక్కడ పిల్లవాడు కనిపించనందున ఒక పడువలో ఎక్కి ఓడపైకి చేరుకున్నాను. అక్కడ వీడు నన్ను చూడగానే పరుగెత్తుకుంటూ వచ్చి నన్ను గట్టిగా పట్టుకొని ఏడ్చాడు ఆ ఓడ దొంగ ఓడ అని కొన్ని అనుభవాల కారణంగా నిర్ధరించాను. ఓడలో ఉన్నవారిని చూసి 'పిల్లవాడిని ఎందుకు తీసుకువచ్చారు? అని అడగ్గా సరైన ప్రత్యుత్తరం ఇవ్వక నన్ను లెక్కచేయక మాట్లాడారు. నేను వాళ్లను చూసి మా అబ్బాయి వేసుకున్న ఆభరణాలన్నిటిని తీసుకొండి పిల్లవాడిని మాత్రం అప్పగించండి.' అని ప్రార్థించాను. నా మాట పూర్తి కాకుండానే ఓడ వేగంగా వెళ్లడం ప్రారంభించింది. వెంటనే ఓడ కాప్టెన్ దగ్గరికి వెళ్లి కన్నీరు, మున్నీరుగా విలపించాను. ఆ పాపిష్టివాడికి దయ కలగలేదు. ఆ ఓడలో ఇంకా చాలా మంది బలవంతంగా ఎక్కించబడి ఉన్నారు. వాళ్లు పిల్లవాడిమీద ఉన్న ఆభరణాలను వలుచుకొని పెక్కు దీపాంతరాలకు వెళ్లి చివరకు మమ్మల్ని అమెరికాలో బానిసలుగా అమ్మివేశారు. అక్కడ చాలా మందికి బానిసలుగా మారి మేము పడిన కష్టాలు వింటే మీరు దుఃఖించకుండా ఉండలేరు. చివరకు ఒక యురోపియన్ దొర ప్రాపకం సంపాదించి ఆయన దగ్గర ఉద్యోగం చేస్తూ ఈ పిల్లవాడిని సంరక్షించి చదివించాను. ఆ దొరగారి అనుగ్రహం వలన మేము మళ్ళీ ఓడ ఎక్కి పుదుచ్చేరి రేవులో దిగి ఇంటికి వెళ్లాము." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 74, 75) ఈ సన్నివేశం పంతొమ్మిదవ శతాబ్దంలో ఉన్న బానిసత్వ వ్యవస్థకి, పిల్లల అపహరణకి నిదర్శనం.

### 5.11.6. బందిపోటు దొంగతనాలు

దారిదోపిడీలు, దొగతనాలు జరిగిన సన్నివేశాలు, ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందులేఖ నవలలో ప్రస్తావనకి వచ్చాయి.

"ఆ కాలంలో మరొక గొప్ప విశేషం పిండారి దండులవారి బందిబోటు తనములు. పిండారీలు మరాఠీ సైన్యం నుండి చెదిరి పోయిన సిపాయి దండులై యుండుదురు. వారికి ఒక నాయకుడు లేదు. తత్సమయమునకు ఎవరు నాయకుడై ఉన్న వానిననుసరించి మూకములుగా గ్రామములపై బడి దోచుకొనుచూ వచ్చిరి. వారు చేయు క్రూర చర్యలకు అంతులేదు. 1830 లార్డ్ హెస్టింగ్స్ వచ్చినప్పటికీ యాభైవేల మందివరకు పిండారి దండులలో ఉండేవారు.

1815లో ఇరవై అయిదువేల మంది తెనుగు కోస్తా తీరాలలో ప్రవేశించి మూడు వందల గ్రామాలవరకు ముట్టడించి కొల్లగొట్టి సర్వనాశము చేసివేసిరి మరొక జట్టు నిజాము ప్రాంతంలో ప్రవేశించి అక్కడ గ్రామాలను నాశనం చేసెను. హేస్టింగ్స్ పరిపాలనలోకి రాగానే ఈ పిండారీలను రూపు మాపవలెనని నిశ్చయించి లక్షాఇరవైవేల సైన్యంతో అటు నర్మదావైపు వీరిని తరిమివేసెను." (వెంకటసుబ్బయ్య, చింతలపాటి. 1960: 30).

1833లో లార్డ్ హెస్టింగ్ బందిపోటు దొంగలను రూపుమాపడానికి ప్రయత్నించడం పంతొమ్మిదవ శతాబ్దంలో దొంగతనాలు జరిగాయని చెప్పడానికి నిదర్శనం. ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందులేఖ నవలల్లో దారిదోపిడీలు, దొంగతనాలు జరిగిన సన్నివేశాయి చిత్రిమయ్యాయి. ప్రతాపముదలియార్ ఇంటి నుండి వెళ్లిన తరువాత తన భార్య జ్ఞానాంబాళ్‌తో కలిసి ఒక రోజు రాత్రి పొన్నూరు గ్రామ సమీపంలో ఒక చావడిలో బస చేస్తాడు. అక్కడ ప్రతాపముదలియార్‌పై దోపిడీ దొంగలు దాడి చేస్తారు. ఈ దాడిని ముందే పసిగట్టిన 'పుణ్యకోటిచెట్టి' దొంగల దోపిడి నుండి ప్రతాపముదలియార్, జ్ఞానాంబాళ్‌ని కాపాడతాడు. ఈ పుణ్యకోటిచెట్టి ప్రతాపముదలియార్ కుటుంబం వలన లాభం పొంది ఉంటాడు. అందుకు ప్రతిగా దేశ సంచారంలో ఉన్న ప్రతాపముదలియార్ పరివారాన్ని దొంగల బారినుండి కాపాడతాడు.

"మేము మాటాడుకుంటూ ఉండగా పడమర దిశగా తుపాకీ శబ్దం విని నేను చావడి తిన్నె వదిలి కిందకి దూకి ఆ దిశగా చూశాను. కొంత దూరంలో దివిటీల వెలుతురులో దొంగలు పెద్ద గుంపుగా రావడం చూసి అరుగు మీదకు ఎక్కి మా దగ్గర ఉన్న దీపం బయటికి తెలియ నీయకుండా మరుగున ఉంచి భగవంతుని మీద సకల భారాన్ని మోపి దొంగలు రాగానే వాళ్లకు ఇవ్వడానికి డబ్బులు ఉన్న పెట్టెలు దగ్గర పెట్టుకొని మరణాన్ని ఎదురుచూస్తున్న వారిలాగా భయంతో గజగజ వణుకుతున్నాము. జ్ఞానాంబాళ్ ఒకమూల కన్నీటి ప్రవాహంతో ధ్యానిస్తూ ఉంది." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 98).

దేవరాజ పిళ్ళై చెల్లెలి కూతురైన గుణరత్నం మెడలో ఉన్న బంగారాన్ని దొంగిలించడానికి ఒక దొంగ ప్రయత్నిస్తాడు."ఒక అమావాస్య రాత్రిపూట అనేక రత్నాభరణాలను వేసుకొని ఆ

అమ్మాయి తొట్టెలో పడుకొని నిద్రపోయింది. ఒక దొంగ నడిఝాములో ఎలాగో లోపలికి దూకి నగలను ఒలవడానికి ప్రాయాసపడి వీలు కానందున బయటకు తీసుకెళ్లి నగలను ఒలుచుకోవచ్చు అని భావించి ఆ పిల్లను మెల్లగా ఎత్తుకొని వీధి తలుపు తీసుకొని బయట పరుగెత్తడం ప్రారంభించాడు. ఆ శబ్దాన్ని విని మా బావమరిది మిగిలిన వాళ్లు మేలుకొని తొట్టెలో బిడ్డ కనిపించనందున వెంటనే దొంగను వెన్నంటి పరుగెత్తారు. ఆ దొంగ ముందు పరుగెత్తుతుండగా వీళ్లు చాలా దూరం అతని వెన్నంటే పరుగెత్తారు. ఆ దొంగ భయపడి సమీపంలోని అయ్యనార్ గుడిలో దూరి ఆ బిడ్డను విగ్రహం పాదం దగ్గర పడుకోబెట్టి, తాను విగ్రహం వెనుక దాక్కున్నాడు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 78).

ఇందులేఖ నవలలో ఉత్తరభారతదేశయాత్రకు వెళ్లిన మాధవుడు కలకత్తానుండి బొంబాయి వెళ్లడానికి రైలు ఎక్కుతాడు. మార్గ మధ్యమంలో అతన్ని గమనించిన షియా అలిఖాన్ అనే దొంగ మాధవున్ని మాటల్లో దింపి అతని పెట్టెను అపహరిస్తాడు. (జయప్రకాశ్, ఎస్(అ). 2016: 262)

శ్రీరంగరాజుచరిత్ర నవలలో శ్రీరంగరాజు ఇంటినుండి వెళ్లిపోయిన సందర్భంలో రాజు, రాకుమారున్ని ఎవరో దొంగలు చంపి శవాన్ని తీసుకుపోతున్నట్లుగా కలగంటాడు." (ఇనాక్, కొలకలూరి(సం). శ్రీరంగరాజుచరిత్ర. 2010: 78).

### 5.11.7. లంచగొండితనం

ఒక ఉద్యోగికి వచ్చేజీతం కాకుండా అదనంగా ప్రజల వద్ద నుండి తీసుకునే ధనాన్ని, కానుకలను లంచంగా చెప్పవచ్చు. పంతొమ్మిదవ శతాబ్దంలో పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, సివిల్ సర్వీసు వంటి నూతన పరిపాలనా విభాగాలు భారతదేశంలో ఏర్పడ్డాయి. ఈ విభాగాలలో పనిచేయడానికి ఉద్యోగులు అవసరమయ్యారు. దీనితో ఉద్యోగవర్గం ఏర్పడింది. ఈ ఉద్యోగులు తమకు వచ్చే జీతం కాకుండా అదనంగా ప్రజల వద్ద నుండి ధనాన్ని తీసుకున్న సన్నివేశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి.

ఇందులేఖ నవలలో ఒ. చందుమీనన్‌గారు ఒక రైల్వే స్టేషన్ మాస్టార్ గోపినాథ బెనర్జీ అనే వ్యాపారవేత్త నుండి ధనాన్ని బహుమానాలను తీసుకున్నట్టుగా వివరించారు. ఉత్తర భారత యాత్రలో ఉన్న మాధవుని పెట్టెని షియా అలిఖాన్ అనే దొంగ ఒక రైల్వే స్టేషన్‌లో దొంగలిస్తాడు. ఈ సందర్భంలో మాధవుడు తాను గోపీనాథ బెనర్జీ స్నేహితుడినని చెప్పగానే అతనికి అమిత మర్యాదలు చేస్తాడు."గోపినాథ బెనర్జీ పేరు వినగానే స్టేషన్ మాస్టారు ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. ఆ కోటీశ్వరునితో బాగా పరిచయం ఉన్నవారే ఈ స్టేషన్ మాస్టర్. పలు రకాలైన వస్తువులు ఈ స్టేషన్ గుండా వారి కోసం ప్రతీ దినము వచ్చి పోతుంటాయి. వారి దగ్గరి నుండి స్టేషన్ మాస్టారుకు దండిగా డబ్బు, బహుమతులు లభిస్తుంటాయి." (జయప్రకాశ్, ఎస్(అ). 2016:264) ఈ సంఘటన ప్రభుత్వ ఉద్యోగులలోని లంచగొండితనానికి నిదర్శనం.

ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో ఒక దర్జీవాని వద్ద ఒక రూపాయిని దొంగలిస్తూ ఒక దొంగ పట్టుబడతాడు. దేవరాజపిళ్ళై వద్ద అతను తన నేరాన్ని అంగీకరించి తాను చేసిన నేరము తప్పు కాదని ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉన్న లంచగొండితనం గురించి దేవరాజపిళ్ళైకి చెబుతాడు.

"అధికారులు ప్రతీ వ్యాజ్యాలలోనూ వాది, ప్రతివాది ఇరువురి దగ్గరి నుండి లంచం తీసుకొని దానిని సరిచేయడానికి ఇరు పక్షాలవారికి కొంత అనుకూలము, కొంత ప్రతికూలము చేస్తుంటారు. వారి కుటుంబ సభ్యులకి సరిపడ వస్త్రాలను జౌళి వ్యాపారులు ఇస్తూ ఉంటారు. అలాగే ఉప్పు మొదలుకొని కర్పూరం వరకు గల అన్ని వస్తువులను వ్యాపారులు ఉచితంగా ఇస్తుంటారు. మేము అమావాస్యనాడు మాత్రమే దొంగలించడానికి వెళ్తాము. ఈ అధికారులు అహోరాత్రులు దోపిడి చేస్తుండటం వల్ల వాళ్ల దోపిడిని మా దోపిడితో పోల్చడానికి వీలవుతుందా? మాంసాహారులైన కొంతమంది అధికారులు వాళ్ల అధికారానికి లోబడిన ఒక ఊరి నుండి మరొక ఊరికి వెళ్లేటప్పుడు చుట్టుప్రక్కల ఉన్న గొర్రెలు, మేకలు మొదలైన జంతువులు, కోడి, కొంగ మొదలైన పక్షులు హతమవుతుంటాయి. నవధాన్యలు, వరిగడ్డి మొదలైనవి కూడా గ్రామాలనుండి, మూటలు, మూటలుగా వస్తుంటాయి. ఆ మందలో పెద్ద భాగం అధికారులకు పోగ మిగిలిన వాటిని చిల్లర అధికారులైన క్షుద్ర దేవతలు భాగం పంచుకుంటారు." (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 141) ఈ మాటలు ప్రభుత్వ ఉద్యోగులలోని

లంచగొండి తనానికి నిదర్శనం. ఈ లంచగొండితనం పోవడానికి పరిష్కార మార్గాన్ని వేదనాయగం పిళ్ళైగారు నవలలోని 38వ అధ్యాయంలో సూచించారు. “లంచమిస్తున్నవారిని దండించాలి అనే చట్టాన్ని మనం అనుసరించకపోయినప్పటికీ ఒక ఉద్యోగి లంచం తీసుకుంటున్నాడనిగాని లేక వేరే దుష్కృత్యాలు చేస్తున్నడనిగాని అందరికి బహిరంగంగా తెలిసి ఉంటే దానిని గురించి సంపూర్ణ విచారణ జరిపి అతని మీద ఎవరూ ఫిర్యాదు చేయక పోయినప్పటికీ అతన్ని వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలి. రాజు దుర్మార్గులను, యోగ్యత లేని వారిని ఉద్యోగాల నుండి తొలగించడమే కాక యోగ్యులైన ఉద్యోగులను సదా గౌరవిస్తూ అభిమానిస్తూ ఉండాలి.” (జయప్రకాశ్, ఎస్(అ). 2008: 179).

ఇందిరాబాయి నవలలో సుందరరావు కేసు విచారణ సమయంలో పోలీసు జవానులు బొగ్గు, జారప్ప భీమారావు వద్దనుండి డబ్బులు తీసుకొని ఫౌజుదారు తమకు చెప్పిన విషయాలన్నీ భీమారావుకి చెప్తారు. అంతేగాక డబ్బు ఉంటే అన్ని పనులు జరుగుతాయని భీమారావుకు చెప్తారు. (వెంకటరావు, గుల్వాడి. 1962: 32) ఈ సంఘటన పోలీసులలోని లంచగొండితనానికి నిదర్శనం. ఈ విధంగా దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ప్రభుత్వ ఉద్యోగులలోని లంచగొండితనానికి సంబంధించిన సన్నివేశాలు చిత్రితమయ్యాయి. ఈ సన్నివేశాలు పంతొమ్మిదవ శతాబ్దంనాటి ప్రభుత్వ ఉద్యోగుల లంచగొండితనానికి నిదర్శనం.

### 5.11.8. భోగం మేళాలు

కందుకూరి వీరేశలింగం పంతులుగారు మొదటి వితంతు పునర్వివాహాన్ని జరిపించే సందర్భంలో వివాహ కార్యక్రమంలో ‘భోగంమేళాల’ ఏర్పాటు గురించి తనకి ఆ వివాహానికి వెయ్యి రూపాయలు విరాళంగా ఇచ్చిన రామకృష్ణయ్యకి మధ్య జరిగిన సంభాషణ గురించి తన స్వీయ చరిత్రలో వివరించారు.

“సంస్కార పారాయణులు చేసేడు వితంతు వివాహములకుగూడ బోగముమేళముల నుంచిరాయని సంస్కార ప్రియులకు సందేహము కలగవచ్చు. వితంతు వివాహపక్షమువారికి కార్యదర్శినయి వేశ్యల మేళములకు వెళ్లనని ప్రతిజ్ఞను గైకొన్న నీ విషయమున గొంచెము

సమాధానము చెప్పవలసియున్నది. వివాహ వ్యయముల నిమిత్తమయి రామకృష్ణగారు పంపిన వేయిరూపాయలు మా చేతిలో నున్నవి. తెలుగు దేశములో మొదటిదైన యీ వితంతు వివాహమును మహావైభవముతో జరపవలెనని మా పక్షమువారి అభిప్రాయం. భోగంమేళం లేక వివాహమునకు శోభ రాదని రామకృష్ణయ్యగారు మొదలైన వారందరును తలిచి యుండిరి. నేనును గవర్రాజుగారును మాత్రము భిన్న అభిప్రాయములై యుంటిమి. అయినను మా పక్షమువారిలోని ఎక్కువ సంఖ్యగలవారి యభిప్రాయమునుబట్టి భోగముమేళము పెట్టుటకు నిశ్చయింపబడి ముందుగా కొంత సొమ్మీయ బడినది. వివాహము జరగవలసిన స్థలము మాయిల్లు నృత్య గానములు సలుపుటకై వేశ్యగణాలను మా యింటిలోపలికి కదుగిడనీయనని నేను పట్టుపట్టితిని. మా యింటిలోపల నాది సర్వాధికారము అందుచేత ఊరేగింపు సమయమున భోగముమేళమును పెండ్లి పల్లకిముందు పెట్టుటకు నిశ్చయించి యట్లు గావించిరి." (వీరేశలింగం, కందుకూరి. 1911: 173). 1881నాటి వివాహ వాస్తవ పరిస్థితులకి ఈ సంభాషణ నిదర్శనం. కందుకూరి వీరేశలింగం పంతులుగారు వద్దని వారించిన ఆయన మాటలను పెడచెవిన పెట్టి మొదటి వితంతు పునర్వివాహంలో భోగం మేళాన్ని ఏర్పాటు చేసారు. ఈ సన్నివేశం వివాహ వేడుకలలో భోగం మేళాల ఏర్పాటుకు పంతొమ్మిదవ శతాబ్దంలో ఉన్న ప్రత్యేకతను గురించి తెలుతుంది. కేవలం వివాహ సందర్భంలోనే కాక అనేక శుభకార్యాలలో వినోదం కోసం భోగం మేళాలు ఏర్పాటు చేసేవారు. ఈ భోగం మేళాల నృత్యాలను చూసి అందరూ ఆనందించేవారు. వివాహ సమయంలో భోగం మేళాల ఏర్పాటు సామాజిక స్థాయికి గుర్తింపుగా ఉండేది. భోగంమేళాలు ఏర్పాటు చేసిన పెళ్లి గొప్ప పెళ్లిగా గుర్తించబడేది. ఒకవేళ వివాహం జరిగే ఊరిలో భోగం మేళాలు లేకుంటే వేరే ఊరి నుండి భోగం మేళాలను తెప్పించేవారు. వివాహానికి అయ్యే ఖర్చులలో అధికభాగం భోగం మేళాలకు వెచ్చించేవారు. ఈ అంశాల ప్రస్తావన ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది.

నరసింహశాస్త్రి కూతురి పెళ్లి జరిగిన విధానాన్ని గురించి అంబాబాయి, భీమారావు మధ్య సంభాషణ జరుగుతుంది. ఈ సంభాషణ వివాహ సమయంలో భోగం మేళాలకి ఉన్న ప్రత్యేకతని తెలుపుతుంది.

"**అంబాబాయి:** ఇప్పటికాలంలో ఉన్న ఒక్క మెతుకు గంజిలో పోయినట్లు. వివాహ ఖర్చుల నిమిత్తం దాచిన డబ్బు వేశ్యల ఆటలకే సరిపోతుంది.

**భీమారావు:** శాస్త్రిగారు రాజామణి, భామామణి మొదలైనవారి మేళాన్ని తానే స్వయంగా పిలుచుకొని వెళ్లారు. ఈ ఊరిలో ఉన్న మేళాలలో అదే గొప్ప మేళమట.

**అంబాబాయి:** ఏంటి తనతోపాటే తీసుకొని వెళ్లారా? అట్లయితే డబ్బు చాలా ఖర్చవుతుంది." (వెంకటరావు, గుల్వాడి. 1962: 6, 7)

ఇందిరాబాయి నవలలో అనేక సందర్భాలలో భోగంమేళాల ప్రస్తావన కనిపిస్తుంది. ఈ భోగంమేళాల వారిని ఆశ్రయించి తాను జీవించే దానినని 'దేవకి' అనే పాత్ర చెబుతుంది. (వెంకటరావు, గుల్వాడి. 1962: 11) ఇందిరాబాయి, విఠలరావుల వివాహం జరిగే సందర్భంలో భోగంమేళాలను ఏర్పాటు చేస్తారు. దీపావళి ఉత్సవాలలో భోగంమేళం స్త్రీలను చూసి విఠలరావు మోహిస్తాడు. ఫలితంగా ఇందిరాబాయి పుష్పవతి అయ్యే సమయానికి సుఖవ్యాధి బారిన పడి మరణిస్తాడు. వినోదం కోసం ఏర్పాటు చేసిన భోగం మేళం చివరికి వరుని మరణానికి కారణమవుతుంది. ఈ వృత్తాంతం వివాహాది శుభకార్యాలలో భోగంమేళాలను ఏర్పాటు చేయకూడదనే సందేశాన్ని ఇస్తుంది.

### 5.11.9. వితంతుస్త్రీ – కష్టాలు

భర్తచనిపోయిన స్త్రీ 'వితంతువు'. వితంతు స్త్రీ పంతొమ్మిదవ శతాబ్దం నాటి సమాజంలో అనేక అవమానాలకు గురికావడం జరిగింది. వితంతువుగా మారిన స్త్రీ మంచి బట్టలను ధరించకూడదు. జుట్టును పెంచుకోకూడదు. బయట తిరగకూడదు. శుభకార్యాలకు వెళ్లకూడదు వంటి అనేక సామాజిక, వైయక్తిక ఆంక్షలు విధించబడ్డాయి. బాల్యవివాహాలు విరివిగా జరగడం. ఈ బాల్య వివాహాలలో అభం శుభం తెలియని చిన్నపిల్లలని ముసలివాళ్లకి ఇచ్చి వివాహం చేయడం వల్ల వితంతువుల సంఖ్య పెరిగింది. "1901లో దేశంలో పాతికేళ్ళలోపు బాలవితంతువులు 12లక్షలమంది ఉన్నట్లు జనాభా లెక్కలు చెప్పాయి. ఇలాంటి వితంతువులకి పునర్వివాహం చేయడానికి కందుకూరి వీరేశలింగంపంతులు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి సంఘసంస్కర్తలు పూనుకున్నారు." (వీరేశలింగం, కందుకూరి. 2013: 5) ఈ సందర్భంలో "ఇంచుక విద్యాగంధముగల వితంతువులు కొందరు తమ్ము వైధవ్య దుఃఖమునుండి కాపాడవలసినదని నాకు ఉత్తరము రాసిరి." (వీరేశలింగం, కందుకూరి. 2013: 40) అంటూ బాలవితంతువులు తమ కష్టాలను తెలుపుతూ తనకు ఉత్తరాలు రాసినట్లు కందుకూరి

వీరేశలింగం పంతులుగారు పేర్కొన్నారు. బాలవితంతువులకు వివాహం జరిపించే విషయంలో వీరేశలింగంపంతులుగారి కృషి గొప్పది. విరాళాలు సేకరించి, తన సొంత డబ్బును వెచ్చించి, వీరేశలింగం పంతులుగారు వితంతు వివాహాలు జరిపించారు. వితంతువుగా మారిన స్త్రీ పడిన బాధలు ఇందిరాబాయి నవలలో గుల్వాడి వెంకటరావుగారు వివరించారు. వితంతువుగా మారిన స్త్రీ ఎదురుగా వస్తే వెళ్లే కార్యంలో శుభం జరగదని భీమారావు తమ ప్రయాణాన్ని ఆపుకుంటాడు.

"ఆ తరువాత భీమారావు, త్రయంబకరావు, వెంకటరావు, పొక్కుసెట్టి మొదలైన వారంతా ఒక ఎద్దులబండిలో అంబాబాయి, చంద్రభాగి, ఇందరాబాయి వీళ్లు ఇంకో ఎద్దుల బండిలో కూర్చుండి విఠలరావు ఉన్న బంగళావైపు వెళ్లడానికి బండ్లను తిప్పి వీధివాకిలి వరకు వచ్చే సమయానికి అకస్మాత్తుగా విభూతిని ధరించిన పార్వతి అనే విధవస్త్రీ తలపై కొంగు కప్పుకొని ఎదురుగా వచ్చింది. భీమారావు! అయ్యో ఈ అవలక్షణ ముండ ఎక్కడి నుండి వచ్చిందబ్బా! ఏదైనా పని నిమిత్తం బయటికి వెళ్లేటప్పుడు ఈమె ఎదురుగా వస్తే ఆ పని నెరవేరదు. వెనక్కివెళ్లి కొద్దిసేపు కూర్చుని మళ్లీ ప్రయాణాన్ని ప్రారంభించడమే దీనికి నివృత్తి." అని చెప్పగానే అందరు వెనక్కి తిరిగి ఇంటికి వచ్చి ఐదు నిమిషాలు కూర్చుండి ఆ తరువాత మళ్లీ ఎద్దుల బండిలో కూర్చుని బంగళాకి చేరుకున్నారు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 129).

### 5.11.9.1. కేశఖండనం

విఠలరావు మరణించిన తరువాత 'కాశీనాథబట్టరు' భీమారావువద్ద "భర్త మరణించాడు, కాబట్టి ఇందిరాబాయికి కేశఖండనం జరిపించాలి" అంటాడు. భీమారావు అది ఖచ్చితంగా జరిపించాలా ఒకవేళ కేశఖండనం జరిపించకుంటే ఏమౌతుంది అని అడుగుతాడు. అందుకు కాశీనాథబట్టరు "పతి మరణించిన తరువాత పత్ని కేశచ్ఛేదనం చేసుకోకుండా స్నానం చేస్తే ఒక్కొక్కసారి స్నానం చేసిన తరువాత ఆమె ఒక్కో వెంట్రుక నుండి ఎన్ని నీటి బిందువులు నేలమీద పడతాయో అన్ని సంవత్సరాలు ఆమె భర్త నరకంలో యాతన అనుభవిస్తాడని శాస్త్రంలో ఉంది." (వెంకటరావు, గుల్వాడి. 1962: 150) అంటాడు. ఆ మాటలు విన్న భీమారావు మౌనం వహిస్తాడు. ఈ అంశం భర్తచనిపోయిన తరువాత భార్యకి 'కేశఖండనం' జరిపించిన విధానానికి నిదర్శనం.

### 5.11.9.2. ఆహార్యం – ఆంక్షలు

భర్తను కోల్పోయిన స్త్రీ తెల్లదుస్తువులనే ధరించాలి. తలదువ్వుకోకూడదు, చదువుకోకూడదు. వైరాగ్యాభావాలను కలిగి ఉండాలి వంటి ఆంక్షలు ఉండేవి. ఈ ఆంక్షలకి విరుద్ధంగా ఇందిరాబాయి నల్లటి వస్త్రాలను ధరిస్తుంది. తలదువ్వుకుంటుంది. అది గమనించిన అంబాబాయి "ఏంటమ్మా నీవిప్పుడు చిన్నపిల్లవి కాదు. పూర్వీకుల ఆచారానికి విరుద్ధంగా నడుచుకోరాదని నీకెంత చెప్పినప్పటికీ నీవు తలదువ్వుకోవడం నల్లటి చీర కట్టుకోవడం, రవిక తొడుగుకోవడం వంటి సిగ్గు చేటుపనులను చేస్తున్నావు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 152) అంటుంది. ఈ మాటలువిన్న ఇందిరాబాయి తాను చేసిన తప్పేంటో తెలియక తాను అలా ఎందుకు చేయవలసి వచ్చిందో తల్లికి చెబుతుంది.

"అమ్మా ఎక్కువ రోజుల నుండి తల దువ్వక పోవడంవల్ల తలలో మట్టి నిండి పేన్లు పెరిగాయి. పేన్లు కుట్టడంవల్ల రాత్రి వేళలో నిద్ర పట్టడంలేదు. తలకి నూనె పెట్టక పోవడం వల్ల కళ్లు మంట మండుతున్నాయని, కొంచెం నూనె పెట్టి దువ్వుకున్నాను. రవిక లేకుండా ఉండడం యోగ్యం కాదని రవికని తొడగుకున్నాను. ఇవి సిగ్గుచేటు పనులని నాకు తెలియదు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 152). ఈ మాటలు పంతొమ్మిదవ శతాబ్దంలో వితంతువులు అనుభవించిన కష్టాలకు నిదర్శనాలు.

### 5.11.10. వితంతు పునర్వివాహం

స్త్రీవిద్య, వితంతు పునర్వివాహం దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని ప్రధాన కథా వస్తువులు. ఇందులేఖ, ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో ఇందులేఖ, జ్ఞానాంబాళ్ చదువుకొని ఉండడం వల్ల అనేక కష్టాలనుండి బయటపడతారు. ఈ అంశాలు స్త్రీ విద్య ఆవశ్యకతను గురించి తెలుపుతున్నాయి. ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయికి బాల్య వివాహం జరిగుతుంది. బాల వితంతువుగా మారిన ఇందిరాబాయి అనేక కష్టాలను అనుభవిస్తుంది. చదువుకొని తల్లిదండ్రులని ఎదిరించి తాను ఇష్టపడ్డ భాస్కరరావుని వివాహం చేసుకుంటుంది. ఈ సంఘటనలు వితంతు పునర్వివాహం ఆవశ్యకతని తెలుపుతున్నాయి.

వితంతు పునర్వివాహం నేడు సామాన్య అంశమే అయినా పంతొమ్మిదవ శతాబ్దంలో అది విప్లవాత్మకమైన మార్పు. ఈ మార్పుని ఆనాటి సమాజం పూర్తి స్థాయిలో అంగీకరించలేదు. దీనికి వితంతు పునర్వివాహాలు చేయడానికి నడుం బిగించిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి మీద జరిగిన దాడులు నిదర్శనం.

"దౌర్జన్యము చూపి ప్రతిపక్షాలు నన్ను మర్ధింప యత్నించుట ఒక్క కాకినాడలోనే కాదు, నా స్వస్థలమైన రాజమంహేంద్రవరంలో సహితమట్టి ప్రయత్నమొకసారి జరిగినది. చెన్నపట్టణము వంటి రాజధాని నగరంలోనే స్త్రీల పునర్వివాహం గూర్చి చాకలి పేటలో నేను ఉపాన్యాసమిచ్చుచున్న సమయమునందచ్చట వైష్ణవ బ్రాహ్మణులు దొమ్మిచేసి నా పైన పడబోగ రావు బహద్దూర్ శ్రీ వనస్పాకము అనంతచార్యులవారు నను తప్పించి తమ బండిలో ఎక్కించుకొని వచ్చినప్పుడు మూఢులిట్టి దౌర్జన్యమునకు గడగుట ఒక వింత కాదు." (వీరేశలింగం, కందుకూరి. 2013: 38). ఈ విధంగా ఎంతోమంది ఆనాడు వితంతు పునర్వివాహాన్ని వ్యతిరేకించారు. చదువుకున్నవారు, సమాజ అభివృద్ధిని కాంక్షించేవారు వితంతు పునర్వివాహాలను సమర్థించారు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని కందుకూరి వీరేశలింగం పంతులుగారు మొదటి వితంతు పునర్వివాహాన్ని 1881 డిసెంబర్ 11న రాజమండ్రిలో జరిపించారు. 1882 అక్టోబరు 22నాటికి మూడు వితంతుపునర్వివాహాలు జరిపించారు. ఈ వివాహాలు జరిపించే క్రమంలో తాను ఎదుర్కొన్న సాదక, బాధల గురించి కందుకూరి వీరేశలింగం పంతులుగారు తన స్వీయ చరిత్రలో వివరంగా వర్ణించారు.

"ఈ వివాహ మహోత్సవమును జూచుటకు యారాత్రి మాపట్టణములోని యూరోపీయనులు సహిత యందఱును దయచేసిరి. అల్లరి జరగకుండ వారించుటకై రక్షకభటుల ఱువది మంది నిలిచి జాగురూకులై కావలి గాజుచుండిరి. మండల రక్షకభట శాఖాధ్యక్షుడే స్వయముగా నుండి తగిన ఏర్పాట్లు చేయుచుండెను. సంయుక్త దండ విధాయకుడే స్వయంగా రక్షణ క్రమమును విచారించుచుండెను. అందుచేత నాటివివాహము జయప్రదముగా జరిగెను." (వీరేశలింగం, కందుకూరి. 1911: 174) మొదటి వితంతు పునర్వివాహం జరిగే సందర్భంలో ఆనాడు ఉన్న వాస్తవ పరిస్థితులకి ఈ వర్ణన నిదర్శనం. ఇలాంటి వర్ణన ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయి పునర్వివాహ సందర్భంలో కనిపిస్తుంది.

"కమలాపురంలో ఇది మొదటి విధవ వివాహం కావడంవల్ల వధూవరుల కీర్తి అందరూ విన్నందువల్ల ఆ దంపదులను కళ్ళార చూడలనే కుతూహలంతో అందరి ఇళ్లలో ఉన్న స్త్రీలు, పురుషులు తమ పిల్లలతో సహా వివాహాన్ని చూడడానికి వచ్చారు. సర్థార్ సహాయబ్, దొరసాని, మిషనరీ పాదరీలు, ఇతర జాతులకు చెందిన అనేక మంది ప్రజలు ముహూర్త సమయానికి ముందే అక్కడికి వచ్చి చేరుకున్నారు. అమృతరావు వారినందరిని సన్మానించి తగిన స్థానాలలో కూర్చోబెట్టాడు." (వెంకటరావు, గుల్వాడి. 1962: 240). ఈ వర్ణన పంతొమ్మిదవ శతాబ్దం నాటికి వితంతువివాహానికి ఉన్న ప్రాముఖ్యతని తెలుపుతుంది.

*****

# ముగింపు

పంతొమ్మిదవ శతాబ్దం నాటి సాంఘిక దురాచారాలను ఆనాటి ప్రజలకి తెలియపరచడానికి సాహిత్య రచనలు మాధ్యమంగా నిలిచిన విధానం తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలల తులనాత్మక పరిశీలన ద్వారా స్పష్టమౌతుంది. ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన నరహరి గోపాలకృష్ణమ సెట్టిగారు అనేక ప్రాంతాలలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి డిప్యుటీ కలెక్టర్ గా పదవీ విరమణ పొందారు. తన జీవిత కాలంలో తాను చూసిన అనేక సామాజిక సమస్యలలో వేశ్యాలంపటత్వం, బహుభార్యత్వం, మూఢనమ్మకాలు, వర్ణవ్యవస్థ–వ్యధ, మొదలైన అంశాలను కథా వస్తువుగా స్వీకరించి శ్రీరంగరాజుచరిత్ర నవల రచించారు. ఇదే విధంగా కర్ణాటక ప్రాంతంలో పోలీసు శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసిన గుల్వాడి వెంకటరావుగారు వితంతు పునర్వివాహం, వేశ్యా లంపటత్వం, మూఢ నమ్మకాలు మొదలైన అంశాలను కథావస్తువుగా స్వీకరించి ఇందిరాబాయి నవల రచించారు. తమిళ ప్రాంతంలో ప్రభుత్వ న్యాయమూర్తిగా పనిచేసిన వేదనాయగం పిళ్ళైగారు స్త్రీ అవిద్య, అత్తవారింట్లో స్త్రీలు పడే కష్టాలు, వర్ణ వ్యవస్థ–వ్యధ మొదలైన అంశాలను కథా వస్తువుగా స్వీకరించి ప్రతాపముదలియార్ చరిత్ర నవల రచించారు. మలయాళ ప్రాంతంలో ప్రభుత్వ న్యాయమూర్తిగా పనిచేసిన ఒ. చందుమీనన్ గారు తన కాలం నాటికి ప్రధాన సామాజిక సమస్యగా ఉన్న నాయర్ లపై నంబూద్రిల ఆధిపత్యాన్ని ప్రధాన కథావస్తువుగా స్వీకరించి ఇందులేఖ నవల రచించారు. ఇలా ఈ నవలలన్నీ ఆ నాటి సామాజిక సమస్యల నేపథ్యంగా వెలువడ్డాయి. శ్రీరంగరాజు చరిత్రలో నరహరి గోపాల కృష్ణమసెట్టిగారు తెలుగు ప్రాంతంలో ఉన్న సామాజిక సమస్యలను వివరించారు. గుల్వాడి వెంకటరావుగారు ఇందిరాబాయి నవలలో కన్నడ ప్రాంత సమస్యలని చెప్పడంతోపాటు ఆ సమస్యలవల్ల కలిగే నష్టాన్ని పాత్రల సంభాషణ ద్వారా చెప్పి సమస్యలతో కలిగే నష్టాన్ని పాఠకులకి తెలిపారు. వేదనాయగం పిళ్ళైగారి ప్రతాపముదిలియార్ చరిత్రలో సాంఘిక సమస్యల సుధీర్ఘవర్ణన, భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని వ్యాఖ్యానించడం కనిపిస్తుంది. ఒ. చందుమీనన్ గారి ఇందులేఖ నవలలో నంబూద్రి, నాయర్ల గొడవ నేపథ్యంగా మలయాళ సమాజ వర్ణణ కనిపిస్తుంది. మొత్తం మీద ఈ నాలుగు నవలలు పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఉన్న సామాజిక అంశాలకు డాక్యుమెంటరి చిత్రాలవంటివి.

పంతొమ్మిదవ శతాబ్దంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంగా దక్షిణ భారతీయ భాషలలో నవలా సాహిత్యం ఆవిర్భవించింది. నవల ఆవిర్భావ పూర్వ పరిస్థితులు తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో ఒకే విధంగా ఉన్నాయి. ప్రక్రియ పరంగా నవల ఆవిర్భావం, నవల నిర్మాణం, నవల కథ, నవల కథావస్తువు మొదలైన అనేక అంశాలలో దక్షిణ భారత తొలి సాంఘిక నవలల మధ్య సామ్యం కనిపిస్తుంది. మిగిలిన భారతీయ భాషలలో కూడా ఈ సామ్యం ఉండి ఉండవచ్చు. మిగతా భారతీయ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలలని తులనాత్మకంగా పరిశీలించిన సందర్భంలో అనేక నూతన అంశాలు వెలుగు చూసే అవకాశం ఉంది. భారతీయ భాషలలో తొలి నవల ఎప్పుడు ఆవిర్భవించింది, భారతీయ భాషలలో తొలి సాంఘిక నవల ఎప్పుడు వెలువడింది, వంటి అంశాల ఊహాప్రతిపాదన నేపథ్యంగా ఈ రంగంలో అనేక పరిశోధనలు భవిష్యత్తులో రావడానికి ఆస్కారం ఉంది.

*****

# పరిశోధన ఫలితాలు

దక్షిణ భారతీయ భాషల్లో (తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం) వచ్చిన తొలి సాంఘిక నవలల్ని ఐదు అధ్యాయాలలో తులనాత్మకంగా పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో అనేక నూతన అంశాలు వెలుగు చూశాయి. అధ్యాయాల వారీగా పరిశోధన ఫలితాలని ఇక్కడ పేర్కొనడం జరుగుతున్నది.

**1. మొదటి అధ్యాయం - దక్షిణ భారతీయ సాహిత్యం - నవల**

దక్షిణ భారతీయ భాషలలో నవల మొదట తెలుగులో వచ్చి ఉండవచ్చు అన్న ఊహా ప్రతిపాదిత అంశం ఆధారంగా ఈ అధ్యాయాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ ఊహా ప్రతిపాదిత అంశానికి ఆధారాలు సేకరించే క్రమంలో అనేక నూతన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

1.1. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో నవల ఆవిర్భావానికి పూర్వం ఒకే విధమైన సామాజిక పరిస్థితులు ఉన్నాయి. ఈ అంశాన్ని ఉదాహరణలతో సహా ఈ పరిశోధనలో సిద్ధాంతీకరించడం జరిగింది. పారిశ్రామిక విప్లవంలో భాగంగా విదేశీయులరాక, మత ప్రచారంలో భాగంగా అచ్చు యంత్రాన్ని, ఆంగ్ల విద్యని స్థానికంగా ప్రవేశ పెట్టడం, స్థానికులు ఆంగ్ల విద్యని అభ్యసించడం, సాహిత్యం ప్రాచీన రూపాన్ని వీడి ఆధునిక గద్య రూపాన్ని ధరించడం, నవల ఆవిర్భావం. ఈ రకమైన పరిణామక్రమం తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలన్నింటిలో కనిపిస్తుంది.

1.2. దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవల తెలుగులో వచ్చినట్లు ఈ పరిశోధనలో సిద్ధాంతీకరించడం జరిగింది. తమిళంలో వెలువడిన తొలి నవల, తొలి సాంఘిక నవల 'ప్రతాపముదలియార్ చరిత్ర' (1879). దీని కర్త వేదనాయగం పిళ్ళై. మలయాళంలో వెలువడిన తొలి నవల 'కుందలత' (1887). దీని కర్త అప్పునెదుంగడి. మలయాళంలో వెలువడిన తొలి సాంఘిక నవల 'ఇందులేఖ' (1889). ఇందులేఖ నవల కర్త ఒ. చందుమీనన్. కన్నడ భాషలో తొలి నవల నిర్ణయం పై సందిగ్ధం ఉంది. యాదవ కవి రచించిన 'కళావతి పరిణయ' (1815),

కృష్ణరాజ ఒడయార్ రచించిన 'సౌగంధికాపరిణయ' (1829), కెంపునారాయణ రచించిన 'ముద్రామంజూశ' (1823) నవలల్లో తొలి నవల ఏది అన్న సందిగ్ధం కన్నడ భాషలో ఉంది. 'కళావతిపరిణయ' ఆధునిక గద్యానికి దగ్గరగా వెలువడిన రచనగా కన్నడ విమర్శకులు గుర్తిస్తున్నారు. కృష్ణరాజ ఒడయార్ రచించిన 'సౌగంధికాపరిణయ' (1829) వెయ్యి పుటలు కలిగిన వచన ప్రబంధం. "దీన్ని కన్నడ విమర్శకులు పూర్తిస్థాయి నవలగా కాక నవలకి భూమికగా నిలిచిన గద్య ప్రబంధంగా పేర్కొంటున్నారు" (సుందరం, ఆర్వీయస్. 1977:180). "ముద్రామంజూశను సంస్కృత ముద్రారాక్షసం నాటకం ఆధారంగా కెంపూ నారాయణ రచించారు" (శేషగిరిరావు, ఎల్. ఎన్. 2013: 124). ఈ కృతికి మూలం విశాఖ దత్తుని సంస్కృత ముద్రారాక్షసం. అందువల్ల ఈ రచనని తొలి కాదాంబరిగా కాక ఐతిహాసిక, చారిత్రక కాదాంబరికి మార్గదర్శకత్వం ఇచ్చిన రచనగా కన్నడ విమర్శకులు గుర్తిస్తున్నారు. ఈ తొలి నవలలని సేకరించే ప్రయత్నంలో భాగంగా బెంగళూరు, మైసూరులో ఉన్న విశ్వవిద్యాలయాలను, పుస్తకశాలలను సందర్శించడం జరిగింది. అనేక ప్రయత్నాల అనంతరం కృష్ణరాజ ఒడయార్ రచించిన 'సౌగంధికాపరిణయ' (1829) రచనని సేకరించ గలిగాను. ఈ రచనని క్రీ.శ. 1909లో ఆర్యమత గ్రంథ ప్రార్థన సభ మేనేజర్ ''గుండ్ల పండిత లక్ష్మీనారాయణాచార్య' అచ్చు వేశారు. వెయ్యి పుటల నిడివి కలిగిన ఈ రచన ప్రాచీన కావ్య సంప్రదాయానుసారం వెలువడింది. మిగతా తొలి రచనలు లభించలేదు. ఈ తొలి ప్రయోగాలపై పూర్తిస్థాయి పరిశోధన జరిగితేగాని తొలి కన్నడ నవలపై స్పష్టత రాదు. కన్నడ తొలి నవల పై ఉన్న అస్పష్టత కన్నడ తొలి సాంఘిక నవలపై లేదు. గుల్వాడి వెంకటరావుగారు రచించిన 'ఇందిరాబాయి' (1899) నవలని కన్నడ తొలి సాంఘిక నవలగా కన్నడ విమర్శకులు గుర్తిస్తున్నారు.

తెలుగు తొలి నవలపై సందిగ్ధం ఉంది. తడకమళ్ల రామకృష్ణ కవి రచించిన 'కంబుకంధరచరిత్ర' (1866), కొక్కొండ వెంకటరత్నం పంతులు రచించిన 'మహాశ్వేత' (1867), నరహరి గోపాలకృష్ణమ సెట్టి రచించిన 'శ్రీరంగరాజుచరిత్ర' (1872), కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన 'రాజశేఖరచరిత్ర' (1878), నవలల్లో తొలి తెలుగు నవల ఏది అన్న సందిగ్ధం ఉంది. ఈ సందిగ్ధం పై జరిగిన పూర్తి చర్చ సిద్ధాంత గ్రంథంలో వివరించడం

జరిగింది. కొక్కొండ వెంకటరత్నం పంతులు రచించిన 'మహాశ్వేత' (1867) నవల నేటికి అలభ్యం, అసంపూర్ణం, సంస్కృతానువాదం. ఈ కారణాల వల్ల డా. అక్కిరాజు రమాపతిరావు గారు మహాశ్వేత తొలి తెలుగు నవల కాదని నిరూపించారు. నాకున్న పరిధులకి లోబడి మహాశ్వేత నవలని సంపాదించడానికి ప్రయత్నించాను కాని మహాశ్వేత నవల లభించలేదు.

డా. సంగిసెట్టి శ్రీనివాస్ గారు, కంబుకంధరచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, "తొలి తెలుగు నవల కంబుకంధరచరిత్ర (1866), మద్రాసు లైబ్రరీలో అందుబాటులో ఉన్న ఈ నవలను పునర్ముద్రించినట్లయితే తెలుగు పాఠకులకు తొలి నవల అందుబాటులోకి వస్తుందని" పేర్కొన్నారు (వెంకటేశ్వరులు, పంతంగి(సం). 2014:22). ఈ నవల సేకరించే ప్రయత్నంలో నేను మద్రాసు లైబ్రరీని సందర్శించడం జరిగింది. అక్కడ క్యాటలాగులో *D.No. 433P* (కంబుకంధర చరిత్ర) *Kambukundhara Charitra by Tadakamalla venkata Krishna Rao. D.No. 1401. P.* (కామరూపకథ) *Kamarupakatha* by *Tadakamalla venkata Krishna Rao* అని పుస్తకాల పేర్లు ఉన్నాయి కాని పుస్తకాలు అందుబాటులో లేవు. ఈ నవల గురించి సంగిసెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, ముదిగంటి సుజాతరెడ్డి వంటి పరిశోధకులు పేర్కొన్నారు. కాని ఈ నవల నేటికి అందుబాటులో లేదు. ఇప్పటి వరకు లభిస్తున్న ఆధారాలను బట్టి ముద్రితమైన, అందరికీ అందుబాటులో ఉన్న తొలి తెలుగు సాంఘిక నవల శ్రీరంగరాజుచరిత్ర (1872). దక్షిణ భారతీయ భాషలలో మొదట తెలుగు (శ్రీరంగరాజుచరిత్ర-1872), తరువాత తమిళం (ప్రతాపముదిలియార్ చరిత్ర-1879), తరువాత మలయాళం(ఇందులేఖ-1889), ఆ తరువాత కన్నడ (ఇందిరాబాయి-1899) భాషలలో తొలి సాంఘిక నవలలు వచ్చాయి. శ్రీరంగరాజుచరిత్ర(1872) కాల ప్రాతిపదికగా దక్షిణ భారతీయ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవల.

**2. రెండవ అధ్యాయం**

**దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - రచయితలు సామాజిక నేపథ్యం — తులనాత్మక పరిశీలన.**

2.1. రచయితల జీవిత విశేషాలు రచనపై చూపే ప్రభావాన్ని ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

2.2. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ ప్రాంతాలలో ఒకే రకమైన సామాజిక పరిస్థితుల నేపథ్యంలో రచయితలు తొలి సాంఘిక నవలల్ని రచించారు.

2.3. జననం, విద్యాభ్యాసం, లంచం–వ్యతిరేకత, రచనలు, సామాజికస్పృహ మొదలైన జీవిత విశేషాలలో రచయితల మధ్య సామ్యం ఉంది.

2.4. ఈ రచయితలు నడయాడిన ప్రాంతాలు వేరైనా తొలి సాంఘిక నవలల్ని రచించడానికి వారిని పురిగొల్పిన సంఘటనల మధ్య సామ్యం కనిపిస్తుంది.

**3. మూడవ అధ్యాయం.**

**దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - ఇతివృత్తం - తులనాత్మక పరిశీలన.**

3.1. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలల్లో కుటుంబ కలహాలతో కూడిన కథ చెప్పబడింది. ఒకే కుటుంబంలోని అంతర్గత కలహాలతో కూడిన కథ శ్రీరంగరాజుచరిత్ర, ఇందులేఖ నవలల్లో ఉంది. రెండు కుటుంబాల మధ్య గొడవలతో కూడిన కథ ఇందిరాబాయి, ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో ఉంది.

3.2. శ్రీరంగరాజుచరిత్ర, ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో వాస్తవిక కథనం రూపంలో కథ ప్రస్తుతీకరించబడింది. ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో అంతర్గత కథనం కనిపిస్తుంది.

3.3. విశ్వజనీనత, చిత్తరంజకత, సంభావ్యతా వంటి నవల కథా లక్షణాలు దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపిస్తాయి. ఈ అంశాలు తొలి సాంఘిక నవలల్లో నిబిడీకృతమైన నవలా లక్షణాలకు నిదర్శనం.

3.4. దక్షిణ భారతీయ భాషల్లోని తొలి సాంఘిక నవలలన్నింటిలో ఇతివృత్తం అధ్యాయాలుగా విభజింపబడి ఉంది.

3.5. కథా కథనంలో ప్రతాపముదలియార్ చరిత్ర ఉత్తమపురుష దృష్టికోణంలో రచించబడగా, ఇందిరాబాయి, ఇందులేఖ, శ్రీరంగరాజుచరిత్ర నవలల్లో సర్వసాక్షి దృష్టికోణం కనిపిస్తుంది.

3.6. సంభాషణాశ్రిత, చేష్టాగత సన్నివేశాలు దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో ఉన్నాయి.

3.7. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో కథానాయకుని దేశసంచారం, వేట, కథానాయిక అపహరణ, కొలనుగట్టుపై ప్రజలు ప్రాపంచిక విషయాలగురించి మాట్లాడుకోవడం వంటి సన్నివేశాలు ఉన్నాయి.

3.8. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర, మలయాళ ఇందులేఖ నవలల్లో సుదీర్ఘవర్ణనలు ఉండగా కన్నడ ఇందిరాబాయి, తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో తక్కువ నిడివితో కూడిన వర్ణనలు ఉన్నాయి.

3.9. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో నవలలోని ప్రధాన పాత్రల పేర్లను నవలలకి శీర్షికలుగా గ్రహించడం జరిగింది. పురుష పాత్రల పేర్లతో శ్రీరంగరాజుచరిత్ర, ప్రతాపముదలియార్ చరిత్ర నవలలు వెలువడగా స్త్రీ పాత్రల పేర్లతో ఇందిరాబాయి, ఇందులేఖ నవలలు వెలువడ్డాయి.

3.10. తెలుగు, తమిళ, కన్నడ తొలి సాంఘిక నవలలకి రెండు పేర్లు ఉన్నాయి. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలకి 'సోనాబాయిపరిణయం' అన్న మరో పేరు ఉంది. కన్నడ

ఇందిరాబాయి నవలకి 'సద్ధర్మవిజయ' అన్న మరో పేరు ఉంది. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలకి 'సుగుణసుందరీ చరిత్రము' అన్న మరో పేరు ఉంది. మలయాళ ఇందులేఖ నవలకి రెండు పేర్లు లేవు. ఈ విధంగా నవలలకి రెండు పేర్లు ఉండటం నవలా రచన ప్రారంభ దశకి నిదర్శనం.

3.11. పుర వర్ణనతో నవల ప్రారంభం కావడం, పుర వర్ణనలో భాగంగా నవలా రచనా కాలంనాటి సామాజిక అంశాలను పాఠకులకి అందించడం, వంటి లక్షణాలు శ్రీరంగరాజుచరిత్ర, ఇందిరాబాయి, ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో కనిపిస్తాయి. మలయాళ ఇందులేఖ నవలలో పురవర్ణన కనిపించదు.

3.12. ఆంగ్లభాషా పద ప్రయోగం, ధ్వన్యనుకరణ పదాల ప్రయోగం, సామెతలు, గేయాలు, శ్లోకాలతోకూడిన రచనా విధానం దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపిస్తుంది.

**4. నాల్గవ అధ్యాయం.**

**దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - పాత్రచిత్రణ – తులనాత్మక పరిశీలన.**

4.1. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో ప్రత్యక్ష లేదా వర్ణనాత్మక పద్ధతి ద్వారా పాత్రల భౌతిక, మానసిక ప్రవృత్తిని రచయితలు పాఠకులకు అందించారు.

4.2. పాత్రల ఆహార్యం మానసిక ప్రవృత్తిని రచయిత తన మాటల ద్వారా పాఠకులకు అందించడం తెలుగు శ్రీరంగరాజుచరిత్ర, కన్నడ ఇందిరాబాయి, మలయాళ ఇందులేఖ నవలల్లో కనిపిస్తుంది. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో నవలా అంతర్గత పాత్ర ప్రతాపముదలియార్ నవలలోని మిగిలిన పాత్రల ప్రవర్తనని పాఠకులకి అందించడం కనిపిస్తుంది.

4.3. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని పాత్రలు నవలా రచనా కాలం నాటి సామాజిక అంశాలకు ప్రతీకగా చిత్రించబడ్డాయి. మలయాళ ఇందులేఖ నవలలో బాగా చదువుకుని ప్రశ్నించే తత్వం కలిగిన తరవాడు కుటుంబ సభ్యుల ప్రవర్తనకు ప్రతీక మాధవుని పాత్ర. ఒకవేళ నాయర్ స్త్రీ విద్యావంతురాలైతే ఆమె నంబుద్రీల రూపంలో తనకు ఎదురయ్యే కష్టాలను ఎలా ఎదురుకుంటుంది అన్న ప్రశ్నకి సమాధానం ఇందులేఖ పాత్ర. తమిళ 'ప్రతాపముదలియార్ చరిత్ర' లో విద్య నేర్చిన స్త్రీ ధైర్య సాహసాలకు ప్రతీక జ్ఞానాంబాళ్ పాత్ర. సవతి తల్లి పోరును ఎదిరించిన స్త్రీలకి ప్రతీక గుణభూషణి పాత్ర. స్త్రీలకు సరైన శిక్షణ ఇస్తే వారు రాజ్యపాలన కూడ చేయగలరన్న సందేశానికి ప్రతీక ఆనందవల్లి పాత్ర. కన్నడ ఇందిరాబాయి నవలలో నవలా రచనా కాలంనాటి సంప్రదాయ భావాలు కలిగిన వ్యక్తుల ప్రవర్తనకు ప్రతీక భీమారావు పాత్ర. చదువుకోని సాధారణ మధ్యతరగతి స్త్రీల మనస్తత్వానికి ప్రతీక సుశీల పాత్ర. బాల్యవివాహం వల్ల స్త్రీలు అనుభవించిన కష్టాలకి ప్రతీక ఇందిరాబాయి పాత్ర. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర నవలలో పంతొమ్మిదవ శతాబ్దం నాటి వర్ణవ్యవస్థకి, కులాచార పట్టింపులకి ప్రతీక శ్రీరంగరాజు పాత్ర. వేశ్యా లంపటత్వం వల్ల కలిగే కష్ట, నష్టాలకి ప్రతీక మూరురాయగండర్ పాత్ర. ఇలా దక్షిణ భారత తొలి సాంఘిక నవలలన్నింటిలో సామాజిక అంశాల సమాహారంగా పాత్రల ప్రవర్తన చిత్రించబడింది. ప్రతీ పాత్ర ప్రవర్తన వెనుక దాగి ఉన్న సామాజిక అంశాన్ని సిద్ధాంత గ్రంథంలో సుదీర్ఘంగా వివరించడం జరిగింది.

4.4. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని కథా నాయకులందరూ వారి తల్లిదండ్రులకు ఏకైక కుమారులు మరియు విద్యావంతులు. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి విద్యపై పెరిగిన ఆసక్తికి నిదర్శనం.

4.5. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని నాయక పాత్రలన్నీ ఏదో ఒక కారణం చేత ఇంటిని వదిలి దేశ సంచారానికి వెళ్లడం కనిపిస్తుంది. ఈ దేశ సంచారంలో ప్రాపంచిక విషయాలు తెలుసుకొని తిరిగి తమ ఇంటికి చేరడం ప్రతీ కథానాయకుని జీవితంలో జరిగిన ఉమ్మడి సంఘటన. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి వ్యాప్తిలో ఉన్న దేశ సంచార యాత్రలకు నిదర్శనం.

4.6. తెలుగు, తమిళ తొలి సాంఘిక నవలల్లోని కథానాయకులు తమ నిత్య జీవితానికి అవసరమైనంత వరకు మాత్రమే విద్యని నేర్చుకున్నారు. కాని ప్రభుత్వ ఉద్యోగాలలో చేరలేదు. ఇందుకు భిన్నంగా మలయాళ, కన్నడ భాషలలోని తొలి సాంఘిక నవలల్లోని కథా నాయకులు విద్యను నేర్చుకొని ఆ విద్య వల్ల ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఈ అంశం పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఆనాటి యువకులలో కాలాంతరంలో పెరిగిన ఆసక్తికి నిదర్శనం.

4.7. దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లోని నాయిక పాత్రలన్నీ నవలా రచనా కాలంనాటి సామాజిక సమస్యలతో బాధింపబడటం అన్ని నవలల్లోను కనిపిస్తుంది. మానసిక పరివర్తన ఆధారంగా ఇందిరాబాయి, ఇందులేఖ, జ్ఞానాంబాళ్ పాత్రలు సంక్లిష్టత లేని పాత్రలు కాగా సోనాబాయి సంక్లిష్టత కలిగిన పాత్ర.

4.8. కన్నడ ఇందిరాబాయి నవలలో స్త్రీ పాత్ర (అంబాబాయి) ప్రతినాయిక పాత్రగా ఉండగా తెలుగు, తమిళ, మలయాళ తొలిసాంఘిక నవలల్లో పురుష ప్రతినాయక పాత్రలు కనిపిస్తాయి.

## 5. ఐదవ అధ్యాయం

## దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు – సామాజికాంశాలు

5.1. పంతొమ్మిదవ శతాబ్దం నాటి సామాజికాంశాలకు దర్పణంగా దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు వెలువడినట్లు ఈ పరిశోధనలో సిద్ధాంతీకరించడం జరిగింది. ఈ సిద్ధాంతానికి తగిన ఆధారాలు ఐదవ అధ్యాయంలో ఇవ్వడం జరిగింది.

5.2. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో వర్ణవిభజనకి సంబంధించిన ప్రస్తావన కనిపిస్తుంది. తెలుగు శ్రీరంగరాజుచరిత్ర, తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో శూద్రులు, చాకలి, మంగలి, స్వర్ణకారులకి సంబంధించిన వర్ణన ఉంది. కన్నడ ఇందిరాబాయి నవలలో చాతుర్వర్ణ విభజనకి సంబంధించిన ప్రస్తావన నవల ప్రారంభంలో ఉంది. మలయాళ ఇందులేఖ నవలలో నంబూద్రి, నాయర్ కులాల ప్రస్తావన కనిపిస్తుంది. ఈ

అంశం పంతొమ్మిదవ శతాబ్దం నాటికి దక్షిణ భారత సమాజంలో ఉన్న వర్ణ విభజనకి నిదర్శనం.

5.3. వివాహం జరిపించే సందర్భంలో జాతకాలు చూడటం, ముహూర్తాలు చూడటం, కట్నకానుకలు స్వీకరించడం, స్త్రీలకు బాల్యవివాహాలు జరిపించడం, సమీప బంధువుల మరణంతో వివాహం వాయిదాపడటం, వంటి అంశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపిస్తాయి.

5.4. విదేశీయుల పాలన వల్ల దక్షిణ భారతదేశంలో ప్రవేశపెట్టబడ్డ నూతన వస్తువులపై ఆనాటి ప్రజలలో నెలకొన్న అపోహలు ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో వివరించబడ్డాయి.

5.5. ఆంగ్లేయుల పరిపాలన వల్ల భారత పరిపాలనారంగంలో నూతనంగా ప్రవేశించిన గవర్నర్ వ్యవస్థ, సివిల్ సర్వీసు, పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ మొదలైన నూతన అంశాలవల్ల ఆనాటి సమాజంలో వచ్చిన మార్పుల గురించిన ప్రస్తావన తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపిస్తుంది.

5.6. తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలలో గవర్నర్ పరిపాలన, రాజ్యసంక్రమణ సిద్ధాంతం గురించిన ప్రస్తావన ఉంది. కన్నడ ఇందిరాబాయి నవలలో ఎలిజబెత్ రాణి పరిపాలన, సివిల్ సర్వీసు గురించిన ప్రస్తావన ఉంది. మలయాళ ఇందులేఖ నవలలో ఆంగ్లేయ ప్రభుత్వం, సివిల్ సర్వీసు గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. ఈ అంశాలు పంతొమ్మిదవ శతాబ్దం నాటికి పరిపాలన రంగంలో వచ్చిన మార్పులకు నిదర్శనాలు.

5.7. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి భారతదేశంలో ప్రవేశపెట్టబడ్డ బ్రిటీషు న్యాయస్థానాలలో న్యాయ విచారణ ఎలా జరిగింది? తీర్పులు ఎలా చెప్పారు? న్యాయస్థానాలలో లంచగొండితనం ఎలా ఉండింది? వంటి అంశాలు ప్రతాపముదలియార్ చరిత్ర, ఇందిరాబాయి, ఇందులేఖ నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి.

5.8. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి భారతదేశంలో నూతనంగా ప్రవేశించిన క్రైస్తవ మతం పట్ల భారతీయులలో నెలకొన్న అభిప్రాయాలు మలయాళ ఇందులేఖ, కన్నడ ఇందిరాబాయి నవలల్లో చర్చకి వచ్చాయి.

5.9. ఆంగ్లవిద్య, స్త్రీ విద్యపై ఆనాటి ప్రజలకు ఉన్న అభిప్రాయాలు మలయాళ ఇందులేఖ, కన్నడ ఇందిరాబాయి, తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి.

5.10. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి భారతదేశంలో నూతనంగా ప్రవేశించిన ఆంగ్లేయ వైద్య విధానం పట్ల ఆనాటి ప్రజలలో నెలకొన్న అభిప్రాయాలు కన్నడ ఇందిరాబాయి నవలలో చర్చకి వచ్చాయి.

5.11. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి భారతదేశంలోని రవాణా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. దేశమంతా రైలు, రోడ్డు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. రవాణాకి రోడ్డుమార్గం ద్వారా ఎడ్లబండ్లను, గుర్రపుబండ్లను, పల్లకిని, గుర్రాలను ఉపయోగించిన సన్నివేశాలు దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో చిత్రితమయ్యాయి. నూతనంగా వచ్చిన రైల్వే వ్యవస్థపై, రైలు ప్రయాణంపై ప్రజలలో నెలకొన్న అభిప్రాయాలు కన్నడ ఇందిరాబాయి, మలయాళ ఇందులేఖ, తమిళ ప్రతాపముదలియార్ చరిత్ర నవలల్లో ప్రస్తావనకి వచ్చాయి.

5. 12. పంతొమ్మిదవ శతాబ్దం నాటికి సమాచార రంగంలో  టెలిఫోన్, తంతితపాల, లేఖలు, వార్తాపత్రికలు వంటి నూతన ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆవిష్కరణల వల్ల సమాచార రంగంలో వచ్చిన మార్పుల గురించిన ప్రస్తావన దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది.

5.13. పంతొమ్మిదవ శతాబ్దం నాటి దక్షిణ భారత సమాజంలో ఉన్న సంఘబహిష్కారాలు, సముద్ర ప్రయాణం–నిషేధం, బానిసత్వ వ్యవస్థ, బాల్య వివాహం వంటి అనేక సాంఘిక దురాచారాలకి సంబంధించిన ప్రస్తావన దక్షిణ భారత తొలి సాంఘిక నవలల్లో కనిపిస్తుంది

*****

# ఉపయుక్త గ్రంథసూచి

## తెలుగు


1. అజీజ్, డి.వి.యస్. 2014. భారతదేశంలో స్త్రీ. కర్నూలు: స్వీయ ముద్రణ.
2. ఇనాక్, కొలకలూరి (సం). 2010. తెలుగులో తొలి నవల – శ్రీరంగరాజు చరిత్ర (నరహరిగోపాల కృష్ణమసెట్టి). హైదరాబాదు: జ్యోతి గ్రంథమాల.
3. ఇనాక్, కొలకలూరి. 2013. తెలుగు నవల. హైదరాబాదు: జ్యోతి గ్రంథమాల.
4. కుటుంబరావు, బి.వి. 1971. ఆంధ్రనవలా పరిణామము. హైదరాబాదు: గాయిత్రి ప్రచురణలు.
5. కృష్ణకుమారి, నాయని(సం). 2007. ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడమి.
6. కృష్ణారెడ్డి, కె. 2011. భారతదేశ చరిత్ర – ఆధునిక యుగం. హైదరాబాదు: ఓరియంటల్ బ్లాక్ స్వాన్.
7. గంగిరెడ్డి, బుక్కా. 2004. కందుకూరి వీరేశలింగం నవలలు–సామాజిక సాంస్కృతిక పరిశీలన. కర్నూలు: మధుప్రియ ప్రింటర్స్.
8. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. 2009. తులనాత్మక దక్షిణాత్య సాహిత్య వ్యాసాలు. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.
9. చంద్రశేఖర్‌రెడ్డి, డి. 2009. భారతీయ విద్య. హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు.
10. చక్రవర్తి, ఉమా. 2017. స్త్రీవాద దృక్కోణంలో జండర్ కులం. హైదరాబాదు: మలుపు ప్రచురణ.
11. చెన్నకేశవ రెడ్డి, జి. (సం). 1999. విజ్ఞాన సర్వస్వం సంపుటం – 6. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.
12. జయప్రకాశ్, ఎస్ (అ). 2008. ప్రతాపముదలియార్ చరిత్ర (వేదనాయగం పిళ్ళై), కుప్పం: ద్రావిడవిశ్వవిద్యాలయం.
13. జయప్రకాశ్, ఎస్ (అ). 2016. ఇందులేఖ (ఒ. చందుమీనన్), న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.

14. తారకం, శ్రీ. 1976. తెలుగు నాడులో సంస్కరణోద్యమం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

15. తారాచంద్. 2007. భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర ద్వితీయ భాగం. హైదరాబాదు: తెలుగు అకాడమి.

16. తారాచంద్. 2014. భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్రమూడవ భాగం. హైదరాబాదు: తెలుగు అకాడమి.

17. నరేశ్ బాబు, దోనేపూడి. 2017. శ్రీరంగరాజ చరిత్ర (సోనాబాయి పరిణయం). హైదరాబాదు: పికాక్ బుక్స్.

18. నళిని, ఎస్. ఎస్. 2009. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.

19. నవీన్, అంపశయ్య. 2012. తెలుగు నవల. హైదరాబాదు: తెలుగు అకాడమి.

20. నాగభూషణరావు, యస్. 1991. దక్షిణ భారతదేశ చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడమి.

21. నాగేశ్వరరావు, ఈద్పుగంటి. 2012. భారతదేశంలో మతం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

22. నిత్యానందరావు, వెలుదండ. 2013. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.హైదరాబాదు: స్వీయ ముద్రణ, ఓమ్ సాయి గ్రాఫిక్స్.

23. పరమేశ్వరన్ నాయర్, పి.కె. 1978. మలయాళ వాఙ్మయ చరిత్రము. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమి.

24. ప్రతాపరెడ్డి, కాసుల. 2017. తెలంగాణ నవలా వికాసం. హైదరాబాదు: తెలంగాణ సాహిత్య అకాడమి.

25. ఫణిక్కర్, కె.ఎన్. 2011. భారతీయ విద్య చారిత్రక అవలోకనం. విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్.

26. ఫణిక్కర్, కె.ఎన్. 2016. ఆధునిక భారతదేశం సంస్కృతి సమస్యలు. విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్.

27. భాస్కర్, నలిమెల. 2010. భారతీయ సాహిత్య వ్యాసాలు. హైదరాబాదు: రామయ్య విద్యాపీఠం.
28. మంగమ్మ, జోలెపాళెం. 2001. తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు, హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.
29. ముఖర్జీ, కనక. 2009. భారతదేశంలో స్త్రీ విముక్తి. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్.
30. ముగళి, శ్రీ.రం. 1978. కన్నడ సాహిత్య చరిత్ర. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమి.
31. మృణాళిని, సి. 1988. సాంఘిక నవల కథా కథన శిల్పం. హైదరాబాదు: తెలుగు పరిశోధన ప్రచురణలు.
32. మోహనరామయ్య, ఎం. 1983. తొలి తెలుగు, తమిళ నవలలు తులనాత్మక పరిశీలన. మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించిన అముద్రిత సిద్ధాంత గ్రంథం.
33. మోహన్, జి.ఎస్. 2003. తెలుగు కన్నడ తులనాత్మక సాహిత్య వ్యాసాలు. బెంగుళూరు: శ్రీనివాస పబ్లికేషన్స్.
34. రంగనాథాచార్యులు, కె.కె.(సం). 2000. తెలుగు సాహిత్య వికాసం. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
35. రంగారావు, కె. 2013. సమాజ శాస్త్రం భారతీయ సమాజం. హైదరాబాదు: డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
36. రఘునాథరావు, పి. 2010. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర. న్యూఢిల్లీ: స్టెర్లింగ్ పబ్లికేషన్స్.
37. రఘునాథాచార్య, ఎస్. బి. 2008. భారతీయ సంస్కృతి. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం.
38. రమాపతిరావు, అక్కిరాజు. 1981. వీరేశలింగం వాణి. హైదరాబాదు: అంతర్జాతీయ తెలుగు సంస్థ.
39. రమాపతిరావు, అక్కిరాజు. 1982. వీరేశలింగం రచనలు (స్వీయచరిత్ర మొదటిభాగం). హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
40. రమాపతిరావు, అక్కిరాజు. 1990. వీరేశలింగం రచనలు(స్వీయచరిత్ర రెండవభాగం). హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

41. రమాపతిరావు, అక్కిరాజు. 1991. నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
42. రాధాకృష్ణ శర్మ, చల్లా. 1978. ఆధునిక తమిళ సాహిత్య నిర్మాతలు. మద్రాసు: దక్షిణ భాషా పుస్తక సంస్థ.
43. రాధాకృష్ణ శర్మ, చల్లా. 1986. తమిళ విందు. సికిందరాబాదు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్.
44. రాధాకృష్ణ శర్మ, చల్లా. 1996. సాహిత్య సమారాధన. మధుర: లక్ష్మీనారాయణ గ్రంథమాల.
45. రాధాకృష్ణశర్మ, చల్లా. 1998. తమిళ సాహిత్య చరిత్ర. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
46. రాధాకృష్ణశర్మ, చల్లా. 2012. తెలుగు దక్షిణాత్య సాహిత్యాలు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
47. రామకృష్ణ, వకుళాభరణం. 2013. ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్.
48. రామకృష్ణ, వకుళాభరణం. 2015. కందుకూరి వీరేశలింగం. న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.
49. రామకృష్ణ, వి. 1978. భారత దేశ జాతీయ సంస్కృతి. న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.
50. రామకృష్ణారెడ్డి, వి. 2009. భారతదేశ చరిత్రలో ముఖ్య ఘట్టాలు. హైదరాబాదు: తెలుగు అకాడమి.
51. రామానుజరావు, దేవులపల్లి (సం.పా) 1979. ఉత్తర భారత సాహిత్యములు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
52. రామానుజరావు, దేవులపల్లి (సం.పా). 1979. దక్షిణ భారత సాహిత్యములు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
53. రామానుజరావు, దేవులపల్లి(సం.పా). 1973. తెలుగు నవల నూరు సంవత్సరాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
54. రావు, పి. ఆర్. 1996. భారతీయ సాంప్రదాయకత సంస్కృతి. న్యూఢిల్లీ: స్టెర్లింగ్ పబ్లికేషన్స్.

55. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2017. సాహిత్య పరిశోధనా కళా: విధానం. హైదరాబాదు: మహేంద్ర భారతి సమర్పణ, హిమాలయ గ్రాఫిక్స్.

56. వరదరాజన్, ము. 1982. తమిళ వాఙ్మయ చరిత్రము. న్యూఢిల్లీ: కేంద్ర సాహిత్య అకాడమి.

57. విద్వేశ్వరి, డి. 2010. భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ. హైదరాబాదు: విశాలాంధ్ర.

58. విశ్వనాథం, జి. 2012. సమాజశాస్త్రం ప్రాథమిక సూత్రాలు. హైదరాబాదు: డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

59. వీరన్న, గుమ్మా. 2017. భారతీయ సంస్కృతీ తత్త్వం. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

60. వీరభద్రరావు, కొత్తపల్లి. 1986. తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం, హైదరాబాదు: స్వీయముద్రణ.

61. వీరేశలింగం, కందుకూరి. 1911. స్వీయ చరిత్రము ప్రథమ భాగం. మద్రాసు: విజ్ఞానచంద్రిక గ్రంథమాల

62. వీరేశలింగం, కందుకూరి. 2010. రాజశేఖర చరిత్రము. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

63. వీరేశలింగం, కందుకూరి. 2011. హాస్య సంజీవని. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్.

64. వీరేశలింగం, కందుకూరి. 2013. మూఢ నమ్మకాలపై నా పోరాటం. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్.

65. వెంకట సుబ్బయ్య, చింతలపాటి. 1960. ఉష:కిరణాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

66. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994. నవలాశిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

67. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 2015. నవల ప్రజలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

68 వెంకటేశ్వర శాస్త్రి, జొన్నలగడ్డ. 1968. మలయాళ భాషా సాహిత్యాలుసంగ్రహచరిత్ర. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్.

69. వెంకటేశ్వర్లు, పంతంగి. 2014. తెలంగాణ తెలుగు నవల. వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం.
70. వేంకటేశ్వర్లు, బూదాటి(సం). 2009. ఆధునిక భాషాబోధన – చిన్నయసూరి. కుప్పం: ద్రావిడవిశ్వవిద్యాలయం.
71. వైకుంఠం, యల్లంపల్లి. 2011. భారతదేశ చరిత్ర, సంస్కృతి. హైదరాబాదు: తెలుగు అకాడమి.
72. వైదేహి, అల్లాడి. 2007. ఆధునిక భారతదేశ చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడమి.
73. వైదేహి, అల్లాడి. 2011. భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడమి.
74. వైదేహి, అల్లాడి. 2011. భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడమి.
75. శంకర్, ఎం. 2012. కందుకూరి రాజశేఖర చరిత్ర – గుల్వాడి వెంకటరావు ఇందిరాబాయి నవలలు తులనాత్మక పరిశీలన. హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన, అముద్రిత ఎం.ఫిల్ పరిశోధనా వ్యాసం.
76. శర్మ, ఆర్.ఎస్. 1992. శూద్రవర్ణం ఎలా పుట్టింది. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్.
77. శేషన్, ఎస్.ఎస్. 1999. 18, 19వ శతాబ్దాలలో వచ్చిన నూతన ఆర్థిక, రాజకీయ పోకడలు. హైదరాబాదు: తెలుగు అకాడమి.
78. శేషశాస్త్రి, ఆర్. 2007. దక్షిణ దేశ భాషా సాహిత్యాలు. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.
89. శ్రీనివాస్, సంగిశెట్టి. 2017. తెలంగాణ నవలా చరిత్ర. హైదరాబాదు: తెలంగాణ ప్రచురణలు.
80. శ్రీహరి, రవ్వ (సం). 2016. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర, హైదరాబాదు: తెలుగు సాహిత్య అకాడమి.
81. సర్కార్, చంచల్.1986. మనవార్తాపత్రికల కథ. న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్
82. సర్కార్, సుమిత్. 2010. ఆధునిక భారతదేశం. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్.
83. సి.వి. 2015. ఆధునిక యుగంలో కులవ్యవస్థ. విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్.

84. సింగయ్య, కె. 2005. భారతీయ సమాజం. హైదరాబాదు: తెలుగు అకాడమి.

85. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2010. శబ్దరత్నాకరము. హైదరాబాదు: విక్టరీ పబ్లిషర్స్.

86. సుందరం, ఆర్వీయస్. 1977. కన్నడ సాహిత్య చరిత్ర. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

87. సుందరం, ఆర్వీయస్. 2015. ఆంధ్రుల జానపద విజ్ఞానం. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.

88. సుజాతారెడ్డి, ముదిగంటి. 2017. తెలుగు నవలానుశీలనం. హైదరాబాదు: ఎమెస్కో.

89. సుబ్బారావు, వేంకట. 1976. తెలుగు వారు – క్రీడారంగం. హైదరాబాదు: ప్రపంచ తెలుగు మహాసభలు.

90. సుబ్రహ్మణ్యం, జి.వి. 1983. ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం. సికిందరాబాదు: యువభారతి.

91. సూర్యనారాయణ, ఎం. 2011. సామాజిక మానవ శాస్త్రం – ప్రాథమిక సూత్రాలు. హైదరాబాదు: తెలుగు అకాడమి.

92. హరిశ్చంద్ర ప్రసాద్. జి. 1993. తెలుగులో పత్రికా రచన అవతరణ వికాసాలు. హైదరాబాదు: భావన ప్రచురణలు.

## కన్నడ

93. అమూర్, జి.యస్. 1989. కన్నడ కాదంబరియ బెళవణిగె. బెంగళూరు: ప్రసారంగా బెంగళూరు విశ్వవిద్యాలయం.

94. ఉషా రమేష్, నాయక్ హారోగద్దె. 1988. దక్షిణ జిల్లేయ శతమానద మహాన్ ప్రతిభగళు. బెంగళూరు: భూమిక ప్రకాశన శివానందనగర్.

95. పుట్టణ్ణ, ఎం.ఎస్. 2013. మాడిదుణ్ణో మహారాయ, బెంగళూరు: వసంత ప్రకాశన.

96. బాబురావ్, బోళర. 2013. వాగ్దేవి, బెంగళూరు: వసంత ప్రకాశన.

97. భగవతి, ఎస్.ఎస్. 2013. హొసగన్నడ సాహిత్యావలోకన. గదగ: విద్యానిధి ప్రకాశన.

98. వెంకటరావు, గుల్వాడి. 1962. ఇందిరాబాయి, మంగళూరు: కన్నడ ప్రపంచ ప్రకాశన.

99. వెంకటరావు, గుల్వాడి. 2013. ఇందిరాబాయి, బెంగళూరు: వసంత ప్రకాశన.

100. వెంకటసెట్టి, ఎ.ఆర్. 1909. సౌగంధికా పరిణయ. మైసూరు: శ్రీమతి కన్యకా పరమేశ్వరి ప్రచురణ.

101. శివరాయ, తు.సు. 2014. కన్నడ సాహిత్య చరిత్ర. మైసూరు: తుళికిన వెంకణ్ణమ్మ స్మారక గ్రంథమాలె.

102. శివరాయ, తు.సు. 1887. కన్నడ సాహిత్య చరిత్ర. మైసూర్: ఉదయరవి ప్రింటర్స్.

103. శివరుద్రప్ప, జి.యస్. 1982. కన్నడ సాహిత్య చరిత్ర. బెంగళూరు: ప్రసారరంగ విజ్ఞాన భారతి.

104. శేషగిరిరావ్, ఎల్.ఎన్. 2013. హొసగన్నడ సాహిత్య చరిత్రే. బెంగళూరు: స్వప్నా బుక్ హౌస్.

# ఇంగ్లీషు

105. Anitha, Devasai. 2005. *Indulekha (O.Chandu Menon)*. New Delhi: Oxford University Press.
106. Balakrishna, manian. 1981. *Papers in Tamil literature.* Madras: narumalarppathippakam.
107. Chaitanya Krishna, 1995. *History of Malayalam Literature*. Hyderabad: Orient Longman,
108. Clark, T.W. 1970. *The Novel in India Its Birth and Development*. Berkeley and Los Angeles: University of California Press.
109. Dumergue, W. 1965. *Indulekha (O. Chandu Menon).* Calicut: Mathrubhomi Press.
110. George, K.M. 1969. *A Survey of Malayalam Literature,* Bombay: Asha Publishing House.
111. George, K.M. 1972. *Western influence on Malayalam language and literature*. New Delhi: Sahitya Academy.
112. George, K.M. 1984. *Comparative Indian Literature.* Kerala: Sahitya Academy, Trichur.
113. George, K.M. 1998. *Western Influence on Malayalam Language and Literature.* New Delhi: Sahitya Academy.
114. Giriprakash T.S. 1999, *navel in Dravidian literature*. Madurai: publication division Madurai Kamaraj University.

115. Krishna Menon, T.K. 1990. *Primer of Malayalam Literature*. New Delhi: Asian Educational Services,
116. Mamtapaande. 2009. *Encyclopadia of Tamil literarure*. New Delhi: Anmulpublication.
117. ParameshvaranNaayar, P.K. 1977. *History of Malayalam literature*. New Delhi: Sahityaakademi.
118. Phalaksha, 1995. *The Political and Cultural History of Karnataka*. Tumukuru: Shashi Prakashan.
119. Ramachandran, C.N. 2001. *The early novels in south India*. Calcutta: publication division university of Calcutta.
120. Sastri,nilakanta. 1975. *History of south India,* Madras: Oxford university press.
121. Shankara, Menon, T.C. 1997. *Chandu Menon*, New Delhi: Sahitya Academy.
122. Shivarama, Padikkal. 2005. *Early Novels in India: (Ed)* Meenakshi Mukharjee. New Delhi: Sahitya Akademi,
123. Singh, K.S. 2001. People of India Tamilanadu. Madras: affiliated EST west press.
124. Srinivasaayangaar, M. 1986. *Tamil studies*. New Delhi: Asian Education Services,
125. Subramanian, N. 1997. *Tamil social history*. Chennai: institute of Asian studies.
126. Subramanian, P. 1999. *Social history of Tamil.* New Delhi: d.k. print world.
127. Vishvanathan E.S. 1988. *History of Tamil literature*. New Delhi: sahitya academy.

**ఇంటర్‌నెట్ ఆధారిత ఆకరాలు.**

1. అవధి*: Online Kannada Blog*: ఉదయ కుమార్ హబ్బు.
2. వికిసోర్స్: మైసూరువిశ్వవిద్యాలయవిశ్వకోశ / ఒడయార్ కాలదకన్నడ సాహిత్య.

**దిన పత్రికలు**

1. ఆంధ్రజ్యోతి దిన పత్రిక: తేది 08 మే 2020 నాడు, పుట సంఖ్య 10లో వచ్చిన వ్యాసం.
2. ఈనాడు దిన పత్రిక: తేది 17 జనవరి 2017నాడు, పుట సంఖ్య 4లో వచ్చిన వ్యాసం.
3. సాక్షి దిన పత్రిక: తేది 10 జూలై 2015 నాడు, పుట సంఖ్య 5లో వచ్చిన వ్యాసం.

*****

# తెలుగు భాష, సాహిత్యం - సామాజికత

సంపాదకులు
డా॥ చిన్నం రాజారాం

చిన్నం పబ్లికేషన్స్

**Telugu Bhasha, Sahithyam - Samajikatha** - A book on the
Telugu Language, Literature - Samajikatha edited by
Dr. Chinnam Rajaram.

ప్రథమ ముద్రణ : 2015

ప్రతుల సంఖ్య : 500

© **Editor**

వెల : రూ. 300/-

**కవరు డిజైను:** బండారి వెంకట్

**ISBN: 978-93-5235-907-3**

**ప్రతులకు:**

**డా॥ చిన్నం రాజారాం**

C/o విశాలాంధ్ర బుక్ హౌస్,

గాంధీ రోడ్డు, తిరుపతి.

సెల్: 09885220546

ఇతర విశాలాంధ్ర బ్రాంచీలు

డి.టి.పి.: శ్రీ ప్రభా గ్రాఫిక్స్,

ప్రకాశం రోడ్డు, తిరుపతి.

**ముద్రణ:** పద్మా గ్రాఫిక్స్, రాయాజీవీధి, నెల్లూరు.

**గమనిక:** ఈ గ్రంథంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలోని విషయాలకు, వివరాలకు ఆయా రచయితలే బాధ్యులు.

41. జాషువా రచనలలో మానవతా దక్పథం - **గంధం వేణు** 372-376

42. సమకాలీన సమాజం - జాషువా

**- డా॥ డి. ఉదయ కుమారి, డా॥ డి. జ్యోతమ్మ** 377-380

43. మునిసుందరం వచన కవితలు - సామాజిక స్పృహ

**- డా॥ ఆవుల శ్రీరామకుమార్ యాదవ్** 381-390

44. ఆధునిక కవిత్వం- చైతన్యానికి ఆలవాలం **- డా॥డి. షకీలాబి** 391-399

45. ఆధునిక సాహిత్య దృక్పథం - సామాజిక చైతన్యం

**- డా॥ యం.దేవరాజులు** 400-406

**4.6.2** నానీ, శతకం - సామాజికత **407-420**

46. "నానీలు" - స్వరూప స్వభావాలు : సామాజిక చైతన్యాంశాలు

**- డా॥ టి.విమల** 407-415

47. ఆధునిక శతక సాహిత్యం సామాజిక స్పృహ **- జి.నల్లారెడ్డి** 416-420

**4.6.3** నాటకం - సామాజికత **421-468**

48. ఆధునిక తెలుగు నాటకం - వైశిష్ట్యం

**- ఎం.రామనాథం నాయుడు** 421-428

49. తెలుగు నాటకం - సామాజిక దృక్పథం **- డా॥ జి. శైలమ్మ** 429-441

50. "పాలేరు" నాటకం - సామాజిక చిత్రణ

**- ధారవత్ సంతోష్ కుమార్** 442-451

51. కన్యాశుల్కం - పాత్ర చిత్రణ **- గాదిరాజు రంగరాజు** 452-461

52. కొలకలూరి ఇనాక్ నాటికలు - సామాజిక చిత్రణ

**- డి.సి.వెంకట సుబ్బయ్య** 462-468

**4.6.4** నవల - సామాజికత **469-528**

53. దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవలలు

- సామాజిక దృక్పథం, **- ఎం. శంకర్** 469-482

## 4.6.4 నవల - సామాజికత

### 53. దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవలలు - సామాజిక దృక్పథం

- ఎం. శంకర్.

పరిచయం

భారతదేశ చరిత్రలో పంతొమ్మిదవ శతాబ్దానికి విశిష్టత ఉంది. ఈ కాలంలో నూతన మత సంస్కరణ ఉద్యమాలు బయలుదేరాయి. ఈ మత సంస్కరణ ఉద్యమాలను చరిత్రకారులు 'భారతీయ పునరుజ్జీవనం' అనే శీర్షికతో అభివర్ణించారు (వైకుంఠం ఎల్లంపల్లి 2011.213). ఆంగ్లేయ సంస్కృతీ, మతం, సాహిత్యం భారతీయ సమాజంపై ప్రభావాన్ని చూపాయి. ఈ కాలంలో ఇంగ్లీషు విద్య భారతదేశంలో ప్రవేశించింది. ఇంగ్లీషు భాషావ్యాప్తికి రాజారామోహనరాయ్ వంటి సంఘ సంస్కర్తలు కృషిచేసారు. ఫలితంగా ప్రపంచవిషయాలు విద్యావంతులైన భారతీయులకు చేరువయ్యాయి. "క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలు, బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన విధానాలు హిందూమత పునరుద్ధరణకు, సాంఘిక మత సంస్కరణ ఉద్యమాలకు దారితీశాయి. క్రైస్తవ మిషనరీలనుంచి, భారత సంస్కృతీ, నాగరికతలను నలిపివేస్తున్న దురాచారాల నుంచి హిందూమతాన్ని రక్షించేందుకు ఈ సంస్కరణ ఉద్యమాలు తలెత్తాయి'' (కృష్ణారెడ్డి. కె 2005:101). సంఘసంస్కర్తలు సమాజాన్ని పునరుద్ధరించే క్రమంలో సాహిత్యాన్ని మాధ్యమంగా ఉపయోగించారు. ఫలితంగా సాహిత్యంలో గుణాత్మక మార్పు వచ్చింది. సాహిత్యం ప్రాచీన రూపాన్ని వీడి నూతన వచన రూపాన్ని ధరించింది. ఈ అంశాలు నవల ఆవిర్భావానికి భూమికగా నిలిచాయి. అన్ని భారతీయ భాషలలోను నవల 19వ శతాబ్దంలో ఆవిర్భవించింది. 19వ శతాబ్దంలో సాంఘికాచారాలు, మూఢనమ్మకాలు ఎలా ఉన్నాయి. బాల్యవివాహాలు, సంఘ బహిష్కారాలు, అంటూ, ముట్టు వంటి సామాజికాంశాలు నాటి ప్రజల జీవన విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి. బ్రిటిష్ ప్రభుత్వం దక్షిణ భారత సమాజంలో ఏరకమైన మార్పు తెచ్చింది వంటి అంశాలను దక్షిణ భారతీయ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నవలల ఆధారంగా పరిశీలించడమే ప్రస్తుత పరిశోధనాపత్ర ముఖ్య ఉద్దేశం.

## 1. దక్షిణ భారతదేశంలో తొలి సాంఘిక నవలలు

పద్దెనిమిదవ శతాబ్దం పూర్వార్ధానికి భారతదేశంలో ముద్రణా యంత్రం వచ్చింది. బెంగాల్లోని సిరాంపూర్‌లో మొదటి ముద్రణా యంత్రాన్ని కంపెనీవారు నెలకొల్పారు. దీనితో పత్రికలు వచ్చాయి. నూతన ఆలోచనల వ్యాప్తికి వచన రచనలు వచ్చాయి. ఈ వచన రచనలు నవల ఆవిర్భావానికి దారితీశాయి. "భారతదేశంలో మొదటి స్వతంత్ర నవల బెంగాల్‌లో పుట్టింది. పి.ఆర్.ఇ. చాంద్ మిత్ర 'టెక్ చంద్ ఠాకూర్' అనే కలం పేరుతో 'అలారేర్ దులాల్' (పెద్దింటి గారాల బిడ్డ - 1856) నవల రాశారు. ఆ తరువాత మరాఠిలో 'బాబా పద్మాన్ జి' రాసిన 'యయునాపర్యటన్' 1857లో వెలువడింది. ఇంగ్లీషులో బకించంద్ర చటర్జి రాసిన Raj Mohan Wife 1865లో వెలువడింది. గుజరాతీలో తొలుతగా చారిత్రిక నేపథ్యంతో 'నంద్ శంకర్ తుల్జ శంకర్' రాసిన 'కరణ్ ఘేలో (పిచ్చికరణ్-1866)' నవల వెలువడింది. సమకాలీన మధ్యతరగతి సమాజాన్ని చిత్రిస్తూ ఉర్దూ కవి నజీర్ అహమద్ ఉర్దూ భాషలో మరతుల్ ఉరుస్ (వధువు చేతిలో అద్దం - 1869) అనే నవలని రాశారు. అస్సామీలో సమకాలీన సమాజాన్ని నేపథ్యంగా తీసుకోని పద్మావతీ దేబి పుక్ నాని గారు 'సుధార్మాల్ ఉపాన్యాస్' (1884) అనే నవలని రాశారు. సింధి భాషలో 'జీనత్ (1890) అనే తొలి నవలని 'మిర్జా ఉలిచ్ బేగ్' గారు రాసారు. ఒరియా భాషలో 'బిబాసిని' (1891) అనే చారిత్రిక నేపథ్యంతో నడిచిన తొలి నవలని 'రాయ్ శంకర్ రాయ్' గారు రచించారు. సిక్కు మత ప్రభావం సిక్కు మతౌనత్యాన్ని చెబుతూ పంజాబీ భాషలో తొలి నవలని భయావీర్ సింగ్‌గారు రాసారు" (విద్వేశ్వరి.డి. 2010: 10-17). ఈ విధంగా భారతీయ భాషలన్నిటిలోను తొలి నవలలు 19వ శతాబ్దంలో వెలువడ్డాయి.

దక్షిణ భారతదేశంలో కూడా నవలారచన 19వ శతాబ్దం ఉత్తరార్థంలో ప్రారంభమైంది. తెలుగులో కాల ప్రమాణంగా చూసినపుడు నరహరి గోపాల కృష్ణమ సెట్టి గారు రాసిన శ్రీరంగరాజు చరిత్ర (1872) తొలి నవల అవుతుంది. దీనికి పూర్వం వచ్చిన కొక్కండ వెంకటరత్నం పంతులుగారి మహాశ్వేతా (1867) నవల సంస్కృత 'కాదాంబరి'కి అనువాదం కావడం వల్ల దీన్ని విమర్శకులు తొలి నవలగా

అంగీకరించలేదు. నవలా లక్షణాలు, సమకాలీన సమజ చిత్రణ, తరువాతి నవలలపై చూపిన ప్రభావం మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకున్నపుడు 'శ్రీరంగరాజు చరిత్ర' తరువాత ఆరు సంవత్సరాలకు వచ్చిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి 'రాజశేఖరచరిత్ర'ని (1878) తొలి తెలుగు సాంఘిక నవలగా విమర్శకులు గుర్తిస్తున్నారు.

గుల్వాడి వెంకట్రావు గారి ఇందిరాబాయి (1899) కన్నడలో నేడు తొలి సాంఘిక నవలగా గుర్తించబడుతున్నది. గుల్వాడి వెంకట్రావు గారి ఇందిరాబాయి (1899) నవలకి పూర్వం కన్నడలో యాదవకవి 'కళావతి పరిణయ' (1815), ముమ్మడి కృష్ణరాజరు 'సౌఘందికాపరిణయ' (1829), కేంపునారాయణ 'ముద్రామంజూశా' (1823) వంటి నవలలు వచ్చాయి. వీటిలో ముమ్మడి కృష్ణరాజరు రాసిన 'సౌఘందికాపరిణయ' గద్యకృతి కావడం, యాదవకవి రాసిన 'కళావతి పరిణయ' దండక ప్రక్రియలో గద్య లక్షణాలని కలిగి ఉండటం, కేంపునారాయణ రాసిన 'ముద్రామంజూశ' పురాణాన్ని పోలి ఉండటం వల్ల కన్నడ విమర్శకులు గుల్వాడి వెంకట్రావు గారు రాసిన ఇందిరాబాయి నవలని తొలి కన్నడ సామాజిక కాదాంబరిగా గుర్తిస్తున్నారు.

తమిళంలో 'ప్రతాప ముదిలియార్ చరిత్ర' (1879) అనే తొలి సాంఘిక నవలని శామ్యూల్ వేదనాయాగం పిళ్ళై గారు రచించారు.

"1887లో అప్పునెడుంగడి రచించిన కుందలతతో మలయాళంలో నవలారచన ప్రారంభమైంది. ఈ ప్రథమ ప్రయోగం అంత విజయవంతం కాలేదు. ఇందులో సంస్కృత పదాలతో కూడిన అలంకార యుక్త భాష వాడబడింది. ఇందులో సరైనా జీవితాదర్శం లేదు "(పరమేశ్వారన్ నాయర్ పి.కె 1978:129). 1889వ సంవత్సరంలో ఓ.చందుమినాన్ గారు సమగ్ర నవలా లక్షణాలతో బాసిల్లె 'ఇందులేఖ' నవలని రచించారు.

మొత్తం మీద దక్షిణ భారతదేశంలో మొదట తెలుగు (రాజశేఖరచరిత్ర -1878),తరువాత తమిళం (ప్రతాప ముదిలియార్ చరిత్ర - 1879), తరువాత మలయాళం (ఇందులేఖ - 1890), ఆ తరువాత కన్నడ (ఇందిరాబాయి - 1899) భాషలలో తొలిసాంఘిక నవలలు వచ్చాయి.

## 2. దక్షిణ భారతదేశంలో తొలి సాంఘిక నవలలు - ఇతివృత్తం

తొలి తెలుగు సాంఘీక నవల 'రాజశేఖర చరిత్ర'లో రాజశేఖరుడి కుటుంబ ఇతివృత్తం వివరించబడింది. రాజశేఖరుడు అనవసర డాంభికాలు ప్రదర్శించడం, అతని కుటుంబం కష్టాలపాలు కావడం, నవల చివరిలో కుటుంబ సభ్యులంతా కలుసుకోవడం రాజశేఖర చరిత్రలోని ఇతివృత్తం. ఈ కథ నడుస్తున్న క్రమంలో నాటి సామాజికాంశాలు చిత్రితమయ్యాయి.

కన్నడ 'ఇందిరాబాయి' నవలలో భీమారావు కుటుంబ ఇతివృత్తం వివరించబడింది. భీమారావు కుటుంబానికి అమృతరావు, సుందరరావు కుటుంబానికి మధ్య నడిచిన సంఘర్షణ ఇందిరాబాయి నవలలోని ప్రధాన కథ. భీమారావు కూతురు ఇందిరాబాయి బాల్యవితంతువుగా మారడం – ఆమె సంఘాన్ని ఎదురించి అమృతారావు ప్రోత్సాహంతో తాను ప్రేమించిన భాస్కరరావును వివాహం చేసుకోవడంతో కథ ముగుస్తుంది. వితంతు పునర్వివాహం ఇందిరాబాయి నవలలోని ప్రధాన కథా వస్తువు.

తమిళ 'ప్రతాప ముదిలియార్ చరిత్ర' లో ప్రతాపముదిలి ఇతివృత్తం వివరించబడింది. ఈ నవలలోని మొత్తం కథను ప్రతాప ముదలి పాఠకులకి చెబుతాడు. ప్రతాపముదలి బాల్యం-జ్ఞానాంబళ్‌తో అతని వివాహం - వివాహానంతరం జ్ఞానాంబళ్ తండ్రికి ప్రతాపముదలి తండ్రికి వివాదం రావడం – ప్రతాపముదలి జ్ఞానంబళ్ ఇంటి నుండి పారిపోయి తమ చిన్న నాటి స్నేహితుడైన కనకసభ వద్ద ఆశ్రయం పొందడం వంటి సంఘటనలతో కథ నడుస్తుంది. ఈ కథ నడిచే క్రమంలో చిన్న చిన్న ఉపకథల రూపంలో నాటి సామాజికాంశాలు అందించబడ్డాయి.

మళయాళ 'ఇందులేఖ' నవలలో ఇందులేఖకి ఆమె మేనమామ మాధవన్‌కి మధ్య నడిచిన ప్రేమ వృత్తాంతం వివరించబడింది. మాధవన్ విద్యావంతుడైన యువకుడు ఇందులేఖను ప్రేమిస్తాడు. ఇందులేఖ కుటంబానికి పెద్ద అయిన పెంచుమీనన్ ఈ ప్రేమవివాహాన్ని అంగీకరించక ఇందులేఖను

సూరినంబూద్రి అనే సంపన్న బ్రహ్మణునికి ఇవ్వాలనుకుంటాడు. ఇందులేఖ ఈ వివాహాన్ని వెతిరేకిస్తుంది. సూరి నంబూద్రి దీన్ని అవమానంగా భావించి దానినుండి గట్టెక్కడానికి అదేకుటుంభంలోని ఇంకో అమ్మయిని పెళ్ళాడి ఇంటికి వెళ్ళిపొతాడు కాని అతను ఇందులేఖనే పెళ్ళడినట్లు ప్రచారమౌతుంది. అపార్థాలన్నీ తొలగిపోయి ఇందులేఖ మాధవన్‌ల వివాహం జరగడంతో కథ ముగుస్తుంది.

## 3. దక్షిణ భారతదేశంలో తొలి సాంఘిక నవలలు - సామాజిక దృక్పథం

### 3.1 పరిపాలన

1857లో సిపాయిల తిరుగుబాటు అనంతరం కంపెనీ పాలన అంతమై భారతదేశంలో బ్రిటిష్ రాణి పాలన ప్రారంభమైంది. "సివిల్ సర్వీస్, సైన్యం, పొలీసుదళం అనేమూడు ప్రధాన విభాగాలపైన ఆధారపడి భారతదేశంలో కంపెని పాలన కొనసాగింది. కంపెనీ సివిల్ సర్వీస్ విభాగానికి కారాన్ వాలిస్ స్పష్టమైన రూపన్నిచ్చాడు. తక్కువ వేతనాలు, ప్రవేటు వ్యాపారం లంచంతో కూడిన వ్యవస్థనితడు సంస్కరించాడు" (రామకృష్ణారెడ్డి. వి. 2009:218). ఇది చారిత్రక సత్యం. ఆంగ్లేయ ప్రభుత్వం ప్రభత్వ శాఖలల్లో ఎన్ని సంస్కరణలని తెచ్చినా కిందిస్థాయి నుండి పైస్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగుల్లో లంచగొండితనం నశించలేదన్న విషయం ఇందిరాబాయి, ప్రతాప ముదిలియార్ చరిత్ర నవలల వల్ల తెలుస్తుంది. ఇందిరాబాయి నవలలో సుందరరవును భీమారావు హత్యచేసి ప్రభుత్వ ఉద్యోగులకు డబ్బును ఎరవేసి శిక్షనుండి తప్పించుకుంటాడు. అదే విధంగా ప్రతాప ముదిలియార్ చరిత్రలో ఒక కలెక్టర్ తాను ఇష్టబడ్డ గుణరత్నం అనే స్త్రీ తనకు దక్కక పోయేసరికి ఆమెను తన కోడలిగా చేసుకుందామనుకున్న దేవరాజు పిళ్ళై పై అపుత్ర వ్యాజ్యం వేసి. అతనికి పిల్లలు లేనికారణంగా అతని ఆస్తిని ప్రభుత్వం స్వాధీన పరుచుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాస్తాడు (ప్రతాప ముదిలియార్ చరిత్ర 2008:71-72). ఈ సంఘటన అధికార దుర్వినియోగానికి నిదర్శనం. ఇందిరాబాయి నవలలో సుందరరావు హత్య సందర్భంలో ఆంగ్లేయ పోలీసు వ్యవస్థలోని అంతర్వ్యులు, అధికార విభజన ప్రస్తావనకి వచ్చాయి. ఇందిరాభాయి నవలలోని ప్రధానపాత్ర భాస్కరరావు సివిల్ పరీక్ష నిమిత్తం సముద్ర

ప్రయాణానికి సిద్ధపడినప్పుడు సివిల్ పరీక్ష గోప్పతనం చాలా సుదీర్ఘంగా వర్ణించబడింది (ఇందిరాబాయి 1962:28).

### 3.2. న్యాయవ్యవస్థ

"అంచెలంచల సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలద్వారా న్యాయనిర్వహణను చేపట్టె నూతన విధానాన్ని బ్రిటిష్ కంపెనీవారు ప్రారంభించారు. దీన్ని వారన్ హేస్టింగ్స్ ప్రవేశపెట్టగా 1793లో కారన్ వాలిస్ స్థిరీకరించాడు. ప్రతిజిల్లాలో 'దివానీ అదాలత్' అనే పేరుగల సివిల్ న్యాయ స్థానాన్ని ఏర్పాటు చేసారు. దీనికి అధ్యక్షత వహించే వ్యక్తి జిల్లా సివిల్ సర్వీసుకు చెందినవాడై ఉండాలి. ఈ విధంగా కారన్ వాలిస్ సివిల్ జడ్జి కలెక్టర్ ఉద్యోగాలను వేరుపరిచాడు" (రామకృష్ణారెడ్డి.వి.2009.221). ఇందిరాబాయి నవలలో అత్తూరుసురప్పయ్య వకీలుకు, భీమారవుకు మధ్య నడిచిన సంభాషణలో కోర్టులు, కోర్టులలోని రకాలు చెప్పబడ్డాయి (ఇందిరాబాయి 1962:1,9). ప్రతాపముదిలియార్ చరిత్రలో దేవరాజు పిళ్లైకి 'కనకసభ' సోంతకుమారుడా కాడా అని విచారించడానికి ముగ్గురు దొరలు విచారణకర్తలుగా నియమించబడతారు. ఈ విచారణకర్తలు పూర్తి స్వతంత్రులుగా ప్రభుత్వం పేర్కొంటుంది. కానివారు కలెక్టర్‌కు లొంగిపోయి తప్పుడు తీర్పు ఇస్తారు. ఈ అంశం న్యాయ వ్యవస్థలోని లోపాన్ని తెలుపుతున్నది (ప్రతాప ముదిలియార్ చరిత్ర 2008:127).

### 3.3 ఆర్థిక వ్యవస్థ

19వ శతాబ్దంలో భారతదేశ ఆర్థిక విధానంలో మార్పు వచ్చింది. ద్రవ్యం చలామణిలోకి వచ్చింది. ఇందిరాబాయి రాజశేఖర చరిత్ర నవలల్లో అణాలు, పైసలు చలామణిలో ఉన్నట్లు చెప్పబడింది. "డబ్బు అంటే 1కాణి, అణాకు నాలుగు కాణులు, రూపాయికి 16అణాలు, అణాకు 12పైసలుగా ఆర్థిక వినిమయం ఉండేది" (రాజశేఖర చరిత్ర 2010:3). ఇందిరాబాయి నవలలో భీమారావు దేవకికి లంచం సందర్భంలోనూ బొగ్గు, జారప్పలకి లంచం ఇచ్చే సందర్భంలోను పావాణి (1/4 అణా) ప్రస్తావన కనిపిస్తుంది. ప్రతాపముదిలియర్ చరిత్రలో బంగారు నాణ్యాలు, రత్నాలు, రూపాయల ప్రస్తావన కనిపిస్తుంది (ప్రతాపముదిలియర్ చరిత్ర 2008:36).

### 3.4. మతప్రచారం

వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు భారతదేశంలో క్రైస్తవమత ప్రచారం ప్రారంభించారు. ఈ క్రైస్తవ మతప్రచారంలో భాగంగా ఆంగ్ల విద్యావిధానాన్ని, వైద్యాన్ని క్రైస్తవ మిషనరీల ద్వారా ప్రచారం చేసారు. ఈ మత వ్యాప్తిని భారతీయులు తిరస్కరించారు. ఇందిరాబాయి నవలలో భాస్కరరావు చదువు నిమిత్తం విదేశాలకి వెళ్ళినపుడు భీమారావ్ అతను క్రైస్తవుల మాదిరిగా జుట్టుపెంచి మంచి బట్టలు ధరించి, జాతిని భ్రష్టుపట్టిస్తున్నాడు. అంటు మతాధిపతులకు లేఖ రాస్తాడు. ఇంకా భీమారావ్ అన్న శంకరావు బ్రిటిషువారు ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మందులు, వాటర్ ఫిల్టర్ వంటివి జాతిని చెడగొట్టడానికి ఇంగ్లీషు వారు చేసిన పన్నాగంగా అభివర్ణిస్తాడు. (ఇందిరాబాయి 1962:22). ప్రతాప ముదిలియార్ చరిత్రలో దేవరాజ పిళ్ళైకి వైద్యం చేసేసందర్భంలో ఇంగ్లీషు వైద్య ప్రస్తావన కనిపిస్తుంది (ప్రతపముదిలియార్ చరిత్ర 2008:26).

### 3.5 పత్రికారంగం

19వ శతాబ్దంలో భారతదేశంలో అనేక పత్రికలు స్థాపించబడ్డాయి. ఈ పత్రికలూ నాటి సమాజ స్థితిగతుల్ని ప్రభావితం చేసాయి. నాటి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా నిలిచాయి. ప్రభుత్వ యంత్రాంగంలోని లోపాలను కథలుగా ప్రచురించి తద్వారా ప్రజలలో చైతన్యాన్ని కలిగించాయి. ఈ విధంగా 19వ శతాబ్దంలో ఏర్పడిన నూతన పత్రికా రంగాన్ని చరిత్రకారులు ఆధునిక పత్రికా రంగంగా అభివర్ణించారు. 19వ శతాబ్దికి పూర్వం పత్రికల స్థానంలో వార్తాహారుల రూపంలో వార్తా ప్రసారం జరిగింది. తపాల సౌకర్యం అందుబాటులో లేని కాలంలో మనుషులే వార్తలను మోసుకేళ్ళేవారు. రాజశేఖరచరిత్ర రచనాకాలం 1878. ఈ కాలంలో అప్పుడప్పుడే పత్రికలు ప్రారంభమౌతున్నాయి. కాబట్టి ఇందులో పత్రికల ప్రస్తావన పెద్దగా కనిపించదు. రాజశేఖరుడు పెద్దాపుర బ్రహ్మణుని సత్రంలో ఉండగా రుక్మిణి అత్తగారింటికి వెళ్ళే బ్రహ్మణుడు భోజనానికి వస్తే అతని ద్వారా రుక్మిణి భర్త మరణవార్తని వాళ్ళింటికి జాబురాసి చేరవేస్తాడు (రాజశేఖచరిత్ర 2010:142). ఇందిరాబాయి నవల మొదటి భాగంలో భీమారావు, అంబాబాయి

మఠాధిపతికి జలాక్షి, అమృతారావులకు వ్యతిరేకంగా లేఖలు రాయడం కనిపిస్తుంది. నవల ముగింపులో 'హితబోధిని' పత్రికలో వచ్చిన సంఘటనని మఠాధిపతి చదివి తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఈ సందర్భంలో రచయిత 'సతీహితబోధిని' ఇత్యాది పత్రికల పేర్లను పేర్కొన్నారు. ప్రతాపముదిలియార్ చరిత్రలో ప్రతాపముదిలి తన భార్యతో సహా ఇంటినుండి పారిపోయి తన బాల్య మిత్రుడైన కనకసభ ఇంట్లో ఉంటాడు. ఈ విషయం తెలిసి అతని అమ్మ నాన్న, అత్తా మామలు వారిని చూడటానికి బయలుదేరుతారు. ఈ విషయాన్ని ఒక వార్తాహారుడు పరిగెత్తుకుంటు వెళ్లి ప్రతాపముదలికి చేరవేస్తాడు.

## 3.6. వివాహాచారం

రాజశేఖరచరిత్ర ఇందిరాబాయి, ప్రతాపముదిలియార్ చరిత్ర నవలల్లో వివాహ వ్యవస్థకి సంబంధించిన వర్ణనలు కనిపిస్తాయి. సీత వివాహ సందర్భంలో కందుకూరి వారు వివాహ సంప్రదాయాన్ని వర్ణించారు. ఇందిరాబాయి వివాహసందర్భంలో గుల్వాడి వెంకట్రావు గారు, కనకసభ పెళ్లి సందర్భంలో వేదనాయాగం పిళ్ళై గారు వివాహ విశేషాలను తెలియచేసారు. వివాహానికి ముందు వధూవరుల జాతకాలను చూడటం జాతకాలను చూసే సందర్భంలో వారిజన్మ నక్షత్రం, రాశి కలిస్తేనే తల్లిదండ్రులు వారి వివాహానికి అంగీకరించడం వంటి అంశాలు దాదాపుగా అన్ని నవలల్లోను ప్రస్తావనకి వచ్చాయి. ఈ అంశాలు వివాహవిషయంలో దక్షిణ భారతదేశంలో జాతకాలకి ఉన్న ప్రాముఖ్యాన్ని తెలియచేస్తున్నాయి. అయితే వివాహ సందర్భంలో పెద్దింటి వారు చేసే హంగూహార్భాటాలు ప్రతాపముదిలియార్ చరిత్రలో సుదీర్ఘంగా వర్ణించబడ్డాయి. "ఊరంతా మకర తోరణాలు కట్టి అరటి స్తంభాలు నాటి పందిరి అలంకరించి, పెళ్ళి కుమారుని పెళ్ళి కూతురుని సుఘంధజలాలతో స్నానం చేయించి. దివ్యములైన వస్త్రాభరణములు అలంకరించి, సముద్ర ఘెషవలె నానా విధములైన మంగళ వాయిద్యములు మోగుతుండగా మయుర బృందమువలె నాట్యకత్తెలు నాట్యమాడుతుండగ కలకంఠముల సమూహములను పోలిన గాయినీమణులు శోభనా గీతములు పాడుతుండగ కనకసభ వివాహం వైభవంగా జరిగింది" (ప్రతాప ముదిలియార్ చరిత్ర 2008:136).

### 3.7 మూఢభక్తి

రాజశేఖర చరిత్రలో భజన సంప్రదాయం గురించి చెప్పబడగా ఇందిరాబాయి నవలలో యక్షగాన మూఢభక్తి చెప్పబడింది. ప్రతాపముదిలియార్ చరిత్ర మొత్తంలో ప్రతీ పాత్ర తన క్రియలన్నిటికి దైవమే కారణమని నమ్ముతుంది. ఇందిరాబాయి నవలలో భీమారావు కీచక వధ ప్రసంగం చెప్పిన తరువాత సంతర్పణ నిర్వహిస్తాడు. తానూ యక్షగానం చెప్పే సందర్భంలో తన భార్య వినడంవల్లె తన ఆడ శిషువు జన్మించిందని నమ్ముతాడు (ఇందిరాబాయి 1962:68). కందుకూరి వీరేశలింగం పంతులుగారు రాజశేఖర చరిత్రలో జనార్థన స్వామి ఉత్సవ వర్ణన సమయంలో మూఢభక్తితో ప్రజలు అడవి జంతులకు కలిగించిన నష్టాన్ని తెలిపారు (రాజశేఖర చరిత్ర 2010:3,1). ఈ అంశాలు అనాధిగా భారతదేశంలో కొనసాగుతూ వస్తున్న దైవమూఢ భక్తికి ప్రతీకలు.

### 3.8 బాల్యవివాహాలు

ఇందిరాబాయి, రాజశేఖర చరిత్ర, ప్రతాపముదిలియార్ చరిత్రలలో బాల్యవివాహాల ప్రస్తావన కనిపిస్తుంది. ఇందిరాబాయి నవలలో బాల్యవివాహం ప్రధాన కథలో భాగంగా వర్ణించబడగా రాజశేఖర చరిత్రలో రుక్మిణి, సీత పాత్రల ద్వారా బాల్యవివాహ సమస్య ఎత్తిచూపబడింది. ఇందిరాబాయి నవలలో ఇందిరాబాయికి ఎనిమిది సంవత్సరాల వయస్సులో పెళ్లైంది. రాజశేఖర చరిత్రలో రాజశేఖరుడు రుక్మిణికి 13 సంవత్సరాల వయస్సులో పెళ్ళి సంబంధాలు చూడటం ప్రారంభించాడు. సీతకి సంబంధాన్ని చూసే సుబ్బరాయుడనే సిద్ధాంతి సీత వివాహాన్ని గురించి మాట్లాడుతూ "ఈ మధ్యానమే చూసినాను ఇక చిన్న దానిని నిలిపి ఉంచరాదు. మొన్న మా బంధువల గ్రామంలో నింతకంటె చిన్న పిల్ల సమర్థాడినది" (రాజశేఖర చరిత్ర 2010:139) అంటాడు. ఈ సంభాషణ స్త్రీలు సంపూర్ణంగా ఎదగడానికి పూర్వమే వారికి వివాహాలు జరిగిన వృత్తాంతాన్ని తెలుపుతున్నది. బాల్య వివాహం వల్ల కలిగే నష్టాన్ని గుల్వాడిగారు ఇందిరాబాయి పాత్రద్వారా తెలిపారు. ఇందిరాబాయి భర్త చనిపోయిన సందర్భంలో ఆమె తల్లిదండ్రులు బాధపడతారు. వాళ్ళను చూసి ఇందిరాబాయి "మీరు బాధపడాల్సిన సమయం

ఇదికాదు. నాకు వివాహం చేసే సందర్భంలోనే బాధపడాల్సింది. నా అభిప్రాయాన్ని ఏ మాత్రం తెలుసుకోకుండా నాకు లేత వయస్సులో పెళ్ళి చేశారు. పెళ్ళిలో జాతకాలకూ, భోగం మేళాలకు ప్రాధాన్యం ఇచ్చారే కాని నా మనస్సుకు, అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పుడు నాబ్రతుకె నాశనమైంది" (ఇందిరాబాయి 1962:146) అంటుంది. ఈ మాటలు బాల్యవివాహం వల్ల కలిగే నష్టానికి ప్రత్యక్ష సాక్షాలు.

### 3.9 సంఘ బహిష్కారాలు

రాజశేఖర చరిత్ర, ఇందిరాబాయి, ప్రతాపముదిలియార్ చరిత్ర రచనా కాలానికి మఠాధి పతులకు, కులపెద్దలకు అత్యంత ప్రాముఖ్యం ఉన్నట్లు తెలుస్తుంది. మఠాధిపతులు తమ మఠం పరిధిలో ఉన్న ప్రాంతాలలో హిందూమత రక్షకులుగా పనిచేసేవారు. ఎవరైనా తమ అభిమతానికి భిన్నంగా నడుచుకున్నా, నాటి సంఘం కట్టుబాట్లకు భిన్నంగా నడుచుకున్నా మఠాధిపతులు వారిని సంఘం నుండి వెలివేసేవారు. ఆ వెలివేసిన వారితో మిగతా కులస్తులు మాట్లాడేవారు కాదు. మఠాధిపతులు తమ మఠ పరిధిలో ఎక్కడ కట్టుబాట్ల ఉల్లంఘన జరుగుతుందో తెలుసుకోడానికి మఠం తరుపున కొందరు ధర్మ విచారకుల్ని ఆయాప్రాంతాలలో నియమించేవారు. ఈ ధర్మవిచారకులు ఆ ప్రాంతంలో నివసించేవారిలో ఎవరో ఒకరు అయివుండి అక్కడి ప్రజలందరిచేతా ఎన్నుకోబడేవారు. ఈ ధర్మ విచారకుని ముఖ్యపని తన ప్రాంతంలో ఎక్కడ కట్టుబాట్లకు విరుద్ధంగా ఏ పని జరిగినా దానిని వెంటనే ఒక లేఖద్వారా మఠాధిపతులకు తెలియజేప్పాలి. ఆ లేఖ అందుకున్న వెంటనే మఠాధిపతులు ధర్మవిచారకుడు చెప్పే విషయాలు నిజమా, కాదా అని తెలుసుకోడానికి ఒక పత్రాన్ని ఆ ప్రాంత సభ సభ్యులకు పంపుతారు. అభియోగా పత్రం అందగానే సభ సభ్యులందరూ సమావేశమైన ఆ పత్రానికి తమ సమ్మతిని తెలిపితే మఠాధిపతులు ఆ అభియోగా పత్రంలో పేర్కొన్న వారిని సంఘం నుండి బహిష్కరిస్తారు. ధర్మ విచారకుడు కట్టుబాట్లను అతిక్రమించిన వారి పేర్లను చెప్పడంతోపాటు మఠం కార్యక్రమాలు నడవడానికి అవసరమైన ధనాన్ని కూడా శిష్య గాణం నుండి సేకరించి మఠాధిపతులకు పంపవలసి ఉంటుంది. ఈ విషయాల

ప్రస్థావన ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది (ఇందిరాబాయి (1962:63). రాజశేఖరుడు ధనాన్ని కోల్పోయి బీదవానిగా మారిన సందర్భంలో సంఘబహిష్కార ప్రస్థాపన వస్తుంది. (రాజశేఖరచరిత్ర 2010:89). ప్రతాపముదిలియార్ చరిత్రలో నీలకంఠ ముదిలియార్ సుందరతణ్ణీని ఎలాగైనా పెళ్ళాడాలని ఆమెని ఆపహరిస్తాడు. అప్పుడు కులపెద్దలు అతన్ని బహిష్కరిస్తారు. "మనకులానికి సంబంధించిన వారంతా ఒకటిగా సమావేశమై అతనిని జాతి బ్రష్టునిగా చేసి శుభాశుభాలకు ఎవ్వరూ పిలువకుండానూ నీరూ నిప్పు ఇవ్వకుండాను బహిష్కరించాలి" (ప్రతాప ముదిలియార్ చరిత్ర 2008:19).

## 3.10 అస్పృశ్యత

19వ శతాబ్దంలో అస్పృశ్యత ప్రధాన సమస్యగా ఉండింది. దీన్ని రూపుమాపడానికి గాంధీజీ హరిజన ఉద్యమాన్ని నడిపారు. ఈ అస్పృశ్య సమస్య ప్రస్థాపన రాజశేఖర చరిత్రా, ప్రతాప ముదిలియార్ చరిత్రలలో కనిపిస్తుంది. రాజశేఖర చరిత్రలో అడవిలో దాహంతో పడిపోయిన రామరాజును ముట్టుకోకుండా ఎవ్వరు నీళ్లు పోయరు (రాజశేఖర చరిత్ర 2010:106). ప్రతాప ముదిలియార్ చరిత్రలో ఒక తురుష్కుడు గుర్రంపై సత్యపురికి వెళ్తూ మార్గాలమధ్యమంలో పడిపోతాడు. "అతడు ఎవరో ఫకీరు అతన్ని తాకితే జాతి బ్రష్టం అవుతుంది" అంటు అక్కడి ప్రజలు అతన్ని తాకరు. కాని ప్రతాపముదలి తాత మాత్రం అతన్ని రక్షిస్తాడు (ప్రతాపముదిలియార్ చరిత్ర 2008:1).

## 3.11 వ్రతాలు, నోములు

మనస్సులో అనుకున్న కార్యం నెరవేరాలని ఇష్ట దేవుళ్ళ పేరిట వ్రతాలు, నోములు ఆచరించడం మనం నేటికీ చూస్తూనే ఉంటాం. స్త్రీలు మాంగళ్య రక్షణార్థం, సంతానం కొరకు ధనధాన్య వృద్ధి కొరకు ఈ వత్రాలను చేస్తుంటారు. ఇందిరాబాయి నవలలో అంబాబాయి తమకు పిల్లలు కలగడం లేదని లక్షవత్తుల వ్రతం చేస్తుంది. దీనితోపాటు హోమ యజ్ఞయాగ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుంది. (ఇందిరాబాయి 1962:4). రాజశేఖర చరిత్రలో శ్రీ శంకర భగవత్పాదులవారు

వస్తున్నారని తెలిగానే, ఆ ఊరిలోని స్త్రీలందరూ లక్షవత్తుల నోము నోచారు (రాజశేఖర చరిత్ర 2010:19).

## 3.12. భోగంమేళాలు

19వ శతాబ్దంలో భోగంమేళం వ్యవస్థ ఉండేది. పెళ్ళిళ్ళు, దేవుని ఉత్సవాలలో భోగంమేళాలు ఏర్పాటు చేసేవారు. గుడిలో జరిగే ఉత్సవాలలోభోగంమేళాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. గుడిమాన్యాలలో కొంతభాగం భోగంమేళాలకు కెటాయించేవారు. ఈ భోగం మేళాలను పిల్లలు మొదలుకొని ముసలివారి వరకు అందరు ఆసక్తితో తిలకించేవారు. కొన్ని సందర్భాలలో భోగంమేళాలు లేని ఊళ్ళలో పెళ్లి జరిగితే వేరేప్రాంతాల నుండి భోగం వారిని అక్కడికి రప్పించేవారు. మొత్తం మీద పెళ్లిలలో, ఉత్సవాలలో భోగం మేళాలకు అధికంగా ధనం ఖర్చు చేసేవారు. ఈ భోగం మేళాల ప్రసక్తి ఇందిరాబాయి, రాజశేఖర చరిత్ర, పత్రాప ముదిలియార్ చరిత్ర నవలల్లో కనిపిస్తుంది. రాజశేఖర చరిత్రలో జనార్ధన స్వామి ఉత్సవాల సందర్భంలో భోగం మేళాల గురించి వివరించబడింది (రాజశేఖర చరిత్ర 2010:32). ఇందిరాబాయి నవలలో నరసింహ శాస్త్రి కూతురి పెళ్లి విషయమై అంబాబాయి, భీమారావు మధ్య నడిచిన సంభాషణలో భోగంమేళాల గురించి వివరించబడింది (ఇందిరాబాయి 1967:7).

## 3.13. నాయర్ ఉద్యమం

కేరళ ప్రాంతంలో తలెత్తిన నాయర్ ఉద్యమానికి ప్రతీకారాత్మకమైన రచన ఒ.చందుమీనన్ గారి 'ఇందులేఖ' నవల. "ట్రావన్ కోర్ రాష్ట్రంలోని మధ్యరకం కులానికి చెందిన నాయర్లు సాంఘికంగా, రాజకీయంగా నంబూద్రి బ్రహ్మణులు, మళయాళేతర బ్రహ్మణులు చలాయిస్తున్న ఆధిపత్యానికి నిరసనగా పోరాటం సలిపారు. వారు అనేక సమస్యలతో బాధపడుతూ ఉండేవారు. నాయర్ల తార్వాడ్ (సమిష్టికుటుంబాలు) సంప్రదాయం మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో నాయర్ల అభివృద్ధికి ఆటంకంగా పరిణమించింది. పాశ్చాత్య విద్య నాయర్లకు సంబంధించిన అనేక ఆచారాల్లో తప్పులెత్తి చూపింది. ముఖ్యంగా నాయర్ మహిళలు నంబూద్రి బ్రాహ్మణుల ఎదుట గుండెలపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా తిరగాలని వారితో

తాత్కాలిక సంబంధాలు కుదుర్చుకోవాలనే ఆచారం నవ్వులపాలైంది. ఫలితంగా ఇది సాంఘీక సంస్కరణలకు, బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలకు దారి తీసింది" (కృష్ణారెడ్డి కె 2005:121-122). ఇందులేఖ నవలలో మాధవన్ ఆంగ్ల విద్య చదువుకొని సంప్రదాయ భావాలు కలిగిన పెంచుమినన్ అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తాడు. అలాగే ఇందులేఖ తనను నంబూద్రి బ్రాహ్మణునికి ఇచ్చి పెళ్లి చేస్తానంటే వద్దంటుంది. ఇలా నంబూద్రి, నాయర్ల కలహం ఇందేలేఖ నవలలో ప్రధాన కథా వస్తువుగా కనిపిస్తుంది.

## 4. ముగింపు

దక్షిణ భారతదేశంలో వచ్చిన తొలి సాంఘిక నవలలు 19వ శతాబ్దంలో నాలుగు రాష్ట్రాలలో ఉన్న సామాజిక అంశాలకు దర్పణంగా రచించబడ్డాయి. రాజశేఖరచరిత్రలో కందుకూరివారు తెలుగు ప్రాంతంలో ఉన్న సామాజిక సమస్యలను వివరించారు. గుల్వాడివారు ఇందిరాబాయి నవలలో కన్నడ ప్రాంత సమస్యలని చెప్పడంతో పాటు ఆ సమస్యల వల్ల కలిగే నష్టాన్ని పాత్రల సంభాషణ ద్వారా చెప్పి సమస్యలతో కలిగే నష్టాన్ని పాఠకులకి తెలిపారు. ప్రతాప ముదిలియార్ చరిత్రలో సాంఘిక సమస్యల సుధీర్ఘ వర్ణన, భారతీయ సంస్కృతీ గొప్పతనాన్ని వ్యాఖ్యానించడం కనిపిస్తుంది. ఇందులేఖ నవలలో నంబూద్రి, నాయర్ల గొడవ వర్ణించ బడింది. మొత్తం మీద ఈ నాలుగు నవలలు 19వ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఉన్న సామాజిక అంశాలకు డాక్యూమెంటరి చిత్రాలవంటివి.

## ఉపయుక్త గ్రంథసూచి


1. కృష్ణారెడ్డి కె. 2005: భారతదేశ చరిత్రా ఆధునిక యుగం, ఓరియంట్ బ్లాక్ స్వాన్, హైదరాబాద్.
2. చంద్రశేఖర్ రెడ్డి రాచపాళెం 2009: తులనాత్మక దాక్షిణాత్య సాహిత్యవ్యాసాలు, ద్రావిడ విశ్వవిద్యాలయం,కుప్పం.
3. రామకృష్ణారెడ్డి.వి 2009: భారతదేశ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, తెలుగు అకాడమి, హైదరాబాద్.

4. విద్వేశ్వరి డి 2010: భారతీయ భాషల్లో నవల, విశాలాంధ్ర,హైదరాబాద్.
5. వీరేశలింగం పంతులు 2010: రాజశేఖర చరిత్ర, విశాలాంధ్ర, హైదరాబాద్.
6. వెంకట్రావు గుల్వాడి 1962: ఇందిరాబాయి, కన్నడ ప్రపంచ ప్రకాశన,మంగళురు.
7. వేదనాయగమ్ పిళ్ళై 2008: ప్రతాప ముదిలియార్ చరిత్ర, ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం.
8. వైకుంఠం ఎల్లంపల్లి 2011: భారతదేశ చరిత్రా సంస్కృతి, తెలుగు అకాడమి, హైదరాబాద్.

# మల్లె మొగ్గలు

(పరిశోధక వ్యాసాల సంకలనం)






సంపాదకులు

డా. జె. సీతాపతి రావు,

తెలుగు ఉపన్యాసకులు(ఒప్పందపు)

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం,

నూజివీడు, కృష్ణాజిల్లా. 521202, ఆంధ్రప్రదేశ్.

*Malle moggalu* (Research Essays)

**Edited by Dr. J. Seethapathi Rao, M.A. (Tel&Sans), M.Phil., Ph.D.,**
**M/s. OWN, Lecturer in Telugu, N-4, B type, Q. No.201,**
**RGUIIIT, NUZVIDU, KRISHNA (DT)**
**521202. ANDHRA PRADESH (STATE), INDIA.**

First Edition: June, 2015
Publication No: 3

Copies: 500

© Author

Copies available at:
J.K.V.M. SHARMA, (PUROHIT)
D.NO. 13- 38, OPP: ELECTRICAL SUB STATION
BACK OF NAVATHA TRANSPORT OFFICE, R.R. V. PURAM
NEAR: GOPALA PATNAM, VISAKHAPATNAM- 29
ANDHRA PRADESH, INDIA

**and at** all leading book shops in A.P.
For e-book: www.kinige.com
**Category 5/2012-**

**ISBN 978-81-92716-2-1**

**Email: seethuphd@gmail.com**

**Price: Rs. 100/- , $ 20**

**Published by Malleteega Publishers, Vijayawada.**

విషయ సూచిక


పాఠకుని మనసు" -డా. డి.వి. వేణుగోపాల్ v – vi

"రసాయనిక సాహిత్య బంధం" -డి. చిన్నాజీ వర్మ vii – viii

సంపాదకుల మాట ix– xii

1. ఎడబాటు + వేదన - కోపం x ఓదార్పు = ప్రణయ బంధం - మల్లేపల్లి ప్రమోద్ కుమార్ 1-10

2. పద్యాన్ని సంస్కరణ వారధిగా చేసుకున్న పోతులూరి - డా. బావికాటి రాఘవేంద్ర 11- 16

3. తిలక్ "పాడువోయిన ఊరు" కవిత: నిర్మాణ విశ్లేషణ- ఎస్. చంద్రయ్య 17- 20

4. పాతనుంచి కొత్తదనం వైపు ఆదూరి కథాద్యుతి - జి.బి.యం. గిల్లీహేస్ 21-29

5. శైలీ శాస్త్ర దృష్ట్యా పాటలో పద నిర్మాణం- డా. ఎ. రవీంద్రబాబు 30- 35

6. తెలుగు-కన్నడ నవలలు తులనాత్మక పరిశీలన- ఎం. శంకర్ 36- 42

7. వ్యాకృతి శాస్త్ర సంజ్ఞల చందం- ఆచార్య దావులూరి కృష్ణకుమారి 43- 51

8. శ్రీ కాళహస్తీశ్వర శతక అనువాదాలు – అనుశీలన- డా. డి.వి.ఎన్.డి. లక్ష్మి 52- 59

9. స్వార్థంనుంచి శ్రేయస్సువైపు మానవ ఉద్యమ పయనం- పల్లి చిన్నరావు 60- 69

10. గీతరథి- సంగ్రామ సారథి-వెన్నెల కురిపిన వచోనిధి 'దాశరథి' - డా. జె. సీతాపతి రావు 70 – 77

11. యువత నిద్దురను వదిలించే మహోదయం-అభ్యుదయం - డా. సి.యస్. క్షేత్రపాల్ రెడ్డి, 78- 86

12. వారసత్వ సంపదను తర్వాతితరానికి అందించే తోటి(కొర్రాజుల)సంస్కృతి - డా. శ్రీమంతుల దామోదర్ 87-93

13. వైజ్ఞానిక సమాజ నిర్మాణమే లక్ష్యంగా సాహిత్యం, విలువలు - జయంతి పాపారావు 94- 99

14. వెలుగుజిలుగులకు మణిదీపాలు"మాండలికాలు"- డా.పి.వి.లక్ష్మణరావు 100- 107

15. ఉత్తరాంధ్ర కథాసాహిత్యం-గిరిజనజీవితం-డా. నూనావత్ రాంబాబు 108-120

# తెలుగు–కన్నడ నవలలు తులనాత్మక పరిశీలన

- ఎం. శంకర్, పిహెచ్.డి., పరిశోధకవిద్యార్థి,
తెలుగువిభాగం, హైదరాబాదు విశ్వవిద్యాలయం.
హైదరాబాదు, 500046. చరవాణి : 9951569644

**పరిచయం:** "ఆధునిక కన్నడ సాహిత్యచరిత్ర పరిణామ క్రమాన్ని చెప్పే సందర్భంలో చాలామంది అణ్ణాజి, గుల్వాడి కవులను వదిలి పెడతారు అంతేకాక కన్నడ కథ, కథానిక, కవిత్వ పరిణామక్రమాన్ని చెప్పే సందర్భంలో 'పంజి మంగేశరాయ', 'శ్రీమంజేశ్వర గోవిందయ్య', పేర్లనుకూడా మరిచిపోతారు. ఈ మహానుభావుల ప్రయోగాలు సాహిత్యదృష్టిలో అంత నిష్ప్రయోజకంగా ఉన్నాయా? అలా భావించడం సరికాదు"(ఇందిరాబాయి1962:6)ఇవి ఆధునిక కన్నడ సాహిత్యాన్ని పరిచయం చేస్తూ శివరామకారంత గారన్న మాటలు. తెలుగు కన్నడ సాహిత్యాలలో సాంఘిక నవలలుగా పేర్కొంటున్న 'ఇందిరాబాయి', 'రాజశేఖర చరిత్ర' నవలల్లో నాటి సామాజిక పరిస్థితులు ఎలా చిత్రితమయ్యాయి ఇలాంటి అంశాలను తులనాత్మకంగా పరిశీలించడం ప్రస్తుత పరిశోధనా పత్ర ముఖ్య ఉద్దేశం. ఈ అంశాలు నవలా ప్రాతిపదికగా తెలుగు, కన్నడ భాషల మధ్య ఉన్న సంబంధాన్ని తెలుపడానికి తోడ్పతాయి.

**కథా క్రమం:** ఇందిరాబాయి నవలలో ప్రధానంగా 'భీమారావ్' కుటుంబం ఇతివృత్త చతురస్రం. భీమారావ్ బాల్యం, అతను నరసింహశాస్త్రి మిల్లులో పనికి చేరడం –

ISBN 978-81-92716-2-1

భీమారావ్ కు అంబాబాయితో వివాహం కావడం-అంబాబాయి మాటలను నమ్మి భీమారావ్ సుందరరావును హత్య చేయడం-సుందరరావు మరణానంతరం అతని కుమారుడు అమృతారావు వృద్ధ ఆశ్రయం పొందడం-భీమారావ్, అంబాబాయిలకు ఇందిరాబాయి జన్మించడం-ఇందిరాబాయిని విఠలరావుకు ఇచ్చి బాల్య వివాహం చేయడం – ఇందిరాబాయి బాల్యవితంతువుగా మారడం-వితంతు కష్టాలు అనుభవించలేక ఇందిరాబాయి అమృతారావ్ ఆశ్రయం పొంది అతని సహకారంతో భాస్కరరావును వివాహమాడటం ఇది స్థూలంగా ఇందిరాబాయి నవలలోని కథ. ఇందిరాబాయి నవలలో భీమారావు కుటుంబానికి సమాంతరంగా 'సుందరరావ్-సుశీల', అమృతారావ్-జలాక్షి' కుటుంబాలను రచయిత చిత్రించారు.

రాజశేఖరచరిత్రలో రాజశేఖరుడి కుటుంబానికి సమాంతరంగా ఇంకో కుటుంబ వర్ణన కనిపించదు. ఇందిరాబాయి నవలలో కుటుంబాలమధ్య నడిచిన సంఘర్షణద్వారా నాటి సాంఘిక పరిస్థితులు తెలుస్తాయి. ఇందుకు భిన్నంగా రాజశేఖరుడి కుటుంబానికి నాటి సమాజానికి మధ్య నడిచిన సంఘర్షణద్వారా నాటి సామాజిక పరిస్థితులు రాజశేఖర చరిత్రలో గూడు కట్టుకున్నాయి. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న ఒక కుటుంబ మానసిక పరివర్తన ఇందిరాబాయి నవలలోని ప్రధానకథ కాగా ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబం అనవసర దాంబికాలు ప్రదర్శించి ధనాన్ని పోగొట్టుకోవడం, పశ్చాత్తాపపడటం అన్నది రాజశేఖర చరిత్రలోని ప్రధానకథ. ఈ రెండు నవలల్లోను నాటి సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలలోని దురాచారాలను వివరించారు.

**కథా వస్తువు- సామ్యత:** రాజశేఖరచరిత్ర, ఇందిరాబాయి రెండునవలల్లోను కథావస్తువు నాటి సమాజానికి ఆలంబనగా స్వీకరించారు. ఇందిరాబాయి నవలలో ప్రధాన రంగస్థలంగా కమలాపురం గ్రామం కనిపిస్తుంది. రాజశేఖర చరిత్రలో

ISBN 978-81-92716-2-1

ధవళగిరి, రాజమహేంద్రవరం, పెద్దాపురం, పిఠాపురంలాంటి ప్రాంతాలు రంగ స్థలాలుగా కనిపిస్తాయి. ఈ విధంగా ఇందిరాబాయి నవలలో రంగస్థల మార్పు కనిపించక పోవడానికి, రాజశేఖరచరిత్రలో అధికంగా కనిపించడానికి కథావస్తువే ప్రధాన కారణం. గుల్వాడి వెంకట్రావుగారు తన నవలలో వితంతు పునర్వివాహాన్ని కథావస్తువుగా స్వీకరించారు. అందుకు తగినట్లుగా 'కమలాపురం అనే గ్రామం–ఆ గ్రామంలోని నివసించే ఒక కుటుంబం (అంబాబాయి+ భీమారావు= ఇందిరా బాయి)– ఆ కుటుంబంలో ఒక బాల్య వితంతువు (ఇందిరాబాయి)–ఆమె సంఘాన్ని ఎదురించి వితంతు పునర్వివాహం చేసుకోవడం'. ఈ విధంగా తన కథావస్తువుకి తగిన వాతావరణాన్ని ఒక గ్రామంలో కల్పించారు. కందుకూరివారి రాజశేఖర చరిత్రలోని ప్రధాన కథావస్తువు మూఢనమ్మకాలని ఎత్తిచూపడం. ఈ భావన ఎంతో విస్తృతి, వ్యాప్తి కలిగింది. ఇందులో స్త్రీ అవిద్య మొదలుకొని వేశ్యాలంపటత్వం, భోగం మేళాలు, జాతకాలు, భూతవైద్యం మొదలైన సామాజిక అంశాలను పేర్కొనాల్సి ఉంటుంది. చాలా కోణాలలో నుండి సమాజాన్ని చిత్రించాల్సి ఉంటుంది. అందుకే రాజశేఖరుడి పయనాన్ని మొదట ధవళగిరినుండి ప్రారంభించి ఆ కుటుంబంలోని పాత్రలను ఆయా ప్రాంతాలకు పంపించి తద్వారా ధవళగిరి, రాజమహేంద్రవరం, పిఠాపురం, పెద్దాపురం మొదలైన ప్రాంతాలలోని ప్రజల మనస్తత్వాలను అక్కడి దురాచారాలను రాజశేఖరచరిత్రలో చిత్రించడం జరిగింది.

**నిర్మాణ సామ్యత:** రాజశేఖరచరిత్రలో పదిహేను ప్రకరణాలు ఉన్నాయి. ఇందిరా బాయి నవలలో అరవై అధ్యాయాలు ఉన్నాయి. అధ్యాయ విభజన రెండింటిలోను ఉంది. రెండు కుటుంబాలు కలిసి ఒకే కుటుంబంగా మారడం ఇందిరాబాయి నవలలో ఉంటే ఒకే కుటుంబం విడిపోయి మళ్ళీ కలుసుకోవడం రాజశేఖరచరిత్రలో ఉంది.

ISBN 978-81-92716-2-1

దృక్కోణం: రాజశేఖరచరిత్ర, ఇందిరాబాయి రెండు నవలల్లోను సర్వ సాక్షి దృక్కోణం కనిపిస్తుంది". ఈ సర్వసాక్షి దృక్కోణంలో రచయితే స్వయంగా కథ చెబుతుంటాడు. కథాంగాలలో అతనికి తెలియని విషయం ఉండదు. కథ జరిగే ప్రతిచోటా అతనుంటాడు. పాత్ర ఒంటరిగా ఉన్నా అతన్ని వదలడు. అతని మనస్సు లోతుల్లోని భావాలను ఆవిష్కరిస్తాడు". (వెంకట సుబ్బయ్య వల్లంపాటి 1989:48) ఇందిరా బాయి నవల పూర్తిగా సర్వసాక్షి దృక్కోణంలో రాశారు. ప్రథమాంకంలో భీమారావ్ పాత్రని గురించిన పూర్తి విషయాలు రచయిత తన మాటల్లో చెప్పడం. అంబాబాయి ప్రవర్తనని రచయిత వ్యాఖ్యానించడం దీనికి ఉదాహరణ. (ఇందిరాబాయి 962:3). రాజశేఖరచరిత్రలో కూడా సర్వసాక్షి దృక్కోణం కనిపిస్తుంది. మొదటి ప్రకరణంలో సిద్ధాంతి స్థితిగతుల్ని కందుకూరివారు తన మాటల్లో చెప్పారు (రాజశేఖరచరిత్ర 2010:10) రెండవ ప్రకరణంలో రుక్మిణి పాత్రని ప్రవేశపెడుతూ ఆ పాత్రని నఖశిఖ పర్యంతం తన మాటల్లో వర్ణించారు.

**సన్నివేశ–సామ్యత:** రాజశేఖరచరిత్ర, ఇందిరాబాయి రెండు నవలల్లోను సంభాషణాశ్రిత సన్నివేశాల చిత్రణ కనిపిస్తుంది. రాజశేఖరచరిత్ర రెండవ అంకంలో 'నీళ్ళరేవువద్ద' కందుకూరివారు సంభాషణాశ్రిత సన్నివేశాన్ని కల్పించారు. నీళ్ళరేవువద్ద స్త్రీలు సంభాషించుకునే సన్నివేశ కల్పన ఇందిరాబాయి నవలలోకూడా కనిపిస్తుంది. రాజశేఖరచరిత్రలోని నీటి రేవు సంభాషణ కథావస్తువులోని అంశాలైన వితంతు కష్టాలు, గృహహింస మొదలైన వాటిని ఎత్తిచూపగా ఇందిరాబాయి నవల లోని నీటిరేవు సన్నివేశం కథాగమనంలో తోడ్పడింది. ఈ సన్నివేశ చిత్రణ ద్వారా తెలుగు, కన్నడ ప్రాంతాలలోని స్త్రీల పేర్లు తెలుస్తున్నాయి.

**కన్నడ ప్రాంత స్త్రీల పేర్లు:** దేయి, పొపె, మేరిదుగ్గి, సుబ్బి, దారు, లక్ష్మి, పొణ్ణు,లింగు, లుజ్జు, బిర్మ, చోము, రుక్కి,యల్లు.

**తెలుగు ప్రాంత స్త్రీల పేర్లు:** సోమిదేవమ్మ, వేకమ్మ, పొట్టి, శేషమ్మ, కాంతమ్మ, రామమ్మ, పుల్లమ్మ, కనకమ్మ, సీతమ్మ.

**శైలి-సామ్యత:** ఇందిరాబాయి నవలలో వ్యావహారిక కన్నడబాష ప్రయోగించబడగా, రాజశేఖరచరిత్రలో సరళ గ్రాంధికభాష ప్రయోగించారు. విశిష్టపదప్రయోగం, పాత్రోచిత భాషాప్రయోగం, సామెతల వాడుక మొదలైన అంశాలలో ఈ రెండు నవలల మధ్య సామ్యముంది.

**ధ్వన్యనుకరణ పదాలు:** పాత్రల భావావేశాన్ని తెలిపే సందర్భంలో ధ్వన్యనుకరణ పదాలను వాడటం ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది. కోపంతో ఊగిపోయె భీమారావ్ స్థితిని రచయిత చెబుతూ "చుకుణాచూర్"(ఇందిరాబాయి962:12) అనే ధ్వన్యనుకరణ పదాన్ని ప్రయోగించారు. కోపంతో ఉన్నపుడు పళ్ళు కొరుకుతూ మాట్లాడటం సాధారణ లక్షణం. అదే విషయాన్ని ఇక్కడ ధ్వన్యనుకరణ పదంలో ఆవృత్తమైన 'చ'కారం తెలుపుతున్నది. ఇలాంటి ధ్వన్యనుకరణ పదాలు అనేకం ఇందిరాబాయి నవలలో కనిపిస్తాయి. 1.ఇత్తలాగి సుందరరాయ నమనేయల్లి 'ఘోయందు' ఘొలాటెబిత్తు (ఇందిరాబాయి 962:23). 2. 'ఫక్కనే' కణ్ణిగికత్తలు బందాగి (ఇందిరాబాయి 962:23) రాజశేఖరచరిత్రలో కందుకూరి వారు అడవిని వర్ణిస్తూ నిశ్శబ్దంగా ఉన్న అడవిలో వినబడే ధ్వనులను ధ్వన్యనుకరణ పదాలతో తెలిపారు. 1.పక్షుల 'కలకలము' (రాజశేఖర చరిత్ర2010:114). 2. చిమ్మటలు కీచుమనె (రాజశేఖర చరిత్ర2010:114)

**విశిష్ట పద ప్రయోగం:** ఇందిరాబాయి నవలలో ఆంగ్ల, మరాఠి పదాలతో పాటుగా కన్నడ ప్రాంతంలో వాడుకలో ఉన్న విశిష్ట పదాల ప్రయోగం కనిపిస్తుంది. తెలుగులో 'ముండాకొడుకు' అని తిడతారే కాని 'ముండాకూతురు' అన్న తిట్టు కనిపించదు. కన్నడలో ఈ తిట్టు కనిపిస్తుంది.



ISBN 978-81-92716-2-1

బోళియమగ = ముండాకొడుకు.

బోళియమగళు = ముండా కూతురు (ఇందిరాబాయి 962:47).

కళవళిసి (మరాఠి)= కలవరంతో. పరంతు(మరాఠి)= అయినా.

పెన్సన్ (ఆంగ్ల )= నేనపవర్తి. కిరోసిన్(ఆంగ్ల )= సీమెణ్ణి.

రాజశేఖరచరిత్రలో అన్య భాషాపదాలు కనిపించకున్నా పంతొమ్మిదో శతాబ్దంలో రాజమండ్రి ప్రాంతంలో వాడుకలో ఉన్న కొన్ని విశిష్ట పదాల ప్రయోగం కనిపిస్తుంది. 1. వెల్లావు (రాజశేఖరచరిత్ర 2010:7) 2. ములుకొలలు (రాజశేఖర చరిత్ర 2010:7). 3. కొటేరులు (రాజశేఖరచరిత్ర 2010:7). 4. పరిగేలు (రాజ శేఖరచరిత్ర 2010:18).

**ముగింపు:** కందుకూరివారి 'రాజశేఖరచరిత్ర' 1878లో ప్రచురితం కాగా, గుల్వాడి వెంకట్రావ్ గారి 'ఇందిరాబాయి' నవల 1899లో ప్రచురితమైంది. ఈ రెండు నవలలు వెలువడిన ప్రాంతం, కాలం వేరైనా ఈ రెండు నవలల మధ్య చాలా సామ్యం ఉంది. ఈ రెండు నవలల్లోని వస్తువు సాంఘికం. అది సమకాలీన సమస్యల సమాహారం. వితంతు కష్టాలు, మధ్యతరగతి స్త్రీ మనస్తత్వం లాంటి అంశాలు రెండు నవలల్లోను చిత్రితమయ్యాయి. రెండు నవలల్లోను ఆర్థిక వినిమయం 'అణాల' రూపంలో జరిగింది ఇది ద్రవ్యం చెలామణిలోకి వచ్చిన ప్రాథమిక స్థితికి నిదర్శనం. ఇందిరాబాయి నవలలో బ్రిటిష్ పరిపాలనవల్ల నూతనంగా భారతదేశంలో ప్రవేశించిన వస్తుసంస్కృతి ప్రస్తావన (ఫ్రిజ్, వాటర్ఫిల్టర్, అలారం గడియారం) కనిపిస్తుంది.

రాజశేఖర చరిత్రలో నూతన వస్తు సంస్కృతి కనిపించదు. ఇతివృత్త నిర్వహణలో ఇందిరాబాయి నవలలో లేని క్లిష్టత రాజశేఖర చరిత్రలో కనిపిస్తుంది. రుక్మిణి, భైరాగిలాంటి పాత్రలు కథ మధ్యలో అదృశ్యమై కథాగమనంలో

ISBN 978-81-92716-2-1

సాక్షాత్కరించడం రాజశేఖర చరిత్రలో కనిపిస్తుంది. ఇందిరాబాయి నవలలో పాత్రలను కొద్దిసేపు దాచి మళ్ళీ కథలో భాగం చేయడం కనిపించదు. ఆంగ్లేయ పాలన వల్ల భారతీయవిద్యావిధానంలో నూతనంగా ప్రవేశించిన బి.ఎ., బి.ఎల్., సి.ఎస్., లాంటి పరీక్షల ప్రస్తావన ఇందిరాబాయి నవలలో కనిపిస్తుంది. రాజశేఖర చరిత్రలో వీటి ప్రస్తావన కనిపించదు. ఈ రెండు నవలలు 19వ శతాబ్దం నాటి కన్నడ, తెలుగు ప్రాంతాల సామాజిక పరిస్థితులకు దర్పణంపట్టే విధంగా రచించారు. భాషల అధ్యయనం అనువాదాల మీద పరిశోధనలు విరివిగా వస్తే వేర్వేరు భాషల్లో ఉన్న విజ్ఞానం మొదలైన చాలా అంశాలు వ్యాప్తిలోకి వస్తాయి.

ఉపయుక్తగ్రంథసూచి:

1. ఆమూర్తి. యెస్.1983: కన్నడకాదంబరియబెళవణిగే :బెంగళూరు, బెంగళూరు విశ్వవిద్యాలయం.

2. కన్నడ సాహిత్య చరిత్రే 1982: శివరుద్రప్ప: బెంగళూరు, ప్రసార రంగ విజ్ఞాన భారతి.

3. మృణాళిని. సి.1988: సాంఘికనవల కథన శిల్పం:హైదరాబాద్, తెలుగు పరిశోధనా ప్రచురణలు.

4. వీరేశలింగంపంతులు 2010: రాజశేఖర చరిత్రము: హైదరాబాద్, విశాలాంధ్ర.

5. వెంకట్రావు, గుల్వాడి.1962: ఇందిరాబాయి: మంగళూరు, కన్నడ ప్రపంచ ప్రకాశన.

6. వెంకట సుబ్బయ్య వల్లంపాటి 1989 నవలాశిల్పం: హైదరాబాద్, విశాలాంధ్ర.

7. శివరాయతు.సు1887: కన్నడసాహిత్యచరిత్ర: మైసూర్, ఉదయ రవి ప్రింటర్స్.

8. శ్రీరామమూర్తి కోడూరి 1979: తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ:హైదరాబాద్, విశాలాంధ్ర

*****



ISBN 978-81-92716-2-1

ज्ञान-विज्ञान विमुक्तये

# संत जोसफ महिला महाविद्यालय (स्वायत्त) St. Joseph's College for Women (A)

*(Reaccredited by NAAC with A Grade)*

विशाखपट्टणम Visakhapatnam - 530 004

## अंतर्राष्ट्रीय संगोष्ठी प्रमाण पत्र | International Seminar Certificate

प्रमाणित किया जाता है कि श्री/श्रीमती/डॉ. एम. शंकर ने संत जोसफ महिला महाविद्यालय (स्वायत्त) विशाखपट्टणम तथा दक्षिण भारतीय राजभाषा संस्थान के संयुक्त तत्वावधान में दि. 09-10 दिसम्बर 2016 को आयोजित "हिन्दी तथा अन्य भारतीय भाषाओं पर वैश्वीकरण का प्रभाव" विषयक द्वि-दिवसीय यू.जी.सी. अंतर्राष्ट्रीय संगोष्ठी में सक्रिय भाग लिया / प्रपत्र वाचन किया / सत्र-संचालन किया / वक्ता के रूप में भाग लिया।

Certified that Mr. / Mrs. / Dr. M. Shankar has Participated / Presented a Paper / Chaired the Session / was Resource Person in the Two-Day U.G.C. International Seminar **"The Impact of Globalization on Hindi and other Indian Languages"** jointly organised by the Department of Hindi, St. Joseph's College for Women (A) and Dakshin Bharateeya Rajbhasha Sansthan on 9th -10th December 2016.

Title of the Paper [illegible] తెలుగు మలయాళ సాహిత్యం ప్రపంచీకరణ ప్రభావం

| | | |
|---|---|---|
| डॉ. एस. कृष्ण बाबु<br>Co-Convener, International Seminar<br>Chairman, D.B. Rajbhasha Sansthan,<br>Visakhapatnam | डॉ. पी.के. जयलक्ष्मी<br>Convener, International Seminar<br>Reader and HoD, Hindi<br>St. Joseph's College for Women (A), VSP | डॉ. सिस्टर. पैजी पी.डी.<br>Principal<br>St. Joseph's College for Women (A),<br>Visakhapatnam |

KMOR 104

# P- R- GOVERNMENT COLLEGE (AUTONOMOUS) KAKINADA, ANDHRA PRADESH

**DEPARTMENT OF HINDI**

**SPONSORED BY U. G. C.**

**APSCHE & KENDRIYA HINDI SANSTHAN, AGRA**

**AYODHYA SHODHA SANSTHAN, AYODHYA**

**With Collaboration**

**SAHITYIK SANSKRUTIK SHODH SANSTHA, MUMBAI**

**INTERDISCIPLINARY**

## INTERNATIONAL SEMINAR

ज्ञान-विज्ञान विमुक्तये

# CERTIFICATE

This is to certify that

Dr./Prof./Mr./Ms. M. Shankar

University/College : University of Hyderabad

has participated / presented the paper entitled

తెలుగు, తమిళ తొలి సాంఘిక నవలలు - సమకాలీన సంఘటనలు

In the two day interdisciplinary, International Seminar on Contemporary Issues in Literature and Culture organized by the Department of Hindi, P. R. Government College (Autonomous) Kakinada, Andhra Pradesh on 6th & 7th February 2015.

| Dr. B. P. Upadhyay | Dr. P. Hari Ram Prasad | Lt. Dr. M. Satyanarayana | Dr. Y. P. Singh |
|---|---|---|---|
| Head Academics SSRI | Co-ordinator | Principal | Director<br>Ayodhya Shodh Sansthan, U.P. |